
# తాళపత్ర విజ్ఞానం

మహర్షులు తాళపత్రాలపై వ్రాసిన అనేకమైన సాంప్రదాయ,
ఆరోగ్య, జీవనరహస్య ధర్మసందేహాలకు సమాధానాల సంపుటి



శైలి




# తాళపత్ర విజ్ఞానం

(ధర్మ సందేహాలు - సమాధానాలు)

వెల : రూ. 250/-

# తాళపత్ర విజ్ఞానం

## (ధర్మ సందేహాలు - సమాధానాలు)



### 1. దివ్యశక్తి

**జ.**మానవుడు మహాశక్తి సంపన్నుడు. దుష్ప్రవర్తనల మూలాన దుర్భలుడు అవుతున్నాడు. మీలో వున్న దివ్య శక్తిని గుర్తించి ఉత్తేజం పొందండి. అప్పుడు మీకు మంచితనమూ, త్యాగ గుణమూ, నిజాయితీ, ఆప్యాయతా అలవడగలవు. మంచి మాటలు వినండి. మంచి దృశ్యాలు చూడండి. మంచి ఆలోచనలు చేయండి. మంచి పనులు ఆచరించండి. అప్పుడు దుష్ట ప్రవృత్తులన్నీ నిర్మూలనమై పోతాయి.

## 2. భగవద్గీత ప్రారంభంలో ధృతరాష్ట్రుడు "కింకుర్వత?" అని ప్రశ్నిస్తాడు. యుద్ధ భూమికి వెళ్ళాక యుద్ధం కాక మరేం చేస్తారు? ఈ మాత్రం తెలీని మూర్ఖుడా?

**జ.** మూర్ఖాగ్రేసరుడైన దుర్యోధనుని తండ్రి ధృతరాష్ట్రుడు. అంత మాత్రాన, మూర్ఖుడనుకో నవసరంలేదు. కురుక్షేత్రంలో ఏం చేశారు? అని అడిగితే అక్కడ యుద్ధం ఎవరెవరు ఎలా చేశారో వినిపించమని ఆయన భావం!



## 3. మరణానంతరం కూడా మరో జీవన విధానం ఏమైనా వుందా? చనిపోయిన వారితో మాట్లాడటానికి ప్రత్యేక శిక్షణ ఏదైనా వుందా?

**జ.** మరణంలేని జీవితం వుండదా అనే మనిషిలోని ఆత్రుతే ఇలా ప్రశ్నగా బయట పడుతుంది.

మరణం అనేది జీవితానికి ముగింపు కాదు. దాని తర్వాత కూడా జీవితం వుంది అని నమ్మితేనే మనం ప్రశాంతంగా జీవించ గలుగుతాము. 60, 70 సంవత్సరాల ఈ జీవితంలోనే, నేను ఎలా జీవించాలి అని అనుకుంటున్నారు, అలాంటిది మరణానంతరం కూడా మీ జీవితాన్ని మీరే ఎంచుకుని ఎలా జీవించాలని బాధ పడటం ఎందుకు? ముందుగా ప్రాణంతోనే జీవించాలని ఆశపడండి. ప్రేమను, ఆనందాన్ని, అనుభవించడాన్ని నేర్చుకోండి. వచ్చే ఆదివారము ఏమి చేయాలి అని ఇంతవరకు ప్లాన్ చేసుకోలేదు. మరణానంతరం ఏమి చేయాలనేది ఇప్పటి నుండే ఎందుకు ఆలోచిస్తున్నారు. మీ ఇరుగు పొరుగు వారితో గొడవలు లేకుండా ప్రేమగా మసలుకోండి. చనిపోయినవాళ్ళ గురించి మాట్లాడి ఏమి చేయగలుగుతారు? అది చెయ్యవా? ఇది చెయ్యవా అని అడుగుతుంటారు అంతేకదా? మీ బాధ్యతలను చనిపోయిన వారిపై మోపడం అసహ్యించు కోవలసిన విషయం కదా! పాపం చనిపోయిన వాళ్ళనైనా ప్రశాంతంగా ఉండనివ్వండి.

## 4. ఉత్తమ తల్లిదండ్రులు ఎవరు?

**జ.** తల్లిదండ్రుల అవసరం లేకుండా పిల్లల్ని పెంచిన వారే ఉత్తమ తల్లిదండ్రులంటాను. ప్రతి క్షణం పిల్లలకు ఏమి చేయాలో, ఏమి చేయకూడదో చెప్పేవాళ్ళు

మంచి తల్లిదండ్రులు కాలేరు. మంచి చెడు సరిగా తెలుసుకునే జ్ఞానం అందించటం మంచి తల్లిదండ్రుల లక్షణం. మనం మొక్కలు పెంచేటప్పుడు ఆ మొక్కలు పెరగటానికి అవసరమైన నీరు, ఎరువులు వంటివి సమకూరుస్తాం కాని ఆ చెట్టును అలా ఎదుగు, ఇలా ఎదుగు అని ప్రతిక్షణం చెప్పంకదా. అలాగే పిల్లలకు అవసరమైన వాతావరణం కల్పించగలిగితే చాలు. తల్లిదండ్రుల



ప్రేమ పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వాలేగాని వారిని బందీలుగా చేయకూడదు. తల్లిదండ్రులు తాము సాధించలేక పోయిన వాటిని పిల్లల ద్వారా సాధించు కోవాలనే ఆలోచన పెంచుకుని వారిమీద ఒత్తిడి పెంచుతున్నారు. అటువంటి వారు మంచి తల్లిదండ్రులు కాలేరు. పిల్లలు ఉత్తమంగా ఎదిగేలా వాతావరణం కల్పించేలా చేసే వారే మంచి తల్లిదండ్రులు.

## 5. తాపత్రయం

*జి.* *'తాపం' అంటే దుఃఖం.*

*'త్రయం' అంటే మూడు.*

*త్రివిధ దుఃఖాలే 'తాపత్రయం'.*

***తాపాలు మొత్తం మూడు రకాలు:***

***ఆధ్యాత్మిక తాపం : మనలోని కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు అనబడే అరిషడ్వర్గాలవల్ల కలిగే బాధలనే 'ఆధ్యాత్మిక తాపాలు' అంటాము.***

ప్రతి మనిషికీ వుండే బాధల మొత్తంలో నిజానికి 90% బాధలు ఈ అరిషడ్వర్గాల వలనే సంభవిస్తాయి!


***ఉదాహరణకు :*** తోటి కొలీగ్‌కి ప్రమోషన్ వచ్చి మనకు రాకపోతే మనం పడే బాధ ఆధ్యాత్మిక తాపం! అట్లే కోరిన అమ్మాయి ఇష్టపడకపోతే వచ్చే బాధ! ఎవరికి వారు కల్పించుకున్న, ఇలా కల్పించుకుంటున్న బాధలే 'ఆధ్యాత్మిక తాపాలు'!

***ఆదిభౌతిక తాపం :*** ఇతర ప్రాణికోటి వల్ల కలిగే తాపాలను 'ఆదిభౌతిక తాపాలు' అంటాము. మన ప్రమేయం లేకుండా ఇతరుల అజ్ఞాన, అక్రమ చర్యల వలన కలిగే బాధలు అన్నమాట. ప్రతి మనిషికీ 9% బాధలు ఈ కోవకు చెందినవి.

***ఉదాహరణకు :*** రోడ్డుమీద ప్రయాణం చేస్తూంటే లారీ వచ్చి గుద్దేస్తుంది.మన కాళ్ళు విరిగి పోయాయి.... అలాగే ఓ తేలు కుదుతుంది. ఇలా కొన్ని బాధలు సాంఘిక జీవనంవల్ల కలుగుతూంటాయి.

***ఆదిదైవిక తాపం :*** ప్రకృతి సహజమైన

మార్పులవలన కలిగే తాపాలను 'ఆది దైవిక తాపాలు' అంటాము.



***ఉదాహరణకు :*** అతివృష్టి, అనావృష్టి, భూకంపాలు మొదలైనవి. ప్రతి మనిషికీ 1% బాధలు మాత్రమే ఈ కోవకు చెందినవి. బద్ధపురుషుడికి తాపత్రయా లుంటాయి, ముక్తపురుషుడికి వుండవు, తాపత్రయాలు లేని స్థితే ముక్తస్థితి.

## 6. ఎప్పుడూ సంతోషంగా వుండ డానికి దారి ఏది?

***జ.*** అరటిపండు తొక్కమీద కాలువేసి జారి పడ్డారు ఎవరో. అంతా నవ్వారు. అదేచోట మీరు జారిపడ్డారు. బాధ పడతారు. ఒకటే చర్య. ఆనందం, దుఃఖం ఎవరి చేతుల్లో ఉన్నాయి? మీ చేతిలోనే కదా! మామూలుగా, మీ మనసులో సంతోషాన్నిచ్చే ఆలోచనల కన్నా, బాధ నిచ్చేవే గుర్తుంటాయి. బాధ ఉన్న క్షణాల్నే




మళ్ళీ మళ్ళీ ఎందుకు నెమరు వేసుకుంటు న్నారు? పనికి వెళ్ళినప్పుడు, కళాశాలలో పాఠాల బరువుతో కాలం గడిపిన రోజులు, కళాశాలలో వుంటే, బళ్ళో మాష్టారు దగ్గర దెబ్బలు తిన్న సంఘటనలు...ఎందుకు ఎప్పుడూ జరిగినదాన్నే ఆలోచిస్తూ ఈ క్షణాన్ని గుర్తించడం మర్చిపోతున్నారు. ఒక్కొక్కక్షణాన్ని గుర్తించి అనుభవించ గలిగితే, ప్రతిక్షణం సంతోషమే కదా?

## 7. భారత రామాయణాలను, తరువాత కాలపు కవులు కావ్యాలుగా, నాటకాలుగా మార్చి రాస్తున్నారు కదా, ఏది నిజమో ఎలా తెలుస్తుంది?

***జ.*** ఎవరు ఎలా మార్చినా మూలకథలో మార్పు వుండదు. ఒకటి రెండు సన్ని వేశాలు తమకు నచ్చినట్టు కల్పించుకుం టారు. మూలమే మార్చినవారు సోదిలోకి రాకుండా పోతారు.

## 8. లోకులు కొందరు ఓం నమో నారాయణాయ! అనకుండా, ఓం నమో వెంకటేశాయ అంటున్నారు. ఇది న్యాయమా?



**జ.** నారాయణా అంటున్నా, వెంకటేశా అంటున్నా, అయ్యప్పా అని పిలిచినా న్యాయమే. ఎటొచ్చీ నిర్మలమైన మనస్సును దైవం మీద ఏకాగ్రం చేయడం ప్రధానం. ఏకాగ్రత లేకపోతే ఏ నామం జపించినా బూడిదలో పోసిన పన్నీరే!

## 9. దేవుడొక్కడే అంటూ మళ్ళీ ముక్కోటి దేవతలు అంటారేం?

**జ.** ముక్కోటి ఆంధ్రులున్నప్పుడు అలా అనే వారు, ఇప్పుడు ఆరుకోట్ల దేవతలు.... ప్రతి ప్రాణీ పరమాత్మ స్వరూపం అన్న నమ్మకం దీనికి కారణం! అది లేని వారికి ఏ బాధాలేదు, ఇందరు దేవతలేమిటా అనే చింత తప్ప!

## 10. శ్రీరాముడు హనుమంతునికి దైవం, మరి రామునికెవరు?

**జ.** రాముడికి రామశబ్దం దైవం.

## 11. న్యాయధర్మాలకు జీవితం అంకితం చేసిన శ్రీరాముడు వాగ్దానాలతో రకరకాల వేషాలేశాడా?

**జ.** కంబళిలో ఆహారం తింటూ వెంట్రుక లేరుకునే కష్టకాలంలో పుట్టాం, కనుక రామాయణ రామభద్రుని చరిత్ర చదువుకుంటూ కలియుగ రాములకు దూరంగా వుండడం క్షేమదాయకం.

## 12. అన్నం పరబ్రహ్మ స్వరూపం కదా, కోపం వచ్చిన వారు భోజనం మానుతారేం?

**జ.** మీరు అదృష్టవంతులు. కోపం వచ్చినప్పుడు మా మిత్రుడు పసివాళ్ళకు మెతుకు మిగలకుండా గిన్నెలు ఖాళీ చేస్తాడు. కోపం అనారోగ్య కారణం. దానికి సరైన చికిత్స ఉపవాసం.

## 13. ద్వాపర యుగాంతంలో పుట్టిన వ్యాసుడు ద్వాపరయుగ ఆరంభంలో జరిగిన భారతం రాశాడని నమ్మ మంటారా?

**జ.** భారతం చదివితే ఈ శంక రాదు. భారత పాత్రలన్నిటి ముందు పుట్టినవాడు వ్యాసుడు. ఆ తరువాయి భీష్ముడు, ఇప్పుడైనా చదవండి.

## 14. భగవద్గీత చదివితే పాపం నశిస్తుందా?

**జ.** గీత బోధిస్తూ అది కూడా వ్యాపారం చేసుకునే స్వాముల యుగంలో వున్నాం మనం. ఇక మన పాపాలు పోయే గీత ఎక్కడిది మనకు.

### 15. ఏ అధికారమూలేని దుర్యోధనుడు కర్ణునికి అంగరాజ్యం పట్టం కడితే పెద్దలు అందరూ మిన్నకుండి పోయినారా?

**జ.** నేటి బడా నాయకుల కుమారులు, బంధువులు చేసే అత్యాచారాలను చూస్తూ ఏం చేస్తున్నారు పెద్దలు. అందుకే భారతం ఈనాడు జరుగుతున్నదంటున్నారు మా గురువులు.

### 16. బాధలలోనే మనకు భగవంతుడు గుర్తుకు వస్తాడా? ఆనంద సమయంలో రాడా?

**జ.** బాధలు ఆయన కలిగిస్తాడనీ, సిరి సంపదలు మనం సంపాదించు కోగల మనీ అనుకునే అవివేకం వల్ల ఈ భావం కలుగుతున్నది.



### 17. ఒకే భార్య, ఒకేమాట, ఒకే బాణం అంటారు రామునికి...?

**జ.** అంటారు రామభక్తులు. కాని రామాయణం వ్రాసినటువంటి వాల్మీకికి భక్తి కన్న రాముని శక్తిమీద విశ్వాసం. ఒక్క బాణం పడితే చచ్చే నీరస రావణునితో యుద్ధం చేసినవాడు మహావీరుడు కాదని ఆదికవికి తెలుసు. రణరంగంలో తనతో సమానమైన వీరులనే ఎదుర్కొంటాడు రాముడు, చదవండి యుద్ధకాండ.

### 18. మానవ శక్తియా? భక్తియా? ఏది ఘనం...

**జ.** నా యందు భక్తితో నీ శక్తికొద్దీ కృషి చేస్తే ఫలం అన్నాడు గీతాచార్యుడు.

### 19. మనిషి పీల్చే గాలికి, త్రాగే నీటికీ, తినే తిండికీ తేడాలేదు కదా, మరి మనుషులలో ఇన్ని తేడాలెందు కొచ్చాయి.?

**జ.** అక్కడే పొరబడుతున్నారు – గాలి అన్ని ప్రదేశాలలో వున్నదీ ఒక్కటే కాదు. సముద్ర తీర ప్రాంతాలలో సముద్రపుగాలి, అలానే కొండలున్న చోట కొండగాలి, వరద సమయంలో గోదావరి గాలి, కృష్ణగాలి. ఈ యంత్రయుగంలో కర్మాగారాలున్న చోట భోపాల్‌గాలి, ఇక నీరంటారా... గోదావరి, కృష్ణా, పెన్నా నదుల నీరు వేరు. గంగ నీరు స్వచ్ఛంగా తెల్లగా వుంటే యమున నల్లగా వుంటుంది. త్రివేణీ సంగమం దగ్గర చూడండి. ఇక ఆహారం. ఇది ఇంటికో రకం. మనం వాడు ఉప్పున్నదే రాతి ఉప్పు, సముద్రం ఉప్పు, సైంధవ లవణం మార్కెట్టులో దొరికే శూన్యరహిత లవణం...


ఇలానే మిర్చి, ఉల్లిపాయ ప్రాంతాలను బట్టి మారుతున్నాయి. ఇన్ని తేడాలుంటే మనిషి మాత్రం ఒక్కరకంగా ఎలా ఉండగలడు.

## 20. వెంకటేశ్వరస్వామికి సంతానం వున్నదా?

**జ.** వెంకటేశుడు విష్ణువు అవతారం, విష్ణువు జగన్నాథుడు అయినపుడు మనమంతా కూడా 'దేవుని బిడ్డలం' కామా!

## 21. అర్థం తెలియని మంత్రాలతో వివాహం కంటె వాడుక భాషలో వివాహం ఉత్తమం కదా?

**జ.** వాడుక భాషలో చేసే వాగ్దానాలు విని ఓట్లు వేసి నెత్తిమీది కెక్కించుకున్న నాయకుల పాలనలో స్వార్థం, బంధుప్రీతి,



ఆశ్రితపక్షం చూసి కూడా ఈ మాట అంటున్నారా. మంత్రమైనా తెలుగు తాత్పర్యమైనా తాళికట్టేవాని మనసు ప్రధానం. అయితే మంత్రానికి శక్తి వున్నదని శబ్ద శాస్త్రం ఘోషించింది. అయితే మంత్రం ఉచ్చరించే శక్తి కూడా వుండాలి. వారు నిర్మలమూ, నిస్వార్థమూ అయిన జీవితం సాగిస్తేనే మంత్రం బలంగా వుంటుంది.

వారు కూడా వ్యాపారదృష్టికి దిగితే మంత్ర తంత్రాలు లేని రిజిష్టరు పెళ్ళి చేసుకొని కాంట్రాక్టు కాపురం చేయడం మేలు.

## 22. భారత రామాయణాలలో భారత ఉపఖండ ప్రస్తావనే వున్నది, మిగిలిన ఖండాలు?

**జ.** భారత, రామాయణాలనాడు భూగోళం ఎలా వుండేదో రెండు గ్రంథాలూ చదివితే తెలుస్తుంది. కిష్కింధకాండలో సుగ్రీ వుడు, భీష్మపర్వంలో సంజయుడు భూగోళానికి,



నాటి గోళానికీ వున్న తేడా గమ నిస్తే ఖండాలు దూరమవు తున్నాయని నేడు శాస్త్రజ్ఞులు చెప్పేమాట అర్థమవుతుంది.

## 23. ఆత్మకూ, పరమాత్మకూ భేదమేమి?

**జ.** ఆత్మయే పరమాత్మ అంటారు కొందరు. ఆత్మ జీవుడనీ, దీనిని శాసించేదీ, నడిపించేదీ, నడుస్తూంటే సాక్షిగా చూసేదీ పరమాత్మ అంటారు. ఇంకా కావాలంటే భగవద్గీత పది మారులు చదివి సద్గురువును ఆశ్రయించండి.

## 24. విశ్వామిత్రుడి గొప్పతనం ఏమిటి?


**జ.** తనకంటె వసిష్ఠుడు గొప్పవాడని తెలిశాక తనుకూడా అంతవాడు కావడానికి అవసరమైన దీక్ష వహించి, కామ, క్రోధాలు విడిచి, అసూయను పూర్తిగా దూరం చేసుకుని ఆత్మ సాక్షాత్కారానికి ప్రయత్నించడం.

## 25. మంగళమంటే...?!

**జ.** ఆనందం, హుందాతనం కలిపిన పవిత్రమైన ఆనందాన్ని మంగళమనవచ్చు. ప్రతి చిన్న విషయానికి ఎదుటి వారిపై విరుచుకుని పడకుండా ప్రశాంతంగా వుండగలగడం. ప్రతివారికీ మంచి జరగాలని ఆశించడం. అమంగళకరమైన ఆలోచనలు, మాటలు రానీయకుండా వుండటం మంగళమని చెప్పవచ్చు. ఇలా వుంటే మన ఉనికి ఇతరులలో సంతోషాన్ని, ఒక పవిత్ర భావాన్ని రేకెత్తిస్తుంది. మనస్సులో అనవసరమైన భారాన్ని పెట్టుకోకుండా తేలికగా పని చేయడం అనాయాస మయితే, మన మెళ్ళిన చోటల్లా ఒక దీపంవలె ఆనందాన్ని ప్రసరింపజేయడం మంగళం.

## 26. వ్యాస మార్గం

**జ.** ఎన్ని విదేశీ శక్తులు దాడులు చేసినా, కాలం, సంస్కృతులలో ఎన్నిమార్పులొచ్చినా, కాలం చెల్లనివి మన పురాణాలు. ఎందరు ఎన్ని రకాలుగా ప్రశ్నించినా చివరికి వాటిని శరణు జొచ్చా



ల్సిందే. ఇది వ్యాసమహర్షి అందించిన జ్ఞానం. ప్రజలకి పంచిన విజ్ఞానం. శ్రీ మహావిష్ణువే శాస్త్రాల్ని సామాన్యులకు అందించేందుకు వ్యాసుని రూపంలో అవతరించాడు. ఆయన ప్రజలందరికీ గురువు. గురువంటే కేవలం బోధించేవాడని కాదు ఆ బోధనలను అనుసరించేలా చేయగలిగేవాడు. కాలం చెల్లని విలువలను ప్రజల ముందు నిలిపినవాడే అసలైన గురువు. ఆయనే వ్యాసుడు. వ్యాసమహర్షి త్రికాల పురుషుడు, భవిష్యత్తును గ్రహించినవాడు కాబట్టే వేద విజ్ఞానం సామాన్యుల చెంతకు చేరేందుకు మహాభారత రచన చేశాడు. వేదాలను పురాణాల రూపంలో మన ముందుంచాడు. ఉపనిషత్తుల సారాంశాన్ని భగవద్గీత రూపంలో అందించాడు. ఆయన మార్గం అనుసరించగలిగితే ప్రజలంతా ధర్మ బద్ధులుగా రూపొందుతారు.

## 27. సత్యదేవుడు

**జ.** యుగయుగాలుగా రమా సహిత సత్యనారాయణుడు అనే నామంతో

పూజలు, సేవలు అందుకుంటున్న స్వామి, అన్నవరంలో హరిహరహిరణ్య గర్భ, త్రిమూర్త్యాత్మకుడుగా వీర వేంకట సత్యనారాయణ మూర్తిగా, ఆద్యాది అనంతలక్ష్మి సత్యవతీ సమేతుడుగా వ్రతరూప ధారియై ఆరాధింపబడుచున్నాడు. ఆలయ నిర్మాణంలోనూ, యంత్ర



ప్రతిష్ఠాదులలో విశిష్టత వున్నట్లే స్వామి వారి పేరులోనూ, అమ్మవారి పేరులోని ప్రత్యేకత కనిపిస్తూ వుంటుంది. శ్రీ స్వామి వారి పేరు 'శ్రీ'తో ప్రారంభ మవుతోంది. 'శ్రీ' అనగా లక్ష్మీవాచకం. కాంతి, శుభ వాచకముకూడా. శ్రీ స్వామివారు లక్ష్మి పతి, శ్రీమంతుడు, శోభాశాలి, శుభ దాయకుడు, 'వీర' శబ్దం శ్రీమన్నారాయణుడు, ధర్మ సంస్థాపన కోసం దుష్ట శిక్షణ, శిష్టరక్షణ మొదలైన మహా కార్యాలకి మహోత్సాహంతో, పూనుకుంటాడు. స్వామివారి చేతులలోగల ధనుర్బాణాలు కూడా ఈ అంశాన్నే తెలియజేస్తున్నాయి.

ఆయన యుద్ధవీరుడే కాక ధర్మవీరుడు, దయావీరుడు, దానవీరుడు కూడా. లోకోద్ధరణకు భూలోకంలో అవతరిస్తానని చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకొని భూ లోకంలో అవతరించినందున సత్య వీరుడు, వ్రతమాచరిస్తానని చెప్పి చేయక పోవుటచే శపించి అసత్య రూపమైన అధర్మ మార్గమునుండి ధర్మ మార్గానికి మళ్ళించి నందున ధర్మవీరుడు, అలాంటి వారిని శపించి, వారి మొర తానే ఆలకించి దయతో కాపాడినందున దయా వీరుడు, తన వ్రతమాచరించిన వారి కోరికలన్నీ తీరుస్తాడు కనుక దానవీరుడు. శ్రీస్వామివారి పేరులో 'వేంకట' అనే శబ్దముంది. 'వేం' అనగా పాపం. 'కట' అనగా ఖండన. వేంకటుడు అంటే పాపాలను నశింప జేయువాడని అర్థం. అదీగాక 'వేం' అమృత బీజమని, 'కట' అంటే ఐశ్వర్యమని అర్థం. అనగా తరగని ఐశ్వర్యం ఇచ్చేవాడని అర్థం. పై మూడు విధాలైన భావాలను కలుపుకుంటే 'వేంకటుడు' అంటే పాపాలని నశింపజేసి, తరగని ఐశ్వర్యాన్ని, మోక్షాన్ని ప్రసాదించేవాడని అర్థం.

'సత్యం' జ్ఞానరూపమైనది, అంతు లేనిది, మూడు కాలాలలో వుండేదని అర్థం. శ్రీ శంకరాచార్యులవారు 'స' అంటే ప్రాణమని, 'త' అంటే అన్నమని, 'య' అంటే సూర్యుడని, సత్యశబ్దము ప్రాణ, అన్న, ఆదిత్య రూపాలతో అద్వైతాన్ని బోధిస్తున్నది. కనుక 'సత్యుడు' అంటే త్రికాలాబాధితమైన ఉత్కృష్టమైన ప్రాణ, అన్న,

ఆదిత్య రూపమైన పరబ్రహ్మతత్వమని చెప్పవచ్చు. తర్వాత 'నారాయణ' శబ్దం. 'నారాః' అంటే ఉదకములు అనగా నీళ్ళు. 'అయనము' అనగా నివాస స్థానము. నీరు నివాస స్థానముగా కలవాడు. అంటే ప్రళయ కాలంలో ఏకార్ణవముపై శయనించేవాడని అర్థం.

చివరిది 'స్వామి' అంటే సమస్త సృష్టి స్థితిలయములకు ప్రభువు అని అర్థం.

స్కాందపురాణంలోని రేవా ఖండంలో శ్రీమన్నారాయణుడు కలియుగంలో శ్రీ సత్యనారాయణ స్వామి వారి పేర అవతరిస్తాడని, ఆయన వాంఛితార్థ ఫలప్రదుడని వివరింపబడింది. ఆయన వ్రతమాచరించినవారికి దుఃఖాలు తొలగి, ధన ధాన్యాలు, సౌభాగ్యసంతతి కలుగుతుంది. శ్రీ సత్యదేవ వ్రతాన్ని మించిన వ్రతం మరొకటి లేదు. ఇది భక్తులపాలిట వరప్రసాదం.

## 28. భగవత్సాక్షాత్కారం

**జ.** భగవంతుడున్నాడా? ఉంటే కనిపించడేం అంటే పగటివేళ ఆకాశంలో నక్షత్రాలను మనం చూడలేం. అంత మాత్రాన నక్షత్రాలు లేవని అర్థంకాదు. పాలలో వెన్న వుంది కాని అది కనిపించదు. పాలను తోడుపెట్టి, పెరుగును చిలికితే వెన్న లభిస్తుంది. చెరువులో చేపలు పట్టాలనుకుంటూ, ముందుగా ఆ కళను నేర్చుకోవాలి. ఆ తర్వాత ఓపికగా గేలం వేసి, చేపను ఒడ్డుకి లాగాలి. అలాగే కేవలం ఆకాంక్ష వున్నంత మాత్రాన భగవత్



సాక్షాత్కారం లభించదు. సజ్జనుల, సాధు పుంగవుల ఉపదేశాలపైన విశ్వాసం వుంచాలి. మనస్సును గేలంలా, ప్రాణాన్ని కొక్కెంలా తయారుచేసుకోవాలి. మన భక్తీ, జపమూ ఎరగా వేయాలి. అప్పుడు భగవత్ సాక్షాత్కారం తప్పక సిద్ధిస్తుంది.

## 29. వేదశాస్త్రాల సారాంశం

**జ.** సత్యాన్ని పలుకు, ధర్మాన్ని ఆచరించు విద్యాధ్యయనమును విడువకు. నీకు క్షేమం చేకూర్చే వాటిని మరువకూడదు. దేవ పితృకార్యాలను విస్మరించరాదు. తల్లి దేవత, తండ్రి దైవం. గురువే భగవంతుడు. అతిథులను గౌరవించు. నిషిద్ధములుగాని కర్మలనే చేయాలి. పెద్దలను, మహాత్ములను సేవించాలి. యోగ్యులకు ద్రవ్యాన్ని శ్రద్ధతో సమర్పించాలి. కర్తవ్యకర్మల యందు సందేహాల్ని ధర్మాధర్మ విచారణా సమర్థులైనవారు, వివేకవంతులు, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులూ అయిన మహా

త్ములవద్ద చేరి తీర్చుకోవాలి. ఇదే ఉపని షత్తుల యొక్క ఆదేశం. ఇదే ఉపదేశం. ఇదే వేదశాస్త్రాల సారాంశం. ఈ విధం గానే అనుష్టించాలి.

## 30. ఆషాఢమాసంలో అత్తా కోడలు ఒకే గడప దాటరా దంటారు. దీని మర్మమేమి?

**జ.** వివాహమైన మొదటి సంవత్సరం గ్రీష్మ ఋతువులో ఆషాఢ మాసంలో అత్తా కోడళ్ళు ఒకే ఇంట్లో ఉండరాదన్నది ధర్మశాస్త్ర నిర్ణయం. దీనివెనుక ప్రకృతిలో జరిగే మార్పుల ప్రభావం మనపై ఎలా ఉంటుందో ఊహిం చవచ్చు. దాని నాధారంగా తీసుకుని ఏర్పాటు చేసుకున్న ఆచారాలలో ఇది ఒకటి.

## 31. గృహనిర్మాణ సందర్భంలో చేసే శంకుస్థాపనలో నవ ధాన్యాలలో నువ్వులు కూడా చల్లుతారు కదా! నువ్వులు శుభకార్యాలలో నిషిద్ధంగదా! దానికి ప్రత్యామ్నాయ మేమిటి?


**జ.** నువ్వులుకు బదుల ఆవాలు జల్లుతారు. అసలు శుభకార్యాలు, అశుభకార్యాలు అన్న తేడాలేవీ లేవు. పితృదేవతలకు సంబంధించిన కార్యాలను అశుభాలుగా భావిస్తాం. వివాహాది శుభకార్యాలకు ముందు పితృదేవతలను ఆరాధిస్తాం. దానికి 'నాంది' అని పేరు.

## 32. త్రికరణశుద్ధి అంటే ఏమిటి?

**జ.** మనస్సు మాట, చేతలలో భేదం లేకుండా ఉండడానికే త్రికరణశుద్ధి అని పేరు.

## 33. పూజలు, వ్రతాలు, ఉత్సవాలు, ఉపవాసాల అంతర్యమేమిటి?

**జ.** ఆధ్యాత్మ సాధనలో ఇవన్నీ భాగాలు. సాధన అందరికీ ఒకే విధంగా ఉండదు.



వారి వారి రుచి భేదాలను బట్టి, ప్రవృత్తిని బట్టి ఆయా పద్ధతులు ఏర్పాటు చేయబడ్డాయి. అయితే వీటి కన్నింటికీ లక్ష్యం ఒక్కటే.

## 34. ఆత్మనిగ్రహానికి ఎలాంటి కర్మలు ఆచరించాలి?

**జ.** ప్రధానంగా ఆహార, విహారాలలో నియమముండాలి. ధ్యాన, ప్రాణాయా మాదులు అందుకు ఉపయోగపడతాయి.

## 35. మనోనిశ్చలత సంపా దించాలంటే భగవంతుని ఎదుట ఎలా వర్తించాలి?

**జ.** భగవంతుని ముందు నిలబడి స్వామి పాదాల మీద దృష్టి లగ్నం చేయాలి. దృష్టిని అటు ఇటు పోనివ్వకూడదు. అందుకే పూజారి తలపైన శఠగోపం పెట్టి మన తలవంచుతాడు.

## 36. పూజలో అగరుబత్తీలు ఎందుకు వెలిగిస్తారు?

**జ.** పూజలో ధూపదీపాదులను సమర్పించాలి. ధూపానికి బదులు అగరువత్తులు వెలిగించడం జరుగుతోంది.

## 37. మృతదేహం గల ఇంటి ముందు నిప్పు ఉంచుతారెందుకు?

**జ.** శవాన్ని దహనం చేయడానికి శ్మశానానికి తీసుకువెళ్ళేముందు ఇంటివద్ద చేయవలసిన హోమాదులున్నాయి. అందుకు నిప్పు కావాలి గదా!

## 38. శివాలయంలో నంది కొమ్ముల మధ్యనుంచి శివుని చూడాలంటారు, నిజమేనా? ఇందుకు ఏ చేతివేళ్ళను ఉపయోగించాలి?

**జ.** మన దృష్టి దేవాలయంలోని వివిధ విగ్రహాలను చూస్తూ చూస్తూ వచ్చి చివరకు మూలవిరాట్టు పాదాలమీద కేంద్రీకృతం కావాలి. అందుకు నందికొమ్ముల మధ్యనుంచి చూడడం కూడా ఒక పద్ధతే. ఇక్కడ ఏ వేళ్ళన్నదానికన్నా దృష్టిని అటు నిటు పోనివ్వకుండా ఏకాగ్రతతో భగవంతునిపై లగ్నం చేయడమన్నది ముఖ్యమని గ్రహించాలి.

## 39. కృష్ణనామం

**జ.** రామనామ జపం గురించి చెప్పినంతగా కృష్ణనామం గురించి చెప్పలేదు. సామాన్యులు అంతగా పట్టించుకోరు. కాని దశావతారాలలో మానవ గుణానికి అత్యంత సమీపంగా కనిపించేది కృష్ణావతారం. సామాన్య బాలకుడుగా అల్లరి చేశాడు. చిలిపి కృష్ణుడిగా వెన్న దొంగిలించాడు. యవ్వనంలో గోపికలతో రసికత ప్రదర్శించాడు. నాయకుడుగా యాదవులలో నిలిచాడు. మంత్రిగా పాండవులను నడిపించాడు. తన భక్తులు తలచినదే తడవుగా ప్రత్యక్షమయ్యాడు. ద్రౌపది కృష్ణుని ఆర్తితో అడిగినప్పుడల్లా ఆమెను ఆదుకున్నాడు. అందులో వస్త్రాపహరణ ఘటన మచ్చుకు ఒక్కటి. అభిమన్యునికి పద్మ వ్యూహ ప్రవేశం తెలియచెప్పాడు. రథ సారథిగా అర్జునుని నడిపించాడు. మహా యోధులను సంహరించే మర్మం బోధించాడు. ఇలా తన భక్తులుగా పాండవులు అడిగినవన్నీ అందించాడు. శ్రీకృష్ణనామం జపిస్తే ఆయన ఆదుకోకపోవడం వుండదు. అందుకు మరో సాక్ష్యంగా గజేంద్ర మోక్షం సంఘటన నిదర్శనంగా నిలుస్తుంది.

## 40. దేవుని చూసిన మీదట తిరిగి వెళ్ళేటప్పుడు వెనుకకు తిరిగి చూడకూడదని కొందరంటారు. నిజమేనా?

**జ.** సౌకర్యం దృష్ట్యా ఈ మాట సరియైనదే కావచ్చు. దైవాన్ని దర్శించి ఆ మూర్తిని మన హృదయఫలకం మీద ముద్రించుకున్నాం. అది చెదరిపోకుండా నిలుపుకోవడం ముఖ్యం కనుక ఏకాగ్ర మనస్కులమై బయటకువచ్చి కొంతసేపు ధ్యాన నిమగ్నులం కావడం కోసం అలా చెప్పారు.

## 41. ఆదిశంకరాచార్యుల వారు శిష్యుని చేత చంపబడి నారని తెలిసిన తరువాత అంతటి మహావ్యక్తికి ఆ ప్రమాదం తప్పలేదా అని అనాసక్తత కలుగుతోంది. ఆయనపై ఆసక్తిని పెంచుకు నేదెలా?

**జ.** అసలు వారు స్వయంగా తనువు చాలించి అదృశ్యమైనారని శంకర విజ యంలో పేర్కొనబడింది. పాంచభౌతిక శరీరం తొడుక్కునే చొక్కావంటిది. అది చిరిగితే వదిలి వేసి మరొకటి తొడుక్కుం టాం. వదలడానికి ఏదో ఒక కారణం చూపబడుతుంది. అంతమాత్రంతో అనా సక్తత పెంచుకోవడమెందుకు? పూర్ణ పుణ్యావతారుడైన కృష్ణ పరమాత్మ బోయ వాని బాణానికి గురై తనువు చాలించారు. రామకృష్ణ పరమహంస, రమణమహర్షి మొదలగువారు తనువులను ఏ విధంగా విడిచారో మనం వినలేదా?

## 42. కుంభకర్ణుడు, భీముడు, బకాసురుడు వీరి తిండి చూస్తుంటే..?

**జ.** గుండె బద్ధలవుతుంది, ఈ కాలపు అరగిద్దెడు తిండి ఆరగించుకోలేని వారికి. కాని మొన్న పత్రికలు చూశారా - లండన్‌లో సాల్వే అనే యువకుడు 20 కిలోల అన్నం, 10 కిలోల మాంసంతో ఫలహారం చేస్తున్నాడట. ఆ బాలుని బరువు విన్నారా, 250 కిలోగ్రాములు. వీడికి వేల సంవత్సరాల క్రితం పుట్టిన భీమ బకా సురులు ఎంత తినగలరో ఆలో చించండి. మనం చాలా అల్పప్రాణులం. అరకిలో కూర అయిదుగురు తినలేని నీరసులం.

## 43. రాముని వంశం లవకుశులతో అంతమా?

**జ.** రాముడు మన గుండెలలో వున్నంత కాలం ఎందుకు అంతరిస్తాడండీ!



## 44. ముక్కోటి ఏకాదశి అనే పేరెలా వచ్చింది?

**జ.** ఉత్తర ద్వార దర్శనమంటే అర్థమైంది గాని మరి దీనికి 'ముక్కోటి ఏకాదశి' అనే పేరెలా వచ్చిందనే సంశయం మనకి కలగకమానదు. మూడు+నీరు – మున్నీరు, మూడు + కంటి – ముక్కంటి, మూడు + పేట – ముప్పేట అని అయినట్లుగా 'మూడు + కోటి –ముక్కోటి అవుతుంది. ఈ చెప్పుకోబోయేది యోగ శాస్త్రానికి సంబం ధించిన అంశం. ప్రతి వ్యక్తికీ ఉన్న కుడి



ముక్కురంధ్రం పేరు పింగళ. ఎడమ ముక్కు రంధ్రం పేరు ఇడ. ఈ రెండు నాడులూ ఏటవాలుగా పైపైకి – అంటే– నుదుటివైపుకి ప్రయాణాన్ని సాగిస్తూ ఉంటే, సరిగా భ్రూమధ్యంలో (రెండు కనుబొమల మధ్య ప్రదేశంలో) సుషుమ్న అనే మరో నాడి (బ్రహ్మరంధ్రం నుండి వెన్నెముక చివరి భాగం వరకూ నిట్టనిలువునా వ్యాపించి ఉన్ననాడి) ఈ రెండు నాడులనీ తాకుతుంది. ఈ మూడు నాడులూ ఒక్కచోట కలిసే ఆ భ్రూ మధ్యమే శరీరంలో ఉన్న 'త్రివేణీ సంగమ స్థానం'. లోకంలో ఉన్న త్రివేణీ సంగమాన్ని పరిశీలిస్తే ఇది మన శరీరంలో కూడ ఉందని భావించగలగాలి. ఈ త్రివేణీ సంగమంలో ఎలా గంగాయమునలనే రెండు మాత్రమే ప్రత్యక్షంగా దర్శనమిస్తూ ఎలా సరస్వతీ నది కన్పడదో, అంతర్వాహినిగా (కనిపించకుండా లోలోన ప్రవహించే లక్షణం కలది) ఎలా ఉంటుందో అదే తీరుగా ఇడా పింగళ నాడులని మనం ఉచ్ఛ్వాస నిశ్వాసాల ద్వారానూ, కుడి ఎడమ ముక్కు రంధ్రాల ద్వారానూ గుర్తించగలంగాని, అక్కడ సరస్వతీనది కన్పడనట్లు ఇక్కడ కూడ సుషుమ్నా నాడికూడ కన్పడదు. ఈ మూడు నాడులూ ఒకచోట కలిసే ఆ భ్రూమధ్య ప్రదేశం అతిపవిత్రమైన కారణంగానే శ్రోత్రియులందరూ అక్కడే కుంకుమని ధరిస్తారు.

వైష్ణవులు కూడ నిలువుగా ఊర్ధ్వ పుండ్రాలని ధరించినా ఈ ప్రదేశంలో బొట్టుని ధరించేది ఇందుకే. యోగాభ్యాసాన్ని చేసే సాధకులందరూ శ్రీహర యోగనిద్రకి ఉపక్రమించిన శయనైకాదశి (ఆషాఢ మాసంలోని శుద్ధపక్ష ఏకాదశి) నాడు ప్రారంభించి యథార్థంగానూ నిష్టతోనూ యోగసాధనని సక్రమంగా చేస్తే ఈ ఏకాదశికి – అంటే –పుష్య శుద్ధ ఏకాదశికి వైకుంఠ దర్శనమౌతుందనీ, ఆ కారణంగా ఇది వారి పాలిటి వైకుంఠ ఏకాదశి అవుతుందనీ పెద్దలు గుర్తించిన అంశం. ఇక ఇడ పింగళ అనే నాడులు రెంటినీ రెండు గుర్రాలుగా భావించి సక్రమమైన రీతిలో ప్రాణాయామ విధానాన్ని పాటిస్తున్న యోగ సాధకునికి, ఎవరికీ కన్పించని సుషుమ్నా నాడి కూడ అనుభవంలోకి వస్తుందనీ, ఆ సుషుమ్నా నాడిలో పరమేశ్వరుడున్నాడనే యథార్థం కూడా అతనికి అర్థమౌతుందనీ, ఆ కార

ణంగ 'మూడు = మూడైన ఇడ పింగళ సుషుమ్నా నాడుల, కోటి = చివరి భాగం (బ్రహ్మరంధ్ర స్థానం) అతని వశంలోనికి వస్తుందనీ, ఆ కారణంగా ఈ ఏకాదశి అతని పాలిటి 'ముక్కోటి ఏకాదశి' కూడ అవుతుందనీ ప్రాచీనులు (యథార్థాన్ని దర్శించి) లోకానికి తెల్పారు.

## 45. నిజానికి దేవునికి ఎన్ని ముఖాలున్నాయి?


**జ.** భగవంతుడు అనేవాడు మీకన్నా బ్రహ్మాండంగా వుండాలని 16 చేతులు, 6 ముఖాలు మరియు 4 ముఖాలని మీరే ఊహించుకుంటున్నారు. నిజం చెప్పండి. మీకు ఎన్ని ముఖములు? ఇంట్లో ఒక ముఖం, కార్యాలయములో ఒక ముఖం, స్నేహితులవద్ద ఒక ముఖం, విరోధుల వద్ద ఒక ముఖం.

వీది వీధికి మీరు ఎన్ని ముఖాలు మార్చుకుంటూ తిరుగుతున్నారు. అలా అయితే కుమారస్వామి కంటే మీకే కదా ఎక్కువ ముఖాలు.

ముఖాల్నిబట్టి దేవుని నిర్ణయించు కుంటే, రాజకీయ నాయకులతో ఏ దేవుడు పోటీ పడలేడు. మన ముందుతరం వారు, దేవునికి ఒక రూపాన్ని ఇచ్చారంటే దానికి తెలివైన కారణాలున్నాయి. అవి తెలుసు కోకుండా, దేవుని యొక్క రూపం గూర్చి నేను తెలుసుకున్నానని అనుకోవడం మీ మనసులో దాగునివున్న అహంకారాని కది నిదర్శనం. అంతే!

## 46. లంకలో సీతాదేవి వున్నదని తెలిశాక హనుమంతుడు లంకకు నిప్పు పెట్టాడు కదా, మరి సీతాదేవి ఆ మంటలలో...?

**జ.** ఈ ప్రశ్న సుందరకాండలో హనుమంతుడే వేసుకుని... ఔరా! ఆవేశం ఎంత



దారుణాలకు దింపుతుందీ! గురువులను చంపిస్తుంది. సాధువులను హింసింప జేస్తుంది. అంతేనా, అది చేయించని పాడు పని ఏముంది–అని చింతిస్తాడు. అంతటి వాడు ఆవేశానికి లొంగి ఎంతకి దిగజారాడో, అది విన్నవారై క్రోధాన్ని ఎంత దూరంలో వుంచాలో గ్రహించడానికి సుందర కాండను చిన్ననాటి నుండీ చదివిస్తే మన పిల్లలైనా, వివేకంతో జీవిస్తారు.

## 47. రాముడు, పరశురాముడు ఇద్దరూ అవతార పురుషులే కదా!


**జ.** పరశురాముడు అంశావతారం రాముడు పూర్ణావతారం అని పురాణాలు చెపుతున్నాయి. పూర్ణావతారం వచ్చినప్పుడు అంశావతారం తాలూకు వ్యక్తి లోపిస్తుంది.

## 48. స్వర్గం నరకం అంటే ఏమిటి?

**జ.** మనం చేసే మంచి అంతా స్వర్గం, చెడు పనులన్నీ నరకం.

## 49. సృష్టిలో ముందు పుట్టింది చీకటా? వెలుగా?

**జ.** లోకంబులు లోకేశులు, లోకస్థులు తెగిన తుది అలోకంబగు పెంజీకటి కవ్వల ఎవ్వండే కాకృతి ।వెలుగు।। అన్నారు పోతన్నగారు. వెలుగు కీవల పెనుచీకటి సృష్టిలో వున్నది.



## 50. తెలుపు శుభానికీ, పవిత్ర తకూ గుర్తు కదా, మరి వితంతువులు తెల్లని వస్త్రం ధరించడానికి గల కారణం?

**జ.** వారిని పవిత్రంగా వుండమనీ, మనం పవిత్రంగా చూడాలనీ...

## 51. లక్ష్మీదేవి ఎక్కడ ఉంటుంది?

**జ.** ముంగిట ముగ్గులు, పసుపు, కుంకుమ లద్దిన గడప, నిత్య పూజలు, తోరణాలు ఉన్నచోట లక్ష్మీదేవి స్వాగత సత్కారాల్ని ఎల్లవేళలా అందుకుంటుంది. కన్న తల్లి దండ్రులను పూజించేచోట, మంచి ముత్యాలున్నచోట, తెల్లని వస్త్రాలతో పరి శుభ్రంగా మనుషులు తిరిగే ప్రదేశాల్లో, పాత్రల నిండా నీరు – పూలు ఉన్నచోట, వెండి వస్తువులు, చందనం, వెండి గిన్నెలో పాలు, పెరుగు, మజ్జిగలు ఉన్న ఇంట్లో లక్ష్మి నివసిస్తుంది. ఎక్కడైతే భక్తి ఉంటుందో, ఎక్కడైతే పసుపుపచ్చని పూలు ఉంటాయో, పెద్దలు, గురువులు ఎక్కడయితే పూజ లందుకుంటారో అక్కడ లక్ష్మీదేవి స్థిర నివాసం చేస్తుంది. నలుగు పిండితో స్నానం చేసే స్త్రీలున్న ఇల్లు, వడపప్పు ప్రసాదంగా పెట్టే ప్రదేశం, శాంత స్వరూపులు, ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారుండే ప్రదేశాలు, బద్దకం, అశ్లీలత, హింసా ప్రవృత్తులు లేనిచోటు ఆమెకు ప్రియప్రదేశాలు. సూర్యుడు ఉద యించే సమయాన్ని చూసేవారికి ఈమె కటాక్షం తప్పక ఉంటుంది. సూర్యుడు అస్త మించే సమయంలో నిద్రించేవారు అమ్మకు నచ్చరు, అంటే పరిశుభ్రంగా, పరిశుద్ధ సేవా గుణం నిండిన హృదయాలతో ఉండే వారింట లక్ష్మీదేవి కలకాలం నివసిస్తుందన్నమాట.

## 52. ధనలక్ష్మీ కటాక్షం

**జ.** **'ధనం మూలం ఇదం జగత్'** అన్నది లోకోక్తి. ఋగ్వేదంలోని పదిహేను ఋక్కులు, ఇతర మంత్రాలతో రూపు దిద్దుకున్న



శ్రీసూక్తం ధనం ప్రాముఖ్యాన్ని తెలియ జెప్తుంది. 'శ్రీ' అంటే శోభ, కాంతి, శుభం, సకల విద్య, లక్ష్మి, అమృతం. విశ్వ మంతా లక్ష్మీమయమే. లక్ష్మి అంటే సంపద, శోభ. లక్ష్మీదేవికి ఉన్న శాంతం, సహనం వర్ణనాతీతం. అందుకే సృష్టిలోని ఆదిశక్తి శక్తికి, ఉనికికి ప్రతిబింబంగా ఉన్న శ్రీసూక్తం, శ్రీమహాలక్ష్మీదేవికే ప్రతి బింబంగా మారింది. ధనలక్ష్మిని సుప్ర సన్నం చేసుకోవాలంటే మనస్సును నిర్మ లంగా ఉంచుకోవాలి.

### 53. కులమతాలు ఎలా పుట్టాయి?

**జ.** కులాలు ఎలా పుట్టాయి, ఎప్పుడు పుట్టాయి అనే మరో వంద డాక్టరేట్లకు పనికొచ్చేసరుకు. ఇక మతం అంటారా, క్రీస్తు ప్రభువుతో క్రైస్తవం, మహమ్మద్ ప్రవక్తతో ఇస్లాం, బుద్ధునితో బౌద్ధం, మహావీరునితో జైనం–ఇలా ప్రవక్తల పేరు మీద వచ్చాయి. మనవారు 'హిందూ' అంటు న్నారే ఇది మతం కాదు, ఇంగ్లీషువారు



అమెరికా, ఫ్రాన్సు, ఆఫ్రికాలవలె దేశ వాచకం అయినా అందరికీ మతాలున్న ప్పుడు మనకూ తప్పనిసరిగా వుండాలను కుని హిందూమతం అంటున్నారు. మనకు మతం లేదు. వేద ప్రతిపాదితమైన ధర్మమే అను సరణీయం. ఉదయం కన్ను తెరిచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకూ ఎలా ప్రవర్తించాలో, ఎలా మాట్లాడాలో, భుజించాలో, సంసారం చెయ్యాలో, నిద్రిం చాలో బోధించేది ధర్మం. ఇలా చెబుతూ వెడితే మహాభారతం అంత గ్రంథం అవు తుంది. అంతకంటే మీరు భారతంలో శాంతి, అనుశాసనిక పర్వాలు పదిసార్లు చదివితే మనుధర్మం ఎలా వుంటుందో కొంత తెలుస్తుంది.

### 54. వాలి తన సోదరుని భార్యను చేపట్టడం ద్రోహమైతే, సుగ్రీవుడు తారను అంతః పురానికి రప్పించుకుని సంసారం చేయడం....

**జ.** అందుకే రామాయణం శ్రద్ధగా చద వాలి. పారాయణం చేసేవారికి, సీరియల్

నవలలా చదివేవారికీ రామాయణ భారత విషయాలు అర్థమయ్యే తీరు వేరు. 'సోదరుడు జీవించి వుండగా' వాని భార్యను కూడినందుకు వాలిని చంపిన రాముడు సుగ్రీవుని ఎందుకు చంపలేదో తెలియ లేదా? భర్త బతికివుండగా ఆ పని పనికి రాదు. అది వానరనీతి, వానరులకే కాదు, నరులు కూడా నియోగ విధానంలో మరదలుతో వెళ్ళవచ్చు. భారతంలో ఆదిపర్వం శ్రద్ధగా పదిసార్లు చదివితే అన్ని విషయాలు తెలుస్తాయి.

## 55. యోగ అంటే ఏమిటి? అది మత పరమైనదా?

**జ.** ఇలాంటి సందేహం గలవారికి యోగ కానిది ఏదో ముందుగా చెప్పాలి. తల కిందపెట్టి కాళ్ళు పైన పెట్టటం యోగ కాదు. శ్వాస బంధించటం యోగ కాదు. శరీరాన్ని మెలితిప్పటం యోగ కాదు. యోగ సాధనలో పలురకాలు ఉన్నాయి.



యోగ అనేది ఒక ప్రత్యేక తరహాకే వర్తిస్తుంది. యోగ అంటే ఐక్యం. ఈ విశ్వంలో నీవు ఎవరో తెలుసుకుని, అనుభవించటం యోగ. నవీన విజ్ఞాన శాస్త్రం యోగా మనం చూస్తున్నదంతా ఒకే రకమైన శక్తి అని, అది భిన్నరూపాలలో కనిపిస్తుందని చెబుతున్నది. అదేవిధంగా మీరుకూడా మీరు, ఈ లోకం అంతా ఒక్కటేనన్న భావన తెచ్చుకోగలగటమే యోగ.'యోగ' ఒక విజ్ఞాన శాస్త్రం. భౌతిక శరీరం బాగుకు విధానాలు ఉన్నట్టే, అంతర్గత బాగుకోసం అందించినదే యోగ. యోగ అనేది భారతదేశంలో పుట్టిన ఒక శాస్త్రం. ఇక్కడి సంస్కృతి అందించిన వరం. దీనిని హిందువులు తొలుత కనుక్కున్నారు. కాబట్టి దీనిని హిందూ మతానికి చెందినదిగా భావిస్తున్నారు. కాని యోగాకి, మతానికి సంబధం ఏమీ లేదు.

ఐన్‌స్టీన్ అనే శాస్త్రవేత్త సాపేక్ష సిద్ధాంతం కనుక్కున్నాడు అంతమాత్రం చేత సాపేక్షసిద్ధాంతం యూదులకు చెందినదవుతుందా? ప్రతి శాస్త్రవేత్త ఏదో ఒక మతం అనుసరించేవాడే. ఇక వారు కనుక్కున్నవన్నీ ఆ మతానికి అంటగడితే ఎలా!

## 56. భగవద్గీతలో ఎన్ని శ్లోకాలు వున్నాయి?

**జ.** భగవద్గీతలోని శ్లోకాలసంఖ్య గురించిన వాదోపవాదాలు, పరిశోధనలు ఇంకా జరుగుతూనే వున్నాయి. శ్రీకృష్ణ పరమాత్మ 620 శ్లోకాలు, అర్జునుడు 57 శ్లోకాలు, సంజయుడు 67 శ్లోకాలు, ధృతరాష్ట్రుడు ఒక శ్లోకం చెప్పారు. అంటే 745 శ్లోకాలు అయ్యాయి.

అయితే వాడుకలో వున్న భగవద్గీత ప్రతినిబట్టి చూస్తే శ్రీకృష్ణుడు 574 శ్లోకాలు, అర్జునుడు 84 శ్లోకాలు, సంజయుడు 41 శ్లోకాలు, ధృతరాష్ట్రుడు ఒక శ్లోకం చెప్పారు. అప్పుడు ఈ సంఖ్య 700 వరకూ అవుతుంది. 13వ అధ్యాయంలో ఓ శ్లోకం వుంది. దాన్ని కూడా కలుపుకుంటే ఆ సంఖ్య 701 అవుతుంది. రాజస్తాన్‌లో కథియవాడ్‌లో ఇటీవల జరిగిన తవ్వకాలలో భగవద్గీత పత్రాలు కొన్ని బయటపడ్డాయని, వాటిలో 755 శ్లోకాలు వున్నాయని ఇంకొందరు చెప్తారు.

### 57. తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దర్శించిన వారిలో ప్రహ్లాదుడు ఒకరని ఒక రచయిత రాశారు. శ్రీనివాసుడు ఏ యుగమునకు చెందిన వాడు? ప్రహ్లాదుడు ఏ యుగంవాడు?

**జ.** కృతయుగంలో ప్రహ్లాదుడు చూసిన నరసింహస్వామే నేడు మనం చూస్తున్న తిరుమల శ్రీనివాసుడు.

### 58. తల్లి గర్భం నుండి శిశువు భూమిపై పడగానే ఎందుకు ఏడుస్తుంది?

**జ.** జనన మరణమనే చక్రంలో మరొక చుట్టు తిరక్కతప్పదు కదా అని.

### 59. దేవుడు మనిషిని సుఖపడనివ్వ కుండా కష్టాలను ఎందుకు కలుగ జేస్తాడు.?


**జ.** తనని మరచిపోకుండా వుండడానికి.

### 60. దుర్మార్గుడైన దుర్యోధనుడు విలాస జీవితాన్ని అనుభవించాడు. ధర్మజ్ఞుడైన ధర్మరాజు కష్టాలను అనుభవించాడు. దీనిలోని ఆంతర్యమేమిటి?

**జ.** అధర్మం ముందు సుఖాన్ని, తరువాత దుఃఖాన్ని ఇస్తుంది. ధర్మం మొదట దుఃఖకరంగా వున్నా అనంతరం అనంత మయిన సుఖాన్నీ, కీర్తినీ ఇస్తుంది.

### 61. వివాహ కార్యక్రమంలో చదివే మాంగల్యం తంతునానేన మంత్రం ఏ వేదంలోనిది?

**జ.** ఇదసలు మంత్రం కాదు. శ్లోకం. దీనికి వేదంతో ఎలాంటి సంబంధం లేదు. మంగళ సూత్రం, తలంబ్రాలు, అప్పగింతలూ ఆదిగాగల దేశీయాచారాలు.



### 62. పూర్వం బ్రాహ్మణులు మాంసం తినే వారట. ఇప్పుడు నిషిద్ధం. ఈ మార్పు ఎందుకు వచ్చింది?

**జ.** ఇప్పుడూ తినేవారు ఉన్నారు. మాంసాహారం నిషిద్ధమని ఒక పక్క వైద్య శాస్త్రజ్ఞులు పరిశోధించి ఘోషిస్తున్నారు.

## 63. మహాభారతం జరగ(డం) లేదా?

**జ.** 'భారతమంతా బొంకు'.... అనే సామెతని వింటుంటాం. తన కొడుకు దుర్యోధనుడు తప్పులు చేస్తున్నాడని స్వయంగా తెలిసీ విదురుడూ, భీష్ముడూ మొదలైన వాళ్ళ ద్వారా వినీ... ఏమాత్రం మందలించని ధృతరాష్ట్రుని వంటి తండ్రులు ఈ లోకంలో లేరా?

సుహృత్ ద్యూతం (స్నేహ పూర్వకమైన జూదం) అంటూ ధర్మరాజుని పిలిచి శకునిని కూచోబెట్టి మొత్తం రాజ్యాన్ని అపహరించి పాండవుల్ని మోసం చేసిన దుర్యోధనుల్లాంటి వాళ్ళు జీవించిలేరా? నష్టపోయిన పాండవుల్లాంటి వాళ్ళు లోకంలో వుండరా? తన బావమరిది అయిన కీచకుణ్ణి ఏమీ అనలేక, తనని ఆశ్రయించడాని కొచ్చిన ద్రౌపది వెంట వాడు అసభ్యకరంగా ప్రవర్తిస్తూ తాను సభని నిర్వహిస్తున్న కాలంలోనే అందరి సమక్షంలో పరుగెత్తినపుడు మౌనంగా వున్న విరాటుని వంటి పరిపాలకులు ఈ సమాజంలో లేరా? ద్రౌపదిలా భంగపడ్డవాళ్ళు లేరా?

కౌరవులందరికీ ఒకే ఒక్క చెల్లెలైన దుస్సలకి భర్త సైంధవుడు. ఇతనికి ద్రౌపది చెల్లెలి వరస అవుతుంది. పాండవులెవరూ లేకుండా చూసి అరణ్యంలో ఒంటరిగా వున్న ఆమెని బలాత్కరించ బోయిన సైంధవుడి లాంటి అన్నలు నేటి కాలంలో లేరా? కళ్ళముందు జరుగుతున్న చరిత్రని వార్తలలో చూస్తుంటే 'వున్నా'రనే అనిపిస్తోంది గదా! ఇక భారతంలో జరగనిదేముంది? జరిగింది – జరుగుతుంది – భారతమే జరగబోతుంది కూడా.

## 64. దశావతారాలలో బలరాముడు లేడా?


**జ.** రామో రామశ్చ రామశ్చ కృష్ణః కల్కిమేవచ అని ఒక పాఠం. పరశురాముడు, రాముడు, బలరాముడు, కృష్ణుడు, కల్కి అని దీని అర్థం.

## 65. తన కష్టాలు ఎదుటివారి ముందు వెలిబుచ్చకుండా అందరినీ నవ్విస్తూ బతికేవారు...?

**జ.** ఈ సమాజంలో అలాంటి వారినే మహనీయులు అనీ, యోగులు అనీ అంటారు.


## 66. 'శూన్యమాసం' అంటే

**జ.** సూర్యుడు (జ్యోతిష శాస్త్రం ప్రకారం ఈయన్ని రవి అంటారు) నెలకి ఒక్కొక్క రాశి చొప్పున (మేషం, వృషభం, మిథునం ... ఇలాగన్నమాట) పన్నెండు రాశుల్లోనూ పన్నెండు నెలల కాలంపాటు సంచరించడం బట్టి మనకి ఒక సంవత్సరం పూర్తవుతోంది. సూర్యుడు (రవి) మేషరాశిలోనికి రాగానే దాన్ని శాస్త్ర పరిభాషలో 'మేష సంక్రమణం' అని అంటారు.




అంటే సూర్యుడు 'మేష - మేషరాశి లోనికి, సంక్రమణం-జరగడం చేశాడు' అని అర్థమన్నమాట. ఇలా క్రమంగా వృషభం, మిథునం అనే రాశుల్లోనికి సంక్రమణం (జరగడం) చేసి ఆ మీదట కర్కాటక రాశిలోనికి సంక్రమణాన్ని చేస్తాడు. ఆ కర్కాటక సంక్రమణాన్నే 'దక్షిణాయన'మని అంటాం మనం. ఇది శాశ్వతంగా జూలై 16నే జరుగుతుంది.

ఇదే తీరుగా క్రమంగా సింహరాశి లోనికి సంక్రమణం చేస్తాడు. ఆ మీదట కన్యారాశిలోనికి రాగానే వినాయక చవితి వస్తుంది. తులారాశిలోనికి రాగానే అమ్మ వారి దసరా ఉత్సవాలొస్తాయి.



'తుల' అనే మాటకి 'త్రాసు-ఉయ్యాల' అని అర్థాలు. ఆడపిల్లలంతా ఉయ్యాలల్లో ఊగడమనే ఈ ఆటని సూర్యుడు తులా రాశిలోనికి వచ్చినప్పుడే చేస్తారు. ఆ ఉయ్యాలా - దానిలో ఊగుతూ ఆడపిల్లా కన్పించ గానే తులారాశిలోనికి (ఉయ్యాలకి సంకే తమైన రాశి) సూర్యుడు సంక్రమణాన్ని చేశాడని గమనించాలన్నమాట.



వృశ్చికరాశిలోనికి సూర్యుడు రాగానే కార్తికం వస్తుంది. ధనూరాశి (ధనుస్ + రాశి అని ఉంటే ఇక్కడ సంస్కృత వ్యాక రణం ప్రకారం సంధి జరిగి ధనూరాశి అని అవుతుంది) లోనికి సూర్యుడు రాగానే మనకి 'ధనుర్మాస'మనే మాట విన్పిస్తూ ఉంటుంది. వైష్ణవులందరూ పాశురాలని గానం చేస్తూ అర్థాన్ని మననం చేసుకుంటూ కన్పిస్తారు ఈ కాలంలోనే.

దీని మీదికి మకరరాశి, ఈ రాశిలోనికి సూర్యుడు రాగానే దాన్ని మకర సంక్ర మణం (దీన్నే సంక్రాంతి అంటారు) అనీ పిలుస్తారు. ఇది కూడ ఇందాక అనుకు న్నట్టుగా ఖచ్చితమైన ఒక తేదీ (జనవరి 14) నాడు మాత్రమే వస్తుంది. దీన్నే ఉత్త రాయణమని పిలుస్తారు.

కుంభరాశిలోనికి సూర్యుడు రాగానే వచ్చే పండుగ 'మహాశివరాత్రి' చిట్ట చివరి దైన మీనరాశిలోనికి సూర్యుడు ప్రవేశించి సంవత్సర కాలమైందని ఈ రాశిలో తాను చేరిన నాటినుండి నెలరోజుల కాలం పూర్తి కాగానే తెలియజేస్తాడు. ఈ పైదంతా స్థూలంగా ఓ పరిచయం కోసం చెప్ప బడిన సూర్యసంక్రమణ విధానం. ఇలాంటి వ్యవస్థలో ప్రాచీనులు నాలుగు నెలల

కాలానికి 'శూన్యమాసా'లని పేరుపెట్టి ఆ మాసాల్లో శుభముహూర్తాలు ఉండనే ఉండరాదని తీర్మానించారు.

అవి క్రమంగా మీన చైత్రం (మీనరాశిలోకి సూర్యుడు సంక్రమణం చేయగా వచ్చిన చైత్రమాసం) అలాగే మిధున ఆషాఢం (మిధున రాశిలోకి సూర్యుడు సంక్రమణం చేయగా వచ్చిన ఆషాఢమాసం) ఇదే తీరుగా కన్యా భాద్రపదం (కన్యారాశిలో సూర్యుడు) ధనుః పౌష్యం (ధనూరాశిలో సూర్యుడుండగా వచ్చే పుష్యమాసం) అనే నాలుగున్నూ. వీటిలో మిగిలిన మూడూ మనకి ప్రస్తుతం' అప్రస్తుతం' కాబట్టి, ఈ నెలకి సంబంధించిన 'మిధున ఆషాఢం' గురించి మాత్రం అనుకుందాం!

## 67. ఉపనిషత్తులు అంటే ఏమిటి? అవి ఎన్ని?

**జ.** వేదంలోని భాగాలలో ఉపనిషత్తులు ఒకటి. ఈ ఉపనిషత్తులు వేదంలోని తత్త్వ జ్ఞానం గురించి, ఆ జ్ఞానానికి సంబంధించిన ఋషుల అనుభవాల గురించి మనకు క్షుణ్ణంగా వివరిస్తాయి. మొత్తం ఉపనిషత్తులు 108 ఉన్నాయి. వాటిలో ప్రధానమైనవి పది. అవి ఈశోపనిషత్తు, కేనోపనిషత్తు, కఠోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు, ముండకోపనిషత్తు, మాండూక్యోపనిషత్తు, తైత్తిరీయోపనిషత్తు , ఐతరీయోపనిషత్తు, చాందోగ్యోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు.



## 68. రామాయణ కల్ప వృక్షంపై అభిప్రాయం?

**జ.** దగ్గరకు వెళ్ళినవారికి రామాయణామృతం ఇస్తుంది. దూరంగా వున్నవారికి వాతావరణ కాలుష్యం విషధూమం.

## 69. ఏడాదిపాటు రావణుడు లంకలో వున్న సీతను ముట్టుకోలేదంటే నమ్మవచ్చా?

**జ.** ఈ ప్రశ్న రామరాజ్యంలో పుట్టడం వల్లే ఉత్తరకాండ తయారయింది! అనుమాన ప్రాణుల బుద్ధి అమ్మవారిని హింసించింది.

## 70. యజ్ఞంలో పశుబలి జీవహింస కాదా?

**జ.** ఈ ప్రపంచంలో అనుక్షణం హింస జరుగుతూనే వుంటుంది. జీవంలేని పదార్థం ఏదీ తినడానికి పనికిరాదు. కాయగూరలు, ఫలాలు, పప్పుధాన్యాలు అన్నిటిలోనూ జీవం వున్నది. జీవితోనే జీవి బ్రతుకుతుంది. యజ్ఞంలో జరిగే పశుబలి విషయం ఆలోచించేవారు ఈ జాతి సంస్కృతికి మూలమైన వేదధర్మాన్ని

ఆలోచించాలి. విందు వినోదాల కోసం రోజూ లక్షలాది చేపలను, కోళ్ళను, మేకలను సంహరించి పెడుతున్నాం. యజ్ఞంలో ఒకానొక పవిత్రలక్ష్యం కోసం నిర్మలమైన చిత్తంతో చేసే పశుబలిని గురించి ఎందుకు తలలు బద్దలు కొట్టుకోవడం? న్యాయస్థానంలో దోషులకు విధించే ఉరి శిక్ష హింస అయితే యజ్ఞంలో జరిగేది కూడా హింసయే!

## 71. రామాయణం కథను ఇంతమంది ఎందుకు రాశారో చెప్తారా?

**జ.** రాసినవారి జన్మ చరితార్థం అవుతుందనే విశ్వాసం. అలా రాయడంవల్ల మరి కొందరు రామకథ చదివి చరితార్థు లవుతారని.

## 72. దేవుడందర్నీ ఒకేలా సృష్టించాడెందుకు?

**జ.** దేవుడు యంత్రం కాదు. పైగా ఈ జగత్ సృష్టి, స్థితి, సంహారాలు ఆయనకు క్రీడ అంటారు పురాణపురుషులు.

## 73 విగ్రహారాధన నిరసించే బుద్ధునికి విగ్రహాలు చేయిస్తున్నారు ఎందుకు?

**జ.** మేరీమాత విగ్రహమును ఆలయాలలో ప్రతిష్ఠించుచున్నారు. మార్క్స్, లెనిన్ విగ్రహములను నడిరోడ్డుపై స్థాపించుచున్నారు. మానవజాతిలో భక్తిభిన్న రూపములలో వికసించుచునే యున్నది.



## 74. పెళ్ళిలో తలపైన జీలకర్ర, బెల్లం పెడతారు ఎందుకు?

**జ.** చిన్నప్పుడు మాడుమీద పసుపుయుద్ద పెట్టేవారు మా అమ్మగారు, అమ్మమ్మగారు. బహుశా మీకా ఇబ్బందిలేదు. మాడు మీద జీలకర్ర, బెల్లం వుంచితే చల్లగా వుంటుంది. పెళ్ళివేళ వధూవరుల దేహాలు పరస్పర స్పర్శతో పులకించి వేడెక్కుతాయి. ఆ వేడిని తగ్గించి సామాన్య స్థితికి తేవడానికి జీలకర్ర, బెల్లం ఔషధులుగా పనిచేస్తాయి.



## 75. ఆషాఢభూతి అంటే...?

**జ.** ప్రజలందరికీ వైరాగ్యం బోధించి, బూడిద పంచిపెడుతూ కాసులు మూట కట్టే సన్యాసికి బూడిద పూసే శిష్యుడు.

## 76. ఏ మతం గొప్పది?

**జ.** అన్ని మతాలు సత్యం, ధర్మం, అహింస మానవత్వ లక్షణాలనీ, దేవుడు ఒక్కడేననీ అంటున్నాయి. ఏ మతాన్ని గొప్పదందాం?

### 77. అందమే ఆనందం ఐతే అది లేనివారికి?

**జ.** అందం అంటే చర్మం నారింజ పండు రంగులో వుండడం కాదు. మనస్సులో ఎటువంటి వికారాలూ లేక పోవడం, హృదయం సుందరభావాలతో నిర్మలంగా వుండడం.

### 78. ఆశీర్వాదాలు ఫలిస్తాయా?

**జ.** అబద్ధం ఆడనివాని నోట ఏమాట వచ్చినా అది తప్పకుండా ఫలిస్తుంది.

### 79. గణపతికి ఏకదంతం ఎందుకుంటుంది?

**జ.** మామూలుగా ఏనుగు రెండు దంతాలు కలిగి వుంటుంది. కానీ వినాయకుడు ఒకే దంతం కలిగి వుండడానికి సంబంధించిన కథను చెప్పుకోవాలి.



వేదవ్యాసుడు మహాభారత కథను చెపుతుంటే వినాయకుడు తన రెండు దంతాలలో ఒకదాన్ని విరగ్గొట్టి, దానితో భారతాన్ని రాశాడు. అంటే విజ్ఞానం కోసం అందాన్ని త్యాగం చేయడానికి సైతం సిద్ధపడాలన్న నీతిని మనం ఇక్కడ గ్రహించాలి. కాబట్టి బాలలూ, అన్నింటి కంటే ఉత్తమమైన విజ్ఞాన సమపార్జనకోసం భౌతిక పరమైన కొన్ని త్యాగాలకు కూడా సిద్ధంకండి.

### 80. నిరాకారుడైన దేవుణ్ణి బండరాళ్ళలో ఎందుకు పూజించాలి?

**జ.** నిరాకార నిర్గుణ పరబ్రహ్మాన్ని ఆరాధించగల ఏకాగ్రత సిద్ధించినవారికి ఏ రాయీ అవసరం లేదు. అది సిద్ధించే వరకూ ఇంద్రియాలు స్థిరంగా వుంటూ పవిత్ర భావంతో ఆరాధించడానికే బండ రాతి బొమ్మలు.

### 81. భారతంలోని పాత్రలు నేటికీ సజీవంగా మన సమాజంలో నడుస్తు న్నాయి, మరి రామాయణ పాత్రలు?

**జ.** భారతం సజీవ మానవగాథ. రామాయణం మానవునికి ఆదర్శం చూపే ఇతివృత్తం.

### 82. పశ్చాత్తాపం వల్ల పాపాలు పోతాయా?

**జ.** పశ్చాత్తాపం పాపాలను ప్రక్షాళన చేస్తుందని, ధర్మ శాస్త్రాలు చెపుతున్నాయి. అయితే ఈ పశ్చాత్తాపం ఆ క్షణంలో వదిలి మళ్ళీ పాపాలు మొదలు పెడితే పూర్వ పాపాలకు శిక్ష మూడింతలవుతుంది. అంటే పశ్చాత్తాపంతో మనస్సు నిర్మలం కాకపోతే నిష్ప్రయోజనం.


## ౮౩. రాధ కృష్ణుని మేనత్తయా?

**జ.** ఈ పాపాయిని భారతంలో భాగవతంలో చూడము. అందుచేత ఏ వరుసతో పిలిచినా బాధలేదు. జయదేవుని ధర్మమా అని అద్భుతమైన ప్రణయానికి పెద్ద పీట ఎక్కి కూర్చుంది.



## ౮౪. శివ ధనుస్సును ఎత్తగలిగిన సీతాదేవిని రావణుడు ఎలా ఎత్తుకు పోయాడు?

**జ.** సీతాదేవి శివధనుస్సు ఎత్తడం రామాయణ రచయిత వాల్మీకి కూడా ఎరగడు.



## ౮౫. ప్రతి యుగంలో విష్ణువు అవతరిస్తాడుకదా, ఈ అవినీతి యుగంలో...?

**జ.** అవతరిస్తాడు.నీతి అంతరించిననాడు.

## ౮౬. ఎక్కువ నిద్రపోయేవారిని కుంభకర్ణుడితో పోలుస్తారేకాని ఊర్మిళతో పోల్చరేం?

**జ.** కుంభకర్ణుడిది మొద్దునిద్ర, ఊర్మిళా దేవిది యోగనిద్ర కాబట్టి.

## ౮౭. సవతి బిడ్డల మధ్య అంత అన్యోన్యం వుండడం వాల్మీకి కల్పన కాదంటారా?

**జ.** వాల్మీకి కల్పనే అయినప్పటికీ అలా వుంటే సంసారం, దేశం ఎంత సుఖంగా, శాంతితో వుంటుందో చూశారా?

## ౮౮. భిక్షాందేహి అన్న పూర్ణేశ్వరీ, అని యువజనానికి యాచన నేర్పడం..

**జ.** యాచనచేసే వారికి భిక్షాందేహి, మనస్సును ఏకాగ్రం చెయ్యవలసిన వారికి కృపావలంబనం.

## ౮౯. రామునికి లవకుశులు పిల్లలు, మిగిలిన లక్ష్మణ, భరతాదులకు సంతానం లేదా?

**జ.** పిల్లలులేని దంపతులు రామాయణ – మహాభారతాలలో వుండరు.

## ౯౦. విధి రాత మార్చుకోలేమా?

**జ.** మార్చుకునే రాత కూడా విధి రాయాలి.

## ౨1. నాస్తికులు, హేతువాదులు రామాయణ, భారత, భాగవతాలను తిట్టిపోయడం వల్ల ప్రజలలో వాటిపట్ల అభిమానం తగ్గుతోందా?

**జ.** హిరణ్యాక్ష, హిరణ్య కశిపుల వల్లనే నారాయణుని ఘనత పెరిగింది. వారు తిట్టి పోయడం వల్లనే రామాయణ భారతాలు గట్టిగా చదువుతున్నారు. అందుకే ఆదివారం ఇంటిలో టీ.వీలో రామాయణం చూసేవారు ఎక్కువయ్యారు.

## ౨2. పునర్జన్మ వున్నదా? పూర్వజన్మ స్మృతులంటారు నిజమేనా?

**జ.** పదేళ్ళు నిండకుండా మహాలింగం వేణుగానంతో, బాలమురళీకృష్ణ కర్ణాటక గాత్రంతో, ఈనాడు శ్రీనివాస్ మాండలిన్‌తో మహామహులను ఆశ్చర్యచకితుల్ని చేస్తుంటే అది జన్మాంతర సంస్కారం కాదా! అలానే పూర్వ స్మృతులూ వుండ వచ్చు కొందరికి. అందరికీ అన్నీ అందవు.

## ౨3. జాతకాలు కుదర్లేదని పెళ్ళిళ్ళు ఆపుతారే?

**జ.** గ్రహాలకూ ప్రాణికోటికీ సంబంధం వుందని అంగీకరిస్తే వివాహాలకు జాతకాలు కుదరవల్సిందే. ఐతే ఆ ఉభయులకూ వివాహమయ్యే యోగ్యత లేకపోతే జాతకాలు చూసినా, చూడకపోయినా పెళ్ళికాదు. ఈ రహస్యం తెలియక వీటిని పట్టుకు వేలాడేవారిని ఏమనాలి?

## ౨4. సీత పతివ్రత అని తెలిసినా అగ్నిప్రవేశం చేయించాడు రాముడు, ప్రజాభిప్రాయానికి భయపడడంవల్లనా?

**జ.** అందుకు సందేహమా, ప్రజాభి ప్రాయానికి ప్రభువులు అంతభయపడ్డారు. ప్రభువులకు భయపడి బతికే ప్రజలం మనం.

## ౨5. దేవతలలో నారదుని పూజించరేం?

**జ.** నారదుడు దేవర్షి, దేవతా పూజలకు ఆవశ్యకమైన భక్తి సూత్రాలు అందించినవాడు. అంటే భక్తులందరూ పరోక్షంగా ఆయనకు గురుపూజ చేస్తున్నారు.

## ౨6. యుద్ధభూమిలో అభిమన్యునికి కత్తి దానం చెయ్యని కర్ణుడు దాతయా?

**జ.** రణరంగంలో శత్రువు దగ్గర చెయ్యి జాపే వాడు కాదు అభిమన్యుడు. మీరు భారతం చదవకుండా కేవలం బొమ్మలు చూసి వుంటారు. ఈ ఘట్టానికి భారతంతో సంబంధం లేదు.

## ౨7. ఉత్తమమైన మానవజన్మ లభించినా మానవుడు పాపాలు చేస్తాడెందుకు?

**జ.** మానవుడే ఏదయినా చెయ్యగలడు. సృష్టిలో ఏ ప్రాణీ అత్యాచారం చెయ్యదు. అత్యాశకుపోదు, అవిశ్వాసంతో వుండదు. అబద్ధాలూ, దొంగతనాలు చెయ్యదు. మనిషి ఒక్కడే ఇన్ని దురాచారాలూ, దుర్మార్గాలూ చెయ్యగలడు. కనుకనే వానిని

సన్మార్గాన నడపడానికి సత్యం–ధర్మం అవస రమని వేదం ఈ సమాజానికి బోధించింది.

## ౯౮. భారత కృష్ణుడు, భాగవత కృష్ణుడు కాదా?

**జ.** భారత కృష్ణుని బాల్యం భాగవతంలో జరిగిందని పెద్దలంటారు. కాని నిన్న



మొన్న కన్ను తెరుస్తూనే వంకా సంకుచిత బుద్ధులకు వేరుగా కనిపిస్తున్నాడు. ఇంతకూ వారు ఒకరా, ఇద్దరా అనే కుస్తీ కంటే భారత, భాగవత పఠనంతో, శ్రవ ణంతో మనశ్శాంతి, బుద్ధి వికాసం సాధించే ప్రయత్నాన్ని ముందు సాగించండి.

## ౯౯. ఉపనయనం కాని వారు దేవుని స్తోత్రాలు చదువుతూ పూజ చేయరాదా?

**జ.** దేవుని పూజకూ, ఉపనయనానికీ సంబంధం లేదు. ఉపనయనంతో బ్రహ్మో పదేశం పొంది బ్రహ్మచర్య వ్రతం పూనాలి. ఈ అసభ్య వాతావరణంలో బ్రహ్మ చర్యం అసాధ్యం.

## 100. అంగదుడు రావణుని సభలో తోక చుట్టబెట్టి రావణునికంటే ఎత్తుమీద కూర్చున్నాడా?

**జ.** బహుశా మీరు చూసిన సినిమాలోనో, టెలివిజన్ లోనో అలా ఇంద్రజాలం చేసి చూపించారు కాబోలు. వాల్మీకి రామాయ ణంలో హనుమంతుడు కూడా ఇలాంటి కోతి పనులు చెయ్యలేదు. ఇద్దరూ నిలబడే మాట్లాడారు. రాయబారులు రాజుదగ్గర ఎలా వుండాలో అలాగే వున్నారు. అయితే రావణుని అహంకారం ఎక్కువ కావడంతో ఆంజనేయుడు లంక తగలబెట్టాడు. అంగదుడు మరో అవమానం చేశాడు.

## 101. సంభవామి యుగే యుగే అన్న భగవంతుడు మళ్ళీ త్రేతాయుగంలో రాముడిగా, ద్వాపర యుగంలో కృష్ణుడిగా పుడతాడా?

**జ.** మన్వంతరాలు, కల్పాలు కూడా వున్నాయి. కల్పం మారినప్పుడు వచ్చే త్రేత, ద్వాపర యుగాలలో ఈ సృష్టిచక్రం అంతా తిరుగు తుందనీ, అప్పుడు మళ్ళీ రామాయణ, భారత గాథలు జరుగుతాయనీ పురాణ వేత్తలు అంటున్నారు.

## 102. ద్వైతం, అద్వైతం అనగా నేమి?

**జ.** ఆత్మ, పరమాత్మ విడిగా వుంటే ద్వైతం, భేదం లేదు అంటే అద్వైతం. ఈ రెండు ముక్కలూ అర్థంకావడానికి శంకరుల

ప్రస్థానత్రయం, మధ్వాచార్యులవారి భాష్యాలూ చదవాలి. ఈ జీవితం చాలదు అవి వంట బట్టడానికి. అయినా భగవద్గీత చదవండి. ఎంతో కొంత తెలిసినట్టు భ్రమ కలుగుతుంది.

## 103. రావణ దుర్యోధనులు మహాఘోర పాతకాలు చేసినవారని తెలిసీ వారి మార్గాన నడిచిన వారే మహామహు లవుతున్నారే?

***జ.*** రావణ, దుర్యోధనులూ మహా మహులుగా ప్రచారం సాగించుకున్నవారే. పాపం పండగానే పది తలలూ నేల పాలయ్యాయి. ఉక్కు తొడలు తుక్కు తుక్కు అయ్యాయి. కాలంమూడాలి, అంత వరకూ పరమేశ్వరారాధన చేద్దాం.

## 104. సంవత్సరం తన అధీనంలో వున్న సీతా దేవిపై అత్యాచారం జరపని రావణుడు రాముని కంటే గొప్పవాడు కాడా?



***జ.*** ఒక్క ఆడదాన్ని అపహరించి నంత మాత్రాన వంశనాశనం చేయాలా రాముడు – అని అడిగితే ఇంకా బావుండేది! రావణాసురుడు నిజంగా గొప్పవాడే, ఎందుకంటే అతనికి రసికత వుంది. ఆడది అనురాగంతో లేకపోతే సుఖం వుండదనే జ్ఞానం వుంది. అందుకే అత్యాచారానికి దిగలేదు. పరదారాపహరణం ఎంత పాపమో గ్రహిస్తాడేమో అని ఏడాది వదిలాడు రాముడు. హనుమంతుని చేత కబురు పంపాడు. అంగదుని చేత రాయబారం నడిపించాడు. కాని అహంకారం, కామం ఎగదన్నిన రావణాసురుడికి ఏమీ వినిపించ లేదు. సర్వనాశనం అయ్యాడు.

రావణుని కంటే నీచుడైన కీచకుడు ఆడదాని హృదయంతో నిమిత్తం లేకుండా బలాత్కరించ బోయాడు. వాడికి ఆ రాత్రే దిక్కులేని చావు అనుగ్రహించాడు భీముడు.

## 105. రామాయణంలో వానర స్త్రీలకి తోకలు లేవే?

***జ.*** సినిమాలలో, రామానంద సాగర్ రామాయణంలో వేషాలు వేసే స్త్రీలు తోకలు పెట్టుకోవడానికి ఒప్పుకోరు.

## 106. ముస్లిమ్‌లకు మహమ్మద్, క్రైస్తవులకు ఏసు క్రీస్తు, అల్లా ఒక్కడే దేవుడు, మనకు మాత్రం ముక్కోటి దేవుళ్ళా?

***జ.*** మహమ్మద్, క్రీస్తు ఒకరు ప్రవక్త, మరొకరు దేవుని బిడ్డ, అడగండి ఆ



మతాల పెద్దలను. వారి దేవుడు కిందికి రాడు. ఆ దయాదాక్షిణ్య మూర్తి పరలోక మందే వుంటాడు. మనకు అలా కుదరదు. ఏ భక్తుడు, ఏ నామంతో, ఏ రూపాన్ని ప్రార్థిస్తే ఆ విధంగా దిగాలి. దిగకపోతే భగవంతుడు కాదు మనకు.

### *107. ఒకపక్క భక్తిత్వం, మరో పక్క నాస్తికత్వం ప్రబలుతున్నాయి. ఏది నిలుస్తుంది?*

***జ.*** రెండూ అలా సాగుతూనే వుంటాయి. నాస్తిక ప్రబోధం పెరిగేకొద్దీ భక్తసంఘాలు మేలుకుని కర్తవ్య నిర్వహణ దీక్ష వహించడం భాగవతకాలం నుంచీ వస్తున్నది.

### 108. మనకు ఎందరో దేవతలుండగా కష్టం వచ్చినా, బాధ కలిగినా, హాయిగా వున్నా రామనామం జపిస్తారు ఎందుకు?

***జ.*** అంతగా ఈ జాతిగుండెలో నిలిచిన పురుషోత్తముడాయన !

### 109. మతం మార్పిడులకు కారణం?

***జ.*** దేవుడు ఒక్కడే అని తెలియక.

### 110. దశరథుడు పట్టాభిషేకానికి రాములవారి మామగారి నెందుకు పిలవలేదు?

***జ.*** భరతుని తాతగారిని పిలిస్తే కొంప మునిగి పోతుంది. కైకేయిని వివాహమాడే సమయంలో ఆమె కుమారునికి పట్టాభిషేకం చేస్తానని వాగ్దానం చేశాడు. అందుచేత ఆయనను పిలవకపోతే అనుమానానికి దారితీస్తుందని రాముని మామగారిని కూడా మరిచిపోయినట్లే అనుకోవాలని ఊహించాడు దశరథుడు. ముసలితనంలో ఆ మాత్రం మరుపు సహజం అనీ అందరూ అనుకున్నారు. అయినా కథ ఆయన అనుకున్నట్లు జరిగితే ఏ రామాయణం లేదు.

### 111. జీవహింస మహాపాపం కదా, మరి మునులు జింకచర్మం, పులిచర్మం వాడతారు, ఆ జంతువులను చంప వచ్చునా?

***జ.*** జీవికి జీవి ఆహారం. ఏ ప్రాణికి ఏది ఆహారమో అది ఆ ప్రాణిని కబళిస్తుంది.



ఇది ప్రకృతి ధర్మం. ఇంకా వివరాలకి మహాభారతం అరణ్యపర్వంలో ధర్మ వ్యాధుని కథ సావధానంగా చదవండి.

## 112. రావణుడు రామనామం జపిస్తూ తన ప్రాణాలు వదిలాడా?

**జ.** వానరసేన హరహర మహదేవ ఈనడం వారథి నిర్మాణంలో ప్రతి బండరాయి మీద శ్రీరామ, శ్రీరామ ఇవన్నీ హరిదాసులూ, పౌరాణికులూ ఎక్కించగా సినిమాలవారూ, దూరదర్శన్ వారూ పూసుకున్న బూడిదపూతలు. రావణుడు చచ్చినా రామనామం జపించడు.

## 113. దేవుళ్లని పూజించే వారు మానవ కల్యాణానికి మరణించిన వారిని పూజించరాదా?

**జ.** మానవ జీవనకల్యాణ పథం చూపడం వల్లనే రామకృష్ణులను పూజించాలి. ఈనాడు కనపడని మహనీయులకంటే కనిపించే కాలనేములనే పూజించే బుద్ధి మనుషులలో పెరిగింది.

## *114. నాకు సంధ్యావందనం చేయక పోతే ఆందోళన కలుగుతుంది?*

**జ.** ఆందోళన కలిగే క్షణంలో ప్రణవం (ఓం) ఉపాసించండి. ప్రశాంతంగా వుంటుంది.

## *115. అతిథిగా వచ్చిన రామునికి శబరి ఎంగిలి పళ్లు ఇచ్చిందా?*

**జ.** ఇవ్వలేదు, వాల్మీకి రామాయణంలో – ఆ తరువాయి పుట్టిన భక్తులు రాముణ్ణి ఎంత అభాసుపాలు చేశారో చూపడానికి ఈ ఎంగిలి కథ ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.

## 116. స్వామీజీలు, బాబాలు, అమ్మలూ లేకపోతే దేవుణ్ణి నమ్మలేమా?

**జ.** నమ్మకానికి ఎవరూ అవసరంలేదు, నమ్మకాన్ని బలపరచుకునేందుకు వెడతారను కుంటాను.

## 117. వేదమంత్రాలన్నిటి చివర స్వాహా అని ఉంటుంది...?

**జ.** అగ్నికాహూతులర్పించే సమయంలో మంత్రాలకే స్వాహా వుంటుంది. అన్నిటికీ కాదు.

## 118. మూడు అవతారాలతో మూడు యుగాలు ఏర్పడ్డాయి. మిగిలినవి??

**జ.** అవతారాలు యుగాలలో వున్నాయి. కాని అవతారాలతో యుగాలు కాదు.

## 119. ఇంద్రజిత్తు అస్త్రం రామలక్ష్మణు లిద్దరినీ మూర్ఛలో ముంచెనా?

**జ.** హనుమంతుడు, జాంబవంతుడు తప్ప రామలక్ష్మణులతో పాటు వానరులందరూ కూడా మూర్ఛపోతారు.

## 120. రామాయణంలో వాలి సుగ్రీవ యుద్ధాన్ని వర్ణిస్తూ భీమబలులు అన్నారు...?

**జ.** మహాభారతంలో పుట్టిన కుంతీదేవి కొడుక్కి పేరేం పెట్టాలా అని ఆలోచించి

వాని బలం భీమంగా వుంది కనుక ఆ పేరు పెట్టారు అతగాడికి. భారత రామా యణాలు పుట్టడానికి ముందే రామ, భీమ శబ్దాలు వున్నాయి. ఎవరికేది ఉచితమో వారికా పేరు పెట్టారు.

## 121. అసలు బ్రహ్మచారి ఎవరు?

**జ.** పదహారు వేలమంది గోపికలు, ఎనమండుగురు రాణులు వున్న శ్రీకృష్ణుడు అని 18 పురాణాలూ చదివిన పెద్దలు చెబుతున్నారు, అర్థమవుతుందా మీకు? బ్రహ్మచారికి నిర్వచనం తెలియాలి ముందు.

## 122. 'అర్జునా, ఈ విశ్వరూపం చూసే అవకాశం నీకే అనుగ్రహిస్తున్నాను', అన్నాడు గీతలో కృష్ణుడు. వేదవ్యాసుని దయావిశేషం వల్ల సంజయుడు కూడా చూశాడు కదా?

**జ.** వ్యాసులవారెవరో ఎరుగుదురా! ద్వైబా హురపరో హరి రెండు చేతులతో దిగిన విష్ణువు, అంటే కృష్ణుని అనుగ్రహమే.

## *123. ధృతరాష్ట్ర ప్రేమ అంటే?*

**జ.** భారత యుద్ధంలో నూరుగురు కొడుకులూ మరణించాక ధృతరాష్ట్రుడు భీముని దగ్గరగా రమ్మని ప్రేమతో గాఢాలింగనం చేసుకుంటాడు. ఆ గుడ్డివాని బుద్ధి తెలిసిన శ్రీకృష్ణుడు ఇనుప బొమ్మను ధృతరాష్ట్రుని కౌగిలింతలో ఉంచగా అంత ఉక్కుబొమ్మా పొడిపొడి అయింది. అదీ ధృతరాష్ట్ర ప్రేమ.

దీనికే మరో పేరు మొసలికన్నీరు. ఈ కథ తెలియాలంటే నీతిచంద్రిక చదవండి.

## 124. మాయలేడి రాక్షసుడని సీతకు తెలియదా?

**జ.** తెలిస్తే రామాయణం లేదు. మీకీ ప్రశ్నే లేదు. నాకీ బాధ లేదు.



## 125. శివుడు విష్ణుభక్తుడనీ, విష్ణువు శివభక్తుడనీ పురాణాలు చెపుతున్నాయే...?

**జ.** శివకేశవులకు భేదం లేదని గ్రహించాలి.

## 126. ఒకప్పుడు కన్యాశుల్కం తీసుకుంటే అది గొప్ప అని చెబుతున్నారు, ఇప్పుడు వరకట్నం అన్యాయం అని అరుస్తారేం?

**జ.** కన్యాశుల్కం, వరకట్నం రెండూ మనిషిని సంతలో పశువులా వేలం వెయ్యడమే. కన్యాశుల్కం గొప్ప అంటున్నారంటే అది గురజాడ అప్పారావుగారు రాసిన నాటకం గురించి, ఏనాటికయినా మనుషులు సంతపశువులు కాకుండా వుండే రోజు కోసం ఎదురు చూడాలి విద్యాగంధం కలవారు.

## 127. రామబాణానికి తిరుగులేదంటారు కదా మరి రావణ సంహారానికి విభీషణుని సలహా ఎందుకు తీసుకున్నాడు?

**జ.** ఒకే మాట, ఒకే భార్య, ఒకే బాణం అన్న వారు త్యాగరాజస్వామి వారు. రామ రావణ సంగ్రామం ఒక్క బాణంతో తేలి పోలేదు. భీకర సంగ్రామం తరువాతే రాముడు రావణాసురుణ్ణి గెలిచాడు. చదవండి.

## 128. ద్రౌపది కర్ణుని ఆరవ భర్తగా కోరడం...?

**జ.** ద్రౌపది కోరిందని మీకుచెప్పిన శకునికి మానసిక చికిత్స చేయించండి. రాయబార సన్నివేశంలో కృష్ణుడు కర్ణునితో సంభాషిస్తూ సామ్రాజ్యంతో పాటు సౌందర్యరాశిని కూడా ఎరవేసినట్లు తెలుగు భారతంలో వున్నమాట నిజం. వ్యాస ప్రోక్తమై సంస్కృత భారతంలో మాకు దొరికినంత వరకూ ఈ ప్రస్తావన లేదనీ, తిక్కన్నగారికి దొరికిన ప్రతిలో వుండక పోదనీ మా గురువులు సెలవిచ్చిన దానినే మేము కూడా చెప్పుకుంటున్నాం.

## 129. రాముడు మాంసాహారియా?

**జ.** వాల్మీకి రామాయణం వ్రాసిన కాలంలో మానవులందరూ సుఖంగా మాంసం ఆరగించారు. ఆయన వ్రాసిన ప్రకారం రాముడు ఇక్ష్వాకు వంశంలో పుట్టిన క్షత్రియ బాలుడు. అప్పటికింకా మూడు నామాలు అడ్డబొట్లతో సిగపట్లు పట్టే దౌర్భాగ్యం రాలేదు.

## 130. కులమతాలు నశించేమార్గం లేదా?

**జ.** ఈ రెండింటి మీద ఆధారపడి నాయకత్వం, మంత్రిపీఠం, సింహాసన



భ్రష్టత్వం... ఇలా ఎన్నో వుండగా, వాగ్దానాలతో బ్రతికే పెద్దలు కుల మతాలను నాశనం కానిచ్చి తమ పదవిని పాతాళానికి తొక్కుకుంటారా! వీటిని గురించి ఆలోచించి ద్వేషాలు పెంచుకోవడం మానిననాడు అవే తప్పుకుంటాయి.

## 131. బ్రహ్మాస్త్రానికి తిరుగులేదు కదా! మరి ఇంద్రజిత్తు లక్ష్మణుడి మీద వేసి నప్పుడు వ్యర్థమైందేం?

**జ.** అస్త్రం ప్రయోగించే వాని శక్తిమీద దాన్ని ఎదుర్కొనేవాని శక్తిపై ఆధారపడి వుంటుంది. చిన్న ఉదాహరణ. లోభి దగ్గర కోట్లు మూలుగుతూంటాయి. అవి భూమిలో పాతిపెడతాడు. ఎవరికి దొరుకుతాయో తెలీదు. అవే మంచి వ్యాపారి

దగ్గరుంటే కోటి పది కోట్లవుతుంది. దాత దగ్గరుంటే పది మందికి గ్రాసవాసాలకు వినియోగపడతాయి.

### 132 కవులను చిన్నచూపు చూస్తూ వారి కృతులకు పూజలు చేస్తారే?

**జ.** కవికి చాలా దశలు, అవలక్షణాలు వుంటాయి. కలం పట్టినప్పుడు ఈ దుర్ల క్షణాలు దాగుకుంటాయి. అప్పుడు ఉన్నత పాత్రలు ముందుకువచ్చి పూజలందు కుంటాయి.

### 133. భగవంతుడు మనిషిని పుట్టించాడా? మనిషి దేవుని సృష్టించాడా?

**జ.** దేవుడు చేసిన మనుషులు తమలో దైవత్వం వృద్ధి కావడానికి దేవుని సృష్టించారు.



### 134. కైక లోకకళ్యాణం కోసమే రాముడిని అడవికి పంపిందంటారా?

**జ.** అంటున్నారు. ఏకపత్నీ ధర్మాన్ని పాటించలేక రెండో కుంపటి అంటించు కున్న వారందరూ–వాల్మీకి రామాయ ణంలో కైక సవతి తల్లి. నేటి సవతు లందరూ ఆమెకు పూజచేయాలి.

### 135. క్యూలో కళ్ళు తెరుచుకుని గంటలు నిలబడి దేవుని ముందు కళ్ళు మూసు కుంటారేం?

**జ.** ఆ విగ్రహం మనస్సులో నిలబడాలని.

### 136. సీతారాములు, లక్ష్మీనారాయణులు, పార్వతీ పరమేశ్వరులు అలా అందరూ భార్య పేరు ముందు పెట్టు కోవడంకంటే భర్త పేరును ముందుంచరాదా.

**జ.** స్త్రీలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కావాలనే ఉద్యమాల ఊసులేని రోజుల్లో వారికిచ్చిన గౌరవ స్థానం అది. ఇప్పుడు సమానత్వం అని మొదలెట్టాక ఆత్మహత్యలు కిరస నాయిల్ డబ్బాలు, గ్యాస్‌పొయ్యిలు నాశన మవుతున్నాయి.

### 137. శ్రీకృష్ణుని వంటి రాజనీతివేత్త ప్రస్తుత కాలంలో వున్నాడంటారా?

**జ.** రాజనీతి సంగతి తెలియదు కాని కృష్ణవేషం వేస్తే చాలు రాజకీయం తెలు స్తుందనుకునే వారిని సింహాసనా లెక్కించే ఓటర్లు కోకొల్లలు.

### 138. ప్రార్థనలు, భజనలు ఆత్మకు శాంతినిస్తాయా?

**జ.** ఆత్మకు శాంతి, అశాంతి, రాగం, ద్వేషం వుండవు. అన్నిటికీ అతీతం అది అని భారతీయ తత్వం బోధిస్తున్నది. ఇతర దేశాలవారి ఆత్మ శాంతికి ప్రార్థనలు, భజ

నలు అవసరం.ఎందుకంటే అది తుది తీర్పు వరకూ సమాధి వదలకూడదు. ఆ వాసన మనకూ సోకి, ఎవడు కన్ను మూసినా ఆత్మశాంతికి మౌనప్రార్థన చెయ్యడం ప్రస్తుతం విధిగా చేశారు.

## 139. మహాభారతంలో యశోద దగ్గర పెరిగిన ఒకరు సూత్రధారికాగా, రాధ దగ్గర పెరిగిన వాడు దాన, వీర, శూరుడయ్యాడు. అంటే కన్నతల్లి కంటే పెంపుడు తల్లుల వలనే కీర్తిప్రతిష్ఠలు వస్తాయా?

**జ.** మహాభారతంలో అసలు యశోద పేరు రాదు. ఇక భారతంలో వున్న రాధ గీత గోవిందంలో రాధ కాదు. కన్నతల్లి కంటే పెంపుడు తల్లి ప్రేమ గొప్పది కావచ్చు. కానీ అది కాదు కీర్తి ప్రతిష్ఠలకు కారణం. అలా అయితే ఈనాడు ఆయాల రక్షణలో బ్రతికేవారందరూ కృష్ణులూ, కర్ణులూ కావాలి.

## 140. అమావాస్యనాడు సూర్యగ్రహణం, పూర్ణిమనాడు చంద్రగ్రహణం ఎందు కొస్తాయి?

**జ.** సూర్యుని చుట్టూ భూమి, భూమి చుట్టూ చంద్రుడు తిరుగు తూండడంవల్ల రాత్రి, పగలు ఏర్పడుతున్నాయి. అందు వల్లనే చంద్రకళలు క్షీణిస్తూ వృద్ధి పొందు తున్నాయి. ఈ భ్రమణంవల్లే చంద్ర గ్రహణం పూర్ణిమనాడు వస్తేనే తెలుస్తుంది. ఇక సూర్యగ్రహణం –భూమికీ సూర్యునికీ అడ్డంగా చంద్రుడు అడ్డుపడడం అమావాస్య నాడే సాధ్యం. అయితే ప్రతి అమావాస్యకూ అదిరాదు. దానికొక లెక్క వున్నది. ఆ గణితం తెలిసిన పంచాంగ కర్తలు అది చెప్పగలుగుతారు.



అయినా ఈ జాతికి శాస్త్రీయ దృక్పథం లేక రాహు, కేతువులనే పాములు మ్రింగు తాయంటారు. పసిపిల్లలకు చెప్పే ఆ కథలు నమ్మి విజ్ఞానుల మనుకునే మేధావులు పాశ్చాత్యుల పాదదాసులై ఆత్మ గౌరవ శూన్యులవుతున్నారు.

## 141. రాజకీయాలలో ప్రవేశించడానికి అర్హత ఏమైనా వున్నదా?

**జ.** రాజకీయం అనేది ఉద్యోగం కాదు. పదవి కాదు, కులం కాదు, మతం కాదు, ఐతే దేశం బానిసత్వంలో వున్న కాలంలో మేధావులైన వారు తమ సర్వస్వం త్యాగం చేసి దేశానికి స్వాతంత్ర్యం సాధించారు. తమ బిడ్డలు అడుక్కు తింటున్నా బాధపడ లేదు వారు. ఈనాడు వాగ్దానాలు ప్రజల పాలు, కరెన్సీ కట్టలు ఆత్మీయులపాలు చేయగలవారు రాజకీయాల్లో రాణిస్తున్నారు.

## 142. గర్భవతులు మంచి విషయాలు వింటే వారికి కల్గే శిశువులు మంచి వారవుతారా?

**జ.** అందుకు సందేహమా. పురాణాలే కాదు ఆధునిక శాస్త్రవేత్తలు కూడా అంగీ కరించిన విషయం. మంచిపిల్లలు అవ సరం లేదనుకున్న గర్భవతులు అసభ్య, అశ్లీల, హింసామయ చిత్రాలు చూసి, నవలలు చదివి ప్రసవించిన సంతానాన్ని చూస్తున్నారుగా!

## 143. మహాభారతాన్ని కవిత్రయమని వ్రాశారు, మరి రామాయణాన్ని?

**జ.** భాస్కరుడు, రంగనాథుడు, మొల్ల, గోపీనాథుడు, శ్రీపాద, విశ్వనాథ, తెలు గులో కవిత్రయ భారతానికున్న పలుకు బడి ఎవరి రామాయణానికీ రాలేదు.

## 144. రథచక్రం ఎత్తుకునే కర్ణుని చంపించడం అన్న అధర్మం కాదా?

**జ.** భారతం కర్ణపర్వం చదవండి. కర్ణుడు రథంమీద వుండగానే చంపించాడు కృష్ణుడు.

## 145. కన్యాశుల్కం మళ్ళీ ప్రవేశిస్తే?

**జ.** వరకట్న దురాచారం ఇలానే సాగితే కన్యాశుల్కం దిగుతుంది. అప్పుడు కడు పులో బిడ్డ మగవాడని తెలిస్తే గర్భస్రావం చేయించుకుంటారు. డబ్బే ప్రాణం అనుకునేవారు.

## 146. డాక్టర్లు కూడా మా ప్రయత్నం మేం చేశాం, ఆ పైన దేవుని దయ అంటారేం?

**జ.** డాక్టర్లు రోగానికి చికిత్స చేస్తారు. ప్రాణం పొయ్యలేరు. అందుకే పురుష ప్రయత్నానికి ఈశ్వరుడు కూడా తోడు కావాలి అంటారు.



## 147. అధికమాసాలు తెలుగు సంవత్సరాలకేనా?

**జ.** మనది చాంద్రమానం. ఇందులో నెల నెలా తిథులు హెచ్చు తగ్గులుంటాయి. దాన్ని సవరించడానికి అధికమాసాలూ, క్షయ మాసాలూ, ఇంగ్లీషు వారికి కూడా నాలుగేళ్ళకోసారి ఫిబ్రవరికి మరో రోజు ఎక్కువగా వస్తుంది.

## 148. బహుపత్నీవ్రతుడైన దశరథుని కుమారుడు ఏక పత్నీవ్రతుడా?

**జ.** తండ్రి బాధలు చూసిన జ్ఞాని రాముడు. అంతేకాదు శ్రీహరిని ద్వేషించే హిరణ్య కశిపుని కుమారుడు ప్రహ్లాదుని కథ మీకు తెలియదా ?

## 149. ముడుపులు చెల్లిస్తే పాపాలు పోతాయా?

**జ.** పాపాన్ని పంచి పెట్టడానికే ముడుపులు.

## 150. మాద్రివలె కుంతి సహగమనం చేయలేదే?

**జ.** భారత కాలంనాటికి సహగమన దురాచారం ఈ జాతిలో లేదు. దేశదేశాల ముష్కరులు ఈ భూమి మీద దాడిచేసి సంపదదోచుకుని తృప్తిపడక పశువుల వలె పతివ్రతల మీద పడుతూంటే మాన ధనమైన జాతి ఆ దౌర్భాగ్యానికి లొంగక తప్పలేదు. తరువాత కొన్నిచోట్ల ఆ ఆచారం నిలబడిపోయింది.

## 151. ఆంజనేయుడు బ్రహ్మచారి కాడా?

**జ.** రామాయణంలో బ్రహ్మచారి గానే వున్నాడు. ప్రేమాయణ కర్తల చేతిలో పడి పెళ్ళిచేసుకున్నాడేమో తెలియదు.



## 152. భగవద్గీత పుచ్చుకుని కోర్టులో ప్రమాణం చేసినంతలో నిజం చెపుతారా?


**జ.** ఈ దేశం వారికి మతపిచ్చి ఎక్కువని భావించిన తెల్లదొరలు ఈ విధానం పెట్టారు. వాస్తవానికి ఈ జాతికి మత గ్రంథం లేదు. భారతం, రామాయణం, భారతంలోని గీత ఇవేవీ మత గ్రంథాలు కావు. మానవునిలోని పశువునీ, పిశాచాన్నీ పారద్రోలి మనిషిగా నిలబెట్టడానికి పుట్టిన ఇతిహాసాలు ఇవి. పైగా ఈ జాతికి మతం పేరు తెలియని రోజులలో పుట్టిన పుస్తకాలవి. పర్యవసానంగా కన్నతల్లికి తిండి పెట్టకుండా, కట్టుకున్న పెళ్ళాన్ని నడి వీధికి తోలే ప్రబుద్ధులకు గీత ఒక లెక్కయా?

## 153. భారతం మొత్తంలో ధృతరాష్ట్రుడంత దుర్మార్గుడు లేడంటారు ఎందుకు?

**జ.** ఈ మాటే ఆ అంధుని అంతరంగిక సచివుడు సంజయుడు చెప్పాడు. మహాసాధ్వి గాంధారి చెప్పింది. అయినా ధన లోభంతో అంతకు తెచ్చుకున్నాడు. ఆ కళ్ళు లేనివాడి కథ విని కళ్ళున్న వాళ్ళు తమ సంతానాన్ని సరైన దారిలో నడుపుకుంటారని వ్యాసమహర్షి ఈ ఇతిహాసం అందించాడు.

## 154. గ్రహాల ప్రాముఖ్యత

**సూర్యుడు :** సూర్యుడు ప్రణవనాదం (ఓంకారం) నుంచి ఉత్పన్నమైనట్టు భావించ బడుతుంది. శుభప్రదమైన రవి గ్రహం పరమశివుని కుడికన్ను అని శాస్త్రాలు చెబుతున్నాయి. అష్ట భుజుడైన సూర్యుడు బంగారు ఛాయగల పట్టు వస్త్రాలు ధరిస్తాడు.



అతని రెండు భుజాలపై రెండు తామర లుంటాయి. ఆరోగ్యాన్ని ప్రసాదించే సూర్య భగవానుడు ఏడుగుర్రాల రథంపై లోకసంచారం చేస్తూంటాడు.

***చంద్రుడు :*** నవగ్రహాలలో చంద్రుడు శుభకరుడని జ్యోతిష శాస్త్రం చెబుతోంది. దేవతలు, రాక్షసులు పాలసముద్రాన్ని చిల కగా చంద్రుడు పుట్టాడని హిందూ పురా ణాలు తెలియ చేస్తున్నాయి. కర్మఫలితా లను బట్టి చంద్రుడు ఆయా జాతకులకు ఫలితాలనిచ్చి కీర్తి ప్రతిష్ఠలు కలిగిస్తాడు.

***కుజుడు :*** కుజుడు ఎర్రని ఛాయతో నాలుగు భుజాలు కలిగి వుంటాడు. ఆయన బంగారు రథాన్ని ఎనిమిది గుర్రాలు లాగు తుంటాయి. రథానికిగల జెండాపై పొట్టేలు గుర్తు వుంటుంది. భూ సంబంధమైన ఆస్తులు బలపరాక్రమాలు కుజుడు తన భక్తులకు అందిస్తాడని పెద్దలు చెబుతారు.

***బుధుడు :*** బుధుడు చంద్రుని కుమారుడు. బుధగ్రహం అనుగ్రహిస్తే మన కోరికలన్నీ నెరవేరతాయని చెబుతారు. అంతేకాక విద్య, విజ్ఞానం, సంగీతం, జ్యోతిష్యం, గణితం, శిల్పకళ, వైద్యరంగాలలో జాత కుడు రాణిస్తాడు.

***గురువు (బృహస్పతి) :*** దేవతలకు అధి పతి అయిన ఇంద్రుని కొలువులో 'గురువు' మంత్రిగా వ్యహరిస్తాడు. ఆయన ఏనుగుపై స్వారీచేస్తూ నాలుగు భుజాలు కలిగి ఒక చేతిలో పుస్తకం, మరొక చేతిలో జపమాల ధరిస్తాడు. గురువునే దక్షిణా మూర్తిగా కూడా పూజిస్తారు. అంతటా సమైక్యత వుండాలన్నదే ఆయన ఆశయం. దయకలిగినప్పుడు జాతకులకు గురువు వివేకాన్ని, కీర్తిని, సంపత్ సమృద్ధిని అను గ్రహిస్తాడు.

***శుక్రుడు :*** ఇతడు భృగుమహర్షి కుమా రుడు. అతడు రజతవర్ణం కలిగి వుంటాడు. కొంగవంటి ఒక జాతిపక్షి ఆయన వాహనం. శుక్రుడు చేతిలో తెల్లని తామర పుష్పం ధరించివుంటాడు. ఇది శుభ గ్రహం. ఇతడు దాంపత్య సుఖాన్ని ఇస్తాడు. శుక్రుని పూజిస్తే, జలుబువంటి రుగ్మతలు తొలగిపోతాయి.

***శని :*** శని నల్లనివస్త్రాలు ధరిస్తాడు. ఒక చేతిలో బెల్లం, మరొకచేతిలో 'వరదాభయ ముద్ర'తో వుంటాడు. అతడు వాయస (కాకి) వాహనుడు. శని అనుగ్రహం గనుక లేకుంటే దరిద్రం, రోగాలు, కలహాలు, ఆకలి బాధ, అగౌ రవం వంటి అష్టకష్టాలు సంభవిస్తాయి.


***రాహువు :*** జగన్మోహిని అవతారంలో వున్న విష్ణువునుంచి దేవతగా నటించి మోసపూరితంగా అమృతం పొందాలని

ప్రయత్నించి విఫలుడైన రాక్షసుడు. సూర్య చంద్రులు ఆ విషయాన్ని గ్రహించి శ్రీమహావిష్ణువుకు తెలియచేయగా విష్ణువు రాహువు శిరస్సును ఖండించాడు. కాని అప్పటికే కొద్దిపాటి అమృతాన్ని చప్పరించినందువల్ల అతని శిరస్సు నుంచి ఒక పాముతోక బయటికి ఏర్పడింది. మొండెంపై పడగ ఏర్పడింది.

**కేతువు :** రాహువు మొండెంపై పడగ భాగంగల గ్రహమే కేతువు. రాహువు సూర్యచంద్రుల్ని మింగినపుడు సూర్య చంద్ర గ్రహణాలు, కేతువు సూర్యుని, చంద్రుని కబళించినప్పుడు సూర్య, చంద్ర గ్రహణాలు ఏర్పడతాయి. కేతువు అను గ్రహంవలన వివేకమూ, మోక్షబుద్ధి, సంతానం, భక్తి కలుగుతాయి.

## 155. స్మృతులు అంటే ఏమిటి?

**జ.** వేదాల తర్వాత స్మృతులు ప్రధానమైన గ్రంథాలు. ఈ గ్రంథాలన్నీ సమాజంలో వున్న మనందరం ఏ పనులు చెయ్యాలో ఏవి చేయకూడదో తెలియజేస్తాయి. ఒక వ్యక్తికోసం, ఆ వ్యక్తి యొక్క కుటుంబం కోసం, ఇలాంటి కుటుంబాలు ఎన్నో వుండే ఊరుల మేలుకోసం, దేశాలన్నీ కలిసిన మొత్తం మానవ సమాజ క్షేమం కోసం, ఈ సృష్టి అంతటి మేలుకోసం, భగవంతుడి అనుగ్రహం కోసం ఒక్కొక్కరు విడిగాను, సామూహికంగాను అందరం ఏం చేయాలో ఏమి చేయకూడదో ఈ గ్రంథాలలో పేర్కొన్నారు. చెయ్యవలసినవి చేయక పోయినా, చెయ్యకూడనివి చేసినా ఎలాంటి ప్రభావం వుంటుందో, ఏ రకమైన పాపాలు కలుగుతాయో వాటిని ఏ విధంగా పోగొట్టుకోవాలో ఈ గ్రంథాలలో వివరించారు.



## 156. సీతాకళ్యాణం ఐదు రోజులు జరిగిందా?

**జ.** ఐదు రోజుల పెళ్ళిళ్ళు, పదహారు రోజుల పండుగలు, మనుగుడుపులు,



ఆఖరికి మంగళ సూత్రధారణ కూడా రామాయణ భారతాలలో లేదు. కన్యాదానం కాగానే పెళ్ళి కూతురును తీసుకుని మగపెళ్ళివారు తిరుగు ముఖం పట్టాలి. రామాయణంలో సీతా కళ్యాణం, భారతంలో ద్రౌపదీ పరిణయం, భాగవతంలో రుక్మిణీ కళ్యాణం చదవమని అనండి పెళ్ళి

పేరిట ఆడపిల్ల తాలూకు వారిని పీడించు కుతినే పూర్వాచార పరాయణుల్ని. వివాహమనేది పరమపవిత్రమైన బంధం అంతే. ఆడపిల్లను కన్న తండ్రులను అదు క్కుతినే దశకు తెచ్చే కట్నాలు, కానుకలు, లాంఛనాలు ఇవన్నీ కూడా మానవుడిలో పిశాచ దృష్టి పెరిగినప్పుడు దిగాయి.

## 157. ధర్మరాజు అబద్ధం ఆడాడా?

**జ.** ఒక్కసారికాదు. రెండుసార్లు. మొదటి సారి అజ్ఞాతవాసానికి విరాటనగరం చేరాక ఆ రాజు గారితో మాట్లాడుతూ తాను ధర్మరాజు కొలువులో పనిచేశా నన్నాడు. రెండోసారి ద్రోణాచార్యుల వారు చండప్రచండంగా బాణవర్షం కురి పిస్తుంటే ఆగలేక "అశ్వత్థామ హతః" అన్నాడు. రెండుసార్లు అబద్ధం ఎందు కాడినాడూ అని చూడండి. ధర్మం వున్నదే దానికి భారతమే ప్రమాణం. ధర్మం మురికి గుంటలో నీరులా ఒక మాదిరి గానే వుండదు. గంగా ప్రవాహంలా నిత్యం మారుతుంది. ప్రాణ విత్తమాన భంగమందు బొంకవచ్చు అన్నారు ధర్మ శాస్త్రవేత్తలు. ధర్మరాజు అబద్ధం ఆడిన రెండు సన్నివేశాలూ అటువంటివే కనుక ఆయన ధర్మరాజే!

## 158. విద్యారంభం

**జ.** దసరానాడు అతి ప్రాధాన్యం ఇచ్చి చేసే మరో సంప్రదాయం అక్షరాభ్యాసం. దేశవ్యాప్తంగ గల అనేకమంది హైందవ




కుటుంబాల్లో మూడు నుంచి ఐదేళ్ళ వయస్సు మధ్య పిల్లలకు దసరా పండుగ నాడు అక్షరాభ్యాసం చేస్తారు. ఆ తల్లి దీవె నల నడుమ తొలి అక్షరాన్ని దిద్దిస్తే తమ పిల్లలు సరస్వతీ బిడ్డలు అవుతారని ఆశి స్తారు. బియ్యంలో బిడ్డ చూపుడు వేలుపట్టి 'ఓం శ్రీ గణపతయే నమః' అని అంటూ రాయిస్తారు. ఇంటి పెద్ద లేదా పూజ నిర్వ హించే బ్రాహ్మణుడు బంగారు ఉంగరాన్ని తేనెలో ముంచి అక్షరాభ్యాసం చేయాల్సిన బిడ్డ నాలుకపై తొలి అక్షరాన్ని రాస్తారు. ఈ రోజున తొలి అక్షరాలు రాసిన పిల్లలకు జీవితకాలం విజయాలు సాధించడానికి సరస్వతీదేవి ఆశీస్సులు వెన్నంటి వుంటా యని అందరూ మనసా వాచా విశ్వసిస్తారు.

## 159. కులమతాలు నశించాలంటూనే ఉద్యోగాల్లో కులమతాలకు ప్రాధాన్యం ఇస్తున్నారే?

**జ.** అదే ఈ నాటి మేధావులు అనుసరి స్తోన్న ఆత్మ ద్రోహి మార్గం. నశించ వలసి నవి కులమతాలుకావు. కులద్వేషాలను బూడిదచేసి, స్వార్థాన్ని దాచుకుని నీతులు చెప్పే బుద్ధులు.

## 160. ఆయుధపూజ

**జ.** దసరా అనగానే చేసే కార్యక్రమాల్లో తొలిగా గుర్తుకు వచ్చేది ఆయుధపూజ. విభిన్న పనిముట్లకు జరిగేపూజ. నవ రాత్రులలో 9వ రోజున వివిధ వృత్తుల వారు, కళాకారులు, ఇతర వృత్తుల వారు తాము వాడే వస్తువుల్ని, పరికరాల్ని, పాత్రల్ని దేవిపాదాల ముందుంచి మౌనంగా ప్రార్థనలు చేస్తూ, పువ్వులతో పూజ చేస్తారు.



పూజ పూర్తయి, తల్లి ఆశీస్సులు అందు కునే వరకు ఆ యా పరికరాల్ని అక్కడే వుంచేస్తారు. ఆమె ఆశీస్సులు తీసుకో కుండా వాటితో తిరిగి ఏ పనీ చేయరు. ఉడికించిన అన్నం, పండ్లు, పువ్వులు, హారతితో ఆయుధపూజను చాలా మౌనంగా నిర్వహిస్తారు. ఏ పరికరాన్ని, పని ముట్టునూ కూడా తల్లి ఆశీస్సుల నుంచి మినహాయించరు. భారతీయ సైని కులు సైతం ఆయుధ పూజ నిర్వహిస్తారు. దీనిని శస్త్రపూజ అంటారు.

## 161. 'ఈ సృష్టిలో పుట్టేదీ, గిట్టేదీ ఏదీలేదు' అని శ్రీకృష్ణుడు గీతలో అన్నాడు కదా?

**జ.** పుట్టేదీ గిట్టేది లేదని కాదు గీతాచార్యుని మాట, పుట్టినది గిట్టి తీరుతుంది. **జాతస్య హి ధృవో మృత్యుః**– మరికొంత వివరిం చాలంటే ఈ భూత కోటి ఆదిలో లేదు. మళ్ళీ అంతమందుండదు. మధ్యలో వుండి పోయే దానికి శోకం దేనికి – అంటాడు.



**అవ్యక్తాదీని భూతాని**
**వ్యక్త మధ్యాని భారత**
**అవ్యక్త నిధనాన్యేవ**
**తత్ర కా పరిదేవనా।**

ఈ మాట 5వేల సంవత్సరాల క్రితం చెప్పినా మానవుడు ధనలోభంతో తన అక్రమ ధనాన్ని స్విస్ బ్యాంకుల్లో దాచు కునే మూర్ఖత్వం వదలలేక పోతున్నాడు.

## 162. పాదరక్షలు పెట్టి రాజ్యం ఏలిన భరతుని పిచ్చివాడనుకోవాలా లేదా?

**జ.** పాదాక్రాంతమైన రాజ్యభోగాన్ని గడ్డి పరకలా వదిలి వెళ్ళిన సత్యవాక్పాలనా పరాయణుడైన రాముని పాదుకల.. కాని



వాగ్దానాలు ప్రజల మొహాన పోసి విద్య, ఉద్యోగం వేలం పాడి బ్రీఫ్‌కేసులు పుచ్చుకునే పాలకుల, పురాణ పరాయణుల పాదాల మీదపడే వారికంటే భరతుడు పిచ్చివాడా!

## 163. సరస్వతి బ్రహ్మకు భార్యయా?

**జ.** నిస్సందేహంగా, ఈ సందేహం విడిచి సరస్వతీ సమారాధనం చేయండి.



## 164. బ్రహ్మచారియైన హనుమంతునికి కొడుకు వున్నాడా?

**జ.** హనుమంతుడు ముందుగా కనిపించే వాల్మీకి రామాయణంలో ఆయనకు కొడుకులు లేరు. ఆ తరువాయి వచ్చిన భక్తి కథలలో ఈ కొడుకును పుట్టించారు.

## 165. బాబా, యోగి, అమ్మ అంటూ అవతారాలుగా ప్రచారం చేసుకుంటున్నారే?

**జ.** చూడండీ. ప్రచారం చేసుకున్నంతలో అవతారాలయిపోతే చాలా మంది ఆషాఢ భూతులు దివ్యమంగళ విగ్రహాలు చెక్కిం



చుకుని ధూపదీప నైవేద్యాలు ఏర్పాటు చేసుకునేవారు. సత్యసాయిబాబా, బాల యోగి, జిల్లెళ్ళమూడి అమ్మ వారికి వారుగా అవతారాల మని ప్రచారం చేసుకోలేదు. వారి శక్తి చూసి, వారి ఆశ్రయంలో శాంతిని పొందినవారు, వారి సేవా కార్య క్రమాలకు సహకరిస్తూ దైవాంశ సంభూతులుగా భావిస్తున్నారు. అవన్నీ అలా ఉంచితే ఈ బాబాలు, అమ్మలు ఎంత మందికి అన్నదానం, విద్యాదానం చేస్తు న్నారో చూడగలిగితే, ఆ సాధకుల పేర నడిచే సేవాసంస్థల కృషి తిలకించగలి గితే వ్యర్థ ప్రలాపాలకు అవకాశం

వుండదు. వీరిని దుయ్యబట్టి, దుమ్ము పోసేవారు తమ కనులఎదుట సాగే అత్యాచారాలను, కుంభకోణాలను సాగించే, కీచక, దుశ్శాసనుల మీద దాడి చేయ గలిగితే ఈ మేధావులకు మనం జోహారు లర్పించగలం.

## 166. పరదారాపహరణం రావణునితోనే మొదలయిందా?

**జ.** ప్రపంచ సాహిత్యంలో ప్రభవించిన మొదటి కావ్యం రామాయణం. దానిలో దొరికాడు దశకంఠుడు. ఆ పాపానికి వంశనాశనం చేసుకున్నాడు. అదీ రామాయణం చదివిన వారు నేర్చుకోవలసిందీ, నేర్పవలసిందీ...

## 167. కిడ్నాపింగు విద్య రావణునితో, వాంప్ పాత్ర శూర్పణఖతో, సి.ఐ.డి. శాఖ హనుమంతునితో ఆరంభమయ్యాయా?

**జ.** అందుకు సందేహమా! ఆ విద్యలు ఇంకా వున్నాయి కనుకనే రామాయణం చదువుతున్నారు, దేశదేశాలవారు.



## 168. లక్ష్మీ కుటుంబం

**జ.** శ్రీ మహాలక్ష్మీదేవి గోత్రం 'భార్గవ' తల్లి పాలసముద్రం, తండ్రి భృగుమహర్షి, తమ్ముడు చంద్రుడు, కోడలు సరస్వతి, భర్త శ్రీహరి, పుత్రులు ఆనందుడు



కర్దముడు, చిక్లీతుడనే ముగ్గురు ఋషులు. కృతయుగంలో ఈమె పేరు శ్రీ మహాలక్ష్మి, భర్త శ్రీహరి. త్రేతాయుగంలో ఈమె పేరు సీత, భర్త శ్రీరామచంద్రుడు. ద్వాపర యుగంలో ఈమె పేరు రుక్మిణి, భర్త శ్రీకృష్ణ పరమాత్ముడు. కలియుగంలో ఈమె పేరు అలర్ మేర్ మంగ (అలర్–పుష్పాల యొక్క, మేర్–పై భాగంలో కన్పిస్తూ దర్శన మిచ్చిన, మంగ–కన్నె–ఈమె పేరే పద్మావతి. పద్మాలలో దాగి పుట్టినది) ఈమెనే 'అల మేలు మంగ' అన్నారు, భర్త శ్రీ వేంకటేశ్వరుడు. కృతయుగంలో వైకుంఠంలో, త్రేతలో అయోధ్యలో, ద్వాపరంలో మధురలో, కలిలో తిరుమలలో ఆమె భర్త వెంట నివసిస్తూ ఉంటుంది.

## 169. స్థిరంగా వుండని మన మనసును నియంత్రించడం ఎలా?

**జ.** ఏది వద్దనుకుంటారో అదే కోరుకుంటుంది మనసు. మీకు ఎర్రరంగు ఇష్టం లేదనుకోండి. ఎక్కడికెళ్ళినా అదే రంగు మీ కళ్ళకు కనిపిస్తుంది. చిన్నతనం నుండి మనసును నియంత్రించుకోవాలని పెద్దలు, చెప్పగా వినివుంటారు. చెడు ఆలోచించవద్దంటారు. చివరికి ఎప్పుడు ఏది చేయకూడదో, ఏది ఆలోచించకూడదో నేర్చుకోవడం జరుగుతుంది. ఏది చెయ్యాలో, ఏది ఆలోచించాలో తెలుసుకునే సమయముండదు. ఫలితంగా మనసంతా చెడు ఆలోచనలతో నిండిపోతుంది. మీ మనసులో భాగహారాలు, తీసివేతలే వుండవు. హెచ్చవేతలు, కూడికలే వుంటాయి. బలవంతంగా ఏ ఆలోచనయినా మనసులో నుండి తొలగించగలరా? ప్రయత్నించి ఫలానాది తొలగించామని చెప్పండి. మీరు మనసుకు సంబంధించిన ప్రాథమిక అంశాలు అర్థం చేసుకోకుండా సంక్లిష్ట అంశాల గురించి ఆలోచిస్తున్నారు అనిపిస్తున్నది.

## 170. పంచాంగం ఎందుకు చూస్తారు?

**జ.** ఖగోళంలో నక్షత్రాల గమనం, దాని ద్వారా ప్రకృతిలో వచ్చే మార్పులకు అనుగుణంగా జరిగే పరిణామాలకు మానవులు చేసే ఉత్సవాలే పండుగ. కాలాన్ని జనవరి, ఫిబ్రవరి అంటూ లెక్కపెట్టడం



సాధారణ విషయం. ఇలా కాకుండా తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాల ద్వారా కాలాన్ని పరిశీలించడమన్నది భారతీయ సంస్కృతి. ఈ ఐదు రకాల లెక్కలతో వుండేదే పంచాంగం. దీనిలో సృష్టి మొదటి నుంచి వున్న సంవత్సరాల గణన వుంటుంది. మన పంచాంగాల్లో సుమారు 195 కోట్ల సంవత్సరాల నుంచి లెక్క వుంది. అందుకే ఉగాదినాడు పంచాంగం చూస్తారు. ఖగోళంలోగల నక్షత్రాల గమనాన్ని బట్టి గ్రహణాలు, వర్షాలు, ఎండలు, ప్రకృతి ప్రళయాలను లెక్క గట్టి పంచాంగకర్తలు చెప్తారు. జ్యోతిష్కులు ఫలిత భాగం ఆధారంగా జాతకాలు చెప్తారు.

## 171. లక్ష్మీదేవికి ఏవి ఇష్టం?

**జ.** ఇంట్లో ఉన్న అందరూ తమ తమ పేర్లతో పిలుచుకోవడంకాక అక్కా, అన్న, తమ్ముడూ, బాబాయి... అనుకుంటూ బంధుత్వపు వరసలతో సంబోధించుకోవడం ఆమెకెంతో ఇష్టం. ఇంటిముందు సన్నని గీతతో ముగ్గున్న ఇల్లూ – అలా చూస్తూండగా ఇంటి పెరట్లో తులసిమొక్క

వీధిలోనికి కన్పిస్తూండడం ఆమెకి ఆనంద దాయకం. ఇంట్లోని గృహిణి సూర్యోదయ కాలానికే స్నానం చేసి కనీసం దైవ మంది



రంలో దీపారాధన నైనా చేసి ఉంటే ఆ గృహిణి ఆమెకి ప్రీతి పాత్రురాలు. ఇంటి కొచ్చిన అతిథి ఇంట్లోని దేవమందిరంలో కూచుని జపం చేస్తూంటే ఆ దృశ్యం ఆమెకి నయనమనోహరం. శ్రీ సూక్త మంత్రాలూ-లక్ష్మీ అష్టోత్తరం లేదా సహస్ర నామాలూ ఆమెకి మరింత సంతోషదాయకాలు. వస్తు ద్రవ్యాలూ, ఆడంబరం అట్టహాసం కంటె భక్తిశ్రద్ధలు ఆమెకి చాలా మక్కువ అయినవి. ద్రవాల్లో ఆవుపాలు, కాయల్లో నారికేళం, పత్రాల్లో మారేడు, పూలల్లో పద్మం, ఫలాల్లో అరటి, అయనాల్లో ఉత్తరాయణం, మాసాల్లో శ్రావణం, పక్షాల్లో శుద్ధం, తిథుల్లో తన భర్తకిష్టమైన ఏకాదశి, వారాల్లో తన తండ్రి పేరిటి శుక్రవారం, వాహనాల్లో గజం, వాసనల్లో కర్పూరం అగరు జవ్వాది, నైవేద్యాల్లో పాయసం, వస్త్రాల్లో తెలుపు, పసుపు పట్టువస్త్రాలు, తన చిత్రాల్లో అటూ ఇటూ ఏనుగులు తనకి అభిషేకిస్తూ ఉంటే తాను పద్మంలో కూర్చున్న చిత్రం ఆమెకి బాగా ఇష్టాలు.

## 172. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల తల్లిదండ్రులెవరు?

**జ.** చరాచరజగత్తును భూమిగా నడుపు కునే పరాశక్తి విలాసంగా ఈ ముగ్గురినీ సృష్టించి వారికి సృష్టి, స్థితి, లయలు చూసే బాధ్యత ఇచ్చిందని పురాణాలు చెపుతున్నాయి.



## 173. యుద్ధం ప్రారంభించకుండా ప్రబోధించిన గీతలో శ్రీకృష్ణుడు యోధులందరినీ నేనే సంహరించాను అంటాడు. అది నిజమా?

**జ.** 'కృష్ణుడు లీలామానుష విగ్రహుడు' అని విశ్వసించగలిగితే వారిని చంప

డానికి ఆయన నిశ్చయించుకున్న క్షణం లోనే వారు చచ్చిన వారితో జమ. అందులో అబద్ధం ఏముంది.

## 174. హేతువాదం గురించి ఏమంటారు?

**జ.** నాకు తెలిసి పురాణాలు తగలబెట్టు, ఆలయాలు పడగొట్టు, సాంప్రదాయాలు నాశనం చెయ్యి అనే విధ్వంసక కార్యక్రమమే నేటి హేతువాదుల నినాదం. కాని ఈ దేశంలో ప్రాచీన కాలంలో 'హేతు వాదం' గురించి రాంషాగారి పుస్తకం చదివితే వివేకం కలుగుతుంది.

## 175. మనం పూజించే దైవాన్ని ఏకవచనంలో 'నువ్వు' అని సంబోధించవచ్చా?

**జ.** మనకు చనువు, అభిమానం అధిక మైన చోట గౌరవం, అగౌరవం వుండవు.

## 176. మోక్షంకోరి తపస్సు చేసేవారే కాని అది పొందిన వారెవరూ కనపడరే?


**జ.** ఇంతకూ మోక్షం అంటే మీకు తెలిసి నట్లు లేదు. జనన మరణ సంసార విష వలయం నుండి పరంజ్యోతిలో లీనం కావడమే మోక్షం.

## 177. శ్రీరాముడు అవతారం చాలించినా పరశురాముడింకా వున్నాడా?

**జ.** మార్కండేయుడు, పరశురాముడు, హనుమంతుడు, అశ్వత్థామ వీరంతా చిరంజీవులు అంటున్నాయి పురాణాలు.

## 178. దుర్గాదేవి శాకంబరీదేవి ఎందుకైంది?

**జ.** దుర్గాదేవి దివ్యావతారాల్లో శాకంబరీ దేవి ఒకటని వేదాలు పేర్కొంటున్నాయి.



శాకంబరి అంటే కూరగాయలు, ఆకు కూరలు వంటి శాకములను వస్త్రాభరణా లుగా ధరించిన మాత అని అర్థం. పాడి పంటలకు లోటులేకుండా అను క్షణం భక్తజనులను రక్షించే అమ్మే శాకంబరీ దేవి అయింది. పూర్వకాలంలో వర్షాలు పడక, పంటలుపండక, కనీసం తాగేందుకు నీరు కూడా లేకుండా ప్రజలు, పశుపక్ష్యాదులు అల్లాడిపోతున్న సమయంలో మునులు, సాధువులు వారికోసం జగన్మాతను ప్రార్థిస్తారు. మునుల ప్రార్థనలతో ప్రత్యక్ష మయిన తల్లి తాను నూరుకన్నులతో ముల్లోకాలను పరిరక్షిస్తానని, దేవతలు, ప్రజలు, తనను శతాక్షిదేవిగా కొలుస్తారని, ఇలా కీర్తినొందే తాను తన దేహం నుంచి శాకములను పుట్టించి ప్రజల ఆకలి

బాధలను తీర్చుతూ, భూమిని సుభిక్షంగ ఉంచుతానని వరమిచ్చిందని చెప్తారు. ఇలా జగన్మాత తన దేహాన్ని శాకములుగా మార్చడం వల్లనే ఆమె శాకంబరీదేవి అయింది.

## 179. ముగ్గురమ్మలు

***లక్ష్మీదేవి :*** సిరిసంపదలు, అదృష్టానికి 'హేతువైన లక్ష్మీదేవి కలువ పువ్వుల్ని రెండు చేతులతో పట్టుకుని వుంటుంది. కలువపువ్వు స్వచ్ఛతకు, పరిపూర్ణతకు, సంతానోత్పత్తికి చిహ్నం. లక్ష్మీదేవిని పద్మ, కమల అంటారు. అందమైన దేవతగా 'శ్రీ' అని కూడా కొలుస్తారు. లక్ష్మీదేవి పక్కన వుండే ఐరావతం విజ్ఞానా నికి, రాచరికానికి చిహ్నంగా భావిస్తారు.

***కాళికాదేవి :*** నాలుగు చేతులతో, నల్లని రూపంతో భీకర అవతారంలో వుంటుంది కాళికా అమ్మవారు. దుష్టశక్తుల్ని దునిమే కత్తి ఒక చేతిలో, దుష్టశక్తి తలను మరో చేత్తో ధరించి వుంటుంది. మరో రెండు చేతులతో భక్తులకు వరాల్ని, అభయాన్ని ఇస్తుంటుంది. పుర్రెల దండ పట్టుకుని, ఎర్రబారిన మూడు కన్నులు, నాలుకతో భీకర అవతారంలో వుంటుంది. ఇవన్నీ ఆమెలోని అపారత్వానికి, దుష్టశక్తుల వినాశనానికి చిహ్నాలు.

***సరస్వతీదేవి :*** చదువుల తల్లి సరస్వతీ దేవి పద్మంపై కూర్చుని, హంసను పక్కన వుంచుకుంటుంది. దీనిని అందానికి, స్వచ్ఛతకు చిహ్నంగా భావిస్తారు.




వీణను చేత ధరించి వేదాలు పలికిస్తుంది. పుస్తకం, నీటి పాత్ర ఆమెవద్ద వుంటాయి. మతాచారాలకు, ఆధ్యాత్మిక సంబంధిత ప్రక్రియలకు, విజ్ఞానానికి, విశ్వాసానికి ప్రతీక సరస్వతీదేవి.

## 180. గుడిగంటలు


***జ.*** గుడిలో గంట కొట్టినప్పుడు వచ్చే శబ్దాన్ని పవిత్రమైన శబ్దంగా భావిస్తారు భక్తులు. గంట భగవంతుని విశ్వజనీన నామం అయిన 'ఓం' అన్న శబ్దాన్ని ఇస్తుది. ప్రతి దేవాలయం ముఖద్వారం



వద్ద గంట వేలాడదీసి వుంటుంది. భక్తులు అందరూ భగవంతుని దర్శనానికి గుడి లోకి ప్రవేశించగానే భక్తి పారవశ్యంతో గంట కొడతారు. భగవంతుడు నిద్రపోడు కాబట్టి గంట కొట్టి ఆయన్ను లేపాల్సిన అవసరం లేదు. ఇలా గంటలు మోగించడం ద్వారా భగవంతుని అనుమతి తీసు కుంటున్నట్లు భావించాల్సి అవసరమూ లేదు. ఇది కేవలం అక్కడున్న పవిత్రతను ఉద్దీప్తం చేసే సంకల్పం మాత్రమే. ఇంట్లో హారతి ఇచ్చిన సందర్భంలో కూడా గంట మోగిస్తాం. కొన్నిసార్లు శంఖునాదం, ఇతర సంగీత సాధనాల పవిత్ర శబ్దాలతో కూడి వుంటుంది. ఇవన్నీ పవిత్రతను, భక్తి భావాన్ని ఇనుమడింపజేసేవే.

## 181. మాలధారణ

***జ.*** మెడలో మాల ధరించడం సనాతన హైందవ ధర్మాచారం. మంత్రాల సంఖ్యను లెక్కించడానికే ఈ మాలలు ధరించరు.



ఔషధ రాళ్ళు, ఔషధాలు, పవిత్ర వృక్షాల తాలూకు గింజలు, బెరడులతో తయారు చేసే మాలల ధారణను మహర్షులు మనకు నేర్పించారు.

కమలాక్ష (కమలం గింజలు) మాల ధరించడంవల్ల శత్రువును జయించ వచ్చని తంత్రసారం పేర్కొంటున్నది. ముడులతో కూడిన మాల, పాపాల్ని తొల గిస్తుంది. జిమపేట (జీవ పుత్ర) మాలను సంతాన గోపాలుడి రక్షరేకుతో ధరించి దేవుళ్ళనామాలు స్మరిస్తే పుత్రుడు జన్మి స్తాడు. కెంపులమాల సంపదను ఇస్తుంది. రుద్రాక్షమాల ధరించి మృత్యుంజయ మంత్రాన్ని జపిస్తే రుగ్మతలు తొలగి, దీర్ఘా యుష్షు కలుగుతుంది. హరీంద్ర మాల అడ్డంకులను తొలగించి,శత్రువుల నుంచి రక్షించగలదు. పాలరాళ్ళ మాల అభ్యాసా నికి, ఇతరులను ఆకర్షించడానికి సహ కరిస్తుంది. తులసి పూసలు, చిన్ని చిన్ని గవ్వల మాలలు శ్రీకృష్ణుడు, విష్ణుమూర్తిల అనుగ్రహం పొందడానికి సహకరిస్తాయి. పిల్లల్ని ఇతరుల దృష్టి దోషం నుంచి, రుగ్మ తల్నుంచి రక్షించేందుకు పులిగోరు, బంగారు, వెండి, రాగి నాణేల మాలలు ధరింప జేస్తారు. ఇలా ఎన్నో నమ్మకాల నడుమ రకరకాల మాలలు ధరించే ఆచారం వుంది.

## 182. దీపారాధన

***జ.*** దీపం జ్ఞాన చిహ్నం. నిర్లక్ష్యమన్న చీకటిని పారదోలే దివ్యజ్యోతి. ప్రతి ఇంట్లోనూ దేవుని ముందు ఉదయం, సాయం సంధ్యవేళ ఒకటి, రెండుసార్లు దాపారాధన చేయడం హైందవ ఆచారం. కొన్ని ఇళ్ళల్లో ఎప్పుడూ దీపం వెలుగు తూనే వుంటుంది. దీనిని 'అఖండ దీపం' అంటాము. అన్ని పవిత్ర సందర్భాలనూ



జ్యోతి వెలిగించి ప్రారంభించే సంప్రదాయం మనకు వుంది. దీపకాంతి చీకటిని పారదోలినట్లే, జ్ఞానం నిర్లక్ష్య ధోరణిని నిర్మూలిస్తుంది. అందుకే అన్ని రూపాల్లోని సంపద అయిన గొప్ప జ్ఞానాన్ని సముపార్జించు కోవడంకోసం, అన్ని పవిత్ర సందర్భాలలోనూ మన ఆలోచనలకు, చర్యలకు సాక్ష్యంగా జ్యోతి వెలిగిస్తాము.

విద్యుత్ దీపాల సంగతిని పక్కనుంచితే సంప్రదాయ బద్ధంగా వెలిగించే నూనె దీపానికి ఆధ్యాత్మిక గుర్తింపు ఎక్కువగా వుంటుంది. దీపపు కుందిలో పోసే నెయ్యి లేదా నూనె, వత్తి మనలోని కోరికలు, అహంభావ ధోరణులకు సంకేతం. భగవంతుని ముందు దీపం వెలిగించగానే మనలోని కోరికలు నెమ్మదిగా ఆవిరవుతూ, అహం కాలిపోతూ వుంటుందని అర్థం చేసుకోవాలి.

## 183. శంఖునాదం

**జ.** యుద్ధాలలో శత్రునాశనం జరిగిన వెంటనే శంఖువు ఊదేవారు. అదే భగవధారాధనలో శంఖువు ఊదడమంటే పాపాల్ని నశింపజేసి, విష్ణుభగవానుడి సాన్నిధ్యంలో సంతోషాన్ని అనుభవించడమని అర్థం. శంఖువు ఊదినప్పుడు అది పవిత్ర శబ్దమైన 'ఓం'ను ప్రతిధ్వనిస్తుంది. ప్రపంచ సృష్టికి ముందు భగవంతుడు జపించిన నాదం ఈ 'ఓం'. ఇది ప్రపంచానికి, దాని వెనుకగల వాస్తవానికి ప్రతినిధి వంటిది. భగవంతుని ధ్యానంలో గలవారి మనస్సుల్ని కాని, అక్కడి వాతావరణాన్నికాని ఎటువంటి శబ్దాలు, వ్యతిరేక శక్తులు నొప్పించ కూడదని, ఇబ్బంది కలిగించ కూడదన్న ఉద్దేశంతో పూజలు చేసుకునే సమయంలో శంఖువు లేదా మరే ఇతర వాయిద్య పరికరాలతోనైనా పవిత్ర శబ్ద తరంగాలు సృష్టించడం ఒక ఉద్దేశ్యం. శంఖువును దేవాలయాల్లో కాని, ఇళ్ళలో కాని భగవంతుని ప్రతిరూపం సరసన నాదబ్రహ్మ – వేదాలు, ఓం, ధర్మ, విజయం, పవిత్రతకు చిహ్నంగా వుంచుతారు. భక్తుల మనస్సుల్లో అత్యున్నత వాస్తవాల్ని నింపేందుకు శంఖువులోని జలాన్ని తీర్థంగా ఇస్తుంటారు.



శబ్ద తరంగాలను సూర్య కిరణాలు అడ్డుకుంటాయని శాస్త్రజ్ఞులు భావిస్తారు. అందుకే శంఖువును సూర్యకిరణాల తాకిడి తక్కువగా వుండే ఉదయం లేదా సాయంత్రం వేళల్లో ఊదుతారు. శంఖు నాదంలోని శబ్దతరంగాలు ఎన్నో వ్యాధులకు మూలమైన సూక్ష్మక్రిముల్ని నశింపజేస్తాయి. జగదీష్ చంద్రబోస్ ఈ విషయాన్ని ఎన్నో ప్రయోగాలద్వారా నిరూపించాడు కూడా. క్రమం తప్పకుండా శంఖువు ఊదేవారికి ఊపిరి సంబంధిత సమస్యలు, ఆస్థమా వంటివిరావు. ఎన్నో రుగ్మతల నివారణలో, గాలి, వాతావరణాల్ని పరిశుభ్ర పరచడంలో శంఖువు శబ్దం ఉపయోగపడుతుంది.

## 184. ప్రదక్షిణ

**జ.** దేవాలయానికి వెళ్ళినప్పుడు గర్భగుడి చుట్టూ తిరుగుతాము. దీనినే ప్రదక్షిణ అంటాం. ఒక కేంద్ర బిందువులేకుండా సర్కిల్ చుట్టుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. భగవంతుడిని మన జీవితాలలో కేంద్ర బిందువుగా గుర్తిస్తూ, మన దైనందిన కార్యక్రమాలు కొనసాగించాలి. గుళ్ళో ప్రదక్షిణ ప్రాముఖ్యం ఇదే. ముందుకు సాగుతూ మనం ప్రదక్షిణ చేయడమంటే భగవంతుడు ఎల్లప్పుడూ మన కుడివైపున వుంటాడని అర్థం. మనకు కుడిపక్క పరమ పవిత్రమైనది. ఆంగ్లభాషలో సైతం 'రైట్ సైడ్' అనడం పరిపాటి. అంటే దైవం కొలువైన గర్భగుడి చుట్టూ ప్రదక్షిణ చేయడమంటే, సక్రమ మార్గంలో పవిత్ర



జీవితానికి దారితీయడాన్ని మనకు మనం గుర్తుచేసుకుంటున్నట్లే. ఈ జీవితానికి అంతులేని సహాయాన్ని, మనోబలాన్ని ఆ భగవంతుని నుంచి అందుకుంటున్నట్లు అర్థం.

## 185. ఓం, హరి ఓం


**జ.** వేదాలు, మంత్రాలు చదివే ముందు 'హరి ఓం' అనే వైదిక సంప్రదాయం వుంది. వేదాలను తప్పుగా ఉచ్చరిస్తే మహాపాతకాలు చుట్టుకుంటాయని అంటారు మన పూర్వీకులు. అలా తప్పుగా అనడం వల్ల వచ్చే అనర్థాలు ఎదురు కాకుండా పరిరక్షించుకునేందుకుగాను మంత్రం ముందు తప్పనిసరిగా 'హరి ఓం' అని పలకాలని శ్రీమద్భాగవతంలో పేర్కొని వుంది. మంత్రాల ఉచ్చారణలో తప్పులు దొర్లడం, పద్ధతులు, స్థలం, సమయం, ఇతర విషయాలకు సంబంధించి, మత సంబంధిత కార్యక్రమాలలో ఏవైనా లోటుపాట్లు జరిగినా వాటి తాలూకూ దోషాల నివృత్తికోసం, పాప పరిహారార్థం ఈ 'హరి ఓం' సంకీర్తన అవసరం.



భారతదేశంలో 'ఓం' అన్నది అత్యంత పవిత్ర నాదం. ఓంకార జపం ప్రభావం మనస్సు, శరీరాలపై విశేషంగా వుంటుంది. అన్ని పవిత్ర కార్యకలాపాల్నీ 'ఓం' శబ్దం తోనే ఆరంభిస్తారు. మళ్ళీ మళ్ళీ జపించే మంత్రం. గాత్రమూలనుంచీ ఆరంభమై పెదవులద్వారా వచ్చి 'మ్'తో ముగించే ఓంకార జపం ఎల్లెడల్లా ప్రతిధ్వనిస్తుం టుంది. మనస్సుకు ప్రశాంతతను చేకూ ర్చుతుంది. 'ఓం'ను వాడుకలో విభిన్న రకాలుగా రాస్తారు. 'ఓం' విఘ్నేశ్వరుడికి ప్రతీక అని కూడా చెప్తారు.

## 186. సర్ప పూజలు

***జి.*** పూర్తి భూమండలం శేషపడగపై సేదతీరుతుంది అనేది ప్రాచీన హైందవ విశ్వాసం. అందుకే వెండి పడగ తయారు చేయించి, దానిలోకి శేషనాగుని స్ఫూర్తిని ఆపాదించి నూతన భవన నిర్మాణ పునా దులలో వుంచుతారు. శేషనాగు భూమం డలాన్ని స్థిరంగా ఏ విధంగా పట్టివుంచు తాడో, పునాదిరాళ్ళు అదే మాదిరి భవన భారాన్ని స్థిరంగా మోయాలన్న వాంఛతో ఇలా చేస్తారు.



పాతాళలోకం భూమి కింద వుంది. ఈ పాతాళానికి అధిపతి నాగరాజు. కాబట్టి దుష్టశక్తుల ప్రభావాన్ని తొలగించుకోవ డానికి పాముల్ని పూజిస్తారు. శేషనాగు క్షీరసాగరంలో కొలువై వుంటాడు కాబట్టి కలశంలో పాలు, పెరుగు నెయ్యి వుంచి క్షీరసాగర ప్రతినిధిగా భావిస్తూ, మంత్రాలు చదువుతారు. ఈ విష్ణుకలశంలో లక్ష్మీ రూపు వుంచి కలశాన్ని భూమి లోపల పెడతారు. పునాది సందర్భంగా చేసే పూజలన్నీ ఈ నమ్మకాలతోనే సాగుతాయి.

## 187. శాంతి జపం

***జి.*** ఏదైనా మూడుసార్లు చెప్తే అది నిజం కాగలదని ఓ నమ్మిక. కోర్టుల్లో సైతం సాక్ష్యం చెప్తున్నప్పుడు అంతా నిజమే చెప్తానని మూడు సార్లు అన్పిస్తారు. అలాగే, ముమ్మారు 'శాంతి' అనడంవల్ల శాంతిపట్ల మన అంతర్గత కోరికను వెల్ల డించి నట్లవుతుంది. శాంతి అంటే ప్రశాం తత. ఇది సహజ స్థితి. ఎవరైనా అల్లరి చేస్తేనో, ఉద్రిక్తతకు కారణమయితేనో

మినహా సాధారణంగా ప్రశాంతత నెల కొనే వుంటుంది. ఏదైనా ఉద్యమం అంత మైన అక్కడ సహజంగానే వున్న ప్రశాం తత మళ్ళీ తర్వాత నెలకొంటుంది. మనిషి జీవితంలో అంతర్గతంగా లేదా బాహ్యంగా శాంతి లేకుండా మనుగడ కష్టం. ఎందు కంటే మన ఉద్రేకాలను కప్పి వుంచేది ఈ ప్రశాంతతే. సమస్యల్ని సద్దుమణిగించి, శాంతిని ఉద్దీప్తం చేసేందుకు మనం శాంతి మంత్రాన్ని మూడుసార్లు జపిస్తాం. బాహ్య కల్లోలాలతో నిమిత్తం లేకుండా అంతర్గత శాంతి కోసం మూడుసార్లు 'శాంతి, శాంతి – శాంతి' అనడం ద్వారా మన ప్రార్థనలకు ముగింపును చెపుతాం. మన సమస్యలు, దుఃఖాలు మూడు విధా లుగా కలుగుతాయి. మొదటిది ఆధిదైవిక – అంటే మన నియంత్రణ లేని కనిపిం చని శక్తులవల్ల కలిగే సునామి, భూకం పాలు, వరదలు, కరువు, లావాలు వంటివి. రెండోది ఆదిభౌతిక–అంటే ప్రమాదాలు, మానవ సంబంధాలు, కాలుష్యం వంటి తెలిసిన కారణాలు. ఇక మూడోది ఆధ్యాత్మిక అంటే రుగ్మతలు, కోపం, బాధ వంటి మన శారీరక, మానసిక సమస్యలు. తొలిసారి కనిపించని శక్తులను ఉద్దేశించి గట్టిగాను, రెండోసారి మన పరిసరాల్ని ఉద్దేశించి సుతిమెత్తని గళంతోనూ 'శాంతి, శాంతి, శాంతి' అని జపించాలి.

## 188. గుడ్లగూబ లక్ష్మీ వాహనం ఎందుకయ్యింది?

**జ.** విష్ణుమూర్తి సరసనున్నప్పుడు లక్ష్మీ దేవి ఆయన వాహనం అయిన గరుడపై ప్రయాణం చేస్తుంది. ఒంటరిగా వున్న ప్పుడు ఆమె వాహనం గుడ్లగూబ. గుడ్ల



గూబ పగటివేళ నిద్రించి, రాత్రిపూట తిరుగుతుంటుంది. ఈ కారణంగా లక్ష్మీ దేవి ఒంటరిగా రావాలంటే చీకట్లోనే వచ్చి, అదే చీకటిలో వెళ్ళిపోతుందన్న నమ్మకం వుంది. విష్ణుమూర్తి వెంట వున్న ప్పుడు మాత్రమే ఆమె పగటి వెలుగులో వస్తుంది. అందుకే దీపావళి చీకట్లు ముసిరే వేళ దీపాలను వెలిగించి ఆ తల్లిని ఆహ్వానిస్తారు.

## 18౨. ఋణత్రయం

*జ.* మానవుడు పుట్టేటప్పుడే మూడు ఋణాలతో పుడతాడని శాస్త్రవాక్యం. అవి ఋషి ఋణం, దేవృణం, పితృఋణం. ఈ ఋణత్రయ విముక్తి వివాహం ద్వారానే జరుగుతుంది. బ్రహ్మచర్యంతో ఋషుల ఋణం, యజ్ఞాలతో దేవఋణం, సంతానంతో పితృఋణం తీర్చుకోవాలి. సంతానప్రాప్తికి సాధనమైంది వివాహం. అందుకనే హిందూ ధర్మంలో వివాహం అనేది ధార్మిక సంస్కారం. దేవఋణం – అంటే గాలి, నీరు ఇతర పరిసర దేవ తల పట్లను, అన్ని కాలాల, ఋతువులు ధర్మ దేవతల పట్లను తనకుగల ఋణాన్ని లేదా బాధ్యతను తీర్చుకోవడం. పంచ మహాభూతాలకోసం, దేవతల కోసం మనం త్యాగం చేయాలి. అంటే యజ్ఞం చేయాలి.

యజ్ఞం అంటే త్యాగమే. మన కృతజ్ఞ తను తెలియచేసే పద్ధతులే యజ్ఞ యాగా దులు. సరిగ్గా యజ్ఞయాగాదులు చేయక పోవడం వల్లే దేశంలో దుర్భిక్షాలు, కురువు కాటకాలు, ప్రకృతి ఉత్పాతాలు సంభవిస్తాయి.

***పితృఋణం :-*** అంటే పిండం పుట్టుక, అంకురం, పునరుత్పత్తి... వీటికి సంబం ధించిన బాధ్యతలను తీర్చుకోవడం. ఈనాడు ఇంత ఆరోగ్యంతో మన శరీరా లున్నాయంటే అందుకు కారణం మన తల్లిదండ్రులు, మన తాత ముత్తాతలు, వారి తాతముత్తాతలు. వారెన్నో కష్ట నష్టలకోర్చి అవిచ్ఛిన్నంగా మానవ సంతతిని కని, పెంచి తీర్చిదిద్దారు. గృహ స్థాశ్రమంలోవుండి మంచి సంతానాన్ని కనడం, క్రమంతప్పకుండా పితృ దేవతల కు పిండ ప్రదానాలు, తర్పణాలు వదలడం ద్వారా మనం వారిఋణం తీర్చుకోగలం.

**ఋషిఋణం** –అంటే సృష్టి మొదలుకొని ఎందరో విజ్ఞానవేత్తలైన ఋషులు ఎంతో కృషితో అనేక సుఖమయ మార్గాలను మనకోసం కనిపెట్టారు. కాబట్టి మనం వారికి ఋణపడివున్నాం. ఆ ఋణం తీర్చుకునే మార్గాల్లో ఒకటి ఆ మార్గాలు మరింత పురోగమించడానికి విద్యార్జనాది సాధనాల ద్వారా ఎవరికివారు వీలైనంత కృషి చేయాలని శాస్త్రం. మహర్షుల తపో ఫలం మహోజ్జ్వలమైన మన ధర్మం. వారు కనుక విజ్ఞానాన్ని మనకందివ్వకపోతే, వాళ్ల జ్ఞానాన్ని గ్రంథస్థం చేసి వుండక పోతే ఇవాళ మనకిన్ని విషయాలు తెలి సుండేవికావు. ఋషుల ఈ విజ్ఞానానికి మనం వారసులం. వారికి మనం ఋణ పడివున్నాం. బ్రహ్మచర్యంతో, నిశిత బుద్ధితో, శ్రద్ధతో ఆ వాఙ్మయాన్ని అధ్య యనంచేసి జ్ఞానం నశించకుండా తర్వాతి తరాలకు ఎప్పటికప్పుడు అందిస్తూ వుండాలి. అదే ఋషి ఋణం తీర్చుకునే పద్ధతి. ఉపనిషత్తుల కాలానికి ఆశ్రమ వ్యవస్థ స్థిరపడటం వలన ప్రతివ్యక్తికీ బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్యాసాశ్రమాలు విధించబడ్డాయి. ఈ నాలుగు ఆశ్రమాలు ఆనాటి కాలానికి ప్రతి వ్యక్తికీ తప్పనిసరి కర్తవ్యమైనాయి. వ్యక్తిత్వ వికాసానికి



వివాహం దోహదకారిగా ఉపనిషత్తులు కీర్తించాయి. స్మృతికాలంలో ఆశ్రమ వ్యవస్థ భగవంతుడు విధించాడనే విశ్వాసం బలపడింది. ఆ కారణం చేతే వివాహం ఒక కర్తవ్యమైంది. అందుకనే ఆ కాలంలో వివాహం చేసుకోకుండా సన్యసించే నైష్ఠిక బ్రహ్మచారుల సంఖ్య చాలా తక్కువగా వుండేది. గృహ్యసూత్రాలు, ధర్మ సూత్రాల్ని బట్టి ఈ విషయం తెలుస్తోంది.

ఆయుర్దాయంలో మొదటి నాల్గవ భాగం బ్రహ్మచర్యం, రెండవ నాల్గవ భాగం గార్హస్థ్యం, మూడవ నాల్గవ భాగం వానప్రస్థం, చివరి నాల్గవ భాగం సన్యాసాశ్రమంలో గడపాలని మనుస్మృతి చెపుతోంది. మనుస్మృతి కాలంలో వివాహం చేసుకోనివాడిని హీనుడిగా పరిగణించేవారు. భార్య అనేది ధర్మార్థకామసిద్ధికి శ్రేష్ఠమైన సాధనం. అపత్నీకుడు అంటే భార్య లేని వాడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల్లో ఎవరైనాసరే ధార్మిక క్రియలు చేయటానికి అర్హులుకారు, అధికారులు కారు అని మనుస్మృతి నిర్ధారించింది.

భర్తయే పుత్రరూపంలో భార్యయందు జన్మిస్తాడు కాబటి స్త్రీని 'జాయా' అంటుంది ఐతరేయ బ్రాహ్మణం. భార్య, భర్త యొక్క ఆత్మకు అర్థాంశం. కాబట్టి పురుషుడు భార్యను పొందేటంతవరకూ అసంపూర్ణంగానే వుంటాడు. వివాహం చేసుకొని, సంతాన పరంపరను పొందడంవల్ల పరిపూర్ణుడవు తాడని శతపథ బ్రాహ్మణం చెపుతుంది. అందువల్లే వివాహమనేది వాసనా పరితృప్తికి సాధనమేకాదు మనిషి పరిపూర్ణత్వానికి సంబంధించిన అంశం.

## ౧౨౦. రథం ముగ్గు ఎందుకు వేస్తారు.?


***జ.*** ప్రతి పండుగకు ఓ పురాణ గాథ వుంటుంది. అలాగే సంక్రాంతి పండుగకూ వుంది. విశ్వజిత్ అనే యాగాన్ని చేస్తున్న బలిచక్రవర్తి దగ్గరకు విష్ణువు వామనుడి రూపంలో వెళ్ళి అతడిని మూడడుగుల స్థలం కోరతాడు. ఓ పాదంతో నేలను, మరోపాదంతో నింగినీ ఆక్రమించి, మూడోపాదాన్ని బలిచక్రవర్తి తలపైన పెట్టి, అతడిని పాతాళంలోకి నొక్కేస్తాడు. అహంకారం అణిగిన బలి, జ్ఞానోదయం అయి ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ రోజున తాను భూలోకానికి వచ్చి ప్రజల మధ్య తిరిగి కానుకలు ఇచ్చుకునే అవకాశాన్ని కల్పించమని విష్ణుమూర్తిని ప్రార్థించి, వరం పొందుతాడు. అందువల్లనే సంక్రాంతి పండుగనాడు ప్రతి ఇంటిముందు చక్కటి రథం ముగ్గు వేస్తారు.

ఈ రథంపై బలిచక్రవర్తి వచ్చి కానుక లిస్తాడన్న విశ్వాసం వుంది. ఆ ముగ్గులో పసుపు, కుంకుమ, పూలరేకులు జల్లి బలిచక్రవర్తికి ఆహ్వానం పలుకుతారు.

## 191. పురాణాలు మొత్తం ఎన్ని?

**జ.** కథలంటే పిల్లలకు ఇష్టమే. కాని ఇప్పుడు వారికి వినే తీరిక, పెద్దలకు చెప్పే ఓపిక వుండటంలేదు. పురాణాల గురించి కొంతైనా పరిజ్ఞానం వుంటే బావుంటుంది. మొత్తం ప్రధాన పురాణాలు 18, ఉప పురాణాలు 18 వున్నాయి. అవి – అగ్ని పురాణం, గరుడపురాణం, నారద పురాణం, పద్మపురాణం, బ్రహ్మపురాణం, బ్రహ్మవైవర్తపురాణం, బ్రహ్మాండ పురాణం, భవిష్యపురాణం, భాగవతపురాణం, మత్స్య పురాణం, మార్కండేయ పురాణం, కూర్మ పురాణం, వరాహపురాణం, వామన పురాణం, వాయుపురాణం, విష్ణుపురాణం, లింగ పురాణం, స్కాంద పురాణం.


**ఉప పురాణాలు :** సనత్కుమార పురాణం,



నారసింహ పురాణం, బృహన్నారదీయ పురాణం, శివపురాణం, దుర్వాస పురాణం, కపిలపురాణం, వారుణ పురాణం, నందీయ పురాణం, పారాశర పురాణం, సౌర పురాణం, వాశిష్ట పురాణం, దేవీభాగవత పురాణం, గణేశ పురాణం, హంస పురాణం, శివరహస్య పురాణం, కాళీపురాణం, ఆంగీరస సంహిత, భృగు సంహితలు.

## 192. పాదాభివందనం

**జ.** పాదాభివందనం చేయడం అనేది ఎదుటి వ్యక్తుల వయస్సు, జ్ఞానం, పెద్ద రికం, దైవత్వాలకు ఇచ్చే గౌరవం. వారి నిస్వార్థ పూరిత ప్రేమ, మనకోసం చేసే త్యాగాలకు గుర్తుగా ఈ పాదాభివందనం చేస్తాం.



ముఖ్యంగా తల్లిదండ్రులకు బిడ్డలు చేసే పాదాభివందనాన్ని ఈ సందర్భంలో పేర్కొనాలి. ఇలా పాదాభివందనాల్ని ప్రతిరోజూ, లేదా ముఖ్యమైన సందర్భా లలో చేయడం మన సంప్రదాయం. ఇలా భక్తితో తలవంచి వారి పాదాలకు నమస్కరించినప్పుడు అనుకూల వ్యక్తి రూపంలో వారి నుంచి మంచి కోరికలు, ఆశీర్వాదాలు అందుకుంటున్నట్లు భావిం చాలి. కుటుంబంలో, సమాజంలో ప్రజలమధ్య సామరస్యాన్ని, పరస్పర

ప్రేమ, గౌరవాలతో కూడిన వాతావర ణాన్ని ఈ సంప్రదాయం సృష్టించగలదని మనం గుర్తెరగాలి.

## 193. గణపతికే తొలిపూజ

**జ.** ముందుగా గణపతిని పూజించ కుండా సనాతన ధర్మంలో ఏ ఒక్క క్రియా జరగదు. శుభ ప్రారంభానికి శ్రీ గణేశ



పూజ పర్యాయపదం వంటిది. ఆయన లోని అసాధారణ మేధావితనంవల్ల మిగతా దేవుళ్ళందరికంటే ముందుగా విఘ్నేశ్వరుడికి తొలిపూజ లందించడం ఆనవాయితీ అయ్యింది. విఘ్నేశ్వరుడిని పూజించాక మిగతా తొమ్మిది గ్రహాల్ని సరైన పద్ధతిలో ఆరాధించాలని యాజ్ఞ వల్క్యస్మృతిలో పేర్కొన్నారు. ఇలా చేయ డంవల్ల అన్ని కార్యకలాపాలకు సత్ఫలి తాలు వచ్చి, సంపద సమకూరుతుంది.

## 194. రావిచెట్టు ఆరాధన

**జ.** వృక్షాలన్నింటిలో రావిచెట్టు పరమ పవిత్రమైంది అని శ్రీమద్ భగవద్గీతలో



శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు. విష్ణు భగ వానుడి నివాసంగా రావిచెట్టును పరిగణి స్తారు. అశ్వద్థ వృక్షంగా ప్రసిద్ధికెక్కిన ఈ రావిచెట్టు కింద పరమ భక్తులైన హిందు వులు తమ ప్రాణాలను సైతం సంతో షంగా విడవడానికి ఇష్టపడుతుంటారు. విష్ణుమూర్తి రావిచెట్టు వేర్లలో వున్నాడని, కేశవుడు చెట్టు కాండంలో, నారాయణుడు కొమ్మల్లో, హరి ఆకుల్లో, దేవుళ్ళందరూ చెట్టు కాయల్లో వున్నారని స్కందపురాణం పేర్కొంది. సాక్షాత్తు విష్ణుమూర్తి ప్రతి రూపమే రావిచెట్టు అనేది అనేకమంది విశ్వాసం. ఇందరు దేవుళ్ళు కొలువై వున్న ఈ వృక్షం నీడన వుంటే సకల కోరికలు తీరతాయని, సర్వపాపాలు హరిస్తాయన్న అచంచల విశ్వాసంతో ఈ చెట్టుకు పూజలు, ప్రదక్షిణలు చేస్తుంటారు.

## 195. మనలో మహత్యం

***జ.*** అనేక రకాలైన గొప్ప శక్తులు ప్రతి ప్రాణిలో విరాజిల్లుతుంటాయి. అయితే అవి నిగూఢంగా వుండడంవల్ల వాటి



గురించి ఎవరికీ తెలియకపోవడం జరుగుతుంది. నిద్రించే కుండలినీ శక్తి యోగాభ్యాసంచే ఏవిధంగా పైకి లేస్తుందో, అదేవిధంగ మనిషిలో వున్న అంతర్లీనమైన దివ్య పారమార్థిక శక్తులు సత్ప్రయత్నంతో బయట పడతాయి. బంగారం ఇతర లోహాలతో కలిసి వున్నప్పుడు దానికెటువంటి ప్రత్యేకత, విలువా వుండదు. అదే పుటంవేసి, మేలిమిగా మారిస్తే అప్పుడా బంగారానికో గొప్ప విలువ ఏర్పడుతుంది. అదే విధంగా అజ్ఞానానికి లోబడి వున్నప్పుడు జీవుడి విలువ తెలీదు. అందువల్ల అతన్నెవరూ లెక్కచెయ్యరు. అలాఅని అతడు నిర్లక్ష్యం చేయదగినవాడా అంటే కానేకాదు. కారణం అతనిలో పవిత్రాత్మ వుండటమే. దానిని బయటవేయాలి. అదెలా బయటపడుతుందంటే సత్సాంగత్యం చేత, మహానుభావుల బోధనలచేత. అటువంటి ఆత్మస్థితి ప్రతిఒక్కరికీ తప్పక కలుగుతుంది. దాంతో ఇంతకాలం తక్కువగా చూడబడినవాడు, సర్వోత్తముడుగా మారతాడు. కనుక చేసే పనులు చెడ్డవికాని మనిషి చెడ్డవాడు కాడు. దుర్మార్గుడయినా పుణ్యాత్ముడు కాగలడు. ప్రయత్నిస్తే మానవుడు మాధవుడవుతాడు. పశువు పశుపతి అవుతుంది. కనుక ప్రతి ఒక్కరూ తమ స్థితికి నిరుత్సాహం చెందక హృదయాన్ని నిష్కల్మషంగా వుంచుకుని దుస్సంకల్పాలను పూర్తిగా తొలగించుకుంటే దైవబలం చేకూరుతుంది. అల్పుడుకూడా మహాత్ముడై తీరతాడు.

## 196. ఆగమ గ్రంథాలంటే ఏమిటి?

***జ.*** శాస్త్రాల్ని, వేదాలను, పురాణాలను అనుసరించి ఏర్పడినటువంటి ప్రమాణ గ్రంథాలే ఆగమాలు. అనేకమంది దేవుళ్ళను అనేకానేకమంది భక్తులు పూజించుకుంటూ వుంటారు. ఇలా వివిధ దైవాల్ని ఏ విధంగా పూజించి, తరించవచ్చో తెలియజెప్పేటటు వంటి గ్రంథాలే ఈ ఆగమ గ్రంథాలు.

## 197. పురాణ వ్యక్తుల పేర్లు - వాటి అర్థాలు

***జ. ఇంద్రజిత్తు :*** ఇంద్రుని జయించినవాడు (జితమనగా జయము)

**కుచేలుడు :** చినిగిన లేక మాసిన వస్త్రము కలవాడు (చేలమనగా వస్త్రము)

***గాంధారి :*** 'గాంధార' దేశపు రాజకుమార్తె కనుక గాంధారి.

***ఘటోత్కచుడు :*** కుండవలె గుబురైన జుట్టు కలవాడు (ఘటమనగా కుండ).
***తుంబురుడు :*** తుంబుర(వాద్య విశేషము) కలవాడు.
***బృహస్పతి:***బృహత్తులకు (వేదమంత్రా లకు) ప్రభువు (బృహస్పతి).
***యశోద :*** యశస్సును (కీర్తి) కలిగించునది

## 128. భస్మం


***జ.*** భస్మం అంటే మన పాపాలను ప్రక్షాళన చేసుకుని, భగవంతుడిని స్మరించడం. భగవంతునికి అర్పించే హోమంలో సమర్పించే గంధపు చెక్కలు, నెయ్యి, ఇతర ఔషధాల నుంచి వచ్చే బూడిద ఈ భస్మం. భస్మాన్ని స్వీకరించినప్పుడు చిటికెడు భస్మాన్ని తీసి నోట్లో వేసుకోవడం హిందువుల ఆచారం. 'భ' భరత్సానాం (పాప నాశనానికి) 'స్మ' స్మరణానికి ప్రతీకలు. అంటే దుష్టశక్తి నాశనం, దైవత్వ స్మరణ అని అర్థం. ఈ భస్మాన్నే మనం 'విబూది'గా పేర్కొంటాం. జనన మరణ పరిధుల నుంచి బయటపడి, శారీరక అహంకారాల్ని మసిచేయడానికి గుర్తుగా ఈ



విబూదిని ధరించాలి. శరీరం అశాశ్వతమని, ఏదో ఒకరోజు అది భస్మరూపం దాల్చుతుందని కూడా విబూదిధారణ స్ఫురణకు తెస్తుంది. శరీరం అంతా భస్మాన్ని పూసుకునే శివునికి సాన్నిహిత్యం కలదీ విబూది. దీనికి ఔషధ విలువలు కూడా వున్నాయి. అనేక ఆయుర్వేద మందులలో ఉపయోగించే విబూది శరీరంలో అదనపు తేమను గ్రహించి, జలుబు, తలనొప్పిల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

## 129. నమస్కారం

***జ.*** 'నమస్తే' అనే పదం 'నమరి', 'తె' అన్న వాటిని కలపడం ద్వారా వచ్చింది.



'నమరి' అన్నదానికి అర్థం శిరస్సు వంచడం. 'తె' అంటే 'మీకు' అని అర్థం. పదం చిన్నది, అసంవర్తిగా వుండేది ఐనా వినయవిధేయతల చిహ్నావైంది. భారతీయ సంస్కృతిలో పెద్దలను 'నీవు' అని సంబోధించడం తప్పు. అలాగే తల్లిదండ్రులు పిల్లలకు, ఉపాధ్యాయుడు

శిష్యులకు, భర్త భార్యకు శిరస్సు వంచడ మన్నది మహాపరాధంగా భావిస్తారు. నిజానికి ఇద్దరు వ్యక్తులు కలవడమంటే, వారి మనస్సులు కలవడమని అర్థం. 'నమస్తే' అంటూ ఒకరి కొకరు పలుక రించుకోవడమంటే మన మనస్సులు కలవవచ్చు అని సూచించుకోవడమన్న మాట. ఛాతీముందు చేతులు జోడించడం దీన్నే సూచిస్తుంది. తలవంచడమంటే స్నేహాన్ని ప్రేమానురాగాల రూపంలో వినమ్రంగా అందించడం. ఇదే మాదిరి నమస్కరించి 'రాంరాం', 'జై శ్రీకృష్ణ', 'నమోః నారాయణ', 'జై సాయిరాం', వంటి మాటలను కూడా దైవత్వ గుర్తిం పుగా అంటూ ఒకరి నొకరు పలకరించు కోవడం, వీడ్కోలు చెప్పుకోవడం అనేది ఆనవాయితీగా వుంది. 'నమస్తే' అన్న మాటకు ఆధ్యాత్మిక అర్థం జీవనశక్తి, దైవత్వం, ఆత్మ లేదా భగవంతుడు సకల చరాచరాలలో ఒకేవిధం అని చెప్పుకో వడం. పాశ్చాత్య ప్రభావంవల్ల సంక్రమిం చిన హ్యాండ్‌షేక్‌లు మంచివికావు. వీటి ఫలితంగా అంటువ్యాధులు సంక్రమించే ప్రమాదంవుంది. పాశ్చాత్యదేశాలవారు గ్లౌజ్ ధరించి మరీ చేతులు కలుపుతున్నారంటే దాని తీవ్రత ఏపాటిదో మనం అర్థం చేసుకో వచ్చు. ఇతరులతో ఇలా చేతులు కలిపి ఊపడంవల్ల మనలో ప్రోదిచేసుకున్న దైవత్వ బలాన్ని ఇచ్చివేసినట్లే అనేది భారతీయుల కున్న ఒక విశ్వాసం. కాబట్టి హ్యాండ్ షేక్ సరైన ప్రక్రియ కాదని మనం గుర్తించాలి.

## ౨౦౦. కొబ్బరికాయ

**జ.** మనలోని జంతు నైజాన్ని సమర్పిస్తు న్నందుకు గుర్తుగా ప్రాచీన కాలంలో



దేవుళ్ళకు జంతుబలులు ఇచ్చేవారు. ఇది క్రమంగా గతించింది. ఆ తర్వాత కాలంలో జంతుబలులకు బదులు కొబ్బరి కాయకొట్టే ఆచారం మొదలైంది. కాయపై వుండే పీచును తొలగించి కొత్త సంప్రదా యానికి శ్రీకారం చుట్టారు. పెళ్ళిళ్ళు, పండుగలు, కొత్త వాహనాల కొనుగోలు, భవనాలు, బ్రిడ్జిలు లేదా మరే పెద్ద ప్రాజె క్టుల నిర్మాణాలు ఆరంభించినా కొబ్బరి కాయ కొడతాము. భగధారాధన సంద ర్భంగా నీటి కలశంపై కొబ్బరికాయ ఉంచడం సంప్రదాయం. కొబ్బరికాయ మానవుల శిరస్సును పోలి వుంటుంది. కనుక దానిని కొట్టడమంటే మన అహాన్ని బద్దలు కొట్టినట్లు అర్థం.కొబ్బరికాయలోని నీళ్ళు మనలోని అంతర్గత వైఖరులకు, అందులోని తెల్లని కొబ్బరి మన మన స్సుకు ప్రాతినిధ్యం వహిస్తాయి. అంటే వీటన్నింటినీ భగవంతునికి అర్పిస్తున్నా

మన్న మాట. భగవంతుడి స్పర్శతో పవిత్ర మైన మనస్సు ప్రసాదమవుతుంది. కొబ్బరి చెట్టులోని ప్రతి భాగం ఉపయుక్తమ యిందే. అంటే స్వార్థంలేని సేవకు సైతం కొబ్బరికాయ ప్రాతినిధ్యం వహిస్తుంది.


కొబ్బరికాయపై వుండే మూడుకన్నులు శివుడికి ప్రాతినిధ్యాలు. అవి మన కోరి కల్ని తీరుస్తాయి.

## 201. యజ్ఞోపవీతం

**జ.** యజ్ఞ అనే పదం నుంచి వచ్చింది యజ్ఞోపవీతం. దీనిని సాధారణ పరి భాషలో 'జంధ్యం' అంటాం. దారపు పోగు లతో చేసిన జంధ్యాన్ని కొందరు హైందవ పురుషులకు యుక్తవయస్సు రాగానే ధరిం పజేస్తారు. మత సంబంధిత కార్య క్రమంలో గురువు కొన్ని ప్రమాణాలు చేయిస్తూ జంధ్యాన్ని ధరింపజేస్తారు. విద్య వంటి వాటిపై ఏకాగ్రత నిలిపే ప్రమా ణాలు చేయిస్తారు.

## 202. నివేదన


**జ.** మనం ఏ ఆహారం తిన్నా, నీరు తాగినా అది భగవత్ ప్రసాదమే. కాబట్టి వీటిని ముందుగా ఆయనకే సమర్పిం చాలి. ఇది భగవంతునికి కృతజ్ఞత తెలిపే



ప్రక్రియ మాత్రమే కాదు, మంచి లక్షణం కూడా. మనుషులలో రెండు రకాల తత్త్వం గలవారు వుంటారు. దేవుడి పట్ల పెద్దగా విశ్వాసం లేని నాస్తిక భావాలు గలవారు ఒకరు కాగా, ప్రతి విషయం లోనూ భగవంతుడినే నమ్మే ఆస్తికత్వం గలవారు మరొకరు. ఇద్దరి కోరికల్నీ తీర్చేవాడు ఆ భగవంతుడే. వేదాలు, ఉప నిషత్తుల సారాంశాలు గ్రహించి, తనకు లభించిన వాటిని భగవంతునికి, ఇత రులకు అర్పించే వారంటే శ్రీమాన్ నారా యణుడికి వల్లమాలిన ప్రీతి. ఇటువంటి వారికి సంపదల్ని, విజయాల్ని సిద్ధింపజేస్తాడు. భగవంతునికి సమర్పించి, ఆయన ప్రసా దంగా స్వీకరించిన ఆహారానికి దైవత్వం లభిస్తుంది. అలా భగవంతునికి నైవేద్యం సమర్పించడం ఆస్తికుల లక్షణం.

## 203. తులసి పూజ


**జ.** దైవారాధనకు ప్రాధాన్యం ఇచ్చే ప్రతి ఇంటి ఆవరణలోనూ తులసి మొక్క వుంటుంది. ఈ మొక్క హైందవ కుటుం బీకుల ముద్రను ఇట్టే వేస్తుంటుంది. తులశమ్మకు మహిళలు పూజలు చేయడం ద్వారా తమ కుటుంబంలోకి సిరి సంపదల్ని కాంక్షిస్తారు. హనుమంతుడు సీతమ్మ తల్లి కోసం లంకలోకి ప్రవేశించినప్పుడు అక్కడి ఆవరణలో తులసి మొక్కను చూసి ఆ గృహిణి గురించిన అంచనా వేస్తాడు. తులసి మొక్కకు పూజలు చేయడం ఏనాటినుంచోగల ఆచారం. పిల్లల్లేని వారు తులసి వివాహం ఏర్పాటు చేసే



వారు. తులసి ఆకుల్లేకుండా విష్ణుపూజ చేయరు. విష్ణు భగవానుడి నివేదనలో, చరణామృత, పంచామృతాలలో తులసి ఆకులు తప్పనిసరిగా వుండాలి. మరణ శయ్యపై వున్నవారి గొంతులో తులసి తీర్థం పోస్తారు. తులసి మొక్కకు వున్నంతటి మతపరమైన గుర్తింపు, ప్రాధాన్యం మరే ఇతర మొక్కకూ లేదు. ఈ విశ్వాసాల అన్నింటి వెనుకా శాస్త్రీయ కారణాలు వున్నాయి. తులసి దైవత్వం ఆపాదించుకున్న ఔషధమొక్క, కస్తూరి మాదిరి మరణించే మనిషికి జీవనమిచ్చే శక్తిగలది. ఆయుర్వేద పుస్తకాలలో తులసి ప్రస్తావన విస్తృతంగా కనిపిస్తుంది. నీటిలో తులసి ఆకులు మరిగించి జ్వరం, జలుబు, దగ్గు, మలేరియాలతో బాధపడుతున్నప్పుడు తాగితే తక్షణ ఉపశమనం కలుగుతుంది. పంచామృతం, చరణామృతాల్లో తులసి ఆకులు వేస్తే ఎక్కువసేపు పాడవకుండా వుంటాయి. పవిత్రమైన తులసి మొక్కల నుంచి నలుదిక్కులా వీచే గాలులు నాలుగు విధాలుగా జీవితాన్ని సువాసన భరితం చేస్తాయి.

## 204. ధృవ వీక్షణం


**జ.** ఎప్పుడూ ఒకేచోట శాశ్వతంగా నిలిచి వుండే ధృవతారను దర్శించడం ఓ హైందవ సంస్కృతి. వివాహతంతు ముగియగానే వధూవరులు వెళ్ళి ధృవ నక్షత్రాన్ని చూసి, నీళ్ళు పైకి జిమ్మి నమస్కరిస్తారు. వివాహిత స్త్రీలు ఈ నక్షత్రాన్ని చూసి ఆమె భర్తకు దీర్ఘాయుష్షు దీవెన లభిస్తుందని విశ్వసిస్తారు. ఈ నక్షత్రానికున్న సుస్థిర లక్షణం ఆ జంట పరస్పరం వైవాహిక విధులను సక్రమంగా నెరపేందుకు సహకరించగలదని నమ్ముతారు. సప్త ఋషుల ఆశీర్వచనాల ద్వారా ధృవ తార కొత్త జంటపై కటాక్షం చూపుతుందన్నది దీని ఉద్దేశ్యం. ధృవతార ఎలా శాశ్వత స్థానం సముపార్జించుకుందో అదే విధంగా ఆమె భర్త స్థిరంగా, శాశ్వతంగా వుండాలని ఆకాంక్షిస్తారు. ఈ నక్షత్రం ఏ విధంగా స్థిరంగా, నిబద్ధతతో వుందో అలాగే వధూవరులు స్థిరంగా వుంటూ, వైవాహిక జీవితంలోని విధివిధానాల నిర్వహణకు కట్టుబడి వుండాలన్నది



పెద్దల అభిప్రాయం. ఈ నక్షత్ర సందేశం సప్తఋషుల ఆశీర్వచనాలతోపాటు వధూ వరులకూ అందుతుంది.

## ౨౦౫. పూజగది

***జ.*** భూగోళంతో సహా సమస్త బ్రహ్మాం డానికి బ్రహ్మ యజమాని. ఆ విధంగా చూస్తే మన ఇంటి యజమాని ఆయనే.



ప్రతి ఇంట్లో భగవంతుని నిలయమైన ప్రార్థనాగదే ప్రధానగది. అంటే మనం దరం ఆయన ఆస్తిని పంచుకుంటున్నా మన్నమాట. ఈ సూత్రం మనలోని అస్తి త్వాన్ని, ఇది నాదన్న భావాన్ని తగ్గిస్తుంది. చాలామంది భారతీయుల ఇళ్ళల్లో ప్రార్థనా మందిరం వుంటుంది. ఈ గదిలో లేదా మందిరంలో ఉదయం, సాయంత్రం దీపం పెట్టి, పూజ చేస్తారు. పుట్టిన రోజులు, వార్షికోత్సవాలు, పండు గలు వంటి ప్రత్యేక సందర్భాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కుటుంబ సభ్యు లందరూ కలిసి ఈ గదిలో చేరి ప్రార్థనలు చేస్తారు. మనందరికి పడకగది, డ్రాయింగ్ రూమ్‌లు అవసరం. ఈ గదుల్ని మన అభిరుచుల మేరకు అలంకరించు కుంటాం. అలాగే ధ్యానానికి, భక్తి ప్రవృ త్తులకు, ప్రార్థనలకు పవిత్రత, ప్రశాంత వాతావరణాన్ని సృష్టించుకోవాలి. ఇందు కోసం మనకి ఓ పూజగది అవసరం. భగవంతుడే మన ఇంటికి అసలు యజ మాని అని, ఆయనే తన ఇంటి బాగోగు లను చూసుకుంటాడని భావిస్తూ ఇలా పూజగదిని ఏర్పాటు చేసుకోవాలి. అలాగే భగవంతుని రూపం అంతటా వ్యాపించి వుంటుంది. ఈ విషయాన్ని మనకు తెలియజెప్తూ ఆయన మన ఇంట్లో, మన చెంతే వున్నాడని మనసా వాచా భావిం చేందుకు ఈ పూజగదులు వుండాలి. ఆయన కృపలేకుంటే ఏ పనీ విజయ వంతంగా, సులువుగా పూర్తికాదని తెలుసుకోవాలి. ప్రతిరోజూ, ప్రత్యేక సందర్భాలలో మనం పూజగదిలో కూర్చుని ఆయనతో సంభాషించాలి. అప్పుడా పవిత్ర ఆలోచనలు, ధ్వని తరం గాలు ఆ ప్రదేశంలో నిండిపోయి మన మనస్సుల్ని ప్రభావితం చేస్తాయి. ఆధ్యా త్మిక ఆలోచనలు, తరంగాలు ధ్యానం ద్వారా, పూజలు, మంత్రాల ద్వారా మనలో గూడు కట్టుకుంటాయి.


## ౨౦౬. విగ్రహాలనెందుకు పూజిస్తారు?

***జ.*** ఇతర ప్రభావాలను వదులుకుని భగ వంతునిపై పూర్తి ఏకాగ్రతను నిమగ్నం చేయడానికి విగ్రహాలను పూజిస్తాము. స్థిరచిత్తాన్ని ధ్యానం అంటారు. మనస్సు

స్థిరంగా లేనప్పుడు విగ్రహ పూజ అవసరం. మనస్సు నియంత్రణ కోసం విగ్రహారాధనకు మరో ప్రత్యామ్నాయం లేదు. ఇది మనస్సు స్థిరపడడానికి అవసరమయ్యే జ్ఞానాన్ని, స్ఫూర్తిని ఇస్తుంది. ఏకలవ్యుడు ద్రోణాచార్యుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని గురువుగా ఆరాధిస్తూ, అర్జునుడికి మించిన గొప్ప నిపుణుడయిన సంగతిని సదా స్మరణకు తెచ్చుకోవాలి. ఇలా మన ప్రతి ఆచారం వెనుకా ఓ పరమార్థం వుంది. పెద్దవాళ్ళు చేశారు కదా అని విషయాన్ని అవగతం చేసుకోకుండా తరతరాలుగా ఆచారాల్ని యాంత్రికంగా అనుసరిస్తూనే వున్నాము. అయితే ఫలానా పండుగనాడు ఫలానా విధంగా చేయాలి, ఫలానా ప్రసాదాలు చేసుకోవాలని యాంత్రికంగా అనుసరించక పద్ధతిగా, త్రికరణ శుద్ధిగా చేయాలి. ఆచార సంప్రదాయాల వెనుక వున్న సారాంశాన్ని అర్థం చేసుకోవాలి. అప్పుడే ఆయా పండుగలకు, మనదేశ గొప్ప సంస్కృతీ సంప్రదాయాలకి న్యాయం చేసిన వారమవుతాం.

## 207. జైనమతం - చక్రం, స్వస్తిక్, అర్ధచంద్రాకారం


**జ.** జైన తీర్థంకరుల బాటను అనుసరిస్తారు. వారు చక్రం, స్వస్తిక్‌లను అత్యంత పవిత్రమైనవిగా భావిస్తారు. జైన మత స్థాపకుడైన మహావీరుని 2500 వర్ధంతి సందర్భంగా పూజకు ఒక సంకేతం తయారుచేశారు. ఇందులో అర్ధ చంద్రాకారం, మూడు బిందువులు, స్వస్తిక్,



హస్తం, ఆ హస్తం మధ్యలో చక్రం వుంటుంది. చక్రం ధర్మంని సూచిస్తుంది. అందులోని 24 ఆకులు ప్రధాన మానవ గుణాలను సూచిస్తాయి. వీటిలో ప్రధానమైనది స్వస్తిక్. ఇది ధ్యానానికి వాడతారు. అందులోని మూడు బిందువులు జ్ఞాన ధర్మ గుణాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. అర్ధ చంద్రుడు దైవత్వాన్ని, అందులోని మరో బిందువు సిద్ధ భగవానుడు (భగవంతుడు)ని సూచిస్తాయి. ఈ మొత్తం సంకేతం చెప్పేది జైన మార్గం అనుసరిస్తే సర్వులకు మోక్షం లభిస్తుంది.

## 208. సిక్కుమతం ఏక్ ఓంకార్

**జ.** భగవంతుడు ఒక్కడే అనేందుకు సిక్కు మతం వారు వాడే సంకేతం 'ఏక్ ఓంకార్'. భగవంతుని ప్రసన్నం చేసుకునే ఏకైక మార్గం ధర్మబద్ధ జీవనమేనన్నది ఆ సంకేతం అందించే అర్థం. సిక్కుమత బోధనలన్ని సిక్కు గురువులు చెప్పగా నమోదు చేసిన 'గురుగ్రంధ్'లో నిక్షిప్తమై వున్నాయి. మతాలలో ఆలశ్యంగ పుట్టిన మతం సిక్కు మతం. ఆనాటి సామాజిక పరిస్థితులను సరిదిద్దేం



దుకు గురునానక్ చేసిన బోధనలే సిక్కు మతమయ్యాయి. రెండు కత్తులు, ఒకబాకు, ఒక డాలు ఒక ప్రత్యేక పద్ధతిలో ఏర్పాటు చేసిన సంకేతం కూడా సిక్కు మతంలో వుంది. ఆ మతంలో వీరోచితానికి ఆ సంకేతం వాడతారు. సిక్కు మతాన్ని నమ్మే వారు మరెవరి ముందు తలవంచకూడ దని, తమ మత ధర్మ రక్షణకోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధమవ్వాలన్నది ఆ సంకేతం అందించే సందేశం.

## ౨౦౯. ఇస్లామ్ – అర్ధచంద్రాకారం

**జ.** ఎటువంటి విగ్రహాలు, సంకేతాలను పూజించటానికి వ్యతిరేకమని చెప్పే ఇస్లామ్ మతం క్రమంగా కొన్ని సంకేతా లను ఎంచుకుని ఇతర మతాల బాటలోనే నడిచింది. ఖురాన్‌లోని కొన్ని వాక్యాలను అరబిక్‌లో ప్రత్యేక పద్ధతిలో రాసి వాటినే పూజించడం కొందరు చేస్తారు. మరి కొందరు మక్కాలోని కాబా మసీదు, అక్కడి నల్లరాయి తమ మత సంకేతంగా ఇళ్ళలో




పవిత్రంగా పెట్టుకుంటారు. మసీదుల మీద కన్పిస్తుంది అర్ధచంద్రాకార రూపం. చంద్రుడిని పూజించడం అనేది ఒకనాటి బైజాంటియన్ సాంప్రదాయం. వారి మీద విజయం సాధించిన తురు ష్కులు వారి దగ్గరున్న అర్ధచంద్రాకార రూపాన్ని లాక్కొని సొంతంచేసుకుని దానిని తమ విజయ సంకేతంగా ప్రదర్శిం చారు. క్రమంగా ఆ అర్ధ చంద్రాకారం దీని మధ్యలో నక్షత్రం ఇస్లామిక్ చిహ్నా మైంది. చంద్రుడు చల్లగా, ప్రశాంతతను ఇస్తాడు. చీకటిలో వెలుగు చూపుతాడు. భక్తితో ఆ దోవన నడిస్తే అల్లాను చేరతా రన్నది ఆ మతస్థులకు అందించిన సంకేతం.

## ౨౧౦. జుడాయిజమ్ – మెనోరా

**జ.** మెనోరా జుడాయిజమ్ (యూదుల) ఇది ఏడుకొవ్వొత్తులు వెలిగించేందుకు వీలున్న స్టాండ్. దేవుడు ఈ లోకాన్ని ఆరు రోజుల్లో సృష్టించి ఏడవ రోజున విశ్రాంతి తీసుకున్నాడట. ఆ ఏడో రోజును 'సబ్బద్' అని విశ్రాంతికి కేటాయించారు.



ఐతే నవీన యూదు మతంలో ఆరు కోణాల నక్షత్రంకి ప్రాముఖ్యత పెరిగింది. అది డేవిడ్ నక్షత్రం (మగేన్ డేవిడ్ అంటారు) అదే ఇప్పుడు యూదుల (ఇజ్రే యల్) జాతీయ పతాకంలో స్థానం సంపా దించుకుంది. యూదుల ఇంటి తలుపు మీద తప్పనిసరిగా 'మీజువా' అనే చిహ్నం వుంటుంది. ఈ చిహ్నం భగవంతుడు మోసెస్‌కి అందించిన 'టెన్ కమాండ్ మెంట్స్'కి ప్రతీక. వెండి లేదా కలపతో చేసిన ఈ చిహ్నం భగవంతుడు ఒక్కడే అని బోధిస్తుంది.

## 211. క్రైస్తవం - శిలువ

***జ.*** క్రైస్తవంలో అతిపాత సంకేతం శిలువ. క్రైస్తవంలో భిన్న వర్గాలున్నా అన్ని వర్గాలు అంగీకరించిన సంకేతం శిలువ. మాన వాళి కోసం క్రీస్తు చేసిన త్యాగానికి ప్రతీక శిలువ. ప్రేమ తత్వానికి చిహ్నం శిలువ అంటారు. శిలువ మీద నగిషీలు పలు రకాలుగా వుండవచ్చు కాని రూపం మాత్రం ఒక్కటే. మనుషులను శిలువ వేయడమనే ఆటవిక విధానం రోమన్



సామ్రాజ్యంలో వుండేది. తమ పాలనకు ఎదురు తిరిగినవారిని శిలువ వేసేవారు. ఇది ఉరి తీయడంతో సమానం. శిలువ వేయడం బహిరంగ ప్రదేశంలో జరిగేది. బైబిల్ గాథల ప్రకారం క్రీస్తును మరో ఇద్దరు నేరస్తులతోపాటు శిలువ వేశారు. మనుషులను అవమానించి, హింసపెట్టి చంపేందుకు వాడిన ఆ శిలువ ప్రేమ, గౌరవాలకు ప్రతీకగా క్రీస్తుజీవితం మార్చింది. వారిని క్షమించండి... వారి తప్పులు వారికి తెలీవు అన్నది క్రీస్తు చివరి మాటగా శిలువనుండి వెలువడిందని నమ్ముతారు.

## 212. జోరాష్ట్రియన్ పార్శీ మతం - పవిత్ర అగ్ని

***జ.*** పార్శీలంటూ మనం పిలిచేవారి మతం జోరాష్ట్రియానిజమ్. ఒకప్పుడు పర్షియాలో విలసిల్లిన మతం. ఆ పర్షియ నేడు ఇరాన్. అక్కడ ఇస్లామ్ పుట్టి ఇతర మతాలను పారద్రోలింది. ముస్లిమ్‌లు దాడులు తట్టుకోలేక మతం మార్చుకున్న వారు మార్చుకోగా తమ మతం తాము కాపాడుకోవాలనుకున్నవారు తమ మత

చిహ్నాలను వెంటతీసుకుని హిందూదేశం పారిపోయి వచ్చారు. పార్శీలు అగ్ని ఆరాధకులు. ఆ పవిత్రమైన అగ్ని వెలిగే పాత్ర వీరి పవిత్ర సంకేతం. దీనిని వీరు 'అరార్ బెహ్రామ్' అంటారు. అది వారి దేవాలయాలలో నిత్యం వెలుగుతుంది. ఈ అగ్నిలో వచ్చే విభూతిని పార్శీలు నుదుటికి రాసుకుంటారు. దేవునికి సమర్పించిన చందనం ఎంతో పవిత్రంగా ధరిస్తారు.

## 213. వేద ఉపాంగాలు అంటే ఏమిటి?

**జ.** వేద సంస్కృతిని చక్కగా తెలుసుకోవాలంటే ఉపయోగపడేవి వేద ఉపాంగాలు. ఇవి ఆరు తత్త్వ శాస్త్ర గ్రంథాలన్న మాట. వీటినే షడ్దర్శనాలంటారు. అవి: 1) న్యాయం, 2) వైశేషికం, 3) సాంఖ్యం, 4) యోగం, 5) పర్వమీమాంస, 6) ఉత్తర మీమాంస. వీటినే వైదిక దర్శనాలంటారు. వేదం యొక్క గొప్పతనాన్ని అంగీక రించేవే ఈ దర్శనాలు.



## 214. పశ్చాత్తాపం అన్నది మానవుని మనో గతాన్ని ప్రక్షాళన చేయగలదా?

**జ.** అందుకు సందేహమా! సర్వపాపాలకూ పశ్చాత్తాపమే ప్రక్షాళణాగ్ని.

## 215. తెల్లవారకుండా స్నానం చేసి, మడిగట్టుకుని ఆ దైవం ముందు కూర్చున్నది మొదలు కొని పిల్లలను తిట్టుకుంటూ, కూతుళ్ళని, కోడళ్ళని నసుగుతూ నోములూ, వ్రతాలు చేస్తే అవి సత్ఫలితాలని ఇస్తాయా?



**జ.** స్నానాలూ, పట్టుబట్టలూ బాహ్యశుద్ధికి అవసరమే కాని పూజా సమయంలోనే కాదు నిరంతరం మనస్సును నిర్మలంగా వుంచుకుని, వాక్కును మంచిగా వుంచుకోకపోతే ఎలాంటి ఫలమూ వుండదు. తిట్లూ, శాపనార్థాలూ పెట్టే నోటితో ఎన్ని స్తోత్రాలు చదివినా ఫలించవు. ఓరిమి లేనివాడు నోములెన్ని నోచినా పిండి వంటలు తినడానికే తప్ప ప్రయోజనం లభించదు.

## 216. ప్రాచీనకాలపు గాంధర్వ, రాక్షస వివాహాలకూ నేటి ప్రేమ వివాహాలకూ పోలిక?

**జ.** గాంధర్వ వివాహంలో వధూ వరులు తొలిచూపులోనే ఆకర్షణకులోనై ఇతరుల ప్రమేయం లేకుండా పాణిగ్రహణం చేసు




కొని సంసార యాత్రకు ఉపక్రమిస్తారు. రాక్షస వివాహ సమయంలో ఒకరిని గురించి ఒకరువిని ఆ గుణగణాలకు ఆకర్షితులై బంధువుల అభిమానానికి విరుద్ధంగా వరుడు వధువును అపహరించి వివాహం చేసుకుంటాడు. గాంధర్వానికి శకుంతల, రాక్షసానికి రుక్మిణి మనకు బాగా తెలిసినవారు. గాంధర్వానికి ఇష్టపడిన శకుంతల ఎన్ని పాట్లుపడినా తన భర్తను నిలబెట్టి తన పత్నిత్వాన్ని భద్రం చేసుకోగలిగింది. రుక్మిణీ కృష్ణుల విషయం లోకవిదితమే. అయితే ఈనాటి ప్రేమ వివాహాలు గాంధర్వం వంటివే కాని ఎంత వరకూ ఫలప్రదాలౌతున్నాయో చూడాలిగా.

## 217. శక్తిపూజలోని మర్మం

**జ.** "సృష్టికి మూలం స్త్రీ, పురుష జననేంద్రియాలు. అవే పానవట్టము. శివలింగము. స్థితికి సూర్యుడే రుద్రుడు. స్తన్యమిచ్చి పోషించే శక్తి లక్ష్మి. లయానికి మూలం ఆకాశం. అదే సదాశివుడు. కాలమతని శక్తి. నేను వాటిని నాలో లయం చేస్తున్నాను.

నా పూజలను మద్య, మత్స్య, మాంస, ముద్రా మైధున భావాలతో చేయాలి. అంటే మీకూ, ప్రపంచానికీగల సంఘర్షణ వలన పుట్టిన ఆవేశ, ఉద్రేకాలను శాంతింప జేసుకోవడమే మద్యభావం. మత్స్యం నీటిలో హాయిగా తిరుగుతుంది. నన్ననడానికి వీరెవరు? అని అహం కరించకుండా – ఎవరు ఎలా అనుకున్నా ప్రాణాన్ని హాయిగా స్వేచ్ఛననుభవించ



నియ్యాలి. ఇది మత్స్యభావం. నాలుకతో అంగుటిని తాకుతూ మాంస ఖండాన్ని చప్పరించడం మాంసభక్షణం. ఖేచరి, ముద్ర, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాల్లో మంచి వాటినెన్నుకొని, శృంగార, వీర, రౌద్ర, భయానక, బీభత్స, జుగుప్స, హాస్య, అద్భుత రసాలన్నింటినీ శాంతంగా అనుభవించడం మైధునభావం.

ఇప్పుడు చెప్పినవన్నీ సాత్వికంగా పూజ చేసేవారు కూడా ఆచరించాలి. సుహాసిని, కాళి, సకల స్వరూపిణి అయిన నన్ను ఆవాహన చేయించుకోవాలి. సజ్జ

నులచేత సాత్వికమైన ఈ భావాలతో పూజింపబడటం ఒక మహాభాగ్యం. ఎక్కడ స్త్రీలు సాత్వికంగా పూజింపబడతారో అక్కడ దేవతలందరూ ఆశీర్వదిస్తారు. స్త్రీ మాటను జవదాటకుండా ఆమెను పూజించేవారిని చిన్న చూపు చూడరాదు. ఎందుచేతనంటే అందరినీ తనవారుగా చూడగలగడం, తన ఆలోచనలోని నిరాశ, అవమానం, భయం, లజ్జ, జుగుప్స, కులం, జాతి, శీలం అనే పాశాల్ని తెగనరికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించడమే మోక్షం. దేవిని పూజించేవారందరూ మోక్షార్హులే. ఇది బ్రహ్మ విష్ణు రుద్రాత్మకుడైన దత్త గురువుల పద్ధతి. నా పద్ధతి కూడా గురుపాదాలే మోక్షానికి దారి.ఇక్కడ గురువులు మీకసలైన పద్ధతులను ఉపదేశిస్తారు. భయం అనుమానం లేకుండా వాటిని ఆచరించండి. ముక్తికాంతనైన నన్ను వరించండి. ప్రాణాన్ని దుఃఖంతో, అహంకార మమకారాలతో కుంచింప జేయకుండా ఆనందంగా, స్వేచ్ఛగా, మీకు ఇచ్చవచ్చినట్లుగా జీవించండి. ఆ హక్కు మీకు ఉంది. ఇక్కడ సుఖం, ఐశ్వర్యం, జ్ఞానం మీదిగా భావిస్తూ అందరూ ప్రేమానురాగాలతో జీవించడం నేర్చుకోండి.

నూతన యుగ నిర్మాణానికి కలిసి ప్రయత్నించండి. మీకు నేను అండగా మిమ్ములను అంటే వుంటాను, సదా రక్షిస్తుంటాను" అంటుంది కామాక్షీదేవి. ఇవన్నీ కామాక్షీదేవి గురుపీఠం వద్ద రాసి వున్న విషయాలు.

## 218. ఉగాదిరోజు వేప, బెల్లం ఎందుకు తినాలి?

**జ.** తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ రోజు వేప, బెల్లం తినాలని శాస్త్రాలు చెబుతున్నాయి.



శతాయుష్యం వజ్రదేహం దదాత్యర్థం శుభాని చ
సర్వారిష్ట వినాశంచ నింబ కందళ భక్షణమ్॥

అనగా వేప, బెల్లం తినడంవల్ల మనిషి శరీరం వజ్రంలా మారుతుంది. సమస్త సంపదలు సమకూరుతాయి. సర్వారిష్టాలు తొలగిపోతాయి. చాంద్రమాన ఉగాది చైత్రమాసం నుండి ప్రారంభమవుతుంది. అంటే సూర్యుడు మీన లేక మేష రాశియందు వున్నప్పుడు ఈ కాలంలో ఉష్ణోగ్రత ఎక్కువై సూర్యుని వేడిమి రోజు రోజుకు పెరుగుతుంది. సూర్యుడు భరణి నక్షత్రం 3వ పాదంలోకి ప్రవేశించగానే ఎండలు అగ్నిజ్వాలల్లా అనిపిస్తాయి. అంటే ఈ కాలంలో సూర్యుని తేజస్సు అత్యంత తీక్షణమవుతుంది. దాంతో మానవ శరీరంలో ఉష్ణసంబంధమైన

ఇబ్బందులు మొదలవుతాయి. ఆటలమ్మ, మశూచి, పెద్దమ్మవారు మొదలైనటు వంటివే గాకుండా, కాలేయ బాధలు కూడా మొదలవుతాయి. ఇటువంటి సమస్యలు, వ్యాధులు రాకుండా ముందుగానే వాటిని నివారించు ఉద్దేశ్యంతోనే వేసవి ఆరంభానికి ముందే ఆ ఇబ్బందులను ఎదుర్కొనేందుకు రామబాణం వంటి వేప, బెల్లం సేవించాలి.

## 219. వరకట్నాలు పురాణాలలో వున్నాయా?

**జ.** చదువు కొనుక్కోవడం ప్రారంభం అయ్యాక ఆ పెట్టుబడిని చక్రవడ్డీలతో రాబట్టే అధ్వాన్నపు దశ ఇప్పుడు ఏర్పడింది. పురాణకాలం నుంచి రెండు మూడు దశాబ్దాల క్రితం వరకు వరుడు, వధువుని అన్వేషించుకుంటూ పోయేవాడే కాని ఆడపిల్లను కన్న తండ్రి వరుడి కోసం చెప్పుల రిగేలా తిరిగి వేలం పాడే రోజులు ఆనాడు లేవు. వివాహమంత్రాలు పరిశీలిస్తే నేటికీ కన్యావరణం విన్పిస్తూనే వుంటుంది. చెయ్యి జాపి యాచించేవాడు వరుడు,




ఇప్పుడాలోచించండి ఈనాటి విద్య మన కెన్ని దుష్ట సంప్రదాయాలు నేర్పి, సమాజ వ్యవస్థను ధ్వంసం చేస్తున్నదో. ముందు తరాల యువకులైనా ఈ వేలం పాటల నుంచి విముక్తు లౌతారని ఆశిద్దాం.

## 220. అశోకవృక్షం కింద వున్న సీత విభూతి ధరించిందని మొల్ల రామాయణంలో...?

**జ.** త్రేతాయుగం నాటికి అడ్డబొట్లు, నిలువు బొట్లు, చుక్కబొట్లు కలవారు తలలు బద్దలు గొట్టుకున్నట్లు కనిపించదు. ఇవన్నీ దేశంలో ఉన్మాదం ప్రబలి పైశాచిక ప్రకృతి విలయ తాండవం చేసిన రోజులలో పుట్టినవి. అయితే మనకిష్టమైన రీతిలో మన దైవాన్ని అలంకరించడం, ప్రసాదాలు ఆరగింపు పెట్టడం భక్తికి చిహ్నాలు. శివదీక్షలో ఉన్న మొల్ల సీతాదేవికి కూడా భస్మంపెట్టి తన భక్తిని ప్రకటించుకొన్నదే కాని ఇది వాల్మీకం కాదు.

## 221. ఈ జీవితం ఎందుకు? ఈ భూమి మీద జీవులెందుకు సృష్టించబడ్డాయి.?

**జ.** జీవితానికి, సృష్టికి సంబంధించి ఎందుకు, ఎలా అని ఎప్పుడూ ప్రశ్నించకండి. మీరు ఆ ప్రశ్నలు అడిగితే అందుకు తగిన సమాధానం ఎవరి దగ్గరా లేదు. కాబట్టి నేను ఒక కథ చెపుతాను. నేను చెప్పే సుందరమైన కథ విన్న తర్వాత నువ్వు చేయగలిగింది దానిని నమ్మడం, నమ్మలేకపోవడం. మీరు వేసిన ఆ సమా



ధానం లేని ప్రశ్నలు మీకు మేలు చేసేది ఏమీ లేదు. అందుకే సృష్టికి, జీవులకు, మానవ జీవితానికి సంబంధించిన ప్రశ్నలు వేయకండి. మీ జీవితంలో మీకు ఎదురయ్యే కొన్ని అనుభవాలు మీకా ప్రశ్నలను తెస్తాయి. ఆ ప్రశ్నలను అధిగమించడం ఎలాఅంటే మళ్లీ ఏదో ఒకకథ చెప్పాల్సి వస్తుంది. ఆ కథలు వినడానికి బాగానే వుంటాయి. కాని అవి వాస్తవం కాదు కాబట్టి నీకు సరైన సమాధానం ఇవ్వవు.

## 222 దీపారాధన ఎలా చెయ్యాలి?

***జ.*** దీపంలో దేవతలున్నారు, వేదాలు ఉన్నాయి, శాంతి వుంది, కాంతి వుంది. ఇంతటి విశిష్ట దీపాన్ని ఓ పద్ధతిగా, నిష్టగా వెలిగించాలి. దీపారాధనకు ఉద్దేశించిన దీపాల నుంచి నేరుగా అగరువత్తులు, ఏకహారతి, కర్పూర హారతులు వెలిగించకూడదు. అగ్గిపుల్ల ద్వారా నేరుగా కుందులలోని దీపాన్ని వెలిగించకూడదు. మరొక




దీపం ద్వారా లేదా ఏకహారతి ద్వారా ప్రత్యేకంగా ముందుగా వెలిగించి పెట్టుకున్న దీపం నుంచి దీపారాధన చేయాలి.

***ఐదువత్తులు :*** దీపారాధన కుందిలో అయిదు వత్తులువేసి గృహిణి తానే స్వయంగా వెలిగించాలి. మొదటి వత్తి భర్త, సంతానం సంక్షేమం కోసమని, రెండో వత్తి అత్తమామల క్షేమానికి, మూడోది అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళ క్షేమానికి, నాల్గవది గౌరవ, ధర్మ వృద్ధులకూ, అయిదోది వంశాభివృద్ధికి అని చెప్తారు. దీపారాధన ఎవరు చేసినా రెండు వత్తులు తప్పనిసరిగా వుండాలి.

***ఏ నూనె మంచిది :*** ఓ పక్క ఆవునేతితో, మరోపక్క నువ్వుల నూనెతో దీపారాధన చేయడం శ్రేష్ఠం. ఆవు నెయ్యిలో సూర్యశక్తి నిండి వుంటుంది. దీనివల్ల ఆరోగ్య, ఐశ్వర్య, సుఖ సంతోషాలు ప్రాప్తిస్తాయి. ఆవునెయ్యిలో నువ్వుల నూనె, వేపనూనె కలిపి దీపారాధన చేస్తే విశేష ఫలితాలు కలుగుతాయి. వేపనూనెలో రెండు చుక్కలు ఆవునెయ్యి కలిపి పరమ శివుని ముందు వెలిగిస్తే విజయం ప్రాప్తిస్తుంది.

## 223. కృష్ణుడికి దేవకీదేవి అంటే ఇష్టమా? యశోద అంటే ఇష్టమా?



**జ.** ఆయన జగన్నాటక సూత్రధారి. ఆయనకు ఎవరిమీదా ఇష్టం లేదు. ఆయన మీదనే ఆయనకు ప్రీతి. ఆయనలోనే యశోద, దేవకీ, గోపికలు, మీరు, నేను, అంతా వున్నాం అని తెలిసినవాడు, తెలీకపోతే మనలానే తాపత్రయపడేవాడు.

## 224. దేవుని సన్నిధిలో వుంటే మోక్షం వస్తుందా?

**జ.** దైవ సాన్నిధ్యమే మోక్షం. ఈ దైవం మీ గ్రామంలోని ఆలయంలో, వేపచెట్టు కింద రాతిలో వున్నది కాదు. మీ మనసు లోపల రాగద్వేషాల పొరలకు ఏ మాత్రం సంబంధం లేకుండా వెలుగుతున్న జ్యోతి. అక్కడ నిలపండి మీ మనసుని.

## 225. సంగీతం రోగాలను నివారిస్తుందా?

**జ.** నివారించిందని విదేశాల వారు వక్కాణిస్తున్నారు. అయితే ఈనాడు వినిపించే శునక, జంబూక, వ్యాఘ్ర గర్జన సంగీతం వింటే నరాలు నలిగి రోగాలు పెరుగుతాయని కూడా అమెరికా దేశపు పరిశోధకులు చెపుతున్నారు.

## 226. రక్షాబంధనం - రాఖీ ఒకటేనా

**జ.** వివాహం మొదలైన శుభకార్యాల్లో వివాహం చేసుకోదలిచిన వధూవరులకీ – అటు ఇటు వైపున్న తల్లిదండ్రులకీ 'రక్షాబంధన' మనే పేరిట ఇలాగే చేతులకి కడతారు గదా! దానికీ దీనికీ భేదమేమిటి? ఒకటే కదా! అన్పిస్తుంది మనకి సహజంగానే. అయితే అదీ ఇదీ ఒకటి కాదు. రక్షాబంధనమనే పైతాడుని మణి కట్టుకి ముడివేయించు కోవడం జరిగాక – 'ఇక కార్యక్రమం అయింది వెళ్లవ'చ్చని ప్రకటించేంతవరకూ ఆ రక్షని ముడి వేయించుకున్న వాళ్ళు ఎటూ వెళ్లనే కూడదు. ఇది యధార్థం కాబట్టే ఎప్పు డెప్పుడు శుభకార్యాలు జరిగితే అప్పు డప్పుడు రక్షాబంధనాన్ని చేయిస్తూ ఉంటారు. ఇక రాఖీ పూర్ణిమనాడు కట్టే రాఖీ అటువంటిది కాదు. సంవత్సరంలో ఒకే ఒక్కసారి కట్టబడే ఈ సూత్రం సంవత్సరకాలంపాటు రక్షణ ధైర్యాన్ని కలుగ జేస్తుంది సదరు వ్యక్తికి. నిజమైన – హృదయపూర్వకమైన దృష్టితో రక్షాబంధనాన్ని చేసిన పక్షంలో ఆ రక్ష(ణ) కారణంగా 'పీటలమీద పెళ్లి ఆగిపోవడం' వంటి వార్తలని విననేవినం. అలాంటి పరిస్థితే, రాబోయే సూచన కన్పిస్తోందనగానే శ్రీహరి పేరిటి

సూక్తాన్ని (పురుష సూక్తాన్ని) చదువుతూ ఆ మీదట కట్టబోయే రక్షకి తిరిగి పూజ చేసి వరునిచేత కట్టిస్తే ఆ దురదృష్టకర స్థితి తొలగిపోతుంది.



ఏ బ్రహ్మ విష్ణుమహేశ్వరులనే ముగ్గురి లోనూ శ్రీహరి 'రక్ష' (స్థితి అనే కార్యాన్ని) చేస్తున్నాడో, అలాటి (శ్రీహరికి జన్మ నక్షత్ర మైన శ్రవణం, చంద్ర) వ్యక్తి బాగా ఉన్న పూర్ణిమ, సూర్యశక్తి ఎక్కువగా ఉండే మధ్యాహ్నకాలంలో రక్షికా పూర్ణిమని కట్టేది ఆ శ్రీహరి రక్షణ ఈ వ్యక్తికి లభిం చాలనే ఉద్దేశ్యంతోనే. శ్రావణ పూర్ణిమ నాడు పొరపాటున గాని బహుళ పాడ్యమి గాని ఉంటే, 'ఆ రోజు రక్ష కట్టరా'దని కూడా బ్రహ్మవైవర్త పురాణం చెప్తోంది. 'నందాయా దర్శనే రక్షా బలిదానం దశాసు చ । భద్రాయాం గోకుల క్రీడా దేశనాశాయ జాయతే ॥ కట్టేటప్పుడు ఏం చేయాలి. ఏదో ఒక తాడుని అలా కట్టేసి వెళ్ళిపోవడం వంటిది కాదు కాబట్టే ఈ సూత్రాన్ని కట్టేప్పుడు ఓ శ్లోకాన్ని – ఈ సూత్రానికున్న పవిత్రతని తెలియజేస్తూ చదవాలి.

**యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబలః ।**
**తేన త్వామపి బధ్నామి రక్షే! మా చల! మాచల !!**

ఒకప్పుడు 'బలి' అనే రాక్షసరాజు తన సైన్యంతో దేవతలనందరినీ జయించి ఆ దేవతా భూముల్ని కూడా తన భూము లతో కలుపుకుని మొత్తం భూమికి అధి పతిగా అయి 'బలి చక్రవర్తి' అనిపించు కున్నాడు.

దేవతలెవరికీ నిలువనీడలేని పరిస్థితి దాదాపు వచ్చిన సందర్భంలో దేవతలంతా శ్రీహరిని ప్రార్థిస్తే ఆయన వామనావ తారాన్నెత్తి బలిని మూడడుగుల నేలని అడిగి త్రివిక్రమునిగా భూమ్యా కాశాలని ఆక్రమించి మూడో అడుగుని బలిచక్రవర్తి తలమీద పెట్టి కింది లోకానికి పంపించి వేశాడు. దాంతో దేవతలకి వాళ్ల భూము లన్నీ తిరిగి లభించాయి. ఈ సందర్భానికి తగిన శ్లోకమే పైది.

'ఏ రాక్షసరాజైన బలిచక్రవర్తి శ్రీహరి చేత బంధింప బడినవాడై – బలి చక్రవర్తి చిరకాల వాంఛ అయిన శ్రీహరి రక్షణని పొందాడో అలాగే ఓ రక్షికా (రాకీ) సూత్రమా! నువ్వు కూడా నాకు ముఖ్యు డైన వ్యక్తిచేత నన్ను ముడివేసి కట్టుతున్న దానివై ఆ వ్యక్తి రక్షణని నాకు కల్గిస్తూ ఉండు! ఎప్పుడూ సడలనీయకు బంధ నాన్ని' అని శ్లోకార్థం.

కాబట్టి రాఖీ సూత్రం రక్షణకి మూల సూత్రమన్నమాట.

## 227. దుర్యోధనుని ఉప్పు తినడంవల్ల పాండవులు సోదరులని తెలిసినా యుద్ధంలో దిగాడు కర్ణుడు. రాముని చేరి అన్నగారి చావుకు కారణమయ్యాడు విభీషణుడు. ఈ ఇద్దరిలో ఎవరి దారి మంచిది?

**జ.** రక్త సంబంధం ఎంతగా వున్నా, ఒకే తల్లి కడుపున పుట్టినా, అన్నదమ్ములైనా ధర్మాన్ని విడిచి లోక కంటకంగా తయార వుతూ, వంశ నాశనానికి దిగిన పాపా చారుల నుండి సామాన్యులకు సుఖ శాంతులు కలిగించడం మంచిదో లేక ఆ దుర్మార్గుల తిండితింటూ వారికోసం తన జీవితాన్ని బలి ఇవ్వడం మంచిదో ఆలోచించుకోవడానికే రామాయణ భార తాలలో విభీషణ, కర్ణుల ప్రవర్తనను చూడాలి. మంచి చెడులనేవి అన్ని కాలా లలో అందరికీ ఒకే విధంగా వుండవు. ఆనాడే కాదు, ఈనాడైనా అధికారంలో వున్నవారికీ, వారి పాదాల కిందపడి నలు గుతున్న వారికీ వుండే తేడా చూస్తూ విభీ షణునివలె తిరగబడలేక కర్ణునివలె బలి అవుతున్నవారికి భారత, రామాయణాలు వంట బట్టించాలి.

## 228. కృష్ణుడు కుచేలుని పాదాలు కడిగాడా?

**జ.** కడగడమే కాదు, కడిగి నీళ్ళు నెత్తిన జల్లుకుని తన పక్కనే కూర్చోబెట్టుకున్నా డని భాగవతం ఘంటాపథంగా చెప్పింది. అంటే భగవంతుడు దరిద్రుల పాలిటి నారాయణుడు కాని, ఆగర్భ శ్రీమంతుల అనుగ్రహం కోసం ఆరాటపడేవాడు కాదు అని అర్థం.

## 229. 'విద్యయొసగును వినయము' అనేసూక్తి ఈనాడు పనికివస్తుందా?

**జ.** ఈనాడు దేశంలో విద్యావంతులు లేరు. చదువును కొనుక్కుంటున్న అక్షరాస్యులే వున్నారు. అక్షరాలు దిద్దించి, అల్లరి చెయ్య



కుండా బిస్కట్లు పెట్టి నిద్రపోగొట్టే కాన్వెం టులో వేలుపోసి పిల్లలకు అవినీతి, అక్రమం అంటే భయంలేని చదువు కొనిపెడుతు న్నాం. వారికి వినయం అనే మాట తెలీదు.

## 230. పంచమాతలు

**జ.** పుట్టిన ప్రతి వ్యక్తీ తన జీవితమునకొక అర్థమూ, పరమార్థమూ లభింప జేసినం దుకు ఐదుగురు మాతృదేవతలకు ఋణ పడి వుండును.

మొదటిది దేహమాత, అనగా కన్న తల్లి, రెండవది గోమాత, పాలిచ్చు గోవు మరియు భూమి దున్ను ఎద్దు, మూడవది భూమాత, తినడానికి తిండి వుండటానికి చోటు ఇచ్చి రక్షించిన తల్లి, నాలుగవది దేశమాత, సంస్కారం, సంప్రదాయం జీవితమునకొక లక్ష్యం అందించిన తల్లి, అయిదవది వేదమాత, ఆధ్యాత్మిక జ్ఞాననిధి.

జన్మ ఇచ్చి మిగిలిన మాతృదేవతలతో సంబంధము కలిగించిన దేహమాత అత్యంత పూజ్యురాలు.

## 231. సత్యధర్మ వ్రతం

***జ.*** మానవ దేహంలో ద్వాదశ రాశులు వున్నాయని చాలామందికి తెలియదు. శిరస్సు మేషం, ముఖం వృషభం, వక్ష స్థలం మిథునం, హృదయం కర్కాటకం, ఉదరం సింహం, కటిభాగం కన్య, పొత్తి కడుపు తుల, మర్మస్థానం వృశ్చికం, తొడలు ధనుస్సు, జానువులు మకరం, జంఘలు కుంభం, పాదములు మీనం.

రాశి చక్రాల్లో గ్రహాలు సంచరిస్తూ వుంటాయి. అందుచేత ఈ రాశులకు మహా మంత్రాలు కూడా వున్నాయి.

***మేషరాశికి :*** ఓం హ్రీం శ్రీం లక్ష్మీ నారాయణాయ నమః

***వృషభరాశికి :*** ఓం గోపాలాయ ఉత్తర ధ్వజాయనమః

***మిథున రాశికి :*** ఓం క్లీం కృష్ణాయ నమః

***కర్కాటక రాశికి :*** ఓం క్లీం హిరణ్య గర్భాయ అవ్యక్త రూపిణే నమః



***సింహరాశికి :*** ఓం క్లీం బ్రహ్మణే జగదాధారాయ నమః

***కన్యారాశికి :*** ఓం నమో ప్రీం పీతాంబరాయ నమః

***తులారాశికి :*** ఓం తత్వ నిరంజనాయ తారకారామాయ నమః

***వృశ్చికరాశికి :*** ఓం నారాయణాయ నరసింహాయ నమః

***ధనూరాశికి :*** ఓం శ్రీం దేవకృష్ణాయ ఊర్ధ్వదంతాయ నమః

***మకరరాశికి :*** ఓం శ్రీవత్సలాయ నమః

***కుంభరాశికి :*** ఓం శ్రీం ఉపేంద్రాయ అచ్యుతాయ నమః

***మీనరాశికి :*** ఓం క్లీం ఉద్ధృతాయ ఉద్ధారిణే నమః

రాశుల ననుసరించి పై మహా మంత్రాల్ని జపిస్తే మానవుడు చాలా భాగం మాయ నుండి బయట పడతాడు.

సృష్టి స్థితి లయాలకు మాయ స్థానం. దీనికి లోబడే జగత్తు కాలభ్రమణ మవుతోంది. మయుడు మాయమే సూత్రధారి. అదే విష్ణుమాయ. త్రిమూర్తులు కూడా మాయబద్ధులే. మానవుడు జాగ్రత్తగా

వుంటూ, ధార్మిక నియమాలు పాటిస్తూ వుంటే, సర్వశుభాలు సమకూరుటయే గాక, మరొక జన్మలేని పరపదాన్ని చేర తాడు. లోకకళ్యాణం కోసం మానవుడు ఏ కార్యం ఆచరిస్తాడో అదే సత్యం. అదే ధర్మం. ఎవరైతే పుష్కరకాలం అనగా ఓ పన్నెండు సంవత్సరాలు సత్యధర్మాన్ని పాటిస్తారో వాళ్ళేం పలికినా, వాళ్ళేం చేసినా, వాళ్ళు ఏ కార్యం తలపెట్టినా వెంటనే ఆ పనులు జరుగుతాయి. సత్య ధర్మ వ్రతం గొప్పదనం అంతటి దన్నమాట.

## 232. త్రినేత్ర - సర్వశక్తి

***జ.*** హిందువులు పేర్కొనే త్రినేత్రం, ముక్కంటి అనేవి పాశ్చాత్యులకు ఎంత ఆలోచించినా అంతుపట్టని అంశం. శివుడిని ముక్కంటిగా కొలుస్తారు. దుర్గా దేవికి మూడో కన్ను వర్ణిస్తారు. నుదుటి మధ్యలో వున్న ఆ మూడో కన్ను తెరిస్తే ప్రళయమొస్తుందనేది హిందువుల ప్రగాఢ విశ్వాసం. మనిషిలోని శక్తిని, ఆధ్యాత్మి కతను వెలుపలికి తీసుకురావాలంటే ఆ



మూడోకంటితో చూడాలంటారు. మూడో కన్నును విధ్వంసానికి ప్రతీకగా వర్ణించినా మూడోకన్ను వాస్తవానికి ఆత్మ జ్ఞానానికి సంబంధించినది. ఆత్మ శోధ నకు, స్వచ్ఛతకు, నిజాయితీకి మూడో కంట చూపు దోహదపడ్తుంది.

కాని దీన్ని గుర్తించి వినియోగించే వారే తక్కువ. వీబూది నుదుటిన రాసు కుని దానిమధ్యలో గంధం లేదా కుంకుమ బొట్టును పెట్టుకోవడమే త్రినేత్ర సంకేతం.

## 233. అష్టమూలికాతైలం దీపారాధనకు పనికివస్తుందా? ఇది శాస్త్ర సమ్మతమేనా?

***జ.*** అసలు వాతావరణ కాలుష్యాన్ని పోగొట్టడానికే దీపారాధన. ఆవునేతి దీపం వెలిగిస్తే ఒక ప్రయోజనం, ఆము దపు దీపం వలన మరో ప్రయోజనం, నూనె దీపం వలన ఒక ప్రయోజనం కలుగుతాయి. ఇలా ప్రతీ నూనెతో ఒక ప్రత్యేకమైన ప్రయోజనము కలుగుతుంది.

అదే విధంగా ఎనిమిది రకాల మూలి కల ద్వారా తీసిన నూనెతో దీపం వెలిగిస్తే కూడా వాతావరణంలో వ్యాపించిన రోగ కారక క్రిములను దూరంగా తరిమి వేసే శక్తి ఆ దీపానికి ఉంటుందనడంలో ఎలాంటి సందేహం అక్కరలేదు. ధూప, దీపాదులతో చేసే పూజ పుణ్యప్రదమే గాక ఆరోగ్యప్రదం కూడా అని గ్రహించాలి. అందుకే పాపమంటే రోగం, పుణ్యమంటే ఆరోగ్యం అని అర్థం చేసుకోవాలి.

## 234. ఇంట్లో ఎవరైనా చనిపోతే ఏడాదివరకు దేవుడిని పూజించరాదని కొందరంటున్నారు, పూజించవచ్చునని కొందరంటున్నారు. ఏది నిజం.?

**జ.** నిత్యం చేసే పూజాదులను ఆపనక్కర లేదు. జరపవలసినదే. ప్రత్యేకంగా ఏదో నిమిత్తంతో జరిపే నైమిత్తికాలను మాత్రం ఏడాదిసూతకం వెళ్ళేవరకు చేయరాదు.

## 235. ప్రాణాయామంలో ఇష్టదైవ నామాన్ని జపించవచ్చునా?

**జ.** కుంభక, రేచకాదులతో కూడిన ప్రాణాయామానికి, నామ జపానికి సంబంధించిన ప్రక్రియలు వేరు వేరు. నామజపం బాహ్యంగా జరిగితే, నామ స్మరణం మానసికంగా జరుగుతుంది. అది చివరకు అజపాజప స్థితికి చేరు



కోవాలి. అదే విధంగా ప్రాణాయామంలో కుంభక, రేచకాదుల ద్వారా ధ్యానం లోకి చేరుకోవలసి ఉంటుంది. ఆ ధ్యానం నిలవనప్పుడు ఇష్టదైవ నామాన్ని బిగ్గరగా జపించుతూ మరల ధ్యానంలోకి పోగలగాలి.

## 236. ఒక్కపొద్దు రోజున ఎలా ఉండాలి? భోజనం ఏ విధంగా తీసుకోవాలి?

**జ.** ఒక్క పొద్దంటే ఉపవాసం. ఆ రోజున ఏమీ తీసుకోకూడదు. మరీ కటిక ఉప వాసం చేసే శక్తిలేనివారు పండో, ఫలమో తీసుకోవడముంది. నీళ్ళు కూడా తాగకుండా ఉపవాసం చేసేవారు కూడా ఉంటారు.

## 237. దశ దినకర్మలో చనిపోయినవారికి సమర్పించే పిండాలను కాకులు ముట్టక పోవడంలోని అంతరార్థ మేమిటి? కాకులు ముట్టకపోతే కుక్కలకు, లేదా ఆవులకు తినిపించవచ్చునా?

**జ.** దశదినకర్మలో చనిపోయిన వారికి మూడు పిండాలను అగ్ని హోత్రంలో వేసి గాని, నదిలో వేసిగాని, ఆవుకు పెట్టిగాని సమర్పిస్తారు. ఇదిగాక వాయస పిండ మన్న పేరుతో ఒక పిండాన్ని కాకులకు వేస్తారు. చనిపోయిన వ్యక్తికి ఏదైనా తీరని కోరిక ఉంటే ఆ వాయసపిండాన్ని కాకులు ముట్టుకోవని నమ్ముతాం. ఆ కోరిక తీరు స్తామని కర్మచేసేవారు వాగ్దానం చేస్తే అప్పుడా పిండాన్ని కాకులు ముట్టు

కుంటాయన్న విశ్వాసంతో ఆ విధంగా చేయడం, కాకులు ముట్టడం కద్దు. ఆ వాయస పిండాన్ని కుక్కలకు పెట్టే సంప్ర దాయం లేదు.

## 238. జిల్లేడునార, తామరనారతో చేసిన వత్తులు దీపారాధనకు పనికివస్తాయా? ప్రతిరోజు వీటితో దీపారాధన చేయవచ్చునా?

***జ.*** తెల్లజిల్లేడు నారతో చేసిన వత్తులు మంచివంటారు.



## *239. దీపారాధనకు ఏయే తైలాలు వాడాలి?*

***జ.*** ఆవునెయ్యి, నువ్వులనూనె వాడవచ్చు.

## 240. మానసిక ప్రశాంతత అంటే ఏమిటి! అలాంటి ప్రశాంతతను అందుకోవడం ఎలా?

***జ.*** ఆనందం, ప్రశాంతత, ప్రేమ అంటే ఏమిటి. అవన్నీ మన కోరికలు. జీవిత మంతా వుండాలనుకుంటాం. కాని మనసు వుండనీయదు. ఫలితంగా ప్రశాంతత వుండదు. మనం ప్రేమను కోరుకుంటాం. కాని ఎక్కడి నుండో, ఎవరితోనో శతృత్వం వస్తుంది. మానసిక ప్రశాంతత లేదని వైద్యుడి దగ్గరికి వెళతారు. ఆయన మందు లిస్తాడు. మాత్ర వేసుకుంటే కొద్దిసేపు ప్రశాంతత వస్తుంది. అంటే శరీరంలోకి మాత్ర ద్వారా రసాయనం చేరగానే మార్పు వచ్చి ప్రశాంతత వచ్చింది. ప్రశాం తత అనేది శరీరంలోని రసాయనమే. ప్రేమ ఒక తరహా రసాయనం. మానసిక ఆందోళన ఒక తరహా రసాయనమే.

బయటకు కనిపించే భావం ఏదైనా దానికితగిన రసాయనం లోపల వుంటుంది. ప్రశాంతత ఏదో ఒక సమయంలో అనుభ విస్తున్నా మంటే అందుకు తగిన రసా యనం మనలోనే దాగుందన్నమాట. ఒక వేళ లేకుంటే మనం ఆ రసాయనం తయారు చేసుకుని ప్రశాంతతను సంపాదించుకోవాలి.

యోగాను సరిగా సాధన చేయగలిగితే మన శరీరంలో శక్తియుక్తులను, రసాయ నాలను బయట కలిగే అనుభవాలకు అతీ తం చేయగలుగుతాం. అప్పుడు బయట జరిగే సంఘటనలు, భావాలు లోపల ప్రశాంతతను అలానే నిలిపి వుంచు తాయి. ఆందోళనలు కలగవు. అటువంటి స్థితినే ఆధ్యాత్మికస్థితి అనవచ్చు.

## 241. పూజ సామగ్రి

***జ.*** పూజ చేసేందుకు ప్రత్యేక వాతా వరణం, మానసిక స్థితి అవసరం. భగ వంతుని సాదరంగా ఆహ్వానించడం, తమ ఆదరణ అందుకోమని ప్రార్థించడం

చేస్తారు. హిందువుల ఇళ్ళలో, దేవాలయాల్లో ప్రత్యేక సామాగ్రి నిర్దేశించారు. వాటిని కంచు, రాగి వంటి లోహాలతో ప్రత్యేక పద్ధతిలో, నిర్దిష్ట రూపంలో తయారు చేస్తారు. ఒక ప్రాంతానికి మరో ప్రాంతానికి కొద్దిగా తేడా వున్నప్పటికి ప్రధానంగా ఉపయోగించే సామాగ్రి ఒక్కటే.

***ధారాపత్ర :*** ఇది ఇళ్ళలోకన్నా దేవాలయాలలో కనిపిస్తుంది. శివలింగం మీద నిత్య అభిషేకం కోసం ఏర్పాటు చేసినది. ఇది త్రిభుజ ఆకారంలో పైన వెడల్పుగా కింద మొనతేలి వుంటుంది. మొనతేలిన ప్రదేశంలో గోముఖం అమరుస్తారు. దీనిగుండా అభిషేకం చేసే నీరు చుక్కలుగా లేదా ధారగా శివలింగం మీదకి జారుతుంది.

***కుంది :*** దీపారాధన కలిగించేందుకు వాడే కుంది చిన్నవి, పెద్దవిగా వుంటాయి. దేవాలయాలలో పెద్దవి వాడతారు. వాటిలో ఐదు ఒత్తులు వెలిగించేందుకు వీలుగా దీపారాధన నూనె వేసి వుంచి పుష్పం



లాంటి భాగం పై ఎత్తున వుంటుంది. ఈ కుందీల రూపాలు భిన్నంగా వుంటాయి. కొన్ని ప్రాంతాలలో దీపలక్ష్మి కుందులు వాడతారు. అది దేవతామూర్తి రూపంలో వున్న కుంది.

***హారతి :*** హారతి ఇచ్చేందుకు ప్రత్యేకంగా చేయించిన వస్తువు వుంటుంది. ఒత్తులు వెలిగించి దేవుని హారతి ఇచ్చేందుకు పట్టుకునే పీఠభాగం వుంటుంది. హారతి భగవంతునికి ఇచ్చి భక్తుల కళ్ళకు



అద్దుకునేందుకు ఇస్తారు. హారతిని భగవంతునికేకాక మనుషులకు భిన్న సందర్భాలలో ఇవ్వడం జరుగుతుంది.

***పంచపాత్ర :*** పూజకు ముందు ఆచమనం చేసేందుకు పవిత్ర జలం లేదా పాలను పోసి వుంచుకునే రాగిపాత్ర.

## 242. సర్పరూపం - శక్తి


***ఐ.*** మనిషి నుండి తొలిగా ప్రజలందుకున్న జీవి సర్పం. సిరియా, ఈజిప్టు వంటి నేటి ముస్లిమ్ దేశాలలో ఒకనాడు నాగపూజ వుంది. నేటి క్రైస్తవ దేశాలైన గ్రీస్, ఇటలీ, మెక్సికోల్లోను నాగపూజ చేసేవారు. నేటికి ఆసియా, ఆఫ్రికా దేశాలలో నాగపూజ సాగుతున్నది.

మనదేశంలో నాగవంశాలు, నాగ తెగలవారికి ప్రత్యేకంగా ఒక రాష్ట్రం నాగా లాండ్ ఉన్నాయి. నాగులకు ప్రత్యేక శక్తు లున్నాయని అన్ని దేశాల వారి నమ్మకం. రత్నాలు, వజ్రాల వంటి విలువైన రాళ్ళు, సంపదలను ఆశ్రయించి పాములుంటా యన్నది నమ్మకం. నాగులకు సంతానం అందించేశక్తి వుందన్న విశ్వాసం అంద రికి వుంది. జ్ఞానానికి నాగులను చిహ్నంగా భావిస్తారు.

సుమేరియా, ఈజిప్టు, గ్రీకు సంస్కృ తులలో రోగాలను నయంచేసే శక్తి దేవత లుగా నాగులను పూజిస్తారు. నాగులు భూలోక వాసులన్నది వీరందరి భావన. హైందవ పురాణాలలో పలురకాల నాగు పాములున్నాయి. శేషుడు విష్ణుమూర్తి పవ ళించే పాన్పు. శివుడు ధరించేది పామును. శ్రీకృష్ణుడు కాళింది సర్పం గర్వం వదిలించాడు.

బౌద్ధ, జైన సంస్కృతులలోను సర్పాలు, వాటికి పూజలు అనేకంగా వున్నాయి.

మానవులనుసర్పాలను అద్భుతంగా ఊహించి ప్రదర్శించినది కుండలిని విద్యలో. మెలికలు తిరిగిన సర్ప రూపం లోని శక్తి దాగి వుంటుంది. శరీరంలో దాగి వున్న ఆ శక్తిని విడుదలచేయడమే కుండలిని విద్య. పురాణాలలో నాగులను దిక్పాలకులుగా వర్ణించారు. తూర్పుకు అనంతుడు, ఈశాన్యంలో అభోగ, దక్షి ణాన వాసుకి, నైరుతి మూలన శంఖసాల, వాయువ్యంలో కులిక, ఈశాన్యంలో



మహా పద్ముడు దిక్పాలకులయ్యారు. సంతానం కోసం నాగులను పూజించడం మనదేశంలో ఆచారం. సంతానం పొందిన వారు నాగప్రతిష్ట చేస్తుంటారు. సంతానం లేకపోతే నాగదోషమని నమ్మిక.

## 243. అన్ని మతములకు ప్రవక్తలు ఉన్నారు. మరి హిందువులకు?

**జ.** మనకు మతం లేదు. వేద ప్రతిపాదిత మైన ధర్మం ఉన్నది. దానినే మనం మతం అంటున్నాం. దానికి ప్రవక్త ఉండదు. ఏ మతంవారికయినా ధర్మం అనుసరణీయం మానవత్వం కావాలంతే.

## 244. ఇంట్లో పూజలకి మడి అవసరమా?

**జ.** ఇంట్లో అయినా గుడిలో అయినా మనస్సు మడి (పవిత్రం)గా ఉండడం అవ సరం. అది లేనప్పుడు బాహ్యాచారాలు ఎన్ని అవలంభించినా వ్యర్థమే. ముందు మనస్సు నిర్మలమయితే మడి, దడీ ఆలో చన రాదు. అయితే పరిశుభ్రత కోసం మడి ప్రవేశించింది.

## 245. 'హా సీతా, లక్ష్మణా!' అని అరిచిన మారీచుని అరుపు వినబడినంత దూరం రాముడు కూడా అరిచి రావద్దన వచ్చుగా?

**జ.** రాక్షసులకున్న గొంతు మానవుల కుండదు. పైగా మారీచుడు రాముని గొంతుకతోనే అరిచాడు. ఆ అరుపు విని రాముడు కూడా ఆశ్చర్యపోయాడు. అంటే మారీచుడు గొప్ప మిమిక్రీ కళాకార పితామహుడు.

## 246. మతం లేకుండా మనిషి బతకలేడా?

**జ.** మతం అంటే వారానికో మారు కళ్ళు మూసుకుని నా పాపాలు నీవు స్వీకరించు, నేను మళ్ళీ ఆరంభిస్తాననడం కాదు. మా దేవుడే దేవుడు. మీ దేవుడు నకిలీ అని దుమ్మెత్తిపోయడం కాదు. సర్వభూతాలనూ పరమేశ్వర రూపంగా భావించి, అహింసావ్రతంతో సత్యవాక్పాలనతో, పరోపకార దృష్టితో, పవిత్రంగా జీవితం గడపడం. ఏ మతానికైనా ఇవే పరమార్థాలు.


## 247. పుణ్యకార్యాలు చేస్తే పాపాలు నశిస్తాయా?

**జ.** నశించవు. ఈ విషయాన్ని రామాయణంలో హనుమంతులవారు స్పష్టం చేశారు. 'రావణా! ఇంత వరకూ నీ పుణ్య కర్మల ఫలం అనుభవించావు. ఇక పాప ఫలం నీ నెత్తిమీదకు వస్తుంది అని. దేని దారి దానిదే.

## 248. ఉగాదినాడు ఏం చెయ్యాలి?

**జ.**వత్సరాదౌ వసంతాదౌ బలిరాజ్యే తథైవ చ।
తైలాభ్యంగ మకుర్వాణో నరకం ప్రతిపద్యతే ॥

ఇంట్లో తల్లి వుంటే ఆమె, తన పిల్ల మాడు (శిరసు మధ్య భాగం) మీద నువ్వుల నూనెని తన కుడిచేతి మూడు



నాలుగు వేళ్ళతో అద్దాలి. చక్కని దీవెనలని దీవిస్తూ తలతోపాటు ఒంటి నిండుగా నువ్వుల నూనెని రాయాలి. కొంతసేపు (గంటకు పైగా) నూనెతో శరీరాన్ని నాననిచ్చాక సున్నిపిండితో శరీరాన్ని అదుముతూ నలపాలి. ఆ మీదట చక్కని కుంకుడు (కాయల) పులుసుతో తలని రెండు మార్లు రుద్దాలి. శరీరాన్ని కుంకుడు తొక్కతో రుద్దాలి. ఆ మీదట సబ్బుతో తోమినా ముందుగా కుంకుడు తొక్కని మాత్రమే వాడాలి.

వేడినీటితో స్నానాన్ని చేయించాలి. ఇలా చేయించిన స్నానాన్ని 'అభ్యంజన (అభ్యంగన) స్నాన' మంటారు. తల నిండుగా కుంకుడు చేదు వాసన వుండే కారణంగా క్రిమి కీటకాలూ, చుండ్రూ మొదలైనవి చేరవు. కుంకుడురసంలో వున్న శక్తి కారణంగా జుట్టు రాలిపోదు.

ఆ మీదట దైవంముందు కొద్దిసేపు (విద్యార్థి దశలో వున్న పిల్లలు కాబట్టి ఆ చదువులకి విఘ్నం రాకుండా ఓ పది నిమిషాలు మాత్రమే) కూచోబెట్టి కొత్త బట్టలని వాళ్ళకి అందిస్తూ, తలమీద అక్ష తలని వేస్తూ వాళ్ళచేత పాదాభివందనాన్ని చేయించుకోవాలి. లోకంలో తల్లిదండ్రు లకి మించి సంతానపు క్షేమాన్ని ఆలో చించేవాళ్ళు మరెవరూ వుండరు. కాబట్టి తల్లిదండ్రులు అక్షతలు వేయాలి, ఆశీర్వ దించాలి. తమతోపాటు పిల్లల్ని కూడ గుడికి తీసుకుపోయి పంచాంగాన్ని విన్పిస్తే 'ఇదొక సంప్రదాయ'మే మాట పిల్లలకి అర్థమౌతుంది. జాతకాన్ని ఆచా ర్యులవారో, శాస్త్రులవారో వివరించి చెప్పాక పిల్లలకి మనోధైర్యాన్ని బోధించి, ఆ జ్యోతి ష్యాన్ని మార్గదర్శకంగా భావించాలనే విషయాన్ని వాళ్ళకి అర్థమయ్యేలా చెప్తూ జ్యోతిష్యశాస్త్రం మీద వున్న గౌరవాన్ని తగ్గ కుండా చూడాలి.

## 24౨. ధర్మకార్యాలు

**ఔ.** సంవత్సరపు మొదటిరోజు కదా అనే ఉద్దేశ్యంతో ఎవరైనా ధర్మకార్యాలని చేయ దలిస్తే 1. చలువ పందిరి నిర్మాణం, 2. అన్న దానం ఈ పండుగకి చేయొచ్చు.

'చలువని కల్గించే పందిరి' అనే అర్థంలో 'చలువ పందిరి' అనే మాటకాస్తా చలిపందిరి, చలువ పందిరి, చలువ మందిరం... చివరికి 'చలివేంద్రం'గా మారిపోయింది. సరే! ఇంతకీ అనవలసి నది 'చలువ పందిరి' అని.



ఒకప్పుడు గ్రామాల్లోకి వెళ్ళినప్పుడు 'పల్చటి మజ్జిగ'ని ఇస్తూండేవాళ్ళు 'దాహం' అనే పేరుతో.

**'ప్రమేయం సర్వ సామాన్యా భూతేభ్యః ప్రతిపాదితా'**

**అనివార్య తతో దేయం జలం మాస చతుష్టయమ్॥**

చక్కని తాటాకుల పందిరిని వేసి, మూడువైపులా తాటాకుల గోడని కట్టి పెద్ద పెద్ద కుండలలో నీటిని పొయ్యాలి. ఆ నీటిని తాగేందుకు వీలుగా గరిటెలనీ, గ్లాసుల్నీ కూడ అక్కడ సిద్ధంగా వుంచాలి.

ఒకసారంటూ చలివేంద్రాన్ని పెట్టాక దాన్ని నాలుగు నెలలపాటు కొన సాగించాలి. కుల – వర్ణ – మంత్ర – సంప్రదాయ భేదాలని పాటించకుండా అందరికీ నీటిని ఇవ్వవచ్చు. ఎండలో మాడుతున్న పాంధునికి ఇచ్చిన ఈ నీళ్ళ కారణంగా పాంధుని దాహం తీరి పితృదేవతలకి ఆ వర్తమానం వెళ్తుందిట. దీనితో వాళ్ళ ఆశీర్వాదఫలం వంశం మొత్తానికి లభించి తీరుతుంది.

వీలుంటే వైదికుడైన బ్రాహ్మణునికి చెప్పులు, గొడుగు, నీటితో నింపిన రాగి పాత్రని దానమియ్యాలి. శక్తి కొలది అన్నాన్ని పేదలకి పంచవచ్చు. స్తోమత నెరిగి దానం చేయడం వివేకవంతుల లక్షణం.

## 250. సప్తపది

***జి.*** వివాహంలో దంపతుల చేత ఏడు అడుగులు వేయిస్తారు. హోమం చుట్టూ వేసే ఆ ఏడు అడుగులనే సప్తపది అంటారు. సప్తపదిలో వేసే ప్రతి అడుగుకు ఒక అర్థముంది. తొలి అడుగు తమ జీవితాలకు అవసరమైన ఆర్థికశక్తి, సాధనకు, రెండవ అడుగు ఆరోగ్యకర ఆధ్యాత్మిక చింతనకు, మూడవ అడుగు ధర్మబద్ధ ఆర్థిక సంపాదన కొరకు, నాల్గవ అడుగు విజ్ఞాన సముపార్జనకు, ఆనంద, ప్రేమ, గౌరవాలకు, ఐదవ అడుగు సంతానం పొంది వారి బాధ్యత తీసుకుంటామని – ఆరవ అడుగు తమ చర్యలపై నియంత్రణ సాధనకు, ఏడవ అడుగు ఒకరి



కోసం మరొకరిగా కలకాలం బతుకు తామనే ప్రమాణంతో వేయిస్తారు. మొత్తం జీవితానికి అవసరమైన అంశాలనన్నింటిని ఏడు అడుగుల్లోకి ఇమిడ్చి ప్రామాణికంగా రూపొందించడమే మేలు.

## 251. మనిషికి మూలం

***జి.*** బయటకు కనిపించే మనిషిని రూపొందించేందుకు లోపల నాలుగు ప్రధాన అంశాలు వుంటాయంటుంది వేదాంతం. అవి ఆత్మకు సంబంధించినవి. అవి ఆలోచన, మేధ, జ్ఞాపక శక్తి, అహం అనేవి. మనిషి చర్యలు ఆలోచనతో మొదలవుతాయి. ఇవి మెదడులో రూపుదిద్దుకుంటాయి. అవి ఒక స్పష్టమైన రూపానికి రావడానికి ఆ మనిషిలోని మేధస్సు, జ్ఞాపకశక్తి దోహదపడాయి.

మేధోశక్తి సంపన్నులు అనేక ఆలోచనలు చేసి, మంచి, చెడు బేరీజు వేసుకుని ఒక నిర్ణయాని కొస్తారు. ఆ శక్తి లేని వారు ఏదోక ఆలోచనవైపు మొగ్గు చూపుతారు.

ఆలోచనలకు ఆధారం గత అనుభవాలు. అవి నిలిచి వుండే తీరు నిర్ణయంలో ముఖ్యపాత్ర వహిస్తుంది. ఇవన్నీ సక్రమంగా వున్నప్పటికీ ఆ ఆలోచనను ఒక రూపానికి తీసుకువచ్చేందుకు అహం అడ్డువస్తుంది. ఈ అహం మిగిలిన వాటికి లోబడి వుంటే మనిషి ప్రవర్తన పలువురు మెచ్చేలా వుంటుంది. లేకుంటే అహంకారానిది పైచేయి అయి నేను, నా అనే అంశాలకు పెద్ద పీటవేసి నిర్ణయాలు సక్రమంగా తీసుకోలేరు.

## 252. బ్రహ్మజ్ఞానం

**జి.** ఆధ్యాత్మిక మార్గంలో అడుగు వేసి, ఆ ప్రయాణానికి ఒక స్పష్టమైన అర్థం ఏర్పరచుకోవాలంటే ముందుగా భౌతిక అంశాలకు దూరంగా జరగాలి.



కోరికలు, దురాశ, లైంగిక చింతనలు.. ఇవన్నీ మానవ బలహీనతలు. అటువంటి బలహీనతలన్నింటినీ వదిలించుకోవాలన్నది భగవద్గీత బోధించే అంశం. ఆ అంశాన్ని రామకృష్ణ పరమహంస మరోసారి మనముందుంచాడు.



సంపద, కోరికలు వదిలించు కోగలిగి, నిజాయతీకున్న విలువను అర్థం చేసుకోగలగడం, మానసిక స్వచ్ఛత, స్వేచ్ఛాభిప్రాయాలు వంటివి మానవుని ఆధ్యాత్మిక యానంలో సహాయ పడతాయి. పేరు, రూపం మీదున్న మోహం తొలగించుకోవాలన్నారు పరమహంస. అందుకే సన్యాసంలో ఆ రెండింటిని తప్పనిసరిగా అనుసరించమంటారు. నేను అనే 'అహం' వదిలి ఈ అనంత విశ్వజీవ కోటిలో, నేనెంతని అనుకోగలిగితే చాలు మనిషిలో మార్పు మొదలైనట్టే. కోరికలకు అతీతమైన ఆత్మ, పరమాత్ముని కోసమే పరితపిస్తుంది. ఆ స్థాయికి ఎదిగేందుకు చేసేవే బ్రహ్మజ్ఞాన సముపార్జన. అశాశ్వతమైన లోకం వదిలి శాశ్వత బ్రహ్మలోకం మీదికి దృష్టి మళ్ళించే ప్రయత్నం అందరూ చేయాలి.

## 253. మోక్షక్షేత్రం

**జి.** ఆషాఢ శుద్ధ విదియనాడు – మోక్ష క్షేత్రమైన పూరీలో జగన్నాథ, బలభద్ర, సుభద్ర రథయాత్ర అత్యంత వైభవంగా జరుగుతుంది. 'రథస్తం వామనం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే' రథానవున్న వామనుని చేసినవారికి పునర్జన్మ వుండదు.

**అయోధ్యా మధురా మాయా**
**కాశీ కాంచీ అవంతికా**
**పూరీ ద్వారావతీశ్చైవ**
**సప్తైతే మోక్షదాయకా!**

భారతదేశంలోని సప్త మోక్షదాయక క్షేత్రాల్లో ఒకటిగా భక్తకోటి చెప్పుకునే పరమపుణ్య తీర్థమైన పూరీ గొప్పతనాన్ని వివరించే శ్లోకమిది.

పురుషోత్తమ క్షేత్రం, శ్రీక్షేత్రం, శంఖు క్షేత్రం, నీలాద్రి ఇలా... ఈ క్షేత్రానికి ఎన్నో పేర్లున్నాయి. ఒరిస్సా రాష్ట్రంలో వున్న ఈ పూరీక్షేత్రాన్ని నేటి భక్తులే కాదు, ఆదిశంకరాచార్యుడు మొదలు నింబాచార్యుడు, రామానుజుడు, వల్లభాచార్యుడు, గురు నానక్, కబీర్ ఇలా ఎందరో మహానుభావులు ఈ క్షేత్రాన్ని సందర్శించారు. జయదేవుడు అష్టపదుల్ని రచించింది ఇక్కడే. గీతగోవిందాన్ని జగన్నాథ స్వామికి అంకితం ఇచ్చిందీ ఇక్కడే. ఈ ఆలయాన్ని ఇంద్రద్యుమ్న మహారాజు కట్టించాడని చెబుతారు. జగన్నాథుడు గిరిజనుల దేవుడనీ, నీ మాధవుడనే పేరుతో సవర తెగ పూజలందు కున్నాడనేది స్థలపురాణం.

## 254. స్వామి వివేకానందుడు 'ఆత్మ సృష్టింపబడదు' అన్నాడు, మరి జీవకోటి రోజు రోజూ ఎలా పెరుగుతోంది?

**జ.** ఆత్మకు ఆది అంతము లేవని ఉపనిషత్సారంగా అందిన భగవద్గీత చెప్పిన




దానిని వివేకానందస్వామి చెప్పారు. జీవకోటి పెరుగుతున్నదని మీరు చెపుతున్నారే, పెరిగేది దేహకోటి.

## 255. అంతా కర్మానుసారం జరుగుతుందని తెలిసినవారు కూడా కొన్నింటికి విశ్వ ప్రయత్నాలు చేస్తారేం?

**జ.** చేసేటప్పుడు కర్మ జ్ఞానం జారిపోతుంది.

## 256. ఆత్మజ్ఞానం

**జ.** చింతామణికోసం ఒక వ్యక్తి తపస్సు చేశాడు. ఎక్కడి నుండో తెలియదుగాని, అతని చేతిలోకి ఒక మణి తటాలున వచ్చి పడింది. అప్పటికి అతను చేసిన యత్నం అతిస్వల్పమే కాబట్టి, ఈ మాత్రం దానికే అది లభిస్తుందా అని, అది నిజమయిన చింతామణి కాదనుకుని దానిని విడిచి పెట్టి, మళ్లీ తపస్సు కొనసాగించాడు.



కొంతకాలం తర్వాత ఒక సాధువు నగిషీలో తళతళలాడుతున్న రాయి నొకదాన్ని అతని ఎదుట వుంచాడు. దాని ఆకర్షణలకు మోసపోయిన ఆ వ్యక్తి అదే నిజమైన చింతామణి అని నమ్మి దానిని స్వీకరించాడు. నిజానికది రాయి. దానివల్ల అతడు కలలుగన్న ఏ కోరికా ఫలించ

లేదు. కాబట్టి మానవుడు అజ్ఞానంతో ప్రవ ర్తించక, తనలో నిబిడీకృతమైవున్న ఆత్మ జ్ఞానాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించాలి.

## 257. పుణ్యకర్మలు

***జ.*** 'శతహస్త సమాహర, సహస్రహస్త సంకర' అంటుంది అధర్వణవేదం. అంటే ఓ మనిషీ! వందలకొద్దీ చేతులతోపనిచేయి, శ్రమించి ఆహార పదార్థాలను ఉత్పత్తి చేయి. అలాగే వేలకొద్దీ చేతులతో ఆ పండించిన పదార్థాల సద్వినియోగం చేసి అందరికీ పంచిపెట్టు.

ఒక్క ధనాన్ని మాత్రమే పంచి పెట్టా లన్న నియమం ఏమీ లేదు. నీ దగ్గర ఏది వుంటే అది పంచి పెట్టు. విద్య, అన్నం, ధనం, భూమి మొదలైనవి ఏవైనా సరే వాటిని ఇతరులకు పంచిపెట్టు.

**శ్రద్ధమయా దేవం, అశ్రద్ధయా దేయం, శ్రియా దేయం**

**హ్రియా దేయం, భియా దేయం, సంవి దాదేయమ్ ॥**



శ్రద్ధతో దానం ఇవ్వండి. అశ్రద్ధతో దానం ఇవ్వకండి. మీరు సంపాదించిన సంపాదనలో ఒక పది శాతమైనా దానం చేయండి. లోక మర్యాద కోసమైనా దానం చేయండి, పాపభీతితోనైనా దానం ఇవ్వండి. సంహిత్ అంటే దేశాభ్యుదయం లేక దీనుల రక్షణ జనోద్ధరణ మొదలైన కార్యాలను దృష్టిలో వుంచుకొనైనా దానం ఇవ్వండి. అన్ని కర్మలు విడిచినా, యజ్ఞం, దానం, తపం లాంటి పుణ్యకర్మలు విడవకూడదం టాడు శ్రీకృష్ణుడు.

## 258. శరణు - ప్రతిఫలం

***జ.*** తనను శరణుజొచ్చిన వారిని భగ వంతుడు ఆదుకుంటాడు. చేసిన తప్పు లను క్షమిస్తాడు. అందుకు రామాయణ, భాగవతాలలో ఎన్నో ఉదాహరణలు వున్నాయి. రావణుడు సీతను అపహరించి చెరపట్టడాన్ని విభీషణుడు అభ్యంతర పెట్టాడు. కాని అన్నను ఎదురించలేదు.

శ్రీరాముడు మరెవరో కాదు మహా విష్ణువు మరో రూపమేనని అర్థం చేసు కున్న విభీషణుడు, మరణం దగ్గర పడిం దని రావణునికి చెపుతాడు. అయినా మొండికేసిన సోదరుని వదిలి శ్రీరాముని శరణుజొచ్చాడు. అన్నను మోసం చేస్తు న్నానన్న భావం అతనికి లేదు. కేవలం లంకరాజ్య ప్రజల సంక్షేమం గురించే అతని తపన. అందుకే శ్రీరాముడి పాదాల చెంత చేరాడు. విభీషణుడిని లంకకు అధి పతి చేయడం ఆయనిచ్చిన ప్రతిఫలం.



అది శరణుజొచ్చిన వారికి భగవంతుడిచ్చే వరం.

## 259. భక్తియోగం

**జ.** భక్తిమార్గంలో ముక్తి పొందవచ్చని శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలో చెప్పాడు. ఈ మార్గం జ్ఞానులకు కాదు సామాన్యులకు. కొందరు భగవంతుని యందు పూర్తిగా మనస్సు లగ్నంచేస్తారు. వీరిది మూఢభక్తి అనిపించవచ్చు. మన పురాణాల్లో చెప్పిన తిన్నడు, కన్నప్ప, శబరి లందరిదీ ఈ భక్తి మార్గమే. వారు సామాన్యులు. వారికి వున్న జ్ఞానం పరిమితం. కాని భక్తి అపరిమితం. తాము చేసే పనికి ఫలితం, దానిమీద దక్కే లాభం గురించి వారికి పట్టదు. భక్తితో భగవంతుని ప్రీతి పాత్రుని చేసుకోవడమే వారి లక్ష్యం. భగవంతుడు అటువంటి భక్తులను అక్కున చేర్చుకుంటాడు. ముక్తి ప్రసాదిస్తాడు. అయితే ఈ స్థాయికి చేరాలంటే ముందుగా మనసులో వున్న అహం వదిలించు



కోవాలి. తన ఇష్టాలు, అయిష్టాలు పక్కన పెట్టి కేవలం భగవంతునియందే మనసు పెట్టిన వారు ఆయన కృపకు పాత్రులవుతారు.

## 260. భగవంతుని మీద మనసు నిలిపితే చాలదా? ధూప, దీపాలు అవసరమా?

**జ.** మనసు నిలపగలిగితే ఏమీ అవసరం లేదు. నిలపకపోతే ఎన్ని చేసినా వ్యర్థం. ఇదే నిజం.

## *261. విశ్వరూపం అంటే...?*

**జ.** విశ్వం యొక్క రూపం అనగా మనం నివసించే భూగోళం. కనిపించే గ్రహ తారా గణాలు, కనిపించని గోళాలు. రెండవ అర్థం భగవద్గీతలో శ్రీకృష్ణుడు చూపించినది.

అది తెలియాలంటే జగద్గురు పీటం వారు ప్రచురించిన కులపతి కృష్ణ మాచార్య గారి శంఖారావం అను గ్రంథం చదవండి.

## 262. రాముని కంటే రఘుమహారాజు గొప్ప పరిపాలకుడయినా రఘుమహారాజు రాజ్యం గురించి ఎవరూ చెప్పకోరేం?

**జ.** రఘువేకాడు ఆ వంశీయులందరూ పరిపాలనాదక్షులే కాని వారి చరిత్ర రాసిన వాల్మీకి లేడు, కాళిదాసు వున్నా సరిపోలేదు.


## 263. తథాస్తు దేవతలు, అశ్వనీ దేవతలు అని వున్నారు. ఇద్దరూ ఒక్కరేనా?



**జ.** అశ్వనీ దేవతలు దేవవైద్యులు, తథాస్తు దేవతలు చెడు మాటలు, పరుష వాక్యాలు పలకకుండా మన నోటిని మంచి మాటల మీదకు మళ్ళించడానికి ఎప్పటికప్పుడు పెద్దల నోట పుట్టేవారు. ఈనాడు పెద్దల నోరు నొక్కుతున్నాం. ఇంక దేవతలు ఎలా వుంటారు?

## 264. త్రికరణాలు, త్రికరణశుద్ధి అంటే ఏమిటి?

**జ.** మనస్సు, వాక్కు, శరీరం అనేవి త్రికరణాలు. అంటే మూడు కరణాలు అని



అర్థం. ఇవి పరిశుద్ధంగా వుండాలి. వీటిలో ఎటువంటి మాలిన్యం వుండరాదు. ఇవి ఒకదాని కొకటి సంబంధం కలిగి వుంటాయి. మనస్సులో కలిగే అభిప్రాయాలను ప్రకటించేది వాక్కు. మనస్సు అంగీకరించే కార్యాన్ని నిర్వహించేది శరీరం. అవి ఎంత శుద్ధంగా వుంటే మనిషి అంతగా రాణిస్తాడు. మనస్సు నిర్మలంగా, వాక్కు సత్యంతోనిండి, ప్రియంగా వుండాలి.

## 265. వచతుష్టయ పురాణాల్ని వివరించండి.

**జ.** 'వ'కారంతో మొదలయ్యే పురాణాలు నాలుగు. వాయు పురాణం, వరాహ పురాణం, వామన పురాణం, విష్ణు పురాణం.

***వాయు పురాణం:*** దీనిలో 24,000 శ్లోకాలు ఉన్నాయి. దీనిని వాయుదేవుడు చెప్తాడు. శివభగవానుని మహత్యం, కాలమానం, భూగోళం, సౌరమండల వర్ణనలు ఈ పురాణంలో ఉంటాయి.

***వరాహ పురాణం :*** దీనిలో 24,000 శ్లోకాలు ఉన్నాయి. వరాహ అవతారం ఎత్తిన విష్ణుమూర్తి భూదేవికి చెప్తాడు. ఇందులో విష్ణుమూర్తి ఉపాసనావధానం ఎక్కువగా


ఉంటుంది. పరమేశ్వరి, పరమేశ్వరుల చరిత్రలు, ధర్మశాస్త్రము, వ్రత కల్పాలు, పుణ్య క్షేత్రాల వివరాలు ఈ పురాణంలో ఎక్కువగా ఉంటాయి.

***వామన పురాణం :*** దీనిలో 10,000 శ్లోకాలు ఉన్నాయి. పులస్త్య మహర్షి నారద మహర్షికి వివరించిన పురాణం ఇది. శివలింగ ఉపాసన, శివపార్వతుల కల్యాణం, శివగణేశ, కార్తికేయ చరిత్రలు, భూగోళం, ఋతు వర్ణనలు దీనిలో ఉన్నాయి.

***విష్ణు పురాణం :*** దీనిలో 23,000 శ్లోకాలు ఉన్నాయి. పరాశరుడు తన శిష్యుడైన మైత్రేయునికి బోధించిన పురాణం ఇది. విష్ణు మహత్యం, శ్రీకృష్ణ, ధ్రువ, ప్రహ్లాద, భరతుల చరిత్రలు దీనిలో ఉన్నాయి.

## 266. భక్తిమార్గాలు

***జ.*** ఎవరైతే తనను ధ్యానిస్తారో, పూజిస్తారో వారి వారి పూజలు, ధ్యానం నిర్మలమైనవా, కావా? అనే విషయాన్ని భగవంతుడు నిరంతరం పరీక్షిస్తూనే వుంటాడు. ఎటువంటి తారతమ్యాలూ లేకుండా వారు చేసుకునే పుణ్య ఫలాన్నిబట్టి వారిని అనుగ్రహిస్తాడు.



దైవాన్ని ఎక్కువగా కొలిచే వారికి, మరెంతగానో ప్రార్థించేవారికి మాత్రమే మోక్షం ప్రాప్తిస్తుందా అని ఎవరికైనా సందేహం వస్తుంది. కాని భగవంతుడు తనను ద్వేషించేవారికి కూడా మోక్షాన్ని ప్రసాదిస్తాడు. భగవంతుని కొలిచే కొన్ని మార్గాలను ప్రహ్లాదుడు తన తండ్రి హిరణ్య కశిపునికి విశ్లేషించిన సందర్భాన్ని తెలుసుకుందాం. మనఃపూర్వకంగా దైవంతో స్నేహభావం కలిగి వుండడం, కథలు వినడం, ఏదో ఒక నామాన్ని, రూపాన్ని నిశ్చయించుకుని భగవంతునికి దాసునిగా వుండడం తొలిమూడు మార్గాలు. అందరం అప్రయత్నంగా చేసే రెండు చేతులు ముకుళించి నమస్కరించడం ఒక మార్గం కాగా గంధపుష్పాలతో పూజలు చేసి, అర్చన జరపడం మరొకటి. మనసు మళ్ళనీయకుండా భగవంతుడిని సేవించడం, భగవన్నామ సంకీర్తనవంటి వన్నీ భక్తిమార్గాలే. దైవసేవలో ఇవి ప్రధానం. ఎంత ఘనంగా దైవాన్ని కొలిచామని కాకుండా ఎంత భక్తిగా సేవించి తరించామన్న దానిపై దృష్టి లగ్నం చేయాలి.

## 267. ఆంజనేయుని తోకను కదిలించలేని భీముడు రాక్షస సంహారం చేశాడా?

***జ.*** భీముడు రాక్షసులను చంపడం, తోక ఎత్తలేక పోవడం–ఈ రెండూ భారతంలో విషయాలే కదా. అంటే తాడి తన్నువాడు ఉంటే వాడి తలదన్ను వాడుండుననే నీతిని గ్రహించాలి.

## 268. సన్యసించినవారు అన్నీ వదులు కోవాలి కదా, మరి శంకరాచార్యులవారు తన తల్లికి కర్మ చేశారే?



జ. బాధ్యతలు నిర్వహించలేక, సంసారాన్ని సముద్రంలో ముంచి పారిపోవడం పలాయనం అవుతుంది కాని సన్యాసం కాదు. ఈ కర్మ భూమిలో ధర్మరక్షణ సన్యాసి కూడా సాగించవలసిందే. అందుకే సన్యసించిన శంకర భగవత్పాదులు మాతృకర్మ చేశారు. విద్యారణ్యుడు విరూపాక్ష సైన్యం ఏర్పాటుచేసి తురుష్క పాలకులను నిలబెట్టి విజయనగర సామ్రాజ్యం స్థాపించాడు. వివేకానంద స్వామి దేశ దేశాలలో మఠాలు నెలకొల్పి దీనజన సేవా సంస్థలు ఏర్పాటు చేశారు నిస్వార్థ సేవకులతో.

## 269. వేదాంగాల్లో కల్పము గురించి తెలపండి!

జ. వేదంలో సంహితలు, బ్రాహ్మణాలు వుంటాయి. వీటిలో మనం చేసే వైదిక కార్యకలాపాల్లో ఉపయోగించే మంత్రాలు వుంటాయి. వైదిక కార్యకలాపాల్లో యజ్ఞాలు, యాగాలు, హోమాలు మొదలైనవి వుంటాయి. వీటి కోసం యాగశాలలు హోమ వేదికలు వంటివి నిర్మించాలి. అంతేకాకుండా వాటిలో ఉపయోగించే వివిధ రకాల ద్రవ్యాలు, దినుసుల వివరాలను కూడా ఇందులో పొందుపరిచారు. వీటికి సంబంధించిన ఇతర అనేక వివరాలు, చేయాల్సిన, చేయకూడని పనులను కల్ప సూత్రాల గ్రంథాల్లో స్పష్టంగా వివరించటం జరిగింది.

## 270. దేవుడనేవాడుంటే మనకెప్పుడూ కనిపించడేం? లేడని ఘోషించే హేతు వాదులకు దర్శన మివ్వవచ్చుగా?

జ. తప్పకుండా! కాని దేవుడు లేడనే విష్ణుద్వేషి హిరణ్య కశిపునికి కనిపించిన క్షణంలో వాడు చచ్చాడు. అలా అందరినీ చంపడం కరుణామయునికి ఇష్టం లేదేమో!

## 271. మనము కోరుకునేది ఏమీ మనకు దొరకడం లేదు. ఎందుకని?


జ. ఒక విషయాన్ని అర్థం చేసుకోండి. ప్రకృతిలో ఏ ఒక్క శక్తీ మిమ్మల్ని నిర్బంధించ లేదు. మీరు ఆ శక్తిని ఉపయోగించే విధములోనే అది మనకు అవసరమయ్యే విషయముగానో లేక అంతమయ్యే విషయముగానో మారుతుంది.

సూర్యుడు ఉదయించే టప్పుడు ఫోటో తీయాలనుకుంటున్నారు. ఆ రోజు బాగా వర్షము పడుతుంది. మీరు అనుకున్నది నెరవేరలేదని ప్రపంచం మీద కోపపడి మీ గదిలోనే ఒక మూలలో కూర్చుని వున్నారు. మీరు బాధపడుతున్నారని ప్రకృతి తనని మార్చుకుంటుందా? కాదు కదా? బాధపడడం మానేసి వర్షాన్ని ఆనందముగా చూడండి. ఒకవేళ అంద మైన ఇంద్రధనుస్సుని చూడవచ్చు. దాన్ని ఫోటోలు తీసి ఆనందపడవచ్చు. అది కాక పోతే ఇంట్లో ఎన్నో పనులు వుండవచ్చు. ఆ పనిని చేసుకోవడానికి తగినంత సమ యం దొరికిందని అనుకోవచ్చు.మనకు మించిన శక్తులవల్ల, మనము చెయ్యాలను కునే పనులను చెయ్యకపోవచ్చు. కాని చెయ్య వలసిన పనులను చెయ్యకుండా నీరసించిపోవడం పిచ్చితనం కదా?"

## 272. ఆత్మ - పరమాత్మ

**జ.** జీవుడు ఆత్మసాక్షాత్కారం పొందాలి. అలా పొందినవాడు ఆత్మను పరమాత్మలో ఐక్యం చేయగలుగుతాడు. అటువంటి వారికి పునర్జన్మలుండవు. మానవులు చాలామంది స్వర్గం గురించి ఆలోచి స్తారు. అయితే స్వర్గవాసం అందరికీ శాశ్వతం కాదు. ఈ జన్మలో చేసిన కొద్ది పుణ్యంవల్ల స్వర్గలోకం ప్రాప్తించ వచ్చు. కాని ఆ ప్రాప్తం తీరగానే తిరిగి స్వర్గలోకం వీడి మరో జన్మను స్వీకరించాల్సి వుంటుంది. పుణ్యకార్యాలు కొంత మేరకే ప్రయోజనం. అలా కాక ఆత్మను అర్థం చేసుకుని, రాగ బంధాలకు అతీతంగా, నిష్కామ కర్మతో భగవంతుని పూజించగలిగిన వారికి స్వర్గ లోకం శాశ్వతమవుతుంది. అదే పర మాత్మలో ఐక్యమవడం. అంతే గాని ప్రతి మరణం పరమాత్మలో ఏకమవడం జరగ దని తెలుసుకోవాలి.

## 273. జాతకం చూడకుండా పెళ్ళి చేయచ్చా?



**జ.** మీతో జీవించాలను కునేవారిని, మీరేకదా ఎన్నుకోవాలి? మీ జీవితాన్ని, జోతిష్యం, జాతకం అని ఇతరుల చేతు లకు అప్పగిస్తున్నారు. జాతక చక్రరీత్యా వారు చేసిన వివాహాలు విడాకులుగా మారలేదని ఎప్పుడైనా మీకు చూపిం చారా? మీ భర్తతో గొడవలైతే కారణం నక్షత్రాలు. మీ భార్యతో జీవితం సఖ్యతగా లేకపోతే గ్రహాలపై అపవాదు వేస్తారు. వివాహ జీవితం సఖ్యతగా లేదంటే, దానికి కారణం, భార్యాభర్తల మొండి తనమే తప్ప గ్రహాలు ఏమాత్రం కారణం కాదు. భార్యాభర్తలు ఇరువురు మనసులు కలిసి సఖ్యతగా మసలుకుంటే, జ్యోతి ష్యాలు, గ్రహాలు, నక్షత్రాలు ఏమిచేస్తాయి.

## 274. సౌభాగ్య వ్రతం

**ఐ.** హైందవ సాంప్రదాయంలో స్త్రీలు ఆచరించే వ్రత విధానాలు ఎన్నో వున్నాయి. కుటుంబ క్షేమం కోసం, తాళి కట్టిన భర్త కోసం, తన సౌభాగ్యం కోసం, సంతానం కోసం, వారి వృద్ధికోసం ఎన్నో కఠినతరమైన నియమాలను సైతం ఆచరిస్తూ వ్రత విధానాలను చేపట్టే భారతీయ మహిళకు అందుకే అంత పూజ్య స్థానముంది. బ్రహ్మరాతను సైతం మార్చి, విధిని తమకు అనుకూలంగా మలుచుకున్న పతివ్రతా శిరోమణులు ఎందరో వున్నారు. జ్యేష్ఠ మాసంలో పౌర్ణమి వెళ్ళిన తర్వాత పదమూడవ రోజు స్త్రీలంతా వట సావిత్రీ వ్రతాన్ని ఆచరిస్తారు.

యమధర్మరాజు నుంచి పతి ప్రాణాల్ని వెనక్కు తెచ్చుకున్న సావిత్రి విజయానికి గుర్తుగా వట సావిత్రీ వ్రతాన్ని జరుపుకుంటారు. సత్యవంతుడు ప్రాణాలు కోల్పోయాక పవిత్రమైన మర్రిచెట్టును సావిత్రి పూజించిందన్న పురాణ కథనం ఒకటుంది. తన పతి సత్యవంతుణ్ణి పునర్జీవుణ్ణి చేసేందుకై సావిత్రి యమధర్మరాజు వెంట యమ లోకానికే వెళ్ళిందన్న కథ అందరికీ తెలిసిందే. ఆమె పతివ్రతా మహిమకు, ఆమె తపశ్శక్తికి అచ్చెరువొందిన యమ ధర్మరాజు ఆమె భర్త ప్రాణాలు ఆమెకు తిరిగి ఇచ్చేస్తాడు. ఇది స్థూలంగా సతీ సావిత్రి కథ. నాటి భారతదేశంలో ఉత్తరాది ప్రాంతం అయిన మిథిలలో ఈ వ్రతం చాలా ప్రసిద్ధి గాంచింది. పెళ్ళ



యిన స్త్రీలంతా వటసావిత్రీ వ్రతం నాడు తమ భర్తలకు ఆయురారోగ్య ఐశ్వర్యాలను, తమకు సౌభాగ్యాన్ని ఇవ్వ వలసిందిగా భగవంతుడ్ని ప్రార్థిస్తారు. చంద్రోదయం వరకు ఉపవాసం వుంటారు. ఆ తరువాత పతికి భోజనం పెట్టి ఆయన ఆశీర్వచనం పొందాక తాము భుజిస్తారు. వివాహమైన స్త్రీలంతా ఆ రోజు ఉదయాన్నే స్నానాది కార్యక్రమాలు పూర్తయ్యాక వటవృక్షం దగ్గరికి వెళ్తారు. వట వృక్షమంటే మర్రి చెట్టు. అంతా మర్రి చెట్టును భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఎర్రని సింధూరంతో మర్రిచెట్టును అలంకరిస్తారు. నూలుదారం పోగుల్ని చెట్టు మొదలు చుట్టూ కడతారు. భర్తతో ఏడడుగులు నడిచారు కనుక చెట్టు చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేస్తారన్నమాట. భర్త దీర్ఘాయుష్మంతుడుగా వుండాలని కోరుకుంటూ మర్రి చెట్టుకు పూజలు నిర్వహిస్తుంది ప్రతి స్త్రీ.

## 275. ఓంకారం - విశ్వసృష్టి

**ఐ.** హైందవ చిహ్నాలన్నింటిలోకి అత్యంత పవిత్రమైనది ఓంకారం. ఇది అనంత




విశ్వంలో వినిపించే ధ్వని సంకేతం. ఈ సంకేతంలో సమస్త విశ్వవ్యాప్త శక్తి వుంది. ఇది సమస్త విశ్వ ప్రతిరూపం. అందుకే ప్రతి హైందవుడు తన అక్షరాభ్యాసాన్ని ఓంకారంతో ప్రారంభిస్తాడు. భగవంతునికి చేసే పూజలో ప్రతి మంత్రం ముందు ఓం అంటారు. ఓంకార రూపం ఇంటి తలుపులమీద, దేవాలయాల మీద, మత గ్రంథాల మీద, తప్పకుండా వుంటుంది. పుట్టినప్పటినుండి మరణించేవరకు హిందువుగా జీవించేవారికి ఓంకారం ఉచ్ఛరించడం దానిని రాయడం ఒక సాంప్రదాయ మవుతుంది. ఓంకారంని వివిధ రంగుల్లో గీస్తుంటారు.

## 276. షడ్దర్శనాలను వివరిస్తారా?

**జ.** షడ్దర్శనాలలో ఎక్కువగా తత్త్వ విషయాల్ని చర్చించారు. వీటిలో మొదటిది న్యాయశాస్త్రం. ఈ శాస్త్రం కర్త గౌతమ మహర్షి. న్యాయశాస్త్రం అంటే తర్క శాస్త్రమే. మనుషులు దైవతత్త్వాన్ని చేరుకోవడానికి తర్కం ఉపకరిస్తుందని దీనిలో పేర్కొన్నారు. తర్క శాస్త్రానికి సంబంధించిన వివిధ విధానాల్ని ఈ శాస్త్రంలో క్షుణ్ణంగా చర్చించారు.

## 277. పవిత్ర చిహ్నాల అర్థం పరమార్థం

ప్రపంచంలో ఎన్నో మతాలు. ఆయా ప్రాంతాలలోని పరిస్థితుల కనుగుణంగా ఏర్పడిన విశ్వాసాలు. ఆది, వ్యవస్థాపకుడు తెలియని హైందవమతం నుండి ఇటీవలే వచ్చిన సిక్కు మతం వరకు ప్రపంచ ప్రజలంతా తమకు నచ్చిన మతాన్ని అనుసరిస్తారు. మతాలు బోధించేది మానవత్వమే. అన్ని మతాల ఆలోచన ముక్తి పొందలమే. ఆ ముక్తి మార్గాలను ఎంచు కోవడంలోనే కొంచెం తేడా. మతం గురించి భక్తులకు తెలియ చెప్పేందుకు బోధనలతో పాటు పలు చిహ్నాలను మత పెద్దలు ఎంచుకున్నారు. నిర్దిష్ట పూజావిధానాలను ఏర్పరిచారు. ఏ సమయంలో పూజచేయాలి, ఎలా పూజ చేయాలి, ఎటుతిరిగి కూర్చుని పూజ చేయాలి అనేవి కూడా ఆ మత గ్రంథాలు చెపుతాయి. దేవునికి ప్రతీకలుగా వీటిని పరి గణిం




చాలి. ఆ భగవత్ సంజ్ఞలకు అర్థం ఏమిటో మత స్థాపకుడు వివరించారు. అప్పటినుండి అన్ని మతాల్లోనూ, పలు రకాల పూజసామగ్రి, పూజా సంకేతాలు గుర్తులు ఉపయోగిస్తున్నారు. ఏ మతం చూసినా ఇలాంటివి కనిపిస్తాయి. దేవుడి రూపం ఎవరికి తెలీదు. ఎవరికి తోచిన రూపం వారు ఊహించుకుంటారు. రూపం లేకపోయినా ప్రత్యామ్నాయ రూపాలను భక్తులకు అందించాయి మతాలు. ఒక్కో మతానికి ఒక పవిత్ర చిహ్నం వుంది. ప్రతి మత చిహ్నం వెనక చక్కని సందేశం వుంటుంది. అది అర్థం చేసుకోవడం భక్తులకు అవసరం.

ప్రతి మత చిహ్నం ఓ దివ్యసందేశం.
సమస్త విశ్వప్రతిరూపం ఓంకారం
సూర్యశక్తికి ప్రతీక స్వస్తిక్.
ఆత్మజ్ఞాన సంకేతం త్రినేత్రం.
సంపదను కూర్చే లక్ష్మీపాదాలు.
సంపూర్ణ జీవితానికి పూర్ణకుంభం
నాగరికతా చిహ్నం కమలం.
అష్టధర్మ జీవన ధర్మచక్రం.

## 278. భగవంతుడు మనలోనే

**జ.** జనక మహారాజు యాజ్ఞవల్క్య మహర్షిని ఒకసారి "భగవంతుడిని ఎక్కడ చూడగలను" అని అడిగాడు. "భగవంతుడు మరెక్కడో లేదు, నీ మనసులోనే ఉన్నాడు. చూసుకో" అని సమాధానం ఇచ్చాడాయన. నిజమే, భగవంతుడు మరెక్కడో ఉండడు. మనలో ఉన్న భగ



వంతుని అంశాన్ని బలవంతంగా అదిమిపెట్టి, బుద్బుదప్రాయమైన భౌతిక ఆకర్షణల వైపు మొగ్గు చూపుతూ మనం క్రమంగా మనుషులుగా, మరికొంచెం మొగ్గు పెరిగి రాక్షసులుగా తయారవుతున్నాం. నిద్రించే సమయంలో అనవసరపు ఆలోచనలన్నీ మరుగునపడి, మనసు ప్రశాంతంగా, ఎటువంటి బంధాలకు సంబంధం లేకుండా ఉండే ఒక అద్భుత స్థితే భగవత్ స్థితి. రాగద్వేషాలకు అతీతమైన అటువంటి స్థితినే భగవంతుడు మనకు మనసులోనింపి, ఈ లోకంలోకి పంపుతాడు. పసిపిల్లలుగా మనం ఉండే స్థితి అదే. అప్పటి నుండి పరిసరాలను నిశితంగా గమనిస్తూ, భగవత్ తత్వం అర్థం చేసుకుంటూ, దానిని పెంపొందించుకుంటే భగవంతుని వెంటే అడుగులను వేయగలుగుతామని గ్రహించాలి. ఆ మార్గం నుండి బయటకు వచ్చి, అర్థంలేని ఆకర్షణలకు గురయ్యేవారు మనసు నుండి భగవంతుని బహుదూరం నెట్టివేయట మవుతుంది.

## ౨౭౯. స్వధర్మాచరణం

**జ.** కోరికల సాఫల్యానికి, భయ విముక్తులు కావటానికి, మరే విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ఒకే ఒక మార్గాన్ని, అదే ధర్మ మార్గాన్ని అనురించాలి. దిలీప మహారాజు క్షాత్ర ధర్మాన్ని పాటిస్తూ ఒక గోవును రక్షించడం కోసం తన శరీరాన్ని సింహానికి సమర్పించాడు. శిబి చక్రవర్తి శరణాగత రక్షణ కోసం ఒక పావురానికి బదులుగా తన శరీరంలోని మాంసాన్ని కోసి ఇచ్చి మరణించేందుకు సిద్ధపడ్డాడు. ఆయా ధర్మకర్మల ఫలితంగా దిలీప మహా రాజు అభీష్టం నెరవేరింది. శిబి చక్రవర్తి త్యాగం ప్రశంసలందుకొన్నది. ప్రహ్లాదుడు భగవద్భక్తి రూపమైన స్వధర్మాన్ని పాటించి పలుమార్లు మృత్యు ముఖం నుండి బయటపడినాడు.

**శ్రేయాన్ స్వధర్మోవిగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్।**
**స్వభావ నియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥**

పరధర్మాన్ని బాగా ఆచరించుట కంటే గుణరహితమైన స్వధర్మాచరణమే మేలైనది. ఎవరి కర్మలను వారు ఆచరిస్తే ఎటువంటి పాపం అంటదు. ధర్మవ్యాధుడు బ్రహ్మజ్ఞాని. అయినప్పటికీ వృత్తి ధర్మాన్ననుసరించి మాంసం విక్రయించేవాడు. అది హింసాత్మకమైనా అతనికి పాప కృత్యం కాదు. వైద్యుడు తన వృత్తిధర్మాన్ని అనుసరించి శస్త్రచికిత్స చేస్తాడు. అది హింస కానేరదు. జన్మవల్ల, వృత్తివల్ల ప్రాప్తించిన స్వధర్మాన్ని ఎట్టి పరిస్థితిలోనూ విడువరాదు.

## ౨౮౦. నవగ్రహాలు వక్రదృష్టితోనూ శుభ దృష్టితోనూ చూస్తే కలిగే లాభలూ, నష్టాలూ....

**జ. రవి :** సర్వగ్రహాలకీ అధిపతి. ప్రాణ శక్తికి మూలకారకుడు. సహస్రకిరణుడు. రోగనిరోధక శక్తిని పెంచుతాడు. కుటుంబంలోని సభ్యుల మధ్య అవగాహనను



కలుగచేస్తాడు. స్త్రీలకు ఆభరణాలనూ పురుషులకు కీర్తినీ ఇస్తాడు. తూర్పు దిక్కుకి అధిపతి అయిన రవి వక్రదృష్టితో చూస్తే అయినవారి మధ్య గొడవలూ, నమ్మినవారే మోసం చెయ్యటమూ, వ్యాపార, ఆరోగ్య, ఆర్థిక సమస్యలనూ తెచ్చి పెడతాడు. రవి శనితో కలిస్తే కొత్త రోగాన్ని కలిగిస్తాడు. చంద్రునితో కలిస్తే మానసికంగా కృంగతీస్తాడు.

**చంద్రుడు :** ఔషదీనాధుడని పేరు. పితృదేవతలకిదే స్థానము. నీటి కారకుడైన చంద్రుడు మానవుడ్ని విశేషంగా ఆకర్షిస్తాడు. తెల్లని వస్తువులను ఇష్టపడే చంద్రుడు మనసుకు మనశ్శాంతిని ప్రసాదిస్తాడు. శత్రువుని కూడా మిత్రుడ్ని చేస్తాడు. కోపాన్నీ, అహాన్ని నియంత్రించి అనేక అవరోధములు రాకుండా చేస్తాడు. అలాగే ఇంట్లో



అనారోగ్యాలను సృష్టిస్తాడు. ధననష్టమూ, వ్యాపార నష్టమూ కలగ చేస్తాడు. అయిన వార్ని, ప్రేమించినవార్ని విడదీస్తాడు.

**కుజుడు :** భూమికి పుత్రుడు కుజుడు. ఈ గ్రహ ప్రభావం చాలా తీక్షణంగా ఉంటుంది. గొడవలకి ప్రేరేపిస్తాడు. అలాగే శరీరంలోని మలినాలనూ, విషాలనూ తొలగింపచేస్తాడు. కుజగ్రహ ప్రభావం మహిళలపై ఎక్కువగా ఉంటుంది. ఆవేశ పూరిత నిర్ణయాలని నిర్ణయించేలా ప్రభావం చూపుతాడు. కామాన్నీ, వ్యసనాలనీ ప్రేరేపిస్తాడు. అదే రాహువుతో కలిస్తే ఇక చెప్పనవసరం లేదు. రవితో కలిస్తే సమాజం కోసం సర్వశక్తులూ వొడ్డి పోరాటం జరుపుతాడు. రక్త సంబంధిత వ్యాధులొస్తాయి. కుజుడు బలంగా ఉంటే మంచి ఉద్యోగము వస్తుంది. కుజునకు అధిష్టాన దేవత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి. ఈ స్వామిని పూజిస్తే చక్కటి ఫలితాలు కలుగుతాయి.

**బుధుడు :** తారా చంద్రుల పుత్రుడు బుధుడు. వ్యాపారంపై, అన్నదమ్ముల



సఖ్యతపై, కుటుంబ ఆరోగ్యాలపై తన ప్రభావాన్ని చూపుతాడు. శుక్రునితో కలిస్తే తెలివి తేటలను పెంచుతాడు. మనిషిని ఉన్నతుడిగా చేసినా, అవివేకిగా చేసినా ఈ గ్రహమే కారణము. రచయితలకూ, కవులకూ, కళాకారులకూ ఈ బుధ గ్రహం అపార కీర్తినిస్తుంది. అదే వ్యతిరేకిస్తే బుద్ధి మందగిస్తుంది. రాతా, గీతా రెండూ గాడి తప్పుతాయి. అదే శనితో కలిస్తే అన్ని విషయాల్లోనూ అవరోధాలే. శనిరాహువులు కలిస్తే తలకు సంబంధిత సమస్యలొస్తాయి. బుధునకు అధిదేవత శ్రీమహావిష్ణువు. ఆయన్ని పూజించి ఈ గ్రహాన్ని ప్రసన్నం చేసుకోవాలి.

**గురు గ్రహము :** ఇంట్లో ఏ శుభకార్యము జరగాలన్నా, సంపూర్ణ శుభప్రదం కావాలన్నా ఈ గ్రహం చల్లగా చూడాల్సిందే. గురుబలం లేకపోతే ఎంతటి శక్తి సామర్థ్యాలున్నా వెనుక పడిపోవాల్సిందే. ఈ గురుగ్రహమే ధర్మ నడవడికకు అవకాశం కల్పిస్తుంది. ఈ గురు గ్రహానికి అధిదేవత బ్రహ్మ. అధిష్టానదేవత మహాశివుడు.

**శుక్రుడు :** భృగుమహర్షి పుత్రుడు. ధనానికీ, సుఖాలకీ, కీర్తికి ఇతనే కారకుడు. కామాన్ని శాసించేవాడు. వీర్యమును వృద్ధి చేసేవాడు.

శుక్రగ్రహ ఆశీస్సులు లేనిదే సుఖమన్నది తెలీదు. సంతోషమన్నది అనుభవించ లేరు. స్త్రీలకు సౌభాగ్యాన్నీ, సంతోషాన్నీ, ఆభరణాలనూ ఇచ్చేది సాహిత్యాలూ ఈ గ్రహ ప్రభావంతోనే వన్నెకొస్తాయి. పేరు తెచ్చి పెడతాయి. వ్యసనాలకూ, భోగా లకూ, ఇతనే కారకుడు. శుక్రుడు అనుకూ లించకపోతే అన్నీ బాధలే. స్త్రీలకు అనేక సమస్యలు. నిద్రపట్టనీయడు. అపకీర్తి, భార్యా భర్తల మధ్య గొడవలూ.... చేయా ల్సినవన్నీ చేస్తాడు. శుక్రునకు అధిష్టాన దేవత శ్రీరాజరాజేశ్వరీ దేవి.

**శని గ్రహము :** ఈ గ్రహం పేరు ఎత్తితేనే అరికాలి నుంచి వణుకు ప్రారంభమవు తుంది. శని సూర్యుని పుత్రుడు. బహు తీక్షణ స్వభావం కలవాడు. కాలాన్నీ, ధనాన్నీ, ఆరోగ్యాన్నీ హరిస్తాడు. అనేక నీచపనులు చేయించి భ్రష్టుపట్టిస్తాడు. గరీబును నవాబుగా, నవాబును గరీబుగా చేయగల సర్వసమర్థుడు. ఏలిననాటి శని, అష్టమశని, అర్ధాష్టమశని అని మాన వులను బెంబేలెత్తిస్తాడు. రాహువూ ఈ గ్రహానికి అనుకూలంగా పనిచేస్తాడు.




మానవుని అహంకారాన్ని అణిచి, ధర్మ శీల గుణాలనూ కలిగిస్తాడు. సోమరి తనాన్ని పెంచుతాడు. శనికి అధిదేవత యముడు. అధిష్టాన దేవత కలియుగ దైవం తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి.

**రాహువు :** ఈ గ్రహం ఛాయ గ్రహము. అయినా రవినీ, చంద్రుడ్నీ ఆపగల శక్తి వంతుడు రాహువు. ఈ రాహు గ్రహ దశ బాగోలేకపోతే పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అలాగే రాహువు కొత్తను తీసు కొస్తాడు. కొత్త మిత్రులూ, కొత్త అల వాట్లూ వాటితో పాటు ప్రయాణాలను చేయిస్తాడు. రాహువు అనుకూలిస్తే అధి కారము అంది వస్తుంది. కన్నెర్ర చేస్తే ఉన్న కొద్దిపాటి అధికారమూ గల్లంతే. అనేక అవలక్షణాలను కలిగించి నష్టాల్ని సమకూర్చి పెడతాడు. భయాల్ని కలగ చేస్తాడు. చెడు సలహాలను వినేలా ప్రేరే పిస్తాడు. రాహువు ఎన్ని ప్రయోజనాలు కలిగించినా ఎంతో కొంత నష్టాన్నీ కలగ చేస్తాడు. రాహువు అధిష్టాన దేవత దుర్గాదేవి.

**కేతు గ్రహము :** బ్రహ్మమానస పుత్రిక మృత్యువు సంతానమే కేతువు. ఈ గ్రహం పెట్టే బాధలు భయంకరము. కేతువు బుధునితో కలిస్తే సర్వ శక్తులకూ విఘా తము కలిగిస్తాడు. చేయని తప్పులున్నా పైకి రాలేరు. ఈ కేతు గ్రహ ప్రభావం తగ్గాలంటే ఈ గ్రహ అధిష్టాన దేవత వినాయకుడిని పూజించాలి. గణపతిని పూజించి ఈ గ్రహాన్ని ప్రసన్నం చేసుకోవాలి.

## 281. శ్రీకృష్ణుడు నెమలి పింఛాన్ని ఎందుకు ధరిస్తాడు?

**జ.** సృష్టిలో సంభోగం చెయ్యని ప్రాణి నెమలి మాత్రమే. శ్రీకృష్ణునికి పదహారు వేలమంది గోపికలు. అన్ని వేల మంది భామలతో శ్రీకృష్ణుడు సరససల్లాపాలు మాత్రమే చేశాడు.



అల్లరి చేసి ఆడాడు. అంత వరకే మెలిగాడు. ఆ విషయాన్ని తెలియ చేయటమే శ్రీకుష్ణుడి పైనున్న నెమలిపింఛం భావం. శ్రీకృష్ణుడు కొంటెవాడు మాత్రమే. అయితే శ్రీకృష్ణుడు భోగిగా కనిపించే యోగీశ్వరుడు. వారందరితో పవిత్ర స్నేహ సన్నిహితంగా ఉన్నానని పదే పదే చెప్పటమే నెమలిని ధరించటము. నెమలి అంత పవిత్ర మైనది కనుకే మన జాతీయ పక్షి అయింది.

## 282. మానవుడు చెయ్యకూడని ధర్మాలు

**జ.** పరిగిత్తేవారికీ, ఆవులించే వారికీ, తలస్నానం చేస్తున్నవారికి నమస్కరించకూడదు. ఉదయించే, అస్తమించే సూర్యుడ్ని నీళ్ళలోనూ, అద్దంలోనూ చూడరాదు. భార్య గర్భవతిగా ఉన్నప్పుడు నదీ స్నానమూ, సముద్ర స్నానమూ చెయ్యరాదు. అలాగే క్షౌరమూ, పర్వతా రోహణమూ చెయ్యరాదు. స్త్రీలను కాటుక పెట్టుకునేటప్పుడూ, స్నానం చేసేటప్పుడూ గాంచరాదు. తన నీడను తానే నీటిలో చూసుకొనుట, రాత్రిపూట చెట్ల ఆకులను కోయుట, రాత్రి పూట బావిలో నీళ్ళు తోడుట చేయరాదు. తలకూ, శరీరానికీ నూనె రాసుకొని మల మూత్రాలు విడవరాదు. భోజనం చేస్తున్న భార్యను, ఆవలిస్తున్న భార్యనూ, తమ్ముతున్న భార్యనూ చూడరాదు. అలా చూడాల్సి వస్తే వెంటనే పక్కకు తిరగాలి. చతుర్ధశి నాడు క్షీరమూ, అమావాస్యనాడు సంసార సుఖాన్ని గూర్చి మర్చిపోవాలి. అలాగే మొలత్రాడు లేకుండా మగవాడు ఎట్టి స్థితిలోనూ ఉండరాదు. గుమ్మడి కాయను స్త్రీ ఎలా పగల కొట్ట కూడదో, దీపాన్ని పురుషుడు ఆర్ప కూడదు. నీళ్ళు త్రాగే జంతువులనీ, పాలు త్రాగుతున్న దూడను అదిలించరాదు.

## 283. పిల్లలకి దిష్టి ఎందుకు తీస్తారు?

**జ.** పిల్లలకి పుట్టిన రోజు పండగ సమయాల్లో ఇంకా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న పెద్దలకీ, పిల్లలకీ దిష్టి రకరకాల పద్ధతుల్లో తీస్తారు. పిల్లలూ, పెద్దలూ విజయాలు సాధించినప్పుడూ, బాగా పొగిడి



నప్పుడూ, అతిగా నీరసం ఆవహించి అడ్డం పడ్డా దిష్టితీస్తారు. పిల్లలకి పసుపూ, సున్నం కలిపిన నీటితో దిష్టి తీస్తారు. జనులందరి దృష్టిదోషం తగలకుండా ఉండాలని దిష్టి తీస్తే పిల్లవాడు కలత నిద్ర పోవటమూ, నిద్రలో ఉలిక్కిపడుతూ లేవటం వంటి అవ లక్షణాలు లేకుండా ఉంటాడు. పిల్లలు కావచ్చు, పెద్దలు కావచ్చు. అనేక వేడుకల్లో పాల్గోనటం వల్ల చుట్టూ అంతా గుమికూడటం వల్ల కొంత అనారోగ్యానికి గురిఅవుతారు. అందుకే పెళ్ళిల్లోనూ, పుట్టిన రోజు లప్పుడూ విధిగా హారతి ఇచ్చి చివరలో ఎర్ర నీళ్ళతో దిష్టితీస్తారు. ఎర్రరంగు పదే పదే చూడటంవల్ల అనేక రోగాలు పోతాయి. మనసుకి ప్రశాంతతో పాటు ధైర్యగుణం వస్తుంది.

## 284. ఎలాంటప్పుడు భోజనాన్ని తినకూడదు?

**జ.** గ్రహణం రోజున అనగా సూర్య గ్రహణానికి పన్నెండు గంటల ముందుగా,



అలాగే చంద్రగ్రహణానికి తొమ్మిది గంటల ముందుగా ఎలాంటి ఆహారాన్ని తీసుకో కూడదు. దూడను కన్న తర్వాత పశువు నుంచి పదిరోజుల వరకూ పాలు సేవించరాదు. తడి పాదాలతో భోజనమూ, పొడిపాదాలతో నిద్ర అనారోగ్యాన్ని కలుగ చేస్తాయి. రాత్రి పడుకునే ముందు కాళ్ళు కడుక్కుని నిద్రకు ఉపక్రమిస్తే సుఖనిద్ర పడుతుంది. అలాగే పడుకునేటప్పుడు తప్పనిసరిగా పక్కనే అందుబాటులో మంచినీరు ఉంచుకోండి.అలాగే గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం నిద్ర మధ్యలో శరీర ధర్మం నిర్వర్తించాల్సివస్తే, అలా మగతగా నడుస్తూ వెళ్ళకండి. ఎక్కువ ప్రమాదాలు జరిగేది ఆ సమయం లోనే. ఓ క్షణం పూర్తిగా ఇహలోకం లోకి వచ్చి ఆపై శరీర ధర్మం తీర్చండి.

## 285. 'ఏడు' సంఖ్య రోదన సంఖ్యా?

**జ.** తిరుమల ఏడుకొండలు.... ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడి నుంచి వచ్చే కిరణాలు ఏడు, మన క్రింద ఏడు లోకాలు,

# 7

మనపైన ఏడులోకాలు. ద్వీపాలు ఏడు. వివాహంలో దంపతులు కలసి వేసేవి ఏడు అడుగులు. అగ్ని దేవుని నాల్కలు ఏడు... బ్రహ్మోత్సవాలు జరిగేదీ ఏడవ నెలలో. సప్త స్వరాలు కూడా ఏడే. ఏడు సంఖ్యమంచిది కాదని కొందరి నమ్మ కము. ఏడు కూడా మంచిదే. భగవం తుడు సృష్టించిన ప్రతిదీ మానవుని కోసమే. దాన్ని ఉపయోగించే పద్ధతుల వల్లే ఫలితం మనుజునికి వస్తుంది.

## 286. భగవంతుని దీపాన్ని ఏ నూనెతో వెలిగించాలి?

**జ.** ఆవునెయ్యి ఉత్తమము. మంచి నూనె మధ్యమము. ఇప్ప నూనె అధమము. ఆవునెయ్యితో వెలిగించిన దీప ఫలం అనంతము. అష్టైశ్వర్యాలూ, అష్టభోగాలూ లభిస్తాయి. వెండి లేదా పంచలోహాల తోనూ, మట్టితో చేసిన ప్రమిదలు శ్రేష్టము. ఆముదంతో వెలిగించిన దాంపత్య సుఖమూ, జీవిత సౌఖ్యమూ లభిస్తాయి.



వేరుశెనగ నూనెతో దీపాన్ని దేముని ముందు పెట్టరాదు. శ్రీమహాలక్ష్మికి ఆవు నెయ్యి దీపమూ, గణపతికి నువ్వుల నూనెతో వెలిగించిన దీపము అన్న ప్రీతి.

## 287. లక్ష్మీదేవి తామర పువ్వులోనూ, ఇరువైపులా ఏనుగులతోనూ ఎందుకు ఉంటుంది?


**జ.** సరస్సులో తామర నిలకడగా ఉండదు. నీటి ప్రవాహానికి కదులుతూ ఉంటుంది. తానూ నిలకడలేని దానిని అని చెప్పటమే



లక్ష్మీదేవి తామర పూవులో కొలువై ఉండ టము. ఇరువైపులా ఏనుగుల అర్థం.... ధనబలము గజబలమంతటిదని అర్థం చేసుకోమని పరమార్థం. తన చంచ లత్వాన్ని తెలియ చెప్పే ఉద్దేశ్యము నీటిలో వున్న కలువ పువ్వుని ఆసనంగా చేసు కోవటము.

## 288. తిరుమలలో పూలబావి ప్రత్యేకత ఏమిటి?

అద్దాల మంటపానికి ఉత్తరం వైపున ఉంది ఈ పూలబావి. స్వామివారికి సమ ర్పించిన తులసీ, పూలమాలలూ, పుష్పా



లనూ ఎవ్వరికి ఇవ్వకుండా ఈ పూలబావి లోనే పడేస్తారు. ఆపద సంభవించినప్పుడు తొండమానుడు ఈ పూలబావి రహస్య మార్గం ద్వారానే శ్రీనివాసుడ్ని శరణు వేడాడు. స్వామివారు ఆ సమయంలో ఏకాంతంగా ఉన్నారు. తొండమానుడ్ని చూసి శ్రీమహాలక్ష్మి సిగ్గుతో శ్రీమహా విష్ణువు వక్షస్థలంలో చేరితే, భూదేవి తొండ మానుడు కట్టించిన పూలబావిలోకి వెళ్ళి దాక్కుందని వరాహపురాణం చెబుతోంది.

## ౨౬౨. ఉత్తరం వైపు తలపెట్టి ఎందుకు నిద్రించ కూడదు?

**జ.** మన భూమిలో అయస్కాంత శక్తి ఉత్తర దక్షిణాలుగా ఇమిడి ఉంటుంది. మనమూ అలానే నిద్రపోయామంటే ఉత్తర దక్షిణాల్లో ఇమిడి ఉన్న అయ స్కాంత శక్తి తరంగాలు మన మెదడులోని శక్తివంతమైన విద్యుత్ తరంగాలని తగ్గించి వేస్తాయి.

దానివల్ల అనేక ఆరోగ్య, మానసిక సమస్యలు. రక్త ప్రసరణ వ్యవస్థలో మార్పు వస్తుంది. మెదడులో లోపాలు తల ఎత్తుతాయి. అలా కాకుండా తూర్పు పడమరల వైపు నిదురిస్తే మెదడు సుఖ వంత స్థానంలో ఉండి మెరుగు పడు తుంది. రక్త ప్రసరణ సరిగా జరిగి శరీరాన్ని ఉత్తేజం చేస్తుంది.

## ౨౬౦. స్త్రీ తన కన్నా వయసు ఎక్కువ ఉన్న పురుషుడిని ఎందుకు వివాహం చేసుకోవాలి?

**జ.** తన కన్నా ఎక్కువ వయసుగల స్త్రీతో శారీరక సంబంధము వల్ల పురుషునికి శక్తి తగ్గిపోతుందనేది అసత్యం. స్త్రీ కి సిగ్గూ, బిడియమూ ఎక్కువ. కాన ప్రేమతో లాలించి, బుజ్జగించాలంటే తన కన్నా చిన్నదవ్వాలి. స్త్రీ సహజంగా పురు షుని కన్నా బలవంతురాలు కాదు. కాన సంసారాన్ని మోయలేదు. కష్టించలేదు. పైగా స్త్రీ పెద్దదయితే కుటుంబభారం స్త్రీ మీద పడుతుంది. మగవాడిదే కుటుంబ భారమని చెప్పటమే పరమార్థం.



అందువల్లే భార్యకంటే భర్తకి ఎక్కువ వయసు ఉండాలన్నది నియమముగా పెట్టారు పెద్దలు.

## 291. బిక్షాటన పవిత్రమైనదా?

**జ.** పూర్వము ఇప్పటిలా పుస్తకాలూ, ప్రసార మాధ్యమాలు లేవు. తాళ పత్రాల లోనే ఏ విషయమైనా ఉండేది. కావ్యాలూ, రచనలూ చేయని కాలంలో మునివాసం చేసిన విద్యార్థులు వారు నేర్చుకున్న కళను అందరికీ పంచటానికి రాగయుక్తంగా పాడుతూ, విన్పిస్తూ పల్లెల్లో, నగరాల్లో తిరిగేవారు. వారు నేర్చుకున్న విద్యను పదిమందికి తెలియచెప్పి ప్రజ లిచ్చిన కాయా, పండును తీసుకుని ముందుకు కదిలేవారు. అది యాచన కాదు. బోధించటము. అలానే లవ కుశులు రామగాథను గానం చేస్తూ పర్య టిస్తూ అయోధ్య చేరి శ్రీరాముని గాథను శ్రీరామునికే విన్పించారు.

## 292. పూజలో కొబ్బరికాయ కుళ్ళితే మంచిదా?

**జ.** పూజలో కొట్టిన కాయ కుళ్ళితే దోషమేమి కాదు. తెలిసి చేసిన పని కాదు. దేవాలయాల్లో కొట్టే కాయ కుళ్ళితే వెంటనె నీళ్ళతో శుభ్రంచేసి మళ్ళీ మంత్రో చ్ఛాటన చేసి మళ్ళీ స్వామిని అలంకరి స్తారు. అనగా కుళ్ళిన కాయ దోషమేకాని ఇచ్చిన వ్యక్తికి సంబంధించినదికాదు. ఇంట్లో పూజ చేసేటప్పుడు కుళ్ళితే తీసేసి కాళ్ళూ, చేతులూ, ముఖమూ, పూజా



మందిరాన్ని శుభ్రం చేసి మళ్ళీ పూజ చేయటం మంచిది. అదే వాహనాలకి కొట్టే కాయ కుళ్ళితే, అంత దిష్టీ పోయి నట్టే. అయినా మళ్ళీ వాహనం కడిగి ... మళ్ళీ కాయకొట్టాల్సిందే. మనసులో అను మానం ఉంచుకునే కంటే, మళ్ళీ చెయ్యటం మంచిది.

## 293.బెజవాడ కనకదుర్గమ్మ ముక్కు పుడకను కృష్ణమ్మ అందుకుంటే కలియుగాంత మేనా?

**జ.** పోతులూరి వీరబ్రహ్మం గారు కాల జ్ఞానంలో ఎన్నో చెప్పారు. పొగబండ్లు నడుస్తాయని, ముఖానికి రంగేసుకున్న



వారు నాయకులవుతారనీ, భర్తలేని స్త్రీ రాజ్యమేలు తుందనీ, నీళ్ళుకొనుక్కుం టారనీ .... అన్నీ జరిగాయి. పై విషయా లన్నీ చెప్పారు. కనకదుర్గమ్మ ముక్కు పుడకను కృష్ణమ్మ అందుకుంటే కలి యుగం అంతమయిపోయినట్టే. అంత ఎత్తున కృష్ణమ్మ ఎగిస్తే ఇక భూమి మీద ఏం మిగులుతుంది?

## 214. కార్తీకమాసంలో ఆహారంతో పాటు తీసుకోకూడనివి ఏవి?

**జ.** ఉల్లిపాయ, ఇంగువ, ముల్లంగి, ఆనపకాయ, మునగకాయ, వంకాయ, గుమ్మడి కాయ, పుచ్చకాయ, వెలగపండు,



చద్ది అన్నము. మినుములు, పెసలు, శెన గలు, ఉలవలు, కందులు ఇవన్నీ వాడ రాదు. అష్టమినాడు కొబ్బరీ, ఆదివారము ఉసిరీ తినరాదు.

## 215. 'అతిథి దేవోభవ' అని అనేదెందుకు?

**జ.** అతిథి భగవత్ స్వరూపుడు. తన పుణ్యాన్ని మనకివ్వటానికి అతిథిగా మన గృహానికి వస్తాడు. అట్టి అతిథికి అతిథి సత్కారాలు చేయనిచో అతని పాపాలన్నీ మనకు సంక్రమిస్తాయి. అతిథి పూజ వల్ల ఆయుష్షు పెరుగుతుంది. పురాణ, ఇతిహాసాల్లో అతిథికెంత ప్రాముఖ్య ముందో విపులంగా ఉంది.

## 216. మంగళ, శుక్రవారాలు ధనాన్ని ఎందుకివ్వరు?




**జ.** సంపాదించేవాడు సంపాదిస్తుంటే ఖర్చు చేసేవాళ్ళు ఖర్చు చేస్తారు. కనీసం ఆ రెండు రోజులైనా ఆపాలన్న ప్రయ త్నము. అలాగే అమావాస్యనాడు కూడా అప్పు ఇవ్వరు. ధనాన్ని అదుపు చెయ్య టానికి మంచి పద్ధతే అయినా మనకి గానీ, ఇతరులకు గానీ కష్టసమయాల్లో ఈ నియమం పనికిరాదని శాస్త్రం చెబు తుంది. అలాచెయ్యటంవల్ల ధనం మరింత పోతుందని శాస్త్రం సెలవిస్తోంది.

## 217. అలిగి అత్తవారింటికి, చెడి చెల్లెలింటికి వెళ్ళకూడదని ఎందు కంటారు?

**జ.** పూర్వకాలంలో కొడుకుని సరయిన దారిలో పెట్టలేకపోతే, సంవత్సరం పాటు అత్తగారింటికి పంపేవారట. అంటే శిక్షతో సమానము. మహాభారతంలో ధృతరాష్ట్రుడు తన బావమరిది శకునిని హస్తినలో ఉంచు కోవటం వల్ల ఎంత అనర్థం జరిగిందో

తెలియనిది కాదు. తన వారి మీద అలిగి అత్తింటికి వెళితే కోల్పోయేది ఆర్థిక స్వేచ్ఛ, సాంఘిక స్వేచ్ఛలతో పాటు మాన సిక ఆనందం కూడా. అలాగే చెడి చెల్లె లింటికి వెళ్ళకూడదు. ఎందుకంటే ఆడ పిల్ల పుట్టింటి నుంచి ప్రేమా, వాత్స ల్యమూ, ధనమూ ఆశిస్తుంది. అలాంటి చెల్లి ఇంటికెళ్ళి ఆ మూడు ఆమె నుంచి ఆశించటం వల్ల చులకనవుతాడు. కాని వాస్తవానికి చులకనయ్యేది మనమే కాదు, అత్తింటి చెల్లి కూడా. అందుకే చెడి చెల్లి లింటికి వెళ్ళొద్దనేది.

## ౨౯౮. ధ్యానం ఆయుష్షును పెంచుతుందా?

**జ.** ఖచ్చితంగా. ధ్యానం ద్వారానే కాదు. నడకా, వ్యాయామాల్లో దేని ద్వారా నయినా ఆయుష్షుతో పాటు ఆరోగ్యము పెరుగుతుంది. శ్వాస సంబంధిత వ్యాయా మాల్లో ప్రేవులూ, ఉదరమూ, మెదడూ, హృదయమూ రిలాక్స్ అవుతాయి. శ్వాస సంబంధిత వ్యాయామాల ద్వారా శరీరం లోని భయంకర విషగాలి బైటికి వెడు



తుంది. అందుకనే ధ్యానం సాధ్యమైనంత వరకూ ఒక్కరే చెయ్యాలని చెప్పేది.

## ౨౯౯. వ్యసనముల వల్ల ఏం కోల్పోతాము?

**జ.** మొదట ఆరోగ్యాన్నీ, తర్వాత ధనాన్నీ, ఆపై ఆత్మవిశ్వాసాన్నీ పోగొట్టుకుంటాడు. అలా వ్యక్తిత్వాన్ని కోల్పోయిన మనిషి భార్య బిడ్డల మీద అకారణ ద్వేషాన్నీ కోపాన్నీ పెంచుకుంటాడు. కుటుంబంలో కలహాలని తెచ్చుకొని వ్యధలకు లోనవు తాడు. అవసరం కోసం, వ్యసనాల కోసం అబద్ధాలని చెప్పి తద్వారా నలుగురిలో చులకన అవుతాడు. సర్వ ఆనందాలకి సమానమైన స్త్రీ సౌఖ్యానికీ, సుఖాలకీ దూరమవుతాడు. భ్రష్టుడవుతాడు. నేర స్థుడు కూడా అవుతాడు. తుదకు తన జీవితాన్ని నాశనం చేసుకుంటాడు. ఆపై తనని నమ్ముకున్న వారి జీవితాలని నట్టేట ముంచుతాడు.

## ౩౦౦. గరుడ పురాణము ఇంట్లో ఉంచుకోవచ్చా?

**జ.** వ్యాసభగవానుడి పద్దెనిమిది పురా ణాలో ఒకటి గరుడ పురాణము. నరకం గూర్చి పాపుల శిక్షల గూర్చి గరుత్మంతుడు అడిగిన ప్రశ్నలకు విష్ణువు చెప్పిన సమా ధానాలు ఈ పురాణంలో ఉన్నాయి. దీనిలో ప్రేతకల్పము ఉండటం వల్ల ఇంట్లో ఉంచుకోవచ్చా అన్న సందేహం చాలా మందిలో ఉంది. ఈ పురాణం వ్యాస విరచితము. అన్ని పురాణాల్లా దీన్ని

ఇంట్లో ఉంచుకోవచ్చు. ఎవ్వరికైనా ఈ పురాణం ఇవ్వాలంటే హంస ప్రతిమతో ఇవ్వాలి. వ్యాసుడు రాసిన పురాణాన్ని ఇంట్లో ఉంచుకోవచ్చా అని సందేహం కూడా తగదు.

## 301. కుంకుడూ, మామిడీ, దానిమ్మ వంటి చెట్లను గృహాల్లో ఎందుకు పెంచకూడదు?



**జ.** ఇలాంటి చెట్లు నీటి శాతాన్ని ఎక్కువగా పీలుస్తాయి. తద్వారా గృహావసరాలకి ఉపయోగపడే అనేక చెట్లు, నీరు సరిపోక పెరగవు. కొన్ని చెట్లు గృహయజమాని జాతకానికి సరిపోవు. అందుకే సర్వసమ్మతమైనవీ, గృహావసరాలకి ఉపయోగపడే చెట్లనే పెంచుకుంటారు. పై చెట్లు పెంచాలనుకుంటే మీ మీ జాతకాల ప్రకారం సరిచూసుకుని పెంచుకోండి.

## 302. చెవులెందుకు కుట్టిస్తారు?

**జ.** ఆడపిల్లలకు చెవులూ, ముక్కూ కుట్టించి చక్కని ఆభరణాలు ధరింపచేసి లక్ష్మీదేవిలా తలచుకొని మురిసిపోయే ఆ కార్యక్రమంలో మరో ఆరోగ్య రహస్యం కూడా ఉంది. చెవులు కుట్టించుకుంటే



కంటి చూపు శక్తి పెరుగుతుంది. ఆక్యుపంక్చర్ వైద్య విధానం చెవి కుట్టించుకుంటే శరీరం మొత్తానికి మంచిదని చెబుతోంది.

## 303. పండగ రోజుల్లో, పుణ్యరోజుల్లో ఉల్లిపాయను తినకూడదా?

**జ.** అలాంటి రోజులు ఎంతో పవిత్రమైనవి. ఆరోజంతా నిర్మలంగా, ప్రశాంతంగా మనస్సూ, శరీరమూ భగవంతుని మీదే లగ్నం చేయాలి. అలా ఉంచాలంటే ఉల్లిపాయను తినకూడదు. ఉల్లిపాయలో ఉత్తేజం చేసే శక్తి ఉంది. నిగ్రహాన్ని సడలించేలా చేస్తుంది. కాన వాటిని ఆ రోజుల్లో దూరంగా ఉంచాలి.



## 304. నిజం నిప్పులాంటిదనీ, ఆవు ముఖాన్ని చూడకూడదనీ ఎందుకంటారు?

**జ.** అసత్యం ఎంత గొప్పవారు ఆడినా తెలుస్తుందని అంటారు. ఆ శక్తి సత్యానిది. అందుకనే నిజం నిప్పులాంటిదనీ



అంటారు. శివలింగం అగ్రభాగాన్ని బ్రహ్మ దేవుడూ, అడుగు భాగాన్ని మహా విష్ణువు చూసి రావాలని పందెము వేసు కున్నారు. దేవతలు సాక్షిగా ఇద్దరూ బైలు దేరుతారు. బ్రహ్మ ఎంత దూరం వెళ్ళినా అగ్రభాగం కనిపించదు. విష్ణువుకు అడుగు భాగం కన్పించదు. బ్రహ్మ దేవు డికి మార్గంలో దేవలోకపు గోవూ, మొగలి చెట్టూ కన్పిస్తాయి. బ్రహ్మ వారితో తాను అగ్రభాగము చూసినట్టు దేవతలకి సాక్ష్యం చెప్పమంటాడు. అంతటి వాడ డిగితే కాదనటమా అని బ్రహ్మతో కలిసి వెళ్ళి బ్రహ్మ శివలింగం అగ్రభాగం చూశా రని చెబుతాయి. దేవతలు నిజమని నమ్మి బ్రహ్మదేవుడ్ని విజేతగా ఎంపిక చేస్తారు. ఈలోగా విష్ణువు వస్తాడు.

అదే సమయంలో ఆకాశవాణి దేవలోక గోవూ, మొగలి పువ్వు అబద్ధం చెప్పాయని తెలియచేస్తుంది. దానితో అసత్యాన్ని పలికిన బ్రహ్మ దేవునికి పూజలుండవనీ, అబద్ధపు సాక్ష్యాన్ని చెప్పిన మొగలి పువ్వు పూజకు పనికి రాదనీ, గోవు ముఖము చూస్తే దోషమని శాపము అని చెప్పుదురు.

## 305. పరస్త్రీ వ్యామోహం సర్వనాశనమేనా?

**జ.** ఒకరి సంగతి అనవసరం. లంకేశ్వ రుడు రావణబ్రహ్మ మహా పండితుడు. వ్యాకరణ కోవిదుడు. రాజనీతిజ్ఞుడు, ధర్మ సూక్ష్మాలను ఎరిగినవాడు. అర్ధశాస్త్ర గణి తాల్లోనూ, ఆయుర్వేదంలోనూ, శిల్ప, గాంధర్వ శాస్త్రాల్లో అతనికి అతనే సాటి. సకల లోకాలన్నింటినీ నోటిమాట ద్వారా శాసించినవాడు. పరమేశ్వరుని వెండి కొండనే ఎత్తిన బలవంతుడు, భక్తి పరుడు. అంతటి వ్యక్తే పరస్త్రీ వ్యామోహం వల్ల ఏమయ్యాడో మనకు తెలుసు. ఇక వేరేవారి సంగతి చెప్పాలా ?

## 306. వివాహంలో ఖచ్చితంగా చేయాల్సిన విధులు పదహారు ... అవి ఏమిటి?

**జ.** ఒకటి వరాగమనమూ, రెండు స్నాత కము, మూడు మధుపర్కమూ, నాలుగు మంగళ స్నానమూ, అయిదు గౌరీపూజ, ఆరు కన్యావరణమూ, ఏడు కన్యా దానమూ, ఎనిమిది సుముహూర్తమూ, తొమ్మిది మంగళ సూత్రధారణమూ, పది తలం బ్రాలూ, పదకొండు హోమమూ, పన్నెండు



పాణి గ్రహణమూ, పదమూడు సప్తపదీ, పద్నాలుగు అరుంధతీ నక్షత్ర దర్శనమూ, పదిహేను స్థాలీపాకమూ, పదహారు నాగ వల్లీ.... ఈ విధులతో వివాహ మహోత్సవం సంపూర్ణమవుతుంది. పూర్వము పెళ్ళంటే పదిరోజులు పైనే చేసేవారు.

## 307. యోగాలో శవాసనానికి ఎందుకంత ప్రాముఖ్యత?

**జ.** యోగ పద్ధతుల ద్వారా శరీరంలోని రక్తం ఒకే ప్రదేశానికి చేరుతుంది. అలా అంత రక్తం ఎక్కువగా ఓ అవయవం దగ్గర చేరడంతో, ఆ ప్రదేశంలోని మాలిన్యాలన్నీ తొలిగిపోతాయి. ఉదాహరణకు వజ్రాసనం వేయటం ద్వారా కాలు, పిరుదుల్లోని రక్తం పొట్టలోకి చేరుతుంది. కాన పొట్ట ప్రదేశం శుద్ధి అవుతుంది. ఇలా అనేక రకాలుగా యోగా చెయ్యటం ద్వారా శరీరంలోని రక్తం పరుగులు పెడుతుంది. శవాసనం ద్వారా తిరిగి ఏ అవయవంలోకి ఎంత రక్తం అవసరమో అంత రక్తం చేరుతుంది. తద్వారా శరీరంలోని చాలా మాలిన్యం పోయి ఆరోగ్యవంతుడవుతారు.

## 308. జీర్ణము, జీర్ణము వాతాపి జీర్ణము అని ఎందుకంటారు?

**జ.** దండకారణ్యంలోని ఇల్వలుడూ, వాతాపీ అనే రాక్షస సోదరులు, అరణ్యంలో వచ్చే పోయేవారిని మాయమాటలతో పిలుచుకు వచ్చి ఆరగిస్తుంటారు. అతిథి పూజకని భోక్తలను పిలుస్తాడు



ఇల్వలుడు. వారు రాకముందే వాతాపి మేకలా మారిపోతాడు. ఇల్వలుడు మేకను కోసి వండి వడ్డిస్తాడు. వాతాపి భోక్తల కడుపు చీల్చుకుని బయటికి వస్తాడు. ఆ తర్వాత ఎంచక్కా వార్ని ఇద్దరూ కలసి భుజిస్తారు. అగస్త్యుడికి ఈ విషయం తెలిసి భోక్తలా వెళతాడు. ఎప్పటిలానే ఇల్వలుడు వాతాపిని వండి వడ్డిస్తాడు. అగస్త్యుడు భుజించిన తర్వాత ఎప్పటివలె 'వాతాపీ బైటకిరా' అంటాడు. అప్పుడు అగస్త్యుడు 'ఇంకెక్కడి వాతాపి.... ఎప్పుడో జీర్ణమయిపోయాడు. 'జీర్ణము, జీర్ణము వాతాపి జీర్ణమంటూ' పొట్టను రుద్దుకుంటాడు. అలా అగస్త్యుడు వాతాపిని జీర్ణము చేసుకొని ఇల్వలుడ్ని బూడిద చేస్తాడు. ఎంత చెడు ప్రభావం కలదైనా, అరగనిదయినా అలా అంటే కడుపులో కొండ ఉన్నా అరుగుతుందని తల్లి నమ్మకము. అందుకనే తల్లి పిల్లలకి భోజనం పెట్టి పూర్తయిన తర్వాత ఆ మాటం టుంది.

### 309. ధనమేరా అన్నిటికీ మూలం

**జ.** ధనం సంపాదించకుంటే తల్లి నిందిస్తుంది. తండ్రి సంతోషించడు. అన్న



దమ్ములు మాట్లాడరు. పనివాడు కోపిస్తాడు. భార్య రాత్రి పూట కూడా దూరంగా ఉంచుతుంది. మిత్రుడు ఎదురైనా పలకరించడు. కాన విధిగా మానవుడు ధనాన్ని సంపాదించాలి. కూడబెట్టాలి.

### 310. సుఖంగా ఉండటమంటే?

**జ.** ఎక్కువ ధనాన్ని కలిగి ఉండటము, ఆరోగ్యంగా జీవించటము, భార్య ప్రియంగా దగ్గరికి రావటము, మీ మాటలను జవదాటని పుత్రులు, ఆధ్యాత్మిక చింతన చెప్పే గురువులూ ఇవన్నీ ఉన్నవారు సుఖజీవులు.


### 311. భార్యను పూర్తి నగ్నంగా ఎందుకు చూడకూడదు?

**జ.** మీ భార్యను మీరు పూర్తి నగ్నంగా చూడటము పాపము కాదు. అయినా చూడొద్దనే ధర్మశాస్త్రం చెబుతుంది. అలా చూడటం వల్ల భర్తకు భార్యపై ఇష్టమూ, మమకారమూ తగ్గిపోతాయి. కామరసం తగ్గుతుంది. సౌందర్యాన్ని దాచి కొద్ది కొద్దిగా అనుభవించాలి. స్త్రీ దాచుకున్నప్పుడే పురుషునిలో కామం వృద్ధి పొందుతుంది. విప్పదీస్తే ఆపై చూడటానికీ, కోరిక తెచ్చుకోవటానికీ ఇంకేమీ ఉండదు. అలాగే భార్య తల దువ్వుకునే సమయాల్లోనూ, ఆవులించేటప్పుడూ, బట్టలు ధరించేటప్పుడూ, బహిష్ఠు, ప్రసవ సమయాల్లోనూ దగ్గర ఉండరాదు.

### 312. భగవంతుని పూజకు ఏ పూలు శ్రేష్ఠమైనవి?

**జ.** పరమేశ్వరుని పూజలకు జిల్లేడూ, గన్నేరూ, మారేడూ, తమ్మి, ఉత్తరేణు ఆకులూ, జమ్మి ఆకులూ, జమ్మి పూలూ, నల్లకలువలూ మంచివి. దాసాని, మంకెన, నదంత, మొగలి, మాలతి, కుంకుమ మద్ది.... ఈ పూలు పూజకు పనికిరావు. తొడిమలేని పువ్వులు పూజకు పనికిరావు. తమ్మి పువ్వుకు పట్టింపులేదు.


మారేడు నందు శ్రీ మహాలక్ష్మీ, నల్ల కలువ నందు పార్వతీ, తెల్లకలువనందు



కుమార స్వామీ, కమలమునందు పరమే శ్వరుడూ కొలువై ఉంటారు. అలాగే చదువుల తల్లి సరస్వతీ దేవీ తెల్ల జిల్లేడులో, బ్రహ్మ కొండ వాగులో, కరవీరపుష్పంలో గణపతీ, శివమల్లిలో శ్రీమహా విష్ణువూ, సుగంధ పుష్పాల్లో గౌరిదేవీ ఉంటారు. అలాగే శ్రీమహావిష్ణువుని అక్షింతలతోనూ, మహాగణపతిని తులసితోనూ, తమాల వృక్ష పువ్వులతో సరస్వతీ దేవినీ, మల్లె పువ్వులతో భైరవుడ్నీ, తమ్మిపూలతో మహా లక్ష్మినీ, మొగలిపువ్వులతో శివుడ్నీ, మారేడు దళాలతో సూర్య భగవానుడ్ని ఎట్టి స్థితిలోనూ పూజింపరాదు.

## 313. గుడిలో దర్శనం అయ్యాక ఎందుకు కూర్చోవాలి?

**జ.** గుడి ప్రశాంతతకు మారు పేరు. దేవుడ్ని దర్శించగానే మనలోని కోపమూ, అహమూ, ఆవేశమూ, స్వార్ధ చింతన ఆ కొంతసేపూ దూరమవుతాయి. వెను వెంటనే జనారణ్యంలోకి వెళితే మళ్ళీ మన మనసు మనల్ని యథావిదిగా నడిపిస్తుంది. అది ఎలాగూ తప్పదు. కాబట్టి,



దర్శనం అవ్వగానే కొంతసేపు ప్రశాంతమైన మనసుతో కూర్చుంటే, ఆ దేవాలయాల్లో చేసిన యజ్ఞ, యాగాది, పుణ్య పూజలఫలం వల్ల మనసు మాలిన్యం కరగటం ప్రారంభిస్తుంది. అలా కొంతయినా ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన సమయాన్ని గడపగలుగుతాము.

## 314. బట్టలుతికిన నీళ్ళు కాళ్ళమీద పోసుకుంటే పుట్టింటికి అరిష్టమా?


**జ.** అవుననే చెప్పాలి. మురికి పట్టిన బట్టల నీటిని అనాలోచితంగా కాళ్ళ మీద పోసుకుంటారు ఆడవాళ్ళు కొందరు. అలా చేయటం వల్ల పుట్టింటికి అరిష్టము. ఎందుకంటే ఆడవాళ్ళు ఎక్కువ సమాయన్ని నీటిలో ఉంటూ పని చేయటం ద్వారా కాళ్ళకూ, చేతులకూ పగుళ్లొస్తాయి. వందలో తొంభై మధ్య తరగతి వారూ ఆ క్రింద తరగతి స్త్రీలలో ఖచ్చితంగా కాళ్ళలో పగుళ్ళు ఏర్పడతాయి. వారిలో పదిశాతం చదువుకున్న, లేదా అందం పట్ల, ఆరోగ్యంపట్ల శ్రద్ధ ఉన్న వాళ్ళు మాత్రమే తగు జాగ్రత్తలు తీసు



కుంటారు. అలా జాగ్రత్తలు తీసుకొని మహిళలు గుడ్డలుతికిన నీటిని, మలిన మైనవీ, క్రిములున్న నీటిని కాళ్ళపై పోసు కోవటం ద్వారా అనేక క్రిములు శరీరం లోకి ప్రవేశించి, అనారోగ్యాన్ని కలగ చేస్తాయి. అప్పుడు అడ్డం పడితే భర్త పుట్టింటికి పంపిస్తాడు. ఆపై పడేది పుట్టింటి వాళ్ళేగా బాధలు. కూతురు సంతోషంగా ఆరోగ్యంగా ఆనందంగా పుట్టింటికి వస్తే ఆనందించాలని తల్లీ, తండ్రీ కోరుకుంటారు. అలా కాళ్ళ మీద గుడ్డలుతికిన నీరు పోసుకుంటే పుట్టింటి మీద ప్రేమతో చెయ్యకుండా ఆరోగ్యంగా ఉంటుందని పెద్దలు అలా చెబుతారు.

## 315. మోసం చేసేవారు ఎలా ఉంటారు?

**జ.** చక్కటి ముఖారవిందముతో, చంద నము వంటి చల్లని మాటలతో, కత్తెర వంటి హృదయంతో ఉంటారు. వీర్ని తెలుసుకోవటానికి ఒక్కటే మార్గం. వీరు వచ్చిన తర్వాత మీ వద్ద ఉన్న అమూల్య మైనవి ఒక్కొక్కటిగా దూరమవుతాయి.



కాన ఒక్కసారి పునరాలోచించుకుని తరచి ఆలోచించి చూస్తే అర్థమవుతుంది. మీ ప్రక్కన ఉన్నది శ్రేయోభిలాషో, లేక అలా నటిస్తున్నాడో... జీవితంలో పైకి రావాలంటే మన ప్రక్కనున్న వాళ్ళు సరయిన వాళ్ళు అయి ఉండాలి. చాలా మంది మేధావులు ఇక్కడే తప్పు చేస్తారు. కాని ఏం లాభం. అమూల్యమైన సమయం ఎంతో వృధా అవుతుంది. అప్పటికి పరా జయము నలువైపులా కమ్మేస్తుంది. అస లైన వారంతా దూరమవుతారు. జరగా ల్సిన నష్టం సమస్తమూ జరిగిపోతుంది. సర్వమూ కాలి పట్టుకోవటానికి ఆకులు కూడా దరిదాపుల్లో కానరావు.

## 316. పంచశీల సూత్రాలంటే ఏమిటి?

**జ.** ప్రాణాలని హింసించి, చంపి ఆనం దింపరాదు. మనవి కాని ఏ ఆస్థులనూ, ఆనందాలనూ కోరకుండా ఉండటమూ,



ప్రక్కవాడి భార్యా, పక్కవారి ధనమూ ఆశించక పోవటము ఇత్యాదులు. శారీరక అధర్మ కోరికలను నియంత్రిం చుకోవటము (స్వార్థమూ, ఈర్ష్య, కుళ్ళు) సత్యాన్ని పలకటము.... చూడకూడనివీ ... మాట్లాడ కూడనివీ... వినకూడనివీ .... చెయ్యకుండా ఉండటము. దుర్వ్యసనాలకి అనగా మద్య, ధూమమూ, మగువలకు దూరంగా ఉండటము.

## 317. స్త్రీ మనసు సముద్రమంత కన్నా లోతు అంటారెందుకు?

**జ. ఔదుమ్బరాణి పుష్పాణి శ్వేతవర్ణం చవాయసమ్।**


**మత్స్యపాదం జలేపశ్యేన్న నారీ హృదయస్థితమ్॥**

మేడిపువ్వులను చూడవచ్చు, తెల్లని కాకిని పట్టుకోవచ్చు, సముద్రాన, నది లోనూ చేపల అడుగులను చూడగలము. కానీ స్త్రీ మనసులో ఏముందో ఎవ్వరూ చూడలేరు. అంత గోప్యము స్త్రీ మనసు. అందుకే అంటారు.... సముద్రం లోతు తెలుసుకోవచ్చు గాని ఆడదాని మనసు తెలుసుకోలేమని.



## 318. శ్రీశైల క్షేత్రం గూర్చి తెలుసుకోండి...

**జ.** సముద్రమట్టానికి 1,500 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఇక్కడ ఉన్న పాతాళ గంగ బ్రహ్మగిరీ, విష్ణుగిరీ, రుద్రగిరీ అనే మూడు పర్వతాల మధ్య ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్నది.




శ్రీశైలక్షేత్ర శిఖరం ఎత్తు 2,830 అడుగులు. కృతయుగంలో హిరణ్య కశ్యపునికి ఈ క్షేత్రం పూజామందిరము.

శ్రీరాముడూ, పాండవులూ ఈ క్షేత్రాన్ని దర్శించారు. శ్రీశైలక్షేత్రానికి వచ్చే భక్తుల అవస్థలు చూసి ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ 1326–35 కాలంలో మెట్లు నిర్మించాడు. ఒకప్పుడు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి స్వామిని దర్శించేవారు. అలా దర్శించిన దర్శనము ధూళి దర్శనమంటారు.

అలా ధూళి దర్శనము చేసుకొని, నిదురచేసి, పాతాళగంగలో శుచిగా స్నానం చేసి మళ్ళీ దర్శనం చేసుకునే వారు. నేటికి కొంత మంది స్వామిని ఆ విధంగానే దర్శనం చేసుకుంటున్నారు.

## 319. ఈ మూడింటి దగ్గర మొహమాటం పనికిరాదు.... ఏమిటా మూడు?



**జ.** మొదటిది ధనం.. ఇక్కడ మొహ మాట పడితే ధనం పోయి తనతో పాటు తనని నమ్ముకున్న వార్నీ ఇబ్బందులలో పడవేస్తుంది. రెండవది భోజనం... ఇక్కడ మొహమాటపడితే కాలేది తన కడుపే. మూడోది శృంగారం... ఇక్కడ సిగ్గుపడితే శృంగార, సరసాల్లో అసలు ఆనందాన్ని కోల్పోతారు. కాన ఈ మూడింటి వద్ద అస్సలు మొహమాట పడవద్దు.

## 320. గుడిలో ఎలా ఉండాలి?

**జ.** గట్టిగా అరవటమూ, నవ్వటమూ, ఐహిక విషయాల గూర్చి మాట్లాడటమూ చేయరాదు. గుడి పరిసరాలన్నీ పరి శుభ్రంగా ఉంచాలి. కొబ్బరి పెంకులూ, అరటి తొక్కలు ఆలయంలో చేసిన ఏర్పాట్లు ప్రకారం వాటిల్లోనే వేయాలి. తోసుకుంటూ లేదా ముందువార్ని అధిగ మిస్తూ దర్శనం చేసుకోరాదు.

భగవంతుడ్ని కనులారా వీక్షించి ఆపై కనులు మూసుకొని ధ్యానం చేయాలి. దేవాలయంలో నిల్చుని తీర్థం పుచ్చు కోవాలి. గృహంలో కూర్చుని తీర్థం పుచ్చు కోవాలి. దీపారాధన శివునికి ఎడమవైపూ, శ్రీమహావిష్ణువుకు కుడివైపూ చేయాలి. అమ్మవారికి నూనె దీపమయితే ఎడమ పక్కగా, ఆవు నేతి దీపమైతే కుడి వైపు వెలిగించాలి.

## 321. శివాలయాల్లో ఎందుకు ప్రదక్షిణం చేయరాదు?



**జ.** మహేశ్వరుడు దేవాధిదేవుడు. అట్టి పరమేశ్వరునికి తలపై నుంచి గంగ జాలు వారుతుంది. మహాశివుడ్ని అభిషేకించిన జలం ఆయనం పీఠంపై జారి, ఏర్పరిచిన దారి నుంచి బయటికి ప్రవహిస్తుంది. ప్రదక్షిణం చేస్తే గంగను దాటినట్లే అవు తుంది. కాన శివాలయంలో ప్రదక్షిణ సరి కాదని శాస్త్రాలు తెలుపుతున్నాయి.

## 322. బ్రహ్మ హత్యా పాతకము ఎంతటి పాపము?

**జ.** బ్రాహ్మణుడు అనగా బ్రహ్మ జ్ఞానాన్ని పొందినవాడు. అట్టివాడిని చంపటమంటే అంతకన్నా ఘోరం ఇంకొకటి లేదు. అట్టి

కార్యం చేసిన వాడు పన్నెండు సంవత్స రాలు ఏకాంతంగా తపస్సు చేసినా పాపం పూర్తిగా పోదు. తనకున్న యావదాస్తినీ పేదలకు ఇవ్వటమూ, అశ్వమేథ యాగ మూ, గోసవనమూ లాంటివి చేయటం ద్వారా బ్రహ్మహత్యా పాతకం వీడుతుంది. బ్రాహ్మణుడ్నేకాదు. ఎవర్ని చంపినా పాపం పాపమే.... ఆ పాపానికి శిక్ష నర కంలో రెండు లక్షల సార్లు నరికించు కోవాలి హత్య చేసినవాడు.

## 323. చక్కగా హాయిగా నవ్వితే?




**జ.** గుండె వేగం పెరిగి రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. పదినిముషాల వ్యాయా మమంత ఫలితం ఉంటుంది. కొన్ని నవ్వుల వల్ల అనేక అనారోగ్యాలు దూర మవు తాయి. చక్కెర వ్యాధి వారికి నవ్వటం చక్కటి మందు, దివ్య ఔషధం.

చిన్నవయస్సులో రోజుకో 300 సార్లు, యుక్త వయస్సులో 47సార్లు, వృద్ధా ప్యంలో కేవలం ఆరుసార్లు నవ్వుతారు. ఇంకా గలగలనవ్వటం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ధైర్య గుణం వస్తుంది. రక్తపోటు తగ్గుతుంది.

## 324. వీటిని సదా గుర్తుంచుకోవాలి?

**జ.** వంకర టింకరగానూ పక్కగానూ పడుకున్న స్త్రీతో కలవరాదు. సంభో గానికి, భోజనానికి ముందు లోపల జలము అనగా మూత్రము విడవాలి.



నిద్రా, మైధునమూ, తిండీ, చదువూ ఈ నాలుగూ సంధ్యా సమయాల్లో చేయ రాదు. భోజనం చేశాక, మళ్ళీ ఆరు గంటల వరకూ తినరాదు. గంట వరకూ స్త్రీతో కలవరాదు. పరభార్యలయందు, అవివాహితలైన స్త్రీల యుందు కలిగే చెడు భావమే కామము. భోజన సమయమున నవ్వులూ, మాటలూ లేకుంటే భోజన ఫలం శరీరానికి వంటపడుతుంది. ఒక చేతితో లేదా ఒక వేలితో నమస్క రిం చటం చేయరాదు.

## 325. శ్రీశైలంలో పాతాళగంగలోని నీరు పచ్చగా ఎందుకుంటుంది?

**జ.** చంద్రగుప్త మహారాజు అనేక సంవ త్సరాలు యుద్ధం చేసి, విజయాలతో రాజ్యం చేరతాడు. అంతఃపురంలోని

స్త్రీలతో ఉన్న అందాలరాశిని తన కూతు రని తెలియక ఆశిస్తాడు. ఆపై తెలిసినా వినకపోవటంతో, చంద్రావతి శ్రీశైలం అరణ్యాలకి వచ్చి పరమేశ్వరుడ్ని అనుగ్ర హించమని తపస్సు చేస్తుంది. అక్కడికి కూడా చంద్రగుప్తుడు వచ్చి చంద్రావతిని చెరపట్ట బోతుండగా మహాశివుడు ప్రత్యక్షమై కామంతో కనులు మూసుకు పోయిన నీవు పచ్చలబండవై పాతాళ గంగలో పడి ఉండమని శపిస్తాడు. ఆపై వేడుకోగా, శ్రీమహావిష్ణువు కలియుగంలో అవతరిస్తాడు. ఆ అవతార పురుషుడు స్నానంకై పాతాళగంగలో దిగిననాడు, స్నానమాచరించిన నాడు నీకు శాప విమోచనం కలుగుతుందని మహే శ్వరుడు శెలవిస్తాడు.

## 326. స్త్రీ ఎలా స్నానము చేయాలి?



**జ.** మౌనంగా చేయాలి. ఎక్కువ సేపు చేయాలి. ఒంటి మీద బట్టలేమీ లేకుండా చేయాలి. అదే పురుషుడు వస్త్రంతోనే స్నానం చేయాలి. స్నానం చేసేటప్పుడు స్త్రీ జుట్టు ముడి వేసుకోవాలి. స్నానము తరువాత మొదటగా ముఖాన్నీ ఆ తర్వాత వక్షాన్నీ ఆపై శిరస్సును ఆపై మిగతా భాగములు మెత్తని వస్త్రముతో తుడుచు కోవాలి. ఆపై చూపుడు వేలు ఉపయో గించకుండా బొట్టుపెట్టు కోవాలి.

## 327. తెల్లవారు జామున వచ్చే కలలు నిజమవుతాయా?

**జ.** జ్యోతిష్య శాస్త్ర ప్రకారమూ, మనో విశ్లేషణా శాస్త్రజ్ఞుల ప్రకారమూ తెల్లవారు జామున వచ్చే కలలు ఎక్కువ శాతం అవుతాయనే సూచనలు తెలియ చెబుతు న్నాయి. దానికి కారణం తెల్లవారు జాము అనగా మెలుకువ వచ్చే సమయం. అనగా ఆ సమయంలో ముఖ్య మైన పని గూర్చి మగతగా నిదురపోతూ మనను తెలియకుండా ఆలోచిస్తుంటుంది.

దాని తాలూకు ఫలితం లేదా జరగ బోయే సంఘటన మనకు ఎంతో కొంత తెలుస్తుంది. ఆ విషయాల ఆధారంగా మనం ఊహించుకున్నదే కలగా వస్తుంది. అనగా వాటిల్లో ఎక్కువగా జరిగే అవ కాశము ఉంది.

## 328. ఎలాంటి భోజనాన్ని చేయరాదు?

**జ.** కాకులు ముట్టుకున్నదీ, కుక్కా, ఆవూ వాసన చూసిన ఆహారము తినకూడదు.

పాలతో భోజనం చేశాక, పెరుగుతో భోజనం చెయ్యరాదు. కాళ్ళు జాపుకుని, చెప్పులు వేసుకుని భుజించరాదు.

భార్యతో కలిసి తినకూడదు. భర్త భుజించిన తర్వాత భార్య తినాలి. కలిసి తినాల్సి వస్తే ముందుగా భర్త ఓ ముద్దను తిన్న తర్వాత భార్య భర్తతో కలసి తినవచ్చు. భుజించ టానికి ఎడమ చేయి ఉపయోగించరాదు. చద్ది అన్నాన్ని భుజించ కూడదు. చల్లా రిన ఆహారాన్ని వేడి చేసి తినకూడదు. పది పదిహేను పదార్థాలతో భోజనం కన్నా కూర, పప్పు, పచ్చడి, మజ్జిగతో తీసుకునే ఆహారం అమృతము. నిలువ పచ్చడి కంటే రోటి పచ్చడి ఎంతో శ్రేష్ఠము. నిలువ పచ్చళ్ళు వయసులో రెండు రోజులకో సారి, మధ్య వయసులో వారానికి రెండు సార్లూ, నలభై దాటిన తర్వాత పదిహేను రోజుల కోసారి, యాభై దాటాక నెలకోసారి తీసుకోవటం ఆరోగ్యకరం.



## 328. సంసార సుఖాన్ని ఏ విధంగా పొందాలి?

**జ.** పురుషుడు తనని నమ్మి ప్రేమించి, తనతో వచ్చిన స్త్రీకి మొదట కడుపునిండా



తిండి పెట్టాలి. ఆ తర్వాత సిగ్గును దాచు కోవటానికి బట్టలివ్వాలి. తన అంద చందాల రక్షణకు గాను గృహమనే భద్రత నివ్వాలి. ఆ తర్వాత రాత్రి యందే కలవాలి. స్త్రీలలో రజస్సు వచ్చిన తర్వాత అనగా చివరి రోజులు మంచివి. రజస్సు కానవచ్చిన నాలుగు రోజులు దూరంగా ఉండాలి. 4, 6, 8, 10, 12, 14, 16, 18 ఇలా సరి సంఖ్య రోజుల్లో కలిస్తే పుత్ర సంతానం కలుగుతుంది. అలాగే 5, 7, 9, 11, 13, 15, 17 బేసి సంఖ్యల్లో కలిస్తే ఆడపిల్ల పుడుతుంది. అలాగే శనివారమూ, రవివారమూ, మంగళ వారమూ కూడదు. నాలుగో రోజు కలిస్తే పుట్టినవారు తక్కువ ఆయుర్దాయ మునూ, అయిదోవ రోజు బహు సంతాన వంతమైన స్త్రీ, ఆరో రోజు సామాన్య సగటు మనిషీ, ఏడో రోజు పిల్లలు పుట్టని

ఆడపిల్లా, ఎనిమిదో రోజు అధిక ధనవంతుడూ, తొమ్మిదవ రోజున మహా పతివ్రతా, పదవరోజు తల్లిదండ్రుల పేరు నిలబెట్టేవాడూ, పదకొండో రోజున నలుగురు నోళ్ళలో నానేదీ, పన్నెండో రోజున ఉత్తమోత్తమమైన పురుషుడూ, పదమూడో రోజున ఎక్కువమంది భర్తలుగలదీ, పధ్నాలుగో రోజు ఆధ్యాత్మిక చింతన కలవాడూ, పదిహేనవ రోజున సకల భోగాలూ అనుభవించే పడతీ, పదహారవ రోజు లోకోత్తరమైన వాడిగా పేరు పొందే పుత్రుడూ జన్మిస్తాడని శాస్త్రం చెబుతుంది. పగలూ, సంధ్యా సమయాల్లో స్త్రీ వద్దకు శృంగారము కొరకు వెళ్ళరాదు. తన కన్నా పెద్ద స్త్రీ లేదా గర్భవతితో శృంగారం నిషిద్ధం. బహు లావూ, బహు సన్నమూ, అవయవ లోపమున్న స్త్రీతో శృంగారం వలదు. గురు ప్రదేశములోనూ, దేవాలయ ప్రదేశములోనూ, యజ్ఞ యాగాదులు జరిగినా, జరుగుతున్నా ఆయా ప్రదేశాల్లో స్త్రీకి దూరంగా ఉండాలి. కడుపారా భుజించినప్పుడూ, పదహారు సంవత్సరములముందూ, డెబ్భై సంవత్సరాల తర్వాత మైథునం మంచిది కాదు. స్త్రీ పురుషుల కలయిక ప్రకృతి సిద్ధంగా ఉండాలి. తారుమారుగా శృంగారం చేస్తే తారుమారు సంతానమే కలుగుతుంది. మగవాడు పడకపై కుడిపాదం పెట్టి ఎక్కాలి. స్త్రీ ఎడమ పాదం పెట్టి పడకపై రావాలి. సంసార సుఖాన్ని మధురంగా అనుభవించాలి.


## 330. స్త్రీలు భగవంతునికి సాష్టాంగ నమస్కారం ఎందుకు చేయకూడదు?



**జ.** భగవంతునికి సాష్టాంగ ప్రణామం పురుషులు చేయవచ్చు. తమ ఎనిమిది అంగాలనూ అనగా వక్షస్థలమూ, నుదురూ, రెండు చెతులూ, రెండు కాళ్ళూ, రెండు కనులూ భూమిపై ఆన్చి నమస్కరించవచ్చు. కానీ స్త్రీలు సాష్టాంగ నమస్కారము చెయ్యాలనుకున్నప్పుడు ఉదరము నేలకు తగులుతుంది. ఆ స్థానంలో గర్భకోశం ఉంటుంది. ఇలా చెయ్యటం వల్ల గర్భకోశానికి ఏదైనా కీడు జరిగే అవకాశం ఉంది. అందుకే ఇతిహాసాల్లో ధర్మశాస్త్రాల్లో, స్త్రీలను మోకాళ్ళపై ఉండి నమస్కరించాలని చెప్పారు. ఇంకా చెయ్యగలిగితే నడుం వంచి ప్రార్థించవచ్చు.

## 331. యక్షప్రశ్నలు ఏవి?

**జ.** మహాభారత గాథలో యముడు కొంగ రూపంలోకి మారి తను యక్షుడినని చెప్పి ధర్మరాజును అడిగే ప్రశ్నలే యక్షప్రశ్నలు. అనుమతి లేకుండా ఈ సరోవరంలో



నీళ్ళు తాగినందుకు ధర్మరాజు సోదరులు కుప్ప కూలుతారు. వార్ని బ్రతికించుకోవాలంటే తన ప్రశ్నలకి సరయిన సమాధానాలు చెప్పమంటాడు యముడు. అవి-

"సూర్యుడిని నడిపేది ఏది? సూర్యుడిని సేవించి తిరిగే వారు ఎవరు? సూర్యుడు దేనివల్ల అస్తమిస్తాడు? సూర్యునకు ఆధారమేమిటి?

ఆ ప్రశ్నలకి సమాధానం "సూర్యుడిని బ్రహ్మం నడుపుతుంది. సూర్యుడ్ని సేవిస్తూ తిరిగేవారు వేల్పులు. సూర్యుడు ధర్మం చేత అస్తమిస్తాడు. సూర్యునికి ఆధారము సత్యము". అని ధర్మరాజు చెప్పాడు.

దానికి సంతృప్తి చెందిన యక్షుడు ధర్మనందుడ్ని మళ్ళీ ప్రశ్నిస్తాడు. "దేని వల్ల శ్రోత్రియుడు అవుతాడు? దేని వల్ల పురుషుడు గొప్ప మహిమను ప్రభావాన్ని పొందగలడు? దేని వల్ల సాయం పొందిన వాడవుతాడు? దేని వల్ల బుద్ధిమంతుడవుతాడు? వాటికి సమాధానంగా ధర్మరాజు...

"వేదాభ్యాసం వల్ల శ్రోత్రియుడు అవుతాడు. నిరుపమానమైన తపస్సు వల్ల గొప్ప ప్రభావం సిద్ధిస్తుంది. ధైర్యంవల్ల సాయం పొందుతాడు. పెద్దల పరిచర్యల వలన బుద్ధిమంతుడు అవుతాడు."

యక్షుడు మళ్ళీ ధర్మరాజును అడుగుతాడు. "దేని వల్ల బ్రాహ్మణుడు దివ్యత్వాన్ని పొందుతాడు? బ్రాహ్మణుడికి నిర్మలత్వం ఎలా వస్తుంది? అలాగే మాలిన్యం ఎలా దరి చేరుతుంది? దేని వల్ల బ్రాహ్మణుడు మర్త్యుడు అవుతాడు?

యక్షుడి ప్రశ్నలకి ధర్మరాజు సమాధానం చెప్పాడు. "విప్రుడు వేదపఠనం వల్ల దివ్యత్వం ఆర్జిస్తాడు. నిష్ఠవల్ల సాధు భావాన్ని పొందుతాడు. సౌశీల్యాన్ని విడనాడి అసాధువు అవుతాడు. శుచిత్వాన్ని వీడి మృత్యుభయం చెంది మర్త్యుడు అవుతాడు".

యక్షుడు ధర్మరాజు జవాబులకి సంతృప్తి చెంది తిరిగి అడుగుతాడు.

"జీవన్మృతుడు ఎవరు?" "దేవతలకూ, పితృ దేవతలకూ, అతిథులకూ, సేవకులకూ పెట్టకుండా తినేవాడు జీవన్మృతుడు.

"భూమి కంటే బరువైనది ఏది?"

"భూమి కంటే బరువైనది తల్లి."

"ఆకాశం కంటే పెద్దది ఏది?"


"ఆకాశం కంటే పొడవు తండ్రి"

"గాలికంటే వేగంగా పోగలిగింది ఏది?" "గాలి కంటే వేగమైనది మనసు"

"గడ్డి కంటే విరివిగా పెరిగేది ఏది?"

"గడ్డి కంటే విరివిగా పెరిగేది చింత."

"నిదురించి కూడా కన్ను మూయనిది ఏది?" "చేప."



"జన్మించి కూడా చైతన్యం లేనిది ఏది?" "గుడ్డు."

"రూపం ఉండి కూడా హృదయం లేనిది ఏది?" "రాయి."

"వేగం చేత అతిశయించేది ఏది?"

"ఏఱు."

"బాటసారికీ, రోగికీ, గృహస్థుడికీ, మర ణించినవాడికి చుట్టాలెవరు?" "స్వార్థం .... వైద్యుడు.... మంచి భార్య... చేసిన ధర్మం."

"ధర్మానికి కుదురు ఏది?" "దాక్షిణ్యం"

"కీర్తికి ఆధారం ఏది?" "దానం."

"స్వర్గానికి సరయిన మార్గం ఏది?"

"సత్యం"

"సుఖానికి నెలవు ఏది?" "శీలము."

"నరుడికి ఆత్మ ఎవరు? వానికి దైవి కంగా ఏర్పడే చుట్టం ఎవరు? అట్టివాడు బ్రతుకునేల నిర్వహిస్తాడు? ఎలా మంచి తనాన్ని పొందుతాడు?"

"నరునకు ఆత్మ పుత్రుడు. అతని దైవికమైన చుట్టం భార్య. అట్టివానిని బ్రతికించేది మేఘుడు. వానికి గొప్పతనం చేకూర్చేది దానము."

"ధర్మాలన్నింటిలోనూ గొప్ప ధర్మం ఏది?" "అహింస."

"ఏది సంపూర్ణంగా ఫలితాన్నిస్తుంది?"

"యజ్ఞము"

"దేన్ని వదలటం ద్వారా సంతోషం వస్తుంది?" "అహంభావము."

"ఎవరితో పొత్తు ఎప్పుడు చెడదు?"

"సజ్జన సహవాసము."

"లోకంలో ప్రజలను ఆదుకుని సహాయం చేసేదెవరు?" "సజ్జనులు."

"దేనివల్ల నీరూ, అన్నమూ లభిస్తాయి?"

"ఆకాశం వల్ల నీరూ, అన్నమూ లభిస్తున్నాయి."

"విషం అంటే ఏమిటి?" "విప్ర ధనము."

"పితృతర్పణాలకు అనుకూలమైన సమయ కాలమేది?"

"బ్రాహ్మణులు రాక."

"దేనిని వదిలిపెడితే మానవుడు సర్వు లకూ ఇష్టుడవుతాడు? నిశ్శోకుడవు తాడు? సంపన్నుడవుతాడు? సౌఖ్యం కలవాడవుతాడు?"

"గర్వాన్ని విడిస్తే సర్వులకు ఇష్టుడవు తాడు. కోపం విడనాడితే శోకం దరి చేరదు. లోభాన్ని వదిలితే సంపన్నుడవు తాడు. ఆశను వదిలితే సుఖవంతుడవు తాడు."

"పురుషుడన్న ఎవరు?"

"భూమ్యాకాశాలకి ఎవని కీర్తీ, వైభ వమూ అవరిస్తుందో అట్టివాడు పురుష శబ్దంతో పిలవదగినవాడు."

"స్వరధని అను సకల సంపదలు కలవాడెవ్వడు?" "ప్రియం, అప్రియం, సుఖం, దుఃఖం, జరిగిన జరగబోయిన కార్యాలు ఎవ్వరికి సమానములో అట్టి మహాత్ముడు స్వరధని అని చెప్పవచ్చు."

ఆ సమాధానాలు విన్న యక్షుడు పరమానంద భరితుడై తమ్ములలో ఒకర్ని కోరుకొమ్మని బ్రతికిస్తానని చెబుతాడు.

ధర్మరాజు నకులుడ్ని కోరుకోగానే, అతని ధర్మనిష్టకు మెచ్చి మిగతా తమ్ము లనీ బ్రతికించి ధర్మరాజు కోరికపై తాను యమధర్మరాజునని చెబుతాడు.

## 332. వైతరణీ నది ఎలా ఉంటుంది?

**జ.** నూరు యోజనాల వెడల్పు ఉంటుంది. ఆ నదిలో నీరు ప్రవహించదు. రక్తమూ, చీమూ ప్రవహిస్తుంటాయి. మొసళ్ళూ, పాములూ పాపులను చిత్రవధ చేస్తాయి.

అందు పాపులు మహా బాధలను నిరంతరమూ అనుభవిస్తూ మానవ జన్మలో చేసిన పాపాలను మననం చేసు కుంటూ ఆక్రందనలు చేస్తూనే ఉంటారు. వారి మొర లాలకించే దిక్కే ఉండదు.

పాపం చేసిన వారికి దాహం వేస్తే కాగే నూనె ఇస్తారు. నరకంలో అనేక బాధలు పడిన తర్వాత కూడా మళ్ళీ మానవ జన్మలో అనేక రోగాలతో జీవి తాన్ని గడపాల్సివస్తుంది కూడా. అందుకే ధర్మంగా ఉండండి. ధర్మాన్ని కాపాడండి. ఆ ధర్మమే అన్ని విధాలుగా అన్ని సమ యాల్లోనూ సదా కాపాడుతుంది.

## 333.వినాయకుడి పూజలో తులసి ఎందుకు నిషిద్ధము?

**జ.** వినాయకచవితినాడు అనేక పత్రా లనూ, పూలనూ తీసుకువచ్చి పూజి స్తాము. ఆ పత్రాల్లో తులసి ఉండదు. సర్వదేవతలకు పవిత్రమైన తులసి వినా యకుడు ఇష్టపడక పోవటానికి కారణము...



ఓసారి గంగాతీరంలో వినాయకుడు విహరిస్తుండగా ధర్మధ్వజ యువరాణి వినాయకుడిని చూసి మోహించి పరిణ యము చేసుకోమంది. దానికి వినా యకుడు కాదనటంతో ధర్మధ్వజ రాజ పుత్రిక కోపించి, దీర్ఘకాలం బ్రహ్మచారిగా ఉండమని శపించింది.

ప్రతిగా వినాయకుడు ఆమెను రాక్ష సుని చెంత దీర్ఘకాలం ఉండమని ప్రతి శాపమిస్తాడు. వినాయకుని శాపానికి చింతించిన ధర్మధ్వజ రాకుమార్తె స్వామిని మన్నించమని వేడుకోగా, వినాయకుడు

శాంతించి, రాక్షసుని చెంత కొంతకాలం ఉండి, ఆపై పవిత్రమైన తులసిగా జన్మి స్తావు అని చెబుతాడు. అందుకే వినా యకుడు తులసిని తన పూజపత్రిలో ఇష్ట పడడు.

## 334. రోజుకి రెండుసార్లే భోజనం ఎందుకు చేయాలి?

**జ.** చిన్నతనంలోనూ, వయసులోనూ ఇంకోసారి భోజనం చేయచ్చు. ముప్ఫయి దాటిన తర్వాత మూడు పూటలా ఆహా రము వల్ల అన్ని విధాలుగా అనర్థమే.



ఒక్కపూట మాత్రమే తింటే మలబద్ధకము వస్తుంది. సంసారబంధం లేనివారు ఒక్క పూటే తినాలి. రెండు పూటల తినరాదు. మరోపూట పళ్ళనే తీసుకోవాలి. సంసారి మాత్రమే రోజూ రెండు పూటల భోజనం చేయాలి.

## 335. జపించేటప్పుడు చేయకూడనివి ఏవి?

**జ.** అపరిశుభ్రంగా ఉండి జపించరాదు. అలా జపిస్తే దైవ దీవెనలకు బదులు



కోపాన్ని రుచి చూడవల్సి వస్తుంది. చేతులు మురికిగా ఉండటమూ, బట్టలు లేకుండా ఉండటమూ, అనవసర విష యాలు మధ్యలో మాట్లాడటమూ, ఐహిక మైన విషయాల గూర్చి ఆజ్ఞాపిస్తూ జపించే జపము జపము కాదు. జప సమయంలో ఆవులింతా, మగతా, బద్ధ కంగా ఏదో జపిస్తున్నామంటే జపిస్తున్నా మంటూ చేస్తే జపం నిష్ప్రయోజనము.

తుమ్ము, దగ్గు వస్తే ఓంకారాన్ని పలికి ఆచమనం చేయాలి. జంతువులను తాకితే స్నానం చేసి జపించాలి. జప సమయంలో ఏమీ తీసుకోరాదు. ఏక వస్త్రంతోనూ, అనేక వస్త్రాలతోనూ జపిం చకూడదు.

## 336. ఎలా భోజనము చెయ్యాలి?

**జ.** రోజుకు రెండుసార్లు భోజనము చేయాలని తైత్తిరీయ బ్రాహ్మణం శెల విస్తోంది. రెండుసార్లు మధ్యలో ఏ ఆహా రమూ తీసుకోకపోతే ఉపవాస ఫలం

కూడా వస్తుంది. భోజనము చేసేటప్పుడు తూర్పు వైపుకి తిరిగి చేయాలి. తూర్పు వైపుకి తిరిగి చేయటం వల్ల ఆయుర్దాయము, అలాగే దక్షిణానికి తిరిగి భోజనము చేస్తే కీర్తి, ఉత్తరం వైపు తిరిగి భోజనము చేస్తే కోరికలు ఫలిస్తాయి. పడమర, దక్షిణం వైపున భోజనం చెయ్యకూడదని వామన పురాణంలోనూ, విష్ణు పురాణంలోనూ ఉంది. కాన తూర్పు వైపు తిరిగి భోజనము చేయటం అనేది అన్ని శాస్త్రాలూ, ధర్మాలూ ఏకగ్రీవంగా ఒప్పుకుంటున్నాయి. ఆకుల మీద, ఇనుప పీటల మీద కూర్చొని భోజనం చెయ్యరాదు. ధనాన్ని కోరుకునేవాడు మఱ్ఱి, జిల్లేడూ, రావి, తుమ్మి, కానుగ ఆకుల్లో భోజనం చేయాలి. మోదుగ, తామర ఆకుల్లో సన్యాసులు మాత్రమే భుజించాలి. భోజనానికి ముందూ, తర్వాత ఆచమనం చెయ్యాలి. తినే ముందు అన్నానికి నమస్కరించి తినాలి.

## 337. ఎలాంటి మాంసాహారం తీసుకోవాలి?

**జ.** మనుధర్మ శాస్త్రంలో ఎలాంటి మాంసాహారం తీసుకోవాలని పరిశీలిస్తే .... యజ్ఞం చేసే సమయంలో చేసే



జంతుబలి కార్యక్రమము హింస క్రిందకు రాదని, వాటిల్లో చంపబడే జంతువులు ఉత్తమ జన్మలు పొందుతాయని ఉంది. మాంసాహారం తినని వాళ్ళు, అశ్వమేథ యాగఫలాన్ని పొందుతారని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. మద్యమూ, సంసారిక సుఖమూ, మాంసమూ శాస్త్రాల్లో చెప్పిన ప్రకారం ఆచరించటం వల్ల కొంత వరకు మంచిదని శాస్త్రాలు చెబుతున్నాయి. పితృ దేవతలకు అర్పించినదీ, అలాగే దేవతలకు అర్పించినదీ, కొన్నదీ, ఇతరులు ఇచ్చినదీ అయిన మాంసాన్ని తినటంలో తప్పు లేదని మనుశాస్త్రం చెబుతోంది. తినకూడని మాంసాల్లో ఆవూ, గుఱ్ఱమూ, కుక్కా, నక్కా, కోతీ, పిల్లీ, ఏనుగూ, సింహమూ, పెద్దపులీ, ఎలుకా, చుంచూ, ఊరపందీ ఉన్నాయి. అలాగే భోజనం అయ్యాక వెంటనే నిద్ర పోకూడదు.

రాత్రిపూట ఉప్పు వేసుకుని భోజనము చెయ్యకూడదు. ఆహారము బాగా వేడిగా ఉన్నది తీసుకుంటే శక్తి తగ్గిస్తుంది. అలాగే బాగా చల్లటిది జీర్ణమవ్వదు. వెంట్రుకలుంటే ఆహారంలో ఆ భాగం తీసి నీళ్ళు చల్లి ఆపై తినాలి. వేడివేడిగా తినాలని ఉంటుంది. మీ నాలుక సహకరించవచ్చు.మరి లోపల అవయవాల సంగతీ?

## 338. దేవుని వద్ద కొబ్బరికాయను కొట్టేది ఎందుకు...?

**జ.** సర్వదేవతలను పూజించే సమయాల్లోనూ, యజ్ఞ, హోమాదుల్లోనూ, కొన్ని



శుభకార్యాల్లోనూ కొబ్బరి కాయను కొట్టడం తప్పనిసరి. కొబ్బరి కాయపై నున్న పెంకు మన అహంకారానికి ప్రతీక. ఎప్పుడైతే కొబ్బరి కాయను స్వామి ముందు కొడతామో మనం మన అహం కారాన్ని విడనాడుతున్నామనీ, లోపలున్న తెల్లని కొబ్బరిలా మన మనసును సంపూర్ణంగా స్వామి ముందు పరిచామని తద్వారా నిర్మలమైన కొబ్బరినీరులా తమ జీవితాలని ఉంచమని అర్థం. సృష్టి యొత్తంలో నీరున్న కాయ కొబ్బరికాయే. కొబ్బరికాయ అంటే మానవ శరీరం. బోండం పైనున్న చర్మం, మన చర్మం.... పీచు మనలోని మాంసము, పెంకే ఎముక, కొబ్బరే ధాతువు, అందులోని కొబ్బరినీరు మన ప్రాణాధారం..... కాయ పైనున్న మూడు కళ్ళు ఇడ, పింగళి, సుషుమ్న అనే నాడులు.


## 339. భోజనానికి ముందూ, తర్వాత ఆచమనము గావించేదేందుకు?

**జ.** భోజనానికి ముందు నీటిని విస్తరి చుట్టూ విడుస్తూ, ఆపై 'అమృతమస్తు' అని కొంత నీటిని సేవిస్తారు. ఆపై యమధర్మ రాజునూ, చిత్రగుప్తుడ్నీ, సర్వదేవతలనూ స్మరిస్తూ కుడి ప్రక్క అన్నాన్ని బలిగా కొంత వేస్తారు. ఆపై భోజనము ముగించి ఆచ మింపచేస్తారు. ఈ పద్ధతిలో దైవభక్తితో పాటు ఆరోగ్యరహస్యం కూడా ఉంది. విస్తరీ లేదా కంచము చుట్టూ నీళ్ళు తిప్పేది కంటికి కనిపించని అనేకానేక సూక్ష్మజీవులు తినే ఆహారంలో కలవ కూడదని అలా నీటితో ఆహారము చుట్టూ తిప్పగానే ఓ రక్షణ కవచము ఏర్పడి సమస్త సూక్ష్మ క్రిములు స్థంభించి పోతాయి. తిరిగి భోజనాంతరం చేసే ఆచ మనము ద్వారా ఆ రక్షణ కవచము తొలిగి సూక్ష్మ క్రిములు వాటి ద్రోవన అవి ప్రయాణిస్తాయని.

## 340. భగవంతుడ్ని కోరుకున్న కోర్కె బైటికి చెబితే తీరదా?

**జ.** దేవుడ్ని పూజించి కోరే కోర్కె ఖచ్చితంగా ఎంతోబలీయమైనదీ, బహు కష్టమైనదీ, మన వల్ల కానిదీ అయి ఉంటుంది. అలాంటి కోర్కె తీరిందంటే భగవంతుడిచ్చాడంటే ఖచ్చితంగా ఎంతో ఆనందించే విషయమే అవుతుంది. అంత సుఖించే విషయం ధనమూ, సౌఖ్యమూ, పదవీ, చక్కని భర్త లేదా భార్య ఎద్దైనా కావచ్చు. కోర్కెని బైటకి చెబితే విన్నవారు పైకి నవ్వినా లోలోన జరగకూడదని కోరుకోవచ్చు. అలాంటి కోర్కె జరగ కుండా తీరకుండా మానవప్రయత్నం చేయవచ్చు. అందుకే చెప్పొద్దొంటారు.

## 341. అప్పు తీసుకోవటానికి ధర్మరాజే వెనకడుగు వేశాడా?



జ. ధర్మరాజు ధర్మం తప్పని వాడు. ఏ ధర్మ సూక్ష్మానికైనా, ధర్మజుడినే అడుగుతారు. ఆ కాలంలో ఓ సారి ధర్మరాజు కుబేరుని వద్ద ధనాన్ని అప్పుగా తీసుకోవటానికి వెళ్ళాడు. అప్పుడు ధర్మరాజు యొక్క ధర్మ గుణాన్ని పరీక్షించదలచి.... ధర్మరాజా ఋణము తీసుకున్నప్పుడు ఆనందించినంతగా, తిరిగి ఇచ్చేటప్పుడు ఆనందిస్తూ ఇవ్వగలవా? అని అంటే ధర్మరాజు మారుమాట్లాడకుండా వెనక్కి వచ్చేశాడు.

## 342. నమ్మినవార్ని వదిలేస్తే ఎంతటి పాపము?

జ. శరణాగతునకు ద్రోహం చెయ్యటం, స్త్రీని చంపటమూ, సద్ బ్రాహ్మణుడి ధనాన్ని హరించటమూ, మిత్రద్రోహం చెయ్యటమూ వలన ఏ ఏ పాపాలు సంక్రమిస్తాయో, అట్టి పాపం నమ్మిన వార్ని వదిలేస్తే వస్తుంది. భార్య నమ్మి వస్తుంది. ఆమెను వదిలెయ్యటం.... తమ్ముడు అన్నని నమ్ముతాడు. అలాంటి అన్న తమ్ముడ్ని మోసం చెయ్యటం ఇలాంటి వన్నీ పై పాపాలతో సమానం.

## 343. వశిష్ఠునికి అరుంధతి వరసకేమవుతుంది?

జ. చాలామంది మాట్లాడినట్టు అరుంధతిని వరుస తప్పి వశిష్ఠుడు వివాహం చేసుకోలేదు. వావీ వరుసలు పరోక్ష సృష్టిలోనే, ప్రత్యక్ష సృష్టిలో కాదు. భగవంతుని పరోక్ష సృష్టిలో వీర్యమూ, అండమూ కలవటం ఉండదు. మహా సృష్టిని పెంచే విషయమై బ్రహ్మ ప్రజాపతులనూ, మనువులనూ, ఋషులనూ సృష్టించాడు. అలా సృష్టించినంత మాత్రాన ఏకగర్భాన జనియించినట్టు కాదు.

## 344. దశావతారాలేవి?

జ. దశావతారాల్లో కొందరు బుద్ధుడు, మరికొందరు బలరాముడు అని అంటారు. తాళ్ళపాక అన్నమాచార్యులవారు తన కీర్తనలలో దశావతార వర్ణనలనూ చేస్తూ.... సోముకుని చంపి వేదములు తెచ్చిన మత్స్యావతారమూ, క్షీర సాగర మధనంలో కూర్మవతారమూ, హిరణ్యాక్షుని నుంచి భూమిని స్వాధీనం చేసుకొన్న వరాహావతారమూ, ప్రహ్లాదునికై మహోగ్ర రూపమెత్తిన నృసింహావతారమూ, బలిని దానమడిగిన వామనావతారమూ, జమదగ్ని కుమారుడిగా పరశురామావతారమూ, తండ్రి మాట జావదాటాని రఘుకుల తిలకుడు శ్రీరాముడిగా రామావతారమూ, శ్రీ కృష్ణుడిగా శ్రీకృష్ణావతారమూ, కలియుగమున కల్క్యావతారమూ, ఈ పదింటిని దశావతారాలుగా అన్నమయ్య తన కీర్తనలలో వర్ణించాడు.

## 345. 'జననీ జన్మ భూమిశ్చ, స్వర్గాదపీ గరీయసీ' అన్నదెవరు?



జ. రఘుకుల తిలకుడు, మానవావతారమెత్తి, పరిపూర్ణమైన మానవునిగా జీవించి, ధర్మ, అర్ధ, కామ, మోక్షాలను స్వయంగా తర్వాత – తల్లీ, జన్మించిన ప్రదేశమూ స్వర్గముకన్నా పరమోత్తమ మయినవి అని చెప్పాడు. లక్ష్మణ విభీషణాదులతో లంకలో ప్రవేశించిన అనంతరము లంకలోని ఐశ్వర్యమూ, బంగారు, వజ్రాల భవంతులను శ్రీరామునికి చూపించి, 'ఆహా అయోధ్య కన్నా ఐశ్వర్యవంతమైనది .... ఇక్కడే ఉండిపోవచ్చు గదా...' అని శ్రీరామునితో అంటే, ఆ సమయాన శ్రీరాముడు మృదుమధురంగా 'జననీ, జన్మభూమిశ్చ, స్వర్గాదపి గరీయసీ' అని పలికాడు.

## 346. ఉత్తమ లక్షణాలనగా ఏవి?

జ. ఏ పలుకూ, ఏ పనీ తనకి అయిష్టమో, బాధాకరమో అట్టి వాటిని ఇతరులకు చెప్పుట చేయరాదు. కోపద్వేషాలతో ఎవ్వరినీ దూరం చేసుకోకుండా, అత్యుత్తమ సభ్యతతో ప్రవర్తిస్తూ, కనులకూ, చేతులకూ, కాళ్ళకూగల చాపల్యతను విడిచిపెట్టాలి. తనెంత గొప్ప స్థితిలోనున్నా అర్హులైన వారిని పూజించుటా, గౌరవించుటా చేయువాడు ఉత్తముడు. దానంగా ఇచ్చినదాన్ని తిరిగి తీసుకొనక పోవటము, అట్లే ఇచ్చిన దానాన్ని నలుగురికీ తానే చెప్పుకోవటము తగదు. దాని వల్ల దానఫలం దక్కదు. క్షత్రియుడికి మాత్రమే ఇచ్చిన దానాన్ని చెప్పుకునే హక్కు ఉంది.

మాట్లాడే ప్రతి మాట ఎదుటవారికి ప్రియంగా, హితంగా, సరళంగా ఉండాలి. సత్యాన్నే పలుకుతున్నా, వినేవారికి అసత్యమన్నట్లు తోచేలా మాట్లాడరాదు. సర్వ మాటలకి సత్యమే ప్రాణమూ, మూలమూ.

## 347. కార్తీక మాసంలో ఉసిరి చెట్టు క్రింద భోజనాలెందుకు?

జ. ధాత్రి చెట్టు అనగా ఉసిరి చెట్టు క్రింద సమారాధనము చేసి బంధు మిత్ర హితులతో ఎవరు వనభోజనము చేస్తారో, ఆ సమయంలో ఎవరు పురాణం వింటారో వారు నీచజన్మలు పొందక శ్రీమహా విష్ణువు దీవెనలను సంపూర్ణంగా పొందుతారు.

అలాగే సంవత్సరంలో ఒక్కసారయినా చెట్లు బాగా వుండే వనాలకి వెళ్ళి గడపటం ద్వారా శ్వాసనాళాలు రిలాక్స్ అవుతాయి. చక్కని ప్రాణవాయువును పీల్చడం ద్వారా అనేక దోషాలు శరీరం నుంచి తొలగి

పోతాయి. ఉసిరిక చెట్టు నుంచి వచ్చే గాలిని పీల్చడం ద్వారా ఎన్నో వ్యాధులు సమసిపోతాయి. కార్తీక మాసంలో ఉసిరి చెట్టును పూజిస్తే సమస్త విష్ణు క్షేత్రము లందు విష్ణుపూజ చేసిన ఫలం వస్తుంది.

## 348. పిల్లలు పక్కనెందుకు తడుపుతారు?



**జ.** తెలిసీ తెలియని వయసులో దేని గూర్చయినా భయపడటం వల్లా, తల్లీ, తండ్రీ పోట్లాడుకోవటం గమనించటం వల్లా, బాగా ఒత్తిడిగా ఏదైనా విషయాన్ని గూర్చి ఆలోచించటము వల్లనూ తోటి పిల్లలు బొమ్మలు తనకి లేవని బెంగ పెట్టు కోవటం వంటి వాటి వల్లా పక్క తడుపుతారు. కనుక పిల్లల మనసు తెలుసు కుని ధైర్యమూ, ప్రేమా రంగరిస్తే ఆ అల వాటు క్రమంగా మానేస్తారు. చిన్న తనంలో తల్లీ, తండ్రీ ప్రేమా, వయసులో స్త్రీకి పురుషుడూ, పురుషునకు స్త్రీ ప్రేమా, పెళ్ళయిన తర్వాత ధనమూ, మధ్య వయస్సులో కూడబెట్టుకున్న ధనమూ ఆపై ఆధ్యాత్మికభావన ఇవి ఎంతో అవ సరము. ఏది తప్పినా, దురదృష్టవంతుల క్రింద లెక్కే.

## 349. విష్ణుసహస్ర నామం చదవటానికి ముందు రుద్ర శాప విమోచనం చదవాలా?

**జ.** విష్ణు సహస్రనామాన్ని మంత్రాను ష్టానంగా చేయాలంటే రుద్రశాప విమో చనాన్ని గురువు నుంచి మంత్రోపాసన ద్వారా స్వీకరించాల్సిందే. పూజకూ, పఠనంకూ, పారాయణమునకు ఈ నియ మములేదు.

## 350. గుడిలో ఎందుకు ప్రదక్షిణలు చేస్తారు?

**జ.** 'ప్రదక్షిణం' లో 'ప్ర' అనే అక్షరము పాపాలకి నాశనము...'ద' అనగా కోరి కలు తీర్చమని, 'క్షి' అన్న అక్షరము మరు జన్మలో మంచి జన్మ ఇవ్వమని. 'ణ' అనగా అజ్ఞానము పారద్రోలి ఆత్మ జ్ఞానము ఇవ్వమని. గుడిలో భగవంతుడి చుట్టూ తిరిగే ప్రదక్షిణంలో ఇంత అర్థం ఉంది. పూర్వం వినాయకుడు పార్వతీ, పరమేశ్వరుల చుట్టూ తిరిగి విశ్వానికి ప్రదక్షిణ చేసిన ఫలం పొందాడు. కాన భగ వంతుని చుట్టూ చేసే ప్రదక్షిణ విశ్వ ప్రదక్షిణ మవుతుంది. ఆత్మ ప్రదక్షిణ అవుతుంది. భగవంతుడా! నేను అన్ని వైపుల నుంచి నిన్నే అనుసరిస్తూ ధ్యానిస్తున్నానని అర్థం.


## 351. రాహుకేతువులకి అప్రదక్షిణము చేయాలా?

**జ.** గ్రహాల రాజు సూర్యుడు అన్ని గ్రహాల మధ్యన ఉంటాడు. చంద్రుడు ఆగ్నే యంగా ఉంటాడు.

అంగారకుడు దక్షిణంగానూ, బుధుడు సూర్యునకు ఈశాన్యంగానూ, బృహస్పతి ఉత్తర దిక్కుగానూ ఉన్నారు. తూర్పున శుక్రుడుంటాడు. పశ్చిమ దిక్కున శనైశ్చ రుడూ, నైఋతిలో రాహువూ, వాయు వ్యంలో కేతువూ ఉంటారు. అయితే గ్రహా లన్నీ ఒకే విధంగా ఉంటే రాహుకేతు వులు వేరుగా అప్రదక్షిణంగా తిరుగుతు న్నట్టు ఉంటాయి. అయినా మనం ఆయా గ్రహాల పూజల ప్రకారమే చేయాలి.

## 352. శివ లింగం ఇంట్లో ఎందుకు పెట్టుకోకూడదు?

**జ.** శివునికి నిత్యపూజ జరగాల్సిందే. అలా చెయ్యగలిగితేనే శివలింగాన్ని ఇంట్లో ఉంచుకోవాలి. శివలింగానికి నిత్యము ఖచ్చితమైన సమయంలో అభి షేకమూ, నివేదన జరగాలి. అలా నిష్టగా చేసే పరిస్థితులు ఈ పోటీ ప్రపంచంలో లేవు. కాన శివలింగాన్ని అలా నిత్య పూజ చెయ్యలేనప్పుడు మహాశివుని ఆగ్రహానికి గురికావటం కన్నా, మీకు దగ్గరిలోని గుడిలో శివలింగాన్ని ఇచ్చివేయటం మంచిది.




## 353. అరిషడ్వర్గములు అను దుర్గుణములు మానవుడ్ని ఏ స్థితికి తీసుకువస్తాయి?

**జ.** మొదటిది కామము. ధర్మవిరుద్ధమైన కోరికలతో, కంటికి నచ్చిన ఆడదాని కోసం వెంపర్లాడేలా చేసి, ధన, మానా లను మనుజులకు పోగొడుతుంది. రెండ వది క్రోధము. కామము వలన క్రోధము పెరిగి, ఆత్మీయులను దూరం చేస్తుంది. శత్రువుల్ని దగ్గర చేస్తుంది. మూడవది లోభము. లోభమువల్ల తన ధనం తనకూ, తనవారికి కూడా దక్కకుండా చివరకు అన్యులకూ, అర్హతలేని వారికి అందుతుంది. నాలుగవది మోహము... 'నాది' అనే భ్రమలో 'నీది' అనునది పోగొట్టేది. ఐదవది మదము... మనకున్న కొద్దిపాటి శక్తులను చూసుకుని విర్ర వీగటము. ఆరవది మాత్సర్యము. పరు లని చూసి ఈర్ష్య పొందుతూ, ద్వేషిస్తూ, పగతో అహంకార పూరితంగా ప్రవర్తించి తన్ను తాను కోల్పోవటము.

## 354. భార్య, భర్తకు ఏ వైపుగా ఉండాలి?

**జ.** సమస్త కార్యాల్లోనూ ఎడమ పక్కనే ఉండాలన్న నియమాన్ని శాస్త్రం చెప్పటం లేదు.పూజాదికాలు నిర్వహించే టప్పుడూ, దానాలూ, ధర్మాలూ చేసే సమయాన భార్య భర్త ఎడమవైపున ఉండాలి. కన్యా దాన సమయాన, విగ్రహ ప్రతిష్ఠల ప్పుడూ కుడివైపున ఉండాలి. బ్రహ్మ దేవుడు మగవాడ్ని కుడిభాగం నుంచీ,



స్త్రీని ఎడమభాగం నుంచీ సృష్టించాడని శాస్త్రాలు చెబుతున్నాయి. శ్రీమహావిష్ణువు తన భార్య శ్రీమహాలక్ష్మిని ఎడమ స్థానంలో పదిలంగా ఉంచుకున్నాడు. నిద్రలో కూడా భర్త భార్యపై కుడిచేతిని వేసి ఆ సమయంలోనూ రక్షణగా చూసుకుంటాడు. భర్త చేతిస్పర్శతో భార్య అనంతమైన భద్రతని పొంది సుఖంగా నిద్రిస్తుంది.

## 355. ఏ గుడికి ఏఏ వేళల్లో వెళితే ఎంత పుణ్యం?

**జ.** ఉదయాన్నే శ్రీమహావిష్ణువు ఆలయానికి, సాయంత్రం పరమేశ్వరుని ఆలయానికి వెళ్ళటము మంచిది. శ్రీమహావిష్ణువు స్థితి కారకుడు. కాన ఆయన మన జీవన పోరాటంలో నిత్యం వచ్చే సమస్యలను తొలగిస్తాడు. మన బుద్ధి ద్వారా ఆపదలను తొలగించి మనల్ని సుఖంగా ఉండేలా చూస్తాడు. మహేశ్వరుడు లయ కారకుడు. కాన రోజు పూర్తి అవుతున్న సమయంలో దర్శిస్తే రెట్టింపు ఫలాన్ని అందిస్తాడు. తొందరపడకుండా ప్రశాంతంగా నెమ్మదిగా భగవంతుడ్ని దర్శించాలి.

## 356. దేహము కూడా పాపాలు చేస్తుందా?


**జ.** మానవుడు తన బుద్ధితో కొన్ని పాపాలు చేస్తే దేహం కూడా తనేమన్నా తక్కువా అన్నట్టు తన మానాన తాను చేసుకుపోతుంది. హత్యలూ, వ్యభిచారమూ, దొంగతనమూ, మద్యమూ, మంసభోజనమూ ఇవన్నీ దేహం చేస్తుంది. అలాగే నాలుక అబద్ధాల్ని, ఈర్ష్యతోనూ, అసూయతోనూ అనేక చాడీలు చెపుతుంది. పురుషుని మనస్సు పర స్త్రీ వైపుకూ, స్త్రీ మనస్సు పర పురుషుని వైపుకూ పోయి పాపాన్ని మనకు మూటగడుతుంది. శరీరము కామంవైపూ, లోభము వైపూ, మదము వైపూ, హేయమైన అవినీతి పనులవైపు లాక్కెళుతుంది. ఐహికమైన ఆ విషయాలను మనుజుడు తనకిచ్చిన బుద్ధితో మనస్సుని నిగ్రహించుకోవాలి.

## 357. పంచకన్యా స్మరణ ఎందుకు చేస్తారు?

**జ.** అహల్యా ద్రౌపదీ, సీతా, తారా, మండోదరీ, తథా పంచకన్యాః పఠేన్నిత్యము మహాపాతక నాశనం. ప్రతిరోజూ పంచకన్యా స్మరణ చేస్తే సకల పాపాలు పోతాయాని, నశిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి.

ఇలా వీరిని స్మరించటం ద్వారా స్త్రీ తన ధర్మములను విస్మరించకుండా ఉంటుందని మరింత కృతనిశ్చయంతో తన స్త్రీ ధర్మాన్ని పాటిస్తుందని నిత్యమూ స్మరించ మంటారు.

## 358. ధైర్యం సుఖాలకు మూలమా?




జ. ఏం జరుగుతుందోనని అటూ, ఇటూ ఎన్నో విధాలుగా ఆలోచించి ఏ పనినీ కొందరు ప్రారంభించరు. అట్టి వారు అధములు. తొలుత అట్టహాసముతో ప్రారంభించి చిన్న ఆటంకానికే చతికిలపడి కార్యాన్ని మధ్యలో అపేవారు మధ్యములు. ధైర్యాన్ని ప్రధానంగా ఎంచుకుని ముందుకు సాగిపోయే వాడు ఉత్తముడు ... వాడే ధైర్యవంతుడు. 'ధైర్యే సాహసే లక్ష్మి' అని అందుకే అన్నారు.

## 359. దరిద్రుడితో స్నేహం చేస్తే ఆ దరిద్రం మనకు అంటుకుంటుందా?

జ. ఖచ్చితంగా. ప్రొద్దున లేస్తే సమస్యలూ, బాధలూ, ఇంకా అనేకం. ఇవేగా దరిద్రానికి కారణము. ధనంలేని దరిద్రుడితో స్నేహం చేస్తే ధనమునూ, విద్యా దరిద్రం కలవాడితో స్నేహం చేస్తే విద్యా జ్ఞానమూ, సంస్కారము లేని దరిద్రుడితో స్నేహం చేస్తే సంస్కారమూ తరిగి పోతాయి. అందుకే ఎందులోనైనా మన కంటే ఉన్నతమైన వారితో స్నేహం చెయ్యాలంటారు.

## 360. ఏ రోజున ఏ దేవుడ్ని పూజించాలి?



జ. సోమవారం శివుడ్ని, మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామినీ, ఆంజనేయ స్వామినీ, బుధవారం విష్ణువునూ, గురువారం నవగ్రహాలనూ, శుక్రవారం అమ్మవారినీ, శనివారం శ్రీవేంకటేశ్వర స్వామినీ ఆదివారం సూర్య భగవానుడ్ని పూజించాలి.

## 361. గుడికి వెళ్ళేటప్పుడు తలస్నానం చేసి వెళితే మరింత శుభమా?

జ. తలస్నానం చేసి వెళితే శరీరము మొత్తం శుచిగా ఉంచుకొని దర్శనం చేసుకున్నట్టు. మన నిత్యకృత్యాలతో మనసు ఎల్లప్పుడూ అనేక విధాలుగా కామ, క్రోధ, లోభ, మదాలతో నిండి ఉంటుంది. ఆ మనసుని పవిత్రంగా, పరిశుద్ధంగా చేసుకొని వెళ్ళే ఆధ్యాత్మిక శక్తి మనకు లేదు గనుక, కనీసం శరీరం మొత్తాన్ని శుభ్రపరుచుకొని దర్శించుకుంటున్నాము.

ఈ శరీరంలా మనసును శుచిగా, నిర్మలంగా ఉండేలా చెయ్యమని అర్థమే పూర్తి స్నానము యొక్క భావము.

## 362. వెల్లుల్లి రక్తాన్ని గడ్డ కట్టించకుండా కాపాడుతుందా?



**జ.** శక్తివంతమైనది రక్షితమైనది వెల్లుల్లి. ఇది రక్తాన్ని పలుచగా చేసి ధమనుల్లో రక్తం గడ్డ కట్టకుండా చేస్తుంది. వీలయినంత ఎక్కువగా వెల్లుల్లి, నీరుల్లిపాయలను తీసుకోవడం గుండెకెంతో మంచిది.

## 363. ధర్మాన్ని కాపాడితే ఆ ధర్మమే రక్షిస్తుందని ఎవరు చెప్పారు?

**జ.** తండ్రి మాటపై అడవులకి వెళ్తున్న శ్రీరామునితో తల్లి కౌసల్యాదేవి "శ్రీరామచంద్రా! ధైర్యంతో నియమనిష్టలతో ధర్మాన్ని ఆచరించి ధర్మాన్ని రక్షిస్తే ఆ ధర్మమే నిన్ను కాపాడుతుంది" అని చెప్పింది.

## 364. ఏ దేవతలకి ఏం ఇష్టం?

**జ.** వినాయకుడికి నివేదనా, శివునకు అభిషేకమూ, అమ్మవారికి స్తోత్రము, విష్ణువుకి అలంకారమూ, సూర్యునకు నమస్కారమూ, గురువునకు శుశ్రూష ప్రియం. స్త్రీకి చీరలూ, నగలూ, పురుషునికి ధనమూ, కీర్తి, పిల్లలకి ఆటలూ, పెద్ద వారికి ఆధ్యాత్మిక చింతన ఇష్టం.

## 365. పుణ్యానికి పోతే పాపం ఎదురయిందని ఎందుకంటారు?


**జ.** మహాభారత గాథలో పైలుడి శిష్యుడు ఉదంకుడు గురుదక్షిణగా గురివిని కోర్కెపై పౌష్య మహారాజు వద్దకు వెళ్ళి కర్ణాభరణాలు అడుగుతాడు. దానికి మహారాజు ఒప్పుకొని, అతిథికి అందునా బ్రాహ్మణ పుత్రునికి ఆతిథ్యమిస్తే మహా పుణ్యమని తలుస్తాడు. భోజనం చేసి వెళ్ళమని చెబుతాడు పౌష్యుడు. చక్కటి భోజనాన్ని సిద్ధం చేయిస్తాడు. భోజనంలో ఓ వెంట్రుక కనిపిస్తుంది. దానితో మండిపడి పౌష్యమహారాజును గుడ్డి వాడిని కమ్మని శాపం ఇస్తాడు. ఆ శాపానికి పౌష్యమహారాజు కన్నెర్ర చేస్తాడు. మునివాసం చేసిన వాడవుకదాని గౌరవిస్తే, పిలిచి విస్తరి వేస్తే పుణ్యానికి పోతే పాపం ఎదురయిందని నాకే శాపం ఇస్తావా? అని ప్రతి శాపం ఇస్తాడు. తర్వాత ఇద్దరూ చింతిస్తారు. అది వేరే గాథ. కొన్నిసార్లు పుణ్యానికి పోతే ఇలాగే జరుగుతుంది. మంచి పనయినా తరచి తరచి తగు వ్యక్తులకి చేస్తేనే పుణ్యం.

## 366. రథసప్తమి రోజు జిల్లేడు ఆకుపై రేగిపండు పెట్టుకుని స్నానం చేసేదెందుకు?

**జ.** అమ్లగుణంగల రేగుపండూ, జిల్లేడు ఆకూ శిరస్సుకు ఎంతో మేలు చేస్తాయి.

జిల్లేడు ఆకులోని రసాయనం జుట్టును గట్టి పరుస్తుంది. మెదడుని చల్లబరుస్తుంది. అందుకే ఆ రోజున నదుల్లోనూ, కుదరకపోతే ఇంట్లోనయినా విధిగా అలా స్నానం చేస్తారు. ఈ ఆచారము కోనసీమ ప్రాంతాలవారు ఎక్కువగా పాటిస్తారు.

## 367. తిరుమల శ్రీ వేంకటేశ్వరుని పాదరక్షలు ఎందుకు అరుగుతున్నాయి?



**జ.** స్వామి వారి పాదరక్షలు చాలా పెద్దవిగా ఉంటాయి. అవి కాలంతో పాటు అరుగుతున్నాయి. దానికి కారణం శ్రీ వేంకటేశ్వరునికి భార్యపై ప్రేమ. శ్రీవారు రాత్రి ఆలయాన్ని మూసిన తర్వాత ఈ పాదరక్షలు ధరించి, ఏడుకొండలు దిగి అలమేలు మంగాదేవి వద్దకెళ్ళి తిరిగి ఏడుకొండలు ఎక్కి తన స్థానానికి సుప్రభాత వేళకి చేరతాడు. అందుకే అవి అరిగి పోతుంటాయని భక్తుల నమ్మకము.

## 368. గురువారం తిరుమల శ్రీ వేంకటేశ్వరుడ్ని మూడు రూపాలతో చూడవచ్చా?

**జ.** గురువారం నాడు శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తులకు మూడు రూపాలతో దర్శనము ఇస్తాడు. గురువారం ఉదయం రెండవ అర్చన అయిన తర్వాత శ్రీ వేంకటేశ్వరుడు ఆభరణాలూ, అలంకరణలూ లేకుండా దర్శనమిస్తాడు. నొసటన సన్నని నామము మాత్రం ఉంటుంది. ఆ సమయంలో స్వామి వారి నేత్రాలని దర్శించి తరించవచ్చు. రాత్రి తోమాల సేవ అయిన తర్వాత పూలంగి సేవలో దర్శనమిస్తారు. అనగా గురువారం ఉదయం సకలాభరణములతోనూ. రెండవ అర్చన తర్వాత అభరణాలు లేకుండా, రాత్రికి పుష్పాలంకరణతో దివ్య దర్శనాన్ని భక్తులకు అందిస్తారు శ్రీవేంకటేశ్వర స్వామి.

## 369. గుడిలో షడగోప్యం (శఠగోపనం) తలమీద పెట్టడం ద్వారా ఏం ఫలితం వస్తుంది?

**జ.** దేవాలయంలో దర్శనం అయ్యాక తీర్థం, షడగోప్యం తప్పక తీసుకోవాలి. చాలామంది దేవుడ్ని దర్శనం చేసుకున్నాక వచ్చినపనైపోయిందని చక, చకా వెళ్ళి ఏదో ఏకాంత నిర్మల ప్రదేశం చూసుకొని కూర్చుంటారు. కొద్దిమంది మాత్రమే ఆగి, షడగోప్యం పెట్టించుకుంటారు. షడగోప్యం అంటే అత్యంత రహస్యం. అది పెట్టే పూజారికి కూడా విన్పించనంతగా కోరికను తలుచుకోవాలి. అంటే మీ కోరికే షడగోప్యము. మానవునికి శత్రువులైన కామమూ, క్రోధమూ, లోభమూ, మోహమూ, మదమూ, మాత్సర్యముల వంటి వాటికి ఇక నుండి దూరంగా ఉంటామని తలుస్తూ తలవంచి తీసుకోవటము మరో అర్ధం.

సహజంగా చిల్లర లేకపోవటం వల్ల, షడ గోప్యమును ఒక్కోసారి వదిలేస్తుంటాము. ప్రక్కగా వచ్చేస్తాము. అలా చెయ్యద్దు. పూజారి చేత షడగోప్యము పెట్టించు కోండి. మనసులోని కోరికను స్మరించు కోండి. షడగోప్యమును రాగి, కంచు, వెండిలతో తయారు చేస్తారు. పైన విష్ణు పాదాలుంటాయి.

షడగోప్యమును తలమీద ఉంచిన పుడు శరీరంలో ఉన్న విద్యుత్, దాని సహ జత్వం ప్రకారం శరీరానికి లోహం తగిలి నపుడు విద్యుదావేశం జరిగి, మనసులోని అధిక విద్యుత్ బైటకెళుతుంది. తద్వార శరీరంలో ఆందోళనా, ఆవేశమూ తగ్గు తాయి. షడగోప్యమును శఠగోపనం అని కూడా అంటారు.

## 370. తులసి దళాలను ఆడవాళ్ళు కోయరాదా?

**జ.** కోయరాదనే శాస్త్రాలు చెబుతు న్నాయి. శుక్రవారం, ఆదివారం, ఏకా దశి, అమావాస్య, పౌర్ణమి రోజులలో తులసినీ ఉసిరి పత్రాన్నీ కోయరాదు.



అలాగే తులసి మొక్కను నాటడం, తొల గించటం మగవారే చేయాలని, మగవారు కోసిన తులసితోనే పూజించాలని శాస్త్రం. తులసిని కోసేటప్పుడు స్తుతించి, నమస్క రించి పురుషులు కోయాలి.

## 371. తల్లికి పెట్టే నమస్కారం ఎంత పుణ్యము?



**జ.** ఆరుసార్లు భూ ప్రదక్షిణ చేసినంత, పదివేల సార్లు కాశీ వెళ్ళి వచ్చినంత, వందలాది సార్లు సముద్ర స్నానం చేసి నంత. ఇట్టి వాటికి పదిరెట్ల ఫలం మాతృ వందనం ద్వారా కలుగుతుంది.

## 372. గుడిలో దర్శనం అయ్యాక కూర్చునేదెందుకు?

**జ.** స్వామి దర్శనమూ, షడగోప్యము అయ్యాక ఒకింత సేపు కూర్చొని వెళ్ళాలి. అలా కూర్చోమనేది ప్రశాంతత కోసము, పుణ్యం కోసము. కూర్చోకుండా వెళితే స్వామిని దర్శించిన ఫలం కూడా రాదు. అలా కూర్చున్నపుడు మంచి చెడులు బేరీజు వేసుకుంటాము. ప్రశాంత మన సుతో ఆలోచిస్తాం. ఏది తప్పు, ఏది ఒప్పు అని ఆలోచనలో పడతాము. రోజు వారి జీవన విధానాన్ని సరిచేసుకుని సరైన

మార్గంలో నడుస్తాము. గుడిలో కూర్చో వటం ఒక రకమైన ధ్యాన పద్ధతి కూడా. కేవలం కూర్చోవటమే కాకుండా ఓ రెండు నిమిషాలు కనులు మూసుకొని ధ్యానం చేస్తే మరింత శుభం కలుగుతుంది.

## 373. పెళ్ళిలో మంగళ సూత్రం కట్టటంలో పరమార్థం?



**జ.** పెళ్ళికొడుకునైన నేను పెళ్ళి కూతురి వైన నీ మెడలో మాంగల్యం కడుతు న్నాను. నా, నీ జీవనం ఈ క్షణం నుంచి ప్రారంభం. నిండు నూరేళ్ళు పూర్ణ ఆయు ష్షుతో మనం కలిసి ఉండాలి. రెండు తాళి బొట్లు గౌరీ శంకరులు. పరస్పరం ఒక్కటై అత్తింటివార్ని, పుట్టింటి వార్ని రెండు తాళిబొట్లవలే సదా కలిపి ఉంచి సుఖంగా జీవితాన్ని గడుపుదామని పరమార్థం.

## 374. స్నానం ఎలా చెయ్యాలి? అసలు స్నానాలు ఎన్ని?

**జ.** స్నానమంటే హడావుడిగా నాలుగు చెంబులు పోసుకొని వచ్చెయ్యటం కాదు. కొంతమంది శరీరం తడవకుండా స్నానం అయ్యిందనిపిస్తారు. స్నానంవిధి అలా చెయ్యకూడదు. అన్ని స్నానాలకన్నా సముద్ర స్నానం శ్రేష్టం. కారణం ఉప్పు నీటిలో స్నానం ద్వారా శరీరంలోని అనేక మలినాలు పోతాయి. తర్వాతది నదీ స్నానం. ఉద యాన్నే నదీస్నానం చేస్తే అనేక చర్మ రోగాలు దూరమవుతాయి. నదీ జలాలు కొండల్లోనూ, కోనల్లోనూ, చెట్టూ పుట్ట లనూ తాకుతూ ప్రవహిస్తాయి. అలా ప్రవ హించటం ద్వారా ఎన్నో వన మూలికల రసం నదీజలాల్లో కలుస్తుంది. దాని వల్ల నదీ స్నానం ఎంతో ఉత్తమమైనది. ఆరోగ్యవంతమైనది. మిగిలినది ఇంటి స్నానము. అతి వేడి నీటితోగానీ, అతి చల్లటి నీటితోగానీ స్నానం చెయ్య రాదు. గోరువెచ్చటి నీళ్ళతో స్నానం చేస్తే శరీరా నికి, శరీరం లోపల అవయవాలకి ఎంతో సేద కలుగుతుంది. అనారోగ్యం ఉన్న వారూ, చిన్నపిల్లలూ తగురీతిలో వేడి లేదా చన్నీటితో స్నానం చేయాలి. స్నానము ఒక పని కాదు. ఓ భోగము. సంతృప్తిగా అనుభవించాలి.

## 375. పుష్కరస్నాన మహత్యము ఏమిటి?

**జ.** మనిషి తాను జన్మించిన దగ్గర్నించి ఎన్నో పాపాలు తెలిసీ, తెలియక చేస్తుం టాడు. పుష్కర స్నానం చెయ్యటం ద్వారా సమస్త పాపాలు పోతాయని మహా భారత ములో వ్యాసుడు శెలవిచ్చాడు.

## 376. తల్లీ, తండ్రీ కన్నా ముందే భుజించరాదా?

**జ.** అవును. జన్మనిచ్చి, మల మూత్రా లను శుభ్రపరిచి పెంచి పెద్ద చేసిన తల్లీ, తండ్రీ పార్వతీ పరమేశ్వరుల వంటివారు. వారు భుజించిన తర్వాత చేసే భోజనం

భగవంతునికి పెట్టిన నైవేద్యము వంటిది. ముందు భుజించిన రాక్షస ఆహారం అవుతుంది.

## 377. వటపత్ర శాయి అనగా?




**జ.** మర్రి ఆకు మీద శయనించిన దేవుడు అని. ఈ వృత్తాంతము మార్కం డేయ మహర్షి చరిత్రలో ఉంటుంది. మార్కండేయుడు ఆరు మన్వంతరములు తపస్సు చేశాడు. ఏడో మన్వంతరములో ఇంద్రుడు తపస్సును చెడగొట్టడానికి అందమైన అప్సరసలను పంపాడు. వారి నాట్య హోయలకు మార్కండేయుడు చలించలేదు. చలించని మార్కండేయుడికి శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమై 'ఏం వరం కావాలో కోరుకో' అనగా 'నీ మాయను చూడాలని ఉంది' అని అడుగుతాడు. ఆ తర్వాత కొన్ని రోజులకి ప్రచండ గాలీ, ధరపాత వర్షమూ విపరీతంగా వచ్చి సముద్రాలు పొంగాయి. నీటితో సమస్తం మునిగిపోతుంది. మార్కండేయుడు మోహశోకాలతో విష్ణుమాయతో నీటిపై జీవించాడు. అలా తిరుగుతున్న అతనికి ఓ చోట మర్రి ఆకుపై శయనిస్తున్న బాలుడు కనిపించాడు. చేతి వ్రేళ్ళతో కాలిని పట్టు కొని నోట ఉంచుకొని చీకుతూ కనిపిం చాడు. అతడే వటపత్రశాయి. మహా విష్ణువు ఆదేశంతో మర్రి ఆకుపై నున్న వటపత్ర శాయి కడుపులోకెళ్ళి చూస్తాడు. నీట ముని గిన సమస్త భూమీ, ప్రాణి కోటి కనిపిస్తుంది. మళ్ళీ మరోచోట సృష్టి ప్రారంభము చేస్తాడని తెలుసు కుంటాడు మార్కం డేయుడు. శ్రీ మహావిష్ణువు వరం ప్రకారం విష్ణుమాయను తెలుసుకుంటాడు.

## 378. మొదటి రాత్రి తెల్లచీరలోనూ, భర్త పోయినప్పుడు తెల్లచీర ధరించటంలో మర్మమూ, తేడాలేమిటి?

**జ.** చాలా మంది రెండు సందర్భాల్లోనూ ఒకే చీరనుకుంటారు. కానీ కాదు. చాలా తేడా వుంది. నవవధువు పాలతో భర్తను చేరేటప్పుడు నిర్మలత్వానికి ప్రతీకైన తెల్లని చీరను ధరించి, భర్తను సమీపిస్తుంది. అలాంటి సందర్భంలో ఆమె ధరించే తెల్ల చీరకు అంచులుంటాయి. సరస్వతీ దేవి ధరించే తెల్లటి చీరవంటి ఆ చీరను వధువు ధరించటానికి ముందు శుభ్ర ప్రద మయిన పసుపుతో అలంకరిస్తారు.

భర్త చనిపోయినప్పుడు ధరించే చీర విషయానికొస్తే ఆ సమయంలో కట్టుకునే తెల్లచీరకు అంచులుండవు. పసుపు రాయరు.

## 379. నిద్రలేవగానే చూడాల్సినవి



**జ.** ఇష్టదైవమూ, సూర్యుడూ, బంగారమూ, సముద్రమూ, తన ప్రతిబింబమూ, వృద్ధులూ, పుణ్యస్త్రీలూ, దూడతో ఉన్న ఆవూ, మంగళ తోరణములూ, పసుపు బట్టలూ, తులసి మొక్కలూ, ఇలాంటివి చూస్తే ఆ రోజంతా మంగళకరంగా ఉంటుంది.

## 380. జ్యోతిర్లింగ దర్శన ఫలములు

**జ.** సౌరాష్ట్ర సోమనాథుడ్ని దర్శించిన భోగభాగ్యాలు కలుగుతాయి. శ్రీశైల మల్లికార్జుడ్ని సేవించిన సర్వదరిద్రాలు సమసిపోతాయి. ఉజ్జయిని మహాకాలుడ్ని కొలిచిన సర్వభయ పాపాలూ హరించుకు పోతాయి. ఓంకారేశ్వరము అమర లింగేశ్వరుడు, ఇహపరాలూ, సౌఖ్యాన్నిస్తాడు. పరళి వైద్యనాథ లింగాన్ని సేవించిన అనేక దీర్ఘవ్యాధులు నయమవుతాయి. భీమేశ్వరము భీమేశ్వర లింగాన్ని దర్శించిన శత్రుజయం కలిగి అకాల మృత్యు భయాలు తొలగిపోతాయి, తప్పిపోతాయి. రామేశ్వరంలోని రామేశ్వర లింగాన్ని దర్శించి, కాశీలో గంగా జలాన్ని అభిషే కించిన, మహోన్నతమైన పుణ్యఫలం కలిగి పరమపదాన్ని చేరుతారు. ద్వారక నాగేశ్వరుడ్ని దర్శించిన మహాపాతకాలూ, ఉపపాతకాలూ నశిస్తాయి. కాశి, విశ్వేశ్వర లింగాన్ని సేవించిన సమస్త కర్మబంధాల నుంచి విముక్తి. నాసిక్ త్ర్యంబకేశ్వర స్వామిని కొలిచిన కోరికలు తీరుతాయి. అపవాదులు పోతాయి. హిమాలయ కేదారేశ్వర లింగాన్ని దర్శించిన వారు ముక్తిని పొందుతారు. వేరూలు ఘుష్మేశ్వర లింగాన్ని దర్శించిన ఇహపర భోగాలను అందిస్తుంది.

## 381. తిరిగి ఆడదీ, తిరక్క మగవాడూ ఎందుకు చెడతాడు?

**జ.** పూర్వకాలంలో ఇంత విజ్ఞానం గూర్చి తెలియచేసే సాధనాలు లేవు. కొడుకుని దేశ సంచారం చేయించి లోకం పోకడా, మోసం, న్యాయం, ధర్మం, తెలివి, లౌక్యము వంట పట్టించుకుని రమ్మనేవారు. అలా దేశ సంచారం చేసి వచ్చిన వారికి వివాహం జరిపించి బాధ్యతలను ధైర్యంగా అప్ప చెప్పేవారు. అదే స్త్రీ తిరిగితే ప్రథమంగా జరిగేది గర్భవతి కావటం. లౌక్యం, విజ్ఞానం సంగతి అటుంచి అన్ని వైపుల నుంచి నవ్వుల పాలవుతుంది. అందుకే స్త్రీని ఎంత దగ్గరి వాళ్ళ ఇంటికైనా పంపరు. దానివల్లే స్త్రీనీ, ధనాన్నీ భద్రంగా ఉంచాలి. రక్షణ కల్పించాలి. అలా చెయ్యలేదంటే ధనమయితే పోతుంది. స్త్రీ అయితే చెడు తుంది. అందుకే ఆడది తిరిగి చెడు తుంది

... మగవాడు తిరక్క చెడతాడు అని అంటారు. ధనాన్నీ స్త్రీని ప్రక్కప్రక్కన పెడితే మొదట స్త్రీని ఆశించి పొంది ఆపై ధనాన్ని ఆశిస్తాడు మగవాడు. అందుకే ఇక్కడైనా ఎక్కడైనా స్త్రీకి అన్ని రక్షణలు.

## 382. చంటిపిల్లల్ని కాళ్ళ మీద పడుకో బెట్టుకుని స్నానం చేయించేదెందుకు?



**జ.** చిన్నపిల్లలకి స్నానం చేయించట మన్నది అతి పెద్దపని. అందుకనే పసి పిల్లలకు అత్తగారో, అమ్మవంటి పెద్దవారో ఆ సమయంలో దగ్గరుండి స్నానం చేయి స్తుంటారు. స్నాన సమయంలో నీళ్ళు చెవుల్లోకి, ముక్కుల్లోకి పోతే పిల్లాడికి ఇబ్బందీ, ప్రమాదం కలిగే అవకాశం ఉంది.అందుకే తల్లి లేదా పెద్దవారు తన రెండు కాళ్ళ మీద పడుకోబెట్టుకొని, వేడి నీటితో స్నానం చేయించాలి. స్నానానికి అరగంట ముందు పిల్లవానికి లేదా పిల్ల ఒంటికి నూనె రాసి, చిన్నగా మెత్తగా మసాజ్ చేసి మాడుకు ఆముదం పెట్టి, ఆపై నలుగు పిండితో స్నానం చేయించాలి. అలా కాళ్ళ మీద పడుకోబెట్టుకుని స్నానం చేయిస్తే పిల్లలు ఏడ్వరు.. నలుగు పెట్టి, నూనే రాసి స్నానం చేయించటం ద్వారా పసిబిడ్డలకి వ్యాయామం అవుతుంది. తద్వారా మంచి ఆరోగ్యకరమైన శరీర పటుత్వం వస్తుంది. అందంగా, ఆరోగ్యంగా పెరుగుతారు పిల్లలు.

## 383. ఏ ప్రదేశాల్లో జపం చేస్తే ఎంత ఫలితము ఉంటుంది?


**జ.** గృహంలో ఎంత చేస్తే అంత ఫలి తము ఉంటుంది. నదీ ప్రాంతాల్లో చేస్తే రెట్టింపు ఫలితం వస్తుంది. గోశాలలో వందరెట్లు, యాగశాలలో అంతకు మించి ఫలితం వస్తుంది. పుణ్య ప్రదేశాల్లోనూ, దేవతా సన్నిధిలోనూ చేస్తే పదివేల రెట్లు ఫలితం వస్తుంది. శివసాన్నిధ్యంలో మహో న్నతమైన ఫలం వస్తుంది. పులి తోలు మీద కూర్చుని జపిస్తే మోక్షం కలుగుతుంది. అలాగే వెదురు తడికపై కూర్చుని జపము చేస్తే దరిద్రం ఆవహిస్తుంది. రాతి మీద కూర్చుని జపిస్తే రోగాలు వస్తాయి. నేల మీద కూర్చుని జపిస్తే దుఃఖమూ, కొయ్య పీట మీద జపిస్తే దౌర్భాగ్యం కలుగు తుంది. గడ్డిమీద జపిస్తే కీర్తి నాశనము అవుతుంది.

## 384. అట్లతద్దినాడు అట్లెందుకు పోస్తారు?

**జ.** ఆశ్వయుజ బహుళ తదియ నాడు వచ్చే అట్లతద్ది స్త్రీలకు ఓ ముఖ్య పండగ. ఈ పండగనాడు అట్లు పోస్తారు. అలా పోసేటప్పుడు అట్లకు ఎన్ని చిల్లులు పడ తాయో, అన్ని వేల సంవత్సరాలు తమకి

అయిదో తనాన్ని ప్రసాదించమని గౌరి దేవిని వేడుకోవటమే అట్లతద్ది. పెళ్ళి కాని వారు ఈ అట్ల తద్ది జరుపుకోవటం వల్ల సుందరమైన భర్త, చక్కటి పిల్లలు కలుగుతారు. గోరింటాకు రుబ్బుకుని పెట్టుకుంటేనే ఈ పండగ అసలు కళ.

## 385. ముక్కోటి నాడు ఉత్తర ద్వార దర్శనం ఎందుకు?



**జ.** ఆ రోజు శ్రీ మహావిష్ణువు యోగనిద్ర నుండి మేల్కొంటాడు. ఉత్తరద్వారం నుంచి దర్శనమిస్తాడు. ఉత్తరద్వారం ద్వారా స్వామిని దర్శిస్తే ఎంతో పుణ్యఫలం. ఆయన నిద్ర నుంచి లేచిన రోజు తొలిగా తామే దర్శనం చేసుకుని మనసులో కోరిక కోరుకుంటే స్వామి తక్షణమే తీరుస్తాడని నమ్మకం. ముక్కోటినాడు ముక్కోటి వ్యవహారాలున్నా మానుకొని శ్రీ మహా విష్ణువుని ఉత్తరద్వారం ద్వారా వెళ్ళి దర్శిస్తే ముక్కోటి దేవతలూ దీవిస్తారు.

## 386. మసాలా దినుసులలు ఎంత మంచివి?

**జ.** మిరియం రక్తాన్ని గడ్డ కట్టించదు. ఆకలిని పెంచుతుంది. లవంగము ఆస్పిరిన్‌లా పనిచేసి రక్తంలో గడ్డలు పడకుండా చేస్తుంది. అల్లం రక్తంలో ప్రమాదకరంగా మారే అవరోధాలను సరి చేస్తుంది. ద్రాక్ష రక్త ప్రసారాన్ని సక్రమంగా నడిపిస్తుంది. ఇక నీరుల్లి.... దీన్ని పచ్చిగా తిన్నా, ఉడికించి తిన్నా రక్తాన్ని నిరాటంకంగా ప్రవహింపచేస్తుంది.

## 387. ఏవి ఎన్నటికీ తిరిగి పొందలేము?


**జ.** గతించిన కాలము, విల్లు నుంచి వెలువడ్డ బాణమూ, పెదవి దాటిన మాటా, చేజారిన అవకాశమూ తిరిగి రావు, పొందలేము. కనుక కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మాట్లాడే మాట ఆచి తూచి మాట్లాడితే అనర్థాలు జరగవు. అవకాశం అరుదుగా వస్తుంది. అప్పుడే తలుపు తీయాలి.... సద్వినియోగ పరచుకోవాలి. ఆ తర్వాత తలుపుతీసినా లక్ష్మి ఉండే అవకాశం లేకపోవచ్చు. మరో ఇంటి తలుపు తడుతూ ఉండవచ్చు. దాన్నే అంటారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనం లేదని.

## 388. అద్దం పగిలితే అరిష్టమా?

**జ.** దాని సంగతి తర్వాత పగిలిన అద్దంలో మొహాన్ని చూసుకోకూడదు. ఇంట్లో ఉంచకూడదు. మరకలు పడి లేదా మాసిపోయిన దాన్ని అసలు ఉంచకూడదు. అద్దానికీ, లక్ష్మీదేవికీ అవినాభావ సంబంధం ఉంది. అద్దం లక్ష్మి స్థానం.

అద్దంలో ఎప్పుడూ ఒకే బొమ్మ నిలిచి ఉండదు. లక్ష్మీ అంతే. నిలకడగా ఉండదు. అద్దం పగిలితే ధన నష్టమని శాస్త్రం చెబు తోంది. గాజు వస్తువేదయినా చూసు కోండి... పగిలినప్పుడు ఎంత జాగ్రత్తగా ఏరినా, శుభ్రపరచినా ఎక్కడో చిన్న ముక్క అయినా చటుక్కున మాటు వేసిన తేలులా కాటు వేస్తుంది. కాన ఎన్నో జాగ్రత్తలు తీసుకుని ఓపికగా వెతికి ఎవ్వరూ నడవని ప్రదే శాల్లో ముక్కలని పారెయ్యాలి.

## 389. గోవు సర్వ దేవతామయమా?



జ. గోక్షీరమూ, దధి, ఘృత, మల మూత్ర ములు ఆవునుంచి వచ్చే ఇవి పంచ గవ్య ములు. గో మూత్రమందు వరుణ దేవుడూ, గోమయమందు అగ్నిదేవుడూ, గో ఘృత మందు సూర్య భగవానుడూ, గోదధి యందు వాయుదేవుడూ, గో క్షీరమందు చంద్రుడూ ఉంటారు. అందుకే గోవు పూజిం పదగ్గది. పవిత్రమైనది. సర్వదేవతా స్థానము.

## 390. ఆయుష్షును హరించే ఆరు దుష్టగుణాలు ఏమిటి?


జ. అహంకారము.... నలుగురితో గొడ వలు... వివాదాలు... పిల్లికి బిచ్చం పెట్టక పోవటము, కోప మనస్తత్వము, నమ్మిన తనవాడ్నేమోసం చేసి తన పబ్బం గడుపు కునే మిత్రద్రోహి తత్వము. వీటివల్ల మనిషి దీర్ఘాయువు తెలియకుండానే తగ్గిపోతుంది.

## 391. దేవాలయంలోకి వెళ్ళే ముందు కాళ్ళు ఎందుకు కడుక్కోవాలి?

జ. గుడికి బైలుదేరామంటే స్నానం చేసే బయలుదేరుతాము. అయినా గుడి బైట పంపు వద్ద లేదా బావి వద్ద మళ్ళీ కాళ్ళు కడుక్కొని వెళతాము. దానికి కారణం స్నానం అయ్యాక, బయలు దేరేముందు చెప్పులు ధరిస్తాము. కాన ముందుగా గుడి బైట పాదరక్షలను వదలి, పంచ భూతాల్లో ఒకటైన భూమిపై నిలబడి, పంచభూతాలకి అధిపతి అయిన నీ వద్దకు వస్తున్నామని మననం చేసుకుంటూ, ఆపాద మస్తకమూ పరిశుభ్రం చేసుకోవ టానికి, తొలుత రెండు కాళ్ళు వెనక, ముందూ తడిచేలా కడుక్కుంటాము. మూడుసార్లు పుక్కిలించి నీటిని బైటకి వదలాలి.

'దేవా! శరీరమూ, వాక్కుకి మూల కారకమైన నాలుకా, నోరూ కూడా శుభ్ర పరుచుకొని నీ ముందుకు వచ్చి ప్రార్థి స్తున్నాము. కాన మమ్ము దీవించు' అని అర్థం. అందుకే విధిగా దేవాలయం లోకి వెళ్ళే ముందు కాళ్ళూ, నోరూ శుభ్ర పరుచుకొని దర్శించుకోవాలి.

## 312. తిరుమల శ్రీవారి హస్తాలు అలా ఎందుకుంటాయి?



జ. తిరుమల స్వామిని దర్శించిన వారం దరికి స్వామి హస్తాలు ఉండే తీరు గమ నంలోనే ఉండి ఉంటుంది. స్వామి హస్తాలు నేలను చూపుతున్నట్టు ఉంటాయి. ఆ భంగిమకు అర్థం.... తన పాదాలను శరణ్యంగా భావించిన భక్తులకూ, దర్శిం చిన భక్తులకూ లేమి ఉండదని పర మార్థం. ఇదే విషయం శ్రీవేంకటేశ్వర సుప్రభాతంలో కూడా ఉంటుంది. ఈసారి తిరుమల వెళ్ళినప్పుడు స్వామి వారిని ఆపాదమస్తకమూ తనివితీరా చూడండి. స్వామి కనిపించగానే కనులు మూసు కోకుండా ఆయన్నే చూస్తూ ముందుకు కదలండి.

## 313. స్త్రీ కామాన్ని పురుషుడు సంపూర్ణంగా తీర్చలేడా ?

జ. నాగ్నిస్తృప్యతి కాష్ఠానాం నాపగానాం మహోదధిః
నాంతకః సర్వభూతానాం నపుంసాం వామలోచనా॥

అగ్ని ఎంత భక్షించినా ఇంకా మిగిలే ఉండును. పూర్తిగా అగ్నిని భక్షించటం ఎవ్వరి తరమూ కాదు. ఎన్ని వర్షములూ, తుఫానులొచ్చినా సముద్రం పెరగదు. యముడు ఎంత మంది ప్రాణాలను తీసు కెళ్తున్నా ఇంకను ప్రాణులెట్లు ఉందురో అలాగే స్త్రీ యొక్క కామాన్ని పురుషుడు ఎంత తీర్చినా, ఇంకనూ ఆమెలో కామ కోర్కె మిగిలే ఉంటుంది.

## 314. తమలపాకు తొడిమ, చివర్ల ఎందుకు తెంపి తాంబూలం సేవిస్తారు?

జ. తమలపాకు తొడిమ తింటే వ్యాధి రావటానికి అవకాశాలు ఎక్కువ. అలాగే చివర్లు తింటే పాపం. ఆకులో ఉండే ఈనెలు తింటే బుద్ధి మందగిస్తుంది.

తమలపాకు నమలగానే ఊసి వేయాలి. దానికి కారణం తొడిమ, ఈనెలూ, చివర్లు ఇంకా మిగిలి ఉంటాయి. తొలి రసం ద్వారా బైటికి వదిలెయ్యటం జరుగు తుంది. తాంబూలంలో ఒక వక్క మాత్రమే వాడాలి. రెండు వక్కలు పనికి రావు. తాంబూలాన్ని గాయాలతో ఉన్నవారూ, కంటి జబ్బులున్న వారూ, క్షయాదులున్న వారూ వేసుకోకూడదని శాస్త్రాలు చెబు తున్నాయి. ఆకుకి రాసే సున్నం మధ్య వేలూ లేదా బొటన వేలితోనే రాసు కోవాలి. దానివల్ల ఆయుష్షు పెరుగు తుంది. ఈ రెండు వేళ్ళ ద్వారా సున్నం

వ్రాయటం ద్వారా హృదయ నరాల్లో ఉత్తేజం కలిగి హృదయం తన పని తను మరింత సులువుగా చేసుకుంటుంది.

## 315. స్త్రీల అలంకారములు పదహారు... అవి ఏమిటి?



దంత ధావనము
నలుగుపెట్టి స్నానము
పసుపు పూత
చీర, రవిక
పారాణి
శిరోజాలంకరణ
పుష్పాలంకరణ
పాపిట కుంకుమ
బుగ్గన చక్కటి చుక్క
లలాట తిలకము
గోరింటాకు
తాంబూలము
పెదవులకి ఎరుపు
కంటికి కాటుక
సర్వాభరణ అలంకరణ

పెళ్ళి అయినవారికి మంగళ సూత్రమూ, నల్లపూసలూ, మెట్టెలు.

## 316. ఎడమ చేతి వేలుకే ఉంగరాన్ని ఎందుకు పెట్టుకోవాలి?

**జ.** ఎడమ చేతివేలికి, మెదడులోని రక్త నాళాలకు అవినాభావ సంబంధము ఉంది. అందువల్ల మెదడు చైతన్యవంతమై ఉత్సాహంగా మనల్ని నడిపిస్తుంది. నవరత్నాలుగల ఉంగరాన్ని ధరించటం ద్వారా సూర్యునిలో శక్తి గ్రహించి శరీరాన్ని ఉత్తేజం చేస్తుంది.

## 317. పూర్వజన్మలో ఏ పాపం చేస్తే ఈ జన్మలో ఏ విధంగా పుడుతారు?

**జ.** బ్రహ్మహత్య చేస్తే క్షయరోగంతో పుడతాడు. గోహత్య చేసినవాడు తిరిగి మరుగుజ్జుగా జన్మిస్తాడు. స్త్రీని హత్య చేసిన వాడు నిత్యరోగిగా పుడతాడు. మాంసాన్ని తిన్న బ్రాహ్మణుడు కుష్ఠువ్యాధితో పుట్టి బాధలు పడతాడు. శాస్త్రాన్ని అవమానించిన వాడు పాండు రోగిగానూ, అబద్ధ సాక్ష్యం చెప్పినవాడు మూగవాడిగానూ, అబద్ధాలని వినేవాడు చెవిటి వాడుగానూ, ఉప్పును అపహరించినవాడు చీమగానూ, ఇష్టానుసారంగా వ్యభిచరించిన వాడు అడవిలో ఏనుగుగానూ, పిలవని పేరంటానికి వెళ్ళినవాడు కాకిగానూ, మిత్రుడ్ని మోసం చేసినవాడు గ్రద్ధగానూ, అమ్మకాల్లో మోసం చేసినవాడు గుడ్లగూబగానూ, భర్తను పలువురినీ హింసించే స్త్రీ జలగగానూ, భర్తను మోసం చేసిన ఆడది బల్లిగానూ, గురుపత్నితో సంభోగం చేస్తే తొండగానూ, అతి కామాన్ని కలిగిన వాడు గుర్రంగానూ జన్మిస్తాడు. భార్యని హింసిస్తే మేకగా పుడతాడు.

## 318. కళ్ళు మూసుకుపోయి ప్రవర్తించటమంటే?

**జ.** మనకంటే విద్యలోనూ, జ్ఞానములోనూ, ధర్మంలోనూ, గొప్పవారయిన వ్యక్తులను ధనమదంతోనూ, భూమి పెరుగుదలవల్ల వచ్చిన ధనంతోనూ, తేలికగా వచ్చిన ధనంవల్ల అహంకారంతోనూ పై


మదాలవల్ల పౌరుషంగా, అహంగా మాట్లాడి తూలనడటమే కళ్ళు మూసుకు పోయి ప్రవర్తించటము. అలాంటి వారి అహం, పొగరు కేవలం తాత్కాలికం.

## 399. ఏ దానము వల్ల ఏం ఫలము?

**జ.** పుణ్యప్రదేశంలో ఇచ్చిన దానమూ, అర్హతగల వారికీ, అవసరమైన వారికీ ఇచ్చేదానం అపాత్రదానం కాదు. ఇచ్చేదానం చిత్తశుద్ధితో ఇవ్వాలి. దానం పుచ్చుకున్నవాడు ఉత్తముడూ, సరయిన వ్యక్తీ అయి వుండాలి. అప్పుడే ఆ దానానికి వేయి రెట్ల ఫలం వస్తుంది.

## 400. ప్రతివారు తప్పక ఆచరించాల్సిన విధులేమిటి?


**జ.** ఉదయం లేవగానే నీరు త్రాగాలి. పెరుగుతో ఏ ఆహారాన్ని భుజించరాదు. అట్లే పెరుగునూ తినరాదు. భోజనం తర్వాత స్నానం చెయ్యకూడదు. స్నానం చేసే సమయమున పైనుంచి రుద్దుకుంటూ స్నానం చేయరాదు. ఇలా చేస్తే కామం వృద్ధి చెందుతుంది. అడ్డదిడ్డంగా రుద్దుతూ స్నానం ముగించాలి. పగటి పూట భార్యతో (స్త్రీ) కలవరాదు. అలాగే వెలుతురులేని ప్రదేశంలో చదవరాదు. అలాగే లేవగానే కూడా చదవరాదు. లేవగానే కాళ్ళు నేలకి తగలకుండా వంగి భూమిని తాకి నమస్కరించాలి. ఇలా చెయ్యటంవల్ల శరీరంలోని విషశక్తి భూమిని ఆకర్షించి, స్వచ్ఛమైన శక్తి



మనలోకి వస్తుంది. కొంతసేపు ధ్యానం తప్పక చేయాలి. ఇలా చెయ్యటం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకూ అవసరమైన ప్రాణశక్తినిచ్చి సమతుల్యం చేస్తుంది. శరీరానికి హాని కల్గించే విషతరంగాలు బైటికి వెళతాయి. సాయం సమయంలో సూర్యుని కిరణాలతో స్నానంచేయాలి. అనగా కొద్దిసేపు నిలవాలి. దానివల్ల అనేక చర్మవాధులు రాకుండా శరీరము వజ్రంలా తయారవుతుంది. ఆ సమయంలో సూర్యకిరణాల్లో 'డి' విటమిన్ ఉంటుంది. రోజు మొత్తం మీద ఒక్కసారే వేడి ద్రవాన్ని త్రాగాలి. (కాఫీ, టీ)

భోజనాన్ని కూర్చొనే భుజించండి. దీనివల్ల శరీరానికి ఎంత ఆహారం కావాలో అంతే తీసుకొని ఆపై ఇక చాలు అని సంకేతము పంపుతుంది. తద్వారా అతి ఆహారం తీసుకొని అనారోగ్యము పాలు కాకుండా ఉండగలము. భోజనం చేసిన వెంటనే నిద్రపోవద్దు. అలా నిద్రపోతే మీతోపాటు ఆహారాన్ని శుద్ధి చేసి రక్తంగా మార్చాల్సిన అవయవాలూ నిదురిస్తాయి. దానితో అజీర్ణమూ మలబద్ధకము ఇత్యాదులూ... రాత్రి పూట పడక గదిలో కిటికీలు తలుపులూ తెరిచి నిద్రించకండి.

తలుపులు తెరిచి నిద్రిస్తే చోరులవల్లా, కిటికీలు తెరిచి నిద్రిస్తే చలికాలంలో రోగాలూ వచ్చే అవకాశం ఉంది. మీరు కానీ, మీ పిల్లలు కానీ ఛాతిపై చేతులు వేసుకొని నిద్రపోకండి. ఇలా నిదురించటం వల్ల ఉపిరితిత్తులపై తీవ్రభారం పడుతుంది. కూర్చున్నప్పుడు చేతులపై తలను ఉంచి విశ్రమిస్తారు కొందరు. అలా చేయటంవల్ల మెదడుకి రక్తం సరిగా సరఫరా అవ్వదు. మెదడు సమస్యలు చాలా వస్తాయి. తిరిగి తిరిగి వచ్చి, లేదా చెమట కారుతున్నప్పుడూ స్నానం చెయ్యరాదు. చెమట వస్తుందంటే శరీరంలో వేడి పెరిగినట్టు. అలాంటప్పుడు స్నానం చేస్తే శరీరంలో వేడి పడిపోతుంది. దానితో చెమట రావటం ఆగిపోతుంది. చెమట అనేది చెడు. ఆ చెడును బైటికి రాకుండా ఆ సమయంలో స్నానం చెయ్యరాదు. రాత్రిపూట చంద్రుడ్నీ, నక్షత్రాలనీ కొద్దిసేపు చూడండి. దీని ద్వారా కనులకు దృష్టి శక్తి పెరుగుతుంది. మనసుకు ప్రశాంతత. నదీ, సముద్ర స్నానం చేసేవారు స్నానం అయ్యాక వెంటనే తొలుతగా వీపు తుడుచుకోవాలి. శరీరంలో అన్ని భాగాలకంటే వెన్నుముక ఎక్కువ చల్లదనం అవుతుంది. అలా చల్లదనం అవ్వటం ఆరోగ్యం కాదు.



అరటి పండును తినగానే మజ్జిగా త్రాగరాదు. అలాగే మజ్జిగన్నంలో అరటి పండు వద్దు. ఇలా తీసుకోవటం వల్ల అరటిపండు జీర్ణ వ్యవస్థకు చేరేలోపు కడుపులో నాని విషపూరితం అవుతుంది.

స్త్రీలు పాలు పొంగకుండా జాగ్రత్తగా ఉండాలి. దీని వల్ల ధననష్టం. అంతే కాదు. పాలు మంట మీద పడటం ద్వారా వచ్చే గాలి మంచిది కాదు. పాలు పొంగించటం వేరు మంట ఆరిపోయ్యేదాకా పాలు పొంగిపోవటం వేరు. భర్తకూ, పిల్లలకూ, బంధువులకూ, అతిథులకూ స్త్రీ గాజులు వేసుకోకుండా వడ్డించ కూడదు. గాజులున్న చేతితో వడ్డిస్తున్నప్పుడు ఆ గాజుల తాకిడికి వచ్చే చిరు శబ్దాలు కనిపించని క్రిములను దూరంగా నెట్టివేస్తాయి.

స్త్రీలు నడుముకు క్రింద భాగంలో బంగారపు నగలు ధరించరాదు. పై భాగాన ధరించిన బంగారు నగలకి తగిలిన గాలి మంచిది. నడుము క్రింద భాగం మలమూత్రాలకి సంబంధించిన ప్రాంతము. ఆ ప్రాంతాన్ని తగిలిన గాలి బంగారాన్ని తాకితే విషగాలవుతుంది. దానికి తోడు బంగారం లక్ష్మీ స్వరూపము.

తేనె, నెయ్యి కలిపి భుజించరాదు. అతిగా లావు ఉన్నవారు గోధుమలతో చేసిన ఆహారాన్ని స్వీకరించాలి. ఒళ్ళు

నొప్పులున్న వారు మాంసాహారానికి దూరంగా ఉండాలి. చేపలను ఆహారంగా తీసుకుంటున్నప్పుడు పాలూ, పాల పదార్థములను విడిచి భుజించాలి.

పాలతో అరటిపండునూ, వేరుశెన క్కాయలు బెల్లముతోనూ తీసుకోవాలి. స్నానం అయ్యాక శరీరానికి ఏ నూనెని వాడకండి. అలా చేస్తే శరీరంలోని చెడును అనగా చెమటను నిలిపినట్టే.

## 401. సాలగ్రామములు ఎంతటి శక్తి వంతమైనవి?

**జ. ఎరుపు సాలగ్రామము:** సామ్రాజ్య పదవీ ప్రాప్తము. **తెలుపు సాలగ్రామము:** ఐహిక అవసరాలను తీరుస్తుంది. **పసుపు సాలగ్రామము:** లక్ష్మీస్థానం, అపర సంపదల ప్రాప్తి. **బూడిదరంగు సాల గ్రామము:** ధనంతో కోరిన పేరు ప్రఖ్యా తులు. **ముదురురంగు సాల గ్రామము:** ఈ సాలగ్రామములను పూజించరాదు.

## 402. మాంసాహారము తీసుకునే వాళ్ళ పూజలు ఫలించవా?


**జ.** శాఖాహారము సత్త్వగుణ వృద్ధికి ఎంతో దోహదపడుతుంది. మనసు ప్రశాంతంగా ఉంటుంది. దైవానుగ్రహం కలగటానికీ, భక్తి, చిత్తశుద్ధి పెరగటానికి శాఖాహారం కారణమవుతుంది. మాంసా హారము ఆయుష్షును హరిస్తుంది. శాఖా హారము తినేవారినీ, మాంసాహారము తినేవారిని పరిశీలిస్తే శాఖాహారం తీసు కునే వారికే ఆయుష్షుతో పాటు ఆరోగ్యం



పాళ్ళు కూడా ఎక్కువని తేలింది. పవిత్ర పుణ్య దినాల్లో మాంసాహారం తీసు కోవటంవల్ల రాక్షస ప్రవృత్తిపైకి మనసు పోతుంది. మాంసాహారాన్ని పండుగ, శుభకార్యాల్లో తీసుకోకపోవటానికి కారణం అదే.

## 403. ఆలయాల్లో రావిచెట్టు, వేపచెట్టు ఎందుకుంటాయి?

**జ.** దేవాలయాల్లో రావి, వేప చెట్టు కలిసే ఉంటాయి. రావి చెట్టును శ్రీ మహావిష్ణువు గానూ, వేప చెట్టును లక్ష్మీదేవిగానూ భావించాలని శాస్త్రాలూ, వేదాలూ చెబు తున్నాయి. ఈ జంట వృక్షాలను పూజించి ప్రదక్షిణం చేయటంద్వారా అనేక దోషాలు తీరి దంపతులు పరిపూర్ణ దాంపత్యాన్ని పొందుతారు. శని దోషం ఉన్నవారు రావి చెట్టుకు పూజ చేయాలి. నమస్కరించి, కౌగిలించుకుంటే అనేక దోషాలు పోతాయి. ఈ రావి చెట్టు క్రిందే బుద్ధుడికి జ్ఞానోదయమైంది.



శ్రీకృష్ణుడు చివరిదశలో ఈ చెట్టు క్రిందే విశ్రమించి వైకుంఠాన్ని చేరాడు. అలాగే వేపచెట్టు గాలికే ఎన్నో రుగ్మతలు దూరమవుతాయి. పవిత్ర ప్రదేశంలో పవిత్రమైన వృక్షాలు ఖచ్చితంగా పెంచుతారు. వాటికవే ఉద్భవిస్తాయి కూడా. రావి చెట్టు గృహ పరిసరాల్లో ఉండరాదు. వేప చెట్టును ఇంటికి ముందూ వెనుకా నాటుకోవాలి. ఇంటి ముందు వేప చెట్టుంటే వైద్యుడున్నట్టే.

## 404. ఏ ఏ సమయాల్లో ఏ దేవుడ్ని పూజించాలి?

**జ.** సూర్య భగవానుని 4.30 నుంచి ఆరులోగ పూజించాలి. ఈ సమయంలో పూజ శ్రీరామునికీ, శ్రీవేంకటేశ్వరునికి కూడా ప్రీతి. ఆరు నుంచి ఏడున్నర వరకూ మహాశివుడ్నీ, దుర్గనూ పూజించిన మంచి ఫలము కలుగును. మధ్యాహ్నము పన్నెండు గంటలప్పుడు శ్రీ ఆంజనేయస్వామిని పూజించిన హనుమ



కృపకు మరింత పాత్రులగుదురు. రాహువును సాయంత్రము మూడు గంటలకు పూజించిన మంచి ఫలితము కలుగుతుంది. సాయంత్రం ఆరు గంటల సమయాన అనగా సూర్యాస్తమయ సమయం శివపూజకు దివ్యమైన వేళ. రాత్రి ఆరు నుంచి తొమ్మిది వరకూ లక్ష్మీదేవిని పూజించిన ఆమె కరుణా కటాక్షములు ఎక్కువగా ఉంటాయి. తెల్లవారుజామున మూడు గంటలకు శ్రీమహావిష్ణువును పూజిస్తే వేకుంఠవాసుడి దయ అపారంగా ప్రసరిస్తుంది.

## 405. వాస్తు శాస్త్రం ఎప్పటినుంచి పాటిస్తున్నారు?

**జ.** ఎంతో పురాతన కాలం నుంచి అనగా .. భారతం జరిగిన కాలం ముందు నుంచీ వాస్తు అమల్లో వుంది. రామాయణంలో అరణ్యవాస సమయంలో లక్ష్మణుడు పర్ణశాల నిర్మించగానే శ్రీరాముడు సీతాదేవితో కలిసి వాస్తుపూజ చేసి లక్ష్మణుడితో కలిసి గృహప్రవేశం చేశారు.

విశ్వకర్మ, మయుడూ, వాస్తు శాస్త్ర నిపుణులే. ఆరోగ్యానికీ, ఆహ్లాదానికీ, ఆనందానికీ అన్నింటికీ మూలమే వాస్తు.

సుగ్రీవుని పట్టాభిషేకము అనంతరము సీతాన్వేషణకు సమయ నిరీక్షణ చేయాల్సిన సమయంలో శ్రీరామ లక్ష్మణులు వాస్తు చూసుకునే నివశించారు.

## 406. (కుంకుమ) బొట్టు ఎందుకు ధరించాలి?



**జ.** మన శరీరంలో ప్రతి అవయవానికి ఒక్కో అధిదేవత ఉన్నాడు. అలాగే లలాట అధిదేవత బ్రహ్మ. లలాటం బ్రహ్మ స్థానం. బ్రహ్మదేవుడి రంగు ఎరుపు. కాన బ్రహ్మ స్థానమైన లలాటాన ఎరుపు రంగు బొట్టు ధరించాలి. అనగా కుంకుమ. లలాటాన సూర్యకిరణాలు తాకరాదు. మనలోని జీవి, జ్యోతి స్వరూపుడిగా భ్రూ మధ్యమంలోని ఆజ్ఞాచక్రంలో సుషుప్త దశలో హృదయ స్థానంలో అనగా అనాహత చక్రంలో ఉంటాడు. కుంకుమను ఉంగరపు వేలితో పెట్టుకుంటే శాంతి, ప్రశాంతి చేకూరుతుంది. నడివేలుతో ధరిస్తే ఆయువు సమృద్ధి చెందుతుంది. బొటన వేలితో ధరిస్తే శక్తివస్తుంది. చూపుడు వేలితో ధరిస్తే భక్తీ ముక్తీ కలుగుతాయి. ప్లాస్టిక్ బొట్టు బిళ్ళల వంటివి ధరించటం కన్నా కుంకుమ ధరిస్తే క్రిమి సంహారకము. కాన శ్రేష్ఠమైన కుంకుమ ధరించండి. ఎప్పుడైతే నుదుటను కుంకుమ అద్దుతారో అప్పుడు జ్ఞానచక్రాన్ని పూజించినట్టు అవుతుంది.

## 407. బిల్వ వృక్షం ఎక్కడ పుట్టింది?

**జ.** శ్రీమహావిష్ణువు తన సతితో కలిసి శివుని గూర్చి తపస్సు చేస్తుండగా లక్ష్మీదేవి కుడిచేతి నుంచి బిల్వవృక్షం జన్మించింది. మహాశివుడు ప్రత్యక్షమై జగద్రక్షణ భారాన్ని శ్రీ మహావిష్ణువుపై ఉంచాడు.

శ్రీవృక్షమనే పేరుతో కూడా పిలిచే ఈ బిల్వ వృక్షంను దేవతలు స్వర్గంలోనూ, మందర పర్వతం పైనా, వైకుంఠంలోనూ నాటారు. శివుని కిష్టమైన ఈ బిల్వ వృక్ష ఆకులతో ఏ రోజైనా పూజ చేయవచ్చు. సోమవారం కోస్తే సోమవారం నాడే పూజకి వినియోగించాలి. ఎండినా, కోసి రెండు మూడు రోజులైనా శివపూజకు వాడకూడదు.

బిల్వ వృక్షానికి ప్రదక్షిణలు చేస్తే సమస్త దోషాలు పోతాయి. సంతానం లేని వారికి సంతానం కలుగుతుంది. బిల్వ వృక్ష పత్రం లక్ష బంగారు పువ్వులతో సమానము.

## 408. షష్టి పూర్తి వేడుకలు



**జ.** ఇరవై సంవత్సరాల బాల్యమూ, మరో నలభై సంవత్సరాలు యవ్వనమూ, కౌమా రాలతో అరవై నిండిపోతాయి. అప్పటికే ఎంతో అలసిపోతారు. తప్పులూ, వొప్పులూ, కష్టాలూ, నష్టాలూ, అయిన వార్ని దూరం చేసుకోవటమూ వంటి వన్నీ అనుభవించి, అరవైకి చేరుకున్నాక వెనుతిరిగి చూసుకోవటమే షష్టిపూర్తి.

కోపావేశాలూ, పగలూ, ప్రతీకారాలూ, పట్టుదలలూ వదలి అందర్నీ ఆహ్వానించి, అన్ని తప్పులనూ క్షమించటమే కాకుండా తనను క్షమించగలిగే వారికి క్షమాపణ చెప్పి అందర్నీ ఆహ్వానించి చేసుకునే పండుగే షష్టిపూర్తి. ఆ వయసు వచ్చే టప్పటికి అలా షష్టిపూర్తి చేసుకోవటం ద్వారా తను వదిలేసిన కర్మలే మున్నాయో తెలుస్తుంది. అందుకే ఆ సమయంలో తులాభారం తూగి ధనాన్ని పేదలకి పంచుతారు. అయిన వారికీ, ఆడ పిల్లలకీ కావలిసినవన్నీ ఇస్తారు. ఎందుకంటే ఆ తర్వాత....?

## 409. దీపారాధనలో తెలియకుండా చేసే పొరపాట్లు



**జ.** స్టీలు కుందుల్లో దీపారాధన చేయ రాదు. అగ్గిపుల్లతో దీపాన్ని వెలిగించ రాదు. ఒకవత్తితో దీపాన్ని చేయరాదు. ఏకవత్తి శవం వద్ద వెలిగిస్తారు.

దీపాన్ని అగరవత్తితో వెలిగించాలి.

దీపారాధన కుందికి మూడుచోట్ల కుంకుమ పెట్టి అక్షింతలు వేయాలి. విష్ణు వుకు కుడివైపు ఉంచాలి. ఎదురుగా దీపాన్ని ఉంచరాదు. దీపం కొండెక్కితే 108 సార్లు 'ఓం నమశ్శివాయ' అని జపించి దీపం వెలిగించాలి.

## 410. పిడుగులు పడేటప్పుడు 'అర్జునా, ఫాల్గుణా' అని ఎందుకు పెద్దలు అనమంటారు?

**జ.** వర్షం పడే సమయంలో పిడుగులు పడటం ప్రకృతి ధర్మము. ఆ సమయంలో చెట్టు క్రింద ఉండకూడదు. అలాగే అర్జునా, ఫాల్గుణా అనమనటంలో ఓ గొప్ప ఇతిహాస కథ కూడా ఉంది.

మహాభారత గాథలో అజ్ఞాత వాసాన్ని ముగించిన అర్జునుడు ఆయుధాల కోసం




ఉత్తరుడిని శమీవృక్షం వద్దకు తెస్తాడు. ఉత్తర గోగ్రహణం ద్వారా గోవులను తరలించుకుపోతున్న దుర్యోధన, కర్ణాదులను ఎదుర్కోవటానికి ఆయుధాలను శమీ వృక్షం మీద నుంచి క్రిందకు తెమ్మంటాడు. అప్పుడు ఉత్తర కుమారుడు భయపడుతుంటే, తనకున్న పదిపేర్లను చెప్పి ఉత్తర కుమారుడి భయం పోగొట్టి ధైర్యాన్ని కలిగిస్తాడు. అర్జునుడి పది నామధేయాలు .... అర్జునా, ఫాల్గుణా, పార్థ, కిరీటి, శ్వేతవాహన, బీభత్స, విజయ, కృష్ణ, (పాండవులు పెట్టిన పేరు), సవ్యసాచీ, ధనుంజయ కాన అర్జునుడి పది పేర్లలో పిడుగులు పడ్డప్పుడు ఏ పేరు తలచినా, భయం తీరుతుంది. కొన్ని ప్రాంతాల్లో పిడుగు పడుతున్నప్పుడు అర్జునుడి రథ చక్ర సూల విరిగిందని అదే పిడుగని చెబుతారు. అలా చెప్పటంలో కూడా అర్జునుడిని తలచి విన్పించటమే.

## 411. బల్లి మీద పడితే

**జ.** కనుబొమ్మలపై పడితే ధన లాభము.
వెనుక మెడపైన పడితే ఆపదలు.
రొమ్ముపై పడితే జయము.
కడుపుపై పడితే సంతానప్రాప్తి.
భుజములపై పడితే ఆరోగ్యము.
మణికట్టు మీద పడితే గర్వభంగము.
వెన్నెముక మీద పడితే ఈతి బాధలు.
పిరుదులపై పడితే స్త్రీ సుఖం.
తొడలపై పడితే భోగము.
మోకాలిపై పడితే వాహన ప్రాప్తి.
జుట్టు మీద పడితే సంకటములు
స్త్రీల జడల మీద పడితే ఆందోళన.

## 412. భార్యను సంతోషపెడుతూ బ్రహ్మచర్యం పాటించే పద్ధతి?

**జ.** వివాహం చేసుకొన్న భార్యను తగు విధంగా భర్త సంతోషపెట్టాలి.

ఇతర స్త్రీలను మనసులో ఉంచుకోకుండా ఆమెతో గడపాలి. స్త్రీలకు స్వభావ సిద్ధమైన పదహారు రోజులూ నిషిద్ధం. అనగా ఋతుకాలమునకు ముందు, వెనుక రోజులతో పాటు తొలి నాలుగు రాత్రులూ, పదకొండవ, పదమూడవ రాత్రులు తప్ప మిగిలిన పది రాత్రులూ భార్య సంగమమునకు శుభ రోజులు. అమావాస్య, పున్నమి రాత్రుల యందు తగదు. ఆ రోజులు వదిలిపెట్టి భార్యాసంగమము చేసినచో బ్రహ్మచర్య వ్రతాన్ని పాటించిన వారితో సమము.

## 413. శ్రీశైలంలో ఇచ్చే యాగభస్మములో ఎన్ని వనమూలికలుంటాయో తెలుసా?

**జ.** రావీ, మోదుగా, మేడీ, ఉత్తరేణూ, జమ్మీ, జిల్లేడూ, చంద్రా దేవదారూ, దర్భ, జువ్వీలాంటి వాటితో యాగము నిర్వహించి యాగానంతరము లభించేదే యాగభస్మము. ఈ భస్మము పవిత్రమైనదీ, పుణ్య ప్రదమయినదీ కూడా. ఆ భస్మాన్నే దేవస్థానము వారు ఇస్తారు.

## 414. స్త్రీ ప్రేమకీ, పురుషుని ప్రేమకీ తేడా?

**జ.** ఓ అమ్మాయిని ఓ అబ్బాయి ఇష్టపడితే రోజులూ, నెలలూ, సంవత్సరాలు నిరీక్షించి రకరకాల ప్రయత్నాలు చేసి వెంటపడి బ్రతిమాలి, భంగపడి, కమ్మని మాటలు చెప్పి ఓ శుభముహూర్తాన ఆ అమ్మాయితో 'అవునని, ఇష్టమనీ' చెప్పి



స్తాడు. అంతే ఆ తర్వాత ఆ అమ్మాయి జీవితాంతము ఆ అబ్బాయి కోసం అనగా భర్త కోసం ఎదురు చూస్తూ, ప్రేమిస్తూ, లాలిస్తూ, గడపాల్సిందే. అయితే ఇష్టపడిన స్త్రీని పెళ్ళికి ఒప్పించడంతో పురుషుడి ప్రేమ ఆగిపోతుంది. స్త్రీకి అక్కడ్నించి ప్రారంభమవుతుంది.

## 415. నీళ్లోసుకుందని అనేదెందుకు?



**జ.** ఆడవాళ్ళు నెల తప్పగానే నీళ్ళోసుకుంది అంటారు. అంటే స్నానం చెయ్యటం కాదు. ఆమె గర్భాశయంలో పిండం పడ గానే ఉమ్మనీరు పడుతుంది. దాన్నే పెద్దలు నీళ్ళోసుకుందని అంటారు. పిండం కడుపులో పెరగదు. గర్భాశయంలో పెరుగుతుంది.

## 416. భగవద్గీతను ఎవ్వరైనా చదవచ్చా?

**జ.** భగవద్గీతను సాధువులూ, సన్యాసులూ, వేదాంతులూ మాత్రమే చదవాలనీ, అలాగే మడిబట్టలతోనూ, పంచెనూ



ధరించి గీత చదవాలనీ, స్త్రీలు చదవరాదని కొన్ని అపోహలున్న మాట వాస్తవమే అయినా అది తగదు. దాహమేసిన వారు దాహాన్ని తీర్చుకున్నట్టు, రోగమొచ్చిన వారందరూ ఔషధాన్ని తీసుకున్నట్టు, భగవంతునిపై భక్తి ఉన్న వారంతా చదవటానికి అర్హులే. అలాగే భగవద్గీత అందరి కోసం. కులమత లింగ బేధములు లేవు. తపశ్శీలత లేనివారికీ, భక్తి లేకుండా ఉన్న వారూ, గురుభక్తి లేనివారూ, ద్వేషాన్ని కురిపించే వారూ వీరు భగవద్గీత చదువుటకు అనర్హులు.

## 417. కార్తీక స్నానమెందుకు?

**జ.** ఈ మాసంలో సూర్యోదయానికి ముందు స్నానం చేస్తే ఆయురారోగ్యాలు కలుగుతాయి. మెడ వరకూ నీటిలో ఉండి స్నానం చెయ్యటం ద్వారా ఉదర వ్యాధులు నయమవుతాయి.

కార్తీక స్నాన విషయంలో ఓ ఆరోగ్య సూత్రం కూడా ఉంది. వర్షాకాలంలో పడిన నీరు భూమిలోకి ఇంకి బలమైన అయస్కాంత మండలం ఏర్పడుతుంది. వర్షాకాలం తర్వాత వచ్చే కార్తీకమాసంలో ప్రవహించే నదుల్లో అయస్కాంత శక్తి అపారంగా ఉంటుంది. దానివల్లే కార్తీక మాసంలో నదీస్నానమూ, సముద్ర స్నానమూ చేయమంటారు. హరిహరాదులకు ప్రీతికరమైన మాసం కార్తీకమసము.

ఈ మాసములో నదీ సముద్ర స్నానమూ, దీపారాధన ఎంతో పవిత్రము. పురుగులూ, మిడతలూ, చెట్లూ, పక్షులూ ఇలా అనేక జీవులు కార్తీక దీపాన్ని చూసి తమ జన్మరాహిత్యాన్ని పొందుతాయి.

## 418. వశీకరణమూ, మోహనమూ లాంటివి సాధన ద్వారా పొందగలమా?

**జ.** ఇటువంటి తంత్ర విద్యలన్నీ శివ తంత్రములో ఉన్నాయి. వశీకరణమూ .... సప్త నిధులకు సంబంధించిన ఈ మంత్రశాస్త్రం శబరజాతికి సంబంధించినది. ఇవి సామాన్యులకు సిద్ధి కలిగించవు. అణిమాద్యష్ట సిద్ధుల్లో అనేక వశీకరణములున్నాయి. కోపాలూ, తాపాలూ, పగలూ, ప్రతీకారాలూ ఇలా ఎన్నింటికో ఈ శాస్త్రంలో మంత్రాలూ, సాధనలూ ఉన్నాయి. కానీ, అవన్నీ మంత్రములే. మూలమంత్రములనీ, కార్యసాధనా పద్ధతులనీ కొన్నింటిని ఆరోజుల్లోనే పూర్వీకులు తీసివేయటం జరిగింది. లోక కళ్యాణంకోసం ఋషులెన్నడో ఆ పని చేశారు. అవి మంత్రములేగాని, ఫలితమిచ్చు పద్ధతులు కావు.

ఈ కలియుగాన మంత్రాలతో ప్రేమనూ, ప్రేయసినీ పొందలేము. అపారధనాన్ని సంపాదించలేము. ద్వేషాన్నీ, కోపాన్నీ తంత్రాల ద్వారా ప్రయోగించలేము. అలా భావోద్వేగాలకి లోనవుతే అది మానసిక సమస్యే కాని మరొకటి కాదు. శబరజాతి అతి పురాతనమైనది. ఈ యుగమున ఆ జాతి లేదు. వారికే ఆ మంత్ర తంత్రాలన్నీ తెలుసు.

## 419. అతి మంచితనము మంచిది కాదా?

**జ.** ఓ గ్రామంలో కాలభైరవుడనే సర్పము ఉండేది. అది తన భీకర విషజ్వాలలతో ఆ ప్రాంత ప్రజలను గడగడలాడించేది. ఆ దారినే వెళ్తున్న ఓ మునీశ్వరుడు ఆ సర్పంతో 'ఇంత భయభ్రాంతులను చేయటం ద్వారా ఏం సాధిస్తావు. నెమ్మదితనమూ, జాలీ, కరుణా, ధర్మబద్ధమైన జీవితమే పరమేశ్వరుని కృపకు దగ్గర దారి' అని చెప్పాడు. ఆపై ఆ పాము అలానే జీవించ సాగింది. కొన్నాళ్ళ తర్వాత మళ్ళీ అటుగా వచ్చిన మునీశ్వరుడు చిక్కిశల్యమైన పామును చూసి ఏమిటిలా అయ్యావు అని అడిగాడు. తమరు చెప్పిన ధర్మ సుగుణాలకి ప్రజలిచ్చిన బహుమానం. నన్ను చూస్తేనే ఆమడ దూరం పారిపోయే ప్రజలు రాళ్ళతోనూ, కర్రలతోనూ కొట్టి ఆనందిస్తున్నారు అని చెప్పింది. దానికి ముని నవ్వి 'ఎవ్వరికీ అపకారం చేయొద్దని చెప్పాను గాని.... భగవంతుడు నీ రక్షణ కోసం ఇచ్చిన 'బుసని కొట్టద్దని



చెప్పానా?' అన్నాడు. కాన మనలో మంచి తనము ఉండటం వేరు. ఆ మంచితనాన్ని చేతకాని తనంగా భావిస్తే 'బుసకొట్టడం' అనగా కనులెర్రజెయ్యటం లాంటివి చేస్తేనే కొంతమంది కంట్రోల్‌లో ఉంటారు.

## 420. స్త్రీ ధనాన్ని ఆశించరాదు.... ఎందుకని?

**జ.** పరుల ధనాన్ని ఆశించటం మహా పాపం. స్త్రీ ధనాన్ని అపహరిస్తే ఆ పాపం మాములు పాపం కన్నా పదిరెట్లు అగును. స్త్రీలు మగవారివలే భోగులు కాదు. వారి ధనాన్ని సంతానం కోసమూ, కుటుంబం కోసమూ, దైవకార్యాల కోసమే ఖర్చుచేస్తారు. అట్టి ధనాన్ని అపహరించటమూ, ఋణం తీసుకొని తిరిగి ఇవ్వకపోవటం పాపాలన్నింటిలో కెల్లా మహాపాపము. ఈ పాపం కన్నా స్త్రీ శీలాన్ని ఆశించటము మహా ఘోరాతి ఘోరమైన పాపము.

స్త్రీ తన శరీరాన్ని ధర్మబద్ధంగా తల్లీ, తండ్రీ దానమిచ్చినవాడికి అనగా తన

అయిదోతనానికి చిహ్నమైన భర్తకే అర్పి స్తుంది. అలాంటి స్త్రీని ఏ విధంగా లోబరు చుకొని అనుభవించినా అది పాపమే.

## 421. గొబ్బిళ్ళూ, ముగ్గుల వల్ల ప్రయోజనమేమిటి?



**జ.** ముగ్గులూ, పండుగ దినాల్లో గొబ్బిళ్ళూ లక్ష్మీదేవికి ప్రీతికరము, మంగళకర ములు. స్త్రీలకు అదొక నిత్య వ్యాయా మము. ముగ్గులోని సున్నపుపొడి పరిసరా ల్లోని సూక్ష్మక్రిములు నశింపచేసి పిల్లాపాప లకు అనారోగ్యాలు దరిజేరకుడా చేస్తుంది.

పేడనీళ్ళు కళ్ళాపి చల్లి, రకరకాల ముగ్గులు పెట్టి, గొబ్బిళ్ళను అలంకరించి, రకరకాల రంగులు చల్లి ఆనందపడటం హృదయానికే కాదు కనులకూ మంచిది. దానితోపాటు శరీరంలోని అనేక రోగా లను పోగొట్టే శక్తి గోమయానికీ, ముగ్గు పొడికి ఉంది.

## 422. గోత్రాలు ఎలా పుట్టాయి?

**జ.** పురాతన కాలంలో వారందరికీ గోవులే ధనం. ఓ చోట నుండి మరో చోటికి వలసలు కూడా వెళుతుండేవారు. అలాంటి సమయంలో గోరక్షణకి గాను గోత్రములు ఏర్పరిచారు. ఒకరి గోవులు, మరొకరి గోవుల్లో కలసి పోవటంవల్ల వచ్చే గొడవలని గోత్రపాలకులు తీర్చే వారు. అలాగే తగువులు తీర్చిన గోత్ర పాలకులు తపోనిష్ఠతో ఉండేవారు. క్రమ శిక్షణతో ధర్మ అర్థాలని బోధించేవారు.

అలాంటి గోత్రపాలకుల పేర్లే ఆపై వారివారి సంతానానికి గోత్రాలయ్యాయి. వారి వంశక్రమంలో జన్మించిన వారు వారి వారి మూలపురుషులను 'గోత్ర' నామంతో ఆరాధిస్తున్నారు. పూజల్లో, యజ్ఞాల్లో, వివాహ సంబంధమైన విష యాల్లో గోత్రం యొక్క పాత్ర ఎంతో ఉంటుంది.

## 423. ఆలయాల వద్ద అమ్మే నల్లదారాలను ధరించటంలో అర్థం ఏమిటి?

**జ.** గృహంలో పూజ చేసిన తర్వాత కట్టు కునే తోరము లాంటివి నల్లదారాలు. దేవాలయాల వద్ద దీన్ని ధరించటం పుణ్య కార్యమే. కాశీ దారమూ, తోరమూ అని పిలిచే వీటిని ధరించటం ద్వారా ప్రయాణ దోషాలన్నీ పోతాయి. శుభప్రదంగా మళ్ళీ మన ఇంటికి చేరుస్తాయి. సర్వగ్రహాలకూ శాంతి మరియు దిష్టి కూడా వదులు తుంది. ప్రయాణ సమయాల్లోనూ, పుణ్య తీర్థాలలోనూ తెలియక అనేక తప్పులు చేస్తాం. వాటిని పోగొట్టేవే నల్ల దారాలు.

## 424. అమావాస్య మంచిరోజు కాదా?

**జ.** చాలామంది అమావాస్య మంచిది కాదంటారు. మహాభారతయుద్ధం పాండవులు అమావాస్యనాడే ప్రారంభించారు.


విజయాన్ని సాధించారు. అధర్మాన్ని ఓడించి, ధర్మాన్ని గెలిపించిన ముహూర్త మిది.కొన్ని రాష్ట్రాల్లో అమావాస్య మంచి రోజు. ఆ రోజు కోసం వేచి ఉండి పనులు ప్రారంభిస్తారు. శుభకార్యాలు జరుపుకుంటారు.

## 425. దేవాలయాల్లో స్త్రీలు పూజారులుగా ఎందుకు ఉండరాదు?

**జ.** భగవంతుని రూపమైన విగ్రహాలకి మంత్రయంత్రాలతో ప్రతిష్ఠ జరిగాక అవి అనంతమైన శక్తిని పొందుతాయి. సాక్షాత్తు దేవతా, దేవుడూ అంశ ఆ విగ్రహానికి వస్తుంది. నిత్య దీప ధూప నైవేద్యాలుంటాయి. శుచీ, ఆచారమూ, శుభ్రతలు అత్యవసరం. స్త్రీలలో ప్రకృతి సహజంగా దూరంగా ఉండాల్సిన రోజులుంటాయి. ఏ సమయంలో అలా జరుగుతుందో వారికే తెలీదు. అలాంటప్పుడు ఆ సమయాల్లో పూజాధికాలు నిర్వర్తించటం జరిగితే భగవత్ దోషమవుతుంది. మళ్ళీ అనేక శుద్ధి క్రియలు చేయాలి.

అందుకే ఆ సమయాల్లో స్త్రీలు దైవదర్శనమూ పూజాధికాలు చేయరు. దానివల్ల దేవాలయాల్లో స్త్రీలు పూజారులుగా ఉండరు. గుడిలో సహితం శుభ్రపరిచేందుకు స్త్రీలను నియమించరు.

## 426. పిల్లలు పుట్టని వార్ని రావిచెట్టుకు ఎందుకు ప్రదక్షిణలు చెయ్యమంటారు?



**జ.** పిల్లలు కలగనివారిని రావిచెట్టుకు ప్రదక్షిణాలూ, తీర్థయాత్రలూ చెయ్యమంటారు. తీర్థయాత్రలు చెయ్యటం ద్వారా అలసిపోతారు. దానికి తోడు ప్రశాంతత వస్తుంది. మానవ సహజమైన ఆర్థిక బాధలూ, వ్యాపార వ్యవహారాల గూర్చి పెద్దగా పట్టించు కోకపోవటంవల్ల మనసు తేలిక పడుతుంది. తర్వాత ఇద్దరూ ఎక్కువసార్లు ఏకమవ్వటం వల్ల సంతానం కలిగే అవకాశం ఎక్కువ. అలాగే రావిచెట్టుకు ప్రదక్షిణం చెయ్యటం ద్వారా సంతానం కలగకపోవటానికి కారణమైన దోషాలని రావిచెట్టు నుంచి వీచీ గాలి తొలగిస్తుంది.

## 427. కన్యాదాన ఫలమెంత?

**జ.** గంగా నదిలో ఇసుకను సప్తమహర్షి మండలం వరకూ పోసి వెయ్యి సంవత్సరాల తర్వాత ఒక్కొక్క ఇసుక రేణువును



ఇసుక కుప్ప నుంచి తీసివేసే సమయ మంత కన్యాదాత బ్రహ్మలోకంలో నివాస ముంటాడు. నువ్వులను సూర్యమండలం వరకూ పోసి ఒక్కొక్క గింజను తీసినంత కాలము స్వర్గసుఖాలూ కన్యాదాత బ్రహ్మ లోకమున పొందును. మినుములను ధ్రువ మండలంవరకూ పోసి, వెయ్యి సంవత్సరాల తర్వాత ఒక్కొక్క గింజను తీసివేసే సమయమంత కన్యాదాత బ్రహ్మ లోకమున ప్రకాశించును.

## 428. సహపంక్తి భోజనాలందు అందరూ ఒకేసారి లెగవాలని ఎందుకు చెబుతారు?

**జ.** సహపంక్తి భోజనానికి కూర్చున్న అందరివీ ఒకే జీవన ప్రమాణములు అయి ఉండవు. మంచీ, చెడు అలవాట్లతో రకరకాల వాళ్ళు ఉంటారు. వారి వారి శరీరాల్లో విద్యుత్ వారి వారి శరీరపు శక్తి ప్రకారం పని చేస్తుంది. సహపంక్తిలో కూర్చున్నప్పుడు దాదాపు శరీరపు భాగాల విద్యుత్ నియంత్రణ ఒకే రకంగా ఉంటుంది. శక్తిహీనుడయిన వ్యక్తి ముందుగా లేచాడనుకుందాం. అతడు శక్తి హీనుడయితే మిగతావారి శక్తి ఎంతో కొంత లాగేసుకుంటాడు. అయినా ఆహారమూ, నిద్రా, సంభోగము మూడింటికి అడ్డు అవసరం.

## 429. వివాహ వేడుకల్లో స్నాతకము చేసేదెందుకు?

**జ.** దీనినే సమావర్తనము అనికూడా అంటారు. బ్రహ్మచర్య కాలంలో ధర్మ విధులను సకాలంలో చేయకుండా అనగా, భోజన విధులూ, స్నానమూ, జందెము ధరించకపోవుటా, ఇత్యాది వాటితో పాటు జూదమూ, మద్యమూ, పరస్త్రీతో సంభాషణలూ, అసభ్య గీతాలను వినుట – ఇటువంటి వాటి ద్వారా దోషములు కలుగుతాయి. అట్టి వన్నీ పోవటానికి చేసేదే స్నాతకము. తెలిసీ తెలియక చేసిన అన్ని దోషములూ ఈ స్నాతకము ద్వారా సమసిపోతాయి.

## 430. వడ్డీ వ్యాపారము ధర్మ సమ్మతమేనా?

**జ.** కాదనే శాస్త్రాలు చెబుతున్నాయి. హింసల్లో గొప్ప హింసని ధర్మాలు ఘోషిస్తున్నాయి. శాస్త్ర ప్రకారం ధర్మ సమ్మతమైన వడ్డీకి మించి పుచ్చుకోవటమంటే ధర్మ శాస్త్రాలతో దూషించు కున్నట్టే. అధిక వడ్డీలు వసూలు చేయువారూ, అసలు కన్నా రెట్టింపు వడ్డీని అందుకున్న వారూ,

కట్టినవాడు అనుభవించిన హింసకం తటికీ వడ్డీ తీసుకున్నవాడు బాధ్యుడు.

వడ్డీ వ్యాపారము ద్వారా ధనాన్ని సంపాదించకుండా, ఆ ధనాన్ని వ్యాపారంలో పెట్టి పదిమందికి ఉద్యోగమిచ్చి తద్వారా ధనాన్ని సంపాదించాలి. ధర్మ శాస్త్రాలను, మహా పురుషులను దూషించేలా ప్రవర్తిస్తే పూర్వం ఇంద్రపదవే వదిలేయాల్సి వచ్చింది.

## 431. రామనామ మహిమ

**జ.** విభీషణుడు ఓ కార్యం కొరకై శ్రీరామునికి ఓ సందేశం పంపదలచి, సేవకునితో చెప్పి వెళ్ళిరమ్మన్నాడు. ఆ సేవకుడు తాను లంకను దాటి సముద్రం మీదుగా అయోధ్యను చేరగలిగే శక్తి తన వద్ద లేదని చెప్పాడు. దానికి విభీషణుడు ఓ పత్రం ఇచ్చి, ఇదే సముద్రాన్ని దాటిస్తుందని, మళ్ళీ నా కడకు వచ్చేవరకూ విప్పి చూడరాదని చెప్పాడు. ఆపై సేవకుడు ఆఘమేఘాలమీద ఆకాశగమనం చేయ సాగాడు. ఆ సేవకుడు సముద్రాన్ని దాటుతూ, ఆ పత్రంలో అంత శక్తి



ఏముందా అని చూశాడట. 'శ్రీరామ' అని ఉందట.'ఓసి ఇంతేనా' అనుకున్నాడో లేదో టప్పున సముద్రంలో పడి పోయాడట. రామ నామాన్ని ఎంత నమ్మితే అంత శక్తి వస్తుంది. అంతే కాదు నమ్మకమే మనిషికి బలమైన శక్తి. నమ్మి మోస పోయిన వాడు లేడనేది ఇందుకే.

## 432. నవరత్న ఉంగరాన్ని ఏ విధంగా చేయించుకోవాలి?

**జ.** నవరత్న ఉంగరం మధ్యలో కెంపునూ, తూర్పుదిశగా వజ్రాన్నీ, ఆగ్నేయ దిశగా ముత్యాన్నీ, ఈశాన్యమున పచ్చనూ, దక్షిణాన పగడాన్నీ, నైఋతిన గోమేధికమూ, పడమర నీలాన్నీ, వాయువ్యమున వైఢూర్యాన్నీ, ఉత్తరాన కనకపుష్య రాగాన్నీ పెట్టి చేయించుకోవాలి.

## 433. పరోపకారమంటే?


**జ.** అవసరమున్న వారికి సహాయ పడటమూ, బావులను త్రవ్వించటమూ, దేవాలయాలు కట్టించటమూ, చలివేంద్రాలు ఏర్పాటు చేయటమూ, విద్యాదానమూ, వస్త్రదానమూ, అభయ దానమూ, అన్నదానమూ ఇవన్నీ పరోపకారాలే.

## 434. శ్రాద్ధం పెట్టే ప్రదేశం ఎలా ఎంచుకోవాలి?

**జ.** దక్షిణ దిశ పల్లంగా ఉండేలా చూసుకోవాలి. పరిశుభ్రమైన ప్రదేశంలో, ఎవ్వరూలేని ప్రదేశంలో చూసుకొని గోవు పేడతో అలకాలి. పరిసరాల్లో గడ్డి లేకుండా చూసుకోవాలి. శ్రాద్ధం గృహంలో పెడితే

ఎనిమిది రెట్లు ఫలం అధికము. పుణ్య క్షేత్రాల్లోనూ తీర్థాల్లోనూ చెయ్యాలనుకుంటే కురుక్షేత్రాములోనూ, గయలోనూ, గంగాతీర ప్రాంతాల్లోనూ, సరస్వతీ తీర్థంలోనూ, ప్రభాస తీర్థమూ, పుష్కరక్షేత్రమూ సర్వశ్రేష్టమైనవి.

## 435. సీమంతము చేసేదెందుకు?



**జ.** గర్భం ధరించిన స్త్రీకి గర్భదోషాలు తొలగిపోవటానికి, దానితో పాటు భూతాది గ్రహ బాధలు తల్లికి, బిడ్డకి తగలకుండా సుఖంగా ప్రసవించటానికి ఈ సీమంత వేడుకను చేస్తారు. వేడుకగా ఈ కార్యక్రమాన్ని చెయ్యటంతో పాటు మంత్ర పూర్వకంగా చేయటం కూడా మరింత మంచిది.

## 436. సంబంధాన్ని ఎలా కుదుర్చు కోవాలి?

**జ.**ఏడుతరాలు తండ్రి వంశస్థులతోనూ, ఆరుతరాలు తల్లి వంశస్థులతోనూ ఎలాంటి రక్త సంబంధంలేని స్త్రీ పురుషుల మధ్య వివాహం జరగాలి. అలాగే ఏక గోత్రీకులు కాకూడదు. వివాహమంటే 'ఎత్తుకు పోవటం'. పురుషుడు స్త్రీతో సర్వ ధర్మాలనూ, సుఖాలనూ సమంగా కలిసి చేస్తానని చెప్పి తల్లీ, తండ్రీ అన్నదమ్ములూ, సోదరీమణులూ, బంధుమిత్రులకీ చెప్పి వారి ఇష్టంతో ఎత్తుకు పోవటమే పెళ్ళి.

## 437. 'ఓం' కార పరమార్థము ఏమిటి?

**జ.** 'ఓం' అను అక్షరము బీజాక్షరము. త్రిమూర్తులను తెలిపే 'ఓం' కారమే సర్వ వేదములకూ మూలము. సర్వమంత్రాలకూ ప్రథమం. త్రిగుణతత్త్వము గలది.

## 438. ప్రతివారూ చేయవల్సిన సంస్కారములు

**జ.** గర్భాదానము, పుంసవనమూ, సీమంతమూ, జాత కర్మమూ, నామకరణమూ, గృహోపనిష్క్రమణమూ, అన్న ప్రాశనమూ, కేశఖండనమూ, కర్ణ వేధమూ, చౌలమూ, ఉపనయనమూ, వేదవ్రత చతుష్టయమూ, నాలుగు వివాహ పద్ధతులు. ఇందులో ఏది చెయ్యక పోయినా జన్మించిన జన్మకి పరమార్థం లేదు.

## 439. చేసే పాపాలకు యమలోకంలో శిక్షలు ఏమేముంటాయి?

**జ.** పరుల ధనాన్నీ, పరస్త్రీనీ ఆశిస్తే అంధకారంలో వుంచి కర్రలతో బాదుతారు. స్త్రీల ధనాన్ని తీసుకుంటే కటిక చీకటిలో నరికిన చెట్లు మీద పడ వేయటము...తల్లీ, తండ్రీ బాగోగులను చూడని

వాడిని, నిప్పులు చెరిగే సూర్యుడి క్రింద మాడి మసి అయ్యేలా చిత్రవధ చెయ్యటము ... సంభోగించకూడని వారితో సంభోగిస్తే మండుతున్న ఇనుప మూర్తిని అనగా స్త్రీమూర్తిని స్త్రీ, పురుషమూర్తిని పురుషుడు కౌగిలించుకునేలా చేయటం, అబద్ధాలు ఆడిన వారిని వంద యోజనములుగల పర్వతం పైనుంచి పడత్రోసి పచ్చడిలా చేయటము, ఇలా ఒక్కోపాపానికి ఒక్కో శిక్ష ఉంది. మొత్తం 84 లక్షల నరకాలున్నాయి. గరుడ పురాణం చదివితే మనం చేసే సాధారణ నిత్యకృత్యాల్లో ఎంత పాపం చేస్తున్నామో, మరింత పాపాన్ని మూట గట్టుకుంటున్నామో అర్థమవుతుంది.

## 440. వినాయకుడి వాహనంగా ఎలుకెందుకయింది?

**జ.** మహాక్రూరుడైన మూషికాసురుడనే రాక్షసుడు మానవులనూ, తాపసులనూ అనేక బాధలు గురి చేస్తుండటంతో వినా యకుడు ఆ రాక్షసుడ్ని నిగ్రహించి తన వాహనంగా చేసుకున్నాడు.



## 441. కలలో ఏమొస్తే ఏం లాభం, ఏం నష్టం?

**జ.** నగ్నంగా నడుస్తున్నట్లు కలవస్తే ఆపదలేమీ రావు. గాలిలో ఎగిరినట్టు వస్తే ఆస్తి నష్టము. అలాగే దేవతలు, గోవులూ, అగ్ని, సరస్సులూ, కన్యలూ, ఫలములూ, పర్వతములూ, నదులూ, సముద్రాలు దాటటం ... వంటివన్నీ ధనాన్నీ, ఆరో గ్యాన్నీ పెంపొందించే సూచికలు. అలాగే తూర్పు, ఉత్తర దిక్కులకు పోయినట్టు కోరిన స్త్రీని పొందినట్టు, శవాన్ని చూసినట్టు వస్తే కష్టములు ముందున్నాయని సూచనలు.

## 442. గాయత్రీ మంత్రం అర్థం...?

**జ.** అన్ని మంత్రాలలో కన్నా శ్రేష్టమైనది గాయత్రీ మంత్రం. గానం చేసే వార్ని రక్షించేది. భూలోకమూ, భువర్లోకమూ, సువర్లోకమూ బ్రహ్మ స్వరూపమని తెలియచెబుతోంది.

"ఓం భూర్భువఃసువః
తత్స వితుర్వరేణ్యం
భర్గో దేవస్య ధీమహీ
ధియోయోనః ప్రచోదయాత్."
అన్నదే గాయత్రీ మంత్రం.

## 443. తమలపాకంటే సకల దేవతల స్థానమా?

**జ.** అవును. అందుకే ప్రతి శుభకార్యానికి తమలపాకులు తప్పని సరిగా వాడతారు. నాగవల్లి దళమనే తమలపాకు దేవతా దళము. తమలపాకు తొడిమలో లక్ష్మీ

దేవి, మధ్య భాగాన పరమేశ్వరుని సతి పార్వతీ దేవి... కొన భాగంలో విద్యాలక్ష్మి అయిన సరస్వతీ దేవి ఉంటారు. ఇంద్రుడూ, మన్మథుడూ, విష్ణువూ, శివుడూ, బ్రహ్మ తమల పాకుపై సదా కొలువుతీరి ఉంటారు. తమలపాకు ఉపవాస వేళలయందు తీసుకో రాదు. అలాగే ఎండిన లేదా చినిగిన తమల పాకులు శుభకార్యాల్లో వాడరాదు.

## 444. కాకి అరిస్తే చుట్టాలొస్తారా?



**జ.** రవాణా సాధనలూ, దూరవాణి వంటివి లేనప్పుడు కబురు అంద చేయ టానికి పక్షులనే ఆధారంగా చేసుకునే వారు. ఓ కొత్త పక్షి తమ సీమలోకి వస్తే చూసి కాకులు అరుస్తాయి. దానితో ఏదో సందేశం ఎవ్వరికో పంపారని అర్థం చేసు కొనేవారు. దానితో ఇంటికి చుట్టాలొస్తు న్నారని అనుకునేవారు. అలాగే కాకి చని పోయి ముందు పడితే ఏ పనినీ, ఏ ఆహా రాన్నీ చాలాసేపటివరకూ తీసుకో కూడదు. చెయ్యకూడదు.

## 445. ఎట్టి గ్రంథాలు చదవరాదు?

**జ.** కామాన్నీ, క్రోథాన్నీ, మోహాన్నీ పెంచే పుస్తకాలు చదవటం వల్ల సమస్త అనర్థా లను తెచ్చుకున్నట్టే. శృంగార కావ్యాలు చదవటంవల్ల మర్యాదా, సిగ్గు వదిలి స్త్రీ సాంగత్యము కోసం చెయ్యరాని పనులు చేయాల్సివస్తుంది. అలాంటి ప్రవర్తన ద్వారా వచ్చేది అవమానమూ, తల వంపులే. దానితో మనిషి ప్రవర్తన మారి నేరస్థుడవుతాడు. క్రోథ, మదాల సాహి త్యం చదవటం వల్ల మిత్రులు శత్రువు లవుతారు. అయిన వారు దూరమవుతారు. మంచి విషయాలు మాట్లాడుకుంటే మనసు మంచిగా ఉంటుంది. మంచిగా ఆలోచి స్తుంది. మంచే జరుగుతుంది.

## 446. పిల్లలు కలగక పోవటానికి శాపాలే కారణమా?

**జ.** సంతానము కలుగక పోవటానికి తెలిసికాని తెలియకకాని చేసిన శాపములే అని జ్యోతిష్యశాస్త్రం చెబుతోంది. సర్ప శాపము, పితృశాపము, మాతృశాపము. భ్రాతృశాపము, ప్రేత శాపము, బ్రాహ్మణ



శాపము, మిత్రశాపము. కాన ఆయా శాంతులు చేయించి భగవంతుని సేవించటం ద్వారా స్వామి చల్లని దీవెనలతో సంతానము కలగవచ్చు. అలాగే సముద్ర స్నానము. అది కూడా రామేశ్వరం వద్ద స్నానం చేస్తే మరింత ఫలం కలుగుతుంది. సముద్రస్నానం ఎక్కడైనా ఒక్కటే కదా అని ఆలోచించకండి. గోవాలో సముద్ర స్నానం చేసి ఆ ఎండలో ఉంటే అనేక చర్మ వ్యాధులు నయమవుతాయి. అందుకే దేశ విదేశాల నుంచి గోవా వచ్చి అనేక చర్మ వ్యాధిగ్రస్తులు నెలలు తరబడి ఉంటుంటారు. అలాగే ఒక్కో ప్రదేశంలో ఒక్కో శక్తి ఉంటుంది. ఇంట్లో పూజమందిరంలో ఉండే దేవునికీ గుడిలో ఉండే దేవునికి ఎంతో తేడా ఉంది.

## 447. కోరిన కోరికలు తీరాలంటే ఏ మాసంలో ఏ అభిషేకం పరమేశ్వరునికి చేయాలి?

**జ.** చైత్రమాసము చెరుకు రసంతో, వైశాఖ మాసము గంధంతో, జ్యేష్ట మాసము ఫలములతో, ఆషాఢమాసము క్షీరముతో,



శ్రావణ మాసము పంచదారతో, భాద్రపద మాసము ఆవుపాలతో, ఆశ్వయుజ మాసము అన్నముతో, కార్తీక మాసము దీపాలతో (అలంకరణ), మార్గశిర మాసము నెయ్యితో, పుష్యమాసం తేనెతో, మాఘ మాసము నీటితో, ఫాల్గుణ మాసము పెరుగుతో అభిషేకిస్తే స్వామి సంతృప్తుడై కోరిన కోర్కెలు తీరుస్తాడు.

## 448. కారమూ, ఉప్పు, ఎంత శత్రువులు?

**జ.** ఈ రెంటిని మితానికి మించి తీసుకోవటంవల్ల తమోగుణము పెరుగుతుంది. దానితో బ్రహ్మచర్యము భంగమవుతుంది. కారమువల్ల రజోగుణం అధికమవుతుంది. నిర్మలత్వానికీ, ప్రశాంత చిత్తానికీ అవరోధం కలుగుతుంది. మిరియాలు వాడటంవల్ల రుచితో పాటు రజో, తమో గుణములు తగు మోతాదులో ఉండి సరయిన దారిలో ప్రయాణించేలా చేస్తాయి.

## 449. గణపతిని నిమజ్జనం చేస్తారెందుకు?

**జ.** పెద్ద పెద్ద విగ్రహాలతో, రంగ రంగ వైభోగంగా వినాయకచవితిని తొమ్మిది రోజులు చేసి నదిలోనో, సరస్సులోనో నిమజ్జనం చేస్తారు. దానికి ప్రధాన కారణం పూజ చేసిన వినాయక విగ్రహానికి యంత్ర ప్రతిష్ఠాపన ఉండక పోవటము. అలాగే ఉంచితే కొన్నాళ్ళకి విగ్రహరూపు రేఖలు మారవచ్చు. అది దోషం. దానితో పాటు గణపతిని అలా వీధుల్లో ఉంచి



పూజించ టానికి దేశభక్తికి సంబంధించిన విషయం ఒకటుంది. తొలుత బహిరం గంగా పూజలను చేసినవాడు బాలగంగా ధర తిలక్. హిందువులందరిది ఒకే మాటగా ఎలుగెత్తి చాటాలని, స్వాతంత్రం కావాలని ఉద్యమం నడిపించి వినాయక చవితిని వాడవాడలా బహిరంగంగా చేయమని చెప్పి దాన్ని ఆచరణలోకి తెచ్చిన వాడు స్వతంత్ర సమర యోధుడు బాలగంగాధర తిలక్. అప్పట్నించి గణ పతి ఉత్సవాలు భారతదేశ మంతటా రంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.

## 450. గోళ్ళెందుకు కొరక కూడదు?

**జ.** అట్టి చర్యలు రాక్షసగుణాన్ని ప్రేరేపి స్తాయి. దానికి తోడు గోళ్ళలోని మట్టీ, క్రిములూ హాయిగా మనలో ప్రవేశించి మనలో అశాంతిని కలిగిస్తాయి. ధర్మ శాస్త్రాలు గోళ్ళు కొరుక్కోవటం అనే అల వాటు మిక్కిలి దరిద్రహేతువని శెలవిస్తు న్నాయి.

## 451. తుమ్మగానే చిరంజీవ అని పెద్దలం టారెందుకు?

**జ.** మన శరీరం ఎన్నో రుగ్మతలను కలిగి ఉంటుంది. అనారోగ్యం గూర్చి తుమ్ము మనకు అనేక సంకేతాలను పంపుతుంది.

మరీ ముఖ్యంగా పిల్లలు తుమ్ముతుంటే పెద్దలు చిరంజీవ అని అంటారు. అనగా బహుకాలం జీవించమని. తుమ్ము అనా రోగ్య చిహ్నము. మన తాత ముత్తాతలు పిల్లల తుమ్మును బాగా పట్టించుకునే వారు. ఎన్నో జాగ్రత్తలు తీసుకునే వారు. తుమ్ము వచ్చిందంటే శరీరంలో అనారోగ్య మున్నట్లే.

## 452. తొలి ఏకాదశికి ఎందుకు అంత ప్రశస్తి?

**జ.** ఆషాఢ శుక్ల ఏకాదశిని తొలి ఏకాదశి అని అంటారు. ఈ తొలి ఏకాదశినాడే శ్రీ మహావిష్ణువు యోగ నిద్రకు ఉపక్ర మిస్తాడు. కార్తీక శుక్ల ఏకాదశి వరకూ యోగ నిద్రలో ఉంటాడు శ్రీమహావిష్ణువు.

## 453. స్త్రీల గూర్చి పురుషులూ, పురుషుల గూర్చి స్త్రీలూ తెలుసు కోవాల్సినవి?

**జ.** స్త్రీలలో మంచీ చెడూ ఉండదు. ఎలాంటి భర్తను పొందుతారో అవే లక్షణాలు వారికి వస్తాయి. స్త్రీలతో ఎదయినా కార్యముంటే ఆ కార్యాన్ని స్త్రీలే చెయ్యగలరు. స్త్రీ చెయ్య కూడని పనులు చెయ్యటం ప్రారంభిస్తే వాటిని ఆపటం ఎవ్వరి తరమూ కాదు. రక్షించుకోలేని వాడికి భార్య అనవసరం.



దున్నటం చేతకాని వాడికి పొలం అనవసరం. స్త్రీకి లొంగిపోయిన పురుషుడు నదీ ప్రవాహంలో పడిన చెట్టువలే సుఖంగా జీవనం సాగిస్తాడు. ఆడవారితో అవసర పని ఉన్నా ఇంటికెళ్ళి కలవకూడదు. కాముకునికి తన భార్య సుందరి అయినా, వేప చెట్టులా అగుపిస్తుంది. పక్కింటి వాడి భార్య అనాకారి అయినా రంభలా అగుపిస్తుంది. స్త్రీ మగవాడి చూపును బట్టే తనలో అతనేం ఆశిస్తున్నాడో తెలుసుకోగలదు. భర్త గొప్పదనమంతా భార్య వంటి మీద నగలూ, చీరలే చెబుతాయి.

పదిలక్షలు పెట్టి భార్యకి బంగారం కొనిపెట్టినా, ఆటోకిచ్చిన తన పదిని భర్త నడిగి మరీ తీసుకుంటుంది. స్త్రీ తప్పు చేసిందంటే రెండే కారణాలు ఒకటి భర్త చేతకాని తనము, రెండు అవసరము. ఏ స్త్రీ కూడా ఒళ్ళు కొవ్వెక్కి తప్పు చేయదు. ప్రేమతో స్త్రీ శృంగారాన్ని అందిస్తే పురుషుడు ఆ స్త్రీ చుట్టూ తిరుగుతాడు. తండ్రి మొగుడికన్నా ధనవంతుడైతే ఆ స్త్రీకి భర్త మీద ఒకింత పెత్తనము ఉంటుంది. గృహం అంటే భార్య. అంతేగాని గోడలూ, భోజనశాలా, శయన మందిరము కాదు. భార్యతో ఏకాంత సమయాన ఏ వాగ్దానం చేసినా అది ఆపై చెయ్యకపోవటం దోషం కాదు. స్త్రీకి పురుషుడే జీవితం. పురుషునికి జీవితంలో స్త్రీ ఓ భాగం మాత్రమే. తల్లి గొప్పదా, భార్య గొప్పదా అంటే ఇద్దరూ గొప్పవారే. కాకపోతే ఒకింత భార్యే గొప్పది. స్త్రీ శృంగారానికి పనికిరాకపోతే ఒక్క ప్రాణి కూడా ఈ భూమ్మీద బ్రతికుండదు.

స్త్రీ ఇంట్లో కొట్టినా భరిస్తుంది. నలుగురిలో తిడితే ఆడపులిలా విరుచుకు పడుతుంది. భర్త భార్యని భద్రంగా, రక్షణగా మాత్రమే చూసుకుంటాడు. కానీ భార్య భర్త గౌరవాన్నీ, సంతానాన్నీ, ధనాన్నీ కాపాడుతుంది. సేవకురాలిగా, తల్లిగా, స్నేహితురాలిగా, మంత్రిగా వీటన్నింటికి మించి ప్రేమగా, భక్తిగా చూసుకుంటుంది.

## 454. షడ్రుచులంటే ఏవి?


**జ.** ఈ పేరు వినటమే గాని ఆ రుచులేమిటో చాలామందికి తెలీదు. కొంత మందికి రెండు మూడు చెప్పి ఆ తర్వాత తెలీదంటారు. మనం తినే భోజనంలో ఈ ఆరు రుచులు ఉండాలి. షడ్రుచులు అనగా ఆరు రుచులు. ఒకటి మధురిమ, రెండు పులుపు, మూడు లవణము, నాలుగు కారం, అయిదు చేదు, ఆరు వగరు. ఈ ఆరు రుచులు అనేక అనారోగ్యాలను దూరం చేస్తాయి.

## 455. బ్రాహ్మణులను భూలోక దేవతలంటారు నిజమేనా?

**జ.** అవును. వైదిక వృత్తిలోనున్నవారూ, ధర్మ, అర్థ, కామ, మోక్షాలను ఆయా కాలాల్లో నిర్వహించేవారూ, మంత్రాలతో పదిమందికీ శుభం కలిగించేవారూ అయిన బ్రహ్మణులు మాత్రమే భూలోక దేవతలుగా అర్హులు.

అలాగే వేదమంత్రాలను ధనానికి కాకుండా పరులకూ, లోక కళ్యాణం కొరకూ ఉపయోగించే వారూ, ఆడంబరాలకు దూరంగా ఉండేవారూ, అసత్యమాడని వారూ, పరనిందలు వేయని వారూ, శాస్త్రాల సారాన్ని తెలుసుకున్న వారూ భూలోక దేవతా దూతలే.

## 456. గడపని తొక్కటం, కూర్చోవటం చెయ్యకూడదని, అలాగే గడపకి పసుపు రాయటంలో ఆంతర్యము ఏమిటి?




**జ.** అసుర సంధ్య వేళ శ్రీ మహావిష్ణువు నరశింహావతారం ఎత్తి ఉగ్రుడై హిరణ్యకశిపుడిని సంహరించాడు. అట్టి గడప శ్రీమహావిష్ణువు స్థానం. దానికి తోడు గుమ్మం వద్ద వ్యతిరేక తరంగాలు ప్రసరిస్తుంటాయి. గడప అంటే లక్ష్మీదేవి కూడా. అందుకనే లక్ష్మికి ఇష్టమైన పసుపుతో అలుకుతారు. మంగళకరమైన కుంకుమతో బొట్టు పెడతారు. పూర్వకాలంలో పాములెక్కువ తిరుగుతుండేవి. రక్షణగా కూడా పసుపును గుమ్మాలకూ, గడపకూ పట్టించేవారు. దాని ఘాటుకు పాములు ఇత్యాది విషక్రిములు లోపలికి రాలేవు.

## 457. కొత్త దంపతులు ఆషాఢమాసంలో దూరంగా ఎందుకుండాలి?

**జ.** ఆషాఢమాసం అనారోగ్యమాసం. ఆ మాసంలో విపరీత గాలులవల్ల దుమ్మూ, ధూళీ లేచి పరిసరాలనూ, నదీ తీర ప్రాంతాలనూ కలుషితం చేస్తుంది. దానికి తోడు వ్యవసాయ పనులను ఈ నెలలోనే ప్రారంభిస్తారు. కొత్త పెళ్ళాంతో సుఖంగా ఇంట్లోనే ఉంటే ఆర్థిక పరిస్థితి దెబ్బ తింటుంది. అదే ఆడపిల్ల ఇంటికి అల్లుడొస్తే మర్యాదలతో పొలం పనులు కుంటుపడతాయి. దానితో పాటు ఈ మాసంలో గర్భం ధరిస్తే ఆ బిడ్డ ఆరోగ్యంగా పుట్టడు. ఆషాఢమాసంలో గర్భం ధరిస్తే నెలలు నిండే సమాయానికి ఎండలు ముదురుతాయి. దానితో తల్లీ కడుపులో బిడ్డా అవస్థలు పడతారని ఆషాఢమాసంలో ఇద్దర్నీ దూరంగా ఉంచుతారు. కాన ఆషాఢమాసం భార్యకి దూరంగా ఉండటమే ఉత్తమం. అత్తా కోడళ్ళు ఒకే గడప దాటకూడదనీ అంటారు.

## 458. ప్రసూతి వైరాగ్యమంటే?

**జ.** స్త్రీ భర్త దగ్గరికి ప్రేమగా కోరికతో దరి చేరి గర్భం ధరిస్తుంది. గర్భం ధరించాక కొన్నాళ్ళకు నెలలు నిండుతాయి.



బిడ్డను కంటున్నప్పుడూ, నెలలు నిండిన సమయంలో వచ్చే నొప్పులూ, బాధలు భరించలేక ఇక చచ్చినా మొగుడితో పడుకోకూడదని అనుకుంటుంది. బిడ్డను కని పచ్చి ఆరిన తర్వాత మళ్ళీ మామూలే. అలాగే శవాన్ని చూసినప్పుడు ఒకింత విరక్తి వస్తుంది. ఎప్పటికైనా మనమూ ఇంతేగా దీనికోసమా, మనమిన్ని మోసాలు చేస్తున్నదని అనిపిస్తుంది. శవం దాటగానే స్నానం చెయ్యగానే మళ్ళీ మాములే. దాన్నే ప్రసూతి వైరాగ్యమూ, శ్మశాన వైరాగ్యమంటారు.

## 459. శ్రీశైల క్షేత్ర 'సాక్షి గణపతి' ని తప్పక దర్శించాలన్నది ఎందుకు?

**జ.** శ్రీశైల క్షేత్రాన్ని దర్శించిన వారంతా పునర్జన్మ నుంచి విముక్తి కలిగించే శిఖర దర్శనం చూడటంతో పాటు సాక్షి గణపతిని దర్శించి గోత్ర, నామాలు చెప్పుకుంటారు. అలా చెప్పటంలో పరమార్థము... సాక్షి గణపతి కైలాసంలో పరమశివుని వద్ద శ్రీశైలాన్ని దర్శించిన భక్తుడూ, భక్తురాలి పేరు చెప్పి సాక్ష్యం ఇస్తాడు. పరమేశ్వరుని అనుగ్రహానికి పాత్రులను చేస్తాడు. అందుకే సాక్షి గణపతిని తప్పక ధరించి గోత్రనామాలు చెప్పుకోవాలి.

## 460. అక్షింతలు చల్లటంలో పరమార్థము ఏమిటి?



**జ.** బ్రహ్మ రాతను నుదుటిపై వ్రాస్తాడు. కర్మఫలాలన్నీ తలపైనే వ్రాసి ఉంటాయి. ధర్మాత్ములు, పెద్దవారూ అక్షింతలు లేదా అక్షితలు తలపైవేసి ఆశీర్వదించటం ద్వారా తలరాత కొంతయినా మారుతుందని విశ్వాసము. పెద్దలు వేసిన అక్షితలు నేల రాలితే వాటిని ఎవ్వరూ త్రొక్కకుండా, వాటిని ఏరి ఎవరూ నడవని ప్రదేశంలో వేయాలి.

## 461. నీరు లేకుండా చేసే స్నానాలు

**జ. మంత్రస్నానము :** మంత్రాలతో ఆవహించేలా చేసుకుని చేయటము.

**భౌమస్నానము:** శరీరానికి విభూది రాసుకోవటము.

**ఆగ్నేయస్నానము:** మంత్రం ఉచ్ఛరిస్తూ భస్మాన్ని రాసుకోవటము.

**వాయుస్నానము:** ఆవు డెక్కల వల్ల ఏర్పడ్డ మట్టిని శరీరానికి రాసుకోవటం.

**దివ్యస్నానము:** ఉత్తరాయణ పుణ్యకాలమందు ఎండలో నిలవటము.

**మానసిస్నానము :** తడి బట్టతో వళ్ళంతా తుడుచు కోవటము.


**ధ్యానస్నానము:** తులసిచెట్టు పాదులోని జలాన్ని చల్లుకోవటము.

## 462. 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అనే నానుడి వాడుకలోకి ఎలా వచ్చింది?

**జ.** కొత్త పెళ్ళికొడుకు కోటి ఆశలతో అత్తింటికి వచ్చాడంటా... ఇంకేముంది కొత్తల్లుడు, ఇల్లూ, వంటిల్లూ హడావుడి రకరకాల పిండి వంటలు... ఘుమ ఘుమలు ... పెళ్ళాం మురిపాలు, కబుర్లు .... పండుగ వాతావరణం. చుట్టు ప్రక్కల వారి పరామర్శలు. ఇంతలో కొత్త పెళ్ళికొడుకు పెళ్ళాం ఇంట్లోకి రాకూడదు. అప్పుడన్న మాట పెద్దల పెదవి విరుపు పలుకులే వాడుకలోకి వచ్చింది. చల్లగా విషయాన్ని పెళ్ళికొడుకుకీ తెలియచేశారు.

దానితో సదరు పెళ్ళికొడుకు దిగులుగా కూలబడ్డాడు. 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉండటమంటే ఇదే' అనుకున్నారంతా....

## 463. దేవునికి హారతినిచ్చేటప్పుడు గంటెందుకు కొడతారు?



**జ.** దేవాలయాల్లో గంటను అనేకసార్లు అనగా నైవేద్యము పెట్టేటప్పుడూ, మేలుకొలుపు పాడేటప్పుడూ, ఆలయం మూసేటప్పుడూ, హారతి నిచ్చేటప్పుడూ గంట కొడతారు. హారతి నిచ్చేటప్పుడు కొట్టే గంటకు అర్థం దేవతలందరినీ ఆహ్వానిస్తున్నామని, ఏ దేవునికి హారతి నిస్తున్నామో, ఆ దేవుడు మహాదైవాంశతో విగ్రహంలో చేరాలని, ఆ మహోత్తరమైన అంశ విగ్రహంలో చేరేటప్పుడు ఈ రూపాన్ని భక్తులు కనులారా వీక్షించేలా, హారతి వెలుగులో స్వామిని చూపటమే పరమార్థము. కాన హారతివేళ దైవాన్ని ప్రత్యక్షంగా చూసినట్టే.

## 464. గుడిలో ప్రదక్షిణలు పద్ధతి?

**జ.** ధ్వజస్థంభం నుంచి మళ్ళీ ధ్వజస్థంభం వరకూ చేస్తే ఒక ప్రదక్షిణ అవుతుంది. అలాగే మందిరమయితే ముఖ ద్వారం వద్ద నుంచి ప్రారంభించి మళ్ళీ మందిర ముఖ ద్వారం వద్దకు వస్తే ఓ

ప్రదక్షిణ పూర్తి అయినట్టు. హనుమంతునకు అయిదు ప్రదక్షిణలు ప్రీతి. ఏదైనా కోర్కె ఉంటే 11, 27,54,108 సంఖ్యలతో ప్రదక్షిణం చేస్తే ఫలితముంటుంది.

నవగ్రహాలకి మూడుసార్లూ, లేదా తొమ్మిదిసార్లూ ప్రదక్షిణ చేయవచ్చు. అలాగే పదకొండూ, ఇరవై ఒకటీ, ఇరవై ఏడూ ఇలా బేసి సంఖ్యలో చేయవచ్చు.

## 465. సీతాదేవి గడ్డిపోచని అడ్డం పెట్టుకొని రావణుడితో మాట్లాడింది ఎందుకు?

**జ.** రావణుడిని గడ్డి పోచగా భావించి నందువల్ల. కాముకుడితో స్త్రీ నేరుగా మాట్లాడరాదు కాబట్టి. కులస్త్రీలూ, పతివ్రతలు పరాయి మగవాడితో మాట్లడరాదు గనుక. తనను కనులతో కూడా చూసే యోగ్యత రావణుడికి సిద్ధించకూడదని. గతంలో శ్రీరాముడు గడ్డిపోచతోనే కాకిని నిరసించాడని తనూ అలాగే నిరసిస్తున్నానని. తనకి దగ్గరిగా ఉన్నాడు గాన, ఏదో ఒకటి అడ్డుగా ఉండాలని.



## 466. బ్రహ్మదేవునికి పూజలెందుకు చెయ్యరు?



**జ.** త్రిమూర్తులు త్రిగుణాత్మకులు. సృష్టి, స్థితి, లయాలకు అధిష్టాన దేవతలు. రక్షణ ఇచ్చే విష్ణువును పూజించటం ద్వారా భద్రతనూ, శ్రీమహాలక్ష్మి ఇచ్చే ధనం ద్వారా సుఖాలనూ పొందటానికి లక్ష్మీదేవిని ప్రార్థిస్తాము. మహాశివుడు లయ కారకుడు. మరణమంటే మానవునికి భయము. అందుకే అట్టి మరణ భయాన్ని పోగొట్టి అనంతమైన దూరంలో మృత్యువుని ఉంచమని ప్రార్థిస్తాము శివుడ్ని. బ్రహ్మ సృష్టించేవాడు. మనల్ని ఎప్పుడో పుట్టించేశాడు. మళ్ళీ ఆయన్ని అడగటానికి ఆయన దగ్గరే ముంది. అందుకే.... బ్రహ్మను పూజించటానికి ఎవరూ ముందుకురారు. కాని మోక్షమనే పరబ్రహ్మ దర్శనము సిద్ధించేది బ్రహ్మ వరంవల్లనే.

## 467. ఏ దేవుని మాలలో ఏ దారాలు వాడాలి?

**జ.** శ్రీమహావిష్ణువు మాలలో దారము పట్టుదిగాని, నూలుదారం గాని వాడాలి.

అమ్మవారికి పట్టుదారం మాలనూ, మహాశివునకు ఊలు దారమూ, సకల జీవకోటికి అన్నప్రదాత సూర్యభగవానుడికి పట్టు దారము గాని నూలుదారం గాని, అలాగే మహాగణపతికీ పట్టు దారమూ, నూలు దారమూ ఉపయోగించాలి. ధరించే తనుగాని లేదా తన ఇంటి పేరుతో ఉన్నవారుగాని చుట్టాలి. తనకై తను చుట్టింది ధరించటం అత్యంత శక్తివంతమైనవి. వేరే ఎవరైనా చుట్టిన మాల ధరించే ముందు పంచగవ్యము లతో శుద్ధిచేసి పూజించి ధరించాలి.

## 468. నిద్రలేవగానే ఎవర్ని చూస్తే ఆ రోజంతా శుభప్రదం అవుతుంది?



**జ.** వేదవేత్తనూ... సుమంగళినీ... గోవునూ ... అగ్నిహోత్రాన్నీ చూసిన మంచి ఫల ములు కలుగుతాయి. నదినీ, సము ద్రాన్నీ, సరస్సునూ చూస్తే దోషాలు పోతాయి. పెరుగూ, నెయ్యి, ఆవాలూ, అద్దమువంటి వాటిని చూడటం అశు భము. అలాగే ముఖాన్ని నేతిలో చూస్తే చిరకాలం ఆరోగ్యంగా జీవిస్తాడు.

## 469. చనిపోయినవార్ని ఊరేగించే టప్పుడు డబ్బులెందుకు చల్లుతారు?

**జ.** ఒరేయ్ పిచ్చోళ్ళారా.... నేనెంతో ధనం సంపాదించాను. ఒక్కపైసా కూడా తీసుకెళ్ళటం లేదు. రేపు మీ ధనమయినా ఇంతే. కనుక ధర్మంగా న్యాయంగా జీవిస్తూ పదిమందికీ సాయం చేసి పోవ టమే అసలు మానవ ధర్మం. కాన మీర యినా స్వార్థ చింతనలకు దూరంగా ఉండి, పదిమందికి మేలు చెయ్యండి అని.

## 470. కార్తీకమాసము ప్రత్యేకత ఏమిటి?

**జ.** ఈ మాసములో ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండి నిత్య మంత్రజపం చేస్తూ ఉండేవారు సర్వ పాపాల నుంచి విముక్తు లవుతారు. ఈ మాసంలో తులసి ఆకు లతో స్వామిని పూజించాలి. ఉసిరిక చెట్టు నీడలో పిండ ప్రదానము చేయాలి. ఉసి రిక తినటముతోపాటు, మాలను ధరిం చిన ప్రశస్తం. విష్ణుమూర్తికి ప్రీతికరము.

కార్తీక మాసములో స్తంభం పాతి దానికి ఓ పాత్రను వ్రేలాడదీసి అందు ఎనిమిది దిక్కులకూ కనిపించేటట్టు దీపం పెట్టాలి. ఇలా చెయ్యటంవల్ల సమస్త దేవ తలకి వందనము చేసిన ఫలము కూడా వస్తుంది.

## 471. ఉప్పునెందుకు దొంగిలించ కూడదు?

**జ.** ఉప్పును కాళ్ళతో త్రొక్కరాదు. అలాగే బదులు కూడా తీసుకోకూడదు. అలాగే

ఉప్పును చేతితో ఎవ్వరికీ ఇవ్వరాదు. ఉప్పు శనీశ్వరుని సంకేతము. పూర్వ కాలంలో ఉప్పు దొరికేది కాదు. ఎంతో కష్టం మీద సంపాదించిన ఉప్పును రక్షిం చుకోవటానికి ఉప్పును శనీశ్వరుని అంశ గానూ, యమధర్మరాజు సంకేతం గానూ చెప్పేవారు. అలా చెప్పటం వల్ల ఉప్పును చేబదులు అడిగేవారు కాదు. తస్క రించేవారు కాదు. ఓ వయసు వచ్చాక రక్తపోటు లేకపోయినా ఉప్పును మజ్జిగలో వాడకపోవటం ఉత్తమం.

## 472. గోళ్ళను ఇంట్లో ఎందుకు తీయకూడదు?

**జ.** మానవ శరీరంలోని చేతి, కాలి వేళ్ళ కున్న గోళ్ళు విషపూరితమైనవి. మనం భోజనం చేసేటప్పుడు పొరపాటున గోళ్ళ ముక్కలు అన్నం ద్వారా తీసుకుంటే అవి జీర్ణంకావు. మన జీర్ణవ్యవస్థకి అంత శక్తి లేదు. విసర్జించేటప్పుడు ప్రేగులకి ఇత్యాది వాటికి తగిలితే ప్రమాదం. అందుకే గోళ్ళు ఇంట్లో తియ్యకపోవటమే కాదు. విధిగా వారానికోసారి కత్తిరించుకోవాలి.

## 473. ఉదయాన్నే నీరు తాగటం ఎందుకు?

**జ.** ఉదయాన్నే లేవగానే పది ద్రోసిళ్ళ నీరు త్రాగటం మంచిది. ఎంతో యవ్వన వంతంగా ఉంటారు. పెద్దలకీ పిల్లలకీ ఉదయాన్నే నీళ్ళు త్రాగటం అలవాటు చేస్తే వారు జీవితాంతమూ అజీర్తి, మూత్ర పిండాల వ్యాధులతో బాధపడకుండా



ఉంటారు. రాగి చెంబుతో నీరు త్రాగితే ఎలాంటి మలబద్ధకమూ ఉండదని ఆయుర్వేదం చెబుతోంది.

## 474. ఎక్కడైనా బావగాని వంగతోట దగ్గర కాదు ఎందుకని?

**జ.** మగవాళ్ళకి కీర్తి వ్యామోహాలూ, స్త్రీ వ్యామోహాలూ ఎక్కువ. ఈ రెంటికి ప్రధా నంగా కావాల్సింది ధనము. సంపా దించిన ధనాన్ని ఎలా అయినా ఎవ్వరిష్టం వచ్చినట్టు వారు ఖర్చు చేసుకుంటారు. అదే వ్యాపారము దగ్గర, వ్యవహారం దగ్గర, అనగా ధనం దగ్గర మొహమాటం పనికిరాదు. అలా మొహమాట పడితే అసలుకే మోసం రావచ్చు. వ్యాపార వ్యవహారాల్లో, ధన విషయాల్లో లొంగేది ఆడదాని దగ్గరే. అందువల్లే జాగ్రత్త అత్యంతవసరమని, ఎక్కడయినా బావ గాని వంగతోట దగ్గర బావ కాదు అని అంటారు. ఇష్టమైతే బైట వంకాయల

గంపైనా కొనిపెట్టవచ్చు. తోట దగ్గర అంటే వ్యాపారం దగ్గర పుచ్చు వంకాయ కూడా ఇవ్వ కూడదని అర్థం.

## 475. శుభకార్యాలకీ, చర్చలకీ ముగ్గురెందుకు వెళ్ళకూడదంటారు?



**జ.** సహజంగా ఈ విషయాన్ని మనం చాలాసార్లు విని ఉంటాము. ఏదన్నా పని మీద వెళ్తున్నప్పుడు ముగ్గురు వెళ్ళకూడదంటారు. ఓ శుభకార్యం కోసమో, మరో కార్యం కోసమో ముగ్గురు వెళితే మార్గ మధ్యలో మాటల్లో అభిప్రాయ భేదాలు రావచ్చు. ఒకరితో ఒకరు మాది సరయినదంటే మాది సరి అని వాదనకు దిగవచ్చు. అప్పుడు కార్యం వదలి గొడవకి దిగుతారు. అదే ఇద్దరయితే వొకరి కొకరు సర్ది చెప్పుకుంటూ సరిచేసుకుంటూ వెళ్ళి కార్యాన్ని శుభప్రదంగా చేసుకుని వస్తారు.

## 476. అప్పగింతల పరమార్థము ఏమిటి?

**జ.** పుత్రునివలే అనేక సంవత్సరములు ఎంతో గారాబంగా పెంచి నీ సుఖముకై, సైవకై అందిస్తున్నాము. మిత్రునిగా, ప్రియునిగా, భర్తగా మీరు ఈమెను పాలించుకోండి. లాలించుకోండి. బుజ్జగించుకోండి. ఆపై వధువుని వరుడి తరుపు వారందరికీ అనగా వరుడి తల్లీ, తండ్రీ, అక్కా, చెల్లెలు ఇత్యాదివారందరికి అప్పగిస్తారు.

## 477.ఈ జన్మలో పురుషుడు మరుజన్మలో స్త్రీగా పుట్టవచ్చా? స్త్రీ కోరుకుంటే పురుషుడిగా జన్మించవచ్చా?

**జ.** స్త్రీ పురుషుడుగానూ, పురుషుడు స్త్రీగానూ జన్మించటమనేది వారి వారి కర్మలని బట్టి జరుగుతుంది. తదేక దీక్షతో కోరుకుంటే కావాల్సిన జన్మవస్తుందనేది స్పష్టము. శ్రీరాముడు వనవాసం చేస్తూ అనేక తాపసుల, మహర్షుల ఆశ్రమాలని మునిసేవకై దర్శించాడు. ఆ సమయంలో శ్రీరాముడి దివ్యమంగళ స్వరూపం చూసి కొంతమంది తాపసులకు కౌగిలించుకోవాలిని అనిపించింది. అలా అనిపించిన వారంతా తర్వాత జన్మలో గోపికలుగా పుట్టి శ్రీకృష్ణుడి పవిత్ర ప్రేమకు పాత్రులయ్యారు.


## 478. ఏ కలవస్తే ఏ వ్యాధి రావటానికి అవకాశం ఉంది?

**జ.** భూత ప్రేత పిశాచులు వస్తే జ్వరం రావటానికీ, ఎర్రని పూలదండలూ, వస్త్రాలలో స్త్రీ పురుషులు కానవస్తే రక్త సంబంధిత రోగాలూ, దున్నపోతూ, కుక్క

గాడిదా, ఇట్టి వాటినెక్కి దక్షిణ దిక్కుగా వెళుతున్నట్లు కలవస్తే ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులూ, రాక్షసులతోనూ, నీటితోనూ ఈ రెంటితో సంబంధము వంటి కలలొస్తే పిచ్చిగా నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితులూ వస్తాయి. చంద్ర, సూర్యగ్రహణాలు వచ్చినట్టు కలవస్తే కంటివ్యాధులు వస్తాయి. నల్లనిది, భయంకర ముఖాలు కలిగిన వారు కలలోకి వస్తే ఎంతో జాగ్రత్తగా ఉండమని హెచ్చరిక. అనేక వంకరలు కలిగిన వారితో నూనె త్రాగినట్టు కలవస్తే తీపి వ్యాధి వస్తుందని సూచన. ఈ కలల రూపానికీ, వాస్తవానికీ మన జీవన ప్రవర్తనే కారణము. వచ్చే కలలన్నీ మన ఊహల్లో ఉన్నవే అని అర్థం చేసుకోవాలి.

## 479. రోహిణికార్తెకి రోళ్ళు పగులుతాయా?

**జ.** రోహిణి కార్తెలో అనగా మే నెలలో సూర్య భగవానుడు మన నడినెత్తి మీద



కొస్తాడు. అనగా మధ్యభాగానికి వస్తాడు.

చండ ప్రచండుడిగా మారతాడు. ఎండలు నిప్పులు కక్కుతూ భూమిని తాకుతాయి. దానితో భూమిలోని తేమ హరించుకు పోతుంది. రాళ్ళలో కూడా అంతోఇంతో తేమ ఉంటుంది. తేమ శాతం ఇంకిపోగానే రోహిణిలో రోళ్ళు కూడా పగులుతాయి.

## 480. పాణిగ్రహణ మంత్రాలకి అర్థం?




**జ.** వరుడు వధువు కుడి చేయి పట్టుకొని అగ్ని సాక్షిగా మంత్రాన్ని చెబుతాడు...

పూషాత్వేతోనయతు హస్తగృహ్యాశ్వినౌత్వా
ప్రవహతాగ్ం రథేన। గృహాన్గచ్ఛ గృమపత్నీ
యథా సోవశినీత్వం విథమావదాసి॥

ఓ నా సహధర్మచారిణీ, తర్వాత నిన్ను నా గృహానికి తీసుకువెళతాను. నా గృహానికి నీవే అధిపతివి. ఆధిపత్యము వహించి సర్వ విషయాల్లోనూ, యజ్ఞయాగాది క్రతు విషయాల్లో సర్వదా, అనుకూల వతివై మెలుగుము.

## 481. స్త్రీలు ధరించే నగల అర్థం ఏమిటి?



**జ. వడ్రాణము:** గర్భకోశము కదలి లోపలున్న శిశువు వికారంగా పుట్టకుండా చేస్తుంది. అలాగే బంగారాన్ని అనేక మార్గాల ద్వారా ఆహారంగా తీసుకుంటే ఎంతో ఫలితం ఇస్తుంది. అలాగే బంగారాన్ని ఏ రూపంగా ధరించిన ఎంతో కొంత శక్తి శరీరానికి సంక్రమిస్తుంది.

**ముక్కర:** దీన్ని ధరించటం వల్ల మాట్లాడేటప్పుడు పై పెదవికి తగిలి వీలయినంత తక్కువ మాట్లాడమని చెబుతుంది. ముక్కర ధరించటంవల్ల ముక్కుకొనపై ఏదో విధంగా దృష్టి ఉంటుంది. అలా దృష్టి ఉండటం ధ్యానంలో ఒక భాగం. అలాగే భార్యాభర్తలు కలుసుకున్న సమయాల్లో స్త్రీ వదిలిన గాలి పురుషునికి అనారోగ్యం. అలాంటి చెడుశ్వాస కలిగిన గాలిని బంగారు ముక్కర పవిత్రం చేస్తుంది.

**కాలికి మెట్టెలు:** గర్భకోశంలోనున్న నరాలకూ కాలివేళ్ళలో ఉన్న నరాలకు సంబంధం ఉంది. దానితో పాటు స్త్రీ కామాన్ని అదుపులో ఉంచుకోవాలంటే కాలి వేలికి రాపిడి ఉండాలి. నేలను తాకరాదు. కామాన్ని పెంచే నరాలు కుడికాలి వేళ్ళలో ఉన్నాయి.

**చంద్రవంక:** శిరోమధ్య ప్రదేశంలో ధరిస్తారు. ఆ ప్రాంతం నుంచే మన జీవనాధారమైన ప్రాణవాయువు బ్రహ్మరంధ్రం నుంచి హృదయంలోకి ప్రవేశిస్తాడు. అందుకే ఆ భాగాన్ని కప్పి ఉంచుతారు.

**కంఠానికి వేసుకునే హారాలు:** హృదయంలో పరమాత్ముడున్నాడు. ఆ విషయాన్ని గుర్తించామని చెబుతూ ధరించటము. తెలిసీ తెలియక చేసిన పాపాలను కూడా *బంగారం పోగొడుతుంది. బంగారం ధరించటం ద్వారా చెడు కలలు రాకపోవటమే కాదు, గుండెల మీద బంగారం గుండెకి సంబంధించిన వ్యాధులను కూడా అరికడుతుంది.*


అలంకారానికి పెట్టుకునే వస్తువులే అవసరానికి ఆదుకుంటాయి. పూర్వం రాజులూ, చక్రవర్తులూ అతిసన్నని బంగారు రేకులు చేయించుకొని వేడి అన్నం మీద వేసేవారు. వెనువెంటనే బంగారు రేకు కరిగి అన్నంలో కలిసిపోయేది. అలా వారు బంగారాన్ని ఆహారంగా తీసుకునేవారు.

## 482. పుణ్యప్రదేశాల్లో రాళ్ళు పేరిస్తే ఇల్లుకడతామా?

**జ.** దేవాలయాల పరిసరాల్లోని తీర్థాల్లో రాళ్ళు పేరుస్తారు. ఎంత ఎత్తు రాళ్ళు పేరిస్తే అన్ని అంతస్థులు ఇళ్ళు కడతారని, ఆ ధనశక్తి అలా క్రిందకి పారే జలపాతంలా వచ్చేస్తుందని అంటారు. గూడు అనేది ప్రతివారికి అవసరం, ఒక నిర్మించుకోవటం ఒక కల. అనేక

వ్యాపకాలతో ఆ విషయాన్ని మరిచి పోతారు. వయసులో స్వంత ఇంటి గూర్చి అంతచింతన ఉండదని, వృద్ధా ప్యం వస్తే స్వంత ఇల్లు అత్యవసరమన్నది తెలుస్తుం దని, అందాక ఆ విషయాన్ని మరిచి పోవద్దని, స్వంత ఇంటి దిశగా ప్రయత్నం చేయమని అర్థం.

## 483. ఏ పూలు దేనికి ప్రశస్థము?



**జ.** కలువపూవు శ్రీమహాలక్ష్మికి నివా సము. సింహద్వారము తలుపు మీద చెక్కిస్తే శుభం. అవిసపూవుకి, అగస్త్య నక్షత్రానికి ఎంతో సంబంధము ఉంది. ఈ చెట్టును పశ్చిమ భాగంలో పెంచితే దుష్ట శక్తులు గృహములోకి రావు.

పారిజాత .... పూలు శ్రీకృష్ణుడు సత్య భామ కోరికపై భూమి మీదకు తెచ్చిన పూలవృక్షము. శ్రీచక్రంపై ఈ పూలు చల్లి పూజించిన చక్కని ఫలితం వస్తుంది.

మద్ది చెట్టు పూలు, ఇందులో రెండు రకాల వృక్షాలుంటాయి. తెల్లమద్ది, నల్ల మద్ది. ఈ రెండు రకాల్లో తెల్లమద్దికి ఔషధ గుణం ఉంది. స్త్రీ దేవతా పూజల్లో వాటిని వాడటం వల్ల త్వరగా ఫలితం వస్తుంది.

సంతానం కలిగించే పూలు కూర దొండ. వీటిని అడవిదొండ అనికూడా అంటారు. సంతానాన్ని ఆశించేవారు దొండ తీగను పూజిస్తారు. పూలను ధరిం చినా సంతానము కలుగుతుందని కొందరి నమ్మకము. చాలామందికి నిజమయ్యింది కూడా.

## 484. శ్రీ లలితా సహస్రనామం ఏ పురాణంలో ఉంది?



**జ.** ఈ సహస్రనామ స్తోత్రం బ్రహ్మాండ పురాణంలో ఉంది. హయగ్రీవుడు అగస్త్య మహర్షికి ఈ సహస్రనామస్తోత్రం తెలియ చేస్తాడు. విద్యా రూపిణీ, జగత్తును ధరిం చినదీ, సృష్టిస్థితి లయకారకురాలు అయిన మహా త్రిపుర సుందరి వైభవము, శ్రీలలితా సహస్రనామము, వెనువెంటనే సిద్ధి కలి గించేది శ్రీ లలితా సహస్రనామ స్తోత్రము. ఇందు వెయ్యి నామాలు వెయ్యి మంత్రాలు. కుండలినీ, యోగరహస్యమూ, సుగుణో పాసనా, శ్రీచక్రవర్ణనా, చతుష్షష్టియోగినీ విషయాలు, లలితాంబికతత్త్వమూ మొద లగు అనేక విషయాలుగల శ్రీ లలితా సహస్ర నామ స్తోత్రం వశిన్యాది దేవతలు వ్యాస భగవానుని ద్వారా భూలోకానికి వ్యాప్తి చేశారు.

## 485. ఏలాంటి దుస్తులు ధరించాలి?



**జ.** పరిశుభ్రమైన నీటితో ఉతికిన బట్టలే ధరించాలి. నూతి వద్ద ఉతికినవి శ్రేష్ఠం. నదుల వద్ద ఉతికినవి బహు శ్రేష్ఠము.

సరస్సుల వద్దా, కుంటల వద్దా ఉతికినవి అధమము. ధరించే దుస్తులు తేలికగా ఉండాలి. నూలు గుడ్డలతో నేసిన బట్టలు శ్రేష్ఠము. ఉతకటానికి కుదరని వాటిని ధరించటము అనారోగ్యమే.

## 486. ఏ లక్షణములు గల సాలగ్రామములు మంచివి కావు?

**జ.** వంకర టింకర కలది వంకర చక్రము పక్కమూతి – విరిగిన చక్రము; పగిలిన చక్రము – ఎరుపు ముఖాలు గలవి; తలక్రింద చక్రము– లోపల పగులు కలది మసక వన్నె – లోపల నీరు నిలిచివున్నది; వెచ్చగా వున్నది – మిక్కిలి గీతలు కలది; అస్పష్టమైనది – వేడి గుణం లేనిది ; అనేక రంధ్రములు కలది.

## 487. దేవాలయాల్లో తల నీలాలెందుకు సమర్పిస్తాము?

బ్రతుకు జీవన పోరాటంలో మనం చెప్పే అబద్ధాలకూ, చిన్న మోసాలకూ అంతే ఉండదు. మానవుడు చేసే సర్వకర్మల పాపఫలం వెంట్రుకలను చేరుతుంది.

అందుకే పాపాలకి నిలయమైన వెంట్రుకలను స్వామికి సమర్పించి, స్వామీ ... ఇంతవరకూ చేసిన పాపాలను వదిలేస్తున్నాను. ఇకపై మంచిగా, ధర్మంగా, న్యాయంగా ఉంటానని చెప్పటమే తల నీలాలివ్వటము.

## 488. సకల శుభకరమూ, ఆరోగ్యకరము.

**జ.** వివాహాది శుభకార్యాల్లో ఒకప్పుడు విధిగా అరటి ఆకుల్లోనే భోజనాన్ని వడ్డించేవారు. ఆరోగ్య శాస్త్రాలూ, పురాతన శాస్త్రాలు భోజనం అరిటాకులోనే ఉత్తమమని శెలవిస్తున్నాయి. ఆకుల్లో ఔషధ గుణాలున్నాయి. అవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అలాగే రావి ఆకులో భోజనం చేస్తే జననేంద్రియ దోషాలు తొలగిపోతాయి. చిన్న పిల్లలకి చక్కటి మాటలు వస్తాయి. మోదుగ విస్తరిలో భుజిస్తే నేత్ర దోషాలు కనుమరుగవుతాయి.

మర్రి ఆకులతో కుట్టిన విస్తరిలో భోజనం చేస్తే పూర్తి ఆరోగ్యము. పచ్చటి ఆకుల్లో భోజనము వల్ల ఆకులోని క్లోరోఫిల్ వల్ల అనేక రుగ్మతలు, పేగుల్లోని క్రిములు దూరమవుతాయి.

## 489. ఏ ఏ తిథిల్లో ఏం తినకూడదు?



**జ.** పాడ్యమినాడు గుమ్మడి కాయనూ, విదియనాడు వాకుడు కాయనూ, తదియ నాడు పొట్లకాయనూ, చవితినాడు ముల్లంగినీ, పంచమినాడు మారేడునూ, షష్టినాడు వేమునూ, సప్తమినాడు కాయా, పండునూ.. అష్టమినాడు కొబ్బరి కాయనీ, నవమినాడు సొరకాయనూ, దశమి నాడు తీగబచ్చలినీ, ద్వాదశినాడు మాంస మునూ, త్రయోదశినాడు ముల క్కాయనూ … చతుర్దశినాడు మినుమూ తినరాదని శాస్త్రం చెబుతోంది.

## 490. ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

**జ.** తీగల నుంచి వచ్చిన ఆహారము అనగా సొర, బీర, పొట్లకాయ, చిక్కుడు, గుమ్మడి ఇత్యాదివన్నీ ఉత్తమం. కాడ నుంచి వచ్చే ఆహారము అనగా వంకాయ, టమోటా ముల్లంగీ, మునగా, మధ్యమం. వంకా యను చిక్కుడు వంటి కూరగాయలతో కలిపి తయారు చేసుకోవాలి. విడిగా తినటం అంత మంచిది కాదు. ఇక అధమం భూమి లోపల పండేవి… అనగా దుంపకు సంబంధించినవి.

## 491. జంతువుల నుంచి మనిషి ఏం నేర్చుకోవాలి?

**జ.** సింహాదేకం బకాదేకం షట్శున స్త్రీణి గర్దభాత్।
వాయసాత్పంచ శిక్షేచ్ఛత్వారి కుక్కటాత్॥

సింహము నుంచి ఒక విషయాన్ని, కొంగ నుంచి రెండు విషయాలనీ, కుక్క నుంచి ఆరు విషయాలనీ, గాడిద నుంచి మూడు విషయాలనీ, కాకి నుంచి అయిదు విషయాలనీ, కోడి నుంచి నాలుగు విష యాలను నేర్చుకోవాలి. మృగాలను వేటా డేటప్పుడు సింహం సర్వశక్తులనూ ఉప యోగిస్తుంది. కొంగ తన ఆహారాన్ని దేశ వాతావరణ ప్రకారంగానూ కాలాను గుణంగానూ తీసుకుంటుంది. మనుజుడు కూడా కార్యాన్ని అలానే చేయాలి. అలాగే కుక్క అవసరమైనంత భుజించుట, అల్ప సంతోషము, చక్కటి నిద్ర, తగు సమ యమున నిద్రలేచుట, నమ్మిన బంటుగా ఉండుట, పరాక్రమాన్ని కలిగి ఉండుట చేస్తుంది. ఈ ఆరు గుణాలు కుక్క నుంచి నేర్చుకోవాలి. అలాగే గాడిద మోయలేని బరువుని కూడా మోస్తుంది. వాతావర ణాన్ని లెక్క చేయకపోవటం, బాగా పని చేసి అలసి సొలసి సుఖంగా ఉండుట. ఈ మూడు గుణాలను గాడిద నుంచి నేర్చు

కోవాలి. కాకి నుంచి అడ్డుగల శృంగార మూ, కాఠిన్యమూ, ఇల్లు నిర్మించుకొను టలో జాగరూకత, సోమరితనాన్ని లేకుం డుట ... ఇట్టివి నేర్చుకోవాలి. ఇక కోడి నుంచి మనిషి నేర్చుకోవాల్సింది. పోరా టంలో వెనుకకు తగ్గకుండుట, ఉదయాన్నే నిద్రలేవటమూ, బంధువులతో భుజించ టమూ, ఆపదలప్పుడు స్త్రీలను (పెట్టను) రక్షించుకొనుట.... ఇటువంటివి కోడి నుండి తెలుసుకోవాలి.

## 482. సరస్వతీ దేవి రాతి మీద ఎందుకు కూర్చుంటుంది?



**జ.** సరస్వతీ దేవి ఏ పటంలోనైనా రాతి మీద వీణ పట్టుకునే కూర్చుంటుంది. లక్ష్మిలా నిలకడ లేని తామరపువ్వులో తన స్థానముండదని చెప్పటమే ప్రథమ ఉద్దేశ్యము. సిరిసంపదలు హరించుకు పోవచ్చు... నేర్చుకున్న విద్య, విజ్ఞానం ఎక్కడికి పోలేనివని పరమార్థం.

సరస్వతి వాహనము హంస. హంస జ్ఞానము కలది. పాలు, నీళ్ళూ కలిపి దాని ముందు ఉంచితే పాలని మాత్రమే స్వీక రిస్తుంది. అనగా విజ్ఞానంవల్ల ఏదైనా సాధించవచ్చునని. అలాగే నెమలి...సృష్టి తత్వానికి వ్యతిరేకంగా, సంగమం లేకుండా మగనెమలి కంటి నీరు త్రాగి గర్భం ధరిస్తుంది.

## 483. నాగుల చవితికి పుట్టలో పాలెందుకు పోస్తారు?

**జ.** అసలు విషయానికొస్తే పాములు పుట్టలు పెట్టవు. చెద పురుగులు పెడితే అందులో నివాసం ఉంటాయి. పామంటే అందరికీ భయం. కనిపిస్తే కాటు వెయ్య కుండానే మరణించేంత భయం. అస లన్ని పాములు మనిషిని చంపలేవు. అలాగే పగకూడా పట్టవు. అలాంటి పాములు ఆకస్మికంగా కానవస్తే, భయం తోనే గుండె ఆగి చనిపోతారని, పాము లంటే భక్తి ఉంటే, భక్తితోనైనా పాముని చూడగానే దూరంగా జరిగి తద్వారా తమ ప్రాణాలూ, పాము ప్రాణాలు నిలపెడతా రని ఈ నియమాన్నిపెట్టారు. పాములు అసలు పాలే తాగవు. కాబట్టి మనం పుట్టలో పోసే పాలన్నీ మట్టిపాలే. పాము కాటేస్తుందని మనం భ్రమపడతాము. మనమేదన్నా చేస్తామని పాము భయపడు తుంది. దాని భయం సంగతి వదిలేస్తే, మన భయం కొద్దిగా తగ్గించే ప్రయత్నమే పుట్టలో పాలు పోయటము. పుట్టలో పాములు సుఖంగా పౌర్ణమికి కలుస్తాయి.

ఆ సమయంలో వాటి రజస్సు పుట్టలో పడి ఇంకిపోయే అవకాశం ఉంది. మనం పోసే పాలు ఆ మట్టి మీద పడి, సూర్యుని కిరణాలు తగిలి, రజస్సు గాలిలో కలుస్తుంది. ఆ రజస్సు గాలి అత్యంత శుభం కూడా.

## 494. తిరుమల శ్రీవారి సుప్రభాతాన్ని ఎవరు రచించారు?



**జ.** స్వామి సుప్రభాత స్తోత్రాన్ని రచించినది శ్రీ ప్రతివాది భయంకర అణ్ణన్ అనే ఆచార్యులవారు. ఈయన మణవాళ మహామునుల శిష్యుల్లో ముఖ్యులు. వీరు క్రీ.శ. 1361 నుంచి 1454 వరకూ జీవించారు. వీరు అనేక కృతులు రచించారు. సుప్రభాతాన్ని పుస్తకంగా ప్రచురించేవారు,ఇంకా అనేక సంగీత కార్యక్రమాలు నిర్వహించేవారు ఈ విషయాన్ని అనగా సుప్రభాతాన్ని రచించిన రచయిత పేరును ఉదహరించటం ధర్మం.

## 495. తల్లి గర్భంలోని పిండం ఎలా పెరుగుతుంది?

**జ.** అయిదు రోజులకు బుద్బుదాకారము, పదిరోజులకు రేగిపండంత పరిమాణంగా పెరుగుతుంది. ఒక నెలకి శిరస్సూ, రెండు నెలలకి భుజాలూ, మూడు నెలలకి గోళ్ళూ, రోమాలూ, చర్మమూ, గుహ్యాంగాలూ, నాలుగు నెలలకి సప్తధాతువులూ, ఐదు నెలలకి ఆకలిదప్పికలూ, ఆరు నెలలకి మాయతో కప్పబడి, ఏడవ నెలలో జ్ఞానం కలిగి అటూ ఇటూ కదులుతాడు.

నెలలు నిండి జన్మించే వరకూ లోపల జీవి అనేక విధాలుగా, గత జన్మలో చేసిన పాపాలనూ, తప్పులనూ పునరాలోచించుకుని, ఈ జన్మలో అవి చెయ్యనని ఆ దేవదేవుడ్ని ప్రార్థిస్తూ భూమిమీద పడతాడు. అయితే పడీపడగానే మాయ కమ్మేస్తుంది. అంతా మరిచిపోతాడు. మళ్ళీ మామూలు పోరాటమే. ధన పోరాటము. స్త్రీ పోరాటము. కుటుంబ పోరాటము. కీర్తి పోరాటము.

## 496. బట్టలన్నీ విప్పదీసి పూర్తి దిగంబరంగా ఎందుకు నిద్రించరాదు?

**జ.** స్త్రీగానీ, పురుషుడు గానీ అటుల చేయరాదని ధర్మశాస్త్రాలూ, ప్రాచీన శాస్త్రాలు చెబుతున్నాయి. బట్టలు లేకుండా నిద్రించటం వల్ల శరీరంలో రసాయనిక మార్పులు జరిగి, శక్తిని హరించేలా చేస్తుందని ఆయుర్వేదం చెబుతోంది. అలాగే స్త్రీలు బట్టలన్నీ విప్పదీసి నిద్రిస్తే రాత్రి విహారం చేసే అనేక రాక్షస అంశగలవారు కామంతో ఆవహించటమో, రహస్యశీల అపహరణం చెయ్యటమో, జరుగుతుంది. కనీసం రహస్య అవయవాలపైనన్నా వస్త్రాన్ని కప్పుకుని నిద్రించటం బహుమంచిది.

## 497. బ్రహ్మ ముహూర్త సమయమంటే?



**జ.** కశ్యప బ్రహ్మకూ, వినతాదేవికి జన్మించినవాడు అనూరుడు. అతడే సూర్యుడి సారథి. తల్లి వినతాదేవి పుత్రుడ్ని చూసుకోవాలనే కుతూహలంతో, ఆత్రుతతో పుట్టకముందే అండం పగలకొట్టడంతో సగం శరీరంతో జన్మించాడు. బ్రహ్మ అతడ్ని సూర్యుడికి సారథిగా నియమించి, నీవు భూలోకాన ఉన్న సమయమే బ్రహ్మ కాలమని, ఆ కాల సమయమున చెడు అన్నది ఏ నక్షత్రాలూ, గ్రహాలు చెయ్యలేవని వరమిచ్చి సూర్యుడి సప్తాశ్వరథానికి సారథిగా నియమించాడు.

## 498. యముడు మానవుడ్ని ఎలా హెచ్చరిస్తాడు?

**జ.** యమధర్మరాజు మానవులకి అనేక విధాలుగా సంకేతాలిస్తాడు. ముందుగా తల వెంట్రుకలను రాలేలా చేస్తాడు. అదే మృత్యుదేవత కదలిక. ఆపై పళ్ళు ఒక్కొక్కటిగా ఊడిపొయ్యేలా చేస్తాడు. ఆ తర్వాత కనులకు దృష్టిని తగ్గిస్తాడు. తదుపరి కాళ్ళూ, చేతులూ వణికేలా చేస్తాడు. అదే ఆయన చివరి హెచ్చరిక. జుట్టు రాలటం ప్రారంభం కాగానే పూర్తికాలం నియమ నిష్టలతో ఉండి ఆయుష్షును పెంచుకోమని ఇహంనందు చెయ్యాల్సిన సమస్త విధులూ సుఖాలూ పొందమని యమధర్మ రాజు తన సంకేతాల ద్వారా తెలియ చెబుతాడు.


## 499. ఏయే దానాల వల్ల ఏయే ఫలితం వస్తుంది?

**జ.** కన్యాదానం వల్ల బ్రహ్మలోకప్రాప్తి. బంగారాన్ని దానం చెయ్యటం ద్వారా విష్ణులోక ప్రాప్తి. గుర్రం దానం చేస్తే గంధర్వలోక ప్రాప్తి. ఏనుగుని దానంగా ఇస్తే శివలోక సాన్నిధ్యము. ఇల్లు దానం చేస్తే విష్ణుకరుణ. నాగలి దానంచేస్తే శ్రీకృష్ణుడి ప్రేమ. భూదానం శివలోక నివాసము. ఎద్దుని దానంగా ఇస్తే మృత్యుంజయ లోకంలో జన్మ. గోవుని దానంగా ఇవ్వటం ద్వారా వైకుంఠ నివాసము.

## 500. అగ్ని హోత్రమంటే ఎలా చేయాలి?

**జ.** సూర్యోదయ సూర్యాస్తమయాల సమయంలో రాగిపాత్రలో ఆవు పేడ పిడకలూ, జిల్లేడూ, మోదుగా, చంద్ర, దర్భ, గరిక లాంటి వృక్షాల కట్టెలను వేసి అగ్ని వెలిగించి మంత్రజపాన్ని చేయాలి. ఆవు నెయ్యి, గోధుమరంగుగల అన్నమును హవిస్సుగా అగ్నిదేవునికి అర్పించాలి. మంత్ర శబ్దములు, రాగి పాత్రనుంచి వచ్చే హోమ ధూమమువల్ల చుట్టూ వాతావరణము పవిత్రంగా మారిపోతుంది.

## 501. పిల్లల్ని ఎలా పెంచాలి?



**జ.** అయిదు సంవత్సరాలు వచ్చే వరకూ పిల్లలని రాజకుమారుల్లా అతి గారాబంగా పెంచాలి. ఆపై పదిహేను సంవత్సరాల వరకూ సేవకుడిలా ఆజ్ఞాపించి పెంచాలి. పదహారు సంవత్సరాల తర్వాత మిత్రునిలా భావించి పెంచాలి. అప్పుడే ప్రయోజకులవుతారు. పిల్లల్ని ప్రేమతో చూడటం వేరు గారాబంగా చూడటం వేరు. ప్రేమతో పెంచితే ప్రయో జకులవుతారు. గారాబంగా పెంచితే మీకూ, దేశానికీ, కట్టుకున్న దానికీ సమస్య అవుతారు. చిన్నతనంలో మన తల్లీ, తండ్రి నుంచి మనం ఏంకోల్పోయామో, ఏ విషయాల ద్వారా జీవితంలో ఈ స్థితి కొచ్చామో, గమనించి అవే తప్పులు మళ్ళీ చేసి ఆపై చింతించకండి. పిల్లలు పెరిగి పెద్దయి ప్రయోజకులుగామారి, మనల్ని ఉద్ధరించే స్థితిలో ఉండాలి. కాని మనమే వారిని చూసే పరిస్థితి వస్తే ఖచ్చితంగా మనం మన పిల్లలని సరైన దారిలో పెంచలేదని ....

## 502. తిరుమల పాప నాశనమందు స్నానం చేస్తే?

**జ.** తెలిసి చేసిన, తెలియక చేసిన సమస్త పాపములు పశ్చాత్తాపముతో మూడు రోజులు స్నానమాచరించిన సమస్త దోషాలు పాపాలూ పోతాయని శ్రీవేంకటేశ్వర మహాత్మ్యంలో ఉంది. చిత్తా నక్షత్రాన చైత్ర పౌర్ణమి ఉదయం ఆకాశగంగలో స్నానమాచ రించిన సర్వ పాపాలు పోతాయి.

## 503. మనిషిని రాక్షసునిగా చేసేవి ఏవి?

**జ.** ధర్మ, అర్థాలతో జీవితాన్ని సాగిస్తున్న వ్యక్తి జూదము, మద్యము, మగువవంటి వ్యసనాలపాలవుతే అతనిలో ధర్మ, సత్య గుణం నశించి ఎన్ని అబద్ధాలైనా, మరెన్ని నీచకార్యాలయినా చేయటానికి ఎట్టి స్థితిలోనూ సందేహించడు. కాన వ్యసనములు ఎంతటి మహాత్ముడి నయినా అధర్మ పద్ధతిలోకి తీసుకెళతాయి.

## 504. ఏ పని ఎప్పుడు చెయ్యాలో అప్పడే చెయ్యాలి.... ఆ పనులేంటి?

**జ.** వంద పనులున్నా..... కోటి ధనం వస్తుం దన్నా సమయానికి భోజనం చేయాలి. వెయ్యి పనులున్నా తగు సమయాన్ని వెచ్చించి స్నానము చేసి పూజాదికాలు చేయాలి. లక్ష సమస్యలున్నా దానము చేయాలని పిస్తే వాయిదా వేసుకోకుండా చేసేయాలి. కోటి పనులున్నా వదలి శ్రీహరిని సమయానికి పూజించాలి. ఇవి చేయగలిగితే మీకన్నా సుఖవంతుడు ఉండరు.

## 505. భార్య గర్భవతిగా ఉన్నప్పుడు ఇల్లెందుకు కట్టుకోకూడదు?



**జ.** భార్య గర్భవతిగా ఉన్నప్పుడు నూతన గృహప్రవేశం పెట్టుకోకూడదు. నిర్మించ కూడదు. జీవితాంతము ఉండే ఇంటి పట్ల, వంశాన్ని ఉద్ధరించే సంతానము పట్ల ఎంతో శ్రద్ధ అవసరం. గర్భవతిగా ఉన్న భార్యని ఎంతో జాగ్రత్తగా కంటికి రెప్పలా చూసుకోవాలి. అత్యంత ముఖ్యమైన రెండు విషయాలని ఎవ్వరూ ఒకేసారి సర యిన రీతిలో చూసుకోలేరు. రెంటికీ న్యాయం చెయ్యలేరు. కాన గృహ నిర్మాణం భార్య గర్భవతిగా ఉన్నప్పుడు కూడదు.

## 506. ఓం శాంతి శాంతి శాంతిః అనగా....

**జ.** మొదటిసారి శాంతి అనగానే.... మనకీ మన వారికీ, దుఃఖ బాధలు తొల గాలనీ, రెండవసారి శాంతి అనగానే మన చుట్టూ ఉన్న సమస్త ప్రాణికోటి సుఖంగా ఉండాలనీ, మూడవసారి శాంతిః అనగానే ప్రకృతిపరంగా, గ్రహాల పరంగా ఏ ఉపద్రవాలూ భూమండలాన్ని తాక వద్దని కోరుకోవటము.

## 507. విజయదశమినాడు ఏ పని ప్రారంభించినా విజయమవ్వటానికి కారణము ఏమిటి?

**జ.** ఆ రోజు విజయదశమి. అనగా శ్రవణా నక్షత్రం, దశమీ తిథి, సంధ్యాకాలము దాటిన తర్వాత సమయమే విజయకాలము.

సంధ్యాకాలం దాటిన తర్వాత 48 నిముషాల వరకూ పరాశక్తి అనన్యశక్తి మంతురాలవుతుంది. కాన ఆ సమయ మున ఏది ప్రారంభించినా, విజయ పథంలో దూసుకుపోవచ్చు. అందుకే విజయ దశమిని విజయ, ముహూర్త అని కూడా సంబోధిస్తారు.

## 508. దేవుని దీపం ఏ వైపుకి ఉండాలి?

**జ.** వెండి, పంచలోహాలు లేదా మట్టి ప్రమిదల్లో దీపం వెలిగించి భగవంతుని వైపుకి ఉంచాలి. రెండువత్తులు ఖచ్చి తంగా ఉండాలి. ఏకవత్తి వెలిగించరాదు. అలా వెలిగించటము మహాదోషము. ఓసారి పూజకు వినియోగించిన కుందిని మళ్ళీ వాడరాదు. మహాశివునికి ఎడమ వైపూ, విష్ణువుకి కుడివైపు దీపాన్ని



ఉంచాలి. ఎదురుగా ఉంచరాదు. నిత్య దీపారాధన చేసే వారికి మంచి భర్త లభిస్తాడు. స్త్రీలు సుమంగళులుగా ఉంటారు. సంతానవంతులవుతారు. దీపారాధనంటే జగన్మాతని కూడా ఆరాధించటమే.

## 509. రామాయణ భారత భాగవతాల్ని ఎప్పుడు చదవాలి?



**జ.** ప్రాతఃకాల సమయాన మహాభారతాన్నీ, మధ్యాహ్నమున రామాయణాన్నీ, రాత్రి సమయాన భాగవతాన్నీ చదివితే ఎక్కువఫలం వస్తుంది.

## 510. శ్రీమహాలక్ష్మీదేవి స్థానాలు ఏమిటి?

**జ.** గురుభక్తి, దైవభక్తి, మాతా పితృభక్తి గలవారికి లక్ష్మి తన కటాక్షాన్ని ఇస్తుంది. అతిగా నిద్రపోయేవారి గృహంలోనూ, ఉదయాన్నే పూజ చేయని వారి గృహంలోనూ లక్ష్మి నిలువదు. గృహం పరిశుభ్రంగా లేకపోయినా, గడపకు పసుపు రాయకపోయినా, స్త్రీకి నిషిద్ధమైన నాలుగు రోజులు పూజామందిరానికి దూరంగా ఉండక పోయినా శ్రీమహాలక్ష్మి ఆ గృహం నుంచి వెళ్ళిపోతుంది. ముగ్గూ, పసుపూ, పువ్వులూ, పళ్ళూ, పాలూ, దీప, ధూప, మంగళద్రవ్యాలు లక్ష్మీస్థానాలు.

## 511. ఇంద్రధనస్సుని మరొక రికి చూపించకూడదా?

**జ.** అందమైన ఏడురంగుల ఇంద్రధనస్సును చూడటం తటస్థిస్తే చూడాలిగాని మరొకరికి చూపించకూడదనటానికి కారణం, ఇంద్రధనస్సు నుంచి వచ్చే కిరణాలు కంటికి అపాయం కలిగిస్తాయి. అందుకే మరొకరికి చూపించకూడదని చెప్పకూడదని చెబుతారు.

## 512. ప్రత్యక్ష శత్రువులు ఎవరు?


**జ.** పితాచ ఋణవాన్ శత్రుర్మాతా చ వ్యభిచారిణీ।
బార్యా రూపవతీ శత్రుః పుత్త్రః శత్రు అపణ్డితః॥

అప్పుల పాలు చేసి నడిరోడ్డు మీదకు లాగిన తండ్రీ, తండ్రికి ద్రోహము చేసి గౌరవాన్ని మంట గలిపిన తల్లీ, రూపవంతురాలూ గుణవంతురాలూ కాని భార్యా, మూర్ఖుడైన మదముగల కొడుకూ– వీరు ప్రధాన శత్రువులు. వీర్ని జయించుట సాధ్యంకాదు.

## 513. పంచాంగము ఎప్పుడు పుట్టింది?

**జ.** సుమారు అయిదు వేల సంవత్సరాల నాటి క్రితం మహర్షులు సూర్యచంద్రుల గమనాన్ని ఆధారంగా చేసుకొని తిథీ, వారమూ, నక్షత్రమూ, యోగమూ, కరణమూ అను ఈ అయిదింటితో పంచాంగాన్ని వ్రాశారు.

## 514. ఆవు ఎంత పవిత్రమైనది?



జ. గోవు...గంగ...గాయత్రి...ఈ మూడు పరమ పవిత్రమైనవి. అవుని పూజిస్తే 33 కోట్ల దేవతలని పూజించినట్లే. క్రిములు లేకుండా చెయ్యటంలోనూ, అనేక నేత్ర, హృదయ రోగాలను పారద్రోలే శక్తి గోమయంలో వుందని వైద్య శాస్త్రంలో ఉంది. ఆవుని ముట్టుకున్నంతనే ఆయుష్షు వృద్ధి చెందుతుంది. ఆవుకు నమస్కరిస్తే ముక్కోటి దేవతలకి నమస్కరించినట్టే.

## 515. ఏ ధనం ఉత్తమము?

జ. ఉత్తమం స్వార్జితం విత్తం మధ్యమం పితురార్జితమ్।

అధమం భ్రాతృజాయాది స్త్రీవిత్త మధమాధమమ్।।

తాను కష్టపడి సాధించుకున్నది ఉత్తమమైనది. తండ్రీ, తాత ఇచ్చినది మధ్యమము, సోదరులు గడించిన ధనమూ, భార్య ద్వారా వచ్చిన ధనమూ అధమము. స్త్రీ సొమ్ము అధమాధమము. అందుకే అంటారు ఆడదాని సొమ్ము తిని వాడే బావుకుంటాడు అని.

## 516. కోపమే ప్రథమ శత్రువా?

జ. తప్పులు అన్నీ అవతల వారే చేయచ్చు. సమస్యలన్నింటికి కారణము వారే కావచ్చు. సర్వధర్మాలని కాదని ఇష్టమొచ్చినట్టు అయిన వారంతా ప్రవర్తించవచ్చు. అయినా కోపం తెచ్చుకుంటే నష్టపోయేది మీరే. ఒక స్టేజీ దాటిపోయిన తర్వాత అరిచినా ప్రయోజనం శూన్యం. అన్ని విషయాలనీ, అన్ని కార్యాలనూ తొలినుంచే క్రమ పద్ధతిలో ఉంచుకోవాలి. అప్పుడే కోపం అదుపులో ఉంటుంది.

## 517. కలలు నిజమేనా? అసలెందుకు వస్తాయి?

జ. విపరీతంగా కష్టించి అలసిసొలసి నిద్రపోతే కలన్నదే రాదు. ధనమెక్కువయినవారికీ, అశాంతి వున్నవారికీ, అనారోగ్యంతోనూ, మానసిక సమస్యలతోనూ, ఒంటరితనంతోనూ బాధపడే వారికి కలలొస్తాయి. వారి భయాలకీ, తీరని కోర్కెలకీ వారివారి ఆలోచనల ప్రతిరూపమే కలలు. సెక్స్ కోరికలు తీరని వారికి ఎక్కువగా కలలు వస్తుంటాయి.

## 518. ద్రౌపది ధర్మ విజేతేనా?

జ. రత్నరాశులతోనూ, పాడి పంటలతోనూ తూలతూగే ఇంద్రప్రస్థ రాజ్యాన్నీ, సోదరులనూ, తననీ పందెం కాసి, ఓడిపోయిన ధర్మరాజుకు ద్రౌపదిని పందెం కట్టే హక్కు లేదు. పైగా ద్రౌపది అయిదుగురి సొత్తు. దానికితోడు ధర్మరాజు ముందే ఓడిపోయాడు కావున, దుర్యోధ

నుడికి సేవకుడు. యుద్ధానికీ, వినోదానికీ, విరోధానికీ, వియ్యానికీ సమ ఉజ్జీ ఉండాలి. సేవకుడితో రాజు, రాజుతో సేవకుడు జూదం ఆడటం ధర్మ, న్యాయ విరుద్ధం. అయినా సర్వధర్మాలు తెలిసిన ధర్మరాజు ద్రౌపదిని పందెం కట్టాడంటే అర్థం...జూదం వ్యసనం దేన్నయినా జయిస్తుంది. ఎంత జ్ఞానమున్నా, ఆ వ్యసనం మనిషిని పక్కదారి పట్టిస్తుంది. ప్రాణ సంకటములోనూ, అవమానభార పరిస్థితుల్లోనూ, ఆపద సమయాల్లోనూ చేసే పని దోషంక్రింద రాదు. అందుకే ధర్మరాజుకు ఆదోషం అంటలేదు.

## 519. చెట్టు ముందా? విత్తు ముందా?

**జ.** చెట్టు కావాలంటే విత్తు కావాలి. అలాగే విత్తు కావాలంటే చెట్టు ఉండాలి. అలా ఎంత వెనక్కి వెనక్కి వెళ్ళి చూసినా చెట్టు ముందు విత్తు, విత్తుకు ముందు మళ్ళీ చెట్టు.... ఇలా ఎన్నిసార్లు వెనక్కి వెళ్ళినా అంతం వుండదు. అంటే చెట్టు విత్తు సంబంధం పెట్టినవాడే దేవుడు. ఆ పరమాత్ముడే అన్నింటా అందరికంటే ముందు అనేది అసలు పరమార్థం. కానీ



చెట్టుముందా విత్తుముందా అంటే పురాణ ఆధారప్రకారం చెట్టే ముందు అది ఎలా గంటే క్షీరసాగర మథనంలో పుట్టింది కల్పవృక్షమే కానీ కల్పవృక్ష విత్తనం కాదు.

## 520. ఋగ్వేదంలో ఏముంది?

**జ.** వ్యవసాయ, వ్యాపార విషయాలతో పాటు ఓడలూ, ఎగిరే వాహనమూ, పద్ధతులూ లాంటి శాస్త్ర జ్ఞానం ఉంది.

## 521. యజుర్వేదము

**జ.** కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదం అని రెండు భాగాలున్నాయి. మొదటి దానిలో కర్మ సిద్ధాంతమూ, గణిత, ఆరోగ్య, అంతరిక్ష శాస్త్రాలున్నాయి. రెండో దానిలో సృష్టి గూర్చి, బ్రహ్మ విద్యల గూర్చి ఉన్నాయి.

## 522. సామవేదము

**జ.** వెయ్యి శాఖలున్నాయని అంటారు. మనకు అందుబాటులో కొన్ని శాఖలు మాత్రమే ఉన్నాయి. ఈ సామవేదం గానం చేస్తూ చదవటానికి వీలుగా ఉంది దీనిని గానవేదం అని కూడా అంటారు.


## 523. పంచాంగ ఫలమంటే?

**జ.** బ్రహ్మ అయిదు ముఖాల నుంచి పుట్టినదే పంచాగము. తూర్పు ముఖాన్నుంచి తిథి, దక్షిణ ముఖాన్నుంచి వారమూ, పశ్చిమ ముఖం నుంచి నక్షత్రమూ, ఉత్తర ముఖంనుంచి యోగము, ఉర్ధ్వ ముఖం నుంచి కరణమూ ... ఈ అయిదింటి కలయికే పంచాంగము. తిథి వల్ల ధనమూ, వారము వల్ల ఆయుష్షు పెరుగుతాయి. నక్షత్రంవల్ల పాపపరిహారమూ, యోగము

వల్ల రోగాలు సమసిపోతాయి. కరణము వల్ల కార్యసిద్ధి కలుగుతుంది.

## 524. తిరుమల శ్రీవారి గడ్డం క్రింద నిత్యం వెన్న ఎందుకు రాస్తారు?

**జ.**'భృగుమహర్షి' వల్ల శ్రీమహావిష్ణువుపై



అలిగి లక్ష్మీదేవి కొల్హాపురాన్ని చేరుతుంది. ఆపై శ్రీమహావిష్ణువు నర అవతారాన్నిదాల్చి, వేంకటాద్రిపై తపస్సు చేస్తాడు. ఆయన చుట్టూ పుట్ట వెలుస్తుంది. గోమందలోని కామధేనువు స్వామి వారికి నైవేద్యంగా పుట్టలోకి పాలధారను కార్చి ఆ స్వామి ఆకలి తీర్చేది. దాన్ని గమనించిన గొల్లవాడు కోపంతో కర్రతో ఆవుతలపై కొడతాడు. దానిని అడ్డుకుని నారాయణుడు ఆ దెబ్బని తాను భరిస్తాడు. ఆ దెబ్బ స్వామికి గడ్డం క్రింద తగిలింది. దానికి ప్రతిగానే స్వామి వారికి నిత్యం గడ్డం క్రింద వెన్నపూస్తారు.

## 525. అథర్వణ వేదము

**జ.** దైవప్రార్థనల గూర్చీ, బ్రహ్మచర్యము గూర్చీ, నియమాలుగూర్చి దైవాన్ని ఎలా పూజించి ప్రసన్నం చేసుకోవాలో ఉంది.

## 526. ఏఏ రోజుల్లో క్షుర కర్మ చేయించుకోవాలి?

**జ.** బుధవారమూ, గురువారమూ, సోమవారమూ మంచిది. అదివారమూ, శనివారమూ క్షురకర్మ వద్దు. మొదట గడ్డం గీయించుకుని ఆపై చంకలూ, ఆ తర్వాత తల క్షౌరం చేయించుకోవాలి. ఇలా చేయిం చుకోవటంవల్ల కుటుంబ వృద్ధిజరుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. గోళ్ళూ, మీసాలూ, రోమాలూ, ప్రతి అయిదు రోజుల కొకసారి కత్తిరించు కోవాలి. ముక్కులోని వెంట్రు కలు కత్తిరించుకోకూడదు. దానివల్ల కంటికి ఇబ్బంది. మనం పీల్చేగాలిలో అనేక విష క్రిములుంటాయి. వాటిని పసిగట్టి ఆపి... మంచి గాలిని పంపించేవే ముక్కులోని వెంట్రుకలు. అలాంటి వాటిని అందం కోసం కత్తిరించవద్దు. అలాగే క్షుర కర్మ పాడ్యమీ, చవితీ, షష్ఠి, అష్టమీ, నవమీ, అమావాస్య, పౌర్ణమి తిథిలందువలదు.

## 527. శనీశ్వరునకు నడకంటే ఇష్టమా?

**జ.** శనీశ్వరునకు నడకంటే ఎంతో ప్రీతి. అందుకే అనేక ప్రదక్షిణాలు చేస్తారు. శనిని తమకనుగుణంగా ఆశ్వీరదించమని వేడుకుంటారు. నడక విషయానికొస్తే నడక శరీరంలో శక్తిని పెంచుతుంది. బుద్ధిని పెంచుతుంది. మనసుకి ఉత్తేజాన్నీ ఉత్సాహాన్నీ ఇచ్చి సమస్త కార్యాల్లో విజయాన్ని తెచ్చి పెడుతుంది.

## 528. పెళ్ళి అనుకోగానే ఎవరెవరు ఏమి కోరుకుంటారు?



**జ.** వధువు తనని వరించే పెండ్లికొడుకు అందగాడు, మంచివాడు, బాగా చూసు కునేవాడు, తన మాట వినేవాడూ, తనని అన్ని విధాల సంతృప్తి పరిచేవాడు అయిన వాడ్ని కోరుకుంటుంది. వధువు తల్లి అల్లు డికి ఐశ్వర్యమెంతో ఉండాలని ఆశిస్తుంది. తనలా తన కూతురికి జరగకూడదని తనెంత బాగా అనుభవించినా కోరుకుంటుంది. వధువు తండ్రి వరునికి పరువూ, ప్రతి ష్టలూ ఉండాలనీ, అల్లుడి గూర్చి గర్వంగా పదిమందిలో చెప్పుకోవాలని ఆశిస్తాడు. బంధువులు వరుడి కుల గోత్రాలనీ, ఇక మిగిలిన వారు విందు భోజనం గూర్చి ఆలోచిస్తారు.

## 529. '9' అంకె గొప్పతనమేమిటి?

**జ.** కృత, త్రేతా, ద్వాపరయుగాలు లెక్కేస్తే తొమ్మిదే వస్తుంది. కృతయుగం 17,28,000. త్రేతాయుగము 12,96,000. అలాగే ద్వాపర యుగము 8,64,000 సం.లు

మహాభారతము పర్వాలు 18, మహా భారత యుద్ధం జరిగింది 18 రోజులు. మహా భారతంలో పాల్గొన్న అక్షౌహిణులు 18. అలాగే భగవద్గీత అధ్యాయాలు 18. వ్యాస మహర్షి పురాణాలు పద్ధెనిమిది కలిపితే తొమ్మిది. మానవ శరీరంలో ఉన్న రంధ్రాలు తొమ్మిది. ఆఖరుకి మనం తల్లి గర్భంలో ఉన్నది కూడా 270 రోజులు. అనగా కలిపితే తొమ్మిది. తొమ్మిది అంకెకూ, ఆరుకి సరిపడదు.

## 530. దేవాలయాల్లో శృంగార చిహ్నాలు అవసరమా ?

**జ.** ఇప్పటిలా ఆరోజుల్లో కామ గ్రంథాలూ, సినిమాలూ, టి.వి.లూ లేవు. నిరంతరము వృత్తి లేదా భక్తి. దానికి తోడు చిన్నతనం లోనే వివాహం చేసేవారు. ఇప్పటిలా స్నేహితులు ఉన్నా, ఎవ్వరికీ శృంగారంపై సరయిన అవగాహన ఉండేది కాదు. శృంగారం అంటే బూతు కాదనీ, సరయిన సమయంలో తెలుసుకొనే ముఖ్యవిష యమని దేవాలయాల్లో అక్కడక్కడ శృంగార భంగిమలు చెక్కి ఉంచేవారు. ఎవరికి వారు ఆ భంగిమలను చూసి అవగాహన ఏర్పరుచుకుని, సుఖ సంసారాన్ని చేయా లన్నది పెద్దల కోరిక. ఇక ముఖ్య విషయ మేమంటే, దేవాలయాల్లో ఆ శృంగార భంగిమల వైపు మనసు పోతుందా, భక్తి వైపుపోతుందా అని భగవంతుడు పెట్టే పరీక్ష కూడా. కామాన్ని వదిలి భక్తిపైనే శ్రద్ధ పెడితే పుణ్యమని పరమార్థం.

## 531. నవవిధ భక్తి సోపానాలు

**జ.** శ్రవణము, కీర్తనము, స్మరణము, అర్చనము, వందనము, సఖ్యము, ఆత్మ

నివేదము, పాదసేవనము, దాస్యము. పై భక్తి మార్గాలను అనుసరించిన మహాను భావుల్లో కొందరు .... వాల్మీకీ, నారదుడూ, హనుమంతుడూ, ప్రహ్లాదుడూ, పరీక్షిత్తు మహారాజూ, అంబరీషుడూ, రామదాసూ, త్యాగరాజూ, అన్నమయ్యా, రామకృష్ణ పరమహంసా... మొదలైనవారు.

## 532. తలంబ్రాలు పోసుకునేదెందుకు?



**జ.** ప్రథమంగా నాలుగుసార్లు ఒకరిపై ఒకరు పోసుకుని, ఆపై పోటీపడి ఒకరిపై ఒకరు సంతోషంగా పోసుకుంటారు. ఆ సమయాన మంత్రాలకు అర్థము. సంతానము వృద్ధి చెందాలని మగవాడు, ధన ధాన్యాలు వృద్ధి చెందాలని వధువు.. ఇలా సమస్త సంపదలూ, సుఖాలూ కావాలని ఇరువురూ భగవంతుడ్ని కోరుకోవటమే తలంబ్రాల ఉద్దేశ్యము.

## 533. గర్భగుడిలోకి వెళ్ళేముందు గడపకెందుకు నమస్కరిస్తారు?

**జ.** గృహములోవలె చెక్కతో కాకుండా దేవాలయాల్లో గడపను రాతితో నిర్మిస్తారు. రాయి పర్వతానికి చెందినది. భద్రుడు అనే ఋషి భద్రమనే పర్వతంగానూ, హిమవంతుడు అనే భక్తుడు హిమాలయము గానూ, నారాయణుడు అనే భక్తుడు నారాయణాద్రిగానూ అవతరించారని పురాణాలు శెలవిస్తున్నాయి. భగవంతుడు ఆ భక్తుల కోసం ఆ కొండల మీదే వెలిశాడు. కాన ఆ రాళ్ళనుంచి వచ్చిన రాయినే గడపగా మార్చి ఉంచుతారు. నిత్యం దేవుడ్ని దర్శించే ఆ గడప పుణ్యానికి నమస్కరిస్తూ అట్లాగే అంతటి భక్తుడ్ని దాటుతున్నందుకు క్షమించమని, మన్నించమని వేడుకోవటమే గడపకు నమస్కరించటము. దేవాలయాల్లో గడపని తొక్కి దాటకండి. కేవలం దాటండి.

## 534.గయలో ఇష్టమైనదాన్ని ఎందుకు వదులుతారు?

**జ.** ఎంతో ఇష్టమైన పండును లేదా కూరగాయనూ మరేదైనా గయలో ఇచ్చి వచ్చామంటారు. ఆ తర్వాత దాన్నిముట్టరు. అలా వదలటానికి ప్రధాన ఉద్దేశ్యము కామక్రోధలోభాలని వదిలేశానని చెప్పటం ... ఇంద్రియాలను అదుపులో ఉంచుకుంటున్నానని చెప్పటం.

## 535. ఆడపడుచు చేత పెళ్ళికొడుకును చేయించేదెందుకు?

**జ.** ఆడపిల్ల పుట్టింటి నుంచి అత్తారింటికి వెళ్ళగానే తన పుట్టింటితో అనుబంధమూ, హక్కులూ పోయాయనీ, దూరమయ్యాయని బాధపడుతుంటుంది.



అలాంటిదేమీ లేదు ఈ ఇంట్లో నీ హక్కు అలానే ఉందని చెప్పి, వివాహ సమయంలో తోడపుట్టిన వాడిని పెండ్లి కొడుకును చేయించటం దగ్గర్నించి ఆమెకు లాంఛనాలు ఇప్పించటం వరకూ తన ఇంటి పిల్లగా ప్రాధాన్యత కల్పిస్తారు. అలాగే తాము పోయిన తర్వాత ఆడపిల్లను మగపిల్లలు పట్టించుకోరేమోనని ముందు నుంచి ప్రతి శుభ కార్యానికి ఆడపిల్ల తప్పనిసరి అని, ఆమె చేతుల మీదగానే ఏదైన ప్రారంభించాలని చెప్పటమే ప్రధాన ఉద్దేశ్యము.

## 536. సాలగ్రామాలు పగిలినవి పూజకు పనికి వస్తాయా?

**జ.** సాలగ్రామములు విష్ణుదేవునికి ప్రతీకలు.

స్ఫుటితం పుత్రహాని స్యాత్
భగ్నోష్ఠం బుద్ధిద నాశనమ్.
ఆస్థాన భంగదం భగ్నం
దుర్దురం క్లేశ కారణమ్
భయావహం భగ్న శీర్షం
అతిస్థూలం ధనాపహమ్
అతిహ్రస్వ మపూజార్హం
త్రికోణం బంధునాశన్.

పగిలిన సాలగ్రామము సంతానహానిని కలిగిస్తుంది. పెదవి విరిగినది బుద్ధిని హరిస్తుంది. దద్దుర్లు కలిగినది క్లేశ కారణ మవుతుంది. తల పగిలినది భయాన్ని కలిగిస్తుంది. బాగా లావయినది ధన నాశనాన్నీ, పొట్టిది అసలు పూజకే పనికి రాదు. చక్రంతోకూడి ఉన్న సాల గ్రామము పగిలినా, విరిగినా పనికివస్తుంది.

## 537. ఆదివారం ఉసిరికాయ తినరాదెందుకు?

**జ.** ఆదివారం రవివారమని కూడా అంటారు. జ్యోతిష్యరీత్యా రవి, శుక్రులకి శత్రుత్వము. ఉసిరిలోని ఆమ్ల గుణం శుక్రునికి సంబంధించినది. ఇరువురికీ పడదు కాబట్టి ఆరోజు ఉసిరి తినరాదని చెబుతారు. అలాగే జలుబుగా ఉన్నా ఉసిరి పేరెత్తరాదు.


## 538. వడపప్పు పండుగలప్పుడు ఎందుకు చేస్తారు?

**జ.** పండుగలప్పుడు మనం అనేక పిండి వంటలు చేసుకుని తింటాము. దానివల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

వడపప్పు, పానకం సేవించటంవల్ల అరగని ఆహారపదార్థాలను అరిగేలా చేస్తాయి. అందుకనే పండగలప్పుడు వడ పప్పు, పానకం చేస్తారు.

## 539. కుడివైపుకి తిరిగి నిద్రిస్తే పిశాచాలు అవహిస్తాయా?

**జ.** కుడివైపుకి తిరిగి నిద్రిస్తే అనేక పీడ కలలూ, కలతనిద్రా వస్తాయని, శాస్త్రం



వక్కాణిస్తోంది. కాన ఎడమవైపు తిరిగి పడుకోవాలని చెబుతారు. పెద్దల మాటల్లో ఎంతో ఆరోగ్య సత్యం కూడా ఉంది. మానవునకు ఎడమ పార్శ్వమున జఠ రాగ్ని ఉంటుంది. తిన్న ఆహారము సరిగ్గా జీర్ణించటానికి ఎడమ వైపు తిరిగి పడు కోమని చెబితే వినరని, చాదస్తంగా కొట్టి పారేస్తారాని కుడివైపు తిరిగి నిద్రిస్తే పిశాచాలు అవహిస్తాయని చెబుతారు. అలాగే దాహమేసినప్పుడు తిన కూడదు. ఆకలేసినప్పుడు నీరు త్రాగరాదు. అట్లే నిద్రలేచినప్పుడు కుడివైపుకి తిరగిలేవండి. తల భాగము శరీరభాగం కంటే దిగువలో ఉంచుకుని నిద్రించరాదు.

## 540. ఈ ఏడుగురూ చిరంజీవులు

**జ.** అశ్వత్థామా, బలి చక్రవర్తీ, వ్యాసుడూ, హనుమంతుడూ, విభీషణుడూ, కృపాచా ర్యులూ, పరశురాముడూ ఈ ఏడుగురూ చిరంజీవులు. నిత్యం వీరిని స్మరించటం వల్ల ఆనందంగా వందేళ్ళు జీవిస్తారు. ఎనిమిదో వానిగా మార్కండేయుడ్ని స్మరిం చటం ద్వారా మృత్యుభయం వీడిపోతుంది.

## 541. కొత్తబట్టలకు నలువైపులా పసుపురాసి ఎందుకు ధరిస్తారు?

**జ.** ఈ ఆచారాన్ని మన పూర్వీకులు మన ఆరోగ్యంకోసం పెట్టారు. బట్టలను మగ్గా లపై నేస్తారు. నేసే ముందు నూలుకు పిండితో తయారయిన గంజి పెడతారు.

అలా గంజి పెట్టి నేయటం వల్ల అనేక రోగక్రిములు వస్త్రాల్లో చేరతాయి. అలాంటి వస్త్రాలను ధరిస్తే చర్మ సంబంధిత రోగా లొస్తాయి. అందుకే క్రిములను దూరం చేసే పసుపును నలువైపులా రాసి ఆపై ధరిం చమని చెపుతారు. పసుపు మంగళకరా నికి కూడా గుర్తు.

## 542. షోడశ మహా దానములన్న ఏవి?

**జ.** గోవు, భూమి, తిలలు, హిరణ్యము, రత్నము, విద్య, కన్య, దాసి, శయ్య, గృహము, అగ్రహారం, రథము, గజము, అశ్వము, మేక, మహిషము.

## 543. మనువు స్త్రీలలో ఏ ఏ లక్షణాలు ఉండాలో, ఉండ కూడదో చెప్పాడు. అవి ఏమిటి?

**జ.** వధువు మరీ పొడువుగానూ మరీ పొట్టిగానూ ఉండరాదు.

పెద్ద స్థనాలు ఉండకూడదు.

అన్నలూ, తమ్ములూ ఉండాలి.

వధువు తరుపు వారిచ్చిన కానుకలు వధువుకే చెందుతాయి. వివాహమాడిన భర్త నపుంసకుడైన సగోత్రికుడితో సంతానం

పొందటం తప్పు కాదు. పాప మంత కన్నా కాదు. భార్యకి ఇష్టం లేకుండా అనుభవించటము నేరమే. అతిగా అలంక రించుకోనిది అయి ఉండాలి. వెంట్రుకలు విరబోసుకుని తిరగరాదు. జడను గుండె లపైకి వేసుకోవటమూ, పమిటను పదే పదే సర్దుకోవటము చేయరాదు. స్త్రీ తల విరబోసుకొని తిరగటమంటే శోకానికి సంకేతము. భర్తమాటకు ఎదురు చెప్పే స్త్రీ, అతిగా ఆవేశపడే స్త్రీ తను సుఖపడక పోవటమే కాదు చుట్టూ ఉన్నవార్ని కూడా సుఖంగా ఉంచదు. స్త్రీకి కోపమూ, ఆవే శమూ, అసహనమూ, ఖచ్చితంగా నష్టాన్ని తెచ్చి పెడతాయి. స్త్రీకి తినేరాతుంటేనే మగవాడు సంపాదించగలడు. స్త్రీ పాపము పురుషుడ్ని వెంటాడుతుంది. అనుభవించే రాత పిల్లలకి మాత్రమే ఉంటే వారికి ఊహ వచ్చేవరకూ తల్లీ, తండ్రీ దరిద్రాన్ని అనుభవించాల్సిందే.

## 544. సప్తపది అనగా ఏంటి?

**జ.** వరుడు వధువుని ఏడు అడుగులు నడిపిస్తూ.... నన్నే సదా అనుసరించు, పరమేశ్వరుడు నీవు నాతో నడిచే అడు గుతో మనల్ని ఒకటిగా చేయాలి. ఇంకా అన్నాన్నీ, శక్తినీ, బుద్ధినీ, సుఖాన్నీ, పశు వృద్ధినీ, ఋతుసంపదనూ, ఋత్విక్ సంప దనూ కలగచేయాలి. ఇరువురమూ ధర్మ, మోక్ష, సుఖ కార్యాలను కలిసి చేద్దాము.

నేను సామవేదాన్ని, నీవు ఋగ్వే దానివి. వీర్యాన్ని ఉంచేవాడిని నేను. భరించే దానవు నీవు. వర్షపు నీటి చుక్కలు



నేల మీద పడి పరమ ఔషధులు మొలకెత్తి నట్టు నాకు సంతానం కలుగచేయి. అలా మనం సంతోషంగా అన్ని సుఖాలతో కలసి జీవిద్దాము అని అర్థం.

## 545. పెళ్ళిలో అల్లుడి కాళ్ళు మామగారెందుకు కడుగుతారు?

**జ.** 'ఓ పెండ్లి కుమారుడా పంచ భూతాల సాక్షిగా చిన్ననాటి నుంచి అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసిన నా పుత్రికను నా కన్యా మణిని, ధర్మ, అర్థ, కామ, మోక్షాలకై నీకు అర్పిస్తున్నాను. దానమిస్తున్నాను. ఈ దానంవల్ల నాకు బ్రహ్మ లోకప్రాప్తి కల గాలని అడుగుతున్నాను. 'ఓ వరుడా! నీవు ఈ సమయాన సాక్షాత్తు శ్రీమన్నా రాయణుడివి ... నా బిడ్డ లక్ష్మీదేవి. కాన అంతటి నీకు కాళ్ళు కడుగుతున్నాను' అని వధువు తండ్రి వరుని కాళ్ళు కడుగు



తాడు. అందుకే అంతా వారిపై అక్షింతలు వేసి, శ్రీలక్ష్మీనారాయణులుగా భావించి నమస్కరిస్తారు.

## 546. వీటివల్ల ఏ ప్రయోజనమూ లేదు... అవి ఏమిటి?

**జ.** బొట్టుపెట్టని నుదురూ, మంచి పనులకు ఉపయోగించని ధనమూ, తగు శిష్యుడు లేని గురువూ, న్యాయం దొరకని



దేశమూ, శక్తీ, యుక్తీగల మంత్రి లేని రాజూ, భర్తను గౌరవించని భార్యా, వివేకంలేని జ్ఞానమూ, మొద్దుబారిన కత్తీ, పాలు ఇవ్వని బర్రె... ఇవన్నీ ఉన్నా ఒకటే లేకపోయినా ఒక్కటే. ప్రయోజనము శూన్యము.

## 547. శివాలయంలో నంది కొమ్ముల మధ్య నుంచి దేవుడ్ని ఎందుకు చూస్తాము?

**జ.** నంది వేద ధర్మ స్వరూపము. నంది మనలోని పశుతత్త్వానికి నిదర్శనము. కొమ్ములు పట్టుకొని, వెనుక తోకవైపు చేయి పెట్టి కొమ్ముల మధ్య నుంచి స్వామిని చూస్తూ, 'స్వామి... నేను నా పశుతత్త్వాన్ని అదుపులో పెట్టుకుంటాను. అందరికీ మంచి చేస్తాను. న్యాయంగా ఉంటాను" అని విన్నవించి ఆపై చూడటమే పరమార్థం.

## 548. '108' సంఖ్యతో జపాన్నెందుకు చేస్తారు?

**జ.** 108 నరములతో 108 కేంద్రాలతో మానవుడి మెదడు ఉంది. అందుకనే 108 సార్లు 108 జపమాలతో ఓ మంత్రాన్ని జపించమని ధర్మశాస్త్రాలు శెలవిస్తున్నాయి. పగడాలతో జపిస్తే వేయింతల ఫలమూ, రత్నమాలతో జపిస్తే పదివేలరెట్లూ, దర్భ ముడి చేత నూరుకోట్ల రెట్లు, రుద్రాక్షాల ద్వారా అనంతమైన ఫలము లభిస్తుందని లింగపురాణము చెబుతోంది. వినపడే టట్టు, వినపడీ వినపడకుండా ఉండే టట్టు, మనసులో జపించటమూ ఇలా ఏ పద్ధతయినా ఉత్తమమే.

## 549. శ్రీమహాలక్ష్మీదేవి ఎక్కడ అస్సలుండదు?

**జ.** నిన్నటి బట్టలు ధరించినవారి దగ్గరా, రెండు సంధ్యకాలాల్లో నిద్రపోయే ఇంట్లో లక్ష్మి ఉండదు. ధనానికీ, ధాన్యానికీ, పుస్త కానికీ, పెద్దలకీ కాళ్ళు తగిలితే శ్రీమహా లక్ష్మి దేవికి కోపం వస్తుంది. అన్నింటికీ మించి స్త్రీలు కన్నీరు పెట్టుకునే చోట ఆమె

ఉండకపోవటమే కాదు, ఆ పరిసరాల్లో కూడా ఉండదు. స్త్రీ కంటి నుంచి కన్నీరు జారిందంటే లక్ష్మీదేవి అక్క జ్యేష్ఠదేవికి పిలుపు నిచ్చినట్టే.

## 550. పుట్టిన బిడ్డకి చెయ్యాల్సిన విధులు ఏమిటి?



**జ.** బిడ్డ పుట్టిన పదిహేను రోజుల్లో పేరు పెట్టాలి. నదుల పేర్లు, వృక్షముల పేర్లు పెట్టరాదు. నాలుగో నెలలో సూర్య దర్శ నము చేయించాలి. ఆరవనెలకు అన్నం తినిపించాలి. తొలి సంవత్సరము లేదా మూడవ సంవత్సరం వెంట్రుకలు తీయించి చెవులు కుట్టించాలి.

## 551. పూసలని ఏ వ్రేలుతో మార్చాలి?

**జ.** బొటన వ్రేలుతో పూసలను జరిపితే మోక్షప్రాప్తి. చూపుడు వ్రేలుతో పూసలని జరిపితే మీ శత్రువులు సర్వం నాశన మౌతారు. ఉంగరం వ్రేలును శాంతి కర్మ లప్పుడు వాడాలి. మధ్య వ్రేలుతో పూస లను జరిపితే లక్ష్మీప్రాప్తి. చిటికెన వ్రేలును మరణంలో వాడాలి.

## 552. ఇంటి ముందు తులసిని ఎందుకు పెంచి పూజిస్తారు?



**జ.** విష్ణువుకు ప్రియమైనది. ప్రీతికర మైనది. తులసికోట ఉన్న ఇంట్లోకి భూత, ప్రేత పిశాచాలురావు. తులసి గాలి సోకితే సూక్ష్మక్రిములు నశిస్తాయి. దేవ దానవుల క్షీరమధనంలో జన్మించిన వాటిల్లో కొన్ని భూలోకానికి వరాలుగా ఇచ్చారు. అలా భూలోకానికి వచ్చిన వాటిలో వేప, జమ్మి లతో పాటు తులసి కూడా ఉంది. తులసి ఉన్న చోట అమంగళం విన్పించదు.

## 553. ఏడ్చే మగవాడ్ని, నవ్వే ఆడదాన్ని నమ్మకూడదంటారు ఎందుకని?

**జ.** పురుషుడు బలవంతుడు. సమా జంలో తిరగటంవల్ల, అనేక మందితో పరిచయాలవల్ల ధైర్యం ఎక్కువగా ఉంటుంది. ఎంత కష్టం వచ్చినా చలిం చని మనస్తత్వము భగవంతుడిచ్చాడు.




పైగా ధైర్యం చెప్పాల్సినవాడు. భార్య వద్దా చుట్టూ వారి దగ్గర ధీరోదాత్తంగా ఉండా ల్సినవాడు. అలాంటి వాడు ఏడ్చాడంటే నమ్మరాదు. అలాంటివాడు మోసకారి అయి ఉంటాడు. స్వార్థంతో ఏదో ఎత్తు వేస్తున్నాడని భావించవచ్చు. లేదా అస మర్థుడైన అయి ఉండాలి. అదే స్త్రీ సున్నిత మనస్తత్వము కలిగి ఉంటుంది. చిన్న బాధకే, సమస్యకే తలక్రిందులవుతుంది. అలజడి చెందుతుంది. ఎంత ఆనందా న్నయినా బాధ అయినా చిరునవ్వుతో తెలి యచేసి పదిలంగా గుండెల్లో దాచుకుం టుంది. ఆ సృష్టి ధర్మాన్ని వదిలేసి అతిగా నవ్వుతూ మాట్లాడుతుందంటే, సరయినది కాదని అర్థం. ఆడది మాటిమాటికి కారణం లేకుండా నవ్వుతూ వుంటే ఆ ఇంటి మగవాడి పరువు నవ్వులపాలే.

## 554. సాలగ్రామములు మహాశక్తి మయములు

**జి.** రేఖలు, రేఖలుండే రంధ్రాలుగల సాలగ్రామములు ఈ కలియుగంలో గండకీ తీరంలో దాపాదర గుండం వద్ద లభిస్తాయిని శ్రీ దేవీ భాగవతం చెబు తోంది. సర్వ శాస్త్రాలూ, ధర్మాలూ శెల విచ్చిన ప్రకారం యజ్ఞయాగాదులు, మంత్ర పూజలకన్నా మహోన్నతమైనది సాలగ్రామపూజ. ఈ సాలగ్రామాలని కొనరాదు. సాలగ్రామములకి మించిన దానం మరేదీ లేదు. పూర్వం ఇంటికో సాల గ్రామము రక్షణగా పెట్టుకునేవారు. సాలగ్రామములు లభించేది ఖచ్చితంగా గండకీనదీ తీరంలోని ముక్తినాథ్ క్షేత్రం లోనే. తిరుమలలోనూ, శ్రీరంగంలోనూ, భద్రాది శ్రీరామునికి సాలగ్రామాలనే ధరింపచేసి పూజిస్తారు.

## 555. తిరుమలేశుని వైభవానికి వాస్తు కూడా తోడయ్యిందా?



**జ.** తిరుమలేశునికి తూర్పు ఎత్తు, ఆలయ ప్రాకారంలో రంగబావి, ప్రాకారానికి వెలుపల ఈశాన్యంలో నీరు ఇలాంటి వన్నీ వైభోగానికి కారణమని వాస్తు పండితులు చెబుతారు. ఈ వాస్తు విషయాలు మానవుల వాస్తు ప్రకారం వ్యతిరేకం.

## 556. ఉత్తరాయణం ఎందుకు పుణ్యకాలము?

**జ.** ప్రకృతి పాత ఆకులను వదిలేసి చిగురులు వేసి, కొమ్ములు పెంచి మానవులకు మధుర ఫలాలనిచ్చే సమయం ఉత్తరాయణం, ఉత్తరాయణంలో ఎక్కువగా జననాలు జరుగుతుంటాయి. ఆడపిల్లలు పుష్పవతులయ్యేది ఈ కాలంలోనే. స్త్రీ పురుషులలో శృంగార భావాలు రేకెత్తించే కాలమూ ఇదే. లయకారుడు పరమేశ్వరుడు నిద్రలేచే సమయము ఉత్తరాయణ కాలం. అంతటి పవిత్రమైనది కాబట్టే భీష్ముడు అంపశయ్య మీదుండి కూడా ఉత్తరాయణం వచ్చాక భగవంతుడిలో లీనమయ్యాడు.

## 557. భగవంతుని పుష్ప పూజను ఎలా చేయాలి?



**జ.** అయిదు వేళ్ళతో పూలు తీసుకొని స్వామిపై వేయరాదు. మధ్యవేలికీ, ఉంగరపు వేలికి మధ్యలోకి పూవులను తీసుకొని వేసి భక్తితో వినయంగా స్వామికి నమస్కరించాలి. ముందు రోజు ఉపయోగించిన పూలను స్వామి చెంతనుండి బొటన వేలితో, చూపుడు వేలితో తియ్యాలి.

## 558. ఉపవాస కాలము

**జ.** ఉపవాసమంటే ఏమీ తీసుకోక పోవటము. ఆఖరికి ఉమ్మి కూడా మింగక పోవటము. ఉపవాసమంటే, భగవంతుడ్ని సదా స్మరిస్తూ ఆయన ధ్యాసలోనే ఉండాల్సిన సమయం. ఉపవాసం వల్ల శరీరంలో మలినాలెన్నో పోతాయి. ఉపవాస మంటే భగవంతుడితో పాటు, మన శరీరాన్ని పూజించటము. పురాణశాస్త్రాల్లో పొరపాట్లు చేసినవారు ఉపవాసాలు చెయ్యాలని ఉంది. అలాగే ఉపవాసాలు బంధువులూ, స్నేహితులూ వంటివారు రాని రోజుల్లో చేయాలి.



## 559. గంగానది పరమ పవిత్రము

**జ.** గంగానది శ్రీమన్నారాయణుని పాదాలవద్ద జన్మించి, భగీరథుని వల్ల భూలోకానికివచ్చి మనల్ని తరింప చేసింది. గంగాదేవి విష్ణుపుత్రి, ఈశ్వర



పత్ని. గంగకు మరో పేరు సురనది. గంగ మూడు లోకాల్లోనూ అనగా దేవ లోకమూ, మానవలోకమూ, పాతళ లోకములోనూ ప్రవహిస్తుంది. గంగా జలం దివ్య ఔషధుల సమ్మేళన భరితం. గంగవల్లే కాశీకి అంత దివ్యశక్తి వచ్చిందని ప్రతీతి. సజీవనది గంగామతల్లి.

## 560. దేవీ పూజలో ఏ రోజు ఏ నైవేద్యం పెట్టాలి?

**జ.** ఆదివారము: పాయసము. సోమవారము: పాలు. మంగళవారము: అరటి పళ్ళు. బుధవారము: ఉదయాన్నే పెరుగును చిలికించి తీసిన వెన్న. గురు



వారము: కండపంచదార. శుక్రవారము: పంచదార. శనివారము: ఆవుపాలని నివేదించాలి.

## 561. తీర్థయాత్రా సమయంలో వేడి నీటి కుండాల్లో ఎక్కువ సేపు ఎందుకు స్నానం చేయరాదు?

**జ.** అత్యంత చలి ప్రదేశమైన కేదార్‌నాథ్, బదరీనాథ్ ప్రయాణంలో అనేక చోట్ల ఉష్ణ నీటి కుండాలు కానవస్తాయి. అంతచల్లని మంచు ప్రదేశంలో అంతటి వేడి నీరు కొండల్లోంచి రావటానికి కారణము గంధకము. గంధకము కొండలగుండా ప్రవహించటం వల్లే నీరు అంతటి వేడిగా ఉంటుంది. ఎంతోమంది వైద్య నిపుణులు పరిశోధనల్లో ఆ వేడి నీటి కుండాల్లో స్నానం చెయ్యటం మంచిది కాదని శాస్త్ర పరిశోధన చేసి మరీ చెప్పారు. కాన ఎక్కువ సేపు స్నానం చేయరాదు. అలాగే ఆ పవిత్ర అద్భుత పుణ్యక్షేత్రాల్లో స్వచ్ఛమైన నీరు పారుతుంటుంది. కాలుష్యానికి

అవకాశంలేని ప్రదేశమని ఆ నీరు తొంద రపడి త్రాగకండి. నీరు స్వచ్ఛమైనదే. ఎటువంటి కాలుష్యానికి అవకాశం ఉండదు.కానీ, మంచు కరిగిన నీరు కావచ్చు. లేదా అనేక విషశిలలూ, వృక్షాల నుంచి వచ్చిన నీరు కావచ్చు. ఏదైన త్రాగటం మంచిది కాదు.

## 562. ఆది గురు శంకరాచార్య

**జ.** జటిలో ముండీలుంచిత కేశః, కాషా



యంబర బహుకృతవేషః ప్రచ్ఛన్న పిచన పశ్యన్ మూఢో, ఉదరనిమిత్తం బహుకృత వేషః జడలు ధరించినా, లేక ముండనము (తల వెంట్రుకలు) చేయించినా, కాషాయ బట్టలు ధరించినా తెలుసు కోవలసిన జ్ఞానం తెలుసుకోనపుడు ఈ వేషాలన్నీ పొట్ట పోషణకు వేసే వేషాలు, వృధా.

## 563. దిష్టి బొమ్మ నుంచేదెందుకు?

**జ.** పంట పొలాల్లో కొత్తగా కట్టే గృహాల ముందు దిష్టి బొమ్మను ఉంచుతారు. నర దిష్టికి నాపరాయి కూడా పగులుతుంద నటంలో సత్యముంది. అందుకే ఎవ్వరు చూసినా చూపు ముందు దిష్టి బొమ్మ మీద పడుతుంది. తద్వారా నరదిష్టి తగల కుండా గృహాలని, పొలాలనీ ఇంకా దొంగల బారి నుంచి కాపాడుకోవచ్చు. పొలాల్లో అయితే రాత్రి దొంగలూ, పక్షులూ ఇత్యాది వన్నీ మనిషి కాపలాగా ఉన్నాడని భ్రాంతి చెంది పంట జోలికి రావనీ ఓ కారణము.

## 564. ఏ భోజనాన్ని తినకూడదు?

**జ.** ఆవు వాసన చూసిన ఆహారాన్నీ, వేశ్య వడ్డించు అన్నమూ, దొంగ లేదా వడ్డీ వ్యాపారుల భోజనమూ, లోభీ, నేర స్తుడూ, ఆడంబరాలను చెపుతూ వడ్డిం చిన వారి అన్నము తినరాదు. చద్ది అన్నమూ, దేవతలకి నైవేద్యం పెట్టని అన్నమూ, భర్త, పుత్రులూ లేనివారి చేతి భోజనమూ, నాట్యము చేయువాని అన్నమూ, నపుంస కుడూ, రంకులాడీ, వేటగాడూ ఇత్యాది వారి నుంచి భోజనం స్వీకరించకూడదని మన ధర్మశాస్త్ర సారాంశము.

## 565. ఈ సమస్త సృష్టి ఎలా అంతమవుతుంది?

**జ.** సృష్టి స్త్రీ పురుషులతో ప్రారంభమై అనంతమై భూమిని ఆక్రమించింది. భూమి పగలటమో, నిప్పుల వాన పడటమో జరిగి మహాప్రళయం ఉద్భవించి సర్వము నాశన మవ్వదు. దేశాలు దేశాలు తన్ను కోవటం ద్వారానో మానవజాతి తుడిచి పెట్టుకుపోదు. సృష్టి ప్రారంభం దగ్గరే

భగవంతుడు వినాశనాన్ని పెట్టాడు. ఇద్దరు కలిస్తే ఇంత పెద్దసృష్టి అయ్యింది. అంటే మగవాడు లేకపోతే భవిష్యత్తులో మగజాతి అంతరించిపోతుంది. స్త్రీలే ఉంటారు. సంతానం కలగదు కనుక అలా...అలా...సృష్టి సమాప్త మవుతుంది.

### 566. ఇంట్లో అరటి చెట్టు పెంచుతున్నారా?



**జ.** దక్షిణ దిక్కు అరటి చెట్టు పెంపకము వంశాన్నీ, పశ్చిమ దిశలో ధనాన్నీ పెంపొందిస్తుంది. ఇంటి ఆవరణ ఉత్తర దిశలో ధనహీనతా, ఇంటి ఆవరణ తూర్పు దిశలో గౌరవాన్నీ కలిగిస్తుంది. అరటి చెట్టు తూర్పున వెలిస్తే సకల శుభప్రదం. నైఋతి మూలన సంతానమూ, ఈశాన్యాన కీర్తీ కలుగుతాయి.

### 567. భర్తను భార్య పేరు పెట్టి పిలవచ్చా?

**జ.** ఏవండీ...మీరూ, తమరూ... ఇలా భార్య భర్తను సంభోదిస్తుండటం సహజం. కాని కొంత మంది వారి వారి పేర్లతో పిలుస్తుంటారు. అలా పిలవకూడదనుకుంటారు. మనం ఏం ఆచరించినా, ధర్మాలూ, పురాణాలూ, ఇతిహాసాల ప్రకారమే జీవనం సాగిస్తుంటాము. భర్త భార్యను తండ్రి వంశంతో కూడా సంభోదిస్తుంటాడు. ఉదాహరణకు శ్రీరామదు సీతను జనకరాజపుత్రీ అని కూడా పిలుస్తాడు. అలాగే భార్య కూడా పిలవచ్చు. సీతాదేవి శ్రీరాముడ్ని ఎన్నోసార్లు పేరు పెట్టి పిలిచింది. అది ఏకాంతంలోనే. భర్తను పేరు పెట్టి పిలవడం మన హిందు సంప్రదాయం కాదు. వినేవాళ్లకి ఆ భర్త మీద ఉండాల్సిన గౌరవము ఉండదు. అలాగే సాటి స్త్రీలలో కూడా ఆ స్త్రీ ఒకింత పలచనే అవుతుంది.

### 568. పదునెనిమిది రోజుల కురుక్షేత్ర యుద్ధంలో ఇరువురి ప్రముఖ వ్యూహాలు...

**జ.** **క్రౌంచారుణ వ్యూహం:** ధృష్టద్యుమ్నుడు క్రౌంచపక్షి ఆకారంలో సైన్యాన్ని నిలుపుతాడు.

**గరుడవ్యూహం:** మూడవ రోజున ఈ వ్యూహాన్ని భీష్ముడు నిర్మించాడు. దీనినే సువర్ణవ్యూహం అనికూడా అంటారు.

**శకట వ్యూహం:** పదకొండవ రోజున ఈ వ్యూహాన్ని నిర్మించారు. బండి ఆకారంలో ద్రోణాచార్యుడు సైన్యాన్ని నిలిపి కేంద్ర స్థానంలో ఉంటాడు.

**చక్రవ్యూహం:** పదమూడవ రోజు ఈ వ్యూహాన్ని నిర్మించారు. దీనిని పద్మ వ్యూహం అనికూడ అంటారు. ద్రోణాచార్యుడు ఈ వ్యూహాన్ని పన్ని అభిమన్యుడ్ని బలి తీసుకున్నాడు.

**మకర వ్యూహం:** ఐదవ రోజున భీష్ముడు ఈ వ్యూహాన్ని నిర్మిస్తాడు.

**బార్హస్పత్య వ్యూహం:** పదిహేడవ రోజున బృహస్పతి సహకారంతో కర్ణుడు ఈ వ్యూహాన్ని పన్నుతాడు.

**శృంగాటక వ్యూహం:** ఎనిమిదవ రోజు నిర్మించిన ఈ వ్యూహంలో త్రికోణా కారంలో సైన్యాన్ని నిలుపుతారు. ధృష్టద్యుమ్నుడు భీష్ముని వ్యూహానికి ప్రతిగా నిర్మిస్తాడు.

**శ్యేన వ్యూహం:** ఈ వ్యూహాన్ని ఐదవ రోజు నిర్మించాడు. దీనినే డేగ వ్యూహం అని కూడా అంటారు. భీష్ముడి మకర వ్యూహానికి ప్రతిగా ధృష్టద్యుమ్నుడు ఈ వ్యూహాన్ని నిలుపుతాడు.

**అర్ధచంద్ర వ్యూహం:** మూడవ రోజు భీష్ముడు పన్నిన గరుడ వ్యూహానికి ప్రతిగా ధృష్టద్యుమ్నుడు అర్ధచంద్ర వ్యూహాన్ని నిలుపుతాడు.

**మండల వ్యూహం:** ఏడవ రోజున నిర్మించిన ఈ వ్యూహంలో భీష్మాచార్యుడు కురుసేనను మండలా కారంలో నిలుపుతాడు.

**మండలార్ధ వ్యూహం:** ద్రోణుడు పన్నెండో రోజు కురుసేనను గరుడ వ్యూహంలో నిలుపగా ధర్మరాజు పాండవ సైన్యంతో మండలార్ధ వ్యూహాన్ని రచిస్తాడు.

**వజ్రవ్యూహం:** ఏడవ రోజున భీష్ముడు కురుసేనను మండల వ్యూహంతో నిలువరించగా ధర్మరాజు పాండవ సేనలను వజ్ర వ్యూహంతో నడిపిస్తాడు.

**సూచీ ముఖ వ్యూహం:** ఆరవ రోజు ధృష్టద్యుమ్నుడు పాండవసేనను మకర వ్యూహంతో నిలపగా దానికి ప్రతిగా భీష్ముడు క్రౌంచ వ్యూహంతో సైన్యాన్ని నడిపిస్తాడు. రెండు వ్యూహాలు భంగపడటంతో అభిమన్యుడు సూచీముఖ వ్యూహాన్ని పన్నుతాడు.

**వ్యాల వ్యూహం:** నాలుగవ రోజు భీష్ముడు కురుసేనను చుట్ట చుట్టుకున్న లేదా ముడి వేసుకున్న పాములా నిలుపుతాడు. ఈ వ్యూహం ద్వారా సకల సైన్యాల స్థంభనను అంచనా వెయ్యటం కష్టము.

**సర్వతోభద్ర వ్యూహం:** తొమ్మిదవ రోజు కురుసేనతో ఈ సర్వతోభద్ర వ్యూహాన్ని రచిస్తాడు భీష్ముడు.


**మహావ్యూహం:** రెండవ రోజు భీష్ముడు ఈ వ్యూహాన్ని అనేక విధాలుగా నిర్మించి అజేయుడై హడలు కొట్టించాడు.

**మహావ్యూహం:** ఎనిమిదో రోజు కూడా మహావ్యూహాన్ని నిర్మించాడు భీష్ముడు.

**మహావ్యూహం:** భీష్ముడు నిర్మించిన సర్వత్ భద్ర వ్యూహానికి ప్రతిగా ధృష్టద్యుమ్నుడు మహా వ్యూహాన్ని నిర్మిస్తాడు.

## 561. 'హనుమాన్ చాలీసా'ను తొలుత విన్నదెవ్వరు?


**జ.** శ్రీరామచరిత మానస్ వ్రాసిన శ్రీరామ



భక్తాగ్రగణ్యుడు తులసీదాస గోస్వామి. తులసీ దాసు శ్రీరామ చరితమానస్ గానంచేస్తే హనుమే స్వయంగా వచ్చే వాడు. ఎక్కడ శ్రీరామ సంకీర్తన జరిగిన ఆయా ప్రదేశాలకి హనుమ వేంచేస్తాడు. ఓసారి తులసీదాస్ శ్రీరామ చరిత మానస్ గానం చేశాక, అంతా వెళ్ళిపోయారు. ఒక్క వృద్ధమూర్తి తన్మయంతో అలాగే ఉండిపోగా, తులసీదాసు ఆయన పాదా లకి నమస్క రించాడు. ఆ వృద్ధ రూపంలో నున్న హనుమంతుడు తులసీదాసుకు తన దివ్య దర్శనాన్ని ఇచ్చాడు. తులసీ దాసు పరమానందభరితుడై నలభై పద్య ములతో కూడిన స్తోత్రాన్ని చెప్పాడు. అదే హను మాన్ చాలీసా. తొలుత విన్నది స్వయ ముగా హనుమంతుల వారే.

## 570. శివాలయంలో నందీశ్వరుని తోకను నిమిరేదెందుకు?

**జ.** శివాలయంలో నంది ఎద్దు జాతికి చెందినది కాదు. అయినా తోక నిమిరితే



ఎంతో ఆనందము. అలా నిమిరినప్పుడు నందీశ్వరుడు పరమానందభరితుడై పరమేశ్వరునికి నీ భక్తుడు నీ దర్శనానికి వచ్చాడని నివేదిస్తాడు. ఎద్దు ధర్మానికీ, గుర్రం శక్తికీ ప్రతీకలు. ధర్మానికి పురి కొల్పుతున్నాం అని చెప్పటం కూడా తోక నిమరటంలో భాగం.

## 571. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చెప్పినవి జరిగినవి

**జ.** చల్లకంటే కల్లునే గొప్పదిగా భావి స్తారు జనులు. వావీ వరుసలు మరిచి పోతారు. వర్ణవ్యవస్థ నాశనమవుతుంది. భర్తలను భార్యలు ఏలుతారు. రాజరికాలు నశిస్తాయి. ప్రజలే ప్రభువులవుతారు. తిరుపతి పెద్ద పట్నమవుతుంది. ఉత్తర దేశాన మహాత్ముడు జన్మించి సత్యం అహిం సలను బోధిస్తాడు. చీమకుర్తీ, బెజవాడ మహాపట్టణాలవుతాయి. ఉత్తములైనవారు అల్పులకు దాసితనము చేస్తారు. కాము కత్వము పెరుగుతుంది. భారతదేశాన్ని విదేశీయులు పాలిస్తారు. మాచర్ల రాజులు మదవతి కారణంగా సమస్తము సమసి పోదురు. కోటి విద్యలున్నా కూడులేక మాడిపోతారు. సర్వవస్తువులూ కల్తీ అవు తాయి. భర్తలను భార్యలూ, భార్యలను భర్తలు ధనంకోసం వేపుకుతింటారు. ముండ మోపులు ముత్తయిదువు లవుతారు. నీటిని కొనుగోలు చేస్తారు. ఎడ్లూ, దున్నపోతులూ లేకుండా బండ్లు నడుస్తాయి. మనుష్యులు పక్షుల్లా ఎగురుతారు.

## 572.మరణించిన వారి పేరు ముందు 'స్వర్గీయ' అని వ్రాసేదెందుకు?

**జ.** జన్మలో చేసిన పనులను బట్టి మర ణించిన జీవి స్వర్గ, నరకాలకి వెళతాడు. ఈ మానవ నిత్య జీవిత కర్మల్లో ఎవ్వరూ స్వర్గానికి పోయే అవకాశము లేదు. అలాగే చనిపోయిన వారి గూర్చి ఏ అశబ్దదోషం వాడిన మహాపాపం. అంతటి పాపం అంటకుండా ఉండేందుకు 'స్వర్గీయ' అని సంబోధిస్తారు.

## 573. అయిదో తనమంటే?



**జ.** ముత్తయిదవని అర్థం. స్త్రీ అయిదు అలం కరణలతో కళ కళ లాడుతుండాలి. పసుపు, కుంకుమ, గాజులు, మెట్టెలు, మాంగల్యము.

## 574. నవరసాలు అనగా?

**జ.** నవరసాల్లో తొలిది శృంగారము, ఆ తర్వాత వరుసగా హాస్యమూ, కరుణా, రౌద్రమూ, వీర్యమూ, భయానకమూ, బీభ త్సమూ, అద్భుతమూ, శాంతమూ... ఇవే నవరసాలు.

## 575. నిద్రపోయేటప్పుడు కలవరింత ఎలా కలుగుతుంది?

**జ.** ఎక్కువగా కలలుకనే సమయంలో మనం స్థూల శరీరాన్ని వదిలి ఇంద్రియ బుద్ధులతో కూడిన సూక్ష్మ శరీరంలో ఉంటాము. అప్పుడు కలిగే దీర్ఘ తీవ్రకలల వల్ల సంపూర్ణంగా లీనమై నోటికి తాకిడి వచ్చి మాట్లాడతాము. ఆ సమయంలో మాట్లాడిన మాటలే కలవరింతలు. మన మనోనిశ్చయాలూ, భయాలూ, కోరికలూ ఇత్యాది వాటికి ఇష్టానుసారంగా నోటిని కదల్చటమే కలవరింత.

## 576. చతుర్దశ విద్యలు అనగా?

**జ.** ఋగ్వేదము, యజుర్వేదమూ, సామ వేదమూ, అథర్వణ వేదమూ, శిక్ష, వ్యాక రణమూ, ఛందస్సు, నిరుక్తము, జ్యోతి ష్యము, కల్పము, మీమాంస, న్యాయ, పురాణ ధర్మ మహాశాస్త్రములు.

## 577. అన్ని దానముల కన్నా విద్యాదానం గొప్పదా?

**జ.** అన్నదానము గొప్పదంటారు. మనువు విద్యాదానము మహోన్నతమైన ఫలమని తెలియచెప్పాడు. నీరూ, అన్నమూ, గోవులూ, భూమీ, వస్త్రములూ, బంగారమూ దిన సరి భత్యములూ వీటన్నింటి కన్నా విద్యా దానము గొప్పది. వస్తువులూ ధనమూ లాంటివి దానంగా ఇస్తే వారికే ఉపయోగ పడతాయి. అదే విద్యాదానం చేస్తే వారికీ, వారి కుటుంబమంతకీ ఉపయోగ పడు తుంది. చేపలకూరతో అన్నం పెట్టడం కన్నా మంచిపని చేపలు పట్టడం నేర్పించటము.

## 578. గర్భం పెద్దగా ఉంటే ఆడశిశువా?

**జ.** అవుననే చెబుతుంది శాస్త్రం. లింగ నిర్ధారణ లేని కాలంలో స్త్రీ గర్భాన్ని బట్టి ఆడా, మగా అనేది చెప్పేవారు. ఆడ శిశువు



గర్భంలో ఉంటే గర్భం పెద్దగా ఉంటుంది. దానికి కారణం శిశువు చుట్టూ ద్రవం ఎక్కువగా ఉంటుంది. అదే మగ శిశువు అయితే ద్రవం తక్కువగా ఉంటుంది. ఈ కారణంగా ఆడా, మగా అనేది చెప్పేవారు ఆరోజుల్లో.

## 579. అమావాస్య పౌర్ణమిరోజుల్లో ప్రయాణం చేయకూడదని ఎందు కంటారు?

**జ.** చంద్రుని పూర్ణత్వమూ అసంపూర్ణత్వ ముల వల్ల ఆ రోజుల్లో శరీరంలో కొంత శక్తి తగ్గుతుంది. అనారోగ్యం వున్న వారి కయితే మరీ ఎక్కువ నీరసంగా ఉంటుంది. దానివల్ల వెళ్లే కార్యం సమర్థవంతంగా చెయ్యలేకపోవచ్చు. అందుకనే ప్రయాణం చేయరాదనేది. అమా వాస్య పౌర్ణములలో చెట్లు ఎక్కొద్దనేది ఇందుకే. శరీరంలో శక్తి నశించటం ద్వారా చెట్టుపై నుంచి పడే ప్రమాదం ఉంది.

## 580. పంచాంగ శ్రవణ ఫలము

**జ.** సకల మంగళకరమైన శబ్దము. శత్రు వులను దూరం చేస్తుంది. దుస్వప్న దోషా లనూ హరిస్తుంది. పరమ పవిత్రమైన గంగా నదిలో స్నానము చేసిన పుణ్యాన్ని ఇస్తుంది. అన్ని దానములలోకెల్లా ఉత్తమ మైన వాటిలోని గోదాన ఫలాన్ని ఇస్తుంది. యజ్ఞములు చేసిన ఫలమును ఇస్తుంది. సకల శుభాలకి శాస్త్ర బద్ధమైనది పంచాంగ శ్రవణము.

## 581. వాస్తు శాస్త్రంలో ఇవన్నీ ఉన్నాయి!

**జ.** పునాది ఇంటికి ఈశాన్యం వైపు వేయాలి. పునాదులు త్రవ్వే ముందు నాగుపాము కనిపిస్తే శుభం కాదు. ఇంటి స్థలము దక్షిణ పడమర ఎత్తుగా ఉత్తరం, తూర్పు దిక్కులు పల్లంగా ఉంటే స్థల యజమానికి కుటుంబ సభ్యులకీ తరతరాలకీ కావా ల్సిన ధనం సమకూరుతుంది. కొత్త పొయ్యి కర్కాటక లగ్నంలో నిర్మించ కూడదు. అలాగే పొయ్యిలు చెడు దినంలో, శుభ కార్యాలు మంచి రోజుల్లో చెయ్యాలి. శివ, విష్ణు, అమ్మవారి దేవాలయాలకు తగుదూరంలో ఇల్లు నిర్మించుకోవాలి.

గృహంలో దేవుడిని తూర్పు తిరిగి పూజ చేయాలి. ఉత్తరం తిరిగి చేయరాదు. అలాగే పడమరలో దేవుడ్ని ఉంచితే పడ మర వైపు తిరిగి పూజ చేయాలి.

### 582. ఎలాంటి స్త్రీని వివాహమాడ కూడదు.

**జ.** కంటి గుడ్లు ఎత్తుగా ఉండటమూ, రోమాలు శరీరం మీద ఉండటమూ, తొడలు సన్నగ ఉండటమూ, స్తనద్వయం ఎత్తుగా లేక పోవటమూ, నుదురు ఎత్తుగా, లావుగా ఉండటము, వయస్సులోనూ శరీర ప్రమాణంలోనూ వరునితో సమంగా ఉన్న కన్యను వివాహం చేసుకుంటే దోషం.

### 583. వాడి పెళ్ళాం తాడు గట్టిదని అంటారు.... ఎందుకు?

**జ.** వివాహ సమయంలో పెండ్లికొడుకు పెళ్ళికూతురి మెడలో ఈ మంత్రం చదువుతూ ప్రేమగా, పెద్దలందరి సమక్షంలో తాళికడతాడు.

**మాంగల్యం తంతునా నేన మమజీవన హేతునా।**
**కంఠే బధ్నామి, సుభగే త్వంజీవ శరదాం శతమ్॥**

అనే వేద మంత్రాల మధ్య మూడు ముళ్ళు వేస్తాడు. ఆ మంత్రానికి అర్థం... ఓ అదృష్టవంతురాలా నేను నీతో చిర కాలం జీవించుటకు ఈ పవిత్రమైన మంగళ సూత్రాన్ని నీ కంఠమందు బంధిస్తున్నాను. నీవు సుమంగళిగా నూరు సంవత్సరాలపైన జీవించు అని...

మంగళసూత్ర శక్తి ఏపాటిదో పార్వతికి సంపూర్ణంగా తెలుసు. అందుకే అమృతం



కోసం సముద్రాన్ని మధించే సమయంలో వచ్చిన కాలకూట విషాన్ని శివుడ్ని మ్రింగ మని పార్వతే స్వయంగా చెప్పింది. ఖరుడు కూడా ఆ భయంకర కాలకూట విషానికి బలి కావల్సింది. కాని పార్వతి దేవి మంగళసూత్ర మహిమతో బ్రతికాడు.

### 584. దేవాలయపు వెనుక భాగాన్ని ఎందుకు తాకరాదు?


**జ.** చాలా మంది ప్రదక్షిణలు చేస్తున్నప్పుడు దేవాలయం వెనుక భాగాన్ని అద్ది నమస్కరిస్తుంటారు. అలా చేయరాదు. ఆ భాగంలో రాక్షసులుంటారు. అలాగే ఆలయానికి గజందూరం నుంచి ప్రదక్షిణ చేయాలి.

### 585. శుక్ర, మంగళ వారాల్లో కొందరు డబ్బెందుకు ఇవ్వరు?

**జ.** మంగళ, శుక్రవారం లక్ష్మీదేవి ప్రతి రూపమని మహిళలు నమ్ముతారు. అందు వల్లే ఆ రోజు ఎవ్వరికీ డబ్బు ఇవ్వరు. అలా చేస్తే ఆడపిల్లను శుక్రవారం పంపినట్టేనని భావిస్తారు. పుట్టింటికి వచ్చిన ఆడపిల్లను కూడా మంగళ, శుక్రవారాలు అత్తవారింటికి పంపరు.

## 586. ఇటుకతో గోడలు కట్టగానే సున్నపు బొట్లు పెట్టి 'శ్రీరామ' అని ఎందుకు రాస్తారు?

**జ.** కొత్తగోడలు లేపగానే సున్నంతో పెద్ద పెద్ద బొట్లు పెట్టి పెద్దగా శ్రీరామ అని వ్రాస్తారు. దానికి కారణం కొత్త గోడల్లో పురుగూ, పుట్రా ఉంటే ఆ సున్నం ఘాటుకి అవి నశించి భవిష్యత్తులో గోడకు ఎలాంటి బీటలూ, పగుళ్ళూ లేకుండా పటిష్టంగా ఉంటాయని.




## 587. ఏ స్త్రీఎన్ని వరాలు కోరుకోవాలి?

**జ.** బ్రాహ్మణ స్త్రీ మూడు వరాలూ, క్షత్రియ స్త్రీ రెండు వరాలూ, వైశ్య స్త్రీ రెండు వరాలూ, శూద్ర స్త్రీ మూడు వరాలు అడగాలి. మహాభారత గాథలో ద్రౌపది ధృతరాష్ట్రుడ్ని రెండు వరాలే అడుగుతుంది. మూడో వరం కోరుకోమన్నా కోరుకోదు. ధృతరాష్ట్రుడే ద్రౌపది ధర్మనియమాలకి మెచ్చి మూడో వరం ఇస్తాడు.

## 588. శుభ శకునములు

**జ.** నెరజాణా, శవమూ, చేపలూ, అగ్నీ, శూద్రుడూ, మాంసమూ, నలుగురు వైశ్యులూ, ఇద్దరు ముత్తైదువులూ, ఈ శకునాలన్నీ శుభములే. బిందెతో నీరు తెస్తున్న స్త్రీ, ఇద్దరు బ్రాహ్మణులూ, స్త్రీ, కోడి, పాలపిట్ట ఇవన్నీ ఎడమవైపు నుంచి వస్తే మంచిది.

## 589. పుణ్యం పోగొట్టేవి ఏవి?

**జ.** గొర్రెల మందల మధ్యలో వెళ్ళటమూ, భార్యాభర్తల మధ్యా, గురుశిష్యుల మధ్యా, ఇద్దరు బ్రాహ్మణుల మధ్యా, మహర్షుల మధ్యా, శివాలయంలో నంది, పరమేశ్వరుల మధ్యా వెళితే పుణ్యం సంగతి సరే సరి.... పాపంతో పాటు చేసిన పుణ్యమూ కరిగిపోతుంది.

## 590. ఇంటి ఆవరణలో జన్మ నక్షత్ర రీత్యా ఏ వృక్షాలు పెంచాలి?

**జ.** అశ్వినీ నక్షత్రం వారు ముష్టి, భరణీ వారు ఉసిరికా, కృత్తికవారు అత్తీ, రోహిణీ వారు నేరేడూ, మృగశిర వారు చంద్రా, ఆరుద్రవారు వనచంద్రా, పునర్వసు వారు వెదురూ, పుష్యమీ వారు రావీ, ఆశ్లేష వారు నాగకేసరమూ, మఖ వారు మర్రీ, పుబ్బ వారు మోదుగా, ఉత్తర వారు జువ్వీ, హస్తవారు ములు వేమూ, అనురాధ వారు

పొగడా, జ్యేష్ఠ నీర్ధు, మూల వారు వేగీ, పూర్వాషాఢ వారు పనసా, ఉత్తరాషాఢ వారు కూడా పనసా, శ్రవణంవారు జిల్లేడూ, ధనిష్ఠవారు కూడా పనసా, శ్రవణంవారు జిల్లేడూ, శతభిషం వారు గానుగా, పూర్వాభాద్ర వారు ఉత్తరాభాద్ర వారు వేపా, రేవతి వారు ఇప్ప పెంచుట శుభం. ఆయా నక్షత్రాల వారికి అవి మిత్ర వృక్షాలు.

## 581. అష్టదిక్పాలకులు ఎవరు?

**జ.** ఇంద్రోవహ్నిః పితృపతిః నైరృతో వరుణోమరుత్,

కుబేర ఈశఃపతయః పూర్వాదీనాం దిశాంక్రమాత్.


ఇంద్రుడు (తూర్పు), అగ్ని (ఆగ్నేయం) యముడు (దక్షిణం), నిరృతి (నైఋతి), వరుణుడు (పశ్చిమం), వాయువు (వాయువ్యం), కుబేరుడు (ఉత్తరం), ఈశానుడు (ఈశాన్యం) మొదలైన దిక్కులనును పాలించేవారే అష్టదిక్పాలకులు.

## 582. చిరిగిన ఆకులో భోజనము చేయవచ్చా?

**జ.** బంతిలో ఆకులు వేసేటప్పుడు కొన్ని చీలినవి వస్తాయి. అట్టి ఆకులో భోజనం చెయ్యటంవల్ల ఆకు క్రింద మలినం అన్నంలో కలిసి అనారోగ్యము ఏర్పడు తుంది. అలాగే అనేక చోట్ల తిరిగి తిరిగి వచ్చి ఆ వస్త్రాలతోనే భోజనం చేయ రాదు. ముఖమూ, చేతులూ కడుక్కొని ప్రశాంతంగా మౌనంగా భోజనం చేయాలి.

## 583. శంఖములో పోస్తేనే తీర్థమా?

**జ.** శంఖాల్లో దక్షిణావర్త శంఖము శ్రేష్ఠ మైనది. శంఖము లక్ష్మీ స్వరూపము. శంఖము కాల్షియంకు సంబంధించినది,



దాని ద్వారా తీర్థమును పుచ్చుకుంటే అనేక వ్యాధులు మటుమాయం అవుతాయి. అలాగే భగవంతునికి తీర్థ పూజ చేయు టకూ, అభిషేకించుటకు లక్ష్మికే అధి కారం. కాన శంఖం ద్వారానే తీర్థమూ, అభిషేకమూ చేస్తారు.

## 584. సాలగ్రామం ఖరీదుకు దొరికే వస్తువా?

**జ.** సాలగ్రామం అందరూ అనుకుంటు న్నట్లుగా ఖరీదుకు లభ్యమయ్యే ఏదో సాధారణ వస్తువు కాదు. సాక్షాత్ భగవత్ స్వరూపం. చాలా చిత్రంగా కొందరికి మాత్రమే ... భక్తిభావం గలవారినే చేరు తుంది. ఉత్తరాది ప్రాంతాల్ని సందర్శిం చినపుడు –నర్మదానదీ తీరాన గాని లేదా సాధువుల వద్దనో దీన్ని పొందవచ్చునను కుంటారు చాలామంది. కానీ అది సరి కాదు. అది వారి అజ్ఞానమే అవుతుంది. ఈ విష్ణుస్వరూపం ఎవరివద్దకు వెళ్ళి చేరాలనుకుంటే, వారినే అలరిస్తుంది.

దీనిక్కారణం సాలగ్రామం ఉన్న ఇంట మడీ-తడీ, నియమం-నిష్ఠా, సదాచార పరాయణతా-శుచి శుభ్రతలుండాలి.

నిత్యపూజ జరగాలి. పర్వదినాలలో విశేషపూజ ఉండాలి. అది అందరికీ సాధ్యమా? అటువంటి శక్తి గలవారినే, సాలగ్రామం చేరుతుంది. ఒకప్పుడు ఇది సిద్ధుల/యోగుల వల్ల యోగ్యులైన వారికి చేరేది. నేటి వ్యాపార ప్రపంచంలో అక్కడ క్కడ ఖరీదుకు దొరుకుతున్నట్లుగా కనిపిం చినా వాటిలో స్థూలదృష్టికి అందని సూక్ష్మలోపాలుంటాయి. అవి కేవలం సిద్ధ పురుషులే గ్రహించగలరు. తెలిసీ - తెలి యక లోపభూయిష్టమైన సాలగ్రామ పూజ చేస్తే, అది కర్తకే చెరుపు చేస్తుంది. కనుక తగినంత పరిజ్ఞానం లేకుండా ఎవరు ఏది చెప్పి ఇస్తే దాన్నే సాలగ్రామంగా నిర్ధారించుకొని పూజ చేయకండి.

## 5౭5. జపాన్ని ఎలా చేయాలి?

**జ.** జపమాలలో 108 పూజలుంటాయి. మాలలో లావు పూజ 'మేరువు'. ఈ లావు



పూజ జప సంఖ్యని కొలవటానికి సంకేత కంగా పెట్టుకుంటారు. మాలను బొటన వ్రేలికి నడుమ వ్రేలికి మధ్య నిలిపి వక్కో పూసనూ ఒక్కొక్క జపానికి దాటవేస్తూ జపించాలి. చూపుడు వ్రేలును వాడరాదు. చూపుడు వ్రేలు ఆకర్షణ శక్తిగలది. అందుకే జపాల్లో ఉపయోగించరు.

## 5౭6. ముగ్గుని ఎలా వేసుకోవాలి?

**జ.** ఉదయం పూట వీధిలో నుంచి మీ ఇంటిలోకి, సాయంత్రం పూట ఇంట్లో నుంచి వీధిలోకి ముగ్గులెయ్యాలి. కళ్ళాపి చల్లి ముగ్గు వెయ్యటం లక్ష్మీప్రదం.

## 5౭7. నిద్రిస్తున్నప్పుడు దుప్పటిని పూర్తిగా ఎందుకు కప్పకోకూడదు.

**జ.** మనం ప్రాణవాయువుని పీల్చి బ్రతు కుతున్నాము. దుప్పటి పూర్తిగా కప్పుకునే అలవాటు ఎక్కువగా పిల్లల్లోనే ఉంటుంది. దాని వల్ల ఎక్కువసార్లు ప్రాణవాయువు అందక అనారోగ్యాలు, ఒక్కోసారి ఘోర ప్రమాదం సంభవించవచ్చు. అందుకే అలా పడుకోకూడదు. చిన్నపిల్లలు అలా పడుకుంటే వెంటనే సరి చేయటం కాకుండా పిల్లలకి అర్థం అయ్యేలా వివరించండి.


## 5౭8. ఏ రోజు తలస్నానం చేస్తే ఏ ఫలము కలుగుతుంది?

**జ.** ఆదివారం తలంటు పోసుకుంటే తాపం పోతుంది. సోమవారం చేస్తే అందం పెరుగుతుంది. మంగళవారం

అమంగళము. బుధవారం చేస్తే వ్యాపార, వ్యవహార అభివృద్ధి. గురువారం ధన నాశనము. శుక్రవారం అనుకోని ఆపదలు కలుగుతాయి. శనివారం మహాభోగములు కలిసి వస్తాయి. ఈ స్నానం విధి పురుషులకే.

## 599. అవసానదశలో తులసి తీర్థమెందుకు పోస్తారు?

**జ.** తులసి మహోన్నతమైన పవిత్రతతో పాటు అనేక వందల అనారోగ్యాలను మటు మాయం చేస్తుంది. తులసికి దోషం లేదు. ఈ తులసిని అమావాస్య, అష్టమి, ద్వాదశి, మంగళ, శుక్రవారములందు కోయరాదు. తలపై ధరించరాదు. విష్ణుపాదాల చెంత ఉండాల్సిన ఈ తులసిలో ఎంతో శక్తి ఉంది కాన అవసాన దశలో తులసి తీర్థం పోస్తారు. తద్వారా జీవి శరీరంలో వేడి రగల్చి, శరీరం చల్లబడకుండా చేసి మరింత కాలం బ్రతికే అవకాశం ఎక్కువగా వుంది. అందుకే తులసి తీర్థం పోస్తారు.




## 600. మడి బట్టలతో పూజ, వంటెందుకు చేస్తారు?

**జ.** భగవంతునికి శుచీ, శుభ్రత అంటే ఎంతోఇష్టం. నీ ఇష్టాన్ని గౌరవించి, నిన్ను పూజిస్తున్నాము అని భావన. మడి మీద పూజ చేస్తూ 'స్వామి... అన్యులెవ్వరినీ తాకకుండా నీ కోసమే భక్తితో ఈ మడి ధరించాను. వస్త్రం ఆరే వరకూ నీసేవే, మడి వస్త్రంతో చేసే పూజ పరమార్థం అదే. అలాగే వంటగదిలో మాసిన బట్టలతోనూ, రాత్రి ధరించిన బట్టలతోనూ వంట చేయటం ద్వారా అనేక క్రిములు వంటలోకి వెళ్ళవచ్చు. భక్తీ, శుభ్రతతో పాటు మడిబట్ట ధరిం చటం వల్ల శరీరంలోని వేడి బైటికి పోదు.

## 601. ఏ దేవుడ్ని దర్శించేటప్పుడు ఏ రంగు దుస్తులు ధరించాలి?

**జ.** సరస్వతీ దేవినీ, శ్రీమహాలక్ష్మీనీ, మహేశ్వరుడ్ని దర్శించటానికి వెళ్ళేట ప్పుడు తెల్లని దుస్తులు ధరించాలి. పార్వతీ దేవినీ, ఆమె పుత్రుడైన వినాయకుడ్ని దర్శించటానికి వెళ్ళేటప్పుడు ఎరుపు బట్టలు ధరించాలి.

## 602. రంగులూ, వారాలకి సంబంధముందా?

**జ.** ఎరుపు ఉత్తేజకారిణి, నారింజ దేహం లోని శక్తిని కదల్చగలదు. పసుపు ఆధ్యా త్మిక జ్యోతి. ఇక ఆకుపచ్చ ఆందోళననూ, నీలిరంగు భౌతిక సౌఖ్యాన్నీ, గులాబి రంగు ప్రేమనూ, ఆప్యాయతనూ, బూడిద రంగు సంతృప్తినీ, వంకాయ రంగు

కామాన్నీ వృద్ధిచేస్తుంది. అలాగే ఏ వారం ఏ రంగు తగినదంటే... ఆదివారం నారింజా, సోమవారం తెలుపూ, మంగళవారము ఎరుపూ, బుధవారము ఆకుపచ్చా, గురు వారం పసుపూ, శుక్రవారం బూడిదా లేదా వంకాయ రంగూ, శనివారం నలుపూ అంటే ఆయా గ్రహాలకు ప్రీతి.

## 603. ఏవరికి ఎంత నిద్రా సమయం కావాలి?

**జ.** ఎవ్వరికైనా ఎనిమిది గంటలు నిద్ర తప్పనిసరి. పసి పిల్లలకు పన్నెండు నుంచి పధ్నాలుగు గంటలు. వృద్ధులకు పది గంటలు. గర్భిణీ స్త్రీలకూ, పాలిచ్చే తల్లు లకూ వీలయినంత ఎక్కువ నిద్ర అవ సరం. నిద్ర ఆయుష్షునీ, శక్తినీ పెంచు తుంది. పగటి నిద్ర కేవలం ఎండా కాలం లోనే చేయాలి. రాత్రి తగ్గిన నిద్రలో సగ భాగమే పగలు నిద్రపోవాలి. యాభై దాటిన వారు మధ్యాహ్నం నిద్ర ఓ అరగంట చేస్తే చాలా మంచిది.

## 604. తల్లో నాలుకలా ఉండటమంటే?

**జ.** నోట్లో నాలుకలా అని కూడా అంటారు. నాలుక మెత్తనిది. సుతిమెత్తనైనది. అయినా రాక్షసుల్లాంటి ముప్పైరెండు పళ్ళ మధ్య ఎంతో చాకచక్యంగా వాటిని నిము రుతూ, తాకుతూ కదిలిస్తూ తన పని తాను చేసుకుపోతుంటుంది. ఎప్పుడూ వాటి నుంచి ఎలాంటి ఇబ్బందిని ఎదుర్కో కుండా సాగిపోతుంటుంది. అలా తల్లో నాలుకలా ఉంటాలని పరమార్థం.

## 605. తిరుపతి లడ్డుకు అంత మధురం ఎలా వస్తుంది?

**జ.** ఎంతమంది చేసినా, ఎక్కడ చేసినా, లడ్డు రుచిచూసి ఇది తిరుపతి లడ్డు ప్రసాదం




కాదనీ, అదే ప్రసాదమయితే ఇది స్వామి దివ్యమధుర ప్రసాదమని చెప్పగలము. ఆ రుచి రావటానికి కారణం స్వామికి నైవేద్యం పెట్టడం ప్రథమ కారణ మయితే ఆలయంలో నున్న బంగారం బావి నీటితో లడ్డూ, మిగతా నైవేద్యాలను తయారు చేస్తారు. తిరుపతిలో ఎన్నో అద్భుత వన మూలికలున్నాయి. బంగారు బావినీటితో చెయ్యటంవల్ల ఆ రుచి వస్తుందంటారు.

## 606. భగవద్గీతను 12వ అధ్యాయము నుంచి ఎందుకు చదవమంటారు దేనికి?

**జ.** భగవద్గీతలో తొలి అధ్యాయము దుః ఖానికి సంబంధించిన అనేక విషయా లతో ఉంటుంది. అదే పన్నెండవ అధ్యా యంతో ప్రారంభించటం ద్వారా ఆ అధ్యా యంలో అమృతమైన వాక్కులను ఆక ళింపు చేసుకొని, ఆపై ఎలాంటి దుఃఖ హేతు సంబంధితమైనవి చదివినా మనో వికారము కలగదని అలా చదవమంటారు.

## 607. గర్భిణీ స్త్రీలు గ్రహణం చూడకూడదా?

**జ.** వాళ్ళేకాదు ఎవరూ చూడకూడదు. స్త్రీ గర్భంలోని శిశువు ఎంతో సున్నితంగా ఉంటాడు. ఏ చిన్న మార్పు అయినా ప్రభావం వెంటనే స్త్రీ శరీరం ద్వారా శిశువులోకి ప్రవే శిస్తుంది. (గ్రహణ సమయంలో రాహు కేతువులతో, సూర్యచంద్రుల కాంతులు మిళిత మయి అనేక విషకిరణాలు ఉద్భవిస్తాయి) అవి చాలావరకూ మానవ శరీర నిర్మాణా నికి ఇబ్బందులను కలిగించేవి. అందుకనే గ్రహణం అవ్వగానే స్నానం చెయ్యమనేది.




## 608. ఆత్మహత్యకు ఆ లోకంలో ఈలోకంలో శిక్ష ఏమిటి?

**జ.** జీవుడు ఆత్మహత్య చేసుకొన్నచో చీమూ, నెత్తురూ నిండిన అంధకామిస్ర మను మహానరకంలో అరవై ఏండ్లు ఉండాలి. ఆత్మహత్య చేసుకున్న వారికి అశౌచనముండదు. అట్టివారికి తర్పణము లిచ్చినా ఫలం కలగదు. అగ్ని సంస్కా రము చేయరాదు. దుఃఖించరాదు. మరు జన్మలో అల్ప ఆయుష్షులవుతారు.

## 609. పిలుపులు

**జ.** ఘంటానాదము దేవతలకి పిలుపు
శంఖారావము విజయానికి పిలుపు
ధనుష్టంకారము సమరానికి సిద్ధం
బిందెలు మ్రోగిస్తే భూతప్రేతాలకి ఆహ్వానము

## 610. ఏ రంగు ఏ ప్రభావాన్ని చూపిస్తుంది?


**జ.** ఎరుపు ఉత్తేజాన్నీ, చురుకుదనాన్నీ, పసుపు పచ్చ ఆధ్యాత్మిక జ్ఞానాన్నీ, నారింజ రంగు శక్తినీ కలుగచేస్తాయి. నీలిరంగు అశుభాన్ని కలిగిస్తుంది. కాన మరో రంగుతో కలిపి వాడాలి. ఆకుపచ్చ ఉల్లా సాన్ని కలిగిస్తుంది. బూడిదరంగు జ్ఞానాన్నీ, ఆలోచననూ... గులాబీరంగు కోరికలనూ పెంచుతుంది. నలుపు బాధలనూ, శోకాన్నీ కలిగిస్తుంది. వంకాయరంగు ఇష్టమంటే ధనంపై అత్యంత మమకారాన్ని కలిగి ఉన్నట్లే. తెలుపు స్వచ్ఛతను, ప్రశాంతతను ఇస్తుంది.

## 611. కాశిలో పోవాలని ఎందుకు కోరుకుంటారు?

**జ.** కొంతమంది ఆ కోరికతో కాశి వెళ్ళి అక్కడే కాలం గడుపుతుంటారు. అవసాన దశలో వచ్చే మరణం కోసం వేచి వుంటారు. కాశిలో ప్రతిక్షణమూ ఉత్తరాయణమే. ఈ ఉత్తరాయణం కోసమే (సూర్యుడు మకర రాశిలో ప్రవేశించినప్పట్నించి మిధున రాశిలో ఉన్నంత కాలం) భీష్ముడు అంప శయ్య మీదుండి వేచి చూసింది. ఈ ఉత్త రాయణంలోనే దేవాలయమూ, బావీ ప్రతిష్టలు చేస్తారు.

## 612. నేలమీద ఏమి లేకుండా ఎందుకు కూర్చోకూడ దంటారు?

జ. కనీసం చిన్న గుడ్డముక్కయినా వేసు కుని కూర్చోవాలి. ఋషులు తపస్సు సమ యంలోనూ, హోమాది సమయాల్లోనూ నేలపై ఆశీనులవ్వరు. మానవుని శరీరంలో విద్యుత్ ఉంటుంది. అదే మనల్ని నడి పిస్తుంది. భూమికి ఆకర్షణ శక్తి ఎక్కువ. శరీరంలోని విద్యుత్‌ను లాక్కుంటుంది. దానితో శరీరంలో శక్తీ, యుక్తీ సన్న గిల్లు తాయి. అందుకనే కటిక నేల మీద కూర్చొని భోజనంగానీ, నిద్రగానీ, పూజ గానీ ఏదీ చేయరాదు.



## 613. అసత్య దోషమెంతో తెలుసా?

జ. సత్యం నూరు అశ్వమేధాలంత గొప్పది. అసత్య దోషానికి ఋషులు, మహర్షులు కూడా భయకంపితులవుతారు. పురాణాల్లో మహాపతివ్రతలు సహితం భర్త మాటనైన జవదాటుతారుగానీ, అసత్యం పలకలేదు. సత్య ధర్మాన్ని పాటించిన వారే పుణ్య లోక ప్రాప్తికి అర్హులు.

## 614. అష్టభోగాలూ, అష్టమదములనగా?

జ. అన్నమూ, వస్త్రమూ, గంధమూ, పుష్పమూ, పానుపూ, తాంబూలమూ, మగువ, సంగీతమూ అష్టభోగాలు. ఇక అష్టమదములు... అర్థమదము, స్త్రీ మదము, విద్యా మదము, కుల మదము, సౌందర్యమదము, ఉద్యోగ మదము, యవ్వన మదము, అన్న మదము.

## 615. అష్టపాశములంటే ఏవి?

జ. అష్టపాశములు మానవుడ్ని బంధించి సంసార సాగరాన ఈదిస్తున్నాయి. దయ, శంక, భయం, లజ్జ, జుగుప్స, కులం, శీలం, జాతి.

## 616. ఉత్తమమైన గురుశిష్యులెవ్వరు?

జ. ఉత్తమమైన నడవడికతో, తాను ఏదైతే చెబుతున్నాడో అదే విధంగా ప్రవర్తి స్తున్నవాడూ, సమస్త విషయాల మీద పరి జ్ఞానమూ, అవగాహన ఉన్నవాడూ, మంచీ, చెడూ దేశకాలమాన పరిస్థితులు, తెలిసిన వాడూ, ఇంద్రియాల మీద పట్టు ఉన్న వాడూ, గాంభీర్యము ఉన్నవాడూ, లోభ మంటే తెలియనివాడూ, తన విద్యను కుల మత ప్రేమలకతీతంగా అందించే వాడు ఉత్తమ గురువు. అట్టి ఉత్తమ గురువుని వెదికి ఆశ్రయించి సేవించేవాడు ఉత్తమ శిష్యుడవుతాడు. శిష్యునిలో శుభ లక్ష ణాలూ, ఇంద్రియాలపట్ల పట్టు ఉన్నవాడూ, విద్యపట్ల అకుంఠిత ఆరాధన ఉన్నవాడూ,

దీక్షా పట్టుదలా, కృతజ్ఞత సమపాళ్ళలో ఉన్నవాడూ, బుద్ధి కుశలతా, మితంగా భుజించేవాడూ, పరనింద చేయనివాడూ, పెద్దలనూ, గురువునూ దైవంనూ గౌరవించి పూజించేవాడే ఉత్తమశిష్యుడు.

## 617. రావణుడి పదితలలు దేనికి ప్రతీకలు?

**జ.** కామము, క్రోధము, లోభం, మోహం, అహంకారము, ఈర్ష్యా, అసూయా, ద్వేషం, సోమరితనం, నిర్లక్ష్యం, అతినిద్ర.



## 618. తీర్థాన్ని మూడుసార్లు తీసుకుంటారెందుకు?

**జ.** తొలి తీర్థము శరీర శుద్ధి, శుచికీ... రెండవ తీర్థం ధర్మ, న్యాయ ప్రవర్తనకూ .... మూడవ తీర్థము పవిత్రమైన పరమేశ్వరుని పరమ పదము కొరకు.

**తీర్థమంత్రము:**

**అకాల మృత్యుహరణం సర్వవ్యాధి నివారణమ్।**

**సమస్త పాప శమనం విష్ణు పాదోదకం శుభమ్॥**

## 619. స్త్రీకి వామనేత్రం అదిరితే ఎంతటి శుభం?

**జ.** స్త్రీకి వామనేత్రం అదిరినా, జలదరించినా శుభం. అలాగే ఎర్రటి కను కొలనులు పులకించినా శుభనిమిత్తమే. సీతాన్వేషణ కొరకై హనుమ లంకచేరి అశోకవనం చేరిన సమయాన సీతాదేవిని దర్శించే కొన్ని క్షణాల ముందు సీతాదేవికి శుభసూచికంగా ఈ శుభనిమిత్తాలు కలిగాయి. ఆ క్షణం తర్వాత సీతాదేవికి అన్నీ శుభములే. సకల సౌభాగ్యాలతో భర్తతో ఆపై ఎంతో సుఖించింది సీతాదేవి. కష్టాల సమయంలో అలాంటి శుభనిమిత్తాలు కలిగితే అన్ని కష్టాల నుంచి విముక్తి కలుగుతుంది.

## 620. ఇంద్రియ నిగ్రహం అంటే?

**జ.** దేవాసుర యుద్ధంలో దేవతలకి సహకరించి అర్జునుడు దేవతల మెప్పు పొందుతాడు. ఆ సమయాన దేవేంద్రుడు అర్జునుడికి అన్ని సముచిత మర్యాదలూ చేస్తాడు. ఆ రాత్రి ఉద్యానవనంలో వున్న అర్జునుడి దగ్గరికి ఊర్వశి సర్వాంగ సుందరంగా అలంకరించుకుని వెళ్ళి కోర్కె తీర్చమని కోరుతుంది. పుత్రుడిని ప్రసాదించమంటుంది. దానికి అర్జునుడు తొమ్మిది నెలలదాకా ఎందుకు.. ఈ క్షణం నుంచి నేనే నీ పుత్రుడ్ని అంటాడు. దేవలోక సుందరి ఊర్వశి కోరివచ్చినా, విచక్షణతో, ధర్మాధర్మాలు మననం చేసుకొని, అందాల సుందరిని దూరంగా ఉంచాడు. అదే ఇంద్రియ నిగ్రహమంటే.

## 621. పెళ్ళయిన తర్వాత అరుంధతి నక్షత్రాన్ని ఎందుకు చూపిస్తారు?

**జ.** అరుంధతి వశిష్ఠ మహర్షి ధర్మపత్ని, మహాపతివ్రత ఆకాశం వంక పెళ్ళి సమయంలో చూపించి చెబుతారు బ్రాహ్మణులు. అలా చేస్తే మీ సంసారిక జీవనం నల్లేరుమీద నడకలా సాగుతుందని పండితులు వధూవరులకు చెబుతారు. మాఘ మాసాది పంచమాసాల కాలమందు తప్ప ఈ నక్షత్రం సాయంత్రవేళ కానరాదు.



రాత్రిపూట చంద్రుడ్ని, నక్షత్రాలను చూడటంవల్ల కంటి శక్తి పెరుగుతుంది. అరుంధతి నక్షత్రం నుంచి వచ్చే కిరణాల వల్ల కంటిశక్తి మరింత పెరుగుతుంది. అరుంధతి నక్షత్రం సప్తర్షిమండలంలో వుండే చిన్న నక్షత్రం. శిశిర, వసంత, గ్రీష్మ ఋతువులందు సాయంకాల సమయాన, మిగిలిన కాలాల్లో అర్థరాత్రి లేదా దాటిన తర్వాత తెల్లవారు జామున కనిపిస్తుంది. అరుంధతి నక్షత్రాన్ని చూడాలనుకుంటే జాగ్రత్తగా ఆకాశం వంక చూడండి. '?' మార్కు ఆకారంలో నక్షత్రాలు ఉంటాయి. ఖచ్చితంగా కాక పోయినా దాదాపుగా ఆ ఆకారంలో ఉంటుంది. చిన్న పిల్లాడిని ? మార్కు గీయమంటే ఎలా గీస్తాడో అలా ఉండే సప్తర్షి మండలంలో పక్కపక్కనే ఉండే నక్షత్రాలే అరుంధతి, వశి ష్ఠులవారివి. అరుంధతి నక్షత్రం చిన్నగా ఉంటుంది.

## 622. దేవతలంటే ఎవరు?

**జ.** దేహ, ఆత్మ రూపంలో అహింసకులు, మర్యాదా, మన్ననాగల పురుషోత్తములు, పదహారు కళల సంపూర్ణులు, సర్వగుణ సంపన్నులు, ఎట్టి వికారము లేని వారు. ఈ అయిదు లక్షణాలు గలవారు దేవతలు.

## 623. పంచమహా పాతకములు ఏవి?

**జ.** బంగారాన్ని దొంగిలించటము, మద్యం సేవించటము, బ్రహ్మహత్య, గురుపత్నితో సరసము, ఈ నాలుగు పాపాలను చేసే వారితో స్నేహం. ఇవి పంచమహా పాతకములు.

## 624. దేవతల వాహనములు

**జ.** గంగానదీ దేవికి మొసలి

యమునా నదీ దేవికి తాబేలు


ఇంద్రునకు ఐరావతము

చంద్రునకూ వాయుదేవునకూ లేడి.

శివునకు వృషభము.

సూర్యునకు ఏడు అశ్వాలు పూన్చిన రథం.


శనికి కాకి, గ్రద్ధ.
లక్ష్మీదేవికి గుడ్లగూబ.
రతీ మన్మథులకు చిలుక
బ్రహ్మ, సరస్వతులకు హంస.
పార్వతీదేవికి సింహము.
అమ్మవారికి పెద్దపులి.
హనుమంతునకు ఒంటె.



## 625. అదృష్టవంతుడ్ని చెడగొట్టలేమా? దురదృష్ట వంతుడ్ని బాగుచెయ్యలేమా?

**జ.** శ్రీమహాలక్ష్మి, ఆమె పెద్దక్క జ్యేష్ఠదేవి ఓసారి పందెం వేసుకున్నారు. అదృష్ట వంతుడ్ని చెడగొట్టగలనని, దరిద్రుడ్ని కూడా బాగు చెయ్యగలనని పెద్దక్క అంది. అయితే చూద్దామని ఓ దరిద్రుడు వెళ్ళే దారిలో ధనరాసుల మూటపడేసి, ఇద్దరూ అతన్నే చూశారు. ఆ దరిద్రుడు తను రోజు వెళ్ళే దారిలో వెళుతూ....... 'ఆc .... రోజు ఇదే దారేనా.... విసుగుపుడు తుంది ...' అని పక్క సందులోంచి వెళ్ళా




డట. ఈసారి పెద్దక్క అదృష్టవంతుడ్ని చెడ గొడదామని, అతని భవంతి పక్కనే ఉన్న ఓ పెద్ద చెట్టును వాడి భవంతిపై విరు చుకు పడమని ఆజ్ఞాపించింది. ఆ వృక్షం పెళపెళమంటూ ఒరిగి భవంతిపై పడింది. భవంతిపై వృక్షం పడటంతో ఆ ప్రాంతమంతా వక్కలైంది. అదృష్టవం తుడనే అతను లబోదిబోమంటూ భవం తిని చూసి గుండెలు బాదుకున్నాడు. పెద్దక్క లక్ష్మీదేవి వైపు చూసింది. చూశావా? నీ కృప ఉన్న అదృష్టవంతుడిని ఎలా చేశానో అంది. శ్రీమహాలక్ష్మి నవ్వి 'నువ్వే చూడు' అంది. లక్ష్మి చూపిన వైపు చూస్తూనే పెద్దక్క అవాక్కయి పోయింది. కారణం కూలిన భవంతి గోడనుంచి వారి పెద్దలు పెట్టిన నిధి బైటపడింది. ఆ నిధిని చూసి అంతా నివ్వెరపోయారు. తమ పూర్వీకులు దాచిన ధనాన్ని ఆనందంగా తీసుకున్నాడు. అదృష్టవంతుడ్ని చెడగొట్టలేము .... దుర దృష్టవంతుడ్ని బాగు చెయ్యలేమూ.

## 626. పంచమాంగల్యాలు

**జ.** నుదుటన కుంకుమా, మెడలో మాంగల్యమూ, తలలో పూలూ, చేతులకు మట్టి గాజులూ, కాలికి మెట్టెలూ ఇవే పంచమాంగల్యాలు. ఈ అయిదు వివాహ మైన స్త్రీ సర్వవేళలా ధరించాలి. భర్తకి ఇవన్నీ ధరించే కనిపించాలి.



## 627. నవగ్రహ ఆరాధన రహస్య ఫలములు

**జ.** సూర్యుడ్ని ఆరాధిస్తే అనేక అనారోగ్య ములు తొలిగిపోతాయి. చంద్రుడ్ని ఆరా ధిస్తే మనోధైర్యము పెరుగుతుంది. బుధ గ్రహాన్ని ఆరాధించటము ద్వారా చక్కటి విద్యా, గురుగ్రహాన్ని సేవించటము ద్వారా శుభవార్తలనూ పొందుతారు. శుక్రుడ్ని ఆరాధిస్తే సుఖాలు లభ్యమవుతాయి. శనిని పూజిస్తే దీర్ఘాయువు కలిగి ఆరో గ్యంగా వెలిగిపోతారు. రాహుగ్రహాన్ని ఆరా ధిస్తే తక్షణమే అనారోగ్యము తొలుగును.

## 628. సోదర సమానురాలి వద్ద కూడా ఏకాంతంగా ఉండరాదా?

**జ.** ఇంద్రియాలు బహుశక్తి వంతమైనవి. వావి వరుసలను కూడా మరిచిపోయేలా చేస్తాయి. వదిన, మరదలు, సోదర సమా నుల సహచర్యమూ, ఇట్టివారి స్పర్శ వలన కూడా ఇంద్రియాలు సడలుతాయి.

కావున ఓ వయసు వచ్చిన తర్వాత ఎవ్వరైనా ఎవరితోనైన ఎంతలో ఉండాలో అంతదూరంలోనే ఉండాలి. నీచ తలం పులకి కూడా నరకము ప్రాప్తిస్తుంది.

## 629. నల్లపూసలు కూడా ధరించేదెందుకు?

**జ.** మంగళసూత్రంతోపాటు నల్లపూసలు గొలుసుగా ధరించటం మన హిందూ సాంప్రదాయం. దుష్టశక్తులు తన మాంగల్యం మీద పడకుండా వుండటా నికి ముఖ్యంగా ధరిస్తారు. అంతే కాకుండా నల్లపూసలు సంతాన సాఫల్యానికీ, ధనా నికీ, సుఖానికీ చిహ్నాలు. నల్లపూసలు మంగళకరమైన, సౌభాగ్యమైన ఆభరణము.


## 630. మానవునికి ఎన్ని జన్మలు ఉన్నాయి?

**జ.** సకలప్రాణికోటి అనగా 84 లక్షల జీవరాసులున్నాయి. అందులో చివరి జన్మ మానవజన్మ. అట్టి దుర్లభమైన మానవ జన్మను బుద్ధితో ధర్మ, అర్థ, మోక్ష, కామాలను తగు విధంగా ఆచరిస్తే ఆపై జన్మలు ఉండవు. ఆపై మోక్షమే... లేదంటే

మళ్ళీ అన్ని జన్మలూ ఎత్తుకుంటూ తిరిగి మానవ జన్మ ఎత్తి ఆత్మజ్ఞానం పొంద గలిగితే సరి... లేదంటే మళ్ళీ...

## 631. శుభకార్యాల్లో ఆడవాళ్ళ గొంతుకి గంధం రాసే దెందుకు?

**జ.** స్త్రీ భర్త ఇంటిలోని వారితో పాటు చుట్టాలూ, స్నేహితులూ.. ఇలా ఎందరినో అభిమానంతో పలకరించాలి. భర్తా, అత్తా, మామావంటి వారితో ఎంతో అభి మానంగా మాట్లాడాల్సి వచ్చినప్పుడు సర ళంగా, సౌమ్యంగా మాట్లాడాలి. గంధం మెడకి వ్రాయటంద్వారా గొంతు సర




ళంగా వస్తుంది. సున్నితంగా సరళంగా తీయగా మాట్లాడటంవల్ల ఆమెపై గౌర వాభి మానాలు పెరుగుతాయి. ఒక్కోసారి చెప్పే విషయం వినయంగా వినమ్రతగా ఉన్నా మాటగట్టిగా కఠినంగా ఉంటే తమను ఎదురించేలా మాట్లాడుతుందని అనుకునే ప్రమాదం ఉంది. స్త్రీ రూపానికి తగ్గట్టు స్వరమూ ఉండాలని రాస్తారు. గంధం శుభానికి సూచన కూడా.

## 632. పిల్లలు గెంతుతూ ఆడుతుంటే భూదేవికి కోపం వస్తుందని ఎందుకు అంటారు?

**జ.** పిల్లలు అలా నిరంతరం గెంతుతూ ఆడుతుంటే, మగపిల్లలకి వరిబీజము లాంటివి వస్తాయి. ఆడపిల్లలకి స్త్రీ సంబం ధిత అనేక సమస్యలు ఉంటాయి. అవి వెనుకా, ముందూ రాకుండా సరయిన సమయంలోనే రావటానికి, పెద్దలు పిల్ల లని గెంతుతూ ఆడుకుంటే భూదేవికి కోపమొస్తుందని చెప్పి మాన్పిస్తారు.

## 633. మ్రొక్కుబడులు చెల్లించకుంటే దేవుడికి కోపం వస్తుందా?

**జ.** తల్లికి బిడ్డల మీద కోపం వస్తుందా? ఇదీ అంతే. భగవంతుడు ఆశించేది ధర్మ, న్యాయాలతో జీవితాన్ని గడపమని. మ్రొక్కులు తీసుకొని మన పాపాలని ఆయన స్వీకరించడు. మ్రొక్కుబడు లివ్వ లేదని కష్టాలు పెట్టడు. ఎవరు చేసిన కర్మ లను బట్టి వారు వారి వారి పాప పుణ్యా లను అనుభవించక తప్పదు. కష్టమొస్తే భగవంతుడికి మ్రొక్కుకొని, తీరిన తర్వాత మర్చిపోయినవారికి, మళ్ళీ కష్టంలో ఆ మ్రొక్కు తీర్చుకుంటారు. భగవంతు డెప్పు డూ మాటమీద, సత్యం మీద నిలిచి ఉండ మంటాడు. దాన్నిమీరితే అది మీ సమస్య, ఆయన సమస్య కాదు.

## 634. భగవద్గీతను చదవాలా? వినాలా?

**జ.** గీత అనగా 'గీ' అంటే త్యాగం, 'త' అంటే తత్వజ్ఞానము. ఈ రెంటిని బోధించేది గీత. ఉపనిషత్తుల సమస్త సారాంశము. భగవద్గీతను అర్జునుడికి శ్రీకృష్ణుడు



మార్గశిర శుద్ధ ఏకాదశి నాడు చెప్పాడు. 'గ' ఆకారంలో కలిగిన వాటిలో గీతను చదవాలి. వినటం మధ్యమం. గీతను చదవటం, గంగాస్నానం, గాయత్రీ జపం, గోవింద నామస్మరణ...ఈ నాలుగింటిలో గీత గంగకన్నా ఉత్తమమైనది. గాయత్రీ మంత్రం కన్నా గొప్పది.

## 635. పంచామృతం ఎలా తయారు చేసుకోవాలి....?

**జ.** పాలు, పెరుగూ, నెయ్యి, తేనే, పంచదారలని అరటిపండుతో జతచేర్చి కొబ్బరి నీరు కావాల్సినంత కలిపి చేసేదే పంచామృతము. పాలు,పెరుగూ, నెయ్యి, ఈ మూడు ఒక్కటిగానే లెక్కించుకోవాలి.

## 636. సాలగ్రామములు - శక్తులు

**జ.** సాలగ్రామ శిల దగ్గరలో రామాయణ, భారత, భాగవతము చదవటం వల్ల మీ పిల్లలు వారి పిల్లలకి ధనంతో పాటు కీర్తి లభిస్తుంది. సాలగ్రామ శిలపై శిలాత్మకమైనటువంటి కుంకుమనుగాని చందనముగాని నిత్యం పెట్టుకునేవారు ధన్యజీవులు. మోక్షమునకు అర్హులు. సాలగ్రామశిల పూజ తర్వాత అదే ప్రదేశంలో భాగవతము చదివిన భక్తి, ముక్తి, శక్తులతో అనుకున్నది సాధించ గలుగుతారు. సాలగ్రామ శిలపూజ ఫలితం బదరీనాథ్ దర్శించినంత పుణ్యఫలము.


గత జన్మపాపాల నుంచి విముక్తి.... ఈ కలియుగమున భగవంతుడు ఆ శ్రీమహావిష్ణువు మనకిచ్చిన వరం సాలగ్రామము. గృహ సంబంధిత దేవ తార్చనలో సాలగ్రామ పూజ చేయుటవల్ల అనేక గృహ వాస్తుదోషాలు పోతాయి. తెలిసీ తెలియక చేసిన తప్పులు, దోషాలూ పోతాయి.

## 637. మానవుని ప్రవర్తన ఎలా ఉండాలి?

**జ.** కొండ చిలువవలె లభించిన దానితో తృప్తి చెందాలి. సీతాకోక చిలుకవలే పరులను ఇబ్బందులు పెట్టకుండా మకరందాన్ని ఆస్వాదించాలి. తేనెటీగ తేనెని కూడబెట్టినట్టు ధర్మాన్ని కూడబెట్టాలి. లేడిలా ఆకర్షణకు లోనుకారాదు. అత్యాశతో చేపలవలే గాలానికి చిక్కరాదు. పసిపాపలా ఆకలి తీరగానే సంతృప్తి చెందాలి.

శిల్పి విగ్రహం మీద ఏకాగ్రత పెట్టినట్టు ధర్మంపై, భగవంతునిపై మనస్సు నిలపాలి. సమాజసేవ పరంగానూ, శ్రేయస్సు కోరి ప్రవర్తించాలి.

## 638. పెళ్ళిలో పెళ్ళికూతురుని గంపలో ఉంచి ఎందుకు తెస్తారు?




**జ.** వివాహసమయంలో నవవధువులు లక్ష్మీనారాయణులు. లక్ష్మి ఎప్పుడూ తామరపువ్వులో ఉంటుంది. అందుకే లక్ష్మిదేవిలా పెళ్ళికూతురుని అలంకరించి తామరపువ్వులో (గంపలో) తెచ్చి శ్రీమహా విష్ణువువంటి అల్లునికిచ్చి వివాహం చేస్తున్నామని పరమార్థం.

## 639. శ్రీరామకోటి- కోటికన్నా తక్కువ వ్రాయవచ్చా?

**జ.** శ్రీరామకోటి వ్రాయటం ద్వారా మనసు ప్రశాంతమవుతుంది. ఏకగ్రాత పొందుతుంది. మంచిపని ఎంత చేస్తే అంత ఫలితం ఉన్నట్టే. ఎంత శ్రీరామకోటిని రాస్తే అంత ఫలము. భగవత్ప్రాప్తికి రామకోటి సులభదారి.

## 640. నీరు విషమా, అమృతమా?

**జ.** ఆహారము జీర్ణంకాని వారికి నీరు అమృతంలా పనిచేస్తుంది. అలాగే భోజన మధ్యలో కొద్దినీరు అమృతమే. కాని భోజనం చేసిన తర్వాత త్రాగే నీరు విషంతో సమానము. కనీసం రెండు గంటలైనా విరామం ఉండాలి. అలాగే తింటూ త్రాగుతూ, త్రాగుతూ తింటే కూడా ఆ నీరు విషమే. కాకపోతే నెమ్మదిగా పని చెయ్యటం ప్రారంభిస్తుంది.

## 641. ఎవరి పాపాలు ఎవరికంటుతాయి?

**జ.** ప్రజలు చేసిన పాపాలు రాజుకూ, రాజు చేసే పాపాలు పురోహితులకూ, భార్య చేసిన పాపాలు భర్తకూ, శిష్యుడు చేసిన పాపము గురువుకూ సంక్రమిస్తాయి. మగపిల్లాడు తప్పుచేస్తే తల్లీ, ఆడపిల్ల తప్పు చేస్తే తండ్రీ బాధ్యులు.


## 642. రుద్రాక్ష

**జ.** ఏకముఖి రుద్రాక్ష పరమశివుడికి ప్రతీక. ద్విముఖి రుద్రాక్ష 'ఓం నమః' అని జపించి ధరించవలెను. దేవతా స్వరూపము. త్రిముఖి రుద్రాక్ష అగ్నిదేవుడి స్వరూపము. చతుర్ముఖి రుద్రాక్ష బ్రహ్మదేవుడి ప్రతీక. పంచముఖి రుద్రాక్ష మహామృత్యుజ్వాల అనగా కాలాగ్ని స్వరూపిణి.

షణ్ముఖి రుద్రాక్ష కార్తికేయుని ప్రతీక. సప్తముఖి రుద్రాక్ష సప్తస్వరాలు. అష్టముఖి రుద్రాక్ష మహాగణపతి. నవముఖి రుద్రాక్ష కనుకదుర్గ. దశముఖి రుద్రాక్ష శ్రీమహా విష్ణువు స్వరూపము. ఏకాదశముఖి రుద్రాక్ష మహేంద్రుడి ప్రతిరూపము. ద్వాదశ ముఖి రుద్రాక్ష ఇంద్రునికి ప్రతీక. చతుర్దశ ముఖి రుద్రాక్ష చిరంజీవి హనుమకి ప్రతి రూపము. ఇరవై రెండు ముఖాల రుద్రాక్షలు దొరుకు తాయని అంటారు. ఏ రుద్రాక్ష ధరించినా, గంగాజలముతో శుద్ధిచేసి సంబంధిత మంత్రజపముచేసి, సోమవారం ప్రాతః కాలంలో ధరించండి.

## 643. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించాలంటే ఏడు ద్వారములు దాటాలి... దానిలో అర్థం పరమార్థమేమి?

**జ.** శ్రీస్వామి విగ్రహాన్ని దర్శించాలంటే ఆరు ద్వారములు దాటి ఆపై వచ్చే ఏడవ ద్వారం అవతల గర్భగుడిలోని శ్రీవేంక



టేశ్వరుని దర్శిస్తున్నాము. దాని పర మార్థం మనలో ఉన్న బ్రహ్మనాడిలో ఏడు కేంద్రములున్నాయి. జీవుడు ఆత్మను చేరా లంటే ఏడవస్థానానికి చేరాలి. అందుకే స్వామి నేను ఏడవగదిలో ఉన్నాను. నన్ను చేరాలంటే మీలో ఉన్న ఏడు ద్వారములు దాటండి. అప్పుడు నా రూపాన్నీ, అంత ర్యాన్నీ చూడగలరు అనేది స్వామి దర్శ నంలో పరమార్థం.

## 644. మైలా, అంటూ లేని వస్తువులు ఏవి?

**జ.** పసుపు, కుంకుమ, పూలు, పళ్ళు, వక్క, తమలపాకు, పాలు, పెరుగు, తేనె, తులసి, గంధం, చెక్క, నేయి, కూర గాయలు. దేవాలయాల్లో పేరంటాల్లో ఇచ్చిన పసు పును ఏ పరమార్థం కొరకు ఇచ్చారో దానికే ఉపయోగించాలి. పసుపును కూరల్లోనూ, కుంకుమను దైవ పూజకి వాడరాదు.

## 645. ఎలాంటిది పరిపూర్ణ దానమవుతుంది?

**జ.** తను చేసే కర్మ ద్వారా ఇతరులు బాధ పడతారని భావిస్తే చెయ్యకుండా ఉండేది ఉత్తమమైన దానము. ఇచ్చే దానం తీసు కునే వ్యక్తి అర్హుడా, కాదా అని ఆలోచించ కుండా అపాత్రదానం చెయ్యరాదు. దాన మంటే కీర్తికోసం కాంక్షించి ఇచ్చేది కాదు. అది దానం క్రిందకి రాదు. అన్ని దానా ల్లోకెల్లా అన్న దానమే ఉత్తమోత్తమము. రోగపీడితులకి ఆరోగ్యదానం చేస్తే వేలాది యాగాలు చేసిన ఫలం కృతయుగంలో

తపస్సు, త్రేతాయుగంలో జ్ఞానం, ద్వాపరంలో యజ్ఞం ... ఈ కలియుగంలో దానం, ఈ యుగానదానం ద్వారా మూడు యుగాల్లో చేసిన తపస్సు, జ్ఞాన, యజ్ఞ ఫలాలన్నీ పొందగలము.

## 646. ఏ నక్షత్రాన పుష్పవతి అయితే ఏ ప్రభావము ఉంటుంది?

**జ.** ఆడపిల్ల పుష్పవతి అవ్వగానే నక్షత్రం చూసుకుంటారు. ఆ నక్షత్రాలను బట్టి భవిష్యత్తులో జరగబోయే మంచీ, చెడూ జ్యోతిష్యశాస్త్రాల ద్వారా తెలుసుకోవచ్చు. నక్షత్రం మంచిది కాకపోయినా, అశుభమైనా చింతించాల్సిన పనిలేదు. తగువిధంగా పూజలు, కర్మలు చేయిస్తే గ్రహణం విడిచినట్టు దోషం పోతుంది. అశ్విని నక్షత్రం – అపారమైన దుఃఖాలు. భరణి నక్షత్రం – సంతానమంతా ఆడపిల్లలే. కృత్తిక నక్షత్రం–మహాదరిద్రము. రోహిణి నక్షత్రం –చక్కటి దాంపత్యము. మృగశిర నక్షత్రం –అన్యోన్యమైన సుఖ సంసారము. ఆర్ద్ర నక్షత్రం–పుత్రసంసారము. పునర్వసు నక్షత్రం



–దుఃఖమైన జీవితము. పుష్యమీ నక్షత్రం – కుటుంబానికి వేదన. ఆశ్లేష నక్షత్రం – సకల శుభములు. మఘనక్షత్రం – భర్తకి దూరం కావటం. పుబ్బ–మగ సంతానము. ఉత్తర ఫాల్గుణి నక్షత్రము.బాగా చూసుకునే పుత్రుడు. హస్త నక్షత్రము – అఖండ అదృష్టము. చిత్త నక్షత్రము– చక్కటి జీవితము. స్వాతి నక్షత్రము–భర్త ప్రేమ అపారమగా పొందుతుంది. విశాఖ నక్షత్రము – నలుగురూ ఈర్ష్యపడే దాంపత్యము. అనురాధ నక్షత్రము – రోగాలమయము. జ్యేష్ఠ నక్షత్రము–ధననష్టం, చపల చిత్తము. మూల నక్షత్రము – ఈతి బాధలు, ఆరోగ్య బాధ. పూర్వాషాఢ నక్షత్రము –కుటుంబానికి ఆవేదన. ఉత్తరాషాఢ నక్షత్రము– సంతోషకర జీవితము. శ్రవణా నక్షత్రము –అధికార ఆనందము. ధనిష్ఠ నక్షత్రము – ఆయురారోగ్యములు. శతభిషం– ఆకలి బాధలు. పూర్వాభాద్ర– శక్తిలేక పోవటము. ఉత్తర భాద్ర పదం – పదిమంది మెచ్చుకునే జీవితము. రేవతి – సకల శుభములు.

## 647. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో రోగం తిరగబెడుతుందా?

**జ.** రోగాలే కాదు పిచ్చి కూడా ముదురుతుంది అంటారు. చంద్రుడు జలకారకుడు. పౌర్ణమినాడు సూర్యచంద్రులు భూమికి రెండు వైపులా ఒకే స్థాయి ఆకర్షణ కలిగి ఉంటారు. అలాగే అధికశక్తి, బలహీనం చంద్రునిలో ఆ రెండు రోజులు

ఉంటాయి. మన శరీరంలో కూడా నీరు ఉంటుంది. చంద్రుడు నీటికారకుడు కాన విపరీతంగా ఆకర్షిస్తాడు. అందువల్ల వ్యాధిగ్రస్తులు ఒకింత ఎక్కువ వేదనకు గురి అవుతారు.

### 648. మహారుద్రునికి ఏ అభిషేకాలు ఇష్టం? ఏ ఫలం ఇస్తాడు?

**జ.** ఆవుపాలతో అభిషేకిస్తే సౌఖ్యమూ, ఆవు పెరుగుతో ఆరోగ్యమూ... ఆవు



నెయ్యితో ఐశ్వర్యమూ, తేనెతో తేజోవృద్ధీ ప్రసాదిస్తాడు. గంధోదకముతో పుత్రుడ్నీ, పుష్పోదకముతో భూమినీ అందిస్తాడు. అలాగే సువర్ణ పూలతో దరిద్రనాశనమూ, నువ్వులనూనెతో మృత్యుభయమూ లేకుండా చేస్తాడు. ద్రాక్షరస అభిషేకంతో కార్యసిద్ధి, పసుపునీళ్ళతో మంగళప్రదమైన శుభము లను వినేలా చేస్తాడు.

### 649. పౌర్ణమి – అమావాస్యల్లో ప్రయాణించకూడదా?

**జ.** నవమీ, పాడ్యముల్లో తూర్పు వైపుకూ, విదియ దశముల్లో ఉత్తరం వైపుకూ, తదియ ఏకాదశుల్లో ఆగ్నేయానికీ, అలాగే చవితి ద్వాదశులందు నైఋతి వైపుకీ, పూర్ణిమ సప్తములప్పుడు వాయువ్యానికీ, అమావాస్య అష్టమి రోజులలో ఈశాన్యా నికీ ప్రయాణించ కూడదని శాస్త్రం చెబు తుంది. అలా వెళ్ళాల్సి వస్తే దైవపూజ చేసుకుని వెళ్ళమని శాస్త్రం చెపుతున్నది.

### 650. గయలో పిండ ప్రదానం చేస్తే ప్రతి సంవత్సరం చెయ్యక్కర్లేదా?

**జ.** గయలోనేకాదు ఎక్కడ పిండ ప్రదానం చేసిన మళ్ళీ యథావిధిగా తద్దినాలు పెట్టా ల్సిందే. తద్దినాలు పెట్టేవారనగా వార సులూ, పుత్రులూ లేకపోతే గయలో పిండ ప్రదానం చేసుకుంటే పుణ్యలోకాల ప్రాప్తి కలుగుతుంది.

### 651. ఆడవాళ్ళు వేదవిద్యనెందుకు అభ్యసించకూడదు?

**జ.** వేదవిద్యను ఆడవాళ్ళు అభ్యసించ టానికి వారి శరీర నిర్మాణం సహకరిం చదు. వేదాన్ని గట్టిగా బైటికి ఉచ్చరిస్తూ చదువుతూ నేర్చుకోవాలి. దీర్ఘంగానూ, నెమ్మదిగానూ, క్రమంగానూ శ్వాసను వదులుతూ, పీలుస్తూ నేర్చుకోవాలి. ఇలా నేర్చుకోవటం వల్ల గర్భాశయముపై విరు

ర్ధంగా ప్రభావం చూపిస్తుంది. స్త్రీకి మాతృత్వమే పెన్నిధి. మరొకరిని భూమ్మీదకు తెచ్చే అపూర్వమైనవరం స్త్రీకి గర్భాశయం ద్వారా జరుగుతుంది. వేదవిద్య ద్వారా గర్భాశయానికి ప్రమాదంకాన స్త్రీలు వేద విద్యను నేర్చుకోవద్దని చెబుతారు. మనసులో జపించుకోవటమూ, పూజలో స్తోత్రాలు పఠించటంవల్ల ఇబ్బంది ఏమీ రాదు. పూజలో పూజిస్తూ పఠించే మంత్రాలకీ, వేద విద్యకూ చాలా తేడా వుంది.

## 652. వాల్మీకి రామాయణంలో ఇవన్నీ ఉన్నాయా?



**జ.** లక్ష్మణుడు లక్ష్మణరేఖ గీయటమూ, సీతా స్వయంవరానికి రావణుడు రావటమూ, ఊర్మిళ నిద్ర, అహల్యకు శ్రీరాముని పాదము తగిలి శాపవిమోచనం కలగటమూ, హనుమంతుడు శ్రీరాముడు వేసిన బాణాన్ని వాయుదేవుని సహాయంతో నాభిలో గుచ్చుకునేలా చెయ్యటమూ, గుహుడు రాముని పడవ వద్దకు మోసుకు రావటం, జనకుడు సీతా స్వయంవరం ప్రకటించటమూ ఇత్యాదివన్నీ లేవు.

## 653. అష్టగంధమంటే?

**జ.** కస్తూరీ, గోరోజనమూ, కుంకుమ పువ్వూ, దేవదారూ, పచ్చకర్పూరమూ, అగరూ, శ్రీగంధమూ, రక్తచందనమూ... ఈ ఎనిమిదింటితో చేసేదే అష్టగంధము.

## 654. తేనెతుట్టెలు ఎక్కడపెడితే ఏం ఫలితం?

**జ.** ఇంటి మధ్యలో–అధిక ధననష్టము. నైఋతి భాగంలో–మంచిది కాదు. ఈశాన్యంలో – అనేక కష్టాలు. అగ్నేయంలో –పెద్దగా మంచి, చెడుల తేడాలుండవు. తూర్పుభాగంలో–శత్రువులపై విజయం. ఉత్తరభాగంలో–అనేక సుఖాలు. వాయవ్యంలో–ధన, ధాన్య లాభాలు.

## 655. ధర్మమంటే ఏమిటి?

**జ.** లోకములను ధరించేది ధర్మము, ధర్మానికి వేదమే మూలము. ధర్మము అభ్యుదయమునకూ, మానవ మనుగడకు మూలము. ధర్మమే విశ్వప్రేమను పెంచుతుంది. కృతయుగమున తపస్సు ధర్మము. త్రేతాయుగమున జ్ఞానమే ధర్మము. ద్వాపరయుగాన యజ్ఞమే ధర్మము. కలియుగాన దానమే ధర్మము.

## 656. ఎంత ఎక్కువ మర్దనము చేస్తే ఎంత సుఖము?

**జ.** చెరుకునూ, నువ్వులనూ, పనివారనూ, అందమైన భార్యనూ, బంగారాన్నీ, భూమినీ, పెరుగునూ, చందనమునూ, తాంబూలాన్నీ ఎంత చేతనైతే అంత మర్దనము చేస్తే అంత గుణమూ, సుఖమూ వస్తాయి.

## 657. మన్మథుడు ఆవహిస్తే వచ్చే అవస్థలు ఏమిటి?

**జ.** కనులతోచూసి మైమరుచుట, మనసు పడుట, సంకల్పించుట, నిద్రపట్టక ఒత్తి గిల్లుట, చిక్కిసగమవుట, విపరీతమైన విసుగు, సిగ్గు బిడియం వదిలివేయటం, చిత్తభ్రమనొందుట, మూర్ఛ, తుదకు ఆత్మ హత్యకు ప్రయత్నించుట.

## 658. నోరు మంచిదయితే ఊరు మంచిదవు తుందని అంటారెందుకు?

**జ.** నాలుక కొసన లక్ష్మీదేవి ఉంటుంది. జిహ్వాగ్రమువల్లే మిత్రులూ, శత్రువులూ ఏర్పడతారు. జిహ్వాగ్రమువలనే అన్ని కార్యాలకు మూలమైన లక్ష్మీదేవి ధన రూపంలో వస్తుంది. అందుకనే నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందని, కోరినవన్నీ చెంతకు వస్తాయని అంటారు.

## 659. మంత్రాలూ, మూలికలకూ శాపముందా?



**జ.** అవును. మంత్రాలకూ, మూలికలకూ అగస్త్యుని శాపం ఉంది. అందుకే వీటిని గురుముఖతః నేర్చుకోవాలి. నేర్పించే గురువు మంత్ర తపోసిద్ధి కలిగి వుంటాడు. గురుముఖతః కాకుండా నేర్చుకుంటే బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంటుంది.

## 660. ధర్మమంటే

**జ.** సత్యాన్నే పలకటము. సృష్టిలోని ఏ జీవినీ బాధపెట్టకుండా ఉండటము. ఇత రుల సంపదపై ఈర్ష్య చెందకుండా ఉండ టము. ఆధ్యాత్మిక విద్యను సంపాదించ టము. తెలుసుకోవటము... ఈ నాలుగే ధర్మానికి మూలము.

## 661. 'రామ' నామ శబ్ద విశిష్టత

**జ.** 'రామ' ర, ఆ, మలు కలిసిన శబ్దం. 'ర' అక్షరము రుద్రుడ్ని 'అ' అక్షరము బ్రహ్మనూ 'మ' అక్షరము విష్ణువును సంబోధిస్తుంది. 'రామ' అని ఒక్కసారి అని నంతనే త్రిమూర్తులను పూజించిన ఫలం కలుగుతుంది. 'రామ' అన్న శబ్దం జీవాత్మపరమాత్మ స్వరూపమే. రామ నామములో 'రా' అని పలికినప్పుడు ఆ శబ్దంలోంచి ఎన్నో జన్మల పాపాలు బైటికి పోతాయి. 'రా' అని చూడండి మీ పెద వులు విడిపోతాయి. ఆ వెంటనే 'మ' అని ఉచ్ఛరించటంతో బైటి పాపాలు మనలోకి ప్రవేశింపలేవు. 'మ' అనగానే పెదవులు కలసిపోతాయి.

## 662. పసిపిల్లల తలపై ఎందుకు కొట్టరాదు?

**జ.** సరదాగానూ, ప్రేమగానూ పసిపిల్లల తలపై కొట్టరాదు. పుర్రెదగ్గర ఎముకలు

మెత్తగా ఉంటాయి. కొంతమంది పిల్లలకి ఆరు సంవత్సరాలు వచ్చినా బలంగా తయారవ్వవు. కాన తలపై కొట్టడం వల్ల ప్రమాదమూ లేదా మానసిక స్థితిలో తేడా రావచ్చు. పిల్లల్లో వయసుతో పాటు మెదడు పెరగకపోవచ్చు.

### 663. రుద్రాభిషేకం చేయించేటప్పుడు తిథులు చూసుకోవాలా?

**జ.** దీర్ఘవ్యాధులవారు తమ వ్యాధులు పోవాలనీ, మిగతావారు కోరికలతోనూ, భక్తితోనూ శివునికి రుద్రాభిషేకం చేయిస్తారు. ఇలా చెయ్యటంవల్ల మరణ భయం పోతుందని పురాణ ఆధారము. రుద్రాభిషేకం చేయించేవారు ఓ ముఖ్య విషయం గుర్తుపెట్టుకొని ఆపై అభిషేకం చేయించాలి. రుద్రాభిషేకమును శివసంచారము తెలుసుకొని చేయించుకోవాలి. మహా శివుడు శుభస్థానములో ఉన్నప్పుడు లెక్కించుకొని అభిషేకం చేయించుకోవాలి. శివపూజ చేసే తిథిని 10తో హెచ్చవేస్తే అనగా '0' చేర్చి ఏడుతో




భాగిస్తే '1' వస్తే కైలాసమున, '2' వస్తే పార్వతీదేవి వద్దా, '3' వస్తే వాహనుడై ఉన్నట్టు, '4' వస్తే కొలువు తీరినట్లు, '5' నైవేద్యము స్వీకరిస్తున్నట్టు. '6' వస్తే ఆనంద నాట్యము చేస్తున్న సమయముగా, '7' వస్తే స్మశానమున ఉన్నట్టు తెలుసుకోవాలి. 7-14 తిధులలో పూజతగదు. వివరంగా తెలుసుకొని అభిషేకం చేయించుకోవాలి.

### 664. సంధ్యావందనము ఏ సమయంలో చేయాలి?

**జ.** సూర్యోదయానికి అరగంట ముందు అంటే ఒకటిన్నర గడియల ముందు నక్షత్రములు సమాప్తమవుతాయి. కాన సూర్యోదయానికి అరగంట ముందు కాలంలోనే సంధ్యోపాసన చేయాలి.

### 665. భగవద్గీతను పారాయణం చేయుట వల్ల ఏ ఏ పుణ్యఫలాలు వస్తాయి?

**జ.** అర్జున విషాద యోగ పారాయణ ద్వారా పాపాలు తొలుగుతాయి. పూర్వ జన్మ స్మృతి కలుగుతుంది. సాంఖ్య యోగంద్వారా ఆత్మ స్వరూపమును తెలుసుకొనగలుగుతారు. కర్మయోగం ద్వారా మీ చుట్టూఉన్న ప్రేతాత్మలు తొలిగిపోతాయి. జ్ఞానయోగ పారాయణం ద్వారా పశు, వృక్ష, పక్షుల పాపాలు కూడా నశించి ఉత్తమమైన లోకాలని చేరుతాయి. తద్వారా మీకు పుణ్యప్రాప్తి. ఆత్మసంయము యోగంద్వారా అనేక



దానములు చేసిన పుణ్యఫలం లభిస్తుంది. విజ్ఞాన యోగం ద్వారా జన్మరాహిత్యమూ, అక్షర పరబ్రహ్మయోగం ద్వారా సమస్త దుర్గుణాలూ నశిస్తాయి. రాజ విద్యా రాజ గుహ్యయోగం ద్వారా పరుల సొత్తును అపహరించిన పాపములు పోతాయి. విభూతి యోగం ద్వారా పాపవిముక్తి కలుగుతుంది. భక్తి యోగం ద్వారా ఇష్టదేవతా దీవెనలూ లభిస్తాయి.క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగం ద్వారా సకలదోషాలూ, చెడూ తొలిగిపోతాయి. గుణ త్రయ విభాగయోగం పారాయణం ద్వారా అనేక స్త్రీలతో పోయిన పాపములు, స్త్రీ దోషాలు పోతాయి. పురుషోత్తమ ప్రాప్తి యోగంద్వారా సర్వపాపాలూ పోయి ఉత్తమ మోక్షాలు సంక్రమిస్తాయి. భోజనానికి ముందు చదివితే మరింత మంచిది. దైవాసుర సంపద్విభాగయోగం ద్వారా అమితశక్తి వంతులవుతారు. శ్రద్ధాత్రయ విభాగయోగం పారాయణ ద్వారా అనేక దీర్ఘరోగములు నశించి క్షీణిస్తాయి. మోక్ష సన్యాసయోగం పారాయణ ద్వారా అనేక యజ్ఞములు చేసిన ఫలములు కలుగును.

## 666. ఏడు వారాల నగలు

***జి.*** పేరు వినటమే కాని అసలవి ఏమిటో చాలా మందికి తెలీదు.

**ఆదివారము:**సూర్యునికిష్టమైన ఈ రోజున కెంపుల కమ్మల, హారాలు ధరించాలి.

**సోమవారము:** చంద్రునికిష్టమైన ఈ రోజున ముత్యాలహారాలూ, గాజులు పెట్టుకోవాలి.

**మంగళవారము:**కుజునికిష్టమైన ఈ రోజున పగడాలదండలూ, ఉంగరాలు అలంకరించుకోవాలి.

**బుధవారము:**బుధునికిష్టమైన ఈ రోజున పచ్చల పతకాలూ, గాజులు వేసుకోవాలి.

**గురువారము:** బృహస్పతికిష్టమైన ఈ రోజున పుష్యరాగపు కమ్మలూ, ఉంగరము వేసుకోవాలి.

**శుక్రవారము:**శుక్రునికిష్టమైన ఈ రోజున వజ్రాల హారములూ, ముక్కుపుడక ధరించి లక్ష్మీదేవిలా మీ వాళ్ళకి దర్శన మివ్వాలి.

**శనివారము:** శనికిష్టమైన ఈ రోజున నీల మణితో చేయించుకున్న కమ్మలూ, హారాలూ, ముక్కుపుడకా ధరించాలి.



ఇవీ ఏడు వారాల నగలు. ఆయా రోజుల్లో ఆయా నవరత్నములతో పాపిడి బిళ్ళ, వంకీలూ ఇలా ఎన్నయినా చేయించుకోవచ్చు. ఆ రోజు ఆ రత్నంకు సంబంధించినవి బంగారంతో చేయించి పెట్టుకోవటమంటే అంతకుమించిన వైభోగము ఇంకేమీ ఉండదు. కాన మహిళలు... ఏడు వారాల నగలంటే ఇవే.

## 667. స్త్రీలు అట్లతద్దినాడు గోరింటాకు ఎందుకు పెట్టుకుంటారు?

**జ.** అరచేతులకీ, కాళ్ళకూ అన్ని శుభ కార్యాల్లోనూ ఆడవాళ్ళు సంబరంగా గోరింటాకును పెట్టుకుంటారు. దానికి మంగళకరమైన కారణమే కాకుండా, మరో కారణం కూడా ఉంది. స్త్రీలు రోజులో ఎక్కువ భాగం నీటిలోనే పని చేయాల్సి రావటం వల్ల కాళ్ళూ, చేతులూ పాచి పడతాయి. ఆ పాచీ, పగుళ్ళూ అనేక వ్యాధులకు కారణమవుతాయి. గోరింటాకు పెట్టుకోవటంవల్లవ్యాధులను అరికట్టడమే కాకుండా శరీరంలోని వేడిని కూడా లాగేస్తుంది. ఇంకా ఎంత ఎర్రగా పండితే అంత చక్కని మొగుడొస్తాడని ఆడపిల్లల నమ్మకం.



## 668. ధర్మన్యాయ శాస్త్రాల్లో గర్భస్రావం....

**జ.** ఇష్టంగా కానీ, పరిస్థితులను బట్టిగానీ, ఏ స్త్రీ అయినా గర్భస్రావం చేయించుకున్నచో ఆ పాపానికి ప్రాయశ్చిత్తమే లేదు. బ్రహ్మహత్యా పాతకం కంటే రెండురెట్లు అధికం. కాన దానికి కారణమైన మగవానికి నాలుగు రెట్లు పాపము.

## 669. వివాహానికి వధూవరుల జాతకాలు కలిశాయని ఏ విధంగా చూసి చెబుతారు?

**జ.** పెళ్ళి కుదుర్చుకునే ముందు జాతకాలు చూడటం మన సాంప్రదాయము. పైగా నమ్మకం కూడా. వధూవరుల జాతక భాగమును సప్తమ, అష్టమ స్థానాలను చూస్తారు. సప్తమ, అష్టమ స్థానములు మిత్ర రాసులూ, మిత్రగ్రహములు అయితే వివాహాన్ని నిర్ణయించుకుంటారు.

## 670. యజ్ఞోపవీతము నందు 9 పోగులేమిటి?

**జ.** యజ్ఞోపవీతము తొమ్మిది పోగుల్లో తొమ్మిది దేవతలుంటారు. బ్రహ్మ, అగ్ని, అనంతుడు, చంద్రుడు, పితృదేవతలు, ప్రజాపతి, వాయువు, సూర్యుడు, సూర్య దేవతలు నివశిస్తారు.

### 671. స్త్రీలు జుట్టు విరబోసుకుని ఎందుకుండరాదు?

**జ.** పిశాచాలకు ఆహ్వానం వంటిది ఆ చర్య. అనేక దుష్టగ్రహాలు ఆ సమయంలో ఆవహించి కల్లోలపరిచే శక్తి జుట్టు విర బోసుకున్నప్పుడే వాటికి వస్తుంది. దానికి



తోడు విరబోసుకున్న స్త్రీని చూసిన పురుషుడుకి ఆ స్త్రీ మీద కామం కలుగుతుంది. తద్వారా అనేక కుటుంబ సమస్యలు వస్తాయి. భర్త చూస్తే భార్య మీద ప్రేమ తగ్గుతుంది. అలాగే జుట్టు విరబోసుకు తిరుగుతుంటే లక్ష్మీదేవి అక్కకు (పెద్దమ్మకు) కూడా ఆహ్వానమే.

### 672. భోజనము చేసేటప్పుడు మాట్లాడకూడదెందుకు?

**జ.** తూర్పు ముఖంగా కూర్చొని భోజనం చెయ్యటం శాస్త్రం. ఆ వైపు ప్రాణశక్తి ఎక్కువగా ఉంటుంది. అలాగే పితరులుండే దక్షిణ దిక్కువైపు నుంచయినా భుజించవచ్చు. భోజనాన్ని ఎత్తైన దాని మీద కూర్చొని నోటికి ఎదురుగా విస్తరి పెట్టుకుని భోజనం చేస్తే అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. పీట లేదా చాప ఇలాంటి వాటిపై కూర్చొని భుజించటం వల్ల కడుపుకి ఎంత కావాలో తెలుస్తుంది. అంతే తినగలుగుతారు. భోజనం చేస్తూ మాట్లాడుతుంటే నోటిలో లాలాజలం ఊరదు. దానితో ఆహారం జీర్ణమవ్వక అనేక రోగసంబంధిత సమస్యలు వస్తాయి. అమావాస్య పౌర్ణమిలలో తక్కువ భోజనం చెయ్యటం ఆరోగ్యకరం.

### 673. ఏవేవి వేటితో పోతాయి?

**జ.** విశాఖ కార్తెతో మేఘాలు పోతాయి. బిడ్డలు పుట్టడంతో స్త్రీకి యవ్వనం క్షీణిస్తుంది. మనిషి మరణిస్తే శత్రుత్వము పోతుంది. గౌరవము యాచనతో పోతుంది. చెడు అలవాట్లతో విలువలు పోతాయి. పక్కవాడ్ని పాడు చెయ్యాలనుకుంటే మన ధనం పోతుంది.

### 674. 'అతి సర్వత్ర వర్జయేత్'అనగా?

**జ.** అద్భుత సౌందర్యము ఉండటం వల్ల సీతాదేవిని రావణుడు అపహరించాడు. అతిగర్వం వల్ల శ్రీరాముడి చేతిలో రావణుడు మరణించాడు. అతిదానం వల్ల బలి నష్టపోయాడు. అతిగా తింటే ముందే పోతాడు. అతిగా వాగితే చులకనవుతాడు. అతిగా ఆశపడితే వచ్చేది అనర్థము. అందుకనే దేనికైనా అతి పనికి రాదని అంటారు.


## 675. ఉల్లి చేసే మేలు తల్లి కూడా చెయ్యదు..... అయినా ఎందుకు పూజలలో నిషిద్ధం...?



**జ.** నిజమే. ఉల్లి చేసే మేలు తల్లి కూడా చెయ్యదంటారు. తపస్సు అనగా దైవ కార్యాలు, పూజలూ, వ్రతాలూ చేసేట ప్పుడు ఉల్లి వద్దనటంలో అర్థం, తమో గుణం పెరిగి సాధనకు ఏకాగ్రత కుద రదు. అందుకే ఉల్లి నిషేధం.

## 676. తాంబూలాలప్పుడు ఒకరివేలికి మరొకరు ఉంగరం తొడిగేదెందుకు?

**జ.** ఎంగేజ్‌మెంట్ ఫంక్షన్‌లో పెళ్ళి కూతురూ, పెండ్లి కొడుకూ ఒకరికొకరు ఉంగరాలు పెట్టుకోవటం ఓ కమ్మని తియ్యని క్షణాలు. వధూవరులు తమ జీవితాంతము గుర్తుంచుకునే మధురమైన క్షణాలు. ఈ ఉంగరాల్ని ఉంగరం వేలికి తొడగటంలో ఒక విషయం దాగి ఉంది. ఉంగరంవేలు నరానికి హృదయానికి అవినాభావ సంబంధము ఉంది. నా మన సునే నా ఈ ఉంగారాన్ని నీ వేలికి తొడుగుతున్నాను. ఉంగరం వేలుకి పెట్టిన




ఉంగరం ద్వారా నీ హృదయాన్ని అంటి పెట్టుకున్నాను అని భావము.

## 677. భక్తి చిహ్నాల అర్థపరమార్థాలేమిటి?

**జ.** ఓంకారము సమస్త విశ్వానికి ప్రతి రూపము. అందుకే అక్షరాభ్యాసంలో తొలుతగా 'ఓం' ని వ్రాయిస్తారు. లక్ష్మీ పాదాలను ఇంటి గోడలపై వేస్తారు. సకల శుభాలకి గుర్తు. సీమంతం చేసిన స్త్రీ కాలిని కుంకుమపై అద్దించి, ఆ పాద ముద్రను ఇంటిలో పడేలా నడిపిస్తారు. స్వస్తిక్ గుర్తు కూడా సకల శుభాలకోసమే. సూర్యదేవునికి ప్రతిరూపమే స్వస్తిక్ గుర్తు. వ్యాపార పుస్తకాల, మీద ఇంటి గోడలపై అనేక వాటి మీద వ్రాసుకుంటారు.

కమలము హిందువుల పవిత్ర చిహ్నం. కమలం బురదలోనూ, ధూళిలోనూ ఉంటుంది. దాని అర్థం సమాజంలోని చెడూ, కుట్రలూ, కుతంత్రాలు మధ్య నివ శిస్తున్నా వాటికి అతీతంగా స్వచ్ఛందంగా కమలంలా విరాజిల్లమని. పూర్ణకుంభము క్షీరసాగర మధనంలో ఉద్భవించిన అమృత కలశంతో సమానము. సంపూర్ణ సుఖ జీవితాన్ని ఇవ్వమని వేడుకోవటమే పూర్ణ కుంభం పూజ.

## 678. తిరుపతిలో శ్రీవేంకటేశ్వరస్వామికి అమ్మవారు కుడిపక్కనెందుకుంటుంది?



**జ.** శేషాద్రి అయిన తిరుమలపై శ్రీమహా విష్ణువు మనుష్య రూపము దాల్చుటము, ఆపై ఆకాశరాజు కుమార్తె పద్మావతిని వివాహం చేసుకోవటం తెలిసిందే. శ్రీవేంకటేశ్వరుడూ, పద్మావతీదేవిల వివాహం గూర్చి సరిగ్గా సమయానికి లక్ష్మీదేవికి నారదుడు చెబుతాడు. దానితో శ్రీమహాలక్ష్మీదేవి పద్మావతి తోనూ, శ్రీనివాసుని తోను గొడవకు దిగుతుంది. ఆ సమయాన శ్రీనివాసుడు పద్మావతి పూర్వగాథ శ్రీమహాలక్ష్మికి చెప్పి, కుడి వక్షస్థలముపై పద్మావతి అమ్మవారినీ, లక్ష్మీదేవిని ఎడమ వక్షస్థలంపై ఉండమని కోరాడు. భర్త ఆదేశానుసారంగా ఇద్దరు అమ్మవార్లు స్వామికి ఇరువైపులా ఉంటారు.

## 679. శాస్త్ర ప్రకారము దధ్యోదనము ఎలా చేయాలి?

**జ.** సన్న బియ్యంతో ముందుగా అన్నాన్ని సిద్ధం చేసుకోవాలి. దానిలో బాగా కాచిన పాలు (కేజీ బియ్యానికి శేరు పాలు, శేరు పెరుగు), పెరుగు, నెయ్యి కలిపి, తిరగ మోత పెట్టుకోవాలి. తిరగమోతకు నెయ్యి మాత్రమే వాడాలి. ఎండుమిరపకాయలూ, ఆవాలూ, మినుములూ, సెనగపప్పు, కరివేపాకుతో తిరగమోతను పెట్టి కలపాలి. ఆపై మిరియాల పొడీ, అల్లం తురుము వేయాలి. నీళ్ళలో ఇంగువ కలిపి పెరుగు అన్నంపై చల్లి బాగా కలపాలి. నోరూరించే దధ్యోదనము సిద్ధం. కఫమూ, పైత్యాన్ని నివారించి, బలముతోపాటు వీర్య బలమూ ఈ దధ్యోదనము ద్వారా కలుగుతాయి.

## 680. శ్రాద్ధమందు భోజనం చేసే భోక్తలెందుకు మాట్లాడరు?

**జ.** ఆ సమయమున అనగా భోక్తలకి భోజనం వడ్డించి ఆపై వారు తీసుకుంటున్నప్పుడు భోజనము బాగుందా? అని అడిగినా భోక్తులు మాట్లాడరు. భోజనం వేడిగా ఉన్నంతవరకూ, భోక్తలు మౌనంగా భుజించినంత వరకూ పితృ దేవతలు భుజిస్తారు. మౌనభంగమయిన స్వీకరించరు. భోక్తలు దక్షిణ ముఖంగా కూర్చొని భుజిస్తే ఆ భోజనాన్ని రాక్షసులు స్వీకరిస్తారు. కాన వడ్డించేటప్పుడు ఈ విషయాన్ని గుర్తుంచుకోండి.

## 681. మంచమ్మీద కూర్చొని కాళ్ళెందుకు ఊపకూడదు?

**జ.** అలా చెయ్యటం అరిష్టము. తెలియకుండానే అనారోగ్యం వస్తుంది. నరాల్లో

artist

బలహీనత వచ్చి వీర్యస్కలనము కూడా ఒక్కోసారి జరుగుతుంది. వాతవ్యాధులు కూడా రావచ్చు. రేతస్సు బలహీనపడి సుఖసంసారం గాడి తప్పుతుంది. పది నుంచి పదిహేను రోజులైనా ఆ విషయం గూర్చి ఆలోచనరాదు. ఎప్పుడైతే శృంగారం పట్ల ఉత్సాహమూ, కోరికా పోతాయో శరీరంలో శక్తి తగ్గుతుంది. ఆలోచనలు వేదాంతపరమైన విషయాలపైకి వెళ్ళి అక్కడా ఇమడలేక ఒకలాంటి నిరాశ వంటిది ఆవహిస్తుంది. తద్వార అనేక అపజయాలు ఎదురవుతాయి.

## 682. బియ్యం తింటే పాండురోగ మొస్తుందా?

**జ.** చిన్నపిల్లలు బియ్యం తినటం పరిపాటి. చిరుతిళ్ళు దొరకనప్పుడు కాకతాళీయంగా బియ్యం తినే పిల్లలు తర్వాత దాన్ని అలవాటుగా చేసుకుంటారు. తర్వాతెప్పుడో గుర్తించిన తల్లి, 'బియ్యం తింటే పాండురోగం వస్తుందని" చెప్పి ఆ అలవాటును మాన్పిస్తుంది. ఇలా బియ్యం తినటంవల్ల అజీర్తి చేస్తుంది. తద్వారా అనేక రోగాలు రావటం ఖాయం. కొన్ని ప్రాంతాల్లో బియ్యం తింటే మీ అమ్మకి జ్వరమొస్తుందని కూడా పిల్లలను భయపెట్టి ఈ అలవాటును మాన్పుతారు.

## 683. భర్త వెంట స్త్రీలు ఎలా నడవాలి?

**జ.** అశుభానికి వెళ్ళేటప్పుడు స్త్రీ ముందు నడవాలి. శుభానికి వెళ్ళేటప్పుడు పురుషుడు వెనుక స్త్రీ నడవాలి. అలాగే భార్య చేసిన పాపంలో భర్తకు భాగముండదు. కానీ భర్త చేసిన పుణ్యంలో భార్యకి సగపాలు. అదే పాపం చేస్తే భార్యకేమాత్రం భాగం ఉండదు.

## 684. భర్త అసమర్థుడైన భార్య పతివ్రతగా ఉండాలా?

**జ.** వివాహమంటే సంతానోత్పాదన. స్త్రీ సంతానం ద్వారా పునీతురాలవుతుంది. ఏ కారణం వల్లనయినా భర్త పనికి రానప్పుడు, సంతాన సామర్థ్య శక్తి లేనప్పుడు స్త్రీ తన మాతృత్వ హక్కును నిర్భయంగా వాడుకోవచ్చు. ప్రేమాభిమానాలను నిర్లక్ష్యం చేయకుండా సంతానం కోసం మాత్రమే, కొన్ని ధర్మాలను ఆచరిస్తూ వరుసైన వారితో సంతానం పొందవచ్చు. మనుస్మృతిలో చెప్పిన ప్రకారము మాతృత్వాన్ని పొందిన స్త్రీ తిరిగి మళ్ళీ ఆ ప్రయత్నాన్ని కొనసాగించకూడదు. అలా చేస్తే ఆ సంబంధము అక్రమ సంబంధము క్రింద పరిగణించవచ్చు.

## 685. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి అభయహస్తానికి అర్థం ఏమిటి?



**జ.** తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి అభయహస్తంతో మనకి సాక్షాత్కరిస్తాడు. స్వామి అయిదు వేళ్ళు కలిపి మనకి చూపటంలో అర్థం, మన శరీరంలో వ్యాన, సమాన, ఉదాన, ప్రాణ, అపానములను వాయువులుంటాయి. ఆ అయిదు వాయువులు నిలిచిన మనస్సు నిలకడగా ఉంటుంది. కాన ఆ అయిదు వాయువులను ఒక్కటిగా చేసి ప్రార్థించు అని భావము.

## 686. నీటినీ, పాలనూ, మజ్జిగనూ ఏ సమయంలో త్రాగాలి?

**జ.** ఉదయం లేవగానే అనగా తెల్లవారు జామున నీటినీ, రాత్రిపూట పాలనూ, మధ్యాహం భోజనం చేశాక మజ్జిగా త్రాగాలి. అలాగే భోజనసమయంలో మంచి నీటిని కుడివైపు ఉంచుకోవాలి. భోజనం చేస్తున్నంత సేపు ముద్దముద్దకీ నీరుని త్రాగరాదు. మొత్తం భోజనంలో నీరు అయిదు నుంచి ఏనిమిది శాతం మాత్రమే తీసుకోవాలి.

## 687. ధనత్రయోదశి రోజు బంగారం కొంటే లక్ష్మికి ఆహ్వానమా?

**జ.** 'ధన్‌తేరస్' అనే పేరుతో ఉత్తరాదిన బాగా ప్రాచుర్యం పొందిన ఈ పండుగ రోజు బంగారాన్ని కొనటం శుభమని, ఈ రోజుకొంటే ఏడాది పొడుగునా బంగారం కొనే ఆర్థిక స్థితి శ్రీమహాలక్ష్మి ఇస్తుందని నమ్మకం. పురాణ ఆధారాలు కూడా ఉన్నాయి. ఈ పండుగనాడు మహిళలు బంగారం కొంటానికి ఉత్సాహం చూపిస్తుంటారు. మహిళలకి ముఖ్యంగా కావల్సింది మూడు... ఒకటి చీరలు, రెండు నగలు... తర్వాత మొగుడు. ఏది ఏమయినా ఈ రోజున ఎవరి కున్నంతలో వారు బంగారం కొనుక్కుంటారు. అది చాలు. ఎవ్వరికైనా ఇంటి ఇల్లాలు కళకళలాడుతూ సంతోషంగా ఉండటమేగా కావాల్సింది. అష్టైశ్వర్యాల పండగ అక్షయ తృతీయ. ఈరోజే శ్రీమహాలక్ష్మి పాలకడలి నుంచి ఉద్భవించింది. పాండవులు అక్షయ పాత్రను పొందినరోజు. శ్రీకృష్ణుడు కుచేలునికి బంగారు పట్టణాన్ని ఇచ్చిన రోజు.


## 688. పిల్లలకి పేరెలా నిర్ణయించాలి?

**జ.** బిడ్డపుట్టిన పదకొండవ రోజు లేదా ఏదైనా మంచిరోజు శుభముహూర్తం చూసుకొని జాతక కర్మ చేయాలి. వారి

వారి కులాచారము ప్రకారం అర్థం వచ్చేలా పేరు పెట్టుటవల్ల వాని ఆచారాలనూ, సంప్రదాయాలనూ గౌరవించే దిశగా ఎదుగుతారు బిడ్డలు. ఉదా: బ్రాహ్మణ బిడ్డకు శుభవాచక నామధేయమూ, వీర పుత్రునికి బలమైన వాచకనామమూ, వైశ్యునికి ధనవాచక నామధేయమూ పెట్టాలి. అప్పుడే మీ పూర్వ వంశీ కులు హర్షిస్తారు. బిడ్డ పుట్టిన మూడు నెలలకి సూర్య దర్శనము చేయించాలి. ఆరో నెలలో అన్నప్రాశన చేయాలి.

## ౬౭౯. వినాయకుడి ముందు గుంజిళ్ళు తీసేదెందుకు?

***జ.*** వినాయక చవితినాడు గుంజిళ్ళు అది కూడా ఇరవై ఏడు గుంజిళ్ళు తీయటంలో పరమార్థం ఉంది. ఇరవై ఏడు ఇళ్ళలో ఇరవై ఏడు గుంజిళ్ళు తియ్యమని చెబుతారు. దానివల్ల శరీర దోషాలు తొలగి పోతాయని పెద్దలు చెబుతారు. వారేకాదు ఖగోళానికి చెందిన అంశమని ఖగోళ శాస్త్రజ్ఞులూ అంగీకరిస్తారు. చిన్ననాటి



నుంచే అందరితో సఖ్యతగా ఉండమని సమాజమంటే మనుష్యులనీ అందరితో కలిసి మెలిసి ఉంటే సుఖమని తెలియ చెప్పటమే మరో ఉద్దేశ్యము.

## ౬౮౦. చిన్నవారయినా పెద్దవారంటే?

***జ.*** జ్ఞానమున్న బ్రాహ్మణులూ, బలమున్న రాజులూ, ధనమున్న వైశ్యులూ వీరంతా చిన్న వారయినా పెద్దవారే. పెద్ద వారికిచ్చే అన్ని గౌరవాలు ఇవ్వాలి. అలాగే వయస్సువల్ల పెద్దవారయిన వారూ పెద్దవారే.

## ౬౮౧. మనువు స్త్రీకి వ్యతిరేకా?


***జ.*** మనువు స్త్రీ ధర్మాలను అనేకం చెప్పాడు. కుటుంబ గౌరవాన్ని నిలపాలన్నా, పోగొట్టాలన్నా స్త్రీయే కారణము. అటువంటి స్త్రీని కనిపెట్టుకోవాలనీ, రక్షించుకోవాలనీ, సుఖపెట్టాలనీ చెప్పాడు. తప్పు చేస్తే ఎంత ఘోరమైన శిక్షలు వెయ్యాలో చెప్పాడు. అలాగే మగవాడికీ అనేక శిక్షలు చెప్పాడు. స్త్రీని ఇష్టం లేకుండా పొందితే దొంగతనానికి శిక్షగా శిరచ్ఛేదం చెయ్యమని చెప్పినట్టు లింగచ్ఛేదం చెయ్యమన్నాడు. యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతాః. అనగా స్త్రీలను ఎక్కడ పూజిస్తే అక్కడ దేవతలు నాట్యం చేస్తారని చెప్పాడు.

తండ్రి బాధ్యతలు విస్మరిస్తే కూతురు తను స్వయంగా ఎంచుకొని వివాహం చేసుకోవచ్చని చెప్పాడు. ఆ రోజుల్లోనే

నీటిని వడగట్టి త్రాగమన్నాడు. స్త్రీని గౌర వించమన్నాడు. అలాగే డప్పు, ఎద్దు, ఆడది కొడితేనే మాటవింటాయనీ చెప్పాడు. ఆనాటి నుంచి ఈనాటి వరకూ వచ్చాయంటే ఎంతో క్రమశిక్షణ వాటిలో ఉన్నట్టే. అప్పట్లో ఏం చెప్పాడు అని అను కోవటం కంటే ఈ కాలానికి మనువు చెప్పిన ధర్మ శాస్త్రంలో ఏం నేర్చుకోవాలో ఏం వదిలేయాలో తెలుసు కోవటానికైనా మను ధర్మం శాస్త్రం చదవండి. మనువుని విమర్శించేవారు ఆయన చెప్పిన అనేక మంచి విషయాలను వదిలేస్తున్నారు. తల్లీ తండ్రీ బ్రతికున్నంత వరకూ ఆస్తి పంచు కోకూడదన్నాడు. విడిపోవద్దన్నాడు. మరి అలాంటి ధర్మాలెన్నో చెప్పాడు.

### 612. దర్భలకెందుకంత పవిత్రత?

**జ.** గరుత్మంతుడు తల్లి దాసీతనాన్ని తొల గించటానికి దేవలోకం నుంచి అమృత కలశం తెచ్చి, దర్భ మీద పెట్టి కద్రువ పుత్రులకి చూపించి, తన తల్లిని దాసీతనం



నుంచి విముక్తి చేయండి అని చెబుతాడు. అలా అమృతభాండ స్పర్శవల్ల దర్భలు పవిత్ర మయ్యాయి. అందువల్లే సమస్త మానవ దేవ హోమాల్లో దర్భలు అంతటి ప్రాము ఖ్యతనూ, అర్హతనూ పొందాయి.

### 613. అశుభ శకునములు

**జ.** భార్య సాధింపూ, పిల్లల గొడవ పడు తున్న సమయములో కాలు బైటపెట్ట రాదు. కాళీ కడుపుతోనూ, అతిగా తిని గానీ బైలుదేరరాదు. అకాల వర్షం తుమ్ములు, పశువుల అరుపులు ఇట్టివి అపశకునములు.

### 614. ప్రదక్షిణ చేసేటప్పుడు ఎలా నడవాలి?

**జ.** వింటి నుంచి వెలువడ్డ బాణంలా, వెనుకెవరో తరుము తున్నట్టు ప్రదక్షిణం చేయరాదు. నిండు గర్భిణీ నడిచినట్టు అడుగులో ఆడుగు వేస్తూ అడుగడుగునా దేవుడ్ని స్మరిస్తూ ప్రదక్షిణములు పూర్తి చేయాలి. అలాగే అర్ధరాత్రీ, మధ్యాహ్నమూ దైవదర్శనము చేయరాదు.

### 615. గృహవాస్తు యజమానిపైనే పని చేస్తుందా?

**జ.** ఆ గృహంలో అందరి మీద ఎంతో కొంత పని చేస్తుంది. ఎక్కువ శాతము యజమాని మీద పని చేస్తుంది. వాస్తు దోషాలు ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తుంది. దివాలా తీయటమూ, అనా రోగ్యమూ, పరాయిస్త్రీపై మమకారమూ, అతిఖర్చూ, అభివృద్ధి లేకపోవటమూ,

మోసపోవటమూ, అవమానం చెందటమూ, మానసిక బాధలు... ఇలా అన్నీ ఇన్నీ కావు. వాస్తు అనేది నమ్మకమూ, ఆరోగ్యమూ ఈ రెంటితో పాటు శాస్త్రం కూడా. ప్రతివారు నమ్మకమున్నా లేకపోయినా వాస్తు పాటించాలి. కారణం వాస్తు ఆరోగ్యం కూడా కాబట్టి. శ్రీరాముడు అరణ్యవాసాన పంచవటిలో ఆశ్రమాన్ని వాస్తు ప్రకారమే నిర్మించి వాస్తు పూజ చేసి గృహప్రవేశం చేశాడని చెబుతారు.

### ౬౫౬. వివాహ పద్ధతులెన్ని?



**జ.** పెద్దల శాస్త్రాల ప్రకారం, దేవతా మంత్రాల సాక్షిగా, వధూవరులు ఒకరినొకరి హస్తాలు గ్రహించి చేసుకోవటం వివాహం. కన్యను అలంకరించి వరునికి ఇచ్చి జరిపించే వివాహం బ్రహ్మ వివాహం. యజ్ఞం చేయటం కోసము ఋత్విక్కుకు కన్యని దక్షిణగా ఇవ్వటం దైవ వివాహము. ఆవు, ఎద్దూ దానం చేసి ఆపై కన్యను ఇవ్వటం ఆర్షవివాహం. మహానుభావునికి ప్రియురాలిగా సహధర్మ చారిణిగా ఉండమని ఆదేశించి కన్యను ఇవ్వటం ప్రాజపత్య వివాహము. తల్లి, తండ్రీ అనుమతి లేకుండా ఇరువురూ చేసుకోవటము గాంధర్వ వివాహము. షరతు పెట్టి వివాహం చేసుకోవటము అసుర వివాహం. కన్యను బలాత్కారంగా తీసుకెళ్ళి వివాహం చేసుకోవటం రాక్షసవివాహం. కన్య నిదుర పోయేటప్పుడూ, ఏమరుపాటుగా ఉన్నప్పుడూ చేసుకున్న వివాహం పైశాచిక వివాహము.

### ౬౫౭. ఎలాంటి స్థితిలో ఉన్నవారి వద్దకు వెళ్ళకూడదు?


**జ.** రతి జరుపుకుంటున్న సమయంలోనూ, ఆలోచనలతో ఉన్న వారి దగ్గరికీ, హోమం చేసేటప్పుడూ, భోజనం చేస్తున్న వారి వద్దకూ వెళ్ళకూడదు. వస్తే వచ్చిన వార్ని అనుమానించాలి. వచ్చిన వారు మనహితులు కాదని తెలుసుకోవాలి.

### ౬౫౮. నవరత్నాలు తొమ్మిది కదా.... అసలు రత్నాలు ౨౨... అవి ఉన్నాయా?

**జ.** ఉన్నాయనే పురాతన శాస్త్రాలూ, గ్రంధాలూ చెబుతున్నాయి. అవి వజ్రమూ, ఇంద్రనీలమూ, మరకతమూ, కర్కేధన, పద్మరాగము, రుద్రాక్ష, వైఢూర్యమూ, విపులా, విపులికా, రజమణీ, స్ఫటికమూ, సౌగంధికమూ, చంద్రకాంతమూ, గోమేధికమూ, సంగమూ, మహానీలమూ, పుష్యరాగమూ, బ్రహ్మమణీ, జ్యోతిర్రసా, సీసగము, ముత్యమూ, పగడము.

## ౬౯౯. నవరత్నాలను ఏ ఏ వేళ్ళకు ధరించాలి?

**జ.** కెంపును మధ్య వేలికి శుక్రవారం పూట, ముత్యాన్ని ఉంగరపు వేలికి సోమ వారమూ, పగడాన్ని బొటన వ్రేలికి గురు



వారమూ, పుష్యరాగాన్ని బ్రొటన వేలికి గురువారమూ, పచ్చను ఉంగరపు వేలికి బుధవారమూ, వజ్రాన్ని మధ్యవేలికి శుక్ర వారమూ, నీలమును చూపుడు వేలికి శని వారమూ, గోమేధికము చూపుడు వేలికి శనివారమూ, వైఢూర్యాన్ని చిటికన వేలికి శనివారమూ ధరించాలని రత్నశాస్త్రం శెలవిస్తోంది.

## ౭౦౦. వినాయక చవితి రోజు చంద్రుడ్ని చూస్తే నీలపనిందలొస్తాయా?

**జ.** దీనికి ప్రధాన కారణం ఆరోజు అనగా వినాయక చవితినాడు చంద్రుని నుంచి వచ్చే కిరణాల్లో మార్పు వుంటుంది. ఆ రోజు చంద్రుడ్ని చూడటంవల్ల కంటి చూపుకు ఇబ్బంది రావచ్చు. అందుకనే ఆ దోషాలను పోగొట్టేలా వివిధ ఆకులతో వినాయకుని పూజ చేసి వ్రత కథ చదివి చంద్రుడ్ని చూడమంటారు. వినాయక పూజలోవాడే ఆకుల్లో చంద్రకిరణాల్లో ఉండే దోషాన్ని హరించే శక్తి ఉంది.

## ౭౦౧. రాత్రిపూట చెట్ల క్రింద ఎందుకు నిద్రించకూడదు?

**జ.** పగటి పూట చెట్లు బొగ్గు పులుసుని పీల్చి ప్రాణవాయువుని పీల్చుకొని బొగ్గు పులుసుని వదులుతాయి. బొగ్గు పులుసు వాయువు అనారోగ్యము. కాన పగటి పూట లాభం, రాత్రి పూట నష్టము.


## ౭౦౨. మహాభారత పర్వాలు ఎన్ని? అవి ఏమిటి?

**జ.** భరతవంశ గాథను మూడేళ్ళ వ్రతాన్ని చేబట్టి వేదవ్యాసుడు జయకావ్యాన్ని వ్రాశాడు. ఆపై వైశంపాయనుడు జనమేజయునికి జయకావ్యాల గూర్చి చెబుతున్నప్పుడు కలిగే సందేహాలనూ, సమాధానాలనూ వేదవ్యాసుడి ఆశీస్సులతో చెప్పినది కలిపి భరతము. ఆపై ఉగ్రశ్రవసుడు నైమిశా రణ్యంలో శౌనకాది మునులకు భారతాన్ని వివరిస్తూ, రమ్యంగా చెబుతూ ఉన్నప్పుడు కలిగిన సందేహాలనూ, సమాధానాలనూ వ్యాసుడి తాత్పర్యానికి అనుగుణంగా చెప్పినదంతా కలిపినదే. అలా చెప్పిందే మహాభారతము. మహాభారత పర్వాలు పద్ధెని మిది. ఆది, సభా, అరణ్య, విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ, శాంతి, అనుశాసనిక, అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ అను పద్దెనిమిది పర్వాలే మహాభారతము.

## 703. తెల్లవారు జామున బైలుదేరితే వారశూల దోషముండదా?

**జ.** తెల్లవారు జామున అనగా ఉదయం నాలుగు గంటల ముందు బైలుదేరితే (సూర్యో దయం ముందు) ఏ దోషమూ లేదు. ఏ దిక్కుకైనా ప్రయాణించవచ్చు. వారశూల దోషాలతో సంబంధము లేదు. అయితే ఈ విషయం కేవలం ప్రయాణానికి మాత్రమే అని గుర్తుంచుకోవాలి.

## 704. అరుంధతికి ఉపదేశించిన అయిదు వత్తుల దీపారాధన ఫలం ఏమిటి?



**జ.** శ్రీ మహాలక్ష్మీ, శ్రీగౌరీ, మహా సరస్వ తులైన ముగ్గురమ్మల జ్యోతిర్యుపాసనను అరుంధతికి ఉపదేశించారు. అయిదు వత్తుల దీపారాధన చేయటం వల్ల తొలి వత్తి భర్త సమస్త కోరికలు తీరుటకూ, రెండవ వత్తి సంతాన యోగక్షేమాల కోసమూ, మూడవ వత్తి పుట్టింటి మరియు అత్తింటి క్షేమము కొరకూ, నాలుగవ వత్తి కీర్తి, గౌరవము కొరకూ, ఐదవ వత్తి సకల అరి ష్టాలను పోగొట్టుటకూ, దుఃఖము నుంచి విముక్తి కొరకూ. ఒక వత్తి దీపారాధన చేయవలదు.

## 705. పెళ్ళి చేసుకోకపోతే స్వర్గప్రాప్తి ఉండదా?

**జ.** స్త్రీ పురుషులెవ్వరైనా వివాహం కానిదే స్వర్గ ప్రవేశం చేయలేరు. కాని భగవం తునిపై అపారభక్తితో వివాహ విషయాన్ని వదిలేసి అనంతమైన భక్తి ప్రపత్తులతో ఆ దేవుడ్నికొలిస్తే స్వర్గానికి వెళ్ళవచ్చు. ధర్మ, అర్థాలతో, న్యాయాలతో సంపా దించిన పుణ్యంతో స్వర్గాన్ని చేరలేరు. స్వర్గాన్నీ, మోక్షాన్నీ పొందాలంటే భక్తి తప్పనిసరి.

## 706. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం ప్రకారం జరగాల్సినవి

**జ.** తిరుపతికి వేళ్ళే అన్ని దారులూ మూసుకుపోతాయి. శ్రీవేంకటేశ్వరస్వామి సంపదను ఆరుగురు దొంగలు దోచు కుంటారు. కృష్ణానది మధ్యలో బంగారు రథం బైటపడుతుంది. అది చూసి ప్రజలు కనులు పోగొట్టుకుంటారు. శ్రీశైల మల్లి ఖార్జునుడు భక్తులతో మాట్లాడతాడు. యాగంటి బసవన్న రంకె వేస్తాడు. మధుర మీనాక్షి జనులతో మాట్లాడుతుంది. బనగానపల్లెలో పాతరమీది చింత చెట్టుకు జాజులు పూస్తాయి. రాయదుర్గంలో రామ చిలుక వీరధర్మాలను చెబుతుంది. శ్రీకాళ

హస్తి గుడిలో దోపిడి జరుగుతుంది. మల్లి కార్జునుడు శ్రీశైలాన్ని వదిలి వింధ్య పర్వతాలకి వెళతాడు. పెనుగొండలో పెద్ద పులులు తిరుగుతాయి.నెల్లూరు సీమ నీటిలో మునిగిపోతుంది. కృష్ణమ్మ కనక దుర్గమ్మ ముక్కుపోగును తాకుతుంది. శ్రీకుమారస్వామి ఆలయం వారం రోజులు మూసేస్తారు. అర్ధరాత్రి సూర్యోదయ మవుతుంది. బెంగుళూరులోని వైశ్య కులంలో శ్రీమహాలక్ష్మి జన్మిస్తుంది. కంచి కామాక్షి కనులెర్ర చేస్తుంది. ఆ ధాటికి దక్షిణాన జనులు మరణిస్తారు.

## 707. ఆలయాల్లో హనుమంతునికి ఒళ్ళంతా సింధూరము ఎందుకు రాస్తారు?

**జ.** ఓసారి సీతాదేవిని హనుమ 'తల్లీ, నీ నుదుట సింధూర తిలకమునకు అర్థ



మేమిటి' అని అడిగాడు. దానికి జనక రాజపుత్రి 'నాయనా! స్త్రీకి బొట్టు మంగళ ప్రదం, సౌభాగ్యదాయకం, నేనిలా బొట్టు పెట్టుకొంటుంటే నా స్వామి అయిన శ్రీరాముని ఆయువు నిత్యమూ పెరుగుతుంటుంది' అని చెప్పింది. దానికి హనుమ సీతమ్మ నుదుటన అంత సింధూరపు బొట్టు పెట్టు కుంటేనే స్వామి ఆయువు పెరిగితే, నేను వళ్ళంతా స్వామి పేరు చెప్పి సింధూరాన్ని అద్దుకుంటే ఇంకెంతో ఆయువు పెరుగు తుందని వళ్ళంతా సింధూరం పులుము కొని సీతమ్మకి చూపించి 'అమ్మా, నేనింక జీవితాంతమూ, ఒళ్ళంతా నా స్వామి కోసం సింధూరము పూసుకుంటాను' అని చెప్పాడు. అందుకే హనుమ విగ్రహానికి సింధూ రాన్ని రాస్తారు. ఈ చర్య భక్తి మార్గాల్లో మహోన్నతమైన మూఢభక్తికి చెందినది.

## 708. సంవత్సరంలో ఒక్కసారయినా నేరేడు తినమనేదెందుకు?

**జ.** చక్కెర వ్యాధిని తగ్గిస్తుంది. కడుపు లోని ప్రేవులకు అంటుకొని ఉన్న అనేక సూక్ష్మజీవులు విసర్జించబడతాయి. నాలుక మొద్దుబారి రుచి తేడా తెలియ కుండా ఉన్నవారికి నేరేడు తినడం వల్ల ప్రతిరుచి స్పష్టంగా తెలుస్తుంది. ఇవన్నీ చెబితే వింటారో వినరోనని సంవత్సర కాలంలో ఒక్కసారన్నా నేరేడు పండును తినమని చెబుతారు. అందుకే చాలా మంది పెద్దలు దగ్గరుండి పిల్లలకి తినిపిస్తారు.

## 709. 'రామ' అనే రెండక్షరాలు శివునివి!?

**జ.** వాల్మీకి రామాయణ శ్లోకాలు ఇరవై నాలుగు వేలు. అయితే శివుని వద్ద మరింత విపులంగా వంద కోట్ల శ్లోకాలుగల రామాయణం ఉందట. ఆ వంద కోట్ల శ్లోకాలు దేవతలకి, మహర్షులకు, రాక్షసులకూ అందరికీ ఇచ్చాడట. తుదకు ఓ శ్లోకం మాత్రమే మిగిలింది. మిగిలిన శ్లోకాన్ని పదిమందికి పది అక్షరాలు పంచగా రెండే అక్షరాలు మిగిలాయి. ఆ రెండక్షరాలే 'రామ'. మహాశివుడు ఆ అక్షరాలను రెంటినీ ఎవ్వరికీ ఇవ్వనని తనే ఉంచుకున్నాడట.

## 710. కైకను వివాహం చేసుకున్నప్పుడు ఆమె బిడ్డకే పట్టం కడతానని దశరథుడు మాట ఇచ్చాడా?

**జ.** ఇచ్చాడు. అయితే కైకకు కాదు. ఆమె తండ్రి కైకయ మహారాజుకు. పట్టాభిషేక సమయంలో నీవు వచ్చి అడుగుతే నీవు చెప్పినట్టు నీ బిడ్డ పుత్రునికే పట్టం కడతానని చెబుతాడు. అందుకే దశరథుడు వశిష్ఠ మహర్షిని కూడా సంప్రదించకుండా హడావుడిగా పట్టాభిషేకం నిర్ణయిస్తాడు. కైకయ రాజుకి కూడా శ్రీరాముడే పట్టాభిషిక్తుడవ్వాలని ఉండటంతో ఏ రోజు తన వరం గుర్తుచెయ్యలేదు. అందుకే కైక తన తండ్రి వచ్చి అడగడని, దేవాసుర యుద్ధంలో ఇచ్చిన కోరికలను అడుగుతుంది.

## 711. మగవాడిలో పరస్త్రీ ఆశ ఉన్నదని ఎలా తెలుస్తుంది?



**జ.** ఏకాంత ప్రదేశంలోనూ, పార్కులలోనూ, నదీ, సముద్ర తీర ప్రాంతాల్లోనూ కారణం లేకుండా లేదా ఉన్నా మాట్లాడినా, ఉద్దేశ్యము ఉన్నట్టే. పూలు, గంధమూ బహుమతిగా పంపినా తనని కోరుతున్నాడని స్త్రీ అర్థం చేసుకోవాలి. సరదాగానూ, వేళాకోళంగానూ, ఎక్కువసేపు మాట్లాడేవారూ, అవకాశాన్ని బట్టి తాకటానికి ప్రయత్నించేవారూ ఆ కోవలోకే వస్తారు. తన శరీరంలో తాకరాని ప్రదేశంలో తాకుతున్నా, అభ్యంతరం పెట్టకుండుట, అక్కడ్నుంచి కదలకపోవుట చేస్తే స్త్రీకి ఆ ఉద్దేశ్యము ఉన్నట్టే. మగవాడికి ఆహ్వానం ఇచ్చినట్టే. స్త్రీ మగవాడికి ఆవగింజంత అవకాశం ఇస్తే ఆ బుల్లి అవకాశంతో ఏనుగును పట్టేంత చేస్తాడు.

## 712. భోజనాన్ని ఎలా తీసుకోవాలి?

**జ.** ఆచమనం చేసిన తర్వాత తీసుకోవాలి. అన్నమునకు నమస్కరించాలి.


ఆహారపదార్థాలను చూసి చిరాకు పడ రాదు. వండినవార్ని అభినందించాలి. అప్పుడే బలాన్నీ, సామర్థ్యాన్నీ ఇస్తుంది. లేనిచో వికటిస్తుంది. భోజనం మధ్యలో లేవటమూ, మాట్లాడటమూ తగదు. ఎంగిలి అన్నాన్ని ఇతరులకు పెట్టరాదు. భార్యకు సహితము పెట్టరాదు. పదార్థాలు బాగు న్నాయని అతిగా తింటే ఆయుష్షు తగ్గు తుంది. భోజనానంతరము కూడా ఆచమనం చేయాలి. ఆచమన విధి తెలి యనప్పుడు భగవంతుడ్ని స్మరించి ఆపై భుజించాలి. విస్తరిలో ఏమీ మిగల్చరాదు. అవసరమైనంత వడ్డించుకోవాలి. లేదా వడ్డించమని చెప్పాలి. ఇష్టం లేని పదార్థా లను ముందుగానే వద్దనాలి.

## 713. ఆవు పేడలో అపారశక్తులు!

**జ.** మన భారతీయులే కాక విదేశీయులు సయితం ఆవుపేడ అద్భుతమైనదని చెబు తారు. ఆవుపేడను అలికిన ఇంట్లో సూక్ష్మ క్రిములురావు. పవిత్రమైన యజ్ఞయాగా దులకు ఆవుపేడనే ఉపయోగిస్తారు. ఆవుపేడ వాసనవలన మలేరియా సోకదు. అత్యంత వేడిని నియంత్రించే శక్తి కూడా ఆవు పేడలో ఉంది. ఇంటిని ఊడ్చిన పుడూ, వాకిలి ఊడ్చినపుడు అనేక రోగ క్రిములు గాలిలోకి లేస్తాయి. అలాంటి వాటికి విరుగుడుగా ఆవుపేడను నీటిలో కలిపి కళ్ళాపు చల్లటం, అలకటం ద్వారా వాటిని నివారించవచ్చు.

## 714. తులసీదాసు రామ భక్తుడెప్పుడయ్యాడు?

**జ.** తులసీదాసు హస్తినాపురంలో ఆత్మా రాముడు, మాతాదేవిలకు జన్మించాడు. ఆపై రత్నావళి అనే సుందరితో వివాహ మైంది. భార్యంటే విపరీతమైన వ్యామోహం. దానితో పుట్టింటికెళ్ళిన భార్యకోసం అర్థ రాత్రి బైలుదేరి వెళ్ళి ఆమెను కలిశాడు. అప్పుడే రత్నావళి భర్తతో అశాశ్వతమైన ఈ వ్యామోహంకన్నా, భగవంతునిపై ఆపేక్ష శాశ్వతమైనది అని చెప్పింది. దానితో తులసీదాసుకు జ్ఞానోదయమై శ్రీరామ నామ జపం చేస్తూ జీవితాన్ని గడిపాడు.






## 715. అతిగా తింటే నిద్ర ఎందుకు ముంచుకు వస్తుంది?

**జ.** తినగానే నిద్ర మంచిది కాదు. పూర్వ కాలంలోని వారు భోజనం చేశాక కాస్త దూరం నడిచేవారు. సత్రాల్లో భోజనం చేసిన వారు ఎట్టి పరిస్థితుల్లో నిద్రపోయే వారు కాదు. తమతమ ధనాన్ని దొంగలూ, స్వార్థపరులూ కొల్లగొట్టే ప్రమాదం ఉందని. ఆ కారణంగానూ, ఆరోగ్య పరంగానూ నిద్ర మంచిది కాదు. భోజనం చేసినపుడు జీర్ణవ్యవస్థలో రక్తప్రసారం జరిగి పోషకాలను స్వీకరిస్తుంది. ఆ సమయంలో ఎక్కువ రక్తం అవసరం అవ్వటంతో శరీరంలోని మిగతా భాగాల్లో రక్త ప్రసరణ తగ్గి మగతగా మత్తుగా అనిపిస్తుంది. నలభై అయిదు దాటిన వారు భోజనం అయ్యాక ఓ పావు గంట ఆగి నిదురించటం మంచిది.

## 716. ఏ రత్నాన్ని దేనితో శుభ్రపరచాలి?



**జ.** కెంపును నిమ్మపండు రసంతోనూ, ముత్యాలని తక్కోల చెట్టు రసముతోనూ, పగడాలను ఆవుపాలతోనూ, పుష్యరాగంను ఉలవల నుంచి వచ్చిన గంజితోనూ, వజ్రాన్ని పులిసిపోయిన బియ్యపు కడుగు నీళ్ళతోనూ, పచ్చను మజ్జిగతోనూ, గోమేధికమును మాదీఫల రసంతోనూ, నీలమును నీలిచెట్ల ఆకులరసంతోనూ శుద్ధి చేయాలి.

## 717. ఉపనయనము చేసేదెందుకు?

**జ.** ఉపనయనము చేయుట వల్ల ద్విజత్వ సిద్ధి కలుగుతుంది. అన్ని విద్యలు ఉపాసించు అర్హత లభిస్తుంది. ముందుగా తొలిగా గాయత్రీని ఉపదేశిస్తారు. గాయత్రి వల్ల జ్ఞానమూ, విజ్ఞానమూ పెరుగుతాయి. గురు ఆదేశంతో విద్య అభ్యసించిన సమస్త సుఖములు లభించును.

## 718. అనారోగ్యం ఎందుకొస్తుంది?

**జ.** వాతావరణాన్ని బట్టి ఆహారం తీసుకోక పోవటంవల్ల. పులుపు పదార్థాలు ఎక్కువగా తీసుకోవటంవల్ల. ఎండిన మాంసము అనగా ఎండు చేపలూ ఇత్యాది తీసుకోవటం వల్లనూ. ఋతుకాలాల యందు ఆహారాన్ని తినకపోవటం వల్లనూ. పాపపు ఆలోచనలూ, చేష్టల వల్లనూ, పర్వత ప్రాంతాల్లో పడకపోయినా నివాశించటంవల్ల. పాచిన అన్నాన్నీ, ఎండిన కూరలు తీసుకోవటం వల్ల. రెండు పూటల పెరుగు తినటంవల్ల. సమయపాలన లేకుండా ఇష్టమొచ్చిన వేళల్లో తినటంవల్ల. వెంటవెంటనే తినటం వల్ల. వ్యాయామం లేకపోవటం వల్ల. అన్నం మధ్యలో నీళ్ళని విపరీతంగా త్రాగటం

వల్ల. జూదమూ, మద్యమూ వంటి వ్యసన ములవల్ల. అన్నింటికీ మించి పరిశుభ్ర మైన నీటిని త్రాగకపోవటం వల్ల.

### 719. స్త్రీకి పుంసవనము చేస్తే పుత్రుడు జన్మిస్తాడా?



జ. పున్నామ నరకం నుంచి రక్షించు వాడు పుత్రుడు. తల్లీ, తండ్రికి ఉత్తర క్రియలు చేయుటకై వృద్ధాప్యంలో చూసు కోవటం కొరకు పుత్రుడ్నికనాలి. తొలి పుత్ర సంతానం కోసం స్త్రీ గర్భవతి అవగానే పుష్యమీ నక్షత్రాన పుంసవనము చేస్తారు.

### 720. ఏ సంఖ్యకు ఎవరు అధిపతి?

జ. ఒకటవ సంఖ్యకు సూర్యగ్రహమూ, రెండవ సంఖ్యకు చంద్రుడూ, మూడవ సంఖ్యకు గురువూ, నాల్గవ సంఖ్యకు రాహువూ, అయిదవ సంఖ్యకు బుధ గ్రహమూ, ఆరవ సంఖ్యకు శుక్రుడూ, ఏడవ సంఖ్యకు వరుణుడూ, ఏనిమిదో సంఖ్యకు శనీ, తొమ్మిదో సంఖ్యకు కుజుడు అధిపతులు.

### 721. ఈశాన్యాన దేవుడ్ని పెట్టే వీలు లేకపోతే?

జ. మారిన జీవన పరిణామాల దృష్ట్యా, ఉద్యోగ నిర్వహణలవల్ల ఎక్కడెక్కడికో వెళ్ళ వల్సి వస్తుంది. అలాంటప్పుడు దేవుడ్ని ఈశాన్యాన పెట్టుకునే అవకాశం, సదు పాయం ఉండకపోవచ్చు. అలాంటప్పుడు దేవుడు పశ్చిమాన్ని చూసేలా ఏర్పాటు చేసుకోవాలి.

### 722. పారిజాత పూలతో పూజ చేయవచ్చా?

జ. కొంతమంది పారిజాత పూలతో పూజ చేయకూడదని... భగవంతునికి ఇష్టం లేని పూలని చెబుతుంటారు. తెలసీ తెలియక చేసిన ప్రసంగాలను పట్టించు కోవక్కర్లేదు. పారిజాత పూలతో భగవం తునికి ప్రీతికరంగా పూజ చేయవచ్చు.

### 723. మహాభారతాన్ని వినాయకుడు ఎక్కడ వ్రాశాడు?

జ. వ్యాసుడు చెబుతుంటే వినాయకుడు ఘంటం ఎత్తకుండా వ్రాసింది, మన భారతదేశ చివర గ్రామమైన 'మాన'లో. హిమాలయాల్లో ఉంది ఈ గ్రామం. బదరీనాథ్ వెళ్ళిన వారు తప్పని సరిగా ఈ గ్రామాన్ని దర్శిస్తారు. 'జయ' కావ్యమనే మహాభారతాన్ని వినాయకుడు వ్యాసుని పలుకు ప్రకారం రాస్తుంటే ప్రక్కన ప్రవ హిస్తున్న సరస్వతీ నది తన పరుగుల ఉరు కుల శబ్దాలకి అంతరాయం కలగకూడదని



మౌనం వహించి ప్రవహిస్తుంది. ఆ అద్భుతాన్ని ఇప్పుడు కూడా బదరీనాథ్ వెళ్లిన వారు చూడవచ్చు. నింపాదిగా ఆగి గమనిస్తే సరస్వతీనది భారతాన్ని రాసిన చోట శబ్దం లేకుండా ప్రవహిస్తుంది. ఆ ప్రదేశాన్ని దాటగానే మళ్ళీ గలగలలు.

### 724. ఎలాంటి పురుషుడ్ని వివాహమాడాలి?

**జ.** ధైర్యమున్నవాడూ, మంచిగుణములు కలవాడూ, శుభలక్షణ సంపన్నుడూ, విద్యాపారంగతుడూ, తనకన్నా పొడవైన వాడూ, సంపూర్ణ ఆరోగ్యవంతుడూ, స్త్రీ



వ్యసనములూ, జూదవ్యసనములూ లేని వాడూ, మద్యాన్ని ఇష్టపడనివాడూ, అందగాడూ, పలువరుస చక్కగా ఉన్నవాడూ, తలమీద నిండైన జుట్టు కలవాడూ అయిన పురుషుడ్ని స్త్రీ కోరుకోవాలి.

### 725. ఇలా చేయకూడదు?

**జ.** పెద్దవారినీ, అగ్నినీ, వాయువునూ, నీటినీ, సూర్యుడినీ చూస్తూ మలమూత్రాలను వదలరాదు. పగటిపూట ఉత్తర ముఖముగా, రాత్రి సమయమున దక్షిణ దిశగా విడువవలెను. స్త్రీ ఈ రెండు పనులూ భర్త గమనించకుండా చెయ్యాలి.

### 726. తాటాకు మంటంటే?

**జ.** చాలా మంది కొన్ని విషయాలను పోలుస్తూ, వాడి కోపం తాటాకు మంట లాంటిదంటారు. తాటాకు మంట ఎంతో సేపు ఉండదు. ఉన్నంత సేపు భగభగలాడి పోతుంది. ఆపై చప్పున ఆరిపోతుంది. అలాగే తల్లి, తండ్రి బిడ్డల మీద అరుస్తారు. భర్త భార్య మీదా, భార్య భర్త మీదా అరుస్తుంది. స్నేహితుడు, స్నేహితుడి మీద అక్కసు వెళ్ళగక్కుతాడు. ఇలాంటి వారందరి కోపతాపాలూ, పట్టుదలలూ, తాత్కాలికము. తాటాకు మంట వంటిది. ప్రేమ ఉన్న చోట కోపం ఉంటుంది. అలాంటి కోపం పేరే తాటాకు మంట.

### 727. ఏ నెలలో పుట్టినవారు ఏ రత్నం ధరించాలి?

**జ.** జనవరి నెలలో జన్మించిన వారు గార్నెట్. ఫిబ్రవరిలో పుట్టిన వారు ఎమి

తెస్టు. మార్చి నెలలో పుట్టినవారు ఎక్వ్యమైరెన్. ఏప్రియల్ నెలలో పుట్టినవారు వైఢూర్యము. మే నెలలో పుట్టినవారు పచ్చ. జూన్ నెలలో పుట్టినవారు ముత్యము. జులై నెలలో పుట్టినవారు కెంపు. ఆగష్టు నెలలో పుట్టినవారు నక్షత్రనీలము. సెప్టెంబర్ నెలలో పుట్టినవారు ఇంద్రనీలము. అక్టోబర్ నెలలో పుట్టినవారు చంద్రకాంతమణి. నవంబర్ నెలలో పుట్టినవారు పుష్యరాగము. డిసెంబర్ నెలలో పుట్టినవారు పచ్చ.

## 728. బ్రహ్మ ముడి బ్రహ్మదేముడే వేస్తాడా?



**జ.** వివాహ సమయంలో వధూవరు లిరువురి చెంగులకూ ముడి వేసి ఆశీర్వదిస్తారు. ఈ ముడి సాక్షాత్తు బ్రహ్మదేవుడే మంత్రోచ్ఛారణతో వేస్తాడు. జీవితాంతము ఇరువురూ కలిసి మెలిసి ఉండాలని బ్రహ్మదేవుడిచే వెయ్యబడిన ముడే బ్రహ్మముడి. ఒకరి చేయి ఒకరు పట్టుకొని అగ్ని చుట్టూ ప్రదక్షిణంచేసి కలిసి మెలిసి సుఖంగా ఉంటామని ముమ్మారు ప్రదక్షిణ చేయటమే పాణిగ్రహణము.

## 729. పురుషుడు చెయ్యాల్సినవి?

**జ.** భార్యను హక్కుగా భావించి తిట్టరాదు. ఆమె బంధువులతో చీటికి మాటికి కయ్యానికి కాలుదువ్వరాదు. భార్య వడ్డించిన పదార్థాలను విమర్శించరాదు. ఇంటిని భార్య జైలులా భావించే పరిస్థితులు లేకుండా వారానికి ఒక్కసారయినా బైటికి తీసుకెళ్ళాలి. పిల్లలతో సరళ సంభాషణలు చేయాలి. పిల్లలు చూస్తుండగా భార్యతో చనువుగా ఉండరాదు. ఏకగదిలో కాపురం ఉంటున్నవారు పిల్లలని గమనించి కలవాలి. భార్యకి ఎంతో కొంత ఆర్థిక స్వేచ్ఛ ఇవ్వాలి. ఆమె అభిప్రాయాలను గౌరవించాలి.

## 730. చిలుకూరి బాలాజీని దర్శిస్తే విదేశాలకి వెళ్తారా?

**జ.** తాళపత్ర పురాణ గ్రంథాల్లో అయితే విపులంగా లేదు. అక్కడి స్వామిని దర్శించి, కోరిన కోర్కె కోరుకుంటే జరుగుతుందని నమ్మకము. ఎంతమందికి అలా కోరికలు తీరాయో తెలుసుకోవాలంటే చిలుకూరి బాలాజీని దర్శించాలి. కోరికలు తీరిన వారూ, తీరాలనుకునే వారూ గుడి చుట్టూ ప్రదక్షిణాలు చేస్తుంటారు. అలాంటి వారిని అంతమందిని, ఆ జన సందోహాన్ని చూస్తే అర్థమవుతుంది చిలుకూరి గుడిలో అమోఘమైన శక్తి ఏదో ఉందని.

## 731. శ్రీరాముడెక్కడ?



**జ.** ఢిల్లీనేలే అక్బర్ పాదుషా శ్రీ రామ చరితమానస్ రచించిన రామభక్తుడు తులసీదాసుని పిలిపించి 'నీ రాముడెక్కడ; చూపించు' అని అడిగాడట. దానితో తులసీదాసు హనుమను వేడుకున్నాడు. అంతే అనేక కోతులు తరలి వచ్చి అల్ల కల్లోలం చేయసాగాయి. అక్బర్ పాదుషా 'ఇదేంగోల' అని అడిగితే 'ప్రభువు రావా లంటే పరివారం ముందు వచ్చి ఏర్పాట్లు చెయ్యాలిగా' అన్నాడు. అంతే అక్బర్ తన తప్పు తెలుసుకుని తులసీదాసుని సకల మర్యాదలు చేసి పంపాడు.

## 732. భాద్రపదమాసములో పండుగలూ, వ్రతాలూ?

**జ.** ఈ మాసంలో పిల్లలకూ, పెద్దలకూ ఇష్టమైన పండుగ వినాయకచవితి. ఈ రోజున అంతా వినాయకపూజ చేసి అక్ష తలు తలపై చల్లుకొని చంద్రుడ్ని చూస్తారు. ఈ మాసంలో ఋషిపంచమీ, సూర్యషష్ఠీ, కేదారవ్రతములు చేసుకుంటారు. విష్ణు పరివర్తన ఏకాదశీ, వామన జయింతీ, అనంత పద్మనాభ వ్రతములూ వస్తాయి. ఈ మాసంలో చివర్లో వచ్చే మహాలయ అమావాస్యనాడు పితృదేవతలకు తర్పణ శ్రాద్ధా విధులను నిర్వహిస్తారు.

## 733. వసెక్కువ పోశారంటారు?

**జ.** సంస్కృతంలో 'వచ' లేదా 'ఉపగ్రంధ' అంటారు. తేమగా ఉన్న ప్రదేశంలో పెరు గుతుంది. పసితనంలో తొందరగా మాటలు రావటానికి వసకొమ్మును అరగదీసి తేనెతో కలిపి పోస్తారు. అలా పోస్తే వాక్కు స్పష్టంగా చక్కగా త్వరగా వస్తుందని అలా పోస్తారు. సమతూకంగా వసపొయ్య కుండా ఎక్కువ పోస్తే గలగల మాట్లాడ తారు. అలాంటి వాళ్ళని సంబోధించి వీడికి వసెక్కువ పోశారంటారు. ఆయు ర్వేదంలో వాపును కూడా ఈ వస చెట్టు వేళ్ళరసం తగ్గిస్తుందని ఉన్నది.

## 734. చతుఃషష్టి కళలు అనగా ఏవి?

**జ.** 64 కళలు అని అనేక సందర్భాల్లో విని ఉంటారు. ఆ 64 కళలు ఇవి. 1. అష్టాదశ లిపిబోధ 2. తల్లేఖనము 3. శీఘ్ర వాచనము 4. బహువిధ భాషా జ్ఞానము 5. తత్తత్ భాషా కవితా కథనము 6. ద్యూతము 7. ఋగ్వేదము 8. యజుర్వే దము. 9. సామవేదము 13. ధనుర్వేదము 14. గాంధర్వవేదము 15. శిక్ష 16 వ్యాక రణము 17. ఛందస్సు 18. నిరుక్తము 19. జ్యోతిషము 20. కల్పము 21. మీమాంసా. 22. న్యాయ శాస్త్రము 23. పురాణము 24. ధర్మశాస్త్రము 25. రాజ్యాంగము

26. పంచాంగము 27. తంత్రము 28. పురాణకథనము 29. స్మృతి 30. కావ్యములు 31. అలంకారము 32. నాటకము 33. శాంతి 34. విశ్వ 35. ఆకర్షణ 36. విద్వేష 37. ఉచ్చాటన 38. మారణ 39. గతి 40. జల 41. అగ్ని 42. దృష్టి 43. ఆయుధ 44. వాక్ 45. రేతస్ 46. గజ 47. హయ 48. రథ 49. శిక్షణ 50 సాముద్రిక 51. మల్లయుద్ధము 52. పాచకత్వము 53.గారుడవిద్య 54 సుషిన 55.అనర్ధ 56. ఘనా 57. ఇంద్రజాల 58. నృత్య 59. గీత 60. రసవాద 61. రత్నపరిక్ష 62. చౌర్య 63. ధాతుపరిక్ష 64. అదృశ్యత్వము.

## 735. పిల్లలు లేనివారు సుబ్రహ్మణ్యేశ్వరుడ్ని ఎందుకు పూజిస్తారు?

**జ.** పార్వతీ పరమేశ్వరులను దర్శించటానికి అనేక మంది తాపసులు కైలాసానికి వచ్చారట. అందులో దిగంబర ఋషులూ ఉండటంతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హేళనగా నవ్వాడు. దానికి పార్వతి పుత్రుని మందలించి, మర్మాంగాలు సృష్టి వృద్ధి కోసం సృష్టించినవి, జాతికి జన్మస్థానాలని తెలియచెప్పింది. తల్లి జ్ఞానబోధతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సర్పరూపం దాల్చాడు కొంతకాలం. జీవకణాలు పాముల్లా ఉంటాయని మనకి తెలిసిందే. ఆ తర్వాత వాటికి అధిపతి అయ్యాడు సుబ్రహ్మణ్యేశ్వరుడు. దాని వల్లే



జీవకణాల అధిపతియైన సుబ్రహ్మణ్యేశ్వరుని పూజిస్తే పిల్లలు పుట్టని దంపతులకు సంతానం కల్గుతుంది.

## 736. కటిక నేల మీద పెట్టకూడనివి?

**జ.** బంగారమూ, రత్నములూ, దీపము, శివలింగము, శంఖమూ, సాలగ్రామమూ, జలమూ, పుష్పమూ, తులసిదళాలూ, జపమాలలూ, కర్పూరమూ, రుద్రాక్షమాలా, కుశమూలములూ (గరిక), పుస్తకమూ, యజ్ఞోపవీతమూ, ఆవు పంచితమూ, నెయ్యూ, తమలపాకులూ, పండ్లూ, వీటిని నేలపై ఉంచరాదు.

## 737. ఆశ్వీయుజ మాసములో పండుగలూ, వ్రతాలూ?

**జ.** శరన్నవరాత్రులు ప్రారంభము. నవరాత్రి పూజలను తొమ్మిది రోజులు ఘనంగా చేసుకుంటారు. దుర్గాష్టమీ పండుగల్లో పెద్ద పండుగ. అమ్మవారిని తొమ్మిది రోజులూ తొమ్మిది రూపాలతో భక్తితో వైభోపేతంగా పూజలు జరుపుకుంటారు. విజయదశమీ, దసరా అని పిలిచే ఈ పండుగ నెల అంతా భక్తిమయం, శక్తిమయం.

## 738. తీర్థం సేవించిన తర్వాత చేతిని తలకు రాసుకోవచ్చా?

**జ.** తీర్థం తీసుకోవటానికి చేతిని గోకర్ణ భంగిమలో ఉంచి తీసుకుంటాము. ఆపై అనాలోచితంగా మనం ఆ చేతిని తలపై



రాసుకుంటాము. అలా చెయ్యటం తగదు. తీర్థం పంచామృతంతో చేస్తారు. అందులో తేనె, పంచాదార వంటివి జుట్టుకు మంచి వికాదు. అలాగే తులసీ తీర్థం తీసుకొన్నా తలపై రాసుకోకూడదు. తీర్థం తీసుకోవటంవల్ల చేయి ఎంగిలవుతుంది. ఎంగిలి చేతిని తలపై రాసుకోకూడదు. ఏ తీర్థం తీసుకున్నా చేతిని సాధారణ నీటితో శుభ్రం చేసుకోవాలి. వైష్ణవ సంప్రదాయంలో గంగాజలంతో అభిషేకం చేసిన తీర్థాన్ని మాత్రమే తల వెనుక రాసుకోవాలని ఉంది.

## 739. ఆశ్వియుజ బహుళ చతుర్దశి

**జ.** ఇదే పిల్లలకు అసలు సిసలు ఆనందోత్సాహాల పండుగ. శ్రీమహాలక్ష్మిని కొలిచి, ప్రసన్నం చేసుకునే దివ్యమైనరోజు. పాతాళం నుంచి బలి ఈ రోజే భూమిపైకి వచ్చాడనీ, ఈనాడే వామనావతారంలో బలిని పాతాళంలోకి అణగదొక్కాడనీ పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజున తిలతైలంతో తలస్నానం చేస్తారు. దానికి కారణము దీపావళీ పర్వ పవిత్ర రోజుల్లో లక్ష్మీదేవి తిలతైలంలో ఉంటుంది. నరకం చతుర్దశినాడు నువ్వులతో చేసిన వంటకాలు తింటారు. నరక చతుర్దశి పండుగకి వెనుకున్న గాథ నరకాసురుడు ఇంద్రుడి తల్లి అదితి కర్ణాభరణాలనూ, దేవతా పుత్రికలు పదహారు వేలమందినీ బలవంతంగా తీసుకెళ్ళాడు. అది తెలిసి సత్యభామ భర్త శ్రీకృష్ణుడితో కలిసి నరకాసురునిపైకెళ్ళి శ్రీకృష్ణుడిచే చంపిస్తుంది. దానికి గుర్తుగా నరక చతుర్దశిని జరుపుతారు. దీపావళిరోజు అమావాస్య. ఆ రోజున లక్ష్మీ పూజ విశేషంగా చేస్తారు. సూర్యుడు తుల రాశిలో ప్రవేశిస్తాడు. దీపావళి మరుసటి రోజు గోవర్ధన పూజ చేస్తారు. విక్ర మార్కుడు పట్టాభిషిక్తుడైన రోజుకూడా ఇదే.

## 740. ఎలాంటి వాళ్ని కొలువులో పెట్టుకోవాలి?

**జ.** తన కన్నా తెలివి తేటలు తక్కువ ఉన్న వారినీ, బలవంతులనీ, వయసులో ఉన్న వారినీ నియమించుకోవాలి. కార్యాన్ని అప్పచెబితే సంపూర్ణంగా చేసేవాడినీ పెట్టుకోవాలి. వస్తు, కొనుగోళ్ళు విషయాన్ని యజమాని ఎప్పుడూ తెలియనివ్వరాదు. అమ్మిన వస్తువుపై ఖచ్చితమైన

లాభాన్ని సేవకులకు తెలియనివ్వరాదు. తనకిచ్చే దాన్నికాక, యజమానికెంత వస్తుంది అని ప్రశ్నించుకునేవాడ్నీ, ఆలోచించేవాడ్నీ వెంటనే తప్పించాలి. చెప్పిన పనిని అయిందన్నట్టు భ్రమ కల్పించేవాడిని ఒక్క ఘడియ కూడా ఉంచరాదు. అబద్ధాలు చెప్పేవాడినీ, యజమాని గూర్చి వెనుక మాట్లాడేవాడినీ, రహస్యాలను వెల్లడి చేసేవారినీ గమనిస్తూ ఉండాలి.

యజమానికి ఎంతో నమ్మకంగా, మరెంతో ఖచ్చితంగా పనులు చేసినా, గౌరవమూ, భక్తీ లేనివారిచే పనులు చేయించుకోకూడదు. ఎదురు సమాధానం చెప్పేవార్ని, తనకే వ్యాపార మెళుకువలు చెప్పేవార్ని ముఖ్యమైన పనులన్నింటికి దూరంగా ఉంచాలి. యజమాని వచ్చిన తర్వాత పనికి వచ్చే వార్నీ, పదినిమిషాల పనిని గంట చేసేవార్ని పెట్టుకుంటే ఆ యజమని వృత్తిలో రాణించదు. అట్లే సేవకుని ఆర్థిక కష్టాలు, యజమాని గమనించకపోతే ఆదుకోకపోతే, సరైన సమయానికి భత్యమూ, తగు అవసరాలూ తీర్చకపోతే ఆ యజమాని వృత్తి వృద్ధిలోకిరాదు. యజమానికి ఎన్ని తెలివితేటలున్నా అవి ఆచరణలో చూపించేది వారే.... వారే లేకపోతే యజమాని లేడు. ఆ విషయాన్ని పదే పదే గుర్తించి మసులుకోవాలి. ఎంతో పెద్ద తప్పు చేస్తేనే మందలించాలి. పరుష పదజాలాన్ని ఎట్టి స్థితిలోనూ వాడకూడదు. యజమాని మాటకూ, చూపుకీ భయపడాలి. ఎంతో మంది పనిచేస్తేనే ఆ యజమాని అంత ధనవంతుడవుతాడు. కీర్తివంతుడవుతాడు. సుఖవంతుడూ అవుతాడు.

## 741. శ్రీరామనవమి



**జ.** చైత్రశుద్ధనవమి శ్రీరామనవమి. సీతారాముల కళ్యాణమూ, శ్రీరాముడు రావణుడ్ని వధించి లంక నుంచి అయోధ్యకు వచ్చిన రోజూ ఇదే. శ్రీరామనవమి రోజు ఉపవాసాదులు చేయుట శుభం. ఈ పండుగనాడు రఘుకుల తిలకుడైన శ్రీరామచంద్రుడి ప్రతిమను అదియును ఎడమతొడ మీద సీతాదేవి ఉన్న ప్రతిమను దానం చేయుట శుభకరం. ఆ ప్రతిమలో శ్రీరాముని కుడి చేయి జ్ఞాన ముద్ర కలిగి ఉండాలి.

## 742. చైత్రమాసంలో ఏ పండుగ లొస్తాయి?

**జ.** సంవత్సరారంభము అనగా ఉగాది. ఈ రోజున బ్రహ్మదేవుడ్ని ప్రార్థిస్తే సకలమూ శుభమవుతుంది. బ్రహ్మను ప్రార్థిం


చాల్సిన ఏకైక పండుగ ఈ ఉగాదే. డోలా గౌరీ వ్రతమూ, సౌభాగ్యశయన వ్రతాలు చేయాలి. శ్రీమహావిష్ణువు మత్స్యా వతార మెత్తి సోముకుడ్నించి వేదాలను రక్షించి బ్రహ్మకిచ్చిన రోజు. సృష్టిని బ్రహ్మ ప్రారం భించిన రోజే ఈ ఉగాది.

### 743. పూజ సమయాల్లో చెయ్యకూడనివి, చెయ్యాల్సినవి

**జ.** సూర్యుడు ఉదయించడానికి ముందే లెగవాలి. అస్తమించిన తర్వాత నిదు రించాలి. నోములూ, వ్రతాలూ చేసే రోజు తలకు నూనెపెట్టడం, దువ్వటం చేయ రాదు. శని, ఆది, మంగళవారాలలో కొత్త వస్తువుని కొనరాదు. స్నానం చెయ్యకుండా పొయ్యి వెలిగించవద్దు. శుక్రవారాలు ప్రయాణాలు చెయ్యవొద్దు. తొలుతగా ముందు మీరు బొట్టుపెట్టుకొని ఆపై ఇత రులకు బొట్టు పెట్టాలి. పూజ సమయ రోజుల్లో మంచినీళ్ళు, మజ్జిగా మీ చేతు లతో వడ్డించొద్దు. ఇతరుల నుంచి ఉప్పు, నూనె తీసుకోవద్దు. గడపని కాలితో తొక్క కుండా జాగ్రత్త వహించండి. గడప బయట నుంచి లోపల వస్తువుని బయటకు తీసుకు రావద్దు. అలాగే బయట వస్తువులని గడప అవతల పెట్టరాదు. రాత్రి భోజనంలో పెరుగుని ఎట్టి పరిస్థితులలో తీసుకోవద్దు.

### 744. కుక్కలు మూలిగినా, ఏడ్చినా ఎవరికో మూడినట్లేనా?

**జ.** కుక్కలు మూలిగినా, ఏడ్చినా యమ ధర్మరాజు వస్తున్న సంకేతకంగా భావి



స్తారు. వాసనచూసి ఎలా చోరులని గుర్తి స్తాయో, అలానే మానవులకి కనిపించని అనేక దివ్య, దుష్టశక్తులు కుక్కలకి కన్పి స్తాయి. కుక్కలు అలా ప్రవర్తించినపుడు చాలాసార్లు చాలచోట్ల మరణాలు సంభ వించాయి. ప్రకృతిని, భగవంతుడి ఉని కిని తెలుసుకోవటానికి ఎన్ని జన్మలైనా చాలవు. కానీ పశు... పక్ష్యాదుల్లో కొన్ని అతీతశక్తులున్నాయి. మనిషి గుర్తించలేని వాటిని ఎన్నో అవి గుర్తిస్తాయి. చెప్ప టానికి కుక్కలకి మాటలేదు. ఆ మాటే కుక్కలకి ఉంటే ఈ భూమ్మీద మానవుడు ఉండేవాడు కాదు. కుక్కలకే కాదు ఏ జీవికి మాట్లాడే శక్తి ఉన్నా మనిషి ఈ భూమిని శాసించలేదు. అందుకే దేముడు అన్ని జంతువులకంటే తక్కువ అర్హతలతో మనిషిని పుట్టించి 'మాట' అనేది ఇచ్చి అందరికంటే ఎక్కువ చేశాడు.

### 745. మార్గశిరమాసములో పండుగలూ, వ్రతాలూ?

**జ.** ఈ మార్గశిర మాసములోనే దత్తా త్రేయ జయింతి. మార్గశిర పౌర్ణమి నాడే దత్తాత్రేయ జయంతి. తనకు తానుగా

పుత్రరూపాన్ని ఇచ్చి దత్త నామధేయు డయ్యాడు శ్రీమహావిష్ణువు. ఈ మాసంలోనే ధనుస్సంక్రాంతి. తిరుప్పావై పారాయ ణము ప్రారంభమయ్యే శుభప్రధమైన రోజు. సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించే పుణ్య వేళ అప్పటి నుంచే ధనుర్మాసం మొదలు.

## 746. పుష్కరాలు ఎలా ఏర్పడ్డాయి?

**జ.** పుష్కరుడనే భక్తుడు మహేశ్వరుని గూర్చి ఘోర తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకోమన్నాడు. అందుకు పుష్కరుడు 'స్వామీ నదులన్నీ జీవులు చేసిన పాపాలతో నిండిపోయాయి. ఆ నదు






లని పునీతము చేయుటకై నీ జలమైన శరీరమును నాకిమ్ము, నీ స్పర్శతో నదు లన్నీ పునీతమవుతాయని' కోరాడు. ఆ తర్వాత బృహస్పతి కూడా శివుని తను వుని పుష్కరునివలే పొంది సర్వులకూ ఆ ఆకారము కావాలని తపము చేశాడు. బృహ స్పతి తపస్సుకు మెచ్చి శివుడు తనకిచ్చిన వరాన్ని బృహస్పతికివ్వటానికి పుష్కరుడు వప్పుకోలేదు. ఆపై బ్రహ్మ గూర్చి గరుడు తపస్సు చేసి తన కోరిక తెలియచెప్పాడు. అప్పుడు బ్రహ్మ పన్నెండు జీవనదులలో సంవత్సరానికొక్కసారి పన్నెండు రోజులు పుష్కరుడుండునట్టు, గరుడొక్క రాశిలో సంచారము బట్టి జరుగుతుందని చెప్పి ఇద్దర్నీ శాంతపరిచాడు. పుష్కర స్నానం వల్ల, ఆహల్యను భంగంచేసిన దోషాన్ని ఇంద్రుడు పోగొట్టుకున్నాడు. బ్రహ్మ శిరస్సు ఖండించిన దోషం వలన పొందిన బ్రహ్మహత్యా పాపం నుంచి శివుడు విము క్తుడయ్యాడు.

## 747. లలితా సహస్రనామం ఏ రోజు చదివితే ఎంత ఫలం?

**జ.** ప్రతిరోజు లలితను చదవటం మహా ఫలం. అలా వీలుకాని వారు ప్రతి శుక్ర వారం చదవాలి. అలాగే పుణ్యఘడియల్లో ఫలితం ఎన్నోరెట్లు ఎక్కువ. అలాగే కుటుంబ సభ్యుల జన్మ నక్షత్ర సమయాల్లో చదివితే కుటుంబశాంతి. పౌర్ణమి నాడు చంద్రుని చూస్తూ చదవటంవల్ల సాక్షాత్తు లలితా దేవి ఎదురుగానే పఠించినట్టే. లలితా దేవికి కలువలూ, మారేడు దళాలూ, తులసీ

దళాలూ, మల్లెపూవులూ ఎంతో ఇష్టం. అలాగే నైవేద్యంగా పాయసమూ, పులగమూ, చిత్రాన్నమూ, దానిమ్మా, బూడిద గుమ్మడికాయా ప్రీతి. దక్షిణావృత శంఖము ఇత్యాదివన్నీ ప్రీతికరములు.

## 748. ఆబ్దికమునాడు భోక్తలకు ఎలా వడ్డించాలి?

**జ.** తొలుత అన్నాన్ని వడ్డించాలి. భోక్త కుడివైపుగా పప్పు వేసి ఆపై తీపి వడ్డించాలి. ఆజ్యపాత్ర ఉంచాలి. భోక్త ఎడమ వైపు పూర్ణములూ, లేదా అలాంటి భక్షము లుంచాలి. అన్నాన్నీ, కూరలనీ, లవణమునీ గరిటెతో భోక్తకి వడ్డించాలి. పండ్లు వడ్డిస్తే వొలిచి వడ్డించాలి. భోక్త వడ్డన కావల్సివస్తే సైగలతోనే చెప్పాలి. భోక్తలను ఒకరినొకరు తాకకుండా కూర్చోబెట్టాలి.

## 749. వివాహ సమయంలో పదహారు ఆజ్య హోమములకి అర్థమేమిటి?

**జ.** తొలి హోమము వధువుని తొలుత పొందిన చంద్రునకు ఆహుతి దత్తము చేస్తారు. ఆపై గంధర్వునకూ, అగ్ని హోత్రునకూ ఆహుతి దత్తము చేస్తారు. నాలుగో హోమము పితృగృహం నుంచి భర్త గృహముకు పోవుటకై కన్యకా దీక్షను వదలివేసినందుకు ఆపై హోమం పితృకులం వదలేసినట్టు భర్త కులాన్ని వదలకుండా ఉండేందుకు. ఆరవహోమము ఇంద్రునికై, సౌభాగ్యవతిగా సుపుత్రవతిగా చేయమని. ఆపై ఏడో హోమము అగ్నిదేవుడి గూర్చి




వధువుకి కలిగిన సంతానాన్ని మృత్యువు నుంచి సదా రక్షించమని వధువుకి భవిష్యత్తులో పుత్రశోకం కలగనీయవద్దని. ఎనిమిదో ఆజ్యహోమం, కలిగిన సంతానానికి సంపూర్ణ ఆయుష్షు నిచ్చి ఈమెను సంతోషంగా ఉంచమని. తొమ్మిదో ఆజ్య హోమము శోకం దరిచేరకుండా, కన్నీరు కార్చకుండా భర్త, బిడ్డలనూ చూసుకుంటూ పరిపూర్ణ సంతోషం పొందాలని. పదవహోమము వధువు మెడను నింగీ, వాయుదేవుడు, ఊరువులనూ, ఎదను ఆశ్వనీదేవతలూ, పుట్టబోయే సంతానాన్ని భానుడూ, ధరించిన వస్త్రములను బృహస్పతీ, వెనుక భాగాన్ని దేవతలూ రక్షించాలని. పదకొండవ ఆజ్యహోమము తెలిసీ తెలియక చేసిన పాపాలను క్షమించమని, వాటి నుంచి కలుగు దుఃఖమును దేవతలు పోగొట్టమని. పన్నెండవ హోమము వరుణదేవుడి కోసం, చల్లగా కాపాడమని, పదమూడో హోమము వరుణ్ని ప్రార్థించటము.... సమస్త కుటుంబ ఆయుర్దాయమును భంగపరచకుండా, కోపం లేకుండా ప్రార్ధనలని వినమని.

పద్నాలుగో ఆజ్యహోమము అగ్ని హోత్రు డికై, వరుణ దేవుడి కోపాన్ని పోగొట్టి మమ్ము సంతోష పరచమని, మాపై శత్రు వుల చర్యలను ఆదిలోనే వ్యర్థం చేయ మని. పదిహేనవ హోమము దేవతలలో తొలి వాడయిన అగ్నిదేవుడ్ని మా యజ్ఞ యాగాదులందు హవిస్సు భుజించి, ఆపై మా కోరికలు తీర్చమని. పదహారవ హోమము అగ్నిహోత్రునికి మనసా వాచా ధ్యానించి పూజించి నమస్కరించటము.

## 750. హనుమంతునకూ, సువర్చలకు వివాహం జరిగిందా?

**జ.** కొన్ని ఆలయాల్లో ఏకంగా వారిద్దరికి వివాహం కూడా జరిపిస్తున్నారు. హను మంతుడు బ్రహ్మచారి. సూర్యుని కుమార్తె పేరు సువర్చల. హనుమ సూర్యుని వద్ద విద్యాభ్యాసం చేశాడు. ఆ సమయంలో సువర్చల హనుమని ఇష్టపడింది.



విషయం తెలిసిన సూర్యుడు విద్యాభ్యాసం అనంతరం హనుమని గురుదక్షిణగా సువ ర్చలను వివాహమాడమన్నాడు. హనుమ కలియుగాంతం అయ్యే వరకూ ఆగ మన్నాడు. ఆ తర్వాత వివాహం చేసు కుంటానని చెప్పాడు. కాన సువర్చలను హనుమ ఈ కలియుగం అంతమైన తర్వాతే వివాహం చేసుకుంటాడు ఇచ్చిన మాట ప్రకారమూ, సూర్యునికిచ్చిన గురుదక్షిణ ప్రకారము.

## 751. నరకాసురుడ్ని చంపింది శ్రీకృష్ణుడా? లేక సత్యభామా?

**జ.** ఎక్కువ మంది సత్యభామనుకుం టారు. తల్లి చేతిలో మరణమని అందుకే సత్యభామను యుద్ధానికి శ్రీకృష్ణుడు తెచ్చేలా చేశాడని అను కుంటారు. కానీ కాదు. సత్యభామే భూదేవి. శ్రీమహాలక్ష్మి పొందుతున్న వైభోగాల గూర్చి చెప్పి, తన వ్యధల గూర్చి భూభారం గూర్చి చెబు తుంది. అప్పుడే శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవి ఇంతవరకూ ఎన్ని భోగాలు అనుభవిం చిందో అవన్నీ ఒక్క జన్మలోనే (సత్య భామ) అనుభవిస్తావని చెబుతాడు. ఆ సమయంలోనే బిడ్డల గూర్చి అడుగు తుంది. అడిగిన సమయం విష ఘడి యలు కావటంతో రాక్షసులు జన్మిస్తారనీ, తానే వార్ని చంపక తప్పదని చెబుతాడు. భూదేవి కడుపు తీపితో నీవు సంహ రించవద్దని 'వరం' శ్రీమహా విష్ణువును అడుగుతుంది. అప్పుడు శ్రీమహావిష్ణువు నీకు నీవుగా చంపమన్నప్పుడే సంహరి



స్తానని అభయం ఇస్తాడు. నరకాసురుడిపై యుద్ధానికి వెళ్ళినప్పుడు సత్యభామను చూసి నరకుడు స్త్రీ అగ్నిలా మారే ప్రసంగము చేస్తాడు. తల్లిలాంటి నాపైనే కారు కూతలు కూస్తాడా సంహరించు 'వెధవను' అని సత్యభామ అంటుంది. శ్రీకృష్ణుడు చక్రాయుధం వదిలేలా చేస్తుంది సత్యభామ.

## 752. సనాతన ధర్మ లక్షణాలు ఏవి?

**జ.** సత్యాన్ని పలకటమూ, ఇంద్రియాలను నిగ్రహంగా ఉంచుకోవటమూ, తపస్సూ, శుచీలతో ఉండటమూ, సంతోషమూ, సిగ్గూ, సహనమూ, చక్కటి స్వభావమూ, జ్ఞానమూ, కరుణా, ధ్యానమూ ఇవన్నీ పాటించిన వారు సనాతన ధర్మ లక్షణాలను కలిగి వున్న వారు అవుతారు.

## 753. బ్రహ్మ ఆయువు ఎంత?

**జ.** ఒక కల్పక కాలం బ్రహ్మ దేవుడికి పగటికాలం. మరొక కల్పకం రాత్రి. అలా



పగలూ, రాత్రి కలిసిన అనేక కల్పకాల సమయమే బ్రహ్మదేవుడి ఆయువు. ఒక కల్పకాంతం అయ్యాకే మార్కండేయుడు వటపత్రశాయిని రావి ఆకుపై చూశాడు.

## 754. స్త్రీని ఉసురుపెడితే ఎంత శిక్ష అనుభవించాలి?

**జ.** మామూలు సాధారణ వ్యక్తుల సంగతి వదిలేస్తే భీష్ముడ్ని తీసుకుందా. మహాభారత గాథలో ద్రౌపదీ వస్త్రాపహరణ సమయంలో భీష్ముడు గట్టిగా వారిస్తే కౌరవులు ఆగిపోయ్యేవారే. ఆపాల్సిన ధర్మం ఉన్నా కూడా ద్రుపదునిపై కోపంవల్ల, ద్రోణాచార్యుడి స్నేహంవల్ల వస్త్రాపహరణాన్ని ఆపలేదు. ఏదో చెప్పాలి కాబట్టి చెప్పాడు గానీ, వికర్ణుడిలా గట్టిగా చెప్పలేదు. ద్రౌపది వేడుకున్నా భీష్ముడు కరుగలేదు. దానికి ఫలితమే బాణాల శయ్యమీద చిత్రహింస పడి మరణించాడు. ఆయనకై ఆయనే వేచి ఉన్నా అంతర్లీనంగా స్త్రీ ఉసురు పోసుకున్నందుకు భీష్ముడు అనుభవించిన శిక్ష అది. కొడుకుల దురాగతాన్ని వారించనందుకు

గాంధారీ, ధృతరాష్ట్రులు తమ పుత్రులందర్నీ కోల్పోయారు. ఆడదాని ఉసురు భయంకర శిక్షను ఇస్తుంది.

## 755. అన్నపూర్ణా దేవి శివునికెందుకు భిక్షం వేస్తుంది?

**జ.** దక్షయజ్ఞమయ్యాక సతీదేవి పార్వతిగా జన్మిస్తుంది. పెద్దయ్యాక శివుడ్ని వివాహం చేసుకోవాలని కోరుకుంటుంది. మహాశివుడు హిమాలయాల్లో ఘోరతపస్సు చేస్తుంటాడు. ఈ విషయం తెలుసుకుని పార్వతి హిమాలయాల్లో తపస్సు చేసుకుంటున్న శివుడ్ని ఆరాధిస్తుంది. శివుడు చలించకపోవటంతో మన్మథుడు శివునిపై బాణాన్ని వేస్తాడు. దానితో శివుడు ఉగ్రుడవుతాడు. మూడో కన్నుతో మన్మథుడ్ని భస్మం చేస్తాడు. ఆపై మరో ప్రదేశానికి తపస్సుకై వెళతాడు. పార్వతికి ఏం చెయ్యాలో పాలుపోదు. నారదుడు పార్వతితో చెపుతాడు.



'తల్లీ మహాశివుడు భిక్షాటనతో సంచారము చేస్తున్నాడు కాన నీవు పవిత్ర కాశీ క్షేత్రం చేరి ప్రతి భక్తునికి అన్నదానం చేస్తూ అన్నపూర్ణగా పిలిపించుకో, సరయిన సమయంలో మహాశివుడ నీకడ కొస్తాడు. భిక్ష అర్థిస్తాడు' అని చెప్పాడు. నారదుడు చెప్పినట్టు పార్వతీదేవి అన్నదానం చేస్తూ అన్నపూర్ణగా భక్తులతో ఆరాధింపబడుతున్న సమయంలో మహాశివుడు భిక్షకై అన్నపూర్ణ ముందుకువచ్చాడు. పార్వతి భర్తను గుర్తుపట్టి చేయి పట్టుకుంది. దానితో మహాశివునికి సర్వమూ అవగతమై పార్వతీదేవే అన్నపూర్ణ అని తెలుసుకుని పార్వతిని స్వీకరించాడు. అప్పట్నించి పార్వతీ దేవి కాశీక్షేత్రంలో అన్నపూర్ణగా వెలిసింది. కాశీ విశ్వేశ్వరుడిగా మహాశివుడు వెలిశాడు.


## 756. ఏ నామాన్ని జపిస్తే ఏ ఫలితం వస్తుంది?

**జ.** శ్రీరామ నామాన్ని జపిస్తే జయం. దామోదరుడ్ని జపిస్తే సకల బంధముల నుంచి విముక్తి. కేశవా అని స్మరిస్తే అనేక నేత్ర వ్యాధులు మటుమాయం. నారాయణా అని జపిస్తే సకల సర్వ గ్రహాల దోషాలు సమశిపోతాయి. మాధవా అని స్మరిస్తే అనుకున్న పనులు నెరవేరుతాయి. ఆచ్యుతా అని స్మరిస్తే తీసుకున్న ఆహారమే ఔషధంగా పనిచేస్తుంది. నరశింహా అని స్మరిస్తే మీ శత్రువులపై మీదే విజయం. అదే నారసింహా అని స్మరిస్తే సకల భయాల నుంచి విముక్తి. గోవిందా అని

స్మరిస్తే సకల పాపాలనుంచి విముక్తి. శ్రీమహా లక్ష్మీ విష్ణువులనూ స్మరిస్తే సకల సంపదలతో మీ గృహం కళకళలాడు తుంది. సర్వేశ్వరా అని స్మరిస్తే చేపట్టిన కార్యం సత్వరమే జరుగుతుంది. విజయం కలుగుతుంది. జగన్మాతా అని స్మరిస్తే సకల అరిష్టాల నుంచి విముక్తి. జగజ్జననీ అని స్మరిస్తే సర్వభయాలు తీరి ప్రశాంతత వస్తుంది. కృష్ణ కృష్ణ అని స్మరిస్తే కష్టాలు తొలుగుతాయి. శివ శివ అని స్మరిస్తే సకలమూ దరిచేరుతాయి.

## 757. దేవుని తీర్థం ఎంత ఆరోగ్యము?

**జ.** భగవంతుడ్ని దర్శించి తీసుకునే తీర్థంలో ఎన్నో ఆరోగ్య సుగుణాలుం టాయి. శ్రీ గంధం, తులసీ, పచ్చ కర్పూ రమూ, కేసరి మొదలగు వాటిని భగవం తుని తీర్థంలో కలుపుతారు. ఈ తీర్థం క్రిమిసంహారకంతో పాటు, రోగనివారక



గుణం కలిగి ఉంటుంది. అందుకే భగ వంతుడ్ని దర్శించాక తీర్థం తీసుకుంటే ఆధ్యాత్మిక భావనతోపాటు ఆరోగ్యం కూడా కలుగుతుంది.

## 758. కార్తీకమాసములో పండుగలూ, వ్రతాలూ?

**జ.** ఈ మాసంలో శ్రీమహావిష్ణువును దామోదర నామంతో భక్తులు పూజిస్తారు. ఎవరికి వీలున్న పరిస్థితిని బట్టి నదీ, నూతి స్నానమునూ భక్తితో చేస్తారు. ఈ మాసమును మించిన సమమైన మాసం లేదని అత్రి మహర్షి శెలవిచ్చారు. కార్తీక మాసములో కార్తీక మహాత్మ్యము చదు వుతూ, మహాశివుడ్ని కొలుస్తూ ఉసిరి చెట్టు క్రింద పూజలూ, భోజనాలూ, వనాల్లో విహారములూ ఇలా అనేక ఆరాధనలు చేస్తూ పరమానందంగా గడుపుతారు. కార్తీక సోమవారాలు విధిగా చేస్తారు. కార్తీక దీపాలు వెలిగిస్తారు. ఈ మాసం మంగళ ప్రదము. స్త్రీలకు ఐదవతనమును వృద్ధి చేస్తుంది. ఆలయాల్లో, తులసీవనాల్లో మహిళలు విశేషంగా అరటి దొప్పల్లో నూనె పోసి దీపాలని వెలిగిస్తారు. ఉసిరి కాయపై వత్తిని పెట్టి వెలిగించి విష్ణు దీవె నలను పొందుతారు. ఈ మాసంలో శివు నికి అభిషేకాలు చేస్తారు. శివాభిషేకం సకల పాపాలను పోగొడుతుంది. కార్తీక శుద్ధ విదియనాడు అన్న సోదరి ఇంటికెళ్ళి చీర పెట్టి ఆమె చేతివంట తిని సోదరికి సంతోషాన్ని కలిగిస్తాడు.

## 759. శివరాత్రి



జ. మహాశివుడ్ని అభిషేకాలతో, బిల్వ పత్రాలతో తమ్మిపూలతో భక్తిగా పూజించే పండుగ. చతుర్ధశి రోజున మహాశివునికి ప్రీతి అయిన కాలమే మాసశివరాత్రి. మాఘబహుళ చతుర్ధశి అనగా అమావాస్యకు ముందు వచ్చేది కాన మహాశివరాత్రి. ఈ శివరాత్రి మంగళ వారమొస్తే ఎంతో పుణ్యప్రదము. శివరాత్రి పగలు ఉపవాసము చేయాలి. రాత్రి అంతా జాగరణం చేయాలి. మహా శివునికి రుద్రాభిషేకం చేసే వారి హస్తం అమృత మయమే అవుతుంది.

## 760. ఓం శాంతిః శాంతిః శాంతిః

జ. కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ
దేశోయం క్షోభరహితః రాజానస్సంతు నిర్భయాః॥

సర్వ ప్రజలూ, ప్రాణులూ సుఖంగా జీవింతురుగాక. పరిపాలకుల ధర్మ న్యాయ పద్ధతులను సరించి పాలించెదరుగాక. సకాలంలో వర్షాలు పడి సకలం సంతోష దాయకమగుగాక. ఎట్టి ఉపద్రవాలూ లేకుండా లోకాలన్నీ సుఖజీవనం సాగించుగాక.

## 761. మాఘమాసములో పండుగలూ, వ్రతాలూ?

జ. మాఘమాసంలో సూర్యోదయం అవబోతున్న సమయంలో స్నానం చేస్తే కుటుంబానికంతటికీ శుభము. ధుండి గణపతి పూజలు చేస్తారు. శివుడ్ని మల్లె పూలతో పూజిస్తారు. కొన్ని ప్రాంతాల్లో 'శ్రీపంచమి' పండుగ చేసుకుంటారు. సరస్వతీ దేవిని పూజిస్తారు. అలాగే రథ సప్తమిని మాఘశుద్ధ సప్తమినాడు ఆచరిస్తారు. రథ సప్తమి సూర్యుడ్ని పూజించే పండుగ. మాఘశుద్ధ అష్టమి భీష్మాష్టమి.

## 762. ఆస్తీ, ఐశ్వర్యాలు నాలుగో తరంలో నిలవవా?

జ. తరతరాలూ తిన్నా తరగని ఆస్తి సంపాదించారని అంటారు. కానీ వాస్తవానికి ఆ తరతరాల సంపాదన నాలుగో తరం వచ్చేసరికి అడుగంటి పోతుంది. లక్ష్మి నిలకడలేనిదే అయినా, అలా ఆస్తి పోవటానికి కారణం, వారివారి పుత్రుల ప్రతినిధులే కారణం. ధనం విలువ తెలియక, నమ్మాల్సిన వారిని నమ్మక, నమ్మకూడని వారిని నమ్మి సర్వమూ పోగొట్టుకుంటారు. నడిరోడ్డు మీద మళ్ళీ కష్టపడుతుంటారు. ఇలా కావటానికి ధనమున్నదనే అహమూ, మధాలే

కారణము. ప్రేమలనూ, అప్యాయతలనూ, ధర్మాన్నీ, న్యాయాన్నీ మరచి పోవటము వలనే వారికా దుస్థితి.

### 763. అమృతాన్ని దేవతలకి మాత్రమే పంచి పెట్టడం న్యాయమేనా?

**జ.** క్షీరసాగర మధనంలో ధన్వంతరి అమృత కలశముతో ప్రత్యక్షమవ్వగానే



రాక్షసులు పరుగున వెళ్ళి, ధన్వంతరి హస్తాల్లోంచి అమృతాన్ని బలవంతంగా తీసుకొని తమ నిజస్థానాలకి తరలి వెళ్ళారు. ఇద్దరు కలిసి పనిచేసినప్పుడు ఫలం సరిసమంగా ఉండాలని శ్రీమహా విష్ణువు ముందే చెప్పినా వినలేదు. ధన్వంతరిని గౌరవించలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో శ్రీమహావిష్ణువు మోహినీ అవతారం ఎత్తి రాక్షసులకు మోహం కల్గించాడు. వారు అమృతాన్ని వదిలి మోహిని వెంట పడ్డారు. పెద్దలను గౌరవించక, మాటకు కట్టుబడక, అధర్మంగా ప్రవర్తించి అమృతాన్ని తెచ్చుకున్నా, స్త్రీ వ్యామోహంతో అమృతాన్ని పోగొట్టుకున్నారు. అందుకే వారు రాక్షసులయ్యారు. అధర్మంగా అమృతాన్ని అపహరించి తామొక్కరే చిరంజీవు లవ్వాలన్న స్వార్థమే రాక్షసులకి శాపమయ్యింది. అమృతం దూరమయ్యింది. శ్రీమహా విష్ణువు ధర్మ ప్రకారమే అధర్మ పరులకు అమృతాన్ని పంచలేదు.

### 764. ఆషాఢమాసములో పండుగలూ, వ్రతాలూ?

**జ.** జగన్నాధక్షేత్రంలో రథ యాత్ర జరుగుతుంది. ఈ మాసంలోనే శయనైకాదశి లేదా తొలి ఏకాదశి. శ్రీమహావిష్ణువు శంఖగదా చక్రాలు ధరించి ఆదిశేషునిపై శయనించి ఉండగా శ్రీమహాలక్ష్మీదేవి పాదములు వత్తుతుండే ప్రతిమను పూజించాలి. ఈ రోజునుంచే చాతుర్మాస్య వ్రతాన్ని పడతారు. వ్యాస పూర్ణిమా, శివ శయనోత్సవము ఈ మాసములోనే వస్తాయి.

### 765. గృహారంభము ఎప్పుడు ప్రారంభించకూడదు? ఎప్పుడు ప్రారంభించాలి?

**జ.** వైశాఖమూ, ఫాల్గుణమూ, పుష్యమూ, శ్రావణమూ, ఈ మాసములందు ముగ్గు పోయాలని బాదరాయణుడు శెలవిచ్చాడు. అదే నారదుడు ఫాల్గుణ, వైశాఖ, శ్రావణ,

కార్తికములందు గృహ నిర్మాణమునకు శ్రీకారం చుట్టమని చెప్పాడు. ఈ మాస ములలో గృహారంభము చేస్తే ధన, కనక, పుత్ర, ఆరోగ్య ములు వృద్ధి చెందుతాయని చెప్పాడు. కారణ తంత్రంలో స్థిర మాసమూ, స్థిర రాశీ, స్థిర అంశము ఇందు గృహానికి శంకుస్థాపన చేయుట మంచిదని చెప్పాడు. ప్రధాన గృహ నిర్మాణం పుష్య, ఆషాఢ మాసములలో వద్దని చెప్పాడు. దైవజ్ఞ వల్లభుడు, చైత్రమాసంలో గృహారంభము శోకమనీ, వైశాఖంలో శుభమనీ, జ్యేష్ఠంలో మహాభయంకర శోకమనీ, ఆషాఢంలో పశువుల క్షీణతనీ, శ్రావణము ధనకారనీ, భాద్రపదము దరిద్రమనీ, ఆశ్వీయుజము గొడవలనీ, కార్తీకము భృత్యనాశనమనీ, మార్గశిరము ధనప్రాప్తి అనీ, పుష్యం లక్ష్మీ ప్రాప్తి అనీ, మాఘమాసము అగ్ని భయమనీ ఫాల్గుణం సకల ఐశ్వర్యప్రాప్తి అని శెల విచ్చాడు.

## 766. శ్రావణమాసములో పండుగలూ, వ్రతాలూ?

**జ.** ఈ మాసంలో నదీ స్నానం వలదు. నదులన్నీ రజస్వలలు. సముద్రంలో కలిసే నదులకు పై నియమము వర్తిం చదు. నాగపంచమీ, దధివ్రతమూ, వర లక్ష్మీ వ్రతమూ వస్తాయి. తెలుగునాట ప్రతిఇంట వరలక్ష్మీ వ్రతము చేస్తారు. శౌనకాది మహర్షులకు సూతమహాముని చెప్పినదే. స్త్రీలకు సౌభాగ్య వంతమైనదీ, అపూర్వ ధన రాశులనూ ఇచ్చేదే వరలక్ష్మీ వ్రతము. వరలక్ష్మీదేవి చారుమతికి కలలో



కనిపించి, శ్రావణ పౌర్ణమి నాటికి ముందు వచ్చే శుక్రవారం పూజించి తరించమని చెబుతుంది. చారుమతి సకల విధి విధా నాలతో వరలక్ష్మీవ్రతం పూర్తి చేసి, తొలి ప్రదక్షిణ చెయ్యగానే కాలి అందియలు ఘల్లుమని మ్రోగాయి. రెండవ ప్రదక్షిణ చేయగానే నవరత్న ఖచిత కంకణాలు ధగధగలాడాయి. మూడో ప్రదక్షిణ చెయ్యా గానే ముత్తైదువులంతా సర్వాభరణ భూషితులయ్యారు. ఆ పట్టణమే ధన కనకములతో నిండిపోయింది. ఈ వ్రతం చేసినా, చూసినా సకల శుభములు సిద్ధి స్తాయని శౌనకాది మహర్షులకు చెప్పాడు.

ఈ మాసంలోనే రక్షాబంధ నోత్స వము. ఇదే అన్నా చెల్లెళ్ళ పండగ. అలాగే ఈ మాసంలోనే శ్రీకృష్ణాష్టమి. శ్రావణ మేఘాలు పరవశంతో పరుగులు తీస్తున్న ఈ సమయంలోనే శ్రీకృష్ణుడు జన్మించాడు. రైతులు ఆవులనూ, ఎద్దులనూ, పూజించే పొలాల అమావాస్య కూడా ఈ మాసంలోనే.

## 767. ఫాల్గుణమాసములో పండుగలూ, వ్రతాలూ?

**జ.** ఈ మాసం విష్ణుప్రీతికరము. ఈ మాసంలో శ్రీమహావిష్ణువుకు క్షీరాన్ని నివే దించే ప్రసాదంగా స్వీకరించే వ్రతం ఆచ రిస్తారు. అలాగే పుత్ర గణపతి వ్రతం చేయటం



ద్వారా పుత్రప్రాప్తి కలుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. సూర్యుడు మీనరాశిలో ప్రవేశించే సమయంలో చేసే పూజలూ, జపాలు ఎంతో ఫలాన్నిస్తాయి. ఫాల్గుణ పౌర్ణమి రోజున హోళీ పండుగ చేస్తారు. 'హోళికా' అనే శక్తి దేవతను పూజిస్తారు. శ్రీకృష్ణుడ్ని ఉయ్యాలలో వేసి 'డోలోత్సవం' చేస్తారు. మహాశివుడు తన మూడో కన్ను తెరిచి కాముడ్ని దహించింది ఫాల్గుణ పౌర్ణమిరోజే. రంగు నీళ్ళను చల్లుకుని ఆనం దించే వసంతోత్సవమూ ఈ మాసంలోనే.

## 768. జ్యేష్ఠమాసంలో పండుగలూ, వ్రతాలూ?

**జ.** సూర్యుడు మిధునరాశిలో ప్రవే శిస్తాడు. సంక్రమణ ప్రవేశమునకు ముందు పదహారు ఘడియలు పుణ్యకాలం. గంగా దేవిని భగీరథుడు నచ్చచెప్పి భూలోకానికి తెచ్చిన మాసము. ఈ మాసంలోనే వట సావిత్రి వ్రతాన్ని స్త్రీలు సౌభాగ్యము కోసం ఆచరిస్తారు. ఈ వ్రతంలో వటవృక్షాన్ని పూజిస్తారు. వటవృక్షము అనగా మర్రి చెట్టు. త్రిమూర్తుల రూపమే. వేళ్ళు బ్రహ్మ, కాండము విష్ణువూ, కొమ్ములు, శివుడూ. అలాగే జ్యేష్ఠ పౌర్ణమీ, ఏరువాక పున్నమీ వస్తాయి. వర్షాకాల ప్రారంభమాసము.

## 769. తిరునాళ్ళు జాతరలు ఎందుకు?

**జ.** తిరునాళ్ళు అంటే ఊరి పండుగ. జన సాంస్కృతిక ఉత్సవాలనే తిరునాళ్ళు, జాతరలు అంటారు. "తిరు" అంటే మంగ ళకరము అని అర్ధం. "తిరునాళ్ళు" అంటే శుభకరమైన దినాలు అని అర్ధం. తిరు నాళ్ అనే పదం తమిళభాష నుండి తెలు గుకు సంక్రమించింది. 'జాతర' అనేది తెలుగుపదం. సమస్త ప్రాణుల్లాగే మను షులు కూడా ప్రాణులే అయినా, సృష్టిలో ఏ ప్రాణికీలేని మేధాశక్తి మనిషికి మాత్రమే వుంది. అందుకే ప్రాణులన్నిటిలోకి మనిషే గొప్పవాడయ్యాడు. తనకన్నా ఎన్నో రెట్లు బలమైన ప్రాణుల్ని కూడా లొంగదీసుకొని సేవ చేయించుకొంటున్నాడు. మనిషి వివేకం తెచ్చుకొని, భాష నేర్చుకొని, సుఖాలు తెల్సుకొన్న తరువాత వినోద విజ్ఞానాల వైపుకి దృష్టిసారించాడు. సంఘజీవిగా మారాడు. సాంఘిక కట్టుబాట్లను ఏర్పర


చుకొన్నాడు. సాంఘిక ఆచారాలు నియమాలు సజావుగా సాగాలంటే మనుషులకు భయం వుండాలిగదా! సరిగ్గా ఈ ఆలోచనా-స్థితిలోనే దేవుడు దేవాలయాలు మొదలయ్యాయి. తిరునాళ్ళు ప్రారంభించిన వుద్దేశ్యం చాలా గొప్పది. పున్నమి దినాలలో మాత్రమే జరిగే తిరునాళ్ళకు దూర దూరాలనుండి రక రకాల విజ్ఞాన దాయకమైన హస్తకళా వస్తువులు, గృహోపకరణాలు, దుస్తులు అమ్మకానికి వచ్చేవి. పశువుల అమ్మకంతో పాటు కొనుగోలు కూడా నడిచేది. నృత్య, సంగీత కార్యక్రమాలు వుండేవి. రకరకాల వింత వింతైన తినుబండారాలు దొరికేవి. ఎప్పుడూ బయట ప్రజలను చూచి ఎరుగని నవ యువతులందరూ తిరునాళ్ళ నెపంతో బయటకు వచ్చేవారు. దేవుని ఉత్సవాలకు శ్రీమంతుడు పేదవాడు అనే వ్యత్యాసం వుండకూడదు గాబట్టి అందరూ కలిసిపోయేవారు.

ప్రతి యింటికీ బంధువులు వచ్చేవారు. చాలా కుటుంబాల్లో ఈ సమయంలోనే వివాహాలు నిశ్చయం అయ్యేవి. పాత తగాదాలు పరిహారం అయ్యేవి. అస్థి పంపకాలు కూడా ఇపుడే జరుపుతుండేవారు.

ఐదు/తొమ్మిది/పదకొండు రోజులుగా తిరునాళ్ళు జరుపుతుండేవారు. ఏ తిరునాళ్ళు అయినా చైత్ర వైశాఖ మాసాలలోనే జరుగుతాయి. స్త్రీ శక్తిదేవతల జాతరలు అన్ని మాసాలలోనూ జరిపే ఆచారం వుంది.

### 770. చిన్ముద్ర అనగా ఏమిటి?

**జ.** మీ బొటనవ్రేలుని చూపుడు వ్రేలు చివరలతో మిగతా మూడు వ్రేళ్ళను నిటా



రుగా ఉంచటమే చిన్ముద్ర. ధ్యాన తపస్సు సమయాల్లో మహోత్తరమైన శక్తి మీ నుంచి బయటకు ప్రసరించకుండా ఉంటుంది.

### 771. వైశాఖ మాసంలో ఏ పండుగ లొస్తాయి? ఏ వ్రతాలు చేయాలి?

**జ.** ఈ వైశాఖ మాసంలో పుణ్య తీర్థాలలో స్నానం పుణ్య కారకము. వైశాఖంలో సూర్యుడు మేషరాశి సంక్రమణంలో ఉండగా ప్రాతఃస్నానం చేస్తే అద్భుత ఫలితం కలుగుతుంది. వైశాఖంలో చలివేంద్రాలు నిర్మిస్తే విష్ణు శివ ప్రీతులవుతారు. ఈ మాసంలోనే అక్షయ తృతీయ వస్తుంది. పరశురాముని జయంతీ ఈ వైశాఖ మాసంలోనే. వైశాఖ శుద్ధ సప్తమి నాడే గంగాదేవి ఆవిర్భవించింది. హనుమజ్జయింతీ, నృసింహ జయంతీ ఈ మాసంలోనే. వైశాఖ శుద్ధ చతుర్దశినాడు సాయం సమయమున హిరణ్య కశిపుని వధించేందుకు శ్రీ మహావిష్ణువు ఉగ్ర నరశింహుడై ఆవిర్భవించాడు.


## 772. తెలుగు నెలలకి ఆ పేర్లెలా వచ్చాయి?

**జ.** చిత్తా నక్షత్రములో పౌర్ణమి రావటం వల్ల చైత్ర మాసమనీ, విశాఖ నక్షత్రములో పౌర్ణమి రావటం వల్ల వైశాఖ మాసమనీ, జ్యేష్ఠా నక్షత్రంలో పున్నమి చంద్రుడు రావటం వల్ల జ్యేష్ఠ మాసమనీ, పూర్వషాఢ నక్షత్రంలో పౌర్ణమి రావటంతో ఆషాఢ మనీ, శ్రవణంలో పౌర్ణమి రావటంవల్ల భాద్రపద మాసమనీ, అలాగే అశ్వనీ, పుష్యమీ నక్షత్రాల్లో పౌర్ణమి రావటం వల్ల కార్తీక, పుష్యమాసములనీ మఖ నక్షత్రంలో పౌర్ణమి రావటం వల్ల మాఘ మాసమనీ, పూర్వఫల్గుణి నక్షత్రంలో పౌర్ణమి రావటం వల్ల ఫాల్గుణ మాసమని మన పూర్వీకులైన మహాఋషులు నామధేయము లేర్పరిచారు.

## 773. దేవాలయాలు ఎందుకు?

**జ.** మీకు తెలుసా? పరాయి పాలకుల హింసకూ, ఇతర మతాల దోపిడికి, అక్రమిత ధర్మాల అక్రమాలకూ హిందూ మతం ఛిన్నాభిన్నమై ఛిద్రమైపోయిందొకప్పుడు. ఎందరో హిందువులు పరాయి మతాల పాలైపోయారు. తమ ఆడబిడ్డల్ని పరాయిమతం వారికి కన్యాదానం చేశారు. కొంతమంది తాము గూడా మతం మార్చుకొని పరాయి మతపు కూటికి చేతులు చాచారు. చేరువై పోయారు. బాధగావున్నా ఇది నగ్నసత్యం!

ఈనాడు ముస్లిములుగా చెప్పుకొంటున్నవారు, క్రైస్తవులుగా చెప్పుకొంటున్న వారు ఎందరో ఒకప్పుడు హిందువులే!



అగ్రవర్ణాలైన బ్రాహ్మణ వర్గాలచేత ఛీదరింపబడినవారు, ధనిక స్వాముల దౌర్జన్యానికి గురైనవారు, దరిద్రాన్ని భరించలేనివారు, అంగబలంలేని వారు. ఎందరెందరో బ్రతుకు దారికోసం పరాయి మతాల పాలైపోయారు. ఆ స్థితిలో మనకు దేవాలయాల అవసరం కల్గింది. హిందువులందరిని ఐక్యత పరచటం కోసం, ఒక్కచోట చేర్చటం కోసం, స్నేహ సంబంధాలు నెలకొల్పటం కోసం, హిందువులందరూ ఒక్కటేనని చెప్పటం కోసం, మనకు దేవాలయాల నిర్మాణం అవసరం అయింది. అయినా పంచమ జాతి వారు దూరంగానే నిలిచిపోయారు. వివిధ వర్ణాలుగా, వివిధ కులాలుగా, విభాగాలుగా ముక్కలైపోయిన హిందూ (భరత) సంజాతులందరినీ ఒక్కత్రాటిమీద నిలిపింది ఈ దేవాలయాలే! దేవునికి విశ్వమే ఆలయం! సకల చారచర జీవనాధారుడైన దేవునికి ఆలయం (ఇల్లు) కావాలా? అక్కర్లేదు.

కానీ... మనకు కావాలి! మన సమైక్యతను కాపాడుకోవటానికి కావాలి! మనమందరం ఒక జాతి వారమని తెలియ జెప్పుకోవటానికి కావాలి! కమ్మ, రెడ్డి, నాయుడు, కుమ్మరి, జాలరి, మంగలి, చాకలి మొదలైన వారందరూ ఒక్కమతం కన్న బిడ్డల మేనని గుర్తుచేసుకోవటానికి మరచి పోకుండటానికి మనకు దేవాలయాలు కావాలి! హిందువులందరు బంధువులేనని తెలుసుకోవటానికి మనకు దేవాలయాలు కావాలి! బాంధవ్యాలు బూడిదపాలై, మమతలు మట్టిపాలై, మనసు చెదరి, బ్రతుకు బరువై, జీవితం శూన్యమనిపించినపుడు సేదదీర్చుకొని గుండెను గట్టిపరచుకోవటానికి దేవాలయాలు కావాలి! ఏ ఒక్కరిదీకాని, ఏ ఒక్కరికీ సంబంధించని, ఏ ఒక్కరి అధికారం వుండని, దేవాలయాలు అభాగ్యులకు అనాధలకు, ఆర్తులకు, ఆశ్రయం ఇచ్చి ఆదరించటానికి కావాలి! ఎవరులేకున్నా నాకు దేవుడున్నాడనే నమ్మకం దిక్కులేనివారందరికీ కావాలి! కావాలి! కావాలి!!!

## 774. మంత్రాలతోనే దేవుని పూజించాలా?

**జ.** దేవతల భాష సంస్కృతం! మన సంస్కృత భాషను దేవభాష అంటారు/ దేవనాగరలిపి అంటారు. 11 వ శతాబ్దానికి పూర్వం ఆంధ్రదేశంలో అందరూ సంస్కృతమే మాట్లాడేవారు. భారతదేశ పండితులందరికీ సంస్కృతమే ప్రధాన భాష. కాబట్టి సనాతన సాహిత్యమంతా

artist

సంస్కృత భాషలో వుంది. మంత్రాలు కూడా సంస్కృత భాషలోనే వుండవల్సి వచ్చింది. సంస్కృతానికి ఆదికవి వాల్మీకి అయితే, తెలుగు భాషకు ఆదికవి నన్నయ భట్టారకుడు. ఈయన 11వ శతాబ్దం వాడు. అంటే మన తెలుగు భాషకు వేయి సంవత్సరాల చరిత్ర మాత్రమే వుంది. వేయి సంవత్సరాల క్రితం మన తాత ముత్తాతలందరూ ప్రాకృత భాష (సంస్కృతానికి ముందున్నభాష) లో మాట్లాడుకొనేవారు. పండితులందరి భాష సంస్కృతమే వుండేది. తెలుగు భాష పుట్టిన తరువాత ప్రజలందరూ తెలుగు భాషలోనే వ్యవహరించటం మొదలు పెట్టారు. పండిత భాషగా వున్న సంస్కృతభాష నిదానంగా మరుగున పడిపోయి నేటికి మృతభాషగా మిగిలిపోయింది. వేదానికి ఒక శాస్త్రీయమైన స్వరాలు వున్నాయి. స్వరయుక్తంగా మాత్రమే వేదపఠనం జరగాలి. అలా పఠించకపోయినట్లయితే మనకు మంచి జరగటానికి బదులుగా చెడుజరిగే అవకాశం ఎంతగానో వుంది. ఈ విషయం

చాలామందికి తెలియదు. ఈనాడు మనకు దొరికే బ్రాహ్మణులందరూ పొట్ట కూటి కోసం పూజలు చేయిస్తున్నవారే! ఇటువంటి బ్రాహ్మణులను 'జన్మ బ్రాహ్మణులు' అంటారు. వీరు 'కర్మ బ్రాహ్మణులు' కారు. కర్మ బ్రాహ్మణుడే నిజమైన బ్రాహ్మణుడు. అయితే కర్మ బ్రాహ్మణుడు లక్షకు ఒక్కడు కూడా దొరకడేమో. ఇది బ్రాహ్మణజాతికి గౌతమ మహర్షి శాపం.

దేవుని పూజించటానికీ, నమస్కరించటానికీ, దర్శించటానికీ వేద మంత్రాలతో పనిలేదు. కానుకలతోను పండ్లతోను పని లేదు. దేవుడు భక్తుని నుండి కోరుకొనేది చంచలత్వంలేని పవిత్ర మనస్సు మాత్రమే. మంత్రాలభాష మాత్రమే కాదు మూగవాని భాష కూడా దేవునికి తెలుసు. అయితే దేవుని గురించి మనకే తెలియదు. ఏం చేద్దాం?

శ్లో॥మనుష్యాణాం సహస్రేషు కశ్చిత్ యతతి సిద్ధయే।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్వతః॥

కోటి కోటి భక్తులు వున్నా పరి పూర్ణంగా దేవునిగురించి తెలిసినవాడు ఎక్కడ ఒక్కడే వుంటాడు అని చెబుతుంది భగవద్గీత.

## 775. మన దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు?

**జ.** దేవాలయం అంటే పవిత్రమైనది గదా! దేవాలయం గాలిగోపురం మీద వివిధ భంగిమల్లో శృంగార శిల్పాలు వుండటం ఏమిటి? చూచేవారికి అసభ్యంగా వుండదా? అని మనకందరకూ అనిపిస్తుంది.దేవాలయాల మీద (గాలిగోపురం



మీద) శృంగార శిల్పాలను నిర్మించటం వెనుక ఒక సునిశితమైన ఆలోచన వుంది. మరొక ప్రయోజనం కూడా వుంది. మన పూర్వీకుల జీవితం మన జీవితంటాగ అతివేగంగా (ఫాస్ట్‌గా) వుండేది కాదు. నిశ్చలంగా, నిబ్బరంగా వుండేవారు. చాలామంది ప్రతిదినమూ దేవాలయానికి వెళ్ళి వస్తుండేవారు. పెద్దవాళ్ళతోపాటుగా యుక్తవయస్సులో వున్నవారు కూడా దేవాలయానికి ప్రతిదినమూ వెళ్ళిరావటం పరిపాటిగా వుండేది. పురుషుడైన ప్రతివాడు "ధర్మ –అర్ధ– కామ –మోక్ష" అనే చతుర్విధ పరుషార్ధాలనూ తప్పక సాధించుకోవాలనే నియమం వుండేది.

మొదటిదిగా ధర్మసాధన చేయాలి. అంటే చదువుకోవటంగానీ, వృత్తి విద్య నేర్చుకోవటంగాని చేయాలి. రెండవది ధనాన్ని సంపాదించాలి. ధనమంటే ఈనాటి రూపాయినోట్లు కాదు. ఆ కాలంలో ఎవరికైనా ఎన్ని పశువులు వుంటే అంతటి ధనవంతుల క్రింద లెక్క! మూడవది వివా

హం చేసుకొని ఎక్కువమంది పిల్లల్ని కనాలి. ఎంతమంది సంతానం వుంటే అంత గొప్పన్న మాట! నాల్గవది చివరిగా మోక్షమార్గం అనుసరించి జీవితం ముగించాలి. ఈ నాల్గింటిని పుణ్యపురుషార్థాలు అంటారు. మనిషికి ఈ నాలుగు పురుషార్థాలు అవసరమే. "కామిగాక మోక్ష కామిగాడు" అంటాడు వేమన. మనం తెల్సుకోవల్సిన విషయం ఇంకొకటి కూడా వుంది. శృంగారం పాపకార్యం కాదు. సృష్టికి మూలం శృంగారమే గదా! అంతేకాదు, మనం భార్యలతో కలసివున్న దేవుళ్ళనే పూజిస్తుంటాం. మనం చదివే మంత్రశ్లోకాలలో కూడా శృంగారం వుంది గదా! ధర్మం ఎంత గొప్పదో శృంగారమూ అంతే! సంపాదన ఎంత ముఖ్యమైనదో శృంగారమూ అంతే! మోక్షమెంతటి గొప్పదో శృంగారమూ అంతే! వశిష్ఠాది మహాబ్రహ్మర్షులకు కూడా భార్య బిడ్డలు వున్నారన్న విషయం విస్మరించకూడదు. భార్యతో కూడిన సృష్ఠికార్యం పవిత్ర ధర్మంగా గుర్తించాలి. కాని పరస్త్రీ వ్యామోహం మాత్రమే మహాపాపం. పూర్వకాలంలో 'సంతానమే సంపత్తు'గా వుండేది. ఎక్కువ సంతానం వున్నవారికి సమాజంలో ఎక్కువ గౌరవం వుండేది. ఎక్కువ సంతానం వున్న వారికి శత్రువులు భయపడే వారు. ఆనాడు వ్యవసాయమే అందరికీ ప్రధాన వృత్తి. ఎక్కువ ధాన్యాన్ని పండించాలంటే ఎక్కువ కృషి చేయాలి. ఎక్కువ కృషి చేయాలంటే ఎక్కువమంది బిడ్డలు కావాల్సి వచ్చేది. కాబట్టి 'సెక్స్' అనాటి ప్రజల జీవనానికి ముఖ్యచేతనం చేయాలి కాబట్టి గుడిగోపురాలమీద బూతు బొమ్మలు సృష్టించాల్సిన అవసరం కల్గివుంటుంది.

ఈనాడు మనం సుఖాల్ని రకరకాలుగా అనుభవిస్తున్నాం. సినిమాలు, టి.వి, కార్లు, ఎ.సి.రూములు, హోటల్స్, బార్‌లు ఇలాంటివెన్నో మనకు సుఖాన్ని కల్గిస్తున్నాయి. ఆనాటి వారికి ఇవేమి లేవు. వారికి సుఖాన్ని కల్గించేవి మూడే మూడున్నాయి. ఆహారం, నిద్ర, శృంగారం. ఈ మూడే వారికి ప్రధానాంశాలు! కాబట్టి శృంగారం ఆనాటి జనజీవితాలకు ప్రధానాంశంగా భావించారేమో! దేవాలయాలే ప్రజలకు వినోద కేంద్రంగానూ, విలాస కేంద్రంగానూ వుండేవి. ఊరివారందరికీ దేవాలయం ఉమ్మడి ఆస్థిగావుండేది. దేవుని ఉత్సవాలు, జాతరలు, తిరునాళ్ళు మాత్రమే ఆనాటివారికి వున్న ఉమ్మడి వినోదం, వూరివారందరూ ఒకేచోట కల్సుకొని ఆత్మీయతలు పంచుకొనేవారు. ఇంతకు మించిన వినోదవిహారాలు వాళ్ళకేమీ వుండేవి కాదు. కష్టించి పని చేయటమే వారికి తెల్సిన విద్య. కడుపునిండ దొరికింది తినటమే వారికి తెల్సిన తృప్తి. ఒక్కొక్క యింటిలో వందల మంది సభ్యులు వుండేవారు. ఈ కారణంగా వారిలో లైంగిక ఆసక్తి అణగిపోతూ వుండేది. చాలామంది యువకులు దేవాలయాల లోనే విశ్రాంతి పొందుతుండే వారు. రాత్రిళ్ళు కూడా అక్కడే నిద్ర పోతుండే

వారు. యువత నిద్రాణం కాకుండా చూడటానికీ, శృంగార మనో వృత్తిని మేల్కొలపటానికి దేవాలయాల మీద బూతు బొమ్మలను నిర్మించేవారు.

అంతేకాదు శృంగారం పాపవృత్తికాదనీ పవిత్రమైనదనీ దీని ఉద్దేశ్యం.

శివలింగం కూడా శృంగార సంకేతమే గదా! ఆనాటి లైంగిక బంధాలు సంతానోత్పత్తి కోసమే వుండేవి. ఈనాటిలా భోగ ప్రవృత్తిగా వుండేవి కాదు. అంతేకాదు ప్రతి పున్నమిరాత్రికీ, "కంచుకొత్సవాలు" జరిగేవి. భర్త కారణంగా పిల్లలు లేని (కలుగని) స్త్రీలందరూ పున్నమిరాత్రులలో అపరిచిత పురుషులతో సంసారం చేసి పుత్రవతులు అయ్యే సంప్రదాయం ఆనాటి ధర్మంగా వుండేది. తన భార్యకు పరపురుషుని వల్ల కలిగిన కొడుకుని క్షేత్రజుడు అంటారు. క్షేత్రజుడు కూడా పుత్రునితో సమానమైన వాడే! కుంతీదేవి ఈ నియోగ పద్ధతిలోనే పాండవులను కన్నది. పాండురాజుకి నియోగపద్ధతిలో జన్మించినవారే ధర్మ - భీమార్జునులు. దయచేసి ఆశ్చర్యపోవద్దు! ధర్మం కాలానుగతంగా మార్పు చెందుతుంది. అంతే!

## 776. శ్రీకృష్ణునికి అంతమంది భార్యలు ఏమిటి?

**జ.** చాలామందికి కుతూహలం కల్గించే ప్రశ్న యిది. దశావతారాలలో శ్రీకృష్ణావతారం తొమ్మిదవది. తొమ్మిదవ సంఖ్యను బ్రహ్మ సంఖ్యగా చెబుతారు. తొమ్మిదవ సంఖ్యకున్న విశేషత ఏ సంఖ్యకూ లేదని



పూర్వ కాలంనాడే గమనించారు ప్రాచీనులు. అపర నారాయణుడని కీర్తింపబడుతున్న వ్యాసమహర్షికి కూడా తొమ్మిదవ సంఖ్య మీద మమకారం ఎక్కువ. అందుకే మహా భారతాన్ని 18 పర్వాలుగా రచించాడు. కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొన్న అక్షౌహిణుల సంఖ్య 18. భారతయుద్ధం కురుక్షేత్రంలో జరిగింది 18 రోజులు. వ్యాసమహర్షి పురాణాలు రచించింది పద్దెనిమిది. 1+8=9. ఏ యుగపు సంవత్సరాలనైనా మొత్తం కలిపితే తొమ్మిదవ సంఖ్య వస్తుంది. శ్రీమన్నారాయణుని దశావతారాలలో తొమ్మిదవ అవతారమైన శ్రీకృష్ణావతారానికి వున్న విశేషత విశిష్టత మరే అవతారానికి లేదు. "నేనే దేవుడను" అని చెప్పుకొన్న అవతారం శ్రీకృష్ణావతారం మాత్రమే! కృష్ణునికి వున్నంత మంది భక్తులు ఎవరికీ లేరు. శ్రీరామునికి వున్నన్ని దేవాలయాలు ఎవరికీ లేవు.



కృష్ణుడు జగద్గురుడు! కృష్ణుడు రసికుడు! కృష్ణుడు యోగీశ్వరుడు! ఇతర దేశాలలో కూడా లక్షలాదిమంది కృష్ణ భక్తులున్నారు.

కృష్ణుని అంతటి భోగి, కృష్ణుని అంతటి యోగి మరొకరు లేరు. శ్రీకృష్ణునికి ఎనిమిదిమంది పట్టపు రాణులుకాక పదహారువేల మంది రాచకన్యలు భార్యలుగా వున్నారని విన్న ప్రతి వారూ బుగ్గలు నొక్కుకోక మానరు. నోటి మీద చేయి వేసుకోవటం మరువరు. ఇది ద్వాపర యుగం విషయంగదా! కలియుగ చరిత్రను కొద్దిగా పరిశీలిద్దాం. క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దానికి చెందిన చైనాదేశపు చక్రవర్తి చిన్–షి–యాంగ్'కి పదమూడు వేల నూట నలభైమంది భార్యలుండేవారు –'సాలమన్' చక్రవర్తికి ఏడువందల మంది భార్యలు, మూడువందలమంది వుంపుడుగత్తెలు, మొత్తం వేయిమంది వుండేవారు– 'అక్బర్ చక్రవర్తికి' ఐదువేల మంది ప్రియురాండ్రు శాశ్వతంగా వుండే వారు– విజయనగర సామ్రాజ్యం పాలించిన రెండవ దేవరాయలకు (క్రీ.శ. 1420) పన్నెండువేల మంది భార్యలు వుండేవారు– మొరాకో చక్రవర్తి 'మౌలి ఇస్మాయల్'కి (క్రీ.శ.1672–1727) ఐదు వందల నలభైమూడు మంది భార్యలు వుండేవారు. తొమ్మిది వందల సంతానంతో 'మౌలి ఇస్మాయిల్' సరదాగా వుండే వాడట – మొన్న మొన్నటి హైదరాబాద్ నవాబ్ గారికి మూడు వందలకు పైగా భార్యలుండేవారు. ఉంపుడుగత్తెలు ఎందరో వుండేవారట.(1940) ఇంగ్లాండ్, అమెరికాల్లో బహుభర్తృత్వం సాధారణంగా వుంది. భారతదేశంలోని 'లడక్' ప్రాంతంలో బహుభర్తృత్వం సర్వసాధారణం. ఈ నాటికీ మనదేశపు గిరిజనులలో బహు భార్యత్వం మామూలు విషయమే. ఆదివాసులు, హిమాలయ ప్రాంతంవారు బహు భార్యాత్వాన్ని గొప్పగా భావిస్తారట.

ఒకప్పటి న్యాయప్రకారం పోషించ గలిగిన శక్తీ, అనుభవించగల సామర్థ్యం వున్నవారెవరైనా బహుభార్యత్వాన్ని కలిగియుండటంలో తప్పులేదు. కాని.... వ్యభిచారం చేయకూడదు. పరుల భార్యల కన్నెత్తియూ చూడకూడదు. వ్యభిచార నియంత్రణ, పరస్త్రీ రక్షణే ఈ న్యాయవ్యవస్థ వుద్దేశ్యం. 'నరకుడు' అనే దానవరాజు ప్రజాకంటకుడై, యువతీ అపహరణ కారుడై, క్షుద్రదేవతోపాసకుడై, సువిశాల భారతదేశాన్ని పీడిస్తున్నపుడు (సువిశాల భారతదేశం అంటే భారత్ – పాకిస్థాన్

– ఆఫ్ఘనిస్థాన్ – మాల్దీవులు– బంగ్లాదేశ్ – నేపాల్– శ్రీలంక –టిబెట్– బర్మా మొదలైన దేశాలన్నీ కలిపి భారతదేశం) శ్రీకృష్ణుడు సత్యభామ సమేతంగా యుద్ధానికి బయలుదేరి వెళ్ళాడు. నరకుడు మరణించిన తరువాత ఆ రాజ్యానికి వాని కొడుకునే రాజుగా చేశాడు. నరకుడు భైరవ పూజకు బలియివ్వటంకోసం నానా రాజ్యాలనుండి ఎందరో కన్యలను అపహరించి తీసికొనివచ్చి పాతాళమందిరంలో దాచివుంచాడు. ఆ కన్యలందరూ కలిపి పదహారువేలమంది వున్నారు. ఎన్నో సంవత్సరాలనుండి ఆ పాతాళ చేరలో మ్రగ్గిపోతున్నారు వాళ్ళందరూ. వారినందరినీ చెరవిడిపించి వారివారి దేశాలకు పంపదలిచాడు కృష్ణుడు. కాని ఆ కన్యలు తమ తమ ఇండ్లకు వెళ్ళటానికి ఎంత మాత్రమూ అంగీకరించలేదు. కృష్ణుడెంతగా నచ్చచెప్పినా వినలేదు వాళ్ళందరూ. అప్పటికి న్యాయధర్మాలు ఎలా వుండేవంటే, శత్రురాజులను ఓడించి విజయం పొందిన వారికి పరాజయం పొందినవారి సర్వస్వమూ స్వంతమవుతుంది. ధన– ధాన్య –వస్తు– వాహనాలేకాక సమస్త దాసదాసీ జనాలు కూడా విజయం పొందినవారికే చెందుతారు. ఈ ధర్మంప్రకారం పదహారు వేలమంది కన్యలు కృష్ణునికి స్వంతమయ్యారు. గత్యంతరం లేక వారినందరినీ ద్వారకా నగరానికి తరలించవల్సి వచ్చింది. వారందరూ లౌకిక ప్రపంచానికి కృష్ణుని భార్యలుగా వున్నారుగాని నిజానికి



ఆ యువతులందరూ కృష్ణ భక్తురాండ్రు అయ్యారు. వీరందరూ ఒక్కొక్కరు పది మంది కొడుకుల చొప్పున బిడ్డలనుకన్నారు. వందల సంవత్సరాలు భార్యలందరితోనూ శ్రీకృష్ణుడు కాపురం చేశాడు.

క్రీ.పూ. 3114 సంవత్సరం కృష్ణ జననం జరిగింది. నాలుగు వందల ఆరు సంవత్సరాలకు పైగా జీవించాడు శ్రీకృష్ణుడు. కృష్ణుని సిగలో నెమలిపింఛం ఎందుకు వుంటుందో తెలుసా! అమలిన శృంగారానికి పింఛంగుర్తు! సృష్టిలోని సమస్త ప్రాణులలోకి నెమలిది ఒక ప్రత్యేక జీవితం. నెమళ్ళకు శారీరక సంభోగం లేదు. మగనెమలి కంటినీరు ఆడనెమలి త్రాగిగుడ్డు పెడుతుంది. పరమశృంగార పురుషుడుగా కనిపించే శ్రీకృష్ణుడు పరమ యోగి. పదహారువేలమందితో సంసారం ఎలా చేశాడు అని కొంటె సందేహం కలుగవచ్చు! శ్రీకృష్ణుడు ప్రతిరోజు ప్రతిరాత్రి ప్రతి నిముషం పదహారువేల మంది ఇండ్ల లోనూ వుండేవాడు. అష్టభార్యల యిండ్ల లోనూ వుండేవాడు. అందుకే ఆయన జగన్నాటక సూత్రధారి. లీలావేషధారి.

## 777. దైవభక్తి మంచిదేనా?

**జ.** భక్తి అంటే శ్రద్ధ –నిష్ట– అర్పణ అనే అర్థాలున్నాయి. ఆరాధనా భావంతో, సుఖ దుఃఖాలనూ, మంచి చెడులనూ భగవ దర్పితంచేయగల దైవభక్తులు ఎందరు న్నారీ ప్రపంచంలో? గుడి గోపురాల వెంట తిరుగుతూ రంగుబట్టలు ధరించే వారందరూ దైవభక్తులేనా? అందరూ దొంగభక్తులే! పిడికెడు గుండెలో సముద్ర మంత ఆశలు పెట్టుకొని కోరరాని కోర్కెలు కొరగాని ఆశలతో హుండీలో కానుకలు వేస్తే దేవుడు తీరుస్తాడా? బస్తా కొబ్బరి కాయలు కొడితే కోరికలు నెరవేరు తాయా? కొండకు వెళ్ళి గుండు గీయించు కొని వస్తే కొండదేవర కాసులు కురి పిస్తాడా? భక్తునికుండవల్సింది కోరిక లేని మనస్సు! బోడిగుండు కాదు. దేవునికి కావల్సింది నిర్గుణమైన భక్తి! కొబ్బరి కాయలు కాదు. దేవునికి నీవు ఏమిచ్చి సంతోషపెట్టగలవు! నీవు సమర్పించేవన్నీ ఆయనవే అయినపుడు ఇక నీవేం ఇవ్వ గలవు! పట్టుబట్టలు కట్టి ముఖానికి పెద్ద బొట్టు పెట్టి కర్పూర నీరాజనాలు త్రిప్పి నంత మాత్రాన ప్రసన్నుడుకాడు. దేవునికి కావల్సింది సత్యనియమ సాధనం, ధర్మ బద్ధజీవనం, కర్మసిద్ధ జీవితం, దేవుని గ్రహించటానికీ, దేవుని దర్శించటానికీ ఇవి చాలు. ఇంకేవీ అక్కరలేదు. దేవుడంటే కానుకలు పారవేస్తే కోరికలు తీర్చేవాడా! దేవుడంటే ఒక నమస్కారం విసిరేస్తే సంప దలు పంపించేవాడా! దేవుడంటే మనం



పెట్టిన రెండు అరటికాయలు తిని, రెండు రూపాయలు దక్షిణ తాంబూలం తీసుకొని మనల్ని అందలం ఎక్కించే వాడా! ఎవరు దేవుడంటే !!!? కష్టాలు వచ్చినపుడు తిట్టటా నికి పనికొచ్చేవాడా! అభయ హస్తం చూపేవాడా! ప్రియ, మృదు భాషణం – అహింస– పరోపకారం – సదాలోచన – నిస్వార్థ బుద్ధి–సమదృష్టి –సదాచారం– సౌశీల్యం – శాంతిజీవనం. వీటిలో భగవంతుని పూజిస్తే అది దైవభక్తి.! అపుడు దైవమే నీలోకి వస్తాడు. నీవు చేస్తున్న ప్రతి పనికీ విజయం సిద్ధిస్తుంది. జీవితాన్ని భగవ దర్పితం చేసినవారికి దుఃఖమే వుండదు. కలతలు కన్నీళ్ళు దగ్గరకు రావు. కోరిక లన్నీ నశించిపోతాయి. మరి దైవభక్తి మంచి దేగదా?

## 778. శ్రీహరిశ్చంద్రుడు భార్యను అమ్మటం న్యాయమా?

**జ.** "సత్యమేవ సమస్యేత సత్యంహి పరమోగతిః"

సూర్యవంశపు హరిశ్చంద్రుని అయో ధ్యానగరం. తన కోసం ప్రత్యేకంగా స్వర్గాన్ని సృష్టించుకొన్న త్రిశంకుని కొడుకే హరిశ్చంద్రుడు. ఈతని కులగురువు బ్రహ్మర్షి వశిష్ఠుడు. శ్రీరాముడు ఈతని వంశంలోనివాడే. సువిశాల భారత సామ్రాజ్యాన్ని ధర్మమార్గాన నడిపించిన ఆరుగురు చక్రవర్తులలో హరిశ్చంద్రుడు

సర్వప్రథముడు. సత్యమార్గమే మనిషికి గొప్ప మార్గమనీ, సత్యవ్రతానికి మించిన వ్రతం మరొకటి లేదని నమ్మి ఆచరించి చూపిన ధీరోదాత్తుడు. ఈ హరిశ్చంద్రుని స్ఫూర్తితోనే మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ మహాత్మాగాంధీ అయ్యాడు. అనేక వందలసార్లు ఈ విషయం గాంధీ చెప్పారు. బ్రిటిష్ చక్రవర్తులు సైతం హరిశ్చంద్ర కథ విని "గ్రేట్‌గ్రేట్" అంటూ చప్పట్లు చరి చారట!! పురాణాలు, హరికథలు గతించి పోయి నాటకాలు సినిమాలు వచ్చిన తరువాత ఈ సత్యహరిశ్చంద్రుడు అవ హేళనపాలై పోవల్సివచ్చింది. అవును మరి! వేయి అబద్ధాలు ఆడైనా ఆలు బిడ్డల్ని పోషించాలి అనుకొనే ఈ రోజుల్లో ఈనాటివారికి హరిశ్చంద్రుడు అసమర్థ డుగా, దోషిగా కన్పించటం సహజమే!

తెలిసిన కథే అయిన సంక్షిప్తంగా చెప్పాల్సివుంది. ఒకసారి స్వర్గలోకంలో ఇంద్రసభకు మహర్షిగణమంతా వచ్చారు. భృగు–అంగీరస–కశ్యప– అత్రి– అగస్త్య– వశిష్ఠ– విశ్వామిత్ర ఆదిగాగల ఎందరో తపోసంపన్నులు నిండిన ఆ సభలో "సత్య వ్రతదీక్ష" గురించిన చర్చవచ్చింది. దేవేంద్రుడు ఆ సభలోని వారితో "మహర్షులారా! సృష్టి లోని సమస్త వ్రతాలలో సత్యవ్రతదీక్ష గొప్పది కష్టతరమైనదిగదా! త్రికరణ శుద్ధిగా సత్యవ్రతాన్ని పాటించేవారు ఎక్క డైనా ఎవరైనా వున్నారా" అని అడిగాడు. మానవులకే గాదు దేవతలకైనా ఎపుడో ఒకప్పుడు అబద్ధం చెప్పవల్సిరాక తప్పదు.

artist

కఠినమైన సత్యవ్రతాన్ని పాటించటం సాధ్యంకాదుగదా! మహర్షులందరూ మౌనంగా వున్న సమయంలో వశిష్ఠ మహర్షి "సురలోకాధిపతీ! సత్యమే వూపి రిగా, సత్యమే సర్వస్వంగా, సత్యదీక్షను పాటించేవాడు భూలోకంలో ఒకడు న్నాడు." అన్నాడు. ఇంద్రునితో పాటుగా అందరూ ఆశ్చర్యపోయారు. "వశిష్ఠ మహర్షీ! మానవులలో అటువంటివారు వున్నారా! ఎవరతను? ఎక్కడున్నాడు" అని ప్రశ్నించాడు దేవేంద్రుడు. "అమరేంద్రా! అతను నా శిష్యుడు. సూర్యవంశపు వాడు". వశిష్ఠుని మాటలు విశ్వామిత్ర మహర్షికి రుచింపలేదు. వశిష్ఠునితో వాదానికి దిగాడు. "ఆ హరిశ్చంద్రునిచేత నేను అబద్ధం పలి కిస్తాను. వాని సత్యవ్రతాన్ని భంగం చేస్తాను. వశిష్ఠుని మాటలు పొల్లుమాటని నిరూ పిస్తాను" అంటూ విశ్వామిత్రుడు పంతం పూనాడు. ఈ కారణంగా హరిశ్చంద్రుడు

విశ్వామిత్రునికి శత్రువయ్యాడు. అంతే! హరిశ్చంద్రునికి కష్టాలు ప్రారంభమయ్యాయి.

విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని వద్దకు వచ్చి తానొక మహాయాగం చేయబోతున్నాననీ యాగనిమిత్తమై ధనం కావాలని అడిగాడు. ఎంతకావల్సివస్తుందని అడిగాడు హరిశ్చంద్రుడు. దానికి విశ్వామిత్రుడు "హరిశ్చంద్రా! ఒక మనిషి ఏనుగు మీద ఎక్కి ఒక రత్నాన్ని ఎంత ఎత్తుకు విసురుతాడో అన్ని వరహాలు కావాలి. నా తపోశక్తి చేత పైకి విసిరిన రత్నం క్రింద పడకుండా పైన శూన్యంలో అలాగే నిలిచి వుంటుంది. అంతటి ధనమివ్వగలవా!" అన్నాడు. అంగీకరించాడు హరిశ్చంద్రుడు. "రాజా! ఈ ధనం నాకిపుడు అవసరం లేదు. అవసరం వచ్చినపుడు వస్తాను. నీ దగ్గరే వుండనివ్వు" అని చెప్పి వెళ్ళిపోయాడు విశ్వామిత్రుడు. కొన్ని రోజులు గడిచిపోయాయి. ఒకరోజున హరిశ్చంద్రుడు వేటకోసం అడవికి వెళ్ళాడు. (క్షత్రియులకు వేటవల్ల పాపం అంటకుండేట్లు అగస్త్యమహర్షి వరం ఇచ్చాడు) అడవికి వెళ్ళిన హరిశ్చంద్రునికి విశ్వామిత్రునిచే సృష్టింపబడ్డ యిద్దరు యువతులు తారసపడి తమను వివాహమాడ వల్సినదిగా కోరారు. హరిశ్చంద్రుడంగీకరించలేదు. ఆ యువతులకు మద్దతుగా విశ్వామిత్రుడు వచ్చి హరిశ్చంద్రునికి నచ్చచెప్పినా హరిశ్చంద్రుడు వినలేదు. "విశ్వామిత్ర మహర్షీ! నా రాజ్య సర్వస్వమూ పరిత్యజించి ఇవ్వగలనుగాని ఈ యువతులను వివాహమాడి నా ఏకపత్నీ వ్రతానికి భంగం కల్గించను" అన్నాడు. అవకాశం కోసం ఎదురు చూస్తున్న విశ్వామిత్రుడు "సరే! రాజా! నీవిపుడు అన్నమాట ప్రకారం నీ రాజ్య సర్వస్వమూ నాకు దానం చేయాలి. ఆడిన మాట తప్పరాదు" అంటూ హరిశ్చంద్రుని సర్వరాజ్యాన్ని దానం చేయించుకొన్నాడు. సంతోషంగా దానమిచ్చాడు హరిశ్చంద్రుడు. సామాన్య పౌరునిగా నూలు వస్త్రాలు ధరించి అంతఃపురం వదలి వెళ్ళబోతున్న సమయంలో విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని అడ్డగించాడు. "ఒకానొకప్పుడు యాగనిమిత్తం ధనమిస్తానని మాట ఇచ్చావు గదా! ఆ ధనమంతా నాకిప్పుడే కావాలి" అంటూ వత్తిడి చేశాడు. హతాశుడయ్యాడు హరిశ్చంద్రుడు.

"విశ్వామిత్ర మహర్షీ! నాకు కొంత గడువు ఇప్పించండి. మీ యాగార్థ ధనాన్ని మీకు ఇప్పిస్తాను అంటూ కొంతగడువు తీసుకొన్నాడు హరిశ్చంద్రుడు. బాకీ వసూలు చేయటానికి నక్షత్రకుడనే మునిని హరిశ్చంద్రునితోపాటు పంపించాడు మహర్షి. అయోధ్యానగరం నుండి వారణాసి (కాశి)కి భార్యాబిడ్డలతో నక్షత్రక సమేతంగా చేరుకున్నాడు హరిశ్చంద్రుడు. బాకీ తీర్చవల్సిన గడువు వచ్చింది. హరిశ్చంద్రుని భార్య చంద్రమతి. ఈమెకు తారామతి అనికూడా మరొక పేరువుంది. మహర్షి ఋణగ్రస్తుడై మనోవ్యధతో శుష్కించిపోయిన హరిశ్చంద్రుని దుస్థితిని చూచి చంద్రమతి బావురుమని ఏడ్చింది.

సత్యనిష్ఠకోసం పడరాని పాట్లు పడుతున్న భర్తతో "స్వామీ! మహాచక్రవర్తులైన మీరు అప్పరుణగ్రస్తులై నిరంతర చింతతో వున్నారు. ఈ స్థితిలో నాకొకమార్గం గోచరిస్తూ వుంది. మీరు కోపించక నా మాట వినాలి. నేను మీ అర్ధాంగిని. మీ కష్ట సుఖాలలోనూ, కీర్తి అపకీర్తిలోనూ నేనూ భాగస్థురాలినేగదా! ఈ వారణాసిలో నన్ను విక్రయించి ఆ ధనాన్ని మహర్షికి ఇచ్చి రుణ విముక్తులుకండి. సంకోచించకండి. మన సత్యవ్రతంకన్నా నా దాస్యవృత్తి ఏమంతటిది! అనిత్యమైన శరీరం సత్య వ్రతం కన్నా గొప్పదికాదు." అని భర్తయైన హరిశ్చంద్రుని ఒప్పించింది. భర్త కీర్తికి భంగం కల్గుతుందేమోనని భయపడి దాసిగా అమ్ముడుబోయింది. భార్యా పుత్రుల్ని గోల్పోయిన హరిశ్చంద్రుడు కూడా ఒక కాటికాపరికి దాసుడుగా అమ్ముడుబోయాడు. అఖండ మహాభారతావనికి చక్రవర్తియైన ఒక మహాపురుషుడు అతినీచ వృత్తియైన కాటికాపరిగా జీవిస్తూ చివరకు తన భార్యను తన చేతులతో తానే తలతీయవల్సిన స్థితిలో కూడా తన సత్య ధర్మాన్ని వదలలేదు. అంతటి మహోన్నతుడాయన. అంతటి ధీరవీరశూర ధీమంత మణిని "భార్యను అమ్ముకొన్న అసమర్థునిగా" చిత్రించి మాట్లాడటం ఏ భారతీయునికైన ధర్మమా! ఈ హరిశ్చంద్రుడు మన దేశంలో కాకుండా మరొక దేశంలో జన్మించి వుంటే దైవావతారంగా కీర్తింపబడేవాడు కాదా! దేవాలయం కట్టించుకొనేవాడు కాదా! ఆలోచించి చూడండి. సత్యవ్రత దీక్షకోసం పడరాని, పడగూడని కష్టాలుపడ్డ ఒక మహాత్ముని కథవిని కన్నీటితో అభినందనలు తెలుపవల్సిన మనం హరిశ్చంద్రుని ఒక 'పోకిరి'గా భావించి ఎగతాళి చేయటం ఎంత విజ్ఞత! ఎంతటి సంస్కృతి!! "నాస్తి సత్యాత్ పరం ధర్మః నానృతాత్ పాతకంపరం" అ నాటి చంద్రమతి విక్రయంలోని ధర్మం, మర్మం ఈనాటి చట్టాలకు, ఈనాటి న్యాయ స్థానాలకు, ఈనాటి న్యాయశాస్త్రాలకు అందనిది. ఆలోచించరానిది. మనకు వాక్ స్వాతంత్ర్యం ఉంది! ఉన్నది కదా అని అజ్ఞానంతో ఒక మహోన్నతుని జీవితానికి మట్టి గొట్టటం మనవారికి మన దేశానికి మాత్రమే చెల్లింది. మరొక దేశంలో అయితే మరొకలా వుంటుంది. మన చరిత్రకు మన పురాణాలకు మనవిశ్వాసాలకు అపచారం అవమానం చేసిన వారెవరైనా మరో విధంగా మూల్యాన్ని చెల్లించకోక తప్పదు. సత్యమేవ జయతే!

సత్యం ధర్మః తపోయోగః సత్యం బ్రహ్మ సనాతనమ్।
సత్యం యజ్ఞః పరః ప్రోక్తః సర్వం సత్యే ప్రతిష్ఠితం॥

## 778. పంచేంద్రియాలలో ఏది గొప్పది?

**జ.** ఘ్రాణం– రసము –చక్షువు– త్వక్ – శ్రోత్రము. ఈ ఐదు పంచేంద్రియములు లేదా జ్ఞానేంద్రియములు అంటారు. (ముక్కు –నోరు– కన్నులు– శరీరము– చెవులు) ఈ ఐదింటిలో ఘ్రాణేంద్రియము (ముక్కు) గొప్పదిగా చెప్పవచ్చు. ఎందుకంటే

మనిషి మరణానికి చేరువ కాబోతున్నపుడు చెవులు వినిపించవు. కన్నులు దృష్టిని కోల్పోతాయి. శరీరం స్పర్శను పోగొట్టుకొంటుంది. నోరు మాటను కోల్పోతుంది. కాని ముక్కు మాత్రం తన శ్వాసక్రియను కొనసాగిస్తూనే వుంటుంది. మనిషి మరణం పొందేవరకు తోడుగా నిలిచి వుండే ఇంద్రియం ఘ్రాణేంద్రియం ఒక్కటే. అన్ని మతాల మహిళలు ముక్కును కుట్టించుకోవటంలోని సదుద్దేశ్యం ఇదే! ఘ్రాణేంద్రియానికి మంచి సువాసన కావాలి. లేకుంటే మిగిలిన ఇంద్రియాలను ప్రేరేపించి మనిషిని దూరంగా నడిపిస్తుంది. చివరకు మనిషి తినే ఆహారమైనాసరే, ముందుగా ముక్కుకి నచ్చాలి. తరువాత కళ్ళకు నచ్చాలి. తరువాత నోటికి నచ్చాలి. అందుకే మనం భుజించే ఆహార పదార్థాలలో సువాసనా ద్రవ్యాలను తప్పకుండా వాడుతుంటాం. సువాసన లేని నేతిని ఎవరైనా ఇష్టపడతారా!

మంచి పరిమళం ముక్కుకి తగిలిన వెంటనే నరనాడులు వికసిస్తాయి. శరీరం ప్రశాంతతను అనుభవిస్తుంది. కన్నులు విప్పారుతాయి. మనిషి మొత్తం చైతన్యవంతుడౌతాడు. నాడీమండల మంతా ఉత్తేజితమై పోతుంది. కాబట్టి పంచేంద్రియాలలో ముక్కు గొప్ప ఇంద్రియం. మనిషి అందమంతా ముక్కులోనే వుంటుంది. వాత్సాయన మహర్షి చెప్పిన విధంగా స్త్రీలలో నాలుగు రకాలవారున్నారు. 1. పద్మిని 2. హస్తిని 3. శంఖిని 4. చిత్తిని. ఈ నలుగురిలో పద్మినీజాతి స్త్రీల శరీరాలకు ఒక రకమైన సువాసన వుంటుందట. ఈ సువాసన ఘ్రాణేంద్రియానికి తగిలినవెంటనే పురుషునికి కామోద్దీపనం కల్గుతుందని చెబుతాడు వాత్సాయనుడు. ఘ్రాణేంద్రియం ఉల్లాసంగా వుంటే శరీరం మొత్తం హుషారుతో వుంటుంది. అందుకే మనం పరిమళం వుండే సబ్బులను, పౌడర్లను ఇష్టపడుతుంటాం. చాలామంది మనస్సుకి మత్తెక్కించే సెంట్‌లను వాడుతూవుంటారు. పడకగదిలో పరిమళ ద్రవ్యాలదే పై చేయి మరి! మల్లెపూలవాసన తగలగానే యువ దంపతులు తీయని కోర్కెలతో పరవశించిపోతుంటారు. స్వానుభవంగా ఇది అందరెరిగిన విషయమే.

పంచేంద్రియాలకు మనస్సుకీ ఎంతో సంబంధం వుంది. మంచి సువాసన తగిలినా, మంచి సంగీతం విన్నా, మంచి సన్నివేశం చూసినా చల్లని గాలి వీచినా, రుచికరమైన పదార్థాలు ఆరగించినా మనస్సుకి ఎంతో సంతోషం కల్గుతుంది. తన్మయత్వం అనుభవిస్తుంది.


## 780. 'జంతుబలి' శాస్త్ర సమ్మతమా?

***జ.*** దేవుళ్ళకు ప్రాణబలి ఇవ్వటం అనాగరిక సంస్కృతి. వేల సంవత్సరాల క్రితం మనుష్యులకు మాంసాహారమే ముఖ్యాహారంగా వుండేది. ఇపుడు మనం పాయసాన్నం వండి దేవునికి ప్రసాదం పెట్టినట్లుగానే అవిద్యావంతులైన ఆనాటి

అనాగరికజనం జంతుబలిని సమర్పించి, తరువాత దాన్ని వండుకొని తినేవారు. ఆర్య సంస్కృతి మన దేశంలో ప్రారంభ మైన తరువాత మాంసాహారం నిషిద్ధమైన దిగా భావించారు. కాని యజ్ఞయాగాదు లలో మాత్రం ప్రాణివధకు ఆర్యుల సమ్మతి వుండేది. క్రీ.పూ. 525 శతా బ్దంలో వుద్భవించిన బౌద్ధమతం జీవ హింసను బాగ వ్యతిరేకించింది. యజ్ఞ యాగాదులు పశుబలితో నిర్వహించ టాన్ని బౌద్ధమతం నిరసించింది. ఎందరో రాజులు, చక్ర వర్తులు, పెద్దలు బౌద్ధమత ధర్మాలను మెచ్చుకొని బౌద్ధిజాన్ని స్వీకరిం చారు. ఈ సమయంలోనే యజ్ఞబలులు నిలిచి పోయాయి. బౌద్ధమతానికి తోడుగా జైన మతంకూడా హింసను సంపూర్ణంగా వ్యతి రేకించింది.

## 781. దేవుడెందుకు కనిపించడు?

**జ.** ఎందుకు కనుపించడు! దేవుడు తప్పకుండా కనిపిస్తాడు. ప్రతివారికీ, ప్రతి రోజు, ప్రతిచోట, ఎక్కడో ఒకచోట కనిపిస్తుంటాడు. మనమే అతనిని గుర్తిం చటం లేదు. ఒకసారి తొందరలో రోడ్డుకి అడ్డంగా వస్తూపోయే వాహనాలను గమ నించకుండా పరుగెత్తావు గుర్తుందా! నీ వెనుక నుండి నీకు తెలయని నీకు సంబం ధంలేని ఎవరో "బాబూ! బస్సువస్తోంది" అంటూ కేకవేశారు. గుర్తువచ్చిందా! ఆ కేక వేయించిందెవరో గుర్తించావా! ఆయనే దేవుడు! మరొకసారి మోటర్ సైకిలు ఎక్కి




కుడి ఎడమలు గమనించకుండా పని తొందరలో దూసుకొని పోబోతుంటే కాకి బట్టలు వేసుకొన్న ఒక వ్యక్తి నిన్ను గట్టిగా మందలించాడు. గుర్తుకువచ్చిందా! ఆయనే దేవుడు! ఇంకొకసారి మతి చెడ గొట్టుకొని మత్తుమందు త్రాగుతూ తూలి పోతుంటే 'సార్! ఇక చాలు సార్! ఇంటికి వెళ్ళండి" అంటూ నీకు చేతులు కట్టుకొని వినయంగా చెప్పాడొకడు! గుర్తుందా! ఆయనే దేవుడు! మరలా ఒకసారి నడి వీధిలో ఒకడి చొక్కాపట్టుకొని వాడిని నాలుగు గుద్దుతూ వానిచేత నాలుగు గుద్దించు కొంటూ క్రిందపడి పైనబడి చొక్కా చించు కొనివున్న సమయంలో దారిన బోయే ఒకాయన "ప్లీజ్‌సార్! వదిలేయండి! తెలి సిన వారు మీరుకూడా" అంటూ మిమ్మల్ని విడదీసి ప్రక్కకు నెట్టిన ఒక మనిషి గుర్తు న్నాడా నీకు! అయ్యో ఆయనే మనిషి రూపంలోని దేవుడు! ఒకసారి మితిమీరిన కోపంతో నీ భార్యను పిడిగుద్దులు గ్రుద్దుతూ వుంటే, గావుకేకలు వేస్తూ విడిచి పెట్టమని నీ కాళ్ళకు చుట్టుకొన్న వారెవరో గుర్తు

పట్టావా! ఆయనే! నీవారి రూపంలో నీ కాళ్ళకు చుట్టుకొన్న దేవుడు! చూచావా! ఆయనకు చిన్నా పెద్దా బేధంలేదు. అందుకే నీ కాళ్ళు పట్టాడు. ఇన్నిసార్లు నీ వద్దకు తనంతతానుగా వచ్చినా గుర్తించ లేదా! మనిషిరూపంలో వస్తేనే చూడలేక పోయావ్. ఎంత పిచ్చివాడివి! అనంతా నంత దివ్యశక్తులతో వస్తే నీవింకేం చూస్తావ్?! అందుకే అసలు రూపంతో కనిపించడు నీకు. ఒక్కోసారి మన జేబు ఎవరో కొట్టేస్తారు. దేవుడు వచ్చి రక్షిం చడు! అంటే ఆ డబ్బు నీకు చెందినది కాదన్నమాట! నీవెక్కడో, ఎపుడో, ఏదో, పొరపాటు చేశావన్నమాట! అందుకే వారి డబ్బు వారికోసం వెళ్ళిపోయింది.

## 782. బిడ్డలందరూ సమానమే గదా! కొడుకును గొప్పగా చూస్తారేమిటి?

**జ.** "యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః అని మనుస్మృతి. ఇదే మనువు స్త్రీలకు స్వాతంత్ర్య మివ్వటానికి అంగీకరించలేదు. కారణమేమంటే ఆనాటి స్త్రీలు విద్యావంతులుకారు. కేవలం ఈ ఒక్క కారణంచేతనే స్త్రీ స్వాతం త్ర్యానికి అడ్డుగోడకట్టారు. అయితే స్త్రీలను గౌరవించాలనీ, ప్రేమించాలనీ, పూజిం చాలనీ చెప్పాడు. ఇది వేల సంవత్సరాల నాటి ధర్మశాస్త్రం.

"ముదితల్ నేర్వగరాని విద్య గలదే ముద్దార నేర్పించినన్" అని అన్నది మహా కవయిత్రి మొల్ల. నిజంగానే యిపుడు



విద్యావంతులైన యువతులు అన్ని రంగా లలోనూ మగవారికి దీటుగా పనిచేస్తుం డటం హర్షణీయం. అయితే ఇక్కడ గమ నించవల్సినదేమంటే–ఆడది అబలకాదు సబల అని ఎన్ని ఉపన్యాసాలు చెప్పినా, ఎన్ని వ్యాసాలు వ్రాసినా స్త్రీలకు ఒరగ బెట్టిందేమీ లేదు. స్త్రీ జీవితం ఎన్ని మలు పులు తిరిగినా చివరి దశకు అబలగానే మిగిలిపోతున్నది. స్త్రీల సమస్యల్లో చాలా వాటికి స్త్రీలే కారణమౌతున్నారు. ప్రత్యక్షం గానో, పరోక్షంగానో "స్త్రీకి స్త్రీయే శత్రువు" అనే నానుడి నిజమనిపిస్తున్నది.

"బిడ్డలందరూ సమానమే గదా! మరి కొడుకును మాత్రమే గొప్పగా చూస్తున్నా రేమిటి' అనేది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న! నిష్ఠూరమైన నిజమొకటి మనం గమనించాల్సి వుంది. పశుపక్షుల్లోగానీ, మనుషుల్లోగాని స్త్రీ – పురుషుల సృష్టిలోనే చాలా భేదం వుంది. ఎద్దుకు వున్నంత బలం ఆవుకు వుండదు. మగవానికి వున్నంత శక్తి ఆడదానికి వుండదు. ఇది సృష్టి ధర్మం అని అంగీకరించి తీరాల్సిందే మనం. తల్లిదండ్రులు మగబిడ్డను ఆడ



బిడ్డను ఎందుకు తేడాగా చూస్తారు? మగ బిడ్డకున్నంత స్వాతంత్ర్యం ఆడపిల్లకు ఎందుకివ్వరు? ఈ వివక్ష భారత దేశం లోనే కాదు అన్ని దేశాలలోనూ ఇప్పటికీ వుంది. ముస్లిందేశాలలో (సౌదీ అరేబియా -కువైట్-ఒమెన్-నైజీరియా మొ॥ దేశాలు) స్త్రీలకు ఈనాటికీ ఓటువేసే హక్కు లేదు. కృషి కార్మికరంగాల్లో పురుషుని ఆదాయము రు.100-00 వుంటే ఆడవారి జీతం రు.60-00గా వుంటోంది. నేటికి గూడ జపాన్ - ఫ్రాన్స్- నార్వే - పశ్చిమ జర్మనీ-బ్రిటన్ - పోర్చు గల్ మొదలైన దేశాలు కూడా ఇంతే, ఫ్రాన్స్- ఇటలీ - జపాన్-స్పెయిన్ మొదలైన దేశాల్లో స్త్రీలు గర్భవతులైవుంటే ఉద్యోగమునుండి తీసివేయటం జరుగుతూవుంది. ఏమిటిది? ఎందుకిలా? అభివృద్ధి చెందిన దేశాలే స్త్రీల విషయంలో వివక్ష చూపిస్తున్నాయి. మరి పేద దేశాలలో స్త్రీల గతేంటి? ఈ శతాబ్దంలో కూడా ఈ వివక్ష న్యాయమా? బోర్డు తగిలించుకొన్న మహిళా సంఘాలు ఏం చేస్తున్నాయి? ఏం చూస్తున్నాయి?

తల్లిదండ్రులు తమ బిడ్డల్లో అబ్బాయికే అధికారమివ్వటానికి కారణమేమంటే - ఆడపిల్లకు వివాహం కాగానే భర్త వెంట అత్తవారింటికి వెళ్ళటం-విద్యావంతురాల్నిచేసి ఉద్యోగం ఇప్పించినా సంపాదన మాత్రం భర్తకు, లేదా భర్త తరుపు వారికి అందించటం - కన్నతల్లిదండ్రుల్ని చూచే బాధ్యత సాంఘికపరంగా ఆమెకు లేకపోవటం- ఇంటి ఆస్థిలో కట్నం రూపంలో కొంత తీసికెళ్ళటం - ఇరవై సంవత్సరాలు పెంచినా చివరకు చుట్టంలాగా మిగిలి పోవటం -తల్లిదండ్రుల కష్టాల్లో ఏ విధమైన భాగం పంచు కోలేకపోవటం- ఈ కారణాలన్నీ ఆడపిల్లను చిన్నచూపు చూశాయి. చిన్ననాటినుంటే ఆడపిల్లను ఎవరికో చెందిన పరాయి పిల్లలాగ చూడటం చేస్తున్నారు కుటుంబ సభ్యులందరూ. ఇపుడు కాలం మారిపోయింది. ఈనాటి ఆడపిల్లలు చదువు సంధ్యలులేని ఆనాటి వాళ్ళు కాదు. అన్ని బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగాలు చేస్తూ వేలకు వేల రూపాయలు ఆర్జిస్తున్నారు. కొడుకుల బాధ్యతల్ని తాము నెత్తికెత్తుకొని 'శభాశ్' అనిపిస్తున్నారు.

కొడుకు గొప్పవాడా! కూతురు గొప్పదా! అన్నది చర్చనీయాంశం కాదు. పిల్లలు ఎవరైనా బుద్ధివంతులుగా పెరిగితేనే (పెంచితేనే) వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు ఆశ్రయం ఇవ్వగలుగుతారు. పాశ్చాత్య దేశాలు మాదిరిగా ఈనాటి తల్లిదండ్రులు

మారిపోతున్నారు. వార్ధక్య జీవితానికి ముందుగానే జాగ్రత్త పడుతున్నారు. కన్న బిడ్డల దయాదాక్షిణ్యంకోసం ఎదురు చూడటం లేదు. లైఫ్ ఇన్సూరెన్స్‌లు వచ్చిన తరువాత జీవన విధానంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ప్రతి నగరంలోనూ వృద్ధాశ్రమాలు వెలుస్తున్నాయి. ఇపుడు విద్యా వంతులెవరూ 'కొడుకే గొప్ప' అనుకోవడం లేదు.

పూర్వకాలం మాదిరిగా 'పుత్రుడంటే పున్నామనరకం నుండి రక్షించేవాడు' అని అనుకోవడం లేదు. కాలంమారింది. కాలంతో పాటుగా విలువలు కూడా మారుతున్నాయి.

అయితే, పాత వాసనలింకా పూర్తిగా పోలేదు. ఏ మార్పు అయినా ఒక్క సారిగా ఒక్కనాటితోనే జరగదు. కాలక్రమేణా మార్పు సంభవిస్తుంది. యాభై ఏండ్లనాటి నమ్మకాలు, పద్ధతులు, ఆచారాలు ఇపుడున్నాయా! లేవు. గుడ్డి నమ్మకాలు ఒక్కొక్కటె పారిపోతున్నాయి. ఆలోచనలలో మార్పు వచ్చింది. వస్తూవుంది.

### *783. 'మనుస్మృతి' మనుధర్మాలు అంటే ఏమిటి? మనువు ఎవరు?*

**జ.** మనకు పధ్నాలుగు మంది మనువులున్నారు. మనుస్మృతి రచించిన మనువును స్వయంభూ మనువు అంటారు. ఈ పదునాలుగు మనువులలో స్వయంభూ మనువు మొదటివాడు. బ్రహ్మ కుమారుడు. ఈ మనుమహర్షిని ఈనాటి బుద్ధిజీవులందరూ బ్రాహ్మణ పక్షపాతి అనీ, స్త్రీ జనవిరోధి అనీ, దళిత శత్రువు అనీ



విమర్శించటం అన్ని చోటులా వింటూనే వున్నాం. అయినా మన హిందు చట్టాలను ఈ మను ధర్మశాస్త్ర ప్రకారమే రచించారు. మనకు స్మృతులు వందకు పైగా వున్నా మనుధర్మ శాస్త్రాన్నే ఆధారం చేసుకొని 'ఇండియన్ లా అండ్ ఆర్డర్' ను బ్రిటిషర్స్ తయారు చేయటం జరిగింది. ఇపుడు మనం పాటించే ఆచారాలన్నీ మనుధర్మ శాస్త్రానివే! ఈ మనుమహర్షి వేదవ్యాస మహర్షికి చాలా సంవత్సరాలు ముందు వాడు. అంటే రామాయణ మహాభారత రచనలకు ముందే మనుస్మృతి వుండి వున్న దన్నమాట! మనుధర్మాలు ఏమిటి? ఏం చెయ్యాలి! ఏం చేయకూడదు! మను మహర్షి చెప్పిన శాస్త్ర, ధర్మాలను, హిత అహితాలను, చెబుతాను–ముందుగా నేను చెప్పదలచినది– స్త్రీలకు ధార్మిక స్వాతంత్ర్యం ఇవ్వరాదనీ, ఇవ్వకూడదనీ మనువు చెప్పలేదు. స్త్రీ దేవతనీ, స్త్రీని గౌరవించాలనీ, స్త్రీని సంతోషంగా వుండేటట్లు చూడాలని చెప్పాడు. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతాః" అన్నాడు

మనువు. కులవధువును నిర్లక్ష్యం చేస్తే కులనాశనం జరుగుతుందన్నాడు మనువు. చతుర్వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణ నిర్ణయంలో శూద్ర వర్ణానికి న్యాయం చేయలేదన్న విషయం మాత్రం బాధాకరమే. ఏది ఏమైనా హిందుధర్మ వ్యవస్థ మొత్తం ఈనాటికీ మనుధర్మ శాస్త్రాధారం గానే వుంది. శూద్రవర్ణాల వారు కూడా మనుధర్మశాస్త్రాన్నే అనుసరించి ఆచ రిస్తున్నారు. ఇదే మనుస్మృతి గొప్పదనం.

## 784. 'స్త్రీ' మానవజాతికి మూల ధనము.

**జ.** హిందూజాతి బీజప్రధానమైనది. జాతి విషయంలోగాని కులవిషయంలో గాని బీజమే (పురుషుడే) ప్రధానం. పురు షుడు ఒకకులం, స్త్రీ మరొక కులం అయిన వారికి సంతతి కల్గితే తండ్రికులమే సంత తికి వర్తిస్తుంది. క్షేత్ర(స్త్రీ)ప్రాధాన్యత వుండదు.

పరాశరునికీ మత్స్యగంధికీ పుట్టిన కృష్ణద్వైపాయనుడు (వ్యాసమహర్షి) బ్రాహ్మ ణుడయ్యాడు. ఆపద్ధర్మంవల్ల కుంతీదేవి మాద్రీదేవి దేవతలకు బిడ్డలను కన్నా పాండురాజు పత్నులు కావటం వల్ల క్షత్రి యులయ్యారు. దేవవేశ్య అయిన మేనకా పుత్రి శకుంతలా దుష్యంతులకు పుట్టిన భరతుడు క్షత్రియుడే అయ్యాడు. ధృత రాష్ట్రునికీ వైశ్యస్త్రీకి పుట్టిన విదురుడు వైశ్యుడు కాలేదు. క్షత్రియుడే అయ్యాడు.

కాని ఆపద్ధర్మ సంతానం ఒక్కొక్కసారి క్షేత్రప్రాధాన్యతను పొందవచ్చు. ఇటు వంటి సంతతి ఎపుడో ఎక్కడోకాని కను



పించదు. మహాభారత ఇతిహాసంలో అంబికా అంబాలికలకు వ్యాసమహర్షి వల్ల జనించిన ధృతరాష్ట్ర పాండురాజుల క్షేత్ర ప్రాధాన్యంతో క్షత్రియులయ్యారు. ఈ క్షేత్రధర్మాన్ని పశుధర్మం అంటారు. పశు మృగాలలో బీజప్రాధాన్యత వుండదు. ఆవుకి పుట్టిన లేదూడ ఆబోతు వెంట వెళ్ళదు. తల్లితోనే వుంటుంది. వైదిక వివాహ హిందూ సంస్కృతి స్త్రీలకు ద్వితీయ వివాహాన్ని అంగీకరించలేదు (ఇది ప్రాచీన సంప్రదాయం. ఇప్పటిదికాదు) వివాహమైన తరువాత సంతానం కలుగకుండానే భర్త మరణిస్తే ఆ స్త్రీకి దిక్కెవరు? ఆమె బ్రతు కేమిటి? సంతానం కలుగకుండానే భర్త మరణిస్తే, ఆ స్త్రీ ఆపద్ధర్మంగా సంతానం కోసం భర్త సోదరులతో సంతానాన్ని పొంద వచ్చునని మనుస్మృతి చెబుతున్నది. అయితే ఆ స్త్రీకి కామలాలసత్వం వుండరాదు. ఒక్క బిడ్డకు మాత్రమే ఆపద్ధర్మ అనుమతి వున్నది. ఈ విధంగా పుట్టినవాడు క్షేత్రజ ధర్మంతో మరణించిన తండ్రికి వారసుడు.



కన్య ఋతుమతి అయిన మూడు సంవత్సరాలకు కూడా తల్లిదండ్రులుగాని, కన్యాసోదరులు గాని వివాహం చేయనట్ల యితే ఆ కన్య తనకునచ్చిన మెచ్చిన పురుషునితో ఎవరి అనుమతి పొందకుండానే వివాహం చేసుకోవచ్చు. ఇది పాపం కాదు. ధర్మమేనంటున్నాడు మనువు. తండ్రి మరణానంతరం పిత్రార్జిత ఆస్తిని అందరూ భాగాలు పంచుకొన్నట్లయితే కొడుకులందరూ భాగాలుగా తీసుకొన్న ఆస్థిలో ఇరవై ఐదవ భాగాన్ని (నాలుగింట ఒక భాగాన్ని) ఆడపడుచులకివ్వాలి. స్త్రీ ధనం కింద ముందుగానే యిచ్చినట్లయితే ఆడ పిల్లలకు భాగం వుండదు.

కొడుకు మాత్రమే కులం వుద్ధరి స్తాడన్నది నిజమేకాని పుత్రసంతతి లేక పోతే పిండం వేసే దిక్కు వుండదని చాలా మంది అభిప్రాయం. కొడుకు లేకపోయిన కూతురి కొడుకు (దౌహిత్రుడు) శ్రాద్ధ కర్మలు చేయటానికి అర్హుడు. పెద్దకూతురి కొడుకు చేత కర్మకాండలు జరిపించాలి. పెద్దకుమార్తె కొడుకు చిన్నవాడైతే, రెండవ కుమార్తె మూడవ కుమార్తె కొడుకుల చేత శ్రాద్ధకర్మలు జరిపించాలని ధర్మశాస్త్రం. శ్రాద్ధకర్మ చేసిన దౌహిత్రునికి తాతగారి ఆస్థిలో భాగం ఇవ్వాల్సి వుంటుంది.

దత్తతస్వీకారానికి సగోత్రీకుడే ఉత్తమం. బిడ్డలు కలుగరన్న నిశ్చయంతో ఒకరిని దత్తతగా తీసికొన్న తరువాత బిడ్డలు కలిగితే, దత్తత తీసుకొన్నవానికి కూడా సమ భాగం ఇవ్వాల్సివుంది. స్వంతబిడ్డలు వున్నారు గదా అని దత్తపుత్రుని బయటకు పంపటానికి వీలులేదు.

సంసారిక జీవితం గడుపుతున్న పురుషుడు పన్నెండు విధాలుగా పుత్రులను పొందవచ్చునని శాస్త్ర ధర్మం వివరిస్తున్నది. ఈ పన్నెండు రకాల పుత్రులలో 'ఔరసుడు' (భార్యకు తనవల్ల పుట్టినవాడు) ముఖ్యుడు. మిగిలిన పదకొండు మంది 'ఆపద్ధర్మ పుత్రులు'. ఈ ఆపద్ధర్మ పుత్రులు కూడా పుత్రసమానులే. ఔరసపుత్రునిలా అన్ని అధికారాలు వుంటాయి. పన్నెండుగురు పుత్రులగురించి వివరిస్తాను–

1. గురు బంధువుల సమక్షంలో అగ్ని సాక్షిగా తాళికట్టిన భార్యకు తనవల్ల పుట్టినవాడు 'ఔరసపుత్రుడు'
2. దీర్ఘరోగం వల్లగానీ, అశక్తత వల్లగానీ, అసమర్ధతవల్లగానీ, ప్రమాదంవల్లగానీ తాను సంతానోత్పత్తికి అనర్హుడైతే, ఇంటి పెద్దల అంగీకారంతో తన గోత్రపు వారివల్ల తన భార్యకు సంతతి కలి

గేట్లు చేయడం తప్పుగాదు. ఈ విధంగా పుట్టినవాడు క్షేత్రజపుత్రుడు."

3. తమకు యిక సంతతి కలుగదని నిశ్చయించుకొని తమకులంలోని (తమ యింటి పేరున్న సగోత్రీకులైన) మరొక దంపతుల బిడ్డను వైదిక ధర్మప్రకారం శాస్త్రవిధిగా తమకొడుకుగా స్వీకరించవచ్చు. ఈ కొడుకు దత్తపుత్రుడు.
4. కొడుకుగా స్వీకరించకపోయినా పుత్ర స్థానాన్ని ఇవ్వకపోయినా కన్నబిడ్డలా ప్రవర్తిస్తూ గుణవినయుడు, అభిమాని ఆత్మీయతా మనస్సున్నవానిని కూడా పుత్రునిగా పొందవచ్చును. ఇతడు 'క్షత్రియపుత్రుడు'.
5. తన భార్య తనకు తెలియకుండా, ఆమె మరొకరి బలాత్కారానికి, భయానికి, ఆపదకులోనై ఆమె ప్రమేయం లేకుండానే గర్భం ధరించి పుత్రుని ప్రసవిస్తే ఆ బిడ్డడు 'గూఢోత్పన్నపుత్రుడు'.
6. ఎవరో ఏకారణంగానో ఒక బిడ్డనుకని అనాధగా వదలివేసి వెళితే, ఆ బిడ్డను మనం స్వీకరించితే, వాడు 'ఆపద్ధర్మ పుత్రుడు'.
7. వివాహానికి ముందు పుట్టింట ఉన్నపుడు కన్యాదశలో రహస్యంగా మరొకరి వల్ల పుట్టినవాడు 'క్షేత్రజపుత్రుడు'.
8. కన్యగా వున్నపుడు బాల్యచాపల్యం వలన, లేదా ఉత్సుకతవలన, అమాయకత్వం వలన గర్భవతియై బిడ్డకు జన్మనిస్తే, వివాహానంతరం భర్తకు తెలిస్తే అతడు 'సహోఢపుత్రుడు'.
9. దారిద్ర్యం వలన, పరదేశ ప్రయాణం వలన, పాలనా క్షీణతవలన, బహు సంతతి వలన కన్న తల్లిదండ్రులే బిడ్డను అమ్మితే ఆ బిడ్డడు 'క్షత్రియపుత్రుడు'.
10. విధవకు పుట్టినవాడుగాని, లేక భర్త త్యజించిన స్త్రీకి పుట్టినవాడు గాని 'పునర్భవ పుత్రుడు'.
11. ప్రమాదం వల్లగానీ, ఉపద్రవం వల్లగానీ, ఆత్మహత్యల వల్లగానీ, తల్లిదండ్రులకు దూరమై లభించిన బిడ్డ 'స్వయం దత్తపుత్రుడు'.
12. వర్ణసంకరం వల్లగానీ, బ్రాహ్మణ, శూద్రవర్ణ స్త్రీపురుషులకు గాని జన్మించి అన్యకారణాలవలన తల్లిదండ్రులచే పరిత్యజింపబడి లభించిన బిడ్డ 'పరవశ పుత్రుడు'.

పన్నెండు మందినీ పుత్రులుగానే స్వీకరించవచ్చును. కాని ఔరసపుత్రుడే అందరికన్నా శ్రేష్టుడు. ఈ పన్నెండు విధాల పుత్రులకు శ్రాద్ధపిండ తర్పణ అర్హత, సంపద హక్కు కులమాన్యత అన్నీ వుంటాయి. ఈ పుత్రుల సర్వహక్కులను ఏన్యాయపీఠం ప్రశ్నించవీలులేదు. గురు బంధు వర్గాలు విమర్శించనూ వీలులేదు.

శ్లో॥ సాచేదక్షత యోనిఃస్యాద్గత ప్రత్యాగతాపివా।
పౌనర్భవేన భర్త్రాసా పునః సంస్కార మర్హతి॥
మనుస్మృతి. 9-176

మనుమహర్షి దూరదృష్టికి ఇదొక నిదర్శన శ్లోకం. ఆడపిల్లల కన్యాప్రాయం కలలగోపురం! అనుభవరాహిత్యమైన ఆలోచనలు ఎక్కువ. అపరిపక్వ స్థితిలో

ఆకర్షణకు లోబడి ఎవరితోనైనా ఎక్కడి కైనా వెళ్ళిపోయినపుడు ఆమెకు ఆమెగా తిరిగిరావటంగానీ తీసుకురావంటం గానీ జరిగితే ఆ కన్య వివాహ సంస్కారానికి అర్హురాలే అంటున్నాడు మనువు.

పరాశర, నారద, గౌతమ, వశిష్టాది పద్దెనిమిది స్మృతులు వున్నా మనుస్మృతికి వున్న ప్రఖ్యాతి ఏ స్మృతికి లేదు. ఈనాడు మనుస్మృతి ఇంతటి నిరాదరణకు గురి కావటానికి గలకారణమేమంటే శూద్ర వర్ణానికి ఒకన్యాయం, బ్రాహ్మణవర్ణానికి ఒక న్యాయం చెప్పబడింది. బ్రాహ్మణ పక్షపాతంగా న్యాయ ధర్మాలు చెప్పటంతో ఈనాటి తరంవారి నిరశనకు గురి అయింది. పరాశరస్మృతి, గౌతమస్మృతి, నారద స్మృతి, వశిష్టస్మృతి అన్ని స్మృతులు కూడా బ్రాహ్మ ణులను దైవసమానులుగానే చెప్పాయి. శూద్రవర్ణాన్ని తక్కువగానే అంచనా వేశాయి. కాని మనుస్మృతి విమర్శలను ఎదుర్కొన్నంతగా ఏ స్మృతి ఎదుర్కొనలేదు. కాయలున్న చెట్టుకేగదా రాళ్ళదెబ్బలు!

శ్లో॥ కృతేతు మనుధర్మశ్చ త్రేతా యాంగౌతమఃస్మృతిః
ద్వాపరే శంఖతశ్చ కలౌపరా శరఃస్మృతి॥

పద్దెనిమిది స్మృతుల్లో మనుస్మృతి కృత యుగానికి, గౌతమస్మృతి త్రేతాయు గానికి, శంఖలిఖితస్మృతి ద్వాపర యుగా నికి, పరాశరస్మృతి కలియుగానికీ, వర్తి స్తుందని పండితోక్తి. అయితే మనుస్మృతి అంత విపులంగా పరాశరస్మృతి లేదు. ఇది నిర్వివాదాంశం. ఒక్క విషయం – ఈ వైజ్ఞానిక కాలంలో శాస్త్రాలు – ధర్మాలు తెల్సుకోవల్సిన అవసరం వుందా? అని ప్రశ్నించేవారు చాలామంది వున్నారు. పాశ్చాత్యులకు ఈ శాస్త్రధర్మాలతో పని లేదేమో! బ్రతుకు దెరువుకోసం జీవన భృతికోసం వచ్చిన సంప్రదాయాలు మనం వద్దనుకొన్నా మనల్ని వదలిపెట్టవు. హిందూ ధర్మం సజీవగంగ! ఏ పరిస్థితుల్లోనూ ఎండిపోదు! మహమ్మదీయమతం, క్రైస్తవ మతం ఈ రెండు మతాలు హిందూమతం మీద మహాదాడి చేశాయి. హిందూ మతం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నది. ఎందరి దౌర్జన్యాలనో చూచింది. వజ్ర పర్వతంలా అలాగే నిలిచివుంది. వుంటుంది! వుండాలి!

ఇది ఈ విధంగా ఎందుకు చేయాలి? ఇది ఎందుకు చేయకూడదు? ఈ విధంగా చేయాలని చెప్పిందెవరు? అని ప్రశ్నించే యువతరానికి జవాబుగా ఇంత పెద్ద సమాధానం వ్రాయల్సి వచ్చింది.

## 785. కళాజీవనం దరిద్రమా?

**జ.** కళాకారులు శారీరక శ్రమ చేయరు. శ్రమరహిత సంపాదనను అభిలషిస్తారు. అనాయాసంగా ధనం సంపాదించే వారికి అహం ఎక్కువ. డబ్బువిలువ తెలియదు. కళాకారులు తామేదో స్వర్గం నుండి భూమికి దిగివచ్చినట్లు భావించుకొం టుంటారు. పొగడ్తలను ఇష్టపడతారు. వాస్తవ జీవితం వీరికిష్టం వుండదు. కల్పనాలోకంలోనే బ్రతకటం వీరికిష్టం. సుఖజీవితం కోసం ఏం చేయటానికీ సంకోచించరు. డబ్బుకోసం మనస్సునీ శరీరాన్ని కూడా తాకట్టుపెట్టటానికి



వెనుకాడరు. నృత్యం గానం సంగీతం మొదలైన విద్యలు గంధర్వ విద్యలుగా చెబుతారు. గంధర్వులకు బాధ్యత, క్రమ శిక్షణ, శీలజీవనం, వాస్తవిక దృష్టి, శ్రామిక విధానం, స్థిరత్వం వంటివేవీ వుండవు. సుఖజీవనమే ప్రధానధ్యేయంగా వుంటారు. చంచల మనస్కులు కావటంవల్ల బహు భర్తృత్వం సాధారణ విషయం వీరికి! అలంకార ప్రియత్వం ఎక్కువ. గృహస్థ జీవితానికి ఇవేవీ పనికిరావు.

శ్లో॥మృగయాక్షో దివాస్వప్నః పరివాదః స్త్రీయోమదః
తౌర్యత్రికం వృథాట్యాచ, కామజో దశకోగుణః!!

మాంసాహార ప్రియత్వం, పగటి నిద్ర, స్త్రీవ్యసనం, నృత్యం, గీతం, వాద్యాభిలాష, ఊరు తిరగటం, జూదం, మద్యపానం, నిందారోపణం, ఈ పది లక్షణాలు కళాకారులకు సహజం. దరిద్రదేవతలకు ఈ పదిలక్షణాలు ప్రియమైనవి. సంసారిక జీవనానికి పనికిరానివి. ప్రపంచం నిద్ర మేల్కొనే సమయానికి కళాకారులు నిద్రకు పక్రమిస్తుంటారు. లోకం నిద్రబోయే సమయానికి వీళ్ళు నిద్రలేస్తారు. రాత్రిజీవనం వీరిది. ముఖంలో కాంతి, దేహంలో శక్తి, శరీరానికి యవ్వనం వున్నంతవరకూ సత్కారం, వయస్సు తగ్గితే ఛీత్కారం! చాలామంది కళాకారులు, జీవితపు చివరి దశలో అతినీచంగా జీవించటం అందరికీ తెల్సిందే! అందుకే పూర్వీకులు ఈ కళా రంగా నికి ప్రత్యేకవర్గాన్ని నియమించారు. వీరిని భోగంవారు, రంగసానులు, భోగినులు, దేవదాసిలు అని పిలిచేవారు. వాద్య నృత్య గీతాలాపనలలో వీరు సిద్ధహస్తులు. జీవితం సగం గడచిన తరువాతనే వీరికి వివాహం జరిగేది. ఇపుడు వీరుకూడా ఈ కళాజీవితాన్ని పూర్తిగా వదలివేశారు. సక్రమజీవితం గడుపుతున్నారు. కళను ఆరాధించి, ఆస్వాదించి గౌరవించండి. కళాజీవితం కోరుకోకండి.

## *786. కులాలు ఎప్పుడు పుట్టాయి?*

***జ.*** ఈ కులాల ప్రస్తావన వేదాల్లో లేదు. మొదట మనకు వర్ణాలేగాని కులాలు లేవు. బ్రాహ్మణ – క్షత్రియ– వైశ్య – శూద్ర వర్ణాలలో నాల్గవ వర్ణమైన శూద్రవర్ణం సంఖ్యాపరంగా బలంగా వుండేది. అతి జనసంఖ్య గల్గిన శూద్రవర్ణం గుంపులు గుంపులుగా విడిపోయారు. ముఠాల వారీగా విడిపోయిన వారందరూ ఒక్కొక్క కులంగా మార్పు చెందారు. త్రేతాయుగం మధ్య దశలో ఇది జరిగి వుండవచ్చు. అంటే ఇరవై లక్షల సంవత్సరాలనాడే కులాలకు అంకురార్పణ జరిగిందనుకోవచ్చు. ఈనాడు రాజకీయ పార్టీలు ఏ

విధంగా క్రొత్త క్రొత్త పేరులతో పుడుతున్నాయో ఆనాడు కూడా ఇలాగే ఒక్కొక్క గుంపు ఒక్కొక్క కులంగా పేర్లు పెట్టుకొన్నాయి. మనకు స్వాతంత్ర్యం రాక ముందు భారతదేశంలో ఇన్ని పార్టీలు లేవు. ఇపుడు వందల సంఖ్యలో పార్టీలు వున్నాయి గదా! శూద్రవర్ణం కూడా ఈ విధంగానే తెగలు తెగలుగా విడిపోయి బహు కులమయం అయింది. అయితే పంచమజాతిగా చెప్పబడే (మాలలు మాదిగలు) దళితులు ఏర్పడింది మాత్రం కలియుగ ప్రారంభంలోనే! అంటే ఐదు వేల సంవత్సరాలకు లోపు అన్నమాట. గ్రామాలకు దూరంగా పూరిగుడిసెల్లో వుంటూ శ్రీమంతులకు వ్యవసాయ కూలీలుగా వుంటూ, చదువు సంధ్యలకు, సంస్కార జీవనానికీ దూరమయ్యారు. వారికి వారే చిత్రవిచిత్ర ఆచారాలనూ ఆనవాయితీలనూ కల్పించుకొన్నారు.

ఇదిలావుంటే– నాగరిక జీవనానికి దూరంగా ఆడవుల్లో నివసిస్తూ గుహల్లో వుంటూ అడవి జంతువులను వేటాడి బ్రతికే తెగ ఒకటివుంది. వీరిని ఆదిమ వాసులు అంటుంటాం. అందరిలా పుట్టిన వీరు చాలా దురదృష్టానికి లోనయ్యారు. జంతువుల చర్మాలను మొలకుచుట్టుకొని జీవించేవారు. వీరికి క్రమబద్ధమైన జీవితం లేదు. మరణానికి భయపడరు. బంధాలకు తలవంచరు. ఆటవిక న్యాయం వీరిది. బలమున్నవాడే నాయకుడు. బలమున్నవాడిదే రాజ్యం. లక్షల సంవత్సరాలనుండి నాగరికతకు దూరంగా పంచమవర్ణంతో సమానంగా దైన్యజీవితం గడుపుతుండటం మనసున్న వారిని బాధిస్తుంది. కన్నీరు తెప్పిస్తుంది. వేల సంవత్సరాలకు ముందున్న 'కులకట్టడి' ఇపుడు లేదు. సర్వ కుల సమానత్వం వస్తున్నది. రాబోతున్నది. ఒక రకంగా ఇది హర్షణీయమే గదా!

## 787. ఆచారము అంటే ఏమిటి?

**జ.** కాలగమనంలో ఆచారాలు కొన్ని వికృత రూపం దాల్చాయి. ఆచారాల పేరుతో దురాచారాలు చోటు చేసుకున్నాయి. ఇది దురదృష్టం! ఆచారాలు, ఆనవాయితీలు, సంప్రదాయాలు, కులధర్మాలు మొదలైనవన్నీ ద్వాపరయుగం నుండే ఎక్కువగా మనకు సంక్రమించాయి అంటారు కొందరు.

శ్రీరాముని కాలంలో ధర్మం వుంది. ఆచారాలింతగా లేవు. త్రేతాయుగంలోనే ధూమపానం మద్యపానం వున్నట్టుగా తెలుస్తుంది. మనుష్యుల వృత్తినిబట్టి, ప్రవృత్తిని బట్టి వర్ణవిభజన జరుగుతూ వున్న సమయమది! నాలుగంటే నాలుగే కులాలు వున్న హిందూసమాజంలో ఇన్ని కులాలు ఇన్ని తెగలు అప్పుడు లేవు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు అన్న నాలుగు వర్ణాలు మాత్రమే వుండేవి. ఒక్కొక్క వర్ణంవారికి ఒక్కొక్క ఆచారం వుండేది. కాలక్రమంలో శూద్రవర్ణం వివిధ రకాల మార్పులకు, వివిధమైన విభాగాలకు, లోనైపోయింది. ఫలితంగా నూరారు తెగలుగా విడిపోయి ఎవరికి ఇష్టమైన

ఆచారాలను వారు స్థిరపరుచుకొన్నారు. ఒక్కొక్క తెగకు ఒక్కొక్క గురువు (కుల పెద్ద) వుండటం వల్లనే రకరకాల ఆచారాలను నెలకొల్పటం జరిగింది. గమనించవలసిన విషయమేమంటే శూద్ర వర్ణం ఒక్కటే వివిధ కులాలుగా విడిపోవటం జరిగింది. కారణమేమంటే ఆనాటి శూద్రులు విద్యావంతులుకారు. సమిష్టి జీవనానికి వుండే బలం విలువ వారికి తెలియదు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలు ఎక్కువ తక్కువగా ఒకే రకమైన ఆచారాలు నియమాలు పాటించారు. అతిజన సంఖ్యా బలం వున్న శూద్రవర్ణం వారందరూ వివిధ కులాలుగా మార్పు చెంది రకరకాల ఆచారాలనూ, సంప్రదాయాలనూ కట్టడి చేసుకొన్నారు. అయితే కొన్ని ఆచారాలు అన్ని వర్ణాలకూ ఒక్కటిగానే వుండేవి. బాధాకరమైన విషయమేమంటే ఆచారాలన్నీ ఎక్కువగా స్త్రీలకే, స్త్రీలకోసమే వుండేవి అని చెప్పక తప్పదు. చాలా ఆచారాలు కట్టుబాట్లకోసమే సృష్టింపబడ్డాయి.

## 788. మంచివారికి కష్టాలు, చెడ్డవారికి సుఖాలు వుంటున్నాయెందుకు?

**జ. "అవశ్యమనుభోక్తవ్యం, గతంజన్మ శుభాశుభం"** మంచివారికి మాత్రమే కష్టాలు వస్తున్నాయి! చెడ్డవారందరూ సుఖంగా వున్నారు! ఈ ప్రపంచంలో దరిద్రంతో జీవించే వారందరూ మంచి వారు – మేడలు మిద్దెలు కట్టుకొని భోగ భాగ్యాలతో వున్న వారందరూ చెడ్డవారు –అని అనుకోవాలా! ఇది అసూయ భావం! ఇది అజ్ఞానంతో కూడిన ఆలోచన! మనది కర్మసిద్ధాంతం! "గత జన్మలోని పాప పుణ్యాల ఫలితమే ఇప్పటిజన్మ" అని నమ్ముతాం. తల్లితండ్రుల పాపపుణ్యాలను కూడా బిడ్డలు అనుభవించి తీరుతారని కూడా నమ్ముతాం. ఈ కర్మ సిద్ధాంతమే హిందూ మతానికి పునాది.



ఇక్కడొక చిన్న ఆత్మ విమర్శ చేసుకుందాం. అసలు, సుఖం అంటే ఏమిటి! జేబునిండుగా డబ్బు, వంటినిండ నగలు, స్వంతకారుల్లో షికార్లు, ఖరీదైన భవనాల్లో నివాసం, ఇంట్లో పనిమనుషులు, దర్జాలు, హోదాలు ఇవేగదా సుఖమంటే! అసలు సుఖానికి నిర్వచనం, సుఖానికి రహదారి, ఇవేమికాదు. మనకంటికి కనిపించేవన్నీ సుఖాలు కానేకావు. ఈ విషయం చాలా మందికి అర్థంకాదు. అర్థమయేటంతగా ఆలోచించరు. డబ్బుతో అన్నీ పొంద

వచ్చు. అన్నీ కొనవచ్చు, అన్నీ అనుభవించవచ్చు అనుకొంటారు. అంతా అబద్ధం. అనుకూలవతియైన భార్య, ఆదరించే బిడ్డలకంటే ఆస్థులు గొప్పవా! "కష్ట సుఖాలు'' ఆలోచించే మనసులోనే వున్నాయి. క్యాష్ బ్యాగుల్లో లేవు. కొన్ని దశల్లో కొన్ని విషయాలు అర్థంకావు. అనుభవముంటేనే బోధపడతాయి. కర్మ సిద్ధాంతం ప్రకారం గతజన్మలోని పుణ్య కార్యాలవల్లనే ఈ జన్మలో సుఖాలు అనుభవిస్తారు. శ్రీమంతులుగా జన్మిస్తారు. ఇది నిర్వివాదం. ఎవరికో ఏదో వున్నదని నీకున్నదాన్ని చిన్నచూపు చూడవద్దు. నీకున్నదే నీకు గొప్పది. మహారాజుగారి భార్య త్రిలోకసుందరి అయితే నీకు లాభమేమిటి? దాహం తీర్చలేని మహా సముద్రం కన్నా దప్పికతీర్చే గ్లాసుదు నీళ్ళు గొప్పవి. మంచివారికి ఎపుడూ మంచే జరుగుతుంది. ఇది పరిపూర్ణ సత్యం. దేవుడు దయామయుడు. ఏదో విధంగా తనబిడ్డలను రక్షిస్తుంటాడు.

## 781. మనుధర్మ శాస్త్రం ఏమిటంటే-

**జ.** వివాహం స్వజాతీయులతోనే జరగాలి- వధువు సలక్షణంగా వుండాలి - తండ్రికి సంబంధించిన ఏడుతరాలతోనూ, తల్లికి సంబంధించిన ఐదు తరాలతోనూ కన్యకు సంబంధం వుండకూడదు - వధువు పొడగరిగానీ పొట్టిగా కానీ వుండకూడదు- శరీరంనిండా వెంట్రుకలు వుండకూడదు- పెద్దనోరు పొట్టిముక్కు



వుండకూడదు - అతి పెద్ద స్తనాలు వుండకూడదు- చిన్నకళ్ళు వుండకూడదు. అన్నలు తమ్ముళ్ళులేని వధువు పనికి కాదు- కన్యాశుల్కం ఇవ్వకూడదు- వరదక్షిణ తీసికొనకూడదు- పెద్దలు నిర్ణయించిన వధువే ఉత్తమమైన గృహిణిగా భావించాలి- అష్టవిధ వివాహాలలో బ్రాహ్మీ వివాహమే మంచిది - గాంధర్వ (ప్రేమ) వివాహాలు యోగ్యమైనవి కాదు- అత్త మామలను (వధువు తల్లిదండ్రులను) తన తల్లిదండ్రుల్లా గౌరవించాలి- వధువుకి సంబంధించిన పుట్టింటి వారి కానుకలు వధువుకి మాత్రమే చెందుతాయి- వివాహమాడిన భర్త నపుంసకుడైతే భార్య మరొక సగోత్రీకుడైన వానితో బిడ్డను పొందటం పాపంకాదు- ఏ పరిస్థితిలోనూ వివాహం విచ్ఛేదనం అంగీకారంకాదు - భార్యను ఒంటరిగా విడచి భర్త దేశ సంచారం చేయకూడదు- గృహిణి గృహంలో సంతోషంగా భార్య ఋతుసమయానికి

వచ్చి ఆమెతో శరీర సుఖాలు పంచుకోవాలి – పగటి సమయాలలో భార్యతో సంభోగం చేయకూడదు– బంధువులు ఇంట్లో వుండగా కానీ, బంధువుల ఇంటికి వెళ్ళినపుడుగాని భార్యతో కలిసి నిద్రించరాదు–చిన్నవారు ఏకాంతంగా వున్నపుడు వారికి భంగం కల్గించరాదు– అమావాస్య, పూర్ణిమా, అష్టమీ తిథులలోనూ పండుగల దినాలలోనూ, భార్య సంగమం చేయకూడదు –భార్య ఋతుమతిగా వున్నపుడు భార్యను సమీపించ కూడదు– భార్యనైన బలత్కారంగా అనుభవించ కూడదు – అక్క కూతుర్ని, మేనత్తగారి కూతుర్ని, మేనమామ కూతురిని వివాహం చేసికొనకూడదు–వివాహం నిశ్చయం జరిగిన తరువాత మాట తప్పకూడదు– ఆడపిల్ల ఋతుమతి అయిన మూడు సంవత్సరాలకుపైగా వివాహం జరుపకుంటే ఆ యువతి తనకిష్టం వచ్చిన వారిని వరించవచ్చు–బిడ్డ పుట్టిన పదిహేను రోజులలోనే నామకరణం చేయాలి–నదుల పేర్లు (గౌతమి కావేరి త్రివేణి గంగా)గాని, వృక్షముల పేర్లుగాని (చంపమల్లిక మందార), ప్రాణుల పేర్లు (నాగమ్మ, నాగయ్య, చిలకమ్మ, పులిరాజు, నందిని) గాని బిడ్డలకు పెట్టరాదు. మృదువైన, అందమైన, మంగళకరమైన, పిలువటానికి సులభంగా వుండే పేరును పెట్టాలి – పసిపాపకు నాల్గవ నెలలో సూర్య దర్శనం ఏయించాలి– ఆరవ నెలకు అన్నం తినిపించాలి– ఒకటి లేక మూడవ సంవత్సరాలలో వెంట్రుకలు



తీయించి, చెవులు కుట్టించాలి – తరువాత విద్యాభ్యాస ఉపనయనాలు– ఉపనయనం లేకుండా బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు వివాహం చేసికొనరాదు – పెద్దమ్మ గురువులు, వృద్ధులు, అధికారులు మొ॥కి నమస్కరించి గౌరవించాలి– పెద్దలు నిలబడివుండగా చిన్నవారు కూర్చుని సంభాషించకూడదు–పెద్దవారిని పేరుతో పిలువరాదు. అక్కచెల్లెళ్ళు అన్నదమ్ములు వీరందరూ జననీ జనక సమానులు– భార్య తల్లి తండ్రులను కూడా స్వంత తల్లిదండ్రులతో సమానులుగా గౌరవించాలి– విద్య నేర్పిన గురువు, కులపెద్ద, గ్రామాధికారి, వైద్యుడు వీరు సదా అభినందనీయులు. కాల్వలు, నదులు, చెరువులు, తోడులేకుండా, లోతు తెలియకుండాదిగి స్నానం చేయకూడదు – ఒంటరిగా ఎక్కడికీ ప్రయాణించకూడదు– ఎప్పుడూ హాస్యప్రసంగాలు చేయకూడదు –నిజంతెలియక నిందించకూడదు–పరస్త్రీల విషయాలు చెప్పు కొనకూడదు– అమావాస్య దినాలలోనూ, ఉరుముల వర్షం పడుతున్నపుడు, బంధువులు మరణించిన సమయాలలోనూ



విద్యాభ్యాసం చేయరాదు. శరీరము మాట మనస్సు పరిశుభ్రంగా వుండాలి– పెద్ద ధ్వనితో సంభాషించకూడదు– ప్రియంగా మాట్లాడాలి అలాగని అసత్యం చెప్ప కూడదు. సత్యం చెబుతున్నానని బాధ కల్గించకూడదు. బాధ కల్గుతుందేమోనని అసత్యం చెప్పకూడదు– మాట్లాడటం ఒక గొప్పకళ ఈ కళను అందరూ అభ్య సించాలి – ధర్మాన్ని న్యాయాన్ని ఎవరైనా ఎవరికైనా చెప్పవచ్చును – దారిన నడు స్తున్నపుడు ముసలివారికి, అంగ వికలు రకు, స్త్రీలకు, తలమీద బరువుతో వున్న వారికి, అధికారులకు, పెద్దలకు, ప్రక్కకు తప్పుకొని దారివదలాలి– స్త్రీలతో, తోడ బుట్టిన దానితోగాని, కన్నతల్లితోగాని హాస్యసంభాషణలు మంచిదికాదు– ఇంటిలో ఒంటరిగా వుండకూడదు– పదే పదే అద్దంలో ముఖం చూచుకొనకూడదు –మాటిమాటికీ వస్త్రధారణ మార్చ కూడదు – పొగడ్తలకు పొంగి పోకూడదు – పొగడ్తలను వినకూడదు– ఎవరినీ ఎక్కు వగా అభిమానించి ఆరాధించకూడదు– అతివినయము అన్నివేళలా మంచిది కాదు– నీచులవద్ద కానుకలు స్వీకరించ కూడదు– మిత్రులను ఎల్లపుడూ ఇంటికి ఆహ్వానించకూడదు– మిత్రులయింటికి ఎల్లపుడూ వెళ్ళకూడదు – మూర్ఖులకు, సోమరులకు, జూదరులకు, తిరుగు బోతు లకు ఎపుడూ సహాయము చేయకూడదు. సహాయము పొందకూడదు– విద్యార్థి దశలో అలంకరణ ప్రియత్వం వుండ కూడదు– ఎంతటి స్థితిలోనూ గురువు లను అవమానించకూడదు. అపహాస్యం చేయకూడదు– సూర్యోదయం తరువాత నిద్రించరాదు– వృద్ధులు, రోగులు ఎపుడై ననూ నిద్రించవచ్చును– రాత్రులలో వీధులవెంట తిరుగరాదు– ప్రాణాపాయ స్థితిలో తప్ప ఎపుడూ అప్పు చేయ కూడదు. సోమరితనము, సంభాషణా ప్రియత్వం (ముచ్చట్లు చెప్పటం) పురుష లక్షణం కాదు– మాతాపితృ సేవవలన మహాపాపికూడా పుణ్యవంతుడౌతాడు– తల్లి దండ్రులను బాధించినవాడు మరు జన్మలో పందిగా పుడతాడు.సగోత్రీకులతో వివాహము పనికిరాదు– వివాహాలలో ఎనిమిది విధాలు వున్నాయి. అన్నిటికన్నా పెద్దలు నిర్ణయించిన వివాహమే (బ్రాహ్మీ వివాహం) గొప్పదిగా దేవతలు ఆశీర్వ దిస్తారు – ఆడవారి ధనాన్నీ బలహీనుల ధనాన్నీ పసివారిధనాన్నీ అపహరించిన వాడు కుక్కగా పుడతాడు– డబ్బులకు అన్నాన్నీ, నీటినీ, న్యాయధర్మాలను అమ్ము కొన్నవాడు గాడిదగా జన్మిస్తాడు – వావి వరులు మరచి కామించినవాడు కుష్ఠు రోగిగా పుడతాడు–భర్త బ్రతికుండగానే

పర పురుషునివల్ల పుత్రుడు పుడితే, ఆ బిడ్డను 'కుండలకుడు' అంటారు. భర్త మరణిం చిన తరువాత పరపురుషుని వల్ల బిడ్డ పుడితే వానిని 'గోలకుడు' అంటారు. వీరి ద్దరూ ధర్మసంతతికాదు. భోజన సమ యంలో ఆహార పదార్థాలను ఒంటిచేతి సహాయముతో (ఒంటిచేతితో) వడ్డించ కూడు– అతిథులకు వంటకాలను వడ్డిం చేటపుడు అవిఏమిటో చెప్పి వడ్డించాలి– శుభకార్యాలలోగాని, అశుభకార్యాలలో గాని ముందుగా ఉప్పును వడ్డించటం కూడదు. అకారణంగా ఉపవాసాలతో గృహస్థులు శరీరాన్ని శుష్కింప చేయ రాదు–అన్ని ధర్మాలలోకెల్లా శరీర ఆరోగ్య ధర్మం మొదటిదిగా తెలియాలి– శరీర మాద్యం ఖలుధర్మ సాధనమ్' అని ధర్మ సూక్తి–పిసినారితనంతో దేహాన్ని దండించి, నోటిని బంధించి, తానుతినక మరొకరిని తిననీయక లోభిగా జీవించకూడదు– అధికసుఖాపేక్షతో, అధిక ధనాశతో, అశాంతిజీవనం గడుపకూడదు– శాంతి లేనివానికి, తృప్తి లేనివానికి సుఖంలేదు– సంగీతం, నృత్యం, గానం, అభినయం, మొదలైన కళలు కులహీనులకు (ద్విజా తులకు) రెండుకులాలు వారికి పుట్టిన వారికి మాత్రమే (భోగంవారికి మాత్రమే) – నృత్యగానాలతో ధనసంపాదన చేయ రాదు–గృహస్థుడు సర్వాలంకారాలతో శుచి వస్త్రాలతో, సుగంధ లేపనాదులతో సౌందర్య వంతునిగా వుండనిచో స్త్రీ తిర స్కారానికి గురికావల్సి వస్తుంది– గృహిణి



కూడా శుచివస్త్రాలతో ఆకర్షణీయంగా వుండాలి–

మధ్యాహ్నపు సూర్యుని చూడరాదు– పశువులను కట్టివేసిన త్రాటిని దాట రాదు– వర్షం వస్తున్నపుడు పరుగెత్త రాదు– నీటిలో తన ప్రతిబింబాన్ని చూడ రాదు– ఋతుమతీ సంగమం చేయ రాదు– భార్య అన్నంతినేటపుడు ఆవు లించేటపుడు భర్త చూడరాదు– భార్య తన కంటికి కాటుక పెట్టుకొనే సమయం లోనూ, తలదువ్వుకొనేటపుడు భర్త పరి శీలనగా చూడరాదు– నగ్నంగా స్నానం చేయరాదు – దారిలోనూ, గోశాలలోనూ, దున్నినపోలంలోనూ, కాలువలలోనూ, పుట్టలవద్దనూ, పాడుబడిన ఇండ్లలోనూ, నిప్పులోనూ, నడుస్తూగాని నిల్చునిగాని మూత్రవిసర్జన చేయరాదు – మాట్లా డుతూ మలమూత్ర విసర్జన చేయరాదు–


నోటితో నిప్పును ఊదకూడదు– భార్య స్నానం చేసేటపుడు నగ్నంగా చూడ

రాదు– చేతులను కాళ్ళను నిప్పుతో కాచుకొనకూడదు– నిప్పును మంచం క్రింద పెట్టరాదు – సాయంసంధ్య సమయంలో తినకూడదు నడవకూడదు నిద్ర పోకూడదు– కాలితో నేలమీద గీతలు గీయకూడదు– తనమెడలోని హారాన్ని తన చేతులతో తానే తీయకూడదు– నీటిలో ఉమ్మి వేయరాదు – ఇంటిలో ఒంటరిగా నిద్రించకూడదు– పెద్దవారు నిద్రిస్తున్నపుడు నిద్రాభం చేయరాదు– శుభ కార్యాలకు పిలువకుండా వెళ్ళకూడదు– తెల్లవారు ఝామున అర్ధరాత్రి సమయాన భోజనం చేయకూడదు– కడుపు నిండుగా ఆహారం సేవించకూడదు– నూనెలేనివి కూడ తినరాదు– చేతులు పట్టి నీరు త్రాగరాదు (పాత్రలో పోసుకొని త్రాగాలి) మృగముల ధ్వని, పక్షుల ధ్వని అనుకరణ చేయరాదు–కంచు (లోహం) పళ్ళెంలో కాలు కడుగకూడదు– ఇష్టంలేని పళ్ళెంలో భుజించకూడదు– పాదరక్షలు ఒకరివి మరొకరు ఉపయోగించరాదు– అనారోగ్యంతోనూ ఆకలితోనూ వున్న జంతువులను బండికి కట్టి బాధించరాదు– ఆవులచేత బరువులు మోయించటం, వ్యవసాయ పనులు చేయించటం మంచిదికాదు– పశువులను కర్రతో కొట్టి వేధించటం శుభంకాదు– ఎద్దులను, గాడిదలను బండికికట్టి మోయలేని బరువువేసి బాధించినవాడు మరుజన్మలో పిచ్చివాడై పుడతాడు– విరిగిపోయిన పీటను వుపయోగించరాదు– నోటితో చేతిగోళ్ళను కొరకరాదు– ఇపుడు సుఖా



న్నిచ్చి తరువాత బాధించే ఏ పనినీ (ఆహారం, జూదం, మద్యం, వ్యభిచారం, పాపం, దూషణం) చేయరాదు– గోవు వీపుమీద ఎక్కకూడదు – జడనుండి క్రిందికి వ్రేలాడునట్లుగా స్త్రీలు పూలను పెట్టకొనరాదు (ఇది వేశ్యల పద్ధతి). రాత్రి సమయాలలో చెట్లక్రింద నిద్రించకూడదు– ఇంటిలో కాలక్షేపానికైనా జూదం ఆడకూడదు– కాలి చెప్పులను చేతితో పట్టుకొని నడువకూడదు– మంచం మీద కూర్చొని భోజనం చేయకూడదు– ఆహార పాత్రను చేతితో ఎత్తిపట్టుకుని తినకూడదు– నువ్వులు కలిపిన ఆహారాన్ని రాత్రిపూట తినకూడదు – నగ్నంగా నిద్రించరాదు– కాళ్ళు కడుక్కొని నిద్రించకూడదు– మాల మూత్రాలను పరీక్షగా చూడరాదు– వెంట్రుకలు, ఎముకలు, బూడిద, కుండపెంకులు, వరిధాన్యపుపొట్టు, ప్రత్తికాయి పొట్టు వీటి మీద నిలబడితే ఆయుక్షీణం – రెండు చేతులతో తలను సవరించుకోకూడదు– స్నానానంతరం నూనె రాయకూడదు– మాంసవ్యాపారి, వేశ్య, మద్యం విక్రయించే

వాడు, వ్యభిచారం చేయించేవాడు ఈ నలుగురి వద్ద ప్రాణాపాయ సమయాల్లోనైనా ధనాన్ని తీసికొనకూడదు - బంగారాన్ని ఎపుడూ తాకట్టు పెట్టకూడదు- భర్త మరణించిన స్త్రీ ధనానికి ఆశపడరాదు - సూర్యోదయ సమయాల్లో మాత్రమే చేయవల్సిన పనులను ఆలోచించాలి - రహస్యాలను స్త్రీలకు చెప్పరాదు - విద్యార్థులు అస్పష్టంగా చదువుకూడదు- అర్ధరాత్రి పాఠాలు చదువరాదు -వేదాధ్యయనం ఉషఃకాలంలోనే చేయాలి - భోజనంచేసిన తరువాత స్నానం చేయకూడదు- స్నానం చేసిన నీటిమీద నిలబడరాదు-ఎప్పుడూ శత్రుసహాయాన్ని కోరకూడదు- తన పేదరికానికి తానే నిరాశపడకూడదు- వాస్తు శాస్త్రాన్ని జ్యోతిష్యాన్ని వృత్తిగా పెట్టుకొని ధనసంపాదన చేసి జీవించరాదు- గోష్పాదం (పిలక) లేని బ్రాహ్మణునిచే శుభకార్యాలు చేయించరాదు- తన చేతులతో ఎప్పుడు మర్మాంగాన్ని సరిచేసుకొంటూ వుండకూడదు- కురూపులను చూచి నవ్వరాదు- దుర్వార్తలను పాపకర్మలను విన్నపుడు చూచినపుడు కుడి చెవిని కుడి చేతితో స్పృశించాలి- ఇంటిలోపల కాళ్ళు కడుగరాదు- మల మూత్ర విసర్జన (ఎటాచ్డ్ బాత్‌రూం) ఇంటిలోపల జరుగరాదు. ఇది దరిద్రానికి దుఃఖానికి సంకేతం- మలవిసర్జన స్నానం, దేహాలంకారం, పల్లుతోమటం, దైవపూజ, క్షవరం, ఈ పనులు మధ్యాహ్న సమయంలో చేయరాదు. పండుగ సమయాలలో పెద్దలను దర్శించి పండ్లు ఫలాలను సమర్పించాలి దీనివల్ల శుభము కీర్తి ఆయుష్షు పెరుగుతాయి. అహంకారం చూపరాదు- శత్రువులైనా మన యింటికి వచ్చినపుడు సమాదరించాలి. ద్వేషం చూపరాదు - ప్రతి దానికీ ఇతరుల సహాయం కోరకూడదు- బంధువుల మిత్రుల ఇండ్లలో ఎక్కువరోజులు నివసించరాదు- కన్నకూతురింట, తోబుట్టువు యింట ఎక్కువ రోజులు గడుపరాదు- పరుల దయనూ, పరుల అన్నాన్నీ, పరుల ఆశ్రయాన్నీ కలలోగూడ పొందగూడదు - గోవు, గుర్రం, గాడిద, పంది, పిల్లి, కుక్క. ఈ ఆరు ప్రాణుల్ని గ్రామప్రాణులు అంటారు. వీటిని రాయితోను, కర్రతోనూ హింసించరాదు- కోపంవల్ల నీకు ఎవరూ వశులుకారు. కాబట్టి కోపత్యాగం అన్ని త్యాగాలకంటే గొప్పది- నీకున్న దానిలో కొంత, నీకు మిగిలిన దానిలో కొంత మంచివారికి సహాయం చేయాలి - అపాత్రులకు (సోమరి, జూదరి, వ్యసన పరుడు) దానం ధర్మం చేయరాదు- ఇంటి సేవకులు ఎల్లవేళలా నిద్రిస్తుండరాదు- ఆహార పదార్థాలను తానొక్కడే తినరాదు- అతికాముక భావనలుకలిగి వుండరాదు- కళాకారుల యిండ్లకు వెళ్ళరాదు. వారిండ్లలో భోజనాదులు చేయరాదు-జలదానం, అన్నదానం, విద్యాదానం, శాస్త్రదానం, వస్త్రదానం ఇవి గొప్పదానాలు- భక్ష్య మాంసాలలో-చిలుక, పావురం, పిచ్చుక, కొంగ, కోతి, పిల్లి, ముంగిస, కప్ప, కాకి, గ్రద్ద,



గాడిద, గుర్రం, గేదె, కోయిల, నెమలి, కుక్క, నక్క, గుడ్లగూబ మొదలైన ప్రాణుల మాంసం తినరాదు–శుభ కార్యాలకు మాంసాహారం మంచిదికాదు.

శిశువు పళ్ళతో పుట్టడం, ప్రేగు మెడను వేసుకొని పుట్టటం, తల్లి గర్భం నుండి కాళ్ళతో బయటకు రావటం. ఇవి అశుభ జననాలు కాబట్టి హోమ శాంతిని జరిపించాలి– రెండు సంవత్సరాలు నిండని బిడ్డ మరణిస్తే దహనం చేయక ఖననం (సమాధి) చేయాలి. శ్రాద్ధకర్మలు అవసరం లేదు– క్షత్రియులకు పన్నెండు రోజులు, వైశ్యులకు పదిహేను రోజులు, శూద్రులకు నెలరోజులు అశుచి దినాలు. శుభ కార్యాలు చేయరాదు– ఆత్మహత్యతో మరణించిన వారికి శ్రాద్ధాదులు పిండ ప్రదానాలు చేయరాదు–(అశుచి దినాలలో కూరలలో కొందరు తీపి, పులుపు, ఉప్పు, కారం వీటిలో ఒక దానిని ఆనాల్లు రోజులు మానివేస్తారు).

మను మహర్షి చెప్పిన ధర్మాలను ఆచారాలను సంప్రదాయాలను ధార్మిక విధులను బ్రాహ్మణులు ఆచరిస్తారా? ఎంత మంది ఆచరిస్తారు!! నూటికి వేయికి లక్షకు కోటికి ఒక్కరైనా ఆచరిస్తున్నారా! ఈ స్థితిలో అగ్రవర్ణాలను మనువాదుల నటంలో అర్థమేమిటో తెలియటం లేదు. ఒకప్పుడు ఆంగ్లేయులు మనల్ని విభజించి పాలించటం అనే దుర్నీతితో మనందరినీ విభజించి కులద్వేషాలు పుట్టించారు. ఇపుడు మనవారనుకొన్న మనరాజకీయ వాదులు మననందరినీ విభజించి పాలిస్తున్నారు. వీరందరూ మనయింటి శత్రువులు. వీళ్ళను పారద్రోలటం ఎవరికీ సాధ్యంకాదు. ఒకనాటికన్నా ఈనాడు కులతత్వం విపరీత పోకడలు పోతోంది. శూద్ర వర్ణమే ముక్కలు చెక్కలుగా విడిపోయి శూద్రులే కులబేధాలను అనుభవిస్తున్నారు. అగ్రవర్ణంవారు ఎపుడూ ఏనాడూ ఏయుగంలోనూ ఇతర వర్ణాలతో పోరాటాలకు దిగలేదు. రక్తపాతం సృష్టించిన దాఖలాలులేవు. ఈ నిజాన్ని అందరూ అంగీకరించాల్సిందే. విద్యా వినయాలతో, ఆచార క్రమశిక్షణతో మూడు వర్ణాల వారిని అతిక్రమించి ముందు నిలిచిన బ్రాహ్మణ వర్గానికి జోహారులర్పించాల్సిందే! (ఈనాటి సమసమాజానికి సంబంధించని ధర్మాలు, కొన్ని కలియుగానికి ఆచరణ యోగ్యం కాని ధర్మాలను, రాజమహారాజులనాటి కాలానికి సంబంధించిన కొన్ని రాజ ధర్మాలను వ్రాయకుండా వదలివేస్తు

న్నాను. ఇది న్యాయమనియే నేను భావిస్తు న్నాను. ఇందుకు క్షంతవ్యుణ్ణి)



అందరికి జన్మనిచ్చే స్త్రీ సదా పూజ్యు రాలు– పతిరహితగా పూజకార్యం మొద లైన వైదిక కార్యాలను చేయరాదు– స్త్రీలు (తల్లి, భార్య, కూతురు) ఇంటి యజ మానికి తెలియకుండా ఏ వ్యవహారములు చేయరాదు– పురుషరక్షణ లేకుండా స్త్రీలు స్వతంత్ర జీవనం సాగించరాదు– గృహ కార్యాలలో నేర్పరులైన తరువాతనే యువ తులకు వివాహం చేయాలి– కూతురు ప్రవర్తనా విషయాలన్నిటికీ తల్లిగా, కుటుంబ సమస్యలలో క్షమామూర్తిగా, గృహకలహాలలో న్యాయదేవతగా, కుటుంబ సర్వస్వంగా గృహిణీ ధర్మాన్నీ స్త్రీలు పాటించాలి – ఇంటి యజమానికి చెప్ప కుండా ఉపవాసవ్రతాలు చేయకూడదు– ఎల్లపుడు అద్దంలో తనను చూచుకొన రాదు–వీధి గుమ్మం వద్ద నిలబడి వుండ రాదు – పనిలేక ప్రక్కింటికి వెళ్ళరాదు– తనయింటి విషయాలను పుట్టింట చెప్ప రాదు–పుట్టింట గొప్పలను అత్తింట చెప్ప రాదు – భర్త తరుపున బంధువులను ఆద రంగా చూడాలి – అత్తమామలను తల్లి దండ్రుల్లా –వృద్ధులకు పసివారికి ముందు భోజనం పెట్టాలి– ఇంటి పని చేసే సేవ కులతో ఇంటి సమస్యలు చెప్పరాదు– పొరుగింటి సమస్యలను వేరొకరితో చర్చించకూడదు – పుట్టినింట ఎక్కువ రోజులు వుండి పోకూడదు– కన్నబిడ్డల నడవడికలను గమనిస్తూ బుద్ధులు నేర్పాలి – ఒంటరిగా దేవాలయానికైనా వెళ్ళ రాదు– భర్తకు తెలియకుండా అప్పులు చేయటం వస్తువులు కొనటం అమ్మటం చేయరాదు – చెప్పుడు మాటలు విన రాదు– మెచ్చకపు మాటలాడే వారిని, ఇత రుల గూర్చి గొప్పలు చెప్పేవారిని చాడీలు మోసేవారిని దగ్గరకు రానీయరాదు. భర్తతో అబద్దాలు చెప్పటం వల్ల కన్న బిడ్డలు అలుసుగా తీసుకొని లంచ కోరు లవుతారు– పొరుగింట వారితో తగువు లాడరాదు–బొట్టులేకుండా యింట్లో తిరగ రాదు– వెంట్రుకలు విరబోసుకొని తిరగ రాదు– భర్త ఇంటలేనపుడు స్వంత సోదరు నితోనైన ముచ్చట్లు చేయరాదు– దైవభక్తి పేరుతో గుడులు గోపురాలు తిరగరాదు – తల వెంట్రుకలను కత్తిరించరాదు– ఇంట్లోని ప్రతివిషయాన్ని భర్తతో చెప్పి అశాంతికి గురి చేయకూడదు– భర్తకంటె ముందుగా నిద్రించకూడదు– పొద్దై

పోయిన ఆహార పదార్థాలను వడ్డించ కూడదు– ఆహారవస్తువులను యధేచ్ఛగా వండి పారవేయకూడదు – వంట సమ యాలలో బయటకు వెళ్ళరాదు– నీటిని వృధాచేయరాదు– పరిశుభ్రతను మరువ రాదు– ఉప్పు, నూనె, పసుపు నేలమీద పడనీయరాదు – పనివారల కష్ట సుఖా లను విచారించటం సహాయం చేయటం మరువరాదు– కాలుమడత వేసుకొని కూర్చొనరాదు– మత్తు పదార్థములను ముట్టరాదు – మాసిన చిరిగిన బట్టలను ధరించరాదు– అతిగా మాట్లాడరాదు– అకారణంగా నవ్వరాదు– వంట పాత్ర లను కాలితో తన్నరాదు– ఇంటికి (గదికి) మధ్యభాగాన నిద్రించరాదు– ఆసనం మీద కూర్చుని కాళ్ళువూపరాదు– నడుస్తూ పదే పదే కుడి ఎడమల వైపులకు చూడరాదు– భర్తకు ముందు నడువ రాదు– భర్తకు కుడివైపున నిల్చొనరాదు, కూర్చొనరాదు– జడను గుండెలమీదకు వేసుకొనరాదు– మాటిమాటికి చీరను సర్దుకొనరాదు– పమిటను కూడ పదే పదే సర్దుకోనరాదు– సుగంధద్రవ్యాలను (అత్తరు) అన్ని వేళలా అలముకొనరాదు –సభ్యతను దాటి అలంకరించు కొన రాదు– రోజుకొక్కరికి అయినా అన్నధర్మం చేయాలి– వట్టి అన్నం (కూర –పచ్చడి లేకుండా) ధర్మం చేయకూడదు – దాహా ర్తులకు మంచినీరు లేదనరాదు– ఇంటి నీడన కూర్చున్నవారిని అదలించరాదు– అతి సంపాదనకు భర్తను ఒత్తిడి చేయ రాదు– బిడ్డలకు భర్తపై ఫిర్యాదులు చేయ రాదు– భర్త అసమర్థతను, పేదరికాన్ని బంధువుల ముందు, పరులముందు ఎత్తి చూపకూడదు– కన్నబిడ్డల తప్పులను దాచకూడదు– భర్త అనురాగం కోసం (పిచ్చినాటు మందులు) రహస్య ఔషధా లను ప్రయోగించరాదు–ఇవి స్త్రీల ధర్మాలు. నిద్రిస్తున్న వానిమీద, పరిగెత్తి పోతున్న వానిమీద, నమస్కరిస్తున్న వాని మీద, బలహీనుని మీద, రోగగ్రస్తులమీద, అంగవికలునిమీద, ప్రతీకారం తీర్చుకొన రాదు–ఆడవారిమీద, బిడ్డల మీద తల్లి దండ్రుల మీద, గురువులమీద అప నిందలు వేయరాదు– బలవంతులతోనూ, ధనవంతులతోను, పాలకులతోను, నాయ కులతోను, కక్షలు పెట్టుకొనరాదు– బల వంతునకు అప్పు ఇవ్వరాదు, తీసికొన రాదు – మద్యవ్యాపారి మాంసవ్యాపారి వీరితో ఆర్థిక లావాదేవీలు వుండ కూడదు – చిన్న చిన్న విషయాలు పరిష్క రించు కోవాలిగాని న్యాయస్థానాలకు వెళ్ళ రాదు – ఇంటి పనిచేయు స్త్రీలను, కూలికి వచ్చిన స్త్రీలను, ఆపదలోవున్న స్త్రీలను, భర్తలేని స్త్రీలను, అవివాహిత యువతు లను, బిక్షమెత్తు స్త్రీలను, మూగ స్త్రీలను, ధనానికి లోబరుచుకొనిగాని, భయ పెట్టిగాని సంభోగించరాదు– పాప కార్యా లను చేయుటయేకాదు, పాపపు ఆలో చనలు కూడ నరకమే.

ధనధాన్య మానప్రాణ రక్షణ కన్నా స్త్రీ రక్షణ గొప్పది. కులస్త్రీని సంరక్షించి

పోషించలేని వాడు బ్రతికివున్నా మరణిం చినవానితో సముడు- స్త్రీ సంపాదనను ఆశించినవాడు కుక్కకన్నా హీనుడు- స్త్రీలను పరులకు తార్చువాడు పందికన్నా నీచుడు.

## 780. అక్క-మేనత్త-మేనమామ బిడ్డల్ని వివాహమాడవచ్చా?

**జ.** అక్క కూతురిని, మేనత్త కొడుకుని, మేనమామకూతుర్ని పెండ్లి చేసుకొనే



పద్ధతి ఆంధ్ర- కర్ణాటక -తమిళనాడుల్లో మాత్రమే వుంది. ఉత్తర భారత దేశంలో ఈ సంప్రదాయంలేదు. ఈ సంప్రదాయం ద్రావిడ సంప్రదాయమేగాని ఆర్య సంప్ర దాయం కాదని తెలియవస్తోంది.

అయితే, అర్జునునికి సుభద్ర మేన మామ కూతురు! శ్రీకృష్ణుని అష్టభార్యలలో ఒకరైన 'భద్రాదేవి' కృష్ణుని మేనత్త శృతకీర్తి కుమార్తె! ఈ విధంగా చూస్తే ఆర్యులలో ఈ సంప్రదాయం వున్నట్లేగదా! కాని మహాభారత యుద్ధానంతరం ఈ వరు సలు ఆర్యుల్లో మాసిపోయాయట! కృష్ణుని వల్ల భద్రాదేవికి పుట్టిన పదిమంది సంతానం మూర్ఖులైపోయారనీ, సుభద్ర మేనత్త కొడు కుని చేసుకోవటం వల్లనే అభిమన్యుడు అర్ధాయుష్షుతో మరణించాడనీ, ఇప్పటికి ఉత్తరభారతంవారు నమ్ముతారు.

తల్లి తరుపున ఏడు తరాలు, తండ్రి తరుపున ఏడుతరాలు వదలివేసి వివాహ సంబంధం కుదర్చాలని 'ధర్మసింధు' చెబు తున్నది. మనువు కూడ ఈ విషయాన్ని బలపరిచాడు. కాని, మన బిడ్డ మనకళ్ళ ఎదురుగా వుండాలనీ, ఆస్థిపాస్తులు పరాయివారికి చెందరాదనీ ఆలోచించి స్వార్ధబుద్ధితో అక్క బిడ్డను పెండ్లి చేసు కోవటం, మేనత్త కూతుర్ని చేసుకోవటం జరుగుతూవుంది. ఇది తప్పు.

అపరిచిత స్త్రీ పురుషుల్లో అనురాగమే కాదు. అవగాహన కూడా వుంటుంది. అంటే నూటికి నూరుశాతం ఈ విధం గానే వుంటారని కాదుగాని ఎక్కువశాతం దంపతులు సుఖంగా వుంటారని చెప్ప వచ్చు! ఒక్క ఆరోగ్య విషయంలోనే కాదు, ఆర్ధిక విషయాలలోగానీ, గౌరవ ఆదరాల విషయంలోగానీ, ఏ రకంగా ఆలోచించి చూచినా అక్కకూతురిని చేసుకోకపోవటం మంచిదిగా కన్పిస్తోంది. అలాగే మేనత్త కూతుర్ని, మేనత్త కొడుకునీ, తరువాత మేనమామ కూతుర్ని పెండ్లి చేసుకోక పోవటం కూడా మంచిది.

చాలామంది పెద్దవారికి కూతురి బిడ్డ అయితే తమను అభిమానంగా చూస్తుం దనీ, వృద్ధాప్యంలో ఆదరిస్తుందనీ, పిచ్చి

ఆలోచనలు చేస్తారు. ఇదంతా తప్పు. కోడలుగా వచ్చిన కూతురి బిడ్డ ఏం చేసినా సర్దుకుపోతాం. పాపం తెలియదులే అని మన్నిస్తాం. అదే పరాయి బిడ్డ కోడలిగా వస్తే ప్రతాపం చూపిస్తాం. పరాయి కుటుంబాన్నుండి వచ్చిన కోడల్ని కూతురిలా చూచు కోగల్గితే, మనల్ని ఏ కోడలైనా ప్రేమగానే చూస్తుంది. అభిమానిస్తుంది. గౌరవిస్తుంది.

## 781. వర్ణాశ్రమ ధర్మం అంటే ఏమిటి?

**జ.** సాంఘీక జీవనం సాఫీగా సాగటానికీ, ఒకే వృత్తిని అందరూ అవలంబించకుండా వుండటానికీ, మానవ సదుపయోగానికీ వర్ణాశ్రమధర్మం ప్రవేశ పెట్టటం జరిగింది.

1. వర్ణధర్మ ప్రారంభం ఎలా జరిగిందంటే, సూక్ష్మబుద్ధి,సాత్విక యోచన వున్న వారినీ, పాపభీతి, అహింస ప్రవృత్తి వున్న వారినీ, కాయకష్టం చేయలేని బలహీనుల్ని ఒక భాగంగా విభజించారు. వీరే బ్రాహ్మణులు". అయితే ఈ విభాగంలోని



వారు ధర్మప్రవృత్తికి కట్టుబడి, తమ వృత్తికి లోబడి వుండకపోతే వాళ్లను బ్రాహ్మణులుగా పరిగణించేవారు కాదు. సంఘ బహిష్కారం జరిగించేవారు. క్రూర మృగాలున్న అడవులకు నెట్టేవారు.

2. ధైర్యసాహసాలు, దేహశక్తి, పోరాట పటిమతోపాటు రక్షణాశక్తి గలిగిన వారిని నాయకులుగా నియమించుకొన్నారు. వీరే "క్షత్రీయులు". తనగుంపులోనివారికి మరొక గుంపువారినుండి ఏ ఆపదా రాకుండా కాపాడటం, క్రూర జంతువుల బారినుండి స్త్రీలకు, వృద్ధులకు, పసివారికీ రక్షణ కల్పించటం ఈ వర్ణం వారి బాధ్యత.

3. తెలివితేటలు, ధర్మబుద్ధి, న్యాయవివక్ష కలిగి వినిమయ దక్షత కలిగినవారిని ఆహార పదార్థాలు అందరికీ, అన్నీ అందటం కోసం వస్తుమార్పిడి జరగటం కోసం నియమించబడినవారే "వైశ్యులు". ఎవరు ఏ విధమైన ఆహార పదార్థాలు సేకరించినా అవి అందరకూ వస్తుమార్పిడి పద్ధతిలో అందేట్లు చేయటం వీరి కర్తవ్యం.


4. ఒక గుంపులో వేయిమంది జనం వుంటే పదిమందిని నాయకులుగానూ, ఇద్దరిని ఆహార వస్తువుల మార్పిడికిగానూ, ఇద్దరిని (బ్రాహ్మణులను) న్యాయ రక్షణకుగానూ, నియమించుకొని మిగిలిన వారందరూ వ్యవసాయ వృత్తికీ, అడవులలోని కంద మూలాలకూ ఫల సేకరణకూ వెళ్ళేవారు. అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణానికి చెందినవారు పదిమంది వుంటే మిగిలిన తొంభైమంది శూద్రవర్ణం వారు వుండేవారు. అందరూ నియమానికి కట్టుబడి వుండేవారు. గుంపులు గుంపులుగా ఉండి బ్రతుకును సాగించే

ఆనాటి జనంలో ఒక దురాచారం ప్రబలి వుండేది. ఎదుటి గుంపులోని స్త్రీలను మాటువేసి అపహరించుకొని పోయే వారు. శాశ్వతంగా తమవద్దనే వుంచుకొనే వారు. అబలలైన స్త్రీలు దౌష్ట్యానికి తల వంచి జీవించేవారు. తమ గుంపులోని స్త్రీలను ఎదుటి గుంపువారు అపహరించుకొని పోవటం అవమానంగానూ, చేతగానితనంగానూ భావించేవారు. సమయం చూచి మాటువేసి అవతలి గుంపువారి ఆడవారిని బలాత్కరంగా ఎత్తుకొచ్చి స్వంతం చేసుకొనేవారు. ఈ విధంగా సాగుతూండేది వారి జీవనం. ఈ పరిస్థితుల్లోనే – రక్షణకు క్షత్రియవర్ణం, ధర్మన్యాయ నిర్ణయానికి బ్రాహ్మణవర్ణం అందరికీ అవసరమయ్యాయి. ఈ రెండు వర్ణాలవారు పెద్దలయ్యారు. అయితే ఎవరూ ధర్మం చరించేవారు కాదు! బుద్ధిచాతుర్యం, నియమపాలన, శాకాహార నియమం కలిగిన బ్రాహ్మణవర్ణం అందరి అభిమానాన్నీ, మెప్పునీ సాధించారు. క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలను శాసించేస్థితికి ఎదిగారు. వర్ణాలలో వీరే అగ్రస్థానం సాధించారు. చాలా నియమబద్ధంగా కూడా వుండేవారు. పర స్త్రీలవంక కన్నెత్తి చూచేవారు కాదు. ఒక స్త్రీతోనే నియమబద్ధంగా వుండటం శూద్ర క్షత్రియ వైశ్యవర్ణాల వారిని ఎంతో ఆకర్షించింది. అందరూ బ్రాహ్మణ వర్ణాన్ని అగ్రవర్ణంగా అభిమానించి గౌరవించటం మొదలు పెట్టారు. అప్పటికి భాషవున్నా, లిపి లేదు. చతుర్వర్ణాలలో బుద్ధివంతులైన బ్రాహ్మణవర్ణమే భాషకు లిపిని సమకూర్చారు. క్షత్రియ వైశ్యవర్ణాల వారికి లిపిని నేర్పించి విద్యావంతులను చేయటమే కాకుండా న్యాయ నీతి ధర్మ సూత్రాలు రచించారు. అవన్నీ అందరికీ ఆమోదయోగ్యం అయ్యాయి.

బుద్ధికుశలత వున్న బ్రాహ్మణ వర్ణం అగ్రవర్ణం అయింది. (ఈనాడు మనం చూస్తున్న బ్రాహ్మణవర్ణానికీ, ఆనాటి బ్రహ్మణవర్ణానికీ ఏ విధమైన సారూప్య సంబంధాలు లేవంటే లేవని చెప్పటం దుస్సాహసమే అవుతుంది. క్షమించాలి.) ఆనాటి బ్రాహ్మణ వర్ణానికి వర్ణ వివక్ష యింత నీచంగా లేదు. వుండివుంటే పరమ బ్రహ్మర్షి సద్బ్రాహ్మణుడైన వశిష్ఠమహర్షికి పంచమ జాతి కన్య అయిన అరుంధతి భార్యగా అయ్యేది కాదు గదా!

ఆ॥ పాపవర్తనుండు బ్రాహ్మణుం డయ్యును,
నిజము శూద్రుకంటె నీచ తముడు
సత్య శౌచ ధర్మశాలి శూద్రుండ య్యు
అతడు సద్విజుండయనిరి మునులు
(శ్రీమహాభారతం పంచమాశ్వాసం అరణ్య పర్వం 137)

గౌతముని శాపంవల్ల బ్రాహ్మణులు ధర్మదూరులై అపమార్గాన్ని అవలంబించి, సదాచారానికి దూరమై, ధనలోభానికి లొంగిపోయారు. శాస్త్రాలను తల కిందులు చేశారు. అసంబద్ధ ఆచారాలను అక్రమ సాంప్రదాయాలను అమాయక జన సామాన్యుల్లోకి చొప్పించారు. ఇది త్రేతాయుగంలో చివరి భాగాన జరిగిందని అంచనా.



అయితే అందరూ గమనించవలసిన విషయం ఒక్కటుంది. శ్రీమద్రామాయణం వ్రాసిన వాల్మీకి బ్రాహ్మణుడు కాదు. భారతీయులు మాత్రమే కాదు బ్రాహ్మణ వర్ణం ఆరాధించి పూజించే అయోధ్య రాజైన శ్రీరాముడు బ్రాహ్మణుడు కాదు. శ్రీ కృష్ణుడు బ్రాహ్మణుడు కాదు. బ్రహ్మర్షి విశ్వామిత్రుడు బ్రాహ్మణుడు కాదు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా వుంది!! బ్రాహ్మణ– క్షత్రియ–వైశ్య– శూద్ర జాతులే కాక ఐదవ జాతిగా (పంచమజాతి) కొంద రిని విభజించటం జరిగింది. వారే మాల మాదిగలుగా ఊరికి దూరంగా ప్రత్యే కంగా వుంటూ వచ్చారు. మాంసాహారం వీరికి ప్రధానాహారం. చెప్పులు కుట్టటం, చర్మ సాధనాలు తయారుచేయటం, కూలి పని చేయటం వీరికి ముఖ్యవృత్తిగా శాసిం చటం జరిగింది. స్మశానాలకు కాపలా కాయటం కూడా వీరి బాధ్యతే!! పంచమ జాతి వారికి ఆలయ ప్రవేశం వుండేది కాదు. వారికి ప్రత్యేక ఆచారాలు, ప్రత్యేక దేవతలు, ప్రత్యేక వస్త్రధారణ వుండేవి. మారెమ్మ, మహంకాళమ్మ, పోతమ్మ, కంకాళమ్మ మొదలైన దేవతలను కొలవటం, మాంసాహారులు కావటంవల్ల జంతు బలులు ఇవ్వటం వారికి ఆచార మయింది.


అన్నదమ్ములైన హిందువులు కులాలు పేరుతో విడిపోయి హిందూ శక్తినీ, హిందు మతాన్నీ, హిందూ ఆదర్శాన్నీ, హిందూ తత్వాన్నీ కకావికలు చేశారు. ప్రపంచ దేశాలలో ఎక్కువ కులాలు వున్న దేశంగా భారతదేశం నమోదు అయింది.

హిందీ భాషను భారతీయుల భాషగా చేయాలనీ, భారతీయులందరికీ ఒకే భాష వుండాలనీ ఎంతోమంది ప్రయత్నం చేశారు. కానీ మాతృభాషా వ్యామోహం వున్న మన భారతీయులు అంగీకరించ లేదు. దురదృష్టం! వర్ణాశ్రమ ధర్మం కాల క్రమంలో నశించిపోయింది. ధన సంపా దన జీవిత ధ్యేయంగామారి అన్ని వర్ణాల వారూ అన్ని ధర్మాలనూ మన్నిస్తున్నారు.

శుభం సర్వేజనాః సుఖినోభవంతు.

## 782. భార్యా భర్తల్లో పురుషునికి పెద్దవయస్సు ఎందుకు?

**జ.** వైదికమతం మనుషులకు కొన్ని నియ మనిబంధనలు విధించింది. అయితే కొందరు వైదికమతం పురుష పక్ష పాతంతో నిండి వుందని వాదించేవారు న్నారు. ఇది కేవలం భ్రమ మాత్రమే! ఇది దృష్టిలోపమే గాని సృష్టిలోపం కాదు. అన్ని మతాల కన్నా హిందుమతానికి లక్షల సంవత్స రాల చరిత్రవుంది. మానవ జీవితాన్ని



సమూలంగా అధ్యయనం చేసిన సనాతన ఋషులు మనుషుల భద్రతకోసం కొన్ని నియమాలను విధించారు. అటువంటి నియమాలలో స్త్రీ పురుషుల వైవాహిక బాంధవ్యానికి పురుషునికి ఎక్కువ వయస్సు స్త్రీకి తక్కువ వయస్సు వుండాలని నిర్ణయించారు. వైవాహిక ఆచారాలన్నీ ఒక్కసారిగా నియమించినవి కాదు. ఒక్కొక్క విషయాన్నీ అనుభవ పూర్వకంగా గుర్తించి విధించటం జరిగింది. రామాయణ కాలం నాటికి స్త్రీ పురుషుల వయస్సులతో నిమిత్తం వుండేది కాదని తెలుస్తున్నది. ద్వాపరయుగం నాటికి భార్య కంటే భర్తకు ఎక్కువ వయస్సు వుండాలని గుర్తించి వుంటారు. అన్ని మతాలవారు ఈ సిద్ధాంతన్నే అమలుపరుస్తున్నారు. పురుషునికన్నా ఎక్కువ వయసుగల స్త్రీతో శారీరక సంబంధాలు కల్గి వుంటే పురుషునికి శక్తి తగ్గిపోతుందనీ, నపుంసకుడు అవుతాడనీ, ఆయుర్దాయం తగ్గిపోతుందని చెప్పే మాటలు నిజం కాదు! కానీ, ఇటువంటి అశాస్త్రీయ అధార్మిక అసంబద్ధ సంబంధం మంచిది కాదు. జన్మతః సామాజిక కారణాలవల్ల స్త్రీలకు సిగ్గు ఎక్కువ. వివాహానంతరం భార్యాభర్తల మధ్య జరిగే శృంగార కార్యకలాపాల్లో ఎక్కువ చొరవ తీసికొనవల్సింది పురుషుడే! భార్యను లాలించి ప్రేమతో బుజ్జగించి, స్వంతం చేసుకోవల్సిన బాధ్యత కూడా పురుషునిదే! ఈ దృష్టితో కూడా పురుషునికి ఎక్కువ వయస్సు వుండాల్సిందే.

పుట్టుకతో పురుషుడు స్త్రీ కంటే బలవంతుడు. ఇది మనుష్యులలోనే కాదు పశువులలోనూ పక్షులలోనూ జంతువులలోనూ పురుషశక్తిని మనం గమనించవచ్చు. ఎద్దులకు వున్నంత శరీరబలం ఆవులకు వుండదు. కోడిపుంజుకు వున్నంత దేహబలం కోడిపెట్టకు వుండదు. పొట్టేలుకి వున్నంత దేహపటిమ గొర్రెలకు వుండదు. దున్నలకు వున్న శరీరశక్తి గేదెలకు వుండదు. ఇది సృష్టి సహజం. స్త్రీ పురుషుల్లో సంభోగానికి ముందు అహ్వానించవల్సింది మగవాడే! అన్ని ప్రాణులలోనూ ఇదే పద్ధతి వుంటుంది. గమనించండి. శృంగార కార్యకలాపాలను, రతి శాస్త్ర మెళకువలను పురుషుడు గమనించినంతగా స్త్రీలు గమనించలేరు. శృంగార కేళిలో కూడా పురుషునిదే ప్రధాన పాత్ర వుంటుంది. స్త్రీ నిమిత్తమాత్రంగా వుంటుంది. ఉరుములు మెరుపులు, వర్షించే ప్రకృతికే

గాని భూమికి కాదుగదా! ఈ కారణంగా పురుషునికి పెద్ద వయస్సు వుండాలి.

సంసారిక బాధ్యతల్లో కష్టించి పోషించాల్సిన బాధ్యత మగవానిదే. ఆర్థిక స్థితి గతులన్నీ పురుషుడే చూచుకోవాలి. గృహ



బాధ్యతలు, సంతానాన్ని సక్రమంగా పెంచటం, పురుషుడు కష్టించి తెచ్చిన ధనధాన్యాదులను సక్రమంగా వినియోగించటం, పొదుపుగా గుప్తంగా కాపురం కొనసాగించటం మాత్రమే స్త్రీ కర్తవ్యం.

స్త్రీ శరీర నిర్మాణం పురుషుని శరీర నిర్మాణానికంటే భిన్నంగా వుంటుంది. స్తనాల బరువు కూడా వారికి ఆటంకమే కలిగిస్తుంది. ప్రతినెలకూ ఋతుక్రమం రావటం, గర్భం ధరించటం, పసిబిడ్డలకు ఆహార సదుపాయాలు చూడటం, స్త్రీలదే కదా ముఖ్యపాత్ర. అయితే ఆడదంటే పిల్లల్ని కనే యంత్రమా? అని ప్రశ్నిస్తున్నారు యువతరపు స్త్రీలందరూ! ఇది తప్పు ఆలోచన. స్త్రీ అంటే పిల్లల్ని కనే యంత్రమూ కాదు. పురుషుడంటే కుటుంబాన్ని పోషించి పెంచే బానిసకాదు!


ఈనాటి యువతరం ఎందుకిలా ఆలోచిస్తున్నది???? ఈ ప్రశ్నకు దొరికే సమాధానం ఒక్కటే. బంధాన్ని భూతద్దంలో నుండి చూస్తున్నారు. పాశ్చాత్య నాగరికతనూ, సంప్రదాయాన్నీ తమకు తాము వర్తిపం జేసుకొంటున్నారు. తినే ఆహారానికి పదిరూపాయలు కావల్సి వుంటే డాబుదర్పాలకోసం తొంభై రూపాయలు ఖర్చు చేసే స్థితికి వచ్చాం. ధన సంపాదనే అందరికి ముఖ్యధ్యేయంగా అయింది. అవసరాలకు మించిన ఖర్చుకి అలవాటు పడిపోతున్నాం. మితిమీరిన స్వేచ్ఛను కోరుతున్నాం. జీవితం చలన చిత్ర మాధ్యమం అయిపోతోంది. మన ఆలోచనలన్నీ టి.వి.కే అంకితం చేస్తున్నాం. అశ్లీలానికి అందరమూ ఎగబడుతున్నాం. మనల్ని పాలించే శాసించే పాలకులకు ప్రజాజీవితాలమీద, సంస్కృతి మీదా, ప్రజల భవిష్యత్తుమీదా అభిమానం లేదు. ప్రజలను విభజించి పాలిస్తున్నారు. కులాల మతాల ముద్రతో ఓట్ల పంట పండిస్తున్నారు. భార్యాభర్తల్లో పురుషుడే పెద్దగా వుండాలని చెప్పటంలో మరొక రహస్యం కూడా దాగి వుంది. సంసారాభివృద్ధికోసం అహరహం శ్రమించిన పురుషుడు త్వరగా శక్తిహీనుడై అనేక దేహ సమస్యలకు రోగాలకు దారితీస్తాడు. కాబట్టి త్వరగా శక్తిహీనుడై అనేక దేహ సమస్యలకు రోగాలకు దారితీస్తాడు. కాబట్టి అపుడు పురుషునికి సేదదీర్చి ఆదరించి అక్కున జేర్చుకొనే భార్య అవసరం

ఎంతైనా వుంది. ఇద్దరూ సమాన వయస్సువారైతే ఒక్కసారే ఇద్దరూ వార్ధక్యాన్ని అనుభవించాల్సి వుంటుంది గదా అని పూర్వీకులు ఆలోచించారేమో! అంటే పురుష స్వార్థంకోసమే వయోబేధం కల్పించారంటారా? లోకంలో అతి తేలికైన పని విమర్శించటమే!

విమర్శ మనందరి జన్మహక్కు. పురుషుడు భార్య లేకుండా బ్రతకలేడు. భార్యను పోగొట్టుకొన్న పురుషుడు తన యింటిలో వున్నా పరాయి కొంపలో బ్రతుకుతున్నట్లే. భర్త మరణించినా ఆడది జీవించగలదు. ఆమె అవసరం పిల్లలకు వుంది. వుంటుంది. కావాలంటే మీరు మన సమాజంలో పరికించి చూడండి. భార్యను పోగొట్టుకొన్న మగవానికీ, భర్తను పోగొట్టుకొన్న ఆడదానికీ ఎంత వ్యత్యాసం వుందో, ఎంత నరకంగా వుంటుందో మీకే తెలుస్తుంది. సమస్యల గురించి ఉపన్యాసాలు దంచటం, రచనలు చేయటం వేరు. సమస్యను అనుభవించటం వేరు. అందుకే వివాహ బంధానికి స్త్రీ కంటే పురుషుడే పెద్దవాడుగా వుండాలని నిర్ణయించిన పూర్వీకుల దూరదృష్టిని వేనోళ్ళ పొగడటంలో తప్పులేదు. అవునుగదూ! విమర్శించటం తప్పుగాదు. ఆలోచించలేక పోవటమే తప్పు. విమర్శనే అలవాటుగా వుంచుకోవటం మహా తప్పు. తల్లి పాలలోని తీపిదనాన్ని గురించి, చిక్కదనాన్ని గురించి, క్వాలిటీ గురించి విమర్శించి చెప్పేవాడిని ఏమనాలి! ఏమని పిలవాలి? అది మీ ఇష్టానికే వదలి వేస్తున్నాను. మీరు కూడా ఆలోచించండి. అతి విమర్శలు మంచిది కాదు. పడక గదిలోని సుఖాన్నీ, కన్నబిడ్డల యవ్వనాన్నీ, కన్నతల్లి అందాన్నీ కూడా విమర్శించవచ్చు. కాని..... విమర్శించగలమా! విమర్శించటం న్యాయమా!!

## 783. దైవ ప్రార్థనలో శృంగారం సమంజసమా?

శ్లో॥"కమలాకుచ చూచుక కుంకుమతో
నియతారుణి తాతుల నీలతనో
కమలాయత లోచన లోకపతే
విజయీభవ వేంకట శైలపతే"



అంటూ శనివారం ఉదయమే రేడియోలో సుప్రభాతం వింటుంటాం. ఇటువంటి శృంగార రసపూరితమైన సుప్రభాతానికి అర్థం అందరికీ తెలియక పోవచ్చు. కానీ హేతువాదులందరూ ఈ శ్లోకాన్ని విమర్శించటం చాలాసార్లు వింటున్నాం "ఓ వేంకటేశ్వర ప్రభో! రాత్రి శృంగార సమయంలో లక్ష్మీదేవిని కౌగిలించుకొని పరున్నావు కాబోలు! కమలములవంటి ఆమె స్తనములు నీలపు రంగు

గల నీ గుండెలకు గ్రుచ్చుకొని నీ వక్షస్థలం కందిపోయి ఎర్రగా అయింది. కమల లోచనా! నీకు విజయమగుగాక!" అని పై శ్లోకానికి అర్థం.

గోపీపీనమపయోధర మర్ధన చంచల యుగకరశాలీ

"ధీరసమీరే యమునాతీరే వసతివనే వనమాలీ....॥

జయదేవ గీతగోవిందం

సంస్కృత కవులందరూ భక్తి రసంలో కూడా శృంగార రసాన్ని మేళవింపు జేశారు. అదే దారిని అనుసరించారు తెలుగు కవులు. "కాటుక కంటి నీరు చను కట్టు పయింబడ నేల యేడ్చెదవో కైటభ దైత్యమర్దనుని గాదిలి కోడల! యోమ దంబ! యోహాటక గర్భురాణి!" అని సర స్వతీదేవితో అంటాడు మహాకవి బమ్మెర పోతనామాత్యుడు.

సంస్కృత శ్లోక సాహిత్యంగాని, పద్య సాహిత్యంగాని తెలుగువారి కున్నంతగా దాక్షిణాత్యులకు లేదని చెప్పవచ్చు. అంతే కాక హిందూమతానికున్నంత పురాణ సాహిత్యం వేరొక మతంవారికి లేదు. "అహం బ్రహ్మోస్మి" అని వైష్ణవులు, నేనే విష్ణుస్వరూపాన్ని, నేనే శివస్వరూపాన్ని అని చిద్విలాసంగా చెప్పుకొనే ధైర్యం హిందూమతంలో మాత్రమే వుంది. కాషాయ బట్టలుకట్టి, కుంకుమ బొట్టు పెట్టుకొని, మైకుముందు కూర్చుని ఎవడు ఏం చెప్పినా జయజయ ధ్వానాలు పలికే సంప్రదాయం మనది. అందువల్లనే దశా బ్దానికొక బాబాగారు, శతాబ్దానికొక స్వామి గారు పుట్టుకొస్తున్నారు. ఇది మన ప్రారబ్ధం.

మనం "పంట" వదలివేసి "పరిగె"ను ఏరుకొంటున్నాం! అతి పురాతన హిందు సంస్కృతి నానాటికీ నశించి పోతోంది. హిందూమతం ఇపుడు దిక్కులేనిది అవుతోంది. హిందువులకు హిందూమతం మీద ప్రేమ సన్నగిల్లుతోంది. కొంత కాలా నికి హిందూ మతం అనేది వుండదే మోనని అనిపిస్తోంది. ఎందుకిలా జరుగు తోంది? మనమెందుకిలా అవుతున్నాం???

ఒక ముస్లిం ఏనాటికీ హిందు మతంలో చేరడు. ఒక క్రైస్తవుడు ఎప్పటికి హిందూ మత స్వీకారం చేయడు. హిందువులు మాత్రం ఏ మతంలో చేరటానికైనా సిద్ధంగా వుంటారు. సాటి హిందువులం దరూ సమ్మతిస్తారు. ఇది ఈనాటి హిందు మతం దుర్గతి! దుస్థితి!! దుర్వ్రతి!!!

హిందువుల ప్రార్థనగీతాలలో శృంగారం ఎందుకు చేరింది? వాఙ్మయ పండితులు, యుక్తాయుక్త విచారపరాయణులైన పండి తులందరూ భక్తిరసానికి శృంగారాన్ని ఎందుకు జోడించారు అన్నదే మన ముందున్న ప్రశ్న. ముందుగా మీకొక వివరణ ఇవ్వాలి.

మన తల్లిని మన స్నేహితుని తల్లి తోనూ, మన యింటిని మరొక యింటి తోనూ, మన భార్యను ప్రక్కింటివాని భార్య తోనూ, మన బిడ్డను ఎదురింటివారి బిడ్డ తోనూ, నీ ఆర్థికస్థితిని మరొకరి ఆర్థికస్థితి తోనూ,నీఇంటి వంటను హోటల్ వంటల

తోనూ పోల్చి చూడకూడదు. ఇది మాన సిక నేరం. మనో దౌర్బల్యం. మన మతాన్ని కూడా మరొక మతంతో పోల్చి చూడకూడదు. ఎందుకంటే,



ఏ మతంలోని ఏ దేవునికీ భార్య, బిడ్డలు వుండరు. ఒక్క హిందూమత దేవ తలకు మాత్రమే భార్య సంసారాలు వున్నాయి. నిర్గుణుడు - నిరాకారుడు - నిరామ యుడు- సర్వవ్యాపకుడు- ఆది మధ్యాం తరహితుడు -సర్వాంతర్యామి అని చెబు తూనే మన దేవుళ్ళకు ఇద్దరేసి భార్యల్ని అంటగట్టి ఆనందిస్తున్నాం! నిరాకారుడు (ఆకారమే లేనివాడు) అని చెబుతూనే విగ్ర హాలు చెక్కించి గుడులు కట్టి కళ్యాణాలు జరిపించి బంగారు ఆభరణాలు తొడిగి సంతోష పడుతున్నాం! అంటే పరోక్షంగా దేవునికి శృంగార తత్వాన్ని అంటగడు తున్నట్లే గదా! శివలింగ స్వరూపమే శృంగార తత్వానికి అంటుకొని వుంది.

లింగాన్ని పురుషునిగానూ, లింగం క్రిందవున్న పానువట్టాన్ని స్త్రీగానూ, ప్రకృతీ పురుషుల ఏకత్వమే శివలింగ స్వరూపంగానూ భావించి ఆరాధిస్తున్నాం. అంటే 'హరప్పా మొహంజొదారో' కాలం నుండే (క్రీ.పూ. 3000) మనం దైవ త్వాన్నీ శృంగారాన్నీ సమ్మిళితం చేసి సృష్టి తత్వాన్ని ఆరాధించామన్నమాట!

చతుర్విధ పురుషార్థాలలో (ధర్మం-అర్థం-కామం-మోక్షం) కామం తరు వాతనే మోక్షానికి స్థానం కల్పించబడింది. యోగివేమన కూడా 'కామి కానివాడు మోక్షగామి కాదు' అని కుండ పగిలినట్లు చెప్పాడు.

శృంగార జీవితాన్ని పరిత్యజించి జీవించే సన్యాసధర్మం మన మానవులం దరికీ ఆమోదయోగ్యం కాదు. సనాతన ధర్మం యిందుకు అంగీకరించదు. సృష్టి ధర్మం శూన్యమవుతుంది. మనుషులం దరూ సన్యాసధర్మ స్వీకారం చేసినట్లయితే సృష్టిక్రమం నిలచిపోతుంది. అందువల్లనే పరివ్రాజక ధర్మాన్ని బ్రాహ్మణులకు మాత్రమే అప్పగించారు. అందరికీ జీవన ధర్మం బోధించాల్సిన బాధ్యత వీరిదే!

మానవులకు దైవనమ్మకం, దైవపూజ, దైవప్రియత్వం, దైవస్నేహం, విధిగా వుండాలి. కాని దైవమే సర్వస్వమూ కాగూడదు. సదా దైవధ్యానంలోనే కాలం గడుపుతూ వుంటే గృహకృత్యాలు ఎవరు నిర్వర్తించాలి? ఆహారం ఏ విధంగా లభి స్తుంది! ఈ లోకంనుండి పరలోకానికి మనం వెళ్ళేముందు మన రక్త, గోత్ర వార సులను సృష్టించి చక్కబరచి వెళ్ళటం మానవధర్మం. ఏ ధర్మం తప్పినా ఈ

ధర్మం ఎవరూ తప్పటానికి వీలులేదు. గృహస్థ బంధనానికి కారణం కామమే గదా! మనిషి భగవత్ చింతనలోపడి భార్యాబిడ్డలను, బాధ్యతలను గృహసేవను విస్మరిస్తాడేమోనన్న బలమైన ఆలోచన వల్లనే దైవప్రార్థనలో శృంగార తత్వాన్ని పూర్వకవులు ప్రవేశపెట్టారని చెప్పవచ్చు! శృంగారం అనగానే అదేదో అంటరానిదిగా, మాట్లాడరానిదిగా, తలచుకొనరానిదిగా, అతి అభినయం చేస్తుంటారు చాలామంది! కామమే మనిషికి లేకుంటే యింతటి అభివృద్ధి వుండదు.

కామం తప్పుగాదు, వ్యభిచారం క్షంతవ్యమూ కాదు. అందుకే ఒకప్పుడు బహుభార్యాత్వ సమాజాన్ని అంగీకరించారు. సంతృప్త శృంగార జీవనం మనిషిని చైతన్యవంతునిగా చేస్తుంది. మానవుడు యింతగా శ్రమ పడటానికి కారణం కోరికలే! కోరికల పరమావధి సుఖమే! కామపు పరమావధి కూడ సుఖమే! అమలిన శృంగారం ఆమోద యోగ్యమే! సూర్యోదయ కాలంనుండి సూర్యాస్తమయ కాలం వరకూ వేదాంత చర్చలతోనూ, వైరాగ్య ప్రవచనాలతోనూ, భక్తి కార్యక్రమాలతోనూ జీవిత విలువలను విధ్వంసం చేసుకోకుండా, భక్తి మార్గం నుండి మనిషిని గృహస్థ జీవితం వైపుకి మరల్చటానికే దైవపరసంలో కూడా శృంగారతత్వాన్ని పైపూతగా పూశారు. అన్నమాచార్యుని గీతాలలో కూడా ఇది చక్కగా వినిపిస్తుంది. జయదేవుని సంస్కృత గీతాలలో కూడా శృంగారం పిల్ల కాలువలా పారుతూనే వుంటుంది. దేవుళ్ళకు భార్యలున్నపుడు శృంగార వర్ణనలు తప్పుగాదు. అందుకే మన మతానికి పరాయి మతాలకు పొంతన కుదురదు. ఇది దృష్టి దోషమేగాని సృష్టిదోషం కాదు.



మన భక్తి గీతాలలో శృంగారం వుందని సిగ్గుపడనవసరం లేదు. శృంగారమెంత వుందో అంతకు మించి తొంబదిరెట్లు వైరాగ్యం కూడా వుందన్నది మరచిపోవద్దు. వంకాయకూరలో కరివేపాకు వున్నంతమాత్రన వంకాయ కూరను కరివేపాకు కూడ అనటానికి వీలులేదు గదా!

శృంగారంలేని జీవితం సంపూర్ణ జీవితం అవుతుందా! శృంగారం ప్రతి ప్రాణికీ జన్మసిద్ధ హక్కు. భూమి నిర్మానుషం కాకుండా వుండాలన్నా, ప్రాణి ప్రపంచం సదాకాలం వుండాలన్నా, చివరకు చెట్టు చేమ వుండాలన్నా, శృంగారం అత్యావశ్యకం. శృంగారం కూడా దైవకార్యమే. పరమ పవిత్రమైనదే.

## 794. కులాంతర - మతాంతర వివాహాల్లో ఏది మంచిది? ఏడడుగుల సంబంధమంటే ఏమిటి?

**జ.** బ్రాహ్మ్మ, దైవ (ఆర్షం) ప్రజాపత్య, రాక్షస, అసుర, కన్యాశుల్క, గాంధర్వ, పైశాచిక మని వివాహాలు ఎనిమిదైనా, ఆర్యధర్మ ప్రకారం వివాహాల్లో నాలుగు రకాలు ప్రఖ్యాతం. 1. బ్రాహ్మ్మ వివాహం. 2. గాంధర్వ వివాహం. 3. క్షాత్ర వివాహం. 4. రాక్షస వివాహం

ఈ నాలుగు వివాహాల్లో 'బ్రాహ్మ్మ వివాహం' విశిష్టమైనది.

**బ్రాహ్మ్మ వివాహం :** ఋషి సంప్రదాయ బద్ధమైన బ్రాహ్మ్మ వివాహం ఆర్య సమ్మత మైన వివాహం. వధూవరుల కుల పెద్దలు తల్లిదండ్రులు అనుమతించి అంగీకరించి, ఆశీర్వదించి వైదిక విధితో ఆచార యుక్తంగా జరిపించేది బ్రాహ్మ్మ వివాహం. ఇది సనా తన జన సమ్మతం! సత్సంప్రదాయం.



**గాంధర్వ వివాహం :** యువతి యువకు లిద్దరూ యుక్తవయస్సు గలవారైయుండి, ఒకరినొకరు ఇష్టపడి, పెద్దలెవరి అంగీ కారమూ లేకుండా, తమంతట తాముగా రహస్యంగాకానీ, వేరొకచోటకి పారిపోయి గానీ చేసుకొనే వివాహం గాంధర్వ వివాహం. ఈ వివాహం బ్రాహ్మ్మ వివాహ మంత గొప్పదిగాదు పవిత్రమైనదీ కాదు. శకుంతల దుష్యంతుని ఈ విధంగానే పెండ్లాడి కష్టాలు పాలైంది.

**క్షాత్ర వివాహం:** కన్యామణి అంగీకారం లేకుండా కన్య తరుపువారి పెద్దల అను మతి లేకుండా వరుడు తన శౌర్య సాహ సాలను ప్రదర్శించి కన్యను బలప్రదర్శ నతో ఎత్తుకెళ్ళి తన స్వజనుల సమక్షంలో చేసుకునే వివాహం క్షాత్రవివాహం. ఇది కేవలం క్షత్రియ కులంవారికి మాత్రమే! అందునా క్షత్రియ కన్యను మాత్రమే ఈ విధంగా పెండ్లాడే అవకాశముంది. ఇతర వర్ణాల వారికి ఈ అవకాశం లేదు.

**రాక్షస వివాహం :** చతుర్విధ వివాహాల్లో ఇది నీచమైన వివాహం. ఈ వివాహానికి బ్రాహ్మణ వైశ్య కులాలవారికి అనుమతి లేదు. ఎవరికీ తెలియకుండా, దొంగ తనంగా, మోసంతో, ఇష్టంలేని కన్యను అపహరించుకొనిపోయి బలవంతంగా వివాహం చేసుకోవటం రాక్షస వివాహం. శూద్ర క్షత్రియ వర్ణాలవారికి మాత్రమే ఈ వివాహం చెల్లుబాటు!

ఈ నాలుగు రకాల వివాహాలు ధర్మ సమ్మతమే అయినా పెద్దల అనుమతితో

జరిగే బ్రాహ్మీవివాహం మాత్రమే పవిత్రమైనది.

ఇక కులాంతర, మతాంతర వివాహాల విషయం. మతాంతర వివాహంకంటే కులాంతరమే మంచిది. "స్వధర్మే నిధనం శ్రేయంః పర ధర్మోభయావహః" అన్నాడు గీతాచార్యుడు. ధర్మభ్రష్టత కన్నా కుల భ్రష్టతే మంచిది. అంటే హిందువుగా పుట్టి హిందూధర్మం వారిని పెండ్లియాడటం ఒకరకంగా క్షమార్హమేగాని, హిందువు క్రైస్తవులనుగాని, ముస్లిం మతంవారిని గాని, వివాహం చేసికోవటంవల్ల ఆ వివాహానికి శాశ్వతత్వం వుండదు. ఏదో కారణంగా, ఏదో విషయానికి పేచీలు రావటం విడిపోవటం జరిగి తీరుతుంది. ఖచ్చితంగా జరిగే తీరుతుందని గాదు. జరిగే అవకాశాలెక్కువ. హిందూ మతంలోని శూద్రవర్ణంలో మూడువేల పైచిలుకు కులాలు వున్నాయి. అంటే శూద్రవర్ణం వేలాది కులాలుగా విడిపోయిందన్నమాట. ఈ రకంగా చూస్తే కులాంతర వివాహం తప్పు గాదు. నిష్ఠూరంగా చెప్పే ఒక విషయం ఏమిటంటే, నూటికి తొంభై ప్రేమ వివాహాలు మంచి ఫలితాన్ని ఇవ్వటం లేదు. యవ్వన ఉద్రేకాన్నీ, సహజంగా యవ్వనంలో వుండే ఆకర్షణను ప్రేమ అనుకొని పొరబడిపోయి ఎందరో తమ జీవితాలను పాడుచేసుకోవటం చూస్తున్నాం. ఆత్మహత్యలు చేసుకోవటం దినపత్రికల్లో చదువుతున్నాం. ఆర్థిక ఇబ్బందులు రానంతవరకు కల్సివుంటారు. ఒకరి కోసం ఒకరం పుట్టాం అనుకొంటారు. ఆర్థిక సమస్యలు మొదలు కాగనే ఇద్దరి మధ్యా గొడవలు ప్రారంభమవుతాయి. నీ వల్ల నా జీవితం పాడైపోయిందంటే నీ వల్ల బ్రతుకు పాడుచేసుకొన్నానని పరస్పర నిందారోపణలు చేసుకోవటం మొదలవుతుంది. మాట పట్టింపులు వస్తాయి. కన్నీరు త్రాగుతూ సమస్యలనే ఆహారంగా తినాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో ఎక్కువగా నష్టపోయేది ఆడదే! కారణమేమంటే పురుషునికన్న స్వేచ్ఛా స్వతంత్రాలు ఎన్నటికెన్నటికీ స్త్రీకి లభించవు. దీనికి కారణాలు చాలా వున్నాయి. ప్రేమ పాఠాలు వల్లించినంత తీయగా జీవన పాఠాలు ఎవరూ వల్లించలేరు. ప్రేమించే రోజుల్లో మగవాడు త్యాగమూర్తిగా సినిమాహీరోగా ఆడపిల్లకు అనిపిస్తాడు. ఆకర్షణా ప్రభావం అది! ఎన్ని చట్టాలు వున్నా, ఎన్ని కోర్టులు వున్నా, ఎందరు న్యాయవాదులున్నా శిక్ష విధించేటందుకు పనికి వస్తారేగాని జీవితం చక్కదిద్దలేరుగదా! కనిపెంచిన వారిని కాలదన్ని, తోడబుట్టినవారిని త్రోసివేసి ప్రేమ పేరుతో పిచ్చి వ్యామోహంలో పడి జీవితాలు నరకం చేసుకోవటం ఏ కులం వారికీ, ఏమతం వారికీ మంచిది కాదు.

ఎంతటి మేధావులైనా ప్రేమ విషయంలో బుద్ధిహీనులౌతారు. ఇది చరిత్ర చెబుతున్న నిత్య సత్యం. ప్రేమించి పెళ్ళి చేసుకోవటమంటే మనం చూస్తున్న సినిమా కథలాగ వుండదు. జీవితంలో ఏది జరుగదో దాన్ని సినిమాకథలో, జరిగి

నట్లుగా చూపిస్తారు అసాధ్యాలను సుసాధ్యాలుగా చూపిస్తేనే, చూచే ప్రేక్షకుడికి థ్రిల్‌గా వుంటుంది. అపుడే ఈలవేసి చప్పట్లు కొడతారు. కలల లోకంలో బ్రతికే యువతీ యువకులకు సినిమా కథలన్నీ నిజంగానే అనిపిస్తుంటాయి. యవ్వన దశను ఎవరు సక్రమంగా ఉపయోగించుకొంటారో, వారు అభివృద్ధి చెందుతారు. ఆశలు తీర్చుకొంటారు. ఉన్నతిని సాధిస్తారు. ఈ సమాజానికి ఎంతో సేవ చేయకల్గుతారు.



ఇక ఏడడుగుల బంధం గురించి తెలుసుకొందాం. వివాహ సమయంలో వధూవరులచేత "సప్తపది" జరిపిస్తారు. కొందరు పురోహితులు సప్తపదిని తప్పించివేస్తుంటారు. గబగబా వివాహం అయిపోయిందనిపించుకొని మరొక ముహూర్తానికి పరుగులు తీయటం మనం అన్నిచోట్లా చూస్తున్నాం. ఆర్య వివాహం జరిగినంత శాస్త్రబద్ధంగా ద్రావిడ వివాహం జరగదు. తాళికట్టటం ఒక్కటే వివాహ ముఖ్య కర్తవ్యం అనుకొంటారేమో! మనం మన బంధువుల వివాహానికి వెళ్ళినపుడు మీరు గమనించే వుంటారు. "పంతులుగారూ! త్వరగా కానివ్వండి. అవతల టయం అవుతోంది" అంటూ తొందర చేస్తుంటారు. ఇది మంచి పద్ధతి కాదని అందరూ గుర్తించాలి. పెళ్లిని నూరేళ్ళ పంటగా అందరూ చెబుతూవుంటారు. అటువంటి జీవిత శుభకార్యాన్ని పరుగులు తీస్తూ చేయించటం వివేకం కాదు. వివాహాన్ని ఎప్పుడూ ఆదరా బాదరాగా జరిపించకూడదు. కట్నంకోసం వరుడి తల్లిదండ్రులు- బాధ్యత దింపుకోవటంకోసం వధువు తల్లి దండ్రులు-వరుడి తల్లిదండ్రులు - బాధ్యత దింపుకోవటంకోసం వధువు తల్లిదండ్రులు - పెండ్లి త్వరగా ముగిస్తే త్వరగా ఇంటికి చేరుకొందామని అర గంటకొకసారి వాచీలు చూచుకొనే బంధువులు-పెండ్లి పీటల మీద కూర్చొని యాంత్రికంగా పురోహితుడు చెప్పింది చేస్తూ మొదటి రాత్రిగురించి ఆలోచిస్తూ, ఫ్రెండ్స్ కోసం అటు ఇటు చూచే పెండ్లి కుమారుడు-పెండ్లికి కట్టుకొన్న పదివేల రూపాయలు చీర అందరికీ నచ్చిందో లేదోనని, పెండ్లికి చేయించుకొన్న బంగారుహారం సరిగా లేదనీ ఆలోచించే పెండ్లికూతురు- ఇలా జరిగేదాన్ని పవిత్ర వివాహ మంటారా? పట్టుచీరల గరగరలు,

బంధువుల పలకరింపులు, కుర్రకారు చూపుల వేటలు, పెళ్ళింటివారి ఉరుకు పరుగులు – వరసైనవారి నవ్వులాటలు, పెళ్ళికొడుకు తరుపువారి మూతి బిగింపులు, ఇవి కాదు వివాహమంటే! అసలు పెళ్ళికి వచ్చినవారు 'వివాహ కార్యక్రమం' చూడటమే లేదు. ఉద్యోగవిషయాలు, రాజకీయాలు, పిల్లల విషయాలు ముచ్చటించుకోవటంతోనే సరిపోతూ వుంది – ఇది వివాహ పవిత్రతను, ఆర్షసంప్రదాయ విశిష్టతను చిన్నబుచ్చుటమే కదా! ఇతర మతస్థుల వివాహాలకెపుడైనా మీరు వెళ్ళారా!



ముస్లిం, క్రైస్తవ వివాహాలు ఈ విధంగా జరుగనే జరుగవు. వివాహ సమయంలో నిశ్శబ్దంగా వుంటారు. దేవుని ప్రార్ధనలో అందరూ పాల్గొంటారు. మరి మన ఖర్మ ఎందుకిలా అవుతున్నది? మన ఆచార సంప్రదాయాలను మన చేతులారా మనమే ఎందుకు కించపరచు కొంటున్నాం! వీరినందరినీ ఎవరు మార్చాలి? మార్చగలిగిన మనసుంటే ఈ బాబాలు, గురూజీలు, స్వాములు మార్చగలరు. కాని వారికంత సమయమేది! సత్కారాలకూ, సంభావనలకే వారికి సమయం చాలటం లేదు. పెండ్లి కుమారుడు కల్యాణ మండపానికి వచ్చిన తరువాత మొదటగా విఘ్నేశ్వరపూజ జరుగుతుంది. కల్యాణ దీక్షా కంకణం కడతారు. పురోహితుడు మహాసంకల్పం చెబుతాడు. తరువాత కన్యాదాతలు వరపూజచేసి, కాళ్ళు కడిగి, తీపి తినిపించి తియ్యని నీరు త్రాగిస్తారు. కన్నబిడ్డను అలంకరించి మండపానికి తీసికొస్తారు. ధర్మార్థకామ మోక్షాలలో ఈ కన్యా మణిని ఎన్నటికీ వదలిపెట్టనని ప్రమాణం చేయించి కన్యాదానం చేయిస్తారు. మధుపర్కం సమర్పించి వరునికి కానుకలు మామగారిచేత ఇప్పిస్తారు. వివాహ ముహూర్తానికి జీలకర్ర బెల్లం కలిపి శిరస్సునవుంచి పెండ్లి ప్రమాణాలు చేయిస్తారు. తరువాత మాంగల్య ధారణ జరుగుతుంది. పురోహితుడు వధూవరులిద్దరికీ రక్ష కడతాడు. తలంబ్రాలు పోయిస్తాడు. వధూవరులిద్దరి కొంగులు కలిపి బ్రహ్మముడి వేస్తాడు. అగ్ని వెలిగించి అగ్ని సాక్షిగా ఈనాటి నుండి మీరిద్దరూ ఒక్కటిగా వుండాలని మంత్రపూర్వకంగా ఇద్దరిచేత ప్రమాణాలు చేయిస్తాడు. తరువాత వధూవరులిద్దరూ ఒకరిచేయిని మరొకరు పట్టుకొంటారు. ఇక ఇపుడు జరిగేది సప్తపది. "సప్తపది అంటే ఏడడుగులు కల్సి నడవటం" "సఖాసప్తపదాభవ"



ఇద్దరు ఏడడుగులు కలిసివేస్తే మిత్రత్వం కల్గుతుందని శాస్త్రం! పెద్దలు దీన్నే ఏడ డుగుల సంబంధం అంటారు. వధూ వరులు ఏడడుగులు ఎందుకు నడుస్తారో చుద్దాం! వరుడు వధువు నడుముపై చేయి వేసి దగ్గరగా తీసికొని అగ్ని హోత్రము నకు దక్షిణవైపున నిలబడి తూర్పు దిక్కు వైపుగా ఇద్దరూ ముందుగా కుడి అడుగు పెట్టి ఏడడుగులు నడవాలి. ఒక్కొక్క అడు గుకి ఒక్కొక్క అర్ధం వచ్చే మంత్రం చెబు తాడు పురోహితుడు.

**మొదటి అడుగు :** "ఏకం ఇషే విష్ణుః త్వా అన్వేతు" ఈ మొదటి అడుగుతో విష్ణువు మనిద్దరినీ ఒక్కటి చేయుగాక!

**రెండవ అడుగు :** "ద్వే ఊర్జే విష్ణుః త్వా అన్వేతు"ఈ రెండవ అడుగుతో మనిద్దరకు శక్తి లభించునట్లు చేయుగాక!

**మూడవ అడుగు :** "త్రీణి వ్రతాయ విష్ణుః త్వా అన్వేతు" ఈ మూడవ అడుగు వివాహ వ్రత సిద్ధికోసం విష్ణువు అనుగ్రహించు గాక!

**నాలుగవ అడుగు :** "చత్వారి మయోభ వాయ విష్ణుః త్వా అన్వేతు" ఈ నాలుగవ అడుగు మనకు ఆనందమును విష్ణువు కల్గించుగాక!

**ఐదవ అడుగు :** "పంచ పశుభ్యో విష్ణుః త్వా అన్వేతు" ఈ ఐదవ అడుగు మనకు పశుసంపదను విష్ణువు కల్గించుగాక!

**ఆరవ అడుగు :** "షదృతుభ్యో విష్ణుః త్వా అన్వేతు" ఈ ఆరవ అడుగు ఆరు ఋతు వులు మనకు సుఖమిచ్చుగాక!

**ఏడవ అడుగు:** "సప్తభ్యో హోతాభ్యో విష్ణుః త్వా అన్వేతు" ఈ ఏడవ అడుగు గృహస్థా శ్రమ ధర్మనిర్వహణకు విష్ణువు అను గ్రహించుగాక!

ఇక సప్తపది మంత్రార్థం చూద్దాం!

"సఖాసప్తపదాభవ! సఖాయౌ సప్తపదా బభూవ। సఖ్యంతే గమేయం సత్యాత్। తేమాయోషం సఖ్యాన్మే మాయేష్మాఔ సమయావః సంప్రియౌ రోచిష్ణూ సుమన సుమానౌ। ఇష మూర్జం అభిసంపసానౌ సం నౌమనాంసి సంవ్రతా సమచిత్తాన్యాకరం"

"ఓ నా అర్ధాంగీ! ఏడగులతో నీవు నా మిత్రురాలి వయ్యావు! నీవు నా స్నేహ మును వీడకు. నాతో నాకు సహవాసిగా వుండిపో. మనం మంచి ప్రేమ గల వారంగా వుందాం. మంచి మనసుతో జీవించుదాం. మనం ఇద్దరమూ సము చిత్తంతో మెలుగుదాం. సమానమైన ఆలో

చనలు కలిగి వుందాం. నీవు నన్నెన్నటికీ విడువద్దు' అంటాడు పెళ్ళికొడుకు.

"సాత్వమసి అమూహం। అమూహ మస్మి। సాత్వం ద్యౌః। అహం పృధ్వీనీ। త్వంరేతో అహంరేతో భృత్। త్వమనో అహమస్మివాక్ । సామాహ మస్మి। ఋక్తం సామాం అనువ్రతాభవ।" అని వరునికి చెబుతుంది వధువు.

"ఓ ప్రాణమిత్రుడా! నీవు ఎప్పుడూ ఏ పొరపాటు లేకుండనట్లుగా వుండు. నేను కూడా ఏ పొరపాటు చేయక నీతో వుంటాను. నీవు ఆకాశమైతే నేను భూమిని! నీవు శుక్రమైతే నేను శోణితాన్ని! నీవు మనస్సైతే నేను మాటను! నేను సామ వేదమైతే నీవునన్ను అనుసరించే ఋక్కువు! మనిద్దరిలో వ్యత్యాసం లేదు. మనమిద్దరమూ ఒక్కటే. కష్టసుఖాలలో ఒకరికొకరం తోడు నీడుగా కల్సి వుందాం" అని పెండ్లికుమారునికి భరోసా ఇస్తుంది పెండ్లికుమార్తె! చివరగా ఇలా అంటాడు వరుడు

"పుంసే పుత్రాయ వేత్తవే(శ్రియై ఉత్తరయ వేత్తావయేహి సూనృతే" ఓ సద్గుణవతీ! మన వంశాభివృద్ధికోసం, మనకు ఉత్తమ స్థితి కలుగటంకోసం, మంచి బలముగల, ధైర్యముగల, ప్రజ్ఞావంతులైన వంశ హితాన్ని రక్షించగల, న్యాయమార్గం అను సరించే ఉత్తమ పుత్రులను నాకు ప్రసా దించు" అని సమాదరిస్తాడు వరుడు.

ఎంత చక్కని మనోహరమైన సన్నివేశ మిది! వివాహంలో ఇది సప్తపది మాత్రమే! వివాహకార్యక్రమంలో జరిపించే ఒక్కొక్క కార్యక్రమం ఎంతో మనోహరంగానూ హృదయంగమంగానూ వుంటుంది. పూర్వీకుల వంశంకోసం, వంశాభివృద్ధి కోసం, వంశకీర్తికోసం, ఎంతెంతగా పరితపించి పోయారో వివాహ మంత్రా లలో తెలుస్తుంది. భార్యను భర్త ఏ విధంగా ఆదరించాలో, భర్తను భార్య ఏ విధంగా గౌరవించాలో వివాహ మంత్రాల్లో చక్కగా వుంది. వివాహం పవిత్ర కార్యంగా చెప్పారు మన ఋషులు.

## 795. విడాకులు అనేవి హిందు సంస్కృతిలో లేవు.

**జ.** కష్టసుఖాలను కలబోసి అనుభవిస్తూ జీవించటమే వివాహధర్మం. కలసి వున్న పుడు కలతలు సహజం! సర్దుకుపోవటమే జీవితం. భార్యాభర్తల అనుబంధం మాటల్లో చెప్పలేనిది. వర్ణించి వ్రాయ లేనిది. వివరించి విడమర్చి చెప్పలేనిది.

## 796. స్త్రీ పురుషులకు వివాహం తప్పనిసరియా?


**జ.** మనిషికి వివాహం ఒక సాంఘిక సదాచారం. జీవనావశ్యకమైన కేశ ఖండ



నము, చౌలము ఉపనయనము, విద్యాభ్యాసము మొదలైన మానవ సంస్కారాలన్నిటిలో వివాహ సంస్కారం ప్రధానమైంది. సంస్కారం అంటే మనిషిలో వున్న ప్రజ్ఞనూ శక్తినీ హెచ్చరించి నిద్రలేపి సమాజాభివృద్ధికీ ప్రజాపురోగతికీ నడిపించటం అన్నమాట! వివాహం వల్ల దేవఋణం – పితౄఋణం –ఋషిఋణం. ఈ ఋణత్రయంనుండి పురుషునికి విముక్తి దొరకుతుందని ఆర్యోక్తి!

### ౭౨౭. దైవఋణం అంటే?

**జ.** గాలి–నీరు–ఆహారం–అగ్ని – పగలు – రాత్రి– సూర్యుడు– చంద్రుడు– భూమి





– ఓషధులు – వృక్షాలు మొదలైన ప్రకృతి ప్రసాదించిన సమస్త సౌలభ్యాలకు ప్రతిగా తన ఋణాన్ని తీర్చుకోవటం, కృతజ్ఞతా భావనతో ప్రకృతిసంపదను కాపాడటం 'దైవఋణం'.

### ౭౨౮. పితౄఋణం అంటే?

**జ.** తనకు జన్మనిచ్చి, తనలో రక్త మాంసాదుల నింపి, మల మూత్రాదులను కడిగి, వైద్యసేవలు చేసి, అన్నపానీయాదుల్ని సమకూర్చిపెట్టి, పెద్దజేసి మాటనేర్పి, విద్యాబుద్ధుల్ని నేర్పించి ప్రయోజకునిగా చేసి గృహక్షేత్ర ధనాదుల నిచ్చిన తల్లి దండ్రులను వార్ధక్య జీవితంలో సేవించి కాపాడటం "పితౄఋణం".

### ౭౨౯. ఋషిఋణం అంటే?

**జ.** ఈ సృష్టిని సకల సౌకర్యాలను మనం మాత్రమే కనిపెట్టలేదు. మనకంటె ముందుగా జన్మించిన పరోపకార బుద్ధులైన మహర్షులెందరో ఎంతోకాలం శ్రమించి, గణిత, ఖగోళ విజ్ఞానాన్ని మనకు



అందించారు. మనం తినే ఉప్పు, చింత పండు దగ్గరనుండి శరీరానికి శక్తిని అందించే కూరగాయల వరకూ వారి దయాభిక్షే! ఆయుర్వేద వైద్యం నుండి పసుపు, వెల్లుల్లి, ఆవాలు, జీలకర్ర వరకూ వాటి పోషక విలువల్ని తెలుసుకొని మనకు అందించింది ఋషులే! కాబట్టి సనాతనులైన వారందరి ఋణాన్నీ విద్యార్జన చేయటం ద్వారా వారు రచించిన గ్రంథాలను చదివి గ్రహించి సమస్త ప్రజలకు తెలుపటం ద్వారా ఋషిరుణాన్ని తీర్చుకోవాలి. ఇదే "ఋషిఋణం". ఈ ఋణత్రయం తీర్చుకోవటానికి వివాహం తప్పనిసరిగదా! ఎందుకంటే ఒంటరిగా ఒక్కడే అన్ని పనులను చేయలేడు. తోడు కావాలి. ఆ తోడు ఆత్మీయతతో కూడి వుండాలి. ఆ ఆత్మీయతకు శాశ్వతత్వం కావాలి. అందుకే పురుషునికి భార్య అవసరం ఎంతో,

ఎంతెంతో వుంది. వివాహానికి కూడా అంతే ప్రాధాన్యతవుంది. మనిషికి నాగరికత వివేకంలేని రోజుల్లో స్త్రీ పురుషుల మధ్య వివాహాలు లేవు. పశువుల్లా యధేచ్ఛగా వుండేవారు. పిల్లలను కనటం పోషించటం ఆడవారి వంతు అయ్యేది. అంతే కాక స్త్రీని అనుభవించటం కోసం పురుషులు తమలో తాము కొట్లాటలకు దిగేవారు. బలహీనులైనవారు ఈ పోట్లాటలో మరణిస్తుండేవారు. బలం కలవాడు బలహీనులతో యుద్ధం చేసి చాలామంది స్త్రీలను తానొక్కడే అనుభవిస్తుండేవాడు. స్త్రీల పోషణాభారం కానీ, పిల్లల పెంపకం గానీ పురుషునికి సంబంధం వుండేదికాదు. స్త్రీలకు రక్షణ అనేది ఏ మాత్రమూ వుండేది కాదు.

## ౭౦౦. ఇది త్రేతాయుగ విషయం

**జ.** సరిగ్గా ఈ సమయంలో జ్ఞానవంతులైన సనాతనులు. ఋషులు ఆరోగ్యవంతమైన సలక్షణమైన ప్రజోత్పత్తికి స్త్రీ రక్షణ ముఖ్యమని గుర్తించారు. విశృంఖల కాముకత్వాన్ని నిషేధించారు. ఒక పురుషునికి ఒక స్త్రీ మాత్రమే వుండాలని చెబుతూ స్త్రీల రక్షణ కోసమే పాతివ్రత్య ధర్మాన్ని ప్రవేశపెట్టారు. స్త్రీలను ఈ పాతివ్రత్య ధర్మంతో కట్టడి చేయ గలిగారే గాని పురుషులను మాత్రం నిర్బం ధించ లేకపోయారు. స్త్రీలు ఋతు సమయంలో వున్నపుడు, గర్భవతులుగా వున్నపుడు, పురుషులు పరస్త్రీ వ్యామోహానికి పాల్పడటం జరుగుతుండేది. స్త్రీలకు మాత్రం




ఒకే భర్త, పురుషులకు అనేక మంది భార్యలు వుండేవారు. సద్ధర్మ పరులైన ఆర్య ఋషులకు పురుషాధిక్యం మింగలేని మెతుకులా అయింది. పురుషు లందరినీ కట్టడి చేయాలని ఆలోచించి “వివాహం” అనే ధర్మకార్యాన్ని ప్రవేశ పెట్టారు. కాని క్షత్రియుల శక్తి శౌర్యాలకు భయపడ్డారేమో! బ్రాహ్మణ, వైశ్య, శూద్ర వర్ణాల వారికి ఏకపత్నీ వ్రతాన్ని సంధానించారు. క్షత్రియులకు ఈ ధర్మంలో స్వతంత్రత నిచ్చారు. ఈ సమయంలో ఏక పత్నీ వ్రతాన్ని పాలించినవాడు శ్రీరాముడు.

అవకాశంవున్నా, అవసరంవున్నా, ఆవశ్యకతవున్నా శ్రీరాముడు ఏకపత్నీ వ్రతాన్నిదాటి చరించలేదు. శ్రీరాముని తండ్రియైన దశరథునికి మూడువందల మంది భార్యలు, ముగ్గురు రాణులు వున్నారని తెలుస్తోంది. అయినా శ్రీరాముడు ఏకపత్నీ వ్రతాన్నే పాలించాడు. అందుకే

ఆయన ఆర్యులకు ఆరాధ్య దైవమయ్యాడు. (ఈనాటి ఆడవారికి శ్రీరాముడు సీతను పరిత్యజించాడన్న ఒక్క విషయం మాత్రమే తెలుసుగాని, అంతటి వియోగంలోనూ శ్రీరాముడు పరస్త్రీ పరిగ్రహణం చేయని సుగుణవంతుడని తెలియక పోవటం విచారకరం)

స్త్రీ పురుషులకు వివాహం అనేది ఒక అభయం! ఒక రక్షణ! ఒక మర్యాద! ఒక గౌరవం! ఒక సంప్రదాయం! నవీన నాగరికతలో వివాహం లేకుండానే కేవలం కామసుఖాలకోసం, ధనతాపత్రయం కోసం జీవిస్తున్నవారు పట్టణాల్లో కోకొల్లలున్నారు. ఇది తప్పు! అనాగరికం! అధర్మం! అసంస్కృతి! అమర్యాద! అరాచకం!

ఏ మతంవారైనా, ఏ కులం వారైనా, ఏ ధర్మంవారైనా ఎవరి ధర్మాన్ని వారు పాటించాలి. ఎవరి మతాన్ని వారు గౌరవించుకోవాలి. ఏ మతమైనా ఏ ధర్మమైనా చెడు మార్గాన్ని బోధించదు. పాశ్చాత్యులు విశృంఖల శృంగారం అనుభవిస్తారనుకోవటం అవివేకం. వారికి కూడా సమాజ నియమాలు కట్టుబాట్లు వున్నాయి. అయితే ఆర్యమతానికీ పాశ్చాత్య మతానికీ ఒక పెద్ద వ్యత్యాసం వుంది. భారతీయులుగా పుట్టినవారు ఏ కులంవారైనా సంఘ నియమాలకు భయపడతారు. పాశ్చాత్యులు “లా అండ్ ఆర్డర్” ని ఉపయోగించుకొని లాభపడతారు. ఆర్యులు ధర్మానికి భయపడతారు. మన ఆర్య స్త్రీలకు చట్టాలు తెలుసు. విడిపోయి వెళ్ళిపోవటం తెలుసు. వెళ్ళి బ్రతకగల దారులు తెలుసు. కాని భర్తలను విడచి వెళ్ళరు! ఎంతటి అసమర్థుడైనా, ఎంతటి నికృష్టుడైనా, ఎంతటి పాశవికుడైనా కట్టుకొన్న వాడితోనే జీవితం సాగిపోవాలని కోరుకొంటారు. ఆర్యవనితా! నీకు పాదాభివందనం! సహనమూర్తీ! నీకు సహస్రాభినందనం!! ప్రపంచంలో ఆర్య స్త్రీలవంటి స్త్రీలు వుండరు. ఆర్యమతం వంటి మతం వుండదు. ఆర్య సంప్రదాయంవంటి సంప్రదాయం వుండదు. ఆర్యులకు కన్న బిడ్డలు ప్రాణంతో సమానం. ఈ బిడ్డ పోతే మరొక బిడ్డను కనవచ్చు అని అనుకోరు. కన్నబిడ్డలకోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడతారు. ఈ దేశంలో బంధాలమధ్య



చట్టాలకు విలువ లేదు. ఇక్కడ బంధమే గొప్పది. చట్టం గొప్పదిగాదు. ఇదే మన భారతీయుల పుణ్యం. దేవుడా! మరు

జన్మవుంటే నన్ను ఇక్కడే పుట్టించు! మన మిపుడు ధనానికి దాసోహమవుతున్నాం. ఎలా సంపాదించావన్నది ముఖ్యం కాదు. ఎంత సంపాదించావన్నది మాత్రం ముఖ్యం. మన సంస్కృతినీ, మరచిపోయి విశృంఖలత్వానికి పరవ్యామోహానికీ మనం బానిసభావం వహించటం భరతమాత దురదృష్టం. వివాహ పద్ధతి ప్రారంభమై ఎనిమిది వేల సంవత్సరాలయింది. స్త్రీ పురుషులిద్దరినీ బంధించి బ్రతికించేది వివాహమే. వివాహ సంస్కారంలో వరుడు అగ్నికి నమస్కరించి వధువు చేతిని పట్టుకొంటూ –

"పూషా త్వేతో నయతు హస్తగృహ్యా అశ్వినౌ త్వా ప్రవహతాం రథేన గృహానాగచ్ఛ గృహపత్నీ! యథా సోవశినీ త్వం వివిధం అవధాసి"

అని అంటాడు.

ఓ గృహపత్నీ! నా యింటికి యజమానురాలివై పెత్తనం వహించి గృహమును తీర్చిదిద్దుకొనుటకై దేవతయగు పూషాదేవి నా యింటికి నిన్ను తోడ్కొని వచ్చుగాక! అశ్వినీ దేవతలు రథముపై నిన్ను నా వద్దకు చేర్చుదురు గాక అని అర్థం.

"ధృవంతే రాజా వరుణక్ష

ధృవం తేనో బృహస్పతిః

ధృవంత ఇంద్రశ్చ అగ్నిశ్చ రాష్ట్రంధారయతాంధ్రవమ్"–

అంటూ వేదమంత్ర పూర్వకంగా పురోహితుడు వధూవరు లిద్దరికీ బ్రహ్మముడి వేస్తాడు. ఓ నవదంపతులారా! క్రొత్తగా



దాంపత్య సామ్రాజ్యము వహించబోవు మీకు ఇంద్రుడు, వరుణుడు, అగ్ని, బృహస్పతి దేవతలు శాశ్వతత్వము చేయుదురు గాక అని అర్థం.

"శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం

ధర్మ ప్రజా సంపత్యర్థం

స్త్రీయం ఉద్వహే"

"కన్యాదాన సమయంలో వరుడు కన్యను స్వీకరిస్తూ శ్రీపరమేశ్వరుని ప్రీతికోసం ధర్మబద్ధ సంతాన సంపదకోసం ఈ కన్యను వివాహం చేసికొనుచున్నాను' అని పెద్దలందరి సమక్షంలో చెబుతారు.

అంతేకాకుండా వివాహానికి 'మహా సంకల్పం' ఇలా జరుగుతుంది.

"ఆద్యంతములు లేని శ్రీమదాది నారాయణుని శక్తిచే మహా జలరాశి నడుమ వుండి, ఆధార, కూర్మ, వరాహ, వైష్ణవ, అనంత, నాగ, శేష, తక్షక మొదలగు అష్ట

దిక్కుల అష్టదివ్యశక్తులపై నిలబడియుండి, ఐరావత, పుండరీక, వామన, కుముదా, అంజనాది అష్టదిగ్గజాలచే రక్షించబడు చుండి, ఇంద్ర, అగ్ని, నిఋత, వరుణ, వాయు, కుబేర, యమ, ఈశానులను అష్ట దిక్పాలురచే పరిపాలింప బడుచుండి, సప్త కుల పర్వతాలచే అధిష్టింపబడియుండి, అనేక దేశభాషలతో విరాజిల్లుతూ భాగి రథీ గౌతమీ వంటి పుణ్యనదులతో నిండి యుండి, శ్రీశైలాది పుణ్య తీర్థములతోనూ, జంబూద్వీపం, ప్లక్ష, శాల్మల, కుశ, క్రౌంచ, శాక, పుష్కర ద్వీపాది సప్త ద్వీపా లతో, భారత, కింపురుష, ఇలావృత, కురు, భద్రాశ్వరమణక, హిరణ్యక, కేతు మాలా, హర్య, మొదలగు నవఖండ మండితమై యుండి, యాభై కోట్ల యోజన విస్తీర్ణముగల భూమండలమున, లక్ష యోజనముల విస్తీర్ణమున్న జంబూ ద్వీప మున, బ్రహ్మదేవుని అనంతాయుష్షు లోని యాభై ఒకటవ సంవత్సరమున మొదటి నెల మొదటివారం మొదటి దినము నందు, తొమ్మిది కల్పాలలో ఒకటైన శ్వేత వరాహ కల్పంలో పధ్నాలుగు మనువు లలో ఏడవ మనువైన వైవస్వతుని మన్వం తరంలో దశావతారములలో తొమ్మిదవ అవతారమైన బుద్ధావతారమున, ఆరు శకాలలో మూడవదైన శాలివాహన శకంలో, ఎనిమిదవ మహాయుగంలో, నాలుగు లక్షల ముప్పైరెండువేల సంవత్స రాల కలియుగ మొదటి భాగంలో, జంబూద్వీపమున, భరత వర్ష భరత



ఖండంలో మేరుపర్వతమునకు దక్షిణము నగల గంగా కావేరి నదుల మధ్యనున్న ఆంధ్రదేశమున, సమస్త గురుబంధు, మిత్ర, బాంధవ సమక్షంలో శుభ ముహూ ర్తంలో, మా పూర్వీకులైన పదితరాల తాత ముత్తాతలకు శాశ్వత బ్రహ్మలోక నివాసం కల్పించటానికీ, ఉత్తమ సంతాన మని యెడు శాశ్వత సంపద కోసం, ఈ కన్యకా మణిని ధర్మములోనూ, ధనములోనూ, శరీర సుఖములోనూ, మోక్షములోనూ సగభాగమునిచ్చి అర్ధాంగిగా గౌర విస్తు న్నాను."అని చెప్పి 'చేసుకొనే' వివాహం గొప్పది కదా! ఇది హిందూ వివాహ వ్యవస్థ గొప్పదనం కాదా! పెండ్లికుమారుని దైవ స్వరూపునిగా భావించి కాళ్లు కడ గటం, పూజించటం కన్యాదానం చేసి ఉత్తమ సంతానాన్ని కనమనీ, నూరు సంవత్సరాలు సుఖంగా అన్యోన్యంగా జీవించమని ఆశీర్వదించే 'మామగారు' హిందువులకే స్వంతం. హిందూ వివాహ పద్ధతిని గౌరవించే యువకులకే స్వంతం. చివరిగా ఒక్కమాట! 'లవ్ మ్యారెజ్ తప్పు గాదు. కానీ కన్నవారి ఆశీస్సులతో వైదిక పద్ధతిలో మాత్రమే వివాహం చేసు

కోవాలి. పెద్దల అనుమతితో చేసుకొనే వివాహమే స్థిరంగా వుంటుంది. జీవితానికి హాయిని ఇస్తుంది. గౌరవప్రదంగా వుంటుంది. మిమ్ములను కని, పెంచి పోషించి పెద్దవారినిగా చేసిన తల్లిదండ్రులకు సంతోషాన్ని కల్గిస్తుంది. అంతేకాదు సుమా! మీ బిడ్డలకు రక్షణ, మీకు అభివృద్ధి కలుగుతుంది. శుభం భవతు!

## 801. రాముడు సీతను పరిత్యజించటం న్యాయమా?

**జ.** రాముడిపుడు లేడు. వుండివుంటే "నా పెళ్లాం నా యిష్టం" అనేవాడేమో! అవును గదా! కాదు! కాదు! రాముడు అలా అని వుండేవాడు కాదు! అనేవాడు కాదు!



భారతీయ జనజీవితంలో కల్సిపోయిన వాడు శ్రీరాముడు. శ్రీరాముడు తాను దైవాంశ సంభూతుడనని ఎక్కడా చెప్ప లేదు. చతుస్సముద్ర ముద్రితమైన రఘువంశ కీర్తికి తనవల్ల మచ్చ వస్తుందని, జననిందకు భయపడిన సకల గుణాభి రాముడు శ్రీరాముడు! ప్రజారాముడు! సీతారాముడు! సీతా పరిత్యాగంలోని ధర్మా ధర్మాలను చూద్దాం. త్రేతాయుగంలో బహు భార్యత్వం సర్వసామాన్యంగా వుండేది. "రాజానోబహు వల్లభాః! రాజులకు ఎంత మంది స్త్రీలనైనా వివాహమాడగల సామాజిక ధర్మం కూడా ఆనాడు అమలులో వుంది. శ్రీరాముని తండ్రి దశరథుడు బహు భార్యం వున్నవాడే! అయినా శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడు. 'ఏక పత్నీవ్రతం' అంటే ఒకే స్త్రీ భార్యగా పొంది జీవితాంతం ఆమెతోనే జీవించాలన్న నియమం కల్గి వుండటం అన్నమాట! ఇంతటి కఠోర నియమం పెట్టుకొన్న రాముడు ప్రాణాధికంగా ప్రేమించే సీతను ఎందుకు పరిత్యజించాడు?

ఏ సీతకోసం సుగ్రీవునితో స్నేహం చేసి, వాలిని వధించి, లంకకు వంతెన నిర్మించి, రావణ కుంభకర్ణాదులను వధించి, అష్టకష్టాలను అడవిలో అనుభవించాడో, ఆ సీతను రాముడెందుకు పరిత్యజించాడు? మహారాజైనా, మాములు మనిషైనా సమస్త సుఖ భోగాలనూ కీర్తి ప్రశంసలనూ, ధర్మార్ధాది పురుషార్థాలనూ భార్యతో కలసి అనుభవించాలను కొంటాడు. ఎన్ని పాపకార్యాలు చేసి అయినా భార్యను సుఖపెట్టాలని భావిస్తుంటాడు. మానవనైజాన్ని కాలదన్ని రాముడెందుకు సీతను పరిత్యజించాడు? ఆ యుగంనాటి భార్యాభర్తలు ఈనాటి భార్యాభర్తలవంటి వారు కాదు. ఆనాటి భార్యలు ధర్మార్థ కామమోక్షాది పురుషార్థాలలో మాత్రమే భాగస్వాములుకాదు, భర్తకు చెందిన కీర్తి ప్రతిష్ఠలలోనూ భార్యకు భాగముండేది. భార్యను 'అర్థాంగి' అనే




కారణం ఇదే! రాజైన ప్రతివానికీ రాముడే ఆదర్శం. పాలకులు ప్రజలను ఎలా పరిపాలించాలో, ప్రజాపాలనలో ఎంతటి ధర్మబద్ధత వుండాలో, ప్రజాభిప్రాయానికి ఎంతటి గౌరవమివ్వాలో తెల్సుకోవల్సిన పాలకులందరికీ రామాయణమే ఆదర్శం. అందుకే ఈనాటికీ 'రామరాజ్యం' అనే పేరును తలుచుకొంటూ వుంటాం! 'శ్రీరామ రక్ష' అనే మాటను తీసివేయ గలమా! నిన్నమొన్నటి వరకూ 'శ్రీరాముడు మంచిరాజు' అనే వాక్యాన్ని తెలుగు కాపీ రాయించేవారు. ఇంగ్లీషు సంస్కృతి వచ్చిన తరువాత హిందూ సంస్కృతి సంపూర్తిగా చచ్చిపోయింది. సంజీవిని తెచ్చినా, అమృతం పోసినా ఇక బ్రతుకదు. హిందూ సంస్కృతి సజీవంగా వుండాలంటే ఏదో మహత్తు జరగాలి! ఏ దేవుడో మహాత్ముడై అవతరించాలి! మనకు కాన్వెంట్‌లు రాకపూర్వం హిందువులు, క్రైస్తవులు మహమ్మదీయులు అందరూ ఒకే పాఠశాలలో కలసి చదువుకొనేవారు. హిందూ చరిత్ర అన్ని మతాలవారికీ కరతలామలకంగా వుండేది. అందువల్లనే కోస్తా ఆంధ్రాలో హిందూ, ముస్లిం అనే వ్యత్యాసమే కన్పించదు. రాముడు ప్రజల కోసం తన భార్యను కూడా పరిత్యాగం చేశాడు గనుకనే భారతీయులకు దేవుడయ్యాడు. ప్రతిగ్రామంలోనూ గుడికట్టి దేవునిగా హారతులిస్తున్నారు. రాముడే సీతను పరిత్యజించకుండా జనాపవాదాన్ని భరిస్తూ రాజహంకారాన్ని ప్రదర్శించి ప్రజలనోరు నొక్కి వున్నట్లయితే మాములు మహారాజులా చరిత్రలో వుండేవాడేమో! కాని దేవుడిగా ప్రతియింటి గోడ మీద ఫోటోలలో వుండేవాడు కాదన్నది నిత్యనిజం. "రామో విగ్రహవాన్ ధర్మః". ఇపుడు మనముందున్న ప్రశ్న 'రాముడు సీతను పరిత్యజించటం ధర్మమా' అని గదా! సీతారాముని ధార్మిక ఆస్థి. సీత మీద సర్వాధికారాలు భర్తగా ఆయనకెపుడో లభించాయి. రాముడు ఏ స్థితిలోనూ ధర్మం తప్పడు. రాముడు అధర్మపరుడే అయితే క్షత్రియకులంలో పుట్టిన శ్రీరాముడ్ని అగ్రకులస్థులైన బ్రాహ్మణులు, వేదవేదాంగ పండితులు, విశ్వామిత్ర వశిష్ఠాది మహర్షులు చేయెత్తి నమస్కరించే వారు కాదుగాక కాదు!! ఆనాటి, త్రేతా యుగంనాటి శ్రీ రాముడ్ని కలియుగ రాజ్యాంగ చట్టం ప్రకారం నిందించటం వివేకమనిపించుకొంటుందా! పరిత్యా

గురాలైన సీత కూడా ఏనాడూ రాముని నిందించి ఎరుగదు. అన్యోన్య జీవితానికీ, ఆలుమగల అనుబంధానికీ, అవ్యాజ అభిమానానికీ, ఆదర్శ దాంపత్యానికీ, ఇపుడు కూడా సీతారాములనే చెబుతుంటారు మన పెద్దలు. మీరు వినలేదా! 'యద్భావం తద్భవతి' అన్నట్లుగా ఎవరు ఏ విధంగా ఆలోచిస్తారో ప్రతిదీ వారికి ఆ విధంగానే కనబడుతుంది. 'నెగటివ్'గా ఆలోచించేవారికి కొన్ని విషయాలు కొన్ని నియమాలు అర్థంకావు. దీనికి ఎవరు మాత్రం ఏం చేయగలం! నమస్కరించి ప్రక్కకు తప్పుకోవటమే మంచిది.

## ౮౦౭. దైవ విగ్రహానికి అమూల్యాభరణాలు వుండాలా?

***జ.*** క్రీస్తు శకానికి పూర్వం 1600 నాడు ఆర్యులు ఇక్కడి గంగాతీర ప్రాంతానికి వచ్చి నివాసాలు ఏర్పరచుకొన్నారు అని చరిత్ర చెబుతోంది. ఆర్యులు ప్రకృతినీ భూమినీ, అగ్నినీ, సూర్యునీ, ఇంద్ర – వరుణాది దేవతలను పూజించేవారు. దైవానికి రూపంలేదనీ శక్తి వుందనీ నమ్మేవారు. అగ్నిని పూజించటం నిత్యకర్మగా వుండేది. యజ్ఞయాగాలు చేసేవారు. సంస్కృత, ప్రాకృత భాషలు మాట్లాడేవారు. ఈ విషయాలన్నీ వేదాలలో వున్నాయి. వెలుగునిచ్చే సూర్యుడు, నీటిని వర్షించే వరుణుడు, ఆహారాన్నిచ్చే భూమి, వేడిని ప్రసాదించే అగ్ని, దేవతలకు రాజుగా భావించే ఇంద్రుడు వీరు మాత్రమే



ఆర్యులకు ఆరాధకులుగా వుండేవారు. అపుడు గుడులుకాని, దేవతా విగ్రహాలు కాని, యింతమంది దేవుళ్ళు కాని లేరు.


మొట్టమొదటి సనాతన హిందూ మతంలో విగ్రహారాధనలేదు. క్రైస్తవ ముస్లిం మతాలు కూడా విగ్రహారాధనను అంగీకరించవు. క్రీ.శ.500 నుండి మనకు విగ్రహారాధన ప్రారంభమై వుండవచ్చు. ఈ విగ్రహపూజతో పాటే దేవాలయాల నిర్మాణం ప్రారంభమైవుండవచ్చు. హిందూమతంలో మూడు కోట్ల దేవుళ్ళు వెలిశారు. ఇప్పటికీ ఇంకా క్రొత్తక్రొత్తగా సాయిబాబా, అయ్యప్ప మొదలైన దేవుళ్ళు వెలుస్తూనే వున్నారు. ముమ్ముందు రోజుల్లో ఇంకా ఎందరో దేవుళ్ళు రాబోతున్నారు కూడ. ఇదొక పిచ్చి! అనాయాసంగా, హాయిగా ఏదో ఎవరో దేవుడు వరాలిస్తున్నాడని ఎవడో ఒకడు చెబితేచాలు,

మరునాడే అక్కడికి ప్రయాణం. పాపం ప్రాచీన దేవతలైన విష్ణువు ఈశ్వరుడు ఈ క్రొత్తదేవుళ్ళ దెబ్బకి మరుగున పడిపోతున్నారు. (శాంతం పాపం) 'క్రొత్త ఒక వింత పాత ఒకరోత' అనే సామెత దేవతలకు కూడా వర్తిస్తూవుందా! ఆభరణాల రక్షణకు కాలిబూట్లతో పోలీసులు కాపలా కాయవల్సిన అవసరం అంతకన్నాలేదు. 'దేవుని ఆభరణాలు దొంగలెత్తుకొని పోయారు. అంటూ పేపరులో చద వాల్సిన దుస్థితి ఎంత బాధాకరం! భక్తులకు ఎంత మనోవేదన? దేవునిలోని దైవత్వానికి ఎంత చిన్నతనం! డబ్బు, బంగారం, వస్తు వాహనాలు మనుషులకు కావాలిగాని, సర్వసంపదకూ, సర్వభాగ్యాలకూ అధినాధుడైన దేవునికెందుకు! "తిరుపతి స్వామి శ్రీమంతులకు మాత్రమే దేవుడన్న" అపఖ్యాతి వినబడుతూ వుంది. ఇది హిందూమతాభిమానులకు బాధ కల్గించే విషయం కాదా! దేవునికీ భక్తునికీ మధ్య పూజారులుండటమే ఒక దురదృష్టమైతే దేవునికి ఆభరణాలు తగిలించి ప్రతి భక్తుడినీ దొంగగా అనుమానించి చూస్తున్న ఈ దుస్థితికి ఎవరు ఏడవాలో నిర్ణయించాల్సింది దేవుడే.

## 803. మహమ్మదీయ మతధర్మం ఏమిటి?

***జ.*** మతం అనేది మండే మంట వంటిది. వంట చేయవచ్చు ఇల్లు కాల్చవచ్చు.


ఏ మతమైన సమ్మతమైనదే మతం అని




చెప్పవచ్చు. ప్రపంచంలోని అతి పెద్ద మతాలలో మహమ్మదీయమతం రెండవది. ఈ మతాన్నే 'ఇస్లాంమతం' అని కూడా అంటారు. క్రీ.శ.622లో ఈ మత స్థాపన జరిగింది. అరేబియాదేశం ఈ మతానికి జన్మస్థలం. మహమ్మద్ ప్రవక్త ఈ మతాన్ని స్థాపించిన కారణంగా మహమ్మదీయ మతం అనే పేరు వచ్చింది. 'ఇస్లామ్' అంటే సర్వము దేవుని అధీనమని అర్థం. వీరు దేవుని 'అల్లాహ్' అని అంటారు. క్రీ.శ.632లో మహమ్మద్ ప్రవక్త మరణించిన తరువాత మహమ్మదీయులు సున్నీ-షియా అనే రెండు భాగాలుగా విడిపోవటం జరిగింది. ప్రపంచంలో వున్న ముస్లింలలో సున్నీలే ఎక్కువ మంది వున్నారు. 40 దేశాలు ముస్లిం మతదేశాలున్నాయి. ప్రపంచంలోని 70 దేశాలలో ముస్లిం మతస్థులున్నారు. "ఖురాన్" వీరి మత నిర్దేశక పవిత్ర

గంథం. భగవంతుడే మహమ్మద్ ప్రవక్తకు చెప్పిన విషయాలను ఖురాన్‌లో వ్రాయటం జరిగింది. 'మక్కా' వీరి పుణ్యక్షేత్రం. 'మదీనా' కూడా వీరి పుణ్యక్షేత్రమే. అన్ని మతాల కన్నా ఇస్లాంమతం అతి వేగంగా వృద్ధిచెందింది. మతరక్షణకోసం (జిహాద్) మరణించటానికి కూడా ముస్లింలు వెను కాడరు. వీరికున్న మతాభిమానం ఏ మతస్థులకు లేదు అని చెప్పవచ్చు. మహ మ్మదీయ మత ప్రకారం నలుగురు భార్య లుండటం తప్పుగాదు. చాలాదేశాలు ఈ పద్ధతిని నిషేధించాయి. ముస్లిం దేశాలైన సౌదీ అరేబియా - ఎమెన్ అరబ్ రిపబ్లిక్ కువైట్- బహ్రిన్- ఒమన్- నైజీరియా మొదలైన తొమ్మిది దేశాలలో ఈనాటికీ స్త్రీలకు ఓటు వేసే హక్కులేదు. భారత దేశంలో కూడా ముస్లింలకు ఒక ప్రత్యేక చట్టం వుంది. భారతీయ చట్టాలు వారికి వర్తించవు. సంసారిక జీవితంలో భర్తకు భార్య అయిష్టురాలైతే, పురుషుడు మూడు సార్లు 'తల్లాఖ్' అని చెబితే చాలు వారిద్దరి భార్యభర్తల అనుబంధం తెగిపోతుంది.

మహమ్మదీయులు విగ్రహ పూజను అంగీకరించరు. మతాన్ని ప్రాణానికంటె గొప్పదిగా భావిస్తారు. మహమ్మదీయుడైన ప్రతివాడూ ప్రతిరోజూ తప్పకుండా 'నమాజ్' ఐదుమార్లు చేసి తీరవల్సిందే. జీవిత కాలంలో ఒక్కసారైన 'హజ్' యాత్ర (మక్కా సందర్శన) చేయాలి. వ్యభిచారం ఏ పరి స్థితిలోనూ చేయకూడదు. అన్యాయంగా సంపాదించకూడదు. జూదం లాంటి




అక్రమార్జన చేయకూడదు. సంపా దించిన డబ్బులో కొంత బీదలకు, దిక్కు లేనివారికీ దానం చేసి తీరవల్సిందే. రంజాన్ మాసంలో తప్పకుండా వుప వాసం వుండి తిరాలి. స్త్రీలందరూ 'ఘోషా' పద్ధతిని పాటించి తీరవల్సిందే. చెడు పనులు, అత్యాచారాలు, హత్యలు దేవుని దృష్టిలో మహాపాపాలు. కష్టించి తినే ఆహా రమే దేవునికి ఇష్టమైనది. సంపాదనలో ఆరవభాగం తప్పకుండా దానం చేయాలి. మీ హక్కులకోసం మరణించినా దేవుడు సంతోషిస్తాడు మతాన్ని గౌరవించండి అని బోధిస్తుంది మహమ్మదీయ మతం. జూదం, వ్యభిచారం, మద్యపానం, ఇస్లాం మతానికి ఎపుడూ పనికిరావు.

## 804. గురుకులం అంటే ఏమిటి?

**జ.** ఋషి సాంప్రదాయాన్ని గురుకులం అంటారు. రుషి సాంప్రదాయమంటే

Artist

వైదిక సంప్రదాయం లేదా ఆశ్రమ సంప్రదాయం అని చెప్పుకోవచ్చు. గురుకులంలో విద్యాబోధన ఎంత ముఖ్యమో సత్ప్రవర్తన కూడా అంతే ముఖ్యం. ఉత్తీర్ణత కంటే ఉన్నతత్వం గొప్పదిగా గురుకులంలో భావిస్తారు. విద్య కేవలం విజ్ఞానాన్ని అందిస్తే, ప్రవర్తన అనేది మనిషికి సర్వతో ముఖాభివృద్ధి కల్గిస్తుంది అని గురుకుల నమ్మకం. ధర్మం, నీతి, శాంతి, వినయం, సద్గుణం, సద్భావం మొదలైనవన్నీ గురుకుల లక్షణాలు. గురుకులాన్ని గురుపీఠం అని కూడా అంటారు. విద్యాపీఠం అని కూడా అనవచ్చు. గురుకులంలోని విద్యార్థులకు విద్యాశుల్కం (ఫీజు) వుండదు. గురుసేవ, గురుభక్తి విద్యా శుల్కంగా భావించబడుతుంది. ఈ గురుకులాల్లో ఒకప్పుడు బ్రాహ్మణ క్షత్రియులకు మాత్రమే ప్రవేశం వుండేది. మహారాజుల ఆశ్రయంతో, రక్షణతో నడుస్తుండేవి. జనావాసాలకు దూరంగా నదీతీరాలలో ప్రశాంత వాతావరణంలో గురుకులం నిర్మించేవాళ్ళు. మహారాజు బిడ్డడైనా గురుకుల పద్ధతులకు కట్టుబడి చదువుకోవల్సిందే. అయితే కొందరు బ్రాహ్మణ బ్రహ్మచారులు సమీప గ్రామంలో భిక్షను స్వీకరించి గురుకులానికి సహాయపడుతూ విద్య నభ్యసించేవారు. శ్రీమంతుల ఇండ్లలో భిక్షను అర్థిస్తూ విద్యాభ్యాసం చేయటం ఆనాటి గురుకుల విద్యార్థులకు చిన్నతనంగా వుండేదికాదు. బ్రాహ్మణ పిల్లలకు, చిన్నతనంలోనే ఉపనయనం కానివారికి దానం చేయరాదు. ఇది హైందవ ధర్మం.

ఉపనయనం అంటే జ్ఞానసిద్ధి (బ్రహ్మత్వ సిద్ధి). ఇపుడు కూడా తిరుపతి– శ్రీశైలం– పుట్టపర్తి– మంత్రాలయం– కాళహస్తి – 'ఇస్కాన్' హైదరాబాదు– బ్రహ్మంగారి మఠం మొదలైన చాలాచోట్ల గురుకులాలు వున్నాయి. ఉచిత భోజనం, ఉచిత విద్య ఈ గురుకులాల్లోని విద్యార్థులకు దొరుకుతున్నాయి. ఇంగ్లీషు వ్యామోహంతో తమ బిడ్డల్ని కాన్వెంట్ స్కూళ్ళకు నడిపించే తల్లిదండ్రులకు గురుకుల విద్య అంటే కాకరకాయ కషాయమే.

అజ్ఞాన తిమిరాంధస్య–జ్ఞానాంజన శలాకయా।
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవే నమః॥

## 805. దెయ్యాలు వున్నాయా?


**జ.** అశాస్త్రీయ నమ్మకమే దెయ్యం! ఎవరైనా ఒక మనిషి శారీరక వాంఛలు తీరకుండాగాని పగ, ప్రతీకారంతో గానీ, తీరని ఏ కోరికలతోగాని, మరణించటం జరిగితే, వారి ప్రేతాత్మ అక్కడి వారిని ఆవహించి బాధిస్తుందని పూర్వీకుల



నమ్మకం. ఈ దెయ్యాలు ఎక్కువగా గిరి
జన ప్రాంతవాసుల నమ్మకంలోనే
వుంటుంటాయి. ఎవరినైన 'నువ్వు
దెయ్యాన్ని చూచావా!' అని అడిగితే
'ముసుగేసుకొని వుంది. చెట్లలోకి పరు
గెత్తుకు పోయింది, మండే కొరివిలాగ
వుంది' అని రకరకాలుగా చెబుతారు.
కాని... యిదంతా మనో దిగ్భ్రమ! క్షణ
కాల బుద్ధివైకల్యం! ఒక్కొకసారి మనం
ఒంటరిగా దారివెంట వెళుతుంటే మన
వెనుకగా ఎవరో వస్తున్న భ్రాంతి కల్గటం
సహజం. దెయ్యాలు పట్టినవారు పిచ్చి
పిచ్చిగా మాట్లాడటానికి కారణం ఏమిటని
ప్రశ్నించవచ్చు. పిచ్చిపిచ్చిగా మాట్లాడ
టానికి దెయ్యమే పట్టనవసరం లేదు.
మనం బస్‌స్టాండ్‌ల్లోనూ, రోడ్లమీద ఎందరో
పిచ్చివాళ్ళను చూస్తుంటాం. వాళ్ళు చేసే
పిచ్చి చేష్టలు పిచ్చిమాటలు చూచి వారికి
దెయ్యం పట్టిందనుకోవాలా! అసలు
దెయ్యాలు ఆడవారికి మాత్రమే ఎక్కువగా
పడతాయి. ఎందువల్ల? బలమైన కోరి
కలు మనస్సులోనే అణచివేసు కొంటూ
బ్రతుకవల్సిన దుస్థితి ఆడవారికి మాత్రమే
వుంది. ఈ కారణంవల్ల మనో వైకల్యానికి
లోనైనప్పుడు మెదడు దారి తప్పుతుంది.
మెదడు సరిగా పనిచేయనపుడు ఎన్నో
వికారాలు కల్గుతాయి. కొద్ది రోజులలో
కొందరు మాములు స్థితికి వచ్చేస్తారు.
అంతేగాని చీపురుదెబ్బలవల్ల, వేప మండ
లతో హింసించినందువల్ల, విభూతివల్ల
ఏమీ జరగదు. అభివృద్ధి చెందిన అగ్ర
రాజ్యాలలో కూడా ఈ దెయ్యాలు భ్రమ
వుందంటే ఆశ్చర్యం కలుగక మానదు.
క్రీ.శ. 14-16 శతాబ్దాల మధ్యకాలంలో
ఇంగ్లాండు - పారిస్ - ఫ్రాన్స్ మొదలైన
యూరప్ దేశాల్లో లక్షల కొద్దీ దెయ్యాల
మాంత్రికుల్ని కాల్చి చంపివేయటం జరి
గింది. అన్ని మతాలలో కన్నా క్రిస్టియన్
మతంలోనే సైతాను (దెయ్యం) భయం
ఎక్కువ. దేవుడ్ని నమ్మినపుడు దయ్యాలను
కూడా నమ్మాలిగదా అని ప్రశ్నించే బుద్ధి
మంతులు చాలామంది వున్నారు. దేవుడ్ని
నమ్మటానికీ దెయ్యాన్ని నమ్మటానికీ చాలా
వ్యత్యాసం వుంది. ఉపకారం చేసేది
దేవత. అపకారం చేసేది దెయ్యం. రెండి
టికీ వ్యత్యాసం వుందిగదా! మూఢ
విశ్వాసం, అజ్ఞానం వున్నచోట దయ్యాలు
వుంటాయి. విద్య, విజ్ఞానం, విమర్శ వున్న
చోట దయ్యాలు వుండవు. దెయ్యాలు
వున్నాయో లేదో మీరే చెప్పండి.

## 806. క్రైస్తవ మత ధర్మం ఏమిటి?

**జ.** ప్రపంచంలోని అన్ని మతాలలో క్రైస్తవ మతం పెద్దది. ఈ మత ప్రచారంకోసం



ప్రతి ఏటా కొన్నివేల కోట్లు ఖర్చు జరుగుతోంది. కన్యగానున్న 'మరియ'కు దేవునివరం వలన పుట్టినవాడు క్రీస్తు! క్రీస్తు జన్మించినప్పటి రోజు, నెల, సంవత్సరాన్ని గుణించుకొనే మనం ప్రతిరోజూ తారీకు వేస్తూ వ్రాస్తున్నాం. అంటే మనం ప్రతిరోజు వేసే తారీకు క్రీస్తు పుట్టి ఎన్ని సంవత్సరాలు జరిగిందో తెలుపుతుంది.

4వ శతాబ్దంలోనే క్రైస్తవులు భారత దేశానికి వచ్చినట్లు చరిత్ర వల్ల తెలుస్తున్నది. క్రైస్తవమతం మొదట కాలు పెట్టింది కేరళలో. (సిరియా దేశంనుండి) అప్పటి కేరళలోని బ్రాహ్మణులు గూడా క్రైస్తవ మతం స్వీకరించారు. 'బైబిల్' క్రైస్తవుల పవిత్ర మతగ్రంథం. బైబిల్ గ్రంథంలో పాత నిబంధన, క్రొత్త నిబంధన అని రెండు భాగాలున్నాయి. పాత నిబంధనలో యూదుల జాతి గురించీ యూదుమతం గురించీ వ్రాయబడింది. క్రొత్త నిబంధన క్రీస్తుజీవితాన్ని, క్రీస్తు బోధనలను, ఆయన శిష్యులను గురించి వ్రాయబడింది. పాత నిబంధనలు హిబ్రూ భాషలోనూ, క్రొత్త నిబంధన గ్రీకు భాషలోనూ వ్రాయబడ్డాయి. క్రీస్తుమతంలో చేరటాన్ని 'బాప్టిజం' అంటారు. శిరస్నానం చేయించి క్రీస్తుదీక్ష ఇస్తారు. యూదులజాతికి చెందిన 'జీసెస్ క్రైస్ట్' ను ఏసుక్రీస్తు అని అంటారు. ఆయన బోధనలనే క్రీస్తుమతం అంటారు. ఏసు దేవుని కుమారుడని అందరూ నమ్ముతారు. క్రైస్తవమతం ఆరవ శతాబ్దంలోనే రోమన్ సామ్రాజ్యమంతా వ్యాపించింది. 4వ శతాబ్దంలో రోమన్ రాజులు ఈ మతాన్ని స్వీకరించారు. తరువాత యూరప్ ఖండమంతా వ్యాపించింది. "మార్టిన్ లూథర్" అనే మత గురువు క్రైస్తవ మతాన్ని సంస్కరించి 16వ శతాబ్దంలో 'ప్రొటెస్టెంట్' అనే క్రీస్తు మతాన్ని క్రొత్తగా స్థాపించాడు. దీనితో క్రైస్తవులు రెండు భాగాలుగా విడిపోయారు. క్రైస్తవమతంలో ఇపుడు 460 శాఖలున్నాయి. ఒక్క అమెరికాలోనే 223 శాఖలున్నాయి. 'ప్రొటెస్టెంట్స్', 'కాథలిక్స్' ఈ రెండు విభాగాలే క్రిస్టియన్ మతంలో ముఖ్యమైనవి. ఇప్పటికి బైబిల్ గ్రంథం 1763 భాషల్లో ముద్రించబడింది. ఇది ప్రపంచ రికార్డ్.



క్రైస్తవ సిద్ధాంతాలు – నీ ప్రక్కనున్న వారిని ప్రేమించలేకపోతే నీవు దేవుని కూడా ప్రేమించలేవు. అధర్మపరులు, న్యాయం తప్పినవారు దైవ సేవకు పనికి రారు. దొంగతనం, వ్యభిచారం క్షమించ రానివి. పేదలను, దీనులను, రోగులను సేవించేవారే నిజమైన జీసస్ భక్తులు – ఇటువంటి నీతులు ఎన్నో బైబిల్ చెబుతుంది. క్రీస్తుపూర్వపు యూదు మత స్తులందరు 'మోజెస్'ను గొప్ప మత ప్రవక్తగా భావిస్తారు. వీరు పాత బైబిల్ నిబంధన (క్రీ.పూ. 1300) అనుస రిస్తారు. యూదులు దేవుణ్ణి 'యెహోవా' అని పిలుస్తారు. యూదులకు జెరుసలేం లోని 'వెయిలింగ్‌వాల్" పుణ్యస్థలం. వీరు విగ్రహపూజను అసలు అంగీకరించరు. హింసను ఇష్టపడరు.

క్యాథలిక్కులకు వాటికన్ సిటీలోని 'పోప్' మార్గదర్శకుడు. పోప్ అంటే తండ్రి.

## 807. 'ధర్మం' అంటే ఏమిటి?

**జ.** ఇది చాలా సంక్లిష్టమైన ప్రశ్న! అడిగిన వెంటనే గభాలున వివరించి చెప్ప టానికి కుదరని గంభీర ప్రశ్న! ఎందు కంటే ధర్మం అనే రెండక్షరాల శబ్దానికి చాలా లోతువుంది. చాలా సంక్లిష్టత వుంది. చాలా నిగూఢత వుంది. చాలా విశాలత వుంది.


## 808. "ధర్మంతు సాక్షాత్ భగవత్ ప్రణీతమ్"

**జ.** ధర్మాలన్నియు సాక్షాత్ పరమాత్మని నుండి లభించాయి. ధరించునదిగాబట్టి ధర్మము అని ధర్మశబ్దానికి ఉత్పత్తి అర్థము. (ధృ–ధారణే). ధర్మము నిత్య సత్యమై వుండే దైనా దేశకాల ప్రాంతాదుల ననుసరించి ధర్మం మారుతుంటుంది. ధర్మము– సామాన్యధర్మం విశేషధర్మం అని రెండు రకాలు.

శ్లో॥ ధృతిఃక్షమాదమో స్తేయం, శౌచ
మింద్రియ నిగ్రహః
హ్రీర్విద్యాసత్య మక్రోధః ఏతత్ ధర్మస్య
లక్షణమ్॥

"ధృతి – క్షమ – దమం – అస్తేయం – శౌచం – ఇంద్రియ నిగ్రహం – హ్రీః (సిగ్గు) – విద్య –సత్యం– అక్రోధం", ఈ పది లక్షణాలు కల్గియున్నది ధర్మమని శాస్త్రం చెబుతోంది. అంటే

1. మానవుడు ఏదైనా పని ప్రారంభి స్తాడు. తనకు సంబంధించినది కాని వ్వండి, కుటుంబానికి సంబంధించినది కానివ్వండి, సమాజానికి సంబంధించినది కానివ్వండి! ప్రారంభించేటపుడు ఏ సమ స్యలు వుండవు. కాని ప్రారంభించిన కొన్ని రోజులకే నూటొక్క సమస్యలు ప్రారంభ మౌతాయి. కువిమర్శలు ప్రారంభమౌతాయి.



ఎన్నెన్నో అడ్డంకులు కలిగి నిరాశ కల్గుతుంది. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆత్మ బలంతో అకుంఠిత దీక్షతో 'ధృతి' చెడకుండా ముందుకి సాగిపోవాలి. 'ఇది ధర్మం'.

2. మనిషి ఏ విషయంలోనైనా, ఏ పనిలోనైనా ఓర్పు కలిగి వుండాలి. క్షమాగుణంతో వుండాలి. ప్రతిదానినీ ప్రతివారినీ, ప్రతివిషయాన్నీ, క్షమాశక్తితో ఎదుర్కొనాలి. కోపగించుకోకూడదు. ఓర్పు గుణం వున్నవారిని ఏ శక్తులూ ఏమీ చేయలేవు. 'ఇది ధర్మం'.

3. మనం ఒక పని చేసేటపుడు మన మనస్సు సంపూర్ణంగా ఆ విషయంలోనే లగ్నం కావాలి. ఒక పనిచేస్తూ మరొక దానిని గురించి ఆలోచించకూడదు. ఏ విషయంలోనైనా ఏకాగ్రత ముఖ్యం. చదువుతున్నా, వింటున్నా, పని చేస్తున్నా, మాట్లాడుతున్నా, మనస్సును పరిపరి మార్గాలకు పోనివ్వకుండా వుండాలి. 'ఇది ధర్మం'.

4.తనకు తెలియని విషయాలను తాను తెలిసికొనక, పెద్దలు, పూర్వులు, చెప్పిన దానిని అంగీకరించక, స్వతంత్ర నిర్ణయం తీసికొనలేక, నిస్తేజంగా నిర్వికారంగా, నిరాశగా, నిర్లిప్తతగా, నియమ రహితుడుగా, వుండకూడదు. 'ఇది ధర్మం'.

5. మనిషి ఎల్లపుడూ మనస్సునూ, శరీరాన్నీ, మాటనూ ఆలోచననూ, సంసారాన్నీ, ఇంటినీ, పరిసరాన్నీ, ధరించే వస్త్రాలనూ పరిశుభ్రంగా శుచిగా వుంచుకోవాలి. మనసు పరిశుభ్రంగా వుండాలి. మాట పరిశుభ్రంగా వుండాలి. మనిషి పరిశుభ్రంగా వుండాలి. 'ఇది ధర్మం'.

6. చదువువున్నా, సంపదలున్నా, కీర్తి వున్నా, బలంవున్నా ఇంద్రియ నిగ్రహం లేనివానికి ఏదో ఒకరోజు పతనం తప్పదు. కాబట్టి మనస్సును దాని యిష్టానికి దాన్ని వదిలివేయకుండా మన చెప్పుచేతల్లో వుంచుకోవాలి. 'మనస్సును గెలిచినవాడు దేవేంద్రునైనా గెలుస్తాడు' మనస్సును తమ చెప్పుచేతల్లో ఎవరుంచుకొంటారో వారిని భూతప్రేతాలుగాని, దెయ్యాలుగాని, యక్షకిన్నర కింపురుషులుగాని, గ్రహాలుగాని, రోగాలుగాని, కష్టసుఖాలుగానీ, మరణంగానీ, వశంలో వుంటాయి. కాబట్టి మనస్సును, మాటను, దృష్టిని, శరీరాన్నీ, చేతులనూ అదుపు చేయాలి. 'ఇది ధర్మం'.

7. ప్రతి విషయానికీ సంకోచపడటం, సిగ్గుపడటం, అనుమానపడటం, తనను తాను తక్కువగా భావించటం కూడదు 'ఇది ధర్మం'.



8. మనిషి సత్యవ్రతం కలిగివుండాలి. అకారణంగా, అనవసరంగా, ఒకరి మెప్పుకోసం, ఒకరిని మెప్పించటంకోసం, తన పనిని సాధించుకోవటంకోసం, తాను ఏ విధంగానైన ప్రయోజనం పొందటం కోసం, తన వారిని తృప్తి పెట్టటం కోసం అబద్దాలు చెప్పకూడదు. అబద్ధం దరిద్రాన్ని కల్గిస్తుంది. అబద్ధం అల్పసుఖాన్ని మాత్రమే కల్గిస్తుంది. అబద్ధం మరొక నాటికి అవమానం పాలుచేస్తుంది. అబద్ధం మనిషి విలువను మట్టిచేస్తుంది. మన శక్తినీ, మనకీర్తినీ, మన గొప్పదనాన్నీ పాతాళానికి త్రొక్కివేస్తుంది. కాబట్టి సాధ్యమైనంతవరకూ సత్యధర్మాన్ని వదలకూడదు. 'ఇది ధర్మం'.

9. మానవునికి ఆహారం ఎంత ముఖ్యమో, వివేకం కూడా అంతే ముఖ్యం. వివేకవంతుడు కావాలంటే విద్యావంతుడు కావాలి. శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు విన్నంత మాత్రాననే వివేకం సిద్ధించదు. విన్న విషయాలను స్వానుభవానికి మళ్ళించుకోవాలంటే మనిషికి విద్య కావాలి. "విద్యా విహీనః పశుః అని ఆర్యవాణి. మనిషిగా పుట్టి మట్టిబొమ్మగా జీవితం గడుపకూడదు. ఎంతటి పేదతనం పెనవేసుకొనివున్నా, స్థితిగతులు ఎంతటి బాధాకరమైవున్నా, భిక్షమెత్తి అయినా చదువుకోవాలి అని ఋషి వాక్యం. విద్య ప్రతి వ్యక్తికీ నిర్బంధంగా వుండాలి. 'ఇది ధర్మం'.

10.పగ, హింస, ప్రతీకార మనస్తత్వం ఇవన్నీ మనిషిని పతనావస్థకు నెడతాయి. పగ, ప్రతీకారాలు మనిషిని అశాంతికి గురిచేసి అనారోగ్యాన్ని కల్గిస్తాయి. తన అభివృద్ధికి తానే ఆటంకంగా నిలవాల్సి వస్తుంది. తనను కన్నవారికీ, తాను జన్మనిచ్చిన వారికీ, తనను నమ్మి బ్రతికేవారికీ అన్యాయం కలుగుతుంది.

అకారణంగా సాటి ప్రాణుల్ని హింసించటం, ఆహారం తింటూవున్న ప్రాణుల్ని, నీరు త్రాగుతున్న ప్రాణుల్ని, ఆడ మగ కలుస్తున్న జంటల్ని హింసించటం, భయపెట్టటం, రాళ్ళతో కర్రతో హింసించటం, తన దారిన తాను వెళుతున్న ప్రాణుల్ని భయపెట్టి పరుగెత్తించటం మంచిదికాదు. కోపాన్ని జయించితే మనుష్యుల్ని జయించవచ్చు. సమస్యల్ని అధిగమించవచ్చు. కోపం ఎప్పుడూ మనకే నష్టాన్ని కల్గించి ఎదుటివారికి లాభాన్ని కల్గిస్తుంది. కోపం

ఆత్మీయుల్ని దూరం చేస్తుంది. కోపం భవిష్యత్తును ఛిద్రం చేస్తుంది. కోపం జీవితాన్ని పతనం చేస్తుంది. కోపాన్ని అదుపులో ఎల్లపుడూ వుంచుకోవాలి. 'ఇది ధర్మం'. వీటినే ధర్మంగా గుర్తించారు పెద్దలు. ఇదిగో! ఇవి విశేష ధర్మాలంటారు.

సామాన్య ధర్మాల విషయానికి వస్తే చెప్పవల్సిన ధర్మాలు ఎన్నో వున్నాయి. సామాన్య ధర్మాలు అంటే శాస్త్రాలు చెప్పనివి చెప్పనక్కరలేని చెప్పినవి కూడా సామాన్య ధర్మాల క్రిందకే వస్తాయి. విజ్ఞానాన్ని దాచుకోకుండా బోధించటం గురుధర్మం! భయభక్తులతో విద్యను నేర్చుకోవటం శిష్యధర్మం! న్యాయ మార్గంగా



సంపాదించి సంసారాన్ని పోషించటం యజమాని ధర్మం! భర్త సంపాదనను సక్రమంగా ఖర్చుపెట్టి గృహాన్ని నడపటం ఇల్లాలి ధర్మం! సైనికుడుగా వుండి దేశాన్ని ప్రజలను కాపాడటం సైనికధర్మం! వృద్ధులైన తల్లిదండ్రుల్ని ఆదరించి పోషించటం పుత్రధర్మం! తాను జన్మనిచ్చిన బిడ్డల్ని ప్రయోజకుల్ని చేయటం తండ్రి ధర్మం! తన ఇంటికీ, తనను కన్నవారికీ పేరు ప్రతిష్ఠలు తేవటం బిడ్డలందరి ధర్మం! తన వృత్తి ఎటువంటిదైనా వృత్తిని గౌరవించటం ప్రతివాని ధర్మం! తాను సంపాదించినదాన్ని తనవారితో పంచుకొని తినటం సంసార ధర్మం! అసహాయులను కాపాడటం మానవతా ధర్మం! చెప్పిన మాటను నిలుపుకోవటం సత్యధర్మం! ధర్మసాక్షిగా పెండ్లాడిన భార్యను వదిలివేయకుండా వుండటం వివాహ ధర్మం! తన భర్త అందహీనుడైనా, స్థితి పరుడుకాకున్నా, నమ్మివుండటం భార్య ధర్మం! నమ్మిన మిత్రునికి అపకారం చేయకుండటం మిత్రధర్మం! సోమరితనం లేకుండుట పురుష ధర్మం! – ఇలా చెప్పుకుంటూ వెళితే చాలా ధర్మాలున్నాయి. "అమ్మా! తల్లీ! ధర్మం చేయి తల్లీ" అని మనం యింటిముందు నిలబడి భిక్షకోసం అరుస్తుండటం ప్రతిరోజూ చూస్తుంటాంగదా! ఇదేంటి 'ధర్మాన్ని చేయటం' ఏమిటి అని మీకెపుడూ అన్పించలేదా!

ధర్మం చేయమని చెప్పి యోచించటం ఎందుకంటే మనిషి సంఘజీవి కాబట్టి మనకు వున్నదాన్ని ఎంతో కొంత లేని వారికి దానంచేయటం సామాజిక ధర్మంగా పూర్వకాలం నుండీ మన ఆచారంగా వస్తోంది. బహుజన సుఖం, బహుజన హితం భారతీయ ధర్మంగా అనాదికాలం నుండి ఋషులు మనకు బోధించారు. నీ దగ్గర వున్నదాన్ని నీవొక్కడవే తినటం

ధర్మంకాదు. నీవు నివసిస్తున్న సమాజంతో సమానంగా పంచుకోవాలి. ఆహారం అందరికీ అందాలి. ఎవరూ పస్తులతో వుండకూడదు. సమాజంలో ఆకలి బాధలు ఆకలిచావులు వుంటే అరాచకత పుడుతుంది. దొంగతనాలు, దోపిడీలు, హత్యలు తయారై మానవకులాన్ని కలుషితం చేస్తాయి. అందుకే ఆర్యులు 'అతిథి దేవో భవ' అని చెప్పారు. అందువల్ల "దానం చేయటం కూడా ఒక ధర్మం" అని గుర్తించాలి. ఆకలిబాధ ఎంతటి దుర్మార్గాన్ని అయినా చేయిస్తుందిగదా! నీకు శక్తి వుంటే, నీవు దానంచేయగల స్తోమత వుంటే, నీ కడుపు నిండివుంటే లేనివారికి ఎంతో కొంత సాయంచేయటం మానవ ధర్మం. మనిషికి ఏం లేకపోయినా ఫర్వాలేదు. ఆకలిబాధ మాత్రం వుండకూడదు గదా! ఆహారం, నిద్ర అందరికీ ఆవశ్యకమే. వేదం కూడా ఇదే చెబుతుంది.

"స్వస్తి ప్రజాభ్యం పరిపాలయంతాం న్యాయ్యేన మార్గేణ
మహిం మహీశాః। గో బ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం
లోకాః సమస్తాః సుఖినోభవంతు।
అపుత్రాః పుత్రిణః సంతు।
పుత్రిణ స్సంతుపౌత్రిణః। లోకయం క్షోభరహితః।అధనాః సధనాః సంతు ।
జీవస్తు శరదశ్శతమ్॥

"పాలకులు ప్రజలను న్యాయ మార్గమున ధర్మబద్దంగా పరిపాలించుగాక! గో సంతతికి పండితులకు శుభం కలుగుగాక! సంతతి లేనివారికి సంతతి కల్గుగాక! సంతతివున్నవారికి మనుమ సంతతి కల్గుగాక! ప్రపంచం శాంతితో నిండియుండుగాక! దరిద్రులు ధనమును పొందుదురుగాక! అందరూ ఏ ఆపదలు కల్గియుండక నూరు సంవత్సరాలు జీవించుదురు గాక!" అని చెబుతుంది వేదం.

పూర్వకాలం'దానధర్మం' ఒక కర్తవ్యంగా వుండేది. బ్రాహ్మణవర్ణం వారికి ఇల్లు తప్ప, స్థిరాస్థులు వుండేవి కాదు. విద్యార్జన చేయటం, సమాజానికి హితాన్ని బోధించటం, ప్రజలకు విద్య బోధించటం వారి పని. బ్రాహ్మణ బ్రహ్మచారులు ఇంటింటికీ భిక్షమెత్తుకొని వచ్చి గురువుకి సమర్పించేవారు. ఆ విధంగా యాచకం చేస్తూ చదువు కోవాలి. విద్య నేర్పుతున్నందుకు గురువు ఏ విధమైన ప్రతిఫలం ఆశించటం తప్పుగా వుండేది. అప్పటి ఆ కాలంలో మనకు అల్లోపతి వైద్యం లేదు. ఆయుర్వేద వైద్యం అందరికీ ఉచితంగా అందుతుండేది. బ్రాహ్మణులే ఈ పనిని చేస్తూ వుండాలి. విద్య, వైద్యం, వేదం, జ్ఞానం ఎవరూ అమ్మకూడదు. ఎవరూ కొనకూడదు. పొరపాటు జరిగితే శిక్షకు గురికావల్సిందే!

ఈనాటికీ బౌద్ధమత ప్రచారకులు "దానధర్మం"తో జీవిస్తూ ధర్మప్రచారం చేస్తున్నారు. బౌద్ధసూక్తి మీకు తెల్సుగదా!

"ధర్మం శరణం గచ్ఛామి!
సంఘం శరణం గచ్ఛామి!
బుద్ధం శరణం గచ్ఛామి!"



ధర్మాన్ని శరణు పొందుతున్నాను! సంఘాన్ని శరణు పొందుతున్నాను. బుద్ధుని (జ్ఞానాన్ని) శరణు పొందుతున్నాను. అంటూ 'ధర్మయానం' చేస్తుంటారు.

## 809. "ధర్మో రక్షతి రక్షితః"

**జ.** "ధర్మాన్ని నీవు రక్షించితే ధర్మం నిన్ను సర్వదా రక్షిస్తూ వుంటుంది. నీవు ఎపుడు ధర్మాన్ని నిర్లక్ష్యం చేస్తావో ధర్మం నిన్నెపుడూ రక్షించదు." ధర్మాన్ని నమ్మాలి – ధర్మాన్ని ఆచరించాలి. ధర్మాన్ని ఆశ్రయించాలి– ధర్మమార్గాననే నడవాలి. ధర్మాన్ని గౌరవించాలి. శ్రీరాముడు ప్రభుధర్మం కోసమే సీతాపరిత్యాగం చేయవల్సి వచ్చింది. ధర్మ మార్గాన నడవటం వల్లనే యుధిష్ఠిరుని ధర్మరాజుగా పిలుస్తున్నాం. "యదా మదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారతా! అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥" అని చెప్పాడు యోగీశ్వరుడైన శ్రీకృష్ణ పరమాత్ముడు. పాండవులు ధర్మపరాయణులు కాబట్టే కృష్ణుడు పాండవ పక్షాన నిలిచి వారికి సహకరించాడు. అధర్మంను త్రొక్కివేశాడు.



అధర్మపరులను అధర్మంతో ఎదుర్కొన వచ్చు. తప్పుగాదు. ధర్మపరులను అధర్మంతో దెబ్బతీయకూడదు. ఇది పాప కార్యం. ఋతుధర్మంవల్లనే వర్షాలు వస్తున్నాయి. చెట్లుపండ్లు ఫలాలను ఇస్తున్నాయి. కాలధర్మం వల్లనే మనిషి మరణిస్తున్నాడు. సంయోగ ధర్మంవల్లనే మళ్ళీ జన్మిస్తున్నాడు. "ధర్మోరక్షతి రక్షితః"

## 810. స్నానం చేయకుండా పూజ చేయకూడదా?

**జ.** శరీర మాలిన్యాలను తొలిగించేది స్నానం. స్నానమనేది శుచి శుభ్రతల సంకేతమేగాని పవిత్రకార్యం కాదు. పూజ చేయటానికీ స్నానం చేయటానికీ సంబంధం లేదు. కాని, స్నానం చేసిన తరువాతనే పూజ చేయటంలో ఒక అంతరార్థం వుందని చెప్పవచ్చు! మామూలు స్నానం కానీ, శిరస్నానంకానీ, అభ్యంగన స్నానంకానీ చేసిన తరువాత శరీర మాలిన్యాలన్నీ తొలగింపబడి మనుసు ప్రశాంతంగా వుంటుంది. "ఆత్మశుద్ధిలేని ఆచా



రమదియేల, భాండశుద్ధిలేని పాకమేల, చిత్త శుద్ధిలేని శివపూజలేలరా" అన్నాడు యోగి వేమన.

దేవుడు కానుకలకు దొంగ పూజలకు లొంగడు. ఒకవేళ లొంగితే వాడు దేవుడే కాదు. అటువంటి దేవుడ్ని పూజించన క్కర్లేదు కూడ! వైదికమతం భారతదేశంలో పుట్టి మూడు వేల సంవత్సరాలకు పైగా అయింది. పండితులైన వైదిక గురువులు హిందువులను, కోతులను ఆడించినట్లుగా ఆడించారు. చిత్రవిచిత్ర ఆచారాలను పుట్టించి హైందవ మతాన్ని నాశనం వైపుగా నడిపించారు. వృత్తి ప్రాదిపదికగా ఏర్పడ్డ వర్ణాశ్రమధర్మం క్రమక్రమంగా వెర్రితలలు వేసింది. ఫలితంగా కులాలు పుట్టాయి. మనకు కులాలు పుట్టి దాదాపుగా రెండు న్నరవేల సంవత్సరాలు అయింది. హిందూ మతంలో ఎపుడైతే కులవ్యవస్థ వచ్చిందో అప్పుడే మతపతనం ప్రారంభం అయింది. హిందువుల ఐక్యత పోయింది. అన్న దమ్ములుగా జీవించవల్సిన హిందువు లందరూ కులాల చిచ్చుతో కొట్టుకోవటం మొదలయింది. హిందువులు మూడు వేల కులాలుగా విడిపోయారు. అర్థం పర్థం లేని ఆచారాలు పుట్టాయి. వేలకువేలుగా దేవుళ్ళు సృష్టింపబడ్డారు. వేదాలను, వేద సంప్రదాయాలను మరిచిపోయాం. చిల్లర దేవుళ్ళకు పూజచేస్తున్నాం. పిచ్చిపిచ్చి ఆచారాలను పాటిస్తున్నాం. ఎప్పుడైనా విచారవంతమైన ఆచారమే సదాచారం.

## 811. మన వివాహ వ్యవస్థ ఎపుడు ప్రారంభమైంది?

***జ.*** చరిత్ర చెబుతున్న విధంగా– ఎనిమిది వేల సంవత్సరాల క్రితం వివాహపద్ధతి మొదలైంది. ఐదువేల సంవత్సరాలనుండి స్థిరీకరింపబడింది. మానవజాతి పురోభి వృద్ధికీ, ఆరోగ్యవంతమైన జాతి నిర్మాణానికీ, సమైక్యతా భావనకూ, మహోదాత్త మైన అనుబంధాలకూ వివాహ వ్యవస్థను కల్పించారు పూర్వీకులు! ఎంతో దూర దృష్టితో ఎంతో సదాలోచనతో ఈ వివాహ సంప్రదాయం మొదలైందని చెప్పాలి. త్రేతాయుగం నుండే వివాహ వ్యవస్థ వుందని పురాణాలు చెబుతున్నాయి. ఏది ఏమైనా– చిన్న చిన్న పురుగులు మొదలు కొని పక్షులు పశువులకేగాక ప్రతి ప్రాణికీ కామసుఖం కావల్సిందే! ఎవరికైన కామాన్ని జయించటం తేలికకాదు. జితేంద్రియులైన మహర్షులు సైతం ఒక్కొక్కసారి కామానికి లొంగిపోయిన సంఘటనలు పురాణాల్లో వున్నాయి. వివాహం ఒక సాంఘిక సంప్ర దాయం! వివాహం ఒక సామాజిక సదాచారం! మనుషులకు వివాహవ్యవస్థ అనేది సృష్టింపబడకుంటే పశువులకూ



మనిషికీ తేడా వుండేది కాదు. బంధాలు అనుబంధాలు వుండేవి కాదు లైంగిక రోగాలతో మానవజాతి మట్టిలో కల్సి వుండేది. వివాహ వ్యవస్థవల్లనే మన మింతటి పురోభివృద్ధిని సాధించగలిగాం.

ప్రాణులన్నిటిలోకి మానవునికి ఒక ప్రత్యేకత వుంది. పశుపక్ష్యాదులు ఒక నిర్ణీత సమయంలో, గర్భధారణ సమయంలో మాత్రమే లైంగిక సంపర్కానికి అంగీకరించి ఆడ మగ కలుస్తాయి. కాని మానవప్రాణి అలా కాదు. మనిషి తన జీవితకాలంలో సగటు రెండువేలసార్లకు పైగ రతిక్రియలో పాల్గొంటాడని అంచనా వుంది. (ఈ లెక్క ఆరోగ్యవంతుడైన మనిషికి మాత్రమే) ఒక స్త్రీ ఒక పురుషుడు, ఒక పురుషునికి ఒక స్త్రీ, అన్న నిబంధనతోనే వివాహ పద్ధతిని ప్రారంభించారు పూర్వీకులు. స్త్రీ పురుషుల లైంగిక సంపర్కమే లేకుంటే సృష్టి నిలిచిపోతుంది. అలాగని విచ్చలవిడితనం మంచిదికాదు. విచ్చలవిడితనంవల్ల అనేక సుఖ రోగాలతో జాతికి జాతే నాశనం అయ్యే ప్రమాదం వుంది. కాబట్టి, స్త్రీ పురుషులకు వైవాహిక జీవితం తప్పనిసరి. మన దేవుళ్ళందరికీ భార్యలను సృష్టించుకొని పూజించే విధానం కూడా వైవాహిక బంధం గొప్పదని చెప్పటానికే! ఋషి సాంప్రదాయం నుండే ఈ వివాహవ్యవస్థ ప్రారంభమైంది.

## 812. శవాన్ని పూడ్చటం మంచిదా? కాల్చటం మంచిదా?

**జ.** ఆర్యులు శవాన్ని కాలుస్తారు. వీరందరూ వైష్ణవ మతస్థులు! ద్రావిడులు శవాన్ని భూస్థాపితం చేస్తారు. వీరందరూ శైవమతస్థులు! అయితే శైవులకు వైష్ణవులకు స్మశానం మాత్రం ఒకటే. క్రైస్తవ మతస్థులు కూడా భూస్థాపితం చేస్తారు.

ముస్లిం మతస్థులు కూడా భూస్థాపితం చేస్తారు. శవదహనం ఖర్చుతో కూడుకొన్నది. శ్రీమంతులకు మాత్రమే ఇది చెల్లుబాటు. భూస్థాపితానికి అంతగా ఖర్చుకాదు. కాని స్థలం సమస్య వుంటుంది. అందరూ ఇటుకలతో సమాధులు కడితే సమస్యేగదా మరి! ఇటుకలతో సమాధి నిర్మించకపోయినా జ్ఞాపకంగా గుర్తుకోసం ఒక రాయిని పాతి వేస్తుంటారు. సంవత్సరాని కొకసారి వెళ్ళి పూజచేసి వస్తుంటారు. దహనం చేసినవారు దహనాంతరం అస్థికలను భద్రంచేసి పవిత్ర నదుల్లో కలుపుతారు. ఈ విధంగా చేయటంవల్ల మరణించిన వారికి సద్గతులు లభిస్తాయని విశ్వాసం. నదీ నిమజ్జనాన్ని వేదధర్మం అంగీకరించదు. వైష్ణవులు ఎందుకు శవదహనం చేస్తారంటే–

ఈ శరీరం పాంచభౌతిక మైనది– "పృధివి అప్ తేజోవాయు రాకాశ నిర్మితం యత్‌తత్ పాంచభౌతికం'' భూమి–నీరు–అగ్ని–గాలి– ఆకాశమనే ఐదిం టితో ఈ శరీరం నిర్మితమౌతుంది. అని వైష్ణవుల నమ్మకం. కాబట్టి మరణించిన తరువాత అగ్నిసంస్కారం చేస్తే భూమి భూమిలో, అగ్ని అగ్నిలో, గాలి గాలిలో కలిసిపోయి జీవునికి ముక్తి లభిస్తుందని వైష్ణవుల విశ్వాసం. దాదాపుగా ఆర్యులలో వైష్ణవులే చాలామంది!

శైవులందరూ భూస్థాపితం ఎందుకు చేస్తారంటే–పుట్టటమనేది ఏది వున్నా అది భూమినుండే పుడుతుంది. శూన్యం నుండి కాదు. ఆహారం భూమినుండే లభిస్తుంది. ఆహారపోషణవల్లనే శరీరం నిలబడు తుంది. ఆహార పోషణవల్లనే శుక్ర శోణి తాల ఉత్పత్తి జరుగుతూవుంది. శుక్ర – శోణితాల కలయికవల్లనే శిశువు జన్మి స్తుంది. భూమియే మనకు అన్నిటినీ ఇస్తు న్నది గాబట్టి, మనిషి మరణించిన తరు వాత భూస్థాపితం చేయటం ధర్మసమ్మత మంటారు శైవమతస్థులు! దాదాపుగా వీరందరూ ద్రావిడులు. వేల సంవత్సరాల క్రితం ఆర్యులకు ద్రావిడులకు యుద్ధాలు జరుగుతూ వుండేవి. వారికి వీరికి వింధ్య పర్వతమే సరిహద్దుగా వుండేది.

కాల్చటం మంచిదా! పూడ్చటం మంచిదా! అంటే ఏం చెప్పాలి. ఎవరి విశ్వాసం వారిది. ఎవరి ఆచారం వారిది. తర తరాల సంప్రదాయాలను మార్చటమంటే మాటలు కాదు. అయితే ఒక్క విషయం గుర్తించితే మంచిది. దీర్ఘ రోగాలతో (ఎయిడ్స్ మొదలైనవాటితో) మరణించిన వారిని దహనం చేయటమే మంచిది అంటు న్నారు చాలామంది వైద్య నిపుణులు.

## 813. భార్య లేనివాడు దైవకార్యాలకు పనికిరాడా?

**జ.** అవును! బ్రహ్మచారి, భార్యాహీనుడు దైవకార్యాలకు పనికిరాడు. ధర్మశాస్త్రం అంగీకరించదు. భర్తను పోగొట్టుకొన్న స్త్రీ శుభకార్యాలకు ఏ విధంగా పనికిరాదో భార్యలేని పురుషుడు కూడా శుభకార్య నిర్వహణకు పనికిరాడన్నది శాస్త్రం. దీనికి



ముఖ్య కారణమేమంటే–పురుషుడు వివాహ సమయంలో వధువును తనదాన్నిగా చేసు కొనే సమయంలో, గురు బంధు, మిత్రుల సమక్షంలో, దైవసాక్షిగా "ధర్మేచ – కామేచ–మోక్షేచ నాతిచరామి' అన్న ప్రమా ణమే. ఈ కారణంగానే ధర్మపరులైన స్త్రీ పురుషులు ద్వితీయ వివాహానికి అంగీక రించరు. కష్టాలతో కాపురం చేయటాని

కైన ఇష్టపడతారుగాని, మరొక పెండ్లికి అంగీకరించరు. ఈనాటి నాగరిక ప్రపంచం ఈ విషయాన్ని 'పాత చింతకాయ పచ్చడి' అంటూ కొట్టిపారేస్తారు గాని దీర్ఘంగా ఆలోచిస్తే వివాహ ధర్మంలోని నిజాయితీ ఏమిటో అర్థం అవుతుంది. త్రేతాయుగంలో శ్రీరాముడు ప్రజాహితం కోసం అశ్వమేధయాగం చేయవల్సి వచ్చింది. అప్పటికే శ్రీరాముడు సీతను పరిత్యజించాడు. అందువల్ల అశ్వమేధం చేయటానికి అంగీకరించలేదు రాముడు. ఆ క్లిష్టసమయంలో కులగురువైన వశిష్ఠుడు, బావగారైన ఋష్యశృంగ మహర్షి ధర్మశాస్త్రాలను శోధించి స్వార్ధ రహితమైన ప్రజాకార్యం కాబట్టి ప్రజా ధనంతో స్వర్ణప్రతిమను చేయించి ఆ ప్రతిమను ప్రక్కనే వుంచుకొని అశ్వమేధం చేయమని చెప్పారు. ఈ రామాయణ కథ మనకందరకు తెల్సిందేగదా.

"ఏ దేశమేగినా ఎందు కాలిడినా – ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా పొగడరా నీ తల్లి భూమి భారతిని – నిలుపరా నీ జాతి నిండు గౌరవము. లేదురా ఇటువంటి భూదేవి ఎందు– లేరురా మనవంటి పౌరులింకెందు ఏ మంచి పూవులన్ పూజించినావో–నిను మోసే నీ తల్ల కనుక గర్భమున" అన్న కవి మాటల అక్షరసత్యం! నూటికి నూట పదిపాళ్ళు నిజం! నిజం!

### 814. వరదక్షిణ - కన్యాశుల్కం ఈ రెండు అవసరమా?

**జ.** వాడుకగా ప్రారంభమైంది కన్యాశుల్కం! వేడుకగా ప్రారంభమైంది వరదక్షిణ! రామాయణకాలం నుండి ఈ వరకానుకలు వున్నట్లుగా తెలుస్తోంది.



శ్రీమంతులు పూర్వకాలంనాడు కన్నకూతురి మీద మమకారంతో దాస దాసీలను, గోగణాలను, ధనరాశులను అల్లునకు కానుకగా ఇచ్చేవారని తెలుస్తూవుంది. కాని పేదవారు  కన్యాశుల్కం తీసుకొని తమ ఆడబిడ్డల్ని ఎంత వయసున్న వారికైన కన్యాదానం చేసేవారట. ఇపుదు కూడా కొన్ని ఆటవిక జాతుల్లోను, బంజారి జాతుల్లోను, (స్థిరనివాసం లేకుండా వూళ్ళు తిరుగుతూ వృత్తులు చేసుకొనే వారిని బంజారీలు అంటారు) మరికొన్ని ఆదిమ జాతుల్లోను ఈ కన్యాశుల్క  పద్ధతి సజీవంగా వుంది. "అష్టవర్షా భవేత్ కన్యా" అన్న మనువాణి ప్రకారం కొన్ని సంవత్సరాల క్రితం ఎనిమిది సంవత్సరాల వయసుకే ఆడపిల్లలకు పెండ్లిళ్ళు జరిపించేవారు. పన్నెండు సంవత్సరాలకే సంసారానికి పంపేవారు. అందరూ ఈ విధంగా చేసేవారనికాదు, కొన్ని పేద జాతుల వారిలోనే ఎక్కువగా ఆడపిల్లలు అన్యాయానికి గురయ్యేవారని చెప్పక తప్పదు. ఇటువంటి వివాహాలకే ఎక్కువగా కన్యాశుల్కం వుండేది. ఎవరు ఎక్కు

వగా వరహాలనిస్తే (వరహా అంటే నాలుగు రూపాయాలు) వారికి పిల్లనిచ్చి పెండ్లి చేసే వారు. వరుని వయస్సునీ, యోగ్యతను చూచేవారుకాదు. కన్యాశుల్కమే ముఖ్యం.

శ్రీమంతుల్లో వరదక్షిణ, పేదవర్గాల్లో కన్యాశుల్కం, రెండు వుండేవి. అగ్రవర్ణాల లోనే వరదక్షిణ అధికంగా వుండేది. రాను రాను కన్యాశుల్కం పోయింది. అన్ని కులాలవారికీ వరదక్షిణ భూతం పట్టు కొంది. కన్యాశుల్కమైనా వరదక్షిణ అయిన స్త్రీల పాలిట శాపమే. ఈ శాపా నికి విముక్తి ఎప్పుడో యువతరమే చెప్పాలి. ఈ సమస్యను దేవుడు కూడా పరిష్కరించలేడు. కాబట్టి మనుషులే మారాలి. మనసులే మారాలి. అప్పటి వరకు యింతే! ఇంతే!!

## 815. స్త్రీలకు "పిత్రార్జిత ఆస్థిహక్కు" శాస్త్రసమ్మతమా?

**జ.** అవును! స్త్రీలకు పిత్రార్జిత ఆస్థిహక్కు సనాతన శాస్త్ర సమ్మతమే! యాజ్ఞవల్క్య మహర్షి రచించిన 'స్మృతి'లో దీన్ని గురించి వివరంగా వుంది. ఇండియన్ లా అండ్ ఆర్డర్"లో యాజ్ఞవల్క్య స్మృతిని ఆధా రంగా చేసుకొని కొన్ని చట్టాలు చేయటం కూడా జరిగింది. భారత రాజ్యాంగాన్నీ ప్రాచీన ఋషి సంస్కృతితోనే వ్రాయటం జరిగింది. ఆశ్చర్యకరమైన గొప్ప విషయం ఏమంటే భారత రాజ్యాంగం పంచమ కులస్థుడైన ఒక విద్యావంతుని పర్యవేక్ష ణలో వ్రాయటం జరిగింది. ఆయనే డా॥ అంబేద్కర్! యాజ్ఞవల్క్య మహర్షి రచించిన



"స్మృతి" ని యాజ్ఞవల్క్యస్మృతి" అంటారు. ఈ స్మృతిలోని రెండవ కాండలో స్త్రీ ధన విషయాలను స్త్రీల ఆస్థిహక్కును వివరిం చాడు. ఈ స్మృతి త్రేతాయుగంలో రచిం పబడినదిగా భావిస్తున్నారు. మనుమహర్షి రచించిన "మనుస్మృతి"ని బ్రిటిష్ పాల కుల కొన్ని ధార్మిక విషయాలను భారతీయ సంవిధానంలో పొందుపరిచినా, కలి యుగానికి "పరాశరస్మృతి"ని ప్రమా ణంగా స్వీకరించటం జరిగింది. 'యాజ్ఞ వల్క్యస్మృతి' ఆధారంగా పిత్రార్జిత స్థిర, చరాస్తులలో కొడుకులతో సమానంగా కూతుళ్ళకు కూడా సమంగాభాగం ఇవ్వాలన్న ధర్మంవుంది. భగవతి 'గార్గి' కూడా యాజ్ఞ వల్క్యస్మృతినే సమర్థించింది. రాజర్షి యైన జనకుడుకూడా యాజ్ఞవల్క్య మహర్షి అభిప్రాయాన్నేఅంగీకరించినట్లు న్నది. యాజ్ఞవల్క్యుడు జనకుని గురువు.

శో॥ స్వేభ్యోంశేభ్యస్తు కన్యాభ్యః
ప్రదద్యుర్భ్రాతరః పృథక్।
స్వాత్స్వాదంశాచ్చతుర్భాగం
పతితాః స్యురదిత్సవః॥

9-118 మనుస్మృతి

పిత్రార్జిత ఆస్థిని కొడుకులందరూ సమంగా పంచుకొన్న తరువాత ఒక్కొక్కరి ఆస్థిలో పదిలో నాల్గవ భాగాన్ని ఆడ పడుచులకు అందరు సోదరులు ఇవ్వాలి. ఇవ్వకుంటే పాపాత్ములు అవుతారు.

ఒకప్పుడు కన్యాశుల్కం ఆచారంగా వుండేది. అంటే ఆడపిల్ల తల్లిదండ్రులకు ధనాన్ని యిచ్చి పెండ్లి చేసుకోవాలన్న మాట! ఇపుడు కన్యాశుల్కం పోయి వర దక్షిణ వచ్చింది. కాలానుగతంగా ధర్మాలు మారుతుంటాయి. స్త్రీల పుట్టింటి కానుకలు కూడా ఎవరూ ముట్టరాదని శాస్త్రం.

"కాలాయ తస్మైనమః"

### 816. మాతాపితృకర్మలు తప్పనిసరిగా చేయాలా?

**జ.**"మాతృదేవో భవ! పితృదేవోభవ! ఆచార్య దేవోభవ! అతిథిదేవో భవ!" అని చెబుతున్నది ఆర్యవాణి

జన్మనిచ్చి, పోషించి, పెంచి, తప్పటడుగులు దగ్గరనుండి తప్పు అడుగుల వరకు సరిదిద్ది, పెద్దజేసి, విద్యాబుద్ధులు నేర్పించి, మనల్ని మనుషులుగా సమాజంలో నిలబెట్టిన తల్లిదండ్రులు మరణించిన తరువాత శ్రాద్ధ కర్మలు తప్పనిసరిగా చేయాలా అంటే ఏం చెప్పాలి?



బ్రాహ్మణ క్షత్రియ వైశ్య వర్ణాలవారు ప్రతి సంవత్సరమూ తిథుల ప్రకారం సంవత్సరీకాలు పెడుతుంటారు. శూద్ర వర్ణం వారందరూ ఎక్కువగా సంక్రాంతికి పెద్దలను స్మరించుకొని బట్టలు పెడుతుంటారు. పెద్దల పేరు మీద దాన ధర్మాలు చేస్తుంటారు. ఇది మన సంప్రదాయం. సంక్రాంతికే పెద్దలను స్మరించుకొని పూజించుకోవట మెందుకంటే, సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించేది పుష్య మాసంలో కాబట్టి! ఉత్తరాయణ పుణ్య కాలం కూడా ఇపుడే ప్రారంభమౌతుంది గనుక ఇపుడే స్వర్గద్వారాలు తెరుస్తారనీ, ఈ పుణ్యకాలంలో మరణించినవారికి స్వర్గప్రాప్తి కల్గుతుందని, హిందువుల విశ్వాసం. స్వర్గ ద్వారాలు తెరిచే సమయంలోనే సంక్రాంతి వస్తుంది. కాబట్టి భోగినాడు పితృదేవతలను పూజించే సంప్రదాయం వచ్చింది. అసలు పుత్రుడు అంటే అర్థం ఏమిటో తెలుసా! "పున్నామ నరకాత్ త్రాయతే ఇతి పుత్రః" పున్నామనరకం

నుండి రక్షించువాడు పుత్రుడు అని అర్థం. పున్నామ నరకం నుండి రక్షింప బడితేనే స్వర్గం లభిస్తుంది. చాలామంది కొడుకు కావాలని ఎందుకు కోరుకొంటారో తెల్సా! ఆడపిల్ల అయితే పెండ్లికాగానే ఇల్లు విడిచి పరాయి చోటికి వెళ్ళిపోతుంది, కొడుకు అయితే మనదగ్గర వుంటాడు. ముసలి తనంలో ఆదరిస్తాడు, మన వంశం పేరు (ఇంటి పేరు) నిలుపుతాడు. చచ్చిన తరువాత కర్మకాండల పుణ్యకార్యం చేస్తాడు. అని ఆశపడతా రందరూ.

''తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు పుట్టనేమి వాడు గిట్టనేమి'' అన్నాడు వేమన. మనకు జన్మనిచ్చిన వారిని సంవత్సరానికొకసారైన తలచుకోవటం కొడుకుల బాధ్యత కాదా! అలా తలచుకోవటం పుణ్యప్రదం కాదా!

## 817. కర్మసిద్ధాంతం అంటే ఏమిటి?

***జ.*** శ్లో॥ కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన।
మాకర్మ ఫల హేతుర్భూ, మాతే సంగోస్త కర్మణి॥ భగవద్గీతా

"నీకు కర్మాధికారమేగాని ఫలితాధికారం లేదు. కర్మఫలానికి నీవే కారణమని భావించరాదు. కర్మను విడచిపెట్టే మనస్సు నీకు రాకుడదు." అన్నాడు గీతాచార్యుడు. కర్మ అంటే కర్తవ్యం. కర్తవ్యపరునికి జయాపజయాల విశ్లేషణ హితాహితాల వివరణ వుండకూడదు. కర్తవ్య నిర్వహణ ఒక్కటే అతని గురిగా వుండాలి. కర్మ



సిద్ధాంతం అంటే కర్తవ్య సిద్ధాంతం. పునర్జన్మ-కర్మ ఈ రెండు సిద్ధాంతాలతో హిందూ మతం పుట్టింది. కర్మసిద్ధాంతంతోనే వర్ణాశ్రమ ధర్మం వచ్చింది. సామాన్యులకు గాని, గృహస్థులకుగాని ప్రతిఫలాపేక్ష విడచి కర్మాచరణ చేయటం కుదరదు. ఎలాగంటే, పాలకోసం పశువుల్ని, పండ్లకోసం చెట్లను పెంచుతాం. ప్రతిఫల మాశించకుండా కర్మాచరణ చేయటం మహాత్ములకే సాధ్యం కాని మామూలు మనుషులకు అసాధ్యం. కురుపితామహుడైన భీష్ముడు కర్మ సిద్ధాంత పరాయణుడై కురుక్షేత్రానికి వచ్చాడు. తప్పుని తెలిసీ దుర్యోధనుని పక్షాన నిలబడ్డాడు. అవక్రవిక్రమంతో పది రోజులు యుద్ధంచేశాడు. మహా పండితుడైన భీష్ముడు కౌరవ పక్షాన నిలబడటానికి కారణం కర్మసిద్ధాంతమే. కర్మసిద్ధాంతం అనుభవంలోకి రావాలంటే వయోపరిణతి వుండాలి. ఒడిదుడుకుల్ని చూడాలి. కష్టనష్టాలలో క్రుంగాలి. ఎత్తుపల్లాలు నడవాలి.

"ధారణాత్ ధర్మః ఇత్యాహుః ధర్మో ధారయతి ప్రజాః" సంస్కృతంలో "ధృ" ధాతువుకి ధరించుట / పోషించుట అనే రెండు అర్థాలున్నాయి. మనిషి యొక్క సర్వతోముఖాభివృద్ధికీ, మరియు అత్యోన్నతికి ఏది సాధనమో అదియే "ధర్మం" "ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్టా"– తైత్తిరీయోపనిషత్తు. ధర్మేసర్వం ప్రతిష్ఠితమ్" – నారాయణోపనిషత్తు. కర్మాచార పరాయణునికి జయాపజయాల భయం వుండదు.

## 818. 'కుంకుమ'ను ఎందుకు ధరించాలి?

**జ.** కుంకుమ ధరించటం అనేది కేవలం స్త్రీలకు మాత్రమే సంబంధించినది కాదు. స్త్రీ పురుషులిద్దరికీ సంబంధించినది.



కుంకుమ పెట్టుకోవటం హిందూ సంప్రదాయం! అన్ని కులాల హిందువులు, శైవ వైష్ణవ మతస్థులు అందరూ నొసటన కుంకుమ ధరించటం గొప్పదనంగా భావిస్తారు. కుంకుమ ఆస్తికత చిహ్నం! ఐదారు వందల సంవత్సరాల క్రితం వరకూ హిందూ మతస్థు లందరూ తప్పనిసరిగా కుంకుమను నొసట దిద్దుకొనే ఆచారం బలీయంగా వుండేది. ఆచారంగా మాత్రమే కాకుండా అలంకారంగా కూడా వుండేది. హరిచందనాన్ని, మంచి గంధాన్ని, విభూతిని గూడా నొసట ధరించటం హిందూ సంప్రదాయంగా పాటిస్తూ వచ్చారు పూర్వీకులు.

రెండు కనుబొమ్మలకు మధ్య భాగంలో నుదుటివద్ద 'ఇడ' 'పింగళ' నాడులు కలిసి 'సుషుమ్న' నాడిగా పరివర్తన చెందే స్థలం వద్ద కుంకుమను దిద్దుకొంటాం. ఈ కుంకుమవల్ల మనిషికి దృష్టిదోషం తగులకుండా వుంటుందని కూడా ఒక నమ్మకం వుంది. మరొకటేమిటంటే కుంకుమ ధరించే వ్యక్తికి ఎదుటివారు మానసికంగా లొంగిపోతారన్న (సైకాలజీ) వాదన కూడా వుంది. ఎర్రని ఎరుపురంగు మనిషికి మనోశక్తిని, త్యాగతత్వాన్నీ, నిర్భయత్వాన్నీ, పరోపకార గుణాన్నీ కల్గిస్తాయన్న 'థియరీ' కూడా వుంది. కుంకుమ ధరించటం పవిత్రతకు, ఆస్తికత్వానికి ధార్మికత్వానికి పురుషులకు సంకేతమైతే, స్త్రీలకు ఐదవ తనానికీ, సౌభాగ్యానికీ, స్థిరబుద్ధికీ సంకేతంగా చెప్పవచ్చు. మానవుడు నాగరికత నేర్చిన దగ్గర నుండీ కుంకుమను ముఖ్య అలంకారంగా కూడా భావించినట్లు కొన్ని గ్రంథాలలో వుంది.

భర్తను కోల్పోయిన స్త్రీలు పరులెవ్వరికీ అందంగా తాము కన్పించకూడదు అన్న వుద్దేశ్యంతోనే కుంకుమ ధారణను త్యజిస్తారు. కుంకుమ భారతీయతకు చెరుగని

ముద్ర, పాశ్చాత్య నాగరికత మనమీదకు దాడిచేసిన తరువాత పురుషులందరూ కుంకుమధారణ మరచిపోయారు. ఇంకొంత కాలానికి స్త్రీలు కూడా మరిచి పోవచ్చు నేమో! దేవుళ్ళు మాత్రమే మిగుల్చు కుంటా రేమో! ఎవరికి తెల్సు? కాలం తెచ్చే మార్పులు వింత వింతగా వుంటాయి.

## 818. 'బ్రాహ్మణుడు' అంటే ఎవరు?

***జ.*** 'బ్రహ్మ జ్ఞానవాంస్తు బ్రాహ్మణః' అని బ్రాహ్మణునికి నిర్వచనం చెప్పారు సనాతనులైన పూర్వీకులు.

ఆ॥ పాపవర్తనుండు బ్రాహ్మణుం డయ్యును
నిజము శూద్రుకంటె నీచతముడు
సత్య శౌచధర్మశాలి శూద్రుండయ్యు
నతడు సద్ద్విజుండ యనిరి మునులు
–శ్రీమహాభారతం



సీ॥ ఎవ్వడు సత్యంబు నెప్పుడు బల్కు,
హింసావిదూరుడు గురుజన హితార్థి
యింద్రియంబులనోర్చి ఎల్లవారల
దనయట్ల జూచు ధర్మ భిరతుడు
కామంబు తగులందు కర్మంబు
లారును, సముచిత సంప్రయోజతనొనర్చు
అట్టి పుణ్యాత్ముని అనఘు బ్రాహ్మణుడని
యనిశంబు గీర్తింతుర మరవర్యు

ఆ॥లార్జవంబు శమము నధ్యయనంబును
పరమధనముసువ్వె బ్రాహ్మణునకు
ధర్మగతికి నవియు తగు సాధనంబులు
వేదవిహితముఖ్య విధులు నెనయె
–శ్రీమహాభారతం – అరణ్యపర్వం

శ్లో॥ జన్మనా బ్రాహ్మణోజ్ఞేయః సంస్కారైః ద్విజుచ్చతే।
విద్వత్వాచ్చాపి విప్రత్వం త్రిభిశ్శ్రోత్రియ ఉచ్యతే॥ 'ధర్మశాస్త్రం'

"చాతుర్వర్ణం మాయసృష్టం గుణభేద విభాగశః" 'భగవద్గీతా"


శూద్రునకు జన్మించినవాడు శూద్రుడు కాగలడుగాని బ్రాహ్మణునికి జన్మించి నంత మాత్రాన బ్రాహ్మణుడు కాలేదు అంటున్నది ధర్మశాస్త్రం. వేదమూ, పురాణాలు, శ్రుతులు, స్మృతులు కూడా ఇదే మాట చెబుతున్నాయి.

బ్రాహ్మణుని "ద్విజుడు" అనికూడా అంటారు. ద్విజుడు అంటే రెండు సారులు జన్మించినవాడు అని అర్థం. మొదటి జన్మ తల్లి గర్భం నుండి జరిగితే రెండవ జన్మ సంస్కారంవల్ల జరుగుతుంది. జన్మవల్ల శూద్రత్వం లభిస్తే, కర్మవల్ల బ్రాహ్మణత్వం లభిస్తుంది.

బ్రాహ్మణుడుగా పుట్టటం గొప్పకాదు బ్రాహ్మణుడుగా జీవించటం గొప్ప।

సర్వశాస్త్రాలు, సమస్త హైందవ ధర్మమూ ఈ విషయాన్ని నొక్కి చెప్పాయి.

సమస్త బ్రాహ్మణకులానికి గాయత్రీ మంత్రాన్ని రచించి చెప్పిన శ్రీ విశ్వామిత్ర మహర్షి బ్రాహ్మణ కులంలో జన్మించలేదు.



సనాతన బ్రాహ్మణ కులమంతా నమస్కరించి గౌరవించే శ్రీరాముడు బ్రాహ్మణ కులంలో జన్మించినవాడు కాదు! శ్రీకృష్ణుడు కూడా బ్రాహ్మణ కులస్థుడు కాదు. మత్స్య – కూర్మ– వరాహ– నారసింహాది అవతారాలేవి బ్రాహ్మణత్వం కాదు. వేదాలలో ఎక్కడా కుల ప్రసక్తి లేదు. జనహితం జనసుఖం బ్రాహ్మణుని లక్ష్యం. బ్రాహ్మణుడు సౌందర్యాభిలాషి కాకూడదు. ఎక్కువసార్లు అద్దంలో తన ప్రతిబింబాన్ని చూచుకోకూడదు. ప్రతినిత్యం క్షురకర్మ చేయించుకొనకూడదు. బహు భార్యాత్వాన్ని కలిగి వుండరాదు. సుఖాభిలాష వుండకూడదు. పాదరక్షలు ధరించకూడదు. మద్యపానం చేయకూడదు. మాంసాహారం ముట్టకూడదు. విదేశప్రయాణం చేయకూడదు. ఇతర దేశ ఆహార పదార్థాలు భుజించకూడదు. ఇతర సంస్కృతిని, అన్యదేశ వస్తువులను ముట్టకూడదు. అశ్లీల శబ్దాలను వుపయోగించకూడదు. ఏ పరిస్థితిలోనూ కోపాన్ని ఆశ్రయించకూడదు. అబద్ధం చెప్పకూడదు. ధనాన్ని, సుఖాలనూ అభిలషించకూడదు. స్త్రీల వంక నిశితంగా చూడకూడదు. విదేశ ఆహారాలనూ, వస్తువులనూ, కాఫీ వంటి విదేశ పానీయాలను ముట్టకూడదు. తాను అభ్యసించిన వేదవిద్యను ధనాశకు వినియోగించ కూడదు. ప్రాణులను కర్రతోగానీ, రాయితోగానీ కొట్టకూడదు. ఏ విధమైన వ్యాపారాలు చేయకూడదు. గోష్పాదం (పిలక) లేకుండా వుండకూడదు. సినిమా నాటకాలు మున్నగునవి చూడకూడదు. ఏకపత్నీ వ్రతాన్ని తప్పక పాటించాలి. సర్వజన శాంతిసుఖాలను కోరుకోవాలి. జనహితం కోసమే తన జీవితాన్ని ఖర్చుచేయాలి. మనస్సు, మాట, శరీరం, పని, లోకహితార్థమై వుండాలి. నేల మీదనే నిద్రించాలి. కోరికలను త్యజించాలి– బ్రాహ్మణునికి ఇన్ని నియమ నిబంధనలు వున్నాయి. ఈ నియమాలను పాటించిన ధర్మమూర్తినే బ్రాహ్మ ణుడు అని భావించి గౌరవించి నమస్కరించాలి.


ధార్మిక లక్షణాలున్న వారెవరైనా బ్రాహ్మణులే!

'బ్రాహ్మణ్యం' కులసంకేత పదం కాదు. గుణసంకేత పదం.

'బ్రాహ్మణాయ నమోనమః
బ్రహ్మజ్ఞానాయ నమోనమః

## 820. ఆలయ గోపురం ఎత్తుగా ఎందుకు కట్టాలి?

**జ.** దేవాలయం అంటే లక్షోపలక్షల భక్తుల పుణ్యధామం. ఆగమ శాస్త్రబద్ధంగా దేవాలయాలను నిర్మించవల్సి వుంటుంది.



ఆలయ నిర్మాణం దేవుడు పడుకున్నట్లు శయన రీతిలో నిర్మిస్తారు. ఆలయ గోపురమే భగవంతుని పాదాలు. గర్భగుడి భగవంతుని శిరస్సు. ఆలయ మంటపం భగవంతుని కడుపు. దైవదర్శనం అంటే గుడిలోకి వెళ్ళి స్వామినిచూచి గంట కొట్టి నమస్కరించాలి అనుకొంటుంటాం. ఆ పద్ధతినే పాటిస్తుంటాం. కాని దూరంగా వుండి కూడా ఆలయగోపురానికి నమస్కరించినా స్వామి పాదాలకు నమస్కరించినట్లే అవుతుంది. కాబట్టి ఆలయగోపురం ఎత్తుగా వుండాలి అంతేకాకుండా దేవాలయం ఒక వ్యక్తికీ ఒక కుటుంబానికీ సంబంధించి వుండదు. సార్వజనిక ఆస్థిగా పరిగణింపబడుతూ, పోషింపబడుతూ, రక్షింపబడుతూ, దర్శింపబడుతూ వుండాలి. దాతలెవరైనా దేవాలయానికి దానాదికాలను చేయవచ్చు. పోషకులుగా వుండవచ్చు. వేశ్యలు కూడా దేవాలయాలను కట్టించిన దాఖలాలు ఎన్నో వున్నాయి. సర్వజనావళికీ పొరుగు ఊరివారికీ, పరదేశ వాసులకూ, క్రొత్తగా వచ్చినవారికీ దేవాలయం ఎక్కడ వున్నదో సులభంగా తెలుసుకోవటానికి బాగుంటుంది. కాబట్టి ఆలయగోపురం ఎత్తుగా వుండాలి.

దేవాలయ గోపురమే కాదు, దేవాలయం కూడా ఎత్తుమీద వుండటం హితదాయకం. అందుకే ఎన్నో దేవాలయాలు కొండలు గుట్టలు చూచుకొని మరీ నిర్మిస్తారు. ఎందుకంటే, మానవుడెంతటి తెలివికలవాడైనా ప్రకృతిని జయించగల శక్తివంతుడు కాలేడు! కాలేడు! వరదబీభత్సాలు, తుఫానులు మొదలైన ప్రకృతి వైపరీత్యాలకు మనిషి భయపడి తీరవల్సిందే. అటువంటి ప్రకృతి ప్రళయసమయాలలో ప్రాణుల కాపాడగల్గిన స్థలం దేవాలయమే!

దేవుడు సర్వోన్నతుడు! ఈ సర్వోన్నత భావం దేవాలయాన్ని దర్శించిన ప్రతిసారీ, మనస్సుకీ బోధపడటానికి దేవాలయాన్నీ దేవాలయగోపురాన్నీ ఎంత వీలైతే అంత ఎత్తుగా నిర్మిస్తారు. హిందు దేవాలయాలేకాదు మసీదుకి కూడా పొడవైన స్తంభం (మినార్) నిర్మిస్తారు. చర్చికి కూడా ముందుభాగంలో ఎత్తుగా దూరానికి కన్పించే విధంగా అంతస్థు నిర్మించి గంటను కడతారు.

## 821. గురువు దేవునితో సమానమా?

**జ.** గురువు దేవునితో సమానం కాదు! గురువు దేవునికంటే ఎంతో ఎంతో గొప్పవాడు. కేవలం దేవుడు నమ్మకంతో ముడి



పడ్డవాడు. మన 'శ్రీగురువు' కనుల ముందు కనిపించే మహనీయుడు.

మనిషి తన జీవితంలో తీర్చుకోలేనిది గురువుల రుణం ఒక్కటే. అందువల్లనే 'మాతృదేవోభవ' 'పితృదేవోభవ' అన్న తరువాత 'ఆచార్యదేవోభవ' అని చెప్పి గురువు స్థానాన్ని తెలియజేసారు మన పూర్వీకులు. తల్లితండ్రి తరువాత స్థానం గురువుదే. దైవత్వాన్ని కూడా గురువు ద్వారానే దర్శించవల్సి వుంటుంది.

శో॥ అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవే నమః॥

అజ్ఞానమనే గ్రుడ్డితనానికి జ్ఞానమనే కాటుకనిచ్చి కనులు తెప్పించిన శ్రీ గురువులకు నమస్కారములు అని శ్లోకార్థం.

బ్రిటిష్ పాలకుల రాకతో గురుకులాలు గురుకుల విద్యాభ్యాసాలు పోయాయి. "మెకాలే దొర" విద్యా పద్ధతితో గురు మర్యాదలు పూర్తిగా పోయాయి. పూర్వ కాలం గురువుగారు కూర్చుంటే శిష్యులు నిలుచుని పాఠాలు వినేవారు. ఇపుడు కాలిబూట్లతో శిష్యులు కూర్చుని వుంటే గురువుగారు నిల్చుని పాఠాలు చెప్పాలి. (దీనినే 'మెకాలే' పద్ధతి అంటారు) విద్యా వ్యాపారమయిందీ నాడు.

ఎపుడైతే విద్యాబోధనకు విలువలు తగ్గి విద్యాలయాలు వ్యాపార సంస్థలుగా మార్పు చెందాయో అపుడే గురువులు గుండ్రా యిలుగా అయిపోయారు. గురువు లందరు 'మాస్టార్'లు అయ్యారు. ఇపు డింకా కొద్దిగా క్రిందకు దిగి 'సార్'లు అయ్యారు. అయ్యో! గురువా! నీకెంత దుర్గతి పట్టిందయ్యా. ఈ మార్పుకి శిష్యులే కారణంకాదు గురువులు కూడా ఎంతో కొంత కారణమవుతున్నారు. విద్యా లయాల్లో కూడా కులవివక్షను చూపిస్తు న్నారు. వ్యాపారధోరణి ప్రదర్శిస్తున్నారు. ఇపుడు విద్యాలయాలు విజ్ఞాన నిల యాలు కావు. అర్జన నిలయాలుగా మారి బ్రతుకుదెరువు మార్గాన్ని మాత్రమే బోధి స్తున్నాయి "యథాగురు తథా శిష్య" ఏది ఏమైన గురుస్థానం గురువుదే కదా! గురు వుని దేవునిగా భావించి సాగిలపడి దండాలు పెట్టకపోయినా ఏనాడైనా ఎప్పుడైనా ఎక్క డైనా ఎదురుపడితే అభిమానంగా పలక రించండి. గురువులు కోరుకొనేది ఇంతే. మనం గొప్ప వాళ్ళమయ్యామని ప్రయో జన పరుల మయ్యామని వారికి తెలియ జేసి చూడండి. హృదయపూర్వకంగా ఎంత సంతోషిస్తారో మీ కళ్ళతో మీరే చూడండి. ఏమైనా గురూపకారం మరువలేనిది కదా!

## 822. శివుని మాత్రమే లింగరూపంలో దర్శించారెందుకు?

**జ.** లయకారకుడైన శివుడు స్థిర స్వరూ పుడు. స్థితికారకుడైన విష్ణువు బహు



రూపుడు. జంబూద్వీప భరత ఖండంలో శైవమే పురాతనమన్నవాదన ఒకటి వున్నది. (1920 నాటి మొహంజొదారో, హరప్పా త్రవ్వకాల్లో కొన్ని శివలింగాలు దొరికాయి. కుడ్య చిత్రాలలో శివలింగ చిత్రాలు కనబడ్డాయి. భారతదేశానికి ఆర్యులు రాకపూర్వం, అంటే క్రీస్తుపూర్వం 3000–1750 నాటి మొహంజొదారో నాగరికతనే మనం సింధూనాగరికత అంటున్నాం. (ఈ మొహంజొదారో పట్టణం ఇపుడు పాకిస్తాన్‌లో వుంది) ఆర్యులు క్రీస్తుపూర్వం 1600 సంవత్సరాలపుడు భారత దేశానికి మధ్య ఆసియా నుండి వచ్చారని చరిత్రకారులు చెబుతున్నారు) మనం దర్శిస్తున్న శివలింగం స్త్రీ పురుషుల సృష్టిసంకేతం "లింగం" పురుష స్వరూపం– లింగం క్రిందవుండే "పానువట్టం" స్త్రీ స్వరూపం. సృష్టి స్వరూపమే శివలింగం – నామము రూపము లేనివాడు దేవుడు. దేవునికి నాలుగుచేతులు, చేతులలో ఆయుధాలు, శిరస్సున కిరీటం మెడలో దివ్యాభరణాలు వుండే దేవుని ప్రతిమను దేవాలయాల్లో, ఫోటోల్లో చూస్తుంటాం గదా! ఈ రూపాలను పామర జనం కోసం పండితులు సృష్టించిన రూపాలు. నిజమైన దేవుని చూచిన వారెవరూ లేరు. అన్నీ ఊహా కల్పితాలే! శివాలయాలలో ఎక్కడా శివుని ప్రతిమలు వుండవు. భృగమహర్షి శాపం వల్ల శివుడు లింగరూపంగా పూజింపబడుతున్నాడు. శివాలయాలు ఎక్కడున్నా శాంతి నిలయాలుగా వుంటాయి. శివుడి మడి, మైల, అగ్రజాతి, అధోజాతి అన్న తారమతమ్యాలు లేదు. ఏ శివాలయంలోనైనా శివలింగాన్ని మన చేతులతో స్పృశించి శివశక్తిని పొందవచ్చు. శివోహం అనుకోవచ్చు! ఇదే శైవాచారం.

శ్లో॥ వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే!
జగతః పితరౌవందే, పార్వతీ పరమేశ్వరౌ!!

## 823. ఇంటి పెద్ద మరణిస్తే శివాలయ నిద్ర చేయాలా?

**జ.** ఎవరికైనా ఎంతటి వారికైన మహాత్ములకైన చండాలునికైనా మరణించటం తప్పదు. ఎన్నియాగాలు చేసినా ఎంత తపస్సు చేసినా మరణాన్ని తప్పించుకొని మనగలగటం ఏ ప్రాణికి సాధ్యంకాదు. అందరూ మరణిస్తారు. అందరూ మరణించవల్సిందే. "జాతస్య హిధృవో మృత్యుః". పుట్టుక అనేది వున్న ఏదైనా గిట్టి తీరవల్సిందే. అందుకే కర్మయోగులు, తత్వజ్ఞానులు, మరణాన్ని దేహధర్మంగా భావిస్తారుగాని దుఃఖించరు. మనిషి గొప్పతనం మనిషి ప్రణాళికాతత్వం, మనిషి

ధర్మ బద్ధ జీవితం, మనిషి చేసిన పుణ్యం, మనిషి మరణదినాలలోనే తెలుస్తుంది అంటారు పెద్దలు. కుటుంబ సభ్యుల ఆత్మీయతల మధ్య బంధువుల ఆదరాల మధ్య ఇహలోక యాత్రను ముగించుకొన్నవాడే ధన్యజీవుడు. పుణ్యమూర్తి.

ఇంటి పెద్ద ఇహయాత్ర ముగిస్తే కొన్ని రోజుల వరకూ ఇంటివారందరూ కకావికస్థితిని అనుభవించాల్సిందే. మంత్రాంగం నడిపించిన మనిషి దూరలోకాలకు వెళ్ళిపోతే సంసార సారధ్యం అయోమయమే గదా! రాజులేని రాజ్యంలో సైనికులే అధికారాలు ప్రదర్శిస్తారు. రాచరికాలు వెలగబెట్ట జూస్తారు. కుక్కల్లా కొట్లాడు కొంటారు. ఇంటి పరువును వీధికి లాగుతారు. మమతలను బాధ్యతలను ముక్కలుగా కోసి వాటాలు పంచుకోచూస్తారు. ఇటువంటి స్థితిలో, మనశ్శాంతి మరుగైపోయి మనసు చలించిపోతుంది. పోయిన వారితో మనము పోదామనిపిస్తుంది. అభద్రతాభావం హృదయాన్ని కుదించి వేస్తుంది. ఈ సమయంలో మనశ్శాంతి కోసం ఆత్మశక్తి



కోసం శివాలయంలో ఒక్కరోజైనా వుండి వస్తే ధైర్యం లభిస్తుందని, పరిస్థితులన్నీ చక్కబడి ప్రశాంతత దొరుకుతుందని పండితులు చెబుతారు.

శివాలయంలో దేవుని దగ్గర కూర్చుని ఆలోచించుకొంటే దేనికైనా దేవుడున్నాడులే అనే ధైర్యం వస్తుందని ఈ సంప్రదాయం శాసించారేమో! మనిషికి మన వెనుక ఒకరున్నారు అన్న నమ్మకం ఎంతో శక్తినిస్తుంది. "ఉన్నది పుష్టి మానవులకు ఓ యదు భూషణ! ఆలజాతికిన్ తిన్నది పుష్టి" మనిషికి వుంటే శక్తి పశువుకి తింటే శక్తి అంటారు. సంవత్సరానికొకసారి ఇంటిని భద్రపరుచుకొని ఒక్కరోజు శివాలయంలో నిద్రించటం ఎవరికైనా మంచిదే. ఒంటరిగా కాకుండా నలుగురైదు గురు కల్సి నిద్రచేయటం శుభదాయకమే!

## 824. మంత్రాలు సంస్కృత భాషలో ఎందుకు?

**జ.** వేదాలు 'అపౌరుషేయాలు' అంటారు. అపౌరుషేయాలు అంటే ఏ పురుషుడూ వ్రాయనివి అని అర్థం. వేదాలను సంస్కృతంలో ఎందుకు వ్రాశారు! అంటే వేదాలు పుట్టినపుడు తెలుగుభాష పుట్టలేదు. అంతెందుకు వేయి సంవత్సరాలక్రితం అంటే పదకొండవ శతాబ్దం వరకు తెలుగు భాషకు వ్యాకరణమే పుట్టలేదు.

వేయి సంవత్సరాలక్రితం ఆంధ్ర ప్రదేశంలో ప్రాకృత భాష మాట్లాడేవారు. ఆంధ్రులు నాగజాతివారనే వాదం కూడా ఒకటుంది. కర్ణాటక దేశంవాడైన నన్నయ

భట్టు మొట్టమొదటగా "ఆంధ్ర శబ్దాను శాసనమ్" అనే వ్యాకరణం వ్రాసేవరకు తెలుగు భాషకు ఒక రూపం లేదు. అలాంటపుడు మంత్రాలు తెలుగులో ఎలా వుంటాయి? లక్షోప లక్షల సంవత్సరాల చరిత్ర మన వేదాలది! తెలుగులో వుండటానికెలా సాధ్యం! వేదానికి ఒక నాదం వుంది. వేదానికి ఒక స్వరం వుంది. వేదానికి ఒక ఛందస్సు వుంది. స్వరయుక్తంగా వేదం చదువుతూ వుంటే ఎంత మధురంగా వుంటుంది! ఎంత హాయిగా వుంటుంది!! ఎంతటి అనిర్వచనీయమైన ఆనందం కల్గుతుంది!

పవిత్ర ఖురానుగ్రంథం అరబ్బిక్ భాషలో వుంది. ఆ భాషను ముస్లిం మతస్థులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. బౌద్ధ మతం పాళీభాషలో వుంది. బౌద్ధులు పాళీ భాషను దైవసమానంగా చూస్తారు. క్రైస్తవ మత బోధకులు మనదేశంలో బోధనలు చేసినా ఇంగ్లీషు భాషలోనే బోధనలు చేస్తారు. ఏ మతంవారు ఆ మతభాషను గౌరవిస్తారు. ప్రేమిస్తారు. పూజిస్తారు. మనం తప్ప! కొంతమంది స్వప్రయోజకులు, మంత్రాలనే జీవనాధారంగా చేసుకొని, ఆచరణలు మాత్రమే మిగుల్చుకొన్న మూర్ఖులు, అగ్రవర్ణమని చెప్పుకొనే ఛాందసులు, వేదాలకూ, వేదమంత్రాలకూ తీరని ఆరని అపచారం అపకారం చేశారు! చేస్తున్నారు! వేదాలు ఎవరికీ తెలియకుండా చేశారు. ఎవరూ చదవకుండా చేశారు. వేదం అంటే పెళ్ళిళ్ళకూ, శ్రాద్ధాలకూ, పూజలకూ చదివే శ్లోకాలు కాదు. మానవునికి దిశానిర్దేశం చేసేది వేదం! వేదం ఒక కులానికి, ఒక మతానికి, ఒక భాషకు చెందినవి కాదు. శూద్రులు వేదం చదవకూడదని ఏ వేదమూ చెప్పలేదు. బ్రాహ్మణులు ఈ విషయంలో మానవాళికి అన్యాయమే చేశారు.

## 825. తల విరబోసుకొని తిరుగకూడదా?

**జ.** తల విరబోసుకోవల్సిన పరిస్థితులు కొన్ని వున్నాయి. వెంట్రుకలు విరబోసుకొని భార్య భర్తకు కనిపించకూడదని శాస్త్రం. అలా కన్పించటం రాబోయే ఆపదలకు సూచనగా భావించాలని స్మృతుల వాక్యం. నానాటికీ కాలం మారుతోంది గాబట్టి యిటువంటి నమ్మకాలు కూడా తుప్పు పట్టిపోతున్నాయి. గత సంవత్సరానికీ ఈ సంవత్సరానికీ ఎన్నో మార్పులు కనబడుతున్నాయి గమనించారా! అందరి జీవితాలు సినిమా మాధ్యమం అయిపోతున్నాయి. ఇప్పటి విపరీత పోకడలను

విచిత్ర విన్యాసాలకు చిత్రరంగమే దోషిగా వుంటున్నది. వెంకటేశ్వర సుప్రభాతం తోనూ, నమశ్శివాయ మంత్రంతోనూ అర్ధ నగ్న దుస్తులతో ప్రేమపాటలు పాడు తుంటే ఎవరైనా నోరెత్తి అడిగిన వారు న్నారా? ఇతర మతస్థులైతే మనలా మౌనంగా వుండేవారా?! 'మేధావులు, బుద్ధిజీవులు చచ్చిపోయిన దేశం మనది". ఈ దేశంలో హిందుమతం మైనారిటీ మతం! నోటిలో హిందుత్వం, గుండెల్లో మందత్వం, కళ్ళలో అంధత్వం. ఏం చేద్దాం హిందుత్వం అనాధ అయింది.



గంధర్వ కాంతలకు తల విరబోసు కోవటం విరహ సంకేతం. మానవ కాంత లకు తల విరబోసుకోవటం శోక సంకేతం. స్త్రీ అయినా పురుషుడైనా తల విరబోసు కొని తిరగటం మంచిది కాదు.

## 826. మరణం ప్రాణులకు ఆవశ్యకమా?

**జ.** శ్లో॥ జాత స్యహి ధృవోమృత్యుః ధ్రువంజన్మ మృతస్య చ।

తస్మాదపరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి ॥ - భగవద్గీత -2-27

జన్మించిన ప్రతి ప్రాణికి మృత్యువు తప్పదు. ఇదే విధంగా మరణించిన ప్రతి జీవికి పుట్టుక కూడా తప్పదు. నిత్య సత్య మైన, నిస్సంశయమైన ఈ విధి విధానం గూర్చి దుఃఖించతగదు అంటున్నది భగవద్గీత. దుఃఖబద్ధమైన జీవితానికి మరణమే విముక్తి! మరణం లేకపోతే మానవజీవితం ఎంత దుర్భరం!!! బాల్యం తెలియకుండా గడిచిపోతుంది. యవ్వనం సుఖభోగాలతో నడచిపోతుంది. కౌమారం బాధలున్నా బాధ్యతలతో గడిచిపోతుంది. మనిషికి చివరిదశయైన వార్ధక్యం అతి భయంకరమైనది. దేహం శక్తిని కోల్పోయి వుంటుంది. కనులు దృష్టిని తగ్గించు కొంటాయి. మేధస్సు బలహీనమై జ్ఞాపక శక్తి నశిస్తుంది. జీర్ణశక్తి వుండదు. తర భేదం (జనరేషన్ గ్యాప్) వలన యువశక్తి యుక్తులముందు వార్ధక్యం చిన్న బోతుంది. ఎవరూ పట్టించుకోరు. మాటకు మన్నన వుండదు. అప్పటి వరకూ సర్వాధికారిగా వెలిగిన మనిషి నిరుపయోగిగా నిలిచి పోవల్సి వస్తుంది. దైన్యం ఆవరించి దుఃఖం కలచి వేస్తుంది. అశక్తుడైన మనిషి మర ణాన్ని శరణువేడతాడు. జీవితం వద్దు అని పిస్తుంది. బ్రతుకు బాధ అనిపిస్తుంది. మృత్యుదేవత కోసం ఎదురుతెన్నులు చూచే పరమ యాతనా స్థితి అది! నరా లకు బిగువు సడలిపోయి మల మూత్ర విసర్జన తెలియకుండానే జరిగిపోతుంది.




అప్పటివరకూ అందరి పొగడ్తలకూ, ఆదరాభిమానాలకూ పాత్రమైన అదే మనిషి ఛీత్కారాలకూ చీదరింపులకూ తల వంచవల్సిన దుస్థితి దాపురిస్తుంది. మరణం జన్మధర్మం. మరణం మనిషికి మిత్రుడు. జీవితమే శత్రువు. అసతో మా సద్గమయ! తమసోమా జ్యోతిర్గమయ! మృత్యోర్మా అమృతంగమయ!

## 827. కలలు ఎందుకొస్తాయి? కలలు నిజమౌతాయా?

**జ.** మనిషి మనోభావాలకు సక్రమ, అక్రమ రూపాలే కలలు! ఊహాలోకాలలో జీవించేవారికీ, అతిగా ఆలోచించేవారికీ, సమస్యలతో వున్నవారికీ, అతి కాముకులకీ కలలు ఎక్కువగా వస్తాయంటారు మనోశాస్త్రజ్ఞులు. మనిషి నిద్రపోతున్నపుడు కూడా హృదయ వ్యవస్థ తన పనిని తాను చేస్తూనే వుంటుంది. నిద్రలో తనకు తెలియకుండానే నిద్రాభంగిమలు మార్చుకొంటూ రక్తప్రసరణకు అవకాశం కల్పిస్తుంటాడు మనిషి. అంతర్గతంగా మనిషిలో వుండే ఆరవ పరిజ్ఞానం (సిక్త్ సెన్స్) మనిషిని కాపాడుతూ వుంటుంది. తెల్లవారు ఝామున నాలుగు గంటలకు నిద్రలేవాలి అనుకొంటూ నిద్రబోతే సరిగ్గా నాలుగు గంటలకే మెలుకువ వస్తుంది. ఇదే ఆరవ పరిజ్ఞానం పని. కొన్ని కలలకు అర్థమే వుండదు. కొన్ని కలలు అసలు జ్ఞాపకమే వుండవు. కొన్ని కలలు చెప్పుకోవటానికే సిగ్గుగా వుంటాయి. కొన్ని ఆలోచించటానికే నీచంగా వుంటాయి. ఇటువంటి కలలన్నీ యదార్థమైపోతే మనిషి మనుగడ ప్రశ్నార్థకంగా తయారవుతుంది. కలలు ఎప్పుడూ నిజం కావు. ఒక్కొక్కసారి యాదృచ్ఛికంగా కలలో వచ్చినట్లు జరుగవచ్చు. కలలను తలచుకొని భయపడటం తప్పు.

కలలో ఒక్కొక్కసారి మనం చనిపోయినట్లు, లేదా మనం హత్య చేసి పోలీసులకు దొరికిపోయినట్లు, మనల్ని ఎవరో దుర్మార్గులు వెంటాడుతున్నట్లు, మన మీద ఏదో మహానేరం మోపబడినట్లు, మహాసముద్రంలో పడి మునిగిపోతున్నట్లు, భయంకర విషసర్పాలు నోరు తెరుచుకొని మనల్ని వెంబడిస్తున్నట్లు, కొండలమీద నుండి భయంకరమైన లోయలోనికి పడుతున్నట్లు ఎన్నెన్నో కలలు వస్తుంటాయి. నిద్రాభంగం జరుగుతుంది. నోరు ఎండిపోతుంది. భయంతో మనసులో దేవుణ్ని తలచుకొంటూ, ఆంజనేయదండకం చదువుకొంటూ నిద్రబోతుంటాం. ఇది అందరికీ మామూలు అనుభవమే.

ఎక్కువగా కలలు వచ్చేవారు ఒంటరిగా మంచం మీద నిద్రించకూడదు. తోడుగా మరొకరిని ప్రక్కన పరుండ బెట్టుకొంటే కలలురావు. ఒంటరితనంలోనూ, అభద్రతా భావనలోనూ మనస్సు కీడును శంకిస్తుంది. ఎక్కువగా ఒంటరితనం అనుభవించేవారు హాయిగా నిద్రపోలేరు.



మరొక రహస్య విషయం ఏమంటే సెక్స్ సుఖాలు ఎక్కువగా అనుభవించేవారికి కలలు రావంటారు మనోవిశ్లేషకులు.

## 828. లక్ష్మీదేవి కమలంలో వుండి ప్రక్కనే ఏనుగులు వుంటాయేంటి?

శ్లో॥ పద్మాసనే పద్మహస్తే సర్వలోకైక వందితే
నారాయణ ప్రియేదేవి విష్ణువక్ష స్థలాలయే
క్షీరసాగర సంభూతే కమలే కమల ప్రియే
పాహిమాం కృపయాదేవి సర్వ సంపత్ప్రదాయనీ!!

దేవదానవులు క్షీరసాగరాన్ని మథించినపుడు జన్మించి విష్ణువును వరించిందామే! సర్వలక్షణ సంపన్నురాలైన ఈ సుందరవతికి "లక్ష్మి"అని నామకరణం చేశారు. సమస్త సంపదలకు అధిదేవతగా



చేశారు! దేవతలందరూ! లక్ష్మీదేవి చిత్రపటాన్ని చూచారు గదా!

పాలనురుగు వంటి దేహఛాయ, త్రిలోకైకసౌందర్యం, ఈమెకు స్వంతం! చిరునవ్వు నిండిన ముఖంతో, సర్వాలంకార భూషితయై, గజరాజులు తోడుగా నాలుగుచేతులతో, కమలాసనంపై కూర్చొని వుంటుంది. చేతులలో ఏ ఆయుధాలు వుండవు. కలువపూలను మాత్రమే చేతధరించి వుంటుంది! ఈ ధనాధిదేవత!

దేవతలకు నాలుగుచేతులు ఎనిమిది చేతులు వుండటం మనం శిల్పాలలో ఫోటోలలో చూస్తుంటాం. అంటే అంతటి శక్తివుంది అని అర్థం! లక్ష్మికి సరస్వతికి నాలుగు చేతులు వుంటే పార్వతి (శక్తి)కి ఎనిమిది చేతులు వుంటాయి. డబ్బు కన్నా, విద్యకన్నా, భుజబలం చాలా గొప్పదని అర్థం. ధనలక్ష్మికి స్థిరత్వంలేదు. ఒకరి దగ్గర ఒకచోట స్థిరంగా వుండదు. లక్ష్మి చంచల మనస్సుగలది. స్థిరమైన జీవితం కూడా లేదు. అయితే వున్న నాలుగురోజులు ఉయ్యాల లూగిస్తుంది. అందరినీ అన్నిటినీ దాసోహమనిపిస్తుంది. తనశక్తి ఏమిటో ఎంతటిదో చూపిస్తుంది. అందుకే డబ్బుకు లోకం దాసోహం అంటారు. "ధనం మూలం మిదం జగత్"

అంటారు. లక్ష్మికి నాలుగు చేతులుండే కారణం యిదే! తన చంచలత్వాన్ని అందరికీ తెలియపర్చటానికే. శ్రీమహాలక్ష్మి నీటి కొలనులో వున్నంతసేపే నిగనిగ లాడుతుంది. నీటి నుండి బయటకు తీయగానే వాడివత్తలైపోతుంది. డబ్బు కూడా పెట్టెలో భద్రంగా వుంటేనే మనిషికి శక్తి వుంటుంది. బయటకు తీసి ఖర్చు పెట్టేస్తే మనిషికి శక్తి సన్నగిల్లుతుంది. అన్ని విధాలుగా మనిషి క్రుంగిపోతాడు.

## 829. ఒకే గోత్రీకుల మధ్య వివాహాలు ఎందుకు చేయరాదు?

శ్లో॥ సప్తమాతృచం మాద్ధీమాన్ యః కన్యాముద్వహేన్నరః!
గురుతల్పీన విజ్ఞేయః సగోత్రాన్ చైవ ముద్వహన్!! – ధర్మసింధు



తండ్రి తరుఫున ఏడుతరాలలోగాని, తల్లితరుఫున ఐదు తరాలలోగాని సగోత్రి కులైన వారిని వివాహం చేసికొనరాదు. అట్లు చేసికొన్నచో తల్లిని (గురుపత్నిని) వివాహం చేసికొన్నంత పాపం సంభవిస్తుంది.

సనాతన సంప్రదాయంలో యజ్ఞ యాగాలు మొదలైన వైదికకర్మలకు, వివాహాది శుభకార్యాలకు, శ్రాద్ధాది పితృ కర్మలకు తప్పనిసరిగా గోత్రం, ప్రవర తప్పనిసరిగా తెలియపర్చవల్సి వుంటుంది. మనందరి గోత్రాలకు ఎనిమిది మంది మహర్షులు మూలపురుషులుగా వున్నారు. అగస్త్యమహర్షి – భరద్వాజ మహర్షి – గౌతమమహర్షి– వశిష్టమహర్షి– కశ్యప మహర్షి– కౌండిన్య మహర్షి – అత్రి మహర్షి– జమదగ్నిమహర్షి. ఈ ఎనిమిది మంది మహర్షులు మనకు గోత్రపురుషులు.

ఏ గోత్రం వారు ఆ గోత్రంవారికి రక్త సంబంధీకులు అవుతారు. ఈ ఎనిమిది మంది గోత్ర పురుషులకు కలిపి నలభై తొమ్మిది మంది ప్రవర పురుషులున్నారు. సంతానోత్పత్తి క్రియకు (దాంపత్యానికి) ఒకే గోత్రికులు అయి వుండరాదు. ఒకే ప్రవరవున్నవారు కూడా దాంపత్య బంధానికి పనికిరారు (వివాహం కుదరదు)

వధూవరులు ఒకే గోత్రం కలవారైన, ఒకే 'ప్రవర' వారైనా అన్నా చెల్లెళ్ళవుతారు. ఒకే గోత్రీకులకు బిడ్డలుపుడితే పరమ దుర్మార్గు లవుతారు. సగోత్రికులు వివాహ బంధం కంటే వర్ణాంతర వివాహమే మేలైనది. సగోత్రికులు, సప్రవరీకుల మధ్య మాత్రమే కాకుండా మేనత్తకూతురిని, అన్నగారి మరదలిని (వదిన చెల్లెలిని)

మేనమామ కూతుర్ని కూడా వివాహం చేసుకోకూడదని ధర్మశాస్త్రం చెబుతోంది. తండ్రి తరఫు రక్తసంబంధీకులు ఏడు తరాలవారు, తల్లితరుపున రక్తబంధువులు ఐదు తరాలవారు కాకుండా వున్న కన్యను పెండ్లిచేసుకోవాలని అన్ని శాస్త్రాలు చెబు తున్నాయి. అక్కకూతురిని పెండ్లిచేసు కోవటం కూడా ధర్మాచారం కాదు

"పైతృష్వసేయీం భగినీం, స్వస్త్రీ యాం
మాతురేవచ, ఏతాస్తి ప్రస్తుభార్యేర్ధే,
నో పయచ్ఛేత బుద్ధిమాన్"

అనగా తండ్రిగారి చెల్లెలి బిడ్డను (మేనత్త కూతురు) తల్లిగారి చెల్లెలి బిడ్డను (పినతల్లి కూతురు) వివాహమాడరాదు. కుండ మార్పిడి వివాహాలు కాని, ఒకే పందిరిలో రెండు పెళ్ళిళ్ళు గాని నిషిద్ధం.

## 830. రావణుడు మహాపండితుడా?

**జ.** దేవతలు రాక్షసులు అన్నదమ్ములు

కశ్యపప్రజాపతికి అదితీదేవి వల్ల దేవ తలు, దితీదేవివల్ల రాక్షసులు పుట్టారు. దేవదానవులిద్దరూ కశ్యప బ్రహ్మ కుమా రులే!పరమేష్ఠి పుత్రుడైన పులస్త్య బ్రహ్మ వంశంవాడే లంకాధిపతి రావణబ్రహ్మ!

రావణుడు తల్లి కైకశీ ఆదేశంతో బ్రహ్మను గూర్చి ఘోరతపస్సు చేసి యక్ష–కిన్నర–కింపురుష –దేవ –దానవ– సిద –సాధ్య –గరుడ– గంధర్వ– నాగ– నభశ్చ రాది గణాలెవ్వరిచేత మరణం లేకుండు నట్లుగా వరంపొంది, 'రావణుడు' అనే శివుని ప్రశంసను పొందాడు. ఆనాటి నుండీ

Artist

"రావణబ్రహ్మ"గా స్థిరనామం వచ్చింది. "రావణుడు" అంటే మహా పట్టుదల గల వాడని అర్ధం. ఈయన మహా పండితుడు! ద్రావిడ సామ్రాజ్యాధినేత! అనుపమాన శివభక్తుడు! నవవ్యాకరణాలైన కావ్య – వ్యాకరణ– రాజనీతి– దండనీతి– అర్థ శాస్త్ర–గణిత–ఆయుర్వేద–శిల్ప– గాంధర్వ శాస్త్రాలలో పండితుడు! అతల వితల సుతల రసాతలాది పైలోకాలకు, భూలోక భువర్లోక సువర్లోక మహాలోకాది క్రింది లోకాలకు అధినేత! సర్వ సంగీత వాద్య నిపుణుడు. అతి పరాక్రమశాలి! పరమశివునికే చుట్టపు పట్టంగట్టిన శైవాచార పరా యణుడు. అనుదినమూ నవకోటి శివ లింగాభిషేకం చేసే అకలంక భక్తుడు. దేవేంద్రాదులచేత ఊడిగం చేయించు కొన్న మహా విక్రమశాలి. లంకా పట్టణాన్ని స్వర్ణ, రత్నాలతో మయబ్రహ్మ చేత నిర్మింపజేసుకొన్న ధీశాలి. బ్రహ్మ జ్ఞాని, మహా పండితుడు. అయితే, యుక్తా యుక్త విచారవంతుడు, సర్వశాస్త్ర పండి తుడు, వేద వేదాంగాలను వివరించి విప్పి

చెప్పగల బ్రాహ్మణోత్తముడైయుండి స్త్రీ వ్యామోహమనే ఒక్క బలహీనతకు బలై పోయాడు. సూర్యాగ్నిగోళం వంటి రావణ కీర్తి బూడిదకుప్పగా మిగిలిపోయింది. మృత్యుదేవతను జయించగల శక్తి వుండీ, మృత్యుపాశానికి తలవంచాడు. కాముకత్వం ఎంత చెడ్డది?! వ్యసన పరత్వం ఎంత క్రూరమైనది?! అవును. అంతే!

## 831. మనుషులు దిగంబరంగా జీవించకూడదా?

**జ.** వానరుడు నరుడుగా పరివర్తన చెందని రోజులలో దిగంబర జీవితాన్నే గడిపాడు. జన్మసిద్ధంగా మేధోశక్తి కల్గిన మానవుడు మొదట ఆహారంకోసం పోరాటాలు జరిపేవాడు. తరువాత కామ సుఖాల కోసం పోరాటాలు జరిపేవాడు. సాటి పశు పక్షులను చూచి సామూహిక జీవితానికి స్థిరపడిన తరువాత మెల్లమెల్లగా భాష నేర్చుకొని ఏకత్వంలో భిన్నత్వంగా గుంపు జీవితం గడుపుతూనే భార్యా పిల్లలతో వుండేవాడు. తరువాత తరువాత కుటీరాలు నిర్మించుకొన్నాడు. గుంపు జీవితాన్నుండి ప్రత్యేక జీవితానికొచ్చేశాడు. భాషా ప్రావీణ్యం ఏర్పడింది. దేవుడు ఏదో శక్తిరూపంలో వున్నాడని భావించాడు. ప్రకృతినే దేవుడుగా పూజించటం ప్రారంభించాడు. ఆహారాలను వండుకొని తినటం నేర్చేసుకొన్నాడు. కాని మానవుని కొక చింత మిగిలిపోయింది. సంతతి అభివృద్ధి జరపటం లేదు' అనేది చింత. సంతానాభివృద్ధికి మంత్రంగా నారచీరలు



కట్టుకోవాలని ఋషులద్వారా తెల్సుకొన్నాడు. మొదటగా నారచీరలు కట్టుకొన్నది మగవాడే! స్త్రీలు దిగంబరంగానే వుండేవారు. తదనంతర కాలంలో స్త్రీ పురుషులిద్దరూ బట్టలు కట్టుకొన్నారు. అప్పటివరకూ కామసుఖాలపై విముఖత వున్న స్త్రీ పురుషులకు కామాతృత పెరిగి వంశాభివృద్ధి జరిగిందని "మానవ విశ్లేషణ" చెబుతుంది. మరలా దిగంబరత్వానికి వస్తే మానవజాతి పతనమై పోతుంది. అభివృద్ధి వుండదు.

## 832. "దుఃఖం" ఒక యోగమా?

**జ.** అందరికీ బాధలు కష్టాలు వుంటాయి. ఈ లోకంలో అందరూ ఇబ్బందుల్ని ఎదుర్కొంటుంటారు. కాని, అందరూ వెక్కి వెక్కి ఏడ్వలేరు. కష్టం వచ్చినపుడు ఏడ్వగలగటం ఒకవరం! దేవుడు ఏడ్వగల్గిన అవకాశాన్ని అదృష్టాన్ని ఒక్క మనిషికి మాత్రమే ఇచ్చాడు. మేధస్సుతోపాటు

కష్టాల్ని, కష్టాలను సహించుకొనే ఆయుధంగా దుఃఖాన్ని, ఇచ్చాడు దేవుడు. చిన్న సమస్యకే ఏడుస్తారు ఆడవారు. ఏడుస్తారు కాబట్టే ఎంతటి సమస్యనైనా భరించేస్తారు. కన్నీటితో సమస్యలు పరిష్కారం కావు. కాని మనసుమాత్రం తేలికపడి బాధ బరువు తగ్గుతుంది. ప్రశాంతత లభిస్తుంది. ఇదిమాత్రం నిజం.

కష్టాలు రావాటాన్ని ఎవరూ ఒప్పుకోరు. కష్టాలను సంతోషకర విషయంగా ఎవరూ అంగీకరించరు. కష్టాలు రెండు రకాలున్నాయి. ఒకటి శారీరకమైన కష్టం. మరొకటి మానసికమైన కష్టం. శారీరకమైన కష్టానికి చెమటరూపంలో శరీరం ఏడుస్తుంది. మానసికమైన కష్టానికి కన్నీటిరూపంలో కళ్ళు ఏడుస్తాయి. కన్నీరు కూడా స్వేదమే గదా! గుండెల నిండుగా ఏడ్వ గల్గిన వాళ్లు సమస్యలకు భయపడి ఆత్మహత్యలకు ప్రయత్నించరని పరిశోధనలో తేలింది. బాధలను మనసులో దాచుకొన్నకొద్దీ సమస్య జటిలంగా తయారవుతుంది. ఆత్మీయులతోనైన బాధను పంచుకోవాలి లేదా తలుపులు వేసుకొని ఒంటరిగానైన ఏడ్వాలి. ఇలా చేయటంవల్ల శరీరంలో "టాక్సిన్లు" బయటికి వచ్చేస్తాయి. ఉల్లిపాయలు కొసేటపుడు వచ్చే కన్నీరు "ఇరిటేషన్" వల్ల వస్తాయి. దుఃఖంవల్ల వచ్చే కన్నీరు "ఎమోషన్" వల్ల వస్తాయి. ఎమోషనల్ వల్ల వచ్చే కన్నీటి వల్ల మానసిక వత్తిడి దూరమవుతుంది. విషాదాన్ని ఒక యోగంగా భావించ గలిగితే మనిషి మనీషి అవుతాడు! మహర్షి అవుతాడు! యోగం అంటే అకల్పిత అదృష్టం! యోగం అంటే సాధన! యోగి అంటే సాధకుడు.



"అనగా అనగా రాగ మతిశయిల్లుచు నుండు తినగతినగ వేప(వేము) తియ్యనుండు. సాధనమున పనులు సమకూరు ధరలోన" అన్నాడు వేమన. కష్టాలను నవ్వుతూ అంగీకరించి చూడు! అపుడు ఆ కష్టమే సుఖంగా మారుతుంది. సమస్యలను నిర్లక్ష్యం చేసి ముందుకువెళ్ళు! ఆ సమస్య దానంతటదే పరిష్కార మార్గానికి వచ్చేస్తుంది.

## 833. పాతివ్రత్యం స్త్రీలకు మాత్రమే ఎందుకు?

***జ.*** ఇది మంచి ప్రశ్న – అందరూ తెల్సుకోవాల్సిన ప్రశ్న. పాతివ్రత్యం స్త్రీలకు మాత్రమే వుండాలని ఎవరు చెప్పారు? ఏ శాస్త్రంలో వుంది? ఒకవేళ ఏ శాస్త్రంలోనైనా వుంటే అది పరమ తప్పుడు శాస్త్రం.



హిందూమతం ఏకపత్నీ వ్రతాన్నే ప్రోత్స హించింది. అందుకే రాముడు దేవుడ య్యాడు. రాముని దేవునిగా చెప్పటానికి ఇదే ఆధారం. అవును నిజమే! మరి, కృష్ణ నికి అంతమంది భార్యలెందుకున్నారు?

ముందుగా పాతివ్రత్యం అంటే ఏమిటో తెల్సుకోవాలి. ఐదుమంది భర్తలున్న 'ద్రౌపది' మహాపతివ్రత! కన్యాతనంలో కర్ణునికి జన్మనిచ్చి, తరువాత ఇంద్ర, వాయు, ధర్మ దేవునివల్ల బిడ్డలు పొందిన 'కుంతీదేవి' పతివ్రత! పరాశర మహర్షివలన వ్యాసు నికి జన్మనిచ్చి తరువాత శంతనుని పెండ్లా డిన 'సత్యవతి' పతివ్రత! దేవేంద్ర సంగ మం జరిపిన 'అహల్య' పతివ్రత! వాలి సుగ్రీవులతో సంసారం చేసిన 'తార' పతివ్రత. అవును! వీరందరూ పతివ్రతలే!

పాతివ్రత్యానికీ పరమ పురుష సంగ మానికీ చాలా వ్యత్యాసం వుంది. వ్యభి చారానికీ పాతివ్రత్యానికీ తేడా ఎంతో వుంది. ఆదికాలంలో మనిషి జ్ఞానవంతు డైన తరువాతనే స్త్రీలందరకీ పాతివ్రత్య పద్ధతిని మహర్షులు ప్రవేశపెట్టారు. దీని వల్ల మానవులకు మేలే జరిగింది. పాతి వ్రత్యమంటే పతితోనే జీవించటమనే నియమం. అలాకాకుండా స్త్రీ స్వేచ్ఛా కాముకత్వంతో జీవిస్తే తదనంతర పరిణా మాలేమిటి? పుత్రపుత్రికా సంతతికి దిక్కె వ్వరు? తోడెవ్వరు? మనిషికి జీవితం కంటే భద్రత ముఖ్యంగదా! మనం మన కోసం జీవించే జీవితకాలం కన్నా మన బిడ్డలకోసం జీవించే జీవితకాలం పెద్దది. మన భద్రతకన్నా మన బిడ్డల భద్రతే ముఖ్యంగా భావిస్తాం. అందుకోసం అహ ర్నిశలూ శ్రమిస్తాం. కష్టపడి బిడ్డలకోసం కూడబెడుతాం. భర్తలేని స్త్రీకి భద్రత ఏమిటి? తండ్రి తెలియని బిడ్డలకు దిక్కెవ్వరు? అందుకే స్త్రీకి పాతివ్రత్యాన్ని పెట్టారు. మగవాడు సంభోగం చేసి వెళ్ళి పోతాడు. తరువాత కష్టాలన్నీ స్త్రీకే గదా! ఆడది పశువుకాదు. మృగంకాదు. తన బిడ్డల్ని తానే పెంచుకొనే కుక్క పంది పిల్లి వంటి హీనప్రాణికాదు. గర్భం స్త్రీకి వస్తుంది గాని పురుషునికి రాదు. పుట్టిన బిడ్డకు పురుషుడు పాలిచ్చి పెంచడు. కామమే జీవన పరమార్ధం కాదు. జీవన మౌల్యాలు ఎన్నో వున్నాయి. స్త్రీకి పదిమంది భర్తలు వుండకూడనిది అందుకే. పురుషునికి స్త్రీకి జీవనవ్యత్యాసం వుంది. శృంగార సంభోగ విషయాలలో పురుషుడు హీనుడు! స్త్రీ

దేవత! అందుకే స్త్రీలకు 'పాతివ్రత్య నియమం' చెప్పింది శాస్త్రం.

## 834. విజయదశమికి శమీపూజ చేస్తారేమిటి?


**జ.** ముందుగా విజయదశమిని గురించి పరిచయం చేస్తాను. మొట్టమొదటగా త్రేతాయుగంలో శ్రీరాముడు రావణ సంహారం ముగించుకొని అయోధ్యా నగ



రానికి వచ్చిన శుభసందర్భంగా విజయోత్సవం జరిగింది. ఆరోజు దశమీ తిథి కావటం వల్ల 'విజయదశమి'గా ప్రసిద్ధి చెందింది. ఇది తొమ్మిది రోజుల ఉత్సవం. ఈ విజయదశమి శక్తి స్వరూపిణి అయిన పరమేశ్వరికి ఇష్టమైన రోజు అని చెబుతారు. ఈ విజయదశమి రోజున ఏ పనిని ప్రారంభించినా నిర్విఘ్నంగా జరుగుతుందని చెబుతారు. విజయదశమి దినం శ్రవణానక్షత్రయుక్తమై వుండాలి. సూర్యాస్తమయానంతరం నలభై ఎనిమిది నిముషాల తరువాత (ఒక మూహూర్తకాలం) పరమేశ్వరి అపరాజితగా వుంటుందని శాస్త్ర ప్రవచనం. ఆ సమయంలో చేసే పూజలు, ప్రారంభించే పనులు విజయాన్ని చేకూరుస్తాయని నమ్ముతారు. కురుక్షేత్ర యుద్ధంలో పాండవులు విజయం సాధించింది కూడా ఈ రోజునే! దేవ-దానవులు పాలకడలిని మధించిన సమయంలో ఎన్నో ఓషధీ వృక్షాలు దేవతా వృక్షాలు పుట్టాయి. ఆవిధంగా పుట్టిన దేవతా వృక్షాలలో శమీవృక్షం (జమ్మిచెట్టు) కూడా ఒకటి. "శమీశమయతే పాపం" శమీ వృక్షానికి భక్తిపూర్వకంగా ప్రదక్షిణలు చేస్తే చేసిన పాపాలు పోతాయట. శమీవృక్షాన్ని పూజించితే విజయం లభిస్తుందని పూర్వీకుల నమ్మకం. శమీవృక్షం పరాదేవత ప్రతిరూపమని అందరి విశ్వాసం. శమీ వృక్షం ఆకులు విషానికి విరుగుడుగా పని చేస్తాయంటారు. ప్రతిరోజూ ఈ చెట్టు నీడన వుండి ఈ చెట్టు నుండి లభించే గాలి (ఆక్సిజన్) పీల్చటంవల్ల అండం సక్రమంగా విడుదల జరిగి సంతాన వతులు అవుతారని ఆయుర్వేదం చెబుతున్నది. మరొక విషయం! ఎక్కడ శమీవృక్షం వుంటుందో అక్కడి భూమిలోపల నీరు లభిస్తుందంటారు. విజయదశమి రోజున శమీవృక్షాన్ని తాకిన, శమీపత్రిని (ఆకులను) చేతులతో ముట్టినా ధనసిద్ధి లభిస్తుందన్న నమ్మకం దక్షిణ భారతంలో బాగా వుంది. విజయదశమితో పాటుగా శమీ పూజను కర్ణాటక రాజ్యంవారు ఘనంగా చేస్తారు. మైసూరు విజయదశమి ఉత్సవాలు చూచితీరాల్సిందే. 'శమీ స్పర్శ మాత్రేణ సర్వతో జయమంగళమ్'

## 835. దైవబలం లేకుంటే మానవశక్తి సహకరించదా?

**జ.** దైవబలం లేకుంటే మానవశక్తి సహకరించదు. మానవశక్తి లేకుంటే దైవ బలం సహకరించదు. ఈ రెండూ నిజమే!



కట్టెలు వుండాలంటే అగ్ని కావాలి. అగ్ని మండాలంటే కట్టెలు కావాలి. పర స్పర సంబంధ విషయాలివి. బియ్యం అన్నంగా మారటానికి నిప్పు కావాలి నీరూ కావాలి. విత్తనం మొక్కగా మారటానికి భూమితో పాటు నీరు కూడా కావాలి. హేతువాదం మానవ కృషి ముఖ్యమంటుంది. భక్తి వాదం దైవబలమే ముఖ్యమంటుంది. ఒకే ముఖ్యవీధిలో రెండు షాపులు ఒకే వ్యాపారం చేస్తున్నా ఒక షాపుకే జనం గుమిగూడి వుంటారు. ఇది వ్యక్తిలోపమా! శక్తి లోపమా! యుక్తి లోపమా! మన జీవి తంలో ఎప్పుడో ఒకసారి అందరికీ వచ్చే అనుమానమే ఇది. మనసావాచా కర్మణా భూమినే నమ్ముకొని పగలు రాత్రి కష్టించి ఎండావానలను లెక్కచేయక వ్యవసాయ కర్మను సాగించే రైతుబిడ్డ ప్రకృతి వైపరీ త్యానికి సర్వనాశనమై పోతుంటాడు గదా! ఏమిటిది! ఎవరితప్పు? కష్టపడి వండు కొన్న అన్నంలో బల్లి పడితే ఎవరిది తప్పు! చెరువునిండా నీరు వుండటం ముఖ్యం కాదు. దిగి త్రాగటానికి నాలుగు మెట్లుం డాలి. దీనినే అదృష్టమనీ, తెలివితేటలు అనీ అంటుంటారు. ఏకాగ్రత, నమ్మకం, పట్టుదల, కలిగిన మానవశక్తికి దైవశక్తి సహకరించి తీరుతుంది.

## 836. ఇంటిముందు కలాపి ఎందుకు చల్లాలి?

**జ.** సూర్యోదయానికి ముందే కలాపి చల్లాలి. సూర్యుడు ఉదయిస్తున్న సమ యంలో కలాపి చల్లకూడదు. కొన్ని మతా చారాలను ఎందుకు ఏమిటి అని ప్రశ్నిం చకూడదు. అలాగని ఎందుకో తెలుసు కోకుండా వుండకూడదు. ఒనానొకప్పుడు మనదేశంలో గురుకులాల్లోని విద్యార్థులు భిక్షమెత్తి గురువుకి సమర్పిస్తూ విద్యా భ్యాసం చేసేవారు. గ్రామపురోహితుడు బౌద్ధబిక్షువులు కూడా "భవతీ భిక్షాందేహీ" అని గృహస్థులను అర్థించేవారు. "అతిథి దేవోభవ" అన్న సంస్కృతి మనది. బియ్యం/ జొన్నలు/ రాగులు మొదలైన ఆహార ధాన్యంతో పాటుగా కూరగాయలు కూడా ధర్మాచారంగా దానం చేసేవారు గృహ స్థులు. ఆవుపేడతో కలాపిచల్లి రంగ వల్లులు దిద్దిన యింటిముందు మాత్రమే ధర్మ భిక్షను అర్థించేవారు. ఏ యింటిముందైన కలాపిలేకుండా వుంటే ఆ యింటిలో ఏదో అశుభం జరిగివుంటుందనీ, యింటిలోని వారికి తీవ్ర అనారోగ్యం కలిగి వుంటుం దని అర్థం చేసుకొని ముందుకి సాగి



పోయే అవగాహనా పద్ధతి వుంది. కాల క్రమేణా యిదొక ఆచారమయింది. ఆవు పేడను నీటిలో కలిపి కలాపి చల్లడం వల్ల రోగకారకక్రిమి ఇంటిలోనికి ప్రవేశించ కుండా వుంటుంది. రకరకాల రంగ వల్లులు (ముగ్గులు) ఇంటి యిల్లాలి కళాత్మక దృష్టినీ, కళాప్రావీణ్యం దండిగా వుండేది.

## 837. హిందువులు 'విడాకులు' తీసికొనవచ్చా?

**జ.** వివాహ విచ్ఛేదనం హిందూ సంప్ర దాయంకాదు. దంపతులను విడదీయ గల శక్తి ఒక్క మరణానికి తప్ప మరొకరికి లేదు. విడిపోవాలనుకుంటే విడి పోయి, కలవాలనుకుంటే కలుసుకో గల్గితే పెళ్ళికి వేదమంత్రాలెందుకు? పెళ్ళికి గురు, బంధువులతో పనేముంది? మనకు నూరు స్మృతులు (ధర్మగ్రంధాలు) వున్నాయి. నాలుగు పవిత్ర వేదాలున్నాయి. బ్రహ్మ సూత్రాలున్నాయి. పద్దెనిమిది పురాణా లున్నాయి. రెండు మహా ఇతిహాసాలున్నాయి. ఎక్కడ వెదికినా వివాహ విచ్ఛేధనం కను పించదు.

## 838. వివాహం ఒక ధార్మిక పవిత్ర ఒప్పందం

**జ.** ఈ పవిత్ర బంధాన్ని త్రెంచగల శక్తి సృష్టికర్తకే లేదని మన నమ్మకం. అందుకే పురుషుని 'భర్త అనీ' 'భార్యను' అర్ధాంగి అంటాం మనం. హిందూమతం వివా హాన్ని 'సంస్కారం' అని చెబుతున్నది. విడాకులు ఎందుకు తీసుకోకూడదు? యిష్టం లేని సంసారం చేయటంవల్ల ఎవరు సుఖ పడతారు? వైరుధ్యంతో కలిసి వుండటం కన్నా విడిపోయి జీవించటం సుఖకరం గదా! అని ఈనాటి వారందరూ వాదిస్తారు. ఈ వాదన తప్పు! ఈవాదం సరికానే కాదు! అన్యోన్య జీవితం గడపాల్సిన సతీ పతులు విడాకులదాకా ఎందుకు వస్తు న్నారు? నూరేండ్ల పంట కావాల్సిన వైవా హిక జీవితం మూడునాళ్ళ ముచ్చటగా ఎందుకు మారుతున్నది? వివాహ బంధా నికున్న బలం యింతేనా? వేలాది మంది అందించిన ఆశీర్వాద బలం ఇంతేనా? వేదమంత్రాల ప్రభావం ఇదేనా??? దీనికి కారణం మనం, మనచుట్టూ వున్న వాతావరణం. మనలో విద్యావంతులే ఎక్కువగా విడాకుల బారినపడుతున్నారు. దీనికి కారణాలు చాలా వున్నాయి. వివాహం అంటే ఏమిటో, మన పిల్లలకు మనం తెలియజెప్పటంలేదు. వివాహ ధర్మం ఏమిటో, వివాహం ఎందుకు కావాలో, వివాహం గొప్పదనమేమిటో ఏ తల్లిదండ్రులు ఏ బిడ్డలకు చెప్ప గలుగు తున్నారు? వివాహ పవిత్రత ఎవరికి



తెలుసు? వివాహమంటే స్త్రీ పురుషుల లైంగికక్రియ కాదు! కామసుఖాలు పొంద టానికి వివాహమే అక్కర్లేదు. వంశాభివృద్ధి కోసం ఋణ విమోచనార్థం జరిగిన వివా హం విచ్ఛిన్నమైతే పుట్టిన బిడ్డలగతేమిటి? జీవిత పయనానికి అర్థమేమిటి? సార్థకత ఏమిటి? జీవితం సమస్యల పుట్ట! కష్టాల గుట్ట! బాధలకట్ట! పరిష్కారం ఎడబాటు తిరుగుబాటు మాత్రం కాదు.

## *83లి. రుద్రాక్షల మహిమ ఏమిటి?*

**జ.** పవిత్ర రుద్రాక్షలను స్త్రీ పురుష లందరూ ధరించవచ్చు! విష్ణు భక్తులకు యజ్ఞోపవీతం ఎంతటిదో, శైవభక్తులకు రుద్రాక్ష అంతటిది. బ్రహ్మ సంతతిగా చెప్పుకొనే శైవ వైష్ణవులందరికీ రుద్రాక్ష ధారణీయమే. చతుర్వర్ణాల వారికీ రుద్రాక్ష మాల ధరించదగినదే. వైష్ణవ సంప్ర దాయాలకున్న మడి ఆచారాలు, సంప్ర దాయ బంధనాలు శైవులకు లేవు. భారత దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలనూ కులాచార విధిలేకుండా ఎవరైనా చేతు లతో ముట్టి ఆత్మానందాన్ని పొందవచ్చు. శైవ సంప్రదాయానికున్న మహా సౌభాగ్యమిది.

ద్రవిడదేశంలో శ్రీబసవేశ్వరుడు శైవ సాంప్రదాయానికి క్రొత్త దారులు వేశాడు. కులమత వివక్ష లేకుండా కడజాతిని కూడా కనికరించి శివలింగధారణ చేయించి లింగాయతులను చేశాడు. శైవ మతానికి ఎంతోసేవ చేశాడు. ఇదొక మత క్రాంతి. శైవ సంక్రాంతి! రుద్రాక్షకు ఐదు ముఖాలు మూడు ముఖాలు ఆరు ఏడు ముఖాలు ఇలా రకరకాలుగా వుంటాయి. ఆ రుద్రాక్ష గొప్పది ఈ రుద్రాక్షకు మహిమ ఎక్కువ అని అబద్ధపురాణాలు చెప్పే అర్ధ పండి తులు ఎందరో వున్నారు. ఇవన్నీ కల్పిత కథలు. మనకు లభించే రకరకాల ముఖాల రుద్రాక్షలు హస్త నైపుణ్యంతో చెక్కినవి. మనిషికి భక్తి దైవనమ్మకం ముఖ్యంగాని రుద్రాక్ష ముఖ్యం కాదని గుర్తించాలి. నమ్మకం మంచిదే. మూఢనమ్మకం మంచిది కాదు. భక్తిని మించిన 'తిక్క' మంచిది కాదు. అమ్మ మనకు పాలు ఇస్తుంది. అమ్మకు మనం పాలివ్వం. దేవుడు మనకు అన్నీ యిస్తున్నాడు, ఇస్తాడు, నీవేమీ దేవునికి సమర్పించనక్కర్లేదు. రుద్రాక్షలను వుంగ రాలలో ధరించరాదు. రుద్రాక్షమాలతో భార్యసంగమం చేయకూడదు. ఒకరి రుద్రాక్షలను మరొకరు ధరించ కూడదు. రుద్రాక్షమాలను ధరించి నిద్రపోకూడదు. స్త్రీలు ఋతు సమయాలలో తీసివేయా లంటారు. పురాణాలు ఏవీ వేదసమ్మతం కావు. అమాయక జన సముదాయానికి మతం పేర, కులం పేర, దేవుళ్ళపేర, భక్తిపేర, ధర్మం పేర, పిచ్చి పిచ్చి ఆంక్షలు,

నమ్మకాలు పెట్టి కడుపులు నింపుకొనే సోమరి వ్యక్తులు ఎందరో వున్నారు. ఎవరినీ నమ్మవద్దు. దేవుడిని నమ్మండి! దురాచారాలను విశ్వసించకండి!

## 840. బుద్ధుని 'అష్టాంగమార్గం' అంటే ఏమిటి?

**జ.** నారాయణుని దశావతారాలలో బుద్ధావతారం ఒక అవతారంగా గుర్తిం



చారు. మానవుని సర్వదుఃఖాలకు మనసే కారణమనీ, మనస్సు నియంత్రణలో వున్న వానికి దుఃఖం లేదనీ, అహింసా జీవనమే దైవరాధనతో సమానమని చెప్పినవాడు బుద్ధుడు. ఆయన ఉత్తమ జీవితానికి కావల్సిన ఎనిమిది సూత్రాలను చెప్పాడు. అదే "అష్టాంగ మార్గం"

1. ఏ విషయమైనా బాగా ఆలోచించిన తరువాతనే అంగీకరించి ఆచరించాలి. మొహమాటంతోగాని, భయంతోగాని, గౌరవంతోగాని అంగీకరించకూడదు. ఇది మొదటి సూత్రం.

2. ప్రతి వ్యక్తికీ మంచి సంకల్పం వుండాలి. లోకహితం కోసం దీక్ష వహించాలి. మంచి సంకల్పమే మంచి దారిన నడిపిస్తుంది. ఇది రెండవ సూత్రం.

3. ఇతరులకు బాధ కల్గించే, ఇతరులను నొప్పించే మాటలు మాట్లాడకూడదు. చాడీ మాటలు అబద్ధాలు చెప్పకూడదు. ఇది మూడవ సూత్రం.

4. ఈ ప్రపంచం ఏ ఒక్కరిది కాదు. అన్ని ప్రాణులకూ సమానహక్కు వుంది. కాబట్టి ప్రాణిహింస చేయకూడదు. ఇది నాలుగవ సూత్రం.

5. అందరూ మంచి జీవితాన్నే గడపాలి. దొంగతనం, వ్యభిచారం, మోసం, అక్రమం, దౌర్జన్యం మొదలైనవాటికి దూరంగా వుండాలి. ఐదవ సూత్రమిది.

6. దేహాన్నీ మనస్సునీ బలంగానూ, ఆరోగ్యంగానూ వుంచాలి. మానసిక శ్రమ దేహదండన కలిగిస్తూ వుండాలి. ఇది ఆరవ సూత్రం.

7. దుఃఖాన్నీ, దురాశనూ, దురభిమానాన్నీ వదలివేయాలి. పిరికితన్నాన్ని దగ్గరకు రానివ్వకూడదు. ధర్మం మరువ కూడదు. ఇది ఏడవ సూత్రం.

8. చివరి సూత్రం నిర్వాణం. దీనినే బోధిసత్వం అంటారు. పుట్టు చావులకు అతీతమైన ఉన్నతస్థితి! భాష భావాల కందని దైవస్థితి! మనిషి పునీతుడై, శరీరం మీది వ్యామోహం వదలి లోకబంధం మరచి, మళ్ళీ తిరిగి రావటానికి ఈ జన్మను పరిపూర్ణం చేసుకోవాలి. ఇది ఎనిమిదవ

సూత్రం. బౌద్ధ బోధనలన్నీ చార్వాక సిద్ధాంతం (నాస్తికత్వం)గా కనిపిస్తుంది. కాని నాస్తికమతం కాదు. జాతి వివక్షను బౌద్ధం అంగీకరించదు. బుద్ధుడు బోధించి "పంచశీల" అందరి మన్ననలను పొందింది.

1. ప్రతి ప్రాణినీ ప్రేమతో చూడు! జీవ హింస చేయకు! మానవ జన్మ గొప్పది.

2. ఇతరుల సంపదకు ఆశపడకు. డబ్బు మనిషిని నీచునిగా మారుస్తుంది.

3. అబద్ధమాడటం అతినీచ ప్రవృత్తి. అతి పాపకార్యాలలో వ్యభిచారం మొదటిది.

5. మత్తు పదార్థాల సేవనంవల్ల మానవత నశిస్తుంది. మత్తు పదార్థాల వైపు చూడకు.

ఈ ఐదు సిద్ధాంతాలను "పంచశీల" అంటారు.

## 841. ఇంటిముందు తులసికోట ఎందుకు?

శ్లో॥ యన్మూలే సర్వతీర్థాని యన్మధ్యే సర్వదేవతాః

యదగ్రే సర్వ వేదాశ్చా, తులసి! త్వాం నమామ్యహం॥

దేవతలు దానవులు క్షీర సాగరాన్ని మధించిన సమయంలో తులసీ, జమ్మి కల్పవృక్షం, పారిజాతవృక్షం, రావి, వేప వృక్షాలు పుట్టాయని పురాణాలు చెబుతున్నాయి. కల్పవృక్షం పారిజాతం దేవలోకానికి సంక్రమించాయి. తులసి, రావి, వేప, జమ్మివృక్షాలు భూలోక సంప్రాప్త మయ్యాయని పౌరణికులు చెబుతారు. హిందువులకు ఈ నాలుగు వృక్షాలపై మమత్వం ఎక్కువ. తులసి చెట్టు, రావి, వేప, జమ్మి వంటి పెద్ద వృక్షంకాదు. నాలుగు అడు



గులకు మించి పెరగదు. ఇండ్లవద్ద వేప చెట్టును మాత్రమే పెంచుతారు. వేప కర్రను గృహోపకరణాలకు వాడుకోవచ్చు. వేపవిత్తనాలు రైతులకు క్రిమి సంహారకంగా కూడా వుపయోగపడతాయి. రావిచెట్టును కావాలని ఎవరూ ఇండ్ల వద్ద పెంచరు. ఎందుకంటే మర్రి చెట్టు లాగానే రావిచెట్టు కూడా దైత్యవృక్షం. మహావృక్షంగా పెరిగి ఇంటిగోడలను పడవేస్తుంది. పూలు, పండ్లను యివ్వదు. రావికలపను దేనికీ వుపయోగించరు. ఉపయోగం కూడా కాదు. జమ్మిచెట్టు తనకు తానుగా పుట్టి పెరగాలి అనే నమ్మకం వుండటం వల్ల ఎవరూ పెంచరు. ఇంటి ముందు తులసికోట పెడతారెందుకు? తులసి కోటను బ్రాహ్మణ వైశ్య క్షత్రియులు మాత్రమే యింటి ముందు పెట్టి ప్రతి నిత్యం నీరుపోసి నమస్కరిస్తుంటారు. జంధ్యపు కులాలకు మాత్రమే ఎందుకు తులసి పరిమితమయిందో తెలియదు. తులసి వృక్షం ఆయుర్వేద రంగంలో మహత్తర

స్థానం సంపాదించుకొంది. ఎన్నో అనా రోగ్యాలకు తులసి దివ్య ఔషధంగా వుంది. తులసిని లక్ష్మీ సమానంగా హిందు వులు పూజిస్తారు. తులసివృక్షం ఇంటి ముందు వుంటే ఆ యింటికి దరిద్రం రాదని నమ్ముతారు. ప్రతినిత్యం తులసిని పూజించే స్త్రీలకు సౌభాగ్యం పది కాలాల పాటు చల్లగా వుంటుందనీ, పతిప్రేమకు పాత్రులు అవుతారనీ, తులసీ ప్రదక్షిణం చేసేవారికి ఆయుష్షు ఆరోగ్యం లభిస్తా యనీ భారతీయ స్త్రీ పవిత్ర విశ్వాసం. పసిపాపలకు జలుబు దగ్గు దురదలు వంటి అనారోగ్యాలు దరిజేరవు. విష్ణు మూర్తికి తులసిమాల అంటే ఎంతో యిష్ట మని వైష్ణవులు విశ్వసిస్తారు. ఎండిన తులసి కొమ్మలను చిన్న చిన్న ముక్కలుగా కోసి పూసలుగా తయారుచేసి మెడలో ధరి స్తారు. "నమోతులసి! నమోదేవీ! నమో విష్ణుప్రియే! శుభే!

## 842. శుభకార్యాలు మాఘమాసంలోనే వుంటాయేమిటి?

**జ.** ఉత్తరాయణ పుణ్యకాలంలో మాఘ మాసం వస్తుంది. శీతోష్ణాలు సమంగా వుండి ఆహ్లాదకరంగా వుండేమాసమిది. మాఘమాసంలో పెండ్లి జరిగితే కార్తీక మార్గశిర మాసాల్లో బిడ్డపుడతాడు. కార్తీక మార్గశిరాల్లో పుట్టిన పాపలు ఆరోగ్యంగా వుంటారు. అందరూ వ్యవసాయపు పనులు లేకుండా యింట్లోనే వుంటారు. తల్లి బిడ్డల క్షేమసమాచారాలు చూడడానికి



ఎంతో వీలుగా వుంటుంది. వైశాఖంలో వివాహం జరిగితే మాఘమాసంలో బిడ్డలు పుడతారు. పుష్యమాసంలో పంటచేతికి వచ్చి డబ్బులు వుండే కాలం. పుష్యం తరు వాత వచ్చేమాసం మాఘమాసం కాబట్టి మాఘమాసం మధురమాసం అంటారు పండితులు. మాఘమాసం శుభ కార్యా లకు, భక్తికార్యాలకు శుభప్రద మైనది. మాఘమాసంలో నదుల నీరు చెరువుల నీరు పరిశుభ్రంగా వుంటుంది. ప్రకృతివల్ల ఎటువంటి తొందరలు వుండవు. వర్షాలుగాని ఎక్కువ వేడితో ఎండలు గాని ఎక్కువ చలిగాని వుండవన్నమాట. మన దేశం వ్యవసాయదేశం. వ్యవసాయమే మనకు ముఖ్య వృత్తి. కాబట్టి ఏ పండు గలైనా, శుభకార్యాలైనా రైతుపరంగా నిర్ణ యించారు. దేశాభివృద్ధికి కృషి కార్మికులే ముఖ్యమని మన పూర్వికులెపుడో గుర్తించారు. కాబట్టి తిరునాళ్ళు జాతరలు పండుగలు పెళ్ళిళ్ళు కృషిపరంగా, కృషి కుల సౌలభ్యపరంగా వుండేట్లు నిర్ణయిం

చారు. మాఘమాసంలో కాయగూరలు విరివిగా దొరుకుతాయి. పండ్లు, ఫలాలు కూడా అంతే! మాఘమాసంలో వివాహం జరిగితే తరువాత ఎండాకాలం వస్తుంది. సూర్యశక్తివల్ల ప్రాణులలో సంయోగేచ్ఛ కలుగుతుంటుంది. కాబట్టి నూతన దంపతులకు అనురాగం అభివృద్ధి చెందుతుంది. మాఘమాసం నుండి ఆషాఢ మాసానికి ఆరునెలల సమయం వుంది. నవవధువు మాఘంలో గర్భవతి అయితే ఆరవనెలలో పుట్టింటివారు ఆడపిల్లను తమ యింటికి తీసికొని వెళతారు. ఎలాగు ఆషాఢంలో క్రొత్త అల్లుడు అత్త వారింటికి వెళ్ళడు.

అపుత్రాః పుత్రిణఃసంతు
పుత్రిణః సంతు పౌత్రిణః
అధనాః సధనాఃసంతు
జీవంతు శరశ్శతమ్

## 843. దేవాలయాల్లో రావిచెట్టు, వేపచెట్టు ఎందుకుంటాయి?

**జ.** వృక్షో రక్షతి రక్షితః రావిచెట్టుకి అశ్వత్థ వృక్షమనీ, బోధివృక్షమనీ పేర్లున్నాయి. దాదాపుగా దేవాలయాల్లో రావిచెట్టు లేదా వేప చెట్టు వుంటాయి. ఎక్కువ చోట్ల రావి వేప కలిసి వుంటాయి. రావి చెట్టును పురుషునిగానూ, వేపచెట్టును స్త్రీగానూ భావించి పూజించటం చేస్తారు అంటే రావిని విష్ణు స్వరూపంగానూ, వేపను లక్ష్మీ స్వరూపం గానూ భావించి ప్రదక్షిణలు చేస్తుంటారు. ఈ జంట వృక్షాలను పూజిస్తే దాంపత్యం



దోషనివారణ కల్గి సంసారం అన్యోన్యంగా వుంటుందని హిందువుల నమ్మకం. రావి వృక్షం గురించి 'పద్మపురాణం' లో వివరించబడింది.

రావిచెట్టులోని అణువణువూ నారాయణ స్వరూపమేనని ఆగమశాస్త్రాలు కూడా చెబుతున్నాయి. ఈ విషయాన్ని స్కందపురాణం కూడా చెబుతుంది. అందుకే శ్రీకృష్ణుని 'వటపత్రశాయి' అంటారు. పసిబిడ్డకు జోలపాడేటపుడు 'వటపత్రశాయికి వరహాల లాలి' అని పాడుతూ నిద్రపుచ్చటం వినేవుంటారందరూ. జ్యోతిష్య శాస్త్రంలో రావిచెట్టుకి ఓ ప్రత్యేకత వుంది. శనిదోషం పోవాలంటే ప్రతిరోజూ రావిచెట్టు నీడన నిలబడాలి. నమస్కరించాలి. కౌగిలించుకోవాలి. ఈ విధంగా కొన్ని రోజులు చేస్తే శనిదోషం తొలగిపోతుందట. రావిచెట్టు కొమ్మలతో యజ్ఞయాగాలు చేస్తారు. సన్యాసులు రావిచెట్టు కర్రను దండంగా చేసుకొంటారు. రావిచెట్టునీడన కాసేపు కూర్చుంటే బి.పి. తగ్గుతుంది. రావి చెట్టుగాలి మంచి ఆలోచనలను కల్గిస్తుంది. శుద్ధోదనుని కుమారుడైన సిద్ధార్థుడు ఎన్నో సంవత్సరాలు ఎందరినో సేవించినా కలుగని జ్ఞానోదయం, రావి చెట్టు క్రింద విశ్రమించిన తరువాత మహాజ్ఞానోదయం కలిగి 'బుద్ధుడు'

అయ్యాడు. అందువల్లనే రావిచెట్టును 'బోధివృక్షం' అంటారు. బౌద్ధ మతస్థులకు ఈ చెట్టు మహాపవిత్రమైనది. శ్రీకృష్ణుడు చివరిదశలో ఈ వృక్షం క్రిందనే విశ్ర మించి ప్రాణత్యాగం చేశాడు. ఈవృక్షం ఆడ, మగ పువ్వులు పుష్పించి కాయలు కాస్తుంది.

వేపవృక్షం కూడా ఎన్నో ఔషధ గుణా లను కలిగిన దివ్యవృక్షం. వేప వృక్షంలో ఎన్నో ఔషధగుణాలు వున్నాయి. వేప ఆకును ఎన్నో రోగాలకు మందుగా వాడ తారు. వేప చెట్టు గాలికి ఎన్నో రోగ కారక క్రిములు నశించిపోతాయి. వేపాకులను నీటిలో వేసి కాచిత్రాగినా, స్నానం చేసినా చర్మవ్యాధులు సూక్ష్మక్రిములు నశిస్తాయి. వేప చెట్టువంటి దివ్య ఔషధ వృక్షం భూలోకంలో మరొకటి లేదు.

## 844. రామాయణ భారతాల నీతి ఏమిటి?

**జ.** రామాయణం పితృభక్తికీ, భారతం భ్రాతృభక్తికీ ఉదాహరణలు. "రామో విగ్ర హవాన్ ధర్మః" అంటున్నది ఆర్యజాతి. 'మూర్తీభవించిన ధర్మమే శ్రీరాముడు' అని వేలాది సంవత్సరాలనుండి నమ్ముతూ వస్తున్నది మన హైందవ సంస్కృతి. మనిషికన్నా మతం గొప్పదనీ, దార కన్నా ధర్మం గొప్పదనీ, జనాభీష్టమే రాజాభీష్ట మని నమ్మినవాడు రాముడు! ఆత్మ ధర్మా నికీ రాజధర్మానికీ వంతెన కట్టినవాడు రాముడు! తాను కరిగిపోతూ జనావళికి వెలుగును పంచినవాడు రాముడు! భారతీ



యుల జీవనాడి రాముడు! రావణుడు వేద వేదాంగవేత్త. బ్రహ్మవంశంలో పుట్టిన వాడు. సృష్టి ఎరుగని రాజకీయ దురం ధరుడు. సర్వ విద్యాపండితుడు. పరమ శివభక్తుడు. ఏమైతేనేం, ఎన్ని కళ్లి వుంటేనేం, స్త్రీ వ్యామోహంతో పతనమై పోయాడుగదా! పరస్త్రీ వ్యామోహం ఎంతటి వానికైనా ప్రాణాంతకమేనన్న పరమనీతి యిది! విభీషణుడు అన్నగారైన రావణునితో కలహించి రామునితో చేరటం ఒకరకంగా భ్రాతృద్రోహమే! రావణుని మరణ రహస్యం విభీషణుడు శత్రువులకు తెలియజేయకుంటే రావణుని సంహరిం చటం సమస్యగానే వుండేది. అందుకే "ఇంటి గుట్టు లంకకు చేటు" అంటారు మన పెద్దలు. ఎంతటి విషమ స్థితిలోనూ సోదరులు కలహించుకోరాదన్న నీతిని యిక్కడ గ్రహించవచ్చు.

భారతం భ్రాతృభక్తికి అద్దంలాంటిది. అన్నదమ్ముల అనుబంధం చదవాల్సిందే! రామాయణ భారతాలు రెండూ ఇతి

# 9

హాసాలు. పురాణాలుకాదు. ఊహకు అంద గలిగినది ఇతిహాసం! కేవలం ఊహతోనే నమ్మేది పురాణం. మహాభారత నీతులను నాలుగు వాక్యాలలో చెప్పటం ఎవరికి సాధ్యం! భారతీయుడైన ప్రతివాడు భారతాన్ని చదివితీరాలి. ఒకసారి కాదు పది సార్లు చదివితేనే విషయం బోధపడుతుంది. మనిషి జీవితంలోనికి నడచివచ్చే కష్టదుఃఖాలకు పరిష్కారం భారతంలో దొరుకుతుంది. మళ్ళీ మరొకసారి చెప్పే మాటేమిటంటే భారతం చదవండి. భారతమంటే కౌరవ పాండవుల కథకాదు. నీ కథ! నా కథ! మనచుట్టూ వున్నవారి కథ! గడచిన తరాలవారి కథ! రానున్న తరంవారి కథ! అదే భారత కథ.

## 845. నవరాత్రులు విశిష్టత ఏమిటి ?

**జ.** నవరాత్రులంటే తొమ్మిది రాత్రులు. మనం స్త్రీ- పురుషదేవతల్ని వేర్వేరుగా పూజిస్తాం కాని ఆ ఇద్దరూ ఒక్కటే. అందుకే కాళిదాస మహాకవి

"వాగర్థావివ సంపృక్తౌ వాగర్థః ప్రతిపత్తయే।
జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ॥"

అంటూ శిరస్సు వంచాడు. సంఖ్యలన్నింటిలోనికి 'తొమ్మిదవ' సంఖ్య దైవ సంఖ్యగానూ, బ్రహ్మ సంఖ్యగానూ చెబుతారు. ఆశ్వయుజంలో దేవీనవరాత్రులు, చైత్రమాసంలో వసంత నవరాత్రులు, భాద్రపదమాసంలో గణపతి నవరాత్రులు అన్నీ తొమ్మిది రాత్రులు జరిపే దైవోత్సవాలే! తిరుమలలో వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు కూడా తొమ్మిది రోజులే జరుపుతారు. మహర్షులు, తపస్వీలు, యతులు, వాస్తు నిపుణులు, ఖగోళ శాస్త్రజ్ఞులు, ఆగమ శాస్త్ర పండితులు, వైదికాచార్యులు, అందరూ తొమ్మిదిని దైవశక్తి సంఖ్యగానే భావించి గౌరవించటం అందరికీ తెల్సిందే. భాద్రపద ఆశ్వయుజ మాసాలలో ఆచరించే నవరాత్రులు శ్రేయోదాయకమైనవి. ఎందుకంటే క్రొత్తనీటితో నదీనదాలు ఎంతో కొంత కల్మషపూరితంగా వుంటాయి. అనారోగ్యాన్ని ఉదరసమస్యలను కల్గిస్తుంటాయి. ఈ మాసాల్లో దేహశ్రమ తక్కువగానూ ఆకలి ఎక్కువగానూ కూడా వుంటుంది. సస్య శాకాహారాల్లో క్రిములు కనబడకుండా వుండి ఆహారం ద్వారా కడుపులోనికి ప్రవేశించి అనారోగ్య కారకాలు అవుతుంటాయి. పూజోపాసన కార్యక్రమాలకు తప్పనిసరిగా వుపవాసం వుండి తీరాలి. రాత్రి సమయాలు భోజనం నిషిద్ధం. ఈ వుపవాస క్రియవలన శరీరం శక్తిని పుంజుకుంటుంది. 'దేహదండన' వల్ల తమోశక్తి హరించి దివ్య తేజస్సు నరనరాలకు ప్రాకుతుంది. ఆయుఃశక్తి వృద్ధి చెందుతుంది.

శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తీక మాసాల్లో ఎక్కువగా వ్రతాలు పూజలు వుపవాసాలు పుణ్య స్నానాలు ఏర్ప రచటంలోని మూల ఉద్దేశ్యం యిదే! మార్గ శిర మాసానికి మనిషి బలంగా స్థిరంగా వుంటాడు గాబట్టి మార్గశిర మాసాన్ని విష్ణుమాసంగా చెబుతారు. భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ "మాసానాం మార్గ శీర్షోహం" అంటాడు. పన్నెండు మాసా లలో మార్గశిరమాసం విష్ణుప్రియమైనది.

## 846. ముఖ జ్యోతిష్యం అంటే ఏమిటి?

**జ.** ఇంగ్లీష్‌లో దీన్ని 'ఫేస్ రీడింగ్' అంటారు. దీనినే 'భావసాముద్రికం' అని కూడా వ్యవహరిస్తారు. ఈ జ్యోతిష్యం చెప్పేవారికి మనోజ్ఞానం (సిక్స్‌సెన్స్) వుంటుంది. ఒక వ్యక్తి ముఖ కవళికలను, కంటిచూపులోని శక్తినీ, మాట్లాడేపద్ధతినీ, ముక్కు తీరునూ, వస్త్రధారణనూ, పలు వరుసనూ, పెదాలనూ, కనుబొమ్మలనూ, భూజాల తీరునూ, నిలుచునే / కూర్చునే పద్ధతినీ ముందుగా ఒక అంచనా వేస్తారు. నవ్వే విధానం కూడా పరిశీలిస్తారు. మెడ పొడుగును చూపులతోనే కొలుస్తారు. చేతులను గాని చేతి రేఖలనుగాని పరిశీ లించరు. కొద్ది సమయం ఆలోచించుకొని మన జీవితం గురించి చెప్పటం మొదలు పెడతారు. మనలోని లోపాలను మన లోని విశేషాలను పుస్తకం చదివినట్లుగా చదివేస్తారు. దాదాపుగా ఎనభై శాతం నిజమే చెబుతారు. అయితే, చెప్పేవాడు

Artist

మంచి వాక్‌శక్తి కలవాడై వుండాలి. వినే వారిని మంత్రముగ్ధులను చేయాలి. వినే వాని కళ్ళలోనికి బహుసూటిగా చూస్తూ సావధానంగా సందర్భోచితంగా స్థిర ప్రజ్ఞతో చెప్పాలి. చెప్పేటపుడు ఎదుటి వాని ముఖకవళికలను భావ ప్రకట నను గమనిస్తుండాలి. ఇదొక వశీకరణ విద్య లాంటిది. అనుభవమే దీని మంత్రం. మనో విజ్ఞానమే దీని యంత్రం. సాధన చేస్తూ పోతుండాలి. కొన్ని రోజులకు ఇది కైవశమవుతుంది. దీనికి తొందర పాటు వుండకూడదు. దీనినే మరికొందరు మరొక రకంగా కూడా చెబుతారు. తొమ్మిది సంఖ్యలలో ఒక సంఖ్యను, కొన్ని పూలలో ఒక పూవును, కొన్ని రంగులలో ఒక రంగును, కొన్ని రుచులలో ఒక రుచిని అడిగి తెల్సుకొంటారు. తొమ్మిది సంఖ్య లలో ఒక్కొక్క సంఖ్యకు ఒక్కొక్క తత్వం వుంది. పూలలో ఒక్కొక్క పూవుకు ఒక్కొక్క గుణం వుంది. రంగులలో ఒక్కొక్క

రంగుకు ఒక్కొక్క విశేషం వుంది. రుచులలో ఒక్కొక్క రుచికి ఒక్కొక్క ధర్మం వుంది. వీటన్నిటినీ కలబోసి విశ్లేషించి మన జీవిత నడవడికను చెబుతారు. ఇది కూడా నూటికి ఏనభైపాళ్ళు నిజమే కన్పిస్తున్నట్లుంటుంది. బాబాలు- స్వాములు- గురువులు- పై విధంగానే చెబుతుంటారు. ఇలా చెప్పటానికి మాయ మంత్రం అక్కరలేదు. ఎదుటి మనిషిని అర్థం చేసుకోగలిగిన కొంతసామర్థ్యం, కొంత మాటకారితనం వుంటే చాలు! శక్తి సామర్థ్యాలు మాత్రమే చాలవు. వేషమూ, వేషానికి తగ్గ భాష వుంటేనే నమ్మకం పుడుతుంది. వేషధారణను నమ్మగలిగితేనే నోటిమాట చెవికెక్కుతుంది. ఇదొక తాంత్రిక విద్య.

## *847. అంతిమ సంస్కారంలో మొలత్రాడు కూడా వుండకూడదా?*

***జ.*** ఈ ప్రశ్నలోనే సమాధానం దాగి వుంది. అయ్యో! ఇదేనా జీవితం! ఇంతేనా జీవితం! చివరకు మిగిలిందేమిటి? మనిషి మరణించిన తరువాత మొలత్రాడు కూడా వూడబెరికి మట్టి చేస్తారు. లేదా దహనం చేస్తారు. ఎలా వచ్చాడో అలాగే సంస్కారం చేస్తారు. దిగంబరంగా ఈ భూమికి వస్తారు. దిగంబరంగానే భూమిని వదలి వెళతారు. అయితే జీవితార్థం ఏమిటి? ఈ భవబంధాలకు అర్థం పరమార్థం ఏమిటి? ఈ జీవన చదరంగానికి విలువ ఏమిటి? ఈ జీవితమింతేనా? అవును! కన్ను తెరిస్తే జననం! కన్ను

Artist

మూస్తే మరణం! జననం ప్రారంభం! మరణం ప్రారబ్ధం! చావుకీ పుట్టుకకూ మధ్య వుండే సమయమే జీవితం!

"పుట్ట బట్టలేదు! చావ బట్టలేదు! నడుమ బట్టకట్టనగుబాటుకాదోకో" అన్నాడు వేమన. దిగంబరుడు కాబట్టి వేమన కవి అలా చెప్పి వుండవచ్చు. వేదాంతులకు సన్యాసులకు బట్టలక్కర్లేదు. వారి ప్రపంచం వేరు. కాని నాగరిక సమాజంలో నడిచే వాడికి బట్టలు కావాల్సిందే. దేహాన్ని విడచిన జీవుడీని మోక్షానికి నడిపించేది ధర్మనిష్ఠ, సత్యదీక్ష ఈ రెండు మాత్రమే! ఓ మనిషీ! బ్రతికున్నంతకాలం పెళ్ళాం బిడ్డల కోసం అన్యాయం అక్రమాలు చేసి, ఎందరినో మోసగించి ధనం సంపాదించి మరణించిన ఈ వ్యక్తినిచూడు! ఈ శవాన్ని చూచైనా తెలివి తెచ్చుకో మనిషీ! భార్య వాకిలిదాకా, కొడుకు కాటిదాకా మాత్రమే రాగలిగారు. జీవంలేని దేహం మట్టి కాబోయే ముందు కట్టుబట్టలే కాదు, మొలత్రాడు కూడా మిగల్చడంలేదు చూచావా! "చచ్చిన

వీడిని చూచైనా బ్రతికున్న వారు బుద్ధి తెచ్చుకోండి' అని అన్యాపదేశంగా చెప్పటమే దీని వుద్దేశ్యం.

శ్లో॥ మృతం శరీరముత్సృజ్య కాష్ఠలోష్ఠ సమంక్షితౌ
విముఖా బాంధవా యాంతి, ధర్మస్తమనుగుచ్ఛతి॥

## 848. పతియే ప్రత్యక్ష దైవమా! సతి ప్రత్యక్ష దేవత కాదా!

**జ.** ఈసృష్టి పురుష ప్రధానంగా జరిగింది. దైహికంగా పురుషుడు బలవంతుడు కాబట్టి గృహానికి అతడే ముఖ్యస్థానం పొందాడు.ఏ రకంగానైనాసరే సంపాదించి స్త్రీని పోషించాల్సిన బాధ్యత పురుషునికే వుంది. దైహికంగా స్త్రీలు బలవంతులు కారు. అంతేకాక గర్భవతులు కావటం పిల్లల్ని కనటం పెంచటం స్త్రీల బాధ్యతగా అయింది. వేల సంవత్సరాలకు పూర్వం మానవులు గుంపులు గుంపులుగా జీవిస్తుండేవారు. స్థిరనివాసం వుండేది కాదు. అప్పటికింకా 'గ్రామాలు' పుట్టలేదు. ఒక గుంపులోని ఆడవాళ్ళను మరొక గుంపు వారు ఎత్తుకెళ్ళి పోతుండేవారు. తమవద్దనే శాశ్వతంగా వుంచేసుకొనేవారు. ఈ స్థితిలో పురుషులకు ఆడవారిని రక్షించుకొనే అదనపు బాధ్యత కూడా వుండేది. పగలు ఆహారం సంపాదించటం రాత్రిళ్ళు కాపలా కాయటం పురుషుల కర్తవ్యంగా వుండేది. ఆహారమిచ్చి రక్షించేవాడు ప్రత్యక్షదైవమేగా మరి!

ఈ విధంగా పురుషారాధన ప్రారంభమైంది. భరించేవాడు భర్తకాబట్టి దైవ సమానుడుగా గౌరవించారు భార్యలు.



ఇక్కడొక మాట చెప్పాలి. మానవ ధర్మాలను మూర్ఖంగానో గుడ్డిగానో ప్రవేశపెట్టటం జరగలేదని గుర్తించాలి. ప్రతి ధర్మం వెనుక ఒక ప్రయోజనం వుంది. ప్రతి ఆచారంవెనుకా ఒక ఆలోచన వుంది. మన హిందూ మతమే కాదు ప్రతి మతంలోనూ ధర్మ ప్రయోజనం వుంది.

స్త్రీలకు ఇవ్వవల్సిన స్థానమేమిటో చెప్పకుండానే చెప్పింది హిందూమతం. బ్రహ్మదేవుడు సరస్వతిని తన వాక్కులో దాచుకొన్నాడు. విష్ణువు తన హృదయం లోను, శివుడు తన అర్ధ శరీరంలోను దాచుకొన్నారు. మరి స్త్రీ దేవత కదా! లక్షల సంవత్స రాల నాటి త్రేతాయుగంలో శ్రీరాముడు సీతను అరణ్యానికి పంపాడనీ, హరిశ్చంద్రుడు ఆలిని అమ్మేశాడనీ, ద్వాపరయుగంలో ధర్మరాజు పెళ్ళాన్ని పణంగా పెట్టాడనీ చెబితే ఎలా! ద్వాపరయుగం గతించి ఐదు

వేల సంవత్సరాలకు పైగా అయింది. హరిశ్చంద్రుడు భార్యను అమ్మటంలోని అంతరార్ధమేమిటో, ధర్మరాజు ద్రౌపదిని ఏ స్థితిలో పందెం కాశాడో చెప్పటానికి అవకాశం లేదుమరి. భార్య అంటే అర్ధాంగి అన్నారు పెద్దలు. అర్ధాంగి అంటే పురుషునిలో సగభాగం అన్నమాట. మాతృభూమి, మాతృభాష అనటం స్త్రీని గౌరవించటమే! భర్త దేవుడైతే అర్ధాంగి దేవతయే గదా మరి!

## 849. మాతా పితృఋణం అంటే ఏమిటి ఏం చేయాలి?

**జ.** ప్రతి మనిషి మాతృఋణం, పితృఋణం, ఆచార్యఋణం దైవఋణం, ఋషి ఋణం అన్ని ఋణాలను తీర్చవల్సిన విధి వుంది. జన్మనిచ్చి పెంచి పెద్ద జేసినందుకు మాతాపితృ రుణాన్నీ, విద్యను నేర్పి లోకజ్ఞానం నేర్పినందుకు ఆచార్య రుణాన్నీ, మన మనుగడకు సహకరిస్తున్నందులకు దైవరుణాన్నీ, శాస్త్రాలనూ, ధర్మాలనూ జీవన పరిజ్ఞానాన్నీ గ్రంథాల ద్వారా ఇచ్చినందుకు రుషి రుణాన్నీ తీర్చుకోవల్సిన ప్రధాన బాధ్యత పురుషునికి వున్నది. ఇందు నిమిత్తమే వివాహం చేసుకోవాలని పూర్వీకుల తీర్మానం.


మాతా పితృఋణం అంటే తల్లి దండ్రుల బాకీ అని అనుకోవచ్చు ఒక రకంగా! ఎలాగంటే, పశుపక్షుల్లాగా కాళ్ళు రాగానే నిన్ను బయటకు నెట్టేయలేదు. నీవు ఆర్జనపరుడవయ్యేవరకూ నిన్ను పోషించారు. నిన్ను ఆర్జనపరునిగా చేశారు. నిన్ను చది



వించటమో, పని నేర్పించటమో వారి వారి స్థోమతను బట్టి ప్రయోజకుడిగా చేశారు. నీ భవిష్యత్తుకి ఒక తోడు కావాలని నీకు పెండ్లి చేశారు. నీ భార్యా బిడ్డలను కూడా కంటికి రెప్పలా కాపాడటానికి సిద్ధంగా వున్నారు. రూపాయికి రూపాయిని ముడివేసి నీకింత ఆస్థిని పోగుచేసి పెట్టారు. నీ ముక్కు తుడిచి, నీ మలమూత్రాలను కడిగి నిన్నింతగా చేసిన తల్లిదండ్రులకు సేవచేసి ఆదరించి అభిమానంతో చూచుకోవటమే మాతపితృ రుణంతీర్చుకోవటం. ఏం చేసినా తీరనిది తల్లిదండ్రుల రుణమే గదా!

## 850. అద్దం పగిలితే అరిష్టమా?


**జ.** అద్దం పగిలిపోగూడదు. పగిలిన అద్దాన్ని యింటిలో వుంచకూడదు. మరకలు పడి మాసిపోయి మసక బారిన అద్దాన్ని యింటిలో వుంచరాదు. పగిలిన అద్దంలో ముఖం చూచుకొనకూడదు. అద్దాలను ఇసుకతో తయారుచేస్తారు. ఇసుకను కొన్ని రసప్రక్రియలతో కరిగించి శుద్ధిచేసి గ్లాసులను తయారుచేస్తారు. కొన్ని వందల



సంవత్సరాల క్రితం ఈ ప్రక్రియ ఎంతో శ్రమతో కూడుకొని వుండేది. అద్దాలను 'బెల్జియం' దేశంనుండి చిన్నచిన్న పలకలుగా భారతదేశానికి ఓడలమీద తెచ్చేవారు. పగిలితే పనికిరాని వస్తువు అద్దమే గదా! కాబట్టి విలువైన అద్దాన్ని జాగ్రత్తగా వాడుకోవల్సివుంది. అతి సున్నితమైన వస్తువు అద్దంగాబట్టి పగులకుండా చూచుకోవటానికి ఎంతో హెచ్చరికగా వుండాలి. అందుకోసమే అద్దం పగిలితే అరిష్టం వస్తుందని భయపెట్టేవారని భావించవచ్చు! అద్దం పగిలితే కాలిలో గ్రుచ్చుకొనే ప్రమాదం కూడా వుంది గదా! అద్దం లక్ష్మి స్థానమని మనవారి నమ్మకం. అద్దానికి లక్ష్మికి కొన్ని పోలికలు కూడా వున్నాయి. ఇద్దరిదీ స్థిరత్వ బుద్ధికాదు. అద్దంలో ఎపుడూ ఒకే బొమ్మ నిలిచి వుండదు. లక్ష్మి కూడా ఎప్పుడూ ఒకచోట నిలిచి వుండదు.

### 851. పాలను త్రొక్కితే పాపమా?

**జ.** మహాలక్ష్మీదేవి పాలలోనే పుట్టింది. పాలు లక్ష్మీదేవికి నివాసస్థానం. ఆ కారణంచేత పాలను త్రొక్కకూడదు. ఒక్క చుక్కపాలు తయారుకావటానికి శరీరానికి ఎంతో శక్తి కావాలి! పాలల్లో ఎంతటి సంపూర్ణశక్తి వుంది! త్రాగిన వెంటనే మనిషికి శక్తిని సమకూర్చేది పాలు ఒక్కటే! ద్రవాహారంలో పాలు, ఘనాహారంలో చేప, ఈ రెండు ఆహారాలు అతివేగంగా శరీరానికి శక్తినిస్తాయి. పాలు అమృతంతో సమానమైనవి. ఏ కారణంచేతనూ పాలు, పెరుగు, వెన్న, నేయి వృధా చేయటం పాపం. అందువల్లనే మన పూర్వజాతి జీవనోన్నతికి కారణమైన ఆవు, మేక (గొర్రె), ఈ మూడింటినీ చేతితో అదలించాలేగాని కర్రతో కొట్టటం మహాపాపం అని వేద శ్రుతి. ఆవునీ, మేకనీ, గుర్రాన్నీ కొట్ట



కూడదు. మన జాతి వికాసానికి తోడుగా వున్న ప్రాణులు ఇవే. మనిషి తన మేధాశక్తితో తెలివితో సృష్టించలేనివి పాలు! పాలను కృత్రిమంగా ఏ మేధావీ సృష్టించలేదు. పాలలో గొప్పదనం అదే! ఏ మాత్రమూర్తి అయినా తన చేతితో గ్లాసుడు

పాలు ఇచ్చిందంటే ఆమె మనకు స్వంత తల్లితో సమానమే. పాలు సమృద్ధిగా వున్న యింటిని శనీశ్వరుడు తన కడగంటి తోనైనా చూడడట. పాలవాసన వున్న యింటికి దరిద్రదేవత రాదట!

## 852. మంగళసూత్రం బంగారానిదే వుండాలా?




**జ.** నిజంగా, రెండువేల సంవత్సరాల క్రితం మనకు మాంగల్యం లేదు. "మాంగల్యం తంతునానేన మమజీవన హేతునా కంఠే బధ్నామి సుభగే సంజీవ శరద శ్శతం' అనేటువంటి శ్లోకం లేదు. సప్తపది వుంది. కన్యాదానం వుంది. అగ్నిసాక్షి వుంది. శ్రీరామచంద్రుడు సీతామతల్లికి మాంగల్యం కట్టేది చలన చిత్రాలలోనే! రాముని కాలంలో మాంగల్యధారణ లేదు. కన్యాదానం మాత్రం వుంది. ప్రమాణం వుంది. ఈనాటికి కొన్ని రాష్ట్రాలలో మాంగల్యధారణ లేదు. ఆనాటి పెండ్లికి ప్రమాణమే ముఖ్యం! అంతే! ఈనాటి పెండ్లికి మనసే ముఖ్యం! ఇంతే! ఆనాడైనా ఈనాడైనా పెండ్లి అంటే మూడు ముళ్ళు, బాజాలు, లైట్లు, వేయిమందికి భోజనాలు, నగలు, కారులు, కట్నాలు, పట్టుచీరలు, కళ్యాణ మండపాలు, వీడియోలు, గానాబజానాలు కాదు! వివాహం అంటే ఏమిటో, ఎందుకు కావాలో ఏ తల్లిదండ్రులైనా తమ బిడ్డలకు చెప్పారా!?!

విలువలు తెలియని వివాహానికి గెలుపెందుకుంటుంది! మరి అందుకే, విడాకులు అంటే ఎవరికీ భయంలేదు. పెండ్లి అంటే– ఒక ఒప్పందం! ఇరుజీవిత కాలపు తిరుగులేని మహా ఒప్పందం!! ఏ కోర్టులూ, ఏ చట్టాలు, ఏ మనుష్యులు, ఏ సమస్యలు, ఏ కష్టాలు, ఏ దేవుడూ విడదీయరాని, విడదీయలేని, విడదీయ గూడని, ఆత్మసాక్షి ఒప్పందం! "వివాహం ప్రతి వ్యక్తికీ ఒక మలుపు. మరణించే వరకూ వుండవల్సిన తీయని వలపు." అందుకే, క్రైస్తవమతం విడాకులకు అంగీకరించదు. మహమ్మదీయ మతం విడాకులను అంగీకరించదు. హిందూమతం ఏ స్థితిలోనూ విడాకులను అంగీకరించదు. వివాహం చిన్న విషయమేమోగాని విడాకులు మాత్రం చిన్న విషయం కాదు.

వివాహానికి మంగళ సూత్రం బంగారానిదే వుండాలా? మరొక లోహానిది పనికిరాదా! ఎందుకు పనికి రాదు? అని ప్రశ్నిస్తే–"తాళి" అంటే తాళవృక్షపు (తాటి చెట్టు) ఆకులతో వివిధ రకాలుగా తయారు చేసే చిన్ని ఆభరణం వంటి దానిని 'తాళి' అంటారు. ఇది ద్రావిడుల ఆచారం. మన లాంటి తాళి ఉత్తర భారతీయులకు (ఆర్యులకు) లేదు.

## 853. ప్రతి పూజకూ ఆవుపాలు కావాలా?

**జ.** శ్లో॥ గ్రీవా మస్తక సంధే తుతాసాం గంగా ప్రతిష్ఠితా
సర్వతీర్థమయో గావః సర్వతీర్థమయః తథా॥



గోవుల కంఠములోనూ, పొదుగు లోనూ, మూత్రములోనూ గంగాదేవి వుంది. శిరస్సు, గంగడోలు, కాళ్ళు, కళ్ళు, చెవులు, తోక మొదలైన గోవు సర్వ అవయవాలలోనూ సర్వదేవతలు వుంటారని హిందువులకు ప్రగాఢ నమ్మకం. కొన్ని నివారణలేని రోగాలకు గోమూత్రాన్ని ఔషధంగా కూడా త్రాగుతారు. గోవు మల మూత్రాలలో 'పెన్సిలిన్' వుందని కనుగొన్నారు. గోవు నోటినుండి వచ్చే నురుగుని మానని వ్రణాలమీద రాస్తూ వుంటే ఎంతటి పుండు అయినా మనాపోతుందట.

అందుకే గోవును 'గోమాత' అని గౌరవపూర్వకంగా పిలుస్తారు. ప్రతి రోజు ఆవుపాలే కావాలా అంటే, వైదిక ధర్మం కావాలని చెబుతోంది. ప్రతిదేవుని పూజకూ ఆవుపాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, ఆవుమూత్రం, ఆవుపేడ విధిగా కావాలని చెబుతారు పురోహితులు. పాలపాకెట్లు వచ్చేశాక ఆవులను పెంచటం పూర్తిగా మానేశారు. ఏ యింటి ముందు గోమాత వుంటుందో ఆ యింటిలో సర్వ శుభాలు వుంటాయి. ఆవు పాలు కావాలంటే పట్టణాలలో కష్టపడవల్సిన స్థితి వచ్చింది. గేదెపాలను పలుచగా చేసి ఆవు పాలు అని మోసం చేయటం మామూలే. క్రొత్తగా కట్టిన యింటి గృహప్రవేశం జరపాలంటే గోమాత కావల్సిందే. ముందుగా గోవును ఇంట్లో త్రిప్పిన తరువాతనే అందరూ గృహప్రవేశం చేస్తారు. భారతీయ జనజీవితంతో గోవు జతపడి వుంది. ఏ పూజలోనైనా గో క్షీరంతో దైవాభిషేకం చేయాల్సిందే. పూర్వకాలంలో భూస్వాములకు గోస్వాములకున్నంత మర్యాద వుండేది కాదు. మొదటి కాన్పుకి వచ్చిన కూతురు బిడ్డతోపాటు అత్త వారింటికి వెళ్ళేటపుడు రెండు గోవుల్ని పసిపాప కోసం కానుకగా పంపే ఆచారం వుండేది.

మహాభారత కథలో ద్రోణునికీ ద్రుపదునికీ గోవువల్లనే గొడవ వచ్చింది. శాస్త్రాలు చెప్పవల్సిన బ్రాహ్మణుడు ఈ గొడవ వల్లనే శస్త్రాచార్యుడై క్షత్రియుడయ్యాడు. ఒక్క ఆవుకోసం మొదలైన వివాదం చిలికి చిలికి గాలివానగా మారి ద్రుపదద్రోణుల మరణానికి దారి తీసింది.


విష్ణుమూర్తికి గోవులంటే యిష్టం. అందుకే గోవిందుడు, గోపాలుడు అంటారు. గోవులుండే చోటికి శనీశ్వరుడు రాడు. గోదానం కూడా గొప్పది.

## 854. ఉపవాసాలు దైవప్రియమా?

శ్లో॥ క్లప్త కేశవ ఖశ్మ శ్రుఃధాంతః శుక్లాం బరం శుచిః

స్వాధ్యాయే చైవ యుక్తస్య నిత్య మాత్మ హితేషు చ ॥-మనుస్మృతి 4-35

"శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" అనేది ధర్మశృతి. వ్రతాలు, నియమాలు, పూజలు మొదలైనవాటి పేరు మీద అకారణ ఉపవాసం వుండకూడదు. దేవుని ప్రేమించటం పూజించటం ఎంత మంచిదో మన శరీరాన్ని ప్రేమించటం కూడా అంతే మంచిది. నీకు సంక్రమించిన పాపాలకు, నీకు లభించబోయే పుణ్యాలకు శరీరానికీ ఏ సంబంధమూ బాంధవ్యమూ వుండదు. పాపాలు పుణ్యాలు చేసేది మన మనస్సు. శరీరంకాదు. ఆత్మకూ దేహానికీ సంబంధం లేనపుడు ఉపవాసాలతో దేహాన్ని దండించటం వివేకం లేనిపని. "చిత్తం చెప్పుల మీద, భక్తి దేవునిమీద" అన్నట్లుగానే దేహం దేవుని దగ్గర మనసు ఆకలి దగ్గర వుంటే ఫలితమేమిటి? కాని.... ఒక్క విషయం! ఉపవాసం దేహంలోని మలినాలను తొలగిస్తుంది అనేది నిజమే! అయితే ప్రశాంత సమయాలలోనే వుపవాసాలు చేయాలి. బంధువులు వచ్చినపుడు, మిత్రులు వచ్చినపుడు, దానధర్మాది కార్యాలు చేయవల్సి వున్న సమయంలో, వుపవాసం వుండవల్సిన పనిలేదు. ధర్మశాస్త్రం అంగీకరించదు. దేహాన్ని కాపాడుకోవటం అన్ని ధర్మాలకన్నా గొప్పధర్మం.



దైవానికి దేవతార్చనకూ కావల్సింది మనసుగాని, ఉపవాస నియమం కాదు. చాలామంది 'నేను దేవుని పూజించ కుండా పచ్చిగంగ కూడా ముట్టుకోను' అని బడాయి కబుర్లు చెబుతుంటారు. అలా చెప్పటం వారి అజ్ఞానమే గాని భక్తిమాత్రం కాదు.

దేవుణ్ణి సరిగా అర్థం చేసుకొన్న భక్తులే వేరు! దైవ ప్రియుల్ని పురాణాలు దారి తప్పించాయని చెప్పటానికి నేను సంకోచ పడవల్సిందేమీ లేదు! దేవుడ్ని మన పురాణాలు దెయ్యాన్నిగా చూపిస్తున్నాయి. భగవాన్ వ్యాసమహర్షి పేరున పురాణాలలో వున్నవి లేనివి యిరికించి పరమ పవిత్రమైన దేవునికి దెయ్యపు గుణాలు అంటగట్టారు. దేవుడు ఆగ్రహిస్తాడనీ అపకారం చేస్తాడనీ ఆపదలు కల్గిస్తాడనీ చెప్పటం దేవునికి చేసే అపకారమే! దేవుడు మన తండ్రి. క్షమించటమే ఆయనకున్న గుణం. దుర్మార్గుడిని కూడా దగ్గరకు తీసుకొని ప్రేమించటమే ఆయనకు అలవాటు. దయచేసి వంట చేసుకోవల్సిన నిప్పుతో వళ్ళు కాల్చుకోకండి' సత్యనారాయణుని పూజించండి.

## 855. సుముహూర్తం తిథి, రాహుకాలం, నమ్మవచ్చా?

**జ.** ఐదువేల సంవత్సరాలకు పూర్వం భారతీయ మహర్షులు సూర్యచంద్రుల గమనాన్ని అనుసరించి తిథి - వారం- నక్షత్రం- యోగం-కరణం మొదలైన ఐదింటితో పంచాంగాన్ని రచించారు. చరిత్రకారుల అంచనా కూడా మనకు వారాలు, నెలలు, సంవత్సరాలు, తిధులు పుట్టి ఐదువేల సంవత్సరాలు! కాని పూర్వీకుల అంచనా ప్రకారం త్రేతా యుగంనుండి ఖగోళ విజ్ఞానం భారతీ యులకు వున్నట్లుగా చెప్పటం జరుగు తూవుంది.

## 856. ఏ తిథులు విధిని మార్చలేవు.

**జ.** అయితే, ఏ పనిచేయటానికైనా ఒక నిర్ణీత సమయం నిర్ణీత దినం కావాలి. కాబట్టి విద్యావంతులైన పండితుల సలహా కావాలి. అలా ప్రారంభమైన ముహూర్త సమయాలు భారతీయుల్లో సుస్థిరస్థానం పొందాయి. మహాభారత యుద్ధానికి అమావాస్య ముహూర్తం పెట్టారు. అయినా పాండవులు విజయాన్ని సాధించు కొన్నారు. సప్తమహర్షుల్లో విశిష్టుడుగా పేరొందిన బ్రహ్మర్షి వశిష్ఠుడు శ్రీరామ పట్టాభిషేకానికి పెట్టిన ముహూర్తం వ్యర్థమై పోయిందెందుకు? అష్టమి రోజున జన్మించిన శ్రీకృష్ణుడు దశావతార శ్రేష్ఠ డుగా వాసికెక్కాడేమిటి? సముహూర్తాల వల్ల, తిథులవల్ల, మనిషి రాత మారిపోతే



బ్రహ్మరాతకు అర్థమేముంది! మన తల వ్రాతను పంచాంగాలే నిర్ణయిస్తాయి గదా అపుడు. మనిషి సహజంగా మనో దుర్బ లుడు. తనమీద తనకే నమ్మకం తక్కువ గాబట్టే సుముహూర్తాల వలలో పడి పోతుంటాడు. నిజంగా ముహూర్త బలం వుంటే ఎన్నోవివాహాలు విచ్ఛిన్నమై పోతున్నా యెందుకు? సుముహూర్తానికి ప్రారంభిం చిన ఎన్నో వ్యాపారాలు దివాళా తీస్తున్నా యెందుకు? కేవలం ముహూర్తాలవల్లనే మంచి జరగదు! మనలో ఆత్మవిశ్వాసం - కృషి- నేర్పు- ఓర్పు- పట్టుదల వుంటే ఏ తిథితోనూ, ఏ రాహుకాలం తోనూ పని వుండదు. ప్రతిరోజూ ప్రయాణించే విమా నాలు-రైళ్ళు-బస్సులు రాహుకాలం చూచుకొనే బయలుదేరుతున్నాయా! అలా బయలుదేరటం కుదురుతుందా! మనం ప్రతిరోజూ పనిచేసే ఆఫీసులన్నీ రాహు కాలం చూచే తెరుస్తారా! లేదే! పూర్వ కాలంలో విద్యావంతులైన పండిత బ్రాహ్మణవర్గానికి శారీరక శ్రమ చేసి

సంసారం పోషించుకొనే శక్తి, సమయమూ వుండేవికావు. ఏ మనిషికైనా ఒక సమయం చెప్పి ఆ సమయాన్నే పని ప్రారంభిస్తే మంచి జరుగుతుందని నమ్మకం కల్గిస్తే ఆ నమ్మకమే అతనిని విజయవంతుని చేస్తుంది. చైత్రమాసం శుభకార్యాలకు మంచిదని, ఆషాఢమాసం ఏ శుభ కార్యానికీ పనికిరాదని చెప్పటంలో ఒక ప్రయోజనం వుంది. పొలం పనులు చేసుకోవల్సిన సమయాల్లో పెండ్లి పనులు పెట్టుకోవటం మంచిది కాదు గదా!

## 857. దేవదాసీలు దేవాలయాలకు అవసరమా?

***జ.*** స్వర్గలోకానికి అప్సరసలు అవసరమా! అన్నట్లుందీ ప్రశ్న. సరే! దేవాలయాలకు దేవదాసీలు వుండటంలోని ఔచిత్యమేమిటో పరిశీలిద్దాం. క్రీ.శ. ఆరవ శతాబ్దం నుండి ఈ దేవదాసీ పద్ధతి వున్నట్లు చారిత్రక ఆధారాలు వున్నాయి. అంటే మనకు వేయి సంవత్సరాల క్రితమే ఈ దేవదాసీ ఆచారం అభివృద్ధిలో వున్నట్లు తెలుస్తోంది. ప్రారంభ దినాలలో దేవదాసీలు వేశ్యలుకారు. దేవుని దాస్యం కోసం నియమింపబడ్డ సేవకులు! ఈ దేవదాసీలనే గుడిచేటినులు అంటారు. ఆనాడు దేవాలయాల నిర్మాణ ప్రారంభం కాశీ నుండే మొదలైనదని చెప్పవచ్చు. భారత దేశం మొత్తంలో 32 లక్షల దేవాలయాలు వుంటే కాశీలో 1500 దేవాలయాలు వున్నాయి. (ఔరంగజేబు చాలా ముఖ్యమైన ఆలయాలను ధ్వంసం చేయించాడు)



దేవాలయాలకు పూర్వం గుహాలయాలు నిర్మించబడ్డాయి. ఇవి మన దేశంలో 1.112 ఉన్నాయి. అప్పటి దేవాలయాల నిర్మాణవుద్దేశ్యం కేవలం దేవపూజకు మాత్రమే కాక, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక, దైవిక కార్యక్రమాలకు వేదికగా వుండాలని భావించారు. దేవదాసీలు వివాహం చేసుకొనరాదన్న నియమం వుండేది. ప్రతిపున్నమికీ దేవాలయాల్లో దేవుని ఎదుట దేవదాసీలు నృత్యగానాలు చేసేవారు. వీరందరికీ రాజాదరణ వుండేది. కొందరు దేవదాసీలు రాజకీయ రహస్య ప్రతినిధులుగా కూడా వుండేవారు. వీరికి ప్రత్యేక భవనాలు వుండేవి. నృత్యగానాలే వీరికి ముఖ్యవృత్తి. వీరు దేవుడినే భర్తగా భావించేవారు. కాలక్రమంలో దేవదాసీలు శ్రీమంతుల భోగ వస్తువులుగా మార్పుచెందారు. ఇహలోక


సుఖాలకు తలవంచారు. రాజులకు వుంపుడుగత్తెలుగా స్థిరపడిపోయారు. కడుపుకోసం పడుపువృత్తి చేసినా నీతినియమాలు తప్పేవారు కాదు. మనదేశంలో ఎన్నో దేవాలయాలు దేవదాసీలు కట్టించినవి వున్నాయి. ఎంతోమంది దేవదాసీలు దేవస్థానాలకు మాన్యాలకు యిచ్చినట్లుగా శాసనాలు వున్నాయి. మంచి చెడులు ప్రతిచోటా ప్రతివారిలోనూ వున్నాయి. వుంటాయి. దేవదాసీలలో చాలామంది కవయిత్రులు కూడా వున్నారు. వీరందరూ భాషా పాండిత్యంలోనూ, చిత్రకళలోనూ, సంగీతంలోనూ, గానంలోనూ, నృత్యంలోనూ, కవిత్వంలోనూ సిద్ధహస్తులే! (శృంగారంలో కూడా) ప్రతిరోజు దేవాలయానికి వచ్చి పూలహారాలు సమర్పించి దైవగీతాలు ఆలపించి హారతులందు కోవటం వీరి ముఖ్యవిధి. వీరికోసం ప్రత్యేకమైన గుర్రపుబండ్లు వుండేవి. వందల ఎకరాల భూమి వీరికోసం మాన్యాలు వుండేవి. రాజాశ్రయంతో పాటు రాజరక్షణ కూడా వీరికి వుండేది. ఈ దేవదాసీ మహిళలందరూ శృంగార కళాపాండిత్యంలో రాటుదేలిన నీటురాండ్రు! తమిళ ప్రాచీన గ్రంథమైన 'శిలప్పదిగారమ్'లో వీరిని గురించి తెలుసుకోవచ్చు. ఏ సంప్రదాయమైనా, ఏ ధర్మమైనా ప్రారంభంలో సదుద్దేశ్యమే వుంటుంది. కాలక్రమంలో వెర్రి తలలు వేసి దురాచారంగా పరిణమిస్తుంది. ఈ మాదిరిగానే దేవదాసీ వ్యవస్థతో పాటుగా దేవదాసీలు 'భోగంవారు' గా పరివర్తన చెందారు. దైవ కార్యాలను పరిత్యజించి 'సానులు'గా మారి పోయారు. ధన సంపాదనే ధ్యేయమైపోయి అతి కోర్కెలకు లొంగిపోయి సమాజంలో మర్యాదను కోల్పోయారు. ఈ సానులకు బిడ్డలుంటారు కాని భర్తలుండరు. దేవదాసీలు లైంగిక దాసీలుగా మారటాన్ని గమనించిన దేవాలయ ధర్మాధికారులు వీరిని శాశ్వతంగా దైవకార్యాలనుండి తొలగించారు. అంతే! వీరి జీవనపథం మారిపోయింది. స్వేచ్ఛా జీవితంతో పాటు సుఖాభిలాష పెరిగిపోయింది. విలాస పురుషులైన శ్రీమంతులకు సుఖాలను అమ్ముకొనే సానులు అయ్యారు. మహారాష్ట్ర-కర్ణాటక-కేరళ రాష్ట్రాలలో అరవై వేలమంది దేవదాసీలు వున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. కాని వీరందరూ దేవదాసీలు కాదు. దేవదాసీల పేరుతో వ్యభిచార వృత్తి చేస్తూ జీవిస్తున్నవాళ్ళు. 18వ



శతాబ్దంనుండీ వేశ్యావృత్తిని నిర్మూలించ టానికి ఎన్నో ప్రయత్నాలు జరుగుతు న్నాయి. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ఎంతగానో శ్రమిస్తున్నాయి. కాని ఫలితం శూన్యమేనని చెప్పక తప్పదు. నేటి ప్రభుత్వం మహారాష్ట్ర (ముంబాయి)లోని వేశ్యలకు లైసెన్స్‌లను మంజూరు చేయా ల్సిన స్థితికి తలవంచింది. ప్రపంచ దేశాలు ఎంతటి కఠిన శిక్షలు అమలు చేసిన ఈ వేశ్యావృత్తిని అరికట్టలేక పోయాయి. ఢిల్లీ – ముంబాయి– బెంగుళూరు వంటి మహా నగరాలలో ఆడ దేవదాసీలేకాదు, మగ దేవదాసీలు కూడా వున్నారు అంటే నమ్మ బుద్ధి కావటంలేదు గదూ! అన్ని మహా నగరాలలో మగవేశ్యలు వున్నారు. అదే ముస్లిం దేశాలలో వ్యభిచారానికి మరణ శిక్ష విధిస్తారు. వ్యభిచారం తప్పు! కాని బహుభార్యాత్వం తప్పుగాదు. మద్య పానానికీ వ్యభిచారానికీ ప్రపంచదేశాలన్నీ తలలు వంచేశాయి. నైతికత, మనుష్య లలో వుండాలిగాని చట్టాలు శాసనాలు ఏం చేస్తాయి! కాల్పనిక సుఖాలకు మనిషి ఎప్పుడూ బానిసే! అందుకే మనుషులే మారాలి!

## 858. విద్య, వేదము, అన్నము విక్రయించకూడదా?


**జ.** కూడదు! ఇది పుణ్యభూమి! ఇక్కడ అన్న విక్రయం జరగకూడదు. ఇది వేద భూమి! ఇక్కడ వేదశాస్త్రాల విక్రయం వుండకూడదు. ఇది ధర్మభూమి! ఇక్కడ విద్యా విక్రయం చేయకూడదు. ఇది కర్మ భూమి! ఎవరూ దుఃఖితులు కాకూడదు.



వేల సంవత్సరాలనాటి భారతదేశ సమాజం, భరత ప్రజ, భరతదేశ రాజ రికం పైన చెప్పిన సిద్ధాంతాలను తు.చ తప్పకుండా నియమనిష్ఠానిరతులై పాటించేవారని శాస్త్రాలు స్మృతులు చెబు తున్నాయి. వేయి సంవత్సరాలక్రితం వరకూ ఆహారాన్నీ విద్యనూ విక్రయించే వారు కాదిక్కడ! అంతెందుకు, ఈనాడు కూడా వేదపురోహితులు వివాహం చేయించినా, పూజాదికాలు చేయించినా ముందుగానే యింత ఇవ్వాలని బేరం చేయరు. ఎక్కడైన ఎవరైనా పెండ్లి చేయిస్తే ఎంతిస్తారు? పూజ చేయించితే ఎంతి స్తారు? అని గనుక అడిగితే వాడు బ్రాహ్మ ణుడే కాదని అర్థం. అటువంటి అధమ బ్రాహ్మణునితో వివాహాది వైదిక కార్య క్రమాలు చేయిస్తే ఫలితం వుండకపోగ దురితం వస్తుంది. ఈనాటి భోజన హోటల్స్, ఉపాహారశాలలు మన సాంప్ర దాయంకాదు. అందువల్లనే భారతీయ ధర్మశాస్త్రం 'అతిధి దేవోభవ' అని చెబు తుంది. ప్రతి గృహస్థుడూ వర్ణకుల విబేధం లేకుండా ప్రతిరోజూ ఎవరో ఒక అతిథికి భోజనం పెట్టి దైవకార్యంగా సంతోష పడే

వాడు. 'అన్నదాతా సుఖీభవ' అని భోజనం చేసిన అతిథి ఆశీర్వదించి వెళ్ళేవాడు. ప్రతి ప్రాణికీ ఆహారం అతిముఖ్య అవసరంగదా! 'విద్యాదానం మహత్తరం! మనం నేర్చిన విద్య మనతోనే నశించి పోకూడదు. ఒక విత్తనం నాటితే వేల విత్తనాలను మనకు అందించినట్లుగా మనం నేర్చిన విద్యను మన సమాజానికి అందించి విద్యా సంపన్నులను చేయటమే విద్యా పరమార్థం! మనిషికి విజ్ఞాన వివేకాల నందించే విద్యను ధనాశతో విక్రయం సాగిస్తే నీవు జన్మించిన నీ సమాజానికి నీవేమి వుపకారం చేసినట్లు? నీ జన్మభూమికి నీ రుణం తీరేదెట్లు? 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపిగరీయసి' అన్న హితవాక్యం ధూళికి పోయినట్లే గదా! ప్రపంచానికే ఆదర్శవంతమైన దేశం మనది ఒకప్పుడు పాశ్చాత్యుల పాదార్పణతో భారత సంప్రదాయాలన్నీ హారతి కర్పూరమై పోయాయి. ఈనాటి విద్యార్థులు చదవటంలేదు. "చదువు కొంటున్నారు" ఈ దేశ తీరుతెన్నులన్నీ మారిపోయాయి. మార్పు కోరుకోవటమే మానవ లక్షణం. మార్పు లేకుండా మనమింత ప్రగతిని సాధించే వాళ్ళం కాదు. కాని ... మార్పుతో పాటుగా మానవత కూడా వుంటే ఎంత బాగుంటుంది! మానవత నిండిన మనుగడ మనిషికి మహదానందాన్ని కల్గిస్తుందన్నది నిత్యసత్యం. ఎన్నిదేశాలనైనా పర్యటించు! మన దేశాన్ని మాత్రం మరచిపోకు! ఎన్ని భాషలనైన నేర్చుకో! తల్లి భాషను మరిచిపోకు!

## 85రి. జ్యోతిష్యం నమ్మదగినదా?




**జ.** భవిష్యత్తు ఏం జరుగనున్నదోనని ప్రతిమనిషికీ ఆతృత, ఆలోచన వుంటాయి. తెలుసుకోవాలన్న ఆకాంక్ష ప్రతి వారికీ సహజమే. శత్రువులతో సతమత మయ్యే మంత్రులకూ, లాభనష్టాలు ఆలోచించే వ్యాపారులకూ అధికార ప్రాప్తికోసం ఉబలాటపడే ఉద్యోగులకూ, సరిగా చదవని విద్యార్థులకూ భవిష్యత్తు అంధకారంగా కన్పించే ఎంతో మందికి జాతకాలనూ, జ్యోతిష్యాన్నీ ఆశ్రయించక తప్పటం లేదు. చాలా దేశాలలో ఇపుడు జ్యోతిష్యాన్ని నిషేధిస్తున్నారు. జ్యోతిష్యం నిజమేనని ఒకవేళ అంగీకరించినా, జీవిత సరళిని విపులీకరించి చెప్పగల వుద్దండ పండితుడు ఒక్కడూ లేదు. "ఉదరం నిమిత్తం బహుకృతవేషం" అన్న సూక్తికి సరిపడిన పండితులే వీళ్ళందరూ. దయచేసి జాతకాలను నమ్మవద్దు కృషిని నమ్మండి! కష్టపడండి! అకస్మాత్తుగా ధనవంతులు కావాలని కోరుకోకండి.

'అదృష్టం' అంటే అవకాశం! అవకాశం కోసం ఎదురుచూస్తూ మీ కృషిని మీరు చేయండి. అక్కరకురాని ఆలోచనలు వదలండి. అత్యాశకు పోకండి మీ జీవన సరళిని మార్చుకోండి. పొదుపును పాటించండి. జల్సాలకు పోకండి. గొప్పతనంకోసం వృధా ధనవినియోగం విరమించండి. అప్పుడు మీకు దేవుడు సహకరిస్తాడు. నవగ్రహాలు మీరు వద్దన్నా తోడుగా వుంటాయి. సోమరిపోతుని, ప్రతిదానినీ విమర్శించేవాడినీ, సుఖాభిలాషినీ సంపదలు వరించవు. అతి విమర్శలు మానుకొనండి! అందరికీ మిత్రులు కండి! అందరితోనూ ప్రియంగా మాట్లాడండి! అపుడు దేవుడు మేలుచేస్తాడో లేదో గాని, మీ చుట్టుప్రక్కల వారందరూ సహకరిస్తారు.

### 860. దేవుడున్నాడు!

**జ.** ఆయన కేవలం మీ ఒక్కరి సుఖాలను చూచే మీ బంట్రోతు కాదు. అమెరికా ప్రెసిడెంట్‌గారి కారు అయినా పెట్రోలు లేకపోతే నడవదు. మనమెంత విద్యావంతులమైన వినయం లేకుంటే గౌరవం దొరకదు. "ఇరుసున కందెన బెట్టక పరమేశుని బండియైన పారదు సుమతీ" అన్నాడు సుమతీకర్త. పరమేశ్వరుని బండికైనా "ఆయిల్" వేయకపోతే నడవదు సుమా! హిట్లర్ నియంత అంతటి సామ్రాజ్యం, వందలకొద్దీ జ్యోతిష్య పండితులు సూచనలిచ్చేవారు. చివరకు హిట్లర్ ఏమయ్యాడు. పరాభవంపాలై పోయి కన్నుమూసాడు.



కాబట్టి నిన్ను నడిపించేది నీ కృషి! నీ మంచితనం! నీ ప్రవర్తన! నీ పట్టుదల మాత్రమే! జ్యోతిష్యంకాదు. పూజలు నైవేద్యాలు కాదు. కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన। మాకర్మ ఫలహేతుర్భూః మాతే సంగోస్త్వ కర్మణి॥

### 861. హిందూమతం స్త్రీకి స్వేచ్ఛను ఇవ్వలేదా?

**జ.** ఎవరు? ఎవరన్నారు? ఎవరు చెప్పారు? హిందూమతం స్త్రీకి కల్పించిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ఆర్థికసమానత్వం, ప్రేమాదరణలు మరొక మతం స్త్రీకి కల్పించలేదు. హిందూ చరిత్రను చూడండి! వేల సంవత్సరాల నాడే హిందూమతంలో స్త్రీకి స్థిరభద్రత కల్పించారు పూర్వీకులు.

అసలు స్వేచ్ఛ అంటే ఏమిటి?

స్వాతంత్ర్యం అంటే ఏమిటి?

భారతీయ హిందువులైన స్త్రీ పురుషులందరూ ఆలోచించాల్సిన విషయమిది. హిందూ స్త్రీని హిందూమతం అణగద్రొక్కిందా? ఆర్యనారిని సనాతనమతం అణచి వేసిందా? ఎవరు! ఈ తప్పుడు



సిద్ధాంతాన్ని ప్రతిపాదించెందెవరు? ఆర్యులు అనాగరికులా? హిందువులు మూర్ఖులా! స్వార్థపరులా! లాలసులా! పరపీడనా పరాయణులా? ఎవరికంటే తక్కువ వారు హిందువులు???? నాగరికత లేనిరోజుల్లోనే నాగరికులు హిందువులు. స్వధర్మ పరాయణులు హిందువులు. హైందవ ధర్మశాస్త్రానికి పునాదులు వేసినవాడు మనుమహర్షి! మనువు బ్రాహ్మణ పక్షపాతి అనీ, శూద్రకుల శత్రువనీ, సర్వస్త్రీజాతి శత్రువనీ, ఈనాడు మనం మనుమహర్షిని దూషిస్తున్నాం. తిరస్కరిస్తున్నాం. అవహేళన చేస్తున్నాం. మనుమహర్షి వేల సంవత్సరాలనాడు త్రేతాయుగ ధర్మంగా మనుస్మృతిని రచించాడు. మనువు తాను రచించిన స్మృతిలో శూద్రకులస్థులను చాలా హీనంగా చిత్రీకరించాడు. బ్రాహ్మణ వర్ణాన్ని అతిగౌరవించాడు. కులాల ప్రకారంగా న్యాయ విచారణ చేయాలనీ, శూద్రులకు వేద శ్రవణం కూడా తగదనీ, సేవకాజీవనమే తగినదని చెప్పాడు. ఆనాటి కులధర్మాలు ఏవిధంగా వుండేవో తెలియదుగాని మనుధర్మం శూద్రవర్ణానికి చెప్పలేని బాధ కల్గించిన మాట మాత్రం నిజం. సహించరాని తప్పు చేసిన మనుమహర్షి నిందార్హుడే! కాని, హిందూధర్మశాస్త్రాలకు మనస్మృతియే పునాది. పరాశర, వ్యాసమహర్షులు కూడా మనబాటలోనే నడిచారు. నేటి భారతీయ శిక్ష్మాస్మృతి'కి చాలావరకు మనుస్మృతి ఆధారంగా చేశారు. స్త్రీ స్వాతంత్ర్య విషయంలో ప్రతివారు మనుస్మృతిలోని ఆనాటి ఈ శ్లోకాన్ని చెబుతారు–

శ్లో॥ పితారక్షతి కౌమరే భర్తా రక్షతి యౌవనే।
రక్షంతి స్థవిరే పుత్రాః నస్త్రీ స్వాతంత్రమర్హతి॥

**మనుస్మృతి** 9-3

బాల్యంలో తండ్రి, యవ్వనదశలో వివాహమాడిన భర్త, వార్ధక్య స్థితిలో కన్న బిడ్డలు స్త్రీని రక్షిస్తారు కాబట్టి స్త్రీకి స్వాతంత్ర్యం అక్కర్లేదు అని చెప్పాడు మనువు. ఈ ఒక్క శ్లోకంతోనే స్త్రీ వ్యవస్థను నిర్ణయించవచ్చా? అదే మనువు ఇంకొక విషయం కూడా చెప్పాడు స్త్రీ విషయంలో –

శ్లో॥ యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతాః
యత్రైతాస్తు నపూజ్యంతే సర్వాస్తత్రా ఫలాక్రియాః॥

మనుస్మృతి 3-56

శ్లో॥ సంతుష్టో భార్యయా భర్తా, భర్త్రా భార్యా తధైవ చ-
యస్మిన్నేవ కులే నిత్యం కల్యాణంతత్ర వైధ్రువం॥

మనుస్మృతి 3-60

ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో దేవతలు అక్కడ మాత్రమే వుంటారు. స్త్రీలు గౌరవింప బడనిచోట ఎటువంటి శుభములు జరగవు. భర్తవల్ల భార్య, భార్య వలన భర్త ఎల్లపుడూ సుఖంగా వున్న చోట



శాంతి సుఖభోగాలుంటాయని చెప్పాడు మనుమహర్షి. ఎంత గొప్పమాట యిది! ఇటువంటి సూక్తులు చాలావున్నాయి.

వేల సంవత్సరాలనాడే ఇతర మతాల లోనూ లేని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు హిందూ మతం స్త్రీలకు కల్పించింది. ఫ్రాన్స్ పశ్చిమ జర్మనీ – స్పెయిన్ – ఇటలీ– జపాను లలో ఉద్యోగం చేసే స్త్రీలు పెండ్లి చేసు కొన్నా, గర్భం ధరించినా చేస్తున్న ఉద్యోగం మానివేస్తామని ముందుగానే వ్రాసి యివ్వాల్సి వుంటుంది. జపానులో 30 సంవత్సరాలు నిండిన స్త్రీలను ఉద్యోగాల నుండి తొలగిస్తారు. ముస్లిం దేశాలైన సౌదీఅరేబియా – నైజీరియా– కువైట్ – బహ్రీన్ మొదలైన తొమ్మిది దేశాలలో స్త్రీలకు ఓటువేసే హక్కు లేదు. ఇటలీ దేశంలో 1963 వరకు స్త్రీలు గవర్న మెంట్ వుద్యోగాల్లో వుండే హక్కులేదు. జపాన్ ఫ్రాన్స్ ఇటలీ మొదలైన దేశాల్లో 1946 వరకు ఆడవారికి ఓటింగ్ హక్కు లేదు. ఇస్లాంమతం, "స్త్రీలకంటే పురుషులే గొప్పవారు" అని చెబుతుంది. ఈనాటికీ ముసుగు ధరించకుండా బయటకు వచ్చే హక్కుగాని ఒంటరిగా బజారుకి వచ్చే హక్కుగాని ముస్లిం స్త్రీలకులేదు. ఏ దేశం లోనూ లేదు. విడాకుల విషయంలోనూ అంతే! పాశ్చాత్యదేశాలలో స్త్రీలు పురుషులు పదేసిమార్లు పెండ్లి చేసుకొని పదేసిమార్లు విడిపోతుంటారు. ఇది స్వాతంత్ర్య మన వచ్చా! పటిష్టమైన వివాహబంధం లేకుంటే అనుబంధాలకు అర్థమేముంటుంది. పశుపక్షుల స్థితికి మనం మారిపోవటం అభిలషణీయమా! హైందవస్త్రీగా పుట్టటం స్త్రీజాతికి గర్వకారణం కాదా! స్త్రీకి మాత్రమేకాదు మగవాడికి కూడా అతి స్వేచ్ఛ సమర్థనీయంకాదు. సమాజ చట్టంలోనే అందరూ బ్రతకాలి. అపుడే అందరికీ గౌరవ మర్యాదలు దక్కుతాయి. మానవుడు సమాజ జీవి. సమాజానికి అంటిపెట్టుకొనే జీవిం చాలి. సమాజ నియమాలనూ నిబంధ నలనూ గౌరవించాలి. ఈ విషయంలో ఎవరికీ స్వేచ్ఛ వుండదు. ఇవ్వబడదు.

## 862. తొమ్మిదవ 'అంకె' గొప్పదంటారేమిటి?

**జ.** సంఖ్యాశాస్త్రంలో తొమ్మిదవ అంకెను 'బ్రహ్మసంఖ్య' అంటారు.

'దైవసంఖ్య, వృద్ధిసంఖ్య, అని కూడా అంటారు.

'పురాణ సంఖ్య' అని కూడా పేరుంది.

ఈ తొమ్మిదవ సంఖ్య గొప్పదన మేమిటో పరిశీలిద్దాం– మీరు ఏదైన మీ యిష్టం వచ్చిన సంఖ్యను తీసుకొని ఆ సంఖ్యను తొమ్మిదిచేత హెచ్చించండి.



హెచ్చించిన ఫలితాన్ని మొత్తం కలిపి ఏక సంఖ్యను చేయండి. తొమ్మిది వస్తుంది. 123456789×9 = 1111111101 మొత్తం అంకెలను కలిపిచూడండి. 'తొమ్మిది' అవుతుంది. ఈ విధంగా ఎంత చిన్న ఎంత పెద్ద సంఖ్యనైనా తొమ్మిదిచే హెచ్చించండి. ఇలాగే తొమ్మిదవ ఎక్కాన్ని కూడా పరీక్షించండి. శేషాలను కలిపిచూడండి. కృత యుగ సంవత్సరాలు 7.28.000- త్రేతా యుగం 12.96.000- ద్వాపరయుగం 8.64.000. ఏ యుగపు సంవత్సరాలు కలిపినా తొమ్మిదే వస్తుంది. నాల్గు యుగాలను కూడిన అంతే! ఇది తొమ్మిదవ అంకెకు మాత్రమే వున్న ప్రత్యేకత! సున్న తీసివేస్తే మనకున్న అంకెలు మొత్తం తొమ్మిదేగదా!

మహామహేతిహాసమని పేరుపొందిన మహాభారతం మొత్తం తొమ్మిదవ సంఖ్యతో ముడిపడివుంది. మహా భారతంలోని పర్వాలు 18, మహాభారత యుద్ధ దినాలు 18, మహాభారత సైన్యం 18 అక్షౌహిణులు, భగవద్గీత అధ్యాయాలు 18. (ఒకటిని, ఎనిమిదిని కలిపితే తొమ్మిది అవుతుంది) భగవాన్ వ్యాసమహర్షి రచించిన పురాణాలు కూడా పద్దెనిమిది. ఒకటి నుండి తొమ్మిది వరకు మొత్తం అంకెలు కూడితే 'తొమ్మిది' వస్తుంది.

1+2+3+4+5+6+7+8+9=81, 8+1=9 మనిషి శరీరానికి వున్న రంధ్రాలు కూడా 'తొమ్మిది'. సర్పానికి తప్ప సృష్టిలోని ప్రతిప్రాణికి తొమ్మిది రంధ్రా లుండవల్సిందే.

గంటకు 3,600 సెకండ్లు-3+6+0+0= 9
రోజుకి1,440 నిమిషాలు-1+4+4+0 =9
నెలకు 720 గంటలు- 7+2+0= 9
సంవత్సరానికి 360 రోజులు- 3+6+0 =9
60 సంవత్సరాలకు 720 నెలలు- 7+2+0= 9
60 సంవత్సరాలకు 21,600
రోజులు - 2+1+6+0+0 =9

తొమ్మిదవ సంఖ్యను ప్రేమించేవారు ఆరవ సంఖ్యను ఇష్టపడరు. తొమ్మిదిని మృత్యుంజయ సంఖ్యగా భావిస్తారు. బిడ్డ తల్లి గర్భంలో వుండేది 270 రోజులు. 2+7+0=9 ఇన్ని కారణాలుగా తొమ్మిది సంఖ్య గొప్పది.

### 863. గంగానది పరమ పవిత్రమా?

***జ.*** గంగానదిని విష్ణుపుత్రి అంటారు. విష్ణు పాదోదకం సర్వపాపహరం కదా! "అకాల మృత్యుహరణం! సర్వవ్యాధి నివారణం! సమస్తపాప క్షయకరం! విష్ణు పాదోదకం! పావనం శుభం!" అనే మంత్రోచ్చారణ చేసి తీర్థాన్ని ఇస్తారు. మనకున్న భారతీయ నదులన్నిటిలోకి గంగానది విశిష్ట మైనదిగా చెబుతారు. ఎందుకంటే గంగా నదీ శ్రీమన్నారాయణుని పాదాలచెంత



జన్మించి భగీరథుని దివ్య ప్రయత్నం వలన శ్రీపరమేశ్వరుని జటాజూటానికి చేరి అక్కడనుండి భూమి మీదకు వచ్చిందని పురాణాలు చెబుతున్నాయి. పరమ పావని పతితపావని గంగాదేవి. ఈమె విష్ణుపుత్రి! ఈశ్వరపత్ని! అందువల్లనే సర్వ పాపాలను పోగొట్టే దివ్యశక్తి వచ్చిందీమెకు.

గంగానదిని 'సురనది' అంటారు. సుర నది అంటే దేవతల నది అని అర్థం. మహాభారతంలోని భీష్మాచార్యుడు ఈమెకు జన్మించినవాడే. గంగా తనయుడు కావటంవల్లనే అస్ఖలిత బ్రహ్మచర్యంతో పవిత్రజీవనం గడిపాడు. భీష్ముని 800 సంవత్సరాల జీవితకాలంలో 675 సంవత్సరాలు వేద వేదాంగ విద్యలు నేర్చుకొన్న సర్వవిద్యా పారంగతుడు. పరమపునీత అయిన గంగాదేవి గర్భవాసాన జననం కావాలని కోరుకొని ఆమెకు జన్మించి జన్మపునీతం చేసుకొని ధన్యుడయ్యాడు.

గంగాజలం దివ్య ఔషధుల సమ్మిళితం మొట్టమొదట ఆర్యులు గంగాతీర ప్రాంతాలలోనే జీవించారు. ఆర్యులకు గంగానది కన్నతల్లితో సమానం. "జిస్ దేశ్‌మె గంగా బెహతీహై ఓ దేశ్ హమారా" అని సగర్వంగా ఉత్తర భారతీయులందరూ చెప్పుకొంటారు. వారణాసికి (కాశీ) అంతటి దివ్యశక్తి గంగానదివల్లనే లభించిందంటారు పండితులు. గంగాదేవి శివ పత్నిగా భావింపబడుతున్నా వైష్ణవులకే ఆమె ఆరాధ్యదేవత అయింది. ఈనాటికీ చాలామంది తమ పెద్దల అస్థికలను గంగా నదిలో కలిపి వస్తుండటం అందరికీ తెల్సిన విషయం. పవిత్రతకు మారు పేరు గంగ! – భారతీయుల పుణ్యనది గంగ! వర్షాలు వచ్చినా రాకపోయినా ఏ నదులైనా ఎండిపోతాయేమోగాని గంగానది ఎండదు. సజీవనది గంగానదీమతల్లి. ఉత్తర భారత గంగను దక్షిణ భారతానికి నడిపించాలంటున్నారు మేధావులు. ఆ శుభ సమయం రావాలని ఆశిద్దాం. సర్వ భారతం సస్యశ్యామలం కావాలని ప్రార్థించుదాం.

## 864. వ్యాసమహర్షి దైవ స్వరూపుడా?

**జ.** 'వ్యాసో నారాయణో హరిః అసలు ఈయన పేరు 'కృష్ణద్వైపాయనుడు'. భూత భవిష్యద్వర్తమానాల నెరిగిన మహా పౌరాణికుడు. మహర్షి–తత్వవేత్త– పండితుడు – వైదికుడు– ప్రజ్ఞాశాలి– పరిత్యాగి –ధర్మశీలి–స్థితప్రజ్ఞుడు – వేదవేది–జ్ఞాన మూర్తి – పరిశీలకుడు – సంయమి – ఈ వ్యాస మహర్షి గురించి ఏం చెప్పిన ఎంత చెప్పిన చాలా తక్కువే అవుతుంది. ఋషులకే ఋషి ఆయన! పండితులకే మహా పండితుడాయన! మహాభారత ప్రారంభంలో వ్యాస మహర్షి పరిచయం ఇలా చేశాడు నన్నయ.



అ॥ వివిధ వేదతత్వ వేదివ్యాసుడాదిముని
పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై పనగు
చుండ జేసె భారతంబు

శ్రీమన్నారాయణాంశతో, కారణ జన్ముడై జన్మించిన వేదవ్యాస మహర్షిని గూర్చి చెప్పటం నావంటి అల్పులకు అసాధ్య విషయం గదా! ప్రపంచ రచన చరిత్రలో మహాభారతమంతటి పెద్ద ఇతిహాసాన్ని యింతవరకు ఎవరూ వ్రాయ లేదు. పదిలక్షల ఒకవేయి శ్లోకాలతో రచింపబడిన శ్రీమహాభారతం 'గిన్నిస్ రికార్డ్'. భారతమంతటి పెద్ద గ్రంథం పుట్టదు. వేద వేదాంగాల విషయాలన్నిటినీ పామరజనం కోసం వ్యాసమహర్షి భారతంలో పొందుపరచి రచించాడు. అందుకే మహాభారతం 'పంచమ వేదం' అని పూజింపబడుతోంది. ఏ ఇతిహాసంలోనైనా శస్త్రాలే వుంటాయి. కాని భారత గ్రంథంలో శస్త్రాలతో పాటుగా 'శాస్త్రాలు' కూడా వున్నాయి. ఈయన బ్రహ్మర్షి వశిష్ఠునకు మునిమనుమడు. పరాశర మహర్షికి పుత్రుడు. శక్తిమహర్షికి మనుమడు. శుక్రమహర్షికి కన్నతండ్రి. గుట్టలుగా పడివున్న వేదరాశిని సమీకరించి సమీక్షించి సంక్షిప్తంచేసి నాలుగు భాగాలుగా ఋగ్వేద – యజుర్వేద – సామవేద– అధర్వణ వేదాలుగా మనకు అందించిన వేదవ్యాసుడీయన. ఉపనిషత్తులను వ్రాసిందీ ఈ పుణ్యమూర్తే! పద్దెనిమిది పురాణాలను వ్రాసింది కూడా ఈ వ్యాసమహర్షే! శ్రీమహాభాగవత రచనా శిల్పి కూడా ఈయనే! "వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం' అంటారందుకే! వైదిక మతానికీ భారతీయతత్వానికీ ఆర్యప్రాభావానికీ మూలపురుషుడీయన. హైందవ జాతికి కులగురువు ఈయనే!

"నమోస్తు తే వ్యాస విశాలబుద్ధే
పుల్లార విందాయత పద్మనేత్ర!"
"వ్యాసం వశిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్
పరాశరత్మజం వందే శుకతాతం తపోనిధిమ్॥"


## 865. "దేవో దేవాలయః" అంటే ఏమిటి?

**జ.** దేహానికి మించిన దేవాలయం లేదు. అంతరాత్మకు మించిన దేవుడు లేడు. మనం వెదికే దేవుడు, మనం చూడాలనుకొంటున్న దేవుడు, మనం పూజించాలనుకొంటున్న దేవుడు, మనం కృతజ్ఞతలను చెల్లించుకోవాలనుకొంటున్న దేవుడు గుడి గోపురాలలో లేడు. నిలువెత్తు విగ్రహాలలో లేడు. పుణ్యక్షేత్రాలలో లేడు. మరి దేవుడెక్కడున్నాడు? నీలో వున్నాడు. నీ మనసులో వున్నాడు. నీ అణుఅణువులో

వున్నాడు. ప్రశాంతతలో వున్నాడు. కరుణలో వున్నాడు. త్యాగంలో వున్నాడు. ప్రేమలో వున్నాడు. మనసుద్వారా దేవునికి దగ్గర కాగలంగాని మంత్రాల ద్వారా కాదు. కరుణద్వారా దేవుని దయపొందగలం గాని కానుకలద్వారా కాదు. ఇపుడు సాగుతున్న హైందవ పద్ధతులు వేదసమ్మతం కాదు. వేదాలలో ఎక్కడా కులాలు లేవు. అంటరానితనం లేదు. ఎక్కువ తక్కువలు లేవు. మనుషులు కోసం వేదం పుట్టింది. మానవోద్ధరణ కోసం వేదాలు సృజింపబడ్డాయి. హిందువులుగా వున్నామేగాని వేదాలు గురించి తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఎవరికీ లేదు. మనకు తెల్సిందల్లా మనల్ని మనం తిట్టుకోవటమే! ఇదే మన దురదృష్టం. "ప్రజ్ఞానం బ్రహ్మ" అంటున్నది ఋగ్వేదం. "అహం బ్రహ్మాస్మి" అని చెబుతోంది యుజుర్వేదం. "తత్త్వమసి" అని వివరిస్తోంది సామవేదం. "అయామాత్మా బ్రహ్మ" అని బోధిస్తోంది అధర్వణ వేదం. మన వేదవిజ్ఞానం ఎంత గొప్పది! మన వేదప్రబోధం ఎంత విశిష్టమైనది!! తరగని



వేదసంపద మనకుంది. తరించగల వేద జ్ఞానం మనకుంది. తెలుసుకోగలిగిన సమయమే మనకు లేదు. "వేదం" అంటే పూజలకు పెళ్ళిళ్ళకు చదివేమంత్రాలు కాదు. "వేదం" అంటే ఉదయం టి.వి. వినే ప్రసంగాలు కాదు. "వేదం" అంటే క్యాసెట్లలోవినే సుప్రభాత స్తోత్రాలు కాదు. మీరెప్పుడైనా వేదాలు చదివారా! కనీసం తెలుసుకొన్నారా! అగ్రవర్ణంవారే వేదాలు చదవాలన్న నియమం వేదాలలో లేదు. వేదనాదం అందరిదీ. వేద జ్ఞానం అందరిదీ. వేద విజ్ఞానం ఎవడబ్బ సొమ్ము కాదు. ఏ ఒక్క జాతికీ స్వంతం కాదు. సర్వజన హితంకోసం సర్వజీవాళి సముద్ధరణ కోసం దైవమిచ్చిన జ్ఞానమిది. వేదం సమస్త హిందు కులబంధువుల ఆస్తి! హక్కు! మనం హిందువులం! మనం బంధువులం! "దేహమే దేవాలయమని చెప్పటం ఏ మతానికి సాధ్యం!?! అహో!! మహోన్నతమైన ఈ సంస్కృతికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలం! దైవకార్యక్రమాల్లో మీరెపుడైనా "మంత్రపుష్పం" విన్నారా! వినండి చెబుతాను. ఈ మంత్రపు అర్థాన్ని మీకు వివరంగా విరిస్తాను. "యచ్చ కించిజ్జగత్సర్వం దృశ్యతే శ్రూయతే పివా అంతర్బహిశ్చ తత్సరం వ్యాపనారాయణ స్తితం॰ అనంత మవ్యయం కవిగ్ం సముద్రేన్తం విశ్వశంభువం పద్మకోశ ప్రతీకాశగ్ం హృదయం చాప్యధోముఖమ్ అధోనిష్ట్యా వితస్యాన్తే నాభ్యా ముపరి తిష్ఠతి జ్వాలమాలా కులంభాతి విశ్వస్యా



యతనం మహత్ సంతతగ్ం శిలాభిస్తు లంబత్యా కోశ సన్నిభమ్ తస్వాంతే సుషిరగ్ం సూక్ష్మం తస్మిన్సర్వం ప్రతిష్ఠితమ్ తస్యమధ్యే మహానగ్ని ర్విశ్వార్చిశ్వతో ముఖః సోగ్ర భుగ్విభజన్ తిష్ఠన్నాహర మజరః కవిః తిర్యగూర్ధ్వ మధశ్శాయి రశ్మయస్తస్య సన్తతా సంతాపయతి స్వం దేహం ఆపాద తలమస్తకః తస్యమధ్యే వహ్ని శిఖా అణీయోర్ధ్వా వ్యవస్థితః నీలతో యద మధ్యస్థా ద్విద్యుల్లేఖేవ భాస్వరా నీవార శూకవత్తన్వీ పీతాభా సవత్యణూ పమా తస్యాః శిఖాయామధ్యే పరమాత్మా వ్యవస్థితః సబ్రహ్మ సశివః సహరిః స ఇంద్రః స అక్షరః పరమస్వరాట్"

ఈ మంత్రార్థం వింటే దేహం దేవా లయం ఏవిధంగా అయిందో తెలుస్తుంది. మనం చూస్తున్న వింటున్న ఈ సర్వ ప్రపంచమంతటా పరమాత్మ వున్నాడు. అంతంలేని నాశనం కాని సృష్టిస్థితి లయ కారకుడైన ఆ పరమాత్మను ధ్యానింతుము గాక! కంఠమునకు క్రింద, నాభి (బొడ్డు)కి పన్నెండు అంగుళముల పైన హృదయ కమలం వుంది. ఆ హృదయ కమలం అనంతమైన ప్రకాశంతో వుంది. ఇదియే పరబ్రహ్మము. ఆకమలములో తమ్మి మొగ్గవంటి హృదయం వుంది ఇది క్రిందికి (అధోముఖంగా) వేలాడుతూ వుంది. దీనిలోనే జగత్తు ప్రతిష్ఠింప బడి వుంది. సుషుమ్నానాడికి మధ్యగా వున్నట్టి దీని హృదయకాంతులు నలువైపులా ప్రస రిస్తుంటాయి. శరీరచలనానికి ఇదే మూలం. సుషుమ్నానాడికి మధ్యలో నున్న హృదయ కమలంలో జఠరంవద్ద ఈ ప్రకాశ వంత మైన కాంతి ప్రభావం శరీరమంతా వ్యాపించి దేహాన్ని ఎల్లపుడూ వేడిగా వుంచుతుంది. ఈ ఉష్ణజ్వాల (అగ్ని జ్వాల) వల్లనే మనస్సు పని చేస్తుంది. ఆహారాన్ని జీర్ణపరచి అన్ని అవయవా లకూ విభాగించే క్రియాశక్తి ఇక్కడే వుంది.

ఈ తమ్మిమొగ్గవంటి హృదయంలో వరిముల్లు అంతటి పరిమాణంగల, మెరుపుతీగ వంటి పసుపుపచ్చని దివ్య కాంతి, అణుసమానమై వర్ణింప వీలులే నట్లుగా వెలుగుతూవుంది. చూడజాలని ఈ దివ్యకాంతికి మధ్యన పరమాత్మ వుంది. (దీనినే పరంజ్యోతి అంటారు) ఈ పరమాత్మయే బ్రహ్మ! ఈ పరమాత్మయే శివుడు! ఈ పరమాత్మయే విష్ణువు! ఈ పరమాత్మయే ఇంద్రుడు! ఈ పరమాత్మ నాశనం లేనిది. సర్వోత్తమమైనది. స్వయం ప్రకాశం కలది గొప్పది. ప్రణవ స్వరూ పమైన పరబ్రహ్మ ఈ హృదయంలోనే వున్నాడు. సర్వసర్వం సహా శక్తికి ఇదే

మూలం. అందుకే ఋగ్వేదం ప్రజ్ఞా నమే బ్రహ్మ అని చెబుతున్నది! అహం బ్రహ్మాస్మి అని యజుర్వేదం చెప్పే దానికి కూడా అర్థం ఇదే! తత్త్వమసి (తత్+త్వం +అసి) నీవే ఆ పరబ్రహ్మ వంటున్నది సామవేదం! అయమాత్మా బ్రహ్మ. అంటున్న అథర్వణార్థం కూడా ఇదే. ఈ ఆత్మయే బ్రహ్మ.

మరి 'దేహం దేవాలయం' కాదా! –
మన హృదయంలో దేవుడు లేడా!
మన గుండెల్లో దేవుడున్నాడు.
గుళ్ళల్లో లేడు.

సత్యం దేవుడు! దయ దేవుడు! మంచి దేవుడు! మానవత్వం దేవుడు! ధర్మం దేవుడు! దానం దేవుడు! నీతి దేవుడు! నియమం దేవుడు! శాంతి దేవుడు! దేవుని కోసం కొండకోనలు ఎక్కాల్సిన పనిలేదు. తీర్థాలు తిరగాల్సిన పనిలేదు. నీ మనసు చంచలమైనపుడు నీవు అపనమ్మకాల పుట్టవైనపుడు, నిన్ను నీవే నమ్మనపుడు దేవుడు నీకెక్కడా కనుపించడు. అసలు నీవే దేవునికి కనుపించవు. ఇది నిజం. కానుకలకు, కొబ్బరి కాయలకు, మంత్రాలకు దేవుడు ప్రసన్నుంకాడు. దేవుడు లంచాలు తీసుకోడు! పూజలకు పొంగిపోడు! అతి కోర్కెలను మన్నించడు.

### 866. "మడి" అనే పద్ధతి ఏమిటి?

**జ.**అన్నం తిన్నవాడు నిద్రపోతాడు.
అన్నం తిననివాడూ నిద్రపోతాడు
సగం ఆహారం తిన్నవాడు నిద్రపోడు.




ఈ 'మడి' అనే ఆచారం కూడా అంతే! సగం పరిజ్ఞానంతో ఆచారాలు జరిపేవారు, మడి పేరుతో దూరంగా తొలగిపోయేవారు ఏ మాత్రమూ వేదపరిజ్ఞానం లేనివారే! మిడిమిడి జ్ఞానంతో వున్నవారే! సమసమాజంలో గొప్పవారుగా పేరు పొందాలనుకొనేవారే!!! ఆలోచనలేని ఆచారం యిది. 'తడి' బట్టలతో 'మడి' వస్తుందా! బ్రహ్మజ్ఞాన శూన్యత్వం యిది.

శరీరం మీద నాలుగు చెంబుల నీరు పోస్తే మడివంతులవుతారా! శరీరం లోపలి మలం, మూత్రం, కఫం, చీము, దుర్గంధం, లాలాజలం, ఎక్కడికి పోతాయి? మాటలో శూద్రత్వం, మనసులో శూద్రత్వం, ఆత్మీయతలో శూద్రత్వం.... ఇన్ని శూద్రత్వాలను వంటినిండా కప్పుకొని తడి బట్టతో మడి వచ్చిందంటే ఎలా!?! మడి వస్తుందోరాదో కాని జలుబు మాత్రం

వస్తుంది. ఈనాటికి బ్రాహ్మణవర్గంలో నూటికి ఒక్కరికి కూడా వేదమార్గం తెలియదు. కొన్ని పురాణాలు మాత్రమే తెలుసు! పురాణాలన్నీ వేద సమ్మతం కావు. భగవాన్ వ్యాసమహర్షి రచించిన పురాణాలను కాదు ఇపుడు చదివేది మనం. పురాణాలను, స్మృతులను ఎవరికిష్టం వచ్చినట్లువారు మార్చేశారు. హైందవ జాతికి ద్రోహం చేశారు. మహోజ్వలమైన సంస్కృతాన్ని మృత భాషగా చేశారు. ఏం జరిగినా, ఏం చేసినా, ఎన్ని చేసినా ఈ నాటి జన స్రవంతి ఈ మడివాదులందరినీ తమలో కలుపుకొని సాగటానికి సర్వసిద్ధంగా వుంది. కాని ఈ జనారణ్యంలో కలిసి జీవించటానికి వారెవరూ సిద్ధంగా లేరు. నరనాడుల్లో జీర్ణించుకొని పోయిన అంధ విశ్వాసాలు ముందుకు సాగనివ్వటం లేదు. ఇది దౌర్బల్యం! ఇది దుర్బలత్వం! ఇది దౌర్భాగ్యం! మన భాష, మన సంస్కృతి, మన ఉన్నతి, మన ఋషి విజ్ఞానం, మన శాస్త్ర పాండిత్యం మన బిడ్డలందరికీ అందించటంలో విఫలం అయ్యాం. ఆ కారణం గానే ఈనాటి యువతరం పాశ్చాత్య దేశాలవైపు ఎదురుచూస్తోంది. విదేశ సంస్కృతిని గుండెలకెత్తుకొని పరుగులు పెడుతున్నది. మనకిపుడు కావాల్సింది ఆచారం కాదు, ఆలోచన.

## 867. గోవును భూలోక దేవతగా పూజిస్తారెందుకు?

**జ.** వేదకాలంనుండీ హిందువులు గోవులను దేవతా స్వరూపంగా భావించి పూజి




స్తున్నారు. భారతీయుల శక్తి, భారతీయుల సంపద, భారతీయుల బలం గోవుల మీదనే ఆధారపడి యుండేది.

శ్లో॥ వరుణశ్చైవ గోమూత్రే, గోమయే హవ్య వాహనః।
దధేవాయుః సముద్దిష్టః సోమఃక్షీరే ఘృతే రవిః॥ పరాశరస్మృతి 21-39

గోమూత్రంలో వరుణుడు-గోమయంలో (పేడ) అగ్నిదేవుడు – ఆవు పెరుగులో వాయుదేవుడు – ఆవుపాలలో చంద్రుడు – ఆవునేతిలో సూర్యుడు వున్నారు. ఆవు ముఖంలోనూ, ఆవు యోనివద్దనూ ఇష్టార్థ దేవతలున్నారని మన స్మృతులన్నీ చెబుతున్నాయి. గోవును పూజించి ప్రదక్షిణ ముమ్మారులు చేస్తే సర్వపాపాలు హరించి పోతాయని గూడా హిందువుల ప్రగాఢ నమ్మకం. ఈ కాలపు శ్రీమంతుడు కోట్ల ఆస్థి కలిగివుంటేనే శ్రీమంతునిగా చెలామణి అవుతాడు. అందరూ గౌరవించి మర్యాదలు చేస్తారు. పూర్వకాలంలో అలా కాదు. ఎన్నివేల, లక్షల గోవులుంటే అంత శ్రీమంతునిగా గౌరవించేవారు. ఈనాటి భూస్వాముల కన్నా ఆనాటి గోస్వాములకు విశేష గౌరవం వుండేది. రాజ

గౌరవం లభించేది. పూర్వకాలంలో గోస్వాములే మహా శ్రీమంతులుగా వుండేవారు. చంచలమైన ధనానికి ఆ రోజుల్లో విలువ లేదు. గోధనమే ధనంగా భావించేవారు.



మహాభారతంలో విరాటరాజు గోధనాన్ని దుర్యోధనులు దౌర్జన్య పూరితంగా దోచుకొని పోవాలనుకొని అర్జునుని చేతిలో పరాభవం పాలవటం ఉత్తర గో(గ్రహణ కథలో (విరాటపర్వం) మీరందరూ వినేవుంటారు. గోధనం లేని రాజ్యం క్షీణించిపోతుందని అరిష్టాల పాలౌతుందని దుర్యోధనుని ఉపాయం! ఆనాటి రాజులకు, శ్రీమంతులకు గోవులే ధనంగా వుండేవి. వస్తుమార్పిడికి కూడా ఆవులనే ఇచ్చేవారు. పూర్వకాలపు స్త్రీలు బహుసంతానవంతులుగా వుండేవారు. పుట్టిన బిడ్డలకు తల్లిపాలు చాలినన్ని లభించేవికాదు. పసిబిడ్డలనుండి పెద్దవారి వరకూ ఆవుపాలే సంపూర్ణ ఆహారంగా సేవించేవారు. పసితనంలో ఆవుపాలు త్రాగినవారికి రోగాలు రావు. ఎందుకంటే ఆవుపాలు త్రాగిన వారికి ఎక్కువ రోగ నిరోధక శక్తి వుంటుంది. గోసంతానమైన ఎద్దులు పొలందున్ని ఆహారోత్పత్తికి సహాయపడేవి. అన్నదాత అయిన రైతు సోదరునికి అన్ని పనులలోనూ సహాయ పడేవి గోసంతతి. యిటువంటి గోమాతను దేవతగా పూజించటం ధర్మమే గదా!

### *868. బాబాలు, స్వాములు, దేవుని దూతలా?*

***జ.*** మన దేశంలో స్వాములకూ, బాబాలకు కొదవలేదు. పంట వదిలి పరిగ కోసం ఎగబడే తత్వం మనది. పరమాత్మను మరచిపోయి పరి(వ్రాజకుల కోసం ఎగ



బడటమే ఎక్కువ. ఎందుకిలా జరుగుతున్నదంటే, చెప్పగలిగిన సమాధానం ఒక్కటే! అతి త్వరగా ధనం సంపాదించాలి. అతి త్వరగా అభివృద్ధి సాధించాలి. అతి త్వరగా పదవులు పొందాలి. శాంతి, సుఖం, ఆనందం, అభిలాష, అతి త్వరగా పొందగలగాలి. ఎంత అవివేకం ఇది ఎంత అక్రమం ఇది! త్వరగా లభించేది త్వరగా నాశనమై పోతుంది. ఒక్క రోజులో పుట్టే కీటకాలు ఒక్కనాటితోనే మరణిస్తాయి. అత్యంత వెలుగును (ప్రసాదించే

మెరుపుతీగ క్షణకాలం మాత్రమే వుంటుంది. పంది మూడు నెలల్లో పిల్లల్ని కంటుంది. పదిహేను సంవత్సరాలకు మించి జీవించలేదు. కుందేలు నెల రోజులకే పిల్లలు పెడుతుంది. రెండేళ్లకు మించి జీవించలేదు. అంటే ఆలస్యంగా లభించేది చాలాకాలం వుంటుంది అని ప్రకృతి మనకు పాఠాలు చెబుతోంది. గమనించండి. ప్రజ్ఞావంతులు, ఆత్మజ్ఞానం కలవారు, కర్మయోగులు, తత్వజ్ఞానులు, స్థితప్రజ్ఞులు, బాబాలను స్వాములను ఎన్నటికీ నమ్మరు. దైవానికి దూతలు, రాయబారులు, మధ్యవర్తులు వుండరు.

"దేవుడు" అంటే ప్రసాదించే వాడు. స్వీకరించేవాడు కాదు. సృష్టి స్థితి లయ కారకుడైన పరమాత్మను మరచిపోయి గారడీ స్వాములను నమ్మకండి. దేవుని నమ్మేవారు, నమ్మకం కలవారు ఒక్క విషయం ముందు తెలుసుకోవాలి. "దేవుడు" అంటే ఏమిటి? ఎవరతను?


## 869. "దేవుడు" ఎక్కడ ఉన్నాడు? ఉంటాడు?



**జ.** మీరు దేవుని ఉనికిని కనుగొనాలంటే మీకొక మార్గంవుంది. శరీరం అలసిపోయేంతగా స్నానం చేయండి. ఎవరితోనూ ఏ విషయాలు చర్చించకండి. మనసులో ఏ విధమైన చెడు మంచి ఆలోచనలు రానీయకండి. మీరొక్కరే ఏకాంతంగా వుండి, అలజడి మరచి, పనులు విడిచి ఒక్క గంటసమయం మీకోసం కేటాయించుకోండి. ఒక జ్యోతిని వెలిగించి దాని ముందు కూర్చొని నిశ్శబ్దంగా కొంత సమయం కనులు మూసుకొని ఉచ్ఛ్వాస నిశ్వాసలను స్థిరం చేయండి. మనస్సును కేంద్రీకరించి మహా మౌనందాల్చి మహర్షులైపోండి. కొన్ని రోజులకి మీకు ఆత్మ సాక్షాత్కారం లభించి తీరుతుంది. మీ ఆలోచన విధానం నడవడిక మాటతీరు మారిపోతుంది. దైవత్వం తెలుస్తుంది. నీలోనీకు తెలియని ఒక మహా శక్తి ప్రవేశిస్తుంది. నీ నోటిమాట దైవ వాక్యంగా నిలుస్తుంది. 'అహం బ్రహ్మోస్మి' అంటూ ఆత్మజ్ఞాన సిద్ధిని నీకు నీవే పొందుతావు.

## 870. సంక్రాంతికి 'పశుపూజ' ఎందుకు చేస్తారు?

**జ.** పశు సంపద జాతి సంపద. పశు సంపద సమృద్ధిగా వుంటే కరువు కాటకాలు ఏమి చేయలేవు. పూర్వకాలంలో ఎక్కువ పశుసంపద వున్న వానిని 'గోస్వామి' అని పిలిచేవారు. భూస్వామి కన్నా గోస్వామి ధనవంతుడుగా వుండేవాడు. ఈనాడు వర్తక వ్యాపారాలు చేస్తున్న వైశ్య వర్ణం వారు గోస్వాములే! దక్షిణ భారతం



లోని శ్రేష్టిని ఉత్తరభారతంలో గోస్వామి అంటారు. సంక్రాంతి పండుగనాడు రైతు సోద రులందరూ తమ పశువుల కొమ్ము లకు రంగువేసి వేడినీటి స్నానం చేయించి పసుపు కుంకుమలతో పూజించి అప్పుడే పండిన కొత్త బియ్యంతో పాయసం వండి తినిపిస్తారు. ఔను! పశువులకూ రైతులకూ విడదీయరాని బంధం గదా. సంక్రాంతి పండుగనాటికి రైతన్నల యిండ్లన్నీ ధాన్య రాశులతో కళకళ లాడుతూంటాయి. సంవత్సర శ్రమ ఫలితం అది. చిన్న చిన్న కొండలుగా కనిపిస్తున్న ధాన్య రాశులను చూచుకొని రైతులందరూ ఆనందంతో మైమరచిపోతారు. నిజమే కాని, ఈ సంప దకు కారణం ఎవరు? పశువులే గదా! ఎండవానలతో తోడుగా నిలిచి, పొలం దున్ని తన పేడనే పొలానికి ఎరువుగా ఉపయోగించి, తన సంసారానికి ఆప ద్బాంధవులుగా నిలిచిన పశువులను పూజించటంలో ఎంత మధురమైన అర్థం వుంది.!! ఎంతటి తీయని భావన వుంది.!! ఎంత విడదీయరాని ఆత్మీయత వుంది!! ఆ పశువుల కష్టంతోనే గదా తన కూతురి పెళ్ళిని చేయగలిగాడు! ఆ పశువుల శ్రమ తోనేగదా పెద్ద కొడుకును చదివించాడు! ఆ పశువుల పరిశ్రమతోనేగదా కన్న తండ్రికి వైద్యం చేయించాడు! ఆ పశువుల సహాయంతోనేగదా తన సంసారం సుఖ సారమై నడుస్తోంది. పనికిరాని గడ్డినితిని పాలు, పెరుగులను తమ కంచాలకు నింపిన పశువులను ప్రేమ మీరా పూజించటంలో కృతజ్ఞత ఎంతో వుంది.

అవిద్యావంతులకున్న కృతజ్ఞతా భావం, ప్రేమబంధం, సంబంధ బాంధవ్యం విద్యావంతులకు వుండవు. తెలియవు. పశు జాతి వుంటేనే బలమైన ఆహారం మనకు లభిస్తుంది. "తిండి కలిగితే కండకల దోయ్ కండ గలవాడేను మనిషోయ్" అని చెప్పిన కవి వాక్కులు నిజం గదా!

## 871. వేదకాలంలో గజముఖుడైన గణపతి లేడు

**జ.** వేదాలలో ఈ గణపతి కనిపించదు హిందూమతంలో విగ్రహ పూజ ప్రారంభ మైన తరువాత ఈ గణపతి సృష్టి జరిగి వుండవచ్చు! గజాననుని గురించి బ్రహ్మ వైవర్త పురాణంలోనూ, వామన పురాణం లోనూ చెప్పటం జరిగింది. అగ్ని పురాణం లోనూ గణేశుని గురించిన ప్రస్తావన వుంది. వీరశైవులు లింగార్చనలో గణ పతిని ముందుగా ప్రార్థించరు. దైవగణా లకు అధిపతి ఇంద్రుడే కావడం వలన చతుర్వేదాలో ఇంద్ర ప్రస్తావన వుంది. ఇంద్రుని గణాధిపతిగా పూజించటం వేద కాలంలోని యజ్ఞయాగాలలో జరిగేది.



"ఇంద్ర" అనేది మనిషి పేరు కాదు. ఒక దేవతది కాదు. కాని మూడు వేల సంవత్సరాల నాటి 'వైదిక మతాన్ని' అయోగ్యులైన పండితులు తమ స్వార్థానికి వాడుకొని కలుషితం చేశారు. ఆనాటి పాపమే ఈనాటికి శాపమై ఇప్పటి తరం వారిని పీడిస్తున్నది. 'గతం గతః' ఈ విషయాన్ని వదిలేద్దాం.

## 872. కోర్కెలతో దేవుని పూజించటం మంచిదా?

**జ.** ప్రతిఫలాపేక్షతో దేవుని పూజించ రాదు.మనిషి కోర్కెలకు అంతం ఏమిటి? ఎప్పుడు?? వయోవృద్ధునికి యవ్వనం కావాలని వుంటుంది. పది ఎకరాలు పొలం వుంటే నూరు ఎకరాలు కావాలనీ, నూరు ఎకరాలు వుంటే వేయి ఎకరాలు భూమి కావాలని వుంటుంది. లక్షాధి కారికి కోటీశ్వరుడు కావాలనే కోరిక వుంటుంది. నిద్రించటానికి కావాల్సింది ఆరడుగుల స్థలమే అయినా ఏడంతస్తుల



మేడ కావాలని కోరిక పుడుతుంది. కారున్నవాడు కూడా తనకు విమానం కావాలని ఆశపడతాడు. రాష్ట్రాధిపతి దేశాధిపతి కావాలని ఆశపడుతుం టాడు. నూరు సంవత్సరాల జీవితం అనుభవించి ఇంకొక నూరేళ్ళు బ్రతకా లని కోరిక వుంటుంది

## 873. ఆశలకు అంతం లేదు.

**జ.** భూమి మీదున్న సముద్రజలం అంతా తీపినీరు కావడం కుదరదు. కోరిన కోర్కెలు తీర్చకపోతే దేవుణ్ణి ఎందుకు పూజించాలి? పండ్లను ఇవ్వని చెట్టుకి నీరెందుకు పోయాలి? అని అను కోవచ్చు."అవశ్యము భోక్తవ్యం గతం జన్మ శుభాశుభమ్"దేవునికి మన మందరమూ సమానమే గదా! అలాంటప్పుడు ఒకడు పేదగా, మరొకడు శ్రీమంతుడుగా, ఒకడు అందగాడుగా, ఇంకొకడు కురూపిగా ఒకడు ఆరోగ్యవంతుడుగా, మరొకరు

కుంటి గ్రుడ్డి మూగవారుగా ఎందుకు వుంటున్నారు? అంటే గత జన్మలో చేసిన పాప, పుణ్యాల ఫలితంగా ఈ జన్మలో వారి వారి కర్మ ఫలితాలను అనుభవిస్తున్నారని చెబుతోంది గీతాశాస్త్రం. నీవు యిపుడు పూజించే పూజలు, పుణ్య కార్యాలు, దానధర్మాలు వచ్చే జన్మకు ఫలితాన్నిస్తాయి. ఈ జన్మకోసం నీవు దేవునితో ఏమి మొర పెట్టుకున్నా ఫలితం వుండదు. కాబట్టి పిచ్చికోర్కెలతో నీవు దేవుని పూజించటం మంచిదికాదు. తపస్సు చేసి బ్రహ్మ, మహేశ్వరుల వల్ల వరాలు పొందిన వారందరూ గత జన్మ కార్యకారణంగానే సాధించగలిగారు. మంచి ప్రవర్తనకు మించిన దైవపూజ లేదుగాక లేదు.

శ్లో॥ యోనహృష్యతి నద్వేష్టి నశోచతి నకాంక్షతి।
శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్యఃసమే ప్రియః॥

కోరికలు లేని, దుఃఖపడని, ద్వేషించని, సంతోషపడని వాడు, మంచినీ చెడునూ సమానంగా భావించేవాడు, నా ప్రియమైన భక్తుడు! అన్నాడు గీతా కృష్ణుడు.

## 874. దానాలు బ్రాహ్మణులకు మాత్రమే చేయాలా?

**జ.**"బ్రహ్మజ్ఞానాత్తు బ్రాహ్మణః' అంటున్నది శాస్త్రం. ఇపుడు మనం చూస్తున్న బ్రాహ్మణకులం వారినందరినీ బ్రాహ్మణులు అనుకొంటున్నాం. వీరందరూ జన్మ బ్రాహ్మణులు. కర్మ బ్రాహ్మణులు కారు. లోకంలో ఏ మనిషైనా తాను తన



కుటుంబం క్షేమంగా వుండాలని మాత్రం కోరుకుంటాడు. అవును గదా! బ్రాహ్మణుడైనవాడు స్వహితం వదిలి లోకహితం లోకక్షేమం కోసం దేవుని ప్రార్థిస్తాడు (ప్రార్థించాలి). ఇది నిజమైన బ్రాహ్మణ లక్షణం. లోకం క్షేమంగా వుంటేనే గదా తనకు దానధర్మాలు లభించేది!


సర్వేత్ర సుఖినః సంతు -సరేసంతు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యంతు-మా కశ్చిత్ దుఃఖ మాప్నుయాత్॥
అపుత్రా పుత్రిన ః సంతు పుత్రినః సంతు పౌత్రినః
అధనాః సధనాః సంతు జీవంతు శరదశ్శతం॥

నిజ బ్రాహ్మణుడు దేవుని ప్రార్థించే విధానం ఇదే. "అందరూ అన్ని చోటులా సుఖంతో వుందురుగాక! అందరూ ఆనందముగా వుందురు గాక అందరూ రక్షితులై వుందురు గాక! ఎవరికీ దుఃఖము కలుగకుండా గాక! సంతానహీనులైన వారికి సంతతి కలుగుగాక! పుత్రవంతులకు పౌత్రు (మనుమలు) కలుగుగాక! దరిద్రులకు ధనము సిద్ధించుగాక! అందరూ నూరు సంవత్సరములు జీవింతురుగాక!" అని లోక కల్యాణం కోసం సర్వ జనహితం కోసం బహుజన సుఖాయ బహుజన హితాయ' అంటూ స్వార్థత్యాగం చేసేవాడే బ్రాహ్మణుడు. తన సుఖాన్ని

తన కుటుంబ శ్రేయస్సునూ విడిచి పెట్టి తాను వుండే గ్రామ క్షేమాన్ని లేక తాను నివసించే పట్టణ క్షేమాన్ని, చివరిగా దేశ క్షేమాన్ని కోరుకొనే త్యాగమూర్తినే బ్రాహ్మణుడు అంటారు. వేదపండితుడ్ని మనం పురోహితుడు అంటా. 'పురం' అంటే గ్రామం 'హితుడు' అంటే క్షేమాన్ని కోరే వాడు. పురోహితుడు అంటే గ్రామ శ్రేయోభిలాషి అని అర్థం. పూర్వ కాలంలోని మహర్షులు అందరూ బ్రాహ్మణులే! లోక శ్రేయస్సుకోసం వాళ్ళ సుఖాలు విడిచి తపస్సులు చేసి మనకు మహత్తరమైన శాస్త్రాలు రచించి ఇచ్చారు. మనుష్యులకు జీవన విధానాన్ని బోధించారు. ఈనాడు మనం అనుభవించే ఎన్నో సుఖాలకు కారణం వాళ్ళే! దానధర్మాలు వేద పండితులకు మాత్రమే చేయాలి.

## 875. భోజనం మౌనంగా చేయాలా?

**జ.** నిద్ర, ఆహారం, మైధునం ఈ మూడు విషయాలలో మౌనంగానే వుండాలి అంటే ప్రశాంతంగా వుండాలన్నమాట.



ఇది శాస్త్రం. ఆహారం తినే సమయంలో మాటల్లోపడితే ఎంత తింటున్నామో తెలియదు. ఎక్కువగా తిన్న ఆహారం శక్తిని కల్గించదు. కాకపోగా విషతుల్యంగా మారే అవకాశంవుంది. త్వరత్వరగా తినే ఆహారం రుచి తెలియదు. సరిగా నమలక పోవటంవలన, గాలితో సహా భుజించటం వలన కడుపులో గాలి చేరి అసౌకర్యం కూడా కలిగిస్తుంది. భోజనం చేసే సమయంలో అనావశ్యక విషయాలలో పడితే ఏదో ఒక గొడవ జరుగవచ్చు. భోజనానికి అర్థాంతర ముగింపు జరుగవచ్చు. ఇంటిలోని వారందరూ ఈ గొడవతో  ఒక్కోసారి మండే కడుపుతోనే పడుకోవాల్సి రావచ్చు. భోజనం మౌనంగా  ఎందుకు చేయాలంటే ప్రశాంతంగా భుజించే ఆహారమే శక్తిని  కల్గించి అమృతంగా మారుతుంది. నరనరాలకు పుష్టినిస్తుంది. మనం రోజుకి లక్ష రూపాయలు సంపాదించినా నాలుగు ముద్దల అన్నం కోసమే గదా! అంతటి ముఖ్య అవసరాన్ని ఆదుర్దాగా ముగించటంలో అర్థమేమిటి? టి.వి. చూచుకొంటూ, పేపరు చదువుకొంటూ ఆహార పదార్థాలను కడుపులోకి కుక్కుతూ వుంటే రుచి సరిగా తెలియక పోగా అజీర్తి కలిగి కొంతకాలానికి జీర్ణవ్యవస్థ దెబ్బతిని ఇక తింటానికేం వుండదు.

## 876. మాతృభూమి, మాతృభాష, అన్నిటికీ తల్లి పేరెందుకు?

**జ."నమాతుః పరదైవతా"** తల్లిని మించిన దైవం లేదు. తల్లిని మించిన గురువులేదు. తల్లిని మించిన హితుడులేదు. తల్లిని మించిన పరతత్వం లేదు. తల్లిని మించిన వస్తువు లేనే లేదు.

## 877. ప్రతి జీవికీ తల్లే పరమాత్మ

**జ.** ప్రపంచంలో ఏ సంస్కృతీ నేర్పని, నేర్పలేని మాతృగౌరవమిది. భారతీయులకు తల్లి దైవ సమానం. 'మాతృదేవోభవ" అని చెప్పిన హిందూ ధర్మాన్ని, సంస్కృతిని, సంస్కారాన్ని చేతులెత్తి



నమస్కరించాలి. పితృస్వామ్య సంస్కృతిలో తల్లికిచ్చిన గౌరవమిది. పరమాత్మా! మళ్ళీ జన్మవుంటే నన్ను ఇక్కడే పుట్టించు అంటూ వేడుకోవాల్సిన పుణ్యభూమి యిది. మాతృభూమి, మాతృభాష, మాతృ సంస్కృతి, అంటూ తల్లి ఎంత గొప్పదో ఎంత విలువైనదో తెలియాలంటే తెలుసుకోవాలంటే ప్రతిస్త్రీ ఈ భూమిలోనే జన్మించి తీరాలి. ఇక్కడే తల్లి కావాలి. విద్యకు అధిష్టాన దేవత సరస్వతి! ధనానికి మూలదేవత లక్ష్మి! బలానికి అధిదేవత పార్వతి! విద్య, ధనం, బలం ముఖ్యమైన మూడింటికీ ప్రసాధనా దేవతలు స్త్రీ మూర్తులే కావటం స్త్రీలకిచ్చిన గౌరవం. ప్రతి మనిషికీ "తల్లే ప్రధమ గురువు" ప్రతిబిడ్డ మొదటి పాఠాలు తల్లి వద్దే నేర్చుకొంటాడు. ప్రతి శిశువు తన నోటి నుండి మొదటిసారిగా చెప్పే మాట "అమ్మ" అని! (కాని ఈనాటి తల్లులందరూ 'అమ్మా' అని పిలిపించుకోవటానికి సిగ్గు పడుతున్నారు. ఇది పాశ్చాత్య పైత్యం) మనకెంత వయస్సు వచ్చినా తల్లి దగ్గరకు వెళ్ళేసరికి పిల్లలమైపోతాం. ఎతంటి గుప్తరోగాన్నైనా ముందు చెప్పేది తల్లికే! తల్లి వున్నా మరణించినా దగ్గర లేకపోయినా సరే చిన్న దెబ్బతగలగానే 'అమ్మా' అని అమ్మనే పిలుస్తాం. ప్రపంచంలో ఎక్కడైనా చెడ్డ కొడుకు చెడ్డ కూతురు వుంటారేమోగాని చెడ్డ తల్లి వుండదని పెద్దలు చెబుతారు.

ఆడతనానికివున్న ఆత్మీయత మగపురుగుకి వుండదు. ఆడపిల్ల పెరిగి తల్లికి స్నేహితురాలవుతుంది. మగవాడు పెరిగి తండ్రికి శత్రువు అవుతాడు. ఇది జీర్ణించుకోలేని నిజం. అంగీకరించలేని సత్యం. భార్యగానైనా, తల్లిగానైనా, చెల్లిగానైనా, అక్కగానైనా, బిడ్డగానైనా, ఆడది మాత్రమే ఆత్మీయతలను పంచగల్గిన కల్పవృక్షం. భర్తమరణించినా ఆడది సుఖంగానే జీవిస్తుంది. భార్య మరణించిన తరువాత మగవాడు దిక్కులేని వాడవుతాడు. అందుకే భర్తకంటే భార్య చిన్నదిగా వుండాలన్నారు పెద్దలు.

## 878. చవితి గణపతిని నిమజ్జనం చేయాలా? ఎందుకు చేయాలి?

**జ.** గణపతి నిమజ్జనం గురించి ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా తమకు తోచిన



విధంగా చెప్పటం జరుగుతూ వుంది. నిమజ్జనానికి ముఖ్య కారణం ఒకటు న్నది. వివరంగా చెబుతాను. గణపతి ఉత్సవాలకు పందిరివేసి పూజించే ప్రతి మను మట్టితో చేస్తారు. ఈ ప్రతిమకు యంత్ర పూర్వక స్థాపన వుండదు. కేవలం కొన్ని రోజుల కోసమే ఈ బొమ్మను పెట్టటం జరుగుతుంది. ఉత్సవాల అనంతరం ప్రతిమా నిమజ్జనం చేయకపోతే ప్రతి రోజూ ఎవరు పూజ చేయాలి! తాత్కాలికంగా వేసిన పందిరి ఎన్ని రోజులు వుంటుంది? మట్టి బొమ్మ గాబట్టి కొద్ది రోజులకే కాలు చేతులు విరిగి వికృతం అయిపోతుంది గదా! విరిగిపోయిన వికృతమైన రూపాన్ని పూజించకూడదు గదా! స్థలం కూడా తాత్కాలికమే గదా! అందువల్ల గణేశ చవితి గణపతిని నిమజ్జనం చేయాలి. ఈ గణేశ వుత్సవాల విశేషమేమంటే కులమత బేధాలు మరచి అన్ని కులాల వారూ పాల్గొని గణపతిని దర్శించటం గొప్ప విశేషం.

## 87౨. సృష్టిలో మానవుడే గొప్ప ప్రాణియా?

**జ.** నడవటానికి మాత్రమే కాళ్ళు, తినటానికి మాత్రమే చేతులున్నది. మనిషికే! ఆహారాన్ని వండుకొని రుచిగా తినేది మనిషి మాత్రమే. ఉప్పు, పులుపు, కారం, తీపి, రుచులు కలిసిన మేళవింపు మనిషికి మాత్రమే తెలుసు. ప్రకృతి ఉపద్రవాల నుండి ఏ విధంగా తప్పించుకోవాలో




మనిషికి మాత్రమే తెలుసు. తనకు కావాల్సిన దాన్ని ఏ విధంగా పొందాలో మనిషికి మాత్రమే తెలుసు. సుఖాలపై మెట్టు కష్టాల క్రింది మెట్టు మనిషికి మాత్రమే తెలుసు. మండుటెండలో చల్లగా నిద్రబోవటం తెలుసు. ఎముకలు కొరికే చలిలో వెచ్చగా నిద్రించటంతెలుసు. వాయు విహారం తెలుసు. భూవిహారం తెలుసు. జల విహారం తెలుసు. గగనంలో తేలి రావటం తెలుసు. రోదసిలో వుండి రావటం తెలుసు. విజ్ఞత తెలుసు! వివేకం తెలుసు! సృష్టించటం తెలుసు! ప్రతిసృష్టి చేయటం

తెలుసు! సాధించటం తెలుసు! వాదించటం తెలుసు!

బ్రహ్మతో పోటీపడదగిన తెలివిగలవాడు మానవుడు. బాధపడవల్సిన విషయమేమంటే, తాను సాధించిన విజ్ఞానానికి తానే బలిపశువు అవుతున్నాడు. మెదడు పెరిగింది. మనసు తరిగింది. మితిమీరిన స్వార్థం మర్రి చెట్టులా పెరిగి చిన్న చిన్న మొక్కల్ని మొలవనీయకుండా చేస్తున్నది. ప్రతివ్యక్తికీ సార్వభౌముపోవాలన్న తపన తాపత్రయం పెరిగిపోతున్నదశలో మానవతా విలువలు మట్టిలో కలిసిపోతున్నాయి. నీతిని పాతిపెట్టి సంస్కారాన్ని సమాధిచేసి భవంతులు కట్టేయాలని తపించి పోతున్నాడు. (ఈ అనాలోచిత తప్పులవల్లనే బాబాలు స్వాములు పుట్టకొక్కుల్లా పుట్టుకొస్తున్నారు). మానవ కులక్షేత్రంలో పెరిగి నిలిచిన తుమ్మ మొక్కల్ని పీకి తులసి మొక్కల్ని నాట గలిగితే దేవతలే స్వర్గం వదులుకొని భూమికి దిగి వచ్చేస్తారు. మరొక మానవవేదం సృష్టించి ఇస్తారు. ఎంత కాదనుకొన్నా ఎంత వద్దనుకొన్నా ఎక్కడో ఏ మూలనో చిన్న ఆశ మిణుకు మంటోంది. ఎప్పటికైనా ఈనాడు కాకపోయినా మరొక నాటికైనా వైజ్ఞానికంగా ఎదిగినట్లే మానసికంగా కూడా ఎదుగుతాడు. అంతటి ధీయుక్తి ధీశక్తి ఒక్క మనిషికే వుంది.

## 880. తీర్థయాత్రలు

**జ.** దేశవ్యాప్తంగా వున్న పవిత్ర పుణ్య క్షేత్రాలు దర్శించి, పవిత్ర నదులలో స్నా



నమాచరించడం ఒక విధిగా పెట్టారు పెద్దలు. ఇటువంటి యాత్రలు ఒక కొత్త ఉత్తేజాన్ని ఇస్తాయి. మనసులను మారుస్తాయి. భగవంతుని తలచుకుని, పూజలు చేయడం ఒక లక్ష్యమైతే, పలు సంస్కృతులు, భాషలు తెలుసుకుని, వివిధ ప్రదేశాలకు చెందిన మానవులు పడుతున్న కష్టాలు ఎటువంటివో గమనించడం ద్వారా జీవితానికి ఒక అర్థం చెప్పుకునే స్థాయికి ఎదగగలుగుతారు. మానవ దృష్టిని విశాలం చేస్తాయి తీర్థయాత్రలు. మనిషిలో బద్ధకం కూడదు. బద్దకం ఎన్నో అనర్థాలు తెస్తుంది. అందుకే ప్రతి సంవత్సరం ఏదో ఒక తీర్థయాత్ర చేయడం ద్వారా మనిషిలో శారీరక ఆరోగ్యం, మానసిక పరివర్తన వస్తాయి. హుషారుగా వుండేవారి వెంటే అదృష్టం వస్తుంది. తీర్థయాత్రలు చేస్తూ మనసులో మార్పును సాధించినవారు, ఆ మార్పును ఇతరులకు పంచగలుగుతారు. అందుకే తీర్థ యాత్రలను ముగించి వచ్చినవారి ఇంటిలో సంతర్పణ చేస్తారు.

## 881. పరిపూర్ణ ఆరోగ్యంగా జీవించాలంటే?

**జ.** మధ్యాహ్నము ఎండనూ, శవాన్ని కాల్చినప్పుడు వచ్చే పొగనూ, వృద్ధ స్త్రీని, తనకన్నా వయసులో పెద్దదైన స్త్రీనీ, గట్టి పెరుగునూ, చీపురు ధూళినీ సేవించ కూడదు. సేవించినచో ఆయుష్షు తగ్గును.

## 882. నవరాత్రుల్లో అమ్మ

**జ.** దసరా పండుగ జరిగే తొమ్మిది రోజులలో దేవి తొమ్మిది రూపాలుగా



అవతరించి తన కార్యాలు ముగిస్తుంది. మొదటి రోజు అంటే పాడ్యమినాడు మహాకాళిగా అవతరించి మధుకైటభు లను సంహరించడంలో విష్ణువుకు సహ కరిస్తుంది. రెండో అవతారం మహిషాసుర మర్దని. మూడో అవతారం మహా సరస్వతి. సకల విద్యాదేవత. ఈమె నుదుటి నుంచి పుట్టిన చాముండేశ్వరి శుంభ, నిశుంభల్ని, రక్త బీజుని సంహరిస్తుంది.

కంసుని మరణవార్త చెప్పిన మాయా దేవి నాల్గవ అవతారం. ఐదో అవతారం రక్తదంతిక. దంతాలతో రాక్షసుల్ని చీల్చి వేయడంవల్ల ఈమెకు ఈ పేరు వచ్చింది. ఆరో అవతారం శాకంబరి. ఏడో అవ తారం దుర్గుడు అనే రాక్షసుడిని చంపిన దుర్గ. ఎనిమిదో అవతారం మాతంగి, తొమ్మిదో అవతారం భ్రామరి. భ్రమరా లతో అరుణుడు అనే రాక్షసుడిని వధించింది.

## 883. ప్రతిపాద-ఘటస్థాపన

**జ.** నవరాత్రి వేడుకల్లో చాలా దేవాల యాల్లో మొలకెత్తిన ధాన్యంగల మట్టి పాత్రలు కనిపిస్తాయి. ఇలా ధాన్యం మొల కల్ని పవిత్ర ప్రదేశంలో వుంచే ఆచారం దేశమంతటా వుంది. ఈ ఆచారాన్ని దక్షిణాదిలో 'త్రిపాద' అని, ఉత్తరాదిలో 'ఘటస్థాపన' అని అంటారు. ఈ ఉత్స వంలో మట్టి లేదా వెండి పాత్ర లేదా కుంభ అనే కుండల్లో నీరు, మట్టి పోసి గింజలు జల్లుతారు. గింజలు వేసిన పాత్ర లను దేవాలయ ప్రాంగణంలో ఒక ప్రత్యేక ప్రదేశంలో లేదా ఇళ్ళలో ఓ పవిత్ర స్థలంలో వుంచి పసుపు, కుంకుమలు జల్లుతారు. అవి తొమ్మిది రోజులలో మొలకలు వచ్చి, ఎదిగి పచ్చదనాన్ని సంతరించుకుంటాయి. దేవి యొక్క సమృ ద్ధమైన శక్తిని ఈ పచ్చని మొలకలు ప్రతిబింబిస్తాయి. ఇక ఏడాది అంతా పంటలు సమృద్ధిగా పండేందుకు ఆ తల్లి ఇచ్చే ఆశీస్సులకు ప్రతిరూపాలు ఇవి.

అంతేకాకుండా సంప్రదాయ బద్ధమైన దేవీమూర్తిని కూడా తయారు చేస్తారు. ఇత్తడి బిందెలో నీళ్ళుపోసి, లోహాలు, హెర్బ్స్‌తో నింపి మామిడి ఆకులతో పైన అలంకరించి కొబ్బరికాయ వుంచుతారు.

ఉత్సవకాలంలో దేవి, ఇతర దైవాల కటాక్షం కోసం ఈ కుంభాన్ని తయారు చేస్తారు. లక్షలాదిమంది దైవాల ఆశీస్సుల్ని కోరుతూ, వారంతా ఈ కుంభంలో కొలువవు తారని ఆశిస్తూ ఇలా తయారు చేసి ప్రత్యేకంగా ఈ నవరాత్రులలో పూజలు జరుపుతారు.

## 884. విద్యారంభం

**జ.** దసరానాడు అతి ప్రాధాన్యం ఇచ్చి చేసే మరో సంప్రదాయం అక్షరాభ్యాసం.



దేశవ్యాప్తంగాగల అనేకమంది హైందవ కుటుంబాల్లో మూడు నుంచి ఐదేళ్ళ వయస్సు మధ్య పిల్లలకు దసరా పండుగ నాడు అక్షరాభ్యాసం చేస్తారు. ఆ తల్లి దీవెనల నడుమ తొలి అక్షరాన్ని దిద్దిస్తే తమ పిల్లలు సరస్వతీ బిడ్డలు అవుతారని ఆశిస్తారు. బియ్యంలో బిడ్డ చూపుడు వేలు పట్టి 'ఓం శ్రీ గణపతయే నమః' అని అంటూ రాయిస్తారు. ఇంటి పెద్ద లేదా పూజ నిర్వహించే బ్రాహ్మణుడు బంగారు ఉంగరాన్ని తేనెలో ముంచి అక్షరా భ్యాసం చేయాల్సిన బిడ్డ నాలుకపై తొలి అక్షరాన్ని రాస్తారు. ఈ రోజున తొలి అక్షరాలు రాసిన పిల్లలకు జీవితకాలం విజయాలు సాధించ డానికి సరస్వతీదేవి ఆశీస్సులు వెన్నంటి వుంటాయని అందరూ మనసా వాచా విశ్వసిస్తారు.

## 885. దుర్గాదేవి శాకంబరీదేవి ఎందుకైంది?



**జ.** దుర్గాదేవి దివ్యావతారాల్లో శాకం బరీదేవి ఒకటని వేదాలు పేర్కొంటు న్నాయి. శాకంబరి అంటే కూరగాయలు, ఆకుకూరలు వంటి శాకములను వస్త్రా భరణాలుగా ధరించిన మాత అని అర్థం.

పాడిపంటలకు లోటు లేకుండా అను క్షణం భక్తజనులను రక్షించే అమ్మే శాకం

బరీదేవి అయింది. పూర్వకాలంలో వర్షాలు పడక, పంటలు పండక, కనీసం తాగేందుకు నీరు కూడా లేకుండా ప్రజలు, పశుపక్ష్యాదులు అల్లాడి పోతున్న సమయంలో మునులు, సాధువులు వారి కోసం జగన్మాతను ప్రార్థిస్తారు. మునుల ప్రార్థనలతో ప్రత్యక్షమయిన తల్లి తాను నూరు కన్నులతో ముల్లోకాలను పరిరక్షిస్తానని, దేవతలు, ప్రజలు, తనను శతాక్షిదేవిగా కొలుస్తారని, ఇలా కీర్తి నొందే తాను తన దేహం నుంచి శాకములను పుట్టించి ప్రజల ఆకలి బాధలను తీర్చుతూ, భూమిని సుభిక్షంగా ఉంచుతానని వరమిచ్చిందని చెప్తారు. ఇలా జగన్మాత తన దేహాన్ని శాకములుగా మార్చడం వల్లనే ఆమె శాకంబరీదేవి అయింది.

## ౮౮౬. ముగ్గురమ్మలు

**ఐ. లక్ష్మీదేవి :** సిరిసంపదలు, అదృష్టానికి హేతువైన లక్ష్మీదేవి కలువ పువ్వుల్ని



రెండు చేతులతో పట్టుకుని వుంటుంది. కలువ పువ్వు స్వచ్ఛతకు, పరిపూర్ణతకు, సంతానోత్పత్తికి చిహ్నం. లక్ష్మీదేవిని పద్మ, కమల అంటారు.

లక్ష్మీదేవిని అందమైన దేవతగా 'శ్రీ' అని కూడా కొలుస్తారు. లక్ష్మీదేవి పక్కన వుండే ఐరావతం విజ్ఞానానికి, రాచరికానికి చిహ్నంగా భావిస్తారు.

**కాళికాదేవి :** నాలుగు చేతులతో నల్లని రూపంతో భీకర అవతారంలో వుంటుంది



కాళికా అమ్మవారు. దుష్టశక్తుల్ని దునిమే కత్తి ఒక చేతిలో, దుష్టశక్తి తలను మరో చేత్తో ధరించి వుంటుంది. మరో రెండు చేతులతో భక్తులకు, వరాల్ని, అభయాన్ని ఇస్తుంటుంది. పుర్రెల దండ పట్టుకుని, ఎర్రబారిన మూడు కన్నులు, నాలుకతో భీకర అవతారంలో వుంటుంది. ఇవన్నీ ఆమెలోని అపారత్వానికి, దుష్టశక్తుల వినాశనానికి చిహ్నాలు.


**సరస్వతీదేవి :** చదువుల తల్లి సరస్వతీదేవి పద్మంపై కూర్చుని, హంసను పక్కన వుంచుకుంటుంది. దీనిని అందానికి, స్వచ్ఛతకు చిహ్నంగా భావిస్తారు. వీణను చేత ధరించి వేదాలు పలికిస్తుంది. పుస్తకం, నీటి పాత్ర ఆమె వద్ద వుంటాయి. మతాచారాలకు, ఆధ్యాత్మిక సంబంధిత



ప్రక్రియలకు, విజ్ఞానానికి, విశ్వాసానికి ప్రతీక సరస్వతీదేవి.

### 887. కార్తీక శుద్ధ చవితి

**జ.** దీపావళి పండుగ తరువాత వచ్చే మరో ఆధ్యాత్మిక పండుగ నాగులచవితి. కార్తికమాసంలోని శుద్ధ చవితే నాగుల చవితి పండుగ. సౌభాగ్యానికి, సంతాన




ప్రాప్తికి నాగారాధన చేస్తారు. నాగేంద్రుడ్ని సుబ్రహ్మణ్యేశ్వర స్వామిగా భావించి కొందరు కొలిస్తే ఆదిశేషువుగా మరి కొందరు పూజిస్తారు. ప్రతి శివాలయం లోనూ నాగేంద్రుని శిలాప్రతిమలు కన బడతాయి. ఈ నాగారాధన అనేది పురాణ కాలం నుండి వుంది. ఈ రోజున నాగేంద్రుడ్ని అర్చిస్తే సకలారిష్టాలు, సర్వ రోగాలు పోతాయనేది మన నమ్మకం.

పరమేశ్వరుడికి సర్పాలే ఆభరణాలు. విష్ణుమూర్తికి పాన్పు ఆదిశేషుడు. ఇక సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సర్పాకారం లోనే ఆరాధిస్తారు. మానవ శరీరంలో నాడులతో నిండివున్న వెన్నెముకను వెన్ను బాము అంటాము. జ్యేష్ఠా నక్షత్రం వృశ్చిక రాశిలోనిది. ఈ నక్షత్రానికి సర్ప నక్షత్ర మనే పేరు వుంది. ఈ సర్ప నక్షత్రంలోనికి సూర్యుడు ప్రవేశించినప్పుడే నాగుల చవితి పండుగ వస్తుంది. మన శరీరంలో వున్న పామును (వెన్నుబాము) ఆరా ధించడమే నాగులచవితి పండుగలోని అర్థం. శరీరం అనేది తొమ్మిది రంధ్ర ముల పుట్ట. ఆ పుట్టలో అడుగు భాగాన మూలాధారంలో శయనించి వుండే నాగమే కుండలినీ శక్తి. ఈ శక్తి ప్రతి మనిషిలోనూ కామము, క్రోధమనే విషాన్ని కక్కుతూంటుంది. దీని విషాన్ని హరించే 'సత్వ' గుణానికి 'పాలు' పోసే సాధనా రహస్యమే నాగులచవితి రోజున పాలు పోయడం. అలా చేయడంవల్ల మనలోని విషసర్పం తెల్లని ఆదిశేషువుగా మారుతుంది. ఈ కుండలినీ శక్తి సామా న్యుడిలో కామంరూపంలో వుంటుంది. అందుకే సంతానాన్ని కోరేవారు ఈ పాము రూపాన్ని పూజిస్తారు. నాగ ప్రతి ష్టలు చేయిస్తారు. నాగులచవితి రోజు పుట్టలోని నాగేంద్రుడికి పాలు పోసి

పుట్టమీద పాలు చల్లుతారు. ఈ రోజు ఉదయాన్నే తలమీద స్నానంచేసి పుట్టవద్దకు నాగులకు ఇష్టమైన ఆవు పాలు, కోడిగ్రుడ్లు, ఇతర పూజా సామాగ్రితో పాటు చలిమిడి, వడపప్పు నైవేద్యంగా తీసుకు వెళ్ళాలి. వాటిని పుట్టలోని నాగుపాముకు సమర్పించాలి. అలా చేస్తే పెళ్ళికాని యువతులకు పెళ్ళిళ్ళు, సంతానం కావలసిన మహిళలకు సంతానం కలుగుతుందని పెద్దలు చెబుతారు. కర్కోటకస్య నాగస్య దమయంత్యా నలస్య చ ఋతుపర్ణస్య రాజర్షే కీర్తనం కలినాశనం॥ (భక్తివలనే అహంకారము నశించును.) కర్కోటకుడను సర్పరాజు, నలుడు, దమయంతి రాజర్షియగు ఋతుపర్ణుల నామము వుచ్చరించిన కలినాశన మవుతుంది. కనుక వీరిని నిత్యం స్మరించాలి.

## ౮౮౮. ఆయుధపూజ

**జ.** దసరా అనగానే చేసే కార్య క్రమాల్లో తొలిగా గుర్తుకు వచ్చేది ఆయుధపూజ. విభిన్న పనిముట్లకు జరిగే పూజ. నవరాత్రులలో 9 వ రోజున వివిధ వృత్తుల వారు, కళాకారులు, ఇతర వృత్తులవారు



తాము వాడే వస్తువుల్ని, పరికరాల్ని, పాత్రల్ని దేవి పాదాలముందుంచి మౌనంగా ప్రార్థనలు చేస్తూ, పువ్వులతో పూజ చేస్తారు. పూజ పూర్తయి, తల్లి ఆశీస్సులు అందుకునే వరకు ఆయా పరికరాల్ని అక్కడే వుంచేస్తారు. ఆమె ఆశీస్సులు తీసుకోకుండా వాటితో తిరిగి ఏ పనీ చేయరు. ఉడికించిన అన్నం, పండ్లు, పువ్వులు, హారతితో ఆయుధపూజను చాలా మౌనంగా నిర్వహిస్తారు. ఏ పరికరాన్ని, పనిముట్టునూ కూడా తల్లి ఆశీస్సుల నుంచి మినహాయించరు. భారతీయ సైనికులు సైతం ఆయుధ పూజ నిర్వహిస్తారు. దీనిని శస్త్రపూజ అంటారు.

## ౮౮౯. కన్నె ముత్తైదువులకు ఆహ్వానం

**జ.** లక్షలాదిమంది హైందవ వనితలు నవరాత్రుల్ని పరమ పవిత్ర దినాలుగా, ఉత్సవంగా జరుపుకుంటారు. దుర్గాదేవిని ప్రత్యేకంగా పూజిస్తూ వివిధ ఆచారాల్ని పాటిస్తారు. ప్రతిమహిళలో అమ్మ దాగివుంటుందని తలుస్తూ, కన్యల్ని పిలిచి భోజనం పెట్టి, నూతన వస్త్రాలు బహూకరించే ఆచారం అనేక ప్రాంతాలలో వుంది.

రెండు నుంచి పన్నెండు సంవత్సరాల నడుమ వుండే కన్నె ముత్తయిదువల్ని ఆహ్వానిస్తారు. పండు ముత్తయిదువల్ని పిలిచి ఆశీర్వాదాలు అందుకుంటారు.

నవరాత్రులు ఆరంభమైన తొలిరోజు కన్నె ముత్తయిదువను పిలిచి ఆమెను



దేవతగా భావిస్తూ మర్యాదలు చేస్తారు. దేవి పేరుతోనే సంబోధిస్తారు. తొలి ప్రసాదాన్ని ఇచ్చి, సుగంధద్రవ్యాలతో స్నానం చేయించి నూతన వస్త్రాలు ధరింప జేస్తారు. రెండోరోజు రెండో కన్యను ఆహ్వానించి ఇదే మాదిరి చేస్తారు. ఇలా తొమ్మిది రోజులు తొమ్మిదిమంది కన్యల్ని ఇలాగే పిలుస్తారు. కొన్ని ప్రాంతాలలో తొమ్మిదో రోజు రాత్రి తొమ్మిది మందినీ ఒకేసారి పిలిచే ఆచారం కూడా వుంది. నవరాత్రి ఉత్సవాల్లో మహిళలు దేవికి సమీపంలో వున్నట్లు భావిస్తూ జపతపాలు చేస్తారు. నిస్వార్థపూరిత చర్యల్ని అవలంభిస్తారు. ఉదయం, సాయంత్రం దేవికి పూజ చేస్తారు. మహిళలు ఉపవాసం వుండి, దగ్గర్లోని పేదలకు ఆహారం, వంట పాత్రలు పంచుతారు. పార్వతీదేవికి ప్రసాదం నివేదించి, ఆమె తిన్నతర్వాతే అభ్యర్థనల్ని ఆమె చెవిన వేయాలని భావిస్తారు.

## ౩౮౦. గోదా స్తుతి

**జ.** శ్రీ విష్ణుచిత్తకుల నందన కల్పవల్లీం
శ్రీరంగరాజ హరిచందన యోగదృశ్యామ్ ।
సాక్షాత్ క్షమాం కరుణయా కమలామి వాన్యాం
గోదామనన్య శరణశ్శరణం ప్రపద్యే ॥



శ్రీ విష్ణుచిత్తుని కులనందన కల్ప వల్లివి, శ్రీరంగనాథుడు ధరించే హరి చందనానివి సాక్షాత్తు క్షమకు, కరుణకు ఆలవాలమైన ఓ గోదాదేవీ నిన్ను తప్ప మరెవరిని శరణుకోరేది. నన్ను రక్షించు తల్లీ.

## ౩౮౧. 'మార్గళి' వ్రతమాసం

**జ.** సూర్యుడు ధనురాశిలో ప్రవేశించే వేళలో విష్ణుపూజ, దాన జపాదులు చేస్తే విశేష ఫలితాలు కలుగుతాయి. ధనుర్మాసారంభవేళ 'మార్గళి' వ్రతం ప్రారంభించి గోదాదేవి శ్రీరంగనాథుని అర్చించిన సమయమిది. 'తిరుప్పావై' పారాయణ ధనుర్మాసారంభం నుండే జరిగింది.



వైష్ణవ సంప్రదాయంలో పన్నెండు మంది ఆళ్వార్లు ముఖ్యులు. భగవంతుని ప్రేరణతో ఆయన దేవేరులు, పరిచార కులు, ఆయన ఆభరణాలు, ఆయుధాలే ఆ పన్నెండు మంది ఆళ్వార్లు. వారు ఆ దైవాన్ని కీర్తిస్తూ పాడిన పాటలే ద్రావిడ వేదంగా అవతరించాయి.

వాటినే పాశురాలు అంటారు. ఇవి మొత్తం నాలుగు వేలు. కనుక ఇవి 'నాలా యిర'గా ప్రసిద్ధి చెందాయి. వైష్ణవాల యాలలో వీటిని రోజూ గానం చేస్తారు. పన్నెండు మంది ఆళ్వార్లలో ఒక్కతే స్త్రీ. ఆమే గోదాదేవి. భూదేవి అవతారమే గోదాదేవి. ఈమె తండ్రి పేరు విష్ణు చిత్తుడు. (గానము చేతనే భగవంతునిలో లీనమైపోవచ్చు.) ఆయన కూడా ఆళ్వా ర్లలో ఒకరు. తులసికోటలో ఒకనాడు గోదాదేవి పసిబిడ్డగా విష్ణుచిత్తునికి లభిం చింది. మధురైకి దగ్గరగా వున్న శ్రీవిల్లి పుత్తూరు గ్రామంలోని విష్ణుచిత్తుని కుమార్తె అయిన గోదాదేవి శ్రీకృష్ణుని కొలి చేది. దేవాలయంలోని ఆ వటపత్ర సాయికి రోజూ తులసి మాలలు సమ ర్పించడమే విష్ణుచిత్తుని దినచర్య. అందుకోసం ఓ తులసివనాన్నే పెంచాడా యన. ఆ తులసివనంలోనే గోదాదేవి ఆయనకు లభిస్తుంది. విష్ణుచిత్తుని కుమార్తెగా ఎదిగిన గోదాదేవికి వయ సుతో పాటే భగవద్భక్తి కూడా పెరిగింది. తనని శ్రీమన్నారాయణుడే వివాహ మాడతాడన్న నమ్మకాన్ని పెంచుకుం దామె. గోదాదేవి ఆముక్తమాల్యద, ఆండాళ్ళు అనే పేర్లతో పిలవబడింది. శ్రీకృష్ణుడే వచ్చి తనని వివాహ మాడాలని గోదాదేవి కాత్యాయనీ వ్రతాన్ని చేసింది.

ఆ కాత్యాయనీ వ్రతంలోని అంశాలే ముప్పది పాశురాలుగా ప్రసిద్ధి చెందాయి. మొదటి ఐదు పాశురాలలో తాను తన చెలికత్తెలతో పయనమై శ్రీకృష్ణుని సన్నిధికి చేరేందుకు చేసిన గానామృతాలవి.

తనను అనుసరించి దివ్యామృత మును ఆస్వాదించమని మొదటి పాశుర మున, వ్రతనియమముల గురించి రెండవ పాశురమున, వ్రతాచరణవల్ల కలిగే అద్భుతఫలితం గురించి నాలుగవ పాశురమున, శ్రీకృష్ణుల వారిని కొలిస్తే అన్ని పాపాలు తొలగి పోతాయని ఐదవ పాశురమున, సభాజనానికి వ్రతాచరణ గురించి ఆరవ పాశురమునుండి పది హేనవ పాశురం వరకు మేలుకొలుపు పాడింది. శ్రీకృష్ణుని వేడుకొనుటకు దారి

ఇమ్మని ద్వారపాలకుని పదహారవ పాశురంలో వేడుకుంది. బలరాముడిని, యశోదానందనులను మేలుకొమ్మని పదిహేడవ పాశురంలో ప్రార్థించింది. పద్ధెనిమిదవ పాశురంలో శ్రీకృష్ణుని భార్య నీలాదేవిని ప్రార్థించింది. శ్రీదేవీ, శ్రీకృష్ణ భగవానులను పంథొమ్మిది, ఇరవై పాశురాలలో ప్రార్థించింది.

ఇరవై ఒకటి, ఇరవై రెండు పాశురాల్లో తాను అహంకార మమకారాలను వదిలి పెట్టి నిర్మల భక్తితో కృష్ణసన్నిధికి వచ్చానని గానం చేసింది. తన ప్రార్థనలే విజ్ఞాపనా పత్రాలని సింహాసనాన్ని అధిష్టించమని శ్రీకృష్ణులవారిని ఇరవై మూడవ పాశురంలో ప్రార్థించింది. ఆమె కోరిక నెరవేర్చేందుకై కృష్ణస్వామి ముందుకి కదిలినందుకు ఆయన పాదాలు కందాయని 'పల్లాండుపల్లాండు' గీతాలను ఇరవై నాలుగవ పాశురంగా పాడింది. చెలులతో వచ్చానని, వ్రతాన్ని చేయడానికి కావాల్సిన సాధనాసంపత్తిని వివరించమని ఇరవై ఐదు, ఇరవై ఆరు పాశురాలలో ప్రార్థించింది. కృష్ణభగవానుడు తమతో వుంటే, ఆధ్యాత్మిక సంపదలన్నీ తమవేనని ఇరవై ఏడవ పాశురంలో ఆమె వెల్లడించింది.

స్వామిని అత్యంత గొప్పగా కీర్తించలేకపోతున్నందుకు క్షమించ మని ఇరవై ఎనిమిదవ పాశురంలో కోరింది. కృష్ణస్వామిని ఎల్లవేళలా కీర్తించగలిగే వరమిమ్మని ఇరవై తొమ్మిదవ పాశురంలో ప్రార్థించింది. ఎవరైతే ఈ పాశురాలతో స్వామిని కీర్తిస్తారో వారికి అనంతమైన ఫలాలు కలుగుతాయని ముప్పైవ పాశురంలో గానం చేసింది. గోదాదేవి అనుకరిస్తూ తిరుప్పావై వ్రతాన్ని ధనుర్మాసంలో ఆచరించాలి. రోజూ రంగనాథస్వామిని ఆలయంలో ఒక మాలికతో అలంకరించి, పాటతో అనగా పాశురంతో కీర్తించింది. అలా 30 రోజులు ఆచరించి గోదాదేవి భగవంతునిలో లీనమైపోయింది.

### 8.12. శ్రీ సాయి ప్రార్థన

**ఐ.** సదా సత్యరూపం చిదానందకందం
జగత్సంభవస్థాన సంహార హేతుం ।
స్వభక్తేచ్ఛయా మానుషం దర్శయంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాథమ్ ॥

సత్యస్వరూపుడు, ఆనందదాయకుడు, జగత్తు యొక్క సృష్టి స్థితి లయలకు కారకుడు, భక్తులను రక్షించేందుకై మానవ రూపాన్ని ధరించిన ఈశ్వరుడైన సద్గురు శ్రీ సాయినాథునికి నమస్కారం



## 813. శ్రీ మత్స్యావతార స్తుతి

**జ.** వేదోద్ధార విచారమతే, సోమకదానవ సంహరణే

మీనాకార శరీరః నమో, భక్తం తే పరిపాలయమాం ।

రామస్మరణా దన్యోపాయం, నహి పశ్యామో భవతరణే,

రామహరే, కృష్ణహరే, తవ, నామ వదామి సదానృహరే ॥

సోమకాసురునిచే దొంగిలింపబడిన వేదముల నుద్ధరించు ఉద్దేశ్యముతో సముద్రములో దాగియున్న సోమకరాక్షసుని సంహరించు నిమిత్తమై మత్స్యా వతారమును దాల్చిన శ్రీ మహావిష్ణో ! నీకు నమస్కారము, భక్తుడనగు నన్ను రక్షింపుము.

## 814. ఇక్ ఓంకార్

**జ.** కోటానుకోట్ల సంవత్సరాలకు పూర్వం అంధకారము, పొగ వ్యాపించి వుండేది. అప్పుడు ఆకాశమూ లేదు, భూమీ లేదు. మరేమి వుందంటే అపారమైన భగవదాదేశమే. రోజులులేవు. పగళ్ళు లేవు. రాత్రిళ్ళు లేవు. సూర్యుడు లేడు. చంద్రుడు లేడు. నక్షత్రాలు లేవు. పర్వతాలు లేవు. అడవులు లేవు. గాలి లేదు. నీరు లేదు. ఏమీ లేదు. చావు పుట్టుకలు అసలే లేవు. నవఖండాలుగానీ, సప్తసాగరాలు కానీ, పాతాళలోకము ఏమీ లేవు. నదులు లేవు. ప్రవాహములు లేవు. ముల్లోకములు లేవు. పాపపుణ్యములు, స్వర్గ నరకాలు లేవు. ఎవరూ రావడంకానీ, పోవడం కానీ లేదు. బ్రహ్మ, విష్ణుమహేశ్వరులు లేరు. వున్నది



కేవలం ఆయన ఒక్కడే. ఆయనే భగవంతుడు. అద్వితీయుడు, సద్రూపుడు, సత్యమూర్తి సర్వాంతర్యామి, సృష్టికర్త, పురుషోత్తముడు, నిర్భయుడు, నిర్వైరి, కాలాతీతుడు, అభవుడు, స్వయం భువు, విజ్ఞానదాత, దయామయుడు.

## 815. అమ్మపురం
## శ్రీ కురుమూర్తి స్వామి

**జ.** మహబూబ్‌నగర్ జిల్లాలోని చిన్న చింతకుంట మండలం, అమ్మపురం గ్రామానికి అతిసమీపంలో గల శ్వేతాద్రి, ఏకాద్రి, దుర్గాద్రి, నాద్రి, భల్లూకాద్రి, పతగాద్రి, దేవలూద్రి అను ఏడు పర్వత శ్రేణులపై శ్రీలక్ష్మీదేవి సమేతంగా కొలువు దీరిన శ్రీ కురుమూర్తి స్వామి (శ్రీ వేంకటేశ్వర స్వామి) వారి విశిష్టమైన ఆలయం ప్రతి ఒక్కరూ చూడదగింది.

కుబేరుని దగ్గర అప్పు తీసుకుని పద్మావతీదేవిని వివాహం చేసుకున్న శ్రీనివాసులస్వామి ఎంత కాలానికి వడ్డీచెల్లించక ఆలస్యం చేస్తూ వున్నాడని కుబేరుడు వెంకటాద్రికి వచ్చి తన అప్పును తీర్చమని పట్టుబట్టాడు. అప్పు చెల్లించే వీలులేక శ్రీ స్వామి తన ప్రతిరూపాన్ని అక్కడే ప్రతిష్ఠింపజేసి, కుబేరుడు నిద్రలోవుండగా

శ్రీ లక్ష్మీదేవితో కలిసి ఉత్తరంవైపు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలో ఆత్మకూరు పట్టణానికి దగ్గర్లోవున్న గుండాల జలపాతంలో జలక్రీడలు చేయసాగాడు. ఆ నదీమతల్లి శ్రీలక్ష్మీ శ్రీనివాసుల పాదాలు కందకుండా వుండేందుకు ఉద్దాల (పాదరక్షలు) కానుకగా ఇచ్చింది. శ్రీలక్ష్మీ శ్రీనివాసులు వాటిని ధరించి కార్తీక శుక్ల పంచమిరోజున, కురుమతి పేరుతో ప్రసిద్ధిగాంచిన, అతి శీతల ప్రదేశమైన కాంచనగుహలో శ్రీ స్వామి శ్రీలక్ష్మీ దేవి సమేతంగా కొలువు తీరారని "ఉత్తర వెంకటాచల మహత్యం" అనే గ్రంథంలో చెప్పబడింది.

## 816. శ్రీకృష్ణనామం

**జ.** రామనామ జపం గురించి చెప్పినంతగా కృష్ణనామం గురించి చెప్పలేదు. సామాన్యులు అంతగా పట్టించుకోరు. కాని దశావతారాలలో మానవ గుణానికి అత్యంత సమీపంగా కనిపించేది కృష్ణావతారం. సామాన్య బాలకుడుగా అల్లరి



చేశాడు. చిలిపి కృష్ణుడిగా వెన్న దొంగిలించాడు. యవ్వనంలో గోపికలతో రసికత ప్రదర్శించారు. నాయకుడుగా యాదవులలో నిలిచాడు. మంత్రిగా పాండవులను నడిపించాడు. తన భక్తులు తలచి నదే తడవుగా ప్రత్యక్షమయ్యాడు. ద్రౌపది కృష్ణుని ఆర్తితో అడిగినప్పుడల్లా ఆమెను ఆదుకున్నాడు. అందులో వస్త్రాపహరణ ఘటన మచ్చుకు ఒక్కటి. అభిమన్యునికి పద్మవ్యూహ ప్రవేశం తెలియచెప్పాడు. రథసారథిగా అర్జునుని నడిపించాడు. మహాయోధులను సంహరించే మర్మం బోధించాడు. ఇలా తన భక్తులుగా పాండవులు అడిగినవన్నీ అందించాడు. శ్రీకృష్ణనామం జపిస్తే ఆయన ఆదుకోకపోవడం వుండదు. అందుకు మరో సాక్ష్యంగా గజేంద్ర మోక్షం సంఘటన నిదర్శనంగా నిలుస్తుంది.

## 817. మత్స్యావతార రహస్యం

**జ.** "దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం ధర్మాన్ని ప్రతిష్ఠించటం కోసం ప్రతి యుగంలో నేను అవతరిస్తాను" అని శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు. ఆ స్వామి అవతారాలు లెక్కలేనన్ని వున్నప్పటికీ భాగవతంలో ఇరవై ఒక్క అవతారాలను విశేషంగా వర్ణించారు. కానీ మన దేవాలయాల్లో దశావతారాలనే కీర్తిస్తూ ఆ అవతారాలనే మూలవిరాట్టుకి అలంకరిస్తారు.

వేదానుద్ధరతే జగన్నివహతే
భోగోళముద్విభ్రతే దైత్యం ధీరయతే
బలించలయతే క్షత్ర క్షయం కుర్వతే
పౌలస్త్యం జయతే హలం కలయతే

కారుణ్య మాతన్వతే మ్లేచ్ఛాన్ మూర్ఛయతే
దశాకృతి కృతే కృష్ణాయ తుభ్యం నమః

మత్స్యావతారంతో వేదాలను ఉద్ధరిం చాడు. కూర్మ రూపం ధరించి భూభారాన్ని మోశాడు.

హిరణ్యాక్షుని బారినుండి భూమిని రక్షించడానికి వరాహావతారం ఎత్తాడు. నరసింహావతారమెత్తి హిరణ్య కశిపుడనే రాక్షసుణ్ణి సంహరించాడు.



వామనుడై బలిచక్రవర్తి అహంకారాన్ని అణచివేశాడు. మదమత్తులైన క్షత్రియ సంహారంకోసం పరశురాముడైనాడు. రావణుని పదితలలు నరికేందుకు శ్రీరా ముడిగా అవతరించాడు. కృషితో నాస్తి దుర్భిక్షమని చెప్పేందుకు హలాన్ని ధరించి బలరామావతారమెత్తాడు. సత్యం, అహింస ప్రచారం కోసం బుద్ధుడైనాడు. ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు కల్క్యావ తార మెత్తాడు విష్ణుభగవానుడైన ఆ శ్రీకృష్ణపరమాత్ముడు. పూర్వం వేదాలను దొంగిలించిన సోమకాసురుణ్ణి సంహ రించి ఆ వేదాలను బ్రహ్మ దేవునికి అందిం చిన ఓ మత్స్యావతారా నీ జయంతి సంద ర్భంగా నీకివే మా నమస్కారాలు అంటూ ఈ లోకంలో అందరూ మనస్ఫూర్తిగా ఆ విష్ణుమూర్తిని తప్పక ప్రార్థించాలి.

## ౭౬౭. కృష్ణతత్త్వం

**ఔ.** తారంగం తారంగం తాండవ కృష్ణ తారంగం
వేణూనాథా తారంగం చిన్ని కృష్ణ తారంగం
కృష్ణా కృష్ణా తారంగం

ప్రతి తెలుగింట పసిబిడ్డను ఆడిస్తూ పాడే తల్లి పాట ఇది. తన బిడ్డచేత 'తారంగం .. తారంగం' అంటూ చప్పట్లు కొట్టిస్తుంది తల్లి. తల్లి ఎలా పాడినా ఆ బిడ్డకు ఒకటే ఆనందం. బిడ్డ కేరింతలు ఆ తల్లికి పరమానందం. బిడ్డకు అలా పాట ద్వారా లయజ్ఞానాన్ని కలిగించేది తల్లే. ఆ తర్వాత మాటలు వచ్చేటప్పుడు ఇలా పలికిస్తుంది.

చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ
బంగారు మొలతాడు పట్టుదట్టి
సందెతాయతులును సరిమువ్వగజ్జెలు
చిన్ని కృష్ణ నిన్ను చేరి కొలతు.

బిడ్డచేత లయజ్ఞానాన్ని కలిగిస్తూ అలా శ్రీకృష్ణ పరమాత్మ గురించిన భక్తిభావాన్ని పెంపొందిస్తుంది. ఆ పరమాత్మ లీలలు తెలుసుకోవాలంటే భారత భాగవతాలు చదవాల్సిందే. ఎందుకంటే మహాభారతం భారతీయ ఔన్నత్యానికి మస్తిష్కం లాంటిది. రామాయణం నేత్రాల వంటిది. భాగవతం హృదయం లాంటిది.



మహాభారతంలో శ్రీకృష్ణుడు గొప్ప రాజనీతిజ్ఞుడు. సమస్త కర్మలను జ్ఞానమనే సమిదతో ఎలా పరిసమాప్తం చేయవచ్చో చెబుతాడు. ఎవరు అన్యచింతనలు మాను కుని నన్నే తలంచుతూ, ఎల్లప్పుడూ నాపట్ల నిష్ఠ కలిగి వుంటారో ఆ భక్తుల యోగక్షేమాల్ని నేను వహిస్తానంటాడు.

సమస్త ప్రాణులపట్ల పగలేనివాడు, మైత్రి కరుణ కలవాడు, అహంకార మమ కారాలు లేనివాడు, సుఖ దుఃఖాల్లో సమ భావం కలవాడు, ఓర్పు కలవాడు, ఎప్పుడూ సంతృప్తి కలిగివుండేవాడు, యోగ యుక్తుడు, మనస్సుని స్వాధీనపరుచు కున్నవాడు, దృఢమైన నిశ్చయం గల వాడు, నాయందు సమర్పించబడ్డ మనో బుద్ధులు గలవాడు, నాయందు భక్తిగల వాడెవడో అతడు నాకు ఇష్టుడని తెలియ జేశాడు శ్రీకృష్ణ భగవాన్. సమస్త ధర్మాల్ని వదిలిపెట్టి, నన్నే శరణుపొందు, సమస్త పాపాలనుండి నిన్ను విముక్తుణ్ణి చేస్తానం టాడాయన. అందుకు ఉదాహరణగా ఓ విషయం చెప్పుకోవాలి.

'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ'

అనే గీతా వాక్యానికి ఇంద్రియ మనో ధర్మాలను వదిలి తాను తానుగా వుండా లని భావం. అందుకు నైష్కర్మ్యము అనగా ఇంద్రియాలతో కర్మలు చేయకపోవడం కాదనేది ఆయన భావన.

ఆహారం మానేస్తే మానవుణ్ణి విషయ ములు మాత్రమే విడుస్తాయి. కాని వాటి పట్ల అభిలాషపోదు. పరమాత్మను దర్శిం చాక ఆ అభిలాష నశిస్తుంది. ఆత్మ సాక్షా త్కారం కలిగినప్పుడు త్రిగుణాలు తొలగిపోతాయి.

'సర్వధర్మాన్ పరిత్యజ్య' అంటే 'వర్ణా శ్రమ ధర్మాలు వదలవలెనా' అని కొందరు ప్రశ్నిస్తారు. అందుకు ఉదాహరణగా ఈ కథ చెప్పుకోవచ్చు.

అక్రూరుడు గోపికల వద్దకు వెళ్ళి, శ్రీకృష్ణ పరమాత్మ భరించరాని తల నొప్పితో బాధపడుతున్నాడని, దానికి నివా రణోపాయం గోపికల వద్ద వుందని చెప్పాడట. ఆ నివారణోపాయమేమిటంటే, గోపికల పాదధూళి శ్రీకృష్ణుని నుదుటికి పట్టిస్తే ఆయన శిరోవేదన తొలగిపోతుం దని చెప్పాడట. అప్పుడా గోపికలు తమ పాదధూళి కృష్ణుని శిరస్సునకు పట్టిస్తే తమకు మహాపాపం చుట్టుకుంటుందని అనిపించినప్పటికీ, ఆయన బాధ తొలగిం చడమే తమ కర్తవ్యంగా భావించారు.

తమ పాదధూళిని శ్రీకృష్ణుని నుదుటికి పూయడానికి సిద్ధపడ్డారు. అందుకే గోపికలు లౌకిక ధర్మాధర్మ విచక్షణమాని, భగవంతుని ప్రీతికై కర్మల నాచరించి ఆయనకు అత్యంత భక్తులు కాగలిగారు. అటువంటి భక్తిని కనబరచాలి.

భాగవత జ్ఞానం, కృష్ణతత్త్వం తెలిసిన వారు కేవలం 12 మంది మాత్రమే వున్నారు. వారు శివుడు, బ్రహ్మ, కార్తికేయుడు, కపిలమహర్షి, నారదుడు, భీష్ముడు, మనువు, బలి, జనకుడు, ప్రహ్లాదుడు, శుక్రుడు, వ్యాసుడు. వీరిని కృష్ణునితో పాటు తలిస్తే కృష్ణతత్త్వం మనకే బోధపడే జ్ఞానం కలుగుతుంది.

## ౮౨౨. ప్రజ్ఞాస్వరూపిణి

**జ.** 'సరస్వతి' అనేది నాలుగు అక్షరాల నామం. ఈ నామంతో అమ్మవారికి నమస్కరించేటప్పుడు 'సరస్వత్యైనమః' అని స్మరించాలి. సరస్వతి అంటే ప్రవహిస్తూ ప్రసరించే ప్రజ్ఞ అని చెప్పుకోవాలి. 'సరస్' అంటే ప్రవహించుట. ఈ లక్షణం కల దానిని 'సరస్వతి' అంటారు.

'ఓం ప్రణోదేవి సరస్వతీ
వాజే భిర్వాజినీవతీ
ధీనా మవిత్ర్యవతు' అని ఋగ్వేదం లోని 'సరస్వతీ సూక్తం'లో చెప్పబడింది.

ప్రకాశవంతమైన ఓ సరస్వతీ ! వేగము కలిగిన నీవు, నీ వేగముచేత, మా బుద్ధులను రక్షించు దానవై మమ్ము రక్షించుదువు గాక అని అర్థం. బుద్ధి తిన్నగా వుంటే



కష్టాలు, నష్టాలు రావు. కాబట్టి ఆ బుద్ధిని ముందు రక్షించమని ఈ మంత్రం ద్వారా కోరుతున్నాం.

సమస్త విద్యలకు సరస్వతి అధిదేవత. ఈ సరస్వతీ అనుగ్రహం వుంటేనే జ్ఞానం వికసిస్తుంది. అజ్ఞానం తొలగుతుంది. అందువల్ల మాయ, మోహం, భ్రమ మొదలైనవి తొలగుతాయి. వాక్కు చక్కబడుతుంది. ధీ, ధారణ శక్తులు సక్రమంగా వుంటాయి. మన వెన్నెముకలోని సుషుమ్నా నాడీ స్వరూపమే ఈ సరస్వతి. తలకట్టుకి, మొలకట్టుకి మధ్య వుండే వెన్నెముకను ఒక వీణ ఆకారంతో పోల్చవచ్చు. అలా పోల్చిన వీణను 'కచ్ఛపీ' అంటారు. దీన్ని ఆధారంగా చేసుకుని మన వాక్కులను సరస్వతి శృతి, లయ బద్ధం చేస్తుంది. ఈ సరస్వతీ రూపంలో వుండేది అమ్మవారే.

గంగా, యమునా నదులను ఇడ, పింగళ నాడులతో పోలిస్తే – అంతర్వాహిని అయిన సరస్వతీ నదిని సుషుమ్నా నాడితో పోలుస్తారు. ఈ మూడు నదుల

యొక్క సంగత స్థానమే ప్రయాగ. ప్రవహిస్తూ ప్రసరించే ప్రజ్ఞాస్వరూపిణి, సుషుమ్నా నాడీ స్వరూపిణి, అంతర్వాహిని అయిన సర్వతీనదీ స్వరూపిణి, సర్వ విద్యాధిదేవత, అగ్నితత్త్వ సూచిత అయిన సరస్వతీ మాతను 'సరస్వత్యై నమః' అంటూ భక్తితో స్మరించుకోవాలి.

## ౨౦౦. మహాలయ పక్షం

భాద్రపద బహుళ పాడ్యమి నుండి అమావాస్య వరకుగల మహాలయ పక్షంలో పితృదేవతలను అర్చించాలి. పితృ దేవతలను తర్పణలద్వారా తృప్తి పరచాలి. ఈ కర్మల ద్వారా మాతా పితరుల ఋణం తీర్చుకోవాలి. అలా చేసిన పక్షంలో వారి ఆశీస్సులు లభిస్తాయి. ప్రతి సంవత్సరం చేసే శ్రాద్ధకర్మకన్నా అతి ముఖ్యమైన శ్రాద్ధాలు ఈ మహాలయ పక్షం పదహారు రోజులు చేయడం సర్వోత్కృష్టం. పదహారు రోజులు చేయలేని వారు ఒక్క మహాలయమైనా చేయాలి.

ఆ ఒక్కరోజు కూడా అన్న శ్రాద్ధం పెట్టలేకపోతే హిరణ్య శ్రాద్ధం చేయాలి. 'హేమాద్రి' అనే ధర్మశాస్త్ర గ్రంథంలో ఇలా చెప్పబడింది. ఏమీ చేయలేని పరిస్థితిలో వున్నప్పుడు పితృదేవతల గురించి కన్నీరైనా కార్చాలి. ఈ మహాలయ పక్షాలలో వచ్చే ఏకాదశి శ్రీమహావిష్ణువుకు ఎంతో ప్రీతికరమైనది. ఆ రోజు విష్ణుసహస్ర నామ పారాయణ చేస్తే మంచి ఫలితం వుంటుంది. వైష్ణవాలయాన్ని దర్శిస్తే కోరిన కోరికలు నెరవేరతాయి. మహాలయ పక్షాలలో వచ్చే అమావాస్య పితృ తర్పణాదులు చేయవలసిన ముఖ్యతిథి. కొన్ని ప్రాంతాలలో ఈ రోజు 'పోలాలమా వ్రతం' పేరుతో అమ్మవారిని అర్చిస్తారు. కందమొక్క, వరిదుబ్బలనీ పెట్టి దాని యందు త్రిమూర్తి స్వరూపిణి అయిన 'పోలాలమా దేవి'ని ఆవహింపజేసి భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. స్త్రీలు తమ సంతానం క్షేమంగా వుండాలని ఈ పూజ జరుపుతారు. ఏడురకాల కూరలతో చేసిన పులుసును అమ్మవారికి నైవేద్యంగా పెడతారు.

## ౨౦౧. ప్రతి చవితీ ప్రీతికరమే

**జ.** 'చతుర్థీ పూజన ప్రీతః' అన్నది గణపతి నామం. చతుర్థీ (చవితి) తిథి గణపతికి ప్రీతి. ఈ తిథినాడు ఆయన ఉద్భవించాడు. భాద్రపద శుద్ధ చవితినాడు వినాయక చవితిగా మనం గణపతిని పూజిస్తాం. అయితే ప్రతి చవితీ గణపతికి ప్రీతికరమే.

భాద్రపద శుక్ల చవితి గణపతి పార్వతీ – పరమేశ్వరులకు కుమారునిగా అవతరించిన రోజు. కానీ, అంతకు ముందే



గణపతి ఉన్నాడు. ఆయన ఉపాసన ఉంది. బ్రహ్మదేవుడు సృష్టి ఆదిలో సృష్టి నిర్వహణకు కలిగే విఘ్నాలు చూసి భయపడి, పరబ్రహ్మను ప్రార్థించాడు. ప్రణవ స్వరూపుడైన ఆ పరమాత్మ విఘ్నాల్ని నశింప జేయడానికి గజవదన రూపంలో సాక్షాత్కరించి తన వక్రతుండ మంత్రాన్ని బ్రహ్మకు ఉపదేశించి, విఘ్నాల్ని హరింప జేస్తాడు. ఇది తొలి ఆవిర్భావం.

సర్వ దారిద్ర్యాలు, భయరోగాది కష్టాలు తొలగించే గణపతికి ప్రీతికరమైనది చతుర్థీ వ్రతం. ముఖ్యంగా కృష్ణ పక్షంలో వచ్చే చతుర్థి ముఖ్యమైనది. ప్రతి నెలా ఆ చతుర్థికి గణపతిని ఉద్దేశించి ఉపవాసమో లేక ఉండ్రాళ్ళు మోదకాలు వంటివి నివేదించడమో చేయాలి.

కృష్ణచతుర్థినాడు దూర్వాలు, బిల్వాలతో, పువ్వులతో గణపతిని అర్చించి, ఇరవై ఒక్క ఉండ్రాళ్ళను నివేదన చేస్తే గ్రహదోషాలు, గృహదోషాలు తొలగిపోతాయంటారు. కృష్ణచతుర్థి వ్రతానికి చంద్రోదయంతో చవితి తిథి ఉండాలి. ఆ రోజున ఉపవాసం చేసి పూజ తర్వాత ఇరవై ఒక్క సార్లు 'ఓం శ్రీగణేశాయ నమః' అని జపించాలి.

## ౨౦౭. స్వస్తిక పద్మం

**జ.** శ్రీ మహాగణపతి విఘ్నరాజు, లంబోదరుడు, వక్రతుండుడు అని అనేక పేర్లున్నవాడు. గజాననుడు, వక్రతుండుడు అనే పేర్లు, వంకరగా ఉండే ఆయన తుండాన్ని జ్ఞాపకం చేస్తాయి. ప్రణవము



అని పిలిచే ఓంకారమూ, వక్రతుండుడూ కూడా గణనాథుడే. అందుకే 'ప్రణవ స్వరూప వక్రతుండం' అని అంటారు.

శుభకార్యాల్లో, ఇళ్ళల్లో, వ్యాపార సంస్థల్లో సిద్ధి బుద్ధి అని రెండు వైపులా రాసి స్వస్తిక పద్మం లిఖించడం, తద్వారా శుభాన్ని ఆకాంక్షించడం ఆనవాయితి.

గణపతి హోమం చేయాలన్నా స్వస్తిక పద్మాన్ని బియ్యపు పిండితో చేసి పసుపు, కుంకుమ, పూలతో అలంకరించడం ఆనవాయితీగా వస్తుంది.

శుభకార్యాలు, శాంతి క్రతువులు, సుఖ సౌఖ్యాలు కాంక్షించే ప్రతి స్థలంలోనూ స్వస్తికగుర్తు గీస్తారు. ఇది పవిత్రంగా భావించే చిహ్నం. ఈ గుర్తు గీసి, 'అస్మిన్ స్వస్తిక పద్మే శ్రీ మహాగణపతిం ఆవాహయామి' అని ఆవాహన చేసి మహాగణపతికి పూజలందిస్తారు. అంటే, మహాగణపతికి, స్వస్తిక పద్మానికి అవినాభావ సంబంధం ఉంది. హోమమే కాక ప్రతిష్ఠ

లేక అనుష్ఠానాదులతో కూడా నవగ్రహా లతో పాటు గణపతి స్థానంలో స్వస్తిక పద్మం వేసి గణపతిని ఆరాధిస్తారు.

## ౨౦౩. గరిక అంటే ఇష్టం

**జ.** వినాయకునికి గరికపోచలంటే చాలా ఇష్టం. ఎన్నిరకాల పత్రాలు, పుష్పాలతో పూజించినప్పటికీ గరిక లేకుంటే విఘ్నే శ్వరుడు లోటుగా భావిస్తాడు. గరికెలు లేని వినాయక పూజ వ్యర్థమని, ప్రయోజన రహితమనీ అంటారు. గడ్డిపోచంతటి విలువ చేయవని సాధారణంగా ఎవరి నైనా అవహేళన చేస్తుంటాం. కాని తన విషయంలో గరికకు ఎంతటి విలువ ఉన్నదీ వినాయకచవితి పూజ ద్వారానే విశదమవుతుంది. ప్రకృతి రీత్యా నీటిని నిలువ చేయగలిగిన మహత్తర శక్తి గరికకు ఉంది.

## ౨౦4. మాతృశక్తి

**జ.** నవరాత్రులు మాతృశక్తి ఆరాధనకు ఉద్దేశించిన ప్రత్యేకమైన పండుగ. మార్కండేయ పురాణంలో శక్తిని మహా కాళిగా, మహాలక్ష్మిగా, మహా సరస్వతిగా వర్ణించారు. మహాకాళి అసురశక్తుల్ని సంహరిస్తుంది. అహంకారాన్ని నశింప జేస్తుంది. జ్ఞానమనే కత్తితో అజ్ఞానాన్ని అంతంచేస్తుంది. మహాలక్ష్మి ఐశ్వర్యానికి దేవత. మహా సరస్వతి విద్య, సాహిత్యం, సంగీతం, వివేకం, జ్ఞానాలకు అధిదేవత. వివేకానికి దేవి. దేవి యొక్క తదుపరి రూపాలు బ్రహ్మచారిణి, చంద్రఘంట,



కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిదాత్రి. వీరే నవదుర్గలు. నిజానికి శక్తి విస్తరణ, వైభవం, లీలలు అనంతమైనవి. ఈ శక్తి వివిధ సందర్భాల్లో విభిన్న ప్రయోజనాలకోసం అనేక పేర్లు, రూపాల్ని ధరిస్తుంది. ప్రకృతి లోని శక్తులన్నీ ఆమె రూపాలు. సృష్టి పోషణ అంతా ఈ శక్తిద్వారానే సాగు తుంది. ఈ సృష్టినంతా ఈ శక్తే పరిరక్షి స్తుంది. ఈ శక్తి బ్రహ్మ, విష్ణు, మహేశ్వ రులకు జనని.

## ౨౦5. స్మర్తృగామి

**జ.** మార్గశిర పూర్ణిమ దత్తాత్రేయస్వామి అవతరించిన తిథి. ఈ స్వామి అపార కృపాకరుడు. మూడు శిరస్సులతో, ఆరు భుజాలతో, ఆయుధాలతో, నాలుగు కుక్క లతో, ఆవుతో అలరారు తుంటాడు దత్తా త్రేయుడు. త్రిమూర్త్యాత్మకమైన శ్రీ దత్తా త్రేయులవారు అనఘావల్లభులు. అసలు 'దత్త' అన్న పేరే మహిమాన్వితం. 'దత్త సంప్రదాయం' పేరిట పరంపరగా గురు

సాంప్రదాయం వుంది. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు సృష్టి స్థితి లయకారులు. అందుకే దత్తాత్రేయునికి మూడు శిరస్సులుంటాయి. త్రిమూర్త్యాత్మక పరబ్రహ్మమన్నమాట. దత్తాత్రేయుల వారు సకల వేద విజ్ఞానమును అధిగమించిన జ్ఞాన సాగరుడు. కనుక నాలుగు వేదములు ఆయన వద్ద నాలుగు కుక్కల రూపంలో వుంటాయి. మనసనేది మాయాశక్తి. సంకల్పవికల్పాలకు, సుఖ దుఃఖాలకు కారణమైన మాయను యోగబలంతో శ్రీ దత్తాత్రేయులవారు కామధేనువుగా మార్చినందునే ఆయన వద్ద ఆవు వుంటుంది. సర్వమంత్రమయమైన అక్షర మాల, ధర్మార్థ కామముల త్రిపుటి, త్రిశూలం, ఆత్మావలోకన వివేకాన్ని కలుగజేసే చక్రం, సర్వవేదముల భాండాగారమైన ఢమరు, శుభాలనిచ్చే కమండు లోదకముతో భాసిస్తూ వుంటాడు దత్తాత్రేయ స్వామి. దత్తాత్రేయుని ఆరాధనకు ఈ రోజు చాలా మంచిది.

అత్రి అనసూయలకు కుమారునిగా, త్రిమూర్తుల తేజం దత్తనామంతో అవతరించింది. కృతయుగంలో దత్తాత్రేయుల వారిని స్కంధుడు, ప్రహ్లాదుడు ఆశ్రయించి ఉపదేశం పొందారు. త్రేతాయుగంలో అలర్కుడు మొదలైనవారు యోగవిద్యను, ఆధ్యాత్మిక విద్యను దత్తాత్రేయుల వారి వద్ద సంపాదించుకున్నారు. ద్వాపర యుగంలో పరశురాముడు, కార్త వీర్యార్జునుడు ఈ స్వామి అనుగ్రహాన్ని సంపాదించారు. కలియుగంలో శంకరాచార్యులవారు, గోరక్షనాథుడు వంటివారు దత్తాత్రేయుని కృపను సంపాదించారు. దత్తాత్రేయుని అనంతరం గాణుగాపురంలో వున్న శ్రీ నృసింహ సరస్వతిని ద్వితీయా వతారంగా చెబుతారు. అలాగే మాణిక్యనగర్‌లోని మాణిక్ ప్రభువు, తరువాత షిర్డి సాయిబాబా వీరంతా దత్తుని




రూపాలేనని చెబుతారు. సంత్‌జ్ఞానేశ్వర్, సంత్ ఏక్‌నాథ్, సంత్ జనార్ధన్‌స్వామి, సంత్ దాసోపంత్ వంటివారు దత్తాత్రేయుని సాక్షాత్కారం పొందారు. ఈ స్వామి అపరకృపాకరుడు, పరమభక్త వత్సలుడు, ఒక్కసారి ఈయన్ని నిండు మనసుతో స్మరిస్తే ప్రత్యక్షమై వరాలనిస్తాడు. అందుకే ఈయన్ని 'స్మర్తృగామి' అంటారు.

జన్మ సంసార బంధఘ్నం
స్వరూపానంద దాయకం
నిశ్శ్రేయసప్రదం వందే
స్మర్తృగామి నమావతు

## ౨౦౬. మంత్రశక్తి

**జ.** దేవాలయాల్లో మూల విరాట్టుండే మండపం గొప్పది. అందులోకూడా గర్భా లయం ప్రశస్తమూ, పవిత్రమూ. గర్భా లయంలో మూలవిరాట్టుని నాలుగు గోడల మధ్యగా అన్ని గోడలకీ సమాన మైన దూరంలో వుండేలా ప్రతిష్ఠ చేయరు. వెనకవున్న గోడ దగ్గరగా మూలవిరాట్టుని ప్రతిష్ఠిస్తారు. నిత్యం మంత్రాలని పఠిస్తూ పూజాది కార్యక్రమాలు ఆ స్వామికి చేస్తున్న కారణంగా ఆ భగవంతుని పాదపీఠం కిందవుండే యంత్రంలోనికి ఈ మంత్ర శక్తి ప్రవేశించి ఆ విగ్రహానికి ఓ ఆకర్షణ ఏర్పడుతుంది. ఈ కారణంగానే వేలు, లక్షలు వెచ్చించి నిద్రాహారాలని లెక్కించక జనమంతా భగవంతుణ్ణి చూడ్డానికొచ్చేది.



అలాంటి మంత్రశక్తి కారణంగా భగవం తుని విగ్రహం, తననించి కొన్ని తపః కిరణాలని నాలుగు దిక్కులా వెదజల్లుతూ వుంటుంది. ఆ శక్తిని గ్రహించడానికి మనం విగ్రహంచుట్టూ ప్రదక్షిణలు చేస్తాం.

ఈ మంత్ర శక్తిని గ్రహించగల నాలుగు గోడలలోనూ స్వామికి మరింత చేరువగా వుండేది మనకి ఆ వెనుక గోడే. అందుకే ఆ గోడ మీద ఒక శిల్పాన్ని చెక్కుతారు. ఎందుకంటే భక్తుడు ఆగినప్పుడు తపశ్శక్తి ప్రవేశిస్తుందని. మనమీదే కాదు, పక్షులు కూడా ఉత్తమ జన్మ రావాలనే ఉద్దేశ్యంతో అక్కడ పక్షుల తిండికోసం బలిపీఠాన్ని ఏర్పాటుచేస్తారు అన్నం పెట్టడానికి. పక్షు లకు ఆహారం పెట్టడం మన హిందువుల సంప్రదాయం.

## ౨౦౭. శ్రీరామస్ఫూర్తి

**జ.** మన దగ్గర వున్నది, కొత్తగా సంపా దించుకున్నది కాపాడుకునేందుకే జీవిత మంతా వెచ్చిస్తుంటారు. తమకున్న ఆధ్యా త్మిక, సామాజిక బాధ్యతల గురించి ఆలో చించి, అనుసరించేవారు అతి తక్కువగా వుంటారు. త్యాగం అంటే ఏమిటో, ఏది అనుసరణీయమో తెలియజెప్పడం కోసం అందించినవే పురాణగాథలు.

రామాయణంలో శ్రీరాముని పాత్ర ఔచిత్యం ఎంతమంది అర్థం చేసుకుం టారు! ముందురోజు పట్టాభిషేకవార్త మరుసటి రోజు అరణ్యవాస ఉత్తర్వులు. అయినా రాముడు ఇదేమిటి అనలేదు. రాజ్యం రావడం లేదన్న బాధలేదు. తన సోదరుడి పట్టాభిషేకం అంటే ఆనందమే అన్నాడు. తాను అడవుల పాలవడం కూడా పితృవాక్య పాలన ఆనందమే నన్నాడు.

ఏ అంశాన్నైనా ఒకేలా తీసుకోగలిగిన మానసిక స్థిరత్వం శ్రీరామచంద్రునిది. ఆ



artist

ఆధ్యాత్మిక స్థితిని అందుకోగలగడంలో రాముని స్ఫూర్తిగా తీసుకోవాలి.

## ౨౦౮. మార్కండేయ మహర్షి జయంతి

**జ.** అల్పాయుష్కుడై జన్మించి శివకేశవులను మెప్పించి చిరంజీవి అయిన మహానుభావుడు మార్కండేయుడు. ఆయన చరిత్ర విన్నా, చదివినా చిరంజీవులవుతారు. తపోదీక్షతో మృత్యువును జయించి, 'మార్కండేయాయుష్య' అనే దీవెనకు కారణభూతుడీయన. ఈయన చరిత్ర పరమ పవిత్రమైనది, నిత్య పఠనీయమైనది. మహాతపశ్శక్తి సంపన్నుడు అయిన భృగుమహర్షి కుమారుడు విధాత. విధాత కుమారుడు మృకుండుడు.

ఈ మృకుండ మహర్షి శివకేశవుల గురించి తపస్సు చేయగా ఆ ఇరువురు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మనగా, నాకో కుమారుడు కావాలన్నాడు.

అల్పాయుష్కుడైన గుణవంతుడు కావాలా, మూర్ఖుడైన శతాయుష్కుడు కావాలా అని అడిగారా ఇరువురు. గుణవంతుడే కావాలనికోరగా 'అట్లే'నని వారు అదృశ్యులైనారు. మృకుండుడు సంతోషంతో ఇంటికి వచ్చి తన భార్య అయిన మనస్వినితో సంసార సుఖాలు పొందగా ఆమె శివకేశవుల వరబలంతో గర్భవతి అయ్యింది. ఆమెకు పుట్టిన కుమారుడే మార్కండేయుడు. బాల్యం నుండే మార్కండేయుడు మహాతపోనిష్ఠ కలిగినవాడై నిత్యం దైవారాధనలో వుండేవాడు. ఒక రోజు మృకుండ మహర్షి మార్కండేయుని పిలిచి అతని జన్మరహస్యం తెలియజేశాడు. తాను అల్పాయుష్కుడనని గ్రహించిన మార్కండేయుడు తాను శివుణ్ణి మెప్పించి శత సంవత్సరాల ఆయుష్షును సాధిస్తానని చెప్పి, శివుణ్ణి సేవించడం మొదలుపెడతాడు. అప్పటికి మార్కండే

యుడు పదహారు సంవత్సరాల ప్రాయు డైనాడు. ఆయన ఆయుష్షు తీరడంతో యమధర్మరాజు రావలసివచ్చింది. శివుణ్ణి శరణుకోరాడు మార్కండేయుడు. శివుడు శూలధారియై ప్రత్యక్షమైనాడు. చేయునది లేక యమధర్మరాజు మార్కండేయుని విడిచి పుచ్చాడు. శివకృపతో మార్కండే యుడు చిరంజీవి అయ్యాడు. ఆ తరు వాత నూరు సంవత్సరాలు వర్షం పడగా భూగోళమంతా నీటిమయమైంది. కేశ వుడు బాలకృష్ణుడై వటపత్రముపై శయ నించి వుండడం చూశాడు. ఆ బాలకృష్ణుని ఉదరంలో కొంతకాలం వుండి బయటకు వచ్చాడు మార్కండేయుడు. అప్పటికి నీరంతా ఇంకి భూమి బయట పడింది.

ద్వాపరయుగంలో ధర్మ రాజుకు కలియుగధర్మాలను విడమరచి చెప్పిన వాడు మార్కండేయ మహర్షే. గౌర ముఖు డనే మహారాజుకు శ్రాద్ధకర్మల కాలమును తెలియజేసిందీ ఈ మహర్షే. పితరులు సప్తలోకాలలో వుంటారని, భూలోక వాసులు భువర్లోక వాసులను, భువర్లోక వాసులు సువర్లోక వాసులను, సువర్లోక వాసులు మహర్లోక వాసులను, మహర్లోక వాసులు జనర్లోక వాసులను, జనర్లోక వాసులు తపోలోక వాసులను, తపోలోక వాసులు సత్యలోక వాసులును పూజిం చాలి అని మార్కండేయులవారు తెలియ జేశారు. వ్యాసుని శిష్యుడైన జైమినికి ధర్మ పక్షుల వృత్తాంతం తెలియజేసింది మార్కండేయ మహర్షే. దుర్వాసుని శాపంతో వపువను అప్సరస, పక్షి అయి పుట్టి పెరిగి పెద్ద అయి మందపాలుడనే మహర్షి అనుగ్రహంతో గర్భవతియై బిడ్డలను కంటుంది. శమీకుడనే మహర్షి వాటిని పెంచి పెద్ద చేస్తాడు. అవి సకల వేదశాస్త్రాలను అధ్యయనం చేస్తాయి.

ఆ పక్షులవద్దకు వెళ్ళమని జైమినికి చెబుతాడు మార్కండేయుడు. జైమిని, ఆ పక్షుల వద్దకు వెళ్ళి తన సకల సంశయా లను నివృత్తి చేసుకుంటాడు.

## ౨౦౨. శ్రీపంచమి

**జ.** మాఘశుద్ధ పంచమినే శ్రీ పంచమి అని పిలుస్తారు. ఈ రోజు మహిమాన్వి తమైన రోజు. దేవీ భాగవతం, బ్రహ్మ వైవర్తపురాణాల్లో శ్రీపంచమి గురించి చెప్పబడింది. సరస్వతీదేవి ప్రాదుర్భ



వించిన ఈ పుణ్యతిథిన అలా మాతను పూజిస్తే సకలవిద్యలూ లభిస్తాయి. మేధా శక్తి, విద్య, ధారణ, స్ఫురణ, ప్రజ్ఞ వాక్కు మొదలైన బుద్ధిశక్తులు అభివృద్ధి చెందు తాయి. ఈ రోజు తెల్లని పూలతో పూజించి పాయసం, టెంకాయ, అరటిపళ్ళు నైవేద్యం పెట్టి సరస్వతీదేవిని కొలిస్తే ఆ మాత

అనుగ్రహం తప్పక లభిస్తుంది. ఈ రోజున దేవతలు కూడా సరస్వతిని కొలుస్తారు.

## 210. సూర్యారాధన

**జ.** మాఘశుద్ధ సప్తమినాడు రథసప్తమి పండుగను చేసుకుంటారు. ఈ రోజు మఖ్యంగా సూర్యుణ్ణి ఆరాధిస్తారు.



ఈనాటి అరుణోదయాన స్నానమాచరించడం మహా పుణ్యదాయకమని మదన రత్నము, నిర్ణయామృతము, వ్రతచూడామణి గ్రంథాలు తెలియజేస్తున్నాయి. మాఘశుద్ధ షష్టిరోజు రాత్రి ఉపవాసం చేసి రెండవ రోజు మాఘస్నానం చేసి, సూర్యదేవాలయానికి గాని, లేదా ఇతర దేవాలయాలకుగాని వెళ్ళి భక్తితో సూర్యుని ధ్యానించి దైవపూజ జరిపిన వారికి వెనుకటి జన్మలోగాని, లేక ఈ జన్మలోగాని చేసిన ఏడు విధాలైన పాపాలు, సకల వ్యాధి దుఃఖాలు తొలగిపోతాయని ధర్మ సింధువు, వ్రత చూడామణి మొదలైన గ్రంథాలలో చెప్పబడి వుంది. మాఘశుద్ధ సప్తమినాడు ఉదయాన్నే లేచి, బంగారు, వెండి, రాగి, ఇనుములతో చేయబడిన ప్రమిదలోగాని, లేక మట్టి ప్రమిదలోగాని ఆకుదొన్నెలోగాని నూనె పోసి, వత్తివేసి దీపాన్ని వెలిగించి, దానిని తలపై వుంచుకొని నదుల్లో గాని, పారే కాలువలో గాని వదిలిపెట్టి నువ్వుల పిండితో ఒళ్ళు రుద్దుకుని, ఏడు జిల్లేడాకులు, ఏడు రేగు ఆకులు, ఏడు చిక్కుడు ఆకులు తలపై వుంచుకుని సూర్య భగవానుణ్ణి ధ్యానిస్తూ స్నానం చేయాలి.

ఆ తర్వాత ఇంట్లో ఓ మండపం తయారుచేసి, అరటి స్తంభములు, మామిడి తోరణాలు కట్టి పూలతో అలంకరించి ఓ పీట వేసి దానిపై బియ్యం పోసి, వెండి, బంగారం లేదా ఇతర లోహాలతో చేసిన సూర్యవిగ్రహాన్ని వుంచి, దీపాన్ని వెలిగించి మంత్రోక్తంగా పూజ చేయాలి.

ఇక ఆ రోజు రాత్రికి భోజనం చేయకుండా ఉపవాసం వుండి నేలపై పడుకోవాలి. ఇలా భక్తిశ్రద్ధలతో ఎవరైతే చేస్తారో వారికి అన్ని వ్యాధులూ తొలగి, సూర్యదేవుని అనుగ్రహం పొంది, సర్వ సౌఖ్యాలు అనుభవిస్తారని శ్రీకృష్ణుడు ధర్మరాజుకు తెలియజేశాడు.

జననీ త్వంహి లోకానాం
సప్తమీ సప్త సప్తికే
సప్తవ్యా హృతికే దేవి
నమస్తే సూర్యమాతృకే!

సప్తాశ్వములుగల ఓ సప్తమీ! నీవు సకల భూతాలకు, లోకాలకు జననివి. సూర్యునికి తల్లివైన నీకు నమస్కారం. అనే మంత్రంతో సూర్యునికి అర్ఘ్యమిచ్చి పూజించాలి. తరువాత పితరులకు తర్పణములు వదలాలి.

## 811. దాన రహస్యం

**ఐ.** మహా పుణ్యఫలమిచ్చేది దానం. మాఘ మాసంలో దానం చేయడం మహా శ్రేష్ఠం. ఐతే ఈ దానం ఎలా చేయాలి?

యోగ్యునికి ఇచ్చిన దానం దాతకీ, గ్రహీతకీ ఇద్దరికీ శుభాన్ని కలిగిస్తుంది. అయోగ్యునికిచ్చినది ఆ ఇద్దరినీ ముంచేస్తుంది. రాతినౌక కూర్చున్నవానితో కలిపి మునిగి పోవునట్లు అయోగ్యునికి ఇచ్చిన దానం దాతను తోడుగా తీసుకొని తప్పక నరకానికే వెళుతుంది.

దానం గురించి మరో మాటను తెల్సుకోవాలి. చాలా ధనవంతుడైన వ్యక్తి లక్షల రూపాయల దానంకంటే పేదవాడు ఇచ్చిన ఒక రూపాయిదానం ఎంతో గొప్పది. ఎందుకంటే పేదవాడు చేసిన ఒక రూపాయి దానం గొప్ప త్యాగమే. భగవంతుని దృష్టిలో ఇదే న్యాయం. ఇలాకాకపోతే పేదవాళ్ళకు ముక్తి అనేదే కలుగదు.

ఒక రాజు తన ప్రజలతో కలసి తీర్థయాత్రలు చేయడానికి బయల్దేరాడు. మార్గమధ్యంలో ఒక వ్యక్తి బట్టలు లేకుండా పడి వున్నాడు. చలి కారణంగా అతడు కొంకర్లు తిరిగిపోతున్నాడు. రాజుయొక్క ప్రజలలో ఒక రైతు వున్నాడు. అతడు తన రెండు ధోవతుల నుండి ఒక ధోవతిని తీసి ఆ వ్యక్తికిచ్చాడు.

రైతు దగ్గర కప్పుకోవడానికి ఇక ఒకే ధోవతి మిగిలింది. వారు ముందుకెళ్ళగా అక్కడ చాలా ఎక్కువ ఎండ వుంది. కానీ వారు గమనిస్తే మేఘాలు వారి పైన నీడను ప్రసరిస్తూ వస్తున్నాయి. రాజు ఆలోచించాడు."మన పుణ్యప్రభావంవల్లనే ఈ మేఘాలు ఇలా నీడను పడుతూ వస్తున్నాయి". తరువాత వారు ఒకచోట ఒక వనంలో విశ్రమించారు. మళ్ళీ బయల్దేరినపుడు ఒక మహాత్ముడడిగాడు. "రాజా! ఎవరి గొప్పతనంవల్ల ఈ మేఘాలిలా నీడను పడుతూ వస్తున్నాయో మీకు తెలుసా?" దీనికి రాజు ఏ సమాధానమూ ఇవ్వలేకపోయాడు. అపుడా మహాత్ముడు "మంచిది. ఒక రొకరుగా ఇక్కడి నుండి బయటకెళ్ళండి. ఎవరివెంట అయితే మేఘం నీడను పడుతూ వస్తుందో అతని పుణ్యప్రభావమే ఇది అని తెలుసుకోవాలి" అన్నాడు. అపుడు రాజు ముందుగా తానే బయల్దేరాడు. తరువాత ఒకరొకరుగా అందరూ బయల్దేరారు. మేఘాలు మాత్రం అక్కడే వున్నాయి. అపుడు రాజు అన్నాడు. "వెనుక ఎవరున్నారో చూడండి" సేవ

artist

కులు అక్కడో రైతు పడుకుని వుండటాన్ని చూశారు. అతన్ని నిద్రలేపి, వారు రాజు దగ్గరికి తీసుకొచ్చారు. అప్పుడు మేఘాలు కూడా అతనికి నీడపడుతూ కదల సాగాయి. అపుడా మహాత్ముడు పుణ్యాత్ముని ప్రభావమే అంటూ ఆ రైతు నడిగాడు. "నీవు అంత పుణ్యమేం చేశావు?" అని. "నేను వేరే పుణ్యమేదీ చేయలేదు. ఇప్పుడే మార్గమధ్యంలో నేను నా రెండు ధోవతుల నుండి ఒక ధోవతిని తీసి చలికి కొంకర్లు తిరుగుతున్న ఒక వ్యక్తికి ఇచ్చాను' అని వినయంగా చెప్పాడా రైతు. దానితో ఆ మహాత్ముడు రాజుతో అన్నాడు. "రాజా! నీవు చాలా దానం చేస్తావు. అయితే నీ వద్ద అపార సంపద వుంది. కాబట్టే నీ దానం రెండు ధోవతులలో ఒకటి దానమిచ్చినదానితో సమానం కాబోదు" అన్నాడు. ఈ విధంగా దానం యొక్క రహస్యాన్ని తెలుసుకుని దానం చేయాలని పెద్దలు చెబుతారు.

## ౨౧౨. ఏకాదశ సరస్వతీ దేవాలయాలు

**జ.** చదువుల తల్లి సరస్వతి పాశము, అంకుశము, వీణ, పుస్తకమును చేతులలో ధరించి వుంటుంది. పాలు, మల్లెలు, చంద్రుడంతటి నిర్మలమైనది శారదా మాత. పదునాలుగు విద్యలలో రమిస్తూ, పదునాలుగు లోకాలలో నివసించే ఆ మాతకు మన దేశంలో ఏకాదశ దేవాలయాలు వున్నాయి. అవేంటో చూద్దాం.



1. కర్నాటక రాష్ట్రం శృంగేరిలోని శారదా పీఠంలో సువర్ణ శారదాదేవి.
2. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో తెల్లని పాలరాతి విగ్రహం కలిగిన సరస్వతీ దేవాలయం.
3. రాజస్థాన్‌లోని బికనీర్ కోటలో ఎరుపు రంగు కలిగిన పసుపు ఛాయతో వెలసిన అమ్మవారి ఆలయం.
4. రాజస్థాన్‌లోని బ్రహ్మ సరోవర తీరంలో అజ్మీర్‌కి 11 కి.మీ. దూరంలో వున్న పుష్కర్‌లో గాయత్రీ పేరుతో వెలసింది సరస్వతీమాత.
5. తమిళనాడు – తంజావూరు జిల్లాలో గల కత్తునూర్‌లో అరసిలార్ నది గట్టుపై సరస్వతీ ఆలయం వుంది.
6. తమిళనాడులోని పూందోట్టంలో సరస్వతీ ఆలయం.

7. రాజస్థాన్‌లోని పిలానీలో పాలరాతి కట్ట డాలతో చేసిన శారదాదేవి ఆలయం వుంది.
8. అష్టాదశ పీఠాలలో ఒకటైన ప్రౌఢ సరస్వతీ పీఠం కాశ్మీర్‌లో వుంది.
9. ఆదిలాబాద్ జిల్లాలోని బాసర క్షేత్రంలో వున్న జ్ఞానసరస్వతీ దేవాలయం.
10. కరీంనగర్ జిల్లాలోని శనిగరం గ్రామంలో వున్న సరస్వతీదేవి ఆలయం.
11. కరీంనగర్‌కు 130 కి.మీ. దూరం లోని కాళేశ్వరంలో మహాసరస్వతీ దేవా లయం వుంది.

పైన చెప్పబడిన ఏకాదశ సరస్వతీ దేవాలయాలలోని ఏదైనా ఒక్క దేవాలయం లోనైనా అమ్మవారిని దర్శించి నట్లయితే మనకు జ్ఞానం సిద్ధిస్తుంది.

సప్త సరస్వతుల పేరిట ఏడు నదులు ప్రవహిస్తున్నాయి. 1) సుప్రభ-పుష్కర క్షేత్రం, 2) కాందనాక్షి - నైమిశారణ్యం, 3) విశాల-గయాక్షేత్రం, 4) మనోరమ - ఉత్తర కోసలము, 5) ఓఘపతి - కురు క్షేత్రం, 6) సురేణు - హరిద్వారం, 7) విమవోదక - హిమాలయం. ఈ మహా దేవి విష్ణురూపం గలది. నల్లకలువ వంటి శరీరకాంతితో, ఉంగరాలు తిరిగిన నల్లని వెంట్రుకలతో, నాలుగు చేతులతో ఒప్పా రుతూ, తామర పూరేకులవలె విశాలమైన పెద్దకళ్ళతో వుండే ఈ మాతృదేవిని ఉద యాన్నే పూజించి తీరాలి.

## 813. సర్వం మన మనసే

**జ.** ఒక విషయం వినండి. మనశ్శాంతి పొంద గోరితే ఇతరులలో లోపాలెంచకండి. అంతకంటె నీ లోపాలు పరికించు. యావత్ ప్రపంచం నీదనే భావన పెంపొందించుకో. ఎవ్వరూ పరాయివారు కారు. ఈ ప్రపంచమంతా పూర్తిగా నీ సొంతమే. ఆకాశంలోని చంద్రుడిని మేఘం కప్పివేస్తుంది. ఆ మేఘాన్ని వాయువువీచి క్రమంగా తొలగించి



వేస్తుంది. ఆ తరువాతే చంద్రుని చూడ గలం. మేఘం వున్న పళంగా తొలగి పోతుందా? పారమార్థిక సిద్ధి విషయం కూడా ఇలాంటిదే. పూర్వ కర్మఫలాలు శమించడం మెల్లగానే జరుగుతుంది. భగవత్సాక్షాత్కారం కలిగినప్పుడు ఆయన ఆంతరంగిక ప్రకాశాన్ని ఇస్తాడు. మనిషి కది స్వయంగా వ్యక్తమవుతుంది. భగవ త్సాక్షాత్కా రసిద్ధి పరిపూర్ణంగా ప్రాప్తించిన వ్యక్తికి తన హృదయంలో దీపిస్తూండే వాడే; సర్వుల - పీడితుల, బాధితుల, అస్పృశ్యుల, బహిష్కృతుల, హృద యాల్లో కూడ నెలకొని వున్నాడని గోచర మౌతుంది. ఈ అనుభూతిచే మనిషికి నిజ మైన వినమ్రత కలుగుతుంది. భగ వంతుడు మనస్వ కీయుడు. పారమార్థిక సాధనలు ఎంత తీవ్రంగా అనుష్ఠించితే,

అంత త్వరితంగా అతడు భగవంతుణ్ణి ప్రాప్తించుకోగలడు. భగవత్సాక్షాత్కారంవల్ల మనకు లభించేది ఏమిటి? రెండు కొమ్ములు మొలుచుకొస్తాయా? కాదు. మనకి చిత్తశుద్ధి లభిస్తుంది. చిత్త శుద్ధి ద్వారా జ్ఞానోదయమౌతుంది.

చిత్తమే సర్వం.మనస్సులోని పరిశుద్ధత అపరిశుద్ధతలు భాసిస్తాయి. తన మనస్సును దోషపూరితం చేసుకున్న తరువాతే ఒక వ్యక్తికి ఇతరులలోని దోషం కనబడుతుంది. మనస్సు సహజంగా చంచలమైనది. కనుక మనస్సును నిశ్చల మొనరించే ధ్యానవేళ, శ్వాసను ఒకింత నియమబద్ధం చేసుకోవడం మంచిది. నువ్వు భగవద్దర్శనం గురించి, లేదా ధ్యానం గురించి మాట్లాడవచ్చు. కాని మనస్సే సర్వమని గుర్తుంచుకుంటే శాంతి లభిస్తుంది.

## 814. సరైన మార్గం ఏది!

**జ.** ఏది గ్రహించాలి!! ఏది త్యజించాలి!!! ఇది తేల్చుకోవడంలో పడే కష్టాలే మానవ జీవితమంతా మన కళ్ళఎదుట జరిగే ఘర్షణలకు మూలం అదే. ఏది మంచి అనేది తెలీక తాను ఎంచుకున్న మార్గమే సక్రమమైనది అనుకుంటూ విధ్వంసం సృష్టించే మూకలను నేడు చూస్తున్నాం. మంచి అనే వ్యక్తి మంచికా లేక సమాజ మంచికా అనేది కూడా చూడాలి. వ్యక్తికి మాత్రమే పరిమితమైతే అది స్వార్థమవుతుంది. అలా కాక పదిమంది మంచిని కోరినదే మేలైన మార్గం. అయితే ఈ సరైన మార్గంలోకి వెళ్ళనివ్వకుండా భౌతిక ఆకర్షణలు బందీలను చేస్తాయి. అప్పుడే మానసికగందరగోళం ఏర్పడుతుంది. అటువంటి మానసిక స్థితి నుండి బైట పడాలంటే సరైన మార్గం తెలియజెప్పే సమర్థగురువు అవసరం. భారత యుద్ధ సమయంలో అర్జునుడికి అలాంటి గందరగోళమే ఏర్పడినప్పుడు దాన్ని తొలగించిన గురువు శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణుడి స్థాయిగల గురువు దొరకడం అదృష్టం. అది అందరికీ సాధ్యంకాదు. ఐనా ఎవరి స్థాయిలో వారు తగిన గురువును ఎంచుకుని అనుసరించాలి.

## 815. జై జగన్నాథ

**జ.** శ్రీ కృష్ణుడు జగన్నాథ స్వామిగా, సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రలతో కొలువుతీరి, భక్తుల పూజల్ని అందుకుంటున్న పుణ్యక్షేత్రం పూరి. ఇక్కడి విశేషమేమంటే – ఏ ఆలయంలోనైనా మూల విరాట్టు మూర్తులు శిలావిగ్రహాలే ఉంటాయి. కానీ, పూరీలో మాత్రం చెక్కతో చేసిన విగ్రహాలే ఉంటాయి. ఆషాఢమాసంలో



చంద్రుడు పుష్యమీ నక్షత్రంతో కలసిన రోజున జగన్నాధ, బలరామ, సుభద్ర విగ్రహాలను రథంలో ఊరేగిస్తారు. దేశంలో అనేకచోట్ల జగన్నాథ రథం ఊరేగినప్పటికీ, ఇక్కడ జరిగే రథోత్సవానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. విష్ణుమూర్తి ఇక్కడే జగన్నాథుడయ్యాడని చెబుతారు. లక్షలాది భక్తులు ఆ రోజు జరిగే రథయాత్రలో పాల్గొని, రథాన్ని లాగి భక్తిప్రపత్తులను చాటుకుంటారు. రథమార్గం జనకపురి చేరేవరకు ఆ ఊరేగింపు కొనసాగుతుంది. స్వామివారు అక్కడ లక్ష్మీదేవిని కలుసుకుని, మూడు రోజులు విశ్రాంతి తీసుకుంటారు. రథయాత్ర 'గుండిచాఘర్' వరకూ సాగుతుంది. అక్కడ ఏడు రోజులు జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రలు విడిది చేస్తారు. గుండిచాఘర్ అనేది ఒక తోట. అక్కడో మందిరం ఉంది. గుండిచాతోట శ్రీకృష్ణుని మేనత్త స్థానం. ఇక్కడా పూజలు నిర్వహిస్తారు. ఆ తరువాత రథయాత్ర దేవాలయానికి చేరుతుంది.

ఇంద్రద్యుమ్నుడనే రాజు కలలో స్వామి కనిపించి, సముద్రంలో ఒక చెక్క కొయ్య కొట్టుకొస్తుందని, దానితో తన విగ్రహాన్ని చేయించి, ఆలయం కట్టించమని చెప్పగా ఆ విధంగా చేశాడట ఆ రాజు. జగన్నాథ స్వామి పంపిన ఇద్దరు శిల్పులు ఆ విగ్రహాలను చెక్కుతుండగా, మధ్యలో అంతరాయం కలుగగా ఆ శిల్పులు అంతర్ధానమయ్యారు. చెక్కతో చెయ్యబడిన అసంపూర్ణ ఓ స్త్రీ మూర్తి, ఇద్దరు పురుషమూర్తుల ప్రతిమలు కనిపించేసరికి రాజు చింతాక్రాంతుడై చేయగలిగిందేమీ లేక మూర్తులనే ప్రతిష్ఠించి, పూజలు చేయిస్తాడు. ఆ ప్రతిమలే జగన్నాథస్వామి, బలభద్రుడు, సుభద్రాదేవి. ఆనాటినుంచి భక్తుల కోరికలను తీర్చే స్వామిగా పూరీ జగన్నాథ దేవాలయంలో జగన్నాథుడు ప్రసిద్ధి చెందాడు. రథంపై ఉన్న జగన్నాథ స్వామిని చూసినవారికి పునర్జన్మ ఉండదనేది నమ్మకం.

## ౨౧౬. స్వధర్మం

**జ.** నిశ్చలమైన మనస్సులో బుద్ధత్వం ఉదయిస్తుంది. సరస్సులో, నిశ్చలమైన జలంలో చంద్రుడు అందంగా ప్రతిబింబిస్తాడు. సరస్సులో ప్రతిబింబించాలని సరస్సులోని నీరు ప్రయత్నించదు. దానికదే జరిగే ప్రక్రియ అది. అలాగే నిశ్చలమైన మనస్సులో శుద్ధ చైతన్యం ప్రతిబింబిస్తుంది. ఇటు మనస్సు కాని, చైతన్యం కాని ప్రతిబింబమునకు ప్రయత్నించవు.



ప్రతిబింబించినంత మాత్రాన జలంలో ఉన్న తేమ చంద్రునికి అంటదు. అలాగే శుద్ధ చైతన్యం మనస్సులో ప్రతిబింబించి నప్పుడు, చైతన్యమునకు మనస్సు అంటదు. నిశ్చల మనస్సు కాలంద్వారా పరిణామం చెందే మనస్సుకు మరణం వంటిది. ఆత్మజ్ఞానానికి నాంది. దీనివల్ల యుగయుగాల నుండి మనను బాధిస్తున్న అజ్ఞానం అంతమై, శుద్ధ చైతన్యం స్వయం జ్యోతిగా వెలుగొందుతుంది. ఆత్మజ్ఞానం కలగటం అనంతమైన అతి మానస జీవితానికి నాంది మాత్రమే. ఈ జీవితానికి అంతం అంటూ ఉండదు. మన స్వధర్మం ఆత్మగా వెలుగొందుతూ ఉండటమే! అగ్నికి వేడి ధర్మం అయినట్లు, మనకు బుద్ధత్వం స్వధర్మం.

## 817. తాపత్రయాలు

**జ.** పురాణాల్లో మూడు విధాల తాపత్రయాలను వర్ణించారు. ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక అన్నవే ఈ మూడు తాపత్రయాలు. వీటిలో మొదటిదైన ఆధ్యాత్మిక తాపత్రయాలను మరల రెండు విధాలుగా విభజించారు. గర్భవాసం, జననం, శిశువు నిస్సహాయత, జలుబు, దగ్గు, ఉబ్బసం, క్షయ, వృద్ధాప్యం,మరణం మొదలైనవి శారీరకమైనవి. కామ, క్రోధ, లోభ, భయ, ద్వేషాలు మానసిక తాపత్రయాలన్నారు. గర్భవాసంలో శిశువు తల్లి మల, మూత్ర మొదలగు కాలుష్యాలను సహిస్తూ ఒకే స్థితిలో పడుకోవాలి. పుట్టిన తర్వాత కొన్నేళ్ళు అన్ని విషయాలు తల్లే చూచుకోవాలి. వృద్ధాప్యంలో మనిషి దైహికశక్తి తరుగుతుంది. తన అవసరాలన్నిటికీ ఇతరులపై ఆధారపడవలసి ఉంటుంది. రెండవది ఆధిభౌతిక తాపత్రయాలు. మృగ, పక్షి, విష జంతువులు, మనుషులు, రాక్షసులు, భూతపిశాచాదుల వల్ల కలిగే ఇబ్బందుల్ని ఆధిభౌతిక తాపత్రయాలంటారు. చలి, గాలి, వేడి, నీరు, ప్రకృతి మున్నగువాటి నుండి కలిగే ఇబ్బందులను ఆధిదైవికము లంటారు.

## 818. లక్ష్ములు ఆరుగురే


**జ.** ప్రతి దేవాలయంలోనూ మంత్రపుష్పం చదువుతారు. దాని చివర్లో కన్పించే ఈ శ్లోకం ప్రకారం నిజానికి లక్ష్ములు ఆరుగురే. కొద్దిగా వీరినే విశ్లేషించి (మరో ఇద్దరుగా వేరుచేసి) ఎనమండుగురిగా చేసి అష్టలక్ష్ములని అన్నారు. ఇంతకీ ఆ ఆరుగురూ క్రమంగా....



శుద్ధలక్ష్మీ ర్మోక్షలక్ష్మీ ర్జయలక్ష్మీ స్సరస్వతీ।
శ్రీర్లక్ష్మీ ర్వరలక్ష్మీ శ్చ ప్రసన్నా మమ సర్వదా॥

శుద్ధలక్ష్మి, మోక్షలక్ష్మి, జయలక్ష్మి, విద్యా లక్ష్మి (సరస్వతి), శ్రీలక్ష్మి (ధనలక్ష్మి), వర లక్ష్మి అనేవాళ్లు.

ఏ అధర్మ సంపాదనా లేకుండా పూర్తి ధర్మబద్ధ ఆదాయ మేదుందో ఆమె శుద్ధ లక్ష్మి. కౌరవులని వధించి రాజ్యాని కొచ్చిన ధర్మరాజు ప్రత్యేక లక్ష్మీపూజని చేసి, సింహాసనాన్ని ఎక్కాడు. అదుగో ఆమె "శుద్ధలక్ష్మి" (రాజుల్ని చంపగా వచ్చిన ఆ దోషం తొలిగిందీ పూజతో).



పాము కరిచి మరణించబోయే శాపం ఏ పరీక్షిత్తుకి వచ్చిందో, అది శ్రీహరి ఆలో చనకి అనుగుణంగానే జరిగిన కారణంగా ఆ ఏడు రోజుల్లో భాగవతాన్ని విని తరిం చిన పరీక్షిత్తుకి 'మోక్షలక్ష్మి'ని ప్రసాదిం చింది. శిశుపాలుణ్ణి వివాహం చేసుకోవల సిన దుఃస్థితిని దాటి కృష్ణుణ్ణి పెండ్లాడిన రుక్మిణికి లభించినది 'జయలక్ష్మి'. పరమ అమాయకుడైన కాళిదాసుకీ, మూగ తనమే ఉన్న మూకమహాకవికీ అద్భుత కవిత్వం, వాగ్ధాటీ అనే ఏవి లభించాయో అది 'విద్యాలక్ష్మి' (సరస్వతి). కృష్ణుని అనుగ్రహం కారణంగా ఏ కుచేలుడు పరమ భాగ్యవంతుడయ్యాడో అది 'శ్రీలక్ష్మి'. తండ్రి తొడని ఎక్కికూచుంటే చాలనుకుని తపస్సు చేసిన ధ్రువునికి శ్రీహరి ప్రత్యక్షం కావడమేదుందో అది 'వరలక్ష్మి'.

## ౨౨. రథోత్సవం

**ఐ.** పూరీ జగన్నాథస్వామి ఆలయం అద్భుత శిల్పకళతో శోభిల్లుతూంటుంది. ఆలయ గోపురం శంఖాకారంలో దర్శన మిస్తుంటుంది. గోపురానికి పైనున్న జెండాపై సుదర్శన చక్రం ఉంటుంది. బలభద్రస్వామి ఊరేగే రథం 'తాలధ్వజ' ఆకుపచ్చరంగులో ఉంటుంది. దానిని తూర్పు దిశగా నిలబెడతారు. రెండవ చివర



జగన్నాథుని రథమైన 'నంది ఘోష'ని ఉంచు తారు. ఇది ఎరుపు, బంగారు రంగుల్లో ఉంటుంది. ఈ రెండు రథాల మధ్యలో సుభద్ర కోసం నిర్మించిన రథం ఉంటుంది. ఇది ఎరుపు, నలుపు రంగుల్లో ఉంటుంది. దాన్ని 'దర్పిధళన్' అంటారు.

సిద్ధం చేయబడి ఉన్న రథాలలో జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రల విగ్రహాల్ని ఉంచుతారు. తర్వాత ఆలయ ధర్మకర్త జగన్నాథునికి పలురకాల పూజలు నిర్వహించి, బంగారు చీపురుతో రథ మార్గాన్ని శుభ్రం చేస్తాడు. ఆ తరువాతనే రథయాత్ర ప్రారంభమౌతుంది.

దేవాలయానికి ముందు గరుడస్తంభం, ఆ స్తంభానికి ముందు ప్రధాన ద్వారం కనబడుతుంది. ఇరువైపులా రెండు రాతి సింహాలుంటాయి. ఇక్కడున్న మొదటి మందిరాన్ని భోగమందిరం అని పిలుస్తారు. ఇది దాటితే నాట్య మందిరం ఆ తర్వాత జగన్మోహన మండపం, దేవతామూర్తుల మండపాలు ఉంటాయి. జగన్నాథుని ముఖం నల్లగా, పెద్ద కళ్ళు, పెద్దనోరుతో ఉంటుంది. బలభద్రుడు, సుభద్రల విగ్రహాలు తెలుపు, పసుపు రంగుల్లో ఉంటాయి. జగన్నాథ స్వామికి, బలభద్రుడు, సుభద్రలకు స్తంభాలవలె చేతులుంటాయి. ఇక్కడి ఆలయ ప్రాంగణంలోనే గుండిచా మందిరం, చక్రతీర్థం, గోపీనాథ ఆలయం, గంగామఠం వంటివి చూడతగ్గ విశేషాలు. ఇక్కడి క్షేత్ర పాలకుడు నరసింహ స్వామి. ఆదిశంకరా చార్యులవారు పూరీలో అద్వైతపీఠాన్ని స్థాపించారు. అలాగే రామానుజాచార్యులవారు కూడా ఇక్కడ ఓ మఠాన్ని స్థాపించారు. శ్రీ చైతన్య ప్రభువు కూడా ఈ స్వామివారి సేవలోనే తరించారు. ఇలా రథయాత్రలో పాల్గొని, జగన్నాథ స్వామిని దర్శించి, తరిస్తున్న భక్తజనులెందరో!

## ౨౨౦. లక్ష్మీదేవికి ఏవి ఇష్టం?

**జ.** ఇంట్లో ఉన్న అందరూ తమ తమ పేర్లతో పిలుచుకోవడంకాక అక్కా, అన్నా, తమ్ముడూ, బాబాయి... అనుకుంటూ బంధుత్వపు వరసలతో సంబోధించుకోవడం ఆమెకెంతో ఇష్టం. ఇంటిముందు సన్నని గీతతో ముగ్గున్న ఇల్లూ – అలా



చూస్తూండగా ఇంటి పెరట్లో తులసి మొక్క వీధిలోనికి కన్పిస్తూండడం ఆమెకి ఆనందదాయకం. ఇంట్లోని గృహిణి సూర్యోదయ కాలానికే స్నానం చేసి కనీసం దైవమందిరంలో దీపారాధననైనా చేసి ఉంటే ఆ గృహిణి ఆమెకి ప్రీతి పాత్రురాలు. ఇంటికొచ్చిన అతిథి ఇంట్లోని దేవ మందిరంలో కూచుని జపం చేస్తూంటే ఆ దృశ్యం ఆమెకి నయన మనోహరం.

శ్రీసూక్త మంత్రాలూ – లక్ష్మీ అష్టోత్తరం లేదా సహస్ర నామాలూ ఆమెకి మరింత సంతోషదాయకాలు. వస్తు ద్రవ్యాలూ, ఆడంబరం అట్టహాసం కంటె భక్తిశ్రద్ధలు ఆమెకి చాలా మక్కువ అయినవి.

ద్రవాల్లో ఆవుపాలు, కాయల్లో నారికేళం, పత్రాల్లో మారేడు, పూలల్లో పద్మం,

ఫలాల్లో అరటి, అయనాల్లో ఉత్తరాయణం, మాసాల్లో శ్రావణం, పక్షాల్లో శుద్ధం, తిథుల్లో తన భర్తకిష్టమైన ఏకాదశి, వారాల్లో తన తండ్రి పేరిటి శుక్రవారం, వాహనాల్లో గజం, వాసనల్లో కర్పూరం అగరు జవ్వాది, నైవేద్యాల్లో పాయసం, వస్త్రాల్లో తెలుపు, పసుపు పట్టువస్త్రాలు, తన చిత్రాల్లో అటూ ఇటూ ఏనుగులు తనకి అభిషేకిస్తూ ఉంటే తాను పద్మంలో కూర్చున్న చిత్రం ఆమెకి బాగా ఇష్టాలు.

## ౨౨౧. శ్రీ ప్రసన్న లక్ష్మీ స్తుతి

**జ.** వందే లక్ష్మీం పరశివ మయీం శుద్ధ జంబూనదాభ్యాం
తేజోరూపాం కనకవసనాం సర్వభూషోజ్జ్వలాంగీం
బీజాపూరం కనకకలశం హేమపద్మే దధానా
మాద్యాం శక్తిం సకలజననీం విష్ణువామాంక సంస్థాం



పరశివుని తేజోరూపంతో, మేలిమి బంగారం వంటి శరీర ఛాయతో, పచ్చని బంగారు వర్ణపు వస్త్రాలతో, దేహమంతటా అలంకరించబడిన మణిమయ స్వర్ణాభరణాలతో ప్రకాశిస్తూ, తన దివ్య హస్తాలో, దానిమ్మ పండుని, బంగారు కలశాన్ని, సువర్ణ పద్మాన్ని ధరించి శ్రీ మహావిష్ణువు ఎడమతొడ మీద ఆసీనురాలై సకల లోకాలచేత తల్లిగా పూజింపబడే ఆదిశక్తి అయిన శ్రీ ప్రసన్న లక్ష్మికి నమస్కారం.

## ౨౨౨. భగవంతుడు మనలోనే

**జ.** జనక మహారాజు యాజ్ఞవల్క్య మహర్షిని ఒకసారి "భగవంతుడిని ఎక్కడ చూడగలను" అని అడిగాడు.

"భగవంతుడు మరెక్కడో లేడు, నీ మనసులోనే ఉన్నాడు. చూసుకో" అని సమాధానం ఇచ్చాడాయన. నిజమే, భగవంతుడు మరెక్కడో ఉండడు. మనలో ఉన్న భగవంతుని అంశాన్ని బలవంతంగా అదిమిపెట్టి, బుద్బుద ప్రాయమైన భౌతిక ఆకర్షణల వైపు మొగ్గు చూపుతూ మనం క్రమంగా మనుషులుగా, మరి కొంచెం మొగ్గు పెరిగి రాక్షసులుగా తయారవుతున్నాం. నిద్రించే సమయంలో అనవసరపు ఆలోచనలన్నీ మరుగునపడి, మనసు ప్రశాంతంగా, ఎటువంటి బంధాలకు సంబంధం లేకుండా ఉండే ఒక అద్భుత స్థితే భగవత్ స్థితి. రాగద్వేషాలకు అతీతమైన అటువంటి స్థితినే భగవంతుడు మనకు మనసులో నింపి, ఈ లోకంలోకి పంపుతాడు. పసిపిల్లలుగా మనం ఉండే స్థితి అదే. అప్పటి నుండి పరిసరాలను నిశితంగా గమనిస్తూ, భగవత్ తత్వం అర్థం చేసుకుంటూ, దానిని పెంపొందించుకుంటే భగవంతుని వెంటే అడుగులను వేయగలుగుతామని గ్రహించాలి. ఆ మార్గం నుండి బయటకు వచ్చి, అర్థం

లేని ఆకర్షణలకు గురయ్యేవారు మనసు నుండి భగవంతుని బహుదూరం నెట్టి వేయటమవుతుంది.

## ౨౨౩. లక్ష్మీ కుటుంబం

**జ.** శ్రీ మహాలక్ష్మీదేవి గోత్రం 'భార్గవ'. తల్లి పాలసముద్రం, తండ్రి భృగుమహర్షి, తమ్ముడు చంద్రుడు, కోడలు సరస్వతి, భర్త శ్రీహరి. పుత్రులు ఆనందుడు, కర్ద ముడు, చిక్లీతుడనే ముగ్గురు ఋషులు. కృతయుగంలో ఈమె పేరు శ్రీ మహా లక్ష్మి. భర్త శ్రీహరి. త్రేతాయుగంలో ఈమె పేరు సీత, భర్త శ్రీరామచంద్రుడు. ద్వాపరయుగంలో ఈమె పేరు రుక్మిణి, భర్త శ్రీకృష్ణపరమాత్ముడు. కలియుగంలో ఈమె పేరు అలర్ మేర్ మంగ (అలర్ – పుష్పాల యొక్క, మేర్–పై భాగంలో కన్పిస్తూ దర్శనమిచ్చి, మంగ – కన్నె – ఈమె పేరే పద్మావతి. పద్మాలలో దాగి పుట్టినది) ఈమెనే 'అల మేలుమంగ' అన్నారు, భర్త శ్రీ వేంకటేశ్వరుడు. కృతయుగంలో వైకుంఠంలో, త్రేతలో అయోధ్యలో, ద్వాప రంలో మధురలో, కలిలో తిరుమలలో ఆమె భర్త వెంట నివసిస్తూ ఉంటుంది.

## ౨౨౪. స్వధర్మాచరణం

**జ.** కోరికల సాఫల్యానికి, భయ విము క్తులు కావటానికి, మరే విపత్కర పరిస్థి తులనైనా ఎదుర్కొనేందుకు ఒకే ఒక మార్గాన్ని, అదే ధర్మ మార్గాన్ని అనుస రించాలి. దిలీప మహారాజు క్షాత్ర ధర్మాన్ని పాటిస్తూ ఒక గోవును రక్షించడం కోసం



తన శరీరాన్ని సింహానికి సమర్పించాడు. శిబి చక్రవర్తి శరణాగత రక్షణ కోసం ఒక పావురానికి బదులుగా తన శరీరం లోని మాంసాన్ని కోసి ఇచ్చి మరణిం చేందుకు సిద్ధపడ్డాడు. ఆయా ధర్మ కర్మల ఫలితంగా దిలీప మహారాజు అభీష్టం నెరవేరింది. శిబిచక్రవర్తి త్యాగం ప్రశంస లందుకొన్నది. ప్రహ్లాదుడు భగవద్భక్తి రూపమైన స్వధర్మాన్ని పాటించి పలు మార్లు మృత్యుముఖం నుండి బయట పడినాడు.

శ్రేయాన్ స్వధర్మోదిగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్।
స్వభావ నియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్॥

పరధర్మాన్ని బాగా ఆచరించుట కంటే గుణరహితమైన స్వధర్మాచరణమే మేలై నది. ఎవరి కర్మలను వారు ఆచరిస్తే ఎటు వంటి పాపం అంటదు.

ధర్మవ్యాధుడు బ్రహ్మజ్ఞాని. అయిన ప్పటికీ వృత్తి ధర్మాన్నను సరించి మాంసం విక్రయించే వాడు. అది హింసాత్మకమైనా అతనికి పాపకృత్యం కాదు. వైద్యుడు తన వృత్తిధర్మాన్ని అనుసరించి శస్త్రచికిత్స చేస్తాడు. అది హింసకానేరదు. జన్మవల్ల, వృత్తివల్ల ప్రాప్తించిన స్వధర్మాన్ని ఎట్టి పరిస్థితిలోనూ విడువరాదు.

## 8125. త్రివిక్రమ స్తుతి

**జ.** బలిదైత్యేంద్రుడు పాదపద్మము తలన్
భద్రంబుగా నుంచుమీ
జలజాత ప్రభవాదులెల్లపుడు పూజల్
సేయు శ్రీపాదమీ
తలపై నుంచుటకే భవంబుల నినున్
ధ్యానించి యున్నాడనో
ఫలమీ సేవయటన్న ప్రోచిన హరీ
పద్మాక్షనే మ్రొక్కెదన్

రాక్షసరాజైన బలిచక్రవర్తి తలపై నుంచిన శ్రీపాదమది. బ్రహ్మాది దేవతలంతా పూజించేలా పాదాన్ని తలపై ఉంచుకునేందుకు బలి ఎంతగా పూజించాడో. పద్మముల వంటి కన్నులు గలిగిన ఓ శ్రీహరీ నాకా భాగ్యాన్ని అనుగ్రహించు స్వామీ!


## 8126. అనుగ్రహ భాషణం

**జ.** శనివారం నాడు శనీశ్వరుని ఆరాధించాలి. నేరుగా ఆయన ముఖం చూడకూడదని ఏంలేదు. ఇతర దేవతా మూర్తులను ఆరాధించినట్లే ఆయనను ఆరాధించవచ్చు. శనిదశ నడుస్తున్నప్పుడు శ్రీ మహావిష్ణువుకు పూజలు, స్తోత్ర పారాయణ చెయ్యాలి. ఉదయం లేస్తూనే విష్ణువును, సాయంత్రం శివుని ప్రార్థించి, నమస్కరించాలి. 'క్షతమ్' అంటే కొరత కలిగినది. అక్షతం అంటే కొరత లేనిది. నిండైనది. సంపూర్ణమైనది అని అర్థం. జీవితంలో కొరత అన్నది లేకుండా పూర్ణత్వం కలిగి జీవించాలి అని అక్షతలు ఉపయోగిస్తాము. బియ్యం, పసుపు ఈ రెండూ మంగళప్రదమైనవి. మంగళ, శుక్రవారాలు శ్రీ లక్ష్మీపూజ (అష్టోత్తరం) చేయడంవలన సుభిక్షంగా ఉంటుంది. పురుషులు మాత్రమే సాలగ్రామమును తాకి పూజ చేయవచ్చును. పురుషులు వేరే ఊరు వెళ్ళినప్పుడో లేక వారు పూజ చేయలేని అసౌకర్యం ఏర్పడినప్పుడు స్త్రీలు నిర్మాల్యమైన పూలు, చందనం తీసివేసి, మరల చందనం, పూలు సమర్పించి, పాలు, పళ్ళు నైవేద్యం పెట్టవచ్చు.

తడిబట్టలతో జపం చేయకూడదు. ఆరిన బట్టలు కట్టుకునే జపం చేయాలి. పొడిబట్టలు లేప్పుడు తడిగా ఉన్న వస్త్రాన్ని ఏడుసార్లు గాలిలో జాడించి, ఆరిన వస్త్రం అని భావిస్తూ జపం చేయవచ్చు. ప్రతిరోజూ రామ నామ జపం చేస్తూ, రామ నామం రాస్తుంటే మనశ్శాంతి లభిస్తుంది.

## 8127. బ్రహ్మ కడిగిన పాదము

**జ.** భాద్రపద శుక్లద్వాదశియందు శ్రవణా నక్షత్రమున మధ్యాహ్న సమయంలో వామనావతార ఆవిర్భావం జరిగింది.



అదెలాగంటే పూర్వం బలిచక్రవర్తి సురులను యుద్ధంలో ఓడించి స్వర్గరాజ్య లక్ష్మిని అనుభవించుచుండగా దేవతలంతా విష్ణుమూర్తిని శరణుకోరారు. విష్ణు

మూర్తి వారికి అభయం ఇచ్చి అదితి కశ్యపులచే స్తుతించబడి వారి గర్భమున వామనుడై పుట్టి, బలిచక్రవర్తి యజ్ఞం చేస్తుండగా రాజద్వారము వద్దకు వెళ్ళి, వేదపఠనం చేయనారంభించాడు. వేద పఠనం చేస్తున్న ఆ బాలవటువుని చూసి, బలిచక్రవర్తి తన గురువు శుక్రాచార్యునిచే నివారింపబడుతున్నప్పటికీ "నీకేం కావాలో కోరుకో" అని అడిగాడు. అపుడు వామనుడు "దానవేంద్రా, నా గురువు నిమిత్తం మూడు అడుగుల ప్రదేశం నాకిప్పించమ"ని కోరాడు. అలాగేనని చెప్పి బలి చక్రవర్తి చెప్పగానే ఒక్కసారిగా తన దేహాన్ని విపరీతంగా పెంచేశాడు. "ఇంతింతై వటుడింతయై మరియు దానింతై నభో వీధిపైనంతై..." అని పోతన వర్ణించినట్లుగా పెరిగిపోసాగాడు. తన మొదటి అడుగుతోనే వామనుడు భూభాగమంతటినీ ఆక్రమించాడు. దేహంతో అంతరిక్షాన్నీ, భుజాలతో దిక్కులంత వ్యాపించాడనీ భాగవతంలో చెప్పబడింది. వామనమూర్తి తన రెండవ పాదంతో స్వర్గాన్ని ఆక్రమించాడు. అలాగే క్రమేపీ ఊర్ధ్వభాగం ఆక్రమిస్తూ మహర్లోక, జనర్లోక, తపోలోకాలకు పైన ఉన్న సత్య లోకం దాకా వ్యాపించాడు. ఇక మూడవ పాదాన్ని మోపేందుకు చోటెక్కడా లేక పోవడంతో ఆయన పాదాన్ని తన శిరస్సుపై ఉంచమని కోరాడు బలి చక్రవర్తి. వామనుడు బలిని పాతాళలోకానికి అణచి సుతలానికి పంపాడు. ఎవరైతే స్వర్గ, మర్త్య, పాతాళ లోకాలను తన మూడు అడుగులతో విపరీతంగా ఆక్రమించారో ఆ విష్ణు భగవానుని 'త్రివిక్రమః' (త్రయో విక్రమాః త్రిషులోకేషు క్రాంతాః యజ్య) అన్నారని శంకరభాష్యం. మనం వేసే ప్రతి అడుగూ, ప్రతి ఆలోచన, ప్రతి మాటలోనూ త్రివిక్రముడు నిండి ఉంటే ఆ స్వామి అనుగ్రహంతో త్రికరణాలు శుద్ధి అవుతాయని, ప్రతి పనీ జయమవుతుందనీ అంతరార్థంగా చెప్పబడింది. వామన జయంతి రోజు మధ్యాహ్న సమయంలో దగ్గరలో ఉన్న నదీస్నానం చేసి, సువర్ణ ప్రతిమతో చేసిన వామనమూర్తిని పూజిస్తే శ్రేష్ఠం.

దేవేశ్వరాయ దేవాయ దేవ సంభూతి కారిణే
ప్రభవే సర్వదేవానాం వామనాయ నమోనమః॥
నమస్తే పద్మనాభాయ నమస్తే జలశాయినే
తుభ్య మర్ఘ్యం ప్రయచ్ఛామి బాల వామన రూపిణే
నమశ్శార ధనుర్బాణ పాణయే వామనాయచ
యజ్ఞభుక్ఫలదాత్రే చ వామనాయ నమోనమః॥

అని ప్రార్థించి అర్ఘ్యాన్ని ఇవ్వాలి. ఆ తరువాత వామనమూర్తిని పూజించి సత్ బ్రాహ్మణునికి దానమీయాలి. అలా చేస్తే కుటుంబంలో సకల సంపత్తులు వామన మూర్తిలా ఎదుగుతాయని పురాణ ఐతిహ్యం.

## ౨౨౮. శ్రీ కృష్ణ స్తుతి

**హే గోపాలక! హే కృపా జలనిధే!**
**హే సిన్ధు కన్యాపతే! హే కంసాన్తక!**
**హే గజేన్ద్ర కరుణా పారీణ! హే మాధవ!**
**హే రామానుజ! హే జగత్రయ గురో!**



**హే పుండరీకాక్ష మాం హే గోపీ జననాథ!**
**పాలయ పరం, జానామి న త్వం వినా!**

ఓ గోపాలా! దయాసాగరా! లక్ష్మీపతీ! కంసుని హతమార్చిన స్వామీ, గజేంద్రుని సంరక్షించిన మహాప్రభో, మాధవా, రామానుజా, త్రిలోకపూజిత గురువరేణ్యా, పద్మ నేత్రుడా, గోపీ జనవల్లభా! నన్ను రక్షించు. నిన్ను వినా నేను మరెవ్వరినీ ఎరుగను.

## ౨౨౨. కృష్ణునికీ ఆంజనేయునికీ పోలిక

**జ.** కౌరవ పాండవుల మధ్య రాయబారిగా వెళ్లాడు శ్రీకృష్ణపరమాత్ముడు. నరులకీ రాక్షసులకీ మధ్య దూతగా వెళ్లాడు రామ భక్తాగ్రేసరుడు ఆంజనేయుడు.

కృష్ణుడు రథంలో భూమి మీద ప్రయాణించాడు. హనుమంతుడు వాయువులో ఆకాశమ్మీద ప్రయాణించి సముద్రాన్ని సైతం దాటాడు.

శ్రీకృష్ణుడు రాజ్యానికి సంబంధించిన వివాదాన్ని పరిష్కరించదలిచి వెళ్తే, హనుమంతుడు రమణి (స్త్రీ అయిన సీతమ్మ)కి సంబంధించిన వివాదాన్ని పరిష్కరించ దలిచి లంకకు వెళ్ళాడు.

శ్రీకృష్ణుణ్ణి దుర్యోధనాదులు తాళ్లతో కట్టేందుకు ప్రయత్నించారు. హనుమంతుణ్ణి బ్రహ్మాస్త్రంతో కట్టి వేశాడు రావణ పుత్రుడు ఇంద్రజిత్తు.

ధర్మరాజాదుల మాటలను ఊహించి రాయబారం వేళ చెప్పాడు శ్రీకృష్ణుడు. ఎవ్వరూ చెప్పని మాటలను ఊహించి చెప్పాడు హనుమంతుడు. రాజ్య సభా మధ్యంలో కృష్ణుడు చెప్తే, రాక్షసులతో కూడిన మంత్రి సభా మధ్యంలో మారుతి చెప్పాడు.

చిన్న రూపాన్ని పెద్దదిగా చేస్తూ తన విశ్వరూపాన్ని చూపాడు కృష్ణుడు. పెద్దగా ఉన్న రూపాన్ని చిన్నదిగా చేసుకుని చెప్పాడు హనుమంతుడు. దూతగా వచ్చిన కృష్ణుణ్ణి





తాళ్లతో కట్టలేకపోతే, హనుమంతుని తాళ్లతో కట్టి బ్రహ్మాస్త్రం పనిచేయకుండా చేసుకున్నారు రావణాదులు.

కురుక్షేత్ర యుద్ధ ముహూర్తాన్ని దూతగా వచ్చిన కృష్ణుడు నిర్ణయిస్తే, రామ రావణ యుద్ధ మహూర్తాన్ని దూతగా వచ్చిన హనుమ నిశ్చయించాడు తథ్యమని. వాయు పుత్రుడైన భీముడు అక్కడ యుద్ధాన్ని (భారతంలో) నిర్ణయిస్తే, వాయు పుత్రుడైన హనుమ ఇక్కడ (రామాయణంలో) నిర్ణయించాడు యుద్ధాన్ని.

## 830. చావు పుట్టుకలు లేనివాడు

**జ.** రాముడు చైత్రమాసం శుద్ధపక్షం నవమినాడు పుట్టాడు. అవతార పరిసమాప్తి వేళ సరయూనదిలోనికి ప్రవేశించి బ్రహ్మదేవుడు పైనుండి రాగా ఆయనతో కలిసి వైకుంఠానికి వెళ్లాడు. ఇది నిర్యాణం కాదు. ఇక కృష్ణుడు శ్రావణమాసం బహుళపక్షం అష్టమినాడు దేవకీ వసుదేవులకి శంఖ చక్రగదా ధారియౌతూ పట్టు పీతాంబరంతో శ్రీహరిగా దర్శనమిస్తూ అవతరించాడు భూమికి. ఇది పుట్టుక కాదు. అవతారపు ముగింపు వేళ ఎవరికీ చెప్పకుండా తాను ఒక పొదలో ఉండి ఉన్నవేళ బాణపు దెబ్బకి నిర్యాణాన్ని చెందాడు. అటు రామునికి పుట్టుక ఉంది. మరణం లేదు. ఇటు కృష్ణునికి పుట్టుక లేదు. మరణం ఉంది. ఈ రెంటినీ కలిపి పరిశీలిస్తే భగవంతునికి చావు పుట్టుకలు రెండూ లేవనే యథార్థం గోచరిస్తుంది.



## 831. రెండవ కంచి

**జ.** దివిలోని దేవతలంతా భువిపైకి దిగి వచ్చి ఒకే చోట కొలువై ఉన్నారా అనిపించేంత గొప్పదైన పట్టణం మచిలీపట్టణం. లోగడ బందరుగా ప్రసిద్ధి చెందిందీ ఊరు. విశేషమైన దేవాలయాలతో ఆధ్యాత్మిక కేంద్రంగా వెల్లివిరిసింది. అందుకే దీనిని రెండవ కాంచీపురమని ప్రశంసించారు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారు. వందకు పైగా దేవాలయాలున్నాయి ఇచట. ఇక్కడి శ్రీ రంగ నాయక స్వామి ఆలయం అతి ప్రాచీనమైనదిగా చెబుతారు. భూదేవి పాదాలు వత్తుతుండగా, నీలాదేవి వింజామరతో వీస్తుండగా ప్రసన్నవదనంతో ఒప్పారేస్వామి వారి దివ్యమంగళ విగ్రహాన్ని చూస్తే తను వెల్లా ఆనందంతో పులకిస్తుంది. శ్రీరంగంలోని రంగనాయకస్వామి విగ్రహాన్ని ఈ విగ్రహం మరిపిస్తుంది. తర్వాత ఇక్కడ చూడవలసిన మరో అత్యద్భుత ఆలయం

శ్రీరామలింగేశ్వర స్వామివారి ఆలయం. నాలుగు వందల సంవత్సరాల క్రితం ఆనాటి అర్చకులైన కందుకూరి సూర్య నారాయణ శర్మగారికి స్వామి కలలో కన్పించి తాను పుట్టలో ఉన్నానని, తనని బయటకు తీయమని చెప్పగా ఆయన ఆ విధంగానే చేశారట. స్వామివారు వల్మీకం నుండి బయటపడ్డారు. దాంతో పునః ప్రతిష్ఠ చేసి, పక్కనే రాజరాజేశ్వరీదేవిని, వీరభద్రస్వామి వార్లను కూడా ప్రతిష్ఠింప చేశారు. ఇక్కడికి వచ్చి రామలింగేశ్వర స్వామివారిని కొలిస్తే సమస్త కోరికలు తీరతాయని చెబుతారు.

మచిలీపట్టణంలో మరోచోట వెలసిన అమ్మ మహిషాసుర మర్ధిని. ఈ దేవతకు కాశీలోని దేవాలయం వంటి ఓ ఆల యాన్ని నిర్మించారు. ప్రాకారంలోపల ఓ తటాకాన్ని తవ్వించి అందులో గంగానది జలాన్ని నింపారు. అందుకే ఈ ఆల యానికి శివగంగనే పేరు వచ్చింది. ఇక్కడి అమ్మవారు చాలా ఉగ్రంగా ఉంటుంది. ఆమెను శాంతమూర్తిగా ఉంచేందుకు ఉద్దండ భారతీస్వామివారు శివలింగ ప్రతిష్ఠ చేశారు.

అలాగే మచిలీపట్టణంలో మరో దేవా లయం శ్రీ భ్రమరాంబసమేత శాంత మల్లేశ్వరస్వామి. ఈ స్వామిని నిత్యం చుట్టు పక్కల ప్రాంతానుండి ఎందరో భక్తులు వచ్చి దర్శించుకుంటారు. దగ్గరలో ఉన్న చిలకలపూడిలో (దీనినే కీరపండరీపురం అంటారు.) పాండురంగస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయం చుట్టూ ఎందరో దేవతా మూర్తులు కొలువై ఉండటం ఓ ప్రత్యేక విశేషం. రాధ,కృష్ణ, సీతారామ, నృసింహ, శ్రీ కాశీ విశ్వేశ్వర, అన్నపూర్ణ, లక్ష్మీ నారా యణ, వీరభద్రులు, ప్రహ్లాద నారద పరా శర పుండరీకాది మహాభక్తుల ఆలయాలు ఉన్నాయి. ఇంకా మీరాబాయి, సక్కు బాయి, నామదేవ, తుకారాం, జ్ఞానదేవ, ఏకనాథ్, ముక్తాబాయి, గోరక్‌నాథ, నివృత్తి దేవ వంటి పాండురంగ భక్తుందరికీ ఆలయాలను నిర్మించారు. ఇక్కడే లింగా కారంలో శ్వేతార్క హనుమంతుడి విగ్రహం కూడా ఉంది. ఇక్కడే మరో ప్రసిద్ధ దేవాలయం ఉంది. నాగులేటి తీరంలో ఉందా ఆలయం. అది శ్రీవీరాంజనేయస్వామి వారి ఆలయం. ఈ స్వామివారు ఒక చేతిలో చెట్టును, మరో చేతిలో ఖడ్గాన్ని ధరించి దర్శనమిస్తుంటారు. దక్షిణాభిముఖంగా ఉండటం ఈ ఆలయ విశేషం. ఈ పట్టణంలో ఇంకా పట్టాభిరామ స్వామి ఆలయం, నాగే శ్వరస్వామి ఆలయం, స్వయంభువుగా వెలసిన వేణుగోపాల స్వామి, చిట్టిపిళ్ళారయ్య (వినా యకుడు), నరసింహస్వామి, భద్రాద్రి శ్రీరాములవారి ఆలయం, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాలు, కంచికామాక్షి, భద్రకాళి, మల్లేశ్వరస్వామి, సరస్వతీదేవి, కన్యకా పరమేశ్వరి, నగరేశ్వరస్వామి, పార్వతీదేవి, సూర్యనారాయణస్వామి, దత్తాత్రేయ, అయ్యప్ప, రాఘవేంద్రస్వామి, సాయిబాబా దేవాలయాలు ఉన్నాయి.

## 732. 'కృష్ణ' అంటే



**జ.** 'కర్షతీతి కృష్ణః' ఆకర్షించే లక్షణం కలవాడని ఈ మాటకి ఉన్నటువంటి అర్థం. ఏమాత్రపు చదువూ లేని గోపబాలురినీ – పాలూ పెరుగులని అమ్మి జీవనం చేస్తూండే గోపికా జనాన్నీ – ఎప్పుడు తనని చంపు తాడోననే భయంతో ఉన్న కంసుణ్ణీ – శత్రుత్వమున్న కారణంగా ఏ క్షణంలో ఏం చేస్తాడోననే వైరంతో ఉన్న శిశుపాలుణ్ణీ – బాంధవ్యంతో వృష్ణ (యదు) వంశం వారందరినీ, ప్రేమదృష్టితో పాండవులు, భీష్ముడు, విదురుడు మొదలయినవారిని, భక్తి భావంతో నారదుడూ మొదలయిన వారినీ ఆకర్షించిన వాడు శ్రీకృష్ణభగవానుడు.

## 733. లక్ష్మీ స్తుతి

**జ.** పద్మాలయాం పద్మకరాం పద్మపత్ర నిభేక్షణాం
వందే పద్మముఖీం దేవీం పద్మనాభ ప్రియామహం

పద్మములందు నిత్యనివాసము చేయు శక్తీ! పద్మములను చేతులందు ధరించిన మహాలక్ష్మీ! పద్మ దళములను బోలిన నేత్రాలతో ఉండే శ్రీదేవీ! పద్మాలవలె



సుందరమై ఆకర్షణ కలిగిన ముఖముగల రమాదేవీ! దేవతా పూజ్యమయిన పాద పద్మములుగల తల్లీ! పద్మనాభుడయిన శ్రీహరికి ప్రేమ పాత్రురాలవయిన ఓ తల్లీ నీకు నమస్కారం.

## 734. ఐదు రోజుల పండుగ

**జ.** ఆశ్వయుజ మాస ప్రథమార్ధంలో దుర్గాదేవి మహిషాసురుని సంహరించి లోక రక్షణ చేస్తే, మాసాంతంలో శ్రీకృష్ణ పరమాత్మ సత్యభామా సమేతుడై నరకాసురుని సంహరించి దుర్మార్గాన్ని అంత మొందించాడు. ఈ మాసమంతా దుష్ట శిక్షణ, శిష్టరక్షణతో గడుస్తుంది. ఆశ్వయుజ బహుళ అమావాస్యనాడే శ్రీమహావిష్ణువు వామనావతారమెత్తి బలిచక్రవర్తిని పాతాళానికి అణగద్రొక్కేశాడు. త్రేతా యుగంలో రాములవారు రావణాసురుని సంహరించి తిరిగి సీతతో అయోధ్యలోకి

ప్రవేశించిన శుభదినం కూడా ఈ రోజే. ఇది ఐదురోజుల పండుగ. ఆశ్వయుజ బహుళ చతుర్దశిని నరక చతుర్దశి అని, ఆ మరుసటిరోజు అమావాస్యని దీపావళి



అమావాస్యగా పండుగ చేయడం సర్వ సాధారణం. అయితే బహుళ త్రయోదశిని ధన త్రయోదశి అనగా లక్ష్మీ పూజని, చతుర్దశిని నరకచతుర్దశి అనీ, కార్తిక శుద్ధ పాడ్యమిని బలిపాడ్యమనీ, కార్తిక శుద్ధ విదియను విదియ అని ఐదు రోజుల పండుగను జరుపుకుంటారు. యమ విదియ అనగా సోదరుడు సోదరి ఇంట ఆతిథ్యం తీసుకుని కానుక ఇచ్చే వేడుక.

యక్షరాత్రి, సుఖరాత్రి, సుఖసుప్తిక, కౌముదీ మహోత్సవం, దీపాలిక, దీపావళి అనే పేర్లతో భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో ఈ పండుగ జరుపుకుంటారు.

శ్రీహరి ఆదివరాహ రూపంలో భూమిని ఉద్ధరించిన వేళ దేవతలు, ఋషులు, గంధర్వులు మొదలైన వారంతా శ్రీమహావిష్ణువు వద్ద చేరి, భూదేవి మీ అంకపీఠం మీద అధివసించి ఉండగా మిమ్మల్ని సేవించుకుంటామని కోరగా, ఆది వరాహ మూర్తి అందుకు సరేనన్నాడు.


ఆదివరాహమూర్తికి, భూ దేవికి జన్మించిన వాడే నరకాసురుడు. బ్రహ్మ దగ్గర వరాలను పొంది ప్రాగ్జ్యోతిషపురాన్ని రాజధానిగా చేసుకుని ఏలుతూ ముల్లోకాలను పీడిస్తూ ఉండగా, శ్రీకృష్ణ పరమాత్మ సత్యభామాసమేతంగా వచ్చి, నరకాసురుని మీద దండెత్తి, అతన్ని సంహరించిన సందర్భంగా ప్రజలు ఆనందోత్సాహాలతో చేసుకున్న పండుగే ఈ దీపావళి, అంటే దీపాల పండుగ. నరక చతుర్దశిరోజు తెల్లవారు ఝామున నువ్వుల నూనెతో తలంటుకొని స్నానం చేయాలి. నువ్వుల నూనెలో లక్ష్మీదేవి, నీటిలో గంగాదేవి ఉంటారని శాస్త్రవచనం. స్నానం చేసేటప్పుడు ఉత్తరేణి, సార, తగిరస ఆకులను తలచుట్టూ తిప్పుకుని స్నానం చేయాలని చెబుతారు. స్నానం చేసేటప్పుడు 'శీతలోష్ణ సమాయుక్త సంకటక దళాన్విత హుపాప మపామార్గ రభామ్యమాణః పునః పునః' అనే మంత్రాన్ని పఠించాల్సి ఉంది.

స్నానమయ్యాక 'యమాయ తర్పయామి, తర్పయామి' అంటూ మూడు సార్లు నువ్వులు వదిలి యమతర్పణం చేయాలి. ఈ రోజు భోజనంలో మినప ఆకులతో కూరచేసుకుని తింటే సమస్త పాపాలు తొలగిపోతాయనేది పౌరాణిక వచనం. చీకటిపడ్డాక ఇంటిచుట్టూ ప్రమిదలతో అందంగా దీపాలను వెలిగించాలి. దీపావళీ పండుగ రోజు ఉదయం సూర్యో

దయానికి పూర్వమే మఱ్ఱి, మామిడి, అత్తి, జువ్వి, నేరేడు చెట్ల పట్టలను నీటిలో వేసి, ఆ నీటిలో స్నానంచేయాలి. సంధ్యా సమయంలో నువ్వుల నూనెతో దీపాలను పెట్టాలి. ఇంటిద్వారాలలో, ధాన్యపు కొట్లవద్ద, బావి, రావిచెట్టు, వంటిల్లు ఈ ఐదు ప్రదేశాలలో తప్పకుండా దీపాలను వెలిగించాలి. దీపాలను వెలిగించాక లక్ష్మీ పూజ చేయాలి. తర్వాత దీపావళీ బాణ సంచాను కాల్చాలి. ఆసేతు హిమాచల పర్యంతం అందర్నీ ఆనందింపజేసే పండుగే దీపావళి పండుగ.

## 835. పవిత్ర మార్గం


**జ.** ముక్తి కోసం ఏంచేయాలో భగవంతుడు బోధించాడు. భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి బోధించినట్లుగా ఉన్నా అది మానవాళి మొత్తానికి సంబంధించిన సందేశం. "నా యందు విశ్వాసంతో పనిచేయండి" అని భగవంతుడు



చెప్పాడు. భక్తితో భగవంతుని మీద భారం వేయండి. చర్య, ప్రతిచర్యలన్నీ ఆ ఈశ్వర ప్రసాదాలేనని తెలుసుకోండి. మనస్సు, బుద్ధి రెండూ ఏకం చేయండి. ఆధ్యాత్మిక చింతనవైపు మళ్ళండి. మనసును, ఆలోచనల్ని అదుపులో పెట్టుకోవటం కష్టమే. ఆ కష్టాన్ని అధిగమించేందుకే యోగ, భక్తి మార్గాల్ని అనుసరించాలి. భగవంతుని యందు మనసు లగ్నం చేసేందుకు ఏ మార్గాన్నైనా అనుసరించవచ్చు. మనసును పవిత్రంగా పెట్టుకునేవారికి ముక్తి సులభమవుతుంది.

## 836. నాగార్చన

**జ.** కార్తికమాసంలో వచ్చే కార్తిక శుద్ధ చవితినే నాగులచవితి అంటారు. ఈ రోజు ఉదయాన్నే ఇంటిల్లపాదీ లేచి, తల స్నానం చేసి పుట్టవద్దకు వెళ్ళి పూజా కార్యక్రమాలు నిర్వహించి, నాగేంద్రుని అనుగ్రహం పొందాలి. ముఖ్యంగా కన్నె పిల్లలు, సంతానం కావలసిన మహిళలు భక్తిశ్రద్ధలతో నాగేంద్రుని పూజిస్తే మంచి భర్త, చక్కని సంతానం లభిస్తుందని ప్రతీతి.



నాగేంద్రునికి ఇష్టమైనవి ఆవు పాలు, కోడిగ్రుడ్డు, చలిమిడి, వడపప్పు. వీటిని పుట్టలో వేసి నమస్కారం చేయాలి.

పాహి పాహి సర్వరూప నాగదేవ దయామయ
సత్సంతాన సంపత్తిం దేహిమే శంకరప్రియ!
అనంతాది మహా నాగరూపాయ వరదాయ చ
తుభ్యం నమామి భుజగేంద్ర సౌభాగ్యం దేహిమే సదా!

అనే ఈ శ్లోకాన్ని పఠిస్తూ నాగులకు పాలుపోసి, నాగపూజ, అశ్వత్థనారాయణ ప్రదక్షిణలు చేయాలి.

వృశ్చికారాశిలోని జ్యేష్ఠా నక్షత్రానికి సర్ప నక్షత్రమనే పేరు వుంది. ఈ సర్ప నక్షత్రంలో సూర్యుడు ప్రవేశించి నప్పుడే నాగులచవితి వస్తుంది.

మన శరీరం ఒక వల్మీకం. అనగా తొమ్మిది రంధ్రాలు కలిగినపుట్ట. ఈ వల్మీకం అడుగున మూలాధారంలో శయనించి ఉండే నాగమే కుండలినీ శక్తి. ఈ నాగమే ప్రతి జీవియందు కామ క్రోథములనే విషాన్ని కక్కుతూ ఉంటుంది. అటువంటి విషాన్ని హరించే సత్వ గుణమునకు పాలు పోయడమే నాగుల చవితిలోని అంతరార్థం. ఈ పండుగ రోజున పాలు పోయడంవల్ల మనలో ఉన్న విషసర్పం తెల్లని ఆదిశేషునిగా మారి, మనలోనే ఉన్న విష్ణుభగవానునికి శయ్యగా ఏర్పడుతుంది. ఈ సాధనే నాగులచవితి పండుగ.

## 237. శ్రీ దత్తాత్రేయ స్తుతి

జగదుత్పత్తిఃర్త్రేచ స్థితి సంహార హేతవే
పాపనాశ విముక్తాయ దత్తాత్రేయ నమోస్తుతే
కర్పూర కాంతి దేహాయ బ్రహ్మమూర్తి ధరాయ చ




వేదశాస్త్ర పరిజ్ఞాయ దత్తాత్రేయ నమోస్తుతే
ఆదౌబ్రహ్మమధ్యే విష్ణురతే దేవ స్సదాశివః
మూర్తిత్రయ స్వరూపా దత్తాత్రేయ నమోస్తుతే॥

ఈ సృష్టి స్థితిలయాలకు కారకుడు, దోష విముక్తికి కారణభూతుడైన శ్రీ దత్తాత్రేయునికి నమస్కారం. కర్పూరకాంతితో సమానమైన శరీరచ్ఛాయతో ఒప్పారే బ్రహ్మ స్వరూపుడు, వేదశాస్త్ర నిధి అయిన దత్తాత్రేయునికి వందనమ్.

## 238. నిష్కామకర్మ

**జ.** ప్రపంచ సుఖాలను పట్టించుకుంటూ, వాటిలోనే మునిగి తేలుతూ ఉండేవారికి వాటితో విడదీయలేని బంధం ఏర్పడుతుంది. ఆ బంధంవల్ల కామం, విపరీతమైన కోరిక కలుగుతుంది. కోరిక నెరవేరకపోతే క్రోధం వస్తుంది. అన్ని కోరికలూ అందరికీ నెరవేరవు కదా! అగ్నిలో నేయి, హవిస్సు పోసేకొద్దీ అది మండుతున్నట్లు కోరికలు తీర్చేకొద్దీ వాటి సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. కోరికలు నెరవేరకపోతే కోపం వస్తుంది. కోపమంత శత్రువు మరొకటి లేదు. ఇది విచక్షణా జ్ఞానాన్ని




పోగొడుతుంది. రామాయణంలో హను మంతుడు 'క్రుద్ధోహన్యాత్ గురూనపి' అని చెప్పాడు కదా! కోపంతో తల్లిదండ్రుల్ని, గురువును కూడా చంపడానికి వెను కాడరు. కనుక కోప పరిణామం మోహం (అవివేకం) వల్ల, లోగడ పెద్దలవల్ల విన్న మంచి మాటల్ని మరచిపోతాం. దానివల్ల అంతఃకరణము అనగా జ్ఞానం నశించగా అది సర్వనాశనానికి దారితీస్తుంది. ధర్మార్థ కామమోక్షాలనే నాలుగు పురు షార్థాలను పాటించే అర్హతను మనిషి పోగొట్టుకుంటాడని అర్థము. ఏ అర్థ కామాలకు లోనయి మనిషి వివేకహీనుడ వుతాడో వాటికే దూరమైపోతాడని భావం.

చేయడం తన కర్తవ్యమని భావించి, ఆ చేసే పనివల్ల ప్రయోజనం, లాభ మెంత, నష్టమెంత అని లెక్కచేయకుండా విధి నిర్వహణకొరకు పనిచేస్తే దానితో ఎక్కువ సంగమం ఏర్పడుతుంది. ఇదే నిష్కామ కర్మ. కర్మఫలంతో మనకు సంబంధం లేదు కదా అని మొక్కుబడి తీర్చుకున్నట్లు పని అయిందనిపించరాదు. పనిపట్ల ఏ మాత్రం అశ్రద్ధ వహించకూడదు. చేస్తున్న పనిని త్రికరణశుద్ధితో నిర్వహించాలి. నిష్కామ కర్మవల్ల కామ క్రోధాదులను జయించవచ్చు. ఇదే పెద్ద ప్రయోజనంగా భావించాలి.

## ౨౩౨. దేవతార్చనమంటే

**జ.** దేవాలయాలలో, గురు మందిరాలలో పూజించే సంప్రదాయం అన్నిమతాల లోను మనం చూస్తున్నాం. హిందూ, ముస్లిమ్, క్రిస్టియన్, సిక్, జైన, పార్శీ మతానుయాయులు తమ ఆచారం ప్రకారం పూజ చేస్తున్నారుకదా? అది వారి విశ్వాసం, వారి పద్ధతి. ఇందులో తప్పు ఏ మాత్రం లేదు. ఎందుకంటారా? సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు ఐన భగ వంతుడు వేలాది, లక్షలాది పేర్లతో పిలువ బడుతున్నాడు. 'ఏకం సద్విప్రాః బహుధా వదంతి' అన్నాయి వేదాలు. భారతీయ సంప్రదాయం ప్రకారం దేవతార్చన అత్యంత పవిత్రమైన కార్యం. స్నానం చేసి మడి వస్త్రాలను ధరించి, విభూతి నామా లను దిద్దుకుని, సంస్కృత భాషలోని వేద మంత్రాలను ఉచ్చరిస్తూ, విగ్రహాలకు షోడశోపచార పూజ కావించటమే దేవ పూజ అని మన భావన. మంచిదే. కాని ఇదే దేవపూజ అనటం సముచితం కాదు. దేవుడంటే విగ్రహాలు, సాలగ్రామాలు, శివలింగాలు అని తెలుసుకోవటం చాలదు. అలా భావించేవారిని భావించ నివ్వండి. కాని దీవ్యతి ఇతి దేవః అంటే మన కను లకు, మనసుకు ఆనందాన్ని ప్రసాదించే



వస్తువులన్నీ భగవంతుడే. చెట్లు, సూర్య చంద్రులు, చిరునవ్వు చిందించే పిల్లలు, నదులు, తీర్థక్షేత్రాలు, బిక్షగాళ్ళు వీరందరూ భగవత్స్వరూపులే. వీరిని భగవంతునిగా భావించుటే దేవపూజ. మనలోని ప్రేమ, విద్య, ధనం, అధికారం, ఆరోగ్య సంపదను ఇతరులకు పంచటమే నిజమైన దైవారాధన.

## 240. శక్తిపూజ

**జ.** హిందూ దేవతల పూజా విధానాలకు ఒక స్పష్టరూపం ఇచ్చి, భక్తులంతా అనుసరించేలా చేశారు ఆది శంకరులు. ముక్కోటి దేవతలు అని చెప్పినప్పటికీ దేవతలందరికీ పూజా విధానంలో ఆరే ఆరు రూపాలుగా విభజించి చెప్పారు. మొదటిది గణపతి పూజ, శివుని పూజ, విష్ణుపూజ, సూర్యభగవానుని పూజ, సుబ్రహ్మణ్య పూజ .... చివరిగా ఆయన చెప్పింది శక్తి పూజ. ఆ దేవతలందరిలో పురుషులైన వారు కూడా శక్తి రూపాన్ని ఆరాధించి



నట్టుగా చెప్పబడింది. ఆదిదంపతులయిన శివపార్వతులను ఎప్పుడూ జంటగానే కొలవాలి. సర్వశక్తులు ఆ శక్తి రూపం నుండి వెలువడినవే. అటువంటి అమ్మవారి పూజనే అన్నింటిలోకి విశిష్టమైన పూజగా పేర్కొనడం జరిగింది. అయినా వ్యక్తిగతంగా భక్తులు ఎంచుకుని తమకు నచ్చిన రీతిలో ప్రార్థనలు జరుపుకునేందుకు వీలుగా మిగిలిన పూజావిధానాలను కూడా రూపొందించారు. కాని శక్తి పూజ చేస్తే సర్వదేవతా పూజలు చేసినట్టే.

## 241. అమృతత్వ ప్రాప్తి

**జ.** "బ్రహ్మణోహిప్రష్ఠాహం, అమృతస్యావ్యయస్యచ శాశ్వతస్యచ ధర్మస్య సుఖస్యైకాంతికస్యచ" అవ్యయము, అద్భుతమూ అయిన బ్రహ్మకు నేనే కారణభూతుడను. అయితే ఈ పరమాత్మను ఎక్కడ చూడాలి. పరమాత్మ ఎక్కడో లేదు. అందరి హృదయాల్లోనూ ఉన్నాడు. "ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి' మనలో ఉన్న పరమాత్మను చూడాలన్న మనం దైవగుణాలను సంతరించుకోవాలి.

దైవగుణాలే మోక్షదాయకాలు. మోక్షదాయకమైన గుణాలేవి? నిర్భయం, అంతఃకరణ శుద్ధి, దానం. ఇంద్రియ నిగ్రహం, దైవారాధన, స్వాధ్యాయం తపస్సు, అహింస, అక్రోధం, త్యాగం, శాంతి, దయ, మృదుత్వం, నిశ్చలతత్వం, అహంకార రాహిత్యం ఇవన్నీ అమృతత్వ ప్రాప్తికి సాధనాలు. "త్యాగే



నైకే అమృతత్వ మానశుః" ఒక త్యాగ రూపమైన సన్యాసంతోనే విద్వాంసులు అమృతత్వాన్ని అంటే మోక్షాన్ని పొందగలరు. అమృతత్వమును కర్మతో పొందలేరు, ధనంతో పొందలేరు. కొందరు త్యాగం వల్లనే అమృతత్వం పొందగలరు అని అవధూతోపనిషత్ చెబుతుంది.

## 842. మహాచైతన్యం

**జ.** "ప్రతివ్యక్తి నిజస్వరూపం అతడు భగవానుని నిత్య సేవకుడై ఉండటం" అని చైతన్య మహాప్రభువు అన్నారు. ఒక వ్యక్తి "నేను మరి ఎవ్వరికీ సేవకుడ్ని కాను. నా కర్తవ్యం భగవానుని సేవించడమే" అని భావించే పక్షంలో అతడు ముక్తి సాధించినట్లే. వెంటనే అతని హృదయం పరిశుద్ధం అవుతుంది. అతడు ముక్తుడు అవుతాడు. ఆ స్థాయికి చేరుకున్న తర్వాత అతని ఆరాటాలూ, ఆందోళనలూ అన్నీ తొలగిపోతాయి. "నేను దేవుడి సేవకుడ్ని. దేవుడు నాకు రక్షణ కల్పిస్తాడు. ఏ విషయాన్ని గురించి అయినా ఇంక నాకెందుకు చింత" అని అతడు గుర్తిస్తాడు. అతడు కేవలం పసివానివలె ఉంటాడు. పసివాడికి తన తల్లిదండ్రులు తనని గూర్చి శ్రద్ధ తీసుకుంటారని తెలుసు. అతనికి ఏ చింతలూ ఉండవు. అతడు నిప్పును ముట్టుకోవాలని చూస్తే అలా చేయకుండా తల్లి అతనిని కాపాడుతుంది. "నాయనా! అది నిప్పు, కాలుతుంది. ముట్టుకోకు" అని పరుగెత్తుకు వస్తుంది. అలా తల్లి ఎప్పుడూ తన బిడ్డను ఓ కంట కనిపెడుతూనే ఉంటుంది. మరి మీరు దేవుని మీద భారాన్ని పూర్తిగా ఎందుకు వదలరు? వాస్తవానికి మీరు దేవుని రక్షణలోనే ఉన్నారు.

## 843. భగవద్దర్శనం

**జ.** భగవంతుడిని చూడగలమా? ఒక వేళ భగవంతుడు మన ఎదురుగా వచ్చి నిలుచున్నా ఆయనే భగవంతుడని గుర్తించటం ఎలా? ఈ ప్రశ్నలు భక్తుల్లో చాలా మందికి కలుగుతుంటాయి. ఇవి ఈనాడు కొత్తగా కలిగినవి. సృష్టి అనాదిగా ఎందరికో ఎదురైన సందేహాలు, ఆ సందేహాల నివృత్తి కోసం పలువురు మహాపురుషులు తమ తమ అనుభవాలను సామాన్యులకు అందించారు. తాము పొందిన జ్ఞానాన్ని మనకు అందించారు.

భగవంతుని చూడాలంటే ముందుగా మనలో మార్పు రావాలి. ఆ భగవంతుని రూపం దర్శించగలిగిన స్థాయికి మనిషి మనసు ఎదగాలి... మారాలి. మనసులో అహం, గర్వం మూటకట్టుకున్నవాడు భగవంతుని దర్శించలేడు. అహంకారపు పొరల దైవత్వాన్ని చూడనివ్వవు. మేథో సంపద, ఆర్థిక సంపదలు కూడా దైవత్వానికి దగ్గర కానివ్వవు. నిర్మలమైన మనసు, చిత్తశుద్ధితో ఆ భగవంతుని చేరడానికి చేసే యత్నం మాత్రమే భగవంతుని దర్శింపచేస్తాయి.

## 844. సదాశివ స్తుతి

నాగేశహారం నటరాజ మూర్తిం
నగేశవాసం వరనంది వాహం।
నాకేశపూజ్యం నతకల్ప భూజం
భజేర్ధనారీతను మాశుతోషమ్ ॥



సర్పరాజునే హారంగా ధరించినవాడు, నాట్యం చేసే నటరాజమూర్తిగా, కైలాసంలో నివసించేవానిగా, నందిని వాహనం కలవాడిగా, ఇంద్రుడి చేత పూజ లందుకున్నవాడిగా, కల్పవృక్షంగా, శక్తి స్వరూపిణిని అర్ధ శరీరం ధరించినవానిగా, భక్తులకు శీఘ్రంగా వరాలిచ్చేవానిగా, ఇలా ఎన్నో మహిమలు కలిగిన సదాశివుడ్ని సదా స్మరిద్దాం.

## 845. ధర్మమూలం

**జ.** "సర్వేషామేవ జంతూనాం,
మనుష్య త్వంతు దుర్లభం
పంచేంద్రియ విధానం తు
బహుపుణ్యై రవాప్యతే"

(గరుడపురాణం)

మానవుడు స్వర్గానికి ప్రతినిధి. జగత్ సృష్టిలో అగ్రగణ్యుడు అని చైనా దార్శనికుడు కన్ఫ్యూషియస్ అన్నాడు. భగవంతుని అద్భుతమైన సృష్టిలో ఆనందాన్ని మానవుడు మాత్రమే అనుభవించగలడు.

జ్ఞానేంద్రియాల శక్తిని, సామర్థ్యాన్ని కలిగినంత మాత్రాన మానవుడు ఇతర జీవులకంటే శ్రేష్ఠుడని చెప్పటం సముచితం కాదు. అతని గొప్పదనం కేవలం అతని సాధనల ద్వారా మాత్రమే సాధ్యం కాజాలదు. మనిషి తనకు లభించిన అవకాశాల్ని ఏ రీతిగా ఉపయోగిస్తున్నాడు? అన్నది గమనింపదగును. దాని మీదనే అతని గొప్పదనం ఆధారపడ్తుంది. వీటిని సత్కర్మలకు వినియోగించినపుడు మాత్రమే అతడు శ్రేష్ఠుడుగా పరిగణింప బడతాడు. అతనికీ, జంతువులకు వ్యత్యాసమేమీ కానరాదు. ఉత్తమ కర్మలనే ధర్మమంటారు.

## 846. నవదుర్గ స్తుతి

**జ.** ప్రథమా శైలపుత్రీ ద్వితీయ బ్రహ్మచారిణీ తృతీయా చంద్రఘంటేతి కూష్మాండేతి చతుర్థకీ



పంచమా స్కంధమాతేతి షష్ఠ్యా కాత్యాయనీతచ
సప్తమా కాలరాత్రేతి మహాగౌరీతిచాష్టమీ
నవమా సిద్ధిధాత్రీతి నవదుర్గాః ప్రకీర్తితాః

శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కంధమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిదాయిని అనే వివిధ దుర్గా స్వరూపాలతో విరాజిల్లే ప్రకృతి స్వరూపిణి అయిన మహామాతకు నమస్కారం.

## ౭47. దుర్గావతరణ

**జ.** ముక్కోటి దేవతల్నీ, త్రిమూర్తుల్నీ ముప్పుతిప్పలు పెట్టేందుకు రంభుడనే రాక్షసుడికి మహిషుడనే కొడుకు పుట్టాడు. మదోన్మత్తుడైన మహిషుడు బ్రహ్మకై తపించాడు. పురుషులెవరిచేత చావు లేకుండా వరాన్ని సాధించాడా మహిషుడు. ఇకదాంతో కన్నూ-మిన్నూ గానక స్వర్గ, మర్త్య, పాతాళ లోకాలన్నీ జయించేశాడు.

జయించడమే గాక సమస్త దేవతల్నీ పీడించడం మొదలుపెట్టాడు. పురుషులు ఆ రాక్షసుడిని జయించలేరు. అటువంటిది ఏ స్త్రీ మాత్రం జయించగలదు?! ఇక లాభం లేదని శివకేశవులు తమ ముఖాలలోని అద్భుతమైన తేజస్సును బయటకు రప్పించారు. వారితో బాటు బ్రహ్మాది దేవతలు కూడా తమ తేజాలను వెలికి తీసి ప్రోగుపెట్టిన వారయ్యారు.

ముక్కోటి దేవతల, త్రిమూర్తుల తేజస్సుల సమ్మేళనంతో మహత్తేజః పూజమైన దుర్గాదేవి ఆవిర్భవించింది. శివ తేజస్సుతో ముఖం, యమతేజంతో కేశ పాశాలు, విష్ణుతేజంతో బాహువులు, చంద్ర తేజంతో స్తనద్వయం, ఇంద్ర తేజంతో మధ్యభాగం, వరుణతేజంతో తొడలు, పిక్కలు, భూమి తేజస్సుతో పిరుదులు, బ్రహ్మతేజంతో పాదాలు, సూర్య తేజంతో పాదాలకు వ్రేళ్ళు, వాసవ తేజంతో చేతివ్రేళ్ళు, కుబేర తేజస్సుతో ముక్కు, ప్రజాపతి తేజస్సు వల్ల దంతాలు, అగ్ని తేజంతో కళ్ళు, సాధ్యుల తేజంతో భ్రూమధ్యం, వాయుతేజం వల్ల చెవులు, సమస్త దేవతల తేజంతో ఏర్పడిన తనువుతో పద్మాసనవస్థయై ఆవిర్భవిం

artist

చింది మహాదుర్గమ్మవారు. అమ్మవారి అట్టహాసం, దేవతల కలకలరావం విన్నాడు మహిషుడు. కోటికి పైగా సైన్యాన్ని తీసుకుని తానుకూడా యుద్ధానికి వెడలి వచ్చాడు. చిక్షుర, చామర, ఉదగ్ర, కరాళ, ఉద్ధ భాష్కల, తామ్ర, ఉగ్రాస్య, ఉగ్రవీర్య, బిడాల, అంధక, దుర్ధర, దుర్ముఖ, త్రినేత్ర, మహాహనులు అనే ప్రసిద్ధి చెందిన రాక్షస వీరులు మహిషుని వెంట పోరుకు సిద్ధమై వచ్చారు. ఇరువైపుల ఢీ అంటే ఢీ అన్నాయి. దుర్గాదేవి ఒక్కసారిగా రాక్షస సైన్యం మీదకు తన సమస్త ఆయుధాలతో విరుచుకుపడింది. దేవతలంతా జయ జయ ధ్వానాలు చేశారు. అమ్మవారిని స్తుతించారు.

**మహిషమర్దనం :**

మహిషుడిపైన, అతని సైన్యంపైన విరుచుకుపడింది దుర్గాదేవి. ఆ తల్లి నిశ్వాసాల నుంచి ఆవిర్భవించిన దుర్గ గణాలు రాక్షస సేనలను చీల్చి చెండాడ సాగాయి. అది చూసిన మహిషుడు కోపంతో మహిషరూపాన్ని ధరించి విజృంభించాడు. దేవతా సైన్యాన్ని కొమ్ములతో కుమ్మాడు. డెక్కలతో తన్నాడు. ముట్టెతో మోదాడు. తోకతో ప్రహరించాడు. కుమ్ము కుమ్ముకీ కొండల్ని పెకిలించి, దుర్గా గణాలపై వాటిని విసరసాగాడు. ఆ రాక్షసుని విజృంభణచూసి దుర్గా సంరక్షణలో ఉన్నప్పటికీ దేవతలకు భయమేసింది. అది గమనించింది తల్లి. తన గణాలపై దుముక బోతున్న మహిషుడ్ని పాశం వేసి పట్టుకుంది. వెంటనే వాడు సింహరూపం ధరించాడు. అప్పుడు ఖడ్గమెత్తింది అమ్మవారు. మహిషుడు సింహరూపం నుండి తన రాక్షసరూపంలోకి వచ్చి తనూ కత్తితో ఆమెను ఎదిరించబోయాడు. అమ్మవారు మహిషుడ్ని చర్మ, బాణ, ఖడ్గాలతో తాడించింది. వెంటనే ఆ రాక్షసుడు పెద్ద ఏనుగ్గా మారి తన తొండంతో అమ్మవారి వాహనమైన సింహాన్ని తాడించాడు. కోపం వచ్చింది దుర్గామాతకు. ఖడ్గంతో వాడి తుండాన్ని నరికేసింది. గింగిర్లు తిరిగిన మహిషుడు రాక్షస రూపంతో మాయా యుద్ధానికి తలపడ్డాడు. వెంటనే అమ్మవారు తన చేతిలోని అక్షయపాన పాత్రను ఎత్తి సురను తలకెక్కేదాకా త్రాగింది.



ఘణఘణఘణ ఘంట మ్రోగించింది. ఒక్క అట్టహాసం చేసింది. ఆ వారుణీపాన సంజాత మదఘూర్ణిత వదనార విందానికి దేవతలంతా నమస్కరించారు. ఆమె అట్టహాసానికి సాగిలపడ్డారు. ఆ ఘంటా రావానికి సంతోషంతో వారు కేరింతలు

కొట్టారు. అలా వారుణీపానం చేస్తూ, ఘంట మ్రోగిస్తూ అనూహ్యంగా విజృంభించిన ఆ మహాశక్తి ధాటికి మహిషుడు ఖంగుతినక తప్పలేదు. ఘంటారావం రాక్షసుల గుండెలను చీల్చింది. ఆమె అట్టహాసాలకి రాక్షసులు చెట్లమీంచి రాలే పిట్టల్లా రాలిపోయారు. తెగబడిన మహిషుడు ఆమె మీదకు దుమికాడు. అమ్మ కాలెత్తి ఒక్క తన్నుతన్నింది. మట్టిబెడ్డ మాదిరి రాలిపడ్డాడు. కిందపడిన మహిసుడి కంఠంమీద ఎడం కాలువేసి తొక్కి పట్టింది. చేతనున్న త్రిశూలంతో వాడి ముఖాన్ని గుచ్చిపట్టి, పెకిలించి పైకి ఎత్తింది. 'జై మహిషాసుర మర్దినీకి జై' అనే నినాదాలు దశ దిశలా మార్మ్రోగాయి. దేవకోటంతా విజయనాదాలతో అమ్మవారిని ఘనంగా స్తుతించారు.

## ౨48. శ్రీ సూర్యనారాయణ స్తుతి

**జ.** ఓం ధ్యాయేహం కమల ద్వయాన్వితకరం సప్తాశ్వయుక్తే రథే।


తిష్టంతం సనకాదిభిర్మునివర్యై శ్రీమారరాద్వైర్యృతం।

ఛాయోషా వరపద్మినీతి తిసృభిర్భార్యాభిరారాధితం ।

హ్యజ్ఞానాంధ తమోపహం హృది భజే శ్రీ సూర్యనారాయణమ్॥

## ౨4౨. సంక్రమణ పుణ్యకాలం

**జ.** సూర్యభగవానుడు నూతన ఉత్తేజంతో, చైతన్య స్ఫోరకంగా సంచరించే ఉత్తరా



యణ పుణ్యకాలంలో వచ్చే మొదటి పండుగ సంక్రాంతి. ఉత్తరాయణ పుణ్యకాలంలో సూర్యుడు మందగమనంతో సంచరిస్తాడు. అందువల్ల పగటి సమయం పెరిగి చీకటి కాలం తగ్గుతుంది.

సప్తవర్ణ అశ్వాలు, మూడు వందల అరవై ఆకులుగల ఒకే చక్రం అనగా సంవత్సర చక్రం. ఇరవై నాలుగు అంచులు, అంటే పర్వాలు, పన్నెండు కాడిపోలులు అనగా పన్నెండు రాశులు, ఆరుముఖాలు అంటే ఆరు ఋతువులు కలిగి, గాయత్రి ఛందస్సుల శక్తితో సూర్యభగవానుడు తన ప్రస్థానాన్ని సాగిస్తాడు. ఈ ఉత్తరాయణ పుణ్యకాలంలో సూర్యభగవానుని సూర్య శక్తిని పుష్కలంగా అందుకుంటాం. సంక్రాంతి పండుగ రోజు నుంచి సౌరశక్తి భూమండలానికి మరింతగా దగ్గరవుతుంది. సూర్యతేజస్సునుండి ఉద్భవించే కిరణాలలో దేవతా శక్తులున్నాయని వేదం తెలియజేస్తోంది.

సూర్యభగవానుడు అన్న ప్రదాత. ఆయువును, ఆరోగ్యాన్ని అందిస్తాడు. రామాయణ, భారత గ్రంథాలుకూడా 'ఆదిత్య హృదయం' ద్వారా సూర్యోపాసన అవసరాన్ని తెలియజేశాయి.

సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించిన క్షణంనుండీ ధనుర్మాసం మొదలైనట్లే. ఇక నెలపొడుగునా సంక్రాంతి సందడే.

సూర్యభగవానుడు మేషాది పన్నెండు రాశుల్లో ఒక్కో నెల ఒక్కొక్క రాశివంతున ప్రవేశించి సంచారం చేస్తాడు.

ధనూరాశినుండి మకర రాశిలోకి మారిన తరుణమే మకరసంక్రాంతి, ఉత్తరాయణ పుణ్యకాల ఆరంభం. ధనుర్మాసంలో మృగ శిర నక్షత్రంతో కూడిన మార్గశిర పుష్య మాసాలు రెండూ కలుస్తాయి. రాశి మార్పులన్నీ సంక్రమణాలే అయినా మకర సంక్రాంతినే పండుగగా భావిస్తాం. కారణం మకర సంక్రాంతికి నరక యాత నలన్నీ పోయి స్వర్గద్వారాలు తెరుచు కుంటాయి.

ప్రతి నెలా సూర్యుడు ఒక రాశినుండి మరొక రాశిలోకి ప్రవేశించడాన్ని సంక్ర మణ మంటారు కదా. ఈ సంక్రమణాలు సంవత్సరానికి పన్నెండు. ఈ సంక్రమ ణాలు అన్నీ పుణ్యప్రదమైనవే. దీనిలో కొన్ని సంక్రాంతులలో సూర్యుడు రాశిప్రవేశం చేయటానికి ముందు, మరి కొన్ని సంక్రాం తులలో సూర్యుడు రాశి ప్రవేశం మరి కొన్ని సంక్రాంతులలో సూర్యుడు రాశి సంక్ర మణానికి ముందు, వెనుకలలో పుణ్య కాలాలు అవుతాయి. 'వసంత విషువత్' అనగా మేష సంక్రాంతి. మొదటి రాశి మేషరాశి. మొదటి నక్షత్రం అశ్వనీ నక్షత్రం. ఈ అశ్వనీ నక్షత్రంలోని మొద బిందువులో అనగా మేషరాశిలో సూర్యుడు ప్రవేశించినప్పుడు అది మేష సంక్రాంతి అవుతుంది. మేష సంక్రాంతికి ముందు పది ఘడియలూ, ఈ సంక్రమణానికి తరు వాత పది ఘడియలూ పుణ్యకాలం.

హరిపద పుణ్యకాలంగా వృషభ సంక్రాంతిని వ్యవహరిస్తారు. ఈ మిథున సంక్రాంతికి తర్వాత వచ్చే పదహారు ఘడి యలు పుణ్యకాలంగా చెప్పబడింది. దక్షిణాయన పుణ్యకాలంగా వ్యవహరించ బడేది కర్కాటక సంక్రాంతి. ఈ సంక్రమ ణానికి ముందుగా వచ్చే ముప్పై ఘడి యలు పుణ్యకాలమే అవుతాయి.

విష్ణుపదమని చెప్పబడేది సింహ సంక్ర మణం. దీనికి ముందు పదహారు ఘడి యలు పుణ్యకాలమే అవుతాయి.

కన్యా సంక్రమణాన్ని కూడా షడశీతి అనే అంటారు. ఈ సంక్రమణ ప్రవేశా నంతరం పదహారు ఘడియలు పుణ్య కాలం. శరద్విషువత్ అని తులా సంక్ర మణాన్ని వ్యవహరిస్తారు, సంక్రమణానికి ముందు పదిఘడియలు, సంక్రమణం తర్వాత పది ఘడియలు పుణ్యకాలం.

వృశ్చిక సంక్రాంతిని కూడా హరిపద పుణ్యకాలంగా చెప్పబడింది. సంక్రమ ణానికి ముందు పది ఘడియలు పుణ్య కాలం.

ధనుస్సంక్రాంతిని కూడా షడశీతి పుణ్య కాలంగా చెబుతారు. సంక్రమణం తర్వాత 16 ఘడియలు పుణ్యకాలం.

కుంభ సంక్రమణాన్ని కూడా విష్ణు పద పుణ్యకాలంగా భావిస్తారు. సంక్రమణానికి ముందు 16 ఘడియలు పుణ్యకాలంగా

చెబుతారు. మీన సంక్రమణాన్ని షడశీతి పుణ్యకాలంగా చెబుతారు. సంక్రమణం తరువాత పదహారు ఘడియలు పుణ్య కాలం స్నానాలు, దానాలు, సంక్రాంతి వ్రతాలు వంటివి ఏవైతే చేయాలని చెప్పబడినవో వాటిని పుణ్యకాలంలో సక్రమంగా ఆచరిస్తే అనంతమైన పుణ్యఫలాలు లభిస్తాయి.

## 850. శుభోదయం

**జ.** సూర్యభగవానుడు ఉదయించే సమయ విశేషాన్ని తెలియజేసేది ఉషస్సు. 'రుజా హరణ కాలం అంటే–రోగాలను హరించే శక్తిగల కాలమని అర్థం.

ఆ సమయంలో నిద్రలేచి పూజాధికాలు నిర్వర్తించే వారికి శారీరకంగానూ, మానసికంగానూ, ఆధ్యాత్మికంగానూ ప్రశాంతత లభిస్తుంది. ఇది అనాదిగా వస్తున్న భారతీయ సంప్రదాయం.

ఉషస్సులోని పవిత్రత, దివ్యత్వం మనలో నింపుకోవడానికి తగిన సాధనలు మనకు అనూచానంగా వస్తున్నాయి. వాటిని వదిలేసి పొద్దెక్కేవరకు నిద్రపోవడం, భగవధ్యానానికి సమయం కేటాయించక పోవడం తప్పని మన పెద్దల మాట.

ఒకప్పుడు ఉషఃకాలంలో పసుపు, కుంకుమలతో అలంకరించబడిన గడపలు, ముగ్గులు దిద్దిన గుమ్మాలు, కళకళలాడే ముఖాలు, తలుపులు తెరిచిన ఇళ్ళు బాలభానునికి స్వాగతాలు పలికేవి.


ప్రకృతిలోని ప్రతి ప్రాణీ సూర్య భగవానుని రాకకు స్పందించేది. ప్రకృతి మొత్తం ఒక చక్కని శృతితో నాదమయం అవుతుంటే, బుద్ధిమంతుణ్ణి అనుకునే మానవుడు మాత్రం అపశృతితో నేడు ఆవులిస్తూనే వున్నాడు. కనుక ఈ సంస్కృతిని పక్కనపెట్టి హైందవ సంస్కృతి చెప్పినట్లు నడుచుకోవాలి.

'సుషాచమే సుదినం చమే'

మంచి ఉషస్సు, మంచిరోజు నాకు లభించుగాక॥ (యజుర్వేదం)

## 851. హరిప్రియ స్తుతి

**జ.** తులసీకాననం యత్రయత్ర పద్మ వనానిచ ।
సాలగ్రామ శిలాయత్రతత్ర సన్నిహితో హరిః ॥



తులసీవనమూ, పద్మ వనమూ, సాలగ్రామమూ ఈ మూడూ వున్నచోట్లలో శ్రీహరి సన్నిహితుడై వుంటాడు. అటువంటి తులసీపద్మ వనాలకు, సాలగ్రామానికి నమస్కారము.


## 852. దివ్యభూమి

**జ.** తత్త్వజ్ఞానం ఏ భూమిని తన నివాస భూమిగా స్వీకరించిందో – ఆ ప్రాచీన భూమి ఇది. ఏ భూమిలోని ఆధ్యాత్మిక ధీర స్థూలరూపాన్ని ధరించి సముద్రపు ఆకారంలో వున్న నదులుగా ప్రవహించిందో ఆ భరత భూమి ఇది.

ఏ భూమిపై ప్రపంచమంతటిలో సర్వశ్రేష్టులయిన మహర్షుల పాదధూళి సోకిందో ఆ దివ్యభూమి ఇది. ధర్మ దర్శనాల ఆదర్శాలు శిఖరాగ్రాన్ని చేరుకున్నది ఇక్కడే. ఏ భూమినుండి ధర్మ తత్త్వం, దర్శనతత్త్వం సమస్త విశ్వాన్నీ పొంగి పొరలే వరదల్లా ముంచెత్తాయో – పరిపూర్ణమైన దివ్యభూమి ఇదే. ఏ భూమి నుండి ఇలాంటి తరంగాలు ఉవ్వెత్తున ఎగసి, శక్తి సామర్థ్యాలను కోల్పోయిన జాతుల్లో జవాన్నీ, జీవాన్ని నింపుతాయో ఆ పవిత్రభూమీ ఇదే. ఏ దేశం శతాబ్దాల తరబడి జరిగిన దాడులనూ, వందలాది విదేశీ దురాక్రమణలనూ, ఎన్నెన్నో ఆచార వ్యవహారాల పరి వర్తనలనూ తట్టుకుని అక్షయంగా, మొక్కపోనిదిగా నిలిచివున్నదో, ఆ కర్మభూమీ ఇదే. నశింపులేని తన వీర త్వంతో, మేరు పర్వతాన్ని మించిన దృఢత్వంతో నేటి వరకు నిలిచివున్న క్షేత్ర భూమీ ఇదే. నేను భారతీయుడను. ప్రతి భారతీయుడు నా సోదరుడు అని నినదించు. భారతీయుడు నా ప్రాణం, భారతీయ దేవీ దేవతలు నా ఆరాధ్య దైవాలు. భారతీయ సమాజం నా బాల్యపు ఊయల, నా యౌవ్వనపు పూల తోట, నా వార్థక్యపు కాశీ అని ఘోషించు. భారత దేశపు మట్టి నాకు స్వర్గంతో సమానం.

## 853. చిన్నబలహీనత చాలు

**జ.** ధర్మమార్గం ఎంచుకుని ప్రయాణం చేసేవారిలో కూడా ఏదో ఒక చిన్న బలహీనత ఏదో ఒక మూల వుండే అవకాశం



తప్పక వుంటుంది. ఆ చిన్న బలహీనతే వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. పురాణపురుషుల గాథల ద్వారా మహా ఋషులు ఈ మానవాళికి చేసిన హెచ్చరిక అది. ధర్మరాజు, నలుడు ధర్మానికి ప్రతీకలు. ధర్మరాజు అజాతశత్రువు. సత్య సంధుడు. అయినా ఆయనలో వున్న జూదమనే బలహీనత పాండవ ధర్మపత్ని ద్రౌపదికి నిండు కొలువులో వస్త్రాపహరణ అవమానానికి దారితీసింది. సోదరులతో సహా వారిని అడవులపాలయ్యేలా చేసింది. నలుడిగాథ కూడా అటువంటిదే. ఎంతో ధర్మబద్ధత కలవారి పరిస్థితి అలా వుండగా సామాన్యమానవులైన మీ పతనం మరింత వేగంగా, మరింత భీకరంగా వుంటుందని తెలియచెప్పడం ఆ ఋషుల వాక్కులలోని ఉద్దేశ్యం. కాబట్టి సామాన్యులమైన మనం మనలోని బలహీనతల్ని వీలైనంతవరకు పారద్రోలే ప్రయత్నం చేయాలి.

## 854. అనంతరూపం

**జ.** వేదాలలో భగవంతుని వర్ణన, గుణ గణాలున్నాయి. అయితే ఆ వర్ణనల చివరిలో ఎంత వర్ణించినా అది సంపూర్ణం

కాదని, ఇంకా ఏదో మనకు తెలియని గుణం, విశేషం ఆ సర్వేశ్వరునిలో విలుప్తమై ఉందని వేదాలు వర్ణించాయి. భగవంతుడు పూర్తిగా మనకు అర్థమయ్యాడని కాని, ఆయన్ని దర్శించామని గాని అనలేం. ఎందుకంటే ఆయన రూపం అనంతమైనది. మానవ బాహ్య చక్షువులకు అంతుపట్టనిది, వారి దర్శనానికి అంతర చక్షువులే తగినవి. వాటిని తెరచి చూడాలి. ఆత్మను తెరచి, జ్ఞానసాధనతో భగవంతుని అర్థంచేసుకుని, ఆయన పట్ల పూర్తి వినమ్రతతో, భక్తిశ్రద్ధలతో అనుసరించిన వారికే ఆ మహోన్నత రూపం సాక్షాత్కరించే మహత్తరమైన అవకాశం లభిస్తుంది.

## ౨౫౫. పరమాత్మ తత్త్వం

**జ.** దేశ దేశాలు తిరుగుతూ మహోపన్యాసాలు చేస్తున్న ఓ సంఘ సంస్కర్తకు ఓ అవధూత తారసపడ్డాడు.

అప్పుడా సంఘ సంస్కర్త ఇలా అడిగాడు. "స్వామీ! నేను ఎన్ని ఉపన్యాసాలు చేసినా, అన్ని శాస్త్రాలలో వుండే పాండిత్యాన్నంతా వెదజల్లినా నా మాటలు ఆలకించేవారు, నేను చెప్పేది ఆచరించే వారు చాలా తక్కువ. మీరు మీ ఆసనాన్ని వదలక, కదలక ఇలాగే మౌనంగా కూర్చున్నా మీకు లెక్కలేనంతమంది శిష్యులు వున్నారు. ఆ శిష్యుల సంఖ్యకు కొదవ లేదు. ఇందుకు కారణమేమిటో సెలవీయండి అని కోరాడు. అప్పుడా అవధూత ఈ విధంగా పలికాడు. "నాయనా! దీపం పురుగులను తన చెంతకు రమ్మని పిలవదు అయినా వేలాది వేలు వెళ్ళి దాని చుట్టూ చేరుతూనే వుంటాయి. పుష్పాలు తమలో వుండే మకరందాన్ని తాగమని ఆహ్వానం చేయకపోయినా తుమ్మెదలు వెళ్ళి ఆ మకరందాన్ని గ్రోలుతాయి. అదే విధంగా నీలోని పరమాత్మను ప్రకాశింపజేస్తే నీవు పిలవకపోయినా మనుషులంతా నీ చుట్టూ చేరతారు. మనుషులే కాదు, పంచభూతాలయినా సరే నీ ఆజ్ఞకు లోబడి వుంటాయి''అని సమాధానమివ్వగా ఆ సంఘ సంస్కర్తకు జ్ఞానోదయమైంది.

artist

## ౨౫౬. లోకాస్సమస్తా సుఖినోభవంతు

**జ.** అనాదికాలం నుండి భారతీయులు 'లోకాస్సమస్తా సుఖినోభవంతు'. ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ సుఖంగా నుండవలెను అని ప్రార్థించుచుండిరి. అందువలననే భారతదేశము సమస్త మానవ కోటికి తలమానికముగా, గురు తుల్యముగా నుండెడిది. అందువల్లనే అనేక

విదేశ సంస్కృతీ ప్రభావముల ఒత్తిడికి నిలబడగలిగి తన పూర్వ ప్రాదుర్భావ మును తిరిగి పొందగల స్థితిలో భారత దేశము వుంది. ఎన్ని తరాలు మారినా భారతదేశ సంస్కృతికి వాటిల్లే ముప్పు ఏమీ వుండదు. మనదేశ సంస్కృతి అంతటిలోతైన ప్రభావం కల్గివున్నది. మన పూర్వీకుల నిర్మాణ ప్రభావంలో అంత శక్తి ఇమిడి వుంది.

ప్రపంచమందలి అన్ని కోణములకు 'శాంతి' సందేశము నందించి, ఒక పెద్ద ప్రశాంతి నిలయంగా విరాజిల్లగల అన్ని హంగులూ భారతదేశం కలిగి వుంది. తప్పక ఆ విధంగా వుండగలదు. అధిక విశ్వాసంతో ఆచరించునట్లు నీ మత మును నీవు ప్రేమించు. ప్రతి ఒక్కరు తమ తమ మతములను ఇనుమడించిన విశ్వా సంతో ఆచరించిన, ప్రపంచంలో ఇతర మతములపట్ల ఏవగింపు, ద్వేషము అను నది ఎంతమాత్రం వుండదు. శక్తివంతము గాను, సంతోష శుభప్రదములనిచ్చునది గాను, మానవుడు తన శక్తియుక్తులనభి వృద్ధి చేసికొని ప్రదర్శించు స్థానముగా నుండినట్లుగ నీ దేశమును ప్రేమించి వృద్ధిలోనికి తెమ్ము.

## 257. చిన్ముద్రధారి

**జ.** క్షీరసాగర మధనం తర్వాత అమృత ఆవిర్భావం జరుగుతుంది. అది సాధిం చేందుకు దేవతలు, అసురులు ఆరాట పడగా విష్ణుమూర్తి మోహినీ రూపంలో అమృతాన్ని దేవతలకు అందించడం జరుగుతుంది. మోహినీరూపంలో వున్న విష్ణు మూర్తిని చూసి శివుడు మోహిస్తాడు. శివకేశవుల సంయోగంతో అయ్యప్ప జన్మిస్తాడు.



త్రిమూర్తుల అంశతో జనించిన దత్తా త్రేయుడే ఈ అయ్యప్ప. దత్తాత్రేయుడు తన అవతార లక్ష్యం ముగిశాక ఆయన తన అంశను ముగించేందుకు సిద్ధపడగా ఆయన భార్య అయిన లీలావతి అందుకు ఒప్పుకోకపోవడంతో మహిషిగా జన్మించ మని ఆయన శపిస్తాడు. లక్ష్మి, గౌరి, సర స్వతిల అంశతో జనించిన లీలావతి మహిషిగా మారుతుంది. బ్రహ్మదేవుడి వల్ల హరిహరసుతుడుతప్ప తనని జయించే వారెవరూ లేకుండా వరాన్ని సాధించు కుంటుంది. ఇక అన్ని లోకాలను హింసించడం మొదలుపెడుతుంది. దేవ తలు, ఋషులు మహిషి ఆగడాలకు తాళ లేకపోతారు. దత్తాత్రేయుడే హరిహరసు

తుడు అయ్యప్పగా అవతరిస్తాడు. ఈయ నకు మణి కంఠుడనే మరోపేరు కూడా వుంది. రాజశేఖర మణికంఠుడిని పెంచు తాడు. ఈ మణికంఠుడే మహిషిని అంతం చేస్తాడు. మణికంఠుడు స్వయంభువుగా శబరిమలలోని స్వర్ణ దేవాలయంలో వెలి శాడు. పెదవులపై చిరునవ్వుతో ఈషణ త్రయాన్ని పారద్రోలి జీవాత్మ పరమాత్మను చేరు అని సూచించే విధంగా చిన్ముద్రతో భక్త జనావళికి నా పాదాలే శరణమని చెబుతున్నట్లుగా ఆ పరమాత్మని చేరడానికి భక్తియోగం అవసరమని చెప్పే విధంగా యోగాసన పట్ట బంధంతో, శతకోటి మన్మథాకారంతో కోటిసూర్య ప్రభతో కిందకి వంగివున్న వామహస్తంతో ప్రతి జీవాత్మ సమానుడై ఆ స్వామి అక్కడ దేవదేవునిగా కొలువు తీరాడు. స్వామి సన్నిధి చెంత పద్దెనిమిది మెట్లు వుంటాయి. వీటినే 'పదునెట్టాంబడి' అంటారు. నలభై రోజులు దీక్ష తీసుకుని ఇరుముడి ధరించినవారు మాత్రమే ఈ మెట్లు ఎక్కేందుకు అర్హులని చెబుతారు. ఈ మెట్లు ఎక్కేటప్పుడు "అష్టాదశ మహా సారం శాస్త్ర దర్శనదాయకం, విదితం శుద్ధ మత్కృష్టం సన్నిధానం నమామ్యహం" అని పఠిస్తూ ఆ మెట్లు దాటాలి. ఈ సోపానాలపై పద్దెనిమిది మంది దేవతల్ని ఆవాహన చేశారట. ఎనిమిది మంది దిక్పాలకులు, నాలుగు వేదాలు, రెండు శాస్త్రాలు, అవిద్య, విద్య, జ్ఞానం, అజ్ఞానం అన్నీ కలిపి మొత్తం పద్దెనిమిది మెట్లుగా వున్నాయనేది శాస్త్ర వచనం. ఈ మెట్లు దాటి వెళితే మోక్షసిద్ధి, దైవ దర్శనం తప్పక లభిస్తాయి.


## 258. గణపతి

**జ.** ***సుముఖశ్చైక దంతశ్చ కపిలో గజకర్ణకః***
***లంబోదరశ్చ వికటో విఘ్నరాజో గణాధిపః***
***ధూమకేతుర్గణాధ్యక్షః ఫాలచంద్రో గజాననః***
***వక్రతుండః శూర్పకర్ణో హేరంబః స్కంధపూర్వజః***

ఈ పదహారు నామాలతో ఎవరైతే విఘ్నేశ్వరుని స్మరిస్తారో వారికి విద్యారంభమున, వివాహమున, ప్రయాణ వేళలయందు, ఇతరత్రా సర్వకార్యము లందు విఘ్నములు కలగవు.

## 259. గణపతి పూజతో ఆరోగ్యం

**జ.** అకార ఉకార మకార ఓంకార స్వరూపుడు, సకల విద్యల సిద్ధులనిచ్చేవాడు, విఘ్నములు తొలగించేవాడు, సహస్ర నామాల గణనాయకుడు అయిన విఘ్నే



శ్వరుడు భాద్రపదమాసంలో, శుక్ల పక్షం లోని నాలుగో రోజున జన్మించాడు. అదే వినాయక చవితి. వినాయకచవితి రోజు ఆ స్వామిని ప్రతిఒక్కరూ పూజిస్తారు. ఆయ నకు అన్ని పూజలలోకెల్లా ఇరవైన్నొక్క పత్రాలతో చేసే పూజ అంటే మహాప్రీతి.

**ఓం సుముఖాయ నమః మాచీపత్రం పూజయామి** మాచిపత్రి కళ్ళకు చలువ చేస్తుంది. తలనొప్పిని పోగొడుతుంది. మనసుకు ఉత్సాహాన్ని ఇస్తుంది.

**ఓం గణాధిపాయ నమః బృహతీపత్రం పూజయామి** బృహతీపత్రం అంటే వాక్కా యల చెట్టు అకులు. ఈ చెట్టు ఆకులు శ్వాసకోశ వ్యాధుల్ని నివారిస్తాయి.

**ఓం ఉమాపుత్రాయ నమః బిల్వపత్రం పూజయామి** బిల్వపత్రం (మారేడు) అంటే శివుడికి మహా ఇష్టం. నీళ్ళలోని మలినా లను మారేడు తొలగిస్తుంది.

**ఓం గజాననాయ నమః దూర్వా యుగ్మం పూజయామి** పచ్చిక బయళ్ళలో లభించే గరిక చర్మవ్యాధుల్ని పోగొడుతుంది.

**ఓం హరసూనవే నమః దత్తూర పత్రం పూజయామి** దత్తూర పత్రం అంటే ఉమ్మెత్త. ఈ ఉమ్మెత్త ఆకులు ఎటువంటి విషాన్నైనా తొలగిస్తాయి.

**ఓం లంబోదరాయ నమః బదరీ పత్రం పూజయామి** బదరీ పత్రం అంటే రేగు ఆకు. ఈ రేగు ఆకుల్ని ఆవులు నమి లితే బాగా పాలిస్తాయి. మనం నమిలితే గొంతు లోని బాధలు పోతాయి. రక్త దోషాలూ వుండవు.



**ఓం గుహాగ్రజాయ నమః అపామార్గ పత్రం పూజయామి**

ఈ ఉత్తరేణి ఆకులు పంటికి మంచివి.

**ఓం గజకర్ణాయ నమః తులసీపత్రం పూజయామి** తులసి ఆకులు నీటిని, గాలినీ శుద్ధి చేస్తాయి.

**ఓం ఏకదంతాయ నమః చూతపత్రం పూజయామి** ఈ మామిడాకులు గొంతు బాధల్ని పోగొడతాయి.

**ఓం భిన్నదంతాయ నమః విష్ణుక్రాంత పత్రం పూజయామి** జ్ఞాపకశక్తి, మేధోశక్తిని పెంచే నీలిపుష్ప పత్రాలివి. వీటినే శంఖు పత్రాలని కూడా అంటారు.

**ఓం వటవే నమః దాడిమీ పత్రం పూజయామి** అతిసారాన్ని అరికట్టే దానిమ్మ పత్రాలివి.

**ఓం సర్వేశ్వరాయ నమః దేవదారు పత్రం పూజయామి** దేవదారు పత్రం క్రిమికీటకాల్ని దగ్గరకు రానీయదు.

**ఓం ఫాలచంద్రాయ నమః మరువక పత్రం పూజయామి** మరువం గుండె

జబ్బులకు మంచిమందుగా పని చేస్తుంది. సువాసనను ఇస్తుంది

**ఓం హేరంబాయ నమః సింధువార పత్రం పూజయామి** వావిలాకు పత్రాలంటారు. విషానికి విరుగుడుగా పని చేస్తాయి. ఈ ఆకు వాసనకు జ్వరాలు తగ్గుతాయి.

**ఓం శూర్పకర్ణాయ నమః జాజిపత్రం పూజయామి** అజీర్తిని వారించే పత్రం జాజిపత్రం.

**ఓం సురగ్రజాయ నమః గణ్డనేపత్రం పూజయామి** చర్మవ్యాధులకు ఈ మొక్కకు పూసే తెల్లని పూలు పనిచేస్తాయి. వీటినే ఏనుగు చెవి ఆకులు అంటారు.

**ఓం ఇభవక్త్రాయ నమః శమీపత్రం పూజయామి** జమ్మి ఆకుల్లో అవాంఛిత రోమాల్ని తొలగించే ఔషధ ప్రక్రియ దాగుంది.

**ఓం వినాయకాయ నమః అశ్వత్థ పత్రం పూజయామి** రావి ఆకులు, బెరడులో ఎన్నో ఔషధగుణాలున్నాయి.


**ఓం సురసేవితాయ నమః అర్జున పత్రం పూజయామి** ఈ మద్ది అకులు గాయాలు సెప్టిక్ కాకుండా వుంచుతాయి. పుండ్లు తగ్గిపోతాయి.

**ఓం కపిలాయ నమః అర్కపత్రం పూజయామి** జిల్లేడు ఆకులు విషాలకు విరుగుడు.

**ఓం గణేశ్వరాయ నమః ఏకవింశతి పత్రాణి పూజయామి** ఇలా పత్రాలతో వినాయకచవితి రోజు స్వామివారిని పూజిస్తే సంవత్సరమంతా విజయాలు వరిస్తాయి.

## ౨౬౦. శుభయాత్ర

**జి.** 'శరణం అయ్యప్ప' అనే మంత్రం మాల వేసుకున్న భక్తులు మనసా – వాచా స్మరించే వేదమంత్రం. నిష్టగా వుండే ఒక మండలం రోజులలో – కనీసం ఒక పది



వేల సార్లయినా ఈ నామాన్ని స్మరించి తీరాల్సిందే. అయ్యప్పస్వామి శైవ వైష్ణవ మత సమన్వయ స్వరూపుడు. 'స్వామియే శరణం అయ్యప్పా' అని ఎలుగెత్తి సర్వ కాలాలలోనూ ప్రార్థిస్తుంటే ఆ నామంలోని మహాశక్తి తనంత తానే మనల్ని రక్షిస్తుంది. శబరిగిరి క్షేత్రాన్ని తలుచుకున్న చాలు, మన జన్మ ధన్య మౌతుందని మహర్షులు చెప్పారు. అయ్యప్ప దీక్షను స్వీకరించి, ఆ స్వామిని హృదయంపై ప్రతిష్టించుకుంటే చాలు, పరమ ప్రసన్నుడై అనుగ్రహిస్తాడు. పరమ మంగళ స్వరూపంగా, పరిపూర్ణ శుభాలను వర్షింపచేసే అయ్యప్పకు సమానమైన భావం ఈ సృష్టిలోనే లేదు.



'స్వామియే శరణం అయ్యప్ప' అనే నామస్మరణలోగల పరమార్థం ఏమిటంటే దేవుడైన నీ పాదాలను మేము మన స్ఫూర్తిగా శరణు కోరుతున్నామని. 'అన్యదా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ' అనే గీతోక్తి సూక్తికి అన్వయిస్తూ – స్వామీ అయ్యప్పా! ముక్తి మార్గాన్ని చూపే నీ పాదాలే తప్ప ఇతరమైనవేవీ మేము కోరడంలేదని తెలియజేస్తోంది. వేద వాక్యాలలోని శక్తులే శరణుఘోషలుగా అవతరించాయనే సత్యం భక్తి ద్వారా ముక్తిని పొందే అవకాశం ఒకే ఒక మానవ జాతికి కలదని చెప్పడంలో సందేహం లేదనడానికి నిదర్శనాలే అయ్యప్ప స్వామిపైగల భక్తి, శబరిగిరి యాత్ర, జ్యోతి దర్శనం, తద్వారా జీవన్ముక్తి. శబరి కొండపై వెలసిన శ్రీ అయ్యప్ప భగవానుని సన్నిధానం ఓ దివ్యసన్నిధానం అటువంటి సన్నిధానంలో అభయ హస్త వరదుడై, ఉపవిష్టుడై నటువంటి ఆ అయ్యప్ప స్వామి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించినంత మాత్రాననే, శుభప్రాప్తి కలిగించే పరమ పవిత్ర సన్నిధానం అది. మాటలు రాని వారికి–మాటను ప్రసాదించే సన్నిధానం. చూపులు లేనివారికి – చూపుల వెలుగునిచ్చే సన్నిధానం. మండలం రోజులు నిష్ఠతో నిర్మలులైవచ్చి తన వాకిట వేచి వుండే అసంఖ్యాక భక్తులతో – అలరారే దివ్యమైన సన్నిధానం అది.

స్వామియే శరణం అయ్యప్ప అనే ఘోషతో మార్మోగే సన్నిధానం. భగవన్మహిమలతో వెలుగొందుతున్న సన్నిధానం. సంతానం, సౌభాగ్యం, ఆరోగ్యం మొదలైన కోరిన వరాలనన్నీ తీర్చే సన్నిధానం. నిత్య బ్రహ్మచారిగా – సకల లోకబాంధవుడిగా ఈ జగత్తును కాపాడే శ్రీ అయ్యప్ప సన్నిధానాన్ని ఒక్కసారైనా చేరండి.

## 261. గురువందనమ్

***ఐ.*** *యస్య ప్రసాదా దహమేవ సర్వం*
*మయ్యేవ సర్వం పరికల్పితం చ*
*ఇత్థం విజానామి సదాత్మరూపం*
*తస్మాంఘ్రి పద్మం ప్రణతోస్మి నిత్యమ్*

ఎవరి అనుగ్రహంతో ఈ 'సమస్తం నేనే, నా లోనే ఈ సమస్తం కల్పించబడి వుంది' అని ఈ ప్రకారంగా సద్రూప ఆత్మ జ్యోతిని తెలుసుకుంటున్నానో, అటువంటి గురుదేవుల పాద పద్మములకు సదా ప్రణమిల్లుతున్నాను.

**ఋషిపంచమి :** మహర్షులకు నెలవైన పుణ్యభూమి మనది. ఎందరో మహనీయులు తమ నియమనిష్ఠలతో అకుంఠిత దీక్షతో తపస్సుచేసి, ఆధ్యాత్మిక సాధనలను

కావించి, తమ దివ్యానుభూతుల్ని భారతీయులకేగాక, యావత్ప్రపంచ మానవ కోటికి చాటిచెప్పి, అజ్ఞాన తపస్సునందు పడివున్న ప్రజానీకానికి జ్ఞానప్రకాశాన్ని అందించారు.

వశిష్ఠ, వాల్మీకి, విశ్వామిత్ర, వామదేవ, గౌతమ, అగస్త్య, భరద్వాజ, యాజ్ఞవల్క్య, వ్యాస, శుకాది ప్రాతః స్మరణీయులైన మహర్షులెందరో తమ బోధలతో ప్రజ మనస్సులలో పరమశాంతిని చేకూర్చి ధన్యులయ్యారు. హృషీకములను అనగా ఇంద్రియాల్ని జయిస్తేనే ఋషి అవుతారు. ఈ ఋషీశ్వరులు, మహర్షులు మానవ జాతి అభివృద్ధికి, సంతోషానికి అనేక విధాలుగా సహకరిస్తున్నారు. వశిష్ఠుడు శ్రీరామచంద్రుని కులగురువుగా వుండి ఆనాటి సంఘాన్ని నడిపించాడు.

విశ్వామిత్రుడు తన శక్తులను శ్రీరాముడికి ఇచ్చి సాంఘిక దుష్టశక్తుల్ని హతమార్చాడు. పరాశరుడు, వ్యాసుడు, శుక, జమదగ్ని, అత్రి, కపిలమహర్షులు మానవ జాతికి మహోన్నత ఉపకారాలు చేశారు.



కపిలుడు 'సాంఖ్యదర్పణం' అనే మానసిక తత్త్వాన్ని తెలిపే గ్రంథాన్ని రచించగా, పరాశరుడు జ్యోతిష్య నాడీగ్రంథాలు రచించారు. భరద్వాజ మహర్షి పుష్పక విమాన నిర్మాణం గురించి వ్రాశాడు. ఈ విధంగా ఋషీశ్వరులు మన కోసం ఎంతో సేవ చేశారు. ఈ మహర్షులలో సప్తర్షి మండలి అని ఒకటుంది. ఇది మన్వంత రానికో మారు మారుతూంటుంది. విష్ణువు, శివుడు, బ్రహ్మ, ఇంద్రుడు మొదలైనవారు ప్రతి మన్వంతరంలోనూ సప్తర్షి మండలిని నిర్ణయిస్తారు. అయితే ఒక్కోసారి ఈ సప్తర్షి మండలంలోనివారి సంఖ్య పెరుగుతూ వుండొచ్చు లేదా తగ్గనూవచ్చు.

మరీచి, అత్రి, అంగీరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వశిష్ఠుడు స్వాయంభువ మన్వంతరంలోని సప్త మహర్షులు. ఔర్వుడు, వశిష్ఠ పుత్రుడు, స్తంభుడు, కశ్యపుడు, పారుడు, బృహస్పతి, దత్తాత్రేయుడు, చ్యవనుడు, అత్రి, స్వారోచిష మన్వంతరంలోని మహర్షులు. వశిష్ఠ మహర్షి భార్యయైన ఊర్జయందు జన్మించిన ఏడుగురు వశిష్ఠులు ఉత్తమ మనువు కాలంలోని మహర్షులు. వీరికి హిరణ్య గర్భులనే పేరు కూడా వుంది. యదుధ్రుడు, వేదశిరుడు, హిరణ్యరోముడు, వర్జన్యుడు, ఊర్ధ్వబాహుడు, సత్యనేత్రుడు, దేవబాహుడు, అనేవారు రైవత మన్వంత

రంలోని సప్తర్షులు. భృగుడు, నభుడు, వివస్వంతుడు, సుధాముడు, విరజుడు, అతి నాముడు, నహిష్టుడు చాక్షుష మన్వంతరంలోని సప్త మహర్షులు. కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, వశిష్ఠుడు, జమదగ్ని వైవస్వత మన్వంతరంలోని సప్తమహర్షులు. పరశు రాముడు, వ్యాసుడు, ఆత్రేయుడు, దీప్తి మంతుడు, బృహుశృతుడు, భరద్వాజుడు, అశ్వత్థామ సూర్యసావర్ణిక మనువు కాలంలోని మహర్షులు. గౌతముడు, అజ రుడు, శరద్వంతుడు, కౌశికుడు, కాశ్య పుడు, ఔర్వుడు బ్రహ్మ సావర్ణిక మన్వం తరంలోని మహర్షులు. మేధాతిథి, వసువు, సత్యుడు, జ్యోతిష్మంతుడు, ద్యుతి మంతుడు, హవ్యవాహనుడు దక్షసావర్ణిక మన్వంతరంలోని మహర్షులు. ద్యుతి, తపస్వి, సుతవుడు, తపోమూర్తి, తపో ధనుడు, తపోనిధి, తపోధృతి, రుద్ర సావ ర్ణిక మన్వంతరంలోని మహర్షులు. భాద్ర పద శుద్ధ పంచమిని 'ఋషి పంచమి' అంటారు. ఈ రోజున ఋషులను స్మరించి అర్చించాలి. ఇంతవరకు తవ్వని, దున్నని నేలలో కందమూలాలను సేకరించుకుని తినడం శ్రేష్ఠమైనది.

## 2162. సంతుష్టాంతరంగుడు

**జ.** ఒకరోజు అక్బర్ చక్రవర్తి వేటకై అడ వికి వెళ్ళి అక్కడ ఒక ఋషిని చూసి, ఆయనతో మాట్లాడి, ఆ మాటలవల్ల ఆయనకెంత జ్ఞానముందో గ్రహించాడు. అయితే ఆ ఋషి దారిద్ర్యానికి బాధ

artist

పడుతూ "ఓ మహర్షీ మీ పేదరికాన్ని చూసి నాకు జాలి కలుగుతోంది. మీరు నగరాని కొస్తే మీకొక మంచి భవనాన్ని ప్రసాదిస్తాను. అందులో సుఖంగా వుండ మని" కోరాడు. అప్పుడా ఋషి చిరు నవ్వుతో "ఈ మనోహరమైన అరణ్యం కంటే, ఈ అరణ్యంలోవుండే కొండ గుహల కంటే, నీ పట్టణాలుగాని, నీ భవనాలు గాని, నాకు సుఖాన్ని ఇవ్వలేవు. కనుక ఇటువంటి సుఖాన్ని విడిచిపెట్టి నీ పట్ట ణంలో ఎందుకుండాలి" అని అడిగాడు. అందుకా చక్రవర్తి "అయితే ఈ పట్టు వస్త్రాలనైనా ధరించమని" వేడుకొనగా "రాజా నాకీసహజమైన చర్మ వస్త్రా లుండగా తిరిగి దీనిపై మరియొక వస్త్రం ఎందుకు చుట్టుకోవాలి" అని అడిగాడు. అప్పుడా రాజు "స్వామీ! మీరు నీరు తాగేందుకు ఈ బంగారు పాత్రనైనా తీసుకొనుము" అని ప్రార్థించగా "రాజా నీరు తాగేందుకు దోసిలి చాలదా. మరి యొక పాత్ర అవసరమేమిటి" అని అడి

గాడు ఋషి. అప్పుడు రాజు "ఓ ముని శ్రేష్ఠా! మీరు శయనించేందుకు ఈ మెత్తని పరుపు స్వీకరించమ"ని ప్రార్థించెను. "ఓ రాజా! పట్టువలె వున్న ఈ మెత్తని పచ్చిక వుండగా మరో పరుపు ఏల" అనడిగాడు ఋషి. అలాగైతే "ఋషిశ్రేష్ఠా! మీరు నిత్యం భుజించేందుకు ఈ సామాగ్రినైనా తీసుకొండ"ని వేడుకున్నాడు రాజు. ఋషి "రాజా! ఈ అరణ్యంలో అనేక ఫలము లుండగా, నాకెందుకివి" అనగా ఆ మహా నుభావుని భక్తిజ్ఞాన వైరాగ్యాలకు రాజు అమితాశ్చర్యాన్ని పొంది, "ఆహా! ఆయన కదా నిజమైన సంతుష్టాంతరంగుడు" అని తలచుకుంటూ ఇంటిముఖం పట్టాడు.

## 263. శని త్రయోదశి

**జ.** త్వష్ట ప్రజాపతి తన కూతురు సంజ్ఞా దేవిని సూర్యునికిచ్చి వివాహం చేయగా, సూర్యుని కిరణాల వేడిమిని భరించలేక తన ఛాయ అనగా నీడకు ప్రాణం పోసి భర్త వద్ద వదిలి తాను తన తండ్రివద్దకు వెళ్ళిపోతుంది. ఈ ఛాయాదేవి, సూర్యుని కుమారుడే శనీశ్వరుడు. ఈయన విభవ నామ సంవత్సరం, మాఘమాసం కృష్ణపక్ష చతుర్దశి తిథియందు ధనిష్ఠా నక్షత్రంలో జన్మించాడు. ఈయన కుడిచేతిలో దండం, ఎడమ చేతిలో కమండలాలు ఉంటాయి. హరిశ్చంద్రుడు, నలుడు, పురుకుత్సుడు, పురూరవుడు, సగరుడు, కార్తవీర్యార్జునుడు వీరంతా శని మహిమ వల్ల అనేక కష్టనష్టాలను పొంది చివరకు శని కృపాదృష్టితో ఆనందాన్ని పొందారు.



శనీశ్వరుడు విష్ణుమూర్తికి తోడల్లుడు. సూర్యుని కుమారుడు, యమధర్మరాజుకి సోదరుడు, యమునా నదికి సోదరుడు, గ్రహాలకు యువరాజు వంటివాడు.

ఆంధ్రప్రదేశ్‌లోని మందపల్లి, మహా రాష్ట్రలో శనిశింగణాపూర్, తమిళనాడులో తిరునళ్ళార్ శని క్షేత్రములు. అయితే పూర్తి వాస్తుతో అతిశక్తివంతమైన 7వ శతాబ్దం నాటి క్షేత్రం పాండిచ్చేరిలోని తిరున ళ్ళార్‌లో వుంది. శని ప్రభావం వల్ల నల మహారాజు వస్త్రాలను పక్షి ఎగుర వేసుకు పోయే దృశ్యాలు ఈ క్షేత్రంలో కన్పిస్తాయి. నలమహారాజును, శని విముక్తి చేసే చిత్రాలు అక్కడ కన్పిస్తాయి. భక్తులు నూనెతో స్నానంచేసి ఆ తర్వాత అక్కడి చెరువులో స్నానం చేసినా ఎక్కడా జిడ్డు కనిపించదు. లక్షలాదిమంది స్నానం చేసే ఆ చెరువులో జిడ్డు కనిపించకపోవడమే అక్కడి విశేషం.

ఈ పవిత్ర క్షేత్రంలో బంగారు కాకిపై శనీశ్వర దేవునికి ఊరేగింపును చేస్తారు. ఇచ్చట ఈ స్వామి వారి భార్యల పేర్లు నీలా దేవి, మంగాదేవి. ఈ స్వామి పడమర దిక్కుగా వుంటాడు. శింగణాపూర్, మందపల్లి, నర్సిం గోల్, విజయవాడ, జాల్నా, పావగఢ్, వైదీశ్వరన్ కోయిల్‌లలోని దేవాలయాలన్నీ శనీశ్వర దేవాలయాలలో ప్రఖ్యాతి

గాంచినవి. శని త్రయోదశి పర్వదినాలలో మందవల్లిలోని శ్రీమందేశ్వర స్వామి వారికి శనిదోష పరిహారార్థం తైలాభిషే కాలు చేసుకుంటే శనిదేవునివలన కలిగే సమస్త దోషాలు నివారించబడతాయని స్కంధ పురాణంలో చెప్పబడింది.

## 264. ఆయన కోరేది భక్తి

**జ.** భగవంతుడి కరుణ ఎవరిమీద ప్రసరి స్తుంది. ఏ అర్హత కలవారు ఆయన అను గ్రహానికి పాత్రులవుతారు. మనిషి కులం, భాష, వయసులను పరిగణనలోకి తీసు కుంటాడా! పండితులమీద దయ ఎక్కువ చూపుతాడా? డబ్బులున్నవారికి, దేవా లయాలు నిర్మించినవారికి, ప్రత్యేకంగా పూజలు చేయించేవారికి, వృద్ధులకు, స్త్రీలకు, పిల్లలకు ప్రత్యేకంగా ఆయన కృప అందుతుందా? ఇటువంటి సందేహాలు ఎన్నో కలగవచ్చు.



కాని నిజానికి భగవంతుడు అవేవీ కోరడు. ఆయనకు కావాల్సింది భక్తి. నిరు పేద భక్తుడు దేవాలయం ముందు నిల బడి అక్కడికి వచ్చే ఇతర భక్తులకు సహాయపడటం వంటి భగవత్ సేవ చేయడం ద్వారా భగవంతుని చేర గలుగు తాడు. అటువంటి భక్తిభావం ప్రదర్శించ గలగడమే భగవంతునికి ఇవ్వగలిగిన నైవేద్యం.

## 265. దేవుని మందిరం

**జ.** ఈ శరీరం సామాన్యమైనది కాదు. ఆత్మ దేవుని మందిరం. భగవంతుడు ఊరేగే దివ్యరథం. రథం లోపల రథికుడు న్నట్లుగా శరీరమనే రథంలో జగన్నాథుడు వెలసి ఉన్నాడు. కనుక బయట దూరంగా వెదికి, వెదికి వేసారేకంటే, అతి సమీ పంలోగల శరీరంలోని దైవాన్ని వెదికి పట్టుకొని ధన్యత చెందడం శ్రేయస్కరం.

పైగా మానవ శరీరంలో ఓ విశిష్టత వుంది. అదే బ్రహ్మావలోకధిషణము. అంటే మానవ మేధస్సులో పరబ్రహ్మను ప్రత్యక్షంగా సాక్షాత్కరించుకునే శక్తి సామ ర్థ్యాలున్నాయి. ఇతర దేవతా శరీరాలకు గాని, పశుపక్ష్యాది శరీరాలకుగాని, సృష్టిలో వున్న ఎనభై మూడు లక్షలపైన గల ఇతర దేహాలకుగాని అటువంటి ప్రజ్ఞా విశేషం లేదు. కొద్దికొద్దిగా పుణ్యమనే మూల్యాన్ని చెల్లించిన వారికి, ఈ సంసార సముద్రాన్ని దాటేందుకు చిన్నచిన్న పడ వలను భగవంతుడు ప్రసాదించాడు.

కానీ మానవుడు అలా కాదు. 'మహతా పుణ్య పుణ్యేన' అన్నట్లు గొప్ప పుణ్యమనే ఖరీదును చెల్లించినందువల్ల అతనికి మానవ దేహమను సర్వ సౌకర్యాలతో కూడినటువంటి, సంసార దుఃఖాంబుదిని అవలీలగా దాటవేసేందుకు, శక్తి వంత మైన దివ్యనౌకను ప్రసాదించాడు. అటు వంటిది లభించినపుడు ఇక మానవుడు ఇతర వ్యాపకాలను తగ్గించుకొని, లేక కట్టిపెట్టి, అతి ముఖ్యమైన ఈ దైవ సాక్షా త్కారరూప ప్రధానతయందే హృదయ చిత్తుడు కావాలి. తిరిగి ఇటువంటి అవ కాశం మరోసారి లభించుట అనేది కడు దుర్లభము.

**మాతర్మే మధుకైటభఘ్ని మహిష ప్రాణా పహారోద్యమే ।**
**పేలా నిర్మిత ధూమ్రలోచన వధే, హే చండ ముండార్దిని ।**
**నిశ్శేషీకృత రక్తబీజ దనుజే । నిత్యే । నిశుం భాపహే ।**
**శుంభ ధ్వంసిని సింహరాశు దురితం దుర్గే। నమస్తేంబికే !**

అంబికా! దుర్గా! మధుకైటభ చండ ముండాది శుంభ నిశుంభులను రాక్షసు లని చంపినదానవు, ధూమ్రలోచనుని వధించిన దానవు, మహిషాసుర మర్దన సమయంలో ఎర్రనైన కన్నులుగల దానవు, నిత్యమైన దానవు, పాపాలను పోగొట్టే ఓ తల్లీ నీకు నమస్కారము.

## ౨౬౯. శక్తిని ఆరాధించే మాసం

**జ.** ఆశ్వయుజ మాసమంతా శక్తిని ఆరా ధించే మాసం. ప్రథమ నక్షత్రం అశ్వనీ యుక్త పూర్ణిమ కారణంగా ఈ మాసం ఒక లెక్కలో ప్రథమ మాసం. ఈ ఆశ్వ యుజమాసంలో ప్రత్యేకమైనవి నవ రాత్రులు. శరత్కాలంలో వచ్చే రాత్రులు కనుక వీటికి శరన్నవరాత్రులు అని పేరు. దేవీ ఆరాధనా ప్రధానమైనవి కనుక దేవీ నవరాత్రులనీ పిలుస్తారు.

అమ్మవారికి మహిషాసురునికి జరిగిన యుద్ధంలో రోజురోజుకు అమ్మవారు విజృంభిస్తూ మహిషాసురుణ్ణి తొమ్మిదవ రోజు రాత్రి సంహరిస్తుందని దేవీ భాగవ తంలో చెప్పడం జరిగింది. కనుకే ఈ తొమ్మిదిరోజులు అమ్మవారిని పూజి స్తారు. ఆఖరిరోజైన 9వ రోజున అమ్మ వారిని 'మహిషాసురమర్దని'గా అలంక రించి పూజిస్తారు. అమ్మవారి ఈ విజ యాన్ని పురస్కరించుకుని సంతోషంతో ఆ మరుసటిరోజు చేసుకునే పండుగే 'విజయదశమి'.



మహిషాసురమర్దని కథలోని మహిషా సురుడు, అతని పరివారం – మనలో వుండే అజ్ఞాన భావాలకు, అసుర గుణా లకు ప్రతీకలన్నమాట. అమ్మవారు, అమ్మ

వారి పరివారం – జ్ఞాన సంపర్కభావాలకు, దైవీ గుణాలకు సంకేతాలన్నమాట. అసుర గుణాలమీద – దైవగుణాలు, అజ్ఞాన భావాలమీద జ్ఞానభావాలయొక్క విజయాధిపత్యం తెలియజెప్పడమే ఈ కథలోని అంతరార్థం.

శుక్లపాడ్యమి నుండి మహానవమి వరకు ఈ నవరాత్రులలో పూజదే ప్రధానం. ఉపవాసాలు, ఏకభుక్తం, నక్తం, స్తోత్ర జపాదులు వారివారి నియమానుసారం చేస్తారు. ఉపదేశమైన శక్తి మంత్రాలను జపించడం, స్తోత్రాలను పారాయణ చేయడం, కలశాదులతో పూజించడం చేయాలి.

ఆశ్వయుజమాసం – సూర్యుడు కన్యా రాశిలో వుండగా ప్రారంభమవు తుంది. అందుకే ఈ మాసంలో సూర్యోదయ సమయానికి కన్యారాశికూడా తూర్పు దిక్కున సూర్యునితో పాటు ఉదయిస్తుంది. సాయంకాలం సమయానికి పడమటి దిక్కు ప్రాంతానికి ఈ కన్యారాశి, ఆ రాశిలోకి సూర్యుడు చేరతారు. ఈ కన్యా రాశికి ముందే 'సింహరాశి' ఆ పడమటి దిక్కుకు చేరుతుంది. అప్పుడా దిక్కు వద్ద సింహరాశిపై కన్యారాశి వున్నట్లు కనబడు తుంది. అలా ఉన్నప్పటి స్థితి అమ్మవారు సింహాన్ని అధిష్టించిన స్థితిని తెలియజేస్తుంది.

ఈ ఆశ్వయుజమాసంలోని శుక్ల పక్షంలో ప్రతిరోజూ సాయంకాలం నుండి సింహరాశిపై కన్యారాశి ఆధిపత్యం వుండటంవల్ల, సింహరూఢియై – మహిషాసురునితో తొమ్మిదిరోజులు యుద్ధంచేసి



సంహరించడంవల్ల ఈ నవరాత్రులలో అమ్మవారిని పూజించి, విజయదశమి నాడు పండుగ జరుపుకోవడం సంప్రదాయం. ఈ పండుగను విజయదశమి అని పిలవడానికి కొన్ని కారణాలున్నాయి. రావణుడి మీదకి రాముడు యుద్ధానికి వెళ్ళినరోజు గనుక విజయదశమి అని, మహిషాసురుడనే రాక్షసుణ్ణి పరాశక్తి అయిన దేవి సంహరించినది కనుక దీన్ని విజయదశమి అని, అజ్ఞాతవాసంలో వున్నప్పుడు జమ్మిచెట్టుపై వున్న ఆయుధాలను తీసుకుని విజయుడు తన శత్రువుల మీదకు యుద్ధానికి వెళ్ళినరోజు కనుక విజయదశమి అయిందని చెబుతారు. విజయదశమి రోజున అపరాజితాదేవితో ఆదిశక్తిని ఆరాధిస్తారు. అపరాజిత అంటే ఓడించరానిది అని అర్థం. అందుకే ఈ రోజు అపరాజితాదేవిని కొలిచిన వారిని ఎవరూ ఓడించలేరు. విజయాలన్నీ వారివే. విజయదశమి రోజున ఏ పని ప్రారంభించినా ఆ పని విజయవంతమవుతుం

దన్న ప్రగాఢ విశ్వాసంతో ముఖ్యమైన పనులన్నీ ఆ రోజే ప్రారంభిస్తారు. ఇలా ఎన్నో విశిష్టతలు కలిగిన పండుగ విజయదశమి.

## 267. జ్ఞానజ్యోతి

**జ.** ప్రహ్లాదునికి – నారదుడు ; ఆంజనేయునికి –సీతారాములు; అర్జునునికి – కృష్ణుడు; సిద్ధయ్యకు–బ్రహ్మంగారు; వివేకానందునికి – రామకృష్ణ పరమహంసలాగా సద్గురువులు దొరకడం అనేది జన్మజన్మల పుణ్యమని భావించాలి. కొంతమంది సాధకులు గురువుల కోసం ఎంతగానో అన్వేషిస్తుంటారు. కొంత మంది గురువులు శిష్యులను వెదుకుతూ వస్తారు.

గురువులు ఏడు రకాలుగా వుంటారు. చదువు చెప్పేవారు – సూచిక గురువులు; కులధర్మాలు, ఆశ్రమ ధర్మాలను బోధించేవారు–వాచిక గురువులు; మహా మంత్రాలను ఉపదేశించేవారు – బోధక గురువులు; వశీకరణ, మారణ, ప్రయోగాలు నేర్పేవారు – నిషిద్ధ గురువులు; విషయ భోగాలమీద విరక్తి కలిగించేవారు – విహిత గురువులు; జీవబ్రహ్మైక్యాన్ని బోధించేవారు – కారణ గురువులు; జీవాత్మ పరమాత్మ ఒక్కటే అని ప్రత్యక్షానుభవాన్ని కలిగించేవారిని–పరమగురువులుగా విభజించారు. ఇక మరొక విధానం వుంది. అది ఉపవాస దీక్ష. గురువు శిష్యుని తాకినంత మాత్రం చేతనే శిష్యునికి శక్తి వస్తుంది. దీన్ని స్పర్శదీక్ష అంటారు. గురువు దూరంగా వున్నప్పటికీ శిష్యుని



ఉద్ధరణకోసం ధ్యానం చేస్తుంటాడు. దీన్ని ధ్యాన దీక్ష అంటారు. కంటిచూపుతోనే శిష్యుడు పవిత్రుడయ్యేందుకు గురువు తన దృష్టిని సారిస్తాడు. దీన్ని దృగ్దీక్ష అంటారు. గురువు శిష్యుడికి ధర్మసూత్రాలు చెప్పి దీక్ష ఇస్తాడు. దీన్నిమంత్ర దీక్ష అంటారు.

## 268. తత్త్వబోధ

**జ.** బుద్ధం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి

ఇంద్రియాలను జయించినవాడు మహా తత్త్వజ్ఞాని అయిన బుద్ధుడు జ్ఞానోదయానికి పూర్వం సిద్ధార్థుడిగా వున్నప్పుడు ఎన్నో జీవసత్యాలను తెలుసుకున్నాడు. అప్పట్లో ఆయననో దృశ్యం బాగా ప్రభావితం చేసింది. ఆయన సత్యశోధకుడై నిరంతరాన్వేషియై తిరుగుతుండగా ఓ రంగు రంగుల పిట్ట తన బుల్లి తోకను ఓ నదిలో ముంచి నీళ్ళను విదిలిస్తోంది. ఆయనకది ఆశ్చర్యమనిపించి ఏం చేస్తున్నావని అడుగుతాడు. ఈ నది పొంగి నా పిల్లల్ని ముంచివేసింది నాకు గర్భ శోకాన్ని కలిగించింది. అందుకే ఈ నది



లోని నీటిని పారబోసి ఎండగట్ట దలుచుకున్నానని చెబుతుంది. "నీ ఈ చిన్న తోకతో ఎన్ని చుక్కల నీళ్ళను తోడగలవు. ఈ నది ఎప్పటికి ఎండుతుంది? నీవిలా చేస్తే యుగాలు పడుతుంది ఆ నీళ్ళను తోడటానికి. ఈ లోపు నీ ఆయుష్షు పూర్తవుతుంది" అన్నాడు.

అది విన్న ఆ పక్షి కోపంతో "ఆ విషయం నాకు తెలియదు. నేను బతికి వున్నంత కాలం నేనీ నదిని తోడేసి విజయాన్ని సాధిస్తాను. ప్రస్తుతం నా లక్ష్యం ఇదే" అని చెప్పేసరికి బుద్ధుడి మనసులో అలజడి మొదలవుతుంది. ఒక పక్షి తన చిన్న తోకతో లక్ష్యాన్ని సాధించాలనుకున్నప్పుడు మనిషి మాత్రం తన లక్ష్యాలను ఎందుకు నెరవేర్చుకోలేకపోతున్నాడు? మహత్కార్యాలను ఎందుకు సాధించలేక పోతున్నాడు? అలాగే నేనూ సాధించి తీరాలి. తత్త్వదర్శనం చేయాలి అనుకుని బోధి వృక్షంకింద తపస్సు చేసి జ్ఞానోదయాన్ని పొందుతాడు.

## ౨౬౨. శనైశ్వర స్తుతి

**ఌ.** *నమః కృష్ణాయ నీలాయ*
*శిఖిఖండ నిభాయచః*
*నమో నీల మధూకాయ*
*నీలోత్పల నిభాయచ ॥*

కృష్ణస్వరూపుడు, నీలవర్ణుడు, నిప్పు తునకతో సమానుడు, నల్లని ఇప్ప పూవు వంటివాడైన శనీశ్వరునికి నమస్కారం.

## ౨౭౦. శివస్తుతి


**ఌ. ప్రాతః స్మరామి భవభీతి హరం సురేశం**
**గంగాధరం వృషభ వాహన మంబికేశం**
**ఖట్వాంగ శూల వరదాభయ హస్తమీశం**
**సంసార రోగహరమౌషధ మద్వితీయమ్!**

సంసార భయాన్ని హరించేవాడు, దేవతలకు కూడా ప్రభువైనవాడు, గంగను ధరించినవాడు, వృషభమును వాహనంగా కలిగినవాడు, అంబికాపతి, ఖట్వాంగం, త్రిశూలం, వరద, అభయ ముద్రలు నాలుగు చేతులయందు కలవాడు, సంసార రోగమును హరించుటకు అద్వితీయమైన ఔషధ రూపుడైన ఈశ్వరుని నేను స్మరిస్తున్నాను.



## ౮౭౧. భగవంతుని స్వరూపం

**జ.** గోవు భగవంతుని స్వరూపం. 'గోష్టాష్టమి' అనగా ఈ అష్టమి రోజు గోవును పూజ చేస్తే సకల సంపదలు కలుగుతాయి. మనకు గోమాత అత్యంత పవిత్రమైనది. పూజనీయమైనది. స్వప్నంలో గోవు ఎదురొస్తే చేయబోయేపని విజయవంతమౌతుంది అంటారు.



గోవు భగవంతుని స్వరూపం. గోమాతను మించిన సాధు జంతువు ఈ సృష్టిలో మరొకటి లేదు. ప్రశాంతతకి, స్వచ్ఛతకి, నిర్మలతకు, పరోపకారానికి, ఉన్నతవ్యక్తికి, గౌరవానికి, అందానికి గోమాతని మించింది లేదు. అందుకే గోమాతని పూజించడం అంటే స్వయంగా ఆ భగవంతుని పూజించడమేనని అర్థం.

## ౮౭౨. యోగీంద్రుడు

**జ.** మహర్షులలో అత్యంత విశిష్టుడు యాజ్ఞవల్క్యుడు. ఈయన బాష్కలునివద్ద ఋగ్వేదము, జైమిని వద్ద సామవేదము, ఆరుణి వద్ద అధర్వణవేదము అభ్యసించాడు. వైశంపాయనుని వద్ద యజుర్వేదాధ్యయనం చేశాడు. ఓ రోజు తాను నేర్చిన విద్యలతో గురువుకే ఎదురు తిరగడంతో, గురువైన వైశంపాయనుడు "నా

artist


వద్ద నేర్చిన విద్యను ఇక్కడేకక్కి ఈ ఆశ్రమాన్ని వదిలి పో" అని కఠినంగా పలకడంతో, వెంటనే తాను నేర్చుకున్న విద్యను రుధిరరూపంలో కక్కి వెళ్ళిపోయాడు. ఆ కక్కిన పదార్థాన్ని బత్తిరి పక్షులు తిని, తిరిగి అవి పలుకగా ఉపనిషత్తులయ్యాయి. అవే తైత్తిరీయోపనిషత్తులుగా ప్రసిద్ధి చెందాయి. ఆ తరువాత యాజ్ఞవల్క్యుడు సూర్యుడ్ని ఆరాధించి శుక్లయజుర్వేదాన్ని గ్రహించి గురువు కన్నా గొప్పవాడయ్యాడు. సరస్వతీదేవిని ఉపాసించి సమస్త విద్యల్ని అతను సాధించగలిగాడు.

ఓసారి జనక మహారాజు యాగం చేయ సంకల్పించి మహర్షులందరికీ ఆహ్వానం పలికాడు. యాజ్ఞవల్క్యుడికి కూడా జనకమహారాజు ఆహ్వానం అందింది. శృంగాలకు సువర్ణ శకలాలతో అలంకరించబడిన వేయి ధేనువులను తెప్పించాడు జనక మహారాజు. క్రతువుకు హాజరైన వారందరి ఎదుట

నిలబెట్టాడు. ఇక్కడ చర్చలో ఎవరైతే మిగతావారిని ఓడించగలరో అతనికే వేయిధేనువులను బహుమానంగా ఇస్తాను" అని పలుకుతాడు. వెంటనే తన శిష్యులతో ఆ కామధేనువులను తోలుకు వెళ్ళమని చెబుతాడు యాజ్ఞవల్క్యుడు. సభలోని వారంతా మౌనంగా ఊరుకుంటారు. ఆయన్ని ఎదుర్కొనే ధైర్యం ఎవరికుంది? అప్పుడు ఆ సభలో వున్న గార్గి అనే యువతి అందరిలో నుండి ముందుకు వచ్చి ఆయన్ని ఎదిరిస్తుంది. "ఓ మహర్షీ! స్వర్గానికి ఆవలిదీ, భూమికి కింద వున్నదీ ఏదో చెప్పండి. స్వర్గానికీ భూమికీ మధ్య ఏముంది? భూత భవిష్యద్వర్తమానాల్లో వున్నదేంటో చెప్పండి?" పండితులంతా అయోమయంలో పడ్డారు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు ఇలా పలికాడు. "ఆకాశం సర్వవ్యాపనత్వం ద్వారా నాడు, నేడు, రేపులు ఏదైతే వుంటుందో దాని ద్వారా" అంటూ సమాధానమిచ్చాడు."మరి ఆకాశం కన్నా సూక్ష్మతరమైనది, అంతటా వ్యాపించేదీ ఏది" అంటూ తిరిగి ప్రశ్నించింది. "అదే పరమాత్మ స్వరూపం. సృష్టి స్థితి కారకుడు సర్వాంతర్యామి, ఆద్యంతరహితుడైన సర్వ వ్యాపకుడు మానవుని హృదయంలో అజరామరమైన, బాధాతీతమైన, అంత రాంత రాత్మ స్వరూపమూ ఇదే" అని చెప్పేసరికి పండితులంతా కరతాళ ధ్వనులు చేయగా తన గెలుపు అసాధ్యమని ఓటమిని అంగీకరించింది గార్గి. గార్గి శిష్యురాలు మైత్రేయి, కాత్యాయని అనే యువతులు యాజ్ఞవల్క్యమహర్షికి భార్యలవుతారు. ఋషులంతా కలిసి యాజ్ఞవల్క్యునికి మాఘ శుద్ధ పౌర్ణమినాడు యోగీంద్ర పట్టాభిషేకం చేస్తారు. ఆయన ఋషులందరికీ తెలియజేసిన విషయాలే యోగ శాస్త్రమని, యోగ యాజ్ఞవల్క్యమని ప్రసిద్ధి చెందాయి.

## ***873. మేలుకో నారాయణా!***

**జ.** ఈ ఏకాదశిని ఉత్థానైకాదశి అనీ, చిల్కు ఏకాదశి అనీ అంటారు. ఈ రోజు శ్రీ మహావిష్ణువు శేషతల్పంపై నుండి మేల్కొం



టాడు. కనుకే దీనిని 'ఉత్థానైకాదశి' అన్నారు. మహాభారత యుద్ధసమయంలో భీష్ముడు యుద్ధంచేసి, అంపశయ్యా చేరిన రోజూ ఇదే. కనుక దీనిని భీష్మైకాదశి అని కూడా పిలుస్తారు. చాతుర్మాస్యవ్రత సమాప్తి కూడా ఇదే రోజు జరుగుతుంది. ఈ రోజు తోచిన విధంగా యథాశక్తిన దానంచేస్తే విశేషమైన ఫలితాలు కలుగుతాయి. విష్ణు సహస్రనామ పారాయణ చేయడం చాలా ఉత్తమం.

**కార్తికదీప స్తుతి:**

**దీపాయ బ్రహ్మరూపాయ**
**విష్ణురూపాయతే నమః**
**రుద్రరూప నమస్తుభ్యం**
**దీపరూపాయతే నమః**

బ్రహ్మరూపం, విష్ణురూపం, రుద్ర రూపం కలిగిన ఓ దీపమా నీకు నమస్కారం.

## 874. వనాల నుండి ఎంతో నేర్చుకోవాలి

**జ.** వాటంతట అవిగా పెరిగిన చెట్ల సమూహాలే వనాలు. భూమిలోపలి పొరలో ప్రవహించే నీటిని సమానంగా పంచుకుని వనంలోని వృక్షాలన్నీ బతికేలా ఐకమత్యంతో వుంటాయి. నా పక్కన



ముళ్ళచెట్టు వుందని గంధపు చెట్టు అనుకోదు. 'ఇది విషపు చెట్టు" అనే అసహ్యంతో పూల తీగె పాకకుండా వుండదు. ప్రతి చెట్టుకి సంబంధించిన వేరూ, కాండమూ, ఆకూ, పూవూ, కాయా, పండూ... ఏదో ఒక వ్యాధిని నయంచేసే ఓషధీ గుణం కలిగే వుంటుంది తప్ప ఏ చెట్టు జన్మా వ్యర్థం కానేకాదు. బ్రతికున్నంత కాలం ఓషధిగా, గాలి వీచే సాధనంగా పనిచేసి చనిపోయాక వ్యక్తికి వంట చెరకుగా పని చేసే ఉత్తమజన్మ కలది వృక్షం. వృద్ధీ క్షయం కలిగినదేదో అది వృక్షం.

## 875. సులభ పూజ

**జ.** అంతరంగంలో భగవంతుని చూడని భక్తులు బహిరంగంలో, తమకు ఇష్టమైన, బంగారు, వెండి, రాగి, ఇత్తడి మున్నగు వాటితో విగ్రహాలను, ప్రతిమలను నిర్మింపజేసుకొంటారు. ఆ విగ్రహాలను అమూల్యమైన ఆభరణాలతో, వస్త్రాలతో, అలంకరిస్తారు. కానరాని దేవుని ఆ విధంగా పూజించే సంప్రదాయం అనాదిగా సాగుతూ వుంది. కాంతులీనే దేవతా ప్రతిమలను పూజిస్తూ, యజ్ఞ యాగాదులను అత్యంత వైభవంగా జరిపి, భగవదనుగ్రహం కొరకు ఆరాధనోత్స వాల్లో తలమునకలవు తున్నారు. కృత యుగంలో భగవంతుడు ధ్యానంతో ప్రసన్నుడయ్యేవాడు, త్రేతాయుగంలో యజ్ఞ యాగాదులతో, ద్వాపరయుగంలో అర్చనలతో భగవంతుడు ప్రసన్నుడయ్యేవాడు. కలియుగంలో కేవలం నామస్మరణ వల్లనే భగవదనుగ్రహం ప్రాప్తమవుతుందన్నారు విజ్ఞులు.

'పత్రం, పుష్పం, ఫలం, తోయం యోమే భక్త్యా ప్రయచ్ఛతి' అన్నాడు ద్వాపరాంతంలో గీతాచార్యుడు.

"చతుర్విధాభజంతేమాం జనా సుకృతి
నోర్జున! ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీచ
భరతర్షభ"

భక్తులు నాలుగు రకాలుగా వుంటారు. వారు ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులు. కష్టాలు ఎదురైనపుడు, ఆపదలో భగవంతునికి మొక్కులు చెల్లించేవారు

ఆర్తులు. భగవత్తత్వాన్ని తెలుసుకో గోరే వారు జిజ్ఞాసువులు. భోగాలను, సంప దలను కోరేవారు అర్థార్థులు, ప్రపంచ మంతా వాసుదేవమయమని భావించే వారు జ్ఞానులు. కేవలం భక్తితో తప్ప ఆడంబరాలతో, భగవంతుడు ప్రసన్నుడు కాడు" అన్న వాస్తవాన్ని మనం మరువ రాదు. "నానా జనస్య శుశ్రూషా కర్త వ్యాకర మన్నితే" మన ఆధ్యాత్మిక సాధ నలో దీనజన సేవ ఒక ప్రధానాంశంగా వుంది. మానవసేవే మాధవసేవ అన డంలో అంతరార్థమిదే. అచేతన మైన ప్రతిమలను దేవతలని భావించడానికి బదులు చేతన ప్రతిమలైన అనాథ బాల లలో, దీనులలో కూడా భగవంతుడు వున్నాడని భావించినప్పుడు అతడు సంతృప్తి చెందుతాడు. మనంచేసే ప్రతి పనీ భగవదర్పణం కావాలి. ప్రత్యక్ష దైవా లయిన మాతాపితరులను, గురువులను, పెద్దలను, అతిథులను అభ్యాగతులను ఆదరించాలి... సేవించాలి. సుప్రసిద్ధులైన వైద్యులు, అధ్యాపకులు, న్యాయవాదులు, ఉన్నతోద్యోగులు, తమ వృత్తి ధర్మాన్ని వదిలి, యజ్ఞయాగాది క్రతువులలో నిమ గ్నులై, తమ కర్తవ్యాన్ని విస్మరిస్తే దేవుడు వారిని మన్నించడు. 'కార్యాచరణమే ఆరా ధన' అన్న ఉదాత్తభావంతో మన విధు లను నిర్వహించాలి. "కలవారు శివా లయంకట్టెదరు, నేనేమి సేయుదు బడుగ నయ్యా! నా కాలే కంబము, దేహమే దేవా లయం, తలయే పైడి కలశమయ్యా! కూడల సంగమదేవా, వినవయ్యా, స్థావరం చెడుగాని, జంగమం చెడదయ్యా" అన్నాడు బసవేశ్వరుడు. అణురేణు తరాకాష్ఠాలలో భగవంతుని పూజించే భక్తులు, నిత్య కర్మ లకు ఆధారాలైన ఇంద్రియాలను సర్వ సమర్పణ భావంతో పరమాత్ముని పూజిస్తూ ధన్యులవుతారు. భక్త కన్నప్ప తనకు సులు వుగా లభించిన వాటితో పరమశివుని పూజించి తరించాడు. రాత్రివేళ వెలిగించే



దీపం నీరాజనమని, మనం తిరిగి అలసి పోవడమే ప్రదక్షిణమని, పొరలి నిద్రిం చడమే వందనమని భావించి, అతనిని మెప్పించే సులభ పూజా విధానంతో బీద భక్తులు మోక్షమందు కోగలరు అన్నారు పరమ భాగవతోత్తములు, పురందర దాసులు.

## 976. వనంలో ఈ జంతువుల్ని వేటాడు!

**జ.** మా గచ్ఛ త్వ మిత స్తతో గిరిశ భో!
మయ్యేవ వాసం కురు స్వామిన్!
ఆది కిరాత! మామక మనః కాంతార సీమాంతరే!
వర్తంతే బహవో మృగా మదజుషో మాత్సర్య మోహాదయః
తాన్ హత్వా మృగయా వినోద రుచితా లాభం చ త్వం ప్రాప్స్యసి॥



ఆదిశంకరాచార్యులవారు శివానందలహరిలో రాసిన శ్లోకమిది. దీని భావం – 'ఆది కిరాతుడివైన శంకరా! ఎక్కడో మరెక్కడో వనాలు వున్నాయనీ అక్కడెక్కడో మృగాలు తిరుగుతూ వుంటాయనీ, వాటిని వధించాలనీ ఎందుకయ్యా అనుకుంటావు? నా హృదయమనే ఈ అడవిలో కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే మృగాలు జట్టుకట్టి ఇష్టం వచ్చినట్టు తిరుగుతూవున్నాయి. కాబట్టి, నా మాట విని నా హృదయాన్నే నీ వేటకి విడిది చోటుగా చేసుకో! దానివల్ల ఇద్దరికీ లాభం వుంటుంది. ఉభయతారకం కదూ!' అని.

## 977. ఆంజనేయ స్తుతి

**జ. యత్ర యత్ర రఘునాథ కీర్తనం
తత్ర తత్ర కృతమస్త కాంజలిమ్
భాష్పవారి పరిపూర్ణలోచనం
మారుతిం నమత రాక్షసాంతకమ్**

రామకీర్తన ఎక్కడ జరిగితే అక్కడ ప్రత్యక్షమై ఆనంద భాష్పాలతో అంజలి ఘటించేవాడు, రాక్షసులను సంహరించేవాడయిన హనుమంతునికి నమస్కారం.

## 978. మోక్షైకాదశి

**జ.** మార్గశిర మాసంలో వచ్చే ఏకాదశిని మోక్షైకాదశి లేదా వైకుంఠ ఏకాదశి అంటారు. మోక్షైకాదశి అంటే సూర్యుడిని పట్టిన ఆరునెలల చీకటి వదిలినట్టన్న మాట. 'మాసానాం మార్గశీర్షోహం' అని గీతాచార్యుడు మార్గశిరమాస వైశిష్ట్యం గురించి చెప్పడంవల్ల ఈ నెలలోని శుక్ల పక్షంలో వచ్చే ఈ ఏకాదశి ప్రాధాన్యత ఎక్కువగా వుంది. ఇది దాదాపు ఉత్తరాయణ ఆరంభకాలం. దీన్ని ముక్కోటి ఏకాదశి అని కూడా అంటారు. ముక్కోటి అంటే ముప్పై మూడు కోట్లకి సంగ్రహ రూప మన్నమాట. ముప్పై మూడు కోట్ల దేవతలు ఈ రోజు భూమికి దిగివస్తారు. దేవతలకు ఆరు నెలలు పగలు, ఆరు నెలలు రాత్రికదా! రాత్రి అయిన దక్షిణా

యనము వెళ్తుండగా చీకటిపోయి సూర్యుడు విముక్తుడు కాగా, దేవతలకు చీకటిపోయి వెలుతురులోకి వస్తారన్నమాట. అంటే వారికి పగలు ప్రారంభమైనదన్నమాట. విష్ణాలయాలలో ఈ రోజు ఉత్తరంవైపు వుండే ద్వారాన్ని తెరుస్తారు. దీనిని వైకుంఠ ద్వారమంటారు. తెల్లవారు ఝూమున ఈ ద్వారంగుండా వెళ్ళి దైవాన్ని దర్శించుకుంటే మోక్షమొస్తుందని భక్తుల నమ్మకం. వైష్ణవాళ్వారులలో ఒకరైన నమ్మాళ్వారు ఈ రోజునే పరమపదించి నందువల్ల వైష్ణవులు దీనిని విశేషంగా పరిగణిస్తారు. శ్రీరంగం, తిరుపతి మొద లైన వైష్ణవ క్షేత్రాలలో ఈ ముక్కోటి ఏకా దశిని గొప్ప ఉత్సవంగా చేస్తారు.

## ౨౭౨. కలిలో అయినా ధర్మమే

**జి.** అధర్మం పెరిగిపోయింది, ఇదంతా కలియుగ ప్రభావం అంటారు పెద్దలు. ధర్మ మార్గం వీడడం అనేది అన్ని యుగా లలో కనిపిస్తుంది. కాని ఏ కాలంలోనూ ప్రజలంతా ధర్మమార్గం వీడలేదు. యుగం ఏదైనా అధర్మ ప్రవర్తన ప్రదర్శించిన వారు న్నారు. కలియుగంలోకి వచ్చినా ధర్మ నిబద్ధతతో వ్యవహరిస్తున్న వారూ వున్నారు. కాబట్టి ధర్మ, అధర్మ స్థితులను గుర్తించి, అధర్మాన్ని అవతలికి నెట్టి ధర్మ బద్ధంగా నడుచుకోవడమనేది ఒక వ్యక్తి మానసిక స్థిరత్వం మీద ఆధారపడుతుంది.

ప్రతివ్యక్తి ధర్మంతో వ్యవహరిస్తే సమాజం ధర్మబద్ధంగా వుంటుంది. సమా జాలన్నీ ధర్మబద్ధతతో వున్నప్పుడు లోకం ప్రశాంతంగా వుంటుంది. అయితే నేటి సమాజంలో ఇతరులంతా ధర్మం తప్పి నపుడు నే ఒక్కడినే ఎందుకు మడికట్టుకు కూర్చోవాలి అని తమ అధర్మ ప్రవర్తనను సమర్థించుకునే వారి సంఖ్య పెరిగింది.

ఇది తమ పతనాన్ని తాము కొని తెచ్చు కోవడమే. అధర్మ ప్రవర్తకుల పాపాలు వారిని వెంటాడుతూనే వుంటాయి. సమయం చూసి కాటేస్తాయి.

## ౨౮౦. సకలాభీష్టసిద్ధికి హనుమద్వ్రతం

**జి.** హనుమంతుడు శివకేశవుల శక్తి స్వరూపుడు. కనుక ఈ మార్గశిర మాసంలో శుద్ధ త్రయోదశినాడు, మృగశిరా నక్ష త్రంలో ఈ వ్రతంచేస్తే కోరిన కోరికలన్నీ నెరవేరతాయి. మాఘ మాసంలో ఆర్ద్రా నక్షత్రం, ఫాల్గుణ మాసంలో పునర్వసు



నక్షత్రం, చైత్ర మాసంలో పుష్యమీ నక్షత్రం లేదా హస్తా నక్షత్రంలో గానీ, జ్యేష్ఠ మాసంలో మృగశిర, ఆర్ద్ర, పునర్వసు, పుష్యమి నక్ష త్రాలలోగాని హనుమద్వ్రతం చేస్తే పుణ్య ప్రదమని చెబుతారు. అయితే

ఈ మాసం శ్రీకృష్ణుడికి ఇష్టం కనుక ఈ మార్గశిర మాసంలో శుద్ధ త్రయోదశినాడు మృగశిరా నక్షత్రంలో ఈ వ్రతం చేయడం శ్రేష్ఠ మంటారు. ధర్మరాజు ఈ మాసంలో హను మద్వ్రతం చేసి తిరిగి రాజ్యాన్ని సంపాదించుకున్నాడు.

ఇదే నక్షత్రంలో ఈ వ్రతం చేసిన విభీష ణుని కుమారుడు నలుడు చింతామణి, కల్పవృక్షం, కామధేనువును ఇంద్రలోకం నుండి సంపాదించాడు. హస్తానక్షత్రం ఆదివారంరోజు వున్నట్లయితే ఆ రోజు ఈ వ్రతం చేసుకుంటే కీర్తిప్రతిష్ఠలను సంపాదించుకుని అజేయులౌతారు. అర్జు నుడు ఆ విధంగానే చేసి కౌరవుల్ని జయిం చాడు. నక్షత్ర పంచకంలో భీముడు ఈ వ్రతాన్నిచేసి మరింత బలశాలి అయ్యాడు. ఒక్కసారైనా ఈ వ్రతం చేసుకుంటే ఎంతో మంచిదని శాస్త్రాలు తెలియజేస్తున్నాయి.

## 281. దివ్యత్వము

**జ.** అనుకరణ మానవత్వం. సృష్టించుట దివ్యత్వం. కృత్రిమమై నటువంటి అను కరణ బలహీనులను గావిస్తున్నది. నీకూ ఓ హృదయముంది. రెండు కళ్ళున్నాయి. ఆత్మ వుంది. జీవితం వుంది. నీకూ ఒక ఆశ వుంది. నీ కళ్ళతో చూసి, నీ హృద యంతో అనుభవించి, నీ ఆనందం కోసం ప్రాకులాడాలికాని, పరుల కన్నుతో చూడడం, పరుల హృదయంతో యోచించుకోవడం, పరుల భావాలను అనుసరించడం ఇది కేవలం బలహీనత యొక్క లక్షణం.

## 282. సుబ్రహ్మణ్య స్తుతి

**జ. హేస్వామి నాథ కరుణాకర దీనబంధో**
**శ్రీ పార్వతీశ ముఖపంకజ పద్మబంధో**
**శ్రీ శాది దేవగణ పూజిత పాదపద్మ**
**వల్లీసనాథ మమదేహీ కరావలంబమ్।**



ఓ స్వామీ! కరుణాకర! దీన బంధూ! శివపార్వతుల తనయుడవై వల్లీదేవి సహితంగా దేవగణం చేత పూజలం దుకుంటున్న ఓ సుబ్రహ్మణ్యేశ్వరా నన్ను కాపాడవలసిందిగా కోరుతున్నాను.

## 283. అభయ స్వరూపుడు

**జ.** పరమేశ్వరుని కుమారుడైన కుమార స్వామినే స్కంధుడని, సుబ్రహ్మణ్యేశ్వరు డని, కార్తికేయుడని, సుబ్బరాయుడని పిలుస్తారు. సుబ్రహ్మణ్యేశ్వరుడు జన్మిం చిన షష్ఠినే సుబ్రహ్మణ్య షష్ఠి అంటారు. ఈ రోజు ఉపవాసముండి సుబ్రహ్మణ్య పూజచేసి బ్రహ్మచారికి భోజనం పెట్టి వస్త్ర దానం చేస్తే ఆ ఇంటికి శుభం చేకూరు తుంది. జ్యోతులకే జ్యోతియై ఆత్మ స్వరూ పుడైన పరంజ్యోతి సుబ్రహ్మణ్యేశ్వరుడు.

పూర్వ మొకప్పుడు తారకాసురుడనే రాక్షసుడు బలగర్వితుడై దేవతల్ని బాధించే వాడు. దేవతలంతా బ్రహ్మవద్దకు వెళ్ళి తమ గోడు వెళ్ళబోసుకున్నారట. అప్పుడు బ్రహ్మ ఈ విధంగా చెప్పాడుట. మహేశ్వ రుడు తపస్సు చేస్తున్నాడు. ఆయన తపస్సు విరమించేటట్లు చేయండి. పార్వ తిని వివాహం చేసుకునే మార్గం చూడండి. శివపార్వతులకు పుట్టే బిడ్డ తారకాసురుణ్ణి సంహరిస్తాడని చెబుతాడు.

అప్పుడు పార్వతీదేవి శివుడికి సప ర్యలు చేస్తోంది. ఆ సమయంలో మన్మ థుడు శివునికి కామవికారం కలిగిం చాడు. శివుడు కోపించి తన మూడో నేత్రం తెరిచాడు. మన్మథుడు భస్మ మయ్యాడు. ఆ తరువాత తారకాసురవధ కోసం పార్వతిని వివాహమాడాడు.

సంభోగ సమయంలో ఆయన వీర్యం కిందపడగా దానిని అగ్ని గ్రహించి భరిం చలేక గంగలో వదిలేశాడు. గంగ ఆ తేజ స్సును భరించలేక ఆ వేడికి వుడికిపోతూ ఆవిరైపోతూ 'శరవణ' మనే పేరున్న ఓ తటాకంలోకి నెట్టేసింది. అక్కడే కుమార స్వామి జన్మించాడు. శరవణమున జన్మిం చుట వల్ల 'శరవణభవుడు' అని పేరొ చ్చింది. ఈ శరవణము కూడా ఈ బాలుని తేజస్సు భరించలేక రెల్లు పొదలోకి జార విడచుట వల్ల 'స్కంధు' డయ్యాడు. తేజః పుంజంగా కనిపిస్తూ చీకటిని హరిం చాడు. కాబట్టి 'గుహు'డయ్యాడు. స్త్రీ గర్భం నుంచి పుట్టని కారణంగా ఈయన



సుబ్రహ్మణ్యుడయ్యాడు. ఈ శిశువును ఆరుగురు తల్లులు కృత్తికలు రక్షించారు. కనుక షాణ్మాతురుడని, కార్తికేయుడని పిలిచారు. ఆ తరువాత ఆయనకి దేవ సేనాధిపత్య మిచ్చారు. స్కంధుడు తారకా సురుణ్ణి సంహరించాడు.

స్కంధుని పూజ అనగా సుబ్రహ్మణ్యా ఆరాధన రెండు వేల సంవత్సరాల ముందు నుండే వుంది. అనేక పురాణాలలో స్కంధుని గాథలున్నాయి. షణ్మతాలకి అధిపషణ్ము ఖుడు. కుండలినీ శక్తి జాగృతమై షట్చ క్రాల నుండి పైకి ప్రాకి అగ్నితత్త్వమైన సుషుమ్నా మార్గంలో ఉత్పన్నమయ్యే శక్తి షణ్ముఖుడు. కాలస్వరూపుడైన ఈ స్వామి ఆరు ఋతువులని ఆరు ముఖాలుగా కలిగిన అభయ స్వరూపునిగా వున్న షణ్ము ఖుని మనం అర్చిస్తాం.

## ***284. సుబ్రహ్మణ్యస్వామి ఆరాధనతో కుజదోష నివారణ***

**జ.** నవగ్రహాల్లో కుజునిది మూడవ స్థానం. ఈయన చతుర్భుజాలతో, ఎరుపు రంగుకలిగిన మేక వాహనంపై దక్షిణాభి

ముఖుడై, గదాశక్తిధారుడై వుంటాడు.

లోహితో లోహితాక్షశ్చ సామ గానం కృపాకరః
ధరాత్మజః కుజో భౌమే, భూమదో భూమి నందనః

ప్రతి మంగళవారం నవగ్రహాలు లేదా సుబ్రహ్మణ్య స్వామి గుడికెళ్ళి పై శ్లోకాన్ని భక్తితో పఠిస్తూ ఏడుసార్లు ప్రదక్షిణం చేసి, బెల్లం నైవేద్యం పెట్టి, రాత్రికి ఉపవాసం చేయాలి. ఈ ప్రకారం ఏడు నెలలు కానీ, ఏడు వారాలు కానీ, దీక్షతో చేసినట్లైతే సమస్త (అంగారక) కుజ దోషాలు పోయి, ఆయురారోగ్య ఐశ్వర్యాలు లభిస్తాయి. కుజ ప్రభావంవల్ల సంతానం కలగక పోయినా సంతానం నిలవక పోయినా సుబ్రహ్మణ్యా రాధన చేయాలి.

## ౨౬౫. ప్రజలు కోరుకునే సంవత్సరాది

**జి.** మనం ఎంతో అదృష్టవంతులం కాబట్టే, భారతీయమైన ఏ పండుగ గురించైనా చెప్పుకోగలిగినంత విశేషాన్ని కలిగి వున్నాం. 'ఎవరినో కూర్చోబెట్టి ఈ పండుగ నాడు ఏం చెయ్యాలని ప్రాచీనులు చెప్పారో దాన్ని ఆచరించుకుంటూ వెళ్ళిపోతుంటే మన వారసులు కూడా అదే పద్ధతిలో మనని అనుసరిస్తారు. చదువూ, ఉద్యోగం, ధనం, బుద్ధీ... ఇన్నిటిని మన సంతానానికి పంచుతున్న మనం, ఈ పండుగల సంప్రదాయాన్ని అందించకపోతే జాతికీ – పండుగలని ఏర్పాటు చేసిన మహర్షులకీ – విశేషించి కాలస్వరూపుడైన (కాలః కలయతా మహమ్) శ్రీహరికీ – అపచారాన్ని చేసినట్లూ–మనదాకా వచ్చిన సంప్రదాయనిధి వున్న భాండాన్ని మనమే నేల జార విడిచినట్లూ అవుతుంది. ఈ నేపథ్యంలో ఉగాది పండుగ విశేషాన్ని రెండు మాటల్లో అనుకుందాం !



**ధర్మమనే ఎద్దు :**

నాలుగు యుగాల్లోనూ మొదటిదైన కృతయుగాన్ని వైశాఖ శుద్ధ తదియనాడూ, త్రేతాయుగాన్ని కార్తీక శుద్ధ నవమినాడూ, ద్వాపరయుగాన్ని శ్రావణ శుద్ధ త్రయోదశి నాడూ ప్రారంభించిన పరమాత్మ కలి యుగాన్ని మాత్రం చైత్ర శుద్ధ పాడ్యమి నాడే ఎందుకు సృష్టించాట్ట? ఇక్కడే వుంది రహస్యం. కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలా నడుస్తుంది–మహాత్ములతో తపస్సే ధ్యేయంగా వుండే జనులతో వుంటుంది. ఈ యుగాది సృష్టికి పెద్ద మంచి ముహూర్తం అవసరం లేదు. ఈ యుగంలోని జనులకి ప్రతిక్షణమూ భయమే –ఎక్కడైనా ధర్మాన్ని తప్పి ప్రవర్తిస్తామేమో? అని. ఇక రెండవదైన త్రేతా యుగంలో ధర్మం మూడు పాదాలా నడు

స్తుంది. ఒక మహాత్ముడు ఆదర్శ పురుషు నిగా వుంటాడు (రాముడు). ఆయన్ని అందరూ ఆదర్శంగా తీసుకుని నడిస్తే చాలు. పరమాత్మ ఏ క్రమశిక్షణలో ప్రజల్ని వుంచాలో, ఆ బాధ్యతని ఇక్కడ ఓ మహా పురుషుడూ, పురుషోత్తముడూ (రాముడు) నిర్వహిస్తాడు కాబట్టి, ఈ యుగాన్ని కూడ పెద్ద ముహూర్తం చూసి సృష్టించాల్సిన పనిలేదనిపించింది భగవంతునికి.

ఇక మూడవదైన ద్వాపరయుగంలో (ద్వాపరమనే మాటకి సందేహం, అను మానం అని అర్థం) ధర్మం రెండు పాదాల మాత్రమే నడుస్తుంది. "ఈ వ్రతం వల్ల ఈ పని జరుగుతుంది – దీన్ని ఆచరించి ఫలాన వాడు ఈ ప్రయోజనాన్ని పొందా" డని పరమాత్మే రుజువునీ, సాక్ష్యాన్నీ చూపిస్తే తప్ప, ఏ పూజలూ, వ్రతాలూ ఈ యుగంలో సాగవు కాబట్టి పరమాత్మ ఈ యుగాదిని సృష్టించేప్పుడు కొంత శ్రమని తీసుకుని – మంచి ముహూ ర్తంలో–అంటే – శ్రావణ శుద్ధ త్రయోదశి నాడు సృష్టిని ప్రారంభించాడు. ఇంత జాగ్రత్తగా ముహూర్తాన్ని భగవంతుడే నిశ్చయించి సృష్టించినా కౌరవ పాండవ యుద్ధం, అన్యాయం, అధర్మం యుగం నిండుగా పరుచుకున్న తీరూ మనకి ఆశ్చ ర్యాన్ని కలిగించకమానదు.

ఇలా మూడు యుగాల సృష్టిలో అను భవాన్ని సాధించిన పరమాత్మ, కేవలం ఒకే ఒక్క పాదంతో ఈ కలియుగంలోని ధర్మవృషభం (ధర్మమనే ఎద్దు) వుంటుం



దని గ్రహించినవాడు – తన సృష్టిలో ఈ యుగంలో అందరూ వీలైనంత సుఖ శాంతులతో వుండాలని భావించి, ఏ యుగాది సృష్టికీ తీసుకోనంతటి జాగ్రత్తని ఈ యుగాది సృష్టి విషయంలో తీసు కున్నాడు. అందుకే సంవత్సరాలు అరవై యింటిలో మొదటిదైన ప్రభవ సంవత్స రంలో, ఆ సంవత్సరంలో కూడ వున్న ఉత్తరాయణ (జనవరి 14 నుండి జూలై 15) దక్షిణాయనాలు (జూలై 16 నుండి జనవరి 13) రెంటిలోనూ మొదటిదైన ఉత్తరాయణంలో, ఆ ఉత్తరాయణంలో కూడ కన్పించే వసంత – గ్రీష్మ – వర్ష ఋతు వులు మూడింటిలోనూ మొదటిదైన వసంత ఋతువులో–ఆ వసంతంలో కూడ వుండే చైత్ర–వైశాఖాలనే రెండు మాసాల్లో మొద టిదయిన చైత్రమాసంలో – ఆ చైత్రంలో కూడ కన్పించే శుద్ధ (అమావాస్య వెళ్ళిన పాడ్యమి నుండి పూర్ణిమవరకు వున్న కాలం) కృష్ణ (పూర్ణిమ వెళ్ళిన పాడ్యమి నుండి అమావాస్య వరకు వున్నకాలం) పక్షాల్లో మొదటిదైన శుద్ధ పక్షంలో – ఆ శుద్ధ పక్షంలో కూడ కన్పించే పదిహేను

తిథుల్లో మొదటిదైన పాడ్యమినాడు, ఆ పాడ్యమిలో కూడా పగలూ రాత్రీ అనే రెంటి లోనూ మొదటిదైన పగటిలో –ఆ పగటిలో కూడ వుండే ముహూర్తాలు పది హేనింటిలోనూ మొదటిదైన బ్రాహ్మీ ముహూర్తంలో, సృష్టి, స్థితి లయాలనే మూడింటిలోనూ మొదటిదైన 'సృష్టి' అనే కార్యాన్ని, బ్రహ్మ విష్ణు మహేశ్వరులనే ముగ్గురిలోనూ మొదటివాడైన బ్రహ్మ చేపట్టాడు. అంటే ఏమిటి? సంవత్సరం – అయనం – ఋతువు – మాసం – పక్షం –తిథి –కాలం–ముహూర్తం.. ఇలా అన్నిటి లోనూ మొదటితనమే గోచరించేలా శ్రద్ధ తీసుకుని ఆ రోజున కలియుగాన్ని సృష్టిం చాడన్నమాట. ఓ అనారోగ్యవంతురాలైన స్త్రీకి గర్భంవస్తే, ఆ గర్భం కూడ తొమ్మిది నెలలపాటు కూడా వుండకముందే ప్రస వించే సమయం వచ్చిందని అన్పిస్తే, ఎలా ఆ స్త్రీని పెద్ద వైద్యశాలలో పెద్ద వైద్యుని పర్యవేక్షణలో పెద్ద ఎత్తున ఖర్చుకి సిద్ధపడి ఆమెని రక్షించాల్సిన బాధ్యతా, ధర్మమూ వున్న భర్త ఎంతటి జాగ్రత్తని తీసు కుంటాడో–అలాగే అధర్మపరులూ, అసత్య వాదులూ... ఇలాటి అవ లక్షణాలు కలి గిన జనులు ఎక్కువ సంఖ్యలో వుండే కలి యుగపు సృష్టికి బ్రహ్మదేవుడు కూడ ఇంతటి జాగ్రత్తని తీసుకున్నాడన్నమాట.

**ఆరు రుచుల పచ్చడి :**

ఏదో వంటింట్లో ఆ వస్తువునీ, ఈ వస్తువునీ కలిపి ఏదో ఓ పచ్చడి చేసినట్లు చేయబడే పచ్చడి కాదిది. పైన అనుకున్న



తీరుగా అన్నింటా మొదటితనాన్ని చెప్పే పచ్చడి ఈ ఉగాదిపచ్చడి. మొదటి సారిగా కాసిన మామిడికాయలోని ఒగరుతనాన్నీ, మొదటిసారిగా వచ్చిన చెరకుగడలోని తీపిదనాన్నీ, మొదటిసారిగా పంట పండిన మిరియపు గింజలోని కారాన్నీ, మొదటి సారిగా చేతికొచ్చిన చింతపండులోని పులుపుదనాన్నీ, మొదసారిగా ఎండబెట్ట బడిన ఉప్పులోని ఉప్పదనాన్నీ–వీటిని ఒకచోటికి తెచ్చి ఆ మొత్తాన్ని ఓ పచ్చడిగా చేసి ఇంట్లో అందరిలోకీ మొదటివాడు (పెద్ద వయస్సువాడు) ఎవరో వారిద్వారా, ప్రపంచమంతకీ మొదటివాడైన పర మాత్మకి నైవేద్యంగా పెట్టి ఆ పచ్చడి ప్రసా దాన్ని ఇంటిలోవున్న ఆ మొదటివారు (పెద్దవయసు వారి) గృహ యజమాను రాలికి అందిస్తే దాన్ని ఆ రోజున (ఉగాది నాడు) తినే మొదటి భక్ష్యం (తిండి)గా స్వీకరింపచేస్తారు.

ఇదంతా ఎందుకంటే భగవంతుడు సృష్టించిన ఆ ఉగాదిలోని మొదటితనాన్ని – ఈ పచ్చడి మొదటితనాన్ని స్మరించు

కుంటూ –గుర్తుచేసు కోవడానికి. 'విషేణ విషమమృతమ్' అని సంస్కృతంలో ఓ మాట వుంది. ఓ దోషం వున్న తిను బండారంలోని దోషం మరో దోషం వున్న పదార్థంతో కలసినప్పుడు పోయి, అమృతంగా మారుతుందని దీని అర్థం. వట్టిగా తమలపాకుని తినడం అనారోగ్యకరం. వట్టిగా వక్కనీ, వక్కపొడినీ నమలడం మరింత అనారోగ్యకరం. అయితే ఈ తమలపాకు, వక్క, సున్నం అనేవి మూడూ కలసి ఒకదాని దోషాన్ని మరొకటి తొలగిస్తూ మూడూ కలసి వ్యక్తికి ఆరోగ్యాన్ని కల్గిస్తాయి. (జిహ్వా జాడ్యచ్ఛేదకరం తాంబూలం పరిగృహ్యతామ్ – తాంబూలస్య సఖే త్రయోదశ గుణాః స్వర్గేఽ ప్యమీ దుర్లభాః॥)

ఆవుపాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, తేనె, పంచదార అనే ఐదింటిలోనూ ఒక్కో చిరుదోషం వుంటే ఈ ఐదూ కలిపిన మిశ్రమాన్ని ఒక ఉద్ధరిణెడు మాత్రమే ప్రతిరోజూ తీసుకున్న పక్షంలో అది 'పంచ–ఐదు ఆరోగ్యకర వస్తువులతో ఏర్పాటు చేయబడిన – అమృతమ్ – పూజా మంత్ర శక్తిని కూడ గ్రహించి అమృతం (పంచామృతం)' అవుతోంది. ఈ వివరణ మంతా ఎందుకంటే భగవంతుడు మనని ఈ కలియుగంలో ఇంత శ్రద్ధా జాగ్రత్తలతో సృష్టిస్తూనే మనకి విరుగుడు వస్తువులని కూడ అనుకూలం చేసుకునే తీరుని చూపిస్తూ మన భౌతిక, మానసిక ఆరోగ్యానికి తన వంతు బాధ్యతని నిర్వహిస్తున్నాడన్నమాట. 'అయోగ్యః పురుషో నాస్తి యోజక స్తత్ర దుర్లభః' అన్నట్టు లోకంలో పనికిరానిదంటూ ఏదీ లేదు. దేన్ని ఎలా పని చేయించుకోవాలో తెలియకపోవడం మన దోషమని దీని యొక్క అర్థం. ఈ పచ్చడిలో మరో విశేషమూవుంది. ఇంటికి సంబంధించిన పెద్దాయన తన జీవితంలో తానెదుర్కొన్న తీపి, చేదు, కారం, ఒగరు సంఘటనలని తన వారసులందరికీ చెపుతూ, ఈ అనుభవాన్ని మార్గదర్శకంగా తీసుకుని జీవితాన్ని నడుపుకోవలసిందని సూచించాలి కూడ.

ఒకప్పుడు (దాదాపు నలభై సంవత్సరాల క్రితం) ప్రసాదాన్ని పంచిన తరువాత వాళ్ళంతా దాన్ని తింటూన్నవేళ యథాలాపంగా ఈ పచ్చడి ప్రాముఖ్యాన్ని వివరిస్తూ జీవితానికి దాన్ని పై రీతిలో అన్వయించి చెప్తూండేవారు. విషయమే కాక



తీపి, చేదు అనుభవాలకి ఉదాహరణలని కూడ వివరిస్తూండడంతో పిల్లలందరికీ జీవితాన్ని నడుపుకోవలసిన తీరు తెలుస్తూండేది. ఈ సమావేశమయ్యాక ఎవరెవరి నూతన వస్త్రాలని వాళ్ళ వాళ్ళకి (దైవం ముందు వస్త్రాలనీ, ఆభరణాలనీ చూపించే కారణంగా) ఆ దైవం దగ్గర నుంచి తెచ్చి దైవ సాక్షిగా అందిస్తూ వుండేవారు. అంటే మనమూ పండుగని ఇలాగే చేసుకోవాలన్నమాట. ఏ వస్తువునైనా, వస్త్రాన్నైనా మనం కొనుక్కున్నామనీ, కొనుక్కో గలిగామనీ అనుకోకుండా ఆ పరమేశ్వరానుగ్రహం కారణంగా కొనుక్కోగలిగామనీ, ఆ కారణంగా ఇవి కూడ భగవత్ప్రసాదాలనే భావనతోనే స్వీకరించాలన్నమాట.

**పంచాంగం వినుట :**

ప్రవర్తయామాస తథా కాలస్య గణనామపి।

గ్రహాన్ రాశీన్ ఋతూన్ మాసాన్ తథా సంవత్సరాధిపాన్ ॥

తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనే పంచ (ఐదు) అంగాలు (ముఖ్యమైన విభాగాలు)తో ఏర్పడిందే 'పంచాంగ' మంటే. ఈ పంచాంగాన్ని శ్రవణం (వినడం) చేయాలి ఈ రోజున. పంచాంగ మనగానే మనకి సంబంధించిన నక్షత్రాన్ని చెప్పి 'నా జాతకం ఎలా వుం?'దని అడగాలనేది కాదు దీని అర్థం. ముందుగా ఈ దేశం, ప్రపంచం ఎలా వుంటుందో తెలుసుకోవలసిన బాధ్యత మనందరి మీదా వుంది. దాన్ని బట్టి కదా మనం వుండేది!



ఆ కారణంగా పంచాంగ మనేది ముందుగా దేశపరిస్థితిని వివరిస్తుంది. భగవంతుడు కూడ తనదైన పద్ధతిలో ఒక తొమ్మండుగురిని (నవ–తొమ్మిదిమంది, నాయకలు–లోకాన్ని నడిపించేవాళ్ళు) పాలకులుగా నియమిస్తూ 'మీరు ఈ సంవత్సరం రాజ్యాన్ని చేయ వలసిం'దని ఆదేశిస్తాడు. ఏ సంవత్సరం ఏ వారం (సోమ, మంగళ, బుధ... ఇలా) నాడు ప్రారంభం అవుతుందో ఆ గ్రహం ఆ సంవత్సరానికి రాజుగా వుంటాడు. ఉదాహరణకు శుక్ర వారంనాడు ప్రారంభమయ్యే సంవత్సరానికి శుక్రుడు పాలకుడుగా ఉంటాడు.

శుక్రుడు రాక్షస గురువు. దేవ విరోధి. తన పుత్రిక అయిన దేవయాని ఎంతటి తప్పుని చేసినా పుత్రికావాత్సల్యంతో తలొగ్గి ఆమె మాటకే పట్టం కట్టాడు. తన పుత్రిక దేవయానికీ, తాను ఏ రాజు దగ్గర మంత్రిగా పనిచేస్తున్నాడో ఆ రాజుపుత్రిక శర్మిష్ఠకీ వివాదం వస్తే తన పుత్రిక కోసం ఆ రాజ్యాన్ని విడిచేశాడు–ఆ రాజ పుత్రికని తన పుత్రికకి దాసిని చేయించాడు.

ఇలా శుక్రుని చరిత్ర ఎంతోవుంది. ఇలాంటి శుక్రుడు 'నేటి సంవత్సరపు రాజు' అనగానే ఆ మనస్తత్వం కలవాని పరిపాలనని మనం అర్థం చేసుకోవాలి.

అదే తీరుగా మంత్రిగా కుజుడు, సేనాధిపతిగా రవి, సస్యాధిపతి (వాణిజ్యపు పంటల మంత్రి)గానూ, నీరసాధిపతి (నిర్+రస=నీరస=లోహాలూ గనుల శాఖామంత్రి)గా గురుడు, ధాన్యాధిపతిగా (మాగాణి పంటల మంత్రి) బుధుడు, అర్ఘాధిపతి (మెట్టపంటలు పప్పుధాన్యాల మంత్రి)గానూ, మేఘాధిపతిగానూ (వర్షాలూ నీటిపారుదల శాఖా మంత్రి) చంద్రుడు, రసాధిపతిగా (నూనెలూ, చమురు ధాన్యాల మంత్రి) శనీశ్వరుడు అనేవాళ్ళు ప్రమాణస్వీకారం చేయబోతున్నారు ఉగాదిరోజున.

ఎన్నికలయిన తర్వాత ముఖ్యమంత్రంటూ ఒకరు నిర్ణయమయ్యాక ఏ శాఖని ఏ మంత్రికి కేటాయించారో తెలుసుకుని ఆయనా, ఆయన ప్రవర్తనా ఎలాంటిదో తెలుసుకుని – మనకి మంచి జరుగుతుందా? చెడు ఎదురౌతుందా? లేక మంత్రిగారి అసమర్థత కారణంగా కాలక్షేపమే జరుగుతుందా?– అని ఎలా మనం ఆలోచించుకుని అడుగేస్తామో, అదుగో ఆ విధానమంతా మనకి నేర్పిన వాడు బ్రహ్మదేవుడే. ఈ సంవత్సరానికి ఫలానవాడు ఈ శాఖకి మంత్రి కాబట్టి ఈ పంట మంచిది, ఈ పంట మంచిది కాదనుకుంటూ నిర్ణయం చేసుకోవాల్సింది



ఈ పంచాంగం ద్వారానే. ఎక్కువమంది మంత్రులయిన దగ్గర్నుండీ వాళ్ళ సంతృప్తి కోసం అనవసర శాఖలని సృష్టించి కేటాయించాల్సి వస్తుందని భావించిన బ్రహ్మ తన సృష్టిరాజ్యాన్ని శ్రీహరి ఆజ్ఞకి అనుగుణంగా తొమ్మిది మంత్రులకే పరిమితం చేశాడు. దేశాన్ని గురించి తెలుసుకున్నాక మన వ్యక్తిగత జాతక వివరాలని అడిగి తెలుసుకోవాలి. ఒక్క మాటని జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి. జ్యోతిషమనేది ఒక అద్భుత శాస్త్రమే అయినా అది నిత్యం అనుష్ఠానం (మంత్రం ఉపాసన దైవ పూజ) చేసే వ్యక్తి యొక్క వాక్‌శుద్ధిని బట్టి జరుగుతుంది. కాబట్టి, ఏదో చూసి ఏదో ఇలా జరుగబోతోందని చెప్పే 'దాన్ని గుడ్డిగా నమ్మేసి ఇలా జరగబోతోందిట' అనుకుంటూ డీలాపడిపోకూడదు. నిజమైన జ్యోతిష పండితుడైతే అలా చెప్పడానికి ఆధారమైన గ్రంథం శ్లోకప్రమాణం చెప్పి ఆ మీదట ఫలితాన్ని చెప్తాడు. అలాటి ఆధారాన్ని చెప్పలేకపోవడమనేది



ఆ వ్యక్తి గ్రంథాన్ని చదవనివాడనీ, ఏదో అనుభవాన్ని బట్టి చెప్పేస్తూంటే కొన్ని జరిగీ కొన్ని జరగకా మొత్తం మీద పేరొచ్చినవాడనీ లోలోపల గమనించు కోవాలి. జ్యోతిషమే కాదు, వాస్తు కూడా అంతే. 'ఇది ఇలా వుండకూడ'దని చెప్పా లంటే దానికి ప్రమాణం వుండాలి గ్రంథ రూపంలో. అలా అడిగిన రోజున కుహనా పండితులు లోకంలో వుండరు – దాంతో మానసిక భయాలని కల్గించే అవకాశం వాళ్ళకి వుండదు–మనకి సొమ్మూపోదు, ప్రశాంతతా లభిస్తుంది. కాబట్టి ఆధార మేదో అడగాలి పండితుణ్ణి. ఓ విరోధీ! నిన్ను గురించి ఇంత గొప్పగా చెప్పుకుం టున్నాం కాబట్టీ, నీమీద గౌరవం మా కుంది కాబట్టీ మాకు విరోధివి కాకు!! సర్వేజనా స్సుఖినో భవంతు.

**సంవత్సర ప్రారంభం తెలుగు సంవత్సరాదికాదు**

**జి.** జనవరి 1కి గాదెలు నిండవు సరి కదా పంటమీద వున్న చేలకి ఏ వర్షం కారణంగా నష్టం వస్తుందో అనే దిగులుతో రైతు వుంటాడు. జనవరి 1కి చలీ, మంచూ కారణంగా వ్యక్తులకి ఉబ్బసం, శ్వాసకోశ వ్యాధులూ వచ్చే అవకాశం ఎక్కువ. జనవరి 1 పుష్యమాసకాలంలో వస్తుంది కాబట్టి శూన్యమాసమైన పుష్యలో ఏ శుభముహూర్తాలూ వుండనే వుండవు.

జనవరి 1కి శిశిర ఋతువైన కార ణంగా చెట్లన్నీ ఆకులు రాలుస్తూ బోడిగా దర్శనమిస్తుంటాయి. ఇలాటి అశుభాలన్నీ మూటగట్టుకున్న జనవరి 1 సంవత్సరాది ఎలా అవుతుంది?

అప్రాచ్యుడేదో వాడి దేశానికి సరిపడిన పద్ధతిలో ఈ తేదీని నిర్ణయించి మన మీదికి విడిస్తే, మనం కూడా అలా చేసు కోవడం సరికాదు. జనవరి 1ని సంవ త్సరాదిగా గుర్తించే ఆచారాన్ని మాను కోవడం భారతీయతకి సాక్ష్యం. ఇంతకీ జనవరి 1న ఇచ్చుకునే శుభాకాంక్షలు 'నీ ఒక్కడికీ శుభం కలుగుగాక!' (విష్యూ హేపీ న్యూ ఇయర్) అనే తీరులో వుంటే, మన భారతీయ ఋషుల శుభాకాంక్షలు ఎంత విశ్వవ్యాప్తంగా వుంటాయో గమనిద్దాం!

**శుభమగుగాక**

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతం
న్యాయ్యేణ మార్గేణ మహీం మహీశాః।
గో బ్రాహ్మణేభ్య శ్శుభమస్తు నిత్యం
లోకా స్సమస్తా స్సుఖినో భవంతు ॥
కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ ।
దేశో యం క్షోభరహితో రాజాన స్సంతు నిర్భయాః।
అపుత్రాఃపుత్రిణ స్సంతు పుత్రిణ స్సంతు పౌత్రిణః।
అధనా స్సధనా స్సంతు జీవంతు శరదాం శతమ్॥



ప్ర-జ-లకి (మనుష్యులే కాదు లోకంలో - 'జ' - పుట్టిన ప్రతిప్రాణికీ) శుభమగుగాక! ఏది భూత భవిష్యద్ వర్త మాన కాలాల్లో ధర్మమో దాన్ని న్యాయం అంటారు. అలాటి న్యాయమార్గంలో రాజులు రాజ్యాన్ని పాలింతురుగాక! ఏ ఎద్దు -పంటకి సంకేతమో,ఏ ఆవు - పాడికి సంకేతమో ఆ పాడిపంటలు సుఖంగా లభించుగాక ! ఆవు ద్వారా వచ్చే పాలు, నేయి, పెరుగులకి తేనె పంచదారలనే మరో రెంటిని చేర్చి ఏ పంచామృతాల తోనూ, లభించిన పంటధాన్యంతోనూ, వేదమంత్రాలతో అభిషేకాన్నీ, హోమాన్నీ చేసి - ఈ ద్రవ్యమంతా నువ్విచ్చిందే - నంటూ భగవంతునికి మనందరి పక్షాన కృతజ్ఞతలని ఘటించే బ్రాహ్మణునికి శుభం కలుగుగాక! భూలోకమేకాక మొత్తం పధ్నాలుగు లోకాలు కూడా సుఖ శాంతులతో వుండుగాక! సకాలంలో వర్షాలు కురిసి, చక్కని పంటలు పండి దేశం మొత్తం ఏ క్షోభా లేక సంతోష మ యంగా వుండి, ఏ యుద్ధాలూ లేని కార ణంగా పరిపాలకులు నిర్భయంగా వుందు రుగాక! సంతానంలేనివారికి పుత్ర సంతతీ, పుత్రులున్న వారికి మనుమల సంతానం, ధనంలేనివాళ్ళకి ధనం పుష్కలంగా కలిగి లోకజనులంతా నూరేళ్లూ సుఖంగా జీవిం తురుగాక! ఇవీ మన ఋషుల శుభా కాంక్షలు. ఎంతటి విశ్వవ్యాప్త శుభకామన వారిది!

## ౨౩౯. గీతోపదేశం


**ఐ.** అదేం చిత్రమోగాని ఈ దేవుడి మీద వచ్చినన్ని నిందలు మరే దేవుడి విష యంలోనూ కన్పించవు. కృష్ణుణ్ణి నిందించే వాళ్ళ భాషలోనే చెప్తే - అన్ని పనుల్నీ కృష్ణుణ్ణే నమ్ముకుని చేస్తూండే ధర్మరాజుకి ఈయన ఏం ఒరగబెట్టాడుట? - అడ వుల పాలు చేయడమేగా! 'అన్నా!' అని నిత్యం ప్రేమతో పలకరించే ద్రౌపదికి ఏం కట్టబెట్టాడుట?- నిండు సభలో వస్త్రాప హరణాన్నేగా! కౌరవపాండవుల మధ్య సంధిని శాంతియుతంగా చేసుకొస్తానని 'తగుదునమ్మా!' అంటూ బయల్దేరి వెళ్ళి ఏం సాధించుకొచ్చాడట? -'ఫలాన రోజున యుద్ధానికి సిద్ధం కావలసిందనే వార్తనేగా!

తనని నిత్యం నమ్ముకోవడమే కాక యుద్ధరంగంలో కూడ నమస్కరించిన భీష్మునికి ఏం వెలగబెట్టాడట? - యుద్ధ రంగంలో అంపశయ్య మీద క్షతగాత్రుల



తిట్లని వింటూ యాభైఎనిమిది రోజుల పాటు ఆలనాపాలనా, అతీగతీ లేకుండా ఒంటరిగా పడి ఉండడాన్నేకదా! పోనీ! వీళ్ళంతా 'తనని నమ్మి మోసపోయిన భక్తు'లని అనుకుందాం! మరి తాను నమ్మిన అర్జునునికి ఏం బహూకరించాడుట? పుత్ర (అభిమన్యు) శోకాన్నేగా! తాను స్వయంగా పుట్టిన యదు వంశానికైనా ఏమైనా చేసుంటాడా? అని ఆలో చిస్తే – ముసలం (రోకలి) ద్వారా మొత్తం వంశ నాశ నాన్నేగా! ...సరే! ఇలా తిట్టుకుంటూ పోతే దోషాలు మాత్రమే కన్పిస్తాయి. సరైన తీరులో ఆలోచిస్తే 'కృష్ణుడి నుండి మనం ఎంతో నేర్చుకోవలసి ఉంద'ని అన్పిస్తుంది.

**ధర్మరాజు ఉవాచ :** పాండవుల యోగక్షే మాలని తరచు గమనిస్తూ రాబోయే వృత్తాంతాన్ని ఎప్పటికప్పుడు పాండవులకి చెప్తూండేవాడు వ్యాసుడు. ఆయన చెప్పాడు ధర్మరాజుతో – 'రేపటి నుండి అష్టకష్టా లంటే ఏమిటో వాటిని నువ్వూ, నీ తమ్ముళ్ళూ, భార్యతో కలిసి పద మూడేళ్ళ పాటు అనుభవించబోతున్నా'–రని. కష్టా నికి సంబంధించిన వార్త తెలిసినా మనః స్థైర్యాన్ని కోల్పోనివాడు ధర్మజుడు. గుండె నిబ్బరంతో తగినంత ప్రయత్నం చేసే లక్షణమున్నవాడు కూడ ఆయనే. ఈ వార్త వింటూనే తమ్ముళ్ళతో, భార్యతో ఈ మాటని చెప్పి 'మనం జాగ్రత్తగా ఉండా' లని చెప్తున్నాడో లేదో ధృతరాష్ట్రుడి నుండి విదురుడు రానే వచ్చాడు. ఆయన రాక సారాంశం 'స్నేహపూర్వకంగా ఏ పందా



లూ లేకుండా పొద్దుపోకకి జూదం ఆడు కోడానికి కౌరవులు పాండవులని ఆహ్వా నించా'రని ధర్మరాజుకి అర్థమైపోయింది. అష్టకష్టాలుపడవలసిన సమయం రాబో తోందని తెలిసి, కారణం ఏమయ్యుం టుందా? అనుకునేలోగా ధృతరాష్ట్రుని ఆహ్వానం వచ్చేసరికి పూర్తిగా జరగ బోయేది తెలిసిపోయింది. (త్రయోదశ సమా రాజన్!... భవిష్యతి) చెప్పింది వ్యాసుడు. కలహకారణం జూదం. ఫలితం అష్టకష్టాలు. అనుభవించవలసిన కాలం పదమూడేళ్ళు. జరగవలసింది ఏదుందో దాన్ని అనుభవించ వలసి నప్పుడు ఆ కష్టమనేది దైవ ప్రార్థన ద్వారా ఆగిపోదు. దైవ ప్రార్థన ఒక ఓదార్పు గానూ, గుండెధైర్యాన్ని కోల్పోకుండా చేసేదిగానూ తోడ్పడుతుందంతే. ఈ యథార్థం తెలిసినవాడు కాబట్టే రావలసిన కష్టాన్ని తొందరగా అనుభవించేస్తే ఆ మీదట సుఖాలని అనుభవించవచ్చునేది ప్రతిమనిషి ఆలోచనా కాబట్టి, అలాగే తీర్మానించుకున్న ధర్మరాజు 'జూదానికి రానని అనలేదు సరికదా – జూదానికి పిలిస్తే రాననడం సరికా'దని మరోమాట




కూడ అన్నాడాయన. (ఆహూ తో న నివ ర్తేయ మితి మే వ్రతమ్) ఇక్కడే ఉంది రహస్యం. ఏ కష్టం మన నుదుటన రాయ బడి ఉందో, ఎంతటి దైవమూ ఆ కష్టం నుండి మనని తప్పించలేడో ఆ సంద ర్భంలో దైవాన్ని ప్రార్థించి, కష్టం నుండి తప్పుకోలేక తీవ్రంగా కష్టంలో పడ్డప్పుడు – ఆ దైవాన్ని ప్రార్థించినా కనికరించ లేద నడం సరికాదు. ఈ రహస్యం తెలిసిన వాడు ధర్మరాజు కాబట్టే ఏ పని చేయ డానికైనా ముందు కృష్ణుణ్ణి ప్రార్థించే ఆయన, జూదానికి వెళ్ళేప్పుడు మాత్రమే ఆయన్ని ప్రార్థించలేదు. అంతేకాదు – ద్రౌపదీవస్త్రాపహరణం దాకా మొదటిసారి జూదంసాగినా, వెంటనే రెండోసారి కూడా, ఏ వ్యాసుడు పదమూడేళ్ళకాలాన్ని కష్టకాలమన్నాడో ఆ పదమూడేళ్ళ నియ మానికి లోబడి జూదాన్ని ఆడి ఓడి 'హమ్మయ్యా!' అని అనుకున్నాడు కూడా. కాబటి ధర్మరాజు ద్వారా నేర్చుకోవా ల్సింది ఈ సందర్భంలో ఒకటే. ఏది దైవంద్వారా కూడా తీరని కష్టం ఔతుందో అలాటప్పుడు ఆయన్ని ప్రార్థించి 'ఏదీ చేయలేకపోయా'డనే నిందని భగవంతు నికి అంటగట్టకూడదని. మనం ఏది తీరే కష్టమో? ఏది గట్టెక్కని కష్టమో? మాకెలా తెలుస్తుందని మరో ప్రశ్న వస్తుంది మనకి. నిజమే, భగవంతుణ్ణి ప్రార్థించినా ఏ కష్టం నుండి మనం గట్టెక్కలేకపోయామో అదే తీరని కష్టమన్నమాట. కాబట్టి మనకి కష్టం తీరిస్తేనే వాడు భగవంతుడని నమ్మడం – పూజించడం, లేని పక్షంలో మరొకణ్ణి దైవంగా కొలవడం సరికాదని దీని భావమన్నమాట.

పోనీ! ధర్మరాజు ప్రార్థించలేదను కుందాం! తనని నమ్ముకున్నవారనే అభి మానంతోనైనా కృష్ణుడు పాండవులని జూదంలో గెలిచేట్టుగా చేయచ్చుగా! కాదు, కాలం విధించవలసి ఉన్న శిక్ష నుండి ఏ వ్యక్తినీ భగవంతుడు తప్పించడు – పై పెచ్చు ఆ శిక్ష సక్రమంగా అమలు జరి గేలా చేస్తాడు కూడ. మనమనుకున్నట్టు కృష్ణుడు మాయలవాడే అయితే ధర్మ రాజుని గెలిపించేవాడే. అలా చేయడు – చేయలేదు.

**ద్రౌపదీ వస్త్రాపహరణం :**

ధర్మరాజు ఆడిన జూదం ద్రౌపదీ వస్త్రాప హరణం దాకా వచ్చింది. ఆ అవమానం కష్టం నుండి తనని తాను తప్పుకోవడం కోసం సభ వారిని ప్రశ్నించింది – నన్నోడి తన్నోడెనా? తన్నోడి నన్నోడెనా? (ముందు నన్ను ఓడగొట్టుకున్నాక ధర్మ రాజు తాను తనని ఓడగొట్టుకున్నాడా? లేక తానోడి నన్ను ఓడగొట్టుకున్నాడా?) అని. సభ నుండి సమాధానం రాలేదు.



'నన్నసలు ధర్మబద్ధంగా గెలిచినట్లు మీరు (సభ) నమ్ముతున్నారా?' అని మరో ప్రశ్న వేసింది. ఆ న్యాయబద్ధమైన ప్రశ్నకి సమాధానాన్ని చెప్పగలవాడు ధర్మరాజే నన్నాడు భీష్ముడు. ఆమె ప్రశ్నకి సరైన సమాధానాన్ని చెప్పి తీరాల్సిందేనన్నాడు వికర్ణుడు. జూదమాడి ఓడిపోయి ముద్దాయిగా ఉన్న తాను–న్యాయశాస్త్రాన్ని ఆపోశన పట్టినవాడే అయినా–న్యాయ సందేహాన్ని తీర్చకూడదనే ధర్మానికి కట్టుబడి ధర్మరాజు మౌనంగానే ఉండిపోయాడు. (న్యాయాధిపతి దురదృష్టవశాత్తూ బోనుని ఎక్కిన పక్షంలో న్యాయశాస్త్ర నియమాన్ని ప్రస్తావించకూడదు)

ఈలోగా ద్రౌపదిని 'కులట' అనీ – ఆమె భర్తలకి మగతనం లేదనీ కొందరంటే – తాను భర్తగా ఆమెకి తగిన వాడినంటూ తొడచరిచి చూపిస్తూ దుర్యోధనుడు అవమానించాడు. ఆ దశలో ఆమె తన భర్తలని చూసింది. తలలు దించుకు కూర్చున్నారు. భీష్మణ్ణి పరిశీలించింది. ద్రోణుణ్ణి గమనించింది. పరిస్థితి చేజారకుండా ప్రయత్నించిన విదురుని మాట నెగ్గలేదని అర్థం చేసుకుంది. రక్షించవలసిన ధృతరాష్ట్రుడు పిల్లల సాక్షిగా చే(యి)స్తున్న అకృత్యమని తీర్మానించుకుంది.

ఈ సందర్భంలో తనని రక్షించగలవాళ్ళు మరెవరూ లేరనీ దైవం ఒకే ఒక్కడు రక్షించగలడనీ నమ్మి (అనన్యచింత) కృష్ణుణ్ణి ప్రార్థించింది మౌనంగా అంతరంగంలో. ఇందాక ధర్మరాజుది నిర్ణయింపబడిన కష్టం. ఇక్కడ ద్రౌపదిది 'ప్రార్థిస్తే గట్టెక్కవచ్చేమోననే ఆశతో ఉన్న కష్టం' అందుకే ప్రార్థించింది. అనన్యచింతతో ప్రార్థించినవేళ రక్షించని పక్షంలో భగవంతుడనేవాడు చేయాల్సిన విధి నిర్వహించని దోషం తనకి సంక్రమిస్తుంది కాబట్టి, ఏ ద్రౌపదిని కులట అన్నారో – ఆమె భర్తలకి మగతనంలేదన్నారో – భార్యగా రావలసిందని దుర్యోధనుడన్నాడో అవన్నీ సరికాదంటూ తనచేష్టద్వారా నిరూపిస్తూ ఏ ద్రౌపది వస్త్రాలని మాత్రమే అడిగిందో అంత మాత్రమే ఇచ్చి ఊరుకున్నాడు కృష్ణుడు. (అనన్యా శ్చింతయంతో మామ్....)

కాబట్టి ద్రౌపది ద్వారా నేర్చుకోవలసింది – మన ప్రయత్నాన్ని మనం చేసి భగవంతుణ్ణి ప్రార్థించాలనేది. ఈ సందర్భం ద్వారా కృష్ణుడు మనకి చెప్పేది – కౌరవులకి మానవీయబలం ఉంది తప్ప దైవబలం లేనేలేదనీ, హృదయపూర్వకంగా అనన్య చింతనతో ప్రార్థిస్తే

ఎంత మాత్రమే రక్షించాలో అది తనకి తెలుసనీను. కృష్ణుడు మనమంతా నిందిం చేట్టుగా మాయలవాడే ఐతే సభా భవ నాన్ని కూల్చి కౌరవులంతా మరణించే లానో-లేక-పాండవుల స్థానంలో మాయా పాండవులను సృష్టించి ఓడించింది ధర్మ రాజుని కాదనీ-ఈమె ద్రౌపదికాక మాయా ద్రౌపది అనీ చేసి ఉండేవాడుగా! అలా చేయడు - చేయలేదు.

**సంజయుడు :**

కృష్ణుడు రాయబారిగా వెళ్ళింది కౌరవ పాండవులకి సంధి చేద్దా మనే ఉద్దేశ్యంతో కానేకాదు. దాని క్కారణం ఉంది. పన్నెండేళ్ళ అరణ్యవాసం, ఒక సంవత్సరపు అజ్ఞాత వాసం ముగిశాక కౌరవులు రాజ్యాన్ని తిరిగి ఇచ్చే ఆలోచనలోనే లేరు. అయితే పాండవులు ఎక్కడ యుద్ధానికొస్తారోననే భయంతో సంజయుడనే రాయబారిని పంపారు. 'యుద్ధానికి రావ'ద్దని దాని సారాంశం.

దాంతో కృష్ణుడు, కౌరవులదగ్గరికి వెళ్ళాడు. నిజంగా శాంతి ఒడంబడికని కౌరవ పాండవులకి నడుమ కృష్ణుడు చేసి ఉంటే - దుర్యోధనుని తొడలు విరగ్గొట్టి చంపుతానన్న భీముని ప్రతిజ్ఞా - అలాగే దుశ్శాసనుని వక్షఃస్థలాన్ని చీల్చి రక్తం తాగుతానన్న ప్రతిజ్ఞా వ్యర్థమైపోతాయి. అదీకాక నిండుసభలో ద్రౌపదికి వస్త్రాప హరణమంతటి దారుణం జరిగినా చివ రికి సంధి జరిగింది కాబట్టి ఎంత దారు ణానికైనా పాల్పడి ఆ మీదట జాగ్రత్తగా



సంధి చేయగల వ్యక్తిని వెదుక్కుంటే చాలు సమస్య తెగిపోతుందనే అపోహ ప్రజలకి కలుగుతుంది. అంతేకాక ధర్మాధర్మాలు రెంటిలో అధర్మమే గెలుస్తుందనే అభిప్రా యమూ దాంతో పాటు భగవంతుడు కూడా స్త్రీకి చేసిన అవమానానికి తగిన శిక్షని విధించలేదనే ఆలోచన ప్రజలకి కలుగుతుంది. ఏ ధర్మరాజు తనకి కలిగిన మనోవ్యథ ప్రభావం హస్తినాపురం మీద పడకూడదంటూ ముఖమ్మీద గుడ్డ కప్పు కుని హస్తినని వీడి అరణ్యాలకి వెళ్ళాడో ఆ ధర్మరాజు మంచితనానికి అర్థం లేకుండా పోతుంది. భీముడు చేసిన ప్రతి జ్ఞలు నెరవేరాలంటేనూ, ద్రౌపదికి జరిగిన అవమానానికి తగిన శిక్ష కౌరవ వంశా నికి పడాలంటేనూ, ఏ ద్రౌపది ధృత రాష్ట్రుణ్ణి రెండు వరాలు అడుగుతూ తన భర్తలు ఐదుగురూ ధనుర్బాణాలతో బంధ విముక్తులు కావాలని కోరిందో ఆ వరాలు

ప్రయోజనవంతం కావాలంటేనూ యుద్ధం వచ్చి తీరాలి. 'తా తవ్వుకున్న గోతిలో తానే పడ్డట్టు' దుర్యోధనుడు కూడ రాయబారిగా కృష్ణుడు వచ్చిన వేళ తాళ్ళతో కట్టాలనే ప్రయత్నమే చేశాడు తప్ప పశ్చాత్తాపంతో గాని, కృష్ణుణ్ణి ప్రార్థిద్దామనే భావంతోగాని లేనేలేడు. కాబట్టి కృష్ణుని రాయబారం ద్వారా గ్రహించాల్సింది ఒకటే – భగవంతుడెప్పుడూ తప్పు చేసినవానికి శిక్ష విధించి తీరాలనే నిర్ణయంతోనే ఉంటాడు తప్ప, 'పోనీ! వాణ్ణి విడిచివేద్దా'మంటూ బాధితుడు పల్కినా, దైవాన్ని ప్రార్థించినా శిక్షించక మానడు –అని. ధర్మమూర్తి అనే పదానికి అర్థం మరి ఇదే కదా!

**మూడు దోషాలు :**

భీష్ముడు తననే నమ్ము కున్నాడనేది యథార్థం. ఇంతకుముందే అనుకున్నాం – భగవంతుడు తప్పు చేసిన ఎంతవార్నైనా విడిచిపెట్టడని. ఆ క్రమంలో భీష్ముడు కూడ మూడు తప్పులు చేశాడు. ఏ సంతానమనేది పితౄఋణం నుండి వ్యక్తిని విముక్తుణ్ణి చేస్తుందో అలాటి సంతానానికి అవకాశం లేకుండా బ్రహ్మచర్య ప్రతిజ్ఞని చేయడం మొదటి దోషం. పోనీ! బ్రహ్మచర్యంతో ఉండి సన్యాసిలాగా సత్వ గుణంతో ఉన్నా బాగుండేది. రాజులమీద తమోగుణంతో యుద్ధాల్లో పాల్గొంటూండేవాడు.

ఇక ద్రౌపదీ వస్త్రాపహరణ వేళ మౌనంగా ఉండి తలదించుకు కూర్చోవడం రెండవ దోషం. 'ఈ రాజ్యం మొత్తం తన'దంటూ చెప్తూ జూదానికి పందెంగా



పెట్టే హక్కు దుర్యోధనుడికి లేదని గట్టిగా పల్కినా జూదం ఆగేది – ద్రౌపదికి కష్టం వచ్చి ఉండేది కాదు. కాశీరాజపుత్రికలైన అంబ, అంబిక, అంబాలికలనే పేర్లున్న ముగ్గుర్నీ వాళ్ళ ఇష్టంతో ప్రమేయం లేకుండా బలవంతానా రథం ఎక్కించుకుని తన తమ్ముని వివాహం నిమిత్తం తీసుకు రావడం మూడవ దోషం. ఈ దోషాలు మూడింటికీ శిక్ష ఇహలోకంలోనే పడిన పక్షంలో భీష్మునికి మోక్షాన్ని ఇచ్చే అవకాశముంటుంది కృష్ణునికి. అందుకే ఆ తప్పులకి విధింపబడే శిక్షగా అంపశయ్య – దాని మీద పడక – అందునా యుద్ధ రంగంలో అక్కడ కూడ క్షతగాత్రుల ఆర్తనాదాలు – మరణించిన సైనికుల భార్యలు రాజవంశాలని చేస్తూండే నిందలు వింటూ ఏభై ఎనిమిది రోజులపాటు గడిపాడు భీష్ముడు.


భీష్ముడూ, అంపశయ్యా ఈ సంఘటన ద్వారా కూడ గ్రహించ వలసిందేమంటే – పరమాత్మ, శిక్షని విధించడమంటే, అదీ అనుగ్రహించడంలోని భాగమేనని. అలా శిక్షవిధించి భీష్ముణ్ణి పవిత్రుణ్ణిగా చేశాడు కాబట్టే, 'శ్రీవిష్ణు సహస్ర నామా'న్ని స్వయంగా

భీష్ముడు చెప్పగావిని, తనతో పాటు మహర్షుల దర్శనాన్ని కూడ ఆయనకి చేయించి, మోక్షద్వారపు తలుపుని తట్టేలాచేశాడు భీష్మునికి కృష్ణుడు. కాబట్టి కృష్ణుణ్ణి ధ్యానిస్తే పాప కర్మక్షయాన్ని (పాపాలని నాశనం) చేసి మోక్షాన్నిప్పించగలడన్న మాట.

**నవరంధ్రాలు :**

కృష్ణుడే మనమనుకున్నట్టుగా మాయలవాడే అయ్యున్నట్లైతే తన వాడైన అర్జునునికి పుత్రశోకాన్ని లేకుండా చేసేవాడేగా! కృష్ణుడు ధర్మమూర్తి. శిక్ష పడేలా చేయడం ఆయన లక్ష్యం. అంతే కాదు, అవతారం పరిసమాప్తి కావాలనే అభిప్రాయంతో తన యదువంశాన్ని కూడ నాశనం చేయించాడు తాను చూస్తూండగానే. దుర్వాసమహర్షిని యదు వంశంలోని కొందరు అపహాస్యం చేయదలిచి యాదవుల్లో ఒకనికి స్త్రీ వేషాన్ని వేసి 'మహర్షీ! ఈమె గర్భవతి. సంతానం స్త్రీయా? పురుషుడా?' అని అడిగారు. ఆయన దివ్యదృష్టితో చూసి అవహేళన చేయదలిచిన యాదవులందరినీ నశించవలసిందని శపించాడు. కృష్ణుడు మాయలవాడే అయితే ఏదో మాయ చెయ్యొచ్చుగా ! చేయడు – చేయలేదు. తన అవతారాన్ని చాలించే వేళ కూడ కృష్ణుడు పరమ గంభీరంగా, ఒంటరిగానూ నదీతీరానికి వెళ్ళాడు. పదహారు వేల గోపికాగణంలో ప్రచారం చేయలేదు. భార్యలైన ఎనమండుగురికీ చెప్పలేదు.

ముఖ్యురాండ్రైన రుక్మిణీ సత్యభామల్లో అతి ముఖ్యురాలైన రుక్మిణికృ్కాడ తెలియజేయలేదు. తల్లిదండ్రులైన దేవకీ వసుదేవులని స్మరించలేదు. యశోదా నందులకి వర్తమానాన్ని పంపలేదు. అర్జునుని కృ్కాడా చూచాయగానైనా తెలియనీయలేదు. ఏ జగన్నాటక కథాప్రణాళికకి అనుగుణంగా తన రాక జరిగిందో, నాటకం సాగిందో ముగిసేవేళ కూడ తన పోక అలాగే సాగాలని ఎవరినీ రానీయకుండా బొటనవ్రేలికి బాణంతగిలి అవతార సమాప్తిగా అర్థం చేసుకోమన్నాడు. పూర్తిగా కాలుపోయి బ్రతికినవారు లోకంలో ఉంటూంటే బొటనవ్రేలికి అయిన గాయం ద్వారా మరణమా. ఆశ్చర్యం కాదూ! ఇది ఒక నటన.



మోగించేటప్పుడు వేణువుకి పెదవి దగ్గర ఒక చిల్లూ, దూరంగా ఎనిమిది చిల్లులూ ఉంటాయి. మొత్తం తొమ్మిది చిల్లులు. అది ఆయనకి ఇష్టం. ఎందుకని? మన నవరంధ్రాలున్న శరీరానికి గాలిని ఊదేది తానే కాబట్టి.

## ౨౮౭. సంప్రదాయ నృత్యం

**ఔ.** యమునాతీరం.. బృందావనం... గోపికా గణం, మురళీగాన తన్మయత్వం, రాసలీలా నర్తనం, అదో రసమయ నంద నం ... జీవాత్మ, పరమాత్మల సంగమం, జీవిత పరమార్ధ సారం .... అదే ఈ రాసలీలా నర్తనాన్ని, కృష్ణునిపైగల భక్తిభావాన్ని తేట తెల్లం చేయడానికి మధుర భక్తికి పరా కాష్టగా భావించవచ్చును. భారతదేశం లోని తూర్పు ప్రాంతంలో వున్న మణి పూర్‌లో ఈ రాసలీల (గోపకాంతలతో శ్రీకృష్ణ సంప్రదాయ నృత్యం) శాస్త్రీయ మైన మణిపురి నృత్యంగా రూపు దాల్చింది. జానపద లేదా భక్తి సంగీత నేపథ్యంలో కూడా ఈ నృత్యం చేయడం జరుగుతుంది. వాస్తవానికి అస్సాం తప్ప పెక్కు ఈశాన్య ప్రాంత రాష్ట్రాలు ఈ జన్మాష్టమి వేడుకల్ని సంగీత, నృత్యాలతో జరుపుకుంటారు. అయితే, బెంగాల్‌లో జన్మాష్టమి వేడుకలు ఎంతో మనోజ్ఞంగా, అత్యంత శోభాయ మానంగా జరుగుతూ ఉంటాయి. శ్రీకృష్ణపరమాత్మ జీవితంలో కొన్ని అద్భుత ఘట్టాలు, కృష్ణలీలల దృశ్యాలతో ఏర్చి



కూర్చిన సజీవత వుట్టిపడే సమగ్ర చిత్రాలు ఊరేగింపులో ప్రదర్శితమవు తాయి. గంటల గణగణనాదాలు, శంఖా రావాలు, మంత్రోచ్చాటనలతో ఆ ప్రాంత మంతా మార్మోగిపోతూ వుంటుంది. ఆ రోజు జరిగే వేడుకలలో వివిధ సామాజిక వర్గాలకు చెందినవారు సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తారు. చీకటిపడగానే దేవా లయాలలో అర్చనలు జరుగుతాయి. ధార్మిక కార్యక్రమాలతో పూజాదికాలు నిర్వహిస్తారు. ఆచారాన్ననుసరించి యాభై ఆరు రకాల పిండివంటలను ప్రసాదా లుగా ముందు శ్రీకృష్ణుడికి నివేదన. తద నంతరం అందరికీ ప్రసాద వితరణ జరుగుతుంది. అందరూ ప్రసాదాలను ఆనందంగా ఆరగిస్తారు.

## ౨౮౮. పూజాదికాలు

**ఔ.** దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లు విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను తమ దైన ఆచార వ్యవహారాలను, అర్చనా రీతు లను కలిగివున్నాయి. వీటిని అనుసరించే ఆయా ప్రాంతాలు జన్మాష్టమి వేడుకల్ని జరుపుకుంటున్నాయి. అయితే ఈ రాష్ట్రా లలో జరిగే జన్మాష్టమి వేడుకల తీరు, ఇంచు మించు ఒకేలా వుండటం గమనార్హం.

సంప్రదాయబద్ధంగా ఇళ్ళల్లో మొద లయ్యే పూజాదికాలు, వేడుకలు శ్రీకృష్ణ పరమాత్మ ఆలయంలో పతాక స్థాయి చేరుకుంటాయి. ఈ పర్వదినాన యావ త్ప్రజానీకం ఈ వేడుకలలో మహోత్సా

హంగా పాల్గొంటారు. భక్తి పారవశ్యంతో తన్మయులవుతారు. మంగళప్రదమైన ఈ పర్వదినాన మండప నిర్మాణానికి, ఎన్నో రకాల ప్రసాదాల తయారీకి గంటలకొద్దీ సమయం పడుతుంది. అత్యంత మనో హరంగా అలంకరించిన మండపంలో (దృఢమైన చిన్న కొయ్యబల్ల) ఎంతో జాగ్ర త్తగా శ్రీకృష్ణుడి ప్రతిమను ప్రతిష్టిస్తారు. శ్రీకృష్ణుడికి ఇష్టమైన భక్ష్యాలను తాజా ఫలాలతో పాటు మండపం పైకప్పు నుంచి వేలాడదీస్తారు. ఈ వేడుకలకు ఏర్పాట్లను ఆ రోజు ఉదయాన్నేగాని లేదా కొద్ది రోజులు ముందుగా కాని మొదలు పెడతారు. అయితే సూర్యాస్తమయం అయ్యాక అసలైన అర్చనలు మొదలవు తాయి. అవి అర్ధరాత్రి దాటేవరకు కొన సాగుతాయి. తీపి, కారం భక్ష్యాలలో ఎక్కువ వాటిని ఆ రోజే పగటి వేళ తయారు చేస్తారు. రాత్రి వేళ వేడుకల సమయంలో ఆరగిస్తారు.

## ౨౪౨. పెద్దలకు పెట్టుకునే పండుగ

**జ.** ముంగిట్లో బహుముచ్చటగానూ, వాకిళ్ళలో వరసగానూ, కంటికి నిండుగా ముగ్గులు కన్పిస్తున్నాయంటేనూ – సూర్యుని రాకకంటె ముందుగానే హరిదాసు కీర్త నలు గోవింద నామంతో వీనులవిందు చేస్తున్నాయంటేనూ – అల్లంత దూరాన కనిపిస్తూన్న గంగిరెద్దు 'పట్టు శాలువా ధరించిన పండితునిలా' నిదానంగా కదిలి వస్తోందంటేనూ – పూర్ణగర్భిణుల్లా గాదెలు నిండుగా దర్శనమిస్తున్నా యంటేనూ –



ఇంకేముంది? – సంక్రాంతి వచ్చేసినట్టే. శ్రీరామనవమీ శ్రీకృష్ణ జయంతీ వంటి పండుగలన్నీ కూడా ఒక్క రోజుతో ముగిసి పోయే పండుగలైతే, మనకి ఈ శరీరాన్నీ, బుద్ధినీ, రక్తమాంసాలనీ ఇచ్చిన పెద్దలకి అనగా పితృదేవతలకి కృతజ్ఞతలను చెప్పు కునే పండుగ కాబట్టి ఇది 'పెద్దలకి పెట్టు కునే పండుగ' అనే అర్థంలో 'పెద్ద పండుగ' కూడ అవుతోంది. నెలరోజుల పాటు సాగే ఈ పండుగలో ముగ్గులూ, హరిదాసు కీర్తనలూ, గంగిరెద్దుల రాకలూ, బుడబుక్కల ధ్వనులూ, గొబ్బె మ్మలూ, చలిమంటలూ, కాటికాపరుల జోస్యాలూ, చిట్టచివరి రోజైన కనుమ నాడు గారెల వంటకాలూ భాగస్వాము లుగా కన్పిస్తాయి. ఈ అన్నిటిలోనూ ఆధ్యా త్మికపరమైన, వైద్యపరమైన రహస్యాలు వుండడం పెద్ద విశేషం.

**గోపికలు :** శ్రీకృష్ణుణ్ణి భర్తగా భావించి ఆరా ధించి తరించిన స్త్రీలు గోపికలు (పూర్వ జన్మలో మహర్షులు వీరంతా). ఆ గోపి (గోపికల) బొమ్మలే గొబ్బెమ్మలంటే. ఆవు పేడని ముద్దలుగా చేసి వాటి మధ్యలో గురుగుచేసి వాటిలో ఈ కాలంలో విరగ



బూసే బంతి పూరేకులని ఉంచి ఆ గొబ్బెమ్మల చుట్టూ పసుపు, కుంకుమబొట్లని పెట్టి ఆ గొబ్బెమ్మలని ఇందాక అనుకున్న ముగ్గుల మధ్యగా ఉంచుతారు. అంతే కాదు. పెద్ద గొబ్బెమ్మని ఒక దానిని మధ్యగా ఉంచి ఆ గొబ్బెమ్మ చుట్టూ చిన్న గొబ్బెమ్మలని పెడతారు. ఏమిటి దీనర్థం? ఆ మధ్యగా ఉన్న గొబ్బెమ్మ గోదాదేవి. శ్రీకృష్ణ భక్తురాలై తరించిన తల్లి ఆమె. ఆమె చుట్టూ ఉన్నవాళ్ళంతా ఈ ఆచార్యముఖంగా (గురువు ద్వారా) భగవంతుణ్ణి చేరాలని తపించే గొబ్బెమ్మలు. ఈ అందరూ ముత్తైదువులే అని సూచించేందుకు పసుపు కుంకుమలూ పూరేకులూ కన్పిస్తాయి.ఆ గొబ్బెమ్మలంతా తరించారు కాబట్టే ఖగోళానికి సంకేతంగా కన్పిస్తున్న ఈ ముగ్గుమీద కన్పిస్తున్నారు. వీటి చుట్టూ కన్నెపిల్లలంతా తిరుగుతూ కృష్ణగీతాలు పాడడానిక్కారణం, ఆ చిన్న గొబ్బెమ్మలు కూడ కృష్ణ భక్తురాండ్రకి సంకేతం కాబట్టే. గోదాదేవి తెలవారు జామునే లేచి అందరినీ లేపి స్వామికి సుప్ర భాతాన్ని చేసేది కాబట్టే, గొబ్బెమ్మలన్నీ తెలవారు జామునే పెట్టబడతాయి. ఈ విషయం యథార్థం కాబట్టే ఈ మాసం పొడుగునా పాశురాలని పఠిస్తారు – విన్పింపచేస్తారు.

గొబ్బెమ్మలని ఆరాధించి నైవేద్యాలు పెట్టాక రాత్రివేళ తీసి మరునాటి నుండీ ఎండబెడతారు. మాఘ శుద్ధ అష్టమి (భీష్మాష్టమి), ఏకాదశి (భీష్మై కాదశి) అలాగే ఈ రెంటికీ ముందు రోజున వచ్చే సప్తమి (రథసప్తమి) నాడు ఈ పిడకలతోనే పొంగలిని వండి సూర్యునికీ భీష్మునికీ నైవేద్యం పెడతారు. ఆ పిడకల భస్మం (గోమయ భస్మం) అలా వ్యర్థంగా పోదు. అది ఆవు పిడకలకి సంబంధించింది కాబట్టి ఆ భస్మాన్ని తేనెతో కొద్దిగ చొప్పున సేవిస్తే శ్వాసదోషం ఉండదు –ఆ భస్మాన్ని నువ్వుల నూనెతో కలిపి శరీరానికి రాసుకుంటే చర్మరోగాలు తొలిగి పోతాయి. ఇటు ఆధ్యాత్మికంగానూ అటు వైద్య పరంగానూ కూడ ఉండేలా ప్రతి సంప్రదాయాన్నీ ఏర్పాటుచేసిన ప్రాచీనులు నిజంగా ఎంత గొప్పవాళ్లు!


**హరిదాసు కీర్తనలు :** తెల్లవారుజామున దేన్ని వింటే అదే ఆ రోజంతా చెవిలోనూ మనస్సులోనూ ఆడుతూ ఉంటుంది. అందుకే హరిదాసు తెలవారు జామునే హరికీర్తనని నెలరోజులపాటూ విన్పిస్తూ ఈ అలవాటుని సంవత్సరమంతా కొన



సాగించ వలసిందని సూచిస్తాడు పరోక్షంగా. హరిదాసు ఎవరోకాదు శ్రీవారే. ఆయన తలమీద ఉండే గుమ్మడి కాయ ఆకారపు గిన్నె మరేదో కాదు ఈ మనం నివసిస్తున్న భూమే. ఆ భూమిలో మనం, మన జీవనానికి ఆధారమైన బియ్యాన్ని వేయడమనేది ఆ హరిదాసుని ఉద్ధరించడానిక్కాదు –'ఓ శ్రీహరీ! ఈ భూభారాన్ని నువ్వే మోస్తున్నావని మాకు తెలుసు. ఈ భూమి ద్వారా (నీ భార్యల్లో ఒకతె భూదేవి కాబట్టి) మాకు తిండి గింజలని ప్రసాదించి మమ్మల్ని రక్షించు' – అని మన గోడుని వెల్లడించుకోడానికే. ఏ ముగ్గుమీద కృష్ణ భక్తురాళ్లున్నారో వాళ్ళ సాక్ష్యంగా హరిదాసు కీర్తనని శ్రావ్యంగా ఆలపించి మన భక్తి భావాన్ని స్వీకరించి వెళతాడు.

**గంగమ్మ :**

శివకేశవులకి భేదం లేదనే యథార్థాన్ని నిరూపిస్తే అటు హరిదాసు నిష్క్రమించాడో లేదో ఇటు గంగిరెద్దు తన ముందూ వెనుకా ఇద్దరితో కలిసి వస్తుంది. గంగ + ఇర + ఎద్దు – 'గంగమ్మకి వాహనమైన ఎద్దు' అని ఈ మాటకి అర్థం. ధర్మానికి సంకేతం ఎద్దు. శక్తికి సంకేతం గుర్రం. అందుచేత గంగమ్మని



తన తలమీద మోస్తూ ధర్మానికి సంకేతంగా వచ్చిన ఈ గంగిరెద్దు సాక్షాత్తూ శంకరుడే. ఇక్కడ మరో రహస్యమూ ఉంది. ఇంతకు ముందొచ్చిన హరిదాసు తలమీదున్న పాత్రలో (భూమిలో) బియ్యాన్ని పోశాం. మంచిదే. ఆ ధాన్యం మనకి భూమిద్వారా రావాలంటే కావాల్సింది వర్షం. ఆ వర్షానికి సంకేతమే ఆకాశగంగ. ఆ గంగమ్మని తలమీద పెట్టుకుని శంకరుడొచ్చాడంటే – మీకు నీటిని కూడా ఇస్తాననీ దిగులుపడవద్దనీ పరోక్షంగా ఆయన అభయాన్నియ్యడానికేకదా!

ఇంతకీ ఈ బోళాశంకరునికి మన మిచ్చే బహుమతి ఏమంటే – ఇంట్లో వాడ కానికినికిరాని దుప్పట్లూ బొంతలూను. నిజానికి శంకరుడంతటి విరాగి మరొకరు లేరు. ఎందుకంటే – ఎవరికీ అక్కరలేని భస్మాన్నీ, వాసనలేని తుమ్మిపూలనీ, ఆకులు రాలిపడే శిశిర ఋతువునీ, ఎవరూ రానిష్టపడని చలీమంచూ నిండిన మాఘమాసపు తెల్లవారుజామునీ, కన్ను పొడుచుకున్నా కనిపించని బహుళ చతుర్దశీ తిథినీ తన ఉత్సవపు రోజుగానూ పెళ్లి రోజుగానూ కూడ (మహాశివరాత్రి) ఎన్నుకున్నాడు కాబట్టి. అంతటి విరాగికి, ఏమీ కోరుకోనివానికి ఏది ఇచ్చినా సరే అది ఆయనకి వెండికొండంత!

**సర్వం ఆకాశం :**

అంబపలుకూ జగదంబ పలుకూ తన పలుకులో ధ్వనించి తాను చెప్పబోయే జోస్యం ఫలించాలని కోరుతూ ధ్వనిస్తూ



వస్తాడు బుడబుక్కలవాడు. సర్వం నాదాత్మకమనీ, ఆ ధ్వని మొత్తం ఆకాశం నుండే వస్తుంది కాబట్టి (శబ్ద గుణక మాకాశమ్) సర్వానికీ ఆధారం ఆకాశమే ననీ, ఆ ఆకాశానికి సంబంధించిన అటు వంటి గ్రహాలకి అధినేత సూర్యుడేనని ఆ సూర్యారాధనమే నేటి పండుగ అనీ ప్రత్యక్షంగా బుడబుక్కల ధ్వని ద్వారా సూచిస్తాడు ఈ భక్తుడు.

**మకరరాశి :**

సూర్యుడు ధనూరాశినుండి మకరరాశి లోనికి ప్రవేశించబోయే రోజుకి (సంక్రాంతి) ముందు రోజు ఇది. ఈ విష యాన్ని సంకేతరూపంగా తెలియజేస్తూ ఈ రోజున పెద్ద పెద్ద చలిమంటల్ని వేస్తారు. ఎందుకనిట? 'సూర్యుడు ఇలాగే ఓ నిప్పుముద్ద. అయితే ఇప్పటి వరకూ ఉన్న తీరుగా కాక ఇక క్రమంగా తన వేడిమిని పెంచుకుంటూ పెద్ద నిప్పు ముద్దగా రేపటినుండి రాబోతున్నా'డని సూచించడం దీని భావం. ఇంట్లో సంవత్సరకాలం పాటు వ్యర్థంగా పడి ఉన్న అనవసరమైన చెక్కలూ కొయ్యలూ... అన్నీ దీన్లో పడేస్తే అటు ఇల్లూ పరి శుభ్రంగా ఉంటుంది–ఇటు చలి మంటలో పాల్గొన్న ఫలితం కూడా ఉంటుంది. ఇక ఇందులో దాగున్న వైద్యరహస్యమేమంటే – మన శరీరానికి హానిని కల్గించే ఎన్నో రకాల క్రిమికీటకాలు (చలికీ మంచుకీ వచ్చి చేరినవి) ఈ మంటల ఆకర్షణకి తమంత తాముగా గురి అయి, మంటల్లో పడి మరణించి పరోక్షంగా మనకి మేలుచేయడమే. ఈ రోజు సాయంత్రం పిల్లలున్న ఇళ్లల్లో 'భోగిపళ్లు' పేరిట పేరం టాన్ని చేస్తారు. బొమ్మల కొలువు చేస్తారు. భోగిపళ్లుగా రేగుపళ్లని తలమీదుగా పోస్తూ పిల్లల్ని ఆశీర్వదిస్తారు. రేగు పండుకి సంస్కృతంలో 'అర్కఫలమ్' అని పేరు. 'అర్క' అంటే సూర్యుడని అర్థం. ఈ పండు కూడ రంగులోనూ, ఆకారం లోనూ, పేరులోనూ సూర్యుణ్ణి పోలి ఉంది కాబట్టి, తలమీదినుండి పోస్తున్న ఈ రేగు పళ్లలాగే సూర్యశక్తి, ఈ పిల్లవానికి శరీరం నిండుగా ఉండాలని పెద్దల ఆకాంక్ష – దీవెనన్నమాట.



**బొమ్మల కొలువు :**

బొమ్మల కొలువు మరో అద్భుత రహస్యాన్ని చెప్తుంది. 'బొమ్మల కొలువుని పెడుతున్న పిల్లల్లారా! తల్లిదండ్రులారా! మీరందరూ కూడ ఆ భగవంతునిచేత ఏర్పాటు



చేయబడిన ఈ ప్రపంచమనే ఇంట్లో బొమ్మల్లాటి వాళ్లే. మీకు తోచినరీతిలో మీరు బొమ్మల్ని కొలువుదీరిస్తే, ఆ పరమేశ్వరుడు కూడ ఆయన ఇష్టానుసారంగా బొమ్మల కొలువుని ఏర్పాటు చేస్తాడు – చేశాడు. అందుచేత సుఖదుఃఖాలకి పొంగిపోనూవద్దు – కుంగిపోనూవద్దు. అయితే మీ ప్రయత్నం మాననూవద్దు' అని దీనిలో భావం.

**వాయురూపం :**


ఇటు సూర్యుడు కొత్త రాశిలోనికి ప్రవేశిస్తూ ఉండడం, అటు ముగ్గులు రమణీయంగా కన్పిస్తూ ఉండడం, ఇలాగే హరిదాసు కీర్తనలూ గంగిరెద్దు రాకలూ... గొబ్బెమ్మలూ... ఇన్నిటితో మనమంతా ఆనందంగా ఉన్న వేళ, మన బాగోగుల్ని చూడాలనే ఆనందంతో మన పితృదేవతలు (మరణించిన మన పెద్దలు) కూడ ఈ రోజు వాయురూపంతో అదృశ్యంగా వస్తారు. 'ఏ శరీరాన్ని చక్కని బుద్ధితోనూ రక్తమాంసాలతోనూ నాకిచ్చారో ఆ పితృదేవతలైన మీకు, నిరంతరం మీ ఆశీర్వచనాలకోసం, నా యథాశక్తి నైవేద్యాన్ని సమర్పిస్తున్నానంటూ షడ్రసోపేతంగా భోజనాలని నివేదించడం ఏదుందో అదే 'పెద్దలకి పెట్టుకోవడ' మంటే.

ఎవరికైనా మనం ఓ సహాయాన్ని చేస్తే వాళ్లు మనకి మాటవరసకైనా ధన్యవాదాలు చెప్తే ఎంత ఆనందిస్తామో అలాగే పితృదేవతలు కూడా మననుండి ఏమీ ఆశించకుండా – 'కనీసం గుర్తుంటేచాల' నే అభిప్రాయంతో మనని దర్శించవస్తారు ఈ రోజున. పితృదేవతలకి ఈ రోజున తర్పణాలని (నువ్వులూ, నీళ్లూ, మంత్రపూర్వకంగా విడవడం) విడుస్తారు. 'తర్పణము' అంటే 'తృప్తిని కల్గించేది' అని అర్థం. సంక్రాంతి పర్వదినాల్లో పితృ తర్పణాలు పెడతారనుకున్నాం కదా! ఇందుకో పురాణ కథనాన్ని పేర్కొనాలి. ఇప్పటి గంగాసాగర్ సమీపంలోని కపిలముని ఆశ్రమంవద్ద బూడిదైన మహారాజు సాగర్ యొక్క 60 వేలమంది కుమారుల్ని, తన పూర్వీకులను తిరిగి తెచ్చుకునేందుకు భగీరథ మహారాజు పవిత్ర గంగానదిని భూమిమీదకు తెచ్చేందుకు ఘోర తపస్సు చేస్తాడు. ఈ రోజునాడు భగీరథుడు చివరిగా గంగాజలంలో తర్పణం విడుస్తూ శాపగ్రస్తులైన తమ పూర్వీకులకు విమోచనం గావిస్తాడు. భగీరథుడి పూర్వీకులను శాప విముక్తుల్ని చేసిన తర్వాత పవిత్ర గంగానది చివరకు సముద్రంలో విలీనం

అవుతుంది. ఈ సందర్భానికి గుర్తుగా, గంగానది బంగాళాఖాతంలో సమ్మిళిత మైన ప్రదేశంలో భారీ ఎత్తున, ప్రతి ఏటా గంగా సాగరమేళా నిర్వహిస్తారు. లక్షలాది మంది జలాల్లో మునిగి తమ పూర్వీకులకు తర్పణాలు వదులుతారు.

మకర సంక్రాంతి దిన ప్రాముఖ్యాన్ని తెలియజెప్పే మరో కథనమూ వుంది. ఆ రోజున భీష్మపితామహుడు తన తనువును చాలిస్తున్నట్లు ప్రకటిస్తాడు. భీష్మపితామహుడు తన తండ్రి నుంచి ఇష్టం మేరకు తనువు చాలించే వరాన్ని పొంది వుంటాడు. కాబట్టి బాణాల శయ్యపై పడుకుని మకర సంక్రాంతి వరకు ప్రాణం వదలడానికి వేచి వుంటాడు. ఉత్తరాయణకాలంలో మరణించిన వ్యక్తి బంధవిముక్తుడవుతాడన్న విశ్వాసంవుంది. కాబట్టి సకల శుభకార్యాల్ని ఆరంభించే మంచిరోజుగా దీనిని పరిగణిస్తారు.


గాలిపటాలని ఆకాశంలో ఎగురవేస్తారు ఈ రోజున. దీనికి రెండు కారణాలు. ఒకటి–కొత్త సూర్యునికి స్వాగతాన్ని చెప్తూ గాలివీచే దిశలోనూ గాలి తేమలోని పరిమాణంలోనూ భేదముంటుందని తెలియజేయడమూ – రెండవది – ఆ సూర్యలోకానికి చేరుతున్న / లేదా / చేరిన పితృ దేవతలని ఆహ్వానించడమున్నూ. గాలిలో ఎగురుతూన్న పెద్ద పాముల్లా కన్పించే ఈ గాలిపటాల రూపంలోనే జీవుడు (అయితే అది సూక్ష్మరూపంలో) ఆకాశగమనాన్ని చేస్తాడు వ్యక్తి శరీరాన్ని విడిచిన మీదట.



ఇంటిలో గాదెలు నిండిన కారణంగానూ చేతిలో సొమ్ములు ఆడుతున్న కారణంగానూ నగానట్రా పొలం పుట్రా కొనుక్కునేది ఈ కాలంలోనే. ఆ ఆనందం మొత్తాన్ని మొదటగా తెల్పేది ఈ ఉత్తరాయణ సూర్యునికే. అందుకే ప్రత్యక్ష దీపమైన సూర్యభగవానుని సాక్షిగానే ఈ రోజున పొంగలిని చేసి ఆయనకి ఇక్కడి నుండే నైవేద్యాన్ని పెట్టి కుటుంబసభ్యులంతా దాన్ని ప్రసాదంగా స్వీకరిస్తారు.

**పశువు :**

ఈ పండుగలో మూడవదీ చివరి రోజూ అయిన పండుగ రోజు ఇది. 'కనుము' అంటే పశువు అని అర్థం. మానవజాతికి చెందిన మనం ఎలా ఆ భగవంతుని సంతానమో అలాగే పశువులూ పక్షులూ ... ఇతర జాతులూ కూడ ఆయన యొక్క సంతానమే. ఒక తండ్రికున్న సంతానంలో ఏ ఒక్కడో ఆనందంగా ఉండి మిగి



లినవాళ్లు కష్టాలపాలై తిండి లేకుండా ఉంటే ఆ తండ్రి దృష్టిమొత్తం ఈ పిల్లల మీదే ఉంటుంది. ఆ సందర్భంలో సుఖంగా ఉన్నవాడు మిగిలిన సంతానాన్ని (సోదరులని) ఆదుకుంటే ఆ తండ్రి ఎంతగానో పొంగిపోయి, 'ఈ కొడుకు చల్లగా ఎప్పుడూ ఉండాలని రెండు చేతులా ఆశీర్వదిస్తాడు కదా!' సరిగ్గా అలాగే మనకి పొలం విషయంలో దుక్కిదున్నడం మొదలుకుని ధాన్యం ఇంటికి వచ్చేవరకూ ఏ పశువు సాయపడిందో ఆ పశుజాతికి (ముఖ్యంగా ఎద్దులకి) పూజ చేయడం కనుమురోజు ఉదయాన చేయాల్సిన పని.

వాటిని పూర్తిగా కడిగి కొమ్ములకి పసుపు రాసి కుంకుమబొట్లు పెట్టి పూల దండని కట్టి చక్కని మేత పెట్టి నీరుపట్టి వాటిని సంతోషదేలా చేయడం ఈ రోజున చెయ్యాలి. దసరా రోజుల్లో వాహన పూజ ఎలా చేస్తామో అలాగే ఈ రోజున మనకి సహాయపడిన ఈ పశుపూజని కూడ చెయ్యాలి. తనని కొట్టినా తిట్టినా కూడ ఏ పశువు యజమాని క్షేమాన్నే కోరుతూ యజమాని చెప్పినట్లే నడుచుకుంటోందో దానికి పూజ చేయక పోవడమంటే ఆ నిజమైన కృతఘ్నుతకి సాక్ష్యం కాదూ? ఇక అతి ముఖ్యమైనది ఈ రోజున కూడ పితృదేవతలకి (పెద్దలకి) పెట్టుకోవడం. పితృదేవతలకి ప్రీతికరం గారె. ఈ పితృభక్ష్యాన్ని (పితృదేవతలకి పెట్టే గారెలని) ఇష్టంగా స్వీకరించి, ఆ విషయాన్ని పితృదేవతలకి తెల్పే పక్షి 'కాకి'. అందుకే 'కనుమునాడు కాకైనా ఊరు కదల' దనే సామెత పుట్టింది. 'ఊరు కదలడ'మెందుకు జరుగుతుంది? తిండి లేకుంటేనేకదా! ఈ రోజున అన్ని ఇళ్ళల్లోనూ పుష్కలంగా ఆహారం లభిస్తుంది. కాబట్టి ఎక్కడికీ కదలాల్సిన అవసరమే లేదని దీని భావం.

ఏ కనుమునాడు ప్రతి వ్యక్తీ తన పితృదేవతలకి (పెద్దలకి) పెట్టుకోవలసి వుందో, ఆ కర్తవ్యాన్ని మరచి మరో ఊరికి పనివుందంటూ పోరాదని చెప్పడం కూడ ఈ సామెతలోని లోభావం. పితృదేవతలు



కాకిరూపంలో కూడ వచ్చి తమవాళ్ళ నివే దనలని స్వీకరిస్తారని మంత్రం చెపుతుంది (గృధ్ర వాయస జలచర రూపేణ...). అకా రణంగా కూడ పితృదేవతలకి పెట్టు కోవడం ఈ రోజు తప్పనిసరి. సుఖ సంతోషాలతో ఉండడం, పితృదేవతలని స్మరించడమే నిజమైన సంపద అంటే. అందుచేత సంక్రాంతి 'సంక్రాంతి లక్ష్మి' అవుతుంది ఇలా చేస్తే.

చివరిలో ఒక్కమాట! మనకి సహాయ పడతాడో లేదో తెలియకపోయినా అతడి చుట్టూ అనేక ప్రదక్షిణలు చేసి చివరికి మోసపోయి దుఃఖిస్తున్నామే! ప్రత్యక్షంగా మనకి బుద్ధినీ, శరీరాన్నీ, ఆస్తిపాస్తుల్నీ ఇచ్చిన ఆ పితృదేవతలని సంవత్సరంలో ఒక్కరోజైనా తలుచుకోకపోవడం కృత ఘ్నుత కాదూ! ఇంత ఇచ్చికూడ మనం పెడుతున్న నివేదనని స్వీకరించలేక పోయినా, ఆశీర్వదించడానికి సిద్ధంగా వున్న పితృదేవతలెంత గొప్పవాళ్ళు ! తప్పక పెద్దలకి పెట్టుకుందాం, ఆశీస్సుల్ని పొందుదాం!!

## ౨౨౦. తులసీదళం


**ఐ.** 'తమసోమా జ్యోతిర్గమయ' అన్న వేదవాక్కుకు ప్రతీకగా నిలిచిన పర్వదినం దీపావళి. శ్రీలక్ష్మీదేవి ఈ రోజున భూ లోకానికి దిగివచ్చి ఇల్లిల్లు తిరుగుతుం దని జనుల విశ్వాసం. ఈ పండుగ అమ్మ వారికి అత్యంత ప్రీతికరమైనది. అందు వల్లనే దీపావళివేళ లక్ష్మీపూజ ప్రధాన కార్యమైంది. దీపావళి సందర్భంగా మనం



వెలిగించే దీపాలను మనలోని అజ్ఞాన తిమిరాన్ని తొలగించే వెలుగు దివ్వెలుగా కూడా సంభావించుకోవలసి ఉంది. లక్ష్మీ దేవికి ప్రతిరూపమే తులసి... విష్ణు మూర్తికి ప్రీతిపాత్రమైనది. సత్యభామ నిలువెత్తు బంగారం ఉంచినా తూగని ఆ దేవదేవుడు రుక్మిణీదేవి సమర్పించిన ఒకే ఒక్క తులసీదళానికి వశుడయ్యాడు.

ప్రకృతి మనకు ప్రసాదించిన వరాలు చెట్లు, చేమలు, పచ్చని మొక్కలు. మాన వాళి మనుగడలోనే కాదు మానవ జీవి తంలో వీటికి ఎంతో ప్రాధాన్యత ఉంది. అవి మనిషికి ఆహారాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదించే సంజీ'వనాలు'. పండుగలు, పబ్బాలు, వివాహాది శుభకార్యాలు, ఉత్స వాలు, వేడుకలలో మామిడి, మర్రి, రావి, అరటి, వెలగ, జిల్లేడు, ఉసిరిక, తులసి తమలపాకు, దేవగన్నేరు, ఉమ్మెత్త... ఇత్యాది వృక్షాలు, మొక్కలు, తీగలకే కాదు కుశలు (గరిక)కు చాలా ప్రాముఖ్యం

ఉంది. పూజా పునస్కారాలలో, శుభాశుభ కార్యాలలో రకరకాల చెట్లు, మొక్క ఆకుల్ని, పండ్లని, పూలను వాడుతుం టారు. ప్రతిమొక్కలో అపూర్వ ఔషధ గుణాలు ఉన్నాయి. మనకు తెలిసిన, మనం పూజించే 'తులసీదళం'లోని ఔషధ గుణాలు అన్నీ... ఇన్నీ కావు. భారతీయ సంస్కృతిలో నింగి, నేల, నీరు, తరులు, గిరులు, విరులు, మొక్కలు అన్నీ పవిత్ర మైనవే... పూజార్హమైనవే. వాటిలో ఔషధ గుణాలు అపారమే. హిందూధర్మంలో 'తులసి'ది అత్యంత పవిత్రమైన స్థానం. 'తులసి' లేని ఇళ్ళు ఉండవంటే అతి శయోక్తి కాదు. నిత్యం ఆరాధించే, దేవ తగా కొలిచే, తొలి మలి సంజెలలో పూజలు అందుకునే 'తులసి'కి ధార్మిక మహనీయతతోపాటు, వైజ్ఞానిక విశేషత కూడా ఉంది. తులసికోటలో పెరిగే మొక్క కన్నా, భూమిపై పెరిగే తులసి మొక్క ఎక్కువ ఎత్తు పెరుగుతుంది. తులసిలో ఎన్నిరకాలు ఉన్నా, రామతులసి, కృష్ణ తులసిలే ఎక్కువ ప్రాశస్త్యం పొందాయి. ఎందరో యోగులు, ఋషులు, మోక్ష గాములచేత, భారతదేశంలో విభిన్న ఆధ్యాత్మిక సంప్రదాయాల్ని అనుసరించే వారిచే, అందరిచే ప్రశంసించబడిన అపూర్వమైన, విలక్షణమైన మొక్కలలో తులసి ఒకటి. భక్తిశ్రద్ధల శక్తిద్వారా ఈ మొక్క ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగిస్తుంది. అద్భుతమైన, పునరారోగ్యాన్నిచ్చే శక్తులు ఇందులో పుష్కలంగా ఉన్నవి.



**బృందాదేవి :**

ధార్మిక, ఆధ్యాత్మిక స్వచ్ఛతలకు 'తులసి' ఎంతో ప్రసిద్ధిగాంచింది. పరి పూర్ణ ఆరోగ్యాన్నిచ్చే ఓషధీయుత ఔషధా లలో రుగ్మతలను నయంచేసే సంప్ర దాయ ఆయుర్వేద, యునాని వైద్యాలలో తులసి ప్రధాన భూమిక వహిస్తుంది. ఇది మనస్సును నిర్మలంగా ఉంచుతుంది. ఆధ్యా త్మిక కాంక్షను ఇనుమడింప చేస్తుంది. భక్తిశ్రద్ధలను, విశ్వాసాలను, నిరాడంబ రతను పెంచుతుంది. హిందువుల ఇంటి ప్రాంగణంలో తులసి మొక్క తప్పనిసరిగా ఉంటుంది. తొలి, మలి సంజెలలో తుల సిని పూజించడం హైందవ సంప్రదాయం. ప్రతిరోజూ నీళ్ళు పోసి, భక్తి ప్రపత్తులతో తులసిమాతను ఆరాధిస్తే ఇంట్లో లక్ష్మీకళ తాండవిస్తుంది. పెరటిలోని తులసి పచ్చదనంతో ఆ ఇంటిలో సుఖ సంతో షాలు వెల్లివిరుస్తాయి. తులసిమొక్కని భగ వత్ స్వరూపంగా భావిస్తారు. తులసీ దళాలు దైవాలకు అత్యంత ప్రీతికరం.

తులసి తీర్థం అత్యంత పవిత్రమైనదేగాక, ఔషధ ప్రదాయిని. "నమస్తులసీ ! కల్యాణీ! నమో విష్ణుప్రియే! శుభే! నమో మోక్షప్రదే! దేవీ! నమః సంపత్ప్రదాయిని" అంటూ గృహిణులు వేకువజామున తులసిని పూజిస్తారు. చాలా మందిరాలలో తులసి నీరే తీర్థంగా ఇస్తారు. కొన్ని ఇతర మతాలలో కూడా తులసినీళ్ళను తీర్థంగా ఇచ్చే సంప్రదాయం అనుచానంగా ఉంది. తమవారు పుణ్యలోకాలకు చేరాలని ఆఖరి క్షణాలలో ఉన్న మనిషి నోట్లో గుక్కెడు తులసి తీర్థం పోయడం హైందవ ఆచారం. కొన్ని మతాలవారు తులసి ఆకుల్ని చేతులలో ఉంచుతారు, పాటిస్తున్న ధర్మం.. ఆచరిస్తున్న సంప్రదాయాలు ఏవైనా మౌలికంగా అన్నింటి అంతరార్థం ఒక్కటే... తులసి కేవలం ఒక సంప్రదాయానికీ, విశ్వాసానికీ పరిమితమైనది కాదు. విశ్వవ్యాప్తంగా పూజలు అందుకుంటున్న విశ్వవంద్య తులసి. బృంద, పుష్పరాస, కృష్ణజీవని, నందిని, విశ్వపావని, విశ్వపూజిత, బృందావని తులసికి పర్యాయపదాలు. తులసిమొక్క ఆకుపచ్చ, లేత ఎరుపు రంగులలో ఉంటుంది. తియ్యని పరిమళం వెదజల్లుతుంది. 30-100 సెంటీమీటర్ల ఎత్తు ఉంటాయి. ఈ మొక్క ఆకులు, విత్తనాలు, మొత్తం మొక్క అంతా ఉపయోగకరం. దీని వృక్షశాస్త్ర నామం ఆక్సిమమ్ శాంక్టమ్ (శాంక్టమ్ అంటే పవిత్రమని అర్థం). ముఖ్యంగా తులసి మొక్క మూడు రకాలు. ఒకటి రామ తులసి (ఆకుపచ్చ), శ్యామ లేదా కృష్ణ తులసి (పత్రములు, బెరడు, నీలవర్ణం కల్గి ఉంటుంది), వన తులసి (అటవీ రకం) అనేవి ఉన్నాయి. ఎంతో ప్రభావవంతమైన పరిమళంగల ఈ తులసీ దళాలు కోలాకారంలో 5 సెం॥మీ పొడవు ఉంటాయి, మామూలుగా కొనదేలి ఉంటాయి. ఈ మొక్క పువ్వులు తెల్లగా, లేత ఎరుపు రంగులో ఉంటాయి. పవిత్రమైన తులసి గురించి, పవిత్ర ధార్మిక గ్రంథాలలో అసంఖ్యాకమైన ప్రస్తావనలు ఉన్నాయి. పువ్వులు, పత్రములు, కాండం భారతీయ సమాజంలో అంతర్భాగాలు. తులసి ఆకులు, పువ్వులు లేకుండా చేసే పూజ సమగ్రమైన పూజ అనిపించుకోదు. మెడలో ధరించే పూసలదండలు, జపమాలలు తయారు చేయడానికి తులసి కాండాన్ని ఉపయోగిస్తారు.

తులసి ఔషధగుణాలు, అసాధారణమైన శక్తులు గురించి ఎంతో విజ్ఞానం, సమాచారం వేదాలలో మెండుగా ఉంది. ఈ మొక్కను స్పృశిస్తేచాలు ఎంతో పవిత్రత, నిర్మలత్వం సిద్ధిస్తుందని, వ్యాధులన్నీ నయమవుతాయని పురాణాలు చెబుతున్నాయి. తులసిని విష్ణుమూర్తి ఇష్టసఖిగా భావించి పూజిస్తారు. ఆమె శ్రీకృష్ణ భగవానుని దేవేరి. శాపవశాన తులసి మొక్కగా పుడమిపై జనించిందని, శాప విముక్తి తర్వాత మహాలక్ష్మిగా వైకుంఠం చేరిందని ఓ వృత్తాంతం పురాణాలలో ఉంది. శ్రీమహాలక్ష్మి శిరోజాలు తులసి

మొక్కగా అవతరించి, ఆ మొక్క ముల్లోకా లకు వంద్యనీయమవు తుందని, ఈ మొక్క ఆకులు పరమ పవిత్రమైనవని కృష్ణార్చనలో, శ్రీమహావిష్ణువుని పూజిం చడంలో తప్పని సరిగా తులసీ దళాలను వినియోగించవలసి ఉందని దేవీ భాగ వతం విస్పష్టంగా చెబుతోంది.

హిందూ పురాణగాథల ప్రకారం తులసి బృందాదేవి అవతారం. బృంద అంటే విద్యుచ్ఛక్తి. దీనిలోని విద్యుదయ స్కాంత తరంగాలు శరీరంలోని రక్త సరఫరా వ్యవస్థను మామూలుగా ఉంచు తాయి. ఎక్కడయితే తులసీవనం, పద్మ వనం, భక్తజనం ఉంటారో అక్కడ శ్రీమహా విష్ణువు నివాసముంటాడని, అక్కడ పరి శుద్ధమైన గాలి వీస్తుందని ఆ గాలిలో మధుర పరిమళం సంచారం చేస్తుందని, తులసీదళం తేనెకన్నా, వేపకన్నా ఎంతో ప్రయోజనకారి అని పద్మపురాణం చెబుతోంది. ఇది మనలో చైతన్యాన్ని



నింపడానికి, శరీరంలో రస ధాతువును (న్యూట్రియంట్ ప్లాస్మా), రక్తధాతువు (రక్తం), మజ్జధాతువు (ఎముకలలోని మూలుగు, నరములు) అలాగే శుక్ర ధాతువు (పునరుత్పత్తి ద్రవాలు)ల గుణా లని మెరుగుపరిచేందుకు ఉపకరిస్తుంది.

**సర్వతీర్థాలు :**

తులసి సంస్కృతపదం. తులసి అంటే సాటిలేనిది అని అర్థం. 'యన్మూలే సర్వ తీర్థాని సన్మధ్యే సర్వదేవతా యదగ్రే సర్వ వేదాశ్చ తులసీం త్వాం నమామ్యహమ్' అని శాస్త్రాలలో చెప్పబడింది. తులసి మొక్క మధ్య భాగంలో అనగా కాండం నుంచి సమస్త దేవీదేవతలు, అగ్రభాగ మందు నాల్గువేదాలు, మూల స్థాన మందు సర్వతీర్థాలు నివాస ముంటాయి. అటువంటి తులసికి నమస్కరిస్తున్నాని పై శ్లోకం అర్థం.

మన జీవన విధానానికి ప్రకృతి ఆలం బన. ప్రకృతితో ముడిపడి సాగే జీవన సరళిలోని పురాణగాథలలో అంతర్లీనంగా ఎన్నో వైజ్ఞానిక అంశాలు ఉన్నాయి. పురాణ గాథలతో ముడిపడిన జీవనశైలి లోని ఆచార వ్యవహారాలన్ని మానవ జీవన వికాసానికి తోడ్పడతాయి.

తులసిలో మనకు తెలిసిన కృష్ణతులసి, లక్ష్మితులసితోపాటు, రామతులసి, అడవి తులసి, నేలతులసి, మరువకతులసి, రుద్ర జడతులసి, కర్పూరతులసి ఇలా ఎన్నో రకాలున్నాయి. కర్పూరతులసి తైలాన్ని ఓషధీయుత టాయ్‌లెట్స్ సాధనాల



తయారీలో విరివిగా వాడతారు. ఈ నూనెను చెవినొప్పికి, క్రిమికీటకాలు, బ్యాక్టీరియాను నిరోధించడానికి ఎక్కువగా వాడతారు. శ్వాస అవరోధ రుగ్మతలను నయం చేయడానికి రామతులసిని మందుగా వాడతారు. మలేరియా నయం చేస్తుంది. అజీర్ణం, తలనొప్పి, హిస్టీరియా, నిద్ర లేమి, కలరా వంటివి నయం చేయడానికి తులసిలో మందు ఉంది. రుగ్మతల్ని నయంచేసే గుణాలుగల తులసి మూలికలో మహారాణిగా శతాబ్దాల తరబడి ప్రసిద్ధి గాంచినది.

**మధుమేహ నివారిణి :**

ఫెనోలిక్స్, ఫ్లేవనాయిడ్స్ వంటి ఫైటో కెమికల్స్ సమృద్ధిగా ఉన్నందున తులసిలో మహత్తర ఔషధ గుణాలు ఎన్నో వున్నాయి. ఫైటో కెమికల్స్ ఫ్రీ రాడికల్స్‌పై పోరాడతాయి. తులసిని యాంటీ ఆక్సిడెంట్‌గా ఇమ్యూనో మాడ్యులేటర్‌గా తయారు చేస్తాయి. తులసిలోని అర్సోలిక్ యాసిడ్‌లో యాంటీ –ఎలెర్జిక్ గుణాలు ఉన్నాయి. అలెరిన్ ఉన్న సమయంలో ఇది హిస్టమిన్ విడుదలను అదుపు చేస్తుంది. ఆర్సోలిక్ యాసిడ్ మగవారిలో స్పెర్మటో జెనిసిస్‌ను, మహిళలలో యాంటీ ఈస్ట్రోజెనిక్ ప్రభావాన్ని కల్గి ఉంటుంది. కీటకాలు కుట్టినచోట తులసి ఆకుల రసాన్ని రాస్తే సత్వర ఉపశమనం కల్గుతుంది.

తులసి ఆస్ప్రిన్‌వలె పని చేస్తుంది. ఎల్ డి ఎల్ కొలెస్టరాల్ (చెడు కొలెస్టరాల్)ను తగ్గిస్తుంది. హెచ్‌డిఎల్ కొలెస్టరాల్ (మంచి కొలెస్టరాల్)ను పెంచుతుంది.

మధుమేహానికి తులసి మంచి మందు అని, ఇందులోని యాంటీఆక్సిడెంట్లు రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తాయని పరిశోధనలో వెల్లడైంది. పసుపు, ఉసిరికతో కలసి ఇది అమోఘంగా పనిచేస్తుంది. మూత్రపిండాల్లో రాళ్ళను నయం చేయడానికి, స్త్రీ సంబంధ వ్యాధుల నివారణకు ఉపకారి. యాంటీబ్యాక్టీరియల్ గుణాలు ఉన్నందున చర్మసంబంధిత సమస్యలను నయం చేయడంలో తులసిని విరివిగా ఉపయోగిస్తారు. తామర, ఇతర చర్మ వ్యాధులను నయం చేయడానికి తులసి ఎంతో అనుకూలమైనది.

బొల్లి (ల్యుకోడెర్మా)ను నయం చేయడంలో ఎంతగానో ఉపయోగపడ్తుంది. తులసిలోని యాంటి ఫంగల్, యాంటి వైరల్ లక్షణాలు ఇ.కోలి, బి.అంత్రాసిస్, ఎమ్.ట్యుబర్క్యులోసిస్ వగైరాలను అణిచి వేస్తుంది. అది డయా ఫోరేలుక్ (చెమట పట్టేలా చేస్తుంది) ఫెబ్రి ఫ్యూజ్‌గా పని

చేస్తుంది (నొప్పి నివారిణిగా). జలుబు, దగ్గు, జ్వరం, గొంతు మంట, గొంతు నొప్పి నయంచేయడంలో ఉపయోగ పడ్తుంది. జలుబుతో బాధపడే వారు గుప్పెడు తులసి ఆకుల్ని, ఏలకుల పొడిని నీళ్ళలో వేసి బాగా మరగ కాచాలి. నీరు సగం అయ్యేవరకు మరిగించాలి. దాన్ని వడబోసి పాలలో కలుపుకుని రోజుకు మూడుసార్లు తాగాలి. ఈ మిశ్ర మంలో అల్లం తురుము చేర్చితే అది రొమ్ము పడిశాల్ని తగ్గిస్తూ, శ్వాసనాళం లోని కఫాన్ని తొలగిస్తుంది. తులసి ఆకులు నరాలకు బలవర్ధక అవసరంగా పని చేస్తుంది. శక్తిని పెంచుతుంది. జ్ఞాపకశక్తి పదును తేరుతుంది.

**పవిత్ర తులసి :**


పవిత్ర తులసీదళాలను మౌత్‌వాష్‌గా ఉపయోగిస్తారు. పంటినొప్పి నుంచి, చిగుళ్ళ వాపునుంచి ఉపశమనం ఇస్తాయి. ఇవి నోటి దుర్వాసన నివారిస్తాయి. తులసి రసాన్ని దంతాల ఆరోగ్యంకోసం వాడ తారు. తులసి ఆకులలో ఇతర ఖని జాలతో పాటు యుజినాల్ (యాంటిసెప్టిక్, ఎనస్థిటిక్, యాంటిస్ట్రెస్ గుణాలు) కార్వ క్రోల్ (యాంటి బ్యాక్టీరియల్) మిథైల్ యుజి నాల్, కారియోఫిలైన్ ఆయిల్ ఉన్నాయి.

వ్యాధులకు, వృద్ధాప్యానికి సంబం ధించి ఫ్రీరాడికల్స్‌పై పోరాడేందుకు శరీరానికి తోడ్పడే యాంటి ఆక్సిడెంట్ లక్షణాలు తులసిలో బాగా ఉన్నాయి. క్యాన్సర్‌కు, వృద్ధాప్యానికి, ఎన్నో రకాల రుగ్మతలకు మూలకారణమయ్యే కణాలకు హాని కలగడాన్ని యాంటి ఆక్సిడెంట్స్ నివారిస్తాయి. ఒత్తిడి, నరాలకు సంబం ధించిన రుగ్మతలనుంచి శరీరాన్ని రక్షిం చడంలో తోడ్పడే ముఖ్యమైన ఎడాప్టో జెనిక్ రోగనిరోధక శక్తి తులసిలో ఉంది.

వాస్తవానికి ఎడాప్టోజిన్ అనే పదం సహజమూలికా ఉత్పాదన ఒత్తిడి, ట్రామా, ఆందోళన, అలసటను తొలగిం చేందుకు శరీరంలో రోగనిరోధకశక్తిని పెంచు తుంది. ఇందులో యాంటి ఇన్‌ఫ్ల మేటరీ స్వభావం మొత్తం శ్వాసకోశ వ్యవస్థను కాపాడడంలో తోడ్పడుతుంది. వాతా వర ణాన్ని శుభ్రపరచడంలో దోహదం చేస్తుంది.

**రోగనిరోధక శక్తి :**

ఆయుర్వేదంలో కృష్ణతులసినే విరివిగా ఉపయోగిస్తారు. జలుబు, తలనొప్పి, కడుపునొప్పి, హృద్రోగం, ఇలా ఎన్నో రోగాలను తులసితో నయం చేయ వచ్చును. రోగ నిరోధకశక్తిని, జీవ రసా యన క్రియలను మెరుగుపరుస్తుంది.



శ్వాస క్రియ సమస్యలను (శ్వాస–కాస) తీరుస్తుంది. రేడియేషన్ హాని, కేటరాక్ట్‌ల నుంచి తులసి కాపాడుతుంది. తులసి ఒత్తిడిని తగ్గిస్తుంది. సత్తువను పెంచుతుంది. వాపులను, నొప్పులనుంచి ఉపశమనం ఇస్తుంది. కొలెస్టరాల్‌ను తగ్గిస్తుంది. విషపదార్థాలను తొలగిస్తుంది. రేడియేషన్ నుంచి కాపాడుతుంది. గాస్ట్రిక్ అల్సర్లను నివారిస్తుంది. జ్వరాలను తగ్గిస్తుంది. జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. యాంటి ఆక్సిడెంట్స్‌కు, ఇతర పోషకాల సరఫరాను సమృద్ధిగా సమకూరుస్తుంది. గుండె, రక్తనాళాలు, కాలేయం, ఊపిరితిత్తులను ఆరోగ్యవంతంగా ఉంచడంలో తులసి ప్రభావాన్ని చూపిస్తుంది. రక్తపోటును, రక్తంలో చక్కెరను క్రమబద్ధం చేస్తుంది.

ధన్వంతరి నిఘంటువు ప్రకారం తులసిలో గుణ (లక్షణాలు), లఘు (తేలిక) మరియు రుక్ష (పొడి), రస (రుచి), కటు (వగరు), తిక్త (చేదు), వీర్య (శక్తి), ఉష్ణ (వేడి), ప్రభావ (క్రియ), క్రిమిఘన్ (క్రిములు లేని) ఉన్నాయి. తులసి కషాయం వైరల్ హెపటైటిస్, వైరల్ ఎన్సెఫాలిటిస్‌లలో పనిచేస్తుంది. తులసిలోని క్రిమినాశని లార్వానాశిని గుణాలు దోమల్ని దూరం ఉంచుతాయి. ఎలర్జీలు, ఆస్మాతోపాటు రోగ నిరోధక శక్తికి సంబంధించిన రుగ్మతలను నయం చేయడంలో యాంటి – ఎలర్జిక్, ఇమ్యూనో మాడ్యులేటరీల ప్రభావాన్ని చూపుతాయి. యాంటి స్ట్రెస్ ఎడా ప్టోజెనిక్ ప్రభావాలు ఒత్తిడిని తగ్గిస్తాయి. అర్సోలిక్ యాసిడ్ వలన తులసిలో యాంటి ఫెర్టిలిటీ ప్రభావం ఉంటుంది. పరాన్న జీవుల వలన వచ్చే చర్మరోగాలకు తులసి ఆకులముద్దను వాడతారు. జ్వరంగా ఉన్నప్పుడు ఈ ముద్దను వేళ్ళకు బొటనవ్రేలి గోళ్ళకూ రాయాలి. హానికరమైన సూర్య కిరణాలు, టీవీ, కంప్యూటర్, ఎక్స్‌రేలు, రేడియేషన్ చికిత్స, అత్యంత ఎత్తులో విమాన ప్రయాణాలు వగైరాలవల్ల కణాలు, కణజాలానికి జరిగే హానిని తులసి తగ్గిస్తుంది.

జ్ఞాపకశక్తికి తులసి దివ్యౌషధం. తలనొప్పి, ఒణుకు, కండరాల నొప్పులు, జ్వరాలు, కలరాల్ని ఇది బాగా నయం చేస్తుంది. మలేరియా జ్వరం తగ్గడానికి తులసిని నల్లమిరియాలతోపాటు తీసుకోవాలి. తులసి అల్లంరసం కీళ్ళ నొప్పులను తగ్గిస్తుంది. తులసి గింజల్ని పెరుగు లేదా తెనెతో తీసుకుంటే వాంతులు కడతాయి. నల్లతులసి రసాన్ని నల్ల మిరియాలు నేతిలో కలిపి తీసుకుంటే గాస్ట్రిక్ సమస్యలు తగ్గుతాయి. నల్లతులసి, తేనె మిశ్రమం ఆస్మా రోగులు తీసుకోవచ్చు.

ఈ మిశ్రమం కళ్ళమంటల్ని, ఎరుపును తగ్గిస్తుంది. తులసిలోని యాటి స్మాస మోడిక్ లక్షణం పొత్తికడుపు నొప్పుల నుంచి ఉపశమనం ఇస్తుంది. స్ట్రెప్టోమైసిన్, ఐసోనియాజైడ్ వంటివి ప్రస్తుతం లభిస్తున్న యాంటి టి.బి. ఔషధాలలో గుణాలే తులసి ఆకులలో ఉన్నాయి.

తులసి తైలాన్ని శక్తివంతమైన మలేరియా నివారక ఔషధంలో వాడతారు. ఇందులో దోమలను తరిమివేసే గుణాలు ఉన్నాయి. యాంటిబాడీల ఉత్పాదన పెంచడం ద్వారా అది మానవదేహంలో రోగ నిరోధక శక్తిని అధికతరం చేస్తుంది. మహిళలలో ఈస్ట్రోజన్ హార్మోన్లస్థాయిల్ని మగవారిలో వీర్యం కౌంట్ తగ్గించడం ద్వారా తులసిలో యాంటిఫెర్టిలిటి ప్రభావం ఉంది.

**సౌందర్య సాధనం :**

తులసి సౌందర్య సాధనంగా పని చేస్తుంది. వాణిజ్యపరంగా మూలికలతో తయారుచేసే ఫేస్ ప్యాక్‌లలో తులసి ఒక ప్రధాన దినుసు. తులసిపొడి, వేపపొడి నిమ్మరసం కలిపి తలకు పట్టిస్తే చుండ్రు రాలిపోతుంది. తులసిలో విటమిన్ 'సి' పుష్కలంగా ఉన్నందున అది చర్మాన్ని కాపాడి, చర్మానికి తేజస్సునిస్తుంది.

పర్యావరణ కాలుష్యం పెను భూతమై మానవాళి మనుగడకే ముప్పుగా పరిణమిస్తోంది. చెట్లు కార్బన్‌డయాక్సైడ్ తీసుకుని ఆక్సిజన్ అందిస్తాయని శాస్త్ర జ్ఞులు అంటున్నారు. ఐతే తులసి మొక్క సర్వ కాల సర్వావస్థలయందు ఆక్సిజన్‌నే విడిచిపెడుతుంది. తులసినుంచి వెలువడే వాయువు ఆకాశంలోని ఓజోన్ పొర దెబ్బ తినకుండా సంరక్షిస్తుంది. ఈ ప్రత్యేకతే ప్రతి ఇంటి ఆవరణలో తులసి కొలువయ్యేలా చేసింది. ప్రఖ్యాత స్మారక కట్టడాలు, చారిత్రక ప్రాధాన్యత గల భవనాల సమీపంలోని పరిశ్రమలనుంచి వెలువడే బాహ్యప్రసరణలను తులసి తగ్గించ గలదని పర్యావరణవేత్తలు గట్టిగా భావిస్తున్నారు.

తులసిలో కాలుష్య నివారక, ఆక్సీకరణ నివారక గాలిని పరిశుద్ధం గావించే లక్షణాలు సమృద్ధంగా ఉండటంతో భారత ప్రభుత్వం ఇటీవలనే తాజ్‌మహల్ ఘన వారసత్వంలో లభించిన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చారిత్రక, స్మారక కట్టడాల చుట్టూ తులసి మొక్కలను ముమ్మరంగా పెంచే కార్యక్రమం ప్రారంభించింది. సమీపంలోని పారిశ్రామిక సంస్థలనుంచి వెలువడే రసాయనిక కాలుష్య కారకాలను, వ్యర్థాలను నియంత్రించి పర్యావరణాన్ని తులసి పరిరక్షిస్తుంది. ఆధ్యాత్మికంగా వైజ్ఞానపరంగా ఔషధ విలువల రీత్యా తులసి మొక్కకు ఎన్నో గౌరవ ప్రాధాన్యతలు ఉన్నాయి. పురాణ గ్రంథాలు 'తులసి'ని దైవంగా భావించి పవిత్రతను ఆపాదిస్తే, విజ్ఞానశాస్త్రం తులసిలో అపూర్వ, అపురూప ఔషధ గుణాలకి పట్టం కట్టింది. ప్రభుత్వాలతో పాటు పలు స్వచ్ఛందసంస్థలు తులసి వనాల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి.


**వరప్రసాదం :**

తాజా తులసి ఆకులు లేదా ఎండిన ఆకుల చూర్ణం గాని నీరు సగం అయ్యే వరకు మరిగించి దాన్ని వడబోసి అందులో తగినంత చక్కెర, పాలు, ఏలక్కాయలపొడి కలిపి హెర్బల్ టీ తయారు చేసుకోవచ్చు. ఈ టీ తాగడం వలన మధుమేహంవంటి ఎన్నో జబ్బులు దరిచేరవు. మహోన్నతమైన

ఆధ్యాత్మిక భావనలు, ఔషధ గుణాలు, ఆరోగ్యాన్నిచ్చే పెన్నిధులు తులసి అనుగ్రహించిన వరం. ప్రకృతి మానవాళికి ప్రసాదించిన వరప్రసాదం తులసి. గడ్డిపరక నుంచి వటవృక్షం వరకు విశ్వంలో వృక్ష సంపద మానవాళిని సంరక్షిస్తున్నది. అపూర్వ ఔషధ గుణాలున్న అపారవృక్ష సంపదను పరిరక్షించుకోవాలి.

## ౨౭౧. నవరత్న సంపద

మిలమిలలాడే రంగురాళ్ళు అనాదిగా మానవాళిని ముగ్ధుల్ని చేస్తూనే వున్నాయి. ఈ రంగురంగుల రాళ్ళను వివిధ ఆభరణాలలో పొదిగి ధరించడాన్ని ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు.



అయితే ఈ రాళ్ళు కేవలం అలంకారానికి మాత్రమే పనికొచ్చేవి కావని, వీటికిగల అతీంద్రియ శక్తులు తమ జాతకాలను ప్రభావితం చేయగలవని మనుషులు నమ్ముతారు. వేదకాలం నుంచి ఈ విశ్వాసం నాటుకుని వుంది. దుష్టగ్రహ ప్రభావం నుంచి తమను తప్పించి, అదృష్టాన్ని తెచ్చిపెట్టగల రాయి ఏదో తెలుసుకునేందుకు జ్యోతిష్కులను సంప్రదించడం జరుగుతూంటుంది. వైఢూర్యం, మాణిక్యం, ముత్యం, పగడం, పచ్చ, పుష్యరాగం, వజ్రం, నీలం, గోమేధికం-ఇవి నవరత్నాలు. ఒక్కోరత్నం ఒక్కోగ్రహానికీ, రాశికీ మాత్రమే కాక, దశావతారాల్లో ఒక్కో అవతారానికీ ప్రతీక అని పరాశర మహర్షి పేర్కొన్నాడు. పరాశరుడు ఖగోళ విజ్ఞాన ఖని.

ఇదిలా వుంటే, రామాయణ మహాకావ్యంలోని సప్తకాండల్లో ఒకటైన సుందర కాండకు కూడా నవగ్రహాలతో, నవ రత్నాలతో సంబంధముంది. ముందుగా మహావిష్ణువు అవతారాలకు, నవ రత్నాలకు, నవగ్రహాలకూ నడుమగల అనుసంధానమేమిటో చూద్దాం.

**నవరత్నాలు - అవతారాలు :**

1. మత్స్యం - కేతువు - వైఢూర్యం
2. కూర్మం - శని - నీలం
3. వరాహం - రాహువు - గోమేధికం
4. నరసింహ - అంగారకుడు - పగడం
5. వామన - గురుడు - పుష్యరాగం
6. పరశురామ - శుక్రుడు - వజ్రం
7. రామ - సూర్యుడు - మాణిక్యం (కెంపు)
8. కృష్ణ - చంద్రుడు - ముత్యం
9. బుద్ధ - బుధుడు - పచ్చ

దివ్యాంశ సంభూతులైనవారు ఖగోళ సంచారులని (గ్రహాలు), జీవాంశను ప్రధానంగా కలిగి వున్నవారు సాధారణ మానవులని పరాశరుడు వర్గీకరించాడు. అందువల్ల గ్రహాలు కొన్ని అతీంద్రియమైన శక్తులు గలవి అయ్యాయి. వాటికి

అధి దేవతలున్నారు, వారికి అవి అధీనమై వుంటాయి. మనుషుల పాప పుణ్యాలను బట్టి ఫలితాలను అనుగ్రహిస్తూంటాయి.

**సుందరకాండ – సంబంధం :**

రామాయణ మహాకావ్యంలోని అయిదవ కాండ సుందరకాండ. అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్న ప్రకరణమిది. హనుమంతుడిని సుందరుడని కూడా అంటారు. ఈ కాండలో ఆయనే నాయకుడు కాబట్టి ఆయన పేరిట అది సుందర కాండయైంది. సుందరకాండ పారాయణం సకల శుభదాయకం.

ఈ కాండలోని మొత్తం మూడువేల శ్లోకాలలో దేనికదే శక్తివంతమైనదైనా, నవగ్రహాలకూ – నవరత్నాలకూ సంబంధమున్న తొమ్మిది శ్లోకాలు వున్నాయి. మరి అవేమిటో విపులంగా పరికిద్దాం.

**మాణిక్యం (కెంపు) :**

**తతో రావణ నీతాయాః సీతాయాః శత్రు కర్శనః**
**ఇయేష పదమన్వేష్టుం చారణా చరితే పథి (1.1)**

ఈ శ్లోకసారాంశమేమంటే, తన విరోధులను మర్దించే శక్తి హనుమంతుడికి వుంది. చారణులు (ఆకాశగమనం చేసే వారు) చరించే ఆకాశమార్గాన్నే రావణుడు సీతను తీసుకొని వెళ్ళాడు. సీతను కనుగొనడానికి హనుమంతుడు అదే మార్గంలో విహరించదలిచాడు. సుందరకాండలో మొట్టమొదటిదైన ఈశ్లోకం మొత్తం 24 వేల శ్లోకాలలో 12001 వది. గాయత్రీ మంత్రంలోని 24 అక్షరాలలో 12వ అక్షరంతో ఇది సంవదిస్తుంది.



గాయత్రీ మంత్రంలో ప్రాయికంగా ప్రశంసించబడిన దైవం సూర్య భగవానుడు. ఆకాశమార్గంలోనే ఆయన సంచారం. హనుమంతుడు సూర్యదేవుని అంతే వాసి. సూర్యగమనాన్ని అనుసరిస్తూ ఆయన విద్యనభ్యసించాడు. ఈ కారణంగా ఆయనకు ఆకాశమార్గం సుపరిచితమే. ఈ అంశాలు మంత్రానికి, గ్రహానికి (సూర్యుడు)గల సంబంధాన్ని వివరిస్తాయి. సూర్యదేవుని అనుగ్రహప్రాప్తికి నిర్దేశింపబడిన రత్నం మాణిక్యం లేక కెంపు.

**ముత్యం :**

**యస్య త్వేతాని చత్వారి వానరేంద్ర యథాతవ**
**ధృతిర్దృష్టిర్మతిర్దాక్ష్యం స్వకర్మసు న సీదతి**
(1.189)

ఈ శ్లోకం సారాంశమేమి టంటే "నీకు విజయానికి తోడ్పడే నాలుగు ప్రధాన లక్షణాలు–జ్ఞాపక శక్తి, మేధస్సు, పట్టుదల, నేర్పూ వున్నాయి. అందుచేత నీవు అన్నిటిలో విజయం సాధించి తీరుతావు. అపజయం మాటేరాదు" అని ఈ మంత్రంలో నిక్షిప్తమైన విజయ రహస్యం మేధస్సుకు సంబంధించి నది. మనస్సును ప్రభావితం

చేసే గ్రహం చంద్రుడు. ముత్యం చంద్రునికి ప్రీతిపాత్రమైనది. హనుమంతుని కీర్తికి రంగస్థలమైన సముద్రమే ఈ రత్నానికి ఆకరముగా వున్నది.

**పగడం :**

**అనిర్వేదః శ్రియోమూలం అనిర్వేదః పరం సుఖం**
**అనిర్వేదోహి సతతం సర్వార్థేషు ప్రవ ర్తకః**
(12.10)

ఈ శ్లోకం సారాంశమేమిటంటే, ఐశ్వర్యానికి మూలం ఉత్సాహం. అదే అపరిమితానందానికి హేతువు. నిజానికి అన్ని యత్నాలకిదే చోదకశక్తి. విజయ రహస్యం కూడా ఇదే. హనుమంతుని అపార అనుభవం నుండి ఆవిర్భవించిన సువర్ణ సూక్తి ఇది. తనకుతానే గావించుకున్న గీతోపదేశమిది. ఈ మంత్రం హనుమంతుని ఆశావాదాన్ని వివరిస్తుంది. ఋణం, ఒత్తిడి మొదలైన మానసిక వ్యథలకు అంగారకగ్రహమే కారణం. అంగారకుడు భూదేవి కొడుకు. భూమాతకు సంబంధించిన ప్రదేశాలలోనే లంకలో హనుమంతుడు అన్వేషిస్తాడు. అంగారకుడు అనుకూలంగా లేనప్పుడు మానసిక రుగ్మతలు కలుగుతాయి. అతడు శుభకరుడైతే సర్వశుభాలనిస్తాడు. పగడం ఆయనకు ఇష్టమైన రత్నం.



**పచ్చ :**

**నమోస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యైచ జనకాత్మజాయై**
**నమోస్తు రుద్రేంద్ర యమాని లేభ్యో నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్యః** (13.60)

ఈ శ్లోకం సారాంశమేమి టంటే, “రామ లక్ష్మణులకు, దివ్యమాత జనకాత్మజకు, రుద్ర –ఇంద్ర– యమ – వాయు – చంద్ర సూర్య – ఇతర మరుద్గణాలకు వందనాలు” అని. ఈ ప్రార్థన చేసిన వెంటనే అశోకవనంపై హనుమంతుడు దృష్టి సారించాడు. తన కార్యసిద్ధికిది సంకేతం. దానిని రామతారక మంత్రంగా పండితులు గుర్తించారు. ఈ మంత్రం కారణంగానే ఈ కాండ సుందరకాండము అయింది. మనస్సును సరైన సమయంలో సరైనమార్గంలో నడిపించడానికి నిర్దిష్టమైన గ్రహం బుధుడు. అతడేగనుక శుభుడైనట్లైతే, సునిశిత భావాలు అవసర సమయంలో స్ఫురిస్తాయి. కాబట్టి ఈ మంత్రం బుధునితో అనుసంధానించబడింది. ఆయనకు ఇష్టమైన రత్నం పచ్చ.

**పుష్యరాగం :**

**ప్రియాన్నసంభవేత్ దుఃఖ్ అప్రి యాత్ అధికం భయమ్**

**తాభ్యాంహి యే వియుజ్యంతే నమ స్తేషాం మహాత్మానామ్** (26.50)

ఈ శ్లోకం సారాంశమేమి టంటే, "మనకు కలిగే దుఃఖాలన్నిటికీ మూల కారణం – వస్తువులతో కానీ, వ్యక్తులతో కానీ మనకు గల మమకారం చేత ఎక్కడ వియోగం కలుగుతుందోనని భయపడడం – అయితే మహాత్ము లైనవారు రాగద్వే షాలకు అతీతంగా వుంటారు. అందువల్ల వారికి ఎలాంటి విచారం కలగదు. నేను అలాంటి మహితాత్ములకు వందనాలర్పి స్తున్నాను" అని. ఈ మంత్రం సీతాదేవి జ్ఞానోపదేశం వంటిది. వేదాంత విష యాలకి సంబంధించిన గ్రహం గురుడు లేక బృహస్పతి. ఆయనకు ఇష్టమైన రత్నం పుష్యరాగం.

**వజ్రం :**

**రామః కమల పత్రాక్షః పర్వ సత్వ మనోహరః**

**రూపదాక్షిణ్య సంపన్నః ప్రసూతో జనకాత్మజే** (35.8)

ఈ శ్లోకం సారాంశమేమిటంటే, "జనక మహారాజు అనుంగుపుత్రీ, రాముని నేత్రాలు మిక్కిలి అందమైనవి. తామరపూరేకు సదృశమైనవి. ఏ వ్యక్తి అయినా, ప్రాణి అయినా మోహపరవశమయ్యే అద్భుత సౌందర్య వంతుడాయన. విశిష్ట లక్షణా లతో, ఉత్తమగుణాలతో ఆయన జన్మించాడు".

రాముని వ్యక్తిత్వాన్ని మిక్కిలి వివరంగా వర్ణించడం వినిన తర్వాతనే సీతాదేవికి హనుమంతుడి నిజాయితీపట్ల సంపూర్ణ



విశ్వాసం కలిగింది. అప్పుడు రాముని అంగులీయకాన్ని సీతాదేవికి అందజేశాడు హనుమంతుడు. సుందరకాండము అంత టికీ ప్రకాశవంతమైన సన్నివేశమిది. ఆ కారణంగానే వజ్రంతో సంవదించ బడింది. శుక్ర గ్రహానికి ప్రీతిపాత్రమైనదీ రత్నం.

**నీలం :**

**జయత్యతి బలోరామో లక్ష్మణశ్చ మహాబలః**

**దాసోహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః** (42–33/34)

ఈ శ్లోకం సారాంశమేమి టంటే, "మహాశక్తిశాలి ఐన రాముడికి జయము. మహావీరుడైన లక్ష్మణుడికి జయము. ఎవరి చేతలు సర్వకాలాల్లో మేలు కలిగిం చునో, అట్టి కోసలదేశ రాజైన రాముడికి నేను దాసుణ్ణి" అని. ఈ జయజయ ధ్వానాలు లంకావాసులకు హెచ్చరికలు వంటివి. సీతాదేవిపై శని దుష్ప్రభావం ఇంతవరకు పడింది. ఇకపై ఆమెను వదిలి రావణుని పీడించడం ప్రారంభ

మైంది. ఈ శ్లోకంద్వారా శనీశ్వరుడు సీతా రాములకు శుభుడుగా మారాడని గ్రహిం చాలి. శనికి ఇష్టమైన రత్నం నీలం.

**గోమేధికం :**

**యద్యస్తిపతి శుశ్రూషా యద్యస్తి చరితం తపః**

**యది చా స్త్యేక పత్నీత్వం శీతోభవ హనూమతః** (53.28/29)

ఈ శ్లోకం సారాంశమేమి టంటే, "నేనే గనుక నా భర్త పట్ల అనుకూలవతినైతే, పతివ్రతా ధర్మాలను నెరవేరుస్తూ వుంటే, నేనే గనుక విధిననుసరించి వివాహమైన భార్యనే అయితే, ఓ అగ్నిదేవా... హను మంతుడికి ఏ బాధా కలిగించవద్దు. చల్లగా వుంటూ హాయిని కలిగించు' అని. ఈ మంత్ర ప్రభావంవల్ల హనుమంతుడు అగ్నితాపం నుండి రక్షింపబడ్డాడు. కాలిన గాయాలు, కుష్ఠు మొదలైన వాటినుంచి ఉపశమనానికి జ్యోతిష్కులు రాహుగ్రహ జపాన్ని సూచిస్తారు. రాహువుకు ప్రీతికర మైన రత్నం గోమేధికం.



**వైఢూర్యం :**

**నివృత్త వనవాసం చ త్వయా సార్థ మరిందమం**

**అభిషిక్త మయోధ్యాయాం క్షిపుంద్ర క్షసి రాఘవమ్**

(68.28)

ఈ శ్లోకం సారాంశమేమిటంటే, "ఓ పూజ్యమాతా, నీ భర్త అసమానవీరుడు. శత్రువులను నిర్జించగలడు. అతడు విజయం సాధిస్తాడు. నీవు తిరిగి ఆయ నను కలుసుకొనగలవు. మీరు మీ రాజ్యా నికి వెళ్ళి అయోధ్య సింహాసనాన్ని అధిష్ఠి స్తారు" అని. హనుమంతుని నోటి నుండి వెలువడిన ఈ మంత్రం సీతాదేవి హృద యానికి సంతోషం కలిగించింది. దీనిని రాముని ఎదుట తిరిగి చెప్పినప్పుడు ఆయనకూ ఆనందం కలిగించింది. రామ పట్టాభిషేకాన్ని హనుమంతుడు తన హృద యంలోనే జరుపుకున్నాడు. కారాగార వాసం, బంధం మొదలైన వాటినుండి విముక్తి పొందాలంటే జ్యోతిష్కులు కేతు జపం సూచిస్తారు.

ఈ మంత్రం రాముని వనవాస అంతాన్ని, సతి ఎడబాటు నుండి విము క్తిని సూచిస్తూ, 'కేతు'తో అనుసంధించ బడింది. కేతువుకు ఇష్టమైన రత్నం వైఢూర్యం. ఈ విధంగా 'సుందరకాండ' నవరత్నాల మాలగా భాసించేదైంది. ఈ శ్లోకాలు నవగ్రహ దోషనివారణకు దోహ దకారి కాగలవు. కనుక వీటిని 9 లేక 27 లేక 108 సార్లు వ్యక్తిగతంగా గాని, సామూహికంగాని పారాయణం చేయ వచ్చు. కనీసం ఒక్కసారి పారాయణం

చేస్తే యావత్ సుందరకాండ పారాయణం చేసినట్లవుతుంది.

సుందరే సుందరో రామః
సుందరే సుందరీ కథా
సుందరే సుందరీ సీతా
సుందరే సుందరం వనమ్
సుందరే సుందరం కావ్యం
సుందరే సుందరః కపిః
సుందరే సుందరం మంత్రం
సుందరే కిం న సుందరమ్!

## ౨౨౨. శరన్నవరాత్రులు

**జ.** దసరా అంటే వృత్తి వ్యాపారస్తులే కాదు– పిల్లలు, పెద్దవాళ్ళు అందరూ తాము నిండు ఆరోగ్యంతో, శక్తితో సంవత్సరమంతా వచ్చిన ఉపద్రవాల్ని ఎదుర్కొని విజయం సాధించడం!

ఈ విశ్వమంతా జీవకణాలలోని జీవంగా, శక్తిపుంజమై ఊర్ధ్వలోకాలు, అధోలోకాలలోని కోట్లకోట్ల కొలదీ కదిలేవో, కదలనివోయైన జీవులలో ఉండి నడిపిస్తున్న పరిపూర్ణ శక్తిస్వరూపం అమ్మల గన్నయమ్మ దుర్గాదేవి. ఆమె నాలుగు చేతులతో నడయాడే రూపం కాదు ఈ సృష్టియంతా ఆవరించిన జీవశక్తి రూపం.

విపరీతమైన కోరికలు, తనకి అవసరం లేకపోయినా ఇతరులను హింసించి ఏదో తెచ్చుకోవాలనే ఆరాటం, పదవి, ధనంతో వచ్చిన అహం, గర్వం వీటితో మూర్తీభవించిన జంతుఆకృతి, మహిషమైన మదం వీటిని అణగద్రొక్కి మన



జీవనం ప్రశాంతంగా, ఆనందమయంగా చేసుకోవాలని సూచిస్తుంది ఈ దసరా.

మనలో చాలామందికి వ్యాపారం, వృత్తులు, రాజకీయం–ఇలా ప్రతీ రంగంలో ఉన్నవారికి అధిక ఆరాటం, ఒత్తిడి, అహంకారం. వీటివల్ల తమ సహజస్వభావాన్ని కోల్పోయి జంతుతత్వంలోకి నెట్టబడతాం. అపుడు మనలో శక్తిని కూడదీసి దైవ ఆరాధనతో తిరిగి వాటిని జయించి మనం మనలాగ మసలుకోవటమే దసరా అంటే.

మనుషులలో మానసిక శక్తులు మూడు. మానసిక శక్తులంటే మనలో కలిగే ఆలోచనలు, అనుబంధాలు, ఉద్రేకాలు, కోపాదులు, ప్రేమలు, విచారం, సంతోషాదులు ఇవన్నీ! సత్వరజో తామస గుణాలని మూడు ప్రవృత్తులు మన మనో శక్తులని నియంత్రిస్తాయి. ఇవే తెలియకుండా మన శారీరక శక్తులని కూడా దూషించి వ్యాధులని కలుగచేస్తాయి. చక్కగా ఆలోచిస్తూ దేనికీ తొందర పడ

కుండా ద్వంద్వాలకి అతీతంగా అంటే సుఖదుఃఖాలకి, పొగడ్తలకి, అవమానానికి అతీతంగా ఉంటూ మేధావియై స్థిరమై అందరికీ ఆదర్శప్రాయమై ఉంటే అది స్థూలంగా సత్వ ప్రవృత్తి.

అలాగే మూఢంగా ఉంటూ, మూర్ఖంగా ప్రవర్తిస్తూ, తొందరగా ఆవేశంలో నిర్ణయాలు తీసుకుంటూంటే అది తామస ప్రవృత్తి. రాజసంగా ఉంటూ కోపతాపాలు, గ్రహ అనగ్రహాలు మానావమానాలకు లోనవుతూ అనుకున్నదాన్ని సాధించే మొండి పట్టుదలతో ఉంటుంటే అది రాజస ప్రవృత్తి అవుతుంది.

కాని సభ్య సమాజంలో ముగ్గురూ సమానంగా జీవించాలి. మనకి ఏ కారణం చేతనో పై గుణాలలో ఎక్కువ తగ్గులు ఏర్పడి జీవనం సంఘర్షణామయం అయినప్పుడు మనలోని శక్తిని ఉపాశించి మేల్కొలిపి మనని బాధించే శక్తులని జంతు ప్రవృత్తిని నాశనం చేసుకొని మళ్ళీ మనం నవోన్మేషంతో జీవించాలని శరన్నవ రాత్రులలో చివరిదైన మహిషాసురమర్దని గాధ సూచిస్తుంది. రాక్షస ప్రవృత్తి లోకంలోనే కాదు మనలోను ఉండవచ్చు! దాన్ని జయించడం జీవిత గమ్యం. బుద్ధితో ఆలోచించి రూపాన్ని కల్పించి ప్రాణం పోసి నుదుటని గీతరాసి సృష్టించేది బ్రహ్మ. మనం తెలుసుకొని ఆలోచించి చదివి జీవన గమ్యాన్ని నిర్దేశించుకొని మన భవిష్యత్‌ని రూపకల్పన చేసుకునే మన బుద్ధియే బ్రహ్మ. ఆయనకి ప్రేరణ సరస్వతీ



దేవి. బ్రహ్మకి నాలుగు ముఖాలు, మన బ్రెయిన్‌కి నాలుగు గదులు. వాటి అనుసంధానం నాడీ మండలం. మన సంకల్ప నిర్మాణ స్థితులకు, కదలికలకు ఆ నాడీ మండలం కారణం. దానికి అధిష్టాన దేవత సరస్వతీ దేవి. ఈ శరన్నవ రాత్రులలో మనం సరస్వతీ పూజ చేస్తాం అంటే మనలోని ధారణా పూరణశక్తిని మనం పూజించి మేల్కొలుపుతాం. అది దసరాలో ముఖ్యమైనది. వ్యాపితత్ర విష్ణుః – సర్వత్రా వ్యాపించి లోకాన్ని పోషించే శక్తి వైష్ణవ శక్తి. విష్ణుమూర్తి చరాచర ప్రాణులలో స్థావర జంగమ జీవులలో నిరంతరం సంచరిస్తూ, విరోధులని సంహరిస్తూ లోకాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు ప్రేరణ కలిగించేది లక్ష్మీదేవి. అలాగే మన శరీరంలో నిరంతరం ప్రవహిస్తూ నరనరాన, అణువు అణువునా ప్రతీ జీవకణాన్ని చేరి ప్రాణవాయువుని, పోషకరసాన్ని అందిస్తున్నది రక్తం. ఈ రక్తప్రసారం ఆగిపోతే శరీరానికి పోషణ ఉండదు. ఆ రక్తంలో తెల్లకణాలు మనోవ్యాధి కారణ శక్తులతో

పోరాడి మనలని రక్షణ వలయంలో ఉంచు తున్నాయి. ఆయనకు నాలుగు చేతులు, మన గుండెకు నాలుగు గదులు, వాటికి ప్రేరణ నరాల శక్తి. అదీ లక్ష్మీదేవి.

ఈ శరన్నవరాత్రులలో మనం మహా లక్ష్మి అలంకరణ చేసి పూజించి మేల్కొ లుపుతాం, అంటే మనని మనం పోషించే శక్తిని పొందుతున్నా యాంత్రికంగా సాగి పోతున్నా జీవనయానంలో మనకు తెలి యదు కాని ఈ జీవితానికి ఒక ధ్యేయ మున్నది. అది ముక్తి. ముక్తి అంటే ఎక్క డికో వెళ్ళిపోవడం కాదు, సామాన్యంగా కనిపించని ఆ భగవంతుని దర్శించి, అను భవించి ఆ ఆనందాన్ని అనుభవించడం. దానికి సాధన మనశరీరంలో నిరంతరం సంచరిస్తూ హంసలా తెలియరాకుండా ఉండే ఓజో శక్తి.

Immune Bodies Properdin వంటి సూక్ష్మ పదార్థాల సమిష్టి శక్తి! ఈ ముక్తి కారకుడు ఈశ్వరుడు. ఆయన నిరా కారుడు, దిగంబరుడు. ఈ తేజస్సు శరీరం ఉండి రూపం లేనిది అన్ని దిక్కు లలో ఉన్నది. దీనికి ప్రేరణశక్తి ఎనిమిది చేతులతో ఉండే ఈ శక్తి. మన వెన్నెముకకి చివరన ముక్కోణపు ఆకృతిలో ఉండే cocex అనే ఎముక. దీనికి ఎనిమిది రంధ్రాలుంటాయి. అందులో ముడుచు కొని ఉంటుంది కుండలినీ శక్తి. నిరం తరం చేసే ధ్యాన సాధనతో ఈ శక్తి మేలు కొంటుంది. ముడతలు విప్పుకొని చలన శక్తితో, పైకి ప్రయాణం చేస్తుంది. ఈ



శక్తి ఎంత శక్తివంతమైనదంటే దాని ప్రతీ కదలిక మనిషికి ఏదో అపూర్వ శక్తి నిస్తుంది. ఈ ఊర్ధ్వ గమనంలోవచ్చే ఆకర్ష ణలు, భయాలు వికృత పరిణామాలు తట్టు కొని జయించి మహిషశక్తిని శక్తి నిర్మూ లించినట్లు జయించి ఆనందస్థితికి చేరటం మన జీవనధ్యేయం. అది సాధిం చాలని మనని మేల్కొలిపే పండుగే విజయ దశమి. అలాగే తల్లి మహిషాసుర మర్ది నియై మనకి సాక్షాత్కరిస్తుంది. వైద్య పరంగా ఆరోజు సంపూర్ణ ఆరోగ్యం సంత రించుకున్న సందేశం. ఆశ్వయుజ, కార్తిక మాసాలు శరదృతువు అంటారు. మంచి వెన్నెల కాసే ఆహ్లాదకరమైన కాలమిది. ఈ ఆశ్వయుజ మాస తొలిరోజులలో వచ్చేదీ దసరా. అంతకుముందున్న వర్ష ఋతువులో వృద్ధి చెందిన పిత్తశక్తి అంటే పోషణశక్తి ఈ కాలంలో ఉన్న సూర్య కిర ణాల వల్ల వేడెక్కి కొంచెం చికాకుపరు స్తుంది. అందుకే ఈ నవరాత్రులలో చేదు, పులుపు కల్గిన నేతితో చేసిన పిండి

వంటలు తింటాం. తేలికగా ఉండే పటిక బెల్లం, ఉసిరికాయ, తేనె, పొట్లకాయ తినాలి. పల్లెలో ఉన్నవాళ్ళు పగలంతా సూర్యకిరణాలచే తపించబడిన స్వచ్ఛమైన చెరువులలో కాని బావిలోకాని నీటిని త్రాగటం మంచిది. దీన్ని హంసోదకం అంటారు. ఈ శరత్కాలంలో మంచి గంధం నీళ్ళతో కలిపి శరీరానికి రాసుకోవటం, వట్టివేరు పచ్చ కర్పూరం వాడటం ముత్యాల హారాన్ని ఆడవాళ్ళు ధరించడం మంచిది. ఆడవారు కనీసం ఈ తొమ్మిది రోజులు పట్టుచీర కట్టుకోవడం మంగళప్రదం, ఆరోగ్యకరం. ఈ కాలంలో మంచుతో కూడినవి త్రాగడం, ఎక్కువ ఉప్పు, పెరుగు, నువ్వులనూనె, మాంసాహారం, పగటి నిద్ర, తూర్పుగాలి వీటిని వదిలేయాలి. దసరా దశవిధ దోషాలని శమింపచేసే సరాగం వంటి సంపూర్ణ జీవితం.

## ౨౨౩. దేవవ్రతుడు

**ఔ.** శ్రీమద్ రామాయణ, భారత, భాగవ తాలను చదివితే పుణ్యం వచ్చేమాట నిజ మయినా దాంతో పాటు వ్యక్తికి బత కాల్సిన తీరూ దానికంటె ఓ చక్కని నిస్వార్థపూరితమైన ఓదార్పు లభిస్తుంది.

రాజ్యాన్ని ఏలుతున్న శంతన మహా రాజుకు మగబిడ్డ కలిగాడనగానే హస్తినా పురమంతా అనుకుంది –'బంగారు గొలు సుల ఉయ్యాలలో, వజ్రాలు తాపడం చేసిన శయ్య మీద రతనాల దీప కాంతు లతో ఆడుకుంటూ, ఆకాశాన్నంటే బంగారు మేడలోనే జీవితాంతం వుంటాడ'ని.

అయితే జరిగిందేమిటి? చేతులూ, కాళ్ళూ తెగిపడిన యుద్ధ సైనికులు రాజవంశా లను తిడుతూన్న తిట్లను వింటూ, గడ్డ కట్టిన సైనికుల రక్తాల దుర్వాసనను పీలుస్తూ, ఏ అండాదండా లేకుండా, పీను గులను తినడానికొచ్చిన నక్కల్నీ, రాబం దుల్నీ చూస్తూ, ఎటు కదిలినా బాధ పెట్టే బాణాల అంపశయ్యమీద భీష్ముని చివరి క్షణం ముగిసింది. ఇంతకీ భీష్ముడు ఇలా అయ్యాడంటే ఆయన అధర్మ పరాయ ణుడా? కాదు. వ్యసనపరుడా? అంత కంటే కాదు. శాపగ్రస్తుడా? కానేకాదు కాదుకాదు. మరెందుకిలా అయిపోయాడు? ఆ కథను తెలుసుకుందాం.

**తండ్రి కోసం కొడుకు :**

భీష్ముని అసలు పేరు దేవవ్రతుడు. యవ్వనదశకొచ్చి, పెళ్ళీడుకొచ్చాడు. ఒక రోజున తన తండ్రి శంతనుడు ఎంతో విచారంగా వుండడాన్ని చూసి దానికి కార ణాన్ని గుచ్చి గుచ్చి అడిగాడు. ఏమాత్రం సిగ్గూ లేకుండా శంతనుడు "నాయనా! నువ్వు నాకు కల్గిన ఒకే ఒక్క సంతానా నివి, సాహసం కలవాడివి. మనది యుద్ధాలు



చేయాల్సిన క్షత్రియవంశం. ఎందుకైనా మంచిదని నీకు తోడుగా మరో పుత్రుణ్ణి కనాలనే ఆలోచన నాకొచ్చింది. నీ తల్లి నన్ను విడిచి వెళ్ళి పోయింది. కాబట్టి మరొక ఆమెను (దాశ రాజు కూతురు సత్యవతిని) వివాహం చేసుకోవాలనుకుంటున్నా" న్నాడు. పెళ్ళీడు కొచ్చిన తనకు పెళ్ళి చేయవలసిన తండ్రి శంతనుడు తన పెళ్ళిని గూర్చి కొడుకుతో అనడం వింతగా అనుకోకూడదు. భారతంలో లేనిది భారత దేశంలో వుండదు. భారతదేశంలో లేనిది భారతంలో కన్పించదనేది (యదిహాస్తి తదన్యత్ర... క్వచిత్) భారతాన్ని రాసిన వ్యాసమహర్షి ప్రతిజ్ఞ. తండ్రి పెళ్ళికోసం కొడుకు, తండ్రి ఇష్టపడిన సత్యవతి తండ్రి దాశరాజు వద్దకెళ్ళి విషయాన్ని చెప్పాడు. శంతనునికీ, సత్యవతికీ కలిగే పుత్రునికే రాజ్యమిస్తానంటే కూతురి పెళ్ళికి ఒప్పు కుంటానన్నాడు మొదట్లో దాశరాజు. భీష్ముడు సరేనన్నాక, 'ముందునాటికి నీకుపెళ్ళై, నీ పిల్లలు రాజ్యానికి అడ్డుపడితే ఎలా?' అని మరో అభ్యంతరాన్ని లేవ నెత్తాడు. దానికి సమాధానంగా 'పెళ్ళినే త్యజిస్తున్నా' నన్నాడు దేవవ్రతుడు. దాంతో భీష్మునికి జీవితాంతం పెళ్ళిలేక పోవడం, తండ్రికి పెళ్ళికావడం జరిగింది.

**భీష్మ ప్రతిజ్ఞ :**

ఈ సందర్భంలో దేవతలంతా దేవ వ్రతునిమీద పుష్పవర్షాన్ని కురిపిస్తూ భీష్మ (భయంకర)మైన ప్రతిజ్ఞలను చేయడం చేత 'భీష్మ'డున్నాడని పెద్దగా పలికారు. ఆ బిరుదు పేరే ఆయనకు శాశ్వతమైంది. ఇంతకీ పెళ్ళి చేసుకోనని ప్రతిజ్ఞ చేస్తే అది భీష్మమా? (గొప్ప ప్రతిజ్ఞా?) అదే నిజమైతే లోకంలో పెళ్ళాడనని పెళ్ళిని మానేసిన వాళ్ళూ, ఏవో కారణాలతో పెళ్ళి కాని వాళ్ళు కూడా భీష్ములే కావాలిగా! అయితే భీష్ముడనే బిరుదు పేరులో వున్న భీష్మమనే మాటకు అర్థం వేరుగా వుంది.

అపుత్రస్య గతిర్నాస్తి – వివాహం అయి పుత్రుల్లేక పోవడమో లేక ఏ శాపం కారణంగానో పుత్రుల్లేకపోవడమో కాదు తన పరిస్థితి. ఏ పుత్రులు లేకపోతే 'పుత్' అనే పేరున్న నరకంలో తాను పడవలసి వుందో, ఆ నరకానికి వెళ్ళేందుకు వీలైన తీరుగా వివాహాన్ని కావాలని త్యజించిన అగతిక గతి (ఏమీ చేయలేని స్థితి) తనది. అంటే, కావాలని తన తండ్రి మనోరథం కోసం తనకు రావలసిన మోక్షాన్ని కాల దన్నుకుని నరకాన్ని చేజేతులా ఆహ్వా నించుకోవడం తాను చేస్తున్నపని. దేవ వ్రతుడు ఇంతటి సాహసాన్ని చేస్తున్న కార ణంగా దేవతలు ఈ ప్రతిజ్ఞను 'భీష్మం' (భయంకరమైన సాహసంతో కూడినది) అన్నారు. పోనీ! బ్రహ్మచారిగా వుంటూ, సత్వగుణంతో జీవిస్తూ వుంటే మోక్షం వచ్చే వీలుంది. అయితే అది తన విష యంలో కుదిరే పనికాదు. తాను క్షత్రి యుడైన కారణంగానూ, తన తండ్రి శంత నునికి (తనోఃశమ్ ఇతి శంతనుః– శరీర సుఖమే ప్రధానమనుకునేవాడు) నిత్యం స్త్రీ వ్యామోహము వున్న కారణంగానూ

తనకు యుద్ధాలు చేయక తప్పదు. బ్రహ్మచర్యమనేది సత్వగుణంతో వృద్ధి పొందేది. కావలసివస్తే యుద్ధ మనేదానికి బ్రహ్మచర్యానికి విరుద్ధ మైన రజస్తమో గుణాలు కావాలి. చేసిన ప్రతిజ్ఞ ఒక తీరుగానూ, నడవాల్సిన నడక మరో తీరుగానూ వున్నా, దానికి సిద్ధపడి ప్రతిజ్ఞలు చేసిన కారణంగా వాటిని భీష్మప్రతిజ్ఞలుగా గుర్తించిన దేవతలు దేవవ్రతుణ్ణి 'భీష్ము'డని పిలిచారు.

**తిరిగి వచ్చిన ప్రియురాలు :**

తండ్రి వివాహంతో కథ సుఖాంతం అయ్యుంటే ఏ గొడవా వుండేదే కాదు. ఆ తండ్రి ఇద్దరు పుత్రులను (చిత్రాంగద, విచిత్ర వీర్యులు) కని కాలం చేశాడు. వాళ్ళలో మళ్ళీ చిత్రాంగదుడు యుద్ధంలో మరణించాడు. దాంతో మళ్ళీ కథ మొదటి కొచ్చింది. ఒక్క కొడుకూ యుద్ధాల్లో దురదృష్టవశాత్తూ జరగరానిది జరిగితే వంశం లేకుండా పోతుందిగదా! అనే చింత ప్రారంభమైంది. కాశీరాజు పుత్రికలైన అంబ, అంబిక, అంబాలిక అనే ముగ్గుర్నీ బలవంతాన తెచ్చాడు భీష్ముడు వివాహం చెయ్యాలని. ఇలా తేవడంలో ఎదురొచ్చిన రాజులతో యుద్ధాన్నిచేసి గెలిచాడు కూడ. ముగ్గురిలో 'అంబ' మాత్రం మరొకరిని ప్రేమించానని చెప్పింది. సాదరంగా ఆమెను, సైన్యాన్ని తోడిచ్చి ప్రియుని వద్దకు పంపితే, భీష్మునితో ఇంతకుముందే యుద్ధంలో ఓడిన కారణంగానూ, తన ఓటమిని తన ప్రియురాలే చూచిన కారణం గానూ, అక్కడికి వెళ్ళి 'తిరిగి

artist

వచ్చిన ప్రియురా'లనే కారణంగానూ 'వద్ద'న్నాడు ప్రియుడు. "నాకు వివాహం కానీక అడ్డుపడ్డావు కాబట్టి నువ్వైనా పెళ్ళాడు" అంది భీష్మునితో అంబ. బ్రహ్మచర్య ప్రతిజ్ఞను చెప్పి కుదరదన్నాడు భీష్ముడు. దాంతో అంబ తనప్రతీకార బుద్ధిని చూపించదలచి తపస్సుచేసి, శిఖండిగా మారి కురుక్షేత్రంలో భీష్ముణ్ణి అస్త్ర సన్యాసం చేసేలా చేసింది. ఇదిలా వుంటే విచిత్రవీర్యుణ్ణి పెళ్ళాడిన అంబిక, అంబాలికలకు ఒక అంధుడూ (ధృతరాష్ట్రుడు), ఒక పాండురోగి (పాండురాజు) పుట్టారు. ఆ మీదట ఓ ధర్మాత్ముడు 'విదురుడు' కలిగాడు. వీళ్ళతోనైనా సక్రమంగా కాలం దొర్లితే బాగుందుని భీష్ముడనుకునే లోగానే కురువంశం కాస్తా ధృతరాష్ట్రుని భేదదృష్టి కారణంగా కౌరవులు, పాండవులుగా విడిపోయింది. పరస్పర ద్వేషాలు, ప్రతీకారాలు తీవ్ర మనస్పర్ధలతో రాజ్యం రెండు

భాగాలుగా అయి, ఒకరు హస్తినాపురం, వేరొకరు ఇంద్రప్రస్థంలో వుండసాగారు.

పోనీ! ఎవరి రాజ్యాన్ని వాళ్ళు పాలించుకున్నా భీష్మునికి ఊరట లభించి వుండేది. దుర్యోధనుని కారణంగా కథ ద్రౌపదీ వస్త్రాపహరణం వరకు వెళ్ళింది. అది కురుక్షేత్రానికి తోవ తీసింది. యుద్ధం అనివార్యమైంది.

**కృష్ణభక్తి :**

ఏ వంశం, దాని ప్రతిష్ఠల కోసం ఇంతగా భీష్ముడు శ్రమించాడో అదంతా పగిలిన కుండలా అయ్యేసరికి తీవ్ర నిర్వేదం కలిగింది భీష్మునికి. మొదటి నుండీ తనకున్న కృష్ణభక్తిని తీవ్రతరం చేశాడు. అంపశయ్యను ఎక్కాడు. అన్ని లోకాల్లోనూ ఋషులంతా గానంచేస్తున్న శ్రీ విష్ణునామాలను బాగా మననం చేశాడు. ఈ తోటనుండి మల్లెలను, ఆ తోటనుండి సన్నజాజులను, మరో తోటనుండి మందారాలను.. ఇలా చేర్చి చక్కటి ఆకర్షణీయమైన మాలగా ఏర్చికూర్చినట్లు తానూ ఆ ఈ లోకాల్లో విన్పించే నామాలను ఒక చోట అర్థవంతంగా ఏర్చికూర్చి శ్రీ విష్ణు సహస్రనామాలను సిద్ధం చేశాడు. దాన్నే గానం చేసుకోసాగాడు. తాను యుద్ధ భూమిలో పీనుగుల మధ్య ఉన్న భావన గాని, రాజవంశాలను యోధులు తిడుతున్న తిట్లుగాని, రక్తమాంసాలు ఎండిన బురదగామారి వస్తున్న దుర్వాసన గాని, నక్కల రాబందుల రాకలుగాని తనకేమీ కన్పించడం లేదు, విన్పించడం లేదు,




ఊహకి రావడం లేదు. అంటే పంచేంద్రియాలూ భగవంతునిమీదే కేంద్రీకరింపబడి, కాయేన వాచా మనసా (త్రికరణ శుద్ధిగా) ఆ కృష్ణుణ్ణే అచంచల భక్తితో ధ్యానించసాగాడు. భీష్ముని సమాధి స్థితినీ, తను ఆరాధిస్తున్న స్థాయినీ గమనించిన కృష్ణుడు భయపడ్డాడు. దానిక్కారణం భీష్ముని తపశ్శక్తి స్థాయి ఎంత ఉందంటే – భగవంతుడైన తాను స్వయంగా భీష్ముని వద్దకు వెళ్ళి మోక్షాన్ని అనుగ్రహించి రావలసినంత – అయింది. పంజరపు తలుపులు తెరిచిన తరువాత లోనున్న పక్షి ఎలా ఎగరడానికి సిద్ధంగా ఉంటుందో అలా భీష్ముని ప్రాణాలు పరమేశ్వరునిలో లీనం కావడానికి సన్న ద్ధంగా ఉన్నాయని ఆ స్థాయిలో ఉన్న మహర్షులకూ, దేవతలకూ, ధర్మరాజుకూ అర్థమైంది.

భీష్ముడు కూడ తనకున్న స్వచ్ఛంద మరణమనే వరాన్ని వినియోగించుకో దలచి తన మరణానికి తానే ముహూ

ర్తాన్ని నిర్ణయించుకున్నాడు.

మాఘమాసస్య చాష్టమ్యాం
శుక్లపక్షే చ పార్థివ ।
ప్రాజాపత్యే చ నక్షత్రే
మధ్యం ప్రాప్తే దివాకరే ॥

కృష్ణుడు పుట్టిన అష్టమి తిథిలో, ఆయన జన్మించిన రోహిణీ నక్షత్రంలోనే తనువు చాలించదలిచి మాఘశుద్ధ అష్టమి మధ్యాహ్నం రోహిణీ నక్షత్రాన్ని దానికి ముహూర్త మన్నాడు. అంతే! ధర్మరాజు భీష్మునికి పాదాభివందనం చేసి సమీపించాడు. మహర్షులు ఆయనచుట్టూ నిలిచారు



ఆశీర్వదిస్తూ. సాక్షాత్తు కృష్ణుడు తానుగా విచ్చేశాడు. భక్తి నిండిన భీష్ముని శరీరం నుండి శ్రీ విష్ణు సహస్రనామ గంగా ప్రవాహం శ్రీకృష్ణుణ్ణి ముంచెత్తింది. కృష్ణుడు నిలువెల్లా పులకరించిపోయాడు. శ్రోతగా ఉన్న ధర్మరాజు శరీరాన్ని మరిచి పోయాడు. భీష్ముడు తన శరీర పంజరం నుండి ప్రాణమనే పక్షిని పరమాత్మలోనికి లీనం చేసుకున్నాడు. మోక్షాన్ని పొందాడు.

నిజానికి భీష్ముడు గతించిన అష్టమి నాడే అయినా (భీష్మాష్టమి) శ్రీహరి రూపమైన కృష్ణుడు తనకు అతిప్రియమైన ఏకాదశీ తిథిన భీష్మునికి బహుమతిగా ఇస్తూ 'భీష్మైకాదశి'ని ఓ పర్వదినంగా ప్రకటించాడు.

**రథ పూజ :**

చిక్కుడుకాయలతో రథాన్ని చేసి, దానిలో భీష్మ పితామహుదు (జీవితాలను బాగుచేయాలనే తపనతో పోరాడి పోరాడి అలసి సొలసి చివరికి భగవంతుడే శరణ్యమని నిరూపించి మోక్షాన్ని పొందిన ఉత్తమ భాగవతుడు) ఉన్నట్లుగా భావించి ఆ రథానికే పూజ చెయ్యాలి.

శ్రీ విష్ణు సహస్రనామాలను భక్తితో ఒక్కో నామానికీ అర్థాన్ని తెలుసుకుంటూ గానం చెయ్యాలి. ఆవుపాలతో పొంగలిని చేసి సూర్యునికి నైవేద్యంగా పెట్టి ఇంటిల్లిపాదీ ఆ ప్రసాదాన్ని స్వీకరించాలి. ఓ మహా విశేషమేమంటే – తల్లిదండ్రులున్న వాళ్లు కూడా భీష్ముణ్ణి ఉద్దేశించి ఈ రోజున తర్పణాలను ఇయ్యాలి.

**భీష్మపర్వం :**

వ్యాసభారతంలో భీష్మ పర్వంలో భగవద్గీత ఉంటే శ్రీ విష్ణు సహస్రనామాలు ఆనుశాసనికపర్వంలో ఉన్నాయి. గీత యుద్ధ ప్రారంభంలో అశాంత వాతావరణంలో చెప్పబడితే, ఈ నామాలు యుద్ధాంతంలో ప్రశాంత స్థితిలో గానం చేయబడ్డాయి. గీత విలపిస్తున్న అర్జునుణ్ణి గీత కర్తవ్యోన్ముఖునిగా చేస్తే ఈ నామాలు మోక్షానికి ఎదురు చూస్తున్న భీష్ముణ్ణి తరింపచేశాయి. గీతకు కృష్ణుడు వక్తకాగా అర్జునుడు మాత్రమే శ్రోత. ఈ నామా

లకు భీష్ముడు వక్త. ప్రధాన శ్రోత ధర్మ రాజు. గీతలో భగవంతుడు తన స్వరూపాన్ని తానే వివరించుకుంటే ఈ నామాల ద్వారా భీష్ముడు శ్రీహరి స్వరూపాన్ని విశ్లేషించి చూపాడు. నిజానికి కృష్ణుడే గీతను చెప్పినా అది కురుక్షేత్రం యుద్ధ ప్రత్యక్ష వ్యాఖ్యాత అయిన సంజయుని ద్వారా లోకానికొచ్చింది. విష్ణు సహస్రనామాలు ఎందరోఋషులు చెప్పి ఉన్నప్పటికీ భీష్ముని ద్వారానే లోకానికొచ్చింది. శిష్య లక్షణాలు పూర్తిగా పట్టని అర్జునునికి శ్రీకృష్ణుడు గీతను బోధిస్తే భాగవత లక్షణాలు పూర్తిగా పట్టిన భీష్ముడు శ్రీకృష్ణునికే నామాలను వినిపించాడు.

అందుకే 'గేయం గీతా – నామ సహస్రమ్' భగవద్గీతను గాని, శ్రీ విష్ణుసహస్ర నామాలను గాని పారాయణం చెయ్యాలని ఆది శంకరులవారన్నారు. ఏ నామం చదివితే ఏ ప్రయోజనం నెరవేరుతుందో ఆ విషయం స్పష్టంగా ఉన్నా, మనకు ఏ ప్రయోజనాలు నెరవేరితే అది మనకు



శ్రేయస్కరమో ఆ పరమాత్మకే తెలుసు. కాబట్టి ఈ కోరికకు ఈ నామమను కుంటూ అంతవరకే లేదా దాన్నే చదవడం కాకుండా, మొత్తం శ్రీవిష్ణు సహస్ర నామాలన్నిటినీ చదవడం సర్వకార్యసిద్ధినీ కలగ చేస్తుంది. శంఖం, చక్రం, గద (విల్లు భుజానికి), నందక మనే కత్తినీ (బొడ్లో) ధరించి అభయాన్నిస్తున్న శ్రీమన్నారాయణ స్వరూపాన్ని కళ్లతో ఊహించుకుంటూ శ్రీ విష్ణు సహస్రనామాలను చదవడంవల్ల మరింత శీఘ్రంగా కార్యాన్ని సాధించుకోవచ్చు.

## ౨౨౪. శ్రీకృష్ణ జన్మాష్టమి

**జ.** జగతిని ఉద్ధరించడానికి సాక్షాత్తు భగవంతుడే పుట్టినరోజు కనుక శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం అయింది. భక్త జన కోటికి ఉత్సాహాన్నిచ్చే మహోత్సవం అయింది. శ్రీకృష్ణాష్టమిని దేశ ప్రజలందరూ కన్నుల పండువగా జరుపుకుంటారు. ఈ వేడుకలలో దేశవ్యాప్తంగా రకరకాల భావాలు దర్శనమిస్తాయి. ప్రాంతీయ వ్యత్యాసాలు ఎలా వున్నా, ఆచరించే విధానాలు విభిన్నమైనవే అయినా, ఈ పర్వదిన వేడుకలలో సమష్టిస్ఫూర్తి గోచరిస్తుంది. సర్వత్రా సంతోషం, ఉత్సాహం, సౌమనస్యం వెల్లివిరుస్తాయి. పండుగలు మన సంస్కృతీ సంప్రదాయాలకు సంఘీ భావానికి ప్రతీకలు, ఘన యశోవైభవ దీపికలు. భారతదేశం అనాదిగా భక్తి భావానికి ఆలవాలం. భక్త జనకోటికి నిలయం. మానవాతీత శక్తిపట్ల మదిలో మెదిలే గౌరవ



భావనే భక్తి. అది ఒక దివ్యరసాయనం, భవరోగ నివారకం. అవతారమూర్తుల జన్మ దినాలను పర్వదినాలుగా పాటించడం, వేడుకలు జరపడం అనాదిగా వస్తున్న ఘన సంప్రదాయం. దేశప్రజలు భక్తి ప్రప త్తులతో అత్యంత ఉత్సాహంతో జరుపు కునే పండుగల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్ట మైనది. సర్వభయాలను, సర్వవిఘ్నాలను తొలగించి విజయపథాననడిపించే అద్భుత చైతన్యం కృష్ణనామం. శ్రీ మహావిష్ణువు దశావ తారాల్లో కృష్ణావతారం ఎనిమిద వది. దుష్టశిక్షణ – శిష్టరక్షణ ప్రధానమే అయి కృష్ణావతారం మనసును రంజింప జేసే అనేక అద్భుత రసాల సమన్వయం. శ్రీకృష్ణ పరమాత్మ మధుమోహనమూర్తిగా, మహా పరాక్రమశాలిగా, అనుపమేయ రాజనీతికోవిదునిగా తత్త్వవేత్తగా వర్ణించ బడిన శ్రీకృష్ణచరితం శ్రీమహాభాగవతాది గ్రంథాలలో సవిస్తరంగా వుంటుంది. శ్రీకృష్ణభగవానుడు జగతికి అందించిన దివ్యగ్రంథం శ్రీమద్భగవద్గీత. అవతార పురుషుల జన్మదినాలను పర్వదినాలుగా, పండుగలుగా, జయంతులుగా భావించి ఆ రోజున ఉపవాస వ్రతాలు, పూజాధి కాలు, ఉత్సవాలు జరపడం, రాత్రి జాగరణ చేయడం వంటి ఆచారాలు మన దేశంలో అనాదిగా పాటించబడుతున్నాయి.

**పర్వదినం :**

భువిపై దైవం అవతరించిన ప్రతి సందర్భం పర్వదినమే... ప్రత్యేకమైనదే.. కృష్ణజన్మాష్టమి కేవలం తిథితో మాత్రమే కాదు నక్షత్రంతో కూడా సంబంధించినది. ఉదాహరణకు హిందువులు శ్రీకృష్ణ జన్మాష్టమిని శ్రావణబహుళ అష్టమినాడు జరుపుకుంటారు. అష్టమి రోజున రోహిణి నక్షత్రం వున్న సమయంలో రాత్రి పుట్టాడు కృష్ణుడు. పైన చెప్పిన అష్టమి దక్షిణాదిన శ్రావణ బహుళ అష్టమిగా, ఉత్తరాదిన భాద్ర పద బహుళ అష్టమిగాను భావించ బడు తుంది. దక్షిణాదిన నెలలో శుక్లపక్షం మొదటవస్తే, ఉత్తరాది వారికి కృష్ణపక్షం మొదట వస్తుంది. ఏదయినా కృష్ణాష్టమి రెండు ప్రాంతాలలో ఒకేరోజున వస్తుంది. రోహిణి నక్షత్రంతో కలసి వచ్చిన అష్టమి నాడు వచ్చే కృష్ణజన్మాష్టమి పండుగను 'శ్రీజయంతి' అంటారు. కృష్ణ జన్మాష్టమి నాడు రాత్రి జాగరణ, భజనలు, భగవత్ కథాకాలక్షేపాలు, అర్చనలు, వేడుకలు నిర్వహిస్తారు.

ముద్దుగారే యశోద ముంగిటి ముత్తెము మువ్వ గోపాలుడు.. దేవకీ సుతుడు... చిన్ని కృష్ణుడు... ఆట పాట లలో, అల్లరి చేష్టలలోను అతడు మామూలు బాలకుడు. ధర్మాన్ని నడిపిం చిన అవతార పురుషుడు. ధర్మ స్వరూ పాన్ని ఉపదేశించిన ఆచార్య పురుషుడు – శ్రీకృష్ణ భగవానుడు. కృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతాయి.

ఇందుకోసం ఎంతో ముందుగా ఏర్పాట్లు జరుగుతాయి. జన్మాష్టమి వేడుకలు శ్రీకృష్ణ జనన సమయమైన అర్ధ రాత్రివరకు కొనసాగుతాయి. అంతకు ముందే చిన్న శిశుకృష్ణుని ప్రతిమకు స్నానాదికాలు నిర్వహిస్తారు. చిన్ని కృష్ణుని ఉయ్యాలను ఎంతో అందంగా అలం కరిస్తారు. ఈ ఊయల ఖాళీగా వున్నంత సేపు భగవన్నామ సంకీర్తనలు సాగుతుం టాయి. గంటలు గణగణ మ్రోగుతుం టాయి. సరిగ్గా చిన్న శిశు కృష్ణుని జనన మహత్తర క్షణాలు సమీపించే ముందు కొన్నిసెకన్లపాటు అన్ని దీపాలను, విద్యు ద్దీప అలంకారాలను నిలిపివేస్తారు. ఒక క్షణం అంతా చిమ్మచీకటి, ఒక్కసారే అన్ని దీపాలు మళ్ళీ వెలిగేటప్పటికి అందంగా పూలతో అలంకరించిన చిన్న ఉయ్యా లలో చిరునవ్వులు చిందిస్తూ బాలకృష్ణుడి విగ్రహం దర్శనమిస్తుంది. ఈ వేడుకలు రాత్రంతా, తెల్లవారు ఝాము వరకు జరు గుతాయి. కొన్నిచోట్ల ఇంకా రెండుమూడు



రోజులు ఈ వేడుకలు కొనసాగుతాయి.

కొన్నిచోట్ల పగలంతా ఉపవాసాలు, సాయంకాలం శ్రీకృష్ణ విగ్రహ ఊరేగిం పులు శ్రీకృష్ణ జనన సూచకంగా ఉయ్యా లలు ఊపడం, రకరకాల భంగిమలలో శ్రీకృష్ణ విగ్రహాలను అలంకరించడం... చిన్ని కృష్ణుని చిలిపి అల్లరికి, వెన్న దొంగ చిలిపిచేష్టలకు గుర్తుగా ఉట్లుకొట్టే సంబరం .... ఇత్యాది వేడుకలు జరుగుతాయి.

**శ్రీకృష్ణ పరమాత్మ :**

శ్రీకృష్ణపరమాత్మ పట్ల భక్తిభావంతో, పూజ్యభావంతో కొంతమంది భక్తులు (శ్రీకృష్ణుని పట్ల అచంచల విశ్వాసం గల వారు) ఆరోంతా ఉపవాసం చేస్తారు. ఉపవాసం ఇంద్రియాల్ని, కోర్కెలని నియంత్రించడానికి తోడ్పడుతుందని, ఆయనకు తనని సమర్పించుకున్న వారు అహాన్ని జయించగలరని, పరమానం దాన్ని పొందగలరని, భగవదనుగ్రహానికి పాత్రులు కాగలరని పలువురి నమ్మకం.

భక్తజనులు ఈ జన్మాష్టమిని ఉత్తరాది లోని గోకులం, బృందావనం, మధుర లలో, పశ్చిమాన ద్వారకలో, తూర్పున

'పూరి'లో ప్రత్యేక శ్రద్ధతో, భక్తి ప్రపత్తులతో పాటిస్తారు. ఎంతో ఘనంగా ఈ వేడుకల్ని నిర్వహిస్తారు. ఈ ఉత్సవ స్ఫూర్తి విస్తృతంగా వ్యాపిస్తుంది. ఈ వేడుకల ఉత్సాహ సంరంభం ఎనిమిది రోజుల ముందే సంగీతం, నృత్యం, నాటకాలు, భజనలు, భగవత్ పురాణ (శ్రీకృష్ణ చరితం, శ్రీకృష్ణ లీలలు వివరించే ఇతి హాసం) ప్రవచనాలు ఇంకా అనేక ఇతర సామాజిక ఉత్సవాలతో ప్రారంభమవుతుంది. రెండు రోజుల ఉత్సవంలో మొదటి రోజున శ్రీకృష్ణ జన్మాష్టమి జరుపుకుంటారు. పెక్కు ఇళ్ళల్లో శ్రీకృష్ణ జననానికి సంబంధించిన ఘట్టాలను ఏదో రూపంలో ప్రదర్శిస్తారు. ఉదాహరణకు శ్రీకృష్ణ జన్మస్థలమైన కారాగార దృశ్యాన్ని ప్రదర్శిస్తుంటారు. ఇతర హిందూధర్మ ప్రతీకలకువలె ఈ కారాగారం కూడా లోతయిన అర్థాన్ని, అంతరార్థాన్ని సంతరించుకుంది. ఈ కారాగారాన్ని భౌతిక జీవితానికి ప్రతీకగా అన్వయించుకుంటే, నిర్వాణస్థితిని పొందడానికి, ఈ కారాగార బంధనాలను ఛేదించి బయటపడాలి.



**రంగవల్లికలు :**

శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని ఇళ్ళ ముంగిళ్ళలో, దేవాలయ ప్రాంగణాలనూ మనోజ్ఞమైన రకరకాల రంగవల్లికలతో తీర్చి దిద్దుతారు. ఈ రంగవల్లు లేయడం కోసం సన్నటి నాజూకైన తెల్లని వరి పిండిని ఉపయోగిస్తారు. ముగ్గలకు వాడే వరిపిండిని తెల్ల సన్నబియ్యం నానపెట్టి తయారు చేస్తారు. ఈ పిండితోనే రంగవల్లికలు వేస్తారు. చాలా సందర్భాల్లో వీధివాకిలి గుమ్మం దగ్గర నుంచి బాల కృష్ణుడి ప్రతిమ వున్న మండపం వరకు చిన్ని కృష్ణుడి బుల్లిబుల్లి పాదాలను డిజైన్ ముగ్గులుగా వేస్తారు. చిన్నికృష్ణుడు తన చిట్టి పాదాలతో ఈ చిరుపాదాల ముగ్గు పైన నడుచుకుంటూ మండపానికి వస్తాడని భక్తుల విశ్వాసం. ఇది ఇంటిలోనికి, మందిరంలోనికి, జీవితాలలోనికి శ్రీకృష్ణ రాకను మౌలికంగా సూచిస్తుంది.

**పవిత్రస్థలం :**

శ్రీకృష్ణుడు జన్మించిన పవిత్ర స్థలమైన మధుర చుట్టు పక్కలగల ప్రాంతాలలో ఈ జన్మాష్టమి వేడుకలను ఎంతో ఘనంగా, వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఈ పుడమిపై శ్రీకృష్ణ పరమాత్మ అవతరణ ఘట్టాలను వర్ణించే నాటకీయమైన సుందర దృశ్యాలతో ఇళ్ళను, ఆలయాలను అందంగా అలంకరిస్తారు.

శ్రీకృష్ణుడి జీవితఘట్టాలు, కృష్ణ లీలలు, అవతార విశేషాలు ఈ అలంకారాలలో ప్రముఖంగా చోటు చేసుకుంటాయి. ఇంచు



మించు వాడవాడలా, పేట పేటలో, ప్రతి వీధి మలుపులో కృష్ణజన్మాష్టమి వేడుకల వేదికలు మనకు దర్శనమిస్తాయి. చిట్టి పొట్టి బాలలు ఎందరో బాలకృష్ణుని వేషాలలో మనకు కనువిందుచేస్తారు. ఆ చిన్ని కృష్ణుల్ని చూడగానే మనలో భక్తి పారవశ్యం ఉప్పొంగుతుంది. వారిలో భక్తి భావం అలా జాలువారుతూ వుంటుంది.


**పార్ణ ఉత్సవం :**

గుజరాత్ (పశ్చిమ భారతావని)లో కృష్ణ ఆరాధనం నిత్యకృత్యం జన్మాష్టమి రెండో రోజున ఘనంగా నిర్వహిస్తారు. 'పార్ణ' అనే ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఇక్కడ ఈ రాష్ట్రంలో శ్రీకృష్ణ ప్రతిమను ఇళ్ళలో వుంచి రోజూ పూజిస్తారు. అలా ఇంట్లో పూజించే, కృష్ణ ప్రతిమను ఈ జన్మాష్టమి రోజులలో ఉయ్యాలలో వుంచి అత్యంత భక్తితో అర్చిస్తారు. రాష్ట్రంలోని దేవాలయాలన్నీ తమ ఆలయ ప్రాంగణాలను చక్కగా అలంకరిస్తారు. విగ్రహాలకు అలంకారాలు చేస్తారు. రంగురంగుల విద్యుత్ దీపాలను అందంగా అమర్చుతారు. కృష్ణ నామ సంకీర్తనతో భజనలు హోరెత్తుతుంటాయి. విందువినోదాలతో అంతటా ఆనందం తాండవిస్తుంది.

**ఉట్టికొట్టుట :**

మహారాష్ట్ర (పశ్చిమ భారతదేశం)లో పెరుగు కుండల రూపంలో ఉట్ల ఉత్సవాలు జరుగుతాయి. ఇవి పాలు, పెరుగు, వెన్న పట్ల శ్రీకృష్ణుడికిగల మక్కువను ప్రతిబింబిస్తాయి. బాలకృష్ణుడికి పాలు, మీగడ, వెన్న పాలతో చేసిన పదార్థాలంటే ఎంతో ఇష్టమని కృష్ణలీలా గాథలు చెబుతున్నాయి. చిన్ని కృష్ణుడు తన ఇంట్లోని పాలు, పెరుగు, మీగడ, వెన్నలను తినడమే గాక ఇరుగుపొరుగు ఇళ్ళలో నుంచి కూడా వాటిని కాజేసి ఆరగించేవాడు. చిలిపి అల్లరి చేష్టలు చేస్తూ ఎంతో ఒడుపుగా ఇరుగు పొరుగు ఇళ్ళల్లో దూరి వాళ్ళు దాచుకున్న వెన్న కాస్తా తినేసేవాడు. ఇరుగుపొరుగు ఇళ్లలోని మహిళలు తమ పాలు పెరుగు, వెన్నలను కుండలలో వుంచి వాటిని ఉట్టిలో పెట్టి పిల్లలకు అందకుండా లావుపాటి తాళ్ళతో పైకప్పులకు కట్టి వేలాడదీసేవారు.

అయితే బాలకృష్ణుడు ఏం తక్కువ వాడు కాదు గోపస్త్రీలు ఊహించినంత అమాయకుడేం కాదు. చాలా చురుకైన వాడు. తన మిత్రులను పిరమిడ్ ఆకారంలో నిలబెట్టి వాళ్ళ భుజాలపైకి ఎక్కి ఆ 'ఉట్టి'ని అందుకొని అందదు అనుకున్న అందులోని పెరుగు కుండను అతి లాఘవంగా అందిపుచ్చుకునేవాడు. పాలు, పెరుగు, వెన్న వున్న మట్టి కడవలను దొంగిలించడంతో మొదలైన అల్లరి చిలిపి పనులు కృష్ణుడ్ని వెన్న దొంగను చేశాయి.




గోకులాష్టమి, పెరుగు కుండల ఉట్ల సంబరాల వేడుకలలో ఆయన గాథ, శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు శతాబ్దాల తరబడి కొనసాగుతూ వస్తోంది. ముంబయి, పూనే వంటి నగరాలలో వెన్న దొంగగా చిన్నికృష్ణుని భూమికను ప్రత్యక్షంగా కళ్ళకు కట్టిస్తూ ఈ కృష్ణజన్మాష్టమి వేడుకల్ని ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. ఇంచుమించు నగరంలో ప్రతీ వీధిలో ఇటువంటి దృశ్యం సర్వసాధారణమే. ఉదాహరణకు ప్రతీ నివాస ప్రాంతంలోని నివాసులు ఈ ఉట్ల సంబరాన్ని నిర్వహిస్తారు. వీధిలో సరైన కూడలి ప్రాంతంలో ఒక ఉట్టిని పైనుంచి వేలాడదీస్తారు. అన్ని వైపులకు జరిగేలాగా దానిని ఏర్పాటు చేస్తారు. ఆ ఉట్టిలో చిన్న కుండను వుంచుతారు. ఆ చిన్న కడవలో విలువైన బహుమతిని, సాధారణంగా నగదు బహుమతి వుంచుతారు. యువకులు (సంప్రదాయ దుస్తులలో బాలురు అయితే ఈ రోజులలో బాలికలు కూడా) వెన్నదొంగ వేషం వేస్తూ పిరమిడ్ ఆకారంలో నిలుస్తారు. ఉట్టిని కొట్టి బహుమతి అందుకోవాలని ప్రయత్నిస్తారు. పెరుగు కడవలు వుంచిన ఉట్లు ఎక్కడెక్కడ వున్నాయో నగరాల్లో తిరిగే గోవిందులు అని పిలువబడే యువత జట్లుగా ఏర్పడి వారిలో చేరుతారు. ఈ ఉట్ల సంబరంలోని వినోదాంశం ఏమిటంటే వెన్న దొంగ వేషధారులు ఉట్టిలో కుండను అందుకోవడం కోసం చేసే ప్రయత్నంలో భాగంగా వారంతా పిరమిడ్ ఆకారంలో ఇంచుమించుగా ఉట్టి అందే ఎత్తువరకు నిలుపుతారు. ఈ సంబరాలను చూడడానికి వచ్చే వారు వెన్న దొంగలు ఉట్టి కొట్టే ప్రయత్నం భంగపరుస్తుంటారు. వాళ్ళకు ఆ ఉట్టి అందకుండా ఉండేందుకు వాళ్ళపై నీళ్ళు చల్లి పిరమిడ్ ఆకారంలో నిలిచిన వాళ్ళను చెదరగొట్టాలని చూస్తారు. వాళ్ళ ప్రయత్నాల్ని భగ్నం చేస్తారు. వాళ్ళకు ఉట్టి అందకుండా చూస్తారు. అయితే ఇదంతా సరదాగా చేసే అల్లరి. కాని ఇలా వినోదం పంచడానికి చేసే ఈ విన్యాసం సవాలు వంటిదే. పిరమిడ్ ఆకారంలో నిలిచిన వెన్న దొంగ వేషధారులందరూ తమ ప్రయత్నంలో విజయం సాధించాలంటే వాళ్లలో సంకల్పబలం, చెక్కుచెదరని ఏకాగ్రత, జట్టులోని ప్రతిఒక్కరిపట్ల పూర్తి నమ్మకం, తమలక్ష్యాన్ని చేరాలనే కృతనిశ్చయం అవసరం. జన్మాష్టమిగా, గోకులాష్టమిగా లేదా శ్రీకృష్ణ జయంతిగా పిలు



చుకునే ఈ శుభ పర్వదినాన్ని దేశ ప్రజలందరూ కన్నుల పండువగా జరుపుకుంటారు. పండుగ వేడుకలు, పూజాదికాలు, సంప్రదాయ సంబరాలు ఎంతో ఉత్సాహంగా సాగుతాయి. ప్రాంతాలు వేరైనా, పాటించే పద్ధతులు ఏవైనా పండుగలు సంఘీభావానికి ప్రతీకలుగా నిలుస్తాయి సౌహార్ద్రం, సౌమనస్యం సంతోషం అంతటా వెల్లివిరుస్తాయి. ఘన సంస్కృతిని, సంప్రదాయ స్ఫూర్తిని పరివ్యాప్తం చేస్తాయి.

## ౨౨౫. ముక్కోటి ఏకాదశి

**జ.** భారతీయ సంప్రదాయంలో ప్రాచీనులు ఏ ఏర్పాటు చేసినా అందులో వైద్య రహస్యం, సామాజిక స్పృహ, శారీరక రక్షణ విధానం, ఆధ్యాత్మిక భావం... అనేవి తప్పక ఇమిడి ఉంటాయి. ఉదాహరణకి భాద్రపద మాసంలో పత్రితో పూజ ఉంది. ఏ ఆకు ఏ వ్యాధికి ఔషధమో తెలియజేస్తుంది ఆ పూజ. ఆశ్వయుజ మాసంలో నరకచతుర్దశి నాడు నరకాసురుని బొమ్మని దహించడం అనే తంతు ఉంది. దాని ద్వారా వ్యక్తి ఎలా ఉండకూడదో గమనించుకునే సామాజిక ధర్మం



ఇమిడి ఉంది. కార్తికమాసం ఉంది. నేతిబీరకాయనీ, ఉసిరికాయనీ వాడాలనీ ఉసిరిచెట్టు కింద భోజనాన్ని చేయాలనీ ... ఇలాటి నియమాలున్నాయి. అవి శరీర ఆరోగ్య రక్షణని తెలియజేస్తాయి. ఈ క్రమంలో ఈ పుష్యమాసంలో వచ్చే శుద్ధ ఏకాదశికి – అంటే –ముక్కోటి ఏకాదశికి ఉత్తరద్వార దర్శనాన్ని ఏర్పాటు చేశారు పెద్దలు. శరీరంలో భగవంతుడెక్కడుంటాడో ఆయన్ని ఎలా దర్శించుకోవాలో చెప్పే అద్భుత విధానం ఉంది ఈ దర్శనంలో. వివరంగా అనుకుంటూ వెడదాం!

**శుద్ధైకాదశులు :**

సంవత్సరంలో పూర్ణిమకి ముందొచ్చే ఏకాదశులు (శుద్ధైకాదశులు) పన్నెండు అయినా, వాటిలో నాలుగు ఏకాదశులు మాత్రమే ప్రధానంగా కన్పిస్తాయి. వీటిలో మొదటిది ఆషాఢ శుద్ధ ఏకాదశి. ఈ రోజున శ్రీమహావిష్ణువు యోగనిద్రకి ఉపక్రమిస్తాడు కాబట్టి శ్రీహరి శయనించే ఏకాదశి అనే పేరిట దీన్ని 'శయనైకాదశి' అన్నారు పెద్దలు. ఇంతేకాక దక్షిణాయనం



రాగానే వచ్చే మొదటి ఏకాదశి ఇదే అవుతున్న కారణంగా దీన్ని 'తొలి ఏకాదశి' అని కూడ లోకం వ్యవహరిస్తోంది.

ఇక ప్రాధాన్య క్రమంలో రెండవది కార్తిక శుద్ధ ఏకాదశి. ఈ రోజున శ్రీమహావిష్ణువు యోగ నిద్రనుండి మేల్కొంటాడనే కారణంగా ఈ ఏకాదశిని ఆయన ఉత్థానం (మేల్కోవడం లేదా నిద్ర లేవడం) పేరిట 'ఉత్థాన ఏకాదశి' అని పిలిచారు పెద్దలు.

మూడవదైన నేటి పుష్య శుద్ధ ఏకాదశిని గూర్చి ఎలాగూ (ముక్కోటి ఏకాదశి) అనుకోబోతున్నాం కాబట్టి, నాల్గవదైన ఏకాదశిని గూర్చి ముందు అనుకుందాం. నాల్గవ ఏకాదశి మాఘమాసంలో వచ్చే శుద్దైకాదశి. దీన్నే భీష్మైకాదశి అన్నారు. భీష్ముడు శ్రీ విష్ణుసహస్ర నామాలని శ్రీకృష్ణుని సమక్షంలో గానంచేసి మోక్షాన్ని పొందిన కారణంగానూ, శ్రీకృష్ణుడే అంగీకరించి తనకిష్టమైన ఏకాదశిని భీష్ముని పరం చేసిన కారణంగానూ దీన్ని ఆయన పేరిట 'భీష్మైకాదశి' అని వ్యవహరించారు పెద్దలు.

ఇక నాల్గింటిలో మిగిలిన ఈ పుష్య శుద్దైకాదశిని 'ముక్కోటి ఏకాదశి లేదా వైకుంఠ ఏకాదశి' అని పిలుస్తారు. దక్షిణాయనం రాగానే వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశి అని పిలుస్తారనుకున్నాం కదా! నిజానికిది దక్షిణాయనం ముగింపులో వచ్చే ఏకాదశి కాబట్టి 'తొలి ఏకాదశి' కావాలి. కాని ఈ రోజున 'ఉత్తర ద్వార దర్శన' మనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తూండే కారణంగా మలి ఏకాదశి లేదా అంత్య ఏకాదశి... అంటూ పిలవలేదు పెద్దలు. ఇంతకీ ఉత్తరమేమిటి? ద్వారమేమిటి? దర్శనమేమిటి? తెలుసుకుందాం! ఒక చిన్న స్థలముంటేచాలు దానికి నిట్టనిలువుగా తూర్పు పశ్చిమాలూ అడ్డంగా ఉత్తర దక్షిణాలూ ఉంటాయి కదా! ఈ ఉత్తర దక్షిణ విభాగాన్ని ప్రాచీనులు కేవలం ప్రదేశాలకి మాత్రమే పరిమితం చేయకుండా కాలంలోనూ శరీరంలోనూ కూడ ఈ విభాగాన్ని చేశారు. కాలంలో ఉత్తరం పగలు. కాలంలో దక్షిణం రాత్రి. ఎక్కడైనా ఉత్తర దక్షిణాల్లో ఉత్తరమే పవిత్రమైనదీ శ్రేష్ఠమైనదీ కదా! అందుకని పగటిని ఉత్తరంగానూ రాత్రిని దక్షిణంగానూ పోల్చి చెప్పారు పెద్దలు. ఈ కారణంగానే దురదృష్టవశాత్తూ ఎవరైనా మరణిస్తే సూర్యాస్తమయం అయ్యేలోగా – అంటే కాలంలోని ఉత్తర భాగంలోనే దహన క్రియలన్నీ చే(యి)స్తారు తప్ప, కాలంలో దక్షిణమైన రాత్రిపూట ఎవరూ చేయరు, చేయించరు కూడ. ఇదే తీరు ఉత్తర దక్షిణ

విభాగాన్ని వ్యక్తి శరీరంలో కూడ చేశారు పెద్దలు. ప్రతివ్యక్తి శరీరానికీ ముఖం తూర్పు. అందుకే నుదుట బొట్టుని పెట్టుకుంటారందరూ. సూర్యుడు ఉదయించేది తూర్పుననే కాబట్టి, ఆ సూర్యుని రంగులో అదే సూర్యుని ఆకారంలో సరిగ్గా సూర్యోదయ వేళలో ధరించవలసినది కుంకుమ అన్నారు సంప్రదాయం తెలిసినటువంటి మన పూర్వులు. ఇక తూర్పు దిక్కుకి కుడివైపున ఉండే దిక్కు దక్షిణం. శరీరంలో పాదాలక్రింది భాగం దక్షిణ దిక్కు అవుతుంది. అదే విధంగా శరీరానికి వెనుక భాగం పశ్చిమం అవుతుంది. ఈ పద్ధతిలోనే శరీరానికి పైభాగం – అంటే – తలకి పైభాగం ఉత్తరం అవుతుంది. ఎత్తుగా ఉండేదీ కఠినంగా ఉండేదీ ఏదో దాన్ని కొండ అన్నారు. శరీరానికి ఉత్తరంగా ఎత్తుగానూ గట్టిగానూ ఉండేది తల ఎలా అవుతోందో అలాగే మన దేశానికి కూడ ఉత్తరంగా ఉంటూ ఎత్తుగానూ కఠినంగానూ ఉన్నది హిమాలయ పర్వతం. ఇది ఎలాగైతే సూర్యునిరాక కారణంగా కరిగి భూమికి గంగని ప్రవహింపచేస్తుందో, అదే తీరుగా మనశిరోభాగం కూడ జ్ఞానమనే సూర్యుని ప్రవేశం కారణంగా కరిగి జ్ఞాన గంగని ప్రసరింపచేస్తుందని పెద్దలు ఊహించారు. హిమాలయాలకెంత గౌరవ స్థానం ఉందో అదే తీరుగా ప్రతివ్యక్తి శిరోభాగానికీ అంత మన్ననా ఉంటుంది. వ్యక్తికి అతిముఖ్యమైన జ్ఞానేంద్రియాలు త్వక్ (శరీరం), చక్షు (కళ్లు), శ్రోతృ (చెవులు), జిహ్వ (నాలుక), ఘ్రాణ (ముక్కు) అనేవి ఉన్నాయో ఆ ఐదూ ఒకేచోట కల్గి ఉన్న శరీర అవయవం శిరస్సు. ఇలాటి శిరస్సు శరీరానికి ఉత్తర భాగమైంది. ఈ శిరోభాగానికి సరిగ్గా నడిమిభాగంలో – అంటే – మాడు భాగంలో ఒక రంధ్ర ముందని గుర్తించారు ప్రాచీనులు. దాన్నే బ్రహ్మరంధ్రము అన్నారు. శరీరానికి ఉత్తరాన ఉండే ఆ రంధ్రాన్ని కప్పివేస్తూ ఉండే ద్వారం (ద్వి = రెండు, అర = తలుపులు కలిగినది – ద్వే అరే యస్యతత్ ద్వారమ్) ఉత్తరద్వారం. ఆ ద్వారం తెరిచి ఆ ద్వారం ద్వారా ఆ లోపల ఉన్న పరమే శ్వరుణ్ణి దర్శించడమే 'ఉత్తరద్వార దర్శన' మంటే. ఇక్కడ పరమేశ్వరుడు దాగి ఉంటాడు కాబట్టే, తల్లులంతా తమ పిల్ల లకి పండుగలప్పుడూ పబ్బాలప్పుడూ నూనెని ఆ ప్రదేశంలో మూడు నాలుగు వేళ్లతో అద్ది ఆ మీద అక్షతలని వేసి దీవించి ఆ మీదట అభ్యంగనస్నానాన్ని (తలంటు) చేయిస్తారు. ఈ ప్రదేశం (బ్రహ్మరంధ్రం



లేదా మాడు) అతి పవిత్రము కాబట్టే శ్రోత్రియులైనవాళ్లు ఈ ప్రదేశంలో కూడా కుంకుమని ధరిస్తారు – అంటే – బొట్టు పెడతారు. అందుకే మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేక మయ్యాక శంక రునికి అలంకారాన్నిచేస్తూ శివలింగపు అగ్రభాగంలో కూడ విభూతిని పూసి గంధాన్నిగాని కుంకుమనిగాని పెడ తారు. ఖచ్చితంగా శివలింగపు పై భాగంలో పుష్పాన్ని అలంకారార్థం పెట్టేది ఎందుకంటే, ఈ ప్రదేశం అతి పవిత్ర మైనదని మనకి తెలియజేయడానికే. ఈ ప్రదేశంలో పరమేశ్వరుడుంటాడు కాబట్టీ, ద్వారం అనేదానికి ఎప్పుడయినా తెరు చుకునే లేదా తెరిచే వీలుంటుంది కాబట్టీ వివాహకాలంలో వధూవరులు ఒకరి బ్రహ్మరంధ్రంపై మరొకరు గుడజీరక మిశ్రమాన్ని (బెల్లం, జీలకర్ర నూరిన ముద్ద) ఉంచుకుని పరమేశ్వర సాక్షిగా ఒక్కటవుతారు.


**త్రివేణి సంగమస్థానం :**

ఇప్పటిదాకా చెప్పినదాన్ని బట్టి ఉత్తర ద్వార దర్శనమంటే అర్థమైందిగాని మరి దీనికి 'ముక్కోటి ఏకాదశి' అనే పేరెలా వచ్చిందనే సంశయం మనకి కలగక మానదు. మూడు+నీరు–మున్నీరు, మూడు + కంటి–ముక్కంటి, మూడు + పేట – ముప్పేట అని అయినట్లుగా 'మూడు + కోటి – ముక్కోటి అవుతుంది. ఈ చెప్పు కోబోయేది యోగశాస్త్రానికి సంబంధిం చిన అంశం. ప్రతి వ్యక్తికీ ఉన్న కుడి ముక్కు రంధ్రం పేరు పింగళ. ఎడమ ముక్కు రంధ్రం పేరు ఇడ. ఈ రెండు నాడులూ ఏటవాలుగా పైపైకి – అంటే – నుదుటి వైపుకి ప్రయాణాన్ని సాగిస్తూ ఉంటే, సరిగా భ్రూమధ్యంలో (రెండు కనుబొమల మధ్య ప్రదేశంలో) సుషుమ్న అనే మరో నాడి (బ్రహ్మరంధ్రం నుండి వెన్నెముక చివరి భాగంవరకూ నిట్టనిలువునా వ్యాపించి ఉన్న నాడి) ఈ రెండు నాడు లనీ తాకుతుంది. ఈ మూడు నాడులూ ఒక్కచోట కలిసే ఆ భ్రూమధ్యమే శరీ రంలో ఉన్న 'త్రివేణీ సంగమ స్థానం'. లోకంలో ఉన్న త్రివేణీ సంగమాన్ని పరి శీలిస్తూ ఇది మన శరీరంలో కూడ ఉందని భావించగలగాలి. ఆ త్రివేణీ సంగమంలో ఎలా గంగా యమునలనే రెండు మాత్రమే ప్రత్యక్షంగా దర్శనమిస్తూ ఎలా సరస్వతీ నది కన్పడదో, అంతర్వాహినిగా (కనిపిం చకుండా లోలోన ప్రవహించే లక్షణం కలది) ఎలా ఉంటుందో అదే తీరుగా ఇడా పింగళనాడులని మనం ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారానూ కుడి ఎడమ ముక్కు రంధ్రాల ద్వారానూ గుర్తించగలం గాని, అక్కడ సరస్వతీ నది కన్పడనట్లు ఇక్కడ కూడ సుషుమ్నా నాడి కన్పడదు. ఈ మూడు నాడులూ ఒకచోట కలిసే ఆ భ్రూమధ్య ప్రదేశం అతిపవిత్రమైన కారణంగానే శ్రోత్రియులందరూ అక్కడే కుంకుమని ధరిస్తారు. వైష్ణవులు కూడ నిలువుగా ఊర్ధ్వపుండ్రాలని ధరించినా ఈ ప్రదే శంలో బొట్టుని ధరించేది ఇందుకే.

యోగాభ్యాసాన్ని చేసే సాధకులందరూ శ్రీహరి యోగ నిద్రకి ఉపక్రమించిన శయనైకాదశి (ఆషాఢమాసంలోని శుద్ధ పక్ష ఏకాదశి)నాడు ప్రారంభించి యథార్థంగానూ నిష్ఠతోనూ యోగసాధనని సక్రమంగా చేస్తే ఈ ఏకాదశికి – అంటే – పుష్య శుద్ధ ఏకాదశికి వైకుంఠ దర్శనమౌతుందనీ, ఆ కారణంగా ఇది వారి పాలిటి వైకుంఠ ఏకాదశి అవుతుందనీ పెద్దలు గుర్తించిన అంశం. ఇక ఇడ పింగళ అనే నాడులు రెంటినీ రెండు గుర్రాలుగా భావించి సక్రమమైన రీతిలో ప్రాణాయామ విధానాన్ని పాటిస్తున్న యోగసాధకునికి, ఎవరికీ కన్పించని సుషుమ్నానాడి కూడ అనుభవంలోకి వస్తుందనీ, ఆ సుషుమ్నా నాడిలో పరమేశ్వరుడున్నాడనే యథార్థం కూడ అతనికి అర్థమౌతుందనీ, ఆ కారణంగా 'మూడు = మూడైన ఇడ పింగళ సుషుమ్నా నాడుల, కోటి = చివరి భాగం (బ్రహ్మ రంధ్ర స్థానం) అతని వశంలోనికి వస్తుందనీ, ఆ కారణంగా ఈ ఏకాదశి అతని పాలిటి 'ముక్కోటి ఏకాదశి' కూడ అవు తుందనీ ప్రాచీనులు (యథార్థాన్ని దర్శించి) లోకానికి తెల్పారు.

**సప్తపది :**

ఏదైనా ముఖ్యమైన పనిమీద వెళ్లే వ్యక్తి ముందుగా ఉత్తరానికి నాల్గడుగులు వేసి ఆ మీదట తాను వెళ్లదలిచిన దిశవైపుగా ప్రయాణించవలసిందని చెప్తోంది శాస్త్రం. (తస్మా దుత్తరతోఽభిప్రయా జయతి) నూతన వధూవరులని తమలపాకుల మీద నడిపిస్తూ 'సప్తపది' పేరిట ఏడడుగులని ఆ ఇద్దర్నీ కలిపి నడిపించేది తొలుతగా ఉత్తరదిక్కువైపుకే. అందరికీ అతి ముఖ్యమైన ఏ ధనం అనేది ఉందో ఆ ధనానికి అధిదేవత అయిన కుబేరుడు ఉండేది ఉత్తరదిక్కునే. ఇలా ఉత్తరానికి ఎంతో ప్రాముఖ్యముంది. అలాటి ఉత్తరపు దిక్కులో ఆ ఏకాదశినాటి తెల్ల వారు జామున పరమేశ్వరుణ్ణి దర్శింపజేస్తారు 'ఉత్తరద్వార దర్శనం' పేరిట ఆలయాల్లో. ఆ స్వామి దర్శనాన్ని చేసి, మన శరీరంలోని ఉత్తర ద్వారంలో కూడ స్వామిని ప్రతిష్ఠించుకుని దర్శించుకుంటే అదే నిజమైన 'ఉత్తరద్వార దర్శనం'. పునర్దర్శన ప్రాప్తిః భూయాత్ ।



## ౨౨౬. ఇద్దరు తల్లుల ముద్దుల బిడ్డడు

**జ.** ఏం చిత్రమో తెలియదుగాని, ఈ పండుగని గూర్చీ, ఈ దైవాన్ని గూర్చీ తలెత్తినన్ని అనుమానాలు మరి ఏ పండుగని గూర్చీ, దైవాన్ని గూర్చీ కన్పడనే



కన్పడవు. ఐతే ఇందులో విశేషాన్ని అర్థం చేసుకుంటే 'ఈ పండుగలో – దైవంలో ఇన్ని విశేషాలున్నాయా?" అని అన్పిం చకనూ మానదు. కొన్ని అనుమానాల్ని మచ్చుకి అనుకుని లో విశేషానికి వద్దాం!

నాగులచవితికి పుట్టలో పాలు పొయ్యడం చేశాం కదా! మళ్ళీ ఈ సుబ్రహ్మణ్య షష్ఠి నాడు పుట్టలో పాలు పొయ్యాలా? ఈ రెంటిలో ఏది ముఖ్యం? ఏది అముఖ్యం? రెండూనా? నిజంగా పుట్టలో పాముండి అది తాగితేనే కదా మనం పాలని పోస్తే సార్థకమయ్యేది! పుట్టలో పాము మనకి కన్పడకపోయినా, ఆ పుట్టలో పాముందని చూచాయగా ఎవరైనా అన్నా మనం ఆ పుట్టవైపుకి వెళ్ళనే వెళ్ళంకదా? మరి పుట్టలో పాము లేనే లేదని దృఢం చేసు కున్నాక పుట్టలో పాలనిపోస్తే ప్రయోజన మేమిటి? అసలు వాస్తవాన్ని పరిశీలిస్తే – పాము పాలు తాగనే తాగదుకదా! మరి ఈ పుట్టేమిటి? పాముండడం – లేక పోవ డమేమిటి? పాలు పోయడమేమిటి?... ఇలా ఎన్నెన్నో అనుమానాలు. ఇక సుబ్ర హ్మణ్యేశ్వరుని గూర్చి చెప్పలేనన్ని సందే హాలున్నాయి. ఈయన గంగాదేవికి పుట్టి నందువల్ల 'గాంగేయు'డయ్యాడని పురాణం చెప్పేంతలోనే అదే పురాణం ఈయన శర వణం (రెల్లు)లో పుట్టినందు వల్ల 'శరవణ భవు' డయ్యాడని మరోచోట చెప్తుంది. మరో పురాణం ఈ దేవుడి జన్మని గూర్చి వివరిస్తూ గంగా – పార్వతుల పుత్రుడైనం దువల్ల ఈయన 'ఇద్దరు తల్లుల ముద్దుల బిడ్డడు' అంటుంది. ఇద్దరికో ఒకరికో మొత్తానికి పుట్టాడు గదా! అని ఆనందిం చబోతే, ఈయన 'జారిపడినవాడు సుమా!' అని 'స్కందు'డనే పేరు మన ఆలోచనకి అడ్డుకట్ట వేస్తుంది. 'ఇదంతా కాదు. ఈయన పుట్టింది 'కృత్తిక'లనే పేరు గల ఆరుగురు స్త్రీలకి – ఆ కారణంగానే ఈయన పేరు 'కార్తికేయు'డంటుంది మరోపురాణం. ఈయనకి 'వల్లీ – దేవ సేన' అనే పేర్లుగల భార్యలున్నారని అను కునేంత లోపే 'ఈయన బ్రహ్మచారి అనీ –అసలు పెళ్ళేకాలేదు' అనీ మరో పురాణం పెళ్ళి కథని కొట్టిపారేస్తుంది. ఇలా సందేహాలని ఎన్నింటిని తవ్వి తెచ్చు కుంటాం? ఎన్ని కావలిస్తే అన్ని సందే హాలూ పైన చూపినతీరుగా స్పష్టంగా సాక్ష్యాధారాలతో కన్పిస్తాయి. ఈ దశలో ఈ నేపథ్యంతో 'ఈయన ఓ దేవుడేనా? ఈయన పేరిట వున్న ఈ శుద్ధ షష్ఠి – ఈయనకి సంబంధించిన పండుగ రోజేనా?' – వంటి అనుమానాలు కలుగు

తాయి. ఈ సందేహాలకు సరైన సమాధా నాలు తెలుసుకుందాం!

**మానసపుత్రుడు :**

కంచి కామకోటిపీఠ పరమాచార్యులూ – 'నడిచే దేవు' డని కొనియాడబడిన వారూ అయిన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వాములవారు ఈ పండుగని గూర్చిన – దైవాన్ని గూర్చిన సంశయాలని తొలగిస్తూ చక్కని సమన్వయాన్ని ప్రమాణ బద్ధంగా ఇలా సెలవిచ్చారు.

ఫలానివానికున్న అందం, ఫలానివాని కున్న మేధావితనం, ఫలానివానికున్న ఐశ్వర్యం ... కలిగి 'నాకొక పుత్రుడు కలిగితే బాగుండు'నని ఎవరైనా మనసులో సంక ల్పిస్తే అలాటివాణ్ణి 'మానసపుత్రు'డని అంటారు. ఈ తీరులో బ్రహ్మ ఎన్నోమార్లు సంకల్పిస్తే అలా పుట్టినవాళ్ళంతా బ్రహ్మ మానస పుత్రులని పిలువబడ్డారు. వాళ్ళలో ఒకరు సనత్కుమారుడు. ఈయన పూర్తి వైరాగ్యమూర్తి. ప్రపంచాన్నే ఒక కలగా భావించి ఆయనేదో, ఆయన తపస్సేదో తప్ప ప్రపంచమూ, ప్రజలూ, సుఖ దుఃఖాలూ ... వీటి గూర్చిన చింత లేనివారాయన. అలాటి ఆయనకి ఓనాడు కల వచ్చింది. ఆ కలలో తాను దేవతలవైపు సేనాపతిగా వుండి రాక్షససైన్యంతో యుద్ధం చేస్తూన్న దృశ్యం కన్పించింది. వెంటనే బ్రహ్మ వద్ద కొచ్చి "ప్రపంచాన్నే స్వప్నంగా భావిస్తూ ఇహలోకమే వద్దనుకునే నాకు ఈ కల ఏమిటి? యుద్ధమేమిటి? గెలుపుకోసం నా ప్రయత్నమేమి?"టని అడిగాడు. ఆయన

artist

దివ్యదృష్టితో పరిశీలించి "అది అలా జరు గబోతోంది కాబట్టి కలగా వచ్చింది నీకు. ఐతే ఈ సంఘటన ఈ జన్మలోనిది కాదు. నీకు రాబోయేజన్మలోది!" అన్నాడు. సనత్కు మారుడు ఆశ్చర్యపడి "ఈ జన్మే అక్కర లేదనుకుంటే మరో జన్మ కూడానా?" అనుకుంటూ దైవనిర్ణయం తప్పదను కుంటూ వెళ్ళిపోయాడు. ఈ సంభాషణ మొత్తం శంకరుని చెవిని పడింది. సనత్కు మారుడంతటి వైరాగ్యమూర్తికి మరో జన్మ వుందనే ఆ విషయాన్ని తన భార్య పార్వ తికి చెప్పాడాయన. వెంటనే ఆమె శంకరు నితో "ఎలాగైనా ఆయన మనకి సంతానం అయ్యేలా వరాన్ని పొంది రావలసిం' దని శివుణ్ణి ప్రార్థించడం లాటి ఆజ్ఞను చేసింది. శంకరునిక్కూడ ఇది ఇష్టమే అయినందువల్ల, సనత్కుమారుడు తపస్సు చేసుకునే ప్రదేశానికి వచ్చాడు శివుడు. శంకరుడు ఎంతసేపు అక్కడే నిలబడి వేచి చూసినా సనత్కుమారుడు తన తపోధ్యాస

లోనే వున్నాడు తప్ప శివుణ్ణి కనీసం చూపుతోనైనా పలకరించలేదు. దాంతో కోపించిన శివుడు "లయ కర్తనైన నేనే స్వయంగా వచ్చినా పలకరించవా? శపిస్తా జాగ్రత్త!" అన్నాడు. దానికి సనత్కుమారుడు కళ్ళు తెరిచి చూసి "శాపమా? నాకా? ఇచ్చుకుంటే ఇచ్చుకో! శాపం – దాని ఫలితం నా శరీరానికే గదా! ఆత్మకి కాదు గదా!" అంటూ మళ్లీ తపస్సులోకి వెళ్ళబోయాడు. శాప మిస్తానన్నా భయపడనంతటి అద్భుత వైరాగ్యమూర్తి అయిన సనత్కుమారుణ్ణి సాదరంగా చూస్తూ శివుడు 'నా శాపానిక్కూడ బెదరలేదుకదా! వరమిస్తాను కోరుకో!" అన్నాడు. మళ్ళీ సనత్కుమారుడు "వరమా? నాకా? ప్రపంచం మీద ఏ ఆశాలేని నాకు వరంతో ఏం పని? కావలిస్తే నీకిస్తా కోరుకో!' అన్నాడు. వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోరాదని భావించిన శివుడు "స్వామీ! నీలాంటి వైరాగ్య మూర్తీ, తపోధనుడూ నాకు పుత్రుడుగా పుడితే బాగుండు ననుకుంటున్నాను" అన్నాడు. 'సరే!' అన్నాడాయన. చెప్పలేని ఆనందంతో శివుడు పార్వతికి ఈ విషయాన్నంతటినీ వివరించి చెప్పాడు. ఆమె ఆశ్చర్య పడుతూ "శంకరా! పురుషుడివైన నువ్వు పుత్రవరాన్నడుగుతూ – నాకు పుత్రునిగా – అన్నావు కదా! పురుషునికి గర్భధారణ ఎలా? మళ్ళీ అక్కడికి వెళ్ళి 'నాకు' బదులు 'మాకు' పుత్రునిగా అని మార్చుకుని రా!" అంది. శంకరుడు సనత్కుమారునికి విషయాన్ని నివేదించి

artist

వరంలో మార్పుకోసం ప్రార్థించాడు. ఫలితం లభించలేదు. చేసేది లేక శంకరుడు వెనుదిరిగాడు. కాలచక్రం కొంత తిరిగాక సనత్కుమారుడు ఒక నిప్పుముద్దగా శంకరునిలో ప్రవేశించాడు. ఆ అగ్ని శివుని మూడవకంటి నుండి దుర్నిరీక్ష్యంగానూ, చెప్పలేని వేడిమి తనంతోనూ బయటికి వేగంగా వచ్చింది. అది ఎక్కడపడుతుందా? అని అందరూ భయంతో వున్న వేళ ఆ నిప్పుముద్ద శరవణ తటాకంలో (ఒకప్పుడు భస్మాసురుడు తన చేతిని పార్వతి తలపై పెట్టి వరం పనిచేస్తోందో లేదో తెలుసుకోవాలని భావించి పార్వతి వెంటపడితే ఆమె ఒక చెరువుగా మారింది. ఆ తటాకం) పడింది. ఆ వేడిమిని భరించలేని శరవణం మెల్లగా ఆ నిప్పుముద్దని ఒడ్డుకి నెట్టింది. ఆ నిప్పుముద్ద మెల్లగా ఒడ్డుకి వెళ్ళి ఒడ్డుకి కొంత పల్లంలో వున్న రెల్లుగడ్డి (శరవణం)లో జారిపడింది. ఆ అద్భుత తేజస్సుని గమ



నించిన కృత్తికా స్త్రీలు ఆరుగురూ తమ స్తన్యాన్ని ఈయబోతే ఆ నిప్పు ముద్ద ఒక కుమారుని రూపం ధరించింది. ఆ కుమారునికి వాళ్ళు తమ పాలనిస్తూ పెంచారు. ఇదీ కథ.

**నిప్పుముద్ద :**

నిప్పుముద్దగా సనత్కుమారుడు తన రూపాన్ని మార్చుకున్న కారణంగా ఇప్పటి కుమారస్వామి 'అగ్ని రూపుడూ లేదా అగ్ని పుత్రుడూ' అయ్యాడు. లోకములో వున్న ఏ వస్తువునైనా దహించి దానిలో వున్న మాలిన్యాన్ని తొలగించగల పవిత్రత అగ్నికుంది కాబట్టి కుమారస్వామిని సుబ్రహ్మణ్యుడు (చెప్పలేనంత పవిత్రత కలవాడు) అన్నారు. ఆ నిప్పుముద్ద ప్రారంభంలో శరవణ తటాకంలో పడింది కాబట్టి ఈయనని 'శరవణ భవుడు' అన్నారు. మెల్లగా ఆ గంగలో కొంత దూరం ప్రయాణించింది కాబట్టి 'గంగకి పుత్రుడు' అనే అర్థంలో 'గాంగేయుడు' అని పిలిచారు. ఆ ఒడ్డు నుండి పల్లానికి జారిన కారణంగా 'స్కందుడు' (జారిపడినవాడు) అన్నారు. అక్కడ రెల్లులో (శరవణము) పడ్డ కారణంగా 'శరవణభవుడు' అన్నారు (రెండు తీరులుగా శరవణ భవుడన్న మాట). కృత్తికాస్త్రీల పాలని స్వీకరించిన కారణంగా 'కార్తికేయుడు' అన్నారు. నిప్పు ముద్ద అందమైన కుమారునిగా మారిన కారణంగా ఆయనని 'కుమారు'డన్నారు. పవిత్రంగానూ, బ్రహ్మచారి రూపంలోనూ దేవతాకళ ఉట్టిపడుతూ కన్పిస్తున్న కారణంగా 'స్వామి' అన్నారు. కుమారరూపం, స్వామిరూపం కలిసి వున్న కారణంగా 'కుమారస్వామి' అన్నారు. మీది కాలంలో ఈయన దేవతల పక్షాన నిలబడి సేనాపతిగా వ్యవహరించడం చేత 'దేవసేనాపతి' అన్నారు. దేవతలకి సేనాపతి (దేవ+సేనాపతి) తప్ప, ఈయన దేవసేన అనే ఆమెకి పతికాదు (దేవసేనా+పతి). ఈ భేదాన్ని గమనించుకోవాలి.

**కుండలినీ :**

ప్రాచీనులు ఏ విషయాన్ని చెప్పినా సంకేతరూపంగానే చెప్పేవాళ్ళు. ఓ ముఖ్య విషయాన్ని చెప్పదలిస్తే, వాళ్ళు ఓ కథగా దాన్ని చెప్పి, దానియందాసక్తి కలిగిన వాళ్ళంతా లో విశేషాన్ని అర్థం చేసుకునేలా మరింత జాగ్రత్తగా ఆ కథని అల్లి లోకానికి ప్రచారం చేసేవాళ్ళు. ఆ ముఖ్యమైన విషయాన్ని ఎక్కడ లోకం మర్చిపోతుందోననే భయంతో దానిపేరిట సంవత్సరంలో ఓ పండుగ రోజుని ఏర్పాటు చేసి, ఆ పండుగరోజున చేయాల్సిన ఓ తంతుని దానికి జోడించేవాళ్లు. ఇదంతా ఆ ముఖ్య

మైన విషయాన్ని ప్రచారంలోనికి తెచ్చి సమాజమంతటినీ బాగుచేయాలనే వాళ్ళ తపనకి సాక్ష్యం. ప్రపంచం – అందునా మన జీవన వ్యవహారం అనగానే సుఖాలు, దుఃఖాలు, ఉద్వేగాలు, ఆందోళనలు .. ఎన్నెన్నో నిత్యం మనని తాకుతూ వెళ్తూంటాయి. ఈ చిన్ని పాంచభౌతిక శరీరం అంతంత బరువులని మోయాలంటే మొదటి మెట్టు ప్రాణాయామం. దీంతో చాలాభాగం మానసికమైన ఒత్తిడులని జయించవచ్చు. ఇక దీని పై స్థాయిది 'కుండలినీశక్తి'. కుండలం అంటే పాము చుట్టు అని అర్థం. ఆ కుండలము కలది కుండలిని – అంటే – పాము అని అర్థం. మనం బాసింపెట్టు వేసుకుని నేలమీద కూచుంటే మన సాగిన వీపుని ఆనుకుని తల వరకూ ఉన్నది వెన్నుపూస కదా! దీన్ని 'వెన్నుపాము' అని పిలిచేదెందుకంటే ఇది కుండలినీ శక్తికి పనికొచ్చే ఆ 'పాము యొక్క శరీరం' (పడగ విప్పిన పాము సాగలాగిన శరీరం) అని తెలియజెప్పేందుకే.



మన మెడ వెనుక నుండి నుదుటి వరకూ వున్న ఆ భాగం అచ్చం పాము పడగలా వుంటుంది గదా! దీన్ని 'పాము తల'గా చెప్పింది శాస్త్రం. అందుకే "ఆ మాట చెప్పగానే వాడు బుస్సున లేచి కస్సుమన్నాడు – విషంకక్కాడు – తల ప్రాణం తోకకొచ్చింది–వాడివి పాము చెవులు – చూపులన్నీ విషాలు..." వంటి మాటలు పుట్టాయి. ఇలా శరీరంలో దాగిన ఆ కుండలినీ శక్తి – మనం నేల మీద కూర్చున్నప్పుడు, మన శరీరం నేలకి ఆనినచోట వుండే 'మూలాధార'మనే చక్రంలో 3 1/2 చుట్లు చుట్టుకుని – ఆ చుట్లమధ్య తల పెట్టుకుని పడుకున్న పాములా వుంటుంది. ఆ పాము చుట్లనే 'వల్లి' అంటారు. యోగి అయినవాడు యోగసాధన ప్రారంభించి ప్రాణ వాయువుని బంధించగానే ఈ పాము మూలాధారంనుండి తలెత్తి బుస్సుమంటూ పై దిశకి ప్రయాణం ప్రారంభిస్తుంది. ఆ మూలాధారం వద్ద వుండేవాడు వినాయకుడు. అందుకే కార్తిక శుద్ధ చవితినాడు (వినాయకునికి ఇష్టమైన తిథి) కుండలినీశక్తిని సాధించి సిద్ధుడైన శంకరునికి ఇష్టమైన కార్తికంలో ముందుగా పాలని పొయ్యాలన్నారు. ఇది నిజమైన మొదటి నాగులచవితి. అలా పైపైకి ప్రయాణించిన కుండలిని స్వాధిష్ఠాన మణిపూరక – అనాహత –విశుద్ధి – ఆజ్ఞా చక్రాలని తాకుతూ సహస్రారచక్రాన్ని చేరడమే 'కుండలిని' అంటే. మన బ్రహ్మరంధ్రస్థానం ఏదుందోఅదే పుట్ట పైభాగం.



మన శరీరం కూడ పుట్ట లాగానే క్రింద విశాలంగా పోను పోను సన్నగా (తల భాగం) వుంటుంది. పుట్టకి వున్నట్లుగానే శరీరానిక్కూడ నవరంధ్రాలున్నాయి.

చీమలన్నీ తమ లాలాజలంతో ఎండకీ, వానకీ చెడని రీతిలో పుట్టని పెడితే పాము చేరినట్లు, మన శరీరానిక్కూడ మన తల్లి దండ్రులు రక్తమాంసాలనీ, బుద్ధినీ అందిస్తే మనం దీనిలో చేరాం. ఆ పుట్ట పైభాగంలో అంటే మన తల మధ్య భాగములో, ఆ పుట్టలో పాలు పోసినట్లే, ఇక్కడ కూడా జ్ఞానమనే అమృతాన్ని పోయాలని సుబ్రహ్మణ్యషష్ఠి సంకేత రూపంగా మనకి చెప్తోంది. ఈ విషయాన్ని అనుకుంటున్న మనమంతా ఇప్పుడు జ్ఞానామృతాన్ని మన పుట్టలోనికి పోసుకుంటున్నా మన్నమాట.

**జ్ఞానక్షీరం :**

అయ్యప్పలు కూడ కుండలినీశక్తి ఆరాధకులే నిజానికి, అందుకే పాము ఏ తీరుగా నేలపడక చేస్తుందో అలానే వీరూ నేలపడకనే చేస్తారు. పాము ఎలా నల్లగా వుంటుందో వీరూ ఆ వస్త్రధారణనే చేస్తారు. (రంగు మార్పుతో పాములన్న మాట నిజమేగాని చీకటిలో ప్రాణాన్ని తీసేది పాముకాబట్టి చీకటిలో కలిసిపోయే నలుపుని పాముకి సంకేతీకరించి చెప్పారు పెద్దలు). శరీరానికంతకీ బ్రహ్మ రంధ్రమే అతి ముఖ్యమైన ప్రదేశమని తెలియజేస్తూ 'ఇరుముడి'ని తలపైన మాత్రమే ధరిస్తారు తప్ప, ఏ భుజానికో వేలాడవేసుకోరు. ఎలా సుబ్రహ్మణ్యుడు ఎంతో పవిత్రత కలవాడో అదే తీరుగా స్నానం, జపం నిత్యనియమంగా చేస్తారు. స్త్రీ రజస్వలా దశలో వుంటే మాట్లాడరు కూడ. సుబ్రహ్మణ్యుడు అగ్నిదైవం (అగ్నిలా అతిపవిత్రుడూ నిప్పుముద్దగా శంకరుని నుదుటి నుండి పుట్టినవాడున్నూ) కాబట్టి ఆ దైవానికి ఇష్టమైన నేతినే మూడుకళ్ళ దైవమైన శంకరునికి ప్రతీకగావుండే కొబ్బరికాయలో పట్టుకెళ్తారు. నిప్పుముద్దగా లోకానికి వచ్చిన సుబ్రహ్మణ్యుణ్ణి దర్శించడాన్నే 'జ్యోతిర్దర్శన'మని నిరూపిస్తారు. మొత్తానికి జ్ఞానక్షీరాన్ని శరీరమనే పుట్ట నిండుగా నింపుకోవడం సుబ్రహ్మణ్యషష్ఠిగా భావించాలన్న మాట. ఎంత గొప్ప రహస్యమిది.



# ౨౭౭. వరలక్ష్మి వరాలు

**ఔ.** మాతా కుప్యతి న మయా న తయా
సాపి కుప్యతి నాంబయా న మయా!
అహమపి కుప్యే నాంబయా న తయా
కస్య దోషొ౽ యం వద రాజన్! ॥

ఒకరాజు దగ్గరికి వెళ్ళి ఓ కవి అన్నాడు గదా! – 'రాజా! మా అమ్మకి కోపం వస్తూంటుంది. దానికి నేనూ, నా భార్య కారణం కాదు. నా భార్యకీ కోపం వస్తూం టుంది. దానికి నేనూ, నా తల్లీ కారణం కాదు. నాకూ కోపం వస్తూంటుంది'. దానికి నా తల్లీ, నా భార్యా కారణం కాదు. మరి మా కోపాలకి కారణం ఏమిటని. ఇందరి కోపాలకీ, చిర్రుబుర్రులకీ కారణం ఒక్కటే – కనీసం ఇల్లు నడప గలిగినంత సొమ్ముకూడ లేని దారిద్ర్యమే. కనీసపు కోర్కెలు కూడ తీరకపోవడమే. అదుగో! అలాంటి తీరని కోర్కెలు కోరినదానికి మించి తీరాలంటేనూ, ఏ సొమ్ము లేక పోతే బుద్ధి మొత్తం చేయకూడని పనుల మీదికి పరుగెత్తుతూ ఉంటుందో అలాటి ఆలోచన(లు) రాకుండా ఉండాలంటేనూ లక్ష్మీదేవి అనుగ్రహం అవసరం. ఆ అను గ్రహాన్ని కూడ సంపూర్ణంగానూ, శీఘ్రం గానూ పొందాలంటే ఆమెకి ఇష్టమైన రోజున–అంటే – వరలక్ష్మీ వ్రతం రోజున –ఆమెని పూజించడం అత్యవసరం. అంతటి గొప్ప రోజులోని విశేషాలని సవి వరంగా తెలుసుకుందాం.

**భార్గవి :**

సంవత్సరంలో మొదటి నెల అయిన



చైత్రంలో గాని, లక్ష్మికి ఇష్టుడైన శ్రీహరికి బాగా ఇష్టమైన మార్గశీర్షమాసం (ధను ర్మాసం)లో గాని రాకుండా ఈ వరలక్ష్మీ వ్రతం శ్రావణమాసంలోనే – అందునా పూర్ణిమకి ముందొచ్చే శుక్రవారం నాడే ఎందుకు రావాలి? ఎందుకిలాటి నియ మాన్ని ప్రాచీనులు చేసి ఉంటారు? పూర్ణిమ నాడు ఏ నక్షత్రం ఉంటే ఆ నెలకి ఆ నక్షత్రం మీదుగా ఆ పేరుని పెట్టారు మన ప్రాచీ నులు. ఈ నియమం ప్రకారం శ్రవణా నక్షత్రంతో కూడిన పూర్ణిమ ఉన్న మాసం శ్రావణం అవుతోంది. శ్రవణానక్షత్రం శ్రీహరి జన్మనక్షత్రం కాబట్టి తనకిష్టుడైన భర్త నక్షత్రం పేరిటి శ్రావణమాసం ఆమెకి బాగా ఇష్టమైన మాసం అయింది. లక్ష్మీదేవి కున్న పేర్లలో ఒకటి 'చంద్ర' అనేది (చంద్రాం హిరణ్మయీం లక్ష్మీమ్). ఆ కార ణంగా ఈ నెలలో మొదటి పదిహేను రోజులూ



ఏ శుద్ధ (చంద్రుడు ఉండే) పక్షమో ఆ పది హేను రోజులూ మరింత ఇష్టమయ్యాయి ఆమెకి. ఒక యుగంలో ఆమె భృగు మహ ర్షికి పుత్రికగా జన్మించింది. అందుకే లక్ష్మీదేవికి 'భార్గవి' అని కూడ పేరుంది. (భార్గవీ లోకజననీ క్షీరసాగర కన్యకా) శుక్రవారానికున్న మరో పేరు 'భృగు వాసర'మని, తన తండ్రి పేరు కలిసొచ్చిన వారం కాబట్టి శ్రావణ మాసంలో – శుద్ధ పక్షంలో – శుక్రవారం ఆమెకి ఇష్టమ యింది. సరే! శ్రావణ శుద్ధ శుక్రవార మనేది శ్రావణమాసంలో మొదటి వారం లోనే వస్తే దాన్ని వరలక్ష్మీ వ్రతపు రోజుగా అనచ్చుగా! 'పూర్ణిమకి ముందొచ్చే శుక్ర వారమే' అంటూ ఓ నియమం ఎందు కట? స్త్రీ అయిన ఎవరైనా ఓ శుభ కార్యాన్ని చేసుకుంటూంటే ముందుగా పిలుచుకునేది తన పుట్టింటివాళ్ళనే కదా! ఏ పూర్ణిమనాడు తన సోదరుడైన చంద్రుడు (లక్ష్మీ, చంద్రుడూ ఒకే సముద్రం నుండి పుట్టారు కదా!) తన పదహారు కళలతోనూ విరాజిల్లుతూ కన్పిస్తాడో, అదే మరి నెలలో మొదటి శుక్రవారం నాడే ఈ పండుగని నిర్ణయించినట్లైతే చంద్రుడు అన్ని కళలతోనూ ఉండ(లే)డో, ఆ కార ణంగా రెండవ శుక్రవారం నాడే 'వరలక్ష్మీ వ్రత'మని అన్నారు పెద్దలు. సరే! దీన్ని ఒప్పుకుందాం! లక్ష్మీదేవికి సంబంధించిన ఉత్సవాన్ని హాయిగా వాతావరణమంతా పొడిగా ఉండే కాలానికి మార్చడమో – లేక – శ్రీహరే కాలాన్ని శాసించగల శక్తి ఉన్నవాడు కాబట్టి (కాలః కలయతా మహమ్–ఋతు స్సుదర్శనః కాల) శ్రావణ మాసంలో కాకుండా వర్షాన్ని మరో మాసంలో కురవవలసిందని నియమం చేయవచ్చుగా! అన్పిస్తుంది మనకి. నిజ మైన ఉత్సవం ఎప్పుడంటే నోటినిండుగా నాలుగువ్రేళ్ళూ తనకీ, తన కుటుంబ సభ్యులకీ వెళ్ళినప్పుడే. అందుకే ఏ భూమి పండడానికి వర్షం చాలా అవసరమో ఆ వర్షఋతువు లోని తొలిమాసాన్ని (శ్రావ ణాన్ని) లక్ష్మీదేవికి సంబంధించిన పూజా మాసంగా నిర్ణయించారు పెద్దలు. ఏ లక్ష్మీ దేవి స్త్రీ జాతికి చెందిందో ఆ కారణంగా ఈ మాసమంతా స్త్రీలకి విశేషమైన పండుగ నెల. అలాగని వరలక్ష్మీ వ్రతాన్ని పురుషులు చేయకూడదేమో? అనుకో కూడదు. నోములు స్త్రీలకేనని, వ్రతాలు మాత్రం స్త్రీ పురుషులిరువురికీ ఏర్పాటు చేయబడినవే.

**లక్ష్మీదేవులు :**

ఇది నిజం కాబట్టే శ్రావణమాసంలో కన్పించే ప్రతి వస్తువులోనూ లక్ష్మీ దర్శనం



అవుతూనే ఉంటుంది. లక్ష్మికి ఇష్టమైన లోహం బంగారం. అందుకే ఆమె తన శరీరం నిండుగా స్వర్ణాభరణాలని ధరించే కన్పిస్తుంది ఎల్లవేళలా కూడ. లక్ష్మీదేవే త్రేతాయుగంలో సీతమ్మగా అయింది కదా! అరణ్యానికి తన భర్తతో వెళ్ళే వేళ లక్ష్మీస్వరూపిణి అయిన సీత ఆభరణాల్లేకుండా పోరాదు కాబట్టి దేవతలు దశరథునిలోచేరి సీతమ్మకి పధ్నాలుగు సంవత్సరాలకి సరిపడే పట్టు చీరలనీ స్వర్ణాభరణాలనీ ఇచ్చి పంపాలనే బుద్ధిని పుట్టించి ఆ వస్త్రాభరణాలని ఇచ్చి పంపించారు. ఈ మాటని ఎందుకనుకుంటున్నామంటే శ్రావణమాసంలో కొనుక్కునే ఏ మాత్రపు బంగారమైనా లక్ష్మీ ఆహ్వానానికి సంకేతమేనని చెప్పడానికి. అలాగే లక్ష్మీదేవి శరీరచ్ఛాయ బంగారపు రంగు. (హిరణ్యవర్ణామ్...) అందుకే ఈ మాసంలో స్త్రీలు బంగారపు రంగులో ఉండే చామంతులని తోరాలుగా మణి కట్టులకీ, కొప్పులోనూ ధరిస్తారు. ఇదే తీరుగా ఈమెకి ఇష్టమైనవి పట్టువస్త్రాలు. ఆ కారణంగా ప్రతి స్త్రీ ఈ మాసంలో లక్ష్మికి గుర్తుగా పట్టుచీరని ధరించి తీరుతుంది. లక్ష్మీదేవి ఎప్పుడూ తనకున్న సర్వాభరణాలనీ ధరించే ఉంటుంది కాబట్టి, ఆ తల్లికి సంబంధించిన ఈ శ్రావణ మాసంలో విశేషించి వరలక్ష్మీ వ్రతంనాడు ప్రతిస్త్రీ తనకి కొత్తగా తన భర్త కొన్న బంగారపు వస్తువుతో పాటు అంతకు ముందున్న సర్వాభరణాలనీ ధరిస్తుంది. (సువర్ణ రజత స్రజామ్...) ఎక్కడెక్కడ దాచుకున్న వెండి వస్తువులనీ తెచ్చి పూజని చేసుకుంటుంది.

లక్ష్మీదేవికిష్టమైన పూజా ద్రవ్యాల్లో గంధ-పుష్ప- అక్షతలు కూడ ఉన్నాయి. ఒంటికి రాసుకున్నప్పుడు పరిమళం లేక ఆరినకొద్దీ సువాసనని వెదజల్లేది గంధం. తనని ధరించినవేళ పరిమళాన్ని బాగా వెదజల్లి కాలం గడుస్తున్నకొద్దీ తన పరిమళాన్ని కోల్పోయేది పుష్పం. ఒకటి (గంధం) ప్రారంభంలో శూన్యం గానే ఉండి కాలక్రమేణ ప్రభావాన్ని చూపేదైతే, మరొకటి (పుష్పం) ప్రారంభంలో గొప్పగా ఉండి కాలక్రమేణ ప్రభావాన్ని కోల్పోయేదౌతూంటే, అక్షతలు (అక్షింతలు అనడం సరికాదు) మాత్రం ప్రారంభంలో ఏ



మంత్ర శక్తిని కలిగున్నాయో కాలక్రమంలో కూడ ఆ శక్తిని అలాగే కలిగి ఉంటాయి తప్ప ఎప్పటికీ క్షతం (ప్రభావాన్ని కోల్పోయేవి) అయ్యేవి కావు. అందుకే వాటిని 'అ+క్షతలు' (ప్రభావ శూన్యత అనేది లేనివి) అన్నారు. ఇవి లక్ష్మికి ఇష్టం కాబట్టే ఈ మాసం నిండుగా స్త్రీలు గంధాన్నీ, పుష్పాలనీ, అక్షతలనీ ధరించే కన్పిస్తారు (గంధ పుష్పాక్షతై ర్యుతామ్).

ఈమె పాలసముద్రం నుండి పుట్టింది కాబట్టే వరలక్ష్మీవ్రతం నాడు కచ్చితంగా పాయసాన్ని (పయసా – పాలతో, కృతమ్ – చేయబడిన వంటకం) వండి అమ్మవారికి భక్తితో నివేదిస్తారు. లక్ష్మీదేవికి పసుపు కుంకుమలు బాగా ఇష్టమైనవి కాబట్టే (హరిద్రా–పసుపు, కుంకుమ ప్రియే – కుంకుమలు ఇష్టమైనదానా!) ప్రతి స్త్రీ తన ఇంటికి పేరంటానికి వచ్చిన స్త్రీ పాదాలకి నిండుగా పసుపు పూస్తుంది. తను కుంకుమ బొట్టుని పెట్టుకుని ఆమె నుదుట కుంకుమని దిద్దుతుంది. పుట్టినింటిలో స్త్రీ ఒక సంతానంగా తల్లిదండ్రులకి పుట్టి సంతానలక్ష్మి అయినది తొలి నాళ్ళలో. ఆ సంతానలక్ష్మే తన వివాహ కాలంలో ధాన్యపుగంపలో వధువు వేషంలో పెళ్ళిపీటలనెక్కి ధాన్యలక్ష్మిగా తన భర్తని చేరింది. ఆ భర్త ఇచ్చిన ఆభరణాలు ధరించి శ్రావణంలో ధనలక్ష్మిగా కన్పిస్తూ ఇల్లంతా తన పసుపు పాదాలతో పవిత్రంగా తిరుగుతూ గృహ లక్ష్మి అవుతోంది. (గృహంలో తిరిగే లక్ష్మి. 'మమ వసతుగృహే సర్వమాంగల్య యుక్తా!') ఇలాటి లక్ష్మికిష్టమైన గంధ–పుష్ప – అక్షత – స్వర్ణాభరణ – హరిద్ర (పసుపు) – కుంకుమ మొదలైన ద్రవ్యాలని అందరు స్త్రీలూ ధరిస్తారు కాబట్టే ఒక ముత్తై దువ మరో ముత్తైదువకి వాయనాన్నిస్తూ

ఇందిరా ప్రతి గృహ్ణాతి ఇందిరా వై దదాతి చ।

ఇందిరా తారకావాఖ్యామ్ ఇందిరాయై నమో నమః ॥ అంటుంది.

"లక్ష్మీదేవినైన నేనిస్తూ ఉంటే, లక్ష్మీ స్వరూపిణి అయిన నా ఎదుటి స్త్రీ నా నుండి స్వీకరిస్తోంది. ఈ మా ఇద్దరు లక్ష్ములనీ ఆ యథార్థ లక్ష్మి (శ్రీహరి భార్య) తరింప చేస్తుంది కాబట్టి అలాటి తల్లివైన లక్ష్మీ! నీకు నమస్కారం" అని పై శ్లోకానికర్థం. మన ఇంటికి లక్ష్మీదేవి ఆ స్త్రీ రూపంలో వస్తే ఆమెని మన ఇంటి ఎదురామెగా భావించడం సరికాదు కాబట్టే, పెద్దలు తన ఇంటికొచ్చిన ప్రతి స్త్రీ పాదాలకీ

గృహ యజమానురాలే పసుపు రాయాలని తీర్మానించారు. అయినా పాదాలకి పసుపు రాయడానికి అహంకారాభిమానాలు అడ్డొచ్చేటట్లైతే ఈ పేరంటమెందుకు? పిలుపులెందుకు? లక్ష్మీదేవికి పోక చెట్లవనం బాగా ఇష్టం కాబట్టి ప్రతి స్త్రీ తాంబూలాలని ఇచ్చి తీరాలి.

**వర్షఋతువు :**

శ్రావణ భాద్రపదాలనే పేరున్న ఈ రెండు మాసాలనీ వర్షఋతువన్నారు. గృహ వైద్యురాలు స్త్రీ కాబట్టే ఇంట్లోని అందరి ఆరోగ్యాలూ సుఖంగా ఉండేలా ఎవరెవరి కడుపు చూసి వారివారికి సరిపడేంతా, ఎవరెవరి రుచి ఏమో తెలిసివాళ్ళకి ఆనందం కలిగేలా వంటనిచేసి పెట్టవల సిందన్నారు స్త్రీని పెద్దలు. వంటింటి కుందేలుని చేయడం దీని లక్ష్యం కాదని గ్రహించాలి. పది రాళ్ళు సంపాదించుకొచ్చే భర్త సుఖంగా ఆరోగ్యవంతంగా జీవించి పది రాళ్ళని ఎప్పుడూ సంపాదిస్తూ ఉండి తనని గృహ లక్ష్మిగా చూసుకునేందుకు వీలుగా అతని భోజన బాధ్యతని స్త్రీ పై మోపారు పెద్దలు. కుటుంబ వ్యవస్థలో భర్త ఆర్జించాలి, భార్య వండిపెట్టాలి అనేది ఒక నియమం. నేటి కాలంలో ఈ ఒకప్పటి సక్రమ కుటుంబ వ్యవస్థ అనేక మైన మార్పులకిలోనై అనారోగ్యానికీ, విసుగు చిరాకులకీ కారణమౌతోంది. మరి! గృహ వైద్యురాలు స్త్రీ కాబట్టి ఆమె ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు పండుగలనే ఓ వ్యవస్థని చేశారు పెద్దలు. దానిలో భాగంగా ఈ వరలక్ష్మీ వ్రతంనాడు చిత్రదీపాన్ని పెట్టవలసిందేనని అన్నారు. వరిపిండినీ, బెల్లాన్నీ కలిపి నీటితో తడిపి దీపారాధన కుందెగా చేసి దానిలో ఆవునేతిని పోసి వెలిగించి పూజంతా ముగిసింతర్వాత ఆ కుందెని గృహయజమానురాలే తినాలనే నియమాన్ని పెట్టారు. వర్షాలు జోరుగా కురిసే కాలంలో ఈ కుందె చక్కని ఔషధమని అర్థమైపోవడం లేదూ. స్త్రీ తన ఇంటి పనుల్లో నిమగ్నురాలై పాదాలని ఎప్పుడూ తడినేలలో పెడుతూనే ఉంటుంది. ఆ కారణంగా ఆమెకి అనారోగ్యం కలక్కుండా పసుపుని పాదాలకి నెల పొడుగునా పూసుకుంటూ ఉండవలసిందేనన్నారు. శ్రావణమాసంలో పేరంటం పేరిట పిలిచి నానబెట్టి మొలకలొచ్చిన సెనగలనీ, తాంబూలాన్నీ ఇస్తారు. ఈ రెండు నెలలపాటూ మొలకలొచ్చిన సెనగలు ఆరోగ్యానికి మంచివని వేరే చెప్పాలా? వర్షాకాలం కారణంగా వచ్చే పీనసానికి (జలుబు – రొంప – పడిసెం) విరుగుడుగా వేడి చేసేందుకై తాంబూలాన్ని ఇవ్వాలన్నారు. మిగిలిన కాలాల్లో నోరు కొంతలో కొంత ఎండి దుర్వాసనని కలిగి ఉండదు గాని, వర్షాకాలంలో మిగిలిన కాలాలతో పోలిస్తే దుర్వాసనని ఎక్కువగా కలిగి ఉంటుంది. అందుకే ఆ నోరు – నాలుకలని శుభ్రపరిచేందుకు వీలుగా తాంబూలాన్ని తప్పక స్వీకరించాలన్నారు. స్త్రీలు తాంబూలాన్ని వేసు కోవడం తప్పుకాదు. (తాంబూల పూరిత

ముఖీ). తాంబూలం వేసుకుంటే పద మూడు లాభాలు న్నాయంది ఆయుర్వేద శాస్త్రం. (జిహ్వా జాడ్యచ్ఛేదకరం - తాంబూలస్య సఖే త్రయోదశ గుణా) వాయనంలో సెనగలతో పాటు సన్నని కొబ్బరి ముక్కలు కూడ ఉంటాయి. ఇవి సెనగలవల్ల వచ్చే దోషానికి విరుగుడు. పై తాంబూలంలో కూడ వట్టిగా వక్కని తింటే దోషం చేస్తుంది. అలాగే వట్టిగా సున్నాన్ని తింటే నోరు పొక్కుతుంది. ఇలా ఏ ఒక్కదాన్ని తిన్నా ఏదో కొంత దోషాన్ని కల్గించే వస్తువుల మూటని - (ఒకదాని కొకటి శత్రువువైన వాటిని) కలిపి (ఆకు, వక్క, సున్నం) ఆరోగ్యా న్నిచ్చేదిగా చేసి దాని పేరు 'తాంబూల' మన్నారు. ఇంతకు ముందు నెల అయిన ఆషాఢం నుండీ గోరింటాకుని పెట్టుకున్న కారణంగా శరీరంలో అనవసరంగా ఉన్న జలాన్నీ - గోళ్లలో ఉన్న వ్యర్థ జలాన్నీ తొలగించేసుకోగలిగాం. ఆ గోరింటా కుని ఈ నెల కూడా ధరిస్తూనే ఉండాలి. కొత్త కాలపు 'మెహిందీ' వలన గోరింటా కంత సౌందర్యమూ ఉండదు - గోరిం టాకు నిలబడినంత కాలమూ అది నిల బడదు - ఇక గోరింటాకు చేసే మేలుని ఏమాత్రమూ చేయదనేది వేరే చెప్పే పనే లేదు. గోరింటాకు రుబ్బేప్పుడు వేసే పటిక కవిరి అనే వాటివల్ల చర్మ వ్యాధి నివా రింపబడుతుంది.

**అందరూ లక్ష్మలే :**

'పేరు + అనటం - పేరనటం' అనే మాట కాస్తా స్త్రీల నోళ్లలోపడి నలిగి నలిగి పేరంటం అని ఇలా మారిపోయింది. ఎదురింటి సుందరిగారింటికే వెళ్లామను కుందాం! 'సుందరీ లక్ష్మిగారూ! మా ఇంటి వరలక్ష్మిని చూచి నన్నాశీర్వదించి దయచేసి వాయనాన్ని తీసుకువెళ్లండి (అని పిలుస్తున్న ప్రతి స్త్రీ పేరుకీ చివర్లో 'లక్ష్మి' అనే పదాన్ని తప్పక చేర్చాలి. ఎందు కంటే మనం పిలిచేది 'లక్ష్మి'ని. పిలిచే మనమూ లక్ష్మలమే. ఆ ఎదురింటామె మనింటికి లక్ష్మీరూపిణిగా రాగా మనం లక్ష్మీ రూపిణిగా సంభోదించి మనింటి వర లక్ష్మి సాక్షిగా తాంబూలాన్నిచ్చి పంపడం యదార్థ కర్తవ్యం. ఇలా పిలువబడిన ప్రతి ఒక్క 'పేరు (నీ) అనడం (అనటం)' ఏదుందో దాన్నే 'పేరు అనటం' అన్నారు. అది క్రమంగా పేరంటం - ఇంకా పాడై - పేరంతంగా మారింది. 'ప్రత్యేకంగా బొట్టెట్టి పేరెట్టి నిన్ను పిలవాలా?' అనే ఓ మందలింపు ఇక్కడి నుండి పుట్టిందే.



**అంగపూజ :**

ముందుగా గణపతి పూజ, ఆ మీదట వినాయకుణ్ణి ప్రార్థించి మన ముందున్న కలశం లేదా మనం చేసుకున్న విగ్రహం లోనికి వరలక్ష్మిని ఆవహించేలా చేయ వలసిందని ప్రార్థించడం, ఆ మీదట సింహాసనం – పాద్యం – అర్ఘ్యం – ఆచ మనం–పంచామృత స్నానం–వస్త్ర యుగ్మ ప్రదానం–కర్పూరం అగరు కస్తూరి మొద లైన అష్టవిధ సుగంధద్రవ్యాల ప్రదానం – మంగళసూత్రం – (ఈ సందర్భంలోనే మనం కొత్తగా చేయించుకున్న ఆభర ణాన్నీ, కొనుక్కున్న వస్త్రాలనీ ఆమెకి సమ ర్పించాలి) సమర్పించి పుష్పాలతో ఆమెకి ప్రతి అవయవ పూజనీ (అంగపూజ) చెయ్యాలి. తర్వాత తోరగ్రంథి పూజని చేసి కుడిచేతికి తోరాన్ని కట్టుకుని (ప్రతి సంవత్సరమూ చేస్తానని అంగీకరించడం – ఈ వ్రత మయ్యేంతవరకూ ఈ ప్రదే శాన్ని విడిచిపోనని ప్రతిజ్ఞ చేస్తూ కంక ణాన్ని ధరించినట్లుగా ధరించడం) లక్ష్మికి సంబంధించిన అష్టోత్తర నామాలనీ చదివి వ్రత కథని వినాలి. ఆ మీదట ధూపం – ఆవునేతితో దీపం (గోఘృత దీపం) నైవేద్యం తాంబూలం – నీరాజనం – మంత్ర పుష్పం చేశాక – అపరాధ క్షమాపణం కోరి చామరం – అద్దం చూపడం – గుర్రాల నెక్కించడం – ఏనుగుల మీద ఊరేగిం చడం – ఉయ్యాల నెక్కించడం – నృత్యా లని చూపడం – మంగళహారతిని పాడ డం... అనే వీటిని చేసి చివర్లో – 'పునః



పూజా బుద్ధి రస్తు' –పై సంవత్సరం కూడ పూజ చెయ్యాలనే బుద్ధిని అనుగ్రహించ వలసిందంటూ లక్ష్మీదేవిని కోరుకోవాలి.

**ముత్తయిదువులు :**

పసుపు పూతతోనూ – చేతి నిండు గానూ, పాదాల చుట్టూతానూ గోరిం టాకు ఎరుపుతోనూ – మెడకింద గంధపు బొట్టుతోనూ – చేతిలో సెనగల మూట తోనూ–తలనిండుగా పూలతోనూ – కొత్త పట్టుచీరల ఫెళఫెళల తోనూ – నూతన స్వర్ణాభరణాల తళతళల తోనూ – పది చోట్ల బొట్టుని పెట్టించుకున్న కారణంగా పెద్ద పెద్ద కుంకుమబొట్లతోనూ – ఆవు వెంట దూడల్లా వస్తున్న తమ పిల్లల్ని ఓ కంట వెనక్కి తిరిగి చూసుకుంటూనూ – సన్నగా చినుకు పడుతున్న వేళ తమ చీరకొంగునే తమకీ సంతానానికీ గొడు గుగా చేసి ఆ ముత్తైదువులు కదులు

తూంటే ఆ పవిత్ర దృశ్యాన్ని చూడడానికి రెండుకళ్లు సరిపోవు - ఆ ముత్తైదువు ఇంటికొచ్చి విశేషాలని వివరిస్తూంటే రెండు చెవులు ఏ మాత్రమూ చాలవు. స్త్రీలారా! సంప్రదాయాన్ని కాపాడండి.

## ౨౨౪. కృత్తికా నక్షత్రం

**జ.** భారతీయ సంప్రదాయంలో వచ్చే ఏ పండుగనీ 'ఇది వట్టి బూటకం' అని కొట్టి పారేసే వీలులేదు. దానిక్కారణం ఆ పండుగ యథార్థమని ఖగోళం సాక్ష్యమిస్తుంది. ఉదాహరణకి కార్తిక పూర్ణిమనే తీసుకుందాం. పూర్ణిమ నాడు ఏ నక్షత్రం వుంటే ఆ నెలకి ఆ నక్షత్రం పేరుని పెట్టారనే విషయం తెలిసిందే. చిత్తా నక్షత్రం పూర్ణిమా నాడుంటే చైత్రం - విశాఖ ఉంటే వైశాఖం... అలాగే పూర్ణిమనాడు కృత్తికా నక్షత్రము వుంటే కార్తికం అవుతోంది కాబట్టి కార్తిక పూర్ణిమనాడు ఆకాశాన్ని పరిశీలిస్తే క్షురకత్తి ఆకారంలో కృత్తికా నక్షత్రం అతి స్పష్టంగా కనిపిస్తుంది. మన పండుగలు కల్పితాలుకావు అనడానికి, ఇలా ఎవరూ ఏనాటికీ మార్చు వీల్లేని సాక్ష్యాన్ని ఏర్పాటుచేసిన ప్రాచీనులెంత గొప్పవాళ్ళు!

**వైద్యునితో పనిలేదు :**

కృత్తికా నక్షత్రం అగ్ని నక్షత్రం. పూర్ణిమ అనేది చంద్రుడు పదహారు కళలతోనూ కనిపించే రోజు. అటు అగ్ని వేడిమీ ఇటు చంద్రుని చల్లదనమూ కలిసి ఒకేసారి వచ్చే అద్భుతమైన రోజు కార్తికపూర్ణిమ. మంచిదే! ఇంతకీ ఈ రోజున మనం ఏమేం చెయ్యాలి? ఈ రోజులో దాగున్న విశేషాలేమిటి? అని మన సందేహం. మన ఇళ్ళలో వ్యర్థమైన నీళ్ళు పోయేందుకై చిన్న తూముల్నీ వాటి వెంట చిన్న కాలువల్నీ నిర్మించి ఆ నీటిని వీధిలోనికి విడిచి పెడతాం. సంవత్సరంలోని అన్ని రోజులూ ఈ కాలవలో నీళ్ళు ప్రవహిస్తూనే ఉంటాయి కాబట్టి కాలవలో పాచి, చెత్తచేరి నీటిని అడ్డగించే ఓ రోజొస్తుంది. ఆ రోజున మేల్కొని పూర్తిగా ఆ తూమునీ, కాలవనీ శుభ్రం చేస్తాం. ఇది అనుభవంలో ఉన్న విషయమే కదా! అలా శుభ్రం చేసిన రోజున ఒకరోజు పాటు నీళ్ళు ప్రవహించకుండా ఎండగడతాం కూడా! సరిగ్గా ఇదే పనిని మన శరీర విషయంలోనూ చేయాలి. వారానికి 7 రోజులపాటు సంవత్సరానికి 365 రోజుల పాటూ పనిచేస్తున్న ఏ జీర్ణక్రియా యంత్రాలు మన శరీరంలో ఉన్నాయో వాటికి విశ్రాంతి నీయకుండా సంవత్సరం పాటూ అలా తినేస్తూ ఉంటే ఆ యంత్రాలకి ఏ మాత్రపు విరామమూ లేని కారణంగా మొరాయిస్తాయి. దాని ప్రతిఫలమే వైద్యుడి దగ్గరకి పోవడం. ఒక సంస్థలో పనిచేసే ఉద్యోగులకి వారానికి ఓ రోజు విశ్రాంతినిచ్చినట్లే ఈ జీర్ణక్రియా యంత్రాలకక్కాడ వారానికి ఓ రోజు విశ్రాంతి నీయడం కోసం ఉపవసించాలి ప్రతి వ్యక్తీ. ఇలా నిత్య నియమంగా ఉపవసించినా కూడా చలీ, మంచూ మెల మెల్లగా అధికమౌతూ వెళ్తూండే ఈ శర

దృతువులో విశేషించి కార్తిక మాసంలో నెలకి నెల రోజులూ ఒకపూట మాత్రమే భోజనం చేసిన పక్షంలో ఇంక ఆ వ్యక్తికి వైద్యునితో అవసరమే రాదు.

**కొలిమి :**

అంతటి గొప్ప నెల కార్తికం కాగా, ఇటు అగ్ని అటు చల్లదనమనే రెంటినీ ఒకేసారి శరీరం అనుభవించే రోజు కార్తికపూర్ణిమ. అందుచేత ఈ రోజు మొత్తం ఉపవసించి రాత్రి ఆహారంలో నేతిబీరకాయను ఏదో ఒక రూపంలో ఉండేలా చేసుకుని భుజించాలి. ఇది ఆరోగ్య రహస్యం.

ప్రపంచానికి ఆధారభూత మయిన దేవతలెందరని దీర్ఘంగా ఆలోచించిన మీదట ఋషులంతా కలిసి నిర్ణయించింది ఐదుగురు మాత్రమే ఆధారమని. వారు 'ఆదిత్య మంబికాం విష్ణుం గణనాథం మహేశ్వరమ్' – సూర్యుడూ అంబికా విష్ణువూ వినాయకుడూ మహేశ్వరుడూ... అనే ఈ ఐదుగురు. ఎక్కడ ఈ రహస్యాన్ని ఈ లోకంలోని వాళ్ళందరూ మరిచిపోతారోననే భయం, సందేహంగల ఋషులు దేవతల వద్ద ఈ అనుమానాన్ని వ్యక్తీకరించడంతో దేవతలు ఈ ఐదుగురినీ కాలంలో భాగస్వాముల్ని చేయదలిచారు. ఆ కారణంగానే భాద్రపద మాసంలో గణపతినీ, ఆశ్వయుజంలో దసరా ఉత్సవాలపేరిట అమ్మవారినీ, కార్తికంలో శంకరుణ్ణీ, మార్గశీర్ష మాసంలో శ్రీహరినీ, పుష్యమాసంలో సూర్యుణ్ణీ మనం ఆరాధించేలా వివిధ రకాల పండు



గల్ని ఏర్పాటు చేశారు. అలా శివుణ్ణి ఆరాధించే కార్తికమాసంలో ఇప్పుడు మనం ఉన్నాం. శివుడు రుద్రుడు. అంటే రౌద్ర స్వరూపంతో, ఎర్రని కనులతో, నుదుట భగభగమండే కొలిమి వంటి నేత్రంతో వేడిమితో ఉంటాడు. అయితే ఆయన శిరసుమీద ఎంతో చల్లదనం ఉండే గంగమ్మ ఒక పక్కగా చంద్రుడూ ఉంటారు. ఇదే చలి వేడిమిల కలయిక అంటే. ఇంతేకాదు అమ్మవారి విషయంలోనూ ఇంతే. అమ్మవారు అగ్ని రంగులో ఉండడమేకాక తాను నిత్యం చేస్తూండే తపస్సు కారణంగా ఎర్రదనంతో ప్రకాశిస్తూ ఉంటుంది. (తామగ్ని వర్ణాం తపసా జ్వలంతీమ్). అయినా

కూడా శంకరునిలో ఎడమభాగంగా ఉండే (అర్ధనారీశ్వర రూపం) తన శిరసు మీద ఎంతో చల్లగా ఉండే చంద్రుణ్ణి ధరించి ఉంటుంది. ఇలా అగ్ని వేడిమినీ చంద్రుని చల్లదనాన్నీ కలిగిన పార్వతీదేవి కూడ చలి వేడిమిల కలయిక కలిగినదే. పారిజాత పుష్పం అమ్మకి ఇష్టం అనడంలో ఇదే రహస్యం కన్పిస్తుంది. బయటి వైపు ఎర్రని రంగుతోనూ, లోపల రేకులన్నీ తెల్లదనంతోనూ కన్పించే పుష్పం పారిజాతం. ఆ ఎరుపూ ఈ తెలుపూ అగ్నీషోముల (అగ్నీచంద్రుల) వేడిమి చల్లదనాలని తెలుపుతుందన్న మాట.

**మత్స్యావతారం :**

ఈ కార్తికపూర్ణిమనాడు శ్రీహరి మత్స్యావతారాన్ని ధరించాడు. ఇదే రోజున త్రిపురాసుర సంహారాన్ని చేశాడు – వ్యాసునిపేరిట ఉత్సవాన్ని చేసుకోవలసిన రోజూ ఇదే – 'యోగిరాజ'నే పేరుతో దత్తాత్రేయుడు జన్మించిన రోజూ ఇదే –




ఆబోతులకి అచ్చుని వేసి విడిచే ఓ కార్యక్రమం వృషోత్సర్జనం చేసేది ఈ రోజునే. ఈ పై అన్నిటినీ వివరించుకోబోయే ముందు కార్తికపూర్ణిమనాడు చేయవలసిందేమిటో తెలుసుకుందాం.

**ఆతపస్నానం :**

కార్తికమాసం మొత్తం తెల్లవారు జామునే లేచి కృత్తికా నక్షత్రం ఆకాశంలో అస్తమించక ముందే ప్రవాహపు నీటిలో స్నానాన్ని చేయాలి. (తావదేవ భవేత్ స్నానం యావన్నస్తా తు కృత్తికా) 'స్నానం చేయించకపోతే ఎలా? మోక్షం పుణ్యం రాదేమో?' అనే ఆలోచనతో ఇంట్లో అందర్నీ స్నానం చేయించవద్దనీ, అనారోగ్య వంతులూ, తెల్లవారుజాము స్నానం ఒంటికి పడని వాళ్ళూ, ఇతర కారణాలవల్ల స్నానం వీలు కాని వాళ్ళనీ బలవంతాన స్నానం చేయించవద్దనీ, అలా చేయించ ప్రయత్నించడం కూడా పాపమేననీ పలికింది శాస్త్రం. శాస్త్రం కొన్ని మినహాయింపులను కూడా స్నానవిధిలో చెప్పింది. అలా చెప్పబడిన స్నానం ఏడు విధాలుగా ఆచరణలో ఉంటుంది.

'ఆపోహిష్ఠాదిభి ర్మంత్రై ర్బ్రాహ్మమ్' – ఆపోహిష్ఠామయో భువః.... అంటూ కొన్ని మంత్రాలున్నాయి. వాటిని చదువుకుంటూ చేసే స్నానం మాంత్రస్నానం లేదా బ్రాహ్మస్నానం. మంచిదే! మరి మంత్రాలు రానివాళ్ళ గతేమిటి? చెప్పబోతోంది శాస్త్రం చివర్లో. భస్మనాగ్నేయం – స్నానం చెయ్యరాని – ఒళ్ళు తడపరాని వ్యాధి వచ్చిందనుకుందాం! స్నానం అక్కర లేదు – చెయ్యగలిగిన స్థితిలో లేదు. ఆ దశలో భస్మాన్నితెచ్చి తలపై చల్లుకుని పూజని ప్రారంభించవచ్చును అంది

శాస్త్రం. ఈ స్నానం పేరు 'ఆగ్నేయం'. గో రజసా వాయవ్యమ్ – భస్మం దొరికే ప్రాంతంలో నేనుండడంలేదు – ఎలా? అని చింతించనక్కరలేదుట. ఆవు నడిచిన త్రోవలో ఉన్న ఆవుగిట్టల కిందపడి నలిగిన ధూళిని నెత్తిమీద చల్లుకుని పూజని ఆరంభించవచ్చునట. ఈ విధంగా చేసే స్నానం పేరు 'వాయవ్యమ్'. ఆతప ఆతపమ్ – ఊరికీ ఊరికీ మధ్య ప్రయాణిస్తుండగా తెలవారింది. మరి స్నానం ఎలా? అదీకాక రాత్రి వచ్చిన జ్వరం – ఉదయం తగిలిన దెబ్బ కారణంగా స్నానం చేయవీల్లేదని ఆందోళన పడనక్కరలేదు. అలాంటి కష్ట దశలో ఓ అర నిముషం పాటు సూర్యస్తుతి (శ్లోకాలు... దండకాలు) చేస్తూ ఎండలో నిలబడితే చాలు పూజని ప్రారంభించుకోవచ్చు. ఇది 'ఆతప స్నానం'. నాభే రథః.... కాపిలమ్ – బొడ్డు కింద లేదా పై భాగంలో శస్త్ర చికిత్స జరిగి ఒంటిని తడుప వీల్లేని పక్షంలో ఒంటిని తడపవీలైన శరీరభాగాన్ని తడి గుడ్డతో తుడిచి పూజని ప్రారంభించవచ్చు. ఇది 'కాపిల స్నానం'. జలావగాహో వారుణమ్ – శరీరమంతా ఆరోగ్యకరంగా ఉండి వట్టిగా నీళ్ళలో వినోదంకోసం చేసే స్నానం 'వారుణం'. కాకి నీటిలోమునిగి రెక్కల్ని విదిలిస్తుందో అలాంటి స్నానమన్నమట ఇది. శరీర మాలిన్యం తొలగ వచ్చేమోగాని పూజకి పనికిరాని స్నానమిది. విష్ణుచింతన పూర్వకం స్నానం మానసమ్ – స్నానం చేయబోతూ, చేస్తూ కూడా శ్రీహరి స్మరణాన్ని



చేస్తే అది 'మానస స్నానం'. ఇది అన్నిటికంటే ఉత్తమమైనది. కార్తికపూర్ణిమనాడు ఇలాటి స్నానాన్ని చెయ్యాలి. దంపతులైతే ఒకరి చేతిని మరొకరు పట్టుకుని సరిగంగా స్నానం చేస్తే శ్రీహరికి అది మరింత ఇష్టమట. ఎందుకని? ఆయన తన భార్యనెప్పుడూ వక్షఃస్థలమ్మీదే ధరిస్తూ ఉంటాడు గదా! ఈ భక్తుడెవరో కూడ తనలానే ఉన్నాడని ఆనందపడతాడుట.

ఇక ఈ కార్తికమాసం నెలరోజులపాటూ చేయకూడనివి – తేనెని తాగడం, రాత్రి వండిన అన్నం మిగలగా పొద్దున్న తినడం, పొద్దున్న వండగా మిగిలిన దాన్ని రాత్రి తినడం, కంచుపాత్రలో భోజనం చేయడం, అతి శీతల పదార్థాల్ని తాగడం, తినడం, ఉప్పుని ఎక్కువగా సేవించడం (నిలవ ఉన్న పచ్చళ్ళని తినడం), తాంబూలాన్ని వేసుకోవడం, మంచులో నడవడం వంటివి. ప్రాచీనులు మనం జరుపుకునే

ఏ పండుగనైనా వైద్య రహస్యంతో ఇమిడ్చి చెప్పేవాళ్ళు. ఇక కార్తికపూర్ణిమనాడు జరిగినపూర్వ విశేషాలేంటో తెలుసు కుందాం!

**కార్తీక పూర్ణిమ :**

బ్రహ్మ వద్ద ఉన్న వేదాలని అపహ రించి సోమకుడనే పేరున్న రాక్షసుడు సముద్రంలో దాక్కున్నాడు. వాణ్ణి వధించ డానికి మత్స్యావతార మెత్తాడు శ్రీహరి. వాణ్ణి చంపి వేదాలని తిరిగి బ్రహ్మకి అప్ప గించాడనేది మనకి తెలిసిన కథ. అయితే బ్రహ్మ వేదాలని పుస్తక రూపంలో ఉంచాడా? లేని పక్షంలో ఆ రాక్షసుడెలా ఎత్తుకు పోగలిగాడు? ఆ వేదాలని తిరిగి బ్రహ్మకి అందించేటప్పుడు శ్రీహరి బ్రహ్మని 'ఎందుకు అశ్రద్ధతో ఉన్నావని' ప్రశ్నించ లేదా? వంటి సందేహాలొస్తాయి మనకి. వేదం శబ్దాలతో నిండిన గ్రంథం. ఒక విధమైన పాటలాగా ఉదాత్త అనుదాత్త స్వరితమనే స్వరాలతో (రాగం లాంటిది) నిండిన అక్షరాల సమూహం. ఈ స్వరాలు లేనిపక్షంలో అవి తెలియని పక్షంలో వేదా లని విన్నా ఒకటే, వినకున్నా ఒకటే. ఏమీ అర్థం కాదు. ఆ స్వరాలని నేరుగా బ్రహ్మ నుండి విని గ్రహించేశాడు సోమకుడు. సృష్టికి సంబంధించిన రహస్యం ప్రారం భించి ముగింపు వరకూ ఉండే సర్వ విశే షాలు ఎవనికి తెలియరాదో వారికి తెలి సిందన్న విషయం శ్రీహరికి అర్థమై, ఏ నీటికి తాను ఆధారమో ఆ నీళ్ళలోనే దాగిన సోమకుణ్ణి వధించి ఆ రహస్యాలు రాక్షస జాతికి అందకుండా చేశాడు. శ్రీహరి అంతటివాడు ఓ అవతారాన్నే ఎత్తాడంటే వేదాలూ వాటి విలువా ఎంతటివో గ్రహిం చగలగాలి. అంతటి ప్రమాదం నుంచి తప్పించుకోగలిగిన రోజు కార్తికపూర్ణిమ.

**దత్తుడు :**

సత్వరజస్తమో గుణాలనే మూడింటికీ అతీతుడు ఎవరో ఆయన 'అ–త్రి' మహర్షి. 'అసూయ' అనే గుణం ఏ మాత్రమూ లేని దెవరో ఆమె (అ + అసూయ) అనసూయ. ఈ ఇద్దరి కోరికపై శ్రీహరి వాళ్ళకి పుడుతూ 'నన్ను నేను మీకు సమర్పించు కుంటున్నాను (దత్తుడు) అన్నాడు. అత్రి మహర్షి పుత్రుడు అయినందువల్ల ఆత్రే యుడూ, దత్తుడైనందువల్ల దత్తుడూ అయి రెండూ కలిపి దత్తాత్రేయుడయ్యాడు. ఆయన ముందు జన్మయోగిరాజు. ఆ పుట్టుక జరిగింది కూడ ఈ పూర్ణిమ రోజే.

**రాక్షసవధ :**

శివకేశవులకి భేదం లేదని తెలియ జేస్తూ ఒకరు విలుకానిగా మరొకరు బాణంగామారి 'త్రిపురు'డనే రాక్షసుణ్ణి వధించిందీ ఈ రోజే. దుర్మార్గుడైన రాక్షస వధ అనేది శివకేశవుల ఉభయుల తప శ్శక్తితో తప్ప సాధ్యంకాలేదంటే ఆ రాక్ష సుని శక్తిని మనం గ్రహించగలగాలి. అంత రాక్షస వధ అయినందుకు సంతో షాన్ని ప్రకటిస్తూ దేవాలయాన్ని దీపాలతో అలంకరిస్తారు భక్తులు నేడు. అంతేకాదు దేవదానవు లిద్దరూ కలిసి పాల సము ద్రాన్ని చిలకగా కాలకూట విషం పొగలు

గక్కుతూ మంటతో వచ్చింది. ప్రపంచ మంతా ఆ విషాగ్నికి ఎక్కడ నాశనమై పోతుందోనని భయపడ్డ పార్వతి, తన భర్త శంకరునికి ఆజ్ఞనిచ్చింది 'ఆ విషాన్ని మింగి లోకరక్షణ చేయవలసిం'దని. ఆయన ఆ విషాన్ని తాగాడు. అంత వరకూ ధైర్యంగా ఉన్న పార్వతి, ఆ విషాన్ని శంకరుడు తాగి సొమ్మసిల్లి పడి పోతూండగా భయాందోళనలతో ఆయన కంఠాన్ని గట్టిగాపట్టి విషం శరీరంలోనికి వెళ్ళనీయకుండా చేసింది. కొంతసేపు గడి చాక శంకరుడు స్వస్థుడయ్యాడు. పధ్నా లుగు భువనాలనీ రక్షించగల ఇల్లాలే అయినా తన భర్తదగ్గరికి వచ్చేసరికి ఆమె కూడ మానసికమైన బలంలేనిదే (అ-బల) అయింది. ఇది పతివ్రతా లక్షణం. ఈ వృత్తాంతం జరిగిందీ ఈరోజే.


ఈ కథకి సంకేత రూపంగా శివాల యాల్లో నేడు జ్వాలాతోరణోత్సవాన్ని చేస్తారు. దూరదూరంగా ఉన్న రెండు స్తంభాల మధ్య గడ్డితో చేసిన వెంటిని తాడులా కడతారు. దానికి నిప్పునంటించి ఆ మంట మండుతూంటే దాని కింది నుండి పార్వతీదేవి విగ్రహాన్ని మంత్రాలు చదువుతూ ముమ్మారు తిప్పుతారు. ఆ పై మంట కాలకూటాగ్ని, కింద కదులుతూ ఉన్న పార్వతి భయపడుతూన్నదానికి సంకేతం. కాసేపటికి మంట చల్లారడం శంకరుడు స్వస్థుడయ్యాడనడానికి సంకేతం. ఈ పెద్దమంటకి ఎక్కడెక్క డున్న హానికర క్రిములన్నీ తమంత తాముగా ఆకర్షింప బడి చనిపోతాయనేది వైద్య రహస్యం.

**నాలుగుసార్లు :**

మహాభారత, భాగవతాలతో పాటు అష్టాదశపురాణాలనీ ఇంకా అనేక గ్రంథా లనీ అందించిన మహర్షి వ్యాసుణ్ణి సంవ త్సరంలో నాలుగుమార్లు (ఆషాఢ కార్తిక మాఘ వైశాఖ మాసాల్లో) స్మరించాలని పెద్దలంటారు. దీనిలోని భావమేమంటే - ఒక నీతికి సంబంధించిన విషయం తన ప్రభావాన్ని మూడు నెలలు మాత్రం చూపగలుగుతుందని. ఇలా సంవత్సరంలో నాలుగుసార్లు నీతి విషయాలని విన్నట్లైతే ఆ వ్యక్తి నీతిమంతుడు కాగలుగుతాడనీ - నీతితో ఉండడం స్వభావంగా అయి పోతుందని నమ్మకం.

**శివావతారం :**

'వృషభ'మంటే ఎద్దు. ఇది ధర్మానికి సంకేతం. పాడీ పంటా సక్రమంగా ఉంటే వ్యక్తుల జీవనానికి ఇబ్బంది ఉండదు. జీవితం సుఖంగా సాగిన పక్షంలో (ఆకలి తీరితే) చోర భయం ఉండదు. పంటకి అనువైన జంతువు ఎద్దు. పాడికి అవసర మైన జంతువు గోవు. ఈ గోసంఖ్య పెరగా లంటే బలమైన ఎద్దులుండాలి. ఆ కార



ణంగా ఒక ఎద్దుని బాగా మేపి దాన్ని శివావతారంగా భావించి దానికి అచ్చు పోసి లోకంలో విడిచేది ఈ రోజే. ఇలా పాడీ – పంటా – ప్రజారక్షణా – స్వయం చికిత్సా విధానం–శివకేశవ అభేద జ్ఞానం – వేదాల గొప్పదనాన్ని తెలియగల అవ కాశం... ఇలా అన్నింటినీ చెప్పే ఈ కార్తిక పూర్ణిమ నిజంగా ప్రతి వ్యక్తికీ బ్రహ్మ రంధ్రంలో (మాడు) నిలువ ఉంచుకో దగిన జ్ఞాన విశేష పూర్ణిమ.

## ౨౨౨. గణపతి కథలో అసలు నిజాలు

**జ.** వైద్యుడు ఒకే ఔషధాన్ని పిల్లలైతే ద్రవ రూపంగానూ, పెద్దలయితే మాత్రల రూపంగానూ, వృద్ధులైన పక్షంలో సూది మందు రూపంగానూ, మరీ వృద్ధులైన పక్షంలో నేరుగా నరాల్లోనికి పంపి వ్యాధిని తొలగిస్తున్నాడు. ఇదే పద్ధతిలో ప్రాచీనులు కూడ భక్తులలో ఉండే స్థాయీ భేదాన్ని బట్టి కొందరికి ఉపాసనలనీ, మరికొందరికి మంత్రోపదేశాలనీ, ఇంకా కొందరికి అర్చనలనీ, ఇంకా మరి కొంద రికి మంత్రోపదేశాలనీ, ఇంకా కొందరికి అర్చనలనీ, ఇంకా మరి కొందరికి వ్రతా లంటూనూ ... ఈ విధంగా ఏర్పాటు వివిధ రూపాలను ఏర్పాటు చేశారు. ఒకే ఔషధం స్థాయీ భేదాన్ని బట్టి రూపాన్ని మార్చుకున్నా పనిచేసే తీరులో ఆ ఔషధంలో ఏ మార్పు లేనట్టు, పైన అనుకున్న ఉపాసనలు – మంత్రోప



దేశాలు – అర్చనలు – వ్రతాల ఆచరణ ... అనే ఇవన్నీ ఒకే తీరూ ఒకే స్థాయీ ఫలితాలనే ఇస్తాయిగాని, ఉపాసనలు ఎక్కువ ఫలితాన్నీ, వ్రతాలు అల్ప ఫలి తాన్నీ ఈయనే ఈయవు. కొందరు నావల మీదా, మరికొందరు మదించిన ఏనుగుల మీదా, ఇంకొందరు బోర్లించిన కుండల పైన పడుకుని ఈదుతూనూ, మరి కొందరు తెప్పల మీదా, ఇంకొందరయితే కేవలం చేతులతో ఈదుతూనూ... గంగని దాటి అందరూ ఒకే రామచంద్రుణ్ణి దర్శించగలిగారంటుంది శ్రీమద్రామయణం.

అంటే ఏమన్నమాట? విధానాలు వేరైనా పరమాత్మని దర్శించడంలో ఎక్కువ తక్కువలల్లేవని భావం.

ఆ కారణంగా ఆ వ్రతంలో కన్పించే కథలు కూడా సామాన్యమైనవి కావన్న మాట. ఈ నేపథ్యంలో వ్రతానికి సంబం

ధించిన పై కథని సంక్షిప్తంగానూ లో రహ స్యాలని వివరంగానూ తెలుసుకుందాం!

**గజాసురవధ :**

'గజ' అనే పేరుగల రాక్షసుడు శంక రుణ్ణి గూర్చి తపస్సుచేసి మెప్పించి ఆయన్ని తన బొజ్జలోనే (ఉదరం) ఉండి పోయేలా చేసుకున్నాడు. శంకరుణ్ణి కానని పార్వతి విష్ణువు వద్దకి వెళ్లి మొరపెట్టు కుంది. విష్ణువు ఆలోచించి నందీశ్వరుణ్ణి గంగిరెద్దుగానూ, తాను ఆడించేవాని గానూ, ఇతర దేవతలని గంగిరెద్దు వెంట వచ్చే వాద్యగాళ్లుగానూ చేసి గజాసురుని ఎదుట ఆడి పాడి అతణ్ణి మెప్పించాడు. గజాసురుడు 'వరం కోరుకొ'మ్మనగానే – 'నీ ఉదరంలోని శంకరుడు కావా'లని – వరాన్ని కోరి శంకరుణ్ణి విడిపించుకొచ్చాడు.

**లో రహస్యం :** దేవుడేమిటి? మరొకరి ఉద రంలో దూరి కూచోవడమేమిటి? జగ న్మాత పార్వతి అందరినీ రక్షించేదౌతూంటే తన భర్తకి ఆపద కల్గితే విష్ణువుని ప్రార్థిం చడమేమిటి? ఇదంతా ఇలా ఉంటే ఈ కథని విజ్ఞానశాస్త్రాలు విజృంభించి రాజ్యాన్ని ఏలుతూన్న ఈ రోజుల్లో చద వడమేమిటి?... వంటి అనేక ప్రశ్నలు మనకి – ఈ కథే కాదు. ఈ వ్రతంలోని అన్ని కథల విషయం లోనూ – కలుగు తాయి. అందుకే ఒట్టిగా కథని చదివేసు కోవడం కాకుండా లోరహస్యాలని గమ నించాలని ప్రాచీనులు చెప్పారు. సరే! 'గ' అంటే గతించడం (మరణించడం), 'జ' అంటే జన్మించడం (పుట్టడం). ఇలాంటి

artist

లక్షణం కలవాడు 'గజుడు'. ఏదో పుట్టాడు కొంతకాలం జీవించి ఏదో ఓ కారణంతో మరణించాడు. తానుగా సాధించిందంటూ ఏమీ లేదతనికి. ఇలాటి గజులెంద రుండరు లోకంలో. అయితే ఆ గజునికీ లోకంలోని గజులకీ ఓ తేడా ఉంది. ఆ గజుడికి ఓ కనువిప్పు కల్గింది – ఇలా పుట్టడం చావడం మళ్లీ పుట్టడం చావడం ... ఇంతేనా జీవితమంటే? – అని. (ఇలా ప్రతి గజుడూ (మనం) ఆలోచించు కోవా లన్నమాట) అందుకే శంకరుణ్ణి గూర్చి తపస్సు చేశాడు. శంకరుడు ప్రత్యక్షమ య్యాడు. ఎందుకని? గజుడు తనకి కలి గిన ఆ కనువిప్పు కారణంగా హృదయ పూర్వకంగానూ – భక్తిశ్రద్ధల తోనూ – ఏదో ఒకటి జీవితకాలంలో సాధించి తీరా లనే దృఢదీక్షతోనూ తపస్సు చేయడం బట్టీ, ఆ తపస్సుకి తాను ప్రత్యక్షం కావ లసినంత స్థాయి ఉంది కాబట్టీ, శివుడు

ప్రత్యక్షమయ్యాడు. ఈ విజయానికి ఆనందపడిన గజుడు శంకరుణ్ణి అడగనే అడిగాడు – తన ఉదరంలో శాశ్వతంగా ఉండవలసిందని. దానికి శంకరుడు 'సరే'నన్నాడు. ఏమిటిది? ఒకదైవం ఒకని ఉదరంలో ఉండిపోవడమా? అనుకో కూడదు. తనని తాను శివునిగా భావించుకోవడాన్ని 'శివోఽహమ్' అంటారు. ఉపాసనల్లో గొప్పది అహం గ్రహోపాసన (తనని తాను తన ముందున్న ఆరాధ్య దైవంగా భావించుకోవడం). ఇది పై దృష్టితో చూస్తే పరిహాసాస్పదంగా కన్పిస్తుంది గాని ఇది అనుభవంలో అందరికీ సాధ్యమయ్యే అంశమే. గంటసేపు పూజ చేస్తూంటే ఏదో ఒక అనిర్వచనీయమైన ఆనందం తనని తాను మర్చిపోయిన తాదాత్మ్యస్థితీ అనేవి ఏదోక నాలుగైదు నిమిషాల పాటు కల్గుతాయి.

అదుగో ఆ స్థితిని అహంగ్ర హోపాసనా స్థితి అనుకోవచ్చు. ఇది మనబోటి వాళ్ళకి ఎంతోసేపు చేసిన జపంలో ఓ కొన్ని క్షణాలపాటు లభిస్తూంటే గజునికి సర్వకాల సర్వావస్థల్లోనూ ఆ తాదాత్మ్యస్థితి లభించి తానొక రాక్షసుడిననే భావమే తనకి తొలిగిపోయింది. ఆ స్థాయీ స్థితీ గజునికి లభించాయి కాబట్టే, శ్రీహరి అంతటివాడు గంగిరెద్దుల నాడించే వానిగా వచ్చి తనకి తానుగా గజునికి దర్శనమీయాల్సి వచ్చింది. గజుని తపః స్థాయీ ఉపాసనస్థితీ ఏ ఎత్తుకి వెళ్లిందంటే శ్రీహరితోపాటు ఇతర దేవతలని

artist

కూడ తనంతతానుగా తన ఇంట కూచుని దర్శించుకునేంత – అంతేకాదు – ఏ దైవాన్ని మనం మెప్పించి బహుమతులని (కోరికలని) పొందుతుంటామో ఆ పరిస్థితి ఇక్కడ తారుమారై దేవతలే రాక్షసుణ్ణి మెప్పించి బహుమతిగా శంకరుణ్ణి పొందవలసి వచ్చినంత. ఇది పరోక్షంగా దేవతలందరి మంగళవాద్య ఘోషతో కూడిన ఓ అభినందన గజునికి – అని భావించవచ్చు. దేవతలంతా ఏదో వంచించడం కోసం రాలేదు గజుని దగ్గరకి. దీని క్కారణం మరేమోకాదు. భారతీయ సంప్రదాయంలో గుర్రమనేది శక్తికి సంకేతం. ఎద్దు అనేది ధర్మానికి సంకేతం. అందుకే మన వద్ద ఉన్న ధనానికి సంబంధించిన నాణెంగాని కాగితాన్ని గాని చూస్తే దాని మీద సింహాల బొమ్మ కింద అశోక చక్రం దానికి ఇరుపక్కలా ఎద్దూ గుర్రం బొమ్మలు కన్పిస్తాయి. ఈ బొమ్మల భావ

మేమంటే – 'ఈ ధనానికి యజమానివైన ఓ వ్యక్తీ! నీ గుర్రాన్ని (శక్తిని) ఎద్దు ఆధా రంగా (ధర్మ పద్ధతిలో వినియోగించి) నన్ను(ధనాన్ని) సంపాదించుకో! అని. అలాటి ధర్మానికి సంకేతమైన ఎద్దు – మనకికన్పించే శివుని వాహనమైన 'నంది'. అంటే దేవతలంతా 'నంది'ని ఆడించి (ధర్మమయమైన పద్ధతిలో మాత్రమే ప్రవర్తిస్తూ) గజుణ్ణి మెప్పించారు. భగ వంతుని చేతిలో మరణాన్ని పొందితే మోక్షం సిద్ధిస్తుందనేది యదార్థం కదా!

అలాటి శ్రీహరి సమక్షంలో శంకరుని వాహనమైన నంది తన కొమ్ముల్తో గజుని పొట్టని చీలిస్తే ఆ గజుని శరీరాన్ని శంక రుడు దర్శించాడంటే గజుడు ఎంత గొప్ప వాడు! అందుకే ఆ గజుని తల వినా యకుడు ముందు కాలంలో ధరించ వల సినవాడయ్యాడు. మొత్తమ్మీద తెలిసేదే మంటే – ఊరికే పుట్టడం చావడం కంటె పరమేశ్వరుని ఆరాధనాన్ని హృదయ పూర్వకంగా చేస్తే తాను రాక్షసుడే అయినా భగవంతునికి తలగా అయ్యేంత స్థితిని పొందవచ్చని.

**వినాయకుడు :**

గజాసురవధ అయ్యాక శంకరుడొస్తు న్నాడని తెలిసి పార్వతి తన భర్తకి స్వాగతం చెప్పదలిచి స్నానాన్ని చేయడం కోసం వెళ్తూ తాను నలిచిన నలుగు మట్టితో ఒక బొమ్మని చేసి ప్రాణం పోసి వాణ్ణి కాపలాపెట్టింది. శంకరుడు వస్తూనే అడ్డగించిన బాలుణ్ణి శూలతో తల నరికి సర్వాలంకారాలతోనూ ఉన్న పార్వతి ఇచ్చిన స్వాగతాన్ని స్వీకరించాడు. ప్రసంగ వశాత్తూ బాలుడు హతుడయ్యాడని తెలిసి పార్వతి దుఃఖిస్తూంటే ఆ గజుని శిరస్సుని తెచ్చి అతికించాడు ఈ బాలునికి.

**లో రహస్యం :** ఎక్కడైనా భర్త ఓ విజ యాన్ని మూటగట్టుకు వస్తున్నాడన్నా, ఆపదనుండి గట్టెక్కి రాబోతున్నాడన్నా కట్టుకున్న భార్య సర్వాభరణాలతోనూ అతనికి స్వాగతం చెప్పాలనేదీ – అలా చెప్తే అతడు సంతోషిస్తాడనేదీ ఇక్కడి తొలి విశేషం. అలా స్వాగతించదలిచిన పార్వతి తన శరీరం మీది నలుగుతో ఓ మట్టి బొమ్మని చేసి దానికి ప్రాణాన్ని పోసిందని కథ చెప్తోంది. బ్రహ్మచేసే సృష్టికార్యాన్ని ఈమె చేయగలదనేది ఇక్కడి విశేషం (సృష్టి కర్త్రీ బ్రహ్మరూపా). శంకరుడు వస్తూన్నవేళ అడ్డగించిన బాలుణ్ణి వధిం చడానికి – లయం చేయడమే తనకి వృత్తి

artist

ధర్మంగా కలిగిన శంకరునికి శూలం కావ లసివచ్చిందా? ఇదేమిటి? అది కాదు. అమ్మ ఆ బాలునికి ప్రాణాన్ని మాత్రమే పోసి సృష్టికార్యాన్ని చేయగలనని పరో క్షంగా చెప్తే – ఏనుగు తలని తెచ్చి మనుష్య శరీరానికి అతికించి స్థితినీ (విష్ణువు చేసే జీవిత రక్షణ స్థితినీ) – తనని అడ్డగించిన బాలుణ్ణి (పార్వతీదేవి ప్రాణాన్ని పోసి సృష్టించినవాణ్ణి) వధించి తాను లయ కార్యాన్ని కూడా చేయగలనని నిరూ పించాడు శంకరుడు.


నిజానికి మట్టిబొమ్మ ఈ వినాయకు డొక్కడే కాదు. మనందరం కూడ మన తల్లి నిర్మించిన మట్టిబొమ్మలమే. మననం దరినీ కూడ లయకర్త అయిన శంకరుడు లయం చేస్తూనే ఉన్నాడు. అయితే ఆ బాలుడి విషయంలో పార్వతి ప్రార్థించింది పరమేశ్వరుణ్ణి – బ్రతికించ వలసిందని. మనని శివుడు లయం చేశాక బ్రతికించ వలసిందని ప్రార్థించేందుకు ఎవరూ లేరు. జగన్మాత అయిన అమ్మని మనం కూడ మనని బ్రతికించుకో గలిగినంతగా మెప్పించుకోగలిగిన పక్షంలో ఆమె మన పక్షాన నిలబడి శంకరుని ద్వారా ప్రాణా లని తిరిగి ఇప్పించగలదు. ఈ విషయమే గాయత్రీ ఉపాసనలో – చిరంజీవితం వర్ధయంతీ –(ఆమె తలుచుకున్న పక్షంలో వ్యక్తికి నిర్ణయింపబడిన ఆయుష్య కాలాన్ని పెంచగలిగిన శక్తి ఉన్నది అమ్మ) అని చెప్పబడింది. మరో విశేషమూ ఉందిక్కడ. ఒకప్పుడు మన్మథుణ్ణి భస్మంచేసి అయ్య



కంటె తానెక్కువని నిరూపిస్తూ అమ్మ ఆ మన్మథుణ్ణి బ్రతికింపజేసి భార్య అయిన రతీదేవిని ఆనందపరిచింది. మన వ్రత కథ సంఘటనలో అమ్మ బ్రతికించిన బాలుణ్ణి లయంచేశాడు అయ్య. అయ్య ద్వారా బ్రతికిన గణపతి శివుని పుత్రుడైతే – అమ్మవల్ల బ్రతికిన మన్మథుడు కేశవ పుత్రుడు. ఆ శివ కేశవభేదం పై దేవతలకి లేనేలేదు.

**గణాధిపత్యం :**

ఎవరెక్కువ నదీనదాల్లో స్నానంచేసి అందరికంటె ముందుగా వస్తారో వారికి దేవగణాలన్నింటికీ ఆధిపత్యం ఇస్తామని దేవతలు ప్రకటించగానే వాయువేగంతో కుమారస్వామి నెమిలిమీద వెళ్లిపోయాడు. పెద్ద బొజ్జతో చిన్న ఎలుక వాహనంపై ఉన్న వినాయకుడు కళ్లనీరు గుక్కుకుంటూ అక్కడే ఉండిపోయాడు.



తల్లి పార్వతి ఆ పుత్రుని దుఃఖాన్ని చూడలేక శివునికి విన్నవిస్తే ఆయన నారాయణ మంత్రోపదేశాన్ని చేశాడు. వినాయకుడు ఆ మంత్రాన్నే జపిస్తూ తల్లి దండ్రులకి ప్రదక్షిణలుచేస్తూ ఉండిపోయాడు ఇక్కడే. అయితే తాను ఏ నది లోనికి స్నానం చేయవెళ్తున్నాడో అప్పటికే వినాయకుడు స్నానాన్ని ముగించి తిరిగి వస్తూన్నట్లుగా అనిపించింది కుమార స్వామికి. కుమారస్వామి ఓడగా వినాయకుడు గణాధిపతి స్థానాన్ని పొందగా దేవతల విందుని ఆరగించిన గణపతి తల్లి దండ్రులకి కృతజ్ఞతా పూర్వంగా సాష్టాంగ పద్ధతిలో నమస్కరించబోయి (పొట్ట ఉన్న కారణంగా నేల మీద పడుకుని తలవంచి నమస్కరించబోతే) కాళ్లు తేలిపోయి, కాళ్లతో భూమిని తొక్కిపట్టుకోదలిస్తే పెద్ద పొట్ట కారణంగా తల తేలిపోయేది. ఈ నమస్కారం – దాని వెనుక శ్రమా... గమనించిన చంద్రునికి నవ్వు ఆగక పరిహాస పూర్వకంగా నవ్వాడు. చంద్రుని దృష్టిదోషం కారణంగా గణపతి బొజ్జ పగిలింది. పార్వతి కోపించి చంద్రుణ్ణి చూస్తే నీలాపనిందలు (నిష్కారణమైన నిందలు) వస్తాయని లోకజనులని శపించింది. ఫలితంగా ఏ ఒక్కరూ తలెత్తి చంద్రదర్శనాన్ని చేయ (లే)క చాలా ఇబ్బంది పడసాగారు.

**లో రహస్యం :** అంగిరసుడు మొదలైన మహర్షులంతా భూలోక ప్రజలని ఉద్ధరించ దలిచి ఈ లోకానికొచ్చి ఇక్కడచేసిన తమ తపఃఫలాన్ని నదీనదాల్లో నిక్షిప్తం చేశారు. ఎవరు వీటిలో స్నానం చేస్తే వారి వారి భక్తి శ్రద్ధలని బట్టి ఆయా మాత్రపు తపశ్శక్తి వాళ్లకి సిద్ధిస్తుందని వాళ్లు చెప్పి పై లోకాలకి వెళ్లిపోయారు మళ్లీ. ఈ కారణంగానే పర్వదినాల్లో నదీస్నానాలు చేయాలన్నారు పెద్దలు. వినాయకుడూ కుమారస్వామీ సమస్త నదీనదాల్లో స్నానంచేసి రావడమనేదే గణాధిపతి పదవికి పెట్టబడిన పరీక్ష. అంటే ఎవరెంత తక్కువ కాలంలో ఆ నదీనదాల్లో దాగిన తపశ్శక్తిని తమ సొంతం చేసుకుంటారో అంతటి తపశ్శక్తి అధికుణ్ణి గణాధిపతిగా నియమించుకోవాలనేది దేవతల ఆశయమన్న మాట. ఇక్కడ నెమిలి వాహనం సన్నని శరీరం కలిగిన కుమారస్వామికీ, ఎలుక వాహనం పెద్ద శరీరమున్న వినాయకునికీ పోటీపడింది. చూడగానే కుమార స్వామే గెలుస్తాడని ఎవరికైనా అర్థ మౌతుంది. అయితే మన అంచనా తల క్రిందై వినాయకుడే గెలిచాడు. ఎలా? శరీర బలానికి సంకేతం కుమారస్వామి. అందుకే తాను నమ్ముకున్న శరీరబలాన్ని ఉపయోగిస్తూ వెంటనే ఎగిరి వెళ్లాడు. వినాయకునిది

తల్లిదండ్రుల ఆశీర్వచన బలం. దీనికి శివుడంతటి వాడిచ్చిన నారాయణమంత్ర బలం తోడైంది. ఈ వివాదంలో గెలుపు వినాయ కునికే వచ్చింది. కాబట్టి కన్న తల్లి దండ్రుల ఆశీర్వాదబలమనేది వ్యక్తికున్న శరీరబలాన్ని ఎప్పుడూ అతిక్ర మిస్తుందనేది ఇక్కడ రహస్యం. ఈ ప్రయ త్నం తల్లిదండ్రుల ఆశీస్సు ఫలించడానికి నారాయణమంత్ర మననం మరింత మంచిదనే విషయం దీనిద్వారా తెలు స్తుంది మనకి. శివకేశవులకి వైరం లేదన డానికి ఈ ఘట్టం ప్రత్యక్ష సాక్ష్యం. గెలి చినపిమ్మట ఆ గెలుపుకి తాను కారణం కాదని వినాయకుడు తల్లిదండ్రులకి నమ స్కరింపబోవడం కృతజ్ఞతకి గుర్తు. గెలుపు పిమ్మట విందు వినోదాలు దేవతల కాలం నుండీ ఉంది. ఆ విందుల నారగించిన వినాయకుణ్ణి చూసిన చంద్రునికి పార్వతి శాపమిచ్చిందని కథ చెపుతోంది. ఎంతటి బుద్ధిమంతుడైన బిడ్డడైనా, గణాలకి అధి పతి పదవిని పొందిన పుత్రుడైనా తల్లికి చిన్నపిల్లవాడు గానే కన్పిస్తాడు. వాణ్ణి ఎవ్వరైనా గేలిచేస్తే తట్టుకోలేదని నిరూ పిస్తూ ఆమె శపించిందంటే – అందునా తమతో ఎప్పుడూ ఉండే చంద్రుణ్ణే క్షమిం చలేదంటే పుత్రుని విషయంలో ఏ తల్లీ చూస్తూ ఊరుకోదని గ్రహించాలి. కాబట్టి ఏ పుత్రుణ్ణీ వాని తల్లిముందు తక్కువ చేయకూడదన్న మాట. దీన్ని బట్టి వినా యకుడు 'అమ్మ బిడ్డ'డని అర్థమైంది. దీన్నే మరోలా అనుకోవాలంటే ఏ పనైనా అమ్మ పార్వతి ద్వారా సాధించాలంటే వినాయ కుణ్ణి ఆరాధిస్తే చాలన్నమాట.

**హోమగుండం :**

ఎలాగో చంద్రుణ్ణి చూడకుండా గడుపు తున్నా ఒకసారి అగ్నిహోత్రుని కంట




పడ్డాడు చంద్రుడు. సప్త మహర్షుల భార్యలూ హోమగుండం చుట్టూ ప్రదక్షిణం చేస్తూంటే పోసిన నెయ్యి అధికం కావడంతో అగ్ని జ్వాలలు ఆ భార్యలని కొద్దిగా తాకాయి. దాంతో అతి పవిత్రుడైన అగ్నికి కూడా మహర్షి భార్యలపట్ల అపచారం చేశాడనే నిందవచ్చి పడింది. భాద్రపద శుద్ధ చవితినాడు వ్రతకథలు వినకుండా చంద్రుణ్ణి చూస్తే మాత్రమే నీలాపనిందలు కలుగుతాయని శాపాన్ని సడలించింది.

**లో రహస్యం :** మానసికంగా మనోవ్యధని కల్గించే అసత్య ఆరోపణమే అపనిందంటే. పార్వతీదేవి శాపం ఎంతగట్టిదంటే దానికి అతి పవిత్రుడైన అగ్ని కూడ లొంగక తప్పలేదు. 'లోకాపవాదా ద్భయమ్' – నేను నా మానాన పోతున్నాను కాబట్టి నాకే భయమూ లేదని ఎవరూ అనుకో

కూడదు. ఏ దిక్కునుంచి ఏ నింద వచ్చి పడు తుందోనని అనుక్షణం తనమీద తాను నిఘా ఉంచుకోవాల్సిందే నంటోంది ఈ కథ.

**శ్యమంతకమణి :**

అనుకోనిరీతిలో కృష్ణుడే చంద్రుణ్ణి చూశాడు. అంతే! సత్రాజిత్తనే రాజువద్ద ఉండే శ్యమంతకమణి కన్పించక పోయే సరికి ఆ నేరం కృష్ణుని మీదే పడింది. దాన్ని తొలగించుకోడానికి కొంత మందితో కలిసి వెళ్ళి శ్యమంతకమణిని ధరించి వేటకి వెళ్ళిన ప్రసేనుని శవాన్నీ (సత్రాజిత్తు తమ్ముడు) అక్కడి నుండి కన్పించిన సింహపు అడుగుజాడలనీ, కొంత దూరం పిమ్మట సింహ కళేబరాన్నీ అక్కడి నుండి ఎలుగుబంటి పాదముద్ర లనీ గమనించాడు కృష్ణుడు. అక్కడ ఉయ్యాలకి వేలాడదీసి శ్యమంతకమణిని ఆ జాంబవంతునితో పోరాడి గెలిచి తీసు కున్నాడు. అతని కుమార్తె జాంబవతిని కాను కగా పొందాడు కృష్ణుడు తిరిగి సత్రా జిత్తు



వద్దకి వచ్చి జనులందరి సమక్షం లోనూ జరిగింది వివరించి మణినిచ్చి వేశాడు.

**లోరహస్యం :** శ్యమంతకమణి ప్రతి నిత్యం బంగారాన్ని సృష్టిస్తూ ఉండే శక్తి కలది. అంత విలువైన మణి కారణంగా కృష్ణుడంతటివాని క్కూడ నింద తప్పలేదు. కాబట్టి ధన విషయంలో ఎవరైనా నింద రాకుండా దూరంగా ఉండాలన్న మాట. ప్రసేనుని ప్రాణాలు పోడానికి కారణం మణి కాబట్టి విలువైన బంగారమనేది వ్యక్తి ప్రాణాలకి ముప్పుని తెస్తుందని గమనించాలి.

చిత్రమైన విషయమేమంటే విలువైన వ్యక్తి ప్రాణాలని గ్రహించే బంగారానికి వ్యక్తికున్నంత విలువ ఏనాడూ లేదు – ఉండదు. అయితే ఆ బంగారమనేది భగ వంతుని క్కూడ అపనిందనీ, సూర్యుణ్ణి ఆరా ధించినంతటి శక్తికల సత్రాజిత్తుకి భ్రాతృ శోకాన్నీ (తమ్ముడైన ప్రసేనుని మరణాన్నీ) కల్గించింది. సత్రాజిత్తంతటివాడు కూడా కృష్ణునిమీద అపనింద వేశాడంటే కారణం ఈ మణి మాత్రమే. సత్రాజిత్తుకి కృష్ణుని మీద అపనింద వేయడమే వచ్చు. ప్రసేను నికి మణితో వెళ్ళి మరణించడమే వచ్చు. కృష్ణునికి మణిని తెచ్చి ఈయడమే కాక బహుమతిగా జాంబవతిని పొందడం కూడా వచ్చు. అపనిందవేసే వాళ్లకి ఆ నిందవేయడమే తప్పు, ఒక పనిని సాధించ గల సామర్థ్యం ఏ మాత్రమూ ఉండదని ఈ కథ చెప్తోంది. మణిని రహస్యంగా కాక అందరు జనుల సమక్షంలో జరిగిన కథని వివరించి ఇయ్యడమెందుకంటే

మరోమారు తాను నిందపడకుండానూ – నింద వచ్చిన నపక్షంలో ఇలా బహిరం గంగా వివరించి ఆ నిందని పోగొట్టు కోవాలి సుమా! అని వివరించడానికీను. ఇలాటి కథలూ వాటి ద్వారా నీతులూ పిల్లలకి చెప్పడం అత్యవసరమని భావిం చిన పెద్దలు ఇటు సామాజిక స్పృహ తోనూ అటు ఆధ్యాత్మికపరంగానూ ఈ కథలని వ్రతాల్లో చొప్పించారు. అందుకే వ్రతకథలని శ్రద్ధగా వినాలి.

## 1000. శక్తిపీఠాలు

**జ.** దక్షుడు యజ్ఞంచేస్తూ దేవతలందరినీ ఆహ్వానిస్తాడు కాని తన అల్లుడైన పరమ శివుడిని పిలవడు. ఆయన కుమార్తె సతీదేవి భర్తను తండ్రి అవమానించడాన్ని భరించ లేక ప్రాణత్యాగం చేస్తుంది. దీంతో శివుడు మహా ఉగ్రుడై ప్రాణంలేని భార్య సతీదేవి శరీరాన్ని భుజంపై వేసుకుని ప్రళయ తాండవం చేయడాన్ని ఆరంభిస్తాడు. శివ తాండవంతో ముల్లోకాలూ అల్లాడి పోతాయి. బ్రహ్మాది దేవతలు అందరూ శ్రీమన్నారాయణుడితో సమాలోచనలు



జరుపుతారు. సతీదేవి శరీరం శివుని వద్ద ఉన్నంతకాలం తన ఉగ్రరూపాన్ని వదల దని, శివతాండవం యావత్ విశ్వాన్ని నశింప జేయగలదని భావించిన విష్ణుమూర్తి సతీదేవి శరీరాన్ని ఖండాలుగా చేసేందుకు చక్రాయుధాన్ని ప్రయోగిస్తాడు. ఇలా ఖండాలైన శరీర భాగాలు, ఆమె ఆభ రణాలు పడిన ప్రదేశాలన్నీ 'శక్తి పీఠాలు'గా రూపాంతరమయ్యాయి. ప్రతి పీఠంలోనూ శక్తిదేవి సరసన శివుని ప్రతిరూపమైన భైర వుడు తప్పనిసరిగా ఉంటాడు. సతీ శరీర క్షేత్రాలు మహాక్షేత్రాలయ్యాయి. మొదటి రోజుల్లో ఇవి విగ్రహాలు లేని శక్తిక్షేత్రా లుగా అంటే రూపం లేనివిగా ఉన్నందున సామాన్యులకు అర్థం కావడం లేదన్న కార ణంతో యోగివర్యులు, మహర్షులు వాటికి దేవాలయ రూపం కల్పిస్తూవచ్చారు. కొన్ని మన దేశంలోనూ, కొన్ని విదేశ భూభా గాలల్లోనూ సైతం ఉన్నాయి. కొన్ని శక్తి పీఠాలు మహాశక్తిపీఠాలుగా ప్రసిద్ధి గాంచాయి.

**భవాని అమ్మవారు**

ఇది సతీదేవి మూడు కన్నులు పడిన చోటుగా చెప్తారు. మహారాష్ట్రలో ఉంది. మహాలక్ష్మి లేదా మహిషమర్ధినిగా పిలిచే భవానీ అమ్మవారు ఈమె. పంచగంగ నదీ తీరాన ఉంది. ఇక్కడ అనేక ప్రాచీన దేవా లయాలు ఉంటాయి. కొల్హాసుర అనే రాక్ష సుడు దేవతల్ని, ఇతరుల్ని వేధిస్తుంటాడని, కరవీర వద్ద మహాలక్ష్మి అతన్ని సంహరిం చిందని ఒక కథనం ఉంది. మహాలక్ష్మీ దేవి ఆలయ మహాద్వారం పశ్చిమ



ముఖంగా ఉంటుంది. ప్రవేశిస్తుండగా ఇరు పక్కలా అనేక దీపమాలలు ఉంటాయి. ఆ తర్వాత నలుచదరంగా ఉన్న స్థూపాలు, చెక్కతో నగిషీలు చెక్కిన ఆర్చీలు వస్తాయి. గరుడమూర్తి గర్భగుడి ముఖంగా ఉంటుంది. మరో ఎత్తైన రాతి మండపం మీద గణేశుని విగ్రహం కూడా గర్భగుడి వైపునకు తిరిగి ఉంటుంది. ఈ మండపాన్ని అనుసరిస్తూ పశ్చిమ ముఖంగా మూడు గుళ్ళు ఉంటాయి. మధ్యలోనిది మహాలక్ష్మి ఆలయం. వెండి నాగపడగతో బంగారు కిరీటంతో ఉంటుంది. మిగతా రెండు మహాకాళి, మహా సరస్వతి ఆలయాలు. మహాలక్ష్మి విగ్రహం నల్లరాతితో, మూడడుగుల ఎత్తుతో ఉంటుంది. గుడి లోపల ఒక గోడపై శ్రీయంత్రాన్ని చెక్కారు. ఏడాదికి మూడురోజులపాటు సూర్య కిరణాలు మహాలక్ష్మీదేవి ముఖంపై పడే మాదిరి గర్భగుడిని మలిచారు. మహాలక్ష్మి గుడి దాటాక శివలింగం, నందిలతో గుడి ఉంటుంది. వెంకటేశ, కాత్యాయని, గౌరీశంకరులు ఉత్తర, తూర్పు, దక్షిణ ముఖాలుగా దేవాలయాలు ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలో నవగ్రహాలు, సూర్యుడు, మహిషాసుర మర్దిని, విఠల్, శివ, విష్ణు, తుల్జాభవాని ఇతరులతో అనేక చిన్న చిన్న గుడులు ఉంటాయి. 'మణికర్ణిక కుండ్'గా పిలువబడే ఆలయ కొలను ఉంటుంది. దీని తీరాన విశ్వేశ్వర మహదేవ ఆలయం ఉంది. ప్రాచీన డెక్కన్ దేవాలయాల సంస్కృతిలో దీనిని నిర్మించారు. రోజుకు ఐదుసార్లుగా ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ప్రతి శుక్రవారం, పౌర్ణమిరోజుల్లో ఉత్సవమూర్తిని బైటకు తీసి దేవాలయ ప్రాంగణంలో ఊరేగిస్తారు.

**దుర్గ :**

ఉత్తర గుజరాత్‌లోని అరవల్లి పర్వత ప్రాంతానికి నైరుతీ దిశగా రాజస్థాన్‌లోని మౌంట్ అబు సమీపంలో అరసూర్ వద్ద అంబాజి లేదా అంబిక శక్తిపీఠం ఉంది. సరస్వతి నది ఇక్కడనుంచి పుట్టి, కుచ్ మైదానంలో అంతర్ధానం అయింది.



ఇక్కడ కోటీశ్వర్ మహదేవ ఆలయం కూడా ఉంది. సతీదేవి ఎడమ స్తనభాగం ఇక్కడ పడిందంటారు. అంబికమూర్తి ఉండదు. యంత్రం మాత్రం ఉంటుంది. ఇక్కడి శక్తిని దుర్గగా పేర్కొంటారు. అంబికావనంలో కృష్ణభగవానుడు శివుడినీ, అంబికను పూజించాడని, కృష్ణునితో వివాహానికి ముందు రుక్మిణి కూడా అంబికను పూజించిందని చెప్తారు. మౌంట్ అబుకు, వశిష్ఠునికి బాంధవ్యం ఉన్నట్లు కూడా చెప్తారు. ఆయన గోవు నందిని గుంటలో పడిందని, గోవును రక్షించేందుకు సరస్వతీనది గుంటను నీటితో నింపి గోవు బయటకు రావడానికి సహకరించిందని విశ్వసిస్తారు.

**అతి పురాతన దేవాలయం :** గయలోని మంగళగౌరి గురించి పద్మ, వాయు, అగ్ని, పురాణాలలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆలయం 1459 నాటిది. మంగళ గౌరి కొండలపై తూర్పు ముఖంగా ఆలయాన్ని నిర్మించారు. మెట్లదారి, రోడ్డుమార్గం కూడా ఉన్నాయి. సతీదేవి స్తన్య భాగం ఇక్కడ పడిందంటారు. నగిషీలు చెక్కిన ప్రాచీన శిల్పాలుంటాయి. దేవాలయం ముందు చిన్న హాలు లేదా మండపం ఉంటుంది. ఆలయ ప్రాంగణంలో హోమ గుండం ఉంటుంది. శివుడు, మహిషాసుర మర్దిని, దుర్గ, దక్షిణేశ్వర్ కాళి విగ్రహాలు గల రెండు చిన్న దేవాలయాలు కూడా ఈ ప్రాంగణంలో ఉంటాయి.

**కన్యాకుమారి :**

భారత ఉపఖండ దక్షిణ అంచుల్లో కన్యాకుమారి ఆలయం ఉంటుంది. సముద్ర తీరాన కన్యాకుమారి చిన్ని దేవాలయం ఉంటుంది. పట్టణం అదే పేరుతో పిలువబడుతుంది. ఈ ప్రదేశంలో స్వామి వివేకానందుడు ధ్యానిస్తూ గడిపాడు. సతీదేవి వీపుభాగం ఇక్కడ పడిందని ప్రతీతి. బాణాసుర అనే రాక్షసుడు అనేక విపత్తులు సృష్టిస్తుంటాడు. అతన్ని నశింపజేయడానికి పరాశక్తిని ప్రార్థించాల్సిందిగా దేవతల్ని, మానవుల్ని విష్ణుమూర్తి అభ్యర్థి





స్తాడు. ఈ ప్రార్థనల ఫలితంగా శక్తి కన్య అవతారంతో కన్యా కుమారిగా అవత రించి, శివుడిని వివాహమాడాలన్న కోరి కతో తపస్సు మొదలుపెడుతుంది. నారద మునీంద్రుడు వివాహానికి అర్ధరాత్రి ముహూర్తాన్ని నిర్ణయిస్తాడు. శివుడు ఊరే గింపుగా వచ్చి వఝుకుంపరై అన్నప్రదేశా నికి చేరుకుంటాడు. అయితే అక్కడ కోడి కూత విన్పించడంవల్ల పవిత్రముహూర్తం మించి పోయిందని భావిస్తూ వెనుతిరుగు తాడు. నిరుత్సాహపడిన దేవి తన జీవి తాన్ని కన్యగా కన్యాకుమారిలో గడపాలని గట్టిగా నిర్ణయించుకుంటుంది. బాణా సురుడు శక్తి కథ విని, బలవంతంగానైనా పెళ్ళి చేసుకుని ఆమె చెయ్యి అందు కోవాలని వస్తాడు. ఇద్దరి నడుమ భీకర యుద్ధం జరగ్గా, ఆమె రాక్షసుడిని సంహరి స్తుంది. నల్లరాతి కన్యాకుమారి మూర్తి చేతిలో పూల దండతో ఉంటుంది. ఆమె ముక్కెర ప్రత్యేకంగా మెరుస్తూ కనిపిస్తుం టుంది. యవ్వనంలో ఆమె సహచరుల యిన విజయసుందరి, బాలసుందరి దేవాలయాలు కూడా పక్కనే ఉంటాయి. ఇక్కడ జరిగే వైశాఖ ఉత్సవాల్లో దేవతా మూర్తిని పట్టణంలో ఊరేగిస్తారు. రథోత్స వరోజుల్లో దేవాలయ తూర్పు ద్వారం తీసి ఉంటుంది. నవరాత్రులలో కూడా ఈ ద్వారం తెరుస్తారు. నవరాత్రులలో నవ రాత్రి మండపంలో దేవతామూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తొమ్మిది రాత్రుల లోనూ ఊరేగింపులు చేస్తారు. నవరాత్రి ఉత్సవాల చివరి రోజైన దశమినాడు బాణాసురుడి సంహారానికి విజయ చిహ్నంగా, దేవతామూర్తిని గుర్రం వాహనంపై ఊరే గింపు జరుపుతారు.

**కలకత్తా కాళి :**

హుగ్లీ (భాగీరథి) నదీ తీరాన కోల్‌కతా నగరంలో కాళిఘాట్ ఉంది. కలకత్తా అన్న పేరు కాళిఘాట్ అన్న పదం నుంచే పుట్టిందని భావిస్తారు. పశ్చిమబెంగాల్ ప్రజల ఆరాధ్యదేవత కాళి. సతీదేవి కుడి పాదం వేళ్ళు ఈ ప్రాంతంలో పడ్డాయంటారు. ఏడాది పొడవునా విశేష సంఖ్యలో భక్తులు కాళిఘాట్‌కు విచ్చేస్తుం టారు. భీకర ఆకారంలోగల ఈ దేవి భక్తుల పట్ల చల్లని చూపుతో ఉంటుందన్న విశ్వాసం ఉంది. కథనం ఇలా ఉంది.. ఒక భక్తుడు భాగీరథీతీరం నుంచి కళ్ళు మిరు మిట్లు గొలిపే కాంతి పుంజం వస్తున్నట్లు గుర్తించి ఆ కాంతికి ఆధారాన్ని అన్వే షించి, మానవుని వేలి రూపంలో మలి చిన రాయి నుంచి వస్తున్నదని గ్రహిస్తాడు.



సమీపంలోనే నాకులేశ్వర్ భైరవ స్వయం భులింగాన్ని కూడా గుర్తిస్తాడు. కారడవి నడుమ కాళిని పూజించడం ఆరంభి స్తాడు. అలా కొంతకాలానికి ప్రస్తుత రూపంలోని దేవాలయం రూపుదిద్దు కున్నది. బెలూర్ మఠం సమీపంలో నది మధ్యగల దక్షిణేశ్వర్ కాళి దేవాలయంలో కాళిమూర్తిని ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస పూజించాడని ప్రతీతి.

**కరుణా స్వరూపిణి :**

మహారాష్ట్రలోగల నాలుగు శక్తి పీఠా లలో ఒకటి తుల్జాపూర్‌లోని భవాని. షోలా పూర్ సమీపంలో మహారాష్ట్రలోని సాహ్యాద్రి పర్వత శ్రేణులపై యమునాచల శిఖరంపై తుల్జాపూర్ భవానీ ఆలయం ఉంది. ఆమె కుడి ముంజేయి ఈ ప్రదేశంలో పడిందంటారు. అమ్మ రూపం భయం గొలిపే మాదిరి ఉన్నా, ఇక్కడి తల్లిని కరుణా స్వరూపిణిగా పేర్కొంటారు. దేవా లయ ప్రవేశద్వారం నుంచి కొన్ని మెట్లె క్కితే కాని గర్భగుడి లోపలికి వెళ్ళలేరు. ఎనిమిది చేతులతో ఆయుధాలు ధరించి, మహిషాసుర కొమ్ముల్ని తలపై దాల్చి, మూడడుగుల ఎత్తులో భవానీ విగ్రహం ఉంటుంది. భవానీని తులజ, తురజ, త్వరిత, అంబలుగా కూడా పేర్కొంటారు. దేవతలు, మానవులపై మాతంగ రాక్షసుడు అకృత్యాలకు తలపడుతుం టాడు. వీరంతా బ్రహ్మను శరణు వేడ తారు. ఆయన సలహాతో శక్తి వద్దకు వెళ్తారు. ఆమె రాక్షసుడిని సంహరించి ఆ ప్రాంతానికి శాంతిని చేకూర్చుతుంది. అడవి దున్న రూపంలోని మహిష అనే మరో రాక్షసుడిని కూడా భవానీ సంహరిం చిందన్న కథనం ఉంది. చైత్రమాసంలో జరిపే గుడి పాండ్వ, శ్రీరల్ షష్ఠి, లిత పంచమి, మకర సంక్రాంతి, రథసప్తమి ఇక్కడ జరిగే ప్రధాన ఉత్సవాలు. మంగళ వారాలు విగ్రహ మూర్తిని ఊరేగిస్తారు. నవరాత్రి ఉత్సవాల్ని ఘనంగా నిర్వహిం చుకుంటారు.

**కామగిరి పర్వతం :**

అస్సాంలోని కామాఖ్య ఆలయాన్ని అత్యంత శక్తివంతమైన పీఠంగా పరిగణి స్తారు. నీలాచల పర్వతం కామగిరి పర్వతంపై ఆలయం ఉంది. కోరికలన్నీ తీర్చే కామా ఖ్యగా శక్తిని కొలుస్తారు.

సతీదేవి యోని భాగం ఇక్కడ పడినట్లు విశ్వసిస్తారు. గణేశ, చాముండేశ్వరి నృత్య రూపాలిక్కడ ఉంటాయి. శక్తిరూపం ఉండదు. ఆలయంలోని గుహలో దేవియోని శిల్పమూర్తి ఉంటుంది. సహజమైన వాతా



వరణం రాయిని నిత్యం తడిగా ఉంచుతుంది. 16 వ శతాబ్ది మొదట్లో కామాఖ్య దేవాలయాన్ని ధ్వంసం చేశారు. తర్వాత 17 వ శతాబ్దిలో నారనారాయణ మహారాజు పునర్నిర్మించాడు. దుర్గాపూజను నవరాత్రులలో నిర్వహిస్తారు. అమ్మ రుతుక్రమ సమయమన్న విశ్వాసంతో అంబుబాసి సంతాన ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సమయంలో మూడు రోజులపాటు గుడి మూసివేసి, నాలుగో రోజున గొప్ప ఉత్సవంగా గుడి తెరుస్తారు. ఈ మూడు రోజులలో భూమిని తవ్వడం, గింజలు జల్లడం అశుభమని భావిస్తారు. తాబేళ్ళు, కోతులు, పావురాలు వంటివెన్నో దేవాలయంలో నివాసం ఉంటాయి. గుడి ప్రాంగణం అంతా తిరుగుతుండే వీటికి దేవాలయ అధికారులు, భక్తులు ఆహారం వేస్తుంటారు. ఇక్కడి వాతావరణం భక్తులకు ప్రశాంతతను, వారికి అంతర్గత శాంతి చేకూర్చే మాదిరి ఉంటుంది. ఈ దేవాలయ నిర్మాణం ఒక్క అస్సాంలో కాక మొత్తం దేశంలోనే అద్భుతంగా ఉంటుంది.

## 1001. నారాయణుడు

**ఔ.** పరమాత్మను జీవునిగా, మనస్సును ముందుకు నడిపేవానిగా, అంతరాత్మగా, గొప్ప పరాక్రమం కలవాడిగా, అనంతమైన ఆత్మగా భావించి, ధ్యానించాలి. నారాయణుడు జన్మల కతీతుడనీ, గొప్పగా పూజింపబడువాడనీ, స్వయం ప్రకాశ చిద్రూపి అనీ, శత్రువులను జయించువాడనీ, తృప్తికి కారణమైన వాడనీ, ఆనం



దాన్ని కలిగించేవాడనీ, ఆనంద స్వరూపుడనీ, ఆనందరూపుడనీ, సత్యమే తన ధర్మమైనవాడనీ, మూడు అడు గుల సమస్తం ఆక్రమించువాడనీ భావించి, ధ్యానించాలి. శుద్ధ తత్త్వ విజ్ఞాన సాంఖ్య దర్శనుడైన మహాఋషి కపిలునిగా, చేసిన మేలు మరువనివానిగా, భూమికి అధిపతిగా, సృష్టిని మూడడుగు లలో కొలుచువానిగా, జాగ్రత్ స్వప్న సుషుప్తి అనే మూడు దశలకు అధ్యక్షు నిగా, గొప్ప శిఖరంగా, ప్రళయకాలంలో తనచే నిర్మితమైన సృష్టిని అంతమొందిం చువానిగా గ్రహించి, ధ్యానించాలి. గొప్ప వరాహరూపము ధరించినవాడు, వాక్కులచే తెలియ బడినవాడు, దివ్యగుణాలున్న మంచి సేవ కలవాడు, బంగారు ఆభరణాలు ధరించినవాడు, గంభీరమైన, గుప్తమై గ్రహించుటకు సాధ్యము కానివాడు, రహస్యముగా నుండేవాడు, చక్రమును, గదను ధరించేవాడు, తనకు తానే శరీరముగా కలవాడు, జయింపశక్యము కానివాడు,

ఇంద్రియముల కందని గొప్ప చిత్రమైన చీకటనే అంతర్యామి, అన్నింటి యందు నిలిచే బలం కలవాడు, జీవుని శరీరాన్ని నశింపచేసి తనలోనికి స్వీకరించువాడు, పొరపాటు అనునది లేనివాడు, నీటికి అధిపతియైన వాడు, వరుణునిగా, ఆయన కుమారుడైన భృగువుగా, విశ్వ వృక్షమును పుట్టించుటకు కారణమైన వానిగా, పద్మము నందలి దళములుగా, అందరియందు ఒక్కటిగా నున్న మన స్సుగా భావించి, ధ్యానించాలి. శంఖ, చక్ర, గదా శార్ఙ్గ ములను, నంద కమను శక్తిని ధరించిన శ్రీమన్నారాయణుడు వన పుష్పములతో చేసిన మాలను ధరించిన వాడై, అంతటా వ్యాపించి, తానే వసు దేవుని కుమారుడైన శ్రీ మహావిష్ణువు అన్ని దిక్కుల నుండి రక్షించుగాక!

## 1002. కృష్ణ స్తుతి

**జ.** చంద్రాననం చతుర్బాహుం శ్రీవత్సాం కిత వక్షసమ్।

రుక్మిణీ సత్యభామాబ్యాం సహితం కృష్ణమాశ్రయే ॥

చంద్రునివంటి కాంతిగల ముఖము



కలవాడు, నాలుగుచేతులు కలవాడు, వక్షస్థలమందు శ్రీ వత్సమను పుట్టుమచ్చ కలవాడు, రుక్మిణీ సత్యభామలతో కూడిన వాడైన శ్రీకృష్ణ భగవానునికి నమస్కారం.

## 1003. మహత్తర కానుక

**జ.** శ్రీ మహావిష్ణువుకు అత్యంత ప్రీతి పాత్రమూ, పరమపవిత్రమూ ఏకాదశి తిథి. అటువంటి ఏకాదశి తిథిని తన పేరిట బహుమానంగా ఆ పరమాత్మ



నుండే పొంది, భీష్మైకాదశి అని పిలిచే పర్వదినానికి మూల పురుషుడైన భీష్మ పితామహునిగా కీర్తి గడించాడు. కురు క్షేత్ర సంగ్రామంలో నేలకొరిగిన భీష్ముడు అంపశయ్యపై ఏభై ఎనిమిది రోజుల పాటు గడిపాడు. దక్షిణాయణంలో అంప

శయ్యపై పడినా, ఉత్తరాయణంలో దేహ త్యాగం చేసి, మోక్షాన్ని పొందిన మహనీ యుడు భీష్ముడు. స్వచ్ఛంద మరణాన్ని వరంగా కలిగిన పుణ్యశాలి. భీష్ముడు మహా యుద్ధవీరుడు. పరశురాముని శిష్యుడు. ఆజన్మ బ్రహ్మచారి, జ్ఞాని, దృఢవ్రతుడు, ధర్మవిదుడు, రాజనీతిజ్ఞుడు, అసమాన యోధుడు, అనన్యభక్తుడు, శ్రీకృష్ణుడు సాక్షాత్ భగవంతుడేనని మొదటిగా గ్రహిం చినవాడు, భారత యుద్ధంలో అయుధాన్ని ధరించనని శ్రీకృష్ణుడు ప్రతిజ్ఞ చేస్తే, కృష్ణపరమాత్మచే ఆయుధాన్ని పట్టిస్తానని ప్రతిజ్ఞ చేసినవాడు భీష్ముడు. అన్నట్లుగానే కురుక్షేత్ర సంగ్రామంలో భీష్ముడి విలు విద్యా కౌశలానికి పాండవసేన చెల్లా చెదురైంది. అప్పుడు కృష్ణుడు ఆయుధం పట్టగా, అర్జునుడు కృష్ణుని పట్టుకుని బతి మిలాడుకోవలసి వచ్చింది. అర్జునుని బాణా లకు భీష్ముడు పడిపోయాడు. పరమ భాగవతోత్తముడైన భీష్మాచార్యుడు మాఘ శుద్ధ అష్టమినాడు అంపశయ్యపై నుండి శ్రీకృష్ణ పరమాత్మలో లీనమై తరించాడు. భీష్ముని నిర్యాణానంతరం వచ్చిన ఏకాదశి కనుక ఆయన పేరుమీద మాఘశుద్ధ ఏకాదశిని భీష్మ ఏకాదశిగా పిలువబడింది. వాసుదేవుని రూపాన్ని మనసులో ధ్యానిస్తూ, ఎన్నెన్నో స్తోత్రాలని చేయడమే కాక భగవంతుని వేయినామాలను ధర్మ రాజుకి వినిపిస్తాడు. అవే శ్రీ విష్ణు సహస్ర నామాలు. భగవంతుడు అనగా శ్రీకృష్ణ పరమాత్మ స్వయంగా విని, ఆమోదించిన స్తోత్రం అది. శ్రీ విష్ణు సహస్రనామం భీష్ముడు ఈ లోకానికి ప్రసాదించిన మహత్తర కానుక. మాఘమాస శుక్లాష్టమి నాడు భీష్మునికి తర్పణమిచ్చి శ్రాద్ధ మొనర్చి నవారికి సంతానం కలుగు తుందని పద్మ పురాణంలో చెప్పబడింది. భీష్మ ఏకాదశినాడు భీష్మునికి జలాంజలి వొసగితే సంవత్సరంలో చేసిన పాప మంతా తొలగిపోతుందని భారతంలో చెప్పబడింది. మాఘ ఏకాదశినాడు శ్రీ మహావిష్ణువుని పూజించి, విష్ణు సహస్ర నామ పారాయణం చేసినవారికి స్వామి వారి అనుగ్రహం తప్పక లభిస్తుంది.

## 1004. శ్రీ బ్రహ్మ స్తుతి

**శ్లో.** యోగిహృత్పద్మనిలయం నతజీవ హితేరతమ్ ।
శ్రుతీనాం జన్మభూమిం త్వాం చతుర్ముఖ మహంశ్రయే ॥



యోగుల హృదయ పద్మముల యందుండు వాడును, తనను సేవించు వారికి శుభము చేయు వాడును, శ్రుతులకు జన్మనిచ్చిన వాడును అగు చతుర్ముఖ బ్రహ్మను నేను సేవించుచున్నాను.

## 1005. చైతన్య రహస్యం

**జ.** జగత్ సృష్టి రహస్యం, జీవన మరణాల గుట్టు, మంచి చెడుల విచారం, మనుష్య జీవన పరమలక్ష్యం మొదలైన ప్రశ్నలు అనాదికాలం నుండి మనిషిని బాధిస్తూనే వున్నాయి. మన ఋషులు శ్రుతుల ఆధారం తోనూ, ధ్యానబలం వల్లనూ, ఆధ్యాత్మిక యోగంవల్లనూ ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వటానికి ప్రయత్నించారు.

ఈ ప్రయత్న ఫలితమే షడ్దర్శనాలు. ఈ దర్శనాలలో సృష్టి ఇత్యాదులను గూర్చిన ఎన్నో వివరాల్ని చూస్తాం. గౌతమ ముని న్యాయదర్శనం, కాణాదుని వైశేషిక దర్శనం, వీటి ప్రకారం అణువులు శాశ్వతాలు.

పరమాత్ముడు జీవుల (పూర్వ జన్మ కర్మల) అదృష్టానుసారం ఈ అణువుల నుండి ప్రపంచాన్ని సృష్టించుతాడు. ఈ అణువుల సంయోగం వలన సృష్టి, వియోగం వలన ప్రళయం జరుగుతూ వుంటుంది.

కపిలుని సాంఖ్యం, పతంజలి యోగ దర్శనం, వీటి ప్రకారం చైతన్యమయుడైన



పురుషుని సాన్నిధ్య శక్తివల్ల అచేతనమైన ప్రకృతి వికాసం పొందుతుంది. మనిషి నిజంగా నిర్లిప్తుడు. అయినా అతడు ప్రకృతి యొక్క క్రియలతో అభిమానం పొంది, ఆజ్ఞకు లోబడి వుంటాడు. ప్రకృతితో సంగమమే బంధనం, అసంగమమే మోక్షం. భూమి మొదలైన పంచ మహా భూతాలు, కళ్లు, చెవులు మొదలైన ఇంద్రియాలు, మనస్సూ ఇవన్నీ ప్రకృతి పరిణామాలే. వీటియొక్క కలయికవల్ల ఈ జగత్తులోని వస్తువులన్నీ ఉత్పన్నమవుతాయి. జైమినీయ మీమాంసానుసారం జీవుల ప్రారబ్ధకర్మాను గుణంగా ప్రకృతి తనంత తానే వికాసం పొంది ఈ ప్రపంచంగా పరిణమించుతుంది. బాదరాయణ వేద వ్యాసుని వేదాంత దర్శనానుసారం ఈ సృష్టి అంతా బ్రహ్మంకాక పరమాత్ముని నుండి వచ్చింది. అతడు దీనినుండే సృష్టిస్తాడు. తానే దీనికి ఆధారభూతుడై వుంటాడు. తిరిగి ప్రళయకాలంలో తనలోనే లీనం చేసుకుంటాడు. అంటే వాస్తవంగా ఒక్కటే అయిన వస్తువే సృష్టి, స్థితి, లయలు పొందుతుంది. ఉదాహరణకు భూమి నుండి మొక్కలు పుట్టి పెరిగి, తిరిగి భూమి లోనే ఐక్యం పొందినట్లు, ఆధునిక విజ్ఞానం ఈ జగత్తుయొక్క మూల వస్తువు శక్తి అనీ, దానియొక్క వివిధ మిశ్రమ పరిణామాలే వివిధ వస్తువులవుతాయని ఇప్పుడిప్పుడే కనుగొంటూ వుంది. దీని వల్ల ఇది వేదాంత వివరణకు చాలా దగ్గరిగా వచ్చిందని తెలుస్తోంది.

అయినా మనస్సంటే ఏమిటి?


చైతన్యమంటే ఏమిటి?

జీవం లేదా ప్రాణం అంటే ఏమిటి?

మొదలైన మూల ప్రశ్నలకు ఇంత వరకూ సమాధానాలు పొందలేదు. వేదాంత దర్శనమైతే వీటికన్నిటికీ మూలం ఒక్కటే. అదే బ్రహ్మము లేదా ఆత్మ. సృష్టి అంతా దానినుండే వచ్చింది అని చెప్పడం వల్ల అది విజ్ఞానంకంటే ఎంతో ముందుకు పోయిందని గ్రహించవచ్చు.

## 1006. అన్నీ అనుభవాలే

**జ.** భూభారమంతా మోస్తున్నట్లుగా కొందరు మాట్లాడతారు. లోకంలోని కష్టాలన్నీ తమకే కలుగుతున్నాయను కుంటారు. కాని నిజానికి కష్టాలు పడు తున్నామను కోవడమే వారనుభవించే అసలు కష్టం. జీవితంలో మనం ఎదు ర్కొనే అనేక సమస్యలు అసలు సమస్యలే కావు. ఆ సమస్యలకు మూలమే వుండదు. ప్రకృతిలో ప్రతిజీవి ఏదో ఒక అడ్డంకిని ఎదుర్కొంటుంది. కాని మనిషి మాత్రమే ఆ అడ్డంకిని తలచుకుని బాధపడు



తుంటాడు. మిగిలిన జీవులన్నీ ఆ అడ్డం కిని అధిగమించేందుకు తగిన మార్గం వెతుక్కుంటాయి. అడ్డంకి ఎదురైందని అక్కడే కూలబడిన జీవిని ఎక్కడైనా చూశారా! జీవితంలో అన్నిరకాల అను భవాలు వుంటాయని అర్థం చేసుకున్న వారికి కష్టాలు, సుఖాలు అనే తేడా వుండదు. అన్నీ అనుభవాలే.

## 1007. కైలాసాచల సన్నిభే గిరిపురే సౌవర్ణ శృంగేమహా

**జ.** స్తంభోద్యన్ మణిమంటపే సురతరు ప్రాంతే చ సింహాసనే ।

ఆసీనాం సకలామరార్చిత పదాం భక్తార్తి విధ్వంసినీమ్

వందే వాసవి కన్యకాం స్మితముఖీం సర్వార్థదా మంబికామ్॥

కైలాస పర్వతంతో సమానంగా ప్రకా శించే గిరిపుర మందలి బంగారు శిఖర



మునగల ఎత్తైన స్తంభాలతో వున్న మణి మంటపమున కల్పవృక్షపు నీడలయందు గల సింహాసనమునందు ఆసీనురాలైన ఓ దేవీ, సమస్త దేవతలచే పూజింపబడు పాదాలు కలిగి, భక్తుల ఆపదలను పోగొట్టి సకల సంపదలను ఇచ్చేదానవు, దరహాసమోము కలిగినదానవు, అందరికి అమ్మ అయిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ నీకు నమస్కారం.

## 1008. గొప్ప మహిమ

**జి.** సకల సద్గుణ సంపన్నుడైన, తపోనిష్ఠా గరిష్టుడైన ఒక మునిశ్రేష్టునివద్ద ఓ శిష్యుడు వుండేవాడు. ఆ శిష్యుడు రోజూ తన గురువుపట్ల ఎంతో భక్తిశ్రద్ధలతో వుండేవాడు. ఇలా వుంటుండగా ఓ రోజు ఒక హఠయోగి ఆ శిష్యుణ్ణి చూసి "ఓయీ! నీవు ఉత్త వెర్రివాడివి. ఆ గురువుకు ఏమి తెలుసునని నీవు అతన్ని ఆశ్రయించావు? వాడు ఎందుకూ పనికిరాని ఒట్టి మొద్దు. నాలాగా వాడు నీళ్ళపై నడవ లేడు. అట్టి

artist

తెలివిహీనుడు, పరమనీచుడిని ఆశ్రయించి, వాడి చుట్టూ ప్రదక్షిణలు గావించి నీ కాలాన్నంతా వ్యర్థం చేసుకుంటున్నావు" అన్నాడు. అప్పుడా శిష్యుడు శాంతంగా– "అయ్యా! మీరు చెప్పిన మహిమలు వారు చేయకున్నా, అంతకంటే వేయిరెట్లు ఉత్కృష్టమైన మహిమ వారి వద్ద వుండడంచేత వారిని ఆశ్రయించాను" అని పలికాడు. ఆ మాటలకు ఆ హఠయోగి ఆశ్చర్యపడి "ఆహా! ఆ మహిమ ఏదో కొంచెం నాకూ తెలియజేయి'' అని కోపంగా అన్నాడు. అప్పుడా శిష్యుడు "అయ్యా! గర్వం, పరదూషణ, క్రోధము మొదలైన దుర్గుణాలు ఆయనవద్ద వెతికినా కనిపించవు. ఇంతకన్నా గొప్ప మహిమ కలదా?" అని అడగ్గా ఆ హఠయోగి తనలోని దుర్గుణాలకు సిగ్గుపడి తలవంచుకుని అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

## 1009. తేజ్ బహదూర్ త్యాగం

**జి.** ఆనందం, దుఃఖం, ఆశ, మోహం... వీటన్నిటికి అతీతంగా ఎదిగినవారు దైవ స్వరూపులు. అటువంటి వారు తాము ఎంచుకున్న ధర్మ మార్గంలో ఎదురయ్యే ఎటువంటి ఇబ్బందులనైనా అంగీకరించి అధిగమిస్తారు. ఆ స్థితికి చేరనివారు ఒక దశలో భయపడి తన ప్రాణం గురించి, తన సుఖం గురించి ఆలోచించుకుని ధర్మ మార్గం నుంచి కొంచెం పక్కకు తప్పుకుంటారు. కాని సిక్కుల గురువైన తేజ్ బహదూర్ తన ధర్మ మార్గం, తన అనుచరుల



కోసం ఎటువంటి కష్టాలనైనా భరించాడు. చివరికి తన ప్రాణాన్నే త్యాగం చేశాడు. ముష్కరులు ఎంత వేధించినా, తన ధర్మ మార్గం వదలకుంటే శిరచ్ఛేదనం చేస్తామన్నా జంకలేదు. భౌతిక సుఖాలన్నీ ఇసుక గోడల వంటివి. చిన్న అలజడికి పడిపోతాయి. ధర్మ మార్గం సుస్థిర పునాది కలిగినది. దానిని ఎవరూ పడగొట్టలేరు. తన తర్వాత కూడా సిక్కు ధర్మం దృఢంగా నిలిచి వుంటుందని ధైర్యంగా నాడే ప్రకటించిన సాహసి తేజ్ బహదూర్.

## 1010. ధర్మబద్ధం

**జ.** 'అన్నమయం హి సౌమ్య మనః' అని ఉపనిషత్తు చెబుతోంది. ఎటువంటి అన్నం తింటే ఆ విధంగానే మనస్సు ప్రవర్తిస్తుందని భావం. కృష్ణుడు హస్తినా పురానికి వస్తున్నాడని తెలియగానే, ఆయన్ని లోబరుచుకునేందుకు దుర్యోధనుడు అందరికంటే ముందుగా వెళ్ళి మేము ఇచ్చే ఆతిథ్యానికి రావలసిందిగా కోరాడు. అప్పుడు కృష్ణుడు ఈ విధంగా అన్నాడు "దుర్యోధనా శత్రుపక్షం నుంచి నేను రాయబారిగా నీ వద్దకు వచ్చినవాడిని. నీ ఇంట ఆతిథ్యం స్వీకరించి నీకు వ్యతిరేకంగా వాళ్ళ ఇంటిమాటలు నీకెలా చెప్పగలను? పైగా నీ ఇంట ఆతిథ్యం తీసుకున్నానే అనుకో. నాకేదైనా ఆరోగ్య లోపం జరిగితే నేనేమీ అనుకోక పోయినా లోకం నిన్నే తప్పుగా అనుకుంటుందిగా. అది శ్రేయస్కరం కాదు. పైగా నేను వస్తున్నాన్న విషయం తెలిసి కుంతీదేవి విదురుని ఇంట భోజనాన్ని సిద్ధం చేసిందట. నేవస్తా" నంటూ వెళ్ళిపోయాడట. ఇది చెప్పడానికి కారణమేమంటే –దుర్మార్గపు ఆలోచనలు, అధర్మార్జనా, కృతఘ్నుతతో నిండిన దుర్యోధన ఆతిథ్యంవల్ల తనకీ అలాంటి ఆలోచనలే కలుగవచ్చని. కనుక ధర్మబద్ధమైన భోజనాన్ని మాత్రమే చేయాలి.

**కరారవిందేన పదారవిందం**
**ముఖారవిందే వినివేశయంతం**
**వటస్యపత్రస్య పుటేశయానం**
**బాలం ముకుందం మనసా స్మరామి**

పద్మంవంటి చేతితో, పాద పద్మాన్ని ముఖపద్మంలో వుంచుకుని, మర్రియాకు పై శయనించిన బాలకృష్ణుని మనసా స్మరిస్తున్నాను.

## 1011. ఫాల్గుణ పూర్ణిమ

**జ.** కృష్ణుడితో ధర్మరాజు "కృష్ణా! ఫాల్గుణ మాసాంతంలో పౌర్ణమిరోజు పల్లెపల్లెన,

పట్టణాలలో ఉత్సవం ఎందుకు జరుగుతుంది. హోలికా మంటలెందుకేస్తారు? ఈ ఉత్సవంలో ఎవర్ని పూజించాలి?" అని అడిగాడట.

అప్పుడు కృష్ణుడు ఈ విధంగా చెప్పాడని హేమాద్రి భవిష్యోత్తర పురాణం చెబుతోంది. పూర్వం రఘుమహారాజు వుండేవాడు. ఆయన ప్రజల్ని కన్నబిడ్డలవలె పాలించేవాడు. ఓరోజు ప్రజలు ఆయన వద్దకువచ్చి 'ఢోంఢా' అనే రాక్షసి మా ఇళ్ళకు వచ్చి పిల్లలను పీడిస్తోంది. దాని బారినుండి మా పిల్లల్ని రక్షించమని మొరపెట్టుకున్నారు. అప్పుడా రాజు వశిష్ఠుల వారితో 'ఎవరా రాక్షసి, ఏమాకథ' అని అడిగాడట. "అది 'మాలి' అనే రాక్షసి కూతురు. ఓసారి శివుని గురించి తపస్సు చేసి మానవులతోగాని, దేవతలతోగాని, శస్త్రాస్త్రములతోగాని, శీత ఉష్ణ వర్ష సమయమునగాని, రాత్రిగాని, పగలుగాని, ఇంటా బయటాగాని తనకు చావు లేకుండా వరం పొందింది. అయితే వరమిచ్చిన శంకరుడు "నీకు ఉన్మత్తుల నుండి, పిల్లల నుండి ఋతుసంధిలో ప్రమాదం వుంటుంది" అని హెచ్చరించాడట కూడా. అది మొదలు ఆ రాక్షసి ఈశ్వరుని పలుకులు స్మరిస్తూ 'అడాడా' అంటూ ఇళ్ళల్లో చొరబడి పిల్లల్ని పీడించసాగింది. "ఓ రాజా! నేడు ఫాల్గుణ శుక్ల పౌర్ణమి. శీతాకాలం వెళ్ళిపోయింది. ఉదయం నుండి గ్రీష్మం ప్రారంభ మౌతుంది. అందరికీ అభయం ఇవ్వు. భయం లేదని చెప్పు. ప్రజల చేత వినోదాలు జరిపించు

artist

పిల్లలు ఖడ్గాలు ధరించి సమరోత్సాహానికి యోధులుగా చేయి. ఎండు కట్టెలు, గడ్డీ గాదం ఒకవైపు చేర్పించు. దానితో అగ్నిని ముట్టించి హోమం చెయ్యి. తరువాత పగలబడి నవ్వుతూ, పాడుతూ మంటల చుట్టూ జనంచేత ప్రదక్షిణం చేయించు. నీచమైన తిట్లను అందరి నోటా పలికించు. తిట్లకు, హోమానికి, పిల్లల అట్టహాసానికి భయపడి ఆ రాక్షసి క్షీణిస్తుంది" అని చెప్పాడు వశిష్ఠుడు. ఆ విధంగానే చేశాడు రఘు మహారాజు. ఆ ఉగ్రమైన కర్మతో రాక్షసి నశించింది. ఈ హోమం దుష్టదమనకరం. సర్వరోగ శాంతికరం. కనుక హోలిక అనే పేరు వచ్చింది. కాలక్రమేణా 'హోళి' అని పిలవబడుతూ హోళీ పండుగయ్యింది. ఈ పౌర్ణమి సర్వసారమైన తిథి. అందరికీ పరమానందకరమైన రోజుగా దీనిని చెప్పుకోవాలి.

## 1012. ఎల్లవేళలా వుంటాయి

**ఐ.** భగవంతుడి సంకేతాలు ఎల్లప్పుడు అన్ని దిశలా వెళుతూనే వుంటాయి. ఐతే అవి అందుకునేందుకు మానసికంగా సిద్ధంగా వున్నవారికే ఆ సంకేతాలు అందు



తాయి. ఆ సంకేతాలు బలవంతంగా అందుకోవాలని ప్రయత్నించినా అందవు. సమయం వచ్చి అవి అందుకున్న క్షణంలో అత్యద్భుత అనుభవం కలుగుతుంది. ఇలాంటి అనుభవం నాకు ఇంతకు ముందు ఎందుకు కలగలేదు. ఎందుకు ఇంత ఆలస్య మైంది అనే ఆలోచన కలుగు తుంది. ఇటువంటి సందేహమే సుబోధ్‌కి కలిగింది. 'సుబోధ్ యువకుడు. రామ కృష్ణ పరమహంస దగ్గరికి చేరి, ఆయన స్పర్శతో ఆధ్యాత్మిక ఆత్మీయ శిష్యుడిగా మారిపోయిన తొలి వ్యక్తి సుబోధ్. అతడే ఆ తర్వాత స్వామీ సుబోధానందగా మారాడు – 'నన్ను ముందే ఎందుకు మీ దగ్గరికు పంపలేదు స్వామీ' అంటూ సుబోధుడు వేడుకుంటే "అది మన చేతిలో లేదు సుబోధా. ఎప్పుడు భగవంతుడి దగ్గరకు చేరాలో అప్పుడే సరిగా వ్యక్తిలో మార్పు వస్తుంది. అదే ఆయన లీల. దానిని ప్రశ్నించేందుకు వీలు లేదు" అన్నాడు రామకృష్ణ పరమహంస.


## 1013. స్వధర్మాచరణ

**ఐ.** లోకవ్యవస్థలో ఎవరికి నియమితమైన ధర్మం వారు చేయడం, వ్యక్తికేకాక సమా జానికీ శ్రేయస్కరం. ఒక వ్యక్తికి జన్మతః ప్రాప్తించిన ధర్మాన్ని అంటే కర్తవ్యాన్ని నిర్వ హించడమే స్వధర్మాచరణ. అర్జునుడు పుట్టుకతో క్షత్రియుడు. ప్రజల రక్షణకోసం యుద్ధం చేయడం శత్రువులను జయించ చడం క్షత్రియ ధర్మం. అందువల్లనే యుద్ధం అర్జునుడికి స్వధర్మం అయింది. ప్రతి పక్షంలో తాతలు, తండ్రులు, సోదరులు, గురువులు వున్నప్పటికీ వారితో యుద్ధం చేయడం అతని ధర్మం. యుద్ధంలో మర ణించినప్పటికీ మేలే జరుగుతుంది. వీర స్వర్గం లభిస్తుంది. విజయం లభిస్తే ఇహ లోక సుఖం లభిస్తుంది. స్వధర్మాచరణకు, కర్తవ్యనిష్ఠకు, కృష్ణ భగవానుడు విశిష్ట స్థానం కల్పించాడు.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ**

**అహంత్వా సర్వ పాపేభ్యో మోక్షయి ష్యామి మాశుచః**

సర్వధర్మాలను – అంటే సమస్త కర్తవ్య కర్మలను నాకు సమర్పించి, సర్వశక్తి మంతుడను, సర్వాధారుడను, పరమేశ్వరు డను అయిన నన్ను శరణువేడితే అన్ని



పాపాల నుంచి విముక్తి చేస్తానని అభయ మిచ్చాడు. ఈశ్వరార్పణ బుద్ధితో తన ధర్మాన్ని తాను నిర్వహించాలి. స్వధర్మం అంటే వ్యక్తి కర్తవ్యం. ప్రతి వ్యక్తికీ కుటుంబ జీవితంలో, సాంఘిక జీవితంలో, వృత్తి – వ్యాపారాలలో ప్రత్యేక కర్తవ్యాలుం టాయి. ఎవరి కర్తవ్యం వారు నిర్వహిస్తే మానవ జీవితం సుఖంగా సాగుతుంది. ఒక కుటుంబంలో తల్లి, తండ్రి, కొడుకు, కోడలు సోదరులు అందరూ వుంటారు. తండ్రి ఏదో పనిచేసి సంపాదించి తెస్తే తల్లి అన్నీ సిద్ధపరిచి కుటుంబమందలి వ్యక్తులకు సమయానుసారం వాటిని అందజేస్తుంది. కొడుకులు చదువు సంధ్యలు నేర్పిస్తే, కూతుళ్ళు తల్లికి తోడ్ప డుతూ ఇల్లూ వాకిలీ చక్కబెడుతుంటే, ఆ ఇల్లు బాగుపడుతుంది. ఒకరు చేయ వలసిన పని మరొకరు చేస్తే అస్తవ్యస్తంగా వుంటుంది. ఇంటికాపలాపని చేయ వల సిన కుక్క తటస్థంగా వుండగా, ఇంటిలో దొంగ దూరడాన్ని చూచి, యజమానిని మేల్కొల్పడానికి ఓండ్ర పెట్టిన గాడిదకు గట్టిదెబ్బలు తప్పవు కదా! అట్లే ఇతరుల పనిని నెత్తిన పెట్టుకొన్నవారికి కష్టం తప్పదు. పరుల కర్తవ్యాన్ని తనపై వేసు కుని సక్రమంగా పూర్తి చేసిన అది భయా వహంగా వుంటుంది. రైతులు స్వధర్మాన్ని పాటించి పంటలు చక్కగా పండించాలి. వ్యాపారులు స్వధర్మం పాటించి క్రయ విక్రయాలు మోసానిక తావులేని విధంగా సక్రమంగా సాగించాలి. ఉపాధ్యాయులు తమ విద్యుక్త ధర్మాన్ని నిర్వహిస్తూ అధ్యయన, అధ్యాపనాదు లను దీక్షతో సాగించాలి. కార్మికులు స్వ ధర్మాన్ని పాటించి నాణ్యమయిన ఉత్ప త్తులను సాధించాలి. పాలకులు నిష్ప క్షికంగా తమ కర్తవ్యాన్ని చేపడుతూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలి. ఎవరు చేయవలసిన పనిని వారు సక్రమంగా చేస్తే, సమిష్టి రూపమైన సమాజం పురోగ మిస్తుంది. శాంతి, సౌభాగ్యాలతో వర్ధిల్లు తుంది. స్వధర్మ రక్షణలో సమాజ శ్రేయం, దేశశ్రేయం ఇమిడి వున్నాయి. స్వధర్మా చరణలో మరణించినా శ్రేయస్కరమని పంచమవేదమైన మహాభారతంలో పేర్కొని వున్నది.

న జాతు కామాన్నే భయాన్నలో భాత్
ధర్మం త్యజే జ్జీవిత స్యాట హేతుః నిత్యో
ధర్మః సుఖదుః ఖేత్వనిత్యే జీవో నిత్యే

హేతుర స్యత్వ నిత్యః (స్వర్గారోహణ పర్వం)

కోరికల సాఫల్యానికి భయం నుంచి బయటపడేందుకు, మరే విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ఒకే ఒక మార్గాన్ని, అంటే ధర్మ మార్గాన్ని అనుసరించాలి. దిలీప మహారాజు ఒక గోవును రక్షించడం కోసం, తన శరీరాన్ని సింహానికి అర్పించాడు. శిబి చక్రవర్తి శరణాగత రక్షణ కోసం, ఒక పావురానికి బదులుగా తన మాంసపు కండలను కోసి ఇచ్చి మరణించేందుకు సిద్ధపడినాడు. ఆయా ధర్మ కర్మల ఫలితంగా దిలీప మహారాజు అభీష్టం నెరవేరింది. శిబిచక్రవర్తి త్యాగం ప్రశంసలందు కొన్నది. ప్రహ్లాదుడు భగవద్భక్తి రూపమైన స్వధర్మాన్ని పాటించి పలుమార్లు మృత్యు ముఖం నుంచి సురక్షితముగా బయట పడినాడు.

శ్రేయాన్ స్వధర్మోవిగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్

స్వభావ నిరతం కర్మ కుర్వ ప్నోతి కిల్బిషమ్॥

పరధర్మాన్ని బాగుగా ఆచరించుట కంటే గుణరహితమై నప్పటికీ స్వధర్మాచరణమే మేలైనది. ఎవరి కర్మలను వారు ఆచరిస్తే ఎటువంటి పాపం అంటదు.

ధర్మవ్యాధుడు బ్రహ్మజ్ఞాని అయినప్పటికీ వృత్తిధర్మాన్ని అనుసరించి మాంసం విక్రయించే వాడు. అది హింసాత్మకమైనా అతనికి పాపకృత్యం కాదు.

దానిని శంకింపవలసిన అవసరం లేదు. వైద్యుడు తన వృత్తిధర్మాన్ని అనుసరించి శస్త్రచికిత్స చేస్తాడు. అది హింస అనడం సమంజసం కాదు. జన్మవల్ల వృత్తి వల్ల ప్రాప్తించిన స్వధర్మాన్ని ఎన్నడూ విడువరాదు.

## 1014. కృష్ణడోలోత్సవం

**ఐ.** ఫాల్గుణశుద్ధ పౌర్ణమినాడు బెంగాలీలు 'కృష్ణడోలోత్సవం' చేస్తారు. బొబ్బట్లను నైవేద్యంగా పెడతారు. నిర్ణయ సింధుకారుడు కృత్య చింతామణిలోని బ్రహ్మ వచనాన్ని ఈ విధంగా ఉదాహరణగా చెప్పాడు.



నరాడోలాగతం దృష్ట్వా
గోవిందం పురుషోత్తమం ।
ఫాల్గున్యాం ప్రయతోభూత్వా
గోవిందస్య పురంవ్రజేత్॥

అని ఫాల్గుణ పౌర్ణమిరోజు డోలా గతుడైన గోవిందుణ్ణి స్మరిస్తే గోవిందుని లోకం చేరుకుంటారు. వసంత ఋతువున సంతోషంగా ఉయ్యాలలో ఊగుతూ, తమ ఆరాధ్యదైవానికి డోలోత్సవం జరుపుతూ ఆనందించడం అన్నది సాంప్రదాయ బద్ధమైన ఓ ఆచారం.

## 1015. కుమారస్వామి స్తుతి

**శ్లో.** ద్వాదశాయత నేత్రాయ
ద్వాదశోద్ధృత బాహవే!
ద్వాదశాయుధ ధారాయ
ద్వాదశాత్మన్నమోస్తుతే ।



పన్నెండు కళ్ళతో, పన్నెండు చేతులతో, పన్నెండు ఆయుధాలను ధరించిన ఓ ద్వాదశాత్మా నీకు నమస్కారం.

## 1016. లోకాస్సమస్తా సుఖినోభవంతు

**శ్లో.** అనాదికాలం నుండి భారతీయులు 'లోకాస్సమస్తా సుఖినోభవంతు'. ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ సుఖంగా నుండవలెను అని ప్రార్థించుచుండిరి. అందువలననే భారతదేశము సమస్త మానవ కోటికి తలమానికముగా, గురుతుల్యముగా నుండెడిది. అందువల్లనే అనేక విదేశ సంస్కృతీ ప్రభావముల ఒత్తిడికి నిలబడగలిగి తన పూర్వ ప్రాదుర్భావమును తిరిగి పొందగల స్థితిలో భారత దేశము వుంది. ఎన్ని తరాలు మారినా భారతదేశ సంస్కృతికి వాటిల్లే ముప్పు ఏమీ వుండదు. మన దేశ సంస్కృతి అంతటి లోతైన ప్రభావం కల్గివున్నది. మన పూర్వీకుల నిర్మాణ ప్రభావంలో అంత శక్తి ఇమిడివుంది. ప్రపంచమందలి అన్ని కోణములకు 'శాంతి' సందేశము నందించి, ఒక పెద్ద ప్రశాంతి నిలయంగా విరాజిల్లగల అన్ని హంగులూ భారతదేశం కలిగి వుంది. తప్పక ఆ విధంగా వుండ గలదు. అధిక విశ్వాసంతో ఆచరించునట్లు నీ మతమును నీవు ప్రేమించు. ప్రతిఒక్కరు తమ తమ మతములను ఇనుమడించిన విశ్వాసంతో ఆచరించిన, ప్రపంచంలో ఇతర మతములపట్ల ఏవగింపు, ద్వేషము అనునది ఎంతమాత్రం వుండదు. శక్తివంతముగాను, సంతోష శుభప్రదములనిచ్చునదిగాను, మానవుడు తన శక్తియుక్తులనభివృద్ధి చేసికొని ప్రదర్శించు స్థానముగా నుండినట్లుగా నీ దేశమును ప్రేమించి వృద్ధిలోనికి తెమ్ము.

## 1017. జగదాంబ స్తుతి

**శ్లో.** ఓం ఇంద్రాణిపతి సద్భావపూజితే పరమేశ్వరి ।
రూపందేహి జయందేహి యశోదేహి ద్విషోజహి ॥

దేవేంద్రాదులతో పూజింపబడే ఓ జగదంబా ! ఓ పరమేశ్వరీ నాకు మంచి రూపాన్ని, యశస్సును, జయాన్ని ప్రసాదించు. శత్రువు అనే వాడిని లేకుండా చేయి తల్లీ !

## 1018. బ్రహ్మరథం

**జ.** ఒకసారి ఇంద్రుడికి, బృహస్పతికి మధ్య విభేదంరాగా ఇంద్రుడు కించపరిచే సరికి బృహస్పతి స్వర్గాన్ని వీడి వెళ్ళి పోయాడు. దాంతో ఇంద్రుడు దేవ గురువుగా బృహస్పతి స్థానంలో త్వష్టప్రజాపతి కుమారుడైన విశ్వరూపుణ్ణి నియమించు కున్నాడు. ఈ విశ్వరూపుడు రాక్షసులపై బంధుప్రీతిని కనబరుస్తూ వారికి హవిర్భావాలు ఇవ్వడంతో ఇంద్రుడు కోపించి విశ్వరూపుణ్ణి సంహరించేసరికి అతనికి బ్రహ్మహత్యాపాతకం ఆవహించింది. దాంతో ఆ దోషాన్ని పోగొట్టుకునేందుకు స్వర్గాన్ని వదిలి వెళ్ళిపోయాడు. అప్పుడు దేవతలంతా కలసి భూలోకానికి వచ్చి నహుష మహారాజుకు ఇంద్రాధిపత్యాన్ని ఇస్తారు. నహుషుడు చాలా గొప్పవాడు. ఎప్పుడైతే ఇంద్రపదవి అతనికి లభించిందో అతనిలో గర్వాంధకారం పొడ సూపడం మొదలుపెట్టింది. దాంతో దేవతలను, మహర్షులను, దిక్పాలకులను కించపరచడమే కాక శచీదేవిని కోరతాడు. అప్పుడు శచీదేవి బ్రహ్మరథంపై ఊరేగి రమ్మని షరతు విధిస్తుంది. నహుషుడు సప్తర్షులచేత పల్లకీని మోయిస్తూ అందులో ఆశీనుడై బయల్దేరతాడు. బ్రహ్మరథమనబడే ఆ పల్లకీని మోస్తున్న వారిలో అగస్త్యుడు కూడా ఒకరు. అగస్త్యుడు పొట్టివాడు. అందుచేత అతను పల్లకీ మోసే వైపు ఒరిగిపోతూ వుంటుంది. వేదాలను, మంత్రాలను దారంతా అవమానపరుస్తూ 'సర్పసర్ప' అంటూ కాలితో అగస్త్యుణ్ణి తంతాడు నహుషుడు. 'సర్ప సర్ప' అంటే తొందరగా కదలమని అర్థం. దాంతో కోపించిన అగస్త్యుడు 'సర్పోభవ' అనగా శపిస్తాడు. సర్పోభవ అనగా 'సర్పం అవుదువుగాక' అని.

artist


అగస్త్యమహాముని సామాన్యుడా! మహా తపస్సంపన్నుడాయె. తక్షణమే నహుషుడు సర్పంగా మారి భూలోకంలోకి వచ్చి పడ్డాడు. ఎప్పుడైతే సర్పంగా మారాడో వెంటనే అతనిలోని గర్వం పటాపంచలై పోయింది. తన తప్పిదానికి పశ్చాత్తాపపడి తనకీ రూపం నుండి విముక్తిని కలిగించమని తిరిగి అగస్త్యుణ్ణి ప్రార్థించాడు. అగస్త్యుడు దయతలచి సర్ప రూపంలో వుండి నీవు అడిగే ప్రశ్నలకు ఎవరైతే సమాధానాలు చెబుతారో వారి వల్ల నీకీ రూపం పోతుందని శాపానుగ్రహాన్ని కలిగిస్తాడు. ఆ తరువాత అరణ్యవాసంలో భీముడు నహుషునికి చిక్క

డంతో తమ్ముణ్ణి వెదుకుతూ వచ్చిన ధర్మ రాజు నహుషుడు అడిగిన ప్రశ్నలకు సమా ధానాలు చెప్పడంతో అతనికి శాపాను గ్రహం లభించి తిరిగి నహుషుడు మానవ రూపాన్ని ధరిస్తాడు. ఇదీ నహుష చరిత్ర.

బ్రహ్మవంశీయులు లేదా బ్రహ్మవేత్తల చేత మోయబడే వాహనాన్నే బ్రహ్మరథం అంటారు.

## 1019. తొమ్మిది గ్రహాలు - తొమ్మిది రత్నాలు

**జ.** మరుక్షణం ఏం జరుగుతుందో తెలి యని జీవితంలో మనుషులను నడిపిం చేది నమ్మకం మాత్రమే. నమ్మకాలు జీవి తాలకు పునాది అవుతాయి. కొన్ని నమ్మ కాలను మనం మూఢనమ్మ కాలుగా కొట్టి పారేసి నప్పటికీ, ప్రతి నమ్మకం వెనుక మనిషికి సొంత అనుభవం వుంటుంది. పలు పర్యాయాలు ఒకే అనుభవం కలిగితే ఆ అనుభవం నేర్పిన పాఠం నమ్మకంగా రూపుదిద్దుకుంటుంది. ప్రకృతిలో ఎదు రుగా ఎన్నో వింతలు, ఎన్నెన్నో విశేషాలు. ఇవన్నీ ఒకజన్మలో అర్థం చేసుకోగలిగినవి కావు. మనిషికి మేలుచేసేవి కొన్ని, కీడు చేసేవి కొన్ని. కీడుచేసేవాటిని ఎలా దూరంగా నెట్టాలి? వాటి బారినపడ కుండా వుండటం ఎలా? ఆ ప్రయత్నంలో మనిషి ప్రకృతిలో లభించే ఇతర అంశా లనే నమ్మాడు. తనకు అసాధారణంగా కన్పించేవన్నీ మహత్తుగలవేనని అను కున్నాడు. అరుదుగా లభించేవాటికి



అత్యంత విలువ వుండటం నేడు మనం చూస్తున్నటువంటిదే. ఎప్పుడో ఒకసారి ఏదో ఒకచోట మెరుస్తూ కనిపించిన వస్తు వును అతి జాగ్రత్తగా ఏరి, కోరి తన దగ్గ రకు చేర్చుకున్నాడు. అది దగ్గరికి వచ్చిన తర్వాత జీవితంలో సంభవించిన మంచి, చెడులకు మరేదీ కారణంగా చెప్పుకోలే నపుడు మనిషికి తట్టేది తన దగ్గరకు కొత్తగా వచ్చిన వస్తువు మాత్రమే. అటు వంటి వస్తువు ద్వారానే పలువురికి మంచి చెడులలో ఏదో ఒక అనుభవం వరుసగా కలిగితే నమ్మకాలు పెరిగి స్థిరపడతాయి. ఇందులో తప్పు పట్టాల్సిన విషయం అంటూ ఏమీ లేదు. అటువంటి నమ్మ కాలే ప్రకృతిలో అరుదుగా లభించే రంగు రాళ్లు, పూసలు, గవ్వలు, కాయలు, పండ్లు వంటి వాటిమీద అనేకం వున్నాయి. వీటిలో మిగతావాటికన్నా మరింతగా విశ్వాసం ఏర్పడింది రత్నాలమీదే. ప్రకృ తిలో లభించే రత్నాల రంగులు, వెలు గులు మనిషిని అనాదిగా ఆకర్షించాయి. రత్నాలు అరుదుగా లభించడం, భూమి పొరలలో కన్పించే మిగిలిన రాళ్ళ కన్నా భిన్నమైనవిగా వుండటంతో వాటిమీద ఆసక్తి, నమ్మకాలను పెంచుకున్నారు.

అవి దేవతా ప్రతిరూపాలుగా, శక్తులను అందించేవిగా, వ్యాధులను తగ్గించేవిగా భావించారు. వేదకాలం నాడు ఆరంభమైన ఆ నమ్మకం క్రమంగా ఒక శాస్త్రంగా రూపొందింది. అనుభవం నేర్పిన పాఠాల నుండి రత్నాల ద్వారా సంక్రమించేటటువంటి మంచి చెడులను అంచనా వేయసాగారు.


గ్రహశాస్త్రంతో మిళితమైన నవరత్న శాస్త్రం వృద్ధిలోకి వచ్చింది. మనిషి జన్మించిన సమయానికి, రత్నాలకు లంకె ఏర్పరచబడింది. ఏ నక్షత్రంలో, ఏ రాశిలో జన్మించిన వారు ఎటువంటి రత్నం ధరించవచ్చో ఆ శాస్త్రం స్పష్టంచేసింది. అంతే కాకుండా ఏ నక్షత్రం వారికి ఏది కూడని రత్నమో కూడా తెలియజెప్పింది. జన్మ నక్షత్రం, జన్మరాశికి తగిన రత్నాన్ని ఎంచుకోవడం నైపుణ్యంతో కూడిన విద్య. అందుకే ఎవరికి వారు తమకు నచ్చిన రత్నం ధరించేందుకు వీలులేదు. ఆ శాస్త్రం తెలిసిన వ్యక్తి మనిషి జాతకం అధ్యయనం చేసి, ఏ గ్రహం చూపు ఎలా వుందో అంచనా వేసి నవరత్నాల్లో ఏ రత్నం ధరించాలో నిర్ణయిస్తాడు. మనిషి యొక్క ఆరోగ్యం, ఉద్యోగం, వృత్తిలో అభివృద్ధి, సంపద పెరుగుదల, మానసిక ఆరోగ్యంకోసం తగిన రత్నాలను సూచిస్తారు. తగిన రత్నం ఎంపిక చేసేందుకు పలురకాల అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. జన్మరాశి, ఆ వ్యక్తికి ఏ గ్రహం అధిపతో తెలుసుకోవాల్సి వుంటుంది. ఒకవేళ గ్రహాధిపతి ఎవరో తెలియకపోయినా ఆ వ్యక్తియొక్క శరీరరూపం, ప్రవర్తన, ఇష్టాలు, అయిష్టాలు, ఎంచుకున్న వృత్తి వంటి వాటి ఆధారంగా గ్రహాధిపతిని అంచనా వేసుకోగలుగుతారు.

సృష్టిలో నవగ్రహాలున్నాయి. మన వారు గుర్తించినవి నవరత్నాలు. ఒక్కొక్క గ్రహాన్ని ఒక రత్నానికి అధిపతిగా నిర్ణయించారు.

| | |
|---|---|
| సూర్యుడు... | కెంపు |
| చంద్రుడు... | ముత్యం |
| శుక్రుడు... | వజ్రం |
| కుజుడు.... | పగడం |
| రాహువు... | గోమేధికం |
| బృహస్పతి.... | పుష్యరాగం |
| శని... | నీలం |
| బుధుడు... | పచ్చ |
| కేతువు... | వైఢూర్యం |

**కెంపు ఆదివారం మంచిది :**

కెంపు ముదురు ఎరుపు రంగులో కనిపించే అత్యంత విలువైన రత్నం. దీనినే




రవిరత్న, వసురత్న అని కూడా పిలుస్తారు. కెంపులు ఎరుపు భిన్న ఛాయలో వుండవచ్చు. మంచి కెంపు ముదురు ఎరుపు

రంగులో వుండి చక్కని వెలుగులు వెద జల్లుతుంది. స్వచ్ఛమైన కెంపుమీద ఎటు వంటి మచ్చలు, చుక్కలు, పగుళ్ళు వుండవు. అవి లేనివి చూసి ఎంచు కోవాలి. కెంపులు కాకపోయినా కెంపుకు దగ్గరి పోలికలు కలిగిన గార్నెట్, రెడ్ స్పైనల్, ఎర్ర టోర్మలైన్‌లను కెంపులుగా భ్రమింపచేసి అమ్ముతుంటారు. మూడు నుండి ఐదు క్యారెట్ల బరువుకు తగ్గని కెంపులనే కొనాలి. బరువు కొంచెం తగ్గినా ఫరవాలేదు కాని నకిలీ కెంపుల జోలికెళ్ళ కూడదు. కెంపులను బంగారు ఉంగ రంలో బిగించి కుడిచేతి ఉంగరపు వేలుకు మాత్రమే ధరించాలి. ఈ కెంపుల ఉంగ రము ఆదివారంపూట ధరించడం ఆరం భిస్తే మంచిది. కెంపులకు అధిపతి అయిన గ్రహం సూర్యుడు. సమస్త కోటి జీవులకు మూలాధారం సూర్యుడు. వ్యవసాయ దారులు, రాజకీయ నాయకులు, ప్రభు త్వాధికారులు సూర్యగ్రహాన్ని అధిపతిగా కలిగినవారు. ప్రతి అంశంలోనూ పేరు ప్రతిష్ఠలు అందించే గ్రహం సూర్యుడు. ఆర్థికంగా ఎంతో సంపద సంపాదించినా, ఎన్నో విజయాలు సాధించినా వారికి తగిన గుర్తింపు మాత్రం వుండదు. దానికి కారణం సూర్యగ్రహ అనుగ్రహం లోపిం చడమే. జాతక చక్రంలో సూర్యుడు అను కూల స్థానంలో లేకుంటే పేరు ప్రతిష్ఠలు లభించవు. అటువంటివారు కెంపు ధరించి లోపం సరిదిద్దుకోవచ్చు.సూర్యుడే సంతానం అందించే దేవుడు అంటుంది జ్యోతిష్యశాస్త్రం. సంతానం కలగని స్త్రీలు కెంపు ధరిస్తే సూర్యగ్రహ ప్రభావం కొద్దిగా మారుతుంది. కెంపులను ఇతర రత్నాలలో కలిపి ధరించకూడదు. జాతకచక్రం చూసుకోకుండా, జ్యోతిష్య శాస్త్ర నిపుణుల సలహా తీసుకోకుండా ఏ రత్నమూ ధరించకూడదు. ఐతే కెంపు విషయంలో వ్యతిరేక ఫలితాలు తక్కువే.

**కాకి ముత్యం ధరించకూడదు :**

ముత్యాలు ఆల్చిప్పలనుండి తీస్తారు. మంచి ముత్యం తెల్లగా, మృదువుగా, మెరుస్తూ వుంటుంది. ముత్యంమీద నల్ల మచ్చ వుంటే ధరించకూడదు. అటువంటి ముత్యాలతో అశుభాలు కలుగుతాయి. ఆ నల్లమచ్చ ముత్యాలను కాకిముత్యం అని




పిలుస్తారు. అది ధరించకూడదు. కనీసం రెండునుండి నాలుగు క్యారెట్ల బరువున్న ముత్యాన్ని వెండి లేదా బంగారంలో పొదిగి ధరించాలి. ముత్యపు ఉంగరం చిటికెనవేలు లేదా చూపుడువేలుకి ధరిం చాలి. ఆడవారు ముత్యాలను దండగానే ధరించాలి. ముత్యాలను ఆది, సోమ, గురువారాల్లో ధరించడం శుభం. ముత్యా నికి అధిపతి చంద్రుడు. చంద్రుడు అధి

పతిగా కలిగినవారికి ఆలోచనలు అద్భుతంగా వస్తాయి. ఇతరులెవరికి ఏమాత్రం తట్టని ఊహలు వీరి సొంతం. చంద్రుడు అధిపతి అయినవారు సినిమా, రాజకీయ, నగలు, అలంకరణ, ఫోటోగ్రఫీ, పెయింటింగ్, రచన, నౌకారంగాలలోకి వెళతారు. జాతక చక్రంలో చంద్రుని ప్రభావ తీవ్రతనుబట్టి వీరు సాధించే విజయాలు మారుతుంటాయి. వృత్తిలో స్థిరత్వానికి, వృద్ధికి ముత్యం ధరిస్తారు. అయితే ముత్యాన్ని వజ్రం, నీలం, గోమేధికాలతో పాటు ధరించ కూడదు.

**పగడం బంగారంతోనే :**

పగడానికి అధిపతి కుజుడు. జ్యోతిష్య శాస్త్రంలో కుజగ్రహ ప్రభావాన్ని వివాహ సమయంలో తప్పకుండా పరిగణిస్తారు. వైవాహిక జీవితంలో సుఖ సంతోషాలు




కుజుడుచూసే చూపుమీద ఆధారపడి ఉంటాయి. పగడాలు సముద్రంలో లభిస్తాయి. నాణ్యమైన పగడం మెరిసే ఎరుపు రంగులో నారింజ రంగు మిళితమైనట్టుగా వుంటుంది. అది గుండ్రంగా లేదా అండ రూపంలో వుండాలి. పొడవుగా, సన్నగా వున్న పగడం ధరించకూడదు. తెల్ల మచ్చలు కలిగిన పగడం ధరించటమంటే అనారోగ్యాన్ని కొని తెచ్చుకోవడమే అంటుంది శాస్త్రం. రెండు రంగు ఛాయలలో వున్న పగడం ధరించడం అశుభమే. పగడాన్ని బంగారంతోనే ధరించాలి. దాని బరువు 3 నుండి 6 క్యారెట్ల వరకు వుండవచ్చు. పగడపు ఉంగరం కుడిచేతి ఉంగరపు వేలుకు ధరించాలి. పగడానికి అధిపతి కుజుడు. భావోద్రేకం, జంతుశక్తి, పోరాట పటిమ ఈ అధిపతిగా కలిగిన వారి లక్షణాలు. వీరికి తీవ్రమైన కోరికలు, శక్తి, లక్ష్యాలు వుంటాయి. ఎర్ర రంగు గ్రహంగా పిలిచే అంగారకుని (కుజ) అధిపతిగా కలిగినవారు సైనికదళాలలో, పోలీసు విభాగంలో పనిచేస్తారు. రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో, మత్తుపానీయ వ్యాపారంలోనూ కనిపిస్తారు. లారీల వంటి భారీ వాహనాల రవాణా వ్యాపారంలో వీరు వుంటారు. ఆ వృత్తులలో కలవారు పగడం ధరిస్తే వృద్ధిలోకి వస్తారు. కుజుడు అధిపతిగా కలిగిన జాతకులు పగడం ధరిస్తే మంచి గుర్తింపు వస్తుంది. కుజాధిపతి జాతకురాళ్ళు దీర్ఘకాలం సంసారసుఖం పొందుతారు. పగడం ధరిస్తే స్థిరమైన, సకల సంపదలతో కూడిన జీవితం లభిస్తుంది. హైందవ శాస్త్రం ప్రకారం జన్మ సమయంలో కుజ స్థానంబట్టి కుజదోషం వస్తుంది. కుజ దోషమున్నవారికి వివాహ జీవితం బాగుండదు. కుజదోషమున్నవారి దుష్ప్రభావానికి విరుగుడు కుజదోషం వున్న వారితో వివాహమేనన్నది శాస్త్రం. కుజ దోషం గలవారు పగడం ధరించవచ్చు.

పచ్చలు, నీలం, గోమేధికాలతోపాటు పగడం ధరించకూడదు.

**గోమేధికం పగుళ్లు వుండకూడదు :**


కపిలవర్ణ ఎరుపు ప్రదర్శించే రత్నం గోమేధికం. నున్నని, స్ఫటికలా కాంతి కనిపించే గోమేధికం మేలైనది. పూర్తి పారదర్శకమైనది, గగ్గులు గగ్గులు కలిగిన గోమేధికాన్ని ధరించకూడదు. ఎరుపు



రంగు గోమేధికం కూడా ధరించకూడదు. రంగు తక్కువ, నునుపులేని గోమేధికం ప్రేమ, సంసార బంధాలలో ఘర్షణ పెంచవచ్చు. గుంటలు లేదా పగుళ్ళు కలిగిన గోమేధికం ధరిస్తే ఆర్థిక చిక్కులు రావచ్చు. చుక్కలు లేదా మచ్చలు కలిగిన గోమేధికం కొనకూడదు. గోమేధికం బరువు నాలుగు నుండి ఆరు క్యారెట్ల మధ్య వుండాలి. వెండితో చేసిన ఉంగరంలో బిగించి కుడిచేయి మధ్య వేలుకు ధరించాలి. గోమేధికం ధరించే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించడం అవసరం. జ్యోతిష్య విజ్ఞాన పండితుల దగ్గర జాతకచక్రం చూపించుకున్న తర్వాతే దీనిని ధరించడం మంచిది. గోమేధికానికి అధిపతి రాహువు. రాహువు ఒక గ్రహమా కాదా అనేది సందేహం. జాతకచక్రంలో మాత్రం రాహుస్థానం చూపుతారు. భారతీయ జ్యోతిష్య శాస్త్రం రాహువును ఛాయా గ్రహంగా గుర్తించింది. సూర్య, చంద్ర గ్రహణాలు ఏర్పడటానికి మూలం రాహు గమనమే. రాహువు సూర్యుడిని, చంద్రుడిని మింగుతాడనే గాధ హైందవ పురాణంలో వుంది. వాస్తవంలో గ్రహణాలు ఏర్పడటానికి ప్రత్యేక కారణాలు ... సమయం వుంది. రాహుగ్రహం అధిపతి కలవారు వ్యవసాయం, సినిమా, ఇంజనీరింగ్ వృత్తులలో వుంటారు. ఆ వృత్తులలో వారికి గోమేధికం ధరించటం కలిసి వస్తుంది. రాజకీయ రంగంలో పనిచేసే వారికి మంచి దశను తెస్తుంది. గనుల వ్యవహారాలు, ఫోటోగ్రఫీ, భారీ ఇంజనీరింగ్ వ్యవహారాలు గోమేధిక ప్రభావాన పుంజుకుంటాయి. జాతక చక్రంలో రాహువు అనుకూలంగా వున్నవారు గోమేధికం ధరిస్తే వృత్తిలో బాగా ఎదుగుతారు. ఉపాసన చేసి వ్యక్తులను వశం చేసుకునే యత్నంలో వున్నవారు గోమేధికం తప్పని సరిగా ధరిస్తారు. గోమేధికం లైంగిక జీవితం, సంసారం మీద తీవ్ర ప్రభావం చూపగలిగినది కాబట్టి, గోమేధికాన్ని ధరించేముందు తగిన సంప్రదింపులు జరపడం అవసరం.

**గురువారం పుష్యరాగం మంచిది :**

పుష్యరాగాధిపతి బృహస్పతి (గురుడు). పుష్యరాగం పసుపు, కుంకుమ, తెలుపు ఛాయలలో దొరుకుతుంది. మంచి పుష్యరాగం లేత పసుపు రంగులో, మెరుస్తూ,



పారదర్శకంగా వుంటుంది. పుష్యరాగాన్ని తెల్ల కాగితం మీద వుంచి, ఎండలో పెడితే అందులోనుండి పసుపు రంగు కిరణాలు వెలువడతాయి.

లోపాలు కలిగిన ఏ రత్నం ధరించ కూడదన్నట్టే లోపాలున్న పుష్యరాగాన్నీ ధరించకూడదు. మచ్చలు లేదా చుక్కలు కలిగినది లేదా పైన గీతలు ఒక వలలాగా ఏర్పడిన పుష్యరాగం కొనకండి. ఎఱ్ఱ రంగు పుష్యరాగం ఆర్థిక ఇబ్బందులు తెచ్చిపెట్టవచ్చు. పుష్యరాగం కనీసం మూడు క్యారెట్ల బరువుండాలి. కొన గలిగితే ఆరునుండి తొమ్మిది కేరట్ల బరు వుండే పుష్యరాగం కొనడం మంచిది. దీనిని బంగారపు ఉంగరంలోగాని, గొలు సులో కాని బిగించి ధరించాలి. పుష్య రాగపు ఉంగరం కుడి చూపుడు వేలుకు ధరించాలి. గురువారం పుష్యరాగపు ఉంగరం ధరించడం మొదలుపెడితే మంచిది. బృహ స్పతి అందరికీ మేలుచేసే గ్రహం. కాబట్టి దీనిని అందరూ ధరించవచ్చు. పుష్యరాగం ఎప్పుడూ మంచినే చేస్తుంది. మంచి చేయక పోయినా చెడు మాత్రం చేయదు. అయితే ఏ స్థాయిలో మేలు జరుగుతుంద నేది జాతకంలో జన్మ నక్షత్రంలో బృహ స్పతి స్థానం మీద ఆధారపడుతుంది. పుష్యరాగం మేధస్సుకు, విజ్ఞానానికి ప్రతీక. సంసార వృద్ధిని సూచిస్తుంది. విజ్ఞానం, విద్య లేదా సంపద, శక్తులను ఇచ్చే రత్నం ఇది. ఆ రెండింటిని కలిపి ఒకరికే ఇవ్వదు. గురుగ్రహ ఆధిపత్యం గలవారు ఉపాధ్యాయ, న్యాయవాద, పత్రికా రంగం, పరిశోధనా రంగాల్లో స్థిరపడతారు. పరుగుపందాలలో పాల్గొనే వారు ఈ గ్రహ ప్రభావితులై వుంటారు. వీరంతా పుష్యరాగం ధరించవచ్చు. కుజ దోషం గల స్త్రీలు పుష్యరాగం ధరిస్తే దోష ఫలం కొంతమేర తగ్గుతుంది. ఆకలికి అధిపతి గురువు. బరువు పెరగాలనుకునే వారు పుష్యరాగం ధరించవచ్చు. గురుడు బలహీనంగా వుంటే స్త్రీలకు స్త్రీ సంబం ధిత అనారోగ్య సమస్యలు వస్తాయి. అటు వంటివారు పుష్యరాగం ధరించాలి. రక్త ప్రసరణ వ్యవస్థ, కాలేయ వ్యవస్థలు గురుగ్రహ ప్రభావంలో పనిచేస్తాయి. గురువు తగిన స్థానంలో లేకపోయినా, నీచంలో వున్నా కాలేయ సమస్యకు గురవు తారు. అటువంటివారు పుష్యరాగం ధరించి సమస్యను పరిష్కరించుకోగలరు. పుష్యరాగాన్ని గోమేధికంతో కలిపి ధరించ కూడదు. పుష్యరాగం గొలుసులో ధరించే స్త్రీలు దానితో పాటుగా వజ్రాలను ధరించ కూడదు. ఎందుకంటే వజ్రాలు పుష్య రాగానికి భిన్నమైన గుణాలు కలిగినవి కాబట్టి.

**నీలం ధరించేవారు ఎర్ర దుస్తులు ధరించకూడదు :**

నవరత్నాలలో మేలైనది, మంచి చెడులలో ఏదైనా ఫలితాలను చూపించేది నీలమణి అని జ్యోతిష్యులు అంటారు. నీలం ప్రభావం జాతక చక్రంలో శని స్థానం మీద ఆధారపడి వుంటుంది. నీలం, నీలమణి, ఇంద్ర నీలమణి ఇతర పేర్లతోను పిలుస్తారు. ఇది నెమలి నీలపు రంగులో పారదర్శకంగా వుంటుంది. దీనిని సూర్యకాంతిలో వుంచినపుడు నీలి కిరణాలు ప్రతిబింబిస్తాయి. నీలం కొనేటపుడు జాగ్రత్తగా చూసుకోవాలి. నీలం మీద గజిబిజి గీతలున్నా, తెలుపు ఛాయ వున్నా కొనకూడదు. నీలం కొని ధరించి ఒక పక్షం రోజులు దాని ప్రభావం పరీక్షించుకున్న తర్వాత దాన్ని శాశ్వతంగా ధరించే ఆలోచన చేయాలి. నాలుగు క్యారెట్ల బరువు నీలం, తెల్ల లోహపు ఉంగరంలో వేయించుకుని కుడి, ఎడమ చేతులలో దేనికైనా మధ్యవేలుకు మాత్రమే ధరించాలి. జన్మ సమయంలో శని సక్రమంగా లేకుంటే జీవితంలో పలురకాల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. లోహపు, తోళ్ళ వ్యాపారం, నిర్మాణరంగం వంటివి ఈ జాతకులకు కలిసి వచ్చేవి. అటువంటివారు నీలం ధరించవచ్చు. రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు నీలం ధరించి లబ్ధి పొందవచ్చు. జాతకంలో శనిగ్రహం బాగున్నవారు నీలం ధరిస్తే వారి వృత్తిలో బాగా ముందుకు వెళతారు. శనిగ్రహ ఆధిపత్యంలో వున్నవారికి ఇంటిపట్టున వుండటం లేదా ఆఫీసులో పనిచేయడం ఇష్టం. వీరికి ఆర్థిక, సామాజిక, అధికార ప్రాబల్యం 50 వ ఏటకల్లా వస్తుంది. ఈ జాతకం కలవారు వయసు మీదపడిన తర్వాత మెరుగైన జీవితం అనుభవిస్తారు. వైవాహిక జీవితానికి, ప్రేమలకు శని అడ్డంకి. శని గ్రహం మంచి దృష్టితో చూస్తున్నవారికే నీలంతో లాభం కలుగుతుంది. అటువంటివారు మంచి రసికులవుతారు. నీలం సరిపోతే జీవితంలో పేరు, ప్రతిష్ఠ, సంపద వస్తాయి. ఐతే కీళ్ళ నొప్పులు, దంత సమస్యలు గలవారు తమ జాతకచక్రాన్ని నిశితంగా పరీక్షించుకున్న తర్వాతే నీలం ధరించాలి. నత్తి, జలుబు, మానసిక రుగ్మత కలిగిన వారికి నీలం ఉపశమనమిస్తుంది. నీలం ధరించేవారు ఎర్రరంగు దుస్తులు వేసుకోకూడదు. నీలంని మరే ఇతర రత్నంతో కలిపి ధరించకూడదు. ముఖ్యంగా ముత్యం, కెంపు, పగడం, వైఢూర్యాలతో పాటు అస్సలు ధరించకూడదు.

**బరువున్న పచ్చ మంచిది :**

ముదురు ఆకుపచ్చరంగులో వుండే ఈ రత్నమంటే జ్యోతిష్యులకు మహా ఇష్టం. పలు ఛాయలలో పచ్చలు దొరికినా ముదురు రంగు పచ్చ మాత్రమే నాణ్యమైనది. ఇది మెరుస్తూ, పారదర్శకంగా వుంటుంది. దీని మీద వలలాంటి గీతలు వుండకూడదు. అటువంటి పచ్చ అనారోగ్యాలను తెస్తుంది. మచ్చలు, గీతలు,

నల్లని చుక్కలు లేని స్వచ్ఛమైన పచ్చలనే ఎంచుకోవాలి. మూడు క్యారెట్ల బరువున్న పచ్చ మంచిది. అయితే వీటి ఖరీదు అధికం. అందువల్ల తక్కువ బరువున్న వైనా ధరించవచ్చు. పచ్చలను వెండి, బంగారాలలో ఏ లోహంతోనయినా చేసిన ఉంగరంలో బిగించి కుడిచేయి చిటికెన వేలు మీద ధరించాలి. బుధ గ్రహం అధిపతిగా కలిగిన జాతకులలో చురుకుదనం పాలు ఎక్కువ. నలుగురితో కలిసిపోగలరు.

బుధగ్రహాన్ని అధిపతిగా కలిగినవారు పాత్రికేయులుగా పెద్ద పెద్ద వ్యాపారవేత్తలుగా, ఉపాధ్యాయులుగా, రాజకీయ వేత్తలుగా, జ్యోతిష్య పండితులుగా వృత్తులలో స్థిరపడతారు. ఏ రంగంలో అడుగు పెట్టినా విజేతలుగా నిలుస్తారు. హోటల్ నిర్వహణ, బ్యాంక్ ఉద్యోగాలు, ఎకౌంటింగ్ ఉద్యోగాలు వీరు చేస్తారు. ఇటువంటి వృత్తులలో వున్నవారు పచ్చను ధరిస్తే మంచి లాభం పొందుతారు. నటులు, కథా రచయితలు పచ్చతో పైకి ఎదుగుతారు. బుధగ్రహం వాక్కు ప్రతినిధి. కాబట్టి సంభాషణలు సరిగా చేయలేనివారు, నత్తి వున్నవారు పచ్చ ధరించడం మంచిది. నిద్రలేమి, నాడీ సంబంధిత ఇబ్బందులు కలవారు పచ్చ ధరించడం మంచిది. మేధో సంపత్తిని అందించే గ్రహం బుధుడు. జ్ఞాన సముపార్జన బుధగ్రహ ప్రభావాన సాధ్యమవుతుంది. పచ్చ ధరిస్తే మేధోపరమైన గుర్తింపు లభిస్తుంది. పేరు ప్రతిష్ఠలు పెరుగుతాయి. అద్భుతమైన ప్రసంగాలతో



అందరిని ఆకట్టుకోగలుగుతారు. సంభాషణా చతురత వీరి సొంతమవుతుంది. ప్రజాజీవితంలో వున్నవారు తప్పని సరిగా ధరించాల్సినది పచ్చ. అయితే పచ్చను పగడం లేదా ముత్యంతోపాటు ధరించ కూడదు.


**పిల్లికన్ను వైడూర్యం :**

కాంతి ప్రవేశంలో స్ఫటికలా వుండే రత్నం వైడూర్యం. ఇది పిల్లికన్నులా మెరుస్తుంటుంది. వైడూర్యం పసుపు, లేత పచ్చ, నల్ల ఛాయలలో కనిపిస్తుంది. దీని మీద తెల్లగీతలు వుంటాయి. ఆ గీతల్లో ఒకే ఒకటి, వైడూర్యం మధ్యలో వుంటే అది అత్యంత శక్తివంతమైన వైడూర్యంగా భావిస్తారు. సంపదను, ఆరోగ్యాన్ని అందిస్తుంది. పలు రకాల గజిబిజి గీతలు, వెలుగు తక్కువ వున్న వైడూర్యాలు కొన కూడదు. ఎర్రరంగు వైడూర్యంలో తెల్లచుక్క వుంటే అది సంసారంలో చిక్కులు తెచ్చేవిగా గుర్తించారు. మూడు క్యారెట్ల బరువుండే వైడూర్యం, వెండి ఉంగరంలో బిగించి, కుడి ఎడమ చేతుల్లోని మధ్య లేదా చిటికెన వేళ్ళకు ధరించాలి. వైడూ

ర్యం అధిపతి కేతువు. కేతువు కేవలం ఒక ఛాయా గ్రహం మాత్రమే. జన్మ రాశిలో కేతు బలహీనంగా వుంటే జీవి తంలో మహాబద్ధకంగా వుంటారు. వీరికి చదువు, తెలివితేటలు అన్నీ వుంటాయి. కానీ ఏదీ అంత త్వరగా సాధించలేరు. జాతకంలో కేతువు అనుకూలంగా వుంటే మంచి తెలివి తేటలుంటాయి. విద్యా పరంగా బాగా ముందుకు వెళతారు. బాగా చదువుకున్నా తగిన ఉద్యోగం లేదా ఉపాధి సక్రమంగా లభించనివారు వైడూర్యం ధరిస్తే మేలు జరుగు తుంది. పరిశోధ నలు, గనుల వ్యాపారంలో వున్నవారు వైడూర్యం ధరిస్తే వారి జీవితంలో స్థిరత్వం వస్తుంది. జన్మ సమయంలో కేతువు ఉచ్ఛంలో వుంటే పేద కుటుంబంలో పుట్టి నప్పటికి అత్యంత ధనవంతులవుతారు. అటువంటివారు వైడూర్యం ధరిస్తే అతి వేగంగా ధనవంతులవుతారు. బికారి దశ నుండి కోటీశ్వరులైన వారందరిది కేతువు ప్రభావమే. ప్రేమ, సంసారం విషయంలో కేతువు ప్రభావం వ్యతిరేకంగా వుంటుంది. పెళ్ళిచేసుకోవాలని వున్నా తగిన జోడి దొరకక పోవడం కేతువు బలహీన చూపువల్లనే. అటువంటివారు వైడూర్యం ధరిస్తే వివాహం విషయంలో సత్ఫలితాలు వస్తాయి. బహిష్టులు సక్రమంగా రాని స్త్రీలు, ఇతర వ్యాధులు కలవారు వైడూర్యం ధరిస్తే బాగుంటుంది. యోగసాధన చేసే వారు, పరిశోధకులు వైడూర్యం ధరిం చాలి. వైడూర్యం ఎటువంటివారైనా ధరించవచ్చు. నీలం, పగడం, గోమేధి కాలలాగా ఇది కూడా మంచిని మాత్రమే ఇచ్చే రత్నం.

**రత్నాల రాజు వజ్రం :**

నవరత్నాలలో రాజు వజ్రం. ధగధగా మెరిసే మెరుపులో వజ్రానికి సాటిరాగలిగి నది లేదు. తెల్లని, పారదర్శక వజ్రం



అత్యుత్తమమైనది. ఆ వజ్రం నుండి అనేక రంగులు వెదజల్లబడుతూ కనిపిస్తాయి. నీలం ఛాయ కలిగిన వజ్రం అశుభాలను తెచ్చేదిగా నమ్ముతారు. ఎర్రఛాయ కలిగిన వజ్రం తిరస్కరించాల్సినది అంటుంది జ్యోతిష్యశాస్త్రం. నలుపుఛాయ కలిగిన వజ్రం కూడా ధరించకూడదు. వజ్రంలో నల్లచుక్కలు వున్నవి ధరించకూడదు. వజ్రాలకున్న ఆదరణను సొమ్ము చేసు కునేందుకు నకిలీ వజ్రాలను అమ్ము తుంటారు. అది తెలియక ఆ నకిలీ వజ్రం ధరించి, వజ్రం ధరించినా తగిన ఫలితం కన్పించలేదని జ్యోతిష్య శాస్త్రాన్ని నిందిస్తుంటారు. నకిలీ వజ్రాలతో ఎటు వంటి మేలు కలుగదు. కనీసం 25 క్యారెట్ల బరువున్న వజ్రం ధరించాలి. వజ్రపు ఉంగరం ప్లాటినమ్, బంగారం,

వెండి లోహాలలో ఏదైనా ఒకదానితో చేయించుకుని కుడి, ఎడమ చేతులలో దేనికైనా చిటికెన వేలుకు ధరించాలి. శుక్రవారం వజ్రం ధరించడం మొదలు పెడితే మంచిది. ఆడవారు వజ్రాలను చెవికి ఆభరణాలుగా లేదా మెడలో ఆభ రణంగా ధరించవచ్చు. శుక్రుడు అధి పతిగా గలవారు మంచి గొంతు కలిగి వుంటారు. నలుగురితో కలివిడిగా వుంటారు. లలితకళల వైపు మక్కువచూపి మంచి పేరు తెచ్చుకుంటారు. వృత్తిలో ఎదుగు దలకు వజ్రం ధరించవచ్చు. శుక్రగ్రహం ప్రేమ, వివాహ అంశాల మీద ప్రభావం చూపుతుంది. ఆ గ్రహం అనుకూలిస్తే మంచి రొమాన్స్‌ను అనుభవిస్తారు. కోరి కలని తీర్చుకోగలుగుతారు.ఎంత ప్రయత్నం చేసినా వైవాహిక బంధంలో సఖ్యత కుదర కపోతే మీరు ధరించడం కాక వజ్రాన్ని అవతలి వారికి బహుమతిగా ఇస్తే పరి స్థితిలో మార్పు వస్తుంది. రొమాంటిక్ బహు మతిగా ఎవరైనా ఎప్పుడైనా ఇవ్వ దగినది వజ్రం. శుక్రదశ బలంగా వుంటే వివా హానికి దారితీస్తుంది. అటువంటి వారు వివాహ సమయంలోనే వజ్రపు ఉంగరం ధరించాలి. అయితే గర్భం రావటంలో ఇబ్బందులు అనుభవించే స్త్రీలు వజ్రం ధరించకుండా వుంటే మంచిది. శుక్రుడికి వివాహం, రొమాన్స్ నచ్చినంతగా సంతా నవృద్ధి నచ్చదు అంటుంది జ్యోతిష్యశాస్త్రం.

శుక్రుడు అనుకూలిస్తే హఠాత్తుగా సంపద వస్తుంది. లాటరీ టికెట్లు కొనే వారు, పెట్టుబడులు పెట్టేవారు ఈ గ్రహ ప్రభావాన వుంటారు. జూదం కూడా వీరికి ఇష్టమైన క్రీడ. చర్మవ్యాధులు, లైంగిక వ్యాధులతో బాధపడే వారు, అండాశయ సమస్యగల స్త్రీలు వజ్రం ధరించకూడదు. వజ్రం ధరించాలను కుంటే ఒకే ఒక వజ్రం ధరించండి. వజ్రాన్ని కెంపు, ముత్యం, పుష్యరాగం, వైడూర్యా లతో కలిపి ధరించకూడదు.

## *1020. రాశుల ప్రకారం రత్నాలు*

**జ.** శుభం కలగాలని కోరుకోవడం సహజం. అటువంటి శుభాలను నవ రత్నాలు అందిస్తాయి. అంతమాత్రం చేత నవ రత్నాలలో ఏది పడితే అది ధరించ కూడదు. ఇతరులెవరో తమకు మేలు చేసిందని చెప్పగానే అటువంటి నవ రత్నమే కొని ధరించడం పొరపాటు. అదే విధంగా నవరత్నాలు అమ్మే దుకాణం వాడు చేసిన సూచనల ప్రకారం నవరత్న ఎంపిక జరగకూడదు. ఒక నవరత్నం ఎంపిక వెనకాల జన్మరాశి, నక్షత్రం, జాతకచక్ర అధ్యయనం అవసరం.

అవన్నీ నిశితంగా పరిశీలించకుండా జ్యోతిష్యశాస్త్ర నిపుణుడి సూచన లేకుండా నవరత్నం ఎంపిక చేసుకుని ధరిస్తే దాని వలన లాభం వుండకపోగా, నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి మీ జాత కానికి తగినటువంటి నవరత్నం ఏదో ఎంపిక చేసుకోండి.

నవరత్నం ఏదైనా బంగారంలో బిగించి ధరించడమే మంచిది. ఇతర లోహాలతో

అందంగా అనిపించినా అందులో కొన్ని చిక్కులున్నాయి.

**మేషం :** ఈ రాశివారు కెంపు ధరించాలి. కెంపు ధరిస్తే జీవితంలో పైకి ఎదగడం మీకే తెలుస్తుంది. ప్రేమ జీవితంలో మాధుర్యం తెస్తుంది. డబ్బు విషయంలో విజయం వస్తుంది. ఈ రాశివారిలో అస హనం, కోపం అధికం. కాని కెంపు ధరిం చడంతో ఆ గుణాలుపోయి మానసిక ప్రశాంతత వస్తుంది. ఆదుర్దా దూర మవుతుంది. ఒత్తిడికి గురయ్యే సంఘటన లను దూరంగా వుంచుతారు. బంగా రంతో చేసిన ఉంగరంలో పొదిగిన కెంపుల ఉంగరం ఎడమ, కుడి చేతులలో ఏదో ఒక చేతి ఉంగరపు వేలుకు ధరించాలి.

**వృషభం :** ఈ రాశివారు కెంపు, నీలం లలో ఏదైనా ధరించవచ్చు. అయితే నీలమణితో మేలు అధికం. నీలం ధరిం చిన తర్వాత ఒక నెలరోజులు గమ నించాలి. ఆ కాలంలో ఏదయినా చెడు జరిగినట్టు అనిపిస్తే నీలం ఉంగరం వదిలేయాలి. ఆ తర్వాత కెంపు ఉంగరం ధరిస్తే దానితో పాటుగా ఆరోగ్యం, ఆనం దం రెండూ వస్తాయి. నీలం ఎంచుకుంటే దానిని బంగారంలో అమర్చి కుడి, ఎడమ చేతివేళ్ళలో మధ్యవేలుకు ధరించాలి. కెంపు అయితే ఉంగరపు వేలుకు ధరించాలి.

**మిథునం :** వజ్రం ఈ రాశివారికి నప్పే రత్నం. బంగారపు ఉంగరంలో వజ్రం పొదిగి ఏ చేతికైనా చిటికెన వేలుకు ధరిస్తే వృత్తిలో వృద్ధి వుంటుంది. ఈ ఉంగరం ధరిస్తే, నలుగురిలో ప్రత్యేకమైన గుర్తింపు తెస్తుంది. వృత్తిలో గుర్తింపు కోరు కోవడం, డబ్బు కోసం ఎదురుచూడటం ఈ రాశివారి గుణం. వజ్రం ధరించడం ద్వారా ఆ లోపాలు పోగొట్టుకుని కోరు కున్న కలలన్నీ ఫలించేలా చేసుకోగలుగు తారు.


**కర్కాటకం :** ఈ రాశివారి రత్నం పగడం. ఐతే ఈ రాశివారికి మేలుచేసే రత్నం ఏదనే దానిమీద ఏకాభిప్రాయం లేదు. భిన్న జ్యోతిష్యులు భిన్న రత్నాలను చెబు తుంటారు. ఐతే పురాతనగ్రంథాలను సంప్రదించాక పగడమే తగినదని తేలింది. బంగారపు ఉంగరంలో పగడం పొదిగి ధరిస్తే ప్రేమలో ఆనందం, జీవి తంలో సంపద సమకూరుతాయి. వజ్రపు ఉంగరాన్ని ఎడమచేతి ఉంగరపు వేలుకు ధరించాలి.

**సింహం :** వైడూర్యంగాని, పగడాన్ని గాని ఈ రాశివారు ఎంచుకోవచ్చు. ఆ రెండు ఈ రాశివారికి ఆరోగ్యం, సంపదలు రెంటిని తెచ్చిపెడతాయి. వైడూర్యం చూపుడు వేలుమీద ధరిస్తే గరిష్టంగా లాభం వస్తుంది. పేరు ప్రతిష్ఠలు, డబ్బు వస్తాయి. పగడపు ఉంగరంతో ఆర్థిక పరమైన విజయం, ప్రేమ జీవితంలో ఆనందం వస్తాయి. కాని పేరు ప్రతిష్ఠలు రావు. ఈ రెండు రత్నాలలో ఏది ఎంచు కున్నా దానిని బంగారు ఉంగరంగానే చేయించుకోవాలి. పగడపు ఉంగరమైతే

ఉంగరపు వేలుకు ధరించాలి.

**కన్య :** పచ్చ లేదా మరకతం అనేది ఈ రాశివారికి తగినది. ఒక మరకతాన్ని కలిగిన ఉంగరాన్ని ఏ చేతిలోనైనా చిటికెనవేలుకు ధరించాలి. అది ధరించిన వెంటనే ఒకదాని తరువాత ఒకటి ఉత్సాహం అందించే సంఘటనలు జీవితంలో జరుగుతాయి. జీవితంలో స్పష్టమైన మార్పు వస్తుంది. ఈ రత్నం పెడితే ఇక జీవితంలో తిరుగుండదు. జీవితంలో కీలకమైన ఆర్థిక, సామాజిక, లైంగిక అంశాలన్నింటిలో అద్భుతాలు సాధిస్తారు. పెళ్ళికానివారు పచ్చను ధరించినట్లయితే త్వరలో పెళ్ళి అవుతుంది. ఆరోగ్యం వస్తుంది. ముఖానికి, చర్మానికి వెలుగు ప్రసాదిస్తుంది.

**తుల :** ఈ రాశికింద జన్మించిన వారంతా అదృష్టవంతులనేది జ్యోతిష్యుల నమ్మకం.



ఈ రాశివారి జీవనాలు గమనిస్తే అది నిజమేనని పిస్తుంది. ఎటువంటి రత్నమైనా వీరికి సరిపోతుంది. ఈ రాశివారు నీలమణిని ఎంచుకుని ధరిస్తే పేరు, సంపద వస్తాయి. ఒకే ఒక నీలమణిని బంగారపు ఉంగరంగా ఏ చేతి మధ్య వేలుకైనా ధరించవచ్చు. అయితే ఇది ధరించిన తొలి నెలలో వ్యతిరేక ఘటనలు ఎదురైతే ఈ ఉంగరం తీసివేయాలి. అటువంటి చేదు అనుభవం కలిగినవారు పగడపు ఉంగరం ధరించాలి. ఉంగరపు వేలుకు ధరించిన పగడపు ఉంగరం సంపదను, ప్రేమ జీవనాన్ని తెచ్చిపెడుతుంది.

**వృశ్చికం :** ముత్యం ధరిస్తే జీవితం ఫలిస్తుంది ఈ రాశివారికి. మంచి ముత్యం ఎంపిక చేసుకుని దానిని బంగారంలో పొదిగి చిటికెనవేలు లేదా చూపుడు వేలుకి ఏ చేతికైనా ధరించవచ్చు. ఆడవారు ముత్యం చెవులకు ధరించినట్లయితే మరింతగా లాభం పొందుతారు. ఆర్థిక పరమైన భద్రతతోపాటు సుస్థిర ప్రేమ, వైవాహిక జీవితం తెచ్చిపెడుతుంది. కెంపు ధరిస్తే వృత్తిలో మరింత పైకివస్తుంది. సామాజిక హోదా వుంటుంది. కాని వ్యక్తిగత జీవితంలో కెంపువల్ల ఎదుగుదల వుండదు.

**ధనుస్సు :** ఈ రాశివారికి కూడా కెంపు తగిన రత్నం. సామాన్యులను కూడా అసామాన్యులను చేయగల శక్తివుంది కెంపుకు. ప్రేమ, వివాహంలోనూ మీకో చక్కని స్థానం వస్తుంది. వైవాహిక బంధం సుస్థిరంగా వుంటుంది. కెంపు ఉంగరం ఏ చేతికైనా ఉంగరపు వేలుకు ధరిస్తే బాగుంటుంది. కొంతమంది కెంపు ధరించిన తర్వాత ఒకరికన్నా ఎక్కువ మందితో ప్రేమ సంబంధాలు ఏర్పడే ప్రమాదముంది. అటువంటి సంకేతాలు కన్పించ

గానే కెంపు ఉంగరం తొగించడం మంచిది. అటువంటి ఇబ్బంది కలిగితే ఈ రాశివారు కెంపును వదిలి పగడపు ఉంగరం ధరించాలి.

**మకరం :** వజ్రం ధరించడం ఈ రాశి వారి వృత్తికి, వ్యక్తిగత జీవితానికి ఎంతో మేలు. మంచి వజ్రం ఎంపిక చేసుకోవాలి. వజ్రం కలిగిన బంగారు ఉంగరం చిటికెన వేలుకు ధరించాలి. దీని వలన వారికి జీవితమంతా ఎదురుండదు. హేతువుతో ఆలోచించే గుణం కలిగిన ఈ రాశి వారు తప్పకుండా మంచి రొమాంటిక్‌గా, సున్నిత మనసు కలిగిన వారుగా తయారౌతారు. వజ్రం ధరించిన తర్వాత వృత్తిపరంగా వున్న అడ్డంకులన్నీ తొలగిపోయి హాయిగా ముందడుగు వేస్తారు.

**కుంభం :** వీరికి తగిన ఉత్తమ రత్నం వజ్రం. ఒకే ఒక వజ్రం కలిగిన బంగారు ఉంగరం ఏ చేతి చిటికెన వేలుకైనా ధరించండి. మీ కలలన్నీ సాకారమవుతాయి. స్నేహితులను గెలుచుకుంటారు. చక్కని జీవిత భాగస్వామి దొరుకుతుంది. ఈ రాశివారు వజ్రపు ఉంగరాన్ని ధరిస్తే మంచి ఇల్లు, ఖరీదైన వాహనం, నగలు, సేవకులు వెరసి విలాసవంతమయిన జీవితం లభిస్తుంది. ఇక ఆలస్యమెందుకు. వెంటనే వజ్రం కొనేందుకు సిద్ధమవండి. వజ్రం ఎంపిక విషయంలో జాగ్రత్త వహిస్తే చాలు, ఇక జీవితమంతా మీదే.


**మీనం :** ముత్యం వీరి అదృష్టరత్నం. బంగారపు ఉంగరంలో ముత్యం పొదిగి చూపుడువేలుకు ధరించాలి. ఆడవారు మాత్రం ముత్యాన్ని చెవి ఆభరణంగా ధరించి వారి అందాన్ని, ఆకర్షణను పెంపొందించుకోవచ్చు. ఆరోగ్యం, ఆనందం, సంపూర్ణ తృప్తి, ప్రేమలను మాత్రం తెచ్చిపెడుతుంది. ఒత్తిడి లేకుండా బాగా రిలాక్స్‌డ్‌గా వుండగలుగుతారు. వ్యక్తిగత అంశాలమీదశ్రద్ధ పెంచుకుంటారు. వృత్తి పరమైన ఎదుగుదలకు కొత్త లక్ష్యాలు పెట్టుకుని అందుకుంటారు. ఏ పని చేపట్టినా తప్పక విజయం సాధిస్తారు. డబ్బు దానంతట అదే వస్తుంది.

## 1021. సప్త సుగుణాలు

**జ.** భారతీయ సమాజంలో స్త్రీకి ఒక ప్రత్యేక స్థానంవుంది. ఆమె పూజితురాలు. సుగుణాలరాశి. ముఖ్యంగా సప్త సుగుణాలతో మహిళ ఈ సమాజం, ప్రధానంగా



కుటుంబం ఉన్నతికి తనను తాను అంకితం చేసుకుని స్వార్థరహితంగా, అవిశ్రాంతంగా కృషి చేస్తున్నది. ఆమెలో కీర్తి (ప్రకాశం), శ్రీ (సర్వసంపద), వాక్కు (సందర్భ సహితంగా పొందికగా మాట్లాడడం), స్మృతి (ధర్మం పాటింపు), మేధ (విజ్ఞానం), ధృతి (భూదేవి అంతటి ఓర్పు), క్షమ (అన్ని తప్పిదాలను క్షమించడం) అన్న సప్త సుగుణాలున్నాయి. పోషణవున్న గింజలు మొలకెత్తి పెరిగి, పంట పండి ఆహారం అందిస్తే, పోషణలేనివి కాల గర్భంలో కలిసిపోతాయి. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటున్న మధ్యాహ్నపువేళ కృష్ణా తీరంవెంట విరగపండిన వరిచేల పైకి ఒక్క గాలి వీచింది. బంగరు వన్నెలీనే వరి కంకులు ఒక్కోసారి గాలికి ఒకదానికొకటి కొట్టుకుంటే మరోసారి పెన వేసుకుపోతున్నాయి. గాలి ఒక్కసారిగా తుపానువలె వీచడంతో వరి పుప్పొడి రేకులు నదీతీరం దగ్గరలోని కొండ గుంటల నుంచి వచ్చిన చిన్న రాళ్ళపైన బడి వింతగా కనిపించాయి. తీవ్రంగా వీచిన గాలికి కొన్ని వరిగింజలు నది ఒడ్డునగల చిత్తడి నేలపైకి వచ్చి పడిపోయాయి. కొన్ని గింజలు చెల్లాచెదరైపోయి దూరంగా విసిరి వేయబడ్డాయి. సీజన్‌మారి మళ్ళీ పంటల సీజన్ వచ్చే నాటికి కొన్ని వడ్లగింజలు మొక్కలై ఏపుగా పెరిగాయి. తక్కినవి ఎక్కడున్నాయి? అంటే అవి కాలగర్భంలో కలిసిపోయాయి. అంటే ఒక వైపు విలుప్తం,



మరోవైపు వికాసం జరిగాయి. పోషణ వల్ల అది జరిగింది. పురుష పదం 'మన్న' లేదా 'మనాస్' పదాల నుండి వచ్చింది. అంటే దీని అర్థం ఆలోచించే శక్తి కలిగి వుండడం. అదే మహిళలకు సంబంధించి చూస్తే కొంత అస్పష్టత వుంది. రాణి లేదా స్త్రీ పదాలకు పై భావవ్యక్తీకరణలో కొన్ని మూలాలున్నాయి. రాణికి 'జనీస్' అనే పదంలో మూలాలు ఉన్నాయి. అంటే 'జన్మనివ్వడం', స్త్రీ పోషణ అనేది 'ధీ' పదం నుండి జనించింది. దీని అర్థం నిలుపు, పోషణకు అండగా వుండడం. పురుషుడు ఒక అంశంపైన నిర్ణయం తీసుకుంటే, స్త్రీ దాన్ని తీసుకుని ఆచరణలో పెట్టాలి, పోషించాలి. ఆసక్తి కలిగించే అంశం ఇక్కడొకటి వుంది. గైనకాలజి (ప్రసూతి శాస్త్రం) గ్రీకు పదం గైయిన్ నుండి రాగా, జనన అనే పర్షియన్ పదానికి కూడా స్త్రీ అనే అర్థం వచ్చే మూలాలు న్నాయి. బిడ్డకు, తల్లికి వున్న బంధమే కుటుంబానికి కీలకమని మానవ శాస్త్రవేత్తలు చెపుతున్నారు. కుటుంబం

అని పిలవడానికి ఇది తప్పనిసరి. తక్కిన దంతా అదనమే. నాగరికత వెలసిన నాటి నుండి మహిళ ఈ పైన పేర్కొన్న పాత్రను (మనల్ని మానసికంగా, శారీరకంగా, ఆధ్యాత్మికంగా పోషించడం, సేవలు చేయడం), ఆమె శరీర నిర్మాణం, నిర్మాణ శాస్త్రం నూతన ఆత్మను ధరించే శక్తి కలిగి నట్టుగా రూపొందించబడింది. తనలో వున్న నూతన ఆత్మను ఓర్పుతో, ప్రేమతో తిరిగి బిడ్డకు అందిస్తుంది. ఒత్తిడి మరియు గుండె సంబంధమైన సమస్య లను తట్టుకునే, పురుషుల కంటె ఎక్కువ శక్తిని కలిగివుండే ఈస్ట్రోజన్ లాంటి హార్మోన్లు స్త్రీకి వుంటాయి. ఒత్తిడి నుండి తట్టుకునే ఆండ్రోజన్ లాంటి హార్మోన్లు పురుషుడికి వుంటాయి. ఇక ఇప్పుడు శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన స్త్రీ గుణ గణాలను ఒకసారి పరిశీలిద్దాం.

**ప్రకాశం :**

సంస్కృతంలో కీర్తి అంటే ప్రకాశం, ఖ్యాతి, ఆదరణ. ఒక వస్తవు మండితే చుట్టూ వెలుగునిస్తుంది. ఒక వస్తువును మండిస్తే అందులో అంతర్లీనంగా దాగి వుండే శక్తి యజ్ఞంలో లభించే ఫలంలాగా ఫలితాన్ని అందిస్తుంది. ఒక వ్యక్తి లేదా వస్తువు లక్ష్యం లేకుండా లేదా అవసర మైనదానికంటే వేగంగా జ్వలించినట్ల యితే అది యాదృచ్ఛికంగా జరిగింద వుతుంది. ఉదాహరణకు మానవుల జీవ నాన్ని మరింత సుఖవంతం చేయడానికి శాస్త్రవేత్త రాత్రింబవళ్ళు శ్రమించి నూతన



ఆవిష్కరణకు కృషి చేయడానికి తనను తాను సరైన దిశలో, సరైన వేగంలో జ్వలింపజేసుకుంటాడు. అందువల్ల ఈ జ్వలితం విధ్వంసం కాదు. అది మాన వాళి మొత్తం క్షేమానికి అవసరమైంది సాధించడానికి స్వార్థ రహితంగా శ్రమించడం అవుతుంది. తమ కోసం తపించే లేదా తమకు మోకరిల్లే వారంటే ఎక్కువమంది మహిళలు ఇష్టపడవచ్చు. అయితే వారికి తగిన స్థానం, గౌరవం విషయం వచ్చేసరికి వారు పురుషుల వైపు చూడవలసి వస్తోంది. ఇది చాలా ఆసక్తి కలిగించే అంశం. ఇందుకు కారణాలు అనేకం. పురుషులు దృఢంగా, అన్నిం టినీ నియంత్రించగల వారిగా వుండా లని, అప్పుడే తమకు భద్రత, కుటుంబ జీవనం హాయిగా వుంటుందని వారు విశ్వసిస్తారు. ఇదొక కారణం. అదే సమ యంలో పురుషులు తమ పట్ల పార దర్శ కంగా, ప్రేమగా వుండాలని కోరు కుంటారు. ఎవరో తప్పితే మంచి ప్రయో

జనాలున్నా తమ భర్తలు సంఘవ్యతిరేక శక్తులుగా ప్రమాదకర లక్ష్యాలు కలిగి వుండాలని కోరుకోరు. ఇతరులకు సహాయం చేసే పరోపకార కార్యకలాపాలలో నిమగ్నమయ్యే పురుషులను మహిళలు బాగా ఇష్టపడతారని ఇటీవల జరిగిన ఒక అధ్యయనంలో వెల్లడైంది. ఒక నిర్దిష్టమైన లక్ష్యంకోసం రాబిన్‌హుడ్ లాంటి కార్యకలాపాలు సాగించే పురుషులనూ స్త్రీలు ఇష్టపడతారు. ఇది ఎందుకు? ఇది చాలా సంక్లిష్టమైన మానసికస్థితి. సాధారణంగా ప్రేమించడం, ఇతరులకు సహాయం చేయడంలో రెండు అంశాలున్నాయి. అలాచేసే వ్యక్తి తన అవసరాల కంటే ఇతరుల అవసరాలకు అధిక ప్రాధాన్యత ఇస్తారు; అతని చర్యలు, ఉద్దేశ్యాలు అంత ర్లీనంగా వుంటాయి. దుష్టతలంపుతో రూపొందించు కున్నవి కావు. దీని అర్థం ఏమంటే అలాంటి వ్యక్తి భాగస్వామికి కష్టసుఖాలలో తోడుగా వుంటాడు. బహుశా ఆ కారణం వల్లనే నమ్మకమైన వ్యక్తిగా భావించి అందుకు అనుగుణంగా వుంటుంది. ఆధ్యాత్మికంగా చూసినప్పటికీ ఒక వ్యక్తి తన భావాలకు మించి ఇతరుల భావాలకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడు అతను నిజమైన ప్రేమను అర్థం చేసుకుంటాడని అర్థం. భాగస్వామి కోసం సంకుచిత ప్రయోజనాలను మాత్రమే వదలి పెడతాడు. ప్రపంచవ్యాప్తమైన దృక్పథం కలిగి ఆత్మాభిమానంతో జీవించడం కంటె దానికి మిన్నగా ఆలోచిస్తాడని చెప్పాలి.

అలాంటి వ్యక్తి భావాలు, శరీర ఆకృతి అతని తర్వాత కూడా జీవిస్తాయి. తులసీదాస్‌ను ఉదాహరణగా తీసుకుందాము. ఉత్తర ప్రదేశ్‌లోని బందా జిల్లా రాజ్ పూర్‌లో క్రీస్తు శకం 1532 లేదా 1589 లో తులసీదాస్ జన్మించారు. ఆయన పుట్టుకతో సరయు పరిణ బ్రాహ్మణుడు. రామాయణం రచించిన వాల్మీకి అవతారంగా ఆయన్ని పరిగణించారు. తులసీదాస్ సతీమణి బుద్ధిమతి (రత్నావళి). ఆయనకు భార్య అంటే ఎనలేని మక్కువ. ఒక్క రోజు కూడ ఆమెను విడిచి వుండలేకపోయేవాడు. ఒకరోజు ఆయన భార్య, భర్తకు చెప్పకుండా తల్లిదండ్రుల వద్దకు వెళ్ళింది. అయితే తులసీదాస్ దొంగ చాటుగా అత్తగారింటికి వెళ్ళి భార్య వద్దకు చేరాడు. అప్పుడామె "నా శరీరం ఎముకలు, మాంసంతో కూడింది. ఈ శరీరం పట్ల పెంచుకున్న ప్రేమలో సగం ప్రభువు రాముడి పట్ల పెంచుకున్నట్లయితే తప్పనిసరిగా జ్ఞానవంతుడివయ్యేవాడివి" అని అన్నది.

ఆమె అంత పచ్చిగా మాట్లాడేసరికి తులసీదాస్ బాగా నొచ్చుకున్నాడు. అనం



తరం నిజమైన జ్ఞానం అంటే ఏమిటో తెలుసుకోవాలని నిర్ణయించు కున్నాడు. ఇల్లువదలిపెట్టి ఇహభోగాలు విడిచి సన్యాసి అయ్యాడు. అలా 14 ఏళ్ళు గడిచాక మొదటిసారిగా రాముడిని చూడగలిగాడు, ఆ విధంగా రామచరితను కీర్తనలుగా గానం చేశాడు. తులసీదాస్ భార్య అలా మాట్లాడి వుండకపోతే నేడు మనకు శ్రీరాముడిపై కీర్తనలు వుండేవి కావు.

ఇప్పుడు మహిళలు పురుషులను లేదా అబ్బాయిలను సానుభూతితోనో లేక పాదార్థిక ప్రయోజనం కోసమో ఇష్టపడవచ్చు. అయితే లోతుగా తరచి చూస్తే మహిళలు ఎల్లవేళలా ఏదైనా ఒక దానిని వినూత్నంగా సృష్టించడానికి కృషిచేసి వికాసం పొందే గుణంగల పురుషులను గౌరవిస్తారు. పురుషుడు మరింతగా పురోభివృద్ధి చెందడానికి అలాంటి మహిళే ప్రోత్సాహక శక్తిగా వుంటుంది. ఒక ఆదర్శ మహిళ తన కుటుంబంతో సహా మరొకరికి వికాసం కోసం తన శక్తినంతా వినియోగించి తాను జ్వలించి కీర్తిని పొందుతుంది.

**శ్రీ :**

మనిషి అవిశ్రాంతంగా కష్టించి సంపాదించి అభివృద్ధి సాధించి ఒక లక్ష్యం సాధించి మరొకదానికి వెళ్ళడానికి, ఒక దశనుండి మరోదశకు వెళ్ళడానికి మధ్య ఏముంటుంది. అలసిపోయి, విసిగిపోయిన తర్వాత, విఫలమైన తర్వాత అతనికి మిగిలేది ఏమిటి? అదే శ్రీ. శ్రీ



నారాయణుడి సభ, విష్ణుమూర్తి పాదాల వైపు చూసినట్లయితే ఆయన శేషపాన్పు పైన విశ్రాంతి పొందుతున్నట్టుగా అర్థమవుతుంది. శేషనాగు ఆయన చుట్టూ వుండి, ఆయనకు భద్రతగా వున్నప్పుడు నారాయణుడు కూడా సంతోషంగా నిద్రిస్తాడు. ఎందుకంటే శేషనాగు రక్షణగా వున్నదని భావించి తల్లి ఒడిలో వున్నట్టు హాయిగా వుంటాడు. ఆమె అపారమైన ప్రకృతిలో అనేక ఇబ్బందుల మధ్య వుంది. ఆమె లక్ష్యం అర్థం, ప్రాపంచిక మైనవన్నీ. అలాగే ధర్మార్థ – కామ మధ్య సమతుల్యత కావాలనుకుంటుంది. జీవితానికి అవసరమైన మూడింట మధ్య సమతుల్యతను ఆమె ఎందుకు కోరుకుం టున్నది? ఆమె సమతుల్యతను కోరడమేకాదు, సమతుల్యం చేస్తుంది. ధర్మ, అర్థ, కామ–ఈ మూడు కలిస్తే ఆమె. అది ఎలాగో చూద్దాం. జీవితంలో అవసరమైనవి ధర్మ,

అర్థ, కామ అన్న విషయం మనకు తెలుసు. ధర్మ అజరామరమయిన సూత్రాలు – సత్యం, ప్రేమ, ఆప్యాయత, న్యాయం, కర్తవ్యం, అమాయకులపట్ల అహింస తదితరాలను అనుసరిస్తుంది. ఈ ధర్మ మును ప్రాచీన వ్యవస్థలో సంస్కార్ ద్వారా సూత్రాలను, అజరామరమైన మంత్ర, తంత్రాలు, యజ్ఞయాగాదులను నిర్వ హించడం, రుజువర్తనగా వ్యవహరిం చడం, స్వచ్ఛమైన ఆలోచనలు చేయడం, వాటిని మాటల్లో, చేతల్లో ఆచరించడం బోధించేవారు. వ్యక్తులుగా మనకు శరీ రానికి, మనస్సుకు వున్నట్టు స్ఫూర్తి వుంటుంది. శరీరానికి సొంత అవస రాలు, డిమాండ్లు వుంటాయి, మనస్సుకు సొంత అభిప్రాయాలు, కష్టాలు, ఆనం దాలు వుంటాయి. మనం సమాజంలో భాగమే, అందువల్ల సామాజిక ప్రవర్తనతో పాటు కొన్ని బాధ్యతలు, కర్తవ్యాలు, రుణాలు, వారసత్వం, అనురాగం, ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవలసిన బంధాలు, సంరక్షణ బాధ్యత వుంటాయి. ఒకవైపు మన సామాజిక బాధ్యతలు నెరవేరుస్తూ మన కర్తవ్యాలను కూడా నిర్వహిస్తూనే, తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ, భార్య నుండి ప్రేమ, అనురాగం, పిల్లల నుండి గౌరవం, కృతజ్ఞతల బంధాలతో కొన్ని వరాలను ఆనందిస్తాము. ఇవన్నీ ముఖ్య మైనవే. ధర్మ సూత్రాన్ని అర్థం చేసు కున్నాక మనం ప్రాపంచికమైన కర్మ, అర్థ సూత్రాలు, ప్రాపంచిక లక్ష్యాలుగల సమా జంలో ప్రవేశిస్తాము. ఇక్కడ సత్వ గుణం పట్ల ఆసక్తి చూపం. సత్వగుణాన్ని కొన్ని సార్లు అపార్థం చేసుకుంటాము. అంతే కాదు, మాయ, భౌతిక వస్తువుల మాయలో పడి, అజ్ఞానం, అసత్యంపట్ల ఆకర్షించి సత్వగుణాన్ని వదిలేస్తాం. అదే సమ యంలో ప్రాపంచిక బాధ్యతలు అవాస్త వమే కాదు – సాపేక్షికంగా అవి వాస్తవ మైనవే. అందువల సాపేక్షికతను చూడ కుండా సత్యసాధనవైపు పయనించాలి. మన ప్రాపంచిక లక్ష్యాలు సాధించకుండా వదలిపెట్టడం ద్వారా దాన్ని మనం ఏనాడు సాధించలేము. తరచుగా తక్కిన రెండు గుణాలను కొన్నిసార్లు సమంగా మరికొన్నిసార్లు ఇంకా ఎక్కువగా ఆచ రించవలసిందిగా అది మనల్ని కోరు తుంది. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు



కౌరవులను చూడగానే తాను పొరపాటు చేస్తున్నానని బాధపడ్డాడు. ఆయన వ్యక్తిత్వం తెలిసినందున తన శక్తి, సామర్థ్యాల పట్ల ఆయన భీతి చెందలేదని మనం ఖచ్చితంగా చెప్పగలము. యుద్ధం జరిగితే ఫలితాలు చాలా దారుణంగా వుంటాయని, తన బంధువులను – తనను పెంచి పోషించిన వారితో సహా వధించవలసి వస్తుందని – ఇది అసలు ఊహించలేదని అర్జునుడు ఎంతో బాధపడతాడు. విజయానికి చెల్లించవలసిన మూల్యం ఎక్కువగా వుంటుందని ఆయన భావించి అలాంటి విజయం అవసరం లేదని భావిస్తాడు. దీన్ని సత్వగుణంగా మనం పోల్చవచ్చు. ప్రాపంచికమైనవి కావాలని, విజయం చాలా కష్టమైందని, ఎన్నో చేయవలసి వుంటుందని ఆయన భావించి యుద్ధాన్ని కోరుకోలేదు.

ఇదే మార్గాన్ని బలరాముడు కూడా అనుసరించాడు. ఆయన మహాభారత యుద్ధ ప్రారంభంలో యాత్రకై వెళ్ళి భీముడు, దుర్యోధనుడి మధ్య మల్ల యుద్ధం జరిగే సమయానికి మాత్రమే తిరిగి వచ్చాడు. అయితే కృష్ణుడి మార్గం వేరు. యుద్ధం ఫలితాలు ఎలా వుంటాయో ఆయనకు తెలుసు. అయిన్పటికీ యుద్ధం తప్పదని ఆయనకు తెలుసు. చేయవలసింది చేయక తప్పదని కూడా ఆయనకు తెలుసు. ఒక దశలో తాత్వికత, భౌతికపరమైన ఊహలు, నైతికతపట్ల చర్చకంటే కేవలం కర్మ సిద్ధాంతమే



ప్రాధాన్యమవుతుంది. ఒక కార్యక్రమం చేసేటప్పుడు తప్పుచేయక తప్పదు. కొంత అలజడి తప్పదు – ఎందుకంటే మంచి లేదా చెడు ఏదో ఒక పని చేస్తున్నావు గనుక. ఇక్కడ మీరు భాగస్వామి అయ్యారు. ఇదే పెద్ద అంశం. మీరు భాగస్వామి అయినప్పుడు కాలం మిమ్మల్ని వెనక్కు లాగుతున్నప్పుడు మీకు ఒక శక్తి అవసరం, ఆ శక్తే శ్రీ. ఎలాంటి సందేహం లేకుండా అర్థం అవసరం. అయితే అది లేకుండా మరేది కొత్తది రాదు. సరైన వ్యక్తీకరణ చేసిన కార్యంలో కనిపిస్తుంది.

మనం నిజంగా శ్రమించి పని చేస్తాము. అలాంటి సమయంలో ద్రవ్య పరమైన దానికంటే మరేదో కావాలి. కొన్ని సమయాల్లో మనకు ప్రశంసలు లభిస్తాయి. ఇతరుల దృష్టిలో మనం చేసేది గొప్పగా లేకపోవచ్చు. ఉదాహరణకు పెయింటర్ కావాలనుకున్న వ్యక్తి కుటుంబపోషణ కోసం క్లర్కుగా చేరి ఇబ్బందులు పడవచ్చు. ప్రశంసలుండవు. అదే ఇంటికి వస్తే భార్య నుండి ప్రేమ, గౌరవం లభించి చేసిన కష్టమంతా మరిచిపోయి ఆనందిస్తాడు. శ్రీ అంటే ఇదే.

శ్రీరాముడు అరణ్యవాసం లోనూ హాయిగా, అర్థవంతంగా జీవించడానికి శ్రీ కారణం. పార్వతీదేవి పుష్పాలు తది తరాలు ఏర్పాటు చేయగా శివుడు పూజ చేయడమే శ్రీ. అలసి, సొలసిపోయిన వ్యక్తి నిద్రించి మరుసటి రోజు హాయిగా లేవడానికి శ్రీ దోహదం చేస్తుంది.

కొన్ని ఇళ్ళలో భార్య ఒకటి తర్వాత మరొక వస్తువు కావాలని పోరు పెట్టడం మనం చూస్తుంటాము. అలాంటి కుటుం బాలు ఏనాడు వృద్ధి చెందవు. గృహిణి లేదా కుటుంబంలో కీలక బాధ్యతలు చూసే మహిళ అవసరాలకు కోర్కెలకు మధ్య దీని ప్రాధాన్యం తెలిసి వున్న కుటుంబాలు అభివృద్ధి చెందుతాయి. కొన్ని సమయాల్లో ఆ గృహిణి తక్షణ అవసరాలను కాదని కోర్కెలకు ప్రాధాన్యం ఇవ్వవచ్చు.

ఒక మనం నిర్వచనం శ్రీ గురించి చెప్పవచ్చు. శ్రీ లేకపోతే ఏదైనా వృథా అవుతుంది. శ్రీ చాలా సూక్ష్మమైంది, స్వార్థరహితమైంది. అది చాలా అరుదుగా నిక్కచ్చిగా చెపుతుంది. పురుషుడు అంతి మంగా ఓదార్పు, శాంతిని, స్థావరం పొందేది శ్రీ మాత్రమే.

**వాక్కు :**

సత్యమైన ప్రసంగమైన సరైన వాక్కు. అది సహేతుకంగా, హాయిగా, అర్థ వంతంగా, ప్రముఖమైందిగా వుండాలి. నమ్రతగా, పొందికగా వున్నట్లయితే అది చాలా శక్తివంతంగా వుంటుంది. అదే మహిళ అనునయంగా మాట్లాడితే అదో



కవితాత్మకంగా వుంటుంది. అదే మహిళ కఠినంగా మాట్లాడితే అ విషయం కంటె రెండు రెట్లు అధికంగా వుంటుంది. పాండవులు తాము నిర్మించిన ఇంద్ర ప్రస్థకు కౌరవులైన దుర్యోధనుడు, ఆయన సోదరులను ఆహ్వానించిన నీతిబోధక కథ తెలిసిందే. ఉత్తమ వాస్తుప్రకారం ఆ భవనం నిర్మించారు. వాస్తుశాస్త్రంపై ఆధారపడి అద్భుతంగా నిర్మించిన మాయ మంటపాన్ని మాయ పర్యవేక్షించినట్టు విశ్వసిస్తున్నారు. భవనంలో భ్రమలు గొలిపే తప్పుదోవ పట్టించే అంతస్తులు న్నాయి. నేల అంతా చక్కగా వుందని భ్రమించి నీటి మడుగులో దుర్యోధనుడు అడుగు పెట్టి అవమానం పొందాడు. "గుడ్డి తండ్రి, గుడ్డి కొడుకు" అని ద్రౌపది తీవ్రవాఖ్యలు చేసింది. సావిత్రి, సత్య వంతుడి కథ తీసుకుందాము. నారదుడు ఊహించినట్టుగానే సత్యవంతుడు అడ విలో చెట్టుకొడుతూ పడి సావిత్రి ఒడిలోనే



ప్రాణాలు విడిచిపెడతాడు. తన భర్త మృత దేహం ముందు ఒక నీడ కదలాడడం దుఃఖంలో వున్న సావిత్రి చూస్తుంది. మృత్యువును కబళించే యముడే అక్కడికి వచ్చాడని సావిత్రి తెలుసుకుంటుంది. తన భర్త ప్రాణాలు తిరిగి ఇవ్వమని సావిత్రి యముడిని అడుగుతుంది. అందుకు యమధర్మరాజు తిరస్కరిస్తాడు. అప్పుడు సావిత్రి మాటలకు ముగ్ధుడైన యముడు ఆమె పతిప్రాణం మినహా ఒకటి తర్వాత మరొకటి వరాలు కోరుకో మంటాడు. ఆ వరాలు ఉపయోగించు కుని సావిత్రి తన అత్తమామలు కోల్పో యిన కీర్తి, ప్రతిష్ఠలను తిరిగి సాధిస్తుంది. చివరకు తన మాటల చాతు ర్యంతో సావిత్రి పతిప్రాణం సైతం దక్కించు కుంటుంది. వందమంది కుమారులు కలగాలని యముడి నుండి ఆశీర్వాదం కూడా పొందుతుంది. సావిత్రి సహేతు కంగా, తార్కికంగా, హృద్యంగా ఆకట్టు కునేలాగా మాట్లాడడంవల్ల ముగ్ధుడైన యముడు చివరకు పతిప్రాణం వరం కూడా పరోక్షంగా ఇవ్వక తప్పలేదు. పలు ధర్మసూత్రాలను, నైతికత లక్షణాలను, పురుషుల నైపుణ్యతను గురించి మెప్పిం చేలా సావిత్రి మాట్లాడడంతో ఆమె ప్రసం గానికి, వాగ్ధాటికి అచ్చెరువొందిన యముడు నాలుగవవరం కూడా ఇచ్చాడు. నూరుగురు కుమారులకు సత్యవంతుడితో కలసి జన్మనిచ్చే భాగ్యం కలిగించమని సావిత్రి కోరుతుంది. ఇక్కడ ఆమె వేసిన మెలికను తెలుసుకుని ఆశ్చర్యపోయిన యముడు సత్యవంతుడికి తిరిగి ప్రాణం పోస్తాడు. మహిళలకు ప్రసంగం గొప్ప ఆయుధం. మెదడులో కుడి, ఎడమ భాగాల మధ్య స్త్రీలకు మంచి సమన్వయం వుండి ఒకేసారి పనిచేస్తాయి. తలకు, హృదయానికి చక్కటి సంబంధం వుండి తక్షణం స్పందిస్తాయి. చక్రాలలో వుండే సూక్ష్మశక్తి మూలంగా చక్కగా ప్రసంగించే స్త్రీలు తమ శక్తివంతమైన మాటలద్వారా ప్రజలను బాగా ఆకర్షిస్తారు. నమ్రతగా, తార్కికంగా, సహేతుకంగా సావిత్రి మాట్లాడడం వల్లనే యముడు సైతం ఏమరుపాటు పడి ఆమె మాటలకు కట్టు బడి పోయాడు. ద్రౌపది విషయాన్ని పరిశీ లించినప్పుడు ఆమె పొందినంత అవ మానం మరెవరూ పొందలేదని మనం వాదించవచ్చు. అయితే సీత, అహల్య లాంటివారితో పోల్చినట్లయితే ద్రౌపది అంతగా సహనం, ఓర్పు ప్రదర్శించలేదు. అయితే తనను తీవ్రంగా అవమానించి నందునే కొంచెం మితి మీరి వ్యాఖ్యానిం

చిందని వాదించవచ్చు, ద్రౌపది అవమా నించినప్పుడు అవమాన భారం, నిస్సహాయ తతో దుర్యోధనుడు బాధపడి వుంటాడు.

**స్మృతి :**

ఒక పదంగా తీసుకుంటే స్మృతి అంటే జ్ఞాపకం, అదో ప్రత్యేకమైన జ్ఞాపకం. దేవుడి ఉనికిని తెలిపే రుజువు చూపిం చమని వితండవాదం చేస్తే, పరిపూర్ణత అనేది మౌలికమైనదేనన్నది వాస్తవమే,



ఆత్మచేతన వున్న మానవులందరికి ఇది వుండేదే. పరిపూర్ణత అన్న విషయం మనకు తెలిసిందే, ఇది పూర్వం నుండి వస్తున్నదే. అది ఎక్కడి నుండి వచ్చేది మనకు తెలియదు కానీ, అయితే అది వుందని మాత్రం మనందరికీ తెలుసు. మన చుట్టూ వున్న ప్రపంచం పరిపూర్ణ మైంది కాదన్న కఠిన వాస్తవం, పరిపూర్ణత భావన మధ్య మనం ఊగిసలాడు తుంటా ము. పెరిగి పెద్దవాడైన వ్యక్తికి, పిల్లవాడికి మధ్య వున్న తేడాగా దీన్ని మనం చెప్ప వచ్చు. పరిధులు పెట్టుకుని జీవిస్తే కలలు కనే వ్యక్తిగా అవుతారు, సామాన్య మానవుల నుండే నాయకుడు వస్తాడు.

మీరు మానవాళి సాధించిన విజ యాలు, త్యాగాల చరిత్రను చూసినట్ల యితే ఒక విషయం సాధారణంగా ఒకే విధంగా కనిపిస్తుంది. కొన్ని తీవ్రమైన మార్పులు చేసినవారు ఐహిక అంశాలకు పరిపూర్ణత భావనను తొలగించలేకపోతు న్నారు. బహుశా వారు జీవితంలో ఏ రోజూ పరిధులను విధించుకుని వుండక పోవచ్చు. రాజీపడ దలచినప్పుడు ఐహిక విషయాలకు ప్రాధాన్యతనిచ్చి, పరిపూర్ణత భావనపట్ల అపరిపూర్ణత చూపిస్తారు. ఇంకా అజ్ఞానమనే సాలెగూడులో చిక్కుకుంటారు. ఈ ప్రపంచం సృష్టించిన ఎండమావుల వెంట పరుగిడుతూ గందరగోళంలో పడి బాధలు పడతారు. కార్యకలాపాలు, బాధ్యతల్లో మునిగిన వ్యక్తి కొన్ని సమయాలలో చేస్తున్న పనికి కట్టుబడిపోతాడు. ఇతరుల చర్యలు తనను తన కుటుంబాన్ని ఎక్కడికి తీసుకు వెళుతున్నాయని కొన్ని సమయాలలో ఆయన లేదా ఆమె ఏమాత్రం పట్టించు కోరు. సంస్కృతం బాగా తెలిసిన వారు స్మృతి అంటే సంస్కార్ అని చక్కగానే చెప్పారు. సంస్కార్ అంటే ఏమిటి? మన అనుభవాలు మన ఆంతరంగిక మనస్సు పైన తీవ్ర ముద్రవేసి మన ప్రవర్తనను రూపుదిద్దుతాయి, కొన్నిసార్లు తార్కికంగా ఆలోచించే మనస్సుకు సైతం ఇది తెలి యకపోవచ్చు. అదే సంస్కార్

(సంస్కారం). మనమంతా సూక్ష్మస్థానం నుండి వచ్చిన వారమే. దాన్నే మనం క్షేత్రం అంటాము. క్షేత్రం ఎంత ఉన్నతంగా వుంటే అంతగా ఆత్మ ఇక్కడ ప్రతిబింబిస్తుంది. ఆ క్షణాలు ప్రధానంగా కనిపిస్తాయి.

**స్పష్టత :** ఏం చేయాలి, దేనికి సంయమనం పాటించాలి అనేది తెలుసుకోవడం.

**శ్రద్ధ :** ఎవరైనా ఒక సమయంలో ఒకే లక్ష్యంపై శ్రద్ధతో పనిచేయాలి, రెండు లేదా అంతకు మించి ఎక్కువ తప్పని సరి



లక్ష్యాలు ఎదురైతే, మరింత ఎక్కువగా అందరికీ ఉపయోగపడేది, శాశ్వతమైంది ఎన్నుకుని స్వల్పమైన మరియు మన కోర్కెలను తీర్చగల వాటిని ఎంచుకునే ఆంతరంగిక సామర్థ్యం కలిగి వుండాలి.

ఒక్కమాటలో చెప్పాలంటే ఉన్నతమైన దాన్ని ఊహించగల సామర్థ్యం కలిగి వుండాలి.

**పునఃవిశ్వాసం :** అలాంటి ఆత్మలు మనకు అజరామరమైన సూత్రాలను గుర్తు చేస్తాయి. ఇతర ప్రపంచమంతా మరోవైపు




పయనిస్తున్నా వారు మాత్రం తమ విధానం మార్చుకోరు. సంస్కారం నుండి, సజీవంగా వున్న అజరామరమైన ఉన్నతమైన సూత్రాలు నాటుకుపోయిన ఆత్మ నుండి ఈ లక్షణాలు ఆవిర్భవించాయి. ఈ ప్రపంచంలో కనిపిస్తున్న దానికి మించింది ఇది. ఉదాహరణకు రావణుడు సీతను అపహరించి లంకకు తీసుకు వచ్చినప్పుడు అధికారం అధిష్ఠించి వున్నాడు. అప్పటికే శివుడు, ఇంద్రుడు, కుబేరుడి నుండి మరణం లేకుండా ఆశీర్వాదం, వరం పొందివున్నాడు. రావణుడంతటి పరాక్రమం, బలం, సంస్కృతి, మేధోశక్తి గలవారు ఆ కాలంలో లేరని జ్ఞానులు చెపుతారు. అయితే తన సతీమణి సీత కోసం మాత్రమే రాముడు అడవులను, మహా సముద్రాన్ని దాటి లంకకు చేరుకున్నాడని రావణుడి భార్య మండోదరి మాత్రమే గుర్తించింది. రావణుడి దుష్ట ఆలోచలను, సీతను వశపరచు కోవాలన్న మాయోపాయాలను మండోదరి అనేక

మార్లు గట్టిగా వ్యతిరేకించినట్లుగా రామాయణం చెపుతోంది. సీత దేవతామూర్తి అని మండోదరికి తెలుసు. మండోదరి తీవ్రమైన అభ్యంతరాలను, రావణుడి స్పందనలను వాల్మీకి, తులసీదాస్‌లు ప్రస్తావించలేదు. రావణుడికి బలం, ధైర్య సాహసాలు, బలమైన మనోశక్తి వున్నా వాస్తవం, న్యాయం, భగవంతుడికి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడలేక పోయారన్న అంశాన్ని చెప్పడంలో ఆయన విఫలమయ్యారు. అయితే మండోదరికి జరగబోయేది, దాని పర్యవసానాలు తెలుసు. ప్రపంచం మొత్తం ఒకవైపు పయనిస్తున్న అజరామరమైన సూత్రాలను గుర్తుంచుకోవడమే స్మృతి.

**మేధ :**

మహిళల మెదడు కుడి,ఎడమ భాగాల మధ్య మంచి సమన్వయం వుండి ఏక కాలంలో పనిచేస్తుందని ఇటీవల జరిపిన అధ్యయనాలలో స్పష్టమైంది. సాధారణంగా దీని అర్థం, వాళ్ళ హృదయం స్పందిస్తుందని, మెదడు ఆలోచిస్తుందని, రెండూ ఒకేమారు పనిచేస్తాయని వారు భావించారు. వారి దృక్పథం సార్వత్రికం, గొప్పది. అందువల్ల ఒక అంశాన్ని ఋజువు చేయడానికి అంతగా హడావిడి పడరు.

"ఒక పురుషుడు స్త్రీని చూసినప్పుడు మొదట ఆమె అందాన్ని చూస్తాడు; ఒక స్త్రీ పురుషుడిని చూసినప్పుడు అతనిలో గల లోపాలను చూస్తుంది. పురుషుడు ఎక్కడ తనను తాను మెరుగుపరచు కోవా



లనేది స్త్రీ చూస్తుంది" అని చక్కగా చెప్పారు. మేధాశక్తిని పురుషులు మెరుగ్గా ఆచరణలో పెడతారని, అందువల్లనే ప్రపంచంలో ఉత్తమ మైన ఛెఫ్‌లు (వంటలు చేసేవాళ్ళు) అంతా పురుషులే నన్న మాటను మనం పదే పదే విని వుంటాము. మరో వైపు చూసినట్లయితే మన అమ్మమ్మ తన కున్న ఆర్థిక వనరుల మేరకు ఉత్తమమైన వంటలు చేశారు, ఆమెకు ఉన్నతమైన భావనలు, భావోద్వేగమైన బలహీనతల మూలంగా తాను నేర్చుకున్న శ్లోకాలన్నింటినీ ఇంట్లోనే తన వారసులకు నేర్పింది. ఇది సంప్రదాయంగా అనేక శతాబ్దాలుగా వస్తున్నది. సేకరించిన సమాచారాన్ని ఆంతరంగికంగా నిలిపి వుంచేందుకు మేధోశక్తి దోహదం చేస్తుంది. అది రెండో జ్ఞానం లాంటిది. సృజనాత్మకతకు మేధోశక్తి తోడయితే అద్భుతాలు చేయవచ్చు.

మనం గార్గి, యాజ్ఞవల్క్య లేదా లోపాముద్ర, అగస్త్యుడు (ఋగ్వేదం శ్లోకాలను రచించిన వారిలో లోపాముద్ర ఒకరు) లాంటి వారి చర్చలను చూసినట్లయితే


భారతదేశంలో వేదకాలంలో మహిళలకు ఎంతో గౌరవం, స్వేచ్ఛ ఇచ్చారు. తత్త్వ శాస్త్రం, ప్రసూతి, విజ్ఞానశాస్త్రాలలో గొప్ప గొప్ప ఋషులతో సైతం ఎంతో తార్కికంగా ఆనాటి మహిళలు చర్చలు జరిపేవారు. జీవిత భాగస్వామిలో ఒక మంచి స్నేహితుడిని ఎవరూ చూడరని, ఒక మంచి స్నేహితుడిలో జీవిత భాగస్వామిని చూడగలరని చక్కగానే చెప్పారు. స్నేహం అనేదానికి రెండు అంశాలు చాలా ముఖ్యమైనవి – అవి : అనుకూలత, కదిలించే అంశాలు. ఒక వ్యక్తిలోగల కదిలించే అంశాల పట్ల ఆకర్షితం కావడం కొన్ని సమయాల్లో వుంటుంది. అయితే సంభాషణ ఈ ప్రపంచానికి సంబంధించినదై వుండరాదు. కొన్నిసార్లు మీకు ఇష్టమైన అంశంపైన తరచుగా చర్చించవచ్చు, ఆనందించవచ్చు. అయితే ఒకరు చెప్పేదాన్ని మరొకరు ఆనందించక పోవచ్చు.

అయితే రెండు పరిస్థితులు కలిసినట్లయితే, అంటే మనం ఇతరులతో మాట్లాడడంలో ఆనందం పొందితే మానసికంగా మనం అందుకు ప్రతిస్పందిస్తాం, అప్పుడు మనలో రసాయనిక, జీవప్రక్రియ మరింత ఉత్తేజమై శక్తి వస్తుంది; ఆత్మ నుండి నూతన వ్యక్తీకరణలు వెలువడతాయి. సంతోషం వెల్లివిరుస్తుంది.

పురుషుడు సహజంగా వేచి వుంటాడు. స్త్రీ సహజంగా ఉత్తేజ పరుస్తుంది. సరైన జోడి కుదిరితే అంతగా సామర్థ్యం లేని పురుషులూ చైతన్యం పొంది అద్భుతాలు చేస్తారు. ఉదాహరణకు సీతను అపహరించి తెలివి తక్కువగా, అహంకారంగా రావణుడు ప్రవర్తించకపోతే రామాయణం లేదు. అలాగే ద్రౌపది శపథం చేసి, దాన్ని పాండవులకు పదే పదే తనకు జరిగిన అవమానాన్ని గుర్తుచేస్తూ వుండకపోతే మహాభారతం లేదు.

**సహనం :**

ఈ పదం ధరణ్ నుండి జనించింది. అంటే నిలపడం, తోడ్పాటివ్వడం, స్థానం, పునాది తదితరాలు కల్పించడం. ప్రాచీన భారతదేశంలో స్త్రీ స్థానం చాలా ఉన్నతంగా వుండేది. చివరకు తండ్రి, గురువు కంటె ఎక్కువగా వుండేది. ఒక ఉదాహరణ చూడండి. ద్రుపదుడి ఇంట స్వయంవరంలో ద్రౌపదిని పాండవులు, వాస్తవంగా అర్జునుడు కింద నీటిలో నీడనుచూసి పైన తిరుగుతున్న చేప కంటిని బాణంతో కొట్టి, అజ్ఞాతంలో



వున్నప్పుడు గెలుచుకున్నారు. పాండవులు ద్రౌపదిని తాము నివసిస్తున్న గుడిసెకు తీసుకువస్తారు. అప్పుడు తల్లి కుంతీదేవి వంట చేస్తూ వుంటుంది. బయటకు వచ్చి తాము తెచ్చిన బహుమతిని చూడమని పాండవులు తల్లిని కోరతారు. అప్పుడు తల్లి మీరు ఏది తెచ్చినా సమంగా పంచుకోమని చెబుతుంది. అలా ద్రౌపది పాండవులు ఐదుగురికి సతీమణి అవుతుంది. ఆనాడు గృహిణికిగల విలువ కుటుంబ సంస్కృతి అది. అందువల్లనే ఆమెకు ఎంతో గౌరవం, ప్రాముఖ్యత ఇచ్చారు. కుటుంబమంతా వాస్తవంగా ఆమె చుట్టూ తిరుగుతుంది. ఆమెది అత్యంత కీలకమైన పాత్ర. వాస్తవంగా ఒకే మహిళ కుటుంబాన్ని నడిపినంతకాలం కుటుంబాలన్నీ చక్కగా వున్నాయి. ఎప్పుడైతే స్త్రీలు పురుషులను అనుసరించడం ప్రారంభమైందో కుటుంబాలు విడిపోవడం ప్రారంభమైంది. మహిళలను చీకటి గదుల్లో మగ్గాలని వదలివేయరాదు; ఎందుకంటే ఇళ్ళ వ్యవహారాలన్నింటినీ చక్కగా సమర్థించుకురాగల శక్తి, స్తోమతలు వున్నాయని సూత్రప్రాయంగా, ఆధ్యాత్మికంగా అంగీకరించబడింది. స్త్రీ, పురుషులను నిర్వచించడం ఆసక్తిగా వుంటుంది. పురుషుడి లక్షణం తీసుకుందాము – అది దేనికి సంకేతం? దుందుడుకుతనం మరియు సమానత లేమికి సంకేతం. ఒక దిశలో చూసి నట్లయితే ఇది ప్రత్యేకంగా కనిపిస్తుంది. కొన్ని సమయాలలో ఔన్న



త్యాన్ని, విశాలత్వాన్ని నిర్లక్ష్యం చేసి చూడడం జరుగుతుంది. మరోవైపు మహిళ లక్షణం నమ్రతకు, సమత్వం, సమున్నత దృక్పథం, బహువిధ పరిశీలనలకు సంకేతం. మీరు ప్రతిదాన్ని పరిగణనలోకి తీసుకుంటే మీరు చేయగలిగింది ఏమీ వుండదు. ఏదో ఒకటి చేస్తున్నట్లయితే సమయానికి చేయాలి. అంటే మీరు సమతుల్యంగా పనిచేస్తున్నారన్నమాట. సమతుల్యత అవసరం, రోజూ ముగింపులో అసమతుల్యతను సరిచూసుకోవడం అవసరం. ఇక్కడే ధృతికి ప్రాముఖ్యత వుంది. మహిళల ప్రభావంతో అనేకమంది దేశ దిమ్మరులు క్రమశిక్షణగా నడుచుకున్న సంఘటను చూస్తున్నాము, వింటున్నాము. ధృతియే ఇందుకు కారణం. ఇక్కడ సీత అనుసరించిన సహనం అత్యంత ఉన్నతమైనది, శిఖరాగ్ర సమానం. సీత జనకుడికి పొలం చాలులో దొరుకుతుంది.

జనకుడిది నిస్వార్థమైన, బాధ్యతాయుత మైన పాలన. అందువల్ల సీత భూమాత బిడ్డై జనించింది. ధృతి అంటే సహనం. అంటే నమ్మినదానికి కట్టుబడి వుండడం లేదా అలాగే జీవించేశక్తి కలిగివుండడం. మనలో అనేకమందికి మంచి చిత్తశుద్ధితో జీవించాలన్న భావనే వుండవచ్చు. ఐతే ధృతి కలలు కనేవారిని, సాధకులను వేరు చేస్తుంది. అలాగే నైతిక విలువలకు కట్టుబడి జీవించేవారిని వేరుచేస్తుంది. రావణుని జయించడానికి రాముడు వస్తాడని సీత విశ్వసించడానికి ధృతి కారణం. ఒకరి అభీష్టానికి, వాస్తవానికి మధ్య గల అంశాలన్నీ పరిశీలించే శక్తి సీతకు వుండడానికి ధృతి కారణం.

రెస్టారెంట్‌లో వున్న భోజనానికి చెప్పడానికి లేదా దానికోసం వేచి వుండడానికి అసహనం ప్రదర్శించడం, వెయిటర్ కిచెన్‌కు వెళ్ళిరాకముందే మనలో ఎక్కువ మంది ఫిర్యాదు చేయడం ప్రారంభిస్తాము. తక్షణం మనపట్ల గౌరవం చూపాలని కోరుకుంటాము. ఇతరులుచేసే మంచి నులు లేదా త్యాగాల ఫలితాలు చూసేందుకు వేచి వుండడానికి ఇష్టపడక ఆత్రుత పడతాము. విత్తనాలు మొలకెత్తినట్టుగా మంచి పనులు  జరగవచ్చు. పొలంలో విత్తనాలు వేశాక మొలకెత్తడానికి కొంత సమయం పడుతుంది. విత్తనాలు వేసి మొలకెత్తుతాయని వేచి చూడాలి. ఈ లోపు ఏమీ చేయలేము. అదే ధృతి అంటే. బలమైన తుపాను మధ్య అది వేగంగా నిలిచి వుంటుంది. మనం నమ్మినదానికి కట్టుబడి వుండడమే కాదు, దానికోసం చిత్తశుద్ధితో, అంకితభావంతో జీవించడం ఉత్తమ జీవనం అవుతుంది.

**క్షమ :**

పరిపూర్ణతకు ధృతి హామీ అయితే, అసంపూర్ణతకు క్షమ హామీ. ఏదీ సంపూర్ణత కలిగి వుండదని మనం గ్రహించాలి. అంతేకాదు, మన పరిసరాలు చక్కగా, పరిపూర్ణంగా వుండవు. మన సంబంధాలు ఏనాడూ పరిస్థితులని చక్కబరచలేవు. అయితే మనం గనుక క్షమాగుణం ఆచరించినట్లయితే పరిస్థితులు మనవైపు తిరిగేట్టుగా చక్కబరచుకోవడం మనం నేర్చుకోగలము.  భూదేవి ఒడిలోకి చేరి,



ఆత్మార్పణగావించాలని నిర్ణయించు కున్న ప్పుడు బహుశా క్షమాగుణం సీత మన సులో వుంటుంది. రాముడి గౌరవం కోసమే ఆమె ఈ పనిచేయతలపెట్టింది. గాంధారి, కుంతి ఒకరిపట్ల మరొకరు క్షమాగుణం ప్రదర్శించారు. అదే విధ ముగా పాండవులు కౌరవులపట్ల క్షమా గుణం ప్రదర్శించారు. ఒకసారి గౌతమ బుద్ధుడిని శత్రువు దూషిస్తాడు. ఇందుకు బుద్ధుడు ఇలా అంటాడు – "ప్రియ మిత్రుడా నీకు ఇష్టంలేని బహుమతితో నీవు ఏమి చేస్తావు?" అని ప్రశ్నిస్తాడు. అప్పుడతను "నాకు ఇచ్చినవానికే తిరిగి ఇస్తాను" అని చెప్తాడు. అప్పుడు బుద్ధుడు "నేను కూడా నీవలె దూషణలు వెనక్కు ఇస్తున్నాను" అని అన్నాడు. క్షమ అంటే ఇది; అది సహనం, ఈ ప్రపంచం నీపైన విసిరినప్పుడు తీవ్రంగా ప్రతి స్పందించ కుండా జీవనం సాగించే శక్తి కలిగి వుండ డమే సహనం. అది మీరు నేర్చుకున్న



ప్పుడు మీరు మరింత సృజనాత్మకంగా, మరింత సానుకూలంగా, ఆధార భూతంగా తయారవుతారు. మనలో ఎక్కువమందిమి ఈ ప్రపంచం విసిరే సవాళ్ళకు, ఆగ్రహానికి, ప్రేమకు, స్వార్థా నికి, తదితరాలకు ప్రతి స్పందిస్తుం టాము. అలాంటి శక్తులన్నింటినీ తొలగిం చడం విజ్ఞతగల వ్యక్తికి తెలుసు. అలాంటి వ్యక్తి తన ఆంతరంగిక మూలాలనుండి నూతనశక్తిని సముపార్జించుకుంటూ అభి వృద్ధి చెందుతాడు. అలాంటి స్త్రీని కలిగి వున్న వ్యక్తి ఈ ప్రపం చమంతా సవ్యంగా వుంటుందని తెలుసుకుంటాడు. అప్పుడు జీవనం ఆనందకరంగా వుంటుంది.

## 1022. శ్రీ రాజరాజేశ్వరి స్తుతి

రాజరాజేశ్వరీం లక్ష్మీం
వరదాం మణిమాలినీం
దేవీం దేవం ప్రియాంకీర్తిం
వందే కామ్యార్థ సిద్ధయే ॥

వరప్రదయు మణిమాలా ధారిణియు దేవతలకు ఇష్టురాలును కీర్తినామము కలదియు రాజరాజేశ్వరి అయిన లక్ష్మీదేవికి నమస్కారం.



## 1023. మహోపదేశం

**జ.** ఏనుగుబొమ్మ కఱ్ఱతో చేయబడింది. ఆ బొమ్మతో ఆడుకునే పిల్లవానికి అది ఏనుగే. కఱ్ఱకాదు. ఆ ఏనుగు ఏ వస్తువుతో చేయబడిందో ఆ వస్తువు, అనగా కఱ్ఱ బాలుని దృష్టినుండి మరుగున పడుతుంది. కానీ దానిని చేసిన వడ్రంగికి అంతా కఱ్ఱే. దాన్ని అతడు ఏనుగుగా చూడడు. ఆ విధంగానే ప్రాపంచికులకు పంచ భూతాత్మకమగు ఈ ప్రపంచం తన నిజరూపమయిన పరమాత్మ స్వరూపాన్ని మరుగు చేస్తుంది. కానీ జ్ఞానికి ప్రపంచం పరమాత్మగానే కనబడుతుంది. ఈ పరమ సత్యాన్ని గ్రహించిన ద్వైత వైవిధ్యమంతా ఆ ఏకరూపుని ఆకృతులే అని గోచరిస్తాయి. అప్పుడు మనకు ద్వైతబుద్ధి వుండును. మనం కాక మరొకరు మనకు కనబడరు. కోరిక, ద్వేషం ఏదీ అప్పుడు లేదు. ఆశాద్వేషాలు ఎప్పుడు లేకుండా పోతాయో అప్పుడు కర్మకారణమూ నశిస్తుంది. కర్మలేనపుడు కర్మఫలమూ లేదు. కర్మఫలం లేకపోతే దేహము, దేహ సంబంధములైన దుఃఖాలు ఏవీలేవు. శంకరాచార్యులవారు ప్రపంచానికి చేసిన దుఃఖ నివారకమగు మహోపదేశం ఇదే.

## 1024. సాక్షాత్కార అర్హత

**జ.** భగవంతుడు ఎవరికీ కనిపించడు కదా! మరి ఆయన ప్రభావం మనుషుల మీద ఎలా పడుతుంది? అది భక్తులకు మాత్రమే అర్థమయ్యే భావం.



భగవంతుని ప్రతినిధులుగా ఈ లోకంలో ఎందరో మహాపురుషులు అవతరించారు. వారు జీవించివున్న రోజుల్లో భక్తులను ఎన్నోరకాలుగా ప్రభావితం చేశారు. వారికి మార్గదర్శకం అయ్యారు. అటువంటి వారిలో రామకృష్ణ పరమహంస ఒకరు. వారు మరణించిన తర్వాత కూడా భక్తులకు తమ మహత్తు చూపుతున్నారు. ప్రస్తుతం ఆయన మన కళ్ళ ఎదురుగా లేకపోయినా ఆయన భావాలను అందుకునే స్థాయికి భక్తులు ఎదిగి వున్నప్పుడు ఆ మహానుభావుడి కృపను అందుకుంటారు. అది సాధ్యమా! అంటే ... సాధ్యమే! ఒక చిత్రకారుడు తెల్ల కాగితం మీద తాను గీయబోయే సుందర రూపాన్ని ముందే చూడగలుగుతాడు. శిలగా వున్నప్పుడే తాను చెక్కబోయే శిల్పాన్ని చూస్తాడు శిల్పి. అది వారి చేతిలో వున్న విద్యవల్ల సాధ్యమైంది. భగవంతుని రూపం చూడాలంటే ముందుగా

ఆ రూపం తిలకించగలిగిన స్థాయికి మనసులు ఎదగాలి. ఆ స్థితికి ఎదిగిన వారు భగవంతుని ఉనికిని ప్రశ్నించరు.

## 1025. ఓం గం గణపతయే నమః

**ఐ.** గణేశ గాయత్రులు

1. ఏకదంతాయ విద్మహే వక్రతుండాయ ధీమహి తన్నో దంతిః ప్రచోదయాత్।
2. తత్కరాటాయ విద్మహే హస్తిముఖాయ ధీమహి తన్నో దంతిః ప్రచోదయాత్।
3. లంబోదరాయ విద్మహే మహోదరాయ ధీమహి తన్నో దంతిః ప్రచోదయాత్।



**యుగయుగాల్లో గణపతి**

కృతయుగంలో ఈయన తల్లిదండ్రులు అదితి కశ్యపులు. బంగారు శరీర ఛ్ఛాయతో 10 చేతులతో సింహవాహనమెక్కి మహోత్కట గణపతి పేరుతో ప్రసిద్ధుడై దేవాంతక నరాంతక రాక్షసుల్ని వధించాడు.

త్రేతాయుగంలో ఈయన తల్లి దండ్రులు పార్వతీ పరమేశ్వరులు. స్ఫటిక శరీర ఛ్ఛాయతో 8 చేతులవాడై మయూర వాహనం ఎక్కి మయూర గణపతిగా ఖ్యాతినార్జించి సింధువనే రాక్షసుణ్ణి చంపాడు.

ద్వాపరయుగంలో పార్వతి నలుగు మట్టి ద్వారా పుట్టి, కుంకుమరంగు శరీర ఛ్ఛాయతో 4 చేతులవాడై ఎలుక వాహానాన్ని ఎక్కి గజానన గణపతి పేరుతో విఖ్యాతుడై సిందూరుడనే రాక్షసుణ్ణి మట్టుపెట్టాడు.

కలియుగంలో తనంత తానుగా (స్వయంభువు) పుట్టి పొగ రంగు శరీర ఛ్ఛాయతో రెండు చేతులవాడై అశ్వ వాహానాన్ని ఎక్కి ధూమకేతు గణపతి పేరిట కలియుగంలోని మొదటి పాదం దాటాక (1,08,000 సంవత్సరాల మీదట) దుర్జనులందర్నీ వధిస్తాడు.

**వినాయకుని అలంకారాలు :**


1. స్వర్ణాభరణాలంకృత గణపతి, 2. విశ్వరూప గణపతి, 3. సింధూరాలంకృత గణపతి, 4. హరిద్రా (పసుపు) గణపతి, 5. రక్తవర్ణ గణపతి, 6. పుష్పాలంకృత గణపతి, 7. చందనాలంకృత గణపతి, 8. రజతాలంకృత గణపతి, 9. భస్మాలంకృత గణపతి, 10. మూల గణపతి. గణపతి నవ రాత్రుల్లో ఈ వరసని పాటిస్తారు.

**వినాయకుని నామాలు :**

**1. తెలుగు భారతం ప్రకారం :** హేరంబ, గణనాయక, గణేశ

**2. పద్మపురాణం ప్రకారం :** ద్వైమాతుర, లంబోదర, గణాధిపతి, వక్రతుండ, కపిల, చింతామణి, ఢుంఠి

**3. వేదాల ప్రకారం :** బ్రహ్మణస్పతి, కవి, జ్యేష్ఠరాజు, కవీనాం కవి.



**4. సంగీత శాస్త్రం ప్రకారం :** పిళ్ళారి, శ్రీ గణనాథ, కరివదన, లకుమికర (లక్ష్మీకరుడు), అంబాసుత, సిద్ధి వినాయక

**5. పూజ ప్రకారం :** సుముఖ, ఏకదంత, గజకర్ణిక, వికట, విఘ్నరాజ, గణాధిప, ధూమకేతు, గణాధ్యక్ష, ఫాలచంద్ర, గజానన, వక్రతుండ, శూర్పకర్ణ, స్కంద పూర్వజ (లంబోదర, వక్రతుండ, కపిల, హేరంబ అనేవి కూడా ఉన్నా ఇవి పద్మ పురాణం, తెలుగు భారతం అనే వాటిలో ఉన్నాయి)

**షోడశ గణపతి స్తుతి :**

ప్రథమం బాల విఘ్నేశం ద్వితీయం తరుణం భవేత్

తృతీయం భక్త విఘ్నేశం చతుర్థం వీర విఘ్నకం

పంచమం శక్తి విఘ్నేశం షష్ఠం ధ్వజగణాధిపం

సప్తమం పింగళం దేవ మష్ట యోచ్ఛిష్ట నాయకం

నవమం విఘ్నరాజం స్యాత్ దశమం క్షిప్రనాయకం

ఏకాదశంతు హేరంబం ద్వాదశం లక్ష్మీనాయకం

త్రయోదశం మహావిఘ్నం భువనేశం చతుర్దశం నృత్తాఖ్యం పంచదశం షోడశోర్ధ్వ గణాధిపం

గణేశ షోడశనామ ప్రయంతః ప్రాతరుత్థితః

సంస్మరేత్సర్వ కుశలం సప్రయాతి న సంశయః

బాలవిఘ్నేశ్వరుడు, తరుణ గణపతి, భక్త గణపతి, వీర గణపతి, భక్తి గణపతి, ధ్వజ గణపతి, పింగళ గణపతి, ఉచ్ఛిష్ట గణపతి, విఘ్నరాజ, క్షిప్ర గణపతి, హేరంబ గణపతి, లక్ష్మీగణపతి, మహా గణపతి, భువనేశ గణపతి, నృత్త గణపతి, ఊర్ధ్వ గణపతి అనే షోడశ నామాలను ప్రాతఃకాలంలో స్మరించేవారికి సమస్త శుభాలు సిద్ధిస్తాయి.

**పథమ పూజ :**

భాద్రపద మాస, బహుళపక్ష చతుర్థి నాడు చంద్రోదయానికొక ఝాము



ముందర వినాయకుడు ఉదయించాడు కనుక అది ఆయన జన్మదినమైంది. సంవత్సరానికి ఒక్కసారైనా ఈ భాద్రపద శుద్ధ చవితినాడు ఆయన్ని ఆరాధించిన వారికి ఆ సంవత్సరమంతా నిర్విఘ్న ప్రదమైనదిగా అవుతుంది. మార్గశిర శుద్ధచవితిని రమా చతుర్థి అంటారు. ఆ రోజు కూడా గణపతిని పూజించాలి. అలా ప్రతి మాసంలోనూ వచ్చే శుద్ధ చవితినాడు అనగా మొత్తం పన్నెండు చవితులు ఆయన్ని పూజించి, పన్నెండవసారి ఉద్యాపన చేసుకున్నవారికి, ఇహపర లోకాలలో తిరుగులేని సౌఖ్యాలు కలుగుతాయని ఈశ్వరుడు వరం అనుగ్రహించి ఉన్నాడు.

సింధూర వర్ణంతో ఒప్పారే గణపతిని సింధూరంతో పూజచేయాలనీ, దేవతలందరిలోకీ అగ్రపూజ ఆయనదేననీ, గంధం, పువ్వులు, పండ్లు, తాంబూలం, హారతి, ప్రదక్షిణ నమస్కారాల్తో నిన్ను పూజించిన వారికి విఘ్నాలు తొలగి, సర్వసిద్ధులు సమకూరుతాయని పార్వతీదేవి వరమిచ్చింది తన కుమారుడైన గణపతికి.

"ఎవరయితే నిన్ను పూజించకుండా మమ్మల్ని పూజిస్తారో వారి పూజలు నిరర్థకమవుగాక. ముందుగా నిన్ను కొలిచిన వారికి సర్వవిఘ్నాలు తొలగిపోవుగాక" అని బ్రహ్మ, విష్ణువు, ఇతర దేవతలూ వినాయకునికి వరాన్నను గ్రహించారు.

అందుకే ఎటువంటి శుభకార్యం తలపెట్టినా ముందుగా గణపతిని సర్వవిఘ్న నివారణ నిమిత్తం తలుచుకోనివారు ఉండరు. ప్రతి పనియందూ విఘ్నేశ్వర స్తుతి పఠించి, ఆయన్ని పూజించి, ఆ తరువాతనే ఆయా కార్యాలు చేయడం అలవాటుగా చేసుకున్నారు. వినాయకుడు అంటే 'అణుచువాడు' అనే అర్థం ఉంది. ఆయన ఏం అణచివేస్తాడంటే విఘ్నాలను అణచి వేస్తాడు. విద్య, విజ్ఞత, వివేకం మొదలైన లక్షణాలుగల వాడే వినాయకుడు. పూర్వకాలంలో కలుషితమైన జలాన్ని శుభ్రపరిచే నేటి అధునాతన పద్ధతులు, సౌకర్యాలు లేవు. చెరువులు, బావులు, నదులపైనే ఆధారపడేవారు. మరి ఇవి కలుషితమైతే పరిస్థితేంటి? ! దానికి జవాబే గణేశ నిమజ్జనం ప్రక్రియ.

వినాయకుని పూజలో ఇరవై ఒక్క రకాల పత్రాలను వాడతాం. అవన్నీ ఔషధీగుణాలు కలిగి ఉన్నవే. గణపతి నిమజ్జన మప్పుడు పూజాపత్రిని కూడా గణపతితో పాటు నిమజ్జనం చేస్తాం. దాంతో ఔషధీ గుణాలున్న ఆ పత్రి నీటిలో కలిసి కలుషిత తత్వాన్ని పోగొట్టి, శుద్ధిచేస్తాయి. ఇక మరో విషయం– గణేశునికి గరిక



పోచలంటే మహా ఇష్టం. అందుకే ఆయన్ని గరికతో కూడా పూజచేస్తారు. పేరుకు వినాయకుని పూజనే గానీ ఈ పూజ వల్ల ప్రజలందరికీ ఆరోగ్య భాగ్యాలను పంచబడుతుందనే విషయం మనం గ్రహించాలి.

## 1026. సప్తర్షుల తిథి

**జి.** ఋషి పంచమి సప్తర్షులకు ఇష్టమైన తిథి. బహిష్టులు ఆగిన స్త్రీలు, అప్పటి వరకూ ఏవైనా తెలిసీ తెలియని దోషాలుంటే అవి తొలగేందుకు సప్తర్షుల్నీ, వారి భార్యల్ని పూజిస్తారు. ఆ రోజు వారు చేసే ఋషి పంచమి వ్రతానికి ప్రాముఖ్యత ఉంది. భవిష్యోత్తర పూరణం ఈ ఋషి పంచమి వ్రత ప్రాశస్త్యాన్ని వివరించింది కూడా. పేరుకు ఇది ఋషిపంచమే అయినా, ఇదిపూర్తిగా స్త్రీలకు సంబంధించిన వ్రతం చేసే రోజుగా గుర్తించబడింది. ఋషిపంచమినాడు తెల్లవారు ఝామున స్త్రీలు స్నానంచేసి పుష్ప సంచయనం చేయాలి. స్నానం చేసేటప్పుడే వ్రత సంకల్పం చెప్పుకోవాలి. తరువాత గణపతి పూజచేసి, ఉత్తరేణి మొక్కకు పూజ జరిపి, దాన్ని సమూలంగా పెరికి, దాని కొమ్మతో దంతధావనం చేయాలి. పుణ్య స్త్రీలు ఈ వ్రతం ఆచరించేటప్పుడు తిల అభ్యంగ స్నానంచేసి, పసుపు కుంకుమలను ధరించి పూజకు ఉపక్రమించాలి. వితంతు స్త్రీలు విబూది, గోపీ చందనం పంచగవ్యములతో స్నానం చేయాలి. తరువాత సప్త ఋషుల్నీ, అరుంధతిని చూస్తూ ఋషి పూజ చేయాలి. పూజలో నాలుగు వత్తుల దీపం ఉంచాలి. పూజయ్యాక పెరుగు, వేయించిన శెనగలు, తోటకూర కూరను భుజించాలి.

## 1027. బుద్ధుని బోధనలు

**జి.** ప్రాణాలపై తీపి ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కనుక హింసకు లోకం తట్టుకోలేదు. నీవు కూడా ఇతరులవంటి వాడవే అనే మాట మనసులో ఉంచుకొని ఇతరులను బాధింపకూడదు. వారి బాధకి కారణభూతుడవు కాకూడదు. ప్రతి ఒక్కరూ ముందు తాము ఆచరించి, తర్వాత ఇతరులకి బోధించడం చేయాలి. క్రమశిక్షణ లేకపోతే జ్ఞానం కలుగదు. ప్రాణహింస చేసేవారు, అబద్ధాలాడేవారు, బలవంతంగా ఒకరినుండి వస్తువుని తీసుకునే వారు కష్టాలపాలవుతారు. మనసును అధీనంలో ఉంచుకోవాలి. పుణ్యచర్యల వల్ల లభించే ఫలంలో కొంతభాగం ఇతరులకు ఇవ్వాలి. ధర్మసూత్రాలను ఆచరిస్తూ ధర్మ మార్గాన్నే అనుసరించాలి,..



## 1028. యమ స్తుతి

**జ.** తపస్వీ బ్రహ్మనిష్ఠోయః సంయమీ సంజితేంద్రియ

జీవానామ్ కర్మఫలస్థః తం యమం ప్రణమామ్యహమ్

తపస్సంపన్నుడు, పరబ్రహ్మ స్వరూప నిష్ఠతో ఎల్లప్పుడూ ఇంద్రియ నిగ్రహాన్ని పాటించేవాడు, జీవులకు కర్మఫలాన్ని అనుగ్రహించే వాడయిన యమధర్మ రాజుకి ప్రణామములు.

## 1029. వ్యక్తిత్వ నిర్మాణం

**జ.** మీరు దేనిని గురించి ఆలోచిస్తే అదే విధంగా తయారవుతారు. బలహీనతను గురించి ఆలోచిస్తే బలహీనులుగా తయారవుతారు. బలాన్ని గురించి ఆలోచిస్తే బలవంతులుగా తయారవుతారు కానీ బలాన్ని గురించి ఆలోచించాలంటే అందుకు తగిన విధంగా నిరంతరం మనకు బలాన్ని గుర్తుచేస్తూ, ఆ బలానికే చిహ్నమైన ఒక ఆదర్శం మనకు అవసరం. ఒక ఆదర్శాన్ని ఎదురుగా వుంచుకొని దానిని అనుసరించే టప్పుడు మనం తప్పు చేసేందుకు అవకాశం తక్కువ. ఆ ఆదర్శం మనకు అందనంత ఎత్తులో, చేరుకోలేనంత దూరంలో వుండవచ్చుగాక. కానీ దానిని తప్పక పొంది తీరాలని మనం అనుకోవాలి. నిజానికి మనం ఎంచుకునే ఆదర్శం తప్పనిసరిగా అత్యున్నతమైన ఆదర్శం అయి వుండాలి. అటువంటి ఆదర్శాన్ని మాత్రమే వ్యక్తులు, సమాజం తమ ముందు వుంచుకోవాలి. దురదృష్టవశాత్తు అధికశాతంమంది మనుష్యులు తమ తమ జీవితాలలో అసలు ఎటువంటి ఆదర్శాన్ని ఏర్పరుచుకోకుండానే చీకటిలో తడుముకుంటూ జీవితమంతా గడుపుతుంటారు. జీవితంలో ఏదో ఒక ఆదర్శాన్ని తన ముందు వుంచుకుని దానిని సాధించాలని ఆరాటపడే వ్యక్తి, తపనపడే వ్యక్తి, వెయ్యి తప్పులుచేస్తే, అసలు ఆదర్శమే లేకుండా జీవితాన్ని గడిపే వ్యక్తి యాభైవేల తప్పులు చేస్తాడు అని నేను రూఢిగా చెప్పగలను. కాబట్టి ఏదో ఒక ఆదర్శాన్ని కలిగి వుండటమే మేలు.

## 1030.హనుమత్ స్తుతి

**జ.** బుద్ధిర్బలం యశోధైర్యం

నిర్భయత్వం మరోగతా ।

అజాడ్యం వాక్పటుత్వంచ

హనుమత్ స్మరణాద్భవేత్ ॥

బుద్ధి, బలం, కీర్తి, ధైర్యం, నిర్భయత్వం, అనారోగ్యం వంటి జాడ్యాలు తొలగడం, వాక్పటుత్వం మొదలైనవన్నీ హనుమంతుని స్మరణతో లభిస్తాయి.



పవిత్రమైన హనుమన్నామాన్ని భక్తితో పన్నెండుసార్లు తలిస్తే చాలు కార్యసిద్ధి అవుతుంది.

## 1031. జయ మంత్రం

**జ.** ఆంజనేయుడు లంకా నగరాన్ని సంపూర్ణంగా దహనం చేస్తూ తనకి ఏ ఆపదా కలగకూడదనే ఉద్దేశ్యంతో ఈ శ్లోకాన్ని బిగ్గరగా అరుస్తూ – ఆకాశంలో తిరిగాడు. అప్పటి నుండీ దీన్ని జయ మంత్రమన్నారు పెద్దలు. కష్టకాలంలో దీన్ని చదివితే ఆపద గట్టెక్కుతుంది.

దాసోహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః

హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః।

న రావణసహస్రమ్మే యుద్ధే ప్రతిబలం భవేత్

శిలాభిస్తు ప్రహరతః పాదపై శ్చ సహస్ర శః॥

అర్దయిత్వా పురీం లంకా మభివాద్య చ మైథిలీమ్

సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వ రక్షసామ్ ।

"కోసల ప్రభువైన రామునికి దాసుణ్ణి. లంకా రాక్షసుల్ని చంపవచ్చినవాణ్ణి, వాయుపుత్రుణ్ణి. వేల వేల రావణులు నాకు యుద్ధంలో ఓ లెక్కకాదు. రాళ్ళతో, చెట్లతో మోదిమోది లంకని నాశనం చేసి ఉపాయశీలీ, ధర్మాత్ముడూ అయిన రాముని భార్య సీతకి నమస్కరించి రాక్షసుల్ని చంపి నా ప్రయోజనాన్ని నెరవేర్చు



కుని మీ లంకనించి తిరిగి వెళ్తాను" అని పై జయమంత్రానికి అర్థం.

ఈ భావాన్ని మననం చేసుకుంటూ ఆంజనేయుడు లంకలో గాలిలో తిరుగు తున్నట్లుగా మనసులో భావించాలి. మంత్రాన్ని మననం చేసుకోవాలి.

## 1032. ఏ స్తోత్రం దేనికి?

**జ.** ఆంజనేయ స్తోత్రాల్లో 'వాలాంజనేయ స్తోత్రం' ఒకటుంది. దీన్నే వాలపూజ (ఆంజనేయుని తోకని మాత్రమే పూజించడం) అంటారు. దీన్ని చదువుతూ వుంటే శత్రుబాధ, జనఘోష, దృష్టిదోషం తొలగుతాయి. 'బడబానల స్తోత్ర'మని ఒకటుంది. ఇది అకస్మాత్తుగా వచ్చిన ప్రాణాపాయ పరిస్థితిని (అనారోగ్యం ద్వారా గాని, వాహన ప్రమాదదము వల్లగాని) తొలగిస్తుంది. 'వీరాంజనేయ స్తోత్ర' మని మరొకటుంది. దీన్ని చదువుతూ వుంటే -- ఏదో జరిగిపోతుందేమో ననే నిష్కారణ భయం, నిరాశ, ఆందోళన, మానసిక



మైన ఒత్తిడీ పూర్తిగా పోతాయి. ఈ స్తోత్రాలని చదువుతూ, ఏమైనా తప్పుగా అక్షరాలను ఉచ్ఛరిస్తే ఏం జరుగుతుందోనని భయపడవద్దు. కావాలని తప్పుగా చద వడం లేదుకదా! భగవంతుడు కరుణామయుడు. తప్పుగా చదువుతున్నా మనసుకి పట్టించుకుని మనం భక్తితో చదువుతున్నట్లయితే ఆ విషయం ఆయనకి తెలిసి సరిగా చెప్పగల గురువుని తటస్థపడేలా ఆయనే చేస్తాడు. మంత్రాలతో ఆంజనేయుణ్ణి పూజించదలిస్తే 'మన్యుసూక్త' ముంది. అర్ధర్చ పాదర్చ అనులోమ విలోమ పూర్వకంగా మూల మంత్రాన్ని మననం చేస్తూ హోమాన్ని చెయ్యడం సరైనది. శత్రుబాధ, అనారోగ్యపీడ తొలగుతాయి.

## 1033. ఆంజనేయ స్మరణవల్ల లాభాలు

**శ్లో.** బుద్ధిర్బలం యశో ధైర్యం నిర్భయత్వ మరోగతా ।
అజాడ్యం వాక్పటుత్వం చ హనుమత్ స్మరణాద్భవేత్॥

చక్కని ఆలోచనాన్ని సరైనవేళలో అందించగల బుద్ధీ, ఆ ఆలోచనాన్ని అమలు చేయగల మనోబలం అలా అమలు చేసి సత్ఫలితాన్ని సాధించినందు వల్ల చక్కని కీర్తీ, ఇలాంటి కీర్తిని సాధించిన కారణంగా మరో మంచిపనిని కూడా సాధించ గలమనే ధైర్యం, అలా ధైర్యంగా పనిని చేస్తున్నందువల్ల భయంలేనితనం – ఆంజనేయుణ్ణి స్మరిస్తూ చేస్తున్నందువల్ల శరీర రోగం రానితనం, మనసుకి ఏ విధమైన జడత్వం (నిస్పృహ-నిరాశా పద్ధతి) లేనితన, మనసు చురుకుగా ఉన్నందువల్ల మాటల్లో గట్టిదనం.... ఇవన్నీ మన స్ఫూర్తిగా ఆంజనేయుణ్ణి స్మరించినందు వల్ల లభిస్తాయి. ఆంజనేయుణ్ణి స్మరించినందువల్ల ఈ సత్ఫలితాలు కలుగుతాయనే పై శ్లోకాన్నే ఆంజనేయ స్తోత్రంగా చదివేస్తూంటారు అందరూ. ఈ శ్లోకం ఫలశ్రుతి (ఆంజనేయుణ్ణి స్మరించి నందువల్ల కలిగే ఫల – ప్రయోజనాలని, శ్రుతి – విన్పించేది) అన్నమాట.

## 1034. శుభస్తుతి


**శ్లో.** జలమధ్యే వరాహచ
పర్వతే రఘునందనమ్
గమనే వామనంచైవ
సర్వకార్యేషు మాధవమ్

నీటిలో దిగినప్పుడు 'వరాహ' అని, కొండలెక్కేటప్పుడు రఘునందన అని,

ప్రయాణాలలో వామన అని, ఏ పనినైనా చేసేటప్పుడు మాధవా అని స్మరిస్తే, ఆయా సమయాలలో కలిగే ప్రయాసలు తొలగిపోవడమేగాక, సమస్త శుభాలు కలుగుతాయి.

## 1035. దైవ సమానులు

**జ.** మానవజన్మని చరితార్థం చేసేది భక్తి ఒక్కటే. భక్తి అనేది జన్మ సంస్కారాన్ని బట్టి వస్తుంది. తెలీనివారు సాధనచేసి, స్సాంగత్యాన్ని బట్టి, భక్తి జ్ఞానాలు కలిగిన గ్రంథాలను చదివి, తెలుసుకోవచ్చు. లోకంలో ప్రతి ఒక్కరూ కొంతైనాభక్తిని కలిగే ఉంటారు. ఏ విధంగా అంటే – మాతృ భక్తి, పితృభక్తి, పతిభక్తి, దైవభక్తి, నీతి, ఓర్పు, సహనం ఇవన్నీ భక్తికే చెందు తాయి. కాబట్టి భక్తి అంటే తెలియని వారుండరు.ఎప్పుడు మనల్నిమనం భగవం తునికి అర్పణం చేసుకుంటామో అప్పటి నుండి ఆయనకు దాసులం. ఆయన



చెప్పుచేతల్లో ఉండవలసిన వారం. అనగా ఆయన సంకల్పం తెలుసుకుని, ప్రవర్తిం చడం ఆయనకు సంబంధించిన విష యాల్లో జీవితాన్ని గడపటం.భగవానుడి కృప కలిగినవారికి జన్మతహా భక్తి కుదురు తుంది. మీరాబాయి, సక్కుబాయి, ప్రహ్లా దుడు మొదలైన భక్తి శిఖామణులు పుట్టు కతోనే భక్తి అనే మహాధనాన్ని కలిగి వున్నారు. ఇహపర సాధనం భక్తే. సంసార మున కలిగే సర్వదుఃఖాల నుండి తరింప చేసేది భక్తే. భక్తికి సులభం కాని కార్యమే లేదు. భగవానుడు భక్తసులభుడని పేరు పొందింది అందుకే. ద్రౌపదికి తన మాన సంరక్షణ విషయంలో ఆమెను కాపాడింది ఆమె భక్తే. ఐదుగురు భర్తలున్నా కష్ట సమ యంలో ఆదుకోలేకపోయారు. హరిశ్చం ద్రుని సత్యదీక్షను ఆయన భక్తిగల హృద యమే కాపాడింది. సత్యభామ తన వద్ద ఉన్న సమస్త ఆభరణాలను, వెండి బంగా రాలను, అనేక మణులను వేసినా శ్రీకృష్ణుని తూచలేక పోయాయి. రుక్మిణీ దేవి ఒక్క తులసీదళాన్ని త్రాసున ఉంచ గానే ఆ జగన్నాథుడు తులసీ మహాత్మ్యంచే సరితూగాడు. ఇటువంటివారిని భగవంతు నితో సమానులని చెప్పినా తప్పులేదు.

## 1036. ఆత్మబోధ

**జ.** మనకు రెండు రకాలైన జ్ఞానాలు ఉన్నాయి. మొదటిది అజ్ఞానం వల్ల భాసించే జ్ఞానం. దీనినే మిధ్యా జ్ఞానం అని కూడా అంటారు. "నేను, నాది, నేను చేయు

చున్నాను, నేను చదువుతున్నాను, ఈ శరీరం నాది, ఈ ఆస్తులు నావి అనుకునే అహంకార, మమకార కర్తృత్వ భావమే దైతే మానవులలో సర్వసామాన్యంగా భాసిస్తూ ఉంటుందో అదే మిథ్యా జ్ఞానం. ఈ మిథ్యాజ్ఞానం కలగడానికి అజ్ఞానం లేదా అవిద్య కారణమై ఉంది. దీనినే ప్రకృతి వికారమగు విజ్ఞానకోశమని అంటారు. దీనివల్ల పరమాత్మయందు జీవత్వం కల్పించబడి మిథ్యాస్వరూపమైన దృశ్య ప్రపంచము గోచరిస్తూ సుఖదుఃఖాలను అనుభవించడం జరుగుతోంది. జీవుడికి అజ్ఞానంవలన కలిగిన దేహాత్మ బుద్ధి, అనగా నేనీ దేహాన్ని అనుకొనే భావం ఎప్పటినుండో ఒక పెద్ద విష వృక్షంగా పెరిగి ఉంది. 'నేను' అనే దేహాభిమానం వల్ల రజ, స్తమోగుణాలచే ఆవరింపబడ్డ జీవుడు ఉపాధి దోషాలచే సుఖదుఃఖాలు, రాగద్వేషాలు, క్షుత్పిపాసలు, రోగాలు, ముసలితనం, మరణం మొదలైన సకల సంసారపు సుడిలో చిక్కుకొంటున్నాడు. ఇదే జీవునికి కలిగిన అజ్ఞానపు మాలిన్యం. ఈ అజ్ఞానపు మాలిన్యాన్ని జ్ఞానమే పోగొట్టగలదు గాని, మరి దేనివల్లా సాధ్యం కాదు.

## 1037. దూతగా ఆంజనేయుడు


**జ.** దూతగా బాధ్యత నిర్వహించటం అంత సులభం కాదు. దౌత్యం ప్రదర్శించాలి. మాటలు ఆచి తూచి వాగాలి. అవసరాన్ని బట్టి ఎదురు తిరిగి ధైర్యసాహ



సాలు ప్రదర్శించాలి. లాభ, నష్టాల ప్రశ్న లేకుండా కొన్ని పనులు చేపట్టాలి. అందుకే దూతగా వ్యవహరించటానికి ఎవరూ త్వరగా అంగీకరించరు. భయపడే వారంతా ఆదర్శంగా తీసుకుని అనుసరించదగిన దూత హనుమంతుడు. పురాణాలలో దౌత్యం ఆయనతోనే ప్రారంభమైంది. సుగ్రీవుడి తరపున రామ, లక్ష్మణుల దగ్గరికి వెళ్ళాడు. వారెవరో తెలుసుకునేందుకు ఒక పద్ధతిలో మాట్లాడాడు. వారి శక్తి తెలుసుకున్న వెంటనే సుగ్రీవుడిని శ్రీరామునితో మైత్రికి సిద్ధం చేశాడు. ఆపైన రాముని దూతగా లంకకు బయలుదేరాడు. అక్కడ రాముని శక్తిని వర్ణించాడు. లొంగని రావణుడి లంకను దహనం చేశాడు. తన బలపరాక్రమాలను చూపిస్తూ స్వామి భక్తిని ప్రదర్శించాడు. అందుకే ఆంజనేయుడు అందరికీ ఆదర్శం.

## 1038. వేదవ్యాస స్తుతి

**జ.** జయతి పరాశర సూనుః
సత్యవతీ హృదయనందనో వ్యాసః
యేనాస్య కమల గళితం



వాఙ్మయ మమృతం జగత్ప్రబతి
నమోస్తుతే వ్యాస విశాలబుద్ధే
పుల్లార విందాయత పత్రనేత్ర
యేనత్వయా భారత తైలపూర్ణః
ప్రజ్వాలితో జ్ఞానమయ ప్రదీపః

సత్యవతీ పరాశర పుత్రుడు, సకల వాఙ్మయ సృష్టికర్త, విశాలమైన బుద్ధి కలిగిన వాడు విశాలమైన నేత్రములు కలిగినవాడు, కృష్ణద్వై పాయనుడనే పేరు కలిగినవాడు, అష్టాదశ పురాణాలను రాసిన వాడు, స్మృతికర్త, పంచమవేదమైన భారతాన్ని రాసినవాడు, పరిపూర్ణ జ్ఞానమయుడైన వ్యాసమహర్షికి నమస్కారం.

## 103బి. గురుపూజా మహోత్సవం

**జి.** ఆషాఢ శుద్ధ పూర్ణిమనే గురు పూర్ణిమ అంటారు. ఈ రోజునే దేశమంతా గురు పూజా మహోత్సవాన్ని జరుపుకుంటారు. గురువు అంటే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ఒక్కటై జన్మించిన రూపం. అనగా సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపమే ఈ గురువు. 'గు' శ్శబ్ద మంధకారస్య 'రు' తన్నిరోధకః అని పెద్దల సూక్తి. 'గు' అనగా అంధకారము. చీకటి అనగా అజ్ఞానము. 'రు' అంధకారాన్ని అనగా ఆ అజ్ఞానాన్ని నశింపచేసేవాడని అర్థం. వేదవ్యాసమహర్షి మానవ జాతికే గురువు. అందుకే ఆయన పేరిట వ్యాసపూర్ణిమ రోజున గురు పూర్ణిమగా పండుగ జరుపుకుంటున్నాం. శ్రీహరి అంశతో సత్యవతీ పరాశరులకు జన్మించిన కృష్ణద్వైపాయనుడే వ్యాసుడు. ఈ వ్యాసమహర్షి వల్లే కురువంశం అభివృద్ధి చెందింది. తల్లి కోరికపై అంబికకు ధృతరాష్ట్రుని, అంబాలికకు పాండురాజుని, అంబిక దాసికి విదురుని ప్రసాదించాడు. పాండవాగ్రజుడైన ధర్మరాజుకి ప్రతి స్మృతిని ఉపదేశించాడు వ్యాసుడు. దానిని ధర్మరాజు అర్జునునికి ఉపదేశించగా, అర్జునుడు దేవతలను మెప్పించి మహామహిమాన్వితమైన అస్త్రశస్త్రాలను పొందాడు. కురుపాండవ సంగ్రామం జరిగినప్పుడు గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రునికి మరణించిన వారందరి పూర్వ జన్మముల గురించి తెలియ జేశాడు వ్యాసభగవానుడు. కురుపాండవ చరిత్ర ఖ్యాతిగాంచే విధంగా వ్యాసుడు మూడు సంవత్సరాలపాటు శ్రమించి 'జయం' అనే పేరు మీద వారి గాథలను గ్రంథస్థం చేశాడు. ఆ జయమే ఆ తరువాత మహాభారతమైంది. వ్యాసుడు అష్టాదశ పురాణాలను రాశాడు. భాగవతాన్ని రచించాడు. వేదాలను నాలుగు భాగాలుగా విభజించి

పైలుడనే శిష్యునికి ఋగ్వేదమును, వైశంపాయనుడనే శిష్యునికి యజుర్వే దాన్ని, జైమిని అనే శిష్యుడికి సామ వేదాన్ని, సుమంతుడనే శిష్యునికి అధర్వణ వేదాన్ని తెలియజేసి వ్యాప్తి చేయించాడు. తాను రాసిన పురాణేతి హాసాలు ప్రచారం చేయమని సుతునికి అన్నీ తెలియజేశాడు. పరమేశ్వరుని అనుగ్రహంతో వ్యాసుడికి ఒక పుత్రుడు కలిగాడు. ఓ రోజు వ్యాసుడు తన ఆశ్రమంలో అరణి మధించుచుం డగా ఘృతాచి అనే అప్సరస కనబడింది. వ్యాసుడు చలించాడు. వీర్యస్ఖలనం కాగా అందుండి శుకుడు జన్మించాడు. శుకుడికి వ్యాసుడు దివ్యబోధలు చేశాడు. సృష్టి క్రమం వివరించాడు. యుగధర్మాలు, వర్ణాశ్రమ ధర్మాలు తెలియజేశాడు. తండ్రి వద్ద ఎన్నో ధర్మ రహస్యాలు తెలుసుకొని జ్ఞాని అయ్యాడు శుకుడు. ప్రాచీన గాథలూ, గత కల్పాలలో జరిగినచరిత్ర, సృష్టికి పూర్వం అనేక సృష్టుల్లో జరిగిన విశ్వం యొక్క పూర్వ వృత్తాంతం ఇలాంటి వన్నీ కూడా పురాణాల్లో గూఢంగా నిహితం చేయబడి ఉన్నాయి. ఎవరు వీటిని మానవ జాతికి అంతరార్థాలతో బోధించి చెప్పా లన్నా, లేదా వారికి వారు అర్థం చేసు కోవాలన్నా, దానికి వ్యాస మహర్షి అను గ్రహం అవశ్యం. అవసరం. వ్యాసాంశం లేనిదే ఈ పురాణగాథల్ని ఎవరూ విప్పి చెప్పలేరు. అందుచేత వ్యాస పూజను చేసి ఒక పౌరాణికుణ్ణి గౌరవించి, ధూప దీప నైవేద్యాలతో పూజించి, ఆయన్ని వ్యాస స్వరూపంగా భావించి పూజిస్తారు. ఇదే 'గురుపూజ'. బౌద్ధులకు వైశాఖ పూర్ణిమ ఎటువంటి పవిత్రమైన రోజో ఈ ఆషాఢ పూర్ణిమ 'వ్యాసపూర్ణిమ'గా లేక 'గురు పూర్ణిమ'గా మనందరికీ కూడా అంత ముఖ్యమయిన రోజుగా మిగిలి పోయింది.

## 1040. జ్ఞాన జ్యోతి

**జ.** గురువు చేయవలసిన పని తన శిష్యు లను అంధకారంలో నుంచి వెలుగులోకి తీసుకొనిపోవడం. ఈ భౌతిక జగత్తులో ఏ మానవుడూ సంసార యాతనలు అనుభవించకుండా చూడడం ఆ గురువు కర్తవ్యం. నేను యాతనలు అనుభవిం చడంలేదు అని ఎవ్వరూ అనలేదు. అది సాధ్యం కాదు. ఈ భౌతిక జగత్తులో మూడు విధాలైన యాతనలున్నాయి. ఆధ్యాత్మిక యాతన, ఆది భౌతికయాతన, ఆదిదైవిక యాతన.



ఇవి భౌతికమైన దేహంవల్ల, మనస్సు వల్ల కలిగే యాతనలూ, ఇతర జీవులవల్ల కలిగే యాతనలూ, ప్రకృతి శక్తుల వల్ల కలిగే యాతనలూ. మనస్తాపం వల్ల మనం బాధపడవచ్చు. చీమలు, దోమలు,

ఈగలు వంటి ఇతర ప్రాణుల వల్ల మనకు చికాకు కలగవచ్చు. లేదా అతీతమైన ఏదో శక్తి మనకు యాతనలను కలిగించవచ్చు. వర్షాలు పడకపోవడం వల్లనో, వరదలవల్లనో ముప్పు ఏర్పడ వచ్చు. తీవ్రమైన ఉష్ణోగ్రత వల్లకాని, ఎముకలు కొరికే చలివల్ల కాని మనం బాధపడ వచ్చు. ఇలాంటి ఎన్నో యాతనలను మనకు ప్రకృతి కలిగిస్తుంది. అందు చేత ఈ విధంగా మూడు విధాలైన యాతనలు మనకు భౌతిక జగత్తులో ఎదురవుతున్నాయి. ప్రతి వ్యక్తి ఈ మూడింటి వల్లగాని, లేదా వానిలో ఏ ఒకటి రెండింటి వల్లనోగాని బాధపడుతూనే వున్నాడు. 'నాకు ఎలాంటి యాతనలూ లేవ'ని ఎవ్వడూ చెప్పుకోలేడు. ఇప్పుడు మనకొక ప్రశ్న ఎదురవుతుంది – 'ప్రాణులు ఎందుకు ఇలా బాధపడుతున్నాయి' అని. దానికి జవాబు 'అజ్ఞానంవల్ల' అని. 'నేను తప్పులు చేస్తున్నాను. అందుకే ఇలా బాధ పడుతున్నాన'ని మానవుడు గుర్తించడంలేదు. చీకట్లో వున్న వాడిని ఎలా కాపాడగలం. అతనికి దీపం చూపించడం ద్వారానే గదా! గురువు జ్ఞానం అనే గొప్ప జ్యోతితో చీకటిలో చిక్కుపడ్డ జీవులకు దారి చూపుతాడు. ఆ జ్ఞానజ్యోతి అజ్ఞానాంధ కారం వల్ల కలిగే ప్రజల యాతనలను రూపు మాపుతుంది.

## 1041. శ్యామలాదేవి స్తుతి

**జ.** శుకవీణాలత్పాణీం శుద్ధ విద్యాం వశంకరీం



శ్యామాం నీపవనాంతస్థాం వన్దే సంగీతయోగినీమ్॥

వీణతో, ముంజేత చిలుకతో ఒప్పారే శుద్ధ విద్యాస్వరూపిణి, కదంబవనవాసిని, సంగీతయోగిని అయిన శ్యామలాదేవికి నమస్కారం.


## 1042. శిల్ప తపస్సు

**జ.** సత్యమే మనుష్యునిలోని అంతః ప్రకాశం. ఈ సత్యం గురించి ఉపనిషత్తులలో ఈ విధంగా చెప్పబడి ఉంది – 'ఆత్మవత్ సర్వభూతేషు యః పశ్యతి సపశ్యతి' ఎవరు సర్వజీవులను తమతో సమానభావంతో చూస్తారో వారే సత్యం తెలిసినవారు అవుతారు. ఎవరు తమ ఆంతర్యంలో సత్యాన్ని ఈ రీతిగా అనుభూత మొనర్చుకుంటారో అట్టివారిలో మనుష్యత్వం ప్రకాశమానమవుతుంది. వారు తమ మానవత్వ మహత్వంవల్ల దేదీప్యమానులవు తున్నారు.

యస్తు సర్వాణి భూతాని ఆత్మనే వ్యానుపశ్యతి

సర్వభూతేషు చాత్మానం తతోన విజుగుప్సతి

అందరియందు తనను, తనలో అందరిని ఎవడు దర్శింపగల్గునో అట్టివాడు గోప్యంగా ఉండలేడు. సార్వకాలికమగు కాంతితో అతడు వెలుగొందుతాడు. అట్టి మానవత్వ ప్రకాశం ఈనాడు జగత్తున అధిక సంఖ్యాకులలో ఆవృతమై ఉంది. కొంచెం కొంచెంగా మాత్రమే పైకి కనిపిస్తూ, అధికాంశము మరుగైపోయి ఉంది. విశ్వసృష్టి జరిగిన ఆదియుగంలో భూమండల మంతా దట్టమగు ఆవిరి తెరతో కప్పబడి ఉండేది. మనుష్యుని సృష్టి ఈనాటి వరకు ఇంకా అసంపూర్ణ స్థితిలోనే ఉంది, స్వప్రకాశితుడగు ఒకానొక మహాపురుషుడు మనఎదుట హఠాత్తుగా ఆవిర్భూతం కావడం ద్వారా తప్ప. ఈ అసంపూర్ణ మానవత్వపు నిబిడావరణంలో మనకు మానవుని గూర్చిన ఎరుక ఏ విధంగా కలుగుతుంది? బుద్ధభగవానునిలో మనుష్యుని యొక్క సత్య స్వరూపం దేదీప్యమానం కావడం ద్వారా మానవ లోకానికి అటువంటి మహాభాగ్యం కలిగింది. అతడు తన విశాల హృదయ భాగంలోకి సర్వమానవ లోకమును గ్రహించుకొని చూసి ఉన్నాడు. "తతోన విజిగుప్సతే' ఇక ఆయన్ని గోప్యంగా ఉంచేదెట్లా? దేశకాల సంబంధమైన ఏ ప్రదేశంలో ఆయన్ని బంధించి ఉంచ గలం? సద్యః ప్రయోజన సిద్ధిని ఆశించే విప్రలుబ్ధ భావంతో ఆతనిని కప్పి పుచ్చగలం? బుద్ధభగవానుడు తపోవేదిక నుంచి లేచినంతనే స్వప్రకాశ ప్రసారణ




మొనర్చి ఉన్నాడు. ఆయన యొక్క ఆ స్వప్రకాశాలోకంలో భరతవర్షమంతా సత్యదీప్తితో వెలుగొందినది. మానవ చరితల్లో సంఘటితమైన ఆయన చిరంతనా విర్భావము, భారతవర్షపు భౌతికమైన ఎల్లలను దాటి, దేశదేశాంతరములకు వ్యాపించినది. సర్వదేశములు భారత వర్షమును తీర్థస్థలంగా స్వీకరించినవి. బుద్ధుని ప్రబోధ ప్రభావంవల్ల ఆనాటి భారత వర్షం సర్వమానవకోటిని తనలోనికి స్వీకరించింది. సత్యమనే ఉప్పెనలు వర్ణ బేధమనే తెప్పను కొట్టుకొనిపోక విడిచి పుచ్చినది. భారతదేశపు పిలుపు సర్వ దేశములకు, సర్వజాతులకు చేరుకున్నది. అమోఘమైన సత్యవాణిని చేరుకునేందుకు దుస్తర గిరి సముద్రములు వైదొలగి దారి వదిలాయి. దూరదూరములలో నుండే వారు మానవులు "అదిగో, మనుష్యుడొకడు స్వప్రకాశితుడైనాడు. దర్శించితిమి. మహాన్తం పురుషం తమసః పరస్తాత్" అని

అనుకోసాగిరి. ఈ మాట మరుప్రాంత ములలోని శిలామూర్తులలో అక్షయ రూపములను దాల్చినది. అద్భుత మగు పూనికతో మానవులు తమ బుద్ధా రాధనా భావమును శిల్పమూర్తులలో, చిత్ర లేఖ నములలో, స్థూపాకృతులలో రచన చేయ సాగిరి. శిల్పప్రతిభ సముద్రములను దాటి అపురూప శిల్పసంపద్రచన చేసినది. శిల్పకారులు తమ నామములను రహ స్యంగా ఉంచి 'బుద్ధం శరణం గచ్ఛామి' అను మంత్రమొక్కటి మాత్రమే శాశ్వత కాలమునకు సమర్పించి పోయారు. యవ ద్వీపమందలి బరోబుదూరు వద్దనున్న మహాస్థూపము చుట్టూ, బుద్ధుని గూర్చిన జాతకకథలలోని అంశములను వర్ణిస్తూ చెక్కబడిన వందలకొలది శిల్ప మూర్తు లను నేను చూసి ఉన్నాను. అందలి ప్రతి దానిలోనూ శిల్పకౌశలోత్కర్ష గోచరించి నది. అందులో ఎక్కడా కొంచమైనా అల సత్వం కాని, అశ్రద్ధ కాని కనిపించ లేదు. దీనినే శిల్ప తపస్సని అంటారు. ఇది ఏక స్వరూపుని గూర్చిన భక్తిభావ పురస్సర మగు తపస్సు. అంటే కీర్తి, లాభం లేని నిష్కామ వ్రతసాధన ద్వారా తమలోని శ్రేష్ఠ శక్తిని, చిరస్మరణీయుడు, చిరవరణీయుడు అగు వాని పేర అంకిత మొనర్చుటయే.

## 1043. అహం తొలగించేది భక్తి

**జ.** భగవంతుని చేరటంలో మనిషికి అడ్డు అతని అహం. నిజమైన భక్తుడు అహంకారం ప్రదర్శించడు. తాను అందు కున్నది భగవాన్ ప్రసాదం అంటాడు. తనకు కలిగే కష్టాలను భగవంతుని లీలగానే స్వీకరిస్తాడు. అది అసలు సిస లైన భక్తుడి తీరు. అయితే దీనికి భిన్నంగా కొందరు భక్తులలో అహంకారం తీవ్ర స్థాయిలో ఉంటుంది. ఆ అహంకారమే వారి పతనానికి దారితీస్తుంది. ఎన్నో మంచి గుణాలుంటాయి. భక్తి, దాన గుణం, శౌర్యం వగైరాలుంటాయి. కాని భగవం తుని ప్రశ్నిస్తారు. ఆ అనంతమూర్తిని అంగీకరించరు. ఫలితంగా వారి అహం వారిని భగవంతునితో ఘర్షణకు తీసుకు వెళుతుంది. రాక్షస రాజులందరి కథ ఇదే. రావణుడు, హిరణ్యకశిపుడు, బలి వంటి వారందరిలోని అహం అణచటానికే శ్రీమహావిష్ణువు వివిధ అవతారాలు ధరించి రావాల్సి వచ్చింది. శ్రీమహా విష్ణువు చేతిలో జీవితం చాలించే సమ



యంలో కాని వారు తమ అహంకారం గురించి అర్థంచేసుకుని, ఆయన పాదా లపై మోకరిల్లారు. అందుకే భక్తులు ఆరంభంలోనే అహం వదిలితే జీవితం ఆనందమయంగా గడుస్తుంది.

## 1044. దేవదేవ స్తుతి

**జి.** త్వమేవ మాతాచ పితాత్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖాత్వమేవ ।
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమదేవ దేవ ॥

తల్లివి, తండ్రివి నీవే. చుట్టానివి, మిత్రునివి నీవే. విద్యవు, ధనానివి నీవే. సర్వస్వం నీవే. నీవే నా దేవదేవుడివి. అట్టి నీకు నమస్కారం.

## 1045. మనల్ని రక్షించేది

**జి.** అనేకమంది చెబుతుంటారు. పూజకు కూర్చున్నప్పుడు మనసు నిలవడంలేదు, ఎక్కడెక్కడికో పరిగెడుతూ వుంది. ఏదో యాంత్రికంగా పూజ, పునస్కారం చేస్తున్నాం అని. అభ్యాసంతోనే మనస్సును కేంద్రీకరించుకోవాలి. ఆ పూజా, ఆ జపం సమయంలో మనస్సును అన్యత్రా పోకుండా కట్టిపెట్టుకోవాలి. ఇది కష్ట సాధ్యమే కాని, అసంభవమైనది ఏ మాత్రం కాదు.

'అచంచలం మహాబాహో మనో దుర్నిగ్రహం చలం' అని భగవానుడు చెప్పి – 'అభ్యాసేనా', 'వైరాగ్యేన' అని, ఈ మనస్సును అదుపులో పెట్టుకొమ్మని ఆదేశించాడు. అందువల్ల మనం ధర్మాన్ని రక్షించడం అనే మాటకు శ్రద్ధతో ధర్మాన్ని ఆచరించడం అనేదే అర్థం. అప్పుడు ధర్మం మనల్ని రక్షిస్తుంది. మనం ఆచరిస్తున్నటువంటి ధర్మంవల్ల మనం సుఖాన్ని పొందగలుగుతాం. మనం ఈ రోజున ఏ మాత్రమైనా సుఖంగా వున్నామూ అంటే అది మనం పూర్వజన్మలో చేసిన ధర్మానుష్టానికి



ఫలం అన్న మాట. దీంట్లో ఏ మాత్రం నంశయానికి ఆస్కారం లేదని గ్రహించండి. 'పుణ్యోహవై పుణ్యేన కర్మణా భవతి; పాపః పాపేన' అని శాస్త్రం చెబుతోంది. క్రితం జన్మలో బాగా ధర్మాన్ని అనుష్టించాం, ఇప్పుడు సుఖంగా ఉన్నాం. ఇప్పుడే మన్నా దుఃఖాన్ని అనుభవిస్తున్నామంటే అది మనం క్రితం జన్మలో చేసిన అధర్మానికి ఫలం. అనేకమంది కష్టం వచ్చినప్పుడు భగవంతుణ్ణి నిందిస్తారు. నేనింత కష్టపడుతూ ఉంటే చూస్తూ వూరికే కూర్చుని వున్నాడే మరి ఆయనా ఒక భగవంతుడంటారా? ఆయనకు దయ ఉన్నదంటారా? అని – నీవు చేసిన దానికి ఫలం తగినట్లుగా ఆయనిస్తుంటే ఆయన్నెందుకయ్యా నిందిస్తావు? శాస్త్రీయులన్నా రొకచోట ఈ విధంగా.

పాక్కృత భోగావసరే తామ్యసి చేతో ముదా కుతోహేతోః!

న్యగ్రోధ బీజముప్త్వా శోచన్నివ నామ్రమస్యేతి'

ఒకడు మామిడిపళ్ళు కావాలను కొన్నాడు. మఱ్ఱి విత్తనాలు నాటాడు. అది పెద్ద వటవృక్షమైందే కాని, దాంట్లో

మామిడిపండ్లు కనబడలేదు. వృక్షం మటుకు చాలా పెద్దదైంది. ఊడలు కూడా దిగి వున్నాయి. కాని తాను అనుకొన్న మామిడిపండ్లు మాత్రం ఆ వృక్షం నుంచి రాలేదు. మామిడి పండ్లు నీకు కావాలంటే మళ్లీ విత్తనాలు తెచ్చి ఎక్కడైనా నాటుతార టయ్యా! అలాగే నీవు పూర్వజన్మలో అధ ర్మాన్నిచేసి, దానికి ఫలంగా ఇవాళ దుఃఖం వస్తే అందుకు నీవు ఈశ్వరుడ్ని నింది స్తావేమిటి? ఆయనేం చేస్తాడు? నీవు చేసి నటువంటి అధర్మానికి అనుగుణమైన ఫలం ఆయన ఇచ్చే తీరాలి. ఒకడు పెద్ద నేరం చేశాడు. దానికి అనుగుణమై నటువంటి శిక్షను న్యాయాధీశుడు ఇచ్చాడు. మనం ఇవతలకు వచ్చి ఆ న్యాయాధీశుడ్ని తిడుతూ కూర్చుంటే ఏమవుతుంది?

ఆయనకు నీ మీద రాగం లేదు, ద్వేషం లేదు. నీవు చేసింది ఫలానా నేరం. ఆ నేరానికి ఫలానా శిక్ష అని రాసి వుంది చట్టంలో. దాని ప్రకారం ఆయన శిక్ష ఇచ్చాడు. నీవు ఆయన్ని నిందించాల్సిన పనిలేదు. నీకు కాస్త వివేకం వుంటే నువ్వు ఆ తప్పు చేయకుండా ఉంటే బాగుండేది. ఆ తప్పేమో మరి చేయనే చేశావు. ఇప్పుడు తదనుగుణమైన శిక్షను న్యాయా ధీశుడిస్తే నువ్వు ఆయన్ని నిందిస్తావా? అటువంటి శిక్ష నీకు రాకూడదనే వివేకం నీకున్నట్లయితే ఆ పని నువ్వు చేయ రాదుగా. ఇతఃపరం అన్నా ఆ తప్పు చెయ్యకుండా ఉండు. నీకు ఇతఃపరంలో ఆ శిక్షరాదు. ఇప్పుడు వచ్చిన శిక్ష ఎట్లాగో అనుభవించి తీరాలి. 'ధర్మం మనల్ని రక్షి స్తుంది' అనే మాటకు అర్థం శ్రద్ధతో అను ష్ఠించినటువంటి ధర్మం మనకు సుఖాన్ని ప్రసాదిస్తుంది. అలాంటి ధర్మాన్ని మనం హింసించడము అనంటే ఆ ధర్మాన్ని మనం అనుష్ఠించకపోవడమే. దానివల్ల మనకి హింస కలుగుతుందీ అంటే, మనం ఆ ధర్మాన్ని వదిలిపెట్టడం వల్ల మనకు వచ్చేటువంటి బాధ, దుఃఖం, ఈ సత్యాన్ని మనసుల్లో ఉంచుకొని, ఎట్టి పరి స్థితులలో కూడా మనిషి తన యొక్క స్వధర్మమేదైతే ఉన్నదో దాన్ని వదిలిపెట్ట కూడదు అని మన యొక్క ప్రాచీనులు సెలవిచ్చారు.

## 1046. ధైర్యమే ఆయుధం

**ఐ.** ఎండాకాలంలో అడవిలోని కుందే ళ్ళన్నీ రేగు పొదల్లో సమావేశమయ్యాయి. ఆ కాలంలో పంటలు లేక ప్రకృతి జంతు వులన్నీ అల్లల్లాడుతున్నాయి. చిన్న జంతు వులన్నీ పెద్ద జంతువులకు ఆహారమౌతు న్నాయ్. కుక్కలు అడవిలో సంచారం చెయ్యడం మొదలుపెట్టాయ్ కుందేళ్ళ

artist

కోసం. అందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాయ్. ఆ కుందేళ్ళలో ఒకటి ఇలా అంది – "బ్రహ్మదేవుడు మనకు సున్నితమైన చిన్న రూపాన్నిచ్చాడు. దుప్పులకిచ్చి నట్లు కొమ్ముల్ని ఇవ్వలేదు. మన మీద ఎవరైనా దాడిచేస్తే పారిపోవడం తప్ప మనకేది దారి. దేవుడు కష్టాలన్నీ మన మీదే పడేశాడు" అంటూ వాపోయింది. వెంటనే మరో కుందేలు ఇలా అంది. "ఈ కష్టాలు నిత్య గండాల తోనే పడలేను. హాయిగా అదిగో ఆ కనబడే చెరువులో దూకడం ఉత్తమం" అంది. మిగతా కుందేళ్ళన్నీ "బతికి నంత కాలం కలిసే బతికాం. చనిపోయేటట్లయితే అంతే కలిసే చద్దాం" అనేసి చావడానికై దగ్గరలో వున్న చెరువుకేసి బయల్దేరాయి. అదే సమయానికి లెక్కలేనన్ని కప్పలు చెరువు కట్టపై కూర్చుని కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నాయి. కుందేళ్ళన్నీ ఓ మందగా చెరువుకేసి రావడంతో భయపడిన కప్పలన్నీ చప్పున నీళ్ళలోకి దూకేశాయి. అది చూసిన ఓ కుందేలు, 'శభాష్. మనం చనిపోవాల్సిన పనేలేదు. దైవం సృష్టిలో మనకంటే అల్పమైనవి, మనల్ని చూసి భయపడేవి కూడా వున్నాయి'. అవి బతగ్గా లేనిది, మనం బతకలేమా? రండి హాయిగా జీవించేద్దాం అనేసరికి కుందేళ్ళన్నీ 'నిజమే' కదా అంటూ తమ ఆత్మహత్యా ప్రయత్నాన్ని విరమించుకుని వెనక్కి మళ్ళిపోయాయి. కష్టాలు వస్తుంటాయి. అయితే మనకంటే కష్టాలు పడేవాళ్లూ ఉన్నారు. మనకంటే పేదవాళ్ళు, అనారోగ్యవంతులు ఎందరో ఉంటారు, వాళ్ళకంటే మనమే నయమనుకుని ధైర్యంగా బతికేయాలి. ధైర్యమనే ఆయుధం మన వెంట ఉంటే మనకేం భయంలేదు కదా!

## *1047. శ్రీ లక్ష్మీనృసింహ స్తుతి*

**ఐ.** శ్రీమత్పయోనిధి నికేతన చక్రపాణీ ।
భోగీంద్ర భోగమణి రాజిత పుణ్యమూర్తే।
యోగీశ శాశ్వత । శరణ్య । భవాబ్దిపోత।
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్ ॥

శ్రీ లక్ష్మీ నృసింహమూర్తీ! లక్ష్మీ సంపన్నమైన పాల సముద్రం నీకు నివాసం! నీవు చక్రపాణివి! ఆదిశేషుని పడగల మణులచే నీ పావన దేహం మెరుస్తూ వుంటుంది. నీవు యోగీశుడవు!



శాశ్వతుడవు! రక్షకుడవు! సంసార సముద్రాన్ని దాటించే నౌకవు! స్వామీ! నాకు చేయూత నివ్వు!

**నారసింహా నమోనమో :**

దుష్టశిక్షణ, శిష్ట రక్షణకోసం శ్రీమహావిష్ణువు అనేక అవతారాలు ఎత్తినట్లు మన

పురాణాలు వెల్లడిస్తూ వున్నాయి. అలాంటి అవతారాల్లో నాల్గవ అవతారం 'నృసింహావతారం'. సింహం తల, మానవ శరీరం రెండూ కలవడం వల్ల నృసింహావతారం అయింది. ఈ క్షేత్రాలలో నరసింహ స్వామి వివిధ పేర్లతో... వివిధ రూపాలతో కొలువుదీరి వున్నాడు. ఒకసారి బ్రహ్మ మానసపుత్రులైన సనక, సనందన సనత్కుమార, సనత్సు జాతులు శ్రీమహావిష్ణువు దర్శనానికి వైకుంఠానికి వెళ్ళినపుడు.... ద్వారపాలకులైన జయ విజయులు అడ్డగించారు. ఆగ్రహించి నవారు మూడు జన్మలు రాక్షసులుగా శ్రీమహావిష్ణువుకు విరోధులై జన్మించమని జయ విజయులను శపించారు. ఈ శాపం కారణంగా జయవిజయులు మొదటి జన్మలో హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగాను, రెండవ జన్మలో రావణ, కుంభకర్ణులుగానూ, మూడవ జన్మలో శిశుపాల, దంతవక్రులుగానూ జన్మించడం జరిగింది. ఈ విధంగా రాక్షసులుగా, శ్రీమహావిష్ణువు విరోధులుగా జన్మించారు. రాక్షసులంటే ప్రజా కంటకులేకదా! మరి వీరి అంతానికి శ్రీహరి ఉద్ధరించాల్సిందే కదా! హిరణ్యాక్ష హిరణ్యకశిపులు బ్రహ్మదేవుని చేత అనేక వరాలను పొంది లోకాలన్నింటినీ పీడించసాగారు. శ్రీ మహావిష్ణువు యజ్ఞ వరాహావతారం ఎత్తి తన కోరలతో హిరణ్యాక్షుడిని వధించాడు. హిరణ్యాక్షుడిని సంహరించడంతో శ్రీహరిపై ప్రతీకారం సాధించేందుకు హిరణ్యకశిపుడు వింధ్యపర్వతంపై



తపస్సు చేసి బ్రహ్మనుంచి వరం పొందాడు. దీని ప్రకారం ప్రాణులచేత గానీ, ఆయుధాల చేతగానీ, భూమి, ఆకాశాల్లోగానీ, పర్వతాలపైగానీ, పగలు, రాత్రిగానీ తనకు చావులేకుండా వరం పొందాడు. ఈ వర గర్వంతో హిరణ్యకశిపుడు ముల్లోకాలను స్వాధీనం చేసుకున్నాడు. శ్రీహరిని వధించడానికి సిద్ధమయ్యాడు. అలాంటి హిరణ్యకశిపుడికి నల్గురు కొడుకులు. వారిలో పెద్దవాడు ప్రహ్లాదుడు. చిన్నతనం నుంచి హరిభక్తుడు. ఇది సహించలేని హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడిని చంపేందుకు సకల యత్నాలు చేశాడు. ఫలించలేదు. నీ శ్రీహరి ఎక్కడున్నాడో చూపించమని హుంకరించాడు. అందుకు ప్రహ్లాదుడు శ్రీహరి ఎక్కడ పడితే అక్కడే వున్నాడని

సమాధానం ఇచ్చాడు. అయితే ఈ స్తంభంలో చూపమని గదతో స్తంభంపై కొట్టగా అందులోంచి శ్రీహరి వచ్చి, పగలు, రాత్రి కాని సంధ్యాసమయంలో భూమిపై, ఆకాశంపైకాక గడపపైన కూర్చొని, మృగ, నరలక్షణాలున్న శ్రీహరి హిరణ్య కశిపుడి ఉదరాన్ని చీల్చి సంహరించాడు. ఈ విధంగా నృసింహావతార ఆవిర్భావం జరిగింది. ఆ పుణ్యదినమే నృసింహ జయంతి. వైశాఖశుద్ధ చతుర్దశిని నర సింహ జయంతిగా జరుపుకుంటారు. హిరణ్యకశిపుడిని సంహరించడంకోసం ఆవిర్భవించిన నరసింహస్వామి కొన్ని చోట్ల శాంతమూర్తిగా, మరికొన్ని చోట్ల ఉగ్రమూర్తిగా, కొన్నిచోట్ల లక్ష్మీ సమేతుడుగా... మరికొన్ని చోట్ల చెంచులక్ష్మీ సమేతుడుగా కొలువుదీరాడు.

## 1048. తొలి తెలుగు వాగ్గేయకారుడు

**జ.** పరమాత్మను కీర్తించిన నా నాలుక, పరులను కీర్తించలేదని తనకాశ్రయ మిచ్చిన రాజునే ఎదురించిన మహాను భావుడు అన్నమాచార్యుడు. అంతటి గొప్పవాడైన ఆ పద కవితా పితా మహుడు సంకీర్తనా చార్యుడైన అన్న మయ్య మొత్తం 32 వేల కీర్తనలను, 12 శతకాలు పద్యాలు, ద్విపద రామా యణము, శృంగార మంజరి, వేంకటేశ్వర మహాత్మ్యము మొదలైన సహస్రాది రచ నలు చేసి, స్వరపరచి గానం చేయడ మంటే అదంతా ఆ శ్రీ వేంకటేశుని కృపే.



శ్రీవేంకటేశ్వరుని నందకము (ఖడ్గము) అన్నమయ్యగా అవతరించి వాగ్గేయకార సంప్రదాయానికి బీజం వేసింది. వాగ్గేయ కారుడంటే పాటలు స్వయంగా రాసి పాడే వాడని అర్థం. అన్నమయ్య మేలుకొలుపు పాట పాడుతుంటే విని నిద్రలేచేవాడట ఆ శ్రీనివాసుడు. మళ్ళీ ఆయన జోల పాడితేనే నిద్రపోయేవాడట. స్వామికే కాదు, అమ్మవారికి కూడా అన్నమా చార్యుల వారి పాటలంటే ఇష్టం. ఆయన పాడుతుంటే అలమేలు మంగమ్మ ఆనం దంతో నాట్యం చేసేదిట. 1424 క్రోధి సంవత్సరం వైశాఖమాసం విశాఖ నక్షత్రం అన్నమాచార్యుల వారి పుట్టినరోజు. ఆ రోజు స్వామిని దర్శించేందుకు తిరు మలకు వెళ్ళాడు. ఆ రాత్రి వరాహస్వామి గుడి పక్కన వున్న మండపంలో కూర్చోగా ఓ కొత్త కీర్తన ఆయన గళంనుండి ఉద్భ వించింది. 'బ్రహ్మ కడిగిన పాదము, బ్రహ్మము తానే నీ పాదమూ.....' అంటూ కీర్తించగా ఆ వేంకటేశ్వరస్వామి వారి

సాక్షాత్కారం అన్నమయ్యకు లభించింది. 'రోజుకొక కీర్తన చొప్పున పాడి సంకీర్తనా యజ్ఞాన్ని నిర్వహించ'మని స్వామి ఆదే శించగా ఆనాటి నుండి అన్నమయ్య కీర్త నలు బహుళ ప్రాచుర్యంలోకొచ్చాయి. 'గొబ్బిళ్ళు, కోలాటం, జాతర, తందనాన, ఛాంగుభళా మోగూగు, యక్షగానం, వీధి నాటకం మొదలైన జానపద కళా రూపాలను ముందు తరాలకు అందించి, ఈనాటికీ మన సమాజంలో, మన గ్రామాలలో సజీవంగా నిలిచిపోవడానికి బీజాలను కొన్ని వందల సంవత్సరాల క్రితమే సుక్షేత్రమైన ఈ భూమిలో నాటిన ఘనత అన్నమాచార్యుల వారిదే.

'నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే అండనేబంటు నిద్ర అదియు నొకటే, మెండైన బ్రాహ్మణుని మెట్టు భూమి యొకటే, ఛండాలు డుండేటి సరి భూమి యొకటే...' అంటూ సమానత్వం, మానవత్వాల గురించి ఏనాడో చెప్పిన అన్నమయ్యకు ప్రతి ఒక్కరూ నమస్కరించి ధన్యత చెందవల్సిందే.

## 1049. శ్రీ సత్యనారాయణ స్వామి స్తుతి

**ఐ.** సత్యనారాయణం దేవం వందేహం కామదం ప్రభుం లీలయా వితతం విశ్వం యేన తస్మై నమోనమః

సమస్త కోరికలకు ప్రభువైనటు వంటి వాడునూ, తనయొక్క లీలామాత్రము చేతనే సమస్త విశ్వమును వ్యాపించిన వాడునూ అగు దేవదేవుడైన సత్య నారాయణ స్వామికి నమోవాకముల ర్పిస్తూ వందనము చేయుచున్నాను.

## 1050. శ్రీ సత్యనారాయణ వ్రత వైశిష్ట్యము

**ఐ.** ఒకానొకప్పుడు నైమిశా రణ్య మందున్న శౌనకాది ఋషీశ్వరులందరూ కూడ సమావేశమై ఏదైనా వ్రతము చేతగాని, తపస్సు చేత గాని మనుష్యుల వాంఛితఫలములు నెరవేరునని సమస్త పురాణములు తెల్సినవాడు, మహాను



భావుడు అగు సూత మహామునిని అడు గగా –"పూర్వకాలమున ఈ విషయమునే నారద మహాముని శ్రీ మహావిష్ణువును అడిగినాడు. ఆ ఉపదేశము మీకునూ వివరిస్తాను".

ఒకసారి నారద మహాముని లోకాను గ్రహకాంక్షచేత సర్వలోకములు తిరు గుచూ భూలోకానికి వచ్చి, భూలోకంలో ప్రజలు పడుచున్న కష్టనష్టములను, అనేక యోనులందు పుట్టుచు అనేక జన్మలను ఎత్తుచు దుఃఖముతో కూడి వారు చేయు పాపకార్యములను చూచి, ఈ ప్రజ

లందరూ ఏ విధంగా తరించెదరని నారదుడు వైకుంతమునకు వెళ్ళి శ్రీ మహావిష్ణువును అడుగగా దానికి శ్రీమహావిష్ణువు మంచిప్రశ్న వేసినావు అని సంతోషించి– 'మహాపుణ్యప్రదము, స్వర్గ మర్త్య లోకములలో దుర్లభము అయిన శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతమొకటి కలదు. దానిని నీయందున్న ప్రేమతో చెబుతాను. ఈ వ్రతమును చేసిన భక్తజనులు ఈ లోకంలో సద్యఃకాలమందే సమస్త సుఖములు అనుభవించి అంత్యమందు మోక్షమును పొందుదురు. ఇహలోక, పరలోక సౌఖ్యములను అనుభవించి ముక్తి నొందగలరు. ఈ వ్రతమును ఆచరించుటచేత దుఃఖశోకముల నశించును. ధనధాన్య సంపత్తులు కలుగును. స్త్రీలు సౌభాగ్యము నిచ్చును. సంతానకరమగును. అన్ని విధములా విజయములను ప్రసాదించును. దారిద్ర్యముతో బాధపడుతున్నపుడు, ఆపదలు సంభవించినప్పుడు, తన్నివారణార్థం ఈ వ్రతం చేయవలెను. మాఘమాసమందుగాని, వైశాఖ మాసమందుగాని, కార్తీక మాసమందుగాని ఈ వ్రతమును చేయవచ్చును. ప్రతీ మాసమందు గాని, ప్రతీ సంవత్సరానికి ఒకసారిగాని చేయవలయును. ఏకాదశి, పూర్ణిమ సంక్రమణ దినములు శ్రేష్ఠములు. 'యస్మిన్నస్మిన్దినే మర్త్యో భక్తి శ్రద్ధాసమన్వితః' అని అన్నందున ఏ రోజైననూ భక్తిశ్రద్ధలతో కూడి శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతమాచ



రించవలె'ని శ్రీ మహావిష్ణువే స్వయముగా చెప్పెను. ఈ వ్రతమును కల్పమునందు చెప్పబడినట్లుగా పౌరాణిక, వైదిక మంత్రములతో సమస్త వర్ణములవారు చేయవచ్చును. ముందుగా విఘ్నములకు అధిపతియైన విఘ్నేశ్వరుని పూజించి, కలశమునందు వరుణదేవుని ఆహ్వానించి, లోకపాలకులైన గణపతి, బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, గౌరీ మున్నగు పంచ లోకపాలకులను పూజించి, మంటపమునందు అధిదేవతా ప్రత్యధి దేవతా సహిత ఆదిత్యాది నవగ్రహములను, ఇంద్రాది అష్టదిక్పాలకులను ఆవాహన చేసి అర్చించవలెను. మహాలక్ష్మీ సమేత శ్రీ సత్యనారాయణ స్వామివారిని సహస్ర నామములతో పూజించి, అధ్యాయ పంచకమైన కథను చదివి, "రంభా ఫలం ఘృతం, క్షీరం గోధూమస్యచ చూర్ణికం" అరటి పళ్ళు, గోధుమ నూక, పాలు, పంచదార, ఆవునెయ్యి మొదలగు సుగంధ ద్రవ్య

ములతో కూడినదియు, సత్యదేవునకు అత్యంత ప్రీతిపాత్ర మైనదియు అగు "సుపాద" ప్రసాదమును ఆరగింపు చేసి, వ్రతమును సంపూర్ణము చేసు కొనవలెను. భక్తిశ్రద్ధలతో వ్రతమాచరించడం ఎంత ప్రధానమో ప్రసాద భక్షణము కూడా అంతియే ప్రధానము.

మహారాజు గోపాలకులిచ్చిన ప్రసాదమును తినడం మానేసి, విడిచిపెట్టి నందున చాలా దుఃఖమును పొంది, తన అపరాధమును తెలుసుకుని యధావిధిగా వ్రత ప్రసాదములు స్వీకరించడంవల్ల దుఃఖమంతా పోయి సౌఖ్యములు కలిగినవని మనకు తెలియుచున్నది. నారదా! ఈ వ్రతమును ఎవరైతే భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారో అట్టి వారందరూ కోరిన సమస్త కోరికలను పొంది, సమస్త సుఖములను అనుభవిస్తారని నారదునకు శ్రీమహావిష్ణువు తెలుపగా, నారదునినుండి నేను తెల్సుకొని, మీ అందరకూ చెప్పి, మీ ద్వారా సమస్త జనులకు వివరించిన వాడనైనా'నని సూతమహా ముని పలికెను. స్వామివారి వ్రతమును ఆచరించినచో స్వామివారి అనుగ్రహమే కాక వ్రతములో ఆవాహనచేసిన అంగదేవతలైన లోకపాలకులు, ఇంద్రాది అష్ట దిగీశ్వరులు, ఆదిత్యాది నవగ్రహముల యొక్క అనుగ్రహము సర్వులకు గలుగును. ఇంతటి మహత్తరమైన వ్రతము అనునిత్యము అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో భక్తకోటి ఆనందోత్సాహములతో జరుపుకొనుచున్నారు. మన ఇంట్లో ఏ శుభకార్యము జరిగిననూ తదనంతరం సత్యనారాయణ స్వామివారి వ్రతమును చేయడం అలవాటుగా ప్రాచీనముగా యున్నది. దేవాలయమునందు గాని, నదీతీరమందు గాని, గోసమూహము నందుగాని, బృందా వనమందు గాని ఎటువంటి వ్రత, పూజాదులు గావించిననూ అవన్నియు అనంత ఫలప్రదమగును. అందువల్ల అన్నవరంలో వ్రతం చేసుకున్నచో అది సుప్రసిద్ధ దేవాలయమైనది కావున వైకుంఠములో శ్రీ మహావిష్ణువు సన్నిధిన వ్రతం చేసుకున్న మహాఫలము వచ్చును. పంపానదీ తీరములో శ్రీ స్వామివారు వేంచేసి యున్నందున నదీతీరములో చేసుకున్న ఫలము దక్కును. దేవస్థానమువారు గో పోషణ చేయుచున్నారు. అందువల్ల గోవులవద్ద వ్రతమాచరించిన పుణ్యము వచ్చును. దేవాలయమునందు చుట్టూ చక్కగా పుష్పములు, లతలు, మొదలగు వాటితో బృందావనమును తలపించు చున్నందున బృందావనమునందు వ్రతం చేసుకున్న ఫలమూ వచ్చుచున్నది. ఇటువంటి అనేక విధముల పుణ్యప్రదమైనటువంటి, శుభప్రదమై నటువంటి సత్యనారాయణ స్వామివారి వ్రతములు, కళ్యాణములు అన్నవరమునకు విచ్చేసి శ్రీహరి సన్నిధిలో జరుపుకుని సకలాభీష్టములను పొందెదరు గాక. వైశాఖమాస శుక్లపక్ష ఏకాదశి రోజున శ్రీ మదాద్యాది మహాలక్ష్మీ సమేత

శ్రీ వీరవేంకట సత్యనారాయణస్వామివారి దివ్య కళ్యాణమహోత్సవము. వైకుంఠపుర వాసియగు నారాయణుని కళ్యాణము రోజున అన్నవరం అంతయు భూలోక వైకుంఠముగా వుండును. అటువంటి జగదేక దివ్యమంగళ స్వరూపుడగు శ్రీ స్వామి వారి కళ్యాణమును కనులారా చూడ వలసినదే, మనసారా ఆనందించ వలసినదే.

## 1051. శ్రీ జగద్గురు స్తుతి

**ఐ.** హర లీలావతారాయ శంకరాయ పరౌజసే
కైవల్య కలనాకప తరవే గురవేనమః



సాక్షాత్తూ పరమశివుని లీలావతారమూ, మోక్షాన్ని ప్రసాదించే కల్ప వృక్షమూ, మహామహోత్తమ తేజోనిధీ, జగద్గురువూ అయిన శ్రీ శంకర భగవత్పాదుల వారికి నమస్కారము.

## 1052. బ్రహ్మపదం

**ఐ.** నీకు విశేషమైన ధనముందనిగాని, ప్రజల మద్దతు వున్నదనిగాని, యౌవనశక్తి వున్నదనిగానీ గర్వించవద్దు. ఎందుకనగా వీటన్నింటినీ కాలం ఒక్క నిముషంలోనే హరించి వేస్తుంది. ఇదంతా మాయా మయం అని గుర్తించి, బ్రహ్మపదాన్ని తెల్సుకొని అందులోకి ప్రవేశించు.

ధనం ఎంత నిలకడ లేనిదో, ధనాన్ని చూసి, చుట్టూ చేరే మందీ మార్బలం, వారిచ్చే అండదండలు కూడా అంత నిలకడ లేనివే. ఇక యౌవనం తెచ్చిపెట్టే అంగబలం, కండబలం, శక్తి సామర్థ్యములు మాత్రం శాశ్వతమా అంటే, కానే కాదు. వ్యాధుల వలన, వార్ధక్యంవల్ల అవి కృశించి నశించునటువంటివి.

ధనబలం, జనబలం, యౌవనబలం అన్నీ తాత్కాలికమైనవే. కాలం తాకిడికి తట్టుకోలేక హరించుకుపోయేవే. ప్రాణ వాయువుతోపాటు అన్నీ గతించి పోతాయి. కాలం దోపిడీ దొంగలాగా, ప్రాణంతో సహా అన్నిటినీ అపహరించుకొని పోతుంది. మాయామయం అఖిలము – సర్వమూ మాయచే ఆవరింపబడివుంది. మాయ అంటే, ఒకప్పుడున్నట్లు కనిపించి, తర్వాత కనిపించనిది – క్షణికములు, బుద్బుదప్రాయములు లేదా అసలేలేనివి, వున్నట్టు కనిపించేవి భ్రమలు, ఎండ మావులు. మానవుడు గర్వించే ఈ ధన జన యౌవనాది సంపదలన్నీ మాయతో కూడినటువంటి క్షణభంగురాలు. కాల గర్భంలో ఎప్పుడు కలిసిపోతాయో తెలియనివి. వీటి పట్టుకొని విర్రవీగవద్దు. శాశ్వతమైన బ్రహ్మపదాన్ని చేరడానికి

మార్గం జూపే జ్ఞానాన్ని సంపాదించు. గోవిందుని భజించు అనుగ్రహం పొందు.

## 1053. నారసింహ మంత్రానికి వర్ణాలు 32

**జ.** శంకరుని మంత్రానికి అక్షరాలు ఐదు మాత్రమే. శ్రీహరి వాసుదేవ మంత్రానికి అక్షరాలు పన్నెండే. లలితాదేవికి సంబంధించిన మంత్రానికి వర్ణాలు పదిహేను మాత్రమే (పంచదశి). మరో తీరులో పదహారు మాత్రమే (బీజాక్షరాన్ని చేర్చడం వల్ల). గాయత్రీ మంత్రానికి వర్ణాలు ఇరవై నాలుగు మాత్రమే. ఇలా అన్ని మంత్రాలకీ కొన్ని కొన్ని వర్ణాలుంటే నారసింహ మంత్రానికున్న వర్ణాలు 'ముప్పై రెండు'. వైష్ణవదీక్షని తీసుకున్న అన్నమయ్య మరో చోటికి వెళ్ళకుండా ఒకటికాదు రెండు కాదు పదహారు సంవత్సరాలు అహోబిలంలోనే నారసింహ మంత్రమననం చేశాడు. సంవత్సరానికి రెండు అయనాలు



(జూలై 16 – జనవరి 14) చొప్పున పదహారేళ్ళకి 16×2=32 అయనాలని గమనించిన అన్నమయ్య నారసింహ మంత్రంలోని అక్షరానికి వేయిచొప్పున నరసింహస్వామి పేరిట ముప్పై రెండు వేల కీర్తనలని లోకానికి అందించాడు. మంత్రంలోని అక్షరాలకి సరిపడినట్లుగ నరసింహ క్షేత్రాలు కూడా ముప్పైరెండే.

## 1054. మానసిక ధైర్యం కోసం

**జ.** కుందాభ సుందరతనుః పరిపూర్ణచంద్ర
బింబానుకారి వదనః
కమలీ త్రినేత్రః।
శాంత స్త్రిభంగిలలితః క్షితి గుప్తపాదః
సింహాచలో జయతు దేవవరో నృసింహః॥

తెల్లని మల్లెపూవు లాంటి శరీరంతోనూ, పూర్ణిమనాటి చంద్రునిలా తిరిగి తిరిగి చూడాలనే ఉత్సుకతని రేకెత్తించే ముఖంతోనూ, లక్ష్మీదేవిని వక్షఃస్థలమ్మీద కూర్చుండబెట్టుకుని పరమ ప్రశాంతతతోనూ, మెడా నడుమూ పాదాలనే మూడు ప్రదేశాల్లో విలాసంకోసం కొద్దిగా ఒయ్యారం చిలకరిస్తూనూ– పాదాలని పాతాళలోకం వారికి అనుగ్రహిస్తూ ఆ పాదాల నుండి వచ్చే గంగని ఆలయానికి సమీపంలో ప్రవహింపజేస్తూ (గంగధార) వుండే సింహాచల దైవం–మనని రక్షించుగాక ! ఈ రూపాన్ని కళ్ళలో పెట్టుకుని, ఈ శ్లోకాన్ని రాత్రివేళ పరుండబోయే ముందు పఠిస్తే భూత, ప్రేత, పిశాచ బాధలు తొలగుతాయి. చెప్పలేనటువంటి మానసిక ధైర్యం వ్యక్తికి కలుగుతుంది.

## 1055. ఆరవ అవతారం

**జ.** దశావతారాలలో పరశు రామావ తారం ఆరవది. పరశురాముడు వైశాఖ శుక్ల తృతీయనాడు అవతరించినట్లు స్కందపురాణం తెలియజేస్తోంది.

వైశాఖస్య తృతీయాయాం శుక్లాయాం తు జనార్దనః

బ్రహ్మలోకా త్రిపథగాత్ పృథివ్యామ వతారయత్

ఏవ ముత్పాదయామాస రవే మధ్యందినే సతి

ప్రోక్తా పరశురామస్య జయంతీ చ సూరిభిః॥



వైశాఖ శుక్ల తృతీయనాడు మిట్ట మధ్యాహ్నం విష్ణువు పరశురాముడిగా అవతరించాడు. కనుక ఆ రోజు పరశు రామజయంతి అయ్యింది. క్షత్రియులు ధర్మబద్ధంగా ప్రజల్ని పరిపాలించలేక పోగా, వారిని దారుణంగా హింసిస్తుండే సరికి శ్రీమహావిష్ణువు పరశురాముడిగా అవతరించి వారందరినీ సంహరించాడని పురాణ కథనం. పరశురామ జయంతి నాడు ఉపవాసం చేసి, పరశురాముని షోడశోపచారము లతో శ్రద్ధగా పూజించి, "జమదగ్నిసుత, వీర, క్షత్రియాంతకప్రభో, గృహాణార్ఘ్యం మయా దత్తం కృపయా పర మేశ్వర" అని అర్ఘ్య ప్రదానం చేయాలని వ్రత గ్రంథాలు తెలియజేస్తున్నాయి.


## 1056. మూడవతారాల మూర్తి

**జ.** శ్రీహరి దశ (10) అవతా రాలనెత్తాడు. వరాహావతారం ముగింపుకి వచ్చిన వేళ, ఇంకా ఆ అవతారానికి కొద్దిగా సమయం వున్న వేళ ప్రహ్లాదుడు ఆర్తితో ప్రార్థించాడు రక్షించవలసిందని. దాంతో శ్రీహరి వేగంగా వస్తూంటే ఆ వరాహావతార సమ యం అయిపోయింది. మరో అవతారాన్ని ధరించవలసిన అవతార సమయం వచ్చింది. జారిపోతున్న కటి వస్త్రాన్ని జారి పోకుండా పట్టుకోవడమంటే ఆ అవ తారాన్ని ముగియకుండా ఆపడమన్న మాట. అవతారమే ముగిస్తే సింహాచల స్వామికి వరాహముఖం వుండే వీలే లేదు. ఇటు వరాహావతారం, దీని పిమ్మట రాబో యే నర+సింహ అవతారాలూ కలిసి మొత్తం మూడు జాతుల రూపం కలిగిన వాడ య్యాడు స్వామి. ఈయనకి వివాహం జరిపేవేళలో ఈ స్వామికి భార్యగా ఆ తల్లి సంపూర్ణ మనుష్య వేషంలోనే వుంటుంది. ఎందుకని? సింహముఖం వాడైన స్వామికి మనుష్య ముఖంవున్న భార్య ఎలా కుదురు తుంది? స్వామిది వట్టి వేషమే కదా! వేషం తీసేస్తే ఆయనది నరరూపమే కదా! ఈ వేషం భక్తుల రక్షణ కోసం కదా! పరశు రాముడూ రాముడూ అలాగే కృష్ణుడూ

బలరాముడూ ఇలా రెండ్రెండు అవతారాలు ఒకే కాలంలో కన్పిస్తే ఇక్కడి స్వామి ఒకే రూపంలో, ఒకే కాలంలో మూడవతారాలతో వుంటాడు.

## 1057. తిరుమల వేంకటేశుని మూలరూపం

**జ.** కృతే స నారసింహో ఽ భూత్
త్రేతాయాం రఘునందనః।
ద్వాపరే వాసుదేవ శ్చ
కలౌ వేంకటనాయకః॥



మనం ఏ తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆరాధిస్తున్నామో ఆ రూపంతో మనకి దర్శనమిస్తున్న ఈ దైవం కలి యుగంవాడు. ఈయనే ద్వాపర యుగంలో శ్రీకృష్ణునిగా వున్నాడు. ఈ వేంకటేశ్వరుడే త్రేతాయుగంలో రామచంద్రునిగా పూజలందుకున్నాడు. ఈ స్వామే కృతయుగంలో నరసింహస్వామిగా మొట్టమొదట అవతరించాడు. ఈ యథార్థాన్ని భక్తులు గుర్తించేందుకే తిరుమలస్వామి దర్శనానికి ముందు వరాహస్వామి దర్శనాన్ని చేయాలని చెప్తూ 'క్యూ'ని అక్కడి నుండే ప్రారంభిస్తారు. శ్రీ వరాహస్వామికి మహానివేదన మయిన తరువాతే శ్రీ వేంకటే శ్వరునికి మహానైవేద్యాన్ని పెడతారు. బ్రహ్మోత్సవాలలో రామ చంద్రునికి వాహనమైన హనుమంతుని మీద ఊరేగింపుకి కారణం శ్రీ వేంకటేశ్వరుడు ఒకప్పుడు రాముడని గుర్తింప జేసేందుకే. అలాగే కృష్ణభగవానుని వేషంలోనూ ఊరేగింపు చేసేది ఇందుకే. తిరుమలలో యోగనరసింహస్వామి ఆలయం దేవాలయ ప్రాకారం లోపల వుండేది కూడ ఇందుకే.

శ్రీ నారసింహ మంత్రం శ్లోకంలోని నాలుగుపాదాల్లో ($4\times8=32$) ముప్పై రెండక్షరాల్లో వుంటే, శ్రీ వేంకటేశుడు ఒకే (కలి) యుగానికి చెందినవాడు కాబట్టి ($32\div4=8$) 'ఓం నమో వేంకటేశాయ' అంటూ ఎనిమిది అక్షరాలతోనే వుంటుంది వేంకటేశ మంత్రం.

## 1058. అక్షయ తదియ

**జ.** వైశాఖ మాసంలో వచ్చే మూడోరోజు 'అక్షయ తృతీయ'. అనగా తదియ పవిత్రమైన రోజు కావడంతో ఈ రోజున బంగారం కొనుగోలు చేస్తే సిరిసంపదలు వస్తాయనే నమ్మకం వుంది. పురాణ కథనం ప్రకారం అక్షయ తృతీయ రోజునే త్రేతాయుగం ప్రారంభమైంది. అలాగే పరశురాముడి జన్మదినోత్సవం కూడా

ఇదే రోజు. మహావిష్ణువు అవతారాలలో పరశురామావతారం కూడా ఒకటి. అక్షయ తృతీయ అనగా అక్షయ తదియ నాడు సూర్యుడు చంద్రుడు ఉచ్ఛస్థితిలో వుంటారు. వేదకాలంలో ఇదే రోజున యాగాలు చేసేవారట. పవిత్రమైన ఈ రోజు జరిగే వివాహాలకు ముహూర్తంతో పనే లేదని చెబుతారు పెద్దలు.

### 1059. శ్రీ వరాహ స్తుతి

**జ.** **వసతి దశన శిఖరే ధరణీ తవలగ్నా**
**శశిని కళఙ్కక లేవ నిమగ్నా**
**కేశవ ధృత సూకర రూప**
**జయ జగదీశ హరే!**



నీ కోరకొనయందు అంటివున్న భూగోళం చంద్రునిలోని మచ్చలా వుంది. వరాహావతారము ధరించిన ఓ స్వామీ, జగదీశా, హరీ నన్ను కాపాడు.

### 1060. ఆదివరాహుని ఆది దర్శనం

**జ.** కలియుగంలో భూమిని అపహరించి సముద్రగర్భంలో దాగిన హిరణ్యాక్షుడనే రాక్షసుని సంహరించడానికి అవతరించిన అవతారే వరాహస్వామి. మహాసూరాకారుడై శరీరాన్ని విపరీతంగా పెంచి, తన ముట్టెతో ఒక్కసారిగా ప్రళయ జలధిని పెళ్ళగించి, అందులోని నీళ్ళు, ఈ బ్రహ్మాండమనే చిప్పను చీల్చుకుని వెళ్ళేంతగా పైకిచిమ్మి మళ్లీ కిందకి పడుతున్న నిర్మలమైన ఆ నీటిధారల తోడి బ్రహ్మాండాన్ని, ఆ బ్రహ్మాండానికి వెలిగా వెలుగొందుతున్న ప్రకృతిశక్తికి ముత్యాల గుత్తి తోడి బంగారు ముక్కెరగా అలంకరించాడా స్వామి. కలియుగ వైకుంఠమైన తిరుమలకు వెళ్ళిన ప్రతి భక్తుడు మొదట పూజించి, సేవించవలసింది ఈ వరాహస్వామినే. తిరుమలలో స్వామినే. తిరుమలలో స్వామి పుష్కరిణికి ఆనుకుని ఉత్తర దిక్కున వున్నదే శ్రీవరాహస్వామి ఆలయం. కలియుగంలో వేంకటేశ్వరుని రూపంలో భక్తుల కోరికలను తీర్చే విష్ణుమూర్తి గతంలో తన వక్ష స్థలాన్ని తన్నిన భృగుమహర్షిపై ఆగ్రహించకపోగా పాద సేవ చేయడాన్ని చూసి సహించని లక్ష్మీదేవి, వైకుంఠాన్ని విడచి కొల్హాపురం వెళ్ళిపోవడంతో ఎడబాటు సహించలేని విష్ణుమూర్తి ఆ వియోగంతో వెంకట్రాదికి రావడం– అక్కడ పశువులకాపరి విసరిన కర్ర వేంకటేశ్వరునికి తగిలి తలకు గాయమై రక్తధారలు కట్టడం, ఆ గాయాన్ని మాన్పుకోవడానికి అడవిలో సంచరిస్తున్న విష్ణువయిన శ్రీవేంకటేశ్వరునికి వరాహస్వామి కనపడటం, ఆ సందర్భంగా

నూరు అడుగుల స్థలాన్ని వరాహస్వామి వేంకటేశ్వరునకు దానం చేయడంలాంటి విషయాలను పురాణాలు స్పష్టం చేస్తు న్నాయి. అయితే స్థలాన్ని పొందిన వేంక టేశ్వరుడు ఏమీ ఇవ్వలేనందున తనకు వచ్చిన భక్తుల కానుకలతో ప్రథమంగా వరాహస్వామికి పూజలు జరిపిస్తానని మాట ఇవ్వడం జరిగిందట. ఆ మాట ప్రకారమే నేటికీ వరాహస్వామికే మొదట పూజ నైవేద్యాలను జరిపి తర్వాతే శ్రీ వేంకటేశ్వరునికి పూజాది కార్యక్రమాలు జరుగుతున్నాయి. వరాహస్వామి దాన మిచ్చిన వంద అడుగుల స్థలానికి సంబం ధించిన వివరాలను తెలిపే రాగి రేకొకటి వరాహస్వామి గుడియందు వుండటం చూడవచ్చు. తిరుమల వచ్చి వరాహ స్వామిని దర్శించకపోతే యాత్ర పూర్తి కాదని ఒక అభిప్రాయం కూడా పెద్దలు వ్యక్తం చేస్తారు. ఈ వరాహస్వామి ఆలయం కూడా వేంకటేశ్వరుని ఆలయ వేళలోనే తెరచి వుంచుతారు.

## *1061. సమస్థితి*

**జ.** వికారహేతౌ నతి విక్రియన్తే
యేశషాం న చేతాంసి త పవధీరా!

'వికారాన్ని కలుగజేసే వస్తువులు సమీ పంలో వున్నప్పటికినీ ఎవరి మనసు లందు వికారమి సుమంతైనా కలగకుండా వుంటుందో వారే ధీరులనదగినవారు' అని కాళిదాసు తెలియజేశాడు. ఎండు టాకు, రాతిగుండు రెండూ గాలిలేనపుడు నిశ్చలంగా వుంటాయి. పెనుగాలి వీస్తే ఆకు ఆమడదూరం ఎగిరిపోతుంది. రాయి మాత్రం స్థిరంగా వుంటుంది. గాలి వీచినపుడు ఆ రెండింటి యొక్క నిజ సత్త బయటపడుతుంది. ఆ ప్రకారమే సంసార క్షేత్రమున పరిస్థితులు సవ్యంగా వున్న ప్పుడు, అందరూ పెద్ద మనుషులుగానే వుంటారు. పరిస్థితులు వికృతంగా వున్న ప్పుడు, ఆపదలు సంభవించినప్పుడు, అనుకోని సంఘటనలు జరిగినప్పుడు సామాన్య మానవుని చిత్తం తలక్రిందు లైపోవును. జ్ఞాని ఈ జగన్నాటకమంతా బూటకమే అని తెలుసుకున్న వాడగుట వలన విచిలితుడు కాక, వాటినన్నింటిని స్వప్నప్రాయంగా చూస్తూ స్వకీయ సమ (ఆత్మ) స్థితి యందే మెలుగుతూ వుంటాడు. కనుకనే ఒకడు జ్ఞానియో, అజ్ఞానియో, దేవుడో, దెయ్యమో, గుణవంతుడో, నిర్గు ణుడో అతని చేష్టలను బట్టి, వ్యవహార మును బట్టి, ఆచరణను బట్టి తృటిలో తేల్చుకోవచ్చు. కాబట్టే భగవానుడు గుణా



తీతుని కొన్ని లక్షణాల్ని చెప్పి జనులను భ్రమనుండి తొలగించాడు. అలాంటి మహత్తర ధర్మములను, సమస్థితిని బాగుగా అభ్యసిస్తూ గుణములన్నిటిని దాటి నిర్గుణ పరమాత్మ స్థితిని పొందు వరకు తమ ప్రయత్నాన్ని ఎవరూ విరమించకూడదు.

## 1062. శాంతి మంత్రము

**శ్లో.** సర్వస్తరతు దుర్గాణి, సర్వో భద్రాణి పశ్యతు।
సర్వస్సద్బుద్ధి మాప్నోతు, సర్వస్సర్వత్ర నన్దతు ॥

అందరును కష్టములు గట్టెక్కి, మేలు పొంది, సద్బుద్ధిని పొంది అన్ని విషయములయందును ఆనందింతురుగాక.

## 1063. ఉగాదినాడు ఏం చెయ్యాలి

**శ్లో.** వత్సరాదౌ వసంతాదౌ బలిరాజ్యే తథైవ చ।
తైలాభ్యంగ మకుర్వాణో నరకం ప్రతిపద్యతే॥

ఇంట్లో తల్లి వుంటే ఆమె, తన పిల్లల మాడు (శిరసు మధ్యభాగంలో) మీద నువ్వులనూనెని తన కుడిచేతి మూడు నాలుగు వేళ్ళతో అద్దాలి. చక్కని దీవెనలని దీవిస్తూ తలతోపాటు ఒంటినిండుగా నువ్వులనూనెని రాయాలి. కొంతసేపు (గంటకుపైగా) నూనెతో శరీరాన్ని నాననిచ్చాక సున్నిపిండితో శరీరాన్ని అదుముతూ నలపాలి. ఆ మీదట చక్కని కుంకుడు (కాయల) పులుసుతో తలని రెండు మార్లు రుద్దాలి. శరీరాన్ని కుంకుడు తొక్కతో రుద్దాలి. ఆ మీదట సబ్బుతో తోమినా ముందుగా కుంకుడు తొక్కని మాత్రమే వాడాలి. వేడినీటితో స్నానాన్ని చేయించాలి. ఇలా చేయించిన స్నానాన్ని 'అభ్యంజన (అభ్యంగన) స్నాన'మంటారు. తల నిండుగా కుంకుడు చేదు వాసనవుండే కారణంగా క్రిమి కీటకాలూ, చుండ్రూ మొదలైనవి చేరవు. కుంకుడు రసంలో వున్న శక్తి కారణంగా జుట్టు రాలిపోదు. ఆ మీదట దైవంముందు కొద్దిసేపు (విద్యార్థి దశలో వున్న పిల్లలు కాబట్టి ఆ చదువులకి విఘ్నం రాకుండా ఓ పది నిమిషాలు మాత్రమే) కూచోబెట్టి కొత్త బట్టలని వాళ్ళకి అందిస్తూ, తలమీద అక్షతలని వేస్తూ వాళ్ళచేత పాదాభివంద నాన్ని చేయించుకోవాలి. లోకంలో తల్లిదండ్రులకి మించి సంతానపు క్షేమాన్ని ఆలోచించే వాళ్ళు మరెవరూ వుండరు. కాబట్టి తల్లిదండ్రులు అక్షతలు వేయాలి. ఆశీర్వదించాలి. తమతోపాటు పిల్లల్ని కూడ గుడికి తీసుకుపోయి పంచాంగాన్ని




విన్పిస్తే 'ఇదొక సంప్రదాయ'మనే మాట పిల్లలకి అర్థమౌతుంది. జాతకాన్ని ఆచార్యులవారో, శాస్త్రులవారో వివరించి చెప్పాక పిల్లలకి మనోధైర్యాన్ని బోధించి, ఆ జ్యోతిష్యాన్ని మార్గదర్శకంగా భావించాలనే విషయాన్ని వాళ్ళకి అర్థమయ్యేలా చెప్తూ జ్యోతిష్య శాస్త్రం మీద వున్న గౌరవాన్ని తగ్గకుండా చూడాలి.

## 1064. వసంతకాలపు గొప్పదనం

**జ.** చైత్ర శ్రీమానయం మాసః పుణ్యః పుష్పిత కాననః' బాగా పూచిన పుష్పాలతో అడవి మొత్తం నిండుగా కన్పిస్తూ, అడవి అంతా 'పూల అడవి' ప్రకాశింపజేస్తున్న ఈ వసంతకాలం ఉత్తమమనీ, రాముని పట్టాభిషేకాన్ని ఈ కాలంలోనే చేయాలనీ నిశ్చయించారు దశరథుడూ, వశిష్ఠుడూ మొదలైన అందరూ కూడ. పట్టాభిషేకం భంగమైంది కాబట్టే సీతాపహరణం తద్వారా రావణునితో రామునికి శత్రుత్వం, ఆ మీదట యుద్ధం... రావణవధ... లోకక్షేమం కలిగాయి. ఆంజనేయుడు తొలుతగా రాముణ్ణి చూసింది ఈ వసంతంలోనే. అంతకు ముందు కాలంలో – మోక్షార్థి అవుతూ – సీతాపహరణాన్ని రావణుడు చేశాడంటే అదికూడా ఈ వసంత కాలంలోనే జరిగింది. వాలికి రాముని చేతిలో మోక్షం లభించింది – అంతకు ముందు కాలంలో మారీచుని క్కూడ రాముని చేతిలో మోక్షం లభించిందీ – రావణ వధానంతరం రాముడు అయోధ్యలో సీతమ్మతోపాటు పట్టాభిషిక్తుడైనదీ.. ఇలా ఈ మొత్తమంతా జరిగింది వసంతంలోనే. 'శ్రీకృష్ణః శ్యామలా దేవీ శ్రీరామో లలితాంబికా' అనే న్యాయం ప్రకారం లలితాదేవీ రాముడూ ఒకరే కాబట్టి ఏ రామునికి వసంతం అనుకూలమో ఆ వసంతంలోనే అమ్మవారికి వసంత నవరాత్రులు (పాడ్యమి నుండి నవమి వరకు) వైభవముగా జరుగుతాయి. (వత్సరారంభ సంపూజితాయై నమో నమః)

## 1065. క్షేత్రజ్ఞుడు

**జ.** మానవ శరీరం విలువైనది. కాని దానితో జనులు సాధించు వస్తువు అల్పమైనది. శరీరమేర్పడింది ఇంద్రియార్థముల కోసంకాదు, ఆత్మకొరకు, దైవం కొరకు. మానవత్వం లభించింది బంధనములు దృఢపరుచుకొనుట కోసం కాదు, బంధనములను వదిలించుకొనుట కొరకు. కనుక శరీరాన్ని, ఇంద్రియ



ములను, మనస్సును, బుద్ధిని విషయ భోగములపైకి విచ్చలవిడిగా పోనీయక అదుపులోనుంచి జీవిత లక్ష్యమగు పరమాత్మను వెతుకుటలో దానిని పూర్తిగా వినియోగించాలి. అద్భుతమైన ఈ శరీరం మరలా మరలా లభించేది కాదు. బ్రహ్మేవ లోకన సమర్థమగు ఈ మనస్సు మరలా మరలా దొరికే పదార్థం కాదు. సృష్టి యందలి చరాచర ప్రాణికోట్లన్నియు, తుదకు దేవతలు సైతం ఈ అపూర్వ మానవ దేహం కోసం తహతహ లాడు తున్నారు. అటువంటి సౌభాగ్యాన్ని పొందిన మానవుడు ఇచట మీన మేషాలు లెక్కిస్తూ కూర్చోకుండా, వున్న కొద్ది ఘడి యలు తానెవరో, ఈ జగత్తేమిటో, ఎచటికి వెళ్ళాలో, లక్ష్యమేమిటో బాగా విచారించి, మట్టిలో మాణిక్యాన్ని కను గొని, క్షేత్రమగు ఈ శరీరమందు క్షేత్రజ్ఞు డైన పరమాత్మను తెలుసుకుని, భార భూత మైన ఈ సంసారాన్ని ఆనందమయంగా మార్చుకొని సుఖించుగాక. మట్టితో చేయ బడిన శరీరమందు మాణిక్యం వంటి ఆత్మ కాపురముంటుందని తెలుసుకోవాలి.

## 1066. జన్మ సార్థకత

**జి.** మనిషిగా ఈ లోకంలో ఎందుకు జన్మించాము! తిని, ఎదిగి, సంతానం పొందడం కోసమే అని అనుకుంటే దానికి మానవజన్మ అక్కరలేదు. సృష్టిలోని మిగి లిన జీవులు చేసేది అదే. అయితే అది పశుజీవనం. మనిషి బతకాల్సింది మానవ జీవనం. ఆ రెండింటికీ తేడా తెలుసు



కోమనే మనిషికి విచక్షణను ఆ భగవం తుడు ప్రసాదించాడు. ఆ విచక్షణే మని షికి, జంతువుకు మధ్య వున్న తేడా. మానవజన్మ రావడం ఒక వరం. గత జన్మల పుణ్యఫలం ఈ జన్మ. ఈ జన్మను సార్థకం చేసుకున్న వారే దైవసాన్నిధ్యాన్ని పొంద గలరు. ముక్తి పొందేందుకు కృషి చేయాలి. ఆ కృషి నుండి మానవుడి దృష్టి మళ్ళించేందుకు పలు వ్యతిరేక శక్తులు అడ్డుపడుతుంటాయి. వాటిని అధిగ మించి జీవితాన్ని ముందుకు నడిపించుకు వెళ్ళాలి.

## 1067. నక్షత్రాలు

**జి.** శరీరంలో ఉండే అవయవాలూ వాటి పనితీరూ ఎలా అందరికీ తెలియాలంటే అది సాధ్యమయ్యే పనికాదో, అలాగే ఆకాశంలో – అంటే – ఖగోళంలో కూడ కలిగే మార్పులూ, కదలికలూ కూడ అందరికీ అర్థమయ్యే అంశం కాదు. ఈ యథార్థాన్ని గ్రహించి నటువంటి పెద్దలు 'అతి సామాన్యుడిక్కూడ ఖగోళంలో ఉండే గ్రహాలూ, నక్షత్రాలూ – అవి ఏ రోజు



ఏ తీరుగా కదులుతూ ఉంటాయి?' వంటి విశేషాలని ఒక నెల రోజులపాటు నేర్పదలిచి దానికి సరయిన కాలంగా ఈ సంక్రాంతిని ఎన్నుకున్నారు. మనం చూస్తున్న ముగ్గు, ముగ్గూ కాదు. మనం చూస్తున్న చుక్కలు, చుక్కలూ కావు. ముగ్గులు కన్పిస్తున్న నేల ఆకాశం. దాని మీద పెట్టబడిన చుక్కలు (నక్షత్రాలని ఈ పేరుతో పిలిచేది ఇందుకే) నక్షత్రాలు. రోజుకి ఒక్కో ముగ్గుచొప్పున మార్చి మార్చి పెట్టేది ఎందుకంటే – ప్రతిరోజూ ఆకాశంలో గ్రహాలూ, నక్షత్రాలూ ఒకే స్థానంలో ఉండవనీ, కదుల్తూ ఉంటాయనీ తెలియజేసేందుకూ, వాటిప్రభావం కారణంగా మన జీవితాలు నడుస్తూ ఉంటాయనీ గమనించేందుకున్నూ. అంటే ముగ్గులు పరోక్షంగా ఖగోళ పాఠాన్ని మనకి చెప్తున్నట్లే అర్థం. ఈ నెల రోజుల ఖగోళ పాఠంలో మొదట పాఠమే మూడు నిలువు చుక్కలూ మూడు అడ్డంగా చుక్కలూ పెట్టి మొత్తం తొమ్మిది చుక్కలతో పెట్టే ముగ్గు. ఈ తొమ్మిది చుక్కలూ ఆకాశంలో కన్పడే నవగ్రహాలకీ సంకేతం. ఏదో ఓ నెలలో ఒక రోజులో ఈ పాఠం ముగిసిపోతే ఖగోళ విశేషాన్ని అందరూ గుర్తుంచుకోలేక పోయే ప్రమాదముందని గుర్తించిన ప్రాచీనులు, ఆ నవగ్రహాలూ అవి ఉండే దిక్కులూ... అందరికీ తెలిసేలా శివాలయాల్లో నవగ్రహ మండపాలని ఏర్పాటు చేశారు. వాటికి ప్రదక్షిణం చేసేసి తిరిగి వచ్చేయడంకాక, ఖగోళంలో అవి ఏయే స్థానాల్లో ఉంటాయో గమనించాలన్న మాట. తొమ్మిది చుక్కలతో ముగ్గుని పెట్టేసాక నాలుగు వైపులా నాలుగు లతలని గీస్తూ, మూలలో కూడ చక్కనైన లతలని ముగ్గులో గీయడానిక్కారణం, దిక్కులనీ – దిక్కుకీ దిక్కుకీ మధ్య ఉండే విదిక్కులనీ (ఈశాన్యం... అలా) గుర్తుంచుకోవలసిందని తెలియ జేసేందుకే. అన్ని గడులకీ మధ్య ఉండేగడి సూర్యుడు. జ్యోతిష పరిభాషలో ఈయన్ని 'రవి' అంటారు. అందుకే ఈ గడిని ఎరుపు రంగుతో నింపుతారు. ఏ గ్రహం ఏ రంగులో ఉంటుందో ఆ రంగుతో ఆ గడిని నింపడం కూడ ఇప్పటికీ కొన్నిచోట్ల కన్పిస్తూంటుంది. అలా నింపితే నవగ్రహ విధానం మనకి గుర్తుండే అవకాశముంటుంది. ఇకపై 9 గడుల్లోనూ కన్పించే బాణాకారపు గుర్తులు ఆ గ్రహాలు ఏ దిక్కుని చూస్తుంటాయో తెలియజేస్తాయి. ఒకప్పుడు ఈ గడుల్ని నింపుతూ ఏ దిక్కుని ఏ గ్రహం చూస్తూం

టుందో ఆ గడిని ఆ గ్రహపు రంగుతో నింపుతూ ఆ గ్రహం చూసే దిక్కువైపుకి చిన్న మొన కన్పించేలా పెట్టేవారు లేదా ఆ రంగుకంటె వేరు రంగు చుక్కని ఆ వైపున అందంగా ఉండేలా పెట్టేవారు. ఈ బాధంతా నవగ్రహ విధానాన్ని లోక మందరికీ తెలియజేయాలనే తపన కారణంగానే. దీన్నే శ్లోకంలో చెప్పారు పెద్దలు. (శుక్రార్కౌ ప్రాఙ్ముఖౌజ్ఞేయౌ - గురు సౌమ్యా వుదఙ్ముశౌ - ప్రత్యఙ్ముఖౌ మంద సోమౌ - శేషా దక్షిణతో ముఖాః)

### 1068. యోగులని, బాబాలని, స్వామీజీలని రకరకాల పేర్లతో పిలుస్తారు. బాబాకు, స్వామీజీలకు తేడా ఏమిటి?

జ. కేవలం పేర్లలో భేదమేగాని తేడా ఏమీ లేదు.

### 1069. ఆత్మ, పరమాత్మలకు గల తేడా ఏమిటి?

జ. ఆత్మవ్యష్టి, పరమాత్మ సమిష్టి. ఆత్మ అంటే జీవాత్మ, పరమాత్మ అంటే సమస్త జీవుల ఆత్మల యొక్క సమిష్టి రూపం.

### 1070. అరుణపారాయణం చేసినా, చేయించినా ఋణ, రోగాది బాధలు తొలుగుతాయని రాశారు. అది ఎక్కడ దొరుకుతుంది?

జ. అరుణం ఆజుషస్మార్త మంత్ర పాఠంలో ఉంటుంది. స్మార్తం చదువుకున్న వారెవరి చేతనైనా పారాయణ చేయించు కోవచ్చు.

### 1071. సూర్యమంత్రం రోజుకు ఎన్నిసార్లు జపం చేయాలి?

జ. యథాశక్తిగా జపం చేయవచ్చు.

### 1072. రోజూ విష్ణు సహస్రనామం పారాయణ చేయవచ్చునా?

జ. చేయవచ్చునా ఏమిటి? విధిగా చేయాలి. భగవద్గీత, విష్ణుసహస్ర నామాలను పారాయణ చేయాలి, శ్రీపతి రూపాన్ని నిరంతరం ధ్యానం చేయాలి, దీనజనులకు ధనాదులనిచ్చి సహాయం చేయాలన్నది మన విధి.

### 11073. దీపాన్ని కర్పూరంతోనే వెలిగించాలన్నారు. నిజమేనా?

జ. అక్షరాలా నిజం. అగ్గిపుల్లతో కన్న, కర్పూరంతో వెలిగించడమే మంచిది.



### 1074. ఒరిస్సాలో పర్వదినాలలో నీరుల్లిని నిషేధిస్తారెందుకు?

జ. నీరుల్లి సాత్త్వికమైన ఆహారం కాదు. కనుక పండుగ పబ్బాలలో మనసును దైవం మీద నింపడానికి వీలుగా సాత్త్వికాహారం తీసుకోవడం మంచిది. అందుకే నీరుల్లిని నిషేధించారు. ఈ నియమం ఒరిస్సాలోనేగాక సర్వత్రా వర్తించే నియమమే.

## 1075. నిత్యధ్యానవ్రతం మాఘమాసంలోనే చేయాలా? ఎప్పుడైనా చేయవచ్చునా?

**జ.** నిత్యవ్రతమన్నారు కనుక రోజూ చేయవలసిందే.

## 1076. కాలం జరిగిన ఇంటిలో సంవత్సరం పూర్తయేవరకు ఆ ఇంటివారు పుణ్యక్షేత్రాలకు వెళ్ళరాదంటున్నారు.

**జ.** ధర్మం కన్న ఆచారం బలీయం, మనకు కొన్ని ఆచారాలు అనూచానంగా వస్తున్నాయి. వాటిలో ఇదికూడా ఒక ఆచారం. తిరుపతి, శబరిమలై వంటి చోట్లకు దీక్ష తీసుకుని వెళ్లడం ఏటి సూతకమయే దాకా పనికిరాకపోయినా మామూలుగా దర్శనం మీవారికి గారికి ఉత్తమగతులు ప్రసాదించమని ప్రార్థించవచ్చు. ఇంట్లో రోజూ చేసుకునే పారాయణలకు నిషేధమేమీలేదు.

## 1077. వివిధ మతాలవాళ్లు మహాత్ముల సమాధులకు పూజలు, అభిషేకాలు చేస్తారు. వాళ్ళ ఆత్మలు అక్కడే ఉంటాయా?

**జ.** ఆత్మకు చావు పుట్టుకలు లేవు కనుక ఒకచోట ఉండడమన్న ప్రశ్నే లేదు. వారి పంచభౌతిక శరీరాన్ని పూడ్చిపెట్టిన సమాధికి పూజ చేయడం వారిని గుర్తుకు తెచ్చుకోవడానికి మాత్రమే. ఏ మతంలో జరిగేదైనా అదే. అయితే కొన్ని మతాల వారు ఆ సమాధులలో చనిపోయిన జీవులు నిద్రిస్తూ ఉంటారని 'ఖయామత్ కా దిన్' లేక 'జడ్జిమెంట్స్‌డే' నాడు దేముడు వారిని లేపి, విచారణ జరిపి, ఎవరి నెక్కడకు పంపించాలో అక్కడకు పంపుతాడని నమ్ముతారు.

## 1078. యోగులు, ఋషులు హిమాలయాలలో ఎప్పుడూ తపస్సు చేస్తూ ఉంటారు గదా. మరి మానవసేవయే మాధవసేవకదా! వారు మానవాళికి ఏవిధంగా ఉపయోగపడుతున్నట్లు ?

**జ.** వారు చేసేది కూడా మానవసేవయే. వారి తపస్సు లోకాన్నంతటినీ ప్రభావితం చేస్తుంది. జ్ఞానులు ఏమీ చేయకపోయినా కేవలం వారి ఉనికి వల్లనే లోకానికి మేలు జరుగుతుందని, వారి దర్శనం వల్లనే మానవాళి తరిస్తుందనీ రమణ మహర్షి వంటి మహనీయులు అన్నారు.



### 1079. ఒక్కొక్కరోజు ఒక్కొక్క దేముని గుడికి వెళ్లి పూజిస్తాం. మిగతా రోజులలో వెడితే ఫలితముండదా?

**జ.** ఆయా దేవీ దేవతలకు ఆయా వారాలు ముఖ్యమని భావించి ఆ రోజున దర్శనానికి తప్పక వెడతాం. దాని అర్థం మిగతా రోజులలో వెళ్లకూడదనిగాని, ఫలితముండదని కానీ కాదు. దైవదర్శనానికి ఎప్పుడు వెళ్లినా మంచిదే.

### 1080. శివలింగం - నందీశ్వరుడులను పూజామండపంలోనే పెట్టుకోవాలా, బీరువాలోనైనా పెట్టవచ్చునా?

**జ.** చక్కగా పూజామందిరంలో పెట్టి దీపం వెలిగించి హారతి ఇచ్చి పూజ చేయండి. బీరువాలో పెట్టుకోవడమెందుకు.



### 1081. ఇంటిలో చాలా వినాయకుని ఫోటోలున్నాయి. అన్ని ఫోటోలు ఉండరాదంటారు, నిజమా ?

**జ.** నిరభ్యంతరంగా ఉంచుకోవచ్చు. వీటితోనే గోడలు నిండి పోతే కొన్ని తీసి ఎవరికేనా ఇవ్వండి. ఇవి కేవలం ఫోటోలు మాత్రమే. యంత్ర ప్రతిష్ఠ చేసిన విగ్రహాలు కాదు గదా! ఫోటోల దుకాణంలో ఎన్ని ఉండవు?

### 1082. ఈశాన్యమూల బరువుండరాదంటారు కారణమేమిటి?

**జ.** అక్కడ నీళ్లుండాలని వాస్తుశాస్త్రం చెబుతోంది. ఆ దిక్కున పల్లముండాలి.

### 1083. కాలమనేది అందరికీ ఒకే విధంగా ఉండదేమి? కష్టాలు ఎక్కువ, తక్కువ అనే భేదమెందుకు? కష్టాలు పడే వాళ్లకు మాత్రం ఎల్లకాలమూ కష్టాలేనా?

**జ.** కాలమన్నది సాపేక్షం. అంటే రిలెటివ్. మన కర్మనుబట్టి, ప్రారబ్ధాన్ని బట్టి, యోగాన్ని బట్టి మంచి చెడులుంటూ ఉంటాయి. మనకు చెడ్డదనిపించిన కాలమే మరొకరికి మంచి దౌతుంది. ఇక కష్టాల విషయంలో కష్టసుఖాలు కావడి కుండలన్న సామెత లేదా?

### 1084. తల్లిదండ్రులలో బిడ్డలపట్ల ఒకరికొక న్యాయం, ఇంకొకరి కింకొక న్యాయం సమంజసమా?

**జ.** నిజానికి తల్లిదండ్రులకు పిల్లలందరి పట్ల సమానమైన భావమే ఉంటుంది. అయితే పిల్లలప్పుడప్పుడు అర్థం చేసుకోలేక తమను వేరుగా చూస్తున్నారని అపోహ పడతారు. ఉదాహరణకు – పెద్ద

కొడుకు పొద్దుపోయి అన్నానికి వస్తే, తల్లి వానినే పెట్టుకుతినమంటుంది. అదే చిన్న కొడుకు వస్తే తానే లేచి పెడుతుంది. ఇదేదో తేడాగా చూచినట్లనిపిస్తుంది కానీ, ఆవిధంగా తల్లి చేయడంలో ఒక రహస్య ముంది. పెద్ద కొడుకు జ్ఞానమొచ్చిన వాడు కనుక తనకు కావలసింది జాగ్రత్తగా పెట్టుకుతింటాడు. అదే చివరివాడైతే చిన్న వాడు కావడం వలన ఏమి తినాలో, ఎంత తినాలో, ఎట్లా తినాలో తెలియని వాడు కావున తల్లి స్వయంగా పెడు తుంది. ఇది అర్థం చేసుకోక వాడినొక విధంగా, వీనినొక విధంగా చూచిందని అనుకోవడం తప్పుగదా!

## 1085. వెండితో చేసిన సత్యనారాయణస్వామి విగ్రహానికి, లక్ష్మీ విగ్రహానికి పంచామృతాభిషేకం రోజూ చేస్తున్నాను. నాకు మంత్రాలు రావు. చేయవచ్చునా?

**జ.** భక్తితో చేయడం ప్రధానం. మంత్రాలు రానంత మాత్రంలో ప్రమాదేమేమీ లేదు. వీలయితే పూజ పుస్తకాలలో శ్లోకాలుం టాయి. వాటిని చదువుతూ చేస్తే ఇంకా మంచి ఫలితం లభిస్తుంది. ప్రయత్నించండి.

## 1086. ధ్యానానికి, తపస్సుకి మధ్య తేడా ఏమిటి?

**జ.** మన చిత్తానికి అనేక వృత్తులుం టాయి. వాటిని నిరోధించడం యోగం. అందులో భాగమే ధ్యానం. దానిలో కొంత




కాలముండి మళ్ళీ దిగిరావడ ముంటుంది. మనం ఏ కర్మచేసినా దానికి చెందిన మంత్రం మీద, దైవం మీద బుద్ధిని నిలిపి ముందు ధ్యానం చేస్తాం. మనం చేసే పూజా, పునస్కారాలు, వివిధ కర్మలు, యజ్ఞయాగాదులు కేవలం యాంత్రికంగా చేసే పనులుగావు. అర్థం, రమార్థం ఉన్న పనులవి. వాటి పరమార్థం మన దృష్టిని భౌతిక విషయాలనుంచి మళ్లించి అంత ర్ముఖం చేయడం. ఆ ప్రక్రియనే ధ్యాన మంటాం. అది కొన్ని గంటలు చేసే దయితే, కొన్ని సంవత్సరాలు ఆ ధ్యానాన్ని నిలిపితే అదే తపస్సు.

## 1087. రామాయణ మూలమంత్రమేది? రామబాణం అని దేనినంటారు? మొదట దీనినెవరు ప్రయోగించారు?

**జ.** రామాయణ మూలమంత్రం రామ మంత్రమే. రాముని బాణం రామబాణం. దానిని ఆయనే ప్రయోగించారు. బాణమంటే మంత్రంతో ప్రయోగించే అస్త్రంకాదు.

## 1088. 'భక్తి' అన్నమాటకు అర్థమేమిటి?

**జ.** భక్తి అనే మాట 'భజ' అన్న ధాతువుకు 'క్తి' అనే ప్రత్యయం కలపగా ఏర్పడింది. భజ ధాతువుకు సేవ అని అర్థం. దానికి 'క్తి' అన్న ప్రత్యయం కలిసింది.



'క్తి అంటే ప్రేమ. దీనిని బట్టి భక్తి అంటే ప్రేమతో సేవ చేయడమని అర్థం. అదే విధంగా కర్మఫల అనాసక్తితో నైష్కర్మ్య స్థితిని అందుకోవడానికి భక్తి అని పేరు.

## 1089. దైవం, "అప్రాప్యమనసాసః" అని, "యతోవాచో నివర్తంతే" అని ఒక వైపున చెబుతూ మరల "అనంత కళ్యాణగుణ పరిపూర్ణుడు దైవ"మని, ఆయనకు అనంత నామాలు కలవని చెప్పడమేమిటి?

**జ.** నిరాకారమన్నా, సాకారమన్నా రెండూ ఒకటే. మనసుకు, మాటలకూ అందని ఆ దైవానికే అనంత కల్యాణగుణ పరిపూర్ణుడన్న మరో విశేషణం కూడా చెప్పబడింది. అందులోగల అనంత, పరిపూర్ణ అన్న మాటలను గుర్తించాలి. ఉదాహరణకు తెలుపొక గుణం, నలుపొక గుణం అనుకోండి. అవి రెండూ అనంతం గాను, పరిపూర్ణంగాను దేవునిలో ఉన్నాయని చెప్పాలిగదా! కొంత నలుపు, కొంత తెలుపు ఉండవచ్చు గానీ రెండూ అనం తంగాను, పరిపూర్ణంగాను కలవంటే ఎలా కుదురుతుంది.? కనుక దీనికి అర్థం ఏ రంగూ లేదని అర్థం కాదా? ఆలోచించండి.

## 1090. వైదిక ధర్మం సనాతనం కదా! అది ఈనాడెలా పనికివస్తుంది ?

**జ.** వైదిక ధర్మం ఎంత పాతదో అంత కొత్తది కూడా. అందుకే అది పురాతనం, నిత్యనూతనం కూడా. పైగా అది ధర్మం. ధర్మమంటే మూడు కాలాలకు – భూత, భవిష్యద్వర్త మానాలకు – చెందినది.

## 1091. ఇష్ట దైవమంటే ఏమిటి? అన్యదైవాల విషయంలో ఏ విధంగా ప్రవర్తించాలి?

**జ.** ఇష్టదైవమంటే తన రుచికి, ప్రవృత్తికి అనుగుణమైన దైవం. అట్టి ఇష్టదైవాన్నే ఆరాధించడం జరుగుతుంది. అన్య దైవాలను దర్శించరాదని, ఆరాధించ రాదని పరిపాటిగా వచ్చే ఒక మాట ఉంది. దాని అర్థం అన్యదైవాలను ద్వేషించమని కాదు. ఏ దైవంలోనైనా తన ఇష్ట దైవాన్నే చూడాలని. రామభక్తుడు కృష్ణ విగ్రహంలో తన

రాముని చూడగలగాలి, శివభక్తుడు విష్ణువులో తన శివుని చూడాలి.

### 1012. జ్ఞానం వల్లనే మోక్షం కలుగుతుంది. మరి భక్తి, కర్మ ఇత్యాదుల ప్రయోజనమేమిటి?

**జ.** కర్మవలన చిత్తశుద్ధి, దానివలన జ్ఞాన ప్రాప్తి, ఆ జ్ఞానంవలన మోక్షం లభిస్తాయి.



ఇవి మెట్ల వంటివి. మోక్షాన్ని సాధించగల సాధనాలలో భక్తి గొప్ప సాధనమని పెద్ద లన్నమాట.

### 1013. ప్రతి రోజూ చేసే దేవుని భక్తికి, మనిషి ప్రాణికి సంబంధముందా?

**జ.** తప్పకుండా ఉంది. భక్తి చేయడమంటే దేవునికి పూజ ఇత్యాదులు చేయడమే కదా! పూజలో ధ్యానముంది, ప్రాణాయామముంది, ఏకాగ్రత ఉంది. ఇవన్నీ మనిషిలోని ప్రాణ శక్తిని పెంచే క్రియలే.

### 1014. అహల్యా, ద్రౌపదీ, సీతా మొదలైనవారు శ్రీమతులు కదా! మరి కన్య లనడమేమిటి?

**జ.** వారు శ్రీమతులయి సంతాన వంతులైనా వారి కన్యత్వానికి భంగం కలగనట్లు వరం పొందినవారు. కనుక వారెల్లప్పుడూ కన్యలుగానే ఉండి పోయారు.

### 1015. సతి అన్న పదానికి భార్య అని అర్థం ఉంది. మరి సతీ అనసూయ, సతీ సావిత్రి మొదలైన వాటిలో గల సతికి అర్థమేమిటి?

**జ.** సతి శబ్దానికి స్త్రీ అనే అర్థం కూడా ఉంది.

### 1016. ఆత్మ ప్రదక్షిణలో దైవానికి పృష్ఠభాగం చూపవలసి వస్తుంది గదా! అది ధర్మమా?

**జ.** అసలు దైవంలేని చోటేముంది? దైవం వెనుక, ముందు, పైన క్రింద సర్వత్రా వ్యాపించి ఉన్నాడు. ఈ సత్యాన్ని గుర్తు చేయడానికే ప్రదక్షిణ, అందుకే అది తప్పకుండా ధర్మబద్ధమే.

### 1017. భోజనకాలంలో పరిషేచన చేయడం, స్వాహా మంత్రాలు చెప్పడంలో అర్థమేమిటి?

**జ.** మనం తీసుకునే ఆహారం పవిత్రంగాను, శుద్ధంగాను, మంత్ర పూరితమైనదిగాను ఉండాలి. అందుకే ఎప్పుడు పడితే అప్పుడు, ఏది పడితే అది తినకూడదు. తినేటప్పుడు మన మనస్సు, బుద్ధి ప్రశాంతంగా ఉండాలి. ఆహార శుద్ధివల్లనే సత్వ శుద్ధి కలుగుతుంది. ఇక స్వాహాకారాలెందుకంటే – అగ్నిహోత్రంలో ఆహుతులిచ్చేటప్పుడు 'స్వాహా' అంటూ ఇవ్వాలి.

అగ్నిని ఉపాసించడం మన విధి. మనకు భారతీయులన్న పేరు అందుకే వచ్చింది. 'అగ్ని మిచ్ఛధ్వం భారతా' అని వేదం చెబుతోంది. ఈ అగ్నులు అనేకవిధాలు. మన లోపల ఉన్నది వైశ్వానరాగ్ని. దానికి ఐదు ఆహుతులిచ్చి ఆహారం తీసుకోవాలి. విస్తరిచుట్టూ నీళ్ళు పొయ్యడంవలన చీమలు, దోమలు, సూక్ష్మక్రిములు దూరంగా పోతాయి, విస్తరిలోకి రావు.

## 1098. పండుగ రోజులలో, ఉపవాసంలో ఉల్లిపాయల తినరాదంటారు, ఎందుకు?

**జ.** ఆ రోజులలో మన మనసులు సత్త్వ గుణంతో చక్కని ఆలోచనలతో ఉండాలి. మనం తినే ఆహారంలో శరీరానికి, మెదడుకు సంబంధించిన గుణాలు అనేకముంటాయి. ఉల్లిపాయలు శరీరానికి నైగనిగ్యాన్ని కలిగించినా మనసును ఉత్తేజితం చేసే లక్షణాలు కలిగి ఉంటాయి. కనుక వాటిని దూరంగా ఉంచడం శ్రేయస్కర మన్నారు.

## 1099. అష్టవిధ అభిషేకాలలో ఏయే పూజకు ఏ విధమైన మంత్రాలు చెప్పాలి? ఎన్ని రోజులు చేయాలి?

**జ.** అన్ని అభిషేకాలలో వాడే మంత్రాల మహన్యాస, లఘున్యాసాలు, నమక, చమక, మన్యు సూక్త, పురుష సూక్త, శ్రీ సూక్తాది మంత్రాలు చెప్పాలి. అవి ఏక వారంగాని, ఏకాదశంగాని, మనం చేసే సంకల్పాన్ని బట్టి చెప్పవలసి ఉంటుంది. ఎన్ని రోజులంటే – జీవితాంతమూ చేయవచ్చు, లేదా ప్రత్యేక ప్రయోజనం కోసమని చేయదలిస్తే మనం సంకల్పించిన విధంగా చేయవచ్చు. పూజాద్రవ్యాలను ప్రత్యేకంగా వివరించనక్కరలేదు. శివాభిషేకానికి బిల్వం ప్రధానంగా ఉండాలి.

## 1100. దేవుని విగ్రహాలను ఫోటోలను రోజూ తుడిచి శుభ్రం చేయవచ్చునా? గురు, శుక్ర వారాలలో పనికిరాదంటారేమిటి?

**జ.** మనం చేసే పూజలోనే (నిత్యం) అర్ఘ్యం సమర్పయామి, పాద్యం సమర్ప



యామి, గంధం సమర్పయామి, పుష్పం సమర్పయామి అంటూ ప్రతిరోజూ సమర్పిస్తాంగదా! ఆసమర్పణలకు వారం, వర్జ్యమంటూ లేవు. కనుక రోజూ నిర్మాల్యం తీసి మరల అలంకరించడంలో తప్పు లేదు. రోజూ ఇల్లు తుడుచుకోవడం, గడప కడిగి ముగ్గు పెట్టుకోవడాలు మనకు ఆచారాలే కదా!

### 1101. దీపారాధనకు నిన్నటి వత్తి ఇవాళ వెలిగించవచ్చా? అక్షతలు, ఎప్పటిప్పుడు కలుపుకోవాలా?

**జ.** నిన్న వెలిగించిన వత్తినే మళ్లీ వెలిగించరాదు. కొత్త వత్తి వెలిగించాలి. అక్షతలు కలిపి పెట్టుకుని రోజూ వాడుకోవచ్చు. అక్షతలంటే విరిగిపోని బియ్యపు గింజలని అర్థం.

### 1102. మనస్సుకు శాంతి కలగడానికి ఏ గ్రంథాలను పారాయణ చేయాలి?

**జ.** మన మనస్సు ఒక చక్రం వంటిది. అది ఊరికే తిరుగుతూ ఉంటుంది. దాన్ని నిరోధించడానికి యోగసాధన చేయాలి. విష్ణు పరమాత్మ చేతిలోని చక్రం మన



స్సుకు చిహ్నమే. మనస్సును పరమాత్మ అధీనం చేస్తే, దాని తిరుగుడు తగ్గి, శాంతి కలుగుతుంది. భాగవతం, శంకరాచార్యులవారి భజగోవింద శ్లోకాలను పారాయణ చేయండి. పారాయణమంటే, కేవలం చదవడమే కాదు చదివిన దానిని నిరంతరం మననం చేసుకోవాలి.

### 1103. పుట్టినరోజు, చనిపోయినరోజు ఇత్యాదులు క్యాలండరులోని తేదీల ప్రకారం జరుపుకోవాలా? లేక తిథుల ప్రకారమా?

**జ.** తిథుల ప్రకారమే జరుపుకోవాలి.

### 1104. లక్ష్మీదేవి పటంలో, గుడ్లగూబను వాహనంగా ప్రచురించారు. ఆ పటానికి పూజ చేయరాదని, దానిని బావిలో పడవెయ్యమని చాలామంది సలహా ఇస్తున్నారు. ఏం చేయమంటారు?

**జ.** గుడ్లగూబ అంటే భయపడే అమాయకుల సలహా పాటించనక్కర లేదు. లక్ష్మి అన్నమాటకు మంచి చూపుకలది అని కూడా అర్థం. అలాగే గుడ్లగూబ కూడా చాలా తీవ్రమైన దృష్టిగలది. అది తన చూపుతో కాకులను మాడ్చి చంపుతుంది.

### 1105. సుకర్మగానీ, దుష్కర్మగానీ, భగవదాదేశం ప్రకారం జీవి చేస్తున్నది గదా! వాళ్లు అనుభవించే ఫలితాలలో తేడా ఎందుకు? జీవి భగవదాదేశాలకు విరుద్ధంగా నడుచుకోగలడా?

**జ.** మీరు వ్రాసిన దాన్నిబట్టి ఒక హంతకుడు హత్య చేసినా, దొంగ దొంగతనం చేసినా, దేముడు చెయ్యమన్నాడు కనుక

చేశామని, తేలికగా తప్పించుకోవచ్చు. అటువంటి వారిని పోలీసులు పట్టు కోవడం, న్యాయస్థానాలు శిక్ష వెయ్యడం మొదలైనవన్నీ తప్పవుతాయి. పైగా, ఇప్పటివరకూ ఏ హంతకుడూ దేవుడు చేయమన్నాడు కావున, హత్య చేశానన్న వాడెవడూలేడు. అసలు దైవము ఏమీ చేయడు. జీవులు చేసే వివిధ కర్మలకు సాక్షిగా వుంటాడు. అందుకే ఆయనకు "సాక్షి" అని పేరు. జీవులు చేసే కర్మలన్నీ, వాటి సంస్కారాలను బట్టి పూర్వజన్మల నుంచి వచ్చిన కర్మల ఫలితంగా జరుగు తుంటాయి. వాటికి మనమే కర్తలంగానీ, దైవంకాదు. దైవంచేసేదల్లా, మనం చేసిన కర్మల యొక్క ఫలితాలను, మనచేత అను భవింప జేయడమే.

## 1106. ఇంటి ఆవరణలో మేడిచెట్టు ఉండొచ్చునా? ఏ దిక్కున ఉండాలి?

**జ.** ఇంటి ఆవరణలో మేడి చెట్టుండనే కూడదు.

## 1107. తల్లిదండ్రులు చనిపోయినప్పడు దేవాలయంలో ఒక రాత్రి, భార్య పుట్టింట్లో ఒకరాత్రి గడపనిదే ఇతరుల ఇళ్లకు వెళ్లరాదంటారు ఎందుకు? భార్య పుట్టింటివారు ఈ దేశంలో లేకపోతే ఏంచేయాలి?

**జ.** తల్లిదండ్రులు చనిపోయినప్పుడు దుఃఖం కలుగుట సహజం. దుఃఖశాంతికై దేవాల యంలో భగవంతుని ధ్యానిస్తూ, ఒక రాత్రి గడపాలి. అత్తమామలు తల్లి దండ్రులతో సమానం. కావున వారితో ఒకరోజు గడిపి చిత్తశాంతిని కలిగించుకోవడానికి పెట్టి నది ఈ ఆచారం. దుఃఖంతో అందరి ఇళ్ళకూ వెళ్లడమేమి న్యాయం?

## 1108. పెండ్లికకాముందు అమ్మాయిది తండ్రి గోత్రం. పెండ్లి అయిన తరువాత భర్త గోత్రమౌతుంది. మరి, కోర్టు ద్వారా విడాకులు పొందిన స్త్రీకి ఏ గోత్రం వర్తిస్తుందో తెలుపగలరు?

**జ.** విడాకులనేది ఇప్పుడు వచ్చిన పద్ధతి గానీ, పూర్వం లేదు. భర్త మరణించిన తరువాత కూడా స్త్రీకి మరణించిన భర్త గోత్రమే వచ్చినట్లు, విడాకులు కూడా భర్త



మరణం వంటిదిగా భావించి, అదే గోత్రం చెప్పుకోవాలి. విడాకులు తరువాత మరి యొకరిని పెండ్లాడితే, వారికి ఈ గోత్రా లతో అసలు పనేలేదు.

## 1109. బ్రాహ్మణములంటే ఏమిటి?


జ. వేదమంత్రాలు నాలుగు తరహాలుగా ఉంటాయి. అవి సంహితులు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులన్నవి. వీటిలో బ్రాహ్మణములు యజ్ఞయాగాదులను నిర్వహించుటకు వాడే మంత్రాలు.

## 1110. కొత్తబట్టలకు పసుపు ఎందుకు రాయాలి?

జ. పసుపు మంగళప్రదం. ప్రతి రంగుకు కొన్ని గుణాలుంటాయి. తెలుపు సత్వ గుణానికి, ఎరుపు రజోగుణానికి, ఆకు పచ్చ సస్యసమృద్ధికి చిహ్నాలు. అదే విధంగా పసుపురంగు శుభానికి సూచకమైన రంగు.

## 1111. ప్రతి సంవత్సరం జరిపే సీతారామకల్యాణ మహోత్సవంలో, సీతారాముల విగ్రహాలతోబాటు లక్ష్మణుని విగ్రహాన్ని కూడా పెడతారు. లక్ష్మణుడు పెండ్లి చూస్తున్నట్లా?

జ. ఒక్క లక్ష్మణుడేమిటి? భరత, శత్రుఘ్నులు, దశరథజనకాదులు, పెండ్లికి వచ్చిన యావన్మందీ చూస్తున్నవారే. అందరి



విగ్రహాలు పెట్టడం కుదరదుకదా! వాళ్ల దగ్గర లక్ష్మణుడి విగ్రహమొక్కటే ఉన్నది కాబోలు.

## 1112. దత్తత తీసుకోకుండా కన్యాదానం చేస్తే, తల్లి దండ్రులు బ్రతికుండగా వేరే వాళ్లు కన్యాదానం చేస్తే, ఫలితం ఎవరికి చెందుతుంది?

జ. కన్యాదానం చేసిన వారికే చెందుతుంది. పది తరాలు అటు, పది తరాలు ఇటు, తన తరానికి – మొత్తం ఇరువది యొక్క తరాల వారికి కన్యాదాన ఫలం లభిస్తుంది.

## 1113. పుట్టినవారి సమయాలు (గంటలు) గుర్తులేని వారికి, జాతకాలు చూపించుకోవాలంటే ఏమి చేయాలి?

జ. జ్యోతిష్కుని దగ్గరకు వెళ్లి, ప్రశ్నించిన సమయంలోని గ్రహస్థితిని బట్టి ఫలితం చెప్పే పద్ధతి కలదు. ఆ విధంగా తెలుసుకోవాలి.

## 1114. జపం చేసేటప్పుడు జపమాలను ఏవిధంగా త్రిప్పాలి? చేతివ్రేళ్లకున్న ప్రత్యేకతను చెప్పండి

జ. జపమాలకు మేరుపూస ఉంటుంది. ఆ మేరుపూస వరకు ముందుకు త్రిప్పుతూ ఒకసారి, మళ్లీ ఆ మేరుపూసను దాటకుండా వెనుకకు త్రిప్పుతూ జపం చేయ

డం ఆచారము. ఇక వేళ్ల విషయానికొస్తే మన శరీరమంతా నరాలపుట్ట. వాటికన్ని టికీ స్పర్శద్వారా జ్ఞానాన్ని అందించేవి వేళ్ళు. అందుకే కళ్లతో చూసి గ్రహించలేని విషయాలనే వ్రేళ్లతో ముట్టుకుని గ్రహిస్తాం.

## 1115. హిందూ మతంలో ఎందుకు ఇంతమంది దేవుళ్లున్నారు?

**జ.** హిందువులకు 33 కోట్ల మంది దేవుళ్లున్నారని మనవాళ్లు లెక్కచెబుతారు. నిజానికి యీ లెక్క పాత జనాభా లెక్కల ప్రకారము సరిపోతుందిగానీ, ఇప్పుడు జనాభా పెరిగింద కావున, దేవతల సంఖ్య కూడా పెరిగింది. నిజానికి దేవుడొక్కడే, ఆ ఒక్క దేవుడినే ప్రతిప్రాణీ తన రుచిని బట్టి, ప్రవృత్తిని బట్టి, భావించడం జరుగు తుంది. మనిషికి దేవుడు కాళ్లు, చేతులు, కళ్లు, తలగల మనిషి రూపంలోనే వుంటాడు. పాముకి దేవుడు పామురూపంలో వుంటాడు. పిల్లలులేని తల్లికి దేవుడు పిల్లవాడి రూపం లోను, విద్యార్థికి దేవుడు చదువు రూపం లోను, యుద్ధంచేసే సైనికుడికి రక్తం పొంగించే లయకాల తాండవం చేసే శివుడి రూపంలోను వుంటాడు. ఎవరిలో ఏవిధమైన భావముంటే ఆ విధమైన రూపంలో పరమాత్మను భావించడం జరుగుతుంది. అందరికీ ఒకే రకమైన ఇష్టముండదు. అందుకే సాధన వైయ్యక్తికం. అందరినీ ఒకే సమయంలో ఒకే చోటచేరి ఒకేవిధమైన దేవుడిని ఒకే పద్ధతిలో పూజించమంటే అది సైనిక పద్ధతి అవుతుంది. ఉపాసనంలో అది కుదరదు. అందుకే ప్రాణికొక దేవుడు.

## 1116. సాయిబాబాకు తల్లిదండ్రులున్నారా?

**జ.** ఆయనా చెప్పలేదు, వాళ్లను చూచిన వాళ్లూ లేరు. కొంత మంది వాళ్ల పేర్లు కూడా చెబుతున్నారన్నారు కదా! వాళ్లెవరో మాకూ చెప్పమనండి. సంతోషిస్తాం.



## 1117. అగ్నిప్రవేశం చేసిన సీతను అగ్నిదేవుడు దోషరహిత అని చెప్పినా, సీతను తరువాతి కాలంలో దోషి అన్నారు. ఇది ఎలా సమర్థనీయం?

**జ.** ఆమెను దోషి అని ప్రజలందరూ అన లేదు. కేవలం ఒక రజకుడు, ఒళ్లు తెలి యని స్థితిలో అన్న మాట అది. ఐతే ఆ

మాటకు శ్రీరాముడు ఆమెను వదలి పెట్టాలా అని మీరడగవచ్చును. రామ రాజ్యం నిజమైన ప్రజాస్వామ్య రాజ్య మనడానికి ఇది మచ్చుతునక. ఈనాడూ మనది ప్రజాస్వామ్యమంటున్నాం. ఈనాడు ప్రజల తప్పులెన్నడానికి సి.ఐ.డి. ఉన్నారు. కానీ రామ రాజ్యంలో రాముని తప్పెన్న డానికి వాళ్లుండేవారు. పైగా తనమీద, తన కుటుంబం మీద అతి సామాన్య జనంలో కూడా ఎటువంటి దురభిప్రాయ మున్నా, దాన్ని పోగొట్టడం తన విధియని భావించి, శ్రీరాముడు సీతను విడిచాడు. తద్వారా ఆమెలో ఎట్టిదోషం లేదని సామా న్యులకు కూడా తెలిసేటట్లు చేశాడు.

### 1118. రావణుడు బ్రాహ్మణ వంశంలో పుట్టాడని ఒకరు, క్షత్రియుడని ఒకరు అంటున్నారు. ఏది నిజము?

**జ.** రావణుడు పౌలస్త్యుడని వాల్మీకి పేర్కొ న్నారు. దానిని బట్టి బ్రాహ్మణుడనే అను కోవాలి.

### 1119. సువర్చలా హనుమల వివాహం జరుపుతున్నారు గదా. ఇది శాస్త్రీయమా? శాస్త్రసమ్మతమా?

**జ.** హనుమంతుడు ఆజన్మ బ్రహ్మచారి. బ్రహ్మచర్యంవలన సువర్చస్సు కలుగు తుంది. ఆలంకారికమైన ఈ విషయాన్ని నిజమని భావించి పెళ్లి కూడా చేస్తు న్నారు. దేవుడికి పెళ్లి చేయడంలో అసలు



రహస్యమేమిటంటే, ఆ పెళ్లిలో మనం చేసుకున్న పెళ్లి, అందులో మనం చేసిన ప్రతిజ్ఞలు, వాటిని పాటిస్తున్నామా లేదా అని ఆత్మావలోకనం చేసుకోవడానికి!!

### 1120. "పాపోహం..." అంటూ ప్రదక్షిణ నమస్కారం చేసేటప్పుడు ఒక శ్లోకం చదువుతాం కదా ! ఇది ఎవరేనా కల్పించిందా? ఆత్మకు పాపమేమిటి?

**జ.** నిజానికి, పుట్టుక, చావు లేనిది ఆత్మ. అది సర్వవ్యాపికూడా. ఈ పాపపుణ్యాలు, చావుపుట్టుకలు శరీరానికి సంబంధించి నవి మాత్రమే. ఆ శరీరంతో, వినయంతో పరమాత్మకు ప్రదక్షిణంచేస్తూ చదివే శ్లోక మిది, దైవం ముందు వినయంతో చెప్పే మాట అది.

### 1121. విష్ణువు నృసింహుడుగా అవతరించడం, శివుని చేత వధింప బడడం జరిగిందికదా! ఆవిధంగా

### మరణించిన విష్ణువు మిగిలిన అవతారాలు ఎట్లా ఎత్తగలిగారు?

**జ.** నాటకాలలో, సినిమాల్లో నటించే వారు ఎన్నో వేషాలు వేస్తారు. ఒక వేషంలో హత్య చేయబడి మరణిస్తాడు. అదే నటుడు ఇంకో వేషంలో చక్రవర్తిగా ప్రత్యక్ష మౌతాడు. ఒక వేషంలో చనిపోయినవాడు మళ్లీ చక్రవర్తి ఎట్లా అయ్యాడు. ఒక వేషంలో చనిపోవటమంటే నటుడు నిజంగా చనిపోయినట్లా? అదే విధంగా పరమాత్మ గొప్ప నటుడు. ఈ అవతారాలు, చని పోవడాలు అన్నీ ఆయన ఆడే నాటకాలు. అవన్నీ ఆయన క్రీడలు. అంతదాకా ఎందుకు? ఆత్మపరంగా మనకూ చావు పుట్టుకలు లేవు. చచ్చేది, పుట్టేది ఈ శరీ రమే. అసలు మరణమంటే మార్పే.

### 1122. ద్రౌపదికి పాండవుల వలన ఉపపాండవులు జన్మించారు గదా! వారి పేర్లేమిటి? యెవరి కుమారుడు యెవరు? వివరంగా తెలియజేయండి.

**జ.** ద్రౌపదికి అయిదుగురు పాండవుల వలన అయిదుగురు కుమారులు జన్మిం చారు. వారినే ఉపపాండవులు అన్నారు. ధర్మరాజు కుమారుడి పేరు ప్రతి వింధ్యుడు, భీమసేనుడి కుమారుడు సుత సోముడు, అర్జునుని కుమారుడు శ్రుత కర్మ, నకులుని కుమారుడు శతనీకుడు, సహదేవుని కుమారుడు శ్రుతసేనుడు.

### 1123. తిరుమలలోని వెంకటేశ్వరస్వామి మూలవిరాట్టుకు నిత్యం అభిషేకము, స్నానమూ చేయిస్తారా?

**జ.** తప్పకుండా చేయిస్తారు. అసలు పూజకు ముందు "స్నానం సమర్పయామి, వస్త్రం సమర్పయామి" అంటూ చేస్తాం కదా! ఇక్కడ కూడా అంతే.



### 1124. "కృషితో నాస్తి దుర్భిక్షం", "యథారాజా తథా ప్రజాః", "ధర్మో రక్షతి రక్షితః" ఇలా యెన్నో వున్నాయి. యివి శ్లోకాలా? వీటిని యేమంటారు? ఇవియే గ్రంథంలో ఉంటాయి.?

**జ.** పైన చెప్పిన "కృషితో నాస్తి దుర్భిక్షం" మొదలైనవి మన పూర్వ గ్రంథాలలో వేల సంఖ్యలో వున్నాయి. ఇవి శ్లోకాలలోని కొన్ని పాదాలు. రామాయణం, భారతం, భాగవతం పురాణాలు నీతిగ్రంథాలలో వీటికి మూలాలు. వీటిని జాగ్రత్తగా గుర్తుం చుకుని లోకం పోకడ తెలుసుకుని మాన వుడు తనను తాను తీర్చిదిద్దు కోవడానికి ఉపయోగిస్తాయి.

## 1125. మన గోత్రములకు మూల పురుషులు యెవరు? వివిధ వ్యక్తుల పేర్లు చెబుతుంటారు. వారందరూ మూల పురుషులవుతారా?

**జ.** 1. కశ్యపుడు 2. అత్రి 3. భరద్వాజుడు 4. విశ్వామిత్రుడు 5. గౌతముడు 6. జమదగ్ని 7. వశిష్ఠుడు 8. అగస్త్యుడు. వీరు యెనిమిది మంది గోత్ర పురుషులని మత్స్య పురాణంలో వున్నది. వీరిని బట్టి ఆయా ఋషుల గణములు యేర్పడినాయి.

## 1126. వివాహం అయినవారు సన్యాసం స్వీకరించవచ్చా? వయస్సు ప్రమాణం వున్నదా? తీసుకుని నియమ నిబంధనలు పాటివేత, ఆ సన్యాసి నిర్యాణం చెందితే భార్యస్థానం యేమిటి? ఆమె సౌభాగ్యస్థానం గురించి చెప్పండి

**జ.** మానవజీవితంలో బ్రహ్మచర్య గార్హస్థ్య సన్యాసాలను నాలుగు ఆశ్రమాలున్నాయి. మొదటిది బ్రహ్మచర్యం. అందులోనే ఇహపర వైరాగ్యం కలిగితే (ఇహ లోకం లోని కోరికలు పరలోకంలో కావాలనే ఆశ లేకపోతే) నేరుగా సన్యాసం స్వీకరించవచ్చు లేదా బ్రహ్మచర్యానంతరం గార్హస్థ్యం (పెండ్లిచేసుకుని) అవలంభించి చేయవలసిన విధులన్నిటినీ నిర్వర్తించి, వైరాగ్యం సంపాదించుకుని సన్యాసం స్వీకరించవచ్చు. వైరాగ్యం తగినంత కలగక పోతే సంసారంలో వుంటూనే మనో నిగ్రహానికి సాధన చేయాలి (దీనినే వానప్రస్థం అన్నారు). అనంతరం సన్యాసం స్వీకరించి సన్యాసాశ్రమంలో విధించిన నియమాలను పాటించాలి. సిద్ధిపొందితే భార్య స్థానం యేమిటి అన్నది శాస్త్ర నిర్ణయానుసారం పెద్దలు నిర్వహిస్తారు. పూలు వుంచాలా? గాజులు తీసేయాలా? మంగళ సూత్రం తెంచేయాలా? గుండు గీయించాలా? లాంటి విషయాలు చర్చించదగిన గొప్ప విషయాలు కావు. అవి అందరూ తెలుసుకోవలసిన అవసరం లేదు. తెలుసుకుని చేయగలిగింది లేదు. అవి ఎవరికి సంబంధించినవి. ఆ సందర్భం వచ్చినపుడు వారు తెలుసుకుని ఆచరించేవి. మరణానంతరం తన భార్యకు జరిగే తతంగం సన్యాసం పుచ్చుకునే సన్యాసికి కూడా అవసరం లేనివి గ్రహించగలరు.



## 1127. భరద్వాజుడనే పేరు గల ఋషి ఒక్కరా? అదే పేరు గల ఋషులు అనేక మంది గలరా?

**జ.** గోత్రకర్త అయిన భరద్వాజ మహర్షి ఒక్కరే అయినా అదే గోత్రంలో అనేక మంది భారద్వాజులుండవచ్చు గదా! పైగా తాత పేరు మనవనికి యధా

తథంగా పెట్టుకునే ఆచారం భారతీయ సంప్రదాయంలో ఉంది. కనుక అనేక మంది భర్వాజులున్నారని శ్రీవావిలి కొలను సుబ్బా రావుగారు (వాసుదాసు గారి) మాటను గాని, శ్రీ పమిడిఘంటం కోదండ రామయ్య గారి నిర్ణయాన్ని గానీ కాదనలేం.

## 1128. "మత్స్యః కూర్మవరాహశ్చ..."లో బుద్ధుని పేరుంది గాని శ్రీవేంకటేశ్వర సుప్రభాతంలో బుద్ధుని పేరులేదు. ఈ రెంటిలో ఏది వాస్తవం?

**జ.** మనమనుకునే బుద్ధుడు, శుద్ధోదన పుత్రుడు, దశావతారాలలోని బుద్ధుడు ఒకరు కాదని గ్రహిద్దాం. శ్రీ వేంకటేశ్వర సుప్రభాతంలో పేర్కొనకపోవడానికి కారణం "నాస్తికోవేద నిదకా" అన్నారు. కనుక వేదం ప్రమాణం కాని బుద్ధుని వదిలేశారేమో! పైగా ద్వైతా ద్వైత విశిష్టా ద్వైతాలలో అద్వైతమత ప్రవర్తకులైన శంక రులు బుద్ధుని నాస్తికులన్నారు. కనుక తరువాతిదైన వైష్ణవంలో అతని పేరెత్తి ఉండక పోవచ్చు.

## 1129. సీతారామ కళ్యాణంలో, శివపార్వతుల కళ్యాణంలో దేవేరులకు పూజారులతో తాళి కట్టించడం సరియైన పద్ధతా? చిన్న కన్యలతో కట్టించితే బాగుంటుంది కదా!

**జ.** తాళి కట్టించుకునేవారు కన్యలు గానీ తాళి కట్టేవారు కాదుగదా! వరుడు కడతాడు. పూజారులు కట్టడమేమిటంటే – నిరంతరం స్వామి సేవలో నిమగ్నులయ్యే వారు వారు. భక్తి, ప్రపత్తులతో అమ్మ మెడలో దండవేసే వారుగా వారిని భావిం చాలి.

## 1130. తన మేనల్లుడైన అభిమన్యుని కృష్ణుడావిధంగా చంపించడమేమిటి? గ్రహరాజు సూర్యుడు తనయుడైన కర్ణుడు చేసిన పాపమేమిటి?

**జ.** వాళ్ళిద్దరూ కారణజన్ములు. ఆ కారణం పూర్తికాగానే వాళ్ళు వెళ్ళి పోతారు. పైగా మన జనన మరణాలకు మనమే కారకులంగాని దైవానికేవిధమైన సంబంధం లేదు. దైవం కేవలం సాక్షి




మాత్రమే. మనం చేసుకున్న కర్మలనను భవింపజేసేవాడు మాత్రమే. ఆధునిక పరి భాషలో చెప్పాలంటే దైవం లేబర్ ఇన్

స్పెక్టర్ వంటివాడు. యాజమాన్యం పని వారికి తగినట్లు జీతాలు చెల్లిస్తున్నారో లేదో చూస్తాడు. చెల్లించకుంటే చెల్లింప జేస్తాడు. తన జేబులోంచి ఇవ్వడు. అదే విధంగా పరమాత్మ జీవులు చేసిన కర్మల ఫలితాలను అనుభవించేటట్లు చూస్తాడు. అందుకే ఆయన సాక్షి.

## 1131. చిదంబర రహస్యమంటే ఏమిటి?

**జ.** జ్యోతిర్లింగాలలో అనేకమున్నాయి. వాటిలో ఆకాశ లింగమొకటి. ఆకాశ మంటే శూన్యం. చిదంబరంలో చిదంబరే శ్వరుడు ఆకాశ లింగరూపంలో ఉన్నాడు.



అది కనబడదు కానీ నిరంతరమూ భక్తుల పూజలందుకుంటుది. అందుకే శివుడు రహస్యంగా, కనబడకుండా ఉండి మనను గ్రహిస్తున్నాడు కనుక చిదంబర రహస్య మయింది.

## 1132. రుద్రాక్ష తులసి మెడలో ధరించేవాటితో జపం చేయకూడదంటారు, నిజమా?

**జ.** అటువంటి ఆచారమెక్కడా కన బడదు. యజ్ఞోపవీతంతో గాయత్రీ మంత్రాన్ని లెక్కపెడుతూ జపంచేయటంలేదా? జపం కాగానే దానిని తీసివేయంగా!

## 1133. దేవాలయంలో తీర్థం లోపలకు తీసుకుని తలకు కూడా రాసుకుంటారు, సబబేనా?

**జ.** తీర్థం పవిత్రమైనది. క్రింద పడితే తొక్కు తాం. కనుక తలకు రాసుకోవడం సబబే.

## 1134. ఆత్మ ప్రదక్షిణ నమస్కారమనగానే దేవాలయంలోని పూజారులు గుండ్రంగా తిరగమంటారు. అట్లా తిరగవచ్చునా?

**జ.** భగవంతుడు కేవలం విగ్రహంలోనే కాదు, సర్వవ్యాప్తిగా ఉన్నాడనడానికి సంకేతమే ప్రదక్షిణ నమస్కారాలు.

## 1135. సంధ్యా వందనంలో శిఖాయైవషట్ అంటారు. వేదాధ్యయనం చేసినవారే పిలకజుట్టు పెట్టుకోడం లేదే, ఈ స్థితిలో నెత్తి చుట్టూ చేయి తిప్పతారు. సబబా?

**జ.** కపాలం పైభాగాన్ని జుట్టుతో కప్పి ఉంచాలి. అది ఆయువు పట్టు. క్రాపిం గులో తలకాయి నిండా – కపాలంతో సహా కప్పుకుంటున్నారు. దానిలో శిఖకూడా కలిసి ఉన్నట్లే కదా! బోడిగుండు, బట్ట తలల వారు ఆ ప్రాంతాన్ని తాకినా చాలు.

### 1136. ఆ తల్లి దయ లేకుంటే త్రిమూర్తుల అస్థిత్వమే లేదని (బహుశః దేవీ భాగవతం కావచ్చును) వ్రాసి యున్నది. పురాణాలన్నీ వ్యాసమహర్షి వ్రాసినవే గదా! ఒక్కొక్క పురాణంలో ఒక్కొక్కలాగ వ్రాయబడి ఉందేమిటి?

**జ.** వ్యక్తులు వివిధ ప్రవృత్తులు, ఇష్టాలు కలవారుగా ఉంటారు. నిర్దిష్టమైన నామ, రూప, గుణాలే లేని పరతత్త్వాన్ని ఊహిం చుకుని సాధన చేస్తూ ఉంటారు. అందుకే వ్యాస భట్టారకులు అన్ని విధాలుగా వ్రాయడం జరిగింది. ఎవరేవిధంగా ఊహించి సాధన చేసిన చివరకు అందరూ చేరేది ఒక్క చోటికే.

### 1137. ఆచమనం చేసేటప్పుడు చెప్పే కేశవనామాలన్నీ విష్ణుమూర్తి పేర్లే. శివనామం ఒక్కటి లేదు గదా!

**జ.** ఇక్కడ విష్ణువంటే త్రిమూర్తులలోని విష్ణువు కారు. ఆ త్రిమూర్తులకు కారకుడైన మహావిష్ణువని అర్థం. త్రిమూర్తులుగా ఆ విష్ణువే ప్రకటితమయ్యాడు.

### 1138. భగవంతుని పూజించేటప్పుడు అంగాంగ పూజ చేస్తారు. ఎందుకలా చేయడం?

**జ.** భగవంతుని సర్వాంగాలు పవిత్రాలే. అందుకే సర్వాంగపూజ.

### 1139. పంచముఖాంజనేయుని అవతార విశేషమేమిటి?

**జ.** పృథివి మొదలైన పంచ భూతాలకు చెందిన సమస్త శక్తులు ఆయనకు ఉన్నాయని చెప్పడం కోసం ఆలంకారికంగా ఆయనకు పంచముఖాలు కల్పించ బడ్డాయి.

### 1140. దేవాలయాల ముఖద్వారాలు ఎక్కువగా తూర్పు దిశగా ఉంటాయి. కొన్నింటికి పశ్చిమంగాను, ఉత్తరంగాను, దక్షిణంగాను ఉంటాయి. ఈ దిశానిర్ణయం అందులోని దైవాన్ని బట్టి ఉంటుందా? ముఖ్యమైన దేవతలలో ఎవరెవరు ఏయే దిశగా ఉండాలో తెలుపగలరు. దేవాలయ సింహద్వారం పడమటి దిక్కుకు ఉండడం దోషమా?

**జ.** గృహవాస్తుకు దేవాలయాల వాస్తుకు కొన్ని భేదాలు సహజంగా ఉంటాయి.



దేవాలయాల విషయంలో పాంచరాత్ర శైవాది ఆగమాలున్నాయి. వాటిని బట్టి దేవాలయ నిర్మాణాలుంటాయి. ఈ ఆగ మాలలో కూడా కొన్ని భేదాలుంటాయి. సింహద్వారాల విషయంలో దోషాలుండ కుండా ఉండడానికే నాలుగువైపులా ద్వారాలు పెట్టే విధానం ఉంది. ఫలానా దైవానికి ఫలానా దిక్కుననే ముఖద్వార ముండాలని నియమం అంతగా లేదనే చెప్పాలి.

## 1141. దేవుని ముందు సాష్టాంగ నమస్కారం చేయాలా? దానివలన కలిగే లాభమేమిటి?

**జ.** దైవానికి, పెద్దలకు మన శరీరంలోని శిరస్సు, వక్షస్థలం, ఎనిమిది ప్రధాన అంగాలు భూమికి తగిలేటట్లు నమస్క రించాలి. దీని వలన శరీరానికి వ్యాయా మమౌతుంది. ఇది చేసేటప్పుడు గాలి పీల్చడం, వదలడాలు ప్రాణాయామమై మన మనస్సును పరమాత్మ యందు నిలిచేటట్లు చేస్తుంది.

## 1142. మనదేశంలో అమ్మాయిలకు సన్యాసమిచ్చే మంచి ఆశ్రమాల పేర్లు, చిరునామాలు తెలుపండి.


**జ.** మన ఆంధ్రప్రదేశ్‌లో చిత్తూరు జిల్లాలో కాళహస్తి దగ్గరగల ఏర్పేడులోని మళయాళ స్వామివారి ఆశ్రమముంది. అట్లే బ్రహ్మకుమారీలకు సంబంధించిన ఒక సంస్థ యావద్భారతంలోను ఉంది. రాజమండ్రిలో సాధుస్త్రీల మఠముంది.

## 1143. పూర్వం మహర్షులు తపస్సు చేసుకున్నట్లుగా తపస్సు చేసుకొనుటకు తగిన మార్గం సూచించండి.

**జ.** ఎవరైనా ఒక గురువు వద్ద మంత్రో పదేశం పొంది దానిని సాధనంగా చేసు కుని తపస్సు చేసినవారే. ఆ తపస్సుకు కావలసి ధ్యాన, ప్రాణాయామాదులు యోగం ద్వారా పొంది తపస్సు కొనసాగిం చారు. వాటిని అభ్యాసం చేసి ఏకాకిగా తపస్సు చేయాలి.

## 1144. కేవలం సారథిగానే ఉంటానన్న కృష్ణుడు భారతయుద్ధంలో కోటి కుయుక్తులతో కౌరవ వంశ నాశనం చేయడం ధర్మమా?

**జ.** అసలు యుద్ధమెందుకు వచ్చింది? కౌరవుల అధర్మ ప్రవర్తన ఫలితంగానే కదా! ఆ యుద్ధంలో కౌరవులకు విరు



ద్ధంగా యుద్ధం చేస్తున్న అర్జునుని రథాన్ని నడిపే బాధ్యత తీసుకున్న కృష్ణుడు కౌరవులకు వ్యతిరేకి అనేకదా! అట్టి స్థితిలో వారి నాశనానికి తగిన సలహాను కృష్ణుడు చెప్పకుంటే అధర్మమవుతుందిగానీ చెబితే కాదు.

## 1145. సీతాపహరణం చేసిన రావణుని చెడ్డవాడని అందరూ అసహ్యించు కుంటారే, మరి రుక్మిణీని దొంగతనంగా తీసుకొని వచ్చిన శ్రీకృష్ణపరమాత్మకు ఆ చట్టం వర్తించదా?

**జ.** సీతను రావణుడు ఎత్తుకు పోవడమంటే పరాయివాని భార్య నెత్తుకు పోవడం కాదా? దానిని నాడే కాదు, నేడైనా, ఎవరైనా ఆమోదిస్తారా? పోనీ సీత రావణుని కోరుకున్న దాఖలాలేమైనా ఉన్నాయా? ఇక రుక్మిణి విషయానికొస్తే ఆమె శ్రీకృష్ణుని పెండ్లి చేసుకోవాలని కోరుకుంది. దానికి తన అన్న రుక్మి అడ్డు తగులుతున్నాడు. అందువలన తనను తీసుకువెళ్లి పెండ్లి చేసుకోమని కృష్ణునికి కబురంపింది. ఫలితంగా గౌరిని ప్రార్థించడానికి వచ్చిన రుక్మిణిని, ఆమె సూచించిన ప్రకారం కృష్ణుడొచ్చి తీసుకువెళ్లి ఎనిమిదిరకాలయిన వివాహ పద్ధతులలో ఒకటైన రాక్షస వివాహం చేసుకున్నాడు. రావణుని, శ్రీకృష్ణుని ఒకే గాటకట్టి చట్టం ఇద్దరికీ ఒకేరకంగా వర్తించవద్దా? అని అడగడం ఏం న్యాయం?

## 1146. అన్నిరకాల ఫలాలలో టెంకాయకు ప్రాధాన్యత ఎందుకిస్తారో వివరిస్తారా?

**జ.** టెంకాయకు పూర్ణఫలమని పేరు. పండ్లలో చాలా పండ్లు ఎంగిలిపండ్లు. అంటే పండుతిని దానిలోని గింజను ఉమ్మేస్తాం. అటువంటి ఎంగిలిగింజను నాటితే దాని నుంచి మరలా చెట్టు మొలిచి, దానికి కాయలు కాసి, అవి



పండ్లవుతాయి కనుక అవి ఎంగిలిపండ్లు. టెంకాయకు ఈ విధమైన ఎంగిలి లేదు. అట్లే అరిటిపండుకు కూడా లేదు. అందుకే అవి పూర్ణఫలాలు. చావుపుట్టుకల నుంచి ముక్తి పొందిన ఫలాలు కనుక వాటిని దైవానికి సమర్పిస్తాము.

## 1147. జీవుని మనసు పరమాత్మపైన చెక్కు చెదరకుండా ఉండాలంటే ఏవిధంగా నడుచుకోవాలి? ఒక మంచి మార్గాన్ని చూపండి.

**జ.** జగత్తును, జగత్తులోని అన్నిటినీ పరమాత్మ స్వరూపంగా భావించి సేవించడమొక్కటే మంచి మార్గం. నామదేవుడు కుక్కను–రొట్టెలెత్తుకుపోయేదానిని

దైవంగా భావించాడు, ఏకనాథుడు గాడిదను రామేశ్వరుడుగా భావించాడు. చీమను, దోమను, చెట్టును పుట్టను సర్వాన్ని దైవంగా భావించి ఆరాధించాలి.

**1148. వ్యక్తి చనిపోయిన తరువాత దశదినకర్మలో చేసే పిండ ప్రదానాలను కాకులనే ఎందుకు ముట్టనిస్తారు. కొన్ని సందర్భాలలో కాకులు ముట్టక పోవడంలోని పరమార్థం ఏమిటి? కాకులు ముట్టనప్పుడు వాటిని ఏం చేయాలి?**

**జ.** పిండాలను అగ్నిహోత్రంలో వేయాలి. ఒక చిన్న పిండాన్ని "వాయస పిండమన్న" పేర కాకులకు వేయాలి. కాకులకు, మనుష్యులకు ప్రకృతిలో సన్నిహిత సంబంధముంది. కాకి అరుస్తూ వుంటే చుట్టాలు వస్తారని భావించడం పరిపాటిగా వస్తున్న ఆచారం. చనిపోయిన వ్యక్తికిగల తీవ్రవాంఛ ఏదైనా తీరకుంటే వాయస పిండాన్ని కాకులు ముట్టవుట. అప్పుడు చనిపోయిన వ్యక్తి కుమారుడో, సన్నిహితులో ఆ కోరికను తీరుస్తామని వాగ్దానం చేస్తే అప్పుడు వాయసం పిండాన్ని ముదుతుందని నమ్ముతాం.

**1149. భగవంతుడే అన్నీ చేయిస్తాడంటారు ఒక వైపున. వేరొక వైపున ఎవరి కర్మఫలం వారనుభవిస్తాడంటారు. దీనిలో ఏది నిజమో చెప్పండి?**

**జ.** రెండూ నిజమే. మనం పూర్వం చేసిన కర్మల కనుగుణంగా మరల కర్మల నాచరించేలా చేసి కర్మల ఫలాన్ని అనుభవించేలా చేసేది ఆయనే. దేనికీ ఆయన కర్మగాదు, సాక్షి మాత్రమే. ఆయన కర్మాగారాలమీద లేబర్ ఆఫీసర్ వంటివాడు. లేబర్ ఆఫీసరు కర్మాగారాలలో పనిచేసే కార్మికులకు యాజమాన్యం సక్రమంగా జీతాలు చెల్లిస్తున్నారా? లేదా? అని చూస్తాడు. చెల్లించకుంటే యాజమాన్యం చేత చెల్లింపచేస్తాడు. తన జేబులోంచి ఇవ్వడు ఇప్పిస్తాడంతే. అదేవిధంగా భగవంతుడు కూడా పూర్వకర్మలకు ఫలితంగా మనమాయా పనులు చేసేటట్లు ఫలితమనుభవించేటట్లు చూస్తాడు, అంతే.

**1150. పంచముఖాంజనేయుని అవతార విశేషమేమిటి?**

**జ.** పృథివి మొదలైన పంచ భూతాలకు చెందిన సమస్త శక్తులు ఆయనకు ఉన్నాయని చెప్పడం కోసం ఆలంకారికంగా ఆయనకు పంచ ముఖాలు కల్పించబడ్డాయి.



### 1151. జయేంద్రసరస్వతి స్వామివారు దేవునికి అభిషేకాలు రాత్రిపూట చేయవద్దన్నారు. నేను అయ్యప్ప గురుస్వామిని. అయ్యప్పకు రాత్రి పూటే పూజ, అభిషేకాలు చేస్తాం కదా ?

**జ.** జయేంద్రస్వామివారు మామూలు పద్ధతి వివరించారు. అయ్యప్ప స్వామి



పూజ విశేష పద్ధతి కనుక రాత్రికూడా చేయవచ్చు. అన్నింటికన్నా ఆచారం బలీయం కదా!

### 1152. దేవాలయాలలో పంచదేవాలయాలు చదువుతారు. గృహాలలో, పూజాగృహంలో వేద పఠనం జరగదు. కారణమేమిటి? వేదపఠన విశిష్టత ఏమిటి?

**జ.** దేవాలయాలలో వేదాధ్యయనం చేసిన పండితుల చేత వేదపఠనం చేయిస్తారు. ఇంట్లో ఆ సౌకర్యముండదు గదా! ఇంటి యజమాని వేదాధ్యయనం చేసిన వారైతే ఇంట్లోకూడా వేదపారాయణ చేసుకోవచ్చు. మనది వైదికధర్మం. మనం చేసే కర్మలన్నీ వేదవిహిత కర్మలే. వేదం మనకు ప్రమాణం.

### 1153. ఋత్విక్కులంటే ఎవరు?

**జ.** యజ్ఞ యాగాదులను చేయించే వారికి ఋత్విక్కులని పేరు.

### 1154. దీక్షాకంకణమంటే ఏమిటి?

**జ.** ఏదైనా కర్మ చేయడానికి దీక్ష వహించాలి. ఆ దీక్షకు గుర్తుగా దీక్షా కంకణ ధారణ చేస్తాం. అదే దీక్షాకంకణం.

### 1155. ఋషి సంప్రదాయం, ప్రకృతిపూజ అంటే ఏమిటి? అమ్మవారి దేవాలయాలలో చేసే కుంకుమపూజకి, ప్రకృతిపూజకి తేడా ఏమిటి?

**జ.** ఋషి సంప్రదాయమంటే ఆయా దేశ, కాలాలకు అనుకూలంగా ఆయా ఋషులు కొన్ని నియమ నిబంధనలను విధిస్తారు. వాటినే స్మృతులంటారు. మనువు మొదలుకొని అనేకమంది ఋషులు దేశ, కాలాలకు అనుగుణంగా మన కార్యకలాపాలలో అనేక మార్పులు చేస్తూ వచ్చారు. వాటికే స్మృతులని పేరు. మనము తాత తవ్విన బావిలో నీళ్ళే త్రాగాలని కూర్చోం. ఆ నీళ్లు మురికివై పురుగులు పడితే ఆ బావి పూడ్చి క్రొత్త బావి

త్రవ్వకుంటాం. ఈ కలియుగంలో పరాశర మహర్షి ఏర్పాటుచేసిన స్మృతి ప్రకారం మనం నడుచుకోవాలి. మన ధర్మాలలో దేశకాలాలకనుకూలంగా మహా జనులైన ఋషులు అనేక నియమ నిబంధనలను ఏర్పాటు చేశారు. ఆ విధంగా ఏర్పాటు చేయబడిన విధి, నిషేధాలు ఋషి సంప్రదాయానికి చెందినవి. ప్రకృతిపూజ అంటే–ప్రకృతిని విష్ణు పత్నిగా ఆరాధిస్తాం. ఆ శక్తికి కుంకుమ పూజ చేస్తాం.

### 1156 నవావరణ పూజ అంటే ఏమిటి? అది ఎందుకు చేసుకోవాలి?

**జ.** మనం పవిత్రులం కావాలంటే మన చుట్టూగల ఆవరణ అంతా పవిత్రం కావాలి. ఎనిమిది దిక్కులు, ఆకాశం పవిత్రం కావడానికి చేసే పూజకే నవావరణ పూజ అని పేరు.

### 1157. శివాలయంలోకి వెళ్ళి స్వామిని దర్శించి విభూతి రాసి, చెవులలో చెబుతారు. కారణమేమిటి?



**జ.** శివలింగాలలో కొన్ని స్పర్శ లింగాలు ఉంటాయి. వాటిని భక్తులు తాకాలి. శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి లింగం కూడా అటువంటిదే. "హస్తే కురంగం, గిరిమధ్య రంగం" – అంటూ శ్లోకం చదువుతూ ఆ లింగానికి తల తాకించాలి.

### 1158. చనిపోయిన వ్యక్తికి హిందువులు స్నానం చేయించి నూతన వస్త్రం కట్టి, కుంకుమ పెట్టి, పూలతో అలంకరించి స్మశానికి పంపుతారెందుకు?

**జ.** చనిపోయిన వ్యక్తి సూక్ష్మ శరీరంతో ఉంటాడు. పోయినది శరీరమే. ఇది వస్త్రం వంటిది. సూక్ష్మ శరీరధారి అయిన జీవునిపై మనకుగల ప్రేమ గౌరవాలకు చిహ్నంగ ఈ పనులన్నీ చేస్తాం. శ్మశానంలో దహనం చేయడం కూడా ఒక యజ్ఞమే. అందుకే దానికి అంత్యేష్టి అని పేరు. ఆ ఇష్టిని పవిత్రంగా చేయాలి. ఆ పవిత్రత కోసమే స్నానం చేయించడం ఇత్యాదులు. జీవునికి చేసే పదహారు సంస్కారాలలో ఇది చివరి సంస్కారం.

### 1159. ఆత్మ సాక్షాత్కారమంటే ఏమిటి?

**జ.** చావు, పుట్టుకలులేని, శస్త్రములు ఛేదించలేని, నిప్పు కాల్చలేని, నీరు తడుపలేని, గాలి ఎగురగొట్టలేని ఆత్మలం మనం. ఆ ఆత్మ పరమాత్మలోని అంశ. ఈ విధమైన జ్ఞానం పొందడానికే ఆత్మ సాక్షాత్కారమని పేరు.

### 1160. యజ్ఞమంటే ఏమిటి?

**జ.** ఒక్క మాటలో చెప్పాలంటే యజ్ఞ మంటే త్యాగం.

### 1161. గణపతి విశిష్టత ఏమిటి?

**జ.** గణపతి దేవతాగణాలకు పతి, విఘ్న నివారకుడు. అన్నిటికన్నా జ్ఞానానికి ప్రతీక గణపతి. "జ్ఞాత్వాకుర్వీత కర్మాణి" అని శాస్త్రాలు ఆదేశిస్తున్నాయి. ఏ పని చేసినా ఎందుకు చేస్తున్నామో, ఎలా



చేయాలో, దానివలన కలిగే ఫలిత మేమిటో తెలుసుకుని చేయాలి. ఊరికే గుడ్డిగానో, యాంత్రికంగానో చేయరాదు. ఆ విధమైన జ్ఞానాన్ని కలిగించేవాడు గణపతి. అందుకే పెండ్లి, పేరంటాలు, ప్రవేశ, నిర్గమాలు, చివరకు యుద్ధానికి వెళ్లినా ముందు గణపతిని పూజించిన మీదట ఆయా కార్యాలు చేయాలి.

### 1162. ముక్తికి మార్గం మంచిపని చేయడమా? లేక ప్రత్యేకంగా భగవంతుని పూజించాలా?

**జ.** కర్మల వలన గాని, ధనసంపద వలన గాని, సంతానం వలనగాని ముక్తి రాదు. వీటన్నిటినీ త్యాగం చేయుట వల్లనే ముక్తి లభిస్తుందని వేదమే పేర్కొంటోంది.

### 1163. హోమమంటే ఏమిటి?

**జ.** అగ్నిదేవుని పూజించడం, "అగ్ని మిచ్ఛధ్వం భరతా" అని వేదంలో ఒక మాట ఉన్నది. మనకు "భారతీయులు" అని పేరు రావడానికి కారణం అగ్నిని ఉపాసిస్తాం కనుకనే.

### 1164. ముఖాన బొట్టు ఎందుకు?

**జ.** కనుబొమల మధ్యనున్న భాగం మనకు ఆయువు పట్టు. దానిని శీతవాతా తపాదుల నుంచి కాపాడుకోవడానికి బొట్టు పెట్టుకుంటాం.

### 1165. భగవద్గీత అంటే ఏమిటి?

**జ.** భగవంతుడు గానం చేసినది భగవద్గీత.

### 1166. హిందూతత్వ శాస్త్రాలలో భగవద్గీతకు అంత ప్రాధాన్యమిస్తారు. దేనికి?

**జ.** భిన్నభిన్నములైన హిందూ తత్వ శాస్త్రాల సమన్వయ రూపం భగవద్గీత. హిందూ వేదాంత భావాలన్నింటి యొక్క సారం గీత. అందుకే దానికంత ప్రాధాన్యత.

### 1167. 'కంచి గరుడసేవ' అంటే ఏమిటి?

జ. కంచిలో గరుత్మంతుని విగ్రహమొకటి ఆరుబైట చేతులు జోడించి ఉండేది. పర మాత్మ సేవకు నిరంతరం సిద్ధంగా ఉండేది. దానిని బట్టి కంచి గరుడసేవ అన్న నానుడి ఏర్పడింది.



### 1168. ఆంధ్ర వాల్మీకి శ్రీవాసుదాసుగారి రామాయణంలో రామలక్ష్మణులు జటాయువును దుమ్మగూడెం వద్ద దహనం చేశారని రాశారు. దూమగూడెం దుమ్మగూడెంగా మారి ఉండవచ్చు. శ్రీదాశరథి రంగాచార్యులవారు 'జీడికల్లు' అని రాశారు. ఏది వాస్తవం?

జ. గోదావరీ తీరంలో 'ఎటపాక' అని మరొక గ్రామముంది. ఎటపాక అంటే 'జటాయువుపాక' అంటారు రామాయణంలో పేర్కొనబడిన ప్రదేశాల పేర్లలో ఈ విధమైన తేడాలున్నాయి. ఇందుకు కారణ మేమా అన్న ఆలోచన చేసిన పెద్దలు 'కల్పాంతర భేదత్వేనా' యని వాటినన్నిం టినీ సమర్థించారు. ప్రతి కల్పంలోను రామాయణగాథ పునరావృత మవుతుం దిట! ఆ విదంగా పునరావృత మవడంలో లోగడ కల్పంలో జరిగిన దానికి భిన్నంగా కొన్ని ఉండవచ్చునని వారి నిర్ణయం. వారి నిర్ణయానికి ఆధారం జగత్తులో ఒక సంఘటన జరిగితే అది శాశ్వతంగా ఉండిపోతుందన్న వైజ్ఞానిక సిద్ధాంతం.

### 1169. 'కథ కంచికి మనం ఇంటికి' అంటారెందుకు ?

జ. ఆ విధంగా దివ్యక్షేత్రమైన కంచిని స్మరిస్తూ శయనించడం కోసం. అటు కాశీ, ఇటు దక్షిణాన కంచి దివ్యక్షేత్రాలు. కాశీలో అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరులు, కాంచీ క్షేత్రంలో కామాక్షి సహిత ఏకామ్రే శ్వరులు నెలకొని ఉన్నారు.

### 1170. దేవుని ముందు దీపారాధనలో వత్తులు రెండు వేయాలా? లేక మూడా?

జ. ఒక్క వత్తి పనికిరాదు. రెండు వత్తులు వెలిగించడం ఆచారం.

### 1171. దేవుని వద్ద తాంబూలం, కదళీఫలాలను ఉంచేటప్పుడు అగ్రం దేవునివైపు కుండాలా? మనవైపుకా?

జ. అగ్రం దేవునివైపే ఉండాలి.

### 1172. భగవద్గీత, లలితాసహస్రనామం వంటివాటికి చివర ఫలశ్రుతి ఉంటుంది. దానిలో పారాయణ వలన ఫలానా ఫలముంటుందని ఉంటుంది. ఆ విధంగా ఎందుకు చెప్పడం?


**జ.** ఒక్కసారి చదవడం వలన ఆయా గ్రంథాలకు సంబంధించిన జ్ఞానం కలగ వచ్చు. ఆ విధంగ చదవడానికి వాటిని పారాయణ చేయడానికి చాలా భేద ముంది. పారాయణ చేయడం వలన వాటిలో పేర్కొనబడిన ఫలితలు తప్పక లభించడంలో అనుమానం లేదు. హిత కరమైన విషయాల పట్ల ఆశ కలిగించడం తప్పుకాదు. అహితములైన విషయాలపై ఆశ కలిగిస్తే తప్పు.

### 1173. తల్లి, తండ్రి మొదలైన వారు మరణించినప్పుడు సంవత్సరం పూర్తి అయ్యేవరకు పూజాదికాలుగాని, దీపారాధనగానీ చేయరాదంటారు. కానీ దేవాలయాలకు వెళ్లవచ్చునంటారు. నిజమేనా ?

**జ.** సంవత్సరంలోపు ప్రత్యేక కార్యక్ర మాలు, వివాహాదులు, వ్రతాలు పనికి రావుగాని రోజూ చేసే దీపారాధన, దేవా లయ దర్శనం నిరభ్యంతరంగా చేయ వచ్చు.

### 1174. దైవారాధన చేసే సమయంలో దీపం ఆరిపోతే ఏం చేయాలి?

**జ.** కృష్ణ! కృష్ణ! అని కృష్ణనామం స్మరించి మళ్ళీ వెలిగిస్తే సరిపోతుంది.



### 1175. భాగవతంలోని గోపికలు పూర్వజన్మలో ఋషులని, వారు శ్రీరాముని తమ పతిగా కావాలని కోరగా ద్వాపరంలో కృష్ణావతారంలో అది సాధ్యమవుతుందిదని వరమిచ్చాడని, ఆ ఋషులే గోపికలుగా జన్మించి కృష్ణునితో రాసక్రీడ జరిపారని చెప్పగా విన్నాను. దానికి ప్రమాణమెక్కడ లభిస్తుంది?

**జ.** ఈ విషయం కూడాపై ఆభాణకం లాంటిదే. రాముడు పురుషులను కూడా మోహపెట్టే రూపం కలవాడు. 'రమంతే యోగినోనంతే' అనగా యోగులు సత్యా నందస్వరూపుడగు రామునితో రమింతు రన్న మాటను పట్టుకుని ఈ విధమైన కథ ఏర్పడి ఉండవచ్చు. కృష్ణావతారం

లోని గోపికలకు కూడా పరమాత్మతో రాస క్రీడాదులు జరిపారన్నమాటకు గోపికలు జీవులని, పూర్ణ పుణ్యావతారమైన కృష్ణునిగా దేవుడే అవతరించాడని, కృష్ణుడనగా యోగేశ్వరేశ్వరుడని ఆయన లీలలన్నీ యోగుల లీలలని అర్థం చేసుకోవాలని పెద్దలంటారు.

### 1176. అష్టోత్తర పూజ దేవుని పటానికి కూడా చేయవచ్చునా? పూజకు ముందు రోజు కోసిన పూలు పనికి వస్తాయా?

**జ.** నిరభ్యంతరంగా చేయవచ్చు. కారణ మేమంటే దేవాలయంలో ప్రాణప్రతిష్ఠ చేసిన విగ్రహాలుంటాయి గానీ కాపుర



ముండే ఇంట్లో ఉండవుగదా! పూజకు అప్పటికప్పుడు కోసినపూలు శ్రేష్ఠం. కానీ కుదరని పద్ధతిలో ముందు రోజుకోసిన వైనా ఫరవాలేదు.

### 1177. మంత్రాన్ని బయటకు కాకుండా, మనసులో జపించడం శ్రేష్ఠమంటారు. మరి లలితా సహస్రనామ స్తోత్రం కూడా మనసులోనే చదవాలా?

**జ.** మంత్ర జపం బాహ్యం, ఉపాంశువు, మానసికం, సగర్భం – అని నాలుగు విధాలు. బయటకు జపించడం అధమం. అయితే హోమం, అర్చన సమయాల్లో మంత్రాన్ని బయటకు పఠిస్తారు. జపం లోనే బాహ్యం పనికిరాదు. పెదవి కదుపుతూ జపించడం ఉపాంశువు. ఇది



మంచిదే. దీనిని మధ్యమం అంటారు. క్రమంగా మానసికంగా మంత్ర జపం చేయగలగాలి. ఇది ఉత్తమం. అదే విధంగా సగర్భజపం కూడా ఉత్తమమైనదే. ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో కలిపి, మౌనంగా మంత్రాన్ని జపించడాన్ని 'సగర్భం' అంటారు. ఇది మహాసిద్ధిని చేకూర్చుతుంది. లలితా సహస్ర నామ స్తోత్రం బయటకు చదివినా తప్పు లేదు. నామం, స్తోత్రం–వీటిని ఎలా చదివితే మనకు తృప్తి కలుగుతుందో అలా చదువుకోవచ్చు. అది బాహ్యమైనా కావచ్చు, మానసికమైనా కావచ్చు.

## 1178. సంధ్యావందనం జీవితాంతమూ చేయవలసిందేనా? జ్ఞానమార్గంలో ఉన్నవాళ్ళు కూడా సంధ్యను ఉపాసించాలా?

**జ.** అహరహమూ సంధ్యను ఉపాసించాలని ఉపనిషత్తులే శాసించాయి. ఉపనయన సంస్కారమైనది మొదలు యావజ్జీవితం సంధ్యను ఆచరించితీరాలి. కేవలం సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించిన వారికే, ఈ నియమం చెల్లదు, అయినా సన్న్యాసంలో కూడా చాలా విధులున్నాయి. బ్రహ్మచారులు, గృహస్థులు చివరికి వానప్రస్థులతో సహా సంధ్యావందనం చేయవలసిందే. జాతాశౌచ మృతాశౌచాలలో కూడా సంధ్యను మానరాదు. అశౌచ కాలంలో అర్ఘ్య ప్రదానం వరకు మంత్రాన్ని ఉచ్చరిస్తూ చేయాలి. జపం, ఉపస్థానం మాత్రం మానసికంగా చేయాలి. నిత్య హోమాదులు దేవతార్చన వంటివి ఉంటే ఈ అశౌచ కాలంలో ప్రతినిధిగా వేరొక ఋత్విక్కును (అశౌచం లేనివారిని) నియమించి జరిపించాలి. కనుక జీవితకాలం సంధ్యను ఉపాసించ వలసిందే. జ్ఞాన మార్గంలో ఉన్నవాళ్ళు సంధ్యవంటి నిత్య కర్మను వీడరాదు. నిజంగా నిష్కామ స్థితిలో ఉన్నట్లయితే కామ్యకర్మలు మాని వేయవచ్చు గానీ, నిత్యనైమిత్తిక కర్మలను మానరాదు. ఎంత జ్ఞాన మార్గంలో ఉన్నామనుకున్నా యజ్ఞ, దాన, తపస్సులను మానరాదని భగవద్గీతలో శ్రీకృష్ణుని వచనం. ఇవి మనలను పవిత్రులను చేస్తాయి. నిత్య కర్మానుష్ఠానం చిత్తశుద్ధిని కలిగిస్తుంది. చిత్తశుద్ధి జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది.

## 1179. హారతి ఎందుకు ఇస్తాము? ఎందుకు కళ్ళకద్దు కొనవలయును ?

**జ.** హారతి జ్యోతి స్వరూపము.ఆ పరమాత్మ స్వయం ప్రకాశ స్వరూపుడు. జ్యోతి స్వరూపుడు. ప్రకాశము అంధకారమును తొలగించి వస్తువును దృష్టికి గోచర మగునట్లు చేయును. చీకటిలో మనము వస్తువులను చూడలేము. అట్లే అజ్ఞానమున్నప్పుడు ఆ పరమాత్మ స్వరూపము కానరాదు. కావున కళ్ళకు హారతి అద్దుకొనుచు అజ్ఞానాంధకారమును తొలగించి, జ్ఞాన ప్రకాశమును కలిగించుమని దేవుని ప్రార్థించవలెను. సూర్యుని యందు గల జ్యోతి ఆ పరమాత్మ యొక్క జ్యోతి, మన కండ్లలోగల జ్యోతి ఒక్కటే. "జాగ్రదవస్థలో కుడికంటిలో ఆ పరమాత్మ స్థానముందు" నని శ్రుతి పలుకుచున్నది.



## 1180. గ్రహశాంతి కోసం, లోకక్షేమం కోసం 'సుబ్రహ్మణ్య పట్టాభిషేకాన్ని' పారాయణ చేయమనీ; సత్‌సంతాన ప్రాప్తి కోసం సుబ్రహ్మణ్యజననగాధ'ని పారాయణ చేయాలనీ ఒక చోట ఒక స్వామీజీ చెప్పారు. అవి ఏ గ్రంథాలలో దొరుకుతాయి?

**జ.** చాలా పురాణాల్లో సుబ్రహ్మణ్య జనన గాథ ఉంది. వేనిలోనిదైనా పారాయణ చేయవచ్చు. రామాయణం బాలకాండలో



విశ్వామిత్రుడు రామ లక్ష్మణులకు కుమార స్వామి జననగాథను చెప్పాడు. "కుమారసంభవశ్చైవ ధన్యః పుణ్యఃతథై వచ" అని వాల్మీకి వచనం 'మహా భారతం అరణ్యపర్వంలో" కూడా స్కంద జనన ఘట్టం ఉంది. పారాయణకుగాను, వాల్మీకి రామా యణంలోని కుమార జన్మ వృత్తాంతం చాలు. ఇక సుబ్రహ్మణ్య పట్టాభిషేక ఘట్టం' మహా భారతం శల్య పర్వం'లో ఉంది. దానిని పారాయణ చేస్తే అద్భుత ఫలితాలు వస్తాయని మహా భారతమే సెలవిస్తోంది.

## 1181. అవధూతకు, గురువుకూ తేడా ఏమిటి? అవధూతలందరూ గురువులేనా? గురువులందరూ అవధూతలేనా?

**జ.** అవధూత అంటే ఒకచోట నిలిచి యుండకుండా గ్రామైక రాత్రంగా తిరు గుతూ, కరతలభిక్ష తరుతల శయన మన్న ట్లుగా ఉంటారు. నేను, నాది అన్న భావముగాని, గౌరవా గౌరవాలన్న తేడా గాని ఉండనివారు అవధూతలు. గురు వంటే మనలోపల నున్న అజ్ఞానాంధ కారాన్ని పోగొట్టి జ్ఞాన ప్రకాశాన్ని బోధి స్తారు. అవధూత తన నడవడిక ద్వారా జ్ఞాన స్వరూపాన్ని చూపిస్తారు.

## 1182. మంత్రానికి, బీజాక్షరానికి తేడా ఏమిటి?

**జ.** ప్రతి అక్షరము బీజాక్షరమే. బీజా క్షరము లేకుండా మంత్రము అనేది ఉండదు. అందుకే "అమంత్ర మక్షరం నాస్తి" అన్నది నానుడి. అయితే అనేక మంది దేవతలు, ఆ దేవతలను ఉపాసిం చటానికి వివిధ మంత్రాలు ఉన్నాయి. ఆ మంత్రాలకు ముందు ఆయా దేవీ దేవతలకు సంబంధించిన బీజాక్షరాలను వాడి జపించడం జరుగుతుంది.

## 1183. స్త్రీ సంతానం వల్ల అనర్థాలు కలుగుతాయనీ, పుత్రసంతానం పున్నామ నరకాన్ని తొలగిస్తుందనీ

**అందరూ పుత్ర సంతానం పైనే మమకారం చూపిస్తున్నారు. స్త్రీ శిశువులను గర్భంలోనే సంహరిస్తున్నారు. మన సంస్కృతిలో స్త్రీ పట్ల ఇంతటి అమానుషత్వాన్ని ఎందుకు బోధించారు.**

**జ.** ఇది సంస్కృతి చేసిన బోధ కాదు. స్వార్థ పరులైన వారి ద్రోహం మాత్రమే. స్త్రీ సంతానం కలిగితే 'మహాలక్ష్మి' పుట్టిం



దనుకొనే సంప్రదాయం మనది. స్త్రీని బాలగా, సువాసినిగా అర్చించే దివ్యత్వం మనది. స్త్రీ పట్ల గౌరవం, భక్తి ఈ దేశంలో ఉన్నట్లుగా ప్రపంచంలో ఎక్కడా లేదని పాశ్చాత్య చరిత్రకారులే లిఖించారు.

స్త్రీని అవమానించిన చోట, హింసించిన చోట దరిద్రం తాండవిస్తుందని మన పురాణాలు స్పష్టపరచాయి. స్త్రీ శిశు హత్య కుటుంబానికీ, సమాజానికీ, దేశానికీ శ్రేయస్సు కాదు. "పుత్రాత్, శతగుణం పుత్రీ" – 'కొడుకు కంటె వంద రెట్లు కూతురే మేలు' అని ప్రాచీనుల మాట. అలాగే తండ్రికంటే తల్లికే ఉదాత్త స్థానాన్నిచ్చారు. కొడుకు కొడుకుకంటే కూతురు కొడుకుకే (దౌహిత్రునకు) ప్రాధాన్యం.

### 1184. భార్య గర్భవతిగా ఉన్నప్పుడు భర్త చేయకూడనివి ఏమిటి? ఏ మాసం నుండి?

**జ.** భార్య గర్భవతి అయిన మూడవ మాసం నుండి ఆమె భర్త సముద్రస్నానం చేయకూడదు. గయాశ్రాద్ధం పెట్టకూడదు. క్షౌరం చేయించుకోకూడదు. శవాలు మోయకూడదు. కొండలు ఎక్క కూడదు. పుత్రుడికి ఉపనయనం చేయకూడదు.

సింధుస్నానం, గయాశ్రాద్ధం, వపనం, శవధారణమ్ ।

పర్వతారోహణం చైవ, నకుర్యాద్ గర్భిణీపతిః ॥

### 1185. స్త్రీలు గాయత్రిని పూజించవచ్చునా?


**జ.** నిరభ్యంతరంగా. పెండ్లిలో పెళ్లి కూతురు గౌరీ తపస్సన్న పేరుతో గౌరికి పూజ చేస్తుంది. అది గాయత్రిని పూజించడమే. ఆమె నడుముకు దర్భతాడు కడతారు. అది ఆమెకు ఉపనయనమే. అసలు గాయత్రీ మంత్రమంటే సూర్యునికి సంబంధించిన మంత్రమే. సూర్యునికి అందరూ నమస్కరించాలి.

### 1186. బ్రహ్మకపాలంలో పిండప్రదానం చేసి వచ్చిన తరువాత ఆబ్దికాదులు పెట్టాలా?

**జ.** పెట్టవలసిందే.

### 1187. గణపతి పూజలు, కుమారస్వామి పూజలు వైదికమైనవి కావనీ, తంత్రాలలో, ద్రావిడులలో ఉన్న పూజలనీ, అవి క్రమంగా హిందూమతంలో చేరిపోయాయని కొందరు వ్రాశారు. వివరించ కోరిక.

**జ.** వైదికమూలంలేని హిందూ మత సంప్రదాయాలు లేవు. ఆర్యులు, ద్రావిడులు అనే తెగలు లేవు. పరమాత్మకు కొన్నిదేవతల రూపాలలో కొన్ని చోట్ల విశేషంగా ఆచరిస్తారు. ఇవన్నీ ఏకవేద





సంస్కృతి తోనే ముడిపడి ఉన్నాయి. వైదిక యజ్ఞాలలోని వివిధ దేవతలే క్రమంగా మంత్ర తంత్ర శాస్త్రాలలో, పురాణాలలో సామాన్యులకు సైతం అందుబాటులో వివిధ ఆరాధనా పద్ధతులతో విస్తృత మయ్యాయి. వేదాలలోని యజ్ఞాగ్ని తత్త్వమే సుబ్రహ్మణ్యుడు, యోగ పరంగా కుండలినీ స్వరూపుడు. సేనానీ, కుమార, సుబ్రహ్మణ్య శబ్దాలు వేదాలలోనే ఉన్నాయి. గణపతి, వినాయక, జ్యేష్ఠరాజ మొదలైన నామాలతో ప్రణవ స్వరూపుడైన పరమాత్మను వేదం పేర్కొంది. వేద సంప్రదాయాలలోనే హోమ ప్రక్రియలు తంత్ర హోమాలలో కూడా స్వీకరించారు. హిందూ మతం వేదపురాణ తంత్ర శాస్త్రాల సమన్వయం మాత్రమే. అన్నీ ఒకదానితో ఒకటి అనుబంధం ఉన్నవి. ఈ దేశంలో జన్మించి వర్ధిల్లిన సత్సంప్రదాయాలివి.

### 1188. కులమతాల భేదాలు లేవంటారు కదా! కొంతమంది పాటిస్తున్నారు కదా! మీరేమంటారు?

**జ.** సమాజంలో అనేక కార్యకలాపాలు నిర్వహించవలసిన అవసరముంటుంది. ఈ పనులన్నింటికి ప్రధాన లక్ష్యం సమాజ శ్రేయస్సు. అన్ని పనులు అందరు నిర్వహించడం కుదరదు. కావున కొందరు కొన్ని పనులను వంశపారంపర్యంగా నిర్వహిస్తూ వాటిలోని సులువు బరువులను ఒంటపట్టించుకొని ఉంటారు. ఉదాహరణకు అందరూ ఉపాధ్యాయులు

artist

కాలేరు. అలాగే అందరూ వ్యాపారస్తులు కాలేరు. అందరూ శౌర్యపరాక్రమాలతో శత్రువు నెదిరించగలిగిన సైనికులు కాలేరు. కావున వ్యక్తుల యొక్క గుణా లను బట్టి, ప్రవృత్తులను బట్టి ఆయా వర్గాలు, కులాలు ఏర్పడతాయి. వీటిలో ఎక్కువ, తక్కువలు కాని భేదభావాలకు గాని ఆస్కారము లేదు. అందరూ ఒక తల్లి పిల్లలుగా మెలిగేవారు. ఒకరి క్షేమాన్ని మరియొకరు కాంక్షించేవారు. కానీ నేడు ఆ పరిస్థితి మారిపోయింది. ఇందుకు కారణము మనలో పెరిగిన స్వార్థ చింతన. ఈనాడు ఏ వృత్తిలో నున్న వారినైన ఆ పని ఎందుకు చేస్తున్నావని ప్రశ్నిస్తే తనకోసం, తన భార్యా పిల్లలను పోషించుకోవడం కోసమని సమాధానం చెబుతాడు. పూర్వము ఇదే ప్రశ్నకు సమా ధానంగా తను చేసే పని వలన పది మందికీ ఉపకారమౌతుందని, అందుకు ప్రతిగా తనకు లభించేది సమాజమిచ్చిన ప్రసాదమని, దానివలన తను, తన కుటుంబం పోషించబడుతున్నామని చెప్పే వారు. దీనిని బట్టి వ్యక్తుల ఆలోచనలలో ఏర్పడిన మౌలికమైన మార్పు ఇన్ని అర్థాలకు కారణమని గ్రహిద్దాం. మధ్య కాలంలో కుల నిర్మూలనకు ఉద్యమిం చిన వారు కొందరుండే వారు.

### 1189. ఉపాసన మార్గమంటే ఏమిటి?

**జ.** పరమాత్మను ఆరాధించే మార్గాలు అనేకమున్నాయి. వాటిలో ఉపాసన మొకటి. ఇందులో ఉపాసకుడు, ఉపాస్య దైవము, ఉపాసనా మంత్రములన్న మూడు విభాగాలుం టాయి. వీటికి త్రిపుటియని పేరు. ఈ త్రిపుటి ఒకటికావడము ఉపా సన యొక్క పరమావధి.

### 1190. ప్రదోషము అనగానేమి? ఎప్పుడు వస్తుంది? ఎలా చెయ్యాలి?

**జ.** ప్రదోషమన్నది కాలానికి సంబం ధించిన మాట. ప్రదోషకాల మంటే ముని మాపువేళ లేక సంధ్యాకాలమని అర్థం. ఆ సమయంలో స్నాన, సంధ్యాదులు చేసు కుని దేవుని పూజించాలి.


### 1191. శ్రీమద్రామాయణ, మహాభారతాలు ఏ మన్వంతరంలో జరిగాయి? తక్కిన మన్వంతరాల్లో జరిగిన విశేషా లేమిటి? గ్రంథాల వివరాలు తెలుపగలరు.

**జ.** పురాణాలు మన్వంతర గాథను తెలియజేస్తున్నాయి. విష్ణు, మత్స్య –

మొదలైన పురాణాలను చూస్తే ఏ మన్వం తరంలో ఏం జరిగాయో కొంతమేరకు తెలుసు కోవచ్చు. పురాణాల ఆధారంగా పరిశీలించితే రామాయణ, భారతాలు ఈమన్వంతరంలోనే జరిగాయి. అయితే ఈ వైవస్వత మన్వంతరంలో 24వ మహా యుగంలోని (నాలుగు యుగాలు కలిపి ఒక మహాయుగం) త్రేతాయుగంలో రామాయణం జరిగిందనీ, ఇప్పటి 28వ మహాయుగంలోని ద్వాపరంలో – అంటే ఇప్పుడు నడుస్తున్న కలియుగానికి ముందరి (నిన్నటి) ద్వాపరంలో – భారతం జరిగిందనీ పురాణాల లెక్క.

### 1182. మనదేశం ఆధ్యాత్మికతకీ, వైరాగ్యానికీ ప్రాధాన్యాన్నీయడం చేత ఆర్థికాభివృద్ధినీ, భౌతిక అభ్యున్నతినీ సాధించలేకపోయిం(తోం)దని కొందరి విమర్శ. సమాధానం?

***జ.*** ఇది పూర్తిగా తప్పుడు అభిప్రాయం. చారిత్రకంగా గమనించినా, పురాణేతిహాసాలను పరిశీలించినా ఈ దేశం భౌతిక, పారమార్థిక ప్రయోజనాలను సమన్వయం చేసినదిగా కనిపిస్తుంది. ఎంతో ఆర్థిక సంపద, వైభవం కలిగిన ఈ దేశంపై విదేశీయుల దాడి, దోపిడీ కారణాలుగా దారిద్ర్యం వచ్చిపడింది. క్రమంగా ఆధ్యాత్మికతకు, ధర్మానికి ప్రాధాన్యాన్ని ఇవ్వకుండా, భౌతిక సంపదల కోసం పరితపించే పాశ్చాత్య ధోరణి కారణంగా వ్యక్తి స్వార్థం చెలరేగి లంచగొండితనం, అన్యా



యార్జన పెరిగి దేశదారిద్ర్యం పెరుగుతోంది. స్వప్రయోజనాల సాధింపుకోసం దేశప్రయోజనాలను నాశనం చేయడానికి వెనుదీయని నాయకుల స్వార్థం, కుట్రలు ... వీటికి తోడు ప్రజ అలసత, ఉదాసీనత దోహదపడి అభ్యున్నతి దెబ్బతింది. మరి యొకవైపు చూస్తే అనేక రంగాలలో భారతాభివృద్ధి ప్రత్యక్షంగా కనిపిస్తోంది. కానీ – రాజకీయ సమాచారాన్నే సమస్తంగా భావిస్తూ, అక్రమ దుర్మార్గ ఘటనలే సంచలన వార్తలుగా ఆకర్షణీయంగా ప్రచురించే ధోరణికి అలవాటుపడ్డ మీడియా (మాధ్యమిక) రంగంకూడా మన అభివృద్ధిని తెలియనివ్వడం లేదు. ధర్మం ప్రవృత్తి, నివృత్తి మార్గాలుగా రెండు విధాలు. రెండింటిలో ఏదో ఒక్కటే గొప్పది – అని మన శాస్త్రాలు చెప్పవు. ప్రవృత్తి మార్గంలోని వారు ధనసంపాదన, వినియోగం వంటి వాటిలో అప్రమత్తంగా ఉండాలి. ధర్మం ప్రాతిపదికన ఎంత సంపాదించినా అది దోషంకాదు. స్వధర్మానికి దెబ్బ తగలకుండా అర్థ, కామ సంపాదనను ధర్మబద్ధంగా సాగించేవాడే నిజమైన మనిషి. నివృత్తి మార్గంలోని వారి వైరాగ్యాన్ని మనం అనుసరించరాదు. మానసికంగా వైరాగ్యాన్ని బోధించినా,

భావిస్తున్నా భౌతికంగా ధర్మాన్నీ, ధర్మ బుద్ధినీ మరువరాదు. కుటుంబంలో, సమాజంలో బ్రతికేవాడు కుటుంబం పట్ల, సమాజంపట్ల బాధ్యతగా ప్రవర్తిం చాలి. ధర్మంలో తనని తాను నియంత్రిం చుకుంటూ, దేశ ఆర్థికాభివృద్ధికి కృషిచేయ డమే భారతీయాదర్శం. రాజ సూయా దుల్ని నిర్వర్తించి ధన సమీకరణ చేసిన ధర్మరాజు, ధర్మ ప్రాధాన్యం చేత వాటిని వదలి, తిరిగి స్వధర్మబద్ధమైన యుద్ధ విధానంల్ల పోయిన సంపదని సాధిం చాడు. లేనిపోని వైరాగ్యంవల్ల కర్తవ్యం మరచిన అర్జునునికి ఈ దేశపు ఆధ్యాత్మి కౌన్నత్యమే ఓదార్పునీ, ప్రబోధాన్నీ అందించాయి. అంగళ్లలో రత్నాలును రాశులుగా పోసి, 'అర్థ', 'కామ' శాంస్త్రాలను ఏర్పరచి, ఆరోగ్యవంతమైన ధార్మిక పరిధుల్లో ప్రవృత్తి మార్గగామి పురోగమించగలడని ప్రబోధించిన ఆధ్యా త్మిక సంస్కృతి మనది. విద్యకీ, ధనానికీ అన్నిటికీ ప్రాచీన కాలంలో సమాజం సమ ప్రాధాన్యాన్నిచ్చింది. క్రమంగా భారత దేశం స్వాభిమానాన్ని కోల్పోయి, అను కరణాన్నే అభ్యుదయంగా భావించడం చేత అభ్యున్నతిని చాటలేక పోతోంద నిపిస్తోంది. మనకి జ్ఞానపూర్వకవైరాగ్యం కలిగితే మన వ్యక్తిగత భోగాలను త్యజిం చాలిగానీ గృహానికీ, దేశానికీ వైభోగంగా వైభవాలుండేలా జాగ్రత్త పడాలి. నివృత్తి మార్గంలోనివానికి ధనాన్ని నిల్వచేయడం దోషం ప్రవృత్తి మార్గగామికి ధనాన్ని దాచకపోతే దోషం. అధర్మం చేయకుండా నిగ్రహించే ఆధ్యాత్మిక, వైరాగ్యధోరణి ప్రవృత్తి మార్గంలో అవసరం. దానినే బోధించింది భారతదేశం.

### 1193. 'సేతుబంధేతు రామేశం' - అనే మాట శివపురాణంలో ఉంది. కానీ రామాయణంలో లేదు. పురాణాల ప్రకారం అయినా రావణవధకు ముందు లింగప్రతిష్ఠ జరిగిందా? లేక ఆ తరువాతనా? రాముడు శివుని ప్రతిష్ఠించలేదు - అని ఒక వైష్ణవస్వామి చెప్పారు. ఏది ప్రమాణం?

**జ.** ఆయన వైష్ణవస్వామి కనుక అలాగే చెప్తారు. కానీ వాల్మీకి రామాయణంలో సీతాదేవితో సహా శ్రీరాముడు పుష్పక విమానంపై వస్తూ, త్రోవలో వివిధ రపాం



తాలను చూపిస్తూ వివరించినట్లుగా యుద్ధకాండ 1223వ సర్గ, 19, 20, 21 శ్లోకాలలో – సేతుబంధ శివుని ప్రసక్తి స్పష్టంగా కనిపిస్తుంది. పురాణాలు చెప్పిన

ప్రకారంగా సేతు బంధానికి ముందే శ్రీరాముడు శివలింగప్రతిష్ఠ చేశాడు.

ఏతత్ కుక్షౌ సముద్రస్య స్కన్ధావార నివేశనమ్ ।

అత్రపూర్వం మహాదేవః ప్రసాద మకరోత్ ప్రభుః।

ఏతత్తు దృశ్యతే తీర్థం సాగరస్య మహాత్మనః ।

సేతుబంధ ఇతి ఖ్యాతం త్రైలోక్యేనాభి పూజితం ॥

ఏతత్ పవిత్ర మనఘం మహాపాతక నాశనం ।

(వాల్మీకి రామాయణం, యుద్ధకాండ)

"ఈ కనుపించునదే త్రిభువన విఖ్యాతమై మూడులోకాలలోను పూజనీయమైన, సాగరగర్భంలోగల సేతుబంధమనే పుణ్యతీర్థం. ఇది పరమపవిత్రమైనది. సకల మహాపాతక నాశనకరమైనది. ఇచటనే పూర్వం మహాదేవుడైన శివుడు ప్రసన్నుడైనాడు" – అని శ్లోకాల భావం.

అయితే ప్రతిష్ఠ చేసిన సన్నివేశాన్ని వాల్మీకి రచించకుండా, తరువాత మాత్రమే ఈ ప్రస్తావన చేశాడు. పురాణ సంప్రదాయంలో రచించిన గ్రంథంలోనే క్షేత్రాదుల గురించి విశేష ప్రసక్తి ఉంటుంది. కావ్య సంప్రదాయంలో ఉండదు. కొందరు శివ ద్వేషులైన వైష్ణవులు ఈ శ్లోకాలకు వ్యాఖ్య రాస్తూ 'మహాదేవ' అనే చోట 'సముద్రుడు' అని అర్థం చెబుతూ దూరాన్వయం చేశారు. అది ఔచిత్యానికి పొసగదు. శివ పురాణం, కూర్మ పురాణం మరికొన్ని



పురాణాలలో చారిత్రక గ్రంథాలలో రామేశ్వర ప్రశస్తి చాలా ఉంది. అవి ప్రమాణాలు కావనడానికి లేదు. ఆ మాట కొస్తే వాల్మీకి రామాయణంలో రామనామం తారక మంత్రమనిగానీ, భద్రాద్రి వంటి రామక్షేత్రాల గురించిగానీ ఏమాత్రం కూడా ప్రస్తావన లేదు. అయినా వాటిని కాదనలేము. రామమంత్రాన్నిగానీ, రామక్షేత్రాలని గానీ శంకించినా మహాపపామే. వాటి గురించి పురాణాది తదితర గ్రంథాలే ప్రమాణాలు. అలాగే రామేశ్వరం గురించి కూడా.

సేతుమధ్యే మహాదేవమీశానం కృత్తి వాససం ।

సామిసోమల సత్ఫాలం స్థాపయా మాస రాఘవః ॥

తస్యదేవో మహాదేవః పార్వత్యా సహ శంకరః ।

ప్రత్యక్ష ఏవ భగవన్ దత్తవాన్ వర ముత్తమమ్ ॥

యావత్ సేతుశ్చ తావచ్చ స్థాస్యామ్యత్ర తిరోహితః ।

స్నానం దానం తపశ్శ్రాద్ధం భిష్య త్యక్షయం ఫలమ్ ॥

స్మరణాదేవ లింగస్య దినపాపం వినవ్యతి"

"చంద్రార్ధ శేఖరుడు, గజచర్మధారి, జగదీశ్వరుడు, సకల దేవతాధికుడు – అయిన పరమశివుని సేతుమధ్యంలో రాఘవుడు స్థాపించాడు. పార్వతీ సహితుడైన మహాదేవుడు, భగవంతుడైన శంకరుడు ప్రత్యక్షమై వరమిచ్చాడు. పర్వతాలు, పృథివి, నదీనదాలు స్థిరములై నిలిచి ఉన్నంతకాలం నేను (శివుడు) ఈ సేతువునందు, సామాన్యుల కంటికి కనబడకుండా స్థిరంగా నివసిస్తాను. ఈ సేతువులో చేయబడిన స్నానం, దానం, శ్రాద్ధకర్మ, జపం, తపస్సు మొదలైనవి అక్షయమైన ఫలాలనిస్తాయి. శ్రీరామ ప్రతిష్ఠితమైన లింగాన్ని స్మరించినంత మాత్రాన, జనులకు ఆ దినాన చేసిన పాపాలన్నీ నశిస్తాయి."

రాముడు శివుని ఆరాధించినంత మాత్రాన రామపారమ్యానికి తక్కువ కాదు. వారిరువురూ ఒకే తత్త్వం. ఒకరి కొకరు భక్తులు.

## 1124. జన్మనక్షత్రంలో చేయకూడనివి ఏవి?

**జ.** ప్రశస్తం జన్మ నక్షత్రం సర్వకార్య సుశోభనమ్ ॥

జన్మ నక్షత్రం అన్ని పనుల్లో శ్రేష్ఠమేనని శాస్త్రం. కాని 'క్షౌర ప్రయాణ భైషజ్య వివాదేషు నశోభనమ్', క్షౌరం, ప్రయాణం, వైద్యం, వివాదాలలో (కేసులలో) పనికిరాదు.

## 1125. మన సంస్కారాల అంతరార్థం

**1. వివాహం :** వివాహం సమయంలో పురుహితునిచే వధూవరులకు మంత్రాలు చెప్పించ బడుతుంటాయి. ఆ సమయంలో వరుడు, "భగ, ఆర్యమ, సవిత, పురంధి అనే దేవ తలు గార్హపత్యం కోసం నిన్ను నాకు అను గ్రహించగా, నా జీవితం సుఖమయ మయ్యేందుకు నీ చేయిని నేను పట్టుకు న్నాను" అని చెబుతాడు.



**2. గర్భాదానం :** స్త్రీ పురుష సంయోగం ద్వారా పుట్టబోయే సంతానం యోగ్యులుగా ఉండేందుకై ఈ సంస్కారం నిర్దేశించబడింది.

**3. పుంసవనం :** తల్లి గర్భంలోని పిండం పవిత్రంగా ఏర్పడేందుకు ఉద్దేశించబడిన సంస్కారమే పుంసవనం.

**4. సీమంతం :** గర్భవతికి ఈ సంస్కారాన్ని నిర్వహించడంవల్ల దుష్టశక్తుల నుంచి రక్షింపబడుతుంది.

**5. జాతకర్మ :** బిడ్డకు నెయ్యిని రుచి చూపి, పది నెలలు తల్లి గర్భంలో ఉండి ఈ ప్రపంచానికి వచ్చిన జీవికి జరిపే తొలి సంస్కారం ఇది.

**6. నామకరణం :** బిడ్డ ఈ సమాజంలో తనకంటూ ఓ వ్యక్తిత్వంతో వృద్ధిలోకి రావాలన్న కోరికతో తల్లిదండ్రులు జరిపే సంస్కారం.

**7. నిష్క్రమణం :** బిడ్డను తొలిసారిగా బయటకు తీసుకెళ్ళడం. చంటిబిడ్డను విభిన్న వాతావరణాలకు పరిచయం చేయడమో ఈ సంస్కారంలోని అంతరార్థం.

**8. అన్నప్రాశనం :** బిడ్డకు బలవర్ధకమైన, ఆహారాన్ని పరిచయం చేయడం.

**9. చూడాకర్మ :** పుట్టు వెంట్రుకలను తీయించడం ఈ సంస్కారంలోని ప్రత్యేకత.

**10. కర్ణబేధ :** చెవులు కుట్టించడం.

**11. ఉపనయనం :** బాల బ్రహ్మచారికి జరిపే సంస్కారం.

**12. వేదారంభం :** సమావర్తన సంస్కారాన్ని చక్కగా ముగించేందుకే వేదారంభం.

**13. సమావర్తనం :** పిల్లలు విద్య ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చినప్పుడు ఈ సంస్కారం జరుపబడుతుంది.

**14. వానప్రస్థం :** బాధ్యతలను వారసులకు అప్పగించి వచ్చే జన్మకై జరిపే కర్మ.

**15. సన్యాసం :** ఐహిక బంధాల నుంచి విముక్తి పొందడం.

**16. అంత్యేష్టి :** పిత్రూణం తీర్చుకునేందుకు పుత్రులు చేసే సంస్కారం.

### 1126. బావిలో వినాయకుని నిమజ్జనం చేస్తే అతని ఉసురు తగులుతుందని, నీళ్లు తగ్గిపోతాయని మా తాతగారు అంటున్నారు. నిజమేనా?

**జ.** గణపతిని తొమ్మిదిరోజులూ పూజించి చివరన నదిలోగానీ, చెరువులోగాని నిమజ్జనం చేయడం ఆచారం. గణపతి జ్ఞానానికి చిహ్నం. జ్ఞానాన్ని గూట్లో పెట్టి తాళం వెయ్యండంకదా నదిలో కలిపి అంద



రికీ అందిస్తాం. అసలు గణపతిది పృథ్వీ తత్వం. మట్టితో గణపతిని చేసి ఆ మట్టి బొమ్మను నిమజ్జనం చేస్తాం. దానితో బాటు పత్రిని కూడా వేస్తాం. ఆ మట్టి మట్టిలో కలిసి పోతుంది. పత్రిలోని వివిధ పత్రాలు, గరిక మొదలైనవి నీటిని శుద్ధి చేస్తాయి. ఈ రోజుల్లో మట్టితో చేసిన విగ్రహాలకు బదులు సిమ్మెంటు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఇత్యాదులతో విగ్రహాలు చేయించడం, వాటికి వివిధ రంగులు పూయడం,

వాటిని నీళ్ళలో వేయడం వలన నీళ్ళు పాడవుతున్నాయి. కానీ, నీళ్ళు తగ్గడం జరిగిందన్న దాఖలాలు ఎక్కడా లేవు.

## 1197. దశరథ మహారాజుకు శాంతాదేవి కూతురెలా అయింది?

**జ.** నిజానికి ఆమె దశరథ మహారాజు కూతురు కాదు. తాను చేయదలచిన పుత్ర కామేష్ఠికి ఆధ్వర్యం వహించమని కశ్యప ముని కొడుకైన విభాండకుని కొడుకు ఋష్యశృంగుని ప్రార్థించడం, అతని భార్య శాంతాదేవితో ఆ దంపతులు వచ్చి పుత్ర కామేష్ఠి నిర్వహించడం జరిగింది. దశరథుడు ఆమెను కూతురుగా, ఋష్యశృంగుని అల్లునిగా భావించి గౌరవించాడు. ఆమె అంగదేశపు రాజు రోమపాదుని కూతురు.

## 1198. మైల, పురుడు వచ్చినప్పుడు సంధ్యావందనాలు, గాయత్రీ జపం చేయవచ్చునా?

**జ.** అర్ఘ్య ప్రదానం వరకు చేయాలి. గాయత్రీ జపం మొదలయినవి చేయకూడదు.

## 1199. క్షత్రియులకు దేవత్వం దేనివల్ల కలుగుతుంది?

**జ.** అస్త్ర శస్త్రాది విద్యలే క్షత్రియులకు దేవత్వం కలిగిస్తాయి. 'క్షత్రియులు' అనే మాటకు కాలానుగుణంగా ఇక్కడ 'పరిపాలకులు' అనే అర్థం తీసుకోవాలి. మహా



భారత కాలం కనుక క్షత్రియులు అస్త్ర శస్త్రాది విద్యలు నేర్చినప్పుడే దేవత్వం సిద్ధిస్తుందని ధర్మరాజు సమాధానం చెప్పాడు. అంటే క్షత్రియులు యుద్ధ విద్యలలో ఆరితేరాలని అర్థం. యుద్ధం చేయడం క్షత్రియ ధర్మం. శత్రు రాజులనుంచి రాజ్యాన్నీ, ప్రజలనూ రక్షించడానికే యుద్ధం చేయవలసి వస్తుంది. యుద్ధం చేయడానికి యుద్ధ విద్యలు నేర్వడంతో సరిపోదు. అందుకు అవసరమైన ధైర్యసాహసాలు, పరాక్రమం కూడా క్షత్రియులకు ఉండాలి. ప్రజల ప్రాణాలు కాపాడడానికి అవసరమైతే తన ప్రాణాలైనా త్యాగం చేయడానికి రాజు సిద్ధంగా ఉండాలి. ఇది క్షత్రియుల ధర్మం. దీనిని పాటించినప్పుడు క్షత్రియులు దేవత్వం పొందగలుగుతారు. యుద్ధం చేయడానికి, ప్రాణాలకు తెగించడానికి ధైర్య సాహసాలు అవసరమైనట్టే, ప్రజల

మేలును దృష్టిలో పెట్టుకొని కొన్ని సంద ర్భాలలో కీలక నిర్ణయాలు తీసుకోడానికి, వాటిని అమలు చేయడానికీ కూడా పాలకులకు ధైర్య సాహసాలు అవసర మవుతాయి. అటువంటి సందర్భాలలో వారు వెనుకడుగువేస్తే తమ ధర్మాన్ని తప్పి నట్టే. అప్పుడు వారు పాలకులని పించు కోవడానికి అనర్హులవుతారు. పాలకులు తమ విధ్యుక్త ధర్మాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తే దేవతలతో సమానులవుతారు. మన పెద్దలు రాజును సాక్షాత్తు విష్ణువే అన్నారు. త్రిమూర్తులలో విష్ణువు వహిం చేది జగద్రక్షణభారం. రాజు చేసేది కూడా అదే. శత్రుభయం లేకుండా ప్రజలు జీవిం చినప్పుడే విద్య, విజ్ఞానం, సంపద అభి వృద్ధి చెందుతాయి. రక్షణే లోపించి నప్పుడు ఏదీ ఉండదు. ఉన్నా ఉపయోగ ముండదు. కనుక పాలకుల బాధ్యత చాలా కీలకమైనది. ఈ సందర్భంలో ఒక విషయాన్ని గుర్తు చేసుకోవాలి. మన రామాయణ, మహాభారత, భాగవతాది గ్రంథాలు వయసు మళ్ళినవారు చదువు కోవలసిన ఆధ్యాత్మిక గ్రంథాలనే అపోహ చాలమందిలో ఉంది. నిజానికి వాటిలో ఆధ్యాత్మిక విషయాలతో పాటు లౌకిక విజ్ఞానాన్ని అందించే విలువైన అంశాలు చాలా ఉన్నాయి. సమాజంలోని వివిధ రంగాలవారు ఎలా నడుచుకోవాలో, ఎవ రెవరి ధర్మం ఎటువంటిదో బోధించే అనేక ఘట్టాలు ఈ రచనల్లో కనిపిస్తాయి. ఏకాలానికైనా, ఏ సమాజానికైనా వర్తించే



నిత్యసత్యాలను బోధించడం ఈ రచనల విశిష్టత. నేటికీ ఇవి నిలిచి ఉండడానికి ఈ గుణమే కారణం.

**క్షత్రియులలో సదాచారమేది?**

యజ్ఞాలు చేయడమే క్షత్రియులలో సదాచారం. పంచభూతాలతో నిండిన ప్రకృతి అందించే సంపదే మన జీవనా నికి ఆధారం. ఆ సంపదను మనం స్వేచ్ఛగా అనుభవిస్తున్నాం. అయితే దానిని సృష్టిం చినది మనం కాదు. మన తెలివి కాదు. ప్రకృతి సంపదను సృష్టించి మనకోసం అందించినవాడు భగవంతుడు. కనుక భగవంతునికి మనం కృతజ్ఞతలు చెప్పు కుంటూ ఉండాలి. అది మన ధర్మం. భగ వంతుడు దయతో మనకు అందించిన సంపదను దుర్వినియోగం చేయకుండా,

కేవలం స్వార్థానికే ఉపయోగించుకో కుండా పదిమందికీ అందాలన్న దృష్టితో వ్యవహరించాలి. భగవంతునికి కృతజ్ఞ తలు అర్పించుకునే ప్రక్రియలలో యజ్ఞం కూడా ఒకటి. భగవంతుడు మనకం దించిన ప్రకృతి సంపదనే మనం యజ్ఞంలో సమర్పిస్తాం. యజ్ఞాలు ఎంతో అర్థబలం, అంగబలం అవసరమైవి. సామాన్యులకు అవి అందుబాటులో ఉండవు. కనుక క్షత్రి యులు యజ్ఞం చేయాలని, అదే వారి సదాచారమని ప్రత్యేకంగా చెప్పడం జరి గింది. ఇక్కడ 'యజ్ఞం' అనే మాటను కూడా కాలానుగుణంగా విస్తృతమైన అర్థంలో తీసుకోవాలి. పదిమందికి మేలు చేసే మంచి పనీ యజ్ఞమే. అందుకే, పెద్ద ఎత్తున జరిపే ఏ సత్కార్యాన్నయినా 'యజ్ఞం'తో పోల్చడం చూస్తుంటాం. పాలకులు యజ్ఞం చేయాలని చెప్పడమంటే, ప్రలందరికీ ఉపయోగపడే మంచి పనులు చేయాలని అర్థం. అదే వారి ధర్మం, వారి సదాచారం కూడా. మంచిపనులే భగవంతుడికి సంతోషం కలిగిస్తాయి. అప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుంది. పాలకులకు మను గడ లభిస్తుంది.

**క్షత్రియులలో మనుష్య భావమేది?**

భయమే క్షత్రియులలో మనుష్యభావం. దేవత్వానికి విరుద్ధమైనదే మనుష్యభావం. జనన మరణాలు లేనివారే దేవతలు. జనన మరణాలు ఉన్నవారు మనుషులు. తమ ధర్మాన్ని త్రికరణ శుద్ధిగా నిర్వర్తించే వారు దేవత్వం పొందుతారు. ధర్మం తప్పిన



వారు మనుష్యస్థితిలోనే ఉండి జనన మర ణాలు, సుఖదుఃఖాలు, శోక మోహాల మధ్య నలుగుతూ ఉంటారు. ఇంతకు ముందు ప్రశ్నలో చెప్పుకున్నట్టు ధైర్య సాహసాలతో జీవించడమే క్షత్రియ ధర్మం. భయమనే మాటకు క్షత్రియుడి జీవితంలో తావు ఉండకూడదు. అతనిలో పిరికితనం ప్రవేశించిందంటే అతడు క్షత్రియత్వానికే అనర్హుడు. అదే అతని పతనం. అందుకే యుద్ధంలో వెన్ను చూపి పారిపోయేవారిని చాలా హీనంగా చూస్తారు. ఖడ్గతిక్కన కథలాంటి కథలెన్నో మనకున్నాయి. యుద్ధానికి వెడుతున్నప్పుడు, 'విజయమో, వీరస్వర్గమో' అన్న ఆదర్శం తప్ప, మరో ఆలోచన ఏదీ క్షత్రియునికి ఉండకూడదు. పాలకులలో భయం అడుగు పెట్టిందంటే దాని ప్రభావం పరిపాలన అంతటా

ప్రసరిస్తుంది. రాజ్యమే అల్లకల్లోల మవుతుంది. దృఢంగా, స్థిరంగా, నిబ్బరంగా ఉండి మంచి చేసే పాలకులే రాజ్యానికి కొండంత బలం. పిరికితనం వల్ల తనను తాను పతనం చేసుకోవడమే కాక, రాజ్యాన్ని కూడా పతనం చేసే పాలకుడు ఆ పాప ఫలితాన్ని మళ్ళీ మళ్ళీ జన్మించి అనుభవిస్తూనే ఉంటాడు.

**క్షత్రియులలో దురాచారమేది?**

శరణు కోరి వచ్చినవారిని విడిచి పెట్టడమే క్షత్రియులలో దురాచారం. రక్షించేవాడే రాజు. రక్షణ కోరేవారిలో రకరకాల వారుంటారు. వారినే ఆర్తులని కూడా అంటారు. ఆర్తులలో అన్నార్తులుంటారు. ఇతరుల వల్ల ప్రాణాలకు ముప్పు వాటిల్లిన వారుంటారు. ధనార్తులుంటారు. శరణు వేడిన వారి విషయంలో స్వపరభేదాలు కానీ, జాతి,మత, కుల, లింగ భేదాలు కూడా ఉండవు. అటువంటి భేదాలను చూసేవాడు పాలకుడే కాదు. పరుడైనా, శత్రుపక్షం వాడైనా శరణుకోరి వస్తే రాజు అతనికి అభయమివ్వవలసిందేనని మన పురాణ కథలు శరణాగత ధర్మాన్ని చాలా నొక్కి చెప్పాయి. శత్రు పక్షంవాడైన విభీషణుడు తనను శరణు వేడినప్పుడు రాముడు అతనికి శరణిచ్చి పాలక ధర్మం నిర్వర్తించాడు. అలాగే సుగ్రీవుడు తనను శరణు కోరాడు కనుక, అధర్మపరుడైన వాలిని అధర్మ పద్ధతిలోనే సంహరించ డానికి ఆయన వెనుకాడలేదు. గయోపాఖ్యానకథ కూడా శరణాగత ధర్మాన్నే నొక్కి చెబుతుంది. శత్రుపక్షం వారికే శరణు ఇచ్చి తీరాలన్నప్పుడు స్వపక్షంలో, స్వజనంలోశరణు కోరి వచ్చివారికి శరణివ్వడం ఎంత ముఖ్యమో గుర్తు చేయడానికే ఈ కథలు. ప్రజలు అనేక సమస్యలతో పాలకులను ఆశ్రయిస్తుంటారు. వారి సమస్యలను తీర్చడానికి పాలకులు ఎంతో ప్రాధాన్యం ఇవ్వాలని ఈ జవాబులోని అంతరార్థం. శరణా గతులను విడిచి పెట్టడమంటే రాజు తన ధర్మాన్ని విడిచిపెట్టడమే. అదే అతని విషయంలో పెద్ద దురాచారం.

## 1200. శుచి శుభ్రతను పాటింపక భగవంతుని స్మరించుట దోషమా? కాదా?

**జ.** ప్రతిరోజు నియమంగా ఒకటి, రెండు గంటలు మాత్రము నామస్మరణ జపము చేయునప్పుడు శుచిగా మడిబట్టలు కట్టుకొనుట, స్నానము చేయుట మొదలగు వాటిని తప్పక ఆచరింపవలయును. ప్రతి



రోజు పగలు రాత్రి ఒక్కటిగా చేసి నామ స్మరణ చేయదలంచినచో శుచి - శుభ్రత యొక్క ఆవశ్యకత లేదు.

### 1201. ద్వాదశ నామములలోను పూజలలోను "కేశవ" నామాన్ని మొదట్లో ఎందుకు ఉచ్ఛరిస్తారు?

**జ.** క + అ + ఈశ + వ అన్న నాలుగు పాలు చేర్చిన "కేశవ" పదు ఉత్పత్తి అగును. క = బ్రహ్మ, ఈశ = ఈశ్వరుడు, అ = విష్ణువు అని అర్థము (అక్షరాణాం అకారో స్మి) వ = వశ అని అర్థము (అక్షరనాం అకారో స్మి) వ = వశ అని అర్థము. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు వశమందు గవాడు కేశవుడు, ఈ నామము యొక్క అర్థము అత్యంత విపులము వ్యాపకము అగుట మూలాన ప్రప్రథమముగా ఉప యోగిస్తున్నారేమో? కశ్చ అశ్చ ఈశశ్చ త్రిమూర్తయః కేశాస్తే ద్వశన వర్తన్తే స కేశవః

### 1202. "దీపం పరబ్రహ్మ" అంటారు. దాని విశిష్టత ఏమి? దీపమునకు - ధూపమునకు గల సంబంధమేమి?

**జ.** దీపము పరబ్రహ్మమునకు ప్రతీకము. పరబ్రహ్మ స్వయం ప్రకాశ స్వరూపము. అట్లే దీపమును వెలిగించుటకు నూనె, వత్తి మొదలైనవి అవసరమైనను వెలిగిన దీపమునకు వేరే ప్రకాశము అవసరము లేదు. ఆ దీపము అంధకారమును తొల




గించును. కనుకనే జ్ఞానము కలిగి నప్పుడు అజ్ఞానాంధకారము నిలువ జాలదు. దీపము సూర్యునివలె బయ టను, లోపలను ప్రకాశ స్వరూపమే. అట్లే జ్ఞానియగువాడు శరీరమునకు లోపల, బయట ఆ యాత్మ చైతన్యమునే చూచును. ఇక ధూపము "వనస్పతి-ఓషధు"ల రస స్వరూపము. (వనస్పతి : మామిడి, పనస మొదలగు పండ్లు. ఓషధి : గోధుమ, వరి మున్నగు ధాన్యములు) పండ్లు ధాన్య ములు భూమి నుండి పుట్టినవి. గంధము భూమి యొక్క గుణము, ఆ పరమాత్ముని స్థూల విరాట్స్వరూపమే భూమి, ఆత్మ నుండి ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి ఉత్పన్నమైనవి. భూమి యొక్క సార స్వరూపమే ధూపము. ఎంత మంచివాసన (సువాసన) గల ధూపమును వెలిగించినచో పరమాత్మ - దేవత లంత

తృప్తి నొందును. ధూపము స్థూలము. దీపము (అగ్ని) సూక్ష్మము. కనుక ఆ పరమాత్మను తెలిసికొనుటకు స్థూలాతి స్థూలము నుండి సూక్ష్మాతి సూక్ష్మమునకు పోవలెను. "దృశ్య తేత్వగ్ర్యయా బుదాధ్య సూక్ష్మయా సూక్ష్మమ దర్శిభిః" అని శ్రుతి హారతితో దీపమును, శంఖములో జల మును, పుష్పము, వస్త్ర, చామరములను దేవునికి చూపించెదరు. దీపము = అగ్ని, శంఖము = జలము, పుష్పము = భూమి, వస్త్ర = ఆకాశము, చామరము = వాయువు, ఈ విధముగా ఐదు తత్త్వములుగల ప్రపం చమును సూచించుట ద్వారా సృష్టికి కార కుడైన పరమాత్ముని కూడా సూచింతురు.

### 1203. ప్రతి మనిషిలోనూ భగవంతుణ్ణి ఏ విధంగా దర్శించాలి? మనిషిలో కొన్ని దుర్గుణాలు కనబడితే ఆ మనిషిని భగవంతునిగా ఎలా చూడగలం?

***జ.*** "నువ్వు ఏ విధంగా ధ్యానించాలను కొంటున్నావు? నీ ఇష్టదైవ మెవరు?" అని శ్రీరామకృష్ణులు, తన శిష్యుడైన శరత్ (స్వామి శారదానంద)ను అడిగినప్పుడు ఆ యువకుడు "నేను అందరిలోనూ భగ వంతుణ్ణి దర్శించాలనుకొంటున్నాను" అని సమాధానం చెప్పాడు. అందుకు 'పారమార్థిక జీవిత చిట్టచివరి అనుభూతి అది" అని చెప్పారు శ్రీరామకృష్ణులు. ఆధ్యాత్మిక సాధన చరమదశలోనే ఈ అనుభూతి కలుగుతుంది. అయితే భగ వంతుడు సర్వవ్యాపి. ఆయన లేనిచో టంటూ లేదు. కనుక, సర్వత్రా విరాజిల్లే పరమాత్మ, సృష్టిలో మానవుల్లో విశేషంగా ప్రకాశిస్తున్నాడనే విశ్వాసంతో శాస్త్ర పఠనం, మహాత్ముల బోధనల జ్ఞానంతో మనం నిత్య జీవితంలో చూసే వ్యక్తులం దరిలో వారి వారి లోపాలను పట్టించు కోక, అందరితోనూ స్నేహపూర్వకంగా మెలగాలి. మొట్టమొదట మనమెవర మనే విషయం మనం తెలుసు కోవడం అవ సరం. మన హృదయం లోనే సర్వదా నెలకొని ఉన్న దైవాన్ని ఆధ్యాత్మిక సాధన లైన పూజ, జప, తప సాధనల ద్వారా దర్శించు కోవాలి. అప్పుడు తనలో ఉన్న దైవమే అందరిలోనూ ఉన్నాడన్న బోధ కలుగుతుంది. అందరికీ ఉపకారం చేస్తూ, కలలో కూడా ఎవ్వరికీ అపకారం చెయ్యకుండా ప్రవర్తిస్తాడు. అటువంటి



వ్యక్తి సాధన, ఏదో రకమైన తపస్సు లేకుండా సాధ్యం కాదు. జ్ఞాని అయితే పరమాత్మ "ఈశావాస్య మిదగ్గం' ఈశ్వరుడే అంతట వ్యాపించి ఉన్నాడు అని భావిస్తాడు.

త్వం స్త్రీ త్వం పుమానసి త్వం కుమార ఉతవా కుమారీ,

త్వం జీర్ణో దండేన వ్చసి త్వం జాతో భవసి విశ్వతోముఖః.

(ఈశ్వరా) నువ్వే స్త్రీవి, పురుషుడవూ నువ్వే, నువ్వే యువకుడవూ, యువతివీ నువ్వే, నువ్వే చేతి కర్ర పట్టుకొని వణుకుతూ వెళుతున్న వృద్ధుడివీ, అన్ని దిక్కులా ముఖాలతో జన్మిస్తావు. అని శ్వేతాశ్వతరోపనిషత్తు (4.3) చెబుతోంది. ఇటువంటి దృఢమైన ప్రజ్ఞతో జ్ఞాని మెలగాలి.

ముక్తిర్నైజసుఖానుభూతిః అమాభక్తిశ్చ తత్సాధనం

హ్యక్షాది త్రితయం ప్రమాణం అఖిలామ్నాయైకవేద్యో హరిః

ద్వైతులు 'అస్తిత్వ' వాదులు. వారికి మహావిష్ణువే పరమగమ్యం, శాశ్వత సత్యం. జగత్తు నిజంగానే సత్యం. జీవులు హరి కంటే భిన్నులూ, ఆయన అనుచరులు. వారు తమ కర్మల ద్వారా ఊర్ధ్వ అధోలోకాలకు వెళతారు. జీవునిలోనే ఉన్న సహజమైన సుఖానుభూతే ముక్తి. దానికి (ముక్తికి) నిష్కల్మషమూ, పరిపూర్ణమైన భక్తి సాధనం. ప్రత్యక్ష, అనుమాన, ఆగమాలు – వేదాలే ప్రమాణం. సకల శ్రుతులూ, వేద్యుడైన  హరిని గురించే చెబుతున్నాయి.

**విశిష్టాద్వైతం :** దీన్ని శ్రీరామానుజాచార్లు విశేషవ్యాప్తి లోకి తీసుకొచ్చారు. విశిష్టాద్వైతం ప్రకారం మహావిష్ణువే పరమ సత్యం. బ్రహ్మ, చిత్ (మనస్సు), అచిత్ (జడం) ఈ మూడూ సత్యాలే. బ్రహ్మ, చిత్, అచిత్‌లచే విశిష్టమైనదున విశిష్టాద్వైతం అనే పేరు వచ్చింది. "విష్ణువు సర్వాంతరాత్ముడు. సక కల్యాణ గుణాల ఆకరం ఆయన, అన్ని శబ్దాలూ ఆయన్నే సంబోధిస్తున్నాయి. భక్తి ద్వారానే ఆయన ప్రాప్తిస్తాడు. ప్రపత్తి ద్వారా అతి సులభంగా లభిస్తాడు. భుక్తిని, ముక్తినీ ప్రసాదిస్తాడు. జీవులందరూ లక్ష్మీదేవితో సహా అస్వతంత్రులు. శంకరాది దేవత లందరూ ఆయన్నే సేవిస్తారు. వేదాలు, పంచరాత్రాది నిగమాలు చెప్పేది ఈ విషయాన్నే. ఈ సత్యాన్నే ఢంకామోగించి చాటు" అంటారు విశిష్టాద్వైతులు.

విష్ణుః సర్వాంతరాత్మా సకలగుణనిధిః సర్వశబ్దాభిధేయః

భక్త్యాలభ్యః ప్రపత్యాపునః అతిసులభః భుక్తిముక్తి ప్రదాతా

జీవాసర్వే అస్వతంత్రాః ప్రకృతిరపి తథా కింకరాశ్శంకరాద్యాః

ఇత్థం త్రైయ్యంత సిద్ధం నిగమ తతిగతం తాథ్యతాం జైత్రభేరిః

**అద్వైతం :** అద్వైత వేదాంతాన్ని గౌడపాదాది ఆచార్యులు వ్యాప్తి చేసినా, శ్రీ శంకరాచార్యులే దీన్ని శుతి, యుక్తి, అనుభూతి ప్రమాణాలతో విశేష వ్యాప్తి చేశారు. పరబ్రహ్మ త్రికాల సత్యం. జీవుడు దేవుడే.

'ఉపాధి' భేదం మూలంగా దైవంకంటే భిన్నంగా కనబడుతున్నాడు జీవుడు. 'శరీరం, మనస్సు' అనే 'ఉపాధులను జీవుని నుంచి తొలగిస్తే మిగిలేది ఆ దైవమే. జీవునికి దేవునికి ఉన్నది. భక్తుడైతే తాను భగవంతుని సేవకుడూ, సర్వ చరాచరసృష్టి ఆ భగవంతునిదే కనుక ఆయన సంతానాన్ని సేవిస్తూ గౌరవిస్తూ జీవిస్తాడు. ఇలా ఎవరిలోనైన లోపాలున్నా, వాటిని గమనించక ఆ వ్యక్తిలో అంతర్గర్భితంగా ఉన్న పరమాత్మను చూస్తాడు భక్తుడు. ఎవరికి వారు దీన్ని అనుభూతి పొందవలసిందే. "తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు, నుర్విజనుల కెల్లనుండు తప్పు" అనే వేమన సూక్తిని జ్ఞాపకముంచుకొని, "ఎవరూ పరాయివారు కాదు, ఈ ప్రపంచాన్ని నీ సొంతం చేసుకో" అనే శారదా మాత చరమోపదేశాన్ని నిత్యస్మరణతో ఆచరణలో పెట్టాలి.

## 1204. శ్రీశంకరాచార్యులవారి అద్వైత మతం, శ్రీరామానుజాచార్యులు ప్రతిపాదించిన విశిష్టాద్వైతం, శ్రీమధ్వాచార్యులు ప్రాచుర్యం చేసిన ద్వైతం గురించి వివరణలు

**జ.** పైమూడు మతాలను భిన్న కాలాలలో ఆయా ఆచార్యులు ప్రతిపాదించి ప్రచారం చేశారు. వారి శిష్య ప్రశిష్యులు ఆయా మత సిద్ధాంతాలను పరంపరగా వ్యాప్తి చేస్తున్నారు. "వారి సిద్ధాంతాలను సులభంగా అర్థం చేసుకోవడానికి శ్లోక రూపంలో కింది బోధించిన విధంలో తెలుసుకొందాం.



పైమూడు తత్త్వాల మూలం పరబ్రహ్మే. వ్యాసభగవానుని వచనం వారికి శిరోధార్యం. అయితే ఈ మూడూ ఒకదానికొకటి పూరకాలే కాని విరుద్ధమైనవి కావు. ద్వైతమతాన్ని శ్రీ మధ్వాచార్యులు స్థాపించారు.

**శ్లోకం:** శ్రీమన్ మధ్వమతే హరిః పరతరః సత్యం జగత్తత్త్వతః,

భిన్నోజీవగణః హరేః అనుచర నీచోచ్చ భావం గతః 'ఉపాధి' కల్పిత భేదమే. అది నిజంగా లేదు. జ్ఞానం ద్వారానే ఈ స్థితి లభిస్తుంది. శరీరం, మనస్సు అహంకారం ఉన్నంత వరకే జీవుడు. ఆ అహంకార మమకారాలు తొలగితే జీవుడు శివుడే అవుతాడు.

కూటస్థం బ్రహ్మ విశ్వం జనయతి న వినామాయయా చ మిథ్యా

తస్మిన్ శబ్ద ప్రసిద్ధేః తదధి గమాత్ తన్నివృత్తి శ్రుతేశ్చ,

సైవా విదాయ మృషార్థాః పి సమధి గతాః కార్యదక్షాః ప్రపంచః

తస్నాన్మాయూర పింఛ చ్ఛవిరివ గహనః బ్రహ్మసంవిత్ వివర్తః

**భావం :** మార్పులేనిది, శాశ్వతమైనది బ్రహ్మ. మాయలేకుండా విశ్వాన్ని సృష్టించ లేదు. విశ్వం కూడా మిథ్యే అని వేదాంత శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ఎందుకంటే బ్రహ్మజ్ఞానంతో భేదబుద్ధి నశిస్తుంది. ఆ అవిద్య, అసత్యం. అయినా, దాని కార్యం ప్రపంచం ద్వారా దృష్టి గోచరమవు తున్నది. పురివిప్పిన నెమలి చిత్రపటాన్ని గోడమీద చూచినట్లుగా నిరూపించ శక్యం కాదు. జ్ఞానస్వరూపమైన బ్రహ్మవివర్తం –అంటే రజ్జుసర్పన్యాయంలోవలె – మందాంధకారంలో తాడుపాముల కన పడటం. బ్రహ్మం ఎప్పుడు తన సచ్చిదా నంద స్వరూపంలో ఉన్నప్పటికి విశ్వంలా గోచరిస్తుంది. అద్వైతం అర్థం చేసుకోవ డానికి కొంచెం నిగూఢం–అపార్థం చేసు కోవడానికి, తప్పుగా వ్యాఖ్యా నించడానికి చాలా అవకాశాలున్నాయి. ఈ అద్వైత జ్ఞానంతో జీవన్ముక్తులుగా ఇలలో మనగలం.


## 1205. స్త్రీలు రుద్రాక్షలు ధరించవచ్చా? వయోపరిమితి ఏమైనా ఉందా?

**జ.** సాధారణంగా స్త్రీలు రుద్రాక్షలు ధరిం చరు. అయితే బ్రహ్మచారిణిలు, సర్వ సంగపరిత్యాగం చేసిన ప్రవ్రాజికలు, స్వామినిలు వాటిని ధరించడం మనం చూస్తాం. రుద్రాక్షధారణ వైరాగ్యానికి చిహ్నం. రుద్రాక్షలకు కొన్ని వ్యాధి నివా రణ శక్తులు ఉన్నాయని శైవాగమాలు చెబుతాయి.

## 1206. ఇంద్రియ నిగ్రహం సంపాదించిన తర్వాత సన్యాసం తీసుకోవడం మంచిదా? సన్యాసం తీసుకొన్న తరువాత ఇంద్రియాల్ని అదుపులో పెట్టడం సులువా?


**జ.** నిజంగా సన్యసించదలచిన వారు ఇటువంటి ప్రశ్నలు వేయరు. ఇంద్రియ నిగ్రహం సన్యసించక ముందు, తర్వాత కూడా అవసరం. సన్యాసం అంటే కాషాయవస్త్రాలు, దండ కమండలాలు ధరించడం కాదు. సంపూర్ణ ఇంద్రియ నిగ్రహం అవతార పురుషుల జీవితాల్లో మనం చూస్తాం. ఉదాహరణకు శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు సకల శాస్త్రాలు ఆక ళింపు చేసుకొన్న విద్వాంసుడు. వివాహి తుడు. భార్య పేరు విష్ణుప్రియ. అనేక మంది శిష్యులు ఆయన వద్ద శాస్త్రాలు నేర్చుకొంటున్నారు కూడా. అతడు సన్య సించదలచి కేశవభారతి వద్దకు వెళ్ళి సన్యాసదీక్ష ఇవ్వమని ప్రార్థించాడు. గురువు కేశవ భారతి మొదట ఒప్పుకో లేదు. చైతన్యులు మళ్ళీ మళ్ళీ ప్రాధేయ పడటంతో ఆయన ఒక పరీక్ష పెట్టారు. చైతన్యుని నాలుక చాపమని చెప్పి, దానిపై కొంచెం పంచదార పోశారు. ఆశ్చర్యం!

చాలాసేపటి వరకు అతడి నాలుకపై పంచదార అలాగే ఉంది. కరగలేదు. నోటితో ఊదగా పంచదార గాలికి ఎగిరి పోయింది. దీనితో ఆయనకున్న ఇంద్రియ నిగ్రహశక్తి రుజువైంది. కనుకనే వెంటనే గురువుగారు సన్యాసదీక్ష ఇచ్చారు. ఆయన రాధాకృష్ణుల మధురభావంలో లీనమై రాధాకృష్ణుల దర్శనం, స్పర్శ పొంది ధన్యులయ్యారు. శ్రీకృష్ణ చైతన్యులుగా సార్థక నామధేయులయ్యారు. అలాగే శంకర భగవత్పాదులు, భగవద్ రామానుజులు, మధ్వాచార్యులు, శ్రీరామ కృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రమణ మహర్షి, నారాయణ గురువు



మొదలైనవారు ఇంద్రియాలను జయించి మహాత్ములయ్యారు.

సన్యాసాశ్రమ స్వీకారానికి ఇంద్రియ నిగ్రహం మొదటిమెట్టు. మోక్షం పొందాలనే బలమైన కోరిక, భగవంతుని దర్శించాలన్న తపన ఉంటేనే సన్యసించాలి. అంతేగాని పేరు ప్రతిష్ఠలకు, పూజా గౌరవాలు పొందడానికి, ధన సంపాదన, పెద్ద పెద్ద గుళ్ళు గోపురాలు భవంతులు కట్టి భోగభాగ్యాలు అనుభవించడానికి కాదు. అరకొర జ్ఞానంతో యోగాసనాలు నేర్పడం, ధ్యాన తరగతులు పెట్టి జిమ్మిక్కులు చెయ్యడం సన్యాసంకాదు. ఇవన్నీ 'భుక్తయే నతు ముక్తయే' భుక్తి కోసంగాని, స్వీయ మోక్షానికికాదు అంటారు శంకర భగవత్పాదులు. తీవ్రవైరాగ్యం ఉన్న ముముక్షువుల అహేతుక దయా సింధువైన గురువుని ఆశ్రయించి సర్వసంగ పరిత్యాగం చేస్తారు. గృహస్థులు అంతరిక వైరాగ్యంతో జీవిస్తారు. వీటికి శాస్త్రాలలో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. 'ఇంద్రియార్థేషు వైరాగ్యం, అనహంకార ఏవ చ, జన్మ మృత్యు జరావ్యాధి దుఃఖ దోషానుదర్శనమ్' – "ముముక్షువుకి ఇంద్రియార్థాలపై వైరాగ్యం ఉండాలి. అహంకార రాహిత్యం, జన్మ, మృత్యువు, ముసలి



తనం, వ్యాధి, దుఃఖం, ఉన్న అశాశ్వత జీవితాన్ని మరలామరలా గుర్తుంచుకొని భగవత్ దర్శనానికి ప్రయత్నించు" అంటాడు కృష్ణ భగవానుడు. "అందరూ సన్యసించవలసిన అవసరం లేదు. ఇల్లు కోటలాంటి"దంటారు శ్రీరామకృష్ణులు.

### 1207. త్రిమూర్తులు - అంటే బ్రహ్మ రజోగుణానికి, విష్ణువు సత్వగుణానికి, శివుడు తమోగుణానికి ప్రతీకలం టారు. అంటే ఆయా గుణాలు వారిలో ఉన్నాయని అర్థమా? తమో గుణం అంటే అజ్ఞానం, అహంకారం, జడత్వం, చీకటి కదా?

***జ.*** దేవతలకు, అందునా త్రిమూర్తులకు సత్త్వ, రజస్తమో గుణాలు ఆపాదించడం సమంజసం కాదు. వారందరూ సత్త్వగుణ ప్రధానులే. పురాణాల్లో ఆ విధమైన తామస, రాజస, సత్త్వ పురాణాలుగా విభ జించారు. ఈ విషయం చాలా మందికి మింగుడు పడదు. సర్వ జ్ఞుడైన మహేశ్వ రుని తామసుడనడం శివనిందే. శివుడు జ్ఞానప్రదాత. 'జ్ఞానాదేవతు కైవల్యం' అని ఉపనిషత్తుల ఉవాచ. మోక్షాన్ని ప్రసాది స్తాడు త్రిపురారి. 'శివం' అంటే కల్యా ణం, శుభం అని అర్థం. అయితే సృష్టి స్థితి ప్రళయాలు కాల చక్రంలో అంతర్భా గాలు. నిజానికి

"బహుల రజసే విశ్వోత్పత్తౌ భవాయ నమో నమః







ప్రబల తమసే తత్సంహారే హరాయ నమో నమః,

జన సుఖ కృతే సత్త్వోద్రిక్తౌ మృదాయ నమో నమః

ప్రమహసి పదే నిస్త్రైగుణ్యే శివాయ నమో నమః

ఈ విశ్వసృష్టికి అవసరమైన రజస్సును అధికంగా వినియోగించిన బ్రహ్మకు నా ప్రణామాలు, ప్రళయకాలంలో తమో గుణాన్ని అధికంగా ఉపయోగించిన రుద్రునికి నా నమస్కారాలు. సత్త్వ గుణం ఆధిక్యంతో సర్వులకు సుఖ సంతోషాలి స్తున్న మహా విష్ణువుకు నా వందనాలు. అత్యంత ప్రకాశ స్వరూపుడు, త్రిగుణ రహి

తుడైనా శివునికి నా నమోవాకాలు అని స్తుతిస్తున్నాడు పుష్పదంతుడనే పరమ శివ భక్తుడు. భవ, మర, మృడ ఈ మూడూ శివ నామాలే. కాల చక్రంలో జీవుల కర్మ ఫల భోగానిక ప్రళయం వస్తేనే కదా మరలా సృష్టి ప్రారంభమయ్యేది.

## 1208. 'రుద్ర శాప విమోచనం' ముందుగా పఠించిన తర్వాత విష్ణు సహస్రనామం పఠించాలని కొందరంటున్నారు. ఈ విషయం ఎంతవరకు నిజం?

**జ.** విష్ణు సహస్ర నామ స్తోత్రమ్ 'పూర్వ భాగం–శుక్లాంబరధరం విష్ణుం శశి వర్ణం చతుర్భుజం.. నుంచి ఉత్తరభాగం (ఫలశ్రుతి)

**కాయేన వాచా మనసేంద్రియైర్వా బుద్ధ్యాత్మనావా ప్రకృతే స్వభావాత్, కరోమి యద్యత్ సకలం పరస్మై నారాయణా యేతి సమర్పయామి.**

## 1209. సాలగ్రామార్చన విధానం తెలుప మనవి

**జ.** సాలగ్రామార్చన విధానం గురించి వివరించడం సాధ్యం కాదు. సాలగ్రామ ప్రతిష్ఠ చేస్తే మడితో ఉండి తప్పనిసరిగా నిత్యం ధూప దీప నైవేద్యాలు పెట్టాలి. ఇంట్లో సాలగ్రామ పూజ అనూచానంగా వస్తే అది వేరే విషయం. అలాగే ఎవరైనా మహాత్ములు, అర్హతగల భక్తునికి సాల గ్రామం ప్రసాదిస్తే వారే పూజా విధానం చెబుతారు.

## 1210. పుని స్త్రీలు మహా నివేదనానికి ప్రతినిత్యం స్నానం చేసే నైవేద్యం వండాలా?

**జ.** తప్పని సరిగా. స్నానం చేసే 'నైవేద్యం' వండాలి (కేదారనాథ్ వంటి శీతల ప్రదేశాల్లో తప్ప).

## 1211. నాకు గణపతి అంటే చాలా ఇష్టం. నేను ఉపవాసం ఉండాలంటే ఏ రోజు ఉండాలి? ఆయనకు ఏ రోజు ఇష్టం?

**జ.** ప్రతి సంవత్సరం భాద్రపద శుక్ల చవితి దినాన మనం వినాయక చవితి పూజలు చేస్తాం. ప్రతిపక్షంలోనూ వచ్చే 'చవితి' తిథి విఘ్నేశ్వ రుని పూజకు విశేష దినం.



రామ భక్తులు ఏకాదశి రోజున శ్రీరామనామ సంకీర్తన చేస్తారు. త్రయో దశి ప్రదోషకాలం శివునికి ప్రీతికర మైనది. వారాల్లో మంగళ, శనివారాలు వినాయకుని పూజకు విశేష దినాలు.

అందులో శక్తి గణపతి – అంటే బుద్ధి, సిద్ధి సమేత గణపతిని పూజించేవారు 'శనివారం' విశేషంగా భావిస్తారు.

## 1212. మానవుడు దేనివల్ల శ్రోత్రియు డవుతున్నాడు?

**జ.** వేదం వలన, వేదాధ్యయనం వలన, లేదా వేదం ప్రమాణమని అంగీకరించడం వలన మానవుడు శ్రోత్రియుడు అవుతున్నాడు.

**వివరణ :** "శ్రుతి" అంటే వేదం. గురువు వల్ల వేదార్థాన్ని చక్కగా తెలుసుకున్నవాడు శ్రోత్రియుడు. 'చాదస్తం'గా మడీ ఆచారం పాటించే కొందరిని సూచించడానికి ఇప్పుడీ మాటను ఉపయోగిస్తున్నారు. అసలు అర్థం అదికాదు. వేదాధ్యయనం చేసిన వారేకాదు, వేదం ప్రమాణమని అంగీకరించే భారతీయులందరూ శ్రోత్రియులే అవుతారని ఈ జవాబు స్పష్టం చేస్తోంది. వేదాధ్యయనం అందరూ చేయలేక పోవచ్చు. కానీ తమకు వేదం తెలిసినా, తెలియకపోయినా వేదాలలో చెప్పిన వాటిని విశ్వసించేవారు ఈ దేశంలో ఎందరో ఉన్నారు. వారందరూ శ్రోత్రియులే అవుతారు. ఉదాహరణకు "నువ్వు కేవలం ఫలానా పేరు, ఊరు, రూపమూ ఉన్న దేహానివి కావు. సృష్టి అంతటా వ్యాపించిన పరమాత్మే జీవాత్మ రూపంలో నీ లోనూ ఉన్నాడు. నేను దేహాన్ని అనే భ్రమను పోగొట్టుకొంటే ఆత్మ సాక్షాత్కారం పొందగలుగుతావు" అని వేదం బోధిస్తుంది. పూజలు, వ్రతాలు, జపతపాలు,



గురుసేవ మొదలైనవన్నీ జీవుని ఆత్మ సాక్షాత్కార లక్ష్యం వైపు నడిపించే సాధనలే. కనుక వీటిని ఆచరించే వారందరూ శ్రోత్రియులే అవుతారు. 'చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ!' అంటాడు ప్రహ్లాదుడు హిరణ్యకశిపునితో. ఆ "లో మర్మం' బోధించే నిజమైన చదువే వేదం. వేదానికి మరో పేరు బ్రహ్మ. ఆ పరబ్రహ్మ తత్త్వాన్ని అందుకోవడమే ప్రతిజీవికి అంతిమ లక్ష్యం.

## 1213. మనిషి దేనివల్ల గొప్పతనం పొందుతున్నాడు?

**జ.** తపస్సు ద్వారా మనిషి గొప్పతనాన్ని పొందుతున్నాడు. మనస్సును, ఇంద్రియాలను ఏకాగ్రం చేయడమే తపస్సు. వేదం మన అంతిమ గమ్యాన్ని, అందుకు అవసరమైన జ్ఞానాన్నీ బోధిస్తే తపస్సు వాటిని అందుకోడానికి మన శరీరాన్నీ, మనస్సునూ సిద్ధం చేసే ప్రక్రియ. పరమాత్మకు సంబంధించిన జ్ఞానం కానీ,



పరమాత్మకానీ మన మనసులో ప్రతి ఫలించాలంటే, అది స్వచ్ఛంగా, శుభ్రంగా, నిర్మలంగా ఉండాలి. ఇక్కడ మనసును అద్దంతో పోల్చుకోవచ్చు. అద్దంలో మన ముఖం బాగా కనిపించడానికి దానిమీద అంటిన మసినీ, మరకలనూ ఎలా తుడిచి వేస్తామో, అలాగే పరమాత్మకు సంబంధిం చిన జ్ఞానం సరిగా ప్రతిఫలించడానికి మనసనే అద్దాన్ని శుభ్రం చేసుకోవాలి. అయితే మనసు కంటికి కనిపించే అద్దం కాదు కనుక, దానిని శుభ్రపరచడానికి వేరే మార్గం కావాలి. తపస్సు అందుకే. కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం అనే ఆరు దుర్గుణాలు మన సనే అద్దానికి పట్టే మసిలాంటివి. తప స్సంటే, మనస్సును దైవం మీదే లగ్నం చేయడం ద్వారా ఈ ఆరు దుర్గుణాలను తుడిచివేయడమే. పూజలు, వ్రతాలు, భజ నలు మొదలయినవి కూడా ఈ తప స్సులో భాగమే అవుతాయి. తపస్సులో శరీరాన్ని కూడా కొంత కష్టపెట్టవలసి వస్తుంది. ఆహార విహారాలను నియం త్రించవలసి వస్తుంది. అదంతా, ఎప్పుడూ సుఖాలవైపు, కోరికలవైపు మనల్ని పరు గెత్తించే మనస్సుకు కష్టాన్ని నేర్పి క్రమ శిక్షణలో ఉంచడానికే. మనం తినే ఆహా రాన్ని బట్టి కూడా మన గుణాలు రూపొం దుతూ ఉంటాయి. విపరీతమైన కారాలు, పులుపులూ, మసాలాలతో కూడిన ఆహారం తీసుకుంటే మనసు ఉద్రేకానికి లోనవుతుంది. అప్పుడు పైన పేర్కొన్న దుర్గుణాలే మనలో రాజ్యం చేస్తాయి. కనుక సాత్త్వికమైన, మితమైన ఆహారాన్ని తీసుకోవాలి. ఉపవాసాలు, ఆహార నియ మాలు ఈ లక్ష్యంతో ఏర్పడినవే. తప స్సంటే ఏ పనీ చేయకుండా ముక్కు మూసుకుని మూల కూర్చోవడమనీ, అది సమాజానికి ఏమాత్రం పనికి రానిదనీ, కేవలం ఆధ్యాత్మిక సంబంధమైనదనీ కొన్ని అపోహలు మనలో చాలా మందిలో ఉన్నాయి. నిజానికి తపస్సు సమాజానికీ, వ్యక్తికీ కూడా ఎంతో మేలు చేసే ప్రక్రియ. అలాగే అది ఆధ్యాత్మిక మైనదేనను కోవ డం కూడా పొరపాటు. లౌకి జీవితంలో ఉత్తమ పౌరులుగా జీవించడానికి కూడా తపస్సు ఎంతో ఉపయోగపడుతుంది. వ్యక్తి తనలోని దుర్లక్షణాలను చంపుకొని, ఉత్తమ గుణాలను వికసింపచేసుకుని వాటిద్వారా సమాజానికి మేలు చేయడా నికి తపస్సు ఎంతో దోహదం చేస్తుంది. తపస్సనగానే మీరు ఏ అరణ్యాలకో వెళ్ళి చేయనక్కర్లేదు. మీ ఊళ్ళో మీ ఇంట్లోనే

ఉండి రోజూ ఉదయం కాసేపు, సాయం త్రం కాసేపు ఒంటరిగా మౌనంగా కూర్చుని ధ్యానం చేసుకోవడమూ తపస్సే. నిజానికి మనకు తెలియకుండానే మనం చాలా రకాల తపస్సులు చేస్తూనే ఉంటాం. ఉదాహరణకు, పరీక్షలు వచ్చినప్పుడు పగలూ, రాత్రీ అనే తేడా లేకుండా ఏకాగ్రంగా చదువుకోవడం, నిద్రమత్తు రాకుండా ఆహారాన్ని పరిమితం చేసుకోవడం కూడా తపస్సే. ఆ తపస్సునే కొన్ని మార్పులతో జీవితంలో ఒక భాగంగా చేసుకుంటే భగవంతుడు మనకు పెట్టిన జన్మపరీక్షలో సులభంగా నెగ్గుతాం. తపస్సువల్ల చెడు గుణాలు అణగిపోయి మంచిగుణాలు మేలుకున్నప్పుడు ఆ వ్యక్తి గొప్పవాడు కాకుండా ఎందుకుంటాడు? ధర్మరాజు యక్షునికిచ్చిన సమాధానం అదే చెబుతోంది.

## *1214. మనిషికి నిజమైన తోడు ఎవరు?*

***జ.*** మనిషికి నిజమైన తోడు ధృతి (ధైర్యం)

**వివరణ :** వేదాలు అసలైన జ్ఞానాన్ని బోధిస్తే, ఆ జ్ఞానమార్గంలో ఆత్మ సాక్షాత్కారాన్ని సాధించే ప్రక్రియ తపస్సు అని చెప్పుకున్నాం. ఆ తపస్సు స్థిరంగా, నిశ్చలంగా సాగితేనే ప్రయోజనం. ఏవేవో ఆకర్షణలు, అడ్డంకులు తపస్సు భంగపరచడానికి ప్రయత్నిస్తూ ఉంటాయి. ఊహించని కష్టాలు చుట్టుకుంటూ ఉంటాయి. అయినా చలించకుండా తపోయోగంలో స్థిరంగా నిలిపేది ధృతి, అనగా ధైర్యం. ఈ ధైర్యమే మనిషికి నిజమైన తోడు అంటాడు ధర్మ

artist

రాజు. ఋషుల తపస్సును భగ్నం చేయడానికి ఇంద్రుడు అప్సరసలను పంపిన ఉదంతాలు పురాణాలలో ఎన్నో కనిపిస్తాయి. ఇవి పరోక్షంగా తపస్సు గురించి బోధించే కథలే. ఆధ్యాత్మికంగానే కాదు, లౌకిక జీవితంలో కూడా మనిషికి నిజమైన తోడు ధైర్యమే. 'ధైర్యే సాహసే లక్ష్మి' అనే నానుడి కూడా ఉంది. ఇంతకీ ధైర్యం ఎలా కలుగుతుందంటే, ఏ ఎలా జరిగినా జరిపించేది ఆ పరమాత్మే నన్న తెలివివల్ల కలుగుతుంది.

## *1215. మనిషి దేనివల్ల బుద్ధిమంతుడవు తాడు?*

***జ.*** వృద్ధులను, పెద్దలను సేవించడం వల్ల బుద్ధి మంతుడవుతాడు.

**వివరణ :** పెద్దలను గౌరవించాలి, సేవించాలని మనం మామూలుగా వినేమాట వెనుక కూడా ఎన్నో విశేషాంశాలున్నాయి. ఇక్కడ పెద్దలంటే వయోవృద్ధులూ, జ్ఞానవృద్ధులూకూడా. సాధారణ విద్యలు గురువు లేకపోయినా, ఒక్కొక్కసారి పుస్తకాలు చదివి కూడా నేర్చుకోవచ్చు,

ఇప్పుడు యూనివర్సిటీలు నిర్వహిస్తున్న కరస్పాండెన్స్ కోర్సుల్లా. అయితే గురువు దగ్గర నేర్చుకున్న విద్యకు ఇది సాటిరాదు. ఇక, ఆధ్యాత్మికానికి వస్తే, ఆచార్యుని



మార్గదర్శనం లభించినవాడే ఆత్మ తత్త్వం తెలుసుకోగలుగు తాడంటుంది ఛాందోగ్యో పనిషత్తు. దీనికి పుస్తకాలు, కరస్పాండెన్స్ కోర్సులు పనికిరావు. వృద్ధులను, పెద్ద లను సేవించడమంటే వారి దగ్గర నేర్చు కోవడమనే అర్థం కానీ, వారికి కేవలం సేవ చేయడమని కాదు. పెద్దలను సేవించి నవాడే నిజమైన జ్ఞానం పొందేవాడు. లౌకిక జీవితంలో కూడా పెద్దలనుంచి, తెలుసుకోవలసింది ఎంతో ఉంటుంది.

### 1216. 'న కర్మాణా న ప్రజయా ధనేవ... వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థా... దహ్రం విపాపం పరమేశ్య భూతం.. యః పరస్సమహేశ్వరః ఈ మంత్రం మూలమేది? దీని అర్థం తెలుప ప్రార్థన

**జ.** పై మంత్రాలు నారాయణో పనిషత్ లేక 'నారాయణ ప్రశ్న' తత్త్వోపదేశంలో నివి. 'ఆత్మతత్త్వాన్ని తెల్పుతూ అణోరణీ యానమహతో మహీయాన్..' ఆత్మ – పరబ్రహ్మ అణువుకంటే ఇంకా చిన్నది. మేరుపర్వతం, హిమాలయాల కంటే లేదా ఈ చరాచర సృష్టి సూర్య మండలం, నక్షత్రాలు, పాలపుంత – ఈ విశ్వం – కంటే పెద్దది. బృహ్ – బ్రహ్మ – సృష్టిలో ఆకాశమే పెద్దది. ఆకాశం కంటే పెద్దది బ్రహ్మ. ఎందుచేత, ఆకాశం కూడా ఆత్మ – బ్రహ్మ నుంచే వచ్చింది. మీరుదహ రించిన మంత్రాలు త్యాగం యొక్క మహి మను తెల్పుతున్నాయి. యాగ యజ్ఞాది కర్మల ద్వారాగానీ, సంతానం చేతగానీ, ఎక్కువ ధనదానం చేతగానీ మోక్షం లభిం చదు. త్యాగం–సర్వకర్మ సన్యాసం ద్వారానే మోక్షం లభిస్తుంది. వేదాంతాలు – ఉప నిషత్ వాక్యాలు విని, గురువు ఉపదే శించిన–మహావాక్యాల అంతరార్థం తెలుసుకోవాలి. మహావాక్యాలంటే సూత్ర రూపంలో ఉన్న – 'తత్త్వమసి' 'అహం బ్రహ్మాస్మి' వంటివి. 'నేను'–జీవుడు నిజంగా బ్రహ్మమే. అనే జ్ఞానం ద్వారా ముక్తి లభి స్తుంది. 'ఓం'కారం సగుణబ్రహ్మం. ఓం కారం నుంచే – సగుణబ్రహ్మం నుంచే ఈ సృష్టి వచ్చిందని – ఆ ఓంకారమే పరమేశ్వ రుడు. ఈ విధంగా గురూపదేశం శ్రవణ, మనన, నిధిధ్యాసనల ద్వారా–జ్ఞానం ద్వారా మోక్షం పొందవచ్చని చెబుతోంది వేదం. 'దహర విద్యే' హృదయాకాశ విదేయ ఆత్మవిద్య. సర్వ వ్యాపియైన ఆత్మ

– బ్రహ్మ సకలజీవుల హృదయాల్లోనూ ఉంది. సాధకుడు తన హృదయంలో ఉన్న ఆత్మను తెలుసుకోవాలి. అపరోక్షాను భూతి పొందాలి. అప్పుడే శాశ్వతానందం లభిస్తుంది. పై విషయాన్ని 'న కర్మణా న ప్రజయా' వంటి మంత్రాలలో వేదమాత బోధిస్తున్నది.

### 1217. 'ఓం శ్రీమాత్రే నమః' అని నేను అమ్మవారిని జపిస్తాను. ఇది మంత్రం కాదన్నారొకరు. ఏ మంత్రం జపించమంటారు?

**జ.** ఆధ్యాత్మిక సాధనకు సాధారణంగా గురూపదేశం పొందాలి. గురువుద్వారా మంత్రదీక్ష పొందినా ఇంకా ఎన్నో సందేహాలతో అసంఖ్యాకులైన సాధకులు కొట్టు మిట్టాడుతుంటారు. ఇక ఉపదేశం పొందని వారి గురించి చెప్పనక్కరలేదు. అయినా మీరు చేస్తున్న జపవిధానంలో లోపం లేదు. అందులో ప్రణవం – 'ఓంకారం–శబ్ద బ్రహ్మ ప్రతీకం ఉంది.



'శ్రీమాత'–జగన్మాత నామం ఉంది. అందుచేత భయం లేదు. ఎవరో ఏదో చెప్పారని భయపడనవసరంలేదు. మత వాసులతో పరిచయం ఏర్పడితే 'మీకు సమయమొచ్చి నప్పుడు మంత్రోపదేశం గురు ముఖతః లభిస్తుంది. అంతవరకు మీరు మంత్రం ఉచ్చరించేటప్పుడు శ్రీ లలితాదేవి రూపం కూడా స్మరించండి. ఆ 'శ్రీమాతే' మీకు దారి చూపుతుందన్న దృఢవిశ్వాసం కల్గి ఉండండి.

### 1218. వృంద (తులసి)ను విష్ణుభగవానుడు మానభంగం చేసినట్లు పురాణంలో ఉంది. అది నూటికి నూరుపాళ్ళు తప్పేననుకుంటాను. ధర్మమార్గంలో సమాధానం చెప్పమనవి?

**జ.** జలంధరుడనే రాక్షసుడు తన పత్ని వృంద పాతివ్రత్య మహిమవల్ల జగత్కంట కుడై ఎన్నో అరాచకాలతో దేవతలను హింసించాడు. దేవతలు మొరపెట్టు కొనగా మహావిష్ణువు జలంధరుని రూపంలో వృందను కలిసాడు. తద్వారా లోకకంట కుడైన జలంధరుడు వధింపబడ్డాడు. భగవత్ లీలలు అనూహ్యాలు, ఆయన లీల లను తెలుసుకోవడం మానవ బుద్ధికి అందదు. మహావిష్ణువు చేసే కార్యాలు మీరు తప్పనుకొంటున్నారు. భగవంతుని సంకల్పం మీకు తెలిస్తే మంచిదే. నాకు దురవగ్రాహ్యం. శ్రీమన్నారాయణుడు ధర్మాధర్మాలకి అతీతుడు. ఆయన లీలలు

అనంతాలు. మన బుద్ధికి అందనివి. సర్వేశ్వరుడు జగత్కల్యాణానికి చేసే కార్యాలను మానవ సహజమైన అల్పబుద్ధితో అర్థం చేసుకోలేని హేతువాదులూ, ఎగ్నాస్టిక్కులూ, నాస్తికుల భావాలను పట్టించుకోవడం సరిగాదు. వేదాల్లో తెల్పిన సత్యాలనే పురాణాల్లో వివరించారు. ఇతిహాస పురాణాల సారం తెలుసుకోవాలి. మానవ శ్రేయస్సుకు దోహదపడే ప్రియమైన హితకరమైన ఉపదేశాల్ని ఆచరించాలి. అప్పుడే మనకు శాశ్వత సుఖం, శ్రేయస్సు లభిస్తాయి.

## 1218. గురువు ఉపదేశం వల్లనే పరమాత్మ దర్శనం కలుగుతుందన్నారు. ఆచార్యుడు లేకపోతే పరమాత్మ దర్శనం, మోక్షం కలుగదా? గురువు అందుబాటులో లేని వారికి మోక్షం లభించాలంటే ఏం చేయాలి?

***జ.*** పరమపురుషార్థమైన మోక్షంకోరే సాధకుడు ఆచార్యుని వద్ద మంత్రోపదేశం పొంది శ్రవణ, మనన నిధిధ్యాసనలు ఆచరించాలని వేదాలు, స్మృతులు చెబుతున్నాయి. ఆత్మసాక్షాత్కారం పొందిన బ్రహ్మజ్ఞానులు బోధిస్తున్నారు. ఉదాహరణకు వేదాంత గ్రంథాలైన ఉపనిషత్తుల్లో 'ఆచార్యవాన్ పురుషోవేద' (ఛాందోగ్యోపనిషత్తు) అన్నారు. అంటే ఆచార్యుని వద్ద ఉపదేశం పొందిన పురుషుడు జ్ఞానాన్ని పొందుతాడు.



పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో
నిర్వేదమాయాన్నా స్త్యకృతతః కృతేన,
తద్విజ్ఞానార్థం గురుమేవాభి గచ్ఛేత్
సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మ నిష్ఠమ్
(ముండకోపనిషత్ 1-2-12)

**భావం :** యజ్ఞ యాగాది కర్మల ద్వారా పొందే లోకాలన్నిటినీ వివేకంతో పరీక్షించి, అవి క్షణికమైనవనీ, అశాశ్వతమైనవనీ తెలుసుకొని, మోక్షాన్ని కోరుకునే బ్రాహ్మణుడు వైరాగ్యంతో, ఈ భువిపై అనిత్యమైన కర్మోపాసనమనే సాధనల ద్వారా నిత్యం శాశ్వతమైన మోక్షం - ఆత్మజ్ఞానం - పొందటం సాధ్యం కాదు కనుక శాశ్వతమైన బ్రహ్మజ్ఞానాన్ని పొందటానికి సమిధలు చేతిలో పెట్టుకొని, శ్రోత్రియుడు, బ్రహ్మ నిష్ఠుడైన గురువు వద్దకు వెళతాడు. (నిష్కామకర్మ అయిన నిత్యాగ్ని హోత్రానికి సమిధలు పట్టుకొని శిష్యుడు ఆచార్యుని వద్దకు వెళ్ళడం సంప్రదాయం) ఆధ్యాత్మిక జ్ఞానం గ్రంథ పఠనం ద్వారా రాదు. శ్రీకృష్ణపరమాత్మ గీతలో :

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన
సేవయా,

ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్వ దర్శనః
(భగవద్గీత అధ్యాయం 4-34వ శ్లోకం)


తత్త్వదర్శులకు, జ్ఞానులకు, శిష్యులు వినయంతో సాష్టాంగ నమస్కారం, శుశ్రూష చేస్తూ వారిని బ్రహ్మతత్త్వం గురించి ప్రశ్నిస్తే వారు జ్ఞానాన్ని బోధిస్తారని శ్రీకృష్ణభగవానుడు అర్జునునికి హితవు పలికాడు. వామదేవమహర్షి, రమణ మహర్షి - వంటి కొందరు మహాత్ములు తప్ప మిగతా అందరూ గురుముఖతః ఉపదేశం పొందాలి. గురూపదేశం కోసం రాత్రి - పగలు తనకు మోక్షాన్ని ప్రసాదించే గురువుని పంపమని, తాను ఇతరుల ద్వారా తెలుసుకునేలా చేయమని భగవంతుని ప్రార్థిస్తే భగవంతుడే అలాంటి గురువు మనకు లభించేలా చేస్తాడు. మనమే ఆ జ్ఞాని వద్దకు వెళ్ళాలి. ఆయన మన అర్హత చూసి, అశేషమైనకృపతో మంత్రోపదేశం చేస్తారు. సందేహాల్ని పటాపంచలు చేస్తారు. అంతవరకు ఇష్టదైవాన్ని తీవ్రంగా ప్రార్థించాలి. మీరు కన్నీళ్ళతో దైవాన్ని వేడుకోండి. అసాధ్యాల్ని సుసాధ్యం చేసే శక్తి భగవంతునికే ఉంది. ఈలోగా శ్రీరామకృష్ణకథామృతం, శారదా దేవి వచనామృతం, స్వామి వివేకానంద భక్తియోగం, భగవద్గీత మొదలైన సద్గ్రంథాలు చదవండి. విష్ణుసహస్రనామం, లలితా సహస్రనామాలు పారాయణం చెయ్యండి. లౌకిక వ్యవహారాలు భగవత్సేవగా చేయండి.

## 1220. హృదయ దౌర్భల్యం హఠయోగం ద్వారా అధిగమించగలమా? హఠయోగ సాధనా సాహిత్యం ఎక్కడ లభిస్తుంది? తెలుప ప్రార్థన

**జ.** హఠయోగ ఆచరణకు అనేక నియమాలున్నాయి. హృద్రోగులు హఠయోగం ఎరిగిన వ్యక్తి సహాయం లేకుండా సొంత ప్రాక్టీసు చెయ్యకూడదు. హఠయోగ గ్రంథాలున్నాయి. భగవాన్ శ్రీరామకృష్ణులు వారి సంప్రదాయస్థు లెవరూ హఠయోగ సాధన చెయ్యరు. ప్రోత్సహించరు కూడా. మీకు ఏ దేవి, దేవతపై అభిరుచి ఉందో ఆ దేవీ, దేవత నామస్మరణ, ధ్యానం చెయ్యండి, దాని ద్వారానే మీ హృద్రోగం - లేక దౌర్భల్యం పోతుంది.

## *1221. దక్షిణావృత శంఖమును ఎలా ఉపయోగించాలి?*


**జ.** దక్షిణావృత శంఖమును పూజా మందిరములో ఉంచవలెను. కొస భాగము తూర్పుదిక్కుగా ఉండేలా ఉంచాలి. అనగా దక్షిణ భాగమున ఓపెన్‌గా ఉంటుంది. అందువలనే దీనికి దక్షిణావృత శంఖము అను పేరు వచ్చింది. శివకేశవులకు ఇద్ద



రకు ఇష్టమైనది శంఖము. పురాణ ఇతి హాసాలలో ఈశ్వరునివద్ద, శ్రీమన్నా రాయణ మూర్తి వద్ద శంఖువు ఉన్న విషయం ప్రస్తావన ఉంటుంది. ప్రధా నంగా పూరణ శంఖువు కన్న క్షిణావృత శంఖువు పూజకు శ్రేష్టము. శంఖము యొక్క మొదలు, చివర, మధ్య భాగము లలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూ పంగా భావించి అలంకరించటం చేస్తు ఉంటారు. శంఖువును క్రింద ఉంచ రాదు. చిన్న శంఖువు అయితే దానికి అడుగున ఏదైనా లోహం అనగా వెండి, రాగి లేదా ఇత్తడితో చేసిన శంఖపీఠమును ఉంచి దానిపై శంఖువును ఉంచాలి. అలా కుదరక పోతే ఇనుము తప్ప ఏదైనా ఇతర లోహంతో చేసిన ప్లేటు లేదా పళ్లెము ఉంచి దానిలో శంఖువును ఉంచ వచ్చు. శంఖువు నందు కొద్దిగా జలము, పుష్పములు, అక్షతలు ఉంచటం మంచిది. సహజంగా దైవపూజ చేసే టప్పుడు ఆవాహన చేయగానే ముందుగా శంఖువు పూజచేసి శంఖువును శుభ్ర పరచి అందులో జలమును తీసుకొని ఆ జలముతో అర్చన, అభిషేకము వంటివి చేయాలి. పూజానంతరము తీర్థము కూడా శంఖువులో పోసుకొని శంఖువుతో చేతిలో పోసుకొని తీర్థము తీసుకోవాలి. పూజకి బాగా పెద్ద శంఖము ఉపయోగిం చేవారు సంకల్పానికి, తీర్థము తీసుకోవ టానికి చిన్న శంఖువును ఉపయోగి స్తారు. పూజ చేయకుండా ఉన్నా శంఖు వును పూజామందిరములోనే ఉంచాలి. దక్షిణావృత శంఖాన్ని అలంకార వస్తు వుగా షోకేసులో పెట్టరాదు. సాధారణ శంఖువులా ఉపయోగించుకోవచ్చు. శంఖువుల మాల మెడలో వేసుకో కూడదు. దేవుని మెడలో వేయవచ్చు. కొంతమంది సరదాగా ఒక శంఖువును మెడలో ధరిస్తున్నారు అలా ధరించుట దోషము. పగిలిన శంఖువులు ఇంట్లో ఉండరాదు. దక్షిణావృత శంఖాన్ని పూజ చేసుకొనే నిమిత్తం ఇతరులకు ఇవ్వ వచ్చు. సమీపంలోని దేవాలయములో అర్చనకు ఉపయోగించే నిమిత్తం ఇవ్వ వచ్చు. శంఖువును దానము చేయరాదు. బహుమతిగా ఇవ్వరాదు.

### *1222. పాము (సర్ప) ఉంగరము ఏ వేలికి ధరించాలి? ఎలా ధరించాలి?*

**జ.** సర్ప ఉంగరము రాగి లేదా వెండితో చేయించాలి. కుడిచేతి ఉంగరపు వ్రేలికి ధరించాలి. తోక భాగము ధరించిన వారి వైపు, శిరస్సు భాగము ఎదుటివైపు ఉండాలి. తప్పనిసరిగా రాత్రివేళ వేలి నుంచి తీయాలి. పూజామందిరంలో ఉంచి మరుసటి రోజు ఉదయంవేళ స్నానము



చేసిన తరువాత మరలా ధరించాలి. బంగారపు సర్ప ఉంగరము ధరించ కూడదు. అలంకారంగా సర్ప ఉంగర ముపై రకరకాల రాళ్ళు పొదుగుతారు అలా చేయకూడదు. శిరస్సుపై కెంపులు, వైఢూర్యాలు బిగిస్తూ ఉంటారు. అది కూడా పనికిరాదు. సర్ప ఉంగరము ధరిస్తే సర్పదోషం కలవారికి మంచి ఫలిత ములు కలుగతాయి. సర్ప ఉంగరము చేయించి ఇతరులకు కూడా ఇవ్వవచ్చు. ఉంగరము ధరించటం ఇష్టపడక పోతే సర్ప ఆకృతి రాగి లేదా వెండితో చేయించి ఇంటిలో 11 రోజుల పూజచేసి సమీపం లోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో లేదా శివాలయములో సమర్పించండి.

### 1223. సుబ్రహ్మణ్య షష్ఠినాడు పుట్టలోపాలు ఎందుకు పోస్తారు?

***జ.*** సుబ్రహ్మణ్య షష్ఠిని తెలుగునాట సుబ్బ రాయుడు షష్ఠి అని కూడా అంటారు. ఈ రోజున గృహిణులు పాము పుట్టలో పాలు పోయడం అనాదిగా వస్తున్న సంప్ర దాయం. ఇంతకీ పాముకీ, సుబ్రహ్మణ్య స్వామికీ ఉన్న సంబంధమేమిటి?

మన శరీరంలో ఆరు చక్రాలున్నాయని యోగశాస్త్రం చెబుతోంది. సుబ్రహ్మణ్యుడు కూడా ఆరు అంకెతో సంబంధమున్న వాడు. ఆయన ఆరు ముఖాలు కలిగిన వాడు. అందుకే ఆయన షణ్ముఖుడు, షడా ననుడు. ఆరుచక్రాలలో మూలాధార



చక్రం ఒకటి. ప్రాణశక్తి ఈ మూలాధార చక్రంలో సర్పరూపంగా ఉంటుంది. అది నిద్రిస్తూ ఉంటుంది కనుక, దానిశక్తి మనకు తెలియదు. యోగసాధనలన్నీ ఈ శక్తిని తట్టిలేపడానికే. అప్పుడే మనకు పరమ జ్ఞానం సిద్ధించి పరమానందం కలుగుతుంది. సుబ్రహ్మణ్యుడు యోగ రూపుడు. జ్ఞానమూర్తి. అందుకే సర్పా కారంలో ఆయనను పూజించే సంప్రదా యం ఏర్పడింది. ముత్తు స్వామి దీక్షితులు 'వాసుకి తక్షకాది సర్పస్వరూపధారణాయ నమః' అంటూ సుబ్రహ్మణ్యుని స్తుతిస్తారు. సుబ్రహ్మణ్య షష్ఠి సర్పరూపంలో చేసే ఆయన ఆరాధనే.

### 1224. నారికేళముతో సమాన ఫలమున్నదా? కొబ్బరికాయ లభించనపుడు వేరొక ఫలముగా దేనిని నివేదించవచ్చును. తెలపగోరు చున్నాను.

***జ.*** నైవేద్యం రెండు రకాలు. మహా నైవేద్య మనీ, అవసర నైవేద్యమనీ. అవసర నైవేద్య



మంటే తాత్కాలికంగా సమర్పించే నైవేద్యం. అందులో నారికేళం (కొబ్బరి కాయ) చాలా శ్రేష్ఠమయినది. అది లభించనపుడు అరటిపళ్ళు, బత్తాయి పండ్లు, పనస పండ్లు, ద్రాక్షపండ్లు మొదలైన వృక్షజాతి ఫలాలు, పాలు, పెరుగులు మొదలైన ద్రవ్యాలు కూడా నైవేద్యం పెట్టవచ్చును. మహానైవేద్యమంటే భక్ష్య, భోజ్యం, లేహ్య, చోష్యాత్మక మైన చతుర్విధమైన వండిన పదార్థాలను సమర్పించాలి.

**1225. శూద్రజాతికి చెందిన ఒక వ్యక్తి విదేశములో మరణిస్తే, ఆ శరీరానికి స్వదేశములో దహన సంస్కారము జరుపబడినది. దశాహమున పిండ కరణము యేదినమున జరిపించాలి. యెలా చేస్తే ఆ ప్రేతకు ముక్తి యేర్పడుతుంది?**

**జ.** స్వదేశంలో మరణిస్తే మరణించిన దినాన్ని ప్రథమదినంగా భావించి, కర్మకాండ నిర్వహించాలి. పదవరోజు దశాహము. పదకొండవ రోజున ఏకాదశాహకృత్యము. పన్నెండవ రోజున ద్వాదశాహకృత్యము, సపిండీ కరణము నిర్వహించాలి. విదేశ మరణమయితే యేరోజు మరణ వృత్తాంతం తెలిసిందో ఆరోజును ప్రధమ దినంగా భావించాలి. మిగిలినవన్నీ ఆ పద్ధతి ప్రకారమే నిర్వహించాలి. అయితే శూద్రులు మరణించినపుడు పదిహేను రోజులు ఆశౌచదినములు పదిహేనవరోజు సపిండీ కరణాదులు నిర్వహించాలి. ఇక్కడ కుటుంబాచారం ప్రధానము. వారి కుటుంబంలో పదిహేను రోజుల ఆశౌచం ఆచారం వుంటే దాని ప్రకారమే కర్మకాండను నిర్వహించాలి. ఇది శాస్త్ర విధానము.

**1226. జాంబవతి తల్లిదండ్రులెవరు? జాంబవంతుడు మృగజాతికి చెందినవాడు కదా! గుహలో ఉయ్యాలలో వున్నపిల్ల జాంబవతి అని వినాయక వ్రతకథ విన్నవారు అపోహపడుతున్నారు. కృష్ణుడు చిన్నపిల్లను పెళ్ళిచేసుకున్నాడా?**


**జ.** వినాయక వ్రతకథలో చంద్రదర్శన దోషం పోవడం కోసం శ్యమంతకోపాఖ్యాన కథ విని అనంతరం ఈ శ్లోకాన్ని చదివి అక్షతలు శిరస్సున ధరించాలని వున్నది. ఆ శ్లోకం యిది.

సింహః ప్రసేన మవధీత్। సింహో జాంబవతాహతః శృణు పుత్రకుమారోదీః ॥ తవహ్యేషశ్శ్యమంతకః అని ఈ శ్లోకంలో వున్న "పుత్రిక' అన్న పదానికి మగపిల్లవాడు అనేభావం. జాంబవంతుడు పెంచిన అమ్మాయి కనుక ఆ అమ్మాయికి

జాంబవతి అని పేరు. జాంబవుడు ఎలుగు బంట్ల జాతికి చెందినవాడు. అతడు పురాణ ప్రసిద్ధుడు. శ్రీమహావిష్ణువు వామన మూర్తిగా అవతరించి, బలిచక్రవర్తి దగ్గర మూడడుగుల భూమిని కోరి, స్వీకరించి, ఆక్రమించిన విశ్వరూపుడైన ఆ మూర్తికి ప్రదక్షిణం చేసిన మహాపురుషుడు. శ్రీరామావతార కాలంలో రాక్షసులతో యుద్ధంచేసి, శ్రీరామ విజయానికి కారకు డైనవాడు. అతడు పెంచిన కన్య జాంబ వతి. ఈ శ్యమంతకోపాఖ్యానం శ్రీమద్భా గవతంలో వున్నది. జాంబవతి తల్లి దండ్రుల ప్రస్తావన మాత్రం లేదు.

## 1227. భగవత్సాక్షాత్కారం పొందడానికి సన్యాసం తప్పనిసరిగా స్వీకరించాలా? గృహస్థుడు పొందలేడా? వివరించండి.

**జ.** అటువంటి నియమం ఏమీ లేదని శాస్త్రాలు చదివితే మనకు తెలుస్తుంది. పూర్వకాలంలో మన ఋషులు గృహ స్థాశ్రమంలోనివారే. జనక మహారాజు, ప్రవాహణజైవలి (ఛాందోగ్య ఉపనిషత్తు), బ్రహ్మ విద్యాసంపన్నుడైన యాజ్ఞ వల్క్యుడు (బృహదారణ్యకోప నిషత్తు) – వీరందరూ ఆత్మజ్ఞులే. అలాగే నాద బ్రహ్మో పాసకుడు త్యాగరాజు, భద్రాచలం రామదాసు, అన్నమా చార్యులు, పోతన మహాకవి కూడా వివాహితులే. 'సాధన' తీవ్రత ముఖ్యం కాని ఏ ఆశ్రమంలో ఉన్నా మన్నది ముఖ్యం కాదు. భగవద్దర్శ నానికి



తగిన కృషి శ్రద్ధాభక్తులు అవసరం. నిజ మైన సాధకుడు స్వామి అయినా, గృహ స్థుడైనా అతనికి ఈశ్వరకృపతో పరమే శ్వర దర్శనం కలుగుతుంది. అయితే తీవ్రతర ముముక్షత్వం, వివేక వైరాగ్యా లుంటే గృహస్థాశ్రమం లోకి వెళ్ళకుండానే సన్యాసాశ్రమం స్వీకరించవచ్చు. 'యద హరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేత్' – అంటే ఎప్పుడు ఏ క్షణంలో వైరాగ్యం కలుగుతుందో అప్పుడే సంసారాన్ని త్యజించవచ్చు, స్త్రీ పురుషులెవరైనా సరే. అయితే, కామవాసనలు – అంటే కోరి కలు–పోనంత కాలం సర్వసంగ పరి త్యాగం వీలుపడదు. స్త్రీ పురుషభేదం లేకుండా మనుషులందరికీ వివాహ మవ్వగానే 50 శాతం మనస్సు భార్యల లేక భర్తవైపునకు వెళ్ళిపోతుంది. పిల్లలు పుట్టగానే మరో ఇరవై ఐదు శాతం మనస్సు వారిపై పోతుంది. మిగతా మనస్సు సంపాదనపైన, ఆహారం, వస్త్రధారణ పైన పోగా భగవంతుని కర్పించడానికి ఏమి మిగులుతుంది? అటువంటి వారు ఎంత

సాధన చేసి దైవసాక్షాత్కారం పొందుతారు? మీ ఆలోచనలన్నిటినీ లోకవ్యవహారాలపై పెడితే ఇక భగవల్లాభం ఎలా కలుగుతుంది? గృహస్థాశ్రమంలో ఉంటూ ఆధ్యాత్మిక సాధనలు చేసి ఇష్టదేవత దర్శనం పొందినవారూ కొందరు లేకపోలేదు. "అద్వైతే ఆచలేబేధే జా ఇచ్చాతాయ్ కొరో" – ఆత్మజ్ఞానాన్ని నీ కొంగున కట్టుకొని నీ ఇష్టం వచ్చినట్లే ప్రవర్తించు అంటారు శ్రీరామకృష్ణులు. చిన్న వయసులోనే మనస్సును నియంత్రించాలి. నడి వయసులోనో, వృద్ధాప్యంలోనో మనస్సును అదుపు చేయడం కష్టతరం. "మొక్కై వంగనిది మ్రానై వంగునా" అనే సామెత కూడా ఉంది కదా. అందుకే, చిన్న వయస్సులోనే సాధనలు చేయడానికి ఉపక్రమించాలి. జీవితాన్ని సీరియస్‌గా తీసుకొన్నవారికి–ఇహలోక జీవితం 'మూడు నాళ్ళ ముచ్చటే' కదా. ఆత్మసుఖమే నిజమైన సుఖం. బాహ్యవస్తు సంచయం, భోగంలో ఆనందం లేదు. 'నాల్పే సుఖమస్తి" అవి రోగం, ముసలితనం మరణం వద్దకు తొందరగా చేర్పిస్తాయి. మనిషికి విచక్షణాజ్ఞానం లేకపోతే మిగతా జంతువుల్లాగే తిండి, ఇంద్రియలోలత్వంతో మృత్యువాత బడతాడు. అందుచేతే "ఆశిష్ఠో ద్రడిష్ఠోబలిష్ఠః", "యువాస్యాత్ సాధుయువా స్యాత్' మంచి యువకుడు కుశాగ్రబుద్ధి, శరీర దారుఢ్యం కలవాడే పరమాత్మను పొందగలడు అంటున్నాయి ఉపనిషత్తులు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు ఉన్న యువకులు కావాలన్నారు స్వామి వివేకానంద. ఎవ్వరూ ఆఘ్రాణించని పుష్పాల్నే భగవంతునికి సమర్పించాలి. అలాగే మన జీవితమనే పుష్పాన్ని ఈశ్వరార్పణచేద్దాం. అప్పుడు ఆయన మనల్ని తప్పక స్వీకరించి అనుగ్రహిస్తాడు. భగవాన్ శ్రీరామకృష్ణుల భక్తులైన గృహస్థులు అక్షయ్, నాగమహాశయ్, గిరీష్‌చంద్రఘోష్, కాళీపద ఘోష్ మొదలైనవారు భగవన్నామ స్మరణతోనే అంతిమ యాత్ర చేశారు.

మరణశయ్యపైన చివరి క్షణంలో భగవంతుని చాయాచిత్రాన్ని చూస్తూ ఆయన నామాన్ని స్మరిస్తూ తుది శ్వాస వదలిన గృహస్థ భక్తుల గురించి నాకు స్వయంగా తెలుసు. మూడు సంఘటనలు మన చేతుల్లో లేవంటారు శ్రీరామ కృష్ణులు. అవి జన్మ, మరణం, వివాహం. ఆధ్యాత్మిక జీవనం గురించి తెలియక ముందే గృహస్థులైన వారు విచారించ నక్కరలేదు. చిన్న వయస్సులోనే పవిత్ర జీవనం గడపదలచుకొన్న వారి శాతం స్వల్పమైనా, వారు సంసార పంకిలంలోకి దిగకుండానే తమ జీవితాల్ని భగ వంతునికి అర్పించాలి.

**1228. ఏల్నాటి శనిగోచారంలో వస్తుంది, ఏడున్నర సంవత్సరాల కాలం వుంటుంది అంటారు. ఉదాహరణకు ప్రస్తుతం పుష్యమి – మఘ – పుబ్బ – హస్త – చిత్త నక్షత్రాలలో పుట్టారు**

***అనుకోండి. అపుడు ఏల్నాటిశనిలోనే జననం అంటారా? దానికి వేరే పేరేమయినా వున్నదా? ఎందుకంటే ఏల్నాటి శని గోచారంలో వస్తుంది. కొన్ని జాతకాలు చూచి, నీకు ఏల్నాటి శని ఫలానారోజు ప్రారంభమవు తుంది. ఫలానారోజుతో అంతమవు తుంది అంటూంటారు. మరి పుట్టుకే ఈ సంవత్సరమయితే దానినే ఏల్నాటి శని జననం అని చెప్పవచ్చునా?***

***జ.*** మనిషి జీవితంలో శుభాశుభాలను తెలుసుకోవడానికి మన మహర్షులు జ్యోతిశ్శాస్త్రంలో రెండు మార్గాలు సూచించారు. ఒకటి జన్మజాతకం. రెండు గోచారం. జన్మ జాతకంలో జన్మించిన సమయంలో వున్నరాశిని లగ్నమంటారు. మిగిలిన రాశులను ద్వితీయం, తృతీయం ... ద్వాశం అంటారు. ఆయా రాశులలో వున్న గ్రహాలకు సంచారం వుండదు. ఆ సమయంలోవున్న గ్రహముల స్థితిని బట్టి, యుతినిబట్టి, వీక్షణాన్నిబట్టి, ఆయా సూచిత ఫలాలను నిర్ణయించి చెప్పడం జరుగుతుంది. ఇది జాతకం. ఇందులో ఏల్నాటి శని ప్రస్తావనేలేదు రాదు. రెండవది గోచారం. గోశబ్దానికున్న అనేకార్థాలలో గ్రహములొకొటి. గ్రహములు ప్రతి సంవత్సరం ఆయారాశులలో సంచరి



స్తూంటాయి. దానిని బట్టి ఫలనిర్దేశం చేయబడుతుంది. గ్రహముల సంచారంలో శని ఒక్కొక్క రాశిలో రెండున్నర సంవత్సరాలు సంచరిస్తూంటాడు. గోచారంలో జన్మించిన జన్మ నక్షత్ర పాదాన్ని బట్టి, రాశి నిర్ణయింపబడుతుంది. ఆ గణనం ప్రకారం ఆ రాశికి పన్నెండవ రాశి, జన్మరాశి. రెండవ రాశి మూడింటిలో శని సంచారకాలం ($3 \times 1\ 1/2 = 7-1/2$) ఏడున్నర సంవత్సరాలకాలం దీనినే ఏల్నాటిశని అంటారు. ఈ ఏల్నాటిశని సామాన్యంగా మూడు పర్యాయాలు వస్తుంది. కొందరు ఈ ఏల్నాటి శని జరుగుతున్నపుడు కూడా జన్మించవచ్చును. ఈ సందర్భంలో కూడా ఈ స్థితిని ఏల్నాటిశని అనే అంటారు. దీనికి మరోపేరు లేదు. జాతకంలో కూడా ఇలాంటి స్థితి వున్నది. మహర్ధశ అంతర్ధశా నిర్ణయాలలో జన్మించిన నక్షత్రంలో జరిగిన ఘడియలలోని మహర్ధశ, అంతర్ధశా భాగాలను జరిగిపోయినవిగాను మిగిలిన నక్షత్ర ఘడియలలోని భాగం అంతర్ధశా మహర్ధశలు మిగిలినవి గాను నిర్ణయిస్తారు.

## 1229. గృహస్థులు పంచాక్షరి మంత్రాన్ని ఎలా జపించాలి – 'ఓం నమశ్శివాయ' అనా, లేక 'నమశ్శివాయ' అని జపించాలా? గృహస్థులు 'ఓం' కారాన్ని ఉచ్చరించకూడదంటున్నారు కొందరు!

**జ.** 'నమశ్శివాయ' అని పంచాక్షరి మంత్రాన్ని జపించినా తప్పు లేదు. అయినా ప్రణవాన్ని చేర్చి 'ఓం నమశ్శివాయ' అంటూ జప ధ్యానాలు చేయడం ఉత్తమం. గృహస్థులు 'ఓం' కారాన్ని ఉచ్చరించ కూడదని ఎక్కడా చెప్పలేదు. అటువంటి సలహా ఎవరైనా ఇచ్చినా దాన్ని పాటించకండి.

## 1230. శ్రీ లలితా సహస్రనామ పూజకి, సహస్రనామాల పారాయణకు తేడా ఏమిటి? ఎలా చెయ్యాలి ?

**జ.** శ్రీ లలితాదేవి పంచోపచార లేదా దశ, షోడశోపచార పూజ చేసుకొని, సహస్రనామాలలో ప్రతి నామానికి మొదట 'ఓం' కారాన్ని (ప్రణవాన్ని), చివర 'నమః' చేర్చి ఉచ్చరించాలి. లలితాంబికా సహస్రనామంలో మొదటినామం 'ఓం శ్రీమాత్రే నమః' అని ప్రారంభించి సహస్ర నామాలు చెబుతూ కుంకుమతో పూజ చేయవచ్చును. ప్రతిరోజూ సహస్ర నామపూజ చేయలేనివారు కేవలం పారాయణ – అంటే శ్లోకాల్ని చదువవచ్చును. శ్రీవిద్యా ఉపాసన, పూజా విధాన గ్రంథాలు



న్నాయి. పై విధానాన్ని అనుసరించే ఉపాసకుల నుంచి పారాయణ విధానం నేర్చుకోవాలి. శ్రీ విద్యాసాధకుల కోసం అన్వేషించండి. మీ పట్టణంలోనే లలితా సహస్రనామ ఆడియో కేసెట్‌లూ లభ్యమవుతాయి.

## 1231. సంక్రమణం అంటే ఏమిటి? మకర సంక్రాంతి వివరాలను తెలియచేయండి.

**జ.** గ్రహాలు తొమ్మిది. సూర్యుడు, చంద్రుడు, అంగారకుడు, బుధుడు, గురువు, శుక్రుడు, శని, రాహువు, కేతువు. నక్షత్రాలు ఇరవై ఏడు. అశ్వని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశిర, ఆర్ద్ర, పునర్వసు, పుష్యమి, ఆశ్రేష, మఘ, పూర్వ ఫల్గుణి, ఉత్తర ఫల్గుణి, హస్త, చిత్త, స్వాతి, విశాఖ, అనూరాధ, జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రవణం, ధనిష్ఠ, శతభిషం, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, రేవతి. ఈ నక్షత్రాలలో ఒక్కొక్క నక్షత్రానికి

నాలుగు భాగాలు. వీటినే పాదాలు అంటారు. 27×4 = 108 పాదాలు అవుతాయి. ఇందులో తొమ్మిది పాదాలు ఒక్కొక్క రాశిగా పరిగణింపబడుతాయి. అశ్వని 4 పాదాలు, భరణి 4 పాదాలు, కృత్తిక మొదటి పాదం మేషరాశి క్రిందకి వస్తాయి. కృత్తిక 3 పాదాలు, రోహిణి నాలుగు పాదాలు, మృగశిర మొదటి రెండు పాదాలు వృషభరాశి క్రిందికి వస్తాయి. యిలా పన్నెండు రాశులు ఏర్పడతాయి. 12 ×9 = 108 పాదాలు సరిపోతాయి. ఈ రాశులలో మేషం, వృషభం, మిధునం, కర్కాటకం, సింహం, కన్య, తుల, వృశ్చికం, ధనుస్సు, మకరం, కుంభం, మీనం. సూర్యాది గ్రహాలు తొమ్మిది ఒక రాశిలో నుండి మరో రాశిలోకి ప్రవేశించడాన్ని సంక్రమణం అంటారు. గ్రహ సంచారానికి నిర్ధిష్ట కాలం ఉంటుంది. ఆ కాల నియమం ప్రకారం గ్రహముల రాశి ప్రవేశం జరుగుతుంది. ఈ క్రమంలో మేష సంక్రమణం, మిధున సంక్రమణం.... మీన సంక్రమణం యేర్పడుతాయి. ఏ గ్రహం ఏ రాశిలో ప్రవేశిస్తే ఆ సంక్రమణం అన్నమాట. అలాగే సూర్యుడు మేషరాశి ప్రవేశాన్ని అనుసరించి, మేష సంక్రమణం లేదా మేష సంక్రాంతి అంటారు. ఆ క్రమంలో సూర్యుడు మేషాది రాశులను దాటి మకర రాశిలో ప్రవేశిస్తే అనగా నక్షత్రముల లెక్కల ప్రకారం ఉత్తరాషాఢ రెండవ పాదంలో ప్రవేశిస్తే, మకర సంక్రాంతి వస్తుంది. అలాగే యితర గ్రహాలు యేవి మకరరాశిలో ప్రవేశించినా మకర సంక్రాంతి అవుతుంది.

## 1232. హనుమంతునకూ, సువర్చలకు వివాహం జరిగిందా?

**జ.** కొన్ని ఆలయాల్లో ఏకంగా వారిద్దరికి వివాహం కూడా జరిపిస్తున్నారు. హనుమంతుడు బ్రహ్మచారి. సూర్యుని కుమార్తె పేరు సువర్చల. హనుమ సూర్యుని వద్ద



విద్యాభ్యాసం చేశాడు. ఆ సమయంలో సువర్చల హనుమని ఇష్టపడింది. విషయం తెలిసిన సూర్యుడు విద్యాభ్యాసం అనంతరం హనుమని గురుదక్షిణగా సువర్చలను వివాహమాడమన్నాడు. హనుమ కలియుగాంతం అయ్యే వరకూ ఆగమన్నాడు. ఆ తర్వాత వివాహం చేసుకుంటానని చెప్పాడు. ఇచ్చిన మాట ప్రకారమూ, సూర్యునికిచ్చిన గురుదక్షిణ ప్రకారము సువర్చల హనుమ ఈ కలియుగం అంతమైన తర్వాతే వివాహం చేసుకుంటాడు.

## 1233. గోరింటాకును తలక్రింద పెట్టుకుంటే నిద్రవస్తుందా ?

**జ.** సామాన్యంగా గోరింటాకును అందం కోసం కాళ్ళకి, చేతులకీ పెట్టుకుంటారు. గోరింటాకును నిద్రలేమితో బాధపడే వారు గోరింటాకు పువ్వులను పక్కమీద చల్లుకోవటం ద్వారా, గోరింటాకు కట్టిన మూటను తలక్రింద పెట్టుకోవటం ద్వారా చక్కటి నిద్ర వస్తుంది. గోరింటాకు రస ముతో తలను మర్దిస్తే పలుచగా ఉన్న వెంట్రుకలు గట్టిపడతాయని ఆయుర్వేదం తెలుపుతున్నది.

## 1234. సన్యాసుల చేతిలో కర్ర ఎందుకు ఉపయోగపడుతుంది?

**జ.** గాలి, నీరు, అగ్ని, ఆకాశం అనే పంచభూతాల సమ్మేళనమే మనిషి కాబట్టి ఐదు అడుగుల పొడవైన చేతి కర్రను ధరిస్తారు. ఇందులో ఏకదండి, ద్విదండి, త్రిదండి అని మూడు విధాలు ఉన్నాయి. చేతిలో ఒకే కర్రను ధరించి ఉండేవారు అద్వైత సిద్ధాంతాన్ని అనుసరించేవారు. అద్వైతం అంటే జీవుడు, దేవుడు ఒక్కటే ననే సిద్ధాంతాన్ని అనుసరించేవారు. శంకరాచార్యుడు ఈ మతాన్ని అనుస రించారు. చేతిలో ఒకే కర్రను ధరించే వీరు ఈ కర్రను జ్ఞానానికి సంకేతమైన రావిచెట్టు నుండి సేకరిస్తారు. రెండు కర్ర లను ఒకటిగా కట్టి చేత ధరించి బోధనలు




చేసేవారు ద్వైత సిద్ధాంతం కలవారు. వీరిని 'ద్విదండి' అంటారు. దేవుడు వేరు జీవుడు వేరు అంటే జీవాత్మ పరమాత్మ వేరు వేరు అని వీరు వాదిస్తారు. వీరం దరూ వైష్ణవ భక్తులు. రామా నుజా చార్యులు మొదలైన వారు ఈ మతానికి ప్రాణంపోసి ప్రాచుర్యం కల్పించారు. ఈ మతాన్ని అనుసరించే వారిని 'జీయరు'లు అని అంటారు. మూడు కర్రలను కలిపి ఒకే కట్టగా కట్టి భుజాన పెట్టుకొనే వారిని 'తత్వత్రయం' అంటారు. జీవాత్మ, పర మాత్మ, ప్రకృతి ఈ మూడింటిని నారా యణ తత్త్వంగా భావించి వీరు పూజి స్తారు. చేతిలోగల పొడవైన దండాన్ని వీరు తమకు దరిచేరబోయే దుష్ట ప్రాణుల నుండి రక్షణగా ఉపయోగిస్తారు. అంతే కాక చెట్టుపైగల ఫలవృక్షాలను కోయ టానికి కూడా ఈ దండాన్ని ఉపయో గిస్తారు. తాపసులు, ఋషులు అనబడే

వారి చేతిలో పద్దెనిమిది అంగుళాల పొడ వున్న 'యోగదండ'మనే పేరుగల దండము ఉంటుంది. రుద్రాక్షమాల నేలపై పడి అపవిత్రం కాకుండా, పంగల కర్ర రూపంలో ఉండే ఈ దండంపై కుడి చేతిని ఆసరాగా పెట్టుకొని త్రిప్పుతుంటారు.

## 1235. తలుపు గడపపై ఎందుకు కూర్చొన కూడదు ?

**జ.** ఈ అలవాటు చాలాకాలం ఒక మూఢ నమ్మకంగా భావించి కొట్టివేస్తుండేవారు. కానీ 'డ్రాసింగ్ రాడ్'ను కనుగొన్న తరువాత గడపపై కూర్చోరాదనటంలో శాస్త్రీయ అంశం ఉందని తెలియ వచ్చింది. 'డ్రాసింగ్ రాడ్' అనే పరికరాన్ని తలుపు ఫ్రేమ్‌వద్ద ఉంచిన, అక్కడ ప్రతికూల శక్తి నలుదిశలా వెదలజల్ల బడటం మనం గమనించవచ్చు. అందుకే మన పూర్వులు గడపలో కూర్చోవడం నిషేధించారు. ఈ నిషేధానికి కారణం తలుపు ఫ్రేమ్ వద్ద ప్రతికూల శక్తి ప్రసారం ఉండటమే కారణం. ఈ ప్రతికూల శక్తికి కారణం తలుపు ఫ్రేమ్ చతురస్రాకారంలో



ఉండటమే. ఈ విషయాన్ని గ్రహించి మన పూర్వీకులు దేవాలయాలు మరియు చర్చీల ద్వారాల వద్ద పైభాగం వంపుగా ఆర్చీల మాదిరిగా నిర్మించారు. చైనీ యులు కూడా తమ తలుపులను పై భాగంలో వంపుగా అమర్చి నిర్మిస్తారు.

## 1236. ఆయుర్వేదము ఐదవ వేదమా?

**జ.** నాల్గు వేదాలలో ఒకటి అయిన అధర్వణ వేదానికి ఉపవేదంగా ఆయుర్వేదాన్ని చెబుతారు. ఆయుర్వేద ఆవిర్భావం క్షీరసాగర మధనం సమయంలో జరిగిందని చెబుతారు. దేవతలు, రాక్షసులు చేసిన క్షీరసాగర మధనంలో మొదటగా పుట్టింది హాలాహలం, తరువాత అమృతం, తరువాత 'ధన్వంతరి' జన్మించాడు. ఈ ధన్వంతరిని మహావిష్ణువు అవతారంగా భావిస్తారు. ఇతడు ఒక చేతిలో అమృత భాండాన్ని, మరో చేతిలో ఆయుర్వేదాన్ని పట్టుకొని ప్రత్యక్షమై వచ్చాడు. ఈ ఆయుర్వేదమే సకల మానవ కోటికి ఆరోగ్యాన్ని ప్రసాదించే జీవనవేదం. దీనిని ధన్వంతరి బ్రహ్మ దేవునికి ఇచ్చాడు. తరువాత మానవాళి రోగాల బారిన పడి నశించకుండా దేవ లోకం నుండి భూలోకానికి ఆయుర్వేదాన్ని రప్పించడానికి విశ్వామిత్రాది ఋషులు నిర్ణయించుకున్నారు. అప్పుడు భరద్వాజ మహర్షి దేవలోకం వెళ్ళి ఆయుర్వేదాన్ని అభ్యసించి వచ్చి 'ఆత్రేయుడు' అనే మహర్షికి బోధించారు. ఈ మహర్షి అగ్ని వేశ మహా

ర్షికి ఉపదేశం చేశాడు. ఆత్రే యుని వద్ద నేర్చుకొన్న ఆయుర్వేద రహస్యాలను మహాశాస్త్రంగా అగ్నివేశుడు రచించాడు. దీనినే అగ్నివేశతంత్రం అంటారు. తరు వాత ఇది చరక సంహితగా రూపు దిద్దు కుంది. ఈ చరకునే ఆయుర్వేదానికి ఆది గురువుగా భావిస్తున్నాం.

## 1237. సూర్యభగవానుని ఏ దేవతలు ఎప్పుడు పూజిస్తారు?

**జ.** ఉదయంపూట ఇంద్రుడు; మధ్యాహ్న



సమయాన యముడు; అస్తమిస్తున్న సమ యాన వరుణుడు పూజిస్తారు. చంద్రుడు అర్ధరాత్రి సమయం వరకు పూజిస్తారు.

## 1238. మాటలవల్ల అయిన గాయం మానిపోదా ?


**జ.**ఏ విషయమైనా ఆచి,తూచి మాటాడాలని అదుపులేని మాటలను మాటాడరాదని చెప్పారు. శరీరానికి అయిన గాయం త్వరగానే మాని పోగ లదు, కానీ మనస్సుకు తగిలిన గాయం మానుట కష్టము. కఠినమైన మనస్సులో అగ్ని లేకున్నా ఇతరుల మనస్సును కాల్చ గలదు. మాట జారటం చాలా ప్రమాద కరమైనది. ఎవరిని ఉద్దేశించి తప్పుగా మాటజారటం జరిగిందో వారి శాశ్వత శత్రువులుగా మారిపోవచ్చు. విల్లు నుండి వదలిన బాణాన్ని ఎలా వెనక్కు తీయలేమో అట్లే వాక్కు విషయంలో కూడా. మాట వల్ల వ్యక్తి ఆత్మాభిమానం దెబ్బతింటే ఆ గాయం మానుటకు చాలా కాలం పట్టవచ్చు లేదా ఆ గాయం మానక పోవచ్చు.

## 1239. ఉదయం ఫలహారంగా వేటిని తీసుకోవాలి ?

**జ.** భారత సంప్రదాయం ప్రకారం ఉదయం ఫలహారంగా గంజి లేదా జావ లేదా అంబలి మరియు నేతిని తీసుకోవడానికి ప్రాధాన్యతను ఇచ్చేవారు. దీనికి కొంత శాస్త్రీయత కూడా ఉన్నది. అన్నం యొక్క గంజి అంబలి లేదా జావతో పాటు గ్రహించినచో రక్తంలో నిలిచి ఉన్న విష పదార్థాలను మరియు మురికిని తొల గించగలవు. అలాగే ఈ జావలో ఉన్న విటమిన్లు శారీరక ఆరోగ్యాన్ని చేకూర్చు తాయి. నెయ్యిలో భాస్వరం మరియు కొవ్వు పదార్థం అధికంగా ఉంటే పలు కులు, దినుసులు ప్రోటీన్‌లను కలిగి ఉన్నాయి. ఇంకాకుకూరల్లో విటమిన్ల శాతం ఎక్కువ. జావ లేక అంబలితో కూడిన వరి అన్నం, పిండి పదార్థం పుష్క లంగా ఉన్న ఆహారంగా పనికొస్తుంది. భారతీయులు సమతౌల్యమైన ఆహారాన్ని గ్రహిస్తూ దృఢమైన ఆరోగ్యమైన శరీరాన్ని కలిగి ఉండమని చెప్పారు.

## 1240. గుడ్లను కలిగి ఉన్న చీమలను చంపరాదా ?

**జ.** గుడ్లను కలిగి ఉన్న చీమలను ఉద్దేశ పూర్వకంగా చంపటం పాపకర్మగా భావించబడింది. ప్రకృతిలో అనేక జీవరాశులతో జీవించే మనం వాటిని ప్రేమించి, తగిన



న్యాయం చేయాలని చిన్నతనం నుండి నేర్చుకుంటాం. మానవులమైన మనం ఇతర ప్రాణుల కష్టసుఖాలను యోచించగలం. గుడ్లను కలిగి ఉన్న చీమలు మనలో ప్రేమను జాగృతం చేస్తాయి. చీమ ఒకప్రాణి, దాని గుడ్డులో మరో ప్రాణం దాగి ఉన్నదన్న విజ్ఞతే వాటికి హాని చేయకూడదన్న సూక్తి.

## 1241. సంవత్సరాల సంఖ్య అరవైగానే ఎందుకు ఉన్నాయి?

**జ.** సంవత్సరాలు ప్రభవతో ప్రారంభమై, అక్షయతో ముగుస్తాయి. తరువాత మరల ప్రభవ ప్రారంభమైనట్లుగానే మనుషులకు అరవై సంవత్సరాలు నిండిన తరువాత బాల్యవస్థ ప్రారంభమౌతుంది. అంటే చిన్న పిల్లల్లా ప్రవర్తిస్తుంటారు. అరవై సంవత్సరాల కొకసారి మనో ధర్మాలతో పాటుగా మానవ ధర్మాలు మార్పు చెందుతుంటాయి. బుద్ధిశక్తి కూడా అరవై సంవత్సరాలు మాత్రమే నిరాఘాటంగా ఉంటుంది. అరవై తరువాత క్రమంగా జ్ఞాపకశక్తి క్షీణించిపోతుంది. శరీరంలోని కండలన్నీ కరిగిపోవటం ప్రారంభిస్తాయి. అరవై సంవత్సరాల లోపల మృత్యుశక్తి ఒకసారి తన ప్రభావం చూపిస్తుంది. అంటే ఏదో విధమైన ప్రాణాపాయం దగ్గరగా వచ్చి వెళ్తుందన్నమాట! అరవై తరువాత ప్రతి పది సంవత్సరాలకు మృత్యుశక్తి పలకరిస్తూనే ఉంటుంది. ఆరుపదుల జీవితాన్ని ఎవరైతే ఆనందంగా గడుపుతారో వారి జీవితం ధన్యమనే చెప్పవచ్చు. ఆ ధన్య జీవితపు జ్ఞాపకార్థమే బిడ్డలు మనవళ్ళు బంధువులు మిత్రులు అందరూకల్సి "షష్టిపూర్తి" పండుగను చేసి సంబరాలు చేసుకుంటారు.

## 1242. నది దాటేటప్పుడు నదీమ తల్లికి చిల్లర నాణాలను సమర్పించాలా ?

**జ.** పూర్వం రోజుల్లో రాగి నాణేలు ఉండేవి. నదులు, కాలువలు దాటేటప్పుడు గంగను ప్రార్థించి చిల్లర నాణేలను నీటిలో విడిచేవారు. పూర్వం ప్రస్తుతం మనకు ఉన్న నీటిశుద్ధి కార్యక్రమాలు, త్రాగునీటి సౌకర్యాలు ఉండేవి కావు. ప్రజలు కాలువల నీటిపైనే ఆధారపడి తమ జీవనాన్ని సాగించేవారు. రాగి నాణేలు ఈ నీటిని చేరుటవలన ఆ నీరు శుభ్రమై ప్రజలకు ఉపయోగపడేది. రాగి నాణేలున్న నదీ నీటిని త్రాగి ప్రజలు ఆరోగ్యంగా, బలంగా ఉండేవారు.

## 1243. జ్ఞానార్జనలో చెవి పాత్ర ఏమిటి?

**జ.** విద్యను ఆర్జించుటలో చెవికి విశేష మైన పాత్ర కలదు. ప్రప్రథమంగా జ్ఞానార్జన చెవితోనే ప్రారంభం అవుతుంది. 'జాగ్రత్తగా ఎక్కువగా విను, జాగరూకతతో తక్కువగా మాట్లాడు' అని పెద్దల వచనం. గురువు చెబుతున్న విషయాన్ని శిష్యుడు గ్రహిస్తాడు. రచించటం అనేది తరువాత వచ్చునటువంటిదే. సంభాషణలో పాల్గొన్నప్పుడు సరిగా వినుటకు ప్రాధాన్యము ను ఇవ్వాలి. జ్ఞానులు మాట్లాడుతున్నప్పుడు సరిగా వినటం ఎంతో అవసరం.

## 1244. స్త్రీ హస్తంలో ఏ గుర్తులుంటే ఆమె అపర లక్ష్మి?

**జ.** స్త్రీ హస్తంలో శ్రీవత్సమూ, తామర, కన్నూ, ఏనుగూ, అశ్వమూ, హంసా, చక్రమూ, వజ్రమూ, కత్తీ, పూర్ణ కుంభము, అంకుశమూ, కిరీటము, హారము, శంఖమూ, పూలదండ మొదలగు గుర్తులు ఉన్నచో



ఆమె సకల ఐశ్వర్యాలను పొందగలదు. అయితే ఈ గుర్తులను హస్తసాముద్రికము తెలిసివారే గుర్తించగలరు.

## 1245. వంటగదిలో తూర్పు దిశగా కిటికీ ఉండాలా ?

**జ.** వాస్తు ప్రకారం వంటగదిలో కిటికీని ఏర్పాటు చేసినట్లయితే వంట చేసేటప్పుడు వచ్చే పొగ కిటికీ ద్వారా బయటకు వెళ్ళిపోతుంది. అలాగే ఉదయం వేళలలో కుటుంబ సభ్యులు అందరూ వంటగదిలో ఉండే అవకాశం ఎక్కువ. అప్పుడు విటమిన్ 'డి'తో కూడిన సూర్య కిరణాల ప్రసరణ వల్ల కుటుంబ సభ్యులు అందరికి చక్కని ఆరోగ్యం సమకూరుతుంది. వంటగదిలో ఉండే ఘాటైన వాసన, పొగ ఈ కిటీ ద్వారా బయటకు వెళ్ళిపోతుంది. అందుకే ఈ ఏర్పాటు.

## 1246. కార్తీక ఏకాదశీ, ద్వాదశీ, పౌర్ణమి దినాలలో చన్నీళ్ళ స్నానాలు చేయాలా?

**జ.** ఈ మాసాల్లో ప్రవహించే నదుల్లోని నీటిలో ఎంతో శక్తి ఉంటుంది. దీనికి కారణం ఇంత వరకు పడిన వర్షపు నీరు భూమిలో ఇంకి ఓ మహా అయస్కాంత మండలం ఏర్పడుతుంది. ఇట్టి క్షేత్రము గల నీటిలో తెల్లవారుజామున నదీ స్నానం చేస్తూ నీటిలో ఉండగలిగినంత సేపు ఉన్నచో పొట్టకు సంబంధించిన వ్యాధులు పోగలవని నమ్మకం. వాస్తవము అనికూడా చెబుతారు. ఈ అయస్కాంత శక్తి వర్షాకాలం తరువాత వచ్చే ఆ మాసాల్లో నదుల్లో ప్రవహిస్తుంది. అందుకే వర్షాకాలం తరువాత వచ్చే ఈ మాసాలను విష్ణువునకు, శివునకు ఇష్టమైన

మాసాలుగా, నదీ స్నానానికి అనువైన మాసాలుగా నిర్ణయించారు.

## 1247. పండుగలు, శుభ సమయాల్లో మామిడి తోరణాలు ఎందుకు కడతాము?

**జ.** ఈ ఆచారము వెనుక ఒక శాస్త్రీయ అంశం దాగి ఉన్నది. గృహప్రవేశము, పండుగ మొదలగు శుభ సమయాల్లో మన చుట్టాలు, స్నేహితులు మొదలగు వారంతా ఇంట్లోకి రావటం, గుమి కూడటం జరుగుతుంది. ఆ కారణంగా సహజంగానే ఇంట్లోని గాలిలో ఆక్సిజన్



తగ్గి కలుషితమౌతుంది. మామిడి ఆకులకు గాలిని శుద్ధిచేసే గుణం ఉండటం వలన మన పూర్వులు తోరణాలను ద్వారాలకు దట్టంగా కట్టమని చెబుతారు. మామిడాకులలకు నోటిలోని పండ్లలో సూక్ష్మ క్రిములను హరించే గుణము ఉన్న కారణంగా మన పూర్వులు పళ్ళు తోమటానికి మామిడి ఆకులను ఉపయోగిస్తుంటారు. బావిలోనికి దిగి శుభ్రం చేయువారికి మొదట ఓ మామిడాకులు ఎక్కువగా ఉన్న కొమ్మను బావిలోకి దించి, చుట్టుతా కొంతసేపు తిప్పమని చెబుతారు. ఇలా చేయటం వల్ల బావిలో ఉన్న విషవాయువులు తొలగింపబడతాయని.

## 1248. ఆడవారిని ఏ వయసులో ఎలా పిలవాలి ?

**జ.** అమ్మాయిలను పది సంవత్సరాల వయస్సు వచ్చే వరకు కుమారీ, కళ్యాణీ, రోహిణీ, శాంభవీ, దుర్గ అని; యౌవన కాలంలో యౌవనా, ప్రౌఢా అనీ; వృద్ధాప్యమున అంగనా, మగువా, మహిళా, కాంతా, నారీ అని పిలవాలి.

## 1249. పాము, ముంగీస శత్రువులా ?

**జ.** పాముకు ముంగీసకు శత్రుత్వము ఉందని వీటి మధ్య పోరును చూసిన వారు అంగీకరించాల్సిందే. పాము కాటును అత్యంత చాకచక్యంగా తప్పించుకొంటూ, పామును అలసేలా చేసి, అదను చూసి పాము తలపై దాడిచేసి, పాము ముందు దుమ్మునులేపి, దానిని అయోమయంలో పడేసి చివరికి ముంగీస విజయం సాధిస్తుంది. ముంగీస తన దేహముపైగల పొడుగాటి వెంట్రుకలను విప్పి పాము కాటును తప్పించుకొంటుంది. ఇంతలాపోరాడుకున్నా నిజానికి పాముకు, ముంగీసకు శత్రుత్వము ఏమీలేదు. ముంగీస ప్రధాన ఆహారం పాము. కావున తన ఆహార అన్వేషణలో ముంగీస పాముతో తలపడక తప్పదు కదా!

## 1250. ఆరోగ్యాన్ని కలిగించే మంచి అలవాట్లు

**జ.** 1. నిత్యం వ్యాయామం చేయటం. 2. సాయంకాల ఎండను ఆస్వాదించడం. 3. ఎక్కువ నీరు త్రాగటం. 4. యజ్ఞ, హోమాదుల పొగను పీల్చటం. 5. రాత్రి పూట క్షీరాన్నమును భుజించటం. 6. అన్నింటికి మించి తృప్తిగా ఉండటం.

## 1251. భగవంతుని ప్రార్థించేటప్పుడు తలపై ఏమీ ధరించకూడదా ?

**జ.** భూమి, ఆకాశము మధ్య నున్న మనము భూమిపై పాదరక్షలు లేకుండా నిలిచి, తలపై ఏ ఆచ్ఛాదనా లేకుండా ప్రార్థించినచో భగవంతుని కరుణా కటా



క్షాలు మనకు సంపూర్ణంగా లభింప గలవు. ఈ నమ్మకంతోనే పాదరక్షలు, తలపాగా వంటివి తీసి భగవంతుని స్మరిం చాలని శాస్త్రాలు శెలవిస్తున్నాయి.

## 1252. ముగ్గురు కలసి ప్రయాణించ కూడదా?

**జ.** ముగ్గురు కలసి ప్రయాణం కావడం అశుభమని తలచబడింది. విశ్వాసం ప్రకారం కొన్ని సంఖ్యలు అశుభంగా ప్రపంచ వ్యాప్తంగా పరిగణించబడినాయి. 3,13, 33 మొదలగునవి ఇలాంటి సంఖ్యలే. ఇద్దరు మాట్లాడుకుంటున్నప్పుడు అభి ప్రాయ భేదాలు ఏర్పడితే సులువుగా ఓ తుది నిర్ణయానికి రాగలరు. ఒకవేళ మూడవ వ్యక్తి ఉంటే ఓ అభిప్రాయ విష యమై ఘర్షణలో ఉన్న వారిని ఇద్దరిని సర్దిపుచ్చుటకు, ఇరువైపులా తన సుము ఖతను వ్యక్తం చేస్తుం డాలి. ఇలా మాటా మాటా ముదిరి, కయ్యానికి దారితీసి ఒకరి నొకరు మాటలతో గాయపరచు కోవాల్సి వస్తుంది. ఇద్దరిమధ్య మూడవ వాడి చొరవ గందర గోళంగా మారవచ్చు. ఎవరికి నచ్చచెప్పినా మిగతా వానికి కోపం రావచ్చు. త్రాగుబోతున్న సందర్భ మైతే పరిస్థితి తన్ను కునేవరకు రావ చ్చును. ప్రయాణానికి సరి సంఖ్యలో వ్యక్తులు బయలుదేరితే బాగుంటుందని చెప్పబడింది. నలుగురు ఉన్నట్లయితే ఇద్దరిద్దరు జంటగా మాట్లా డుకోడానికి అనువుగా ఉంటుంది. తాము చెప్పేది ఇత రులు వినడం లేదన్న గొడవా ఉండదు. ఈ సిద్ధాంతం వ్యక్తుల మధ్య స్నేహాన్ని పెంచేదే కాని, తుంచేది కాదు.

## 1253. మానసిక మరియు శారీరక పవిత్రత గల వారికి బుద్ధిబలం కల పిల్లలు పుడతారా ?

**జ.** భారతీయ సంప్రదాయం ప్రకారం బ్రహ్మచర్య కాలం తరువాత వివాహం చేసుకొని సంతానాన్ని పొందాలని తెలుప బడింది. శుభ్రమైన ఆహారం తీసుకొనుట, మంచి తలంపులు ముఖ్యమైనవిగా తెలుప బడ్డాయి. దానధర్మాలు మరియు పూర్ణ



శరణాగత భక్తి, దంపతుల ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయి. సంభోగం గర్భధారణ కార్యంగా, పవిత్రంగా భావించబడేది. ఋతుస్రావమైన తరువాత అలాగే పౌర్ణమి మరియు చంద్రదర్శనం (నెలవంక) తరువాత మొదటి నాలుగు రోజులు గర్భ ధారణకు శుభమైన రోజులుగా మన పూర్వులు తెలుపలేదు. ఆధునిక వైద్య శాస్త్రము కూడా ఈ విషయంతో ఏకీభవించింది. రతిక్రీడా సమయంలో మానసిక ఆందోళనలులేని ఆరోగ్యకర మైన మనస్సు చక్కని సంతానాన్ని పొందేలా తోడ్పడుతుంది.

## 1254. 108 సంఖ్య ప్రాముఖ్యత ఏమిటి?

**జ.** ★ అష్టోత్తర శతనామావళి 108.
★ జపమాలలో పూసలు 108.
★ ఉపనిషత్తులు 108.
★ ఆయుర్వేదం మనిషిలో 108 మర్మ స్థానాలు కలవని పేర్కొంటుంది.
★ దేవ భాషలో అక్షరాలు 108.
★ భరతుడి నాట్యశాస్త్రంలో నాట్య భంగిమలు 108.
★ శ్రీచక్ర యంత్రంలో 54 స్త్రీ, 54 పురుష అంతర్భాగాలు ఉన్నాయి.

## 1255. పుట్టిన రోజు చేయకూడని పనులు

**జ.**1. పాత బట్టలను కట్టుకొనుట చేయరాదు. 2. శరీరానికి నూనెను మర్దించి స్నానం చేయరాదు. 3. అరటి మండలను నరకుటగాని, పొయ్యిని ఆర్పుటగాని చేయరాదు. 4. శరీరానికి గాయముగాని, దెబ్బ కాని తగులకుండా చూచుకొనవలెను. 5. ఇతరులు విడిచిన ఎంగిలి ఆహారాన్ని తినరాదు. 6. క్షౌరము చేయించుకొనుట, గోళ్ళను కత్తిరించు కొనుట గాని చేయరాదు. 7. ఒంటరిగా భుజించరాదు. 8. తన వయసును ఇతరులకు చెప్ప కూడదు. 9. తన కోసం వండిన వంట లను తను తినిన తరువాతనే ఇతరులు తినుట చేయవలెను. 10. పుట్టిన రోజు జరుపు

కొను వ్యక్తిని కొట్టుటగాని, తిట్టుటగాని చేయ రాదు. 11. స్మశానమును సందర్శించరాదు.

## 1256. పసుపు దాని ఉపయోగాలు

**జ.** భారతీయులు తమ వంటలలో పసుపుకు ఎంతో ప్రాధాన్యమిచ్చారు. పసుపులో నీటిని కలిపి దానిని పేస్ట్‌లాగా చేసి దానిని క్రమంగా లోనికి తీసుకొనినచో శరీరానికి చురుకుదనం పెరుగుతుందని ఆయుర్వేదం వెల్లడిస్తోంది. ఆహారంలో పసుపును ఉపయోగించినచో చర్మ రోగాలు, మూత్ర సంబంధ వ్యాధులు, సూక్ష్మ క్రిములను హరిస్తుంది. మన దేహంలో గల విషపదార్థాలు పసుపు కలిపిన ఆహార సేవనం ద్వారా తొలగిపోగలవు. గ్యాస్ ట్రబుల్, కడుపులోని మంట మొదలగు సమస్యలకు పసుపు ఓ చక్కని రోగ నివారణి. సౌందర్య సాధనలో కూడా పసుపుకు సముచిత స్థానం కలదు. పసుపు పేస్ట్‌ను చర్మానికి రుద్దుకొనినచో చర్మం తేజోవంతమౌతుంది.

## 1257. ఉత్తమ పురుషుడు అంటే ఎవరు?

**జ.** ★తన క్షేమములకంటే తనవారి క్షేమములను నిరంతరమూ చూసేవాడు ఉత్తమ పురుషుడు.

★ తనకు లభించిన ప్రతిఫలాన్ని బట్టి ప్రత్యుపకార ఫలాన్ని ఇచ్చువాడు మధ్యమ పురుషుడు.

★ తన సుఖం కోసం, తన వ్యసనాల కోసం కుటుంబాన్నీ, తన వారినీ నాశనం చేయువాడు అధమ పురుషుడు.

★ తనకున్న దుర్గుణాల ద్వారా తనూ, తన వారినీ పాడు చెయ్యటమే కాక, ఏ సంబంధం లేనివార్ని కూడా మాయ ప్రలోభాలతో ఆ వైపు మళ్ళించువాడు అధమాధమ పురుషుడు.

## 1258. గుడిలోని అర్చకులను భక్తులు తాకరాదా?

**జ.** గుడిలోని అర్చకుడు చాలా సమయం దేవతా మంత్రాలను మరియు శ్లోకాలను పఠిస్తూ ఉంటాడు. ఆ కారణంగా అతని శరీరం శక్తికి నిలయంగామారి ఉంటుంది.



ఎవరైనా అతనిని తాకినట్ల యితే ఆ శక్తిని అతడు కోల్పోగలడు. ప్రతి ఒక్కరి శరీరం చుట్టుతా ఓ శక్తి ఆవరణము ఉంటుంది. మనము ఇతరులను తాకినప్పుడు ఈ తేజో ఆవరణం ప్రభావానికి గురి అవుతుంది. కావున అనవసరంగా అర్చకులనే కాదు, ఏ వ్యక్తినీ తాకే అలవాటు మానుకోవటం మంచిది.

## 1259. ఇంట్లోకి దుష్టశక్తులు రాకుండా ఉండాలంటే ఇల్లు ఏ విధంగా ఉండాలి ?

**జ.** 1. ఇల్లు శుచిగా, శుభ్రంగా ఉండాలి. 2. ఇంట్లో నిత్యం దీపారాధన చేయాలి. 3. పురుటి స్త్రీని విడిగా ఉంచాలి. 4. ఇంట్లో స్త్రీలు ఋతు సమయంలో విడిగా ఉండాలి. 4. తులసి, నిమ్మ, వేప వంటి చెట్లు ఇంటి ఆవరణలో తప్పక ఉండాలి. 5. ఇంట్లో రామాయణం, భారతం, భాగవతం, భగవద్గీత మొదలగు గ్రంథాలను ఉంచుకొని, వాటిని పారాయణం చేయాలి.

## 1260. బ్రాహ్మణుడు అంటే ఎవరు ?

**జ.** నిత్యమూ వేదాధ్యయనముచేయువాడు, బ్రహ్మజ్ఞానము కలవాడు, మద్య మాంసాలను ముట్టనివాడు, పొగాకును తీసుకొననివాడు, సత్యశౌచములు పాటించువాడు మాత్రమే బ్రాహ్మణుడు కాని



బ్రాహ్మణ తల్లిదండ్రులకు పుట్టినవాడు, యజ్ఞోపవీతం ధరించిన వాడు మాత్రమే బ్రాహ్మణుడు కాజాలడు.

## 1261. మజ్జిగలు ఎన్నిరకాలు అవి ఏవి?

**జ.** మజ్జిగను దశవిధ తక్కం అంటారు. అంటే మజ్జిగ పది విధాలుగా ఉంటుంది.

★ మొదటి రకం మజితం. తియ్యని పెరుగుని నీరు కలపకుండా చక్కగా చేస్తారు. దీనివలన మూత్రకోశ వ్యాధులు తగ్గగలవు అని చెబుతారు.

★ రెండవ రకం మిళితం. ఒక వంతు పెరుగు, మూడువంతుల నీళ్ళు కలిపి చేస్తారు. ఈ మజ్జిగ పాండు, ఉదర కోశ వ్యాధులను తగ్గించగలదని చెప్పుదురు.

★ మూడవ రకం గోళం. ఒక వంతు పెరుగు, ఒకటిన్నర వంతునీరు కలిపి చేసే ఈ మజ్జిగ నేత్ర వ్యాధులను, మూత్ర రోగాలను తగ్గిస్తుంది.

★ నాల్గవ రకం దధి. ఒక వంతు పెరుగు ఐదు వంతుల నీటిని కలిపి చేసే ఈ మజ్జిగను త్రాగుటవలన చిన్న వయసులోనే ముఖంపై ముడుతలు వచ్చి వృద్ధాప్య చిహ్నాలు తొలగగలవు.

★ ఐదవ రకం కాలశయం. ఒక వంతు పెరుగు, రెండు వంతుల నీరుతో చేసే ఈ మజ్జిగ విషశక్తికి కూడా విరుగుడుగా పనిచేసి ఉదరకోశ వ్యాధుల నుండి ఉపశమనాన్ని కలిగిస్తుంది.

★ ఆరవ రకం కరమధితం. కవ్వం పెట్టి చిలుకకుండా పెరుగు, నీటిని సమ

పాళ్ళలో తీసుకొని చేతులతో పిసికి చేయునది. ఈ మజ్జిగ ఉపయోగించిన శరీరానికి కావలసినంత ఆరోగ్యం చేకూరదు.

★ ఏడవ రకం ఉధశిత్వం. ఒక వంతు పెరుగు, రెండు వంతుల నీటితో చేసే ఈ మజ్జిగ ఉపయోగించక పోవటం శ్రేయస్కరం.

★ ఎనిమిదవ రకం తక్రం. రెండు వంతుల పెరుగు, ఒకవంతు నీటితో మజ్జిగ చేసి శొంఠి, మిరియాలు వంటి వాటితో పాటు పిప్పళ్ళ పొడితో చేసిన కషాయాన్ని కలుపుకొని త్రాగితే పాండు రోగాన్ని తగ్గించగలదని చెబుతారు.

★ తొమ్మిదవ రకం దండాహతం. ఒక వంతు పెరుగు, రెండు వంతుల నీటితో చేసే ఈ మజ్జిగను అన్ని ఋతువులలో తీసుకొనవచ్చును. ఈ దండాహతం ప్రతి రోజు పిల్లలకు ఇచ్చినచో వారిలో ఉత్సాహం, చురుకుతనము వెల్లివిరియ గలదు.

★ పదవ రకం అతిమిళితం. ఒక వంతు పెరుగు, తొమ్మిది వంతుల నీటినీ కలిపి చేసే ఈ మజ్జిగ అన్ని వయసుల వారు ఉపయోగించవచ్చును. దీనిని మజ్జిగ తేట అంటారు. ఈ మజ్జిగ తేట అమృతము వంటిది. వేసవితాపాన్ని తీర్చి సేదతీరు స్తుంది.

## 1262. పులి చర్మము మీద కూర్చొని చేసే తపస్సు ఉత్తమమా ?

**జ.** పులి చర్మాన్ని దాటి భూమికి ఆకర్షించే గుణం లేదు. అందువలన తపస్సు ద్వారా సాధించిన ఫలము సాధకునిలోనే ఉండి



పోతుంది. కటిక నేల మీద పూజ చేస్తే సాధకునకు దుఃఖము కలుగుతుంది. రాతి మీద పూజ చేస్తే అనేక వ్యాధులు వస్తాయి. గడ్డి పరకలమీద కూర్చొని పూజ చేస్తే ఆయుష్షు క్షీణిస్తుంది. వెదురుకు సంబంధించిన తయారు చేసిన ఆసనము మీద కూర్చొని పూజ చేసినచో దరిద్రము సంభవించును.

## 1263. మానవుడు చేయకూడని పనులు ఏవి?

**జ.** ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుటకు కొన్ని నిషేధాలను మన పూర్వులు నిర్దేశించారు. అవి

1. ఏదైనా గ్రహించు సమయంలో పెద్దల ముందు నిలబడవలెను.

2. ఏదైనా సమస్యను చర్చించునపుడు పెద్దగా అరచుట నాగరకమైన పనికాదు.

3. నిట్టూర్పు విడువరాదు. అది వ్యక్తి యొక్క ఆందోళనకరమైన స్థితిని తెలుపును.

4.ఆందోళనను అణచుకొనరాదు. దానిని ఇతరులతో పంచుకొనవలెను.

5. అరటిపండు తినిన వెంటనే మజ్జిగ త్రాగరాదు.

6. ఔషధిని వాసన చూసిన ఎడల దాని గుణము కోల్పోవును. కావున వాసన చూడరాదు.

7. జూదము, చదరంగము మొదలగు వ్యసనాలకు స్వస్తి పలకాలి.

8. నిరంతరము దైవారాధనలో కాలం గడుపుతూ ఇతరులకు తనకు తోచినంత సహాయం చేయాలి.

### 1264. గుడిలోకి చెప్పలు లేకుండా ప్రవేశించాలా ?

**జ.** పాదరక్షలతో పవిత్ర స్థలాలలో తిరుగ రాదని హిందూసాంప్రదాయం చెబుతు తోంది. అందుచేత గుడిలోకి కూడా పాద రక్షలు లేకుండా వెళ్ళవలయునని సాంప్ర దాయం. దీనికి ఆంతరంగికమైన మరో కారణం కూడా ఉంది. గుడి నేలభాగం అయస్కాంత శక్తితో ప్రేరేపితమై ఉంటుంది. ఆ అయస్కాంత శక్తి మన శరీరంలోకి ప్రవహించటం ఆరోగ్యప్రదం. కావుననే పాద రక్షలు లేకుండా శుభ్రమైన పాదా లతో దేవాలయంలోకి ప్రవేశం చేయాలని చెప్పబడింది. అలాగే దేవాలయం ప్రాం గణంలో అనేక ఔషధ మొక్కలు, పూల మొక్కలు ఉంటాయి. అవి అనుకూల శక్తిని చూపుతుంటాయి. అలాగే దైవ విగ్రహాన్ని అభిషేకించిన జలం నేలపై పడి పవిత్రతను కలిగిస్తుంది. కావున అలాంటి



నేలపై పాదాన్ని తాకించుటవల్ల (చెప్పులు లేకుండా) ఆ శక్తి పాదాల ద్వారా దేహానికి అంతటా చేరుతుంది. అలాగే పాదరక్షలు లేకుండా ఉండటం గర్వ అహంభావాలు తొలగి ఉన్న స్థితిని తెలుపుతుంది. అలాగే గుడిలో సహజంగా ఉండే అయస్కాంత శక్తిని కూడా భక్తుడు పొందుతాడు.

### 1265. మానవునికి దేవుడుకూడా తీర్చలేని బాధ ఏమిటి?

**జ.** తనకి లేదన్న చింతకంటే ఎదుటి వాడికి ఉన్నదన్న బాధగల వాని చింతను ఆ దేవుడుకూడా తీర్చలేడు.

## 1266. విష బాధలు తొలగాలంటే గరళ కంఠుని పూజించాలా?

**జ.** క్షీర సాగర మథన సమయంలో వచ్చిన హాలాహలాన్ని శివుడు తన కంఠంలో ఉంచుకొని లోకాన్ని రక్షించాడు. అంతటి విషాన్ని తనలో దాచుకున్న పరమశివుడు మనుష్యులకు కలిగే విషరోగాలను అరి



కట్టే శక్తిగల వాడని భక్తులు నమ్ముతారు. శివా, పరమేశ్వరా అన్న ధ్యాన జపంవల్ల శరీరంలో ఎన్నో మార్పులు జరిగి ఉత్సాహం, ఉత్తేజం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

## 1267. నిద్రలేవగానే భగవన్నామాన్ని స్మరించాలా?

**జ.** అదృష్టవంతులు గాఢమైన నిద్రలో ప్రశాంతత పొందుతూ ప్రాపంచిక వ్యవహారాలను మరచి సుఖనిద్రను పొందుతారు. సమయానికి తిండి మరియు నిద్ర మనిషి ఆరోగ్యానికి ముఖ్యమైనవి. నిద్ర నుండి లేచిన తరువాత పడకపై కూర్చొని తలను నిటారుగా ఉంచి పార్వతి, లక్ష్మి మరియు సరస్వతి దేవతల స్తోత్రమో లేక నామమో జపించ వలెనని మన పూర్వులు చెబుతారు. దీనికి సైన్స్‌కు సంబంధించిన కారణం కూడా కలదు. మనం నిద్ర పోతున్నప్పుడు రక్తప్రసారం మందకొడిగా సాగును. ఒక్క సారిగా నిద్రలేచి నిలుచోవడం వల్ల గుండె ఒక్కసారిగా రక్తాన్ని ఎక్కువ మోతాదులో విడచుటకు ఒత్తిడి కలుగును. దీనివల్ల గుండె స్థబ్దత చెందే అవకాశము ఉన్నది. కావుననే మన పెద్దలు నిద్రనుండి మేల్కొన్న తరువాత కాసేపు కూర్చొని భగవంతుని ప్రార్థించమని చెప్పారు. అలా కాసేపు కూర్చొని పడక దిగినట్లయితే రక్త ప్రసరణ అనుకూల స్థితిలో ఉంటుంది. సైన్స్ పై విషయానికి సాక్ష్యంగా ఉంది. హృద్రోగ నిపుణుల అభిప్రాయం ప్రకారం గుండె జబ్బులు కలవారిలో 23 శాతం మంది హఠాత్తుగా నిద్రనుంచి లేచి నిలబడటం వల్ల మరణాలు సంభవించా యని తెలుస్తుంది.


## 1268. స్త్రీని కలవ కూడని రోజులు ఏవి?

**జ.** ఋతుమతి అయిన స్త్రీని నాలుగు రోజుల వరకు తాకకూడదు. స్త్రీ ప్రసవించిన తరువాత ఒక నెలవరకు దూరంగా ఉండాలి. ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం, సంధ్యాకాలంలో సంగమం కూడదు. సంధ్యాకాలమందు

కలిసినా గర్భం నిలవదు. ఒకవేళ నిలిచినా పుట్టిన వారు భూమిని భారమయ్యేలా వారి ప్రవర్తన ఉంటుంది. నిజానికి పర్వదినాల్లో స్త్రీని కలవకూడదని శాస్త్రాలు శెలవిస్తున్నాయి.

## 1269. దీర్ఘాయువుకు కారణం క్షమించే గుణమేనా ?

**జ.** పొరపాట్లు చేయడం మనిషి తత్వమైతే క్షమించడం దైవత్వం అని శాస్త్రం చెబుతోంది. అమెరికాలోని మిచిగాంన్ విశ్వవిద్యాలయానికి చెందిన డా. లోరెన్ ఎల్.టోసెంట్ ప్రకారం క్షమించడానికి దీర్ఘాయువుతో సంబంధమున్నదని, క్షమించిన వాడు ఎంతో ప్రశాంతను పొందుతాడని, క్షమించిన తన కోపాన్నంతా ఇతరులపై కుమ్మరించిన వాడి అంతరాత్మ వాడిని దోషం చేసానని భావనతో వెంటాడి మానసిక ప్రశాంతను హరిస్తుంది కాబట్టి క్షమాగుణం ఎంతో గొప్పదే కాక ఆచరించదగిన గుణము.




## 1270. పెళ్ళయిన స్త్రీలే నల్లపూసలు ధరించాలా ?

**జ.** స్త్రీలు తమకు పెళ్ళయిందన్న గుర్తుగా బంగారంతో చుట్టిన నల్లపూసలు ధరిస్తారు. తమకు అంగరంగ వైభవంగా జరిగిన పెళ్ళి గురించి, తమ సంసార మాధుర్యం గురించి నలుగురు తమ గురించి గొప్పగా మాట్లాడుకునేటప్పుడు వారి నోటి వెంట వచ్చిన దోషాలను ఈ నల్లపూసలు అరికడతాయనే ఓ నమ్మకం. అంతే కాక నల్లపూసల దండ స్త్రీలకు అదనపు అలంకారంగా కూడా ఉంటుంది.

## 1271. చీకటి పడిన తర్వాత వాకిలి ఊడ్చకూడదా ?

**జ.** సాయంకాల సమయంలో చీకటి పడక ముందే వాకిలి ఊడ్చి, తరువాత దేవునికి దీపారాధనచేయాలి అని మన సంప్రదాయం చెబుతోంది. అదృష్ట దేవతను ఆకర్షించడానికి, దురదృష్ట దేవతలను దగ్గరకు రానీయకుండా ఉండటానికి ఈ విధమైన ఆచారం వ్యాప్తిలో ఉంది. కానీ చీకటి పడిన తరువాత వాకిలి ఊడ్వడం, నీరు చల్లడం చేయరాదనటానికి అసలైన కారణం చీకటిలో వాకిలిని అంత శుభ్రంగా ఊడ్వ లేక పోవటమే కాక చీకటి పడిన తరువాత నేలపై పాకే ప్రాణులు బయటకు వస్తాయికూడా. అందుకే సూర్యాస్త మయానికి ముందే ఈ ఊడ్చే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని చెపుతారు.

## 1272. అతిథి వెళ్ళిపోతున్నప్పుడు తింటూ కూర్చోకూడదంటారు ఎందుకు?

**జ.** మర్యాద మరియు మంచితనము సంస్కృతి సారం. ప్రతీ సమాజానికి తన దైన శైలిలో మర్యాదతో కూడిన ప్రవర్తనా శైలి ఉంది. అతిథిని గౌరవించటం భార తీయ సంప్రదాయం. అతిథిని దేవుడితో పోల్చడం (అతిథిదేవోభవ) భారతీయ సంప్రదాయం. మన ఇంటికి వచ్చిన అతిథి అతడు ధనవంతుడైనా, పేద వాడైనా, ఉన్నత స్థితిలో ఉన్నా, సాధారణ జీవనం గడుపుతున్నా అతడు గౌరవ నీయుడే. అటువంటి అతిథి సెలవు తీసుకుంటున్నప్పుడు అతనితో కొద్ది దూరం వెళ్ళి ఆ అతిథిని సాగనంపటం ఆ ఇంటి యజమాని యొక్క బాధ్యత. అతిథి సెలవు తీసుకుంటున్నప్పుడు నీ మానాన నీవువెళ్ళు, నా పని నేను చేసు కుంటాను అని అన్నట్లు భోజనం చేయటం లాంటి పనులు చేసినట్లయితే ఆ అతిథిని అమర్యాద పరచినట్లే. అతిథి వెళ్ళే తొందరలో ఉంటే మనం తినే కార్య క్రమాన్ని కొద్దిగా వాయిదా వేసి అతనిని సాగనంపటం మన విధి.

## 1273. కాకులకు ఎందుకు అన్నం పెడతారు?

**జ.** కాకికి గతాగతాలు తెలుసునని శాస్త్రాలు చెబుతున్నాయి. పోయిన జీవుడు కాకిరూపంలో అయినవాళ్ళ చుట్టూనే తిరుగుతున్నాడనీ, అన్నాన్ని పెట్టినప్పుడు



అన్నాన్ని ముట్టుకుంటే వానికోరికలు తీరినట్టు, ముట్టుకోకపోతే కోరికలు తీరనట్టూ శాస్త్రం చెబుతోంది. అలాగే కాకులు అరిస్తే చుట్టాలు వస్తారని చెబుతారు.

## 1274. గోకులాష్టమి రోజు అర్ధరాత్రి నైవేద్యం ఎందుకు పెడతారు?

**జ.** గోకులాష్టమి రోజున చిన్ని కృష్ణుడి పాద ముద్రలు ఇంటి బైట నుండి ఇంట్లోకి వేస్తారు. అంటే కృష్ణుడు బుడి బుడి నడకలతో తమ ఇంట్లోకి ప్రవేశిం చాలని వారి ఉద్దేశ్యం. అర్ధరాత్రి పన్నెండు గంటలకు అంటే శ్రీకృష్ణుడు జన్మించిన సమయాన, నూతన బాలునికి నైవేద్యం పెడతారు.


## 1275. మోక్షాన్ని పొందుటకు ఐదు మార్గాలు

**జ.** మోక్షాన్ని పొందుటకు వ్యాస మహర్షి ఐదు మార్గాలను సూచించాడు. అవి 1. తల్లిదండ్రులను గౌరవించి పోషించ వలెను. 2. భార్యాభర్తలు ఒకరికొకరు విశ్వసనీయంగా ఉండాలి. 3. సర్వ ప్రాణి కోటిని ప్రేమించగల సహృదయము ఉండాలి. 4. మిత్రద్రోహము, బంధు వులకు ద్రోహము మరియు ఆశ్రయించిన

వారికి అన్యాయము చేయరాదు. 5. నిత్యము భగవంతుని ఆరాధిస్తూ నిష్కామముగా జీవించాలి.

## 1276. కప్పలు అరిస్తే వానలు పడతాయా?

**జ.** కప్పలు అరిస్తే వానలు పడతాయనే విశ్వాసం బహుళ ప్రాచుర్యంలో ఉంది. కానీ ఈ నమ్మకానికి శాస్త్రీయమైన నిరూపణ లేదు. మనకు తెలిసిన వాస్తవ



మేమంటే వర్షం పడిన తరువాత కప్పలు అరుస్తాయని. వర్షర్తువు ప్రారంభంకా గానే కప్పల అరుపులు అంతటా వినబడు తుంటాయి. చాలా రకాల కప్పలు నీటిలో గుడ్లు పెడతాయి. కావున వాటి అండో త్పత్తి మరియు అండాలను నీటిలో వద లడం మొదలైన వాటికి వర్షాలకు సం బంధం ఉంది. వానాకాలం రాగానే మగ కప్పలు సంభోగానికై ఆడ కప్పలను వాటి భాషలో అవి అరుస్తూ పిలుస్తాయి.

## 1277. బంగారపు కడియం కన్నా పంచలోహ కడియమే మేలా?

**జ.** పిల్లలను లోహ నిర్మిత కడియాలు ధరించమని చెబుతారు. కొందరు వీటిని వెండి లేదా బంగారంతో చేయించుకుం టారు. వీటికన్నా పంచలోహ నిర్మిత కడియమైతే అనేక ప్రయోజనాలు కలవని తెలుస్తుంది. పంచలోహ కడియంలో బంగారం, వెండి, రాగి, ఇనుము మరియు సీసము వంటి లోహాలు ఉంటాయి. మానవ శరీరం చుట్టూతా ప్రాణశక్తి ప్రవా హం ఉంటుంది. ఈపంచలోహ నిర్మిత కడియాన్ని ధరిం చటం వల్ల ఈ ప్రాణశక్తి ప్రవాహం ఎక్కువ స్థాయిలో ప్రభావవంతంగా పని చేస్తుంది. ఇలాంటి అనుకూల శక్తి పిల్లల బుద్ధిబలాన్ని పెంపొందిస్తుంది. కావున ముఖ్యంగా పిల్లలు ఈ పంచలోహ కడియాన్ని ధరించమని పెద్దలు చెబుతారు.

## 1278. ఊరేగింపు సమయంలో దేవుని ఉత్సవ విగ్రహాల ముందు బిందెతో నీళ్ళను ఎందుకు పోస్తారు?

**జ.** ఈ విధంగా నీటిని పోయటం అంటే స్వామిని తమ ఇంటిలోకి ఆహ్వానిం చటం. ఊరేగింపు తమ ఇంటి ముందు రాగానే బిందెతో నీటిని తీసుకొని నిలు వుగా పోసి స్వామిని ఆహ్వానిస్తారు. ఈ నీటిని అడ్డముగా పోయరాదని శాస్త్రాలు చెబు తున్నాయి. అడ్డముగా పోస్తే అశుభము.

## 1279. పూజలకు ఆవుపాలే శ్రేష్ఠమా?

**జ.** గోవు సమస్త సృష్టిలోకి పవిత్రమైనది. సకల దేవతలకి నివాస స్థలము. అందుకే

పూజల్లో, వ్రతాల్లో, యజ్ఞము మొదలగు శుభకార్యాల్లో ఆవుపాలు, ఆవు పెరుగు, ఆవునెయ్యిని మాత్రమే వాడతారు.

## 1280. మౌనం మహాశక్తి వంతమైనదా?

**జ.** మనలను ఎవరైనా అకారణంగా దూషించుచున్నప్పుడు మౌనంగా ఉన్న యెడల ఆ తిట్లూ, శాపనార్థాలు తిరిగి



అతన్నే ఆవహిస్తాయి. అందుకే మౌనం మహా శక్తివంతమైనది. ప్రళయానికి ముందు కూడా సముద్రం ఎంతో మౌనంగా ఉంటుంది.

## 1281. స్నానం చేసేటప్పుడు వంటికి నూనె రాయాలా ?

**జ.** ఉదయం వేళ దేహానికి నూనె మర్ధన చేసుకొని తరువాత స్నానం చేయాలని భారతీయుల దినచర్యలో చెప్పబడింది. నూనె రాసుకోవడం ద్వారా బాహ్యమైన ఆనందమే శరీరానికి కలుగుతుందని మాత్రమే మనము అనుకుంటాము. కానీ దానితో పాటుగా మరో రెండు ఇతర ప్రయోజనాలు ఉన్నాయి. మొదటిది ఔషధ పూరితమైన నూనెను శరీరమంతటా రాయటం వలన ఔషధ పరమైన ప్రభావాన్ని శరీరంపై కలిగి ఉంటుంది. రెండవది శరీరంపై సూక్ష్మ క్రిములు నూనె రాయడం ద్వారా నశిస్తాయి.

## 1282. దాయాల్సింది వయస్సు ఒక్కటేనా?

**జ.** వేదధర్మశాస్త్రాలు ఖచ్చితంగా దాయాల్సినవి చెబుతూ అందులో మొదటగా వయస్సును పేర్కొన్నాయి. ఆ తర్వాత ధనాన్నీ, నిత్యం చేసే మంత్ర పూజను, కుటుంబ వివాదాలను, ఉపయో గిస్తున్న ఔషధ వివరాలను, చేసిన దానాన్ని, జరిగిన పరాభవాన్ని గుట్టుగా ఉంచాలని వాటి వివరాలను తెలుప రాదని పేర్కొన్నాయి.

## 1283. నక్క ఊళ చెడు శకునమా?

**జ.** నక్కకు మనకంటికి కనిపించని దయ్యాలు, భూతాలు, యక్ష, కిన్నెరాది దేవతలు కనిపిస్తాయని మన వారి నమ్మకం. అందుకే నక్క ఊళ పెట్టినపుడు ప్రయాణం మానమని సలహా ఇస్తారు. నక్కకు దయ్యాలు, భూతాలు కనిపిస్తాయా లేదా అన్నది ప్రక్కన పెడితే నక్కలు, కుక్కలు లాంటి జంతువులకు ఆకలిగా ఉన్నప్పుడు, సంభోగేచ్ఛ కలిగి తోడును కోరినపుడు కూతలు వేస్తాయి. ముఖ్యంగా

నక్కలు ఆకలిగొన్నప్పుడు, సంభోగం కోరేటప్పుడు ఇలా ఊళలు వేయటం జరుగుతుంది. ఇలాంటి సమయాలలో అవి విచక్షణను కోల్పోతాయి. దాడికి యత్నించవచ్చు. అందువలన ఈ సమయంలో ప్రయాణించుటవలన అవి ఎదురై మనకు హాని కలిగించ వచ్చుననే భయంతో బయటకు కదలనీయరు.

### 1284. పొలంలో పంటకై చల్లడానికై ఉంచిన ధాన్యాన్ని బదులుగా ఇవ్వరాదని ఎందుకు అంటారు?

**జ.** పొలంలో పంటకై చల్లడానికి నిల్వ ఉంచిన ధాన్యాన్ని బదులు ఇవ్వటం వల్ల ఆ వ్యక్తి పంట సరిగా రాదని, ఆ రైతు నష్టపోతాడని భారతీయులు దృఢంగా విశ్వసిస్తారు. ధాన్యమే రైతు యొక్క పెట్టుబడి. పెట్టుబడి అయిన ధాన్యాన్ని తగినంతగా లేకుండా రైతు తన వృత్తిని చేయలేడు. అలా ధాన్యాన్ని విడనాడడం వల్ల అది ఆ రైతుకు పతనాన్ని కలిగిస్తుంది. ఇతరులకు సహాయ పడటం వ్యక్తి సహృదయతకు ప్రతిరూపమైనా తన వృత్తికి సంబంధించిన పెట్టుబడినే ఇతరులకు



ధారపోయడం, తద్వారా తను పంట నష్టపోవడం అభిలషణీయం కాదు కదా!

### 1285. చరక సంహిత రొంపకు చెప్పిన అమోఘమైన వైద్యం ..?

**జ.** బాగా మరుగుతున్న నీటిలో ఇరవై తులసి ఆకులు వేసి, బాగా మరిగిన తరువాత పంచదార, పాలు పోసి మనం ఉదయం త్రాగే కాఫీ, టీలకు బదులు ఈ ద్రవాన్ని త్రాగినచో రొంప, జ్వరము దరిచేరవని చరకసంహిత పేర్కొంటుంది.

### 1286. సందర్శించిన ఫలం దక్కాలంటే కాశీని ఎలా దర్శించాలి?

**జ.** కాశీ విశ్వనాథుని సందర్శించుకోవాలంటే ఎంతో పుణ్యం చేసుకొని ఉండాలి. విశ్వనాథుని సందర్శనార్థమై నేరుగా కాశీకి వెళ్ళినచో ఫలము అనంతము. అలా కాక పితృ కార్యక్రమాల కోసం అంటే అస్తికల నిమజ్జనం కోసం కాశి వెళితే ఆ పుణ్య ఫలం పితృదేవతలకే చెందుతుంది.

### 1287. తూర్పు దిక్కు యొక్క ప్రాముఖ్యత ఏమిటి ?

**జ.** నాలుగు దిక్కులలో తూర్పు దిక్కు ఎక్కువ ప్రాధాన్యతను కలిగి ఉన్నది. భూమి చుట్టూతా దక్షిణము నుండి ఉత్తరానికి మరియు తూర్పు నుండి పడమటికి అయస్కాంత శక్తులు పరిభ్రమిస్తుంటాయి. తూర్పు నుండి పడమటివైపు ప్రవహించే శక్తి మన శరీరానికి ఎక్కువ ఆరోగ్యకరమైనదిగా ఉంది. సూర్యుడు,

గ్రహాలు మరియు నక్షత్రాలు వాటి వాటి అయస్కాంత శక్తులను భూమిపైకి నిరంతరం పైన సూచించిన విధంగా ప్రసరింప చేస్తూ భూమిపై జీవనానికి అనుకూలతను చేకూర్చుతారు. ఈ శక్తి తరంగాలు ఋతువుల మార్పుకు, భూమి సారాన్ని కాపాడుటకు మరియు వృక్ష మరియు జంతు జాలాన్ని కాపాడు టకు దోహదం చేస్తాయి. అందుకే తూర్పు దిక్కుగా తల ఉంచి నిద్రించుట శ్రేష్ఠమని చెప్పబడినది. దేవుడి ఆరాధనలో మరియు శుభకరమైన కర్మలలో దీపాన్ని తూర్పు దిక్కుగా ఉంచి వత్తిని వెలిగించాలి. అలాగే ఇంటి ముఖ ద్వారము తూర్పు వైపు ఉండుట క్షేమకరము. అందుకని దేవా లయములు మరియు ఇంటి ముందు ఏర్పాటు చేయబడు దేవుని విగ్రహములు తూర్పు వైపు ముఖమును కలిగి ఉండుట శుభకరము. ఏ శుభ కార్యమైనా తూర్పు దిక్కున నిల్చొని చేయుట మంచిది. వివా హము, పుట్టినరోజు, విందు కార్యక్ర మము, కొత్త బట్టలు ధరించినప్పుడు తూర్పుకు ముఖమును ఉంచి చేయవలెను. ఇంటికి తూర్పు దిక్కుగా బావి, గ్రామానికి తూర్పు దిక్కుగా చెరువు ఉండవలెనని శాస్త్రము.

### 1288. వివాహిత స్త్రీలు పిల్లేళ్ళు ఎందుకు ధరిస్తారు?

**జ.** వివాహిత స్త్రీలు మూడు, నాలుగు కాలి వేళ్ళకు పిల్లేళ్ళు ధరిస్తారు. దీనికి ఒక కారణాన్ని చెబుతారు. స్త్రీలకు పురుషుల కన్నా రెండు రెట్లు కామము అధికము. వీటిని ధరించటం వల్ల ఆ కాలి వేళ్ల వద్ద ఉన్న కామ నరాలు ఒకదానితో మరొకటి రాసుకొని కామాన్ని తగ్గించి, పురుషుని కామంతో సరిసమానం అగును కావున పిల్లేళ్లను స్త్రీ పాదాల వేళ్ళకు పెట్టమని మన పెద్దలు చెప్పారు.

### 1289. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో శివలింగం వెనుక దీపాలు ఎందుకు కదులుతాయి?


**జ.** శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ఓం నమః శివాయ అని పలుకుతు, అయిదు దీపాలను వెలిగించినచో అనంతమైన పుణ్యం లభించగలదు. స్వామి ఇచ్చట వాయులింగ రూపంలో భక్తులకు దర్శన మిస్తారు. అందుకే లింగానికి వెనుక నున్న దీపాలు కదులుతుంటాయి. రాహు కేతు దోషాలు ఉన్నవారు ఈ దేవాలయంలో



రాహుకేతు పూజచేసి, స్వామివారిని దర్శించినచో రాహుకేతు దోషం నివారణ కాగలదని భక్తుల నమ్మకం.

## 1220. అస్తమించే సూర్యుడు గొప్పవాడా? ఉదయించే సూర్యుడు గొప్పవాడా?

**జ.** అస్తమించే సూర్యుడు ఉదయించే సూర్యుడంతటి శక్తికలవాడుకాదని మన పూర్వుల అభిప్రాయం. ఆధునిక శాస్త్రం కూడా ఈ విషయాన్ని అంగీకరించింది. సూర్య కిరణాలు ప్రయాణం చేస్తున్నప్పుడు భూమిని ఆవరించి ఉన్న గాలి ఆవరణం గుండా పోతాయి. అలా అవి గాలియొక్క పరమాణువులతో ఢీకొని వ్యాపిస్తాయి. తక్కువ ప్రసరణా సామర్థ్యమున్న కాంతి కిరణాలు అలా గాలి పరమాణువులతో ఢీకొని వ్యాపిస్తాయి. అలాగే ఎంత ఎక్కువ దూరం కిరణాలు గాలి ఆవరణం గుండా ప్రయాణం చేస్తాయో అన్ని ఎక్కువ కిరణాలు గాలి పరమాణువులను ఢీకొని వ్యాపిస్తాయి. అస్తమించే సూర్యుడి కిరణాలు నడి మధ్యాహ్న సూర్య కిరణాల కంటే పదహారు రెట్లు దూరంగా ప్రయాణం చేస్తాయి. అలా అస్తమించే సూర్య కిరణాలు ఎక్కువ దూరం ప్రయాణం చేయడం వల్ల గాలితోరాపిడికి గురై ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. ఎక్కువ ప్రసరణా సామర్థ్యమున్న (వేవ్ లెంగ్త్) ఎర్రని కిరణాలు మాత్రం అలా వ్యాపించవు. ఈ ఎర్రని కిరణాలు మన కంటిపై పడి అస్తమించే సూర్యుడు మనకు ఎర్రగా కనిపిస్తాడు.



## 1221. పాలను ఎవరైనా, ఎప్పుడైనా త్రాగవచ్చా?

**జ.** గర్భిణీస్త్రీలూ, ప్రసవించిన స్త్రీలూ, పసిపిల్లలూ, ముసలివారు తప్పనిసరిగా పాలను త్రాగాలి. పాలను ఉదయం, మధ్యాహ్న భోజనం తరువాత, రాత్రి భోజనం తరువాత స్వీకరించవచ్చును. పాలను త్రాగిన తరువాత అర గంట వరకు నిద్రించకూడదు. పులుపు పదార్థాలు, నువ్వులతో చేసిన పదార్థాలను తీసుకున్న తరువాత ఎట్టి పరిస్థితులలోను పాలను స్వీకరించకూడదు.

## 1222. కర్రను ఏ సందర్భంలో ఉపయోగించాలి? ఎవరిపైన ప్రయోగించాలి ?

**జ.** ★ మనల్ని చూసి మొరిగే కుక్కల మీద.
★ భార్యను బానిసగా చూసే భర్త మీద.
★ మాటవినని, చెడు విషయాల విషయాలు పలికే భార్య మీద.
★ సేవకుని బానిసగా చూసే యజమాని పైన.
★ ఎన్ని చేసిన మనసు మార్చుకోని శత్రువు పైన.
★ కోరల్లో విషమున్న పాముపైన.
★ నిలువెల్లు విషమున్న మనిషిపైన.

★ మాట వినని పశువు మీద.
★ చదువు నేర్వరి మొండివాని పైన.
★ కటిక చీకటిలోను.
★ వృద్ధాప్యంలోను.

ఈ సందర్భాలలో కర్రను ఉపయోగించాలని పెద్దలు చెప్పారు.

## 1283.హనుమంతుని తాకి నమస్కరించ కూడని వారు ఎవ్వరు?

**జ.** పెళ్ళికాని వారు హనుమంతుని తాకి నమస్కరించ కూడదు.



## 1284. మహాపుణ్యాతిపుణ్య కార్యక్రమాలు ఏవి?

**జ.**★ పాడ్యమినాడు విష్ణుమూర్తికి ఘృత స్నానము చేసినవారి ఇరువది ఒక్క తరములు తరించి విష్ణులోకాన్ని పొందుతారు.

★ బ్రహ్మదేవునకు నేయితో, పాలతో స్నానము చేయించినవారు బంగారు విమానంలో బ్రహ్మలోకాన్ని చేరతారు.

★ చెరకురసంతో స్నానము చేయించిన వారు ప్రకాశవంతమైన సూర్యలోకాన్ని చేరతారు.

★ గంధపు నీటితోగానీ, చందనపు నీటితో గానీ అభిషేకించినవారు బంగారు వన్నె కాంతితో రుద్రలోకాన్ని చేరతారు.

★ పరిశుద్ధ జలముతో గాయత్రీ మంత్రమును వందపర్యాయములు జపించి బ్రహ్మదేవునకు అభిషేకించిన వారు బ్రహ్మలోకాన్ని పొందుతారు.

## 1285. ధనుష్కోటి వద్ద స్నానం చేస్తే పిల్లలు పుడతారా ?

**జ.** పిల్లలు పుట్టని వారు సేతుస్నానము చేయటము అనగా రామేశ్వరము దగ్గర శ్రీరాముడు నిర్మించిన ధనుష్కోటి వద్ద స్నానం చేయమని చెబుతారు. దీనిని ఏదో మూఢనమ్మకంగా కొట్టిపారవేయనక్కర లేదని నేటి వైద్యశాస్త్రవేత్తలు కూడా సెలవిచ్చారు. అక్కడి నీటిలో బంగారము, వెండి, పాదరసమూ, అల్యూమినియం వంటి లోహములు అధికంగా ఉన్నాయని అచ్చట స్నానము చేయుట ద్వారా చర్మము రంధ్రముల ద్వారా ఈ లోహాలు దేహంలోకి ప్రవేశించి గర్భం కలుగుటకు అవకాశాలు పెరుగుతాయని వైద్యశాస్త్రమూ అంగీకరించింది.


## 1286. సుగుణాలలో శ్రేష్ఠమైన సుగుణం ఏది?

**జ.** వ్యక్తి ఆచరించే సుగుణాలలో ఏ సుగుణం ఉత్తమోత్తమమో గణించటం

కష్టం. ఒక్కో సందర్భంలో ఒక్కో సుగుణం దాని ప్రాధాన్యతను తెలుపుతుంది. అయితే ఈ సుగుణాలలో ఉత్తమోత్తమ మైన సుగుణంగా అందరిచే ఆమో దింపబడిన సుగుణం 'ఓర్పు' అంటే సహన శక్తిగా పేర్కొనబడింది. మానవునికి గల ఈ సహనశక్తి వలన జీవితంలోని అనేక ఒడిదుడుకులు, కష్టనష్టాలను ఎంతో సమర్థవంతంగా ఎదుర్కొనేలా చేస్తుంది. ఇతరులను క్షమించగలిగే తత్త్వం, ఇతరుల ఎడల శత్రుభావం లేక పోవటం అనే లక్షణాలను ఈ ఓర్పు అనే గుణమే కలిగిస్తుంది. ఓర్పు విషయంలో మనం భూమాతను ఆదర్శంగా తీసుకో వాలని పెద్దలు చెబుతారు. నిరంతరం మానవులు తనకూ, తన ప్రకృతికీ ఎంతో బాధ కలిగించినా సహనంతో మసలుతూ, నిరంతరం క్షమిస్తూ విజేతయై భూమాత నిత్యం పూజింపబడుతుంది.

## 1297. గర్భిణీస్త్రీలు రాత్రి వేళల్లో బయటకు వెళ్ళకూడదా ?

**జ.** ఏ వైద్యశాస్త్రమైనా గర్భిణితో ఉన్న స్త్రీ అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చ రిస్తుంది. గర్భం ధరించిన సమయంలో అధిక శారీరక శ్రమ, మానసిక ఆందోళన మొదలగునవి దరి చేరకుండా ఉండటం అవసరం. ఒకవేళ చీకట్లో బయటకు అడుగు పెట్టినట్లయితే గర్భిణి ఏ కారణంగానైనా ఆకస్మిక భయానికి గురి అయ్యే అవకాశము ఉన్నది. ఈ భయం ఆమె ఆరోగ్య స్థితిని బాగా దెబ్బ తీయ




గలదు. తల్లియొక్క దుష్ప్రభావం కడుపు లోని బిడ్డపైపడి యాతనకు గురి కాగ లదు. ఆకస్మిక భయం ఒక్కసారిగా రక్త ప్రసరణను తీవ్రతరం చేస్తుంది. అలా కావడం మానసిక శారీరక ఆరోగ్యాలకు మంచిది కాదు. ఈ సమస్యే కాకుండా రాత్రి సమయంలో విషపూరితమైన క్రిమి కీటకాలు, జంతువులు, కొన్ని రకాల పక్షులు తమ గూళ్ళ నుండి బయటకు వచ్చి తిరు గుతుంటాయి. కావున వీటి వల్ల ప్రమాదం సంభవించవచ్చును లేదా వాటిని చూసి గర్భిణీ స్త్రీ ఆకస్మిక భయానికి గురి కావచ్చు. అలాగు రాత్రి సమయం దొంగలు, దోపిడీ దారులు, తాగుబోతులు, దుర్మా ర్గులు సంచరించే కాలం కావున వారివల్ల వచ్చే గర్భిణీకి ఏదైనా ఇబ్బంది కలుగవచ్చు లేదా వారి నుండి తప్పించు కొనుట, పారిపోవుట గర్భిణీకి కష్టం కావున ఇలాంటి నిషేధం విధించి ఉండ వచ్చును. రాత్రి సమయాలలో భూత

ప్రేతాలు సంచరిస్తాయని పూర్వం కొందరు విశ్వసించేవారు. కాబట్టి గర్భిణి వాటి విషయమై ఆ కాలంలో వీధి దీపాలు కూడా లేకుండా ఉండేవి కాబట్టి రాత్రి సమయం బయటకు వెళ్ళడం ఎంతో ఇబ్బందికరంగా ఉండేది. అనేక రకాల సమస్యల కారణంగా మన పూర్వులు ఇట్టి నియమాన్ని పెట్టారు.

## 1298. వివాహము తరువాత నూతన వధూవరులచేత ఇరువురి పేర్లు చెప్పించటంలో ఆంతర్యం ?

**జ.** నూతన వధూవరులను ఇంటిలోనికి రాకుండా ఆపి ఒకరి పేరు మరొకరి చేత చెప్పించటం సర్వసాధారణ విషయం. ఈ ఆచారం వల్ల భావోద్వేగాలు  ఉపశమింపబడే ఒక ఆహ్లాదకర వాతావరణం కలుగుతుంది. ఈ పద్ధతిలో భార్యాభర్తలు ఒకరి పేరు మరొకరు చెప్పే తీరును బట్టి వారికి



గల ప్రేమాభిమానాలను పెద్దలు అవగాహన చేసుకొనగలరు. వివాహ సమయంలో జరిగే చిన్న చిన్న గొడవలు, వ్యవహారాలు, ఘర్షణలు జరిగినా అవేమీ మాకు పట్టలేదు అని ఇరువురు తెలియ జెప్పటమే ఈ తంతు వెనుక అసలు రహస్యం.

## 1299. పిల్లలు చేయకూడని పనులు

**జ.** 1. స్నానం అయ్యాక నూనె రాసుకోకూడదు. 2. నదుల్లోను, కాల్వలోను లోతు తెలియకుండా దిగరాదు. 3. అపరిచితులతో సరదా సంభాషణలు చేయరాదు. 4. ఆడపిల్లలు పదే పదే అద్దంలో చూసుకొనరాదు. 5. తోడ పుట్టిన వారైనా సరే ఒక వయస్సు వచ్చిన తరువాత వారితో ఏకాంతముగా గడుపరాదు. 6. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఇతరుల నుండి సహాయాన్ని ఆశించాలి. 7. నోటితో మంటను ఊదరాదు. 8. వడ్డీ వ్యాపారము, వాస్తు, జ్యోతిష వ్యాపారముల వల్ల ధనాన్ని సంపాదించకూడదు.

## 1300. మానవునిలో ఉన్న కుండలినీ శక్తిని ఎలా నిద్రలేపాలి ?

**జ.** ప్రతి మానవునిలో దైవశక్తి నిద్రావస్థలో ఉండును. ఈ దైవశక్తినే తాంత్రిక శాస్త్రము 'కుండలినీ శక్తి' అని పిలుస్తారు. ఈ బ్రాహ్మీశక్తి వెన్నుపాము క్రింది భాగములో (గుదమునకు దగ్గరగా ఉన్న చివరి వెన్నుపూస అడుగు భాగమున) ఓ చిన్నని

శివలింగమునకు సర్పమువలె చుట్టుకొని నిద్రావస్థలో ఉండును. ఈ నిద్రించు శక్తియే కుండలినీ శక్తి. ఇది మనిషిలోని దివ్యశక్తి. ఈ శక్తి నిజమేనని అధునిక శాస్త్రవేత్తలు కూడా అంగీకరించుచు న్నారు. నిరంతర యోగ ధ్యానముతో, శివారాధనతో ఈ కుండలినీ శక్తి జాగృత మగును. జాగృతమైన ఈ కుండలినీ శక్తి వెన్నుపాము ద్వారా మెదడులోనికి ప్రవే శించి మెదడులో పనిచేయకుండా ఉన్న అనేక విభాగములలో శక్తిని ప్రజ్వలింప చేయును. ఇట్టి శక్తులను జాగృతము చేసిన వ్యక్తి దివ్యశక్తులను కలిగి మహా త్ముడు అగును. మెదడులోని సెల్స్ కేవలం 20 శాతం మాత్రమే పనిచేయుచున్న వని నేటి ఆధునిక శాస్త్రవేత్తలు కూడా అంగీక రించారు. మన ఋషులు మెదడులోని కణాలను పూర్తిగా పనిచేయించగల యోగ శాస్త్రమును కనుగొని దానిద్వారా కుండలిని జాగృతముచేసి మెదడులోని పూర్తి శక్తిని ఉపయోగించినారు. ఈ యోగము ద్వారా మానవుడు దైవత్వాన్ని పొందగలడని మన పెద్దల భావన.

### 1301. అరుంధతి నక్షత్రాన్ని చూస్తే త్వరగా చనిపోమా?

**జ.**అరుంధతి నక్షత్రాన్ని ఓ శుభకర నక్షత్రముగా హిందువులు భావిస్తారు. అరుంధతి నక్షత్రాన్ని చూసి, గుర్తు పట్టటం అంత సులవైన పనిఏమీకాదు. ఈ అరుంధతి నక్షత్రం సప్తఋషి నక్షత్ర మండలానికి కాస్తదూరంగా ఉంటుంది.




ఈ నక్షత్రాన్ని గమనించాలంటే చూపు స్పష్టంగా ఉండాలి, సప్తఋషి మండల మేదో గమనించి, దాని తరువాతగల అనేక నక్షత్రాలలో అరుంధతిని గమనిం చాలంటే కొద్దిగా బుద్ధిబలం కూడా అవ సరం. బుద్ధిబలము, దేహఆరోగ్య బలము కలవారు సహజంగానే ఎక్కువ రోజులు బ్రతుకగలరుకదా ? కాబట్టి ఈ విశ్వా సంలో మంచి తర్కమే మనకు కనిపిస్తుంది.

### 1302. స్వామి వారిని సంవత్సంలో ఒక్కసారన్నా కానీ ఈ రూపంలో దర్శించుకోవాలా?

**జ.** బ్రహ్మముహూర్త సమయంలోగాని, స్వామి శయనించినపుడు శయన దర్శ నము గాని, రథోత్సవమునందు గాని – ఈ మూడింటిలో ఒక్కదర్శనాన్ని అయినా సంవత్సరంలో ఒకసారి స్వామిని దర్శించి ముక్తిని పొందవలెనని శాస్త్రాలు చెబు తున్నాయి.

## 1303. స్త్రీలు అరటిబోదెలో దీపం వెలిగించి ఎందుకు వదులుతారు?

**జ.** పెళ్ళి కానివారు, పెళ్ళి అయినవారు కూడా అరటిచెట్టు బోదెలో దీపం వెలిగించి కోనేరు, నదుల్లో దీపాలను వదులుతారు. పెళ్ళికానివారికి మంచి భర్త లభిస్తాడని, పెళ్ళి అయినవారికి భర్త క్షేమంగా



ఉంటాడని నమ్మకం. తెల్లవారు జామున లేవటం వల్ల, ఎంతో దూరం వెళ్ళి ప్రశాంతంగా దీపాలు వదలటం వల్ల పెళ్ళయినవారికి ఆ సమయంలో ప్రశాంతమైన గాలి శరీరంలోకి ప్రవేశించి మరింత మెరుపు వచ్చి తద్వారా భర్త ప్రేమను మరింత అధికంగా అందుకుంటుంది. పెళ్ళికాని పిల్ల నలుగురు అమ్మలక్కల దృష్టిలో పడి త్వరగా వివాహం అయ్యే అవకాశాన్ని పొందుతుంది.

## 1304. భోజనాన్ని ఎలా తినాలి?

**జ.** భారతీయ ఋషి సంప్రదాయం ప్రకారం కటిక నేలమీద కూర్చోకుండా చాప వంటి దానిపై, ఇంటిల్లపాదీ గుండ్రంగా కూర్చొని మధ్యలో ఆహార పదార్థాలు పెట్టు కొని భోజనం చేస్తే కనీసం యాభైశాతం వ్యాధులను అరికట్ట వచ్చును.


## 1305. దేవాలయ ప్రవేశం చేసే పురుషులు ఛాతీభాగములో వస్త్రం ధరించ కూడదా ?

**జ.** ధరించ కూడదనే చెబుతారు. కొన్ని దేవాలయాలలో ఈ ఆచారం తప్పని సరిగా పాటించబడుతోంది. దేవాలయంలోకి ప్రవేశించే భక్తుడు భగవత్ కృప తనపై ప్రసరించాలని కోరుకుంటాడు. దేముని ముందు చేతులు జోడించి నిలచిన భక్తునిపైకి భగవత్కృప ప్రవే శిస్తుందని భావించబడుతోంది. ఇది మానసిక భావనే కాక శారీరక భావన కూడా. విగ్రహంలోని ప్రతిభాగం నుండి వెలువడుతున్న శక్తి కిరణాలు భక్తుడిలో నేరుగా ప్రవేశిస్తాయి. కావున నడుము నుండి తలభాగం వరకునగ్నంగా ఉండాలని పెద్దలు సూచిస్తారు. దేవాలయంలోకి దేవతా విగ్రహాన్ని దర్శించబోయే భక్తుడు తడి మడిబట్టను కట్టుకొని ఉండటం వల్ల భగవత్ కటాక్షం ఇంకా ఎక్కువగా ఉంటుంది. కానీ స్త్రీలకు ఈ నియమం వర్తించదు. స్త్రీ యొక్క మాతృత్వాన్ని ఎంతో గౌరవించే భారతీయులు వారికి ఇబ్బందిని కలిగించే ఈ ఆచారాన్ని పాటించమని చెప్పలేదు. అలాగే సూర్యోదయం, సూర్యాస్తమయం సమయంలో స్నానం తరువాత మన దేహాన్ని సూర్యునికి ఎదురుగా ఉంచటం చేత సూర్య కిరణాలలో ఉండే 'డి' విటమిన్ శరీరానికి పుష్కలంగా లభిస్తుంది. ఇలాంటి విషయాన్ని దృష్టిలో ఉంచుకొనే

పురుషులు పై వస్త్రాన్ని ధరించకుండా దేవాలయంలోకి ప్రవేశించాలని చెప్పటం జరిగింది.

## 1306. యౌవన స్త్రీలు సన్యాసం స్వీకరించ కూడదా?

**జ.** సన్యసించకూడదనే హిందూ సనాతన ధర్మం చెబుతోంది. ఋతుస్రావము స్త్రీలోని కామవాంఛను సూచిస్తుందని, యౌవనము మరియు ప్రౌఢ దశ అయిన తరువాత భవబంధాలను వదలుకొని



సన్యాసిగా మారవచ్చునని హిందూ ధర్మం బోధిస్తుంది. యౌవన, ప్రౌఢ దశ పూర్తి అయ్యేవరకు సన్యసించుట వీలుకాదని మాత్రమే హిందూ ధర్మం చెప్పుచున్నది కాని ఈ వయస్సులో ఆధ్యాత్మ భావన తప్పుకాదని చెప్పుటలేదు. సంసారి అయిన పార్వతీదేవి తన తపస్సుతో భువనాలను ఏలే భువనేశ్వరియై, జగన్మాతయై విశ్వనియంత్రాణా శక్తికి అధిష్ఠాన దైవమై విలసిల్లుతోందని మనం మరువరాదు.

## 1307. గంగాజలానికి అంతటి శక్తి ఎక్కడ నుండి వచ్చింది?

**జ.** గంగ హిమాలయాల్లో పుట్టింది. గంగ ప్రవహించే భూభాగంలో రేడియం ఉండటంవల్ల ఆ నీటిలో చైతన్యాన్ని కల్గించే శక్తి దాగి ఉంటుంది. అందువలన కలరా, అంటువ్యాధుల వంటి క్రిములు గంగా జలంలో బ్రతుకవు. గంగా జలము సమస్త వ్యాధులను పోగొట్టే అమృత ప్రవాహమని చరక మహర్షి కూడా చెప్పాడు.

## 1308. త్రిమధుర ప్రసాదమంటే ఏమిటి ?

**జ.** కొబ్బరీ, అరటిపండు, బెల్లమూ వీటిని త్రిమధురములు అని అంటారు. ఆయుర్వేద పరంగా శరీరానికి ఈ ప్రసాదం ఎంతో మేలు చేస్తుంది. అల్సర్ వంటి వాటికి అమృతములా పని చేస్తుంది.

## 1309. భాగవతం మనకు ఏం బోధిస్తుంది ?

**జ.** మానవుడు భగవంతుని సేవించి ఆత్మోన్నతిని ఎట్లు పొందవచ్చునో భాగవతం బోధిస్తుంది. భాగవతం భగవంతుని తత్త్వాన్ని విడమరచి చెబుతుంది. మానవునికి ప్రాణప్రదమైనటువంటిది మలిన పవిత్ర హృదయం. కానీ గత జన్మల జీవన గమనంవలన మనకు అనేక విషగుణాలు కూడా ఏర్పడతాయి.

లైంగికేచ్ఛ, నానావిధాలైన భౌతిక కోర్కెలు, కోపం, అసూయ, ద్వేషం, స్వార్థం, అధికా కాంక్ష మొదలగు గుణాలు మనలను అంటిపెట్టుకొని ఉంటాయి. ఈ గుణాలను మనం జయించి దైవత్వాన్ని విక సింప చేసుకోవాలి. ఈ దైవగుణాన్ని విక సింప చేసుకోవాలంటే పవిత్ర గ్రంథపఠనం, సాధుజన సాంగత్యం, భగవంతుని నామాన్ని జపించాలని భాగవతం మనకు బోధి స్తుంది. అన్ని కర్మలూ భగవంతుడివే కాబట్టి నీ స్వధర్మాన్నే దైవంగా భావించి, అందరినీ భగవంతుడి బిడ్డలుగా తలచి దివ్య మనస్సుతో దైవ నామాన్ని జపించు. అంతటా, అన్ని కర్మలలోను దైవ నామాన్ని భావించినట్లయితే ఎట్టి ఇతర సాధనలు లేకుండానే నీవు సిద్ధపురుషుడవు అవు తావు. మనిషి మహాత్ముడు కాగలందులకు కుల గోత్రాలు, చేతివృత్తులు అడ్డంకి కాదు. ఇదే భాగవతం జనులకు చూపిన భక్తి బాట.

### 1310. ఈ సృష్టిలో తొలి పెళ్ళికూతురు ఎవరు ?

**జ.** ఆది దంపతులు పార్వతీ పరమేశ్వ రులు. మన వివాహ వ్యవస్థలో నూతన వధువు చేత మొదటగా గౌరీ పూజ చేయి



స్తారు కానీ ఏ మహాలక్ష్మీ, సరస్వతీ దేవి పూజ చేయించరు. కారణం తొలి వధువు, తొలి ముత్తయిదువ పార్వతీ దేవి కాబట్టి.

### 1311. ఎప్పుడూ విజయం, సంపదా కలగాలంటే ఏమి చేయాలి?

**జ.** శ్రవణా నక్షత్రమున తెలుపూ, పసుపూ, నీల వర్ణముగల పుష్పములతో వైకుంఠవాసుని పూజించినచో విజయం, సంపద తప్పక కలుగగలవు.

### 1312. తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి నివేదించే అతి పురాతన ప్రసాదం ఏమిటి?

**జ.** తిరుక్కనమాడై లేదా అక్కలి అనే ప్రసాదం కేవలం ఆలయానికే పరిమిత మయ్యే ప్రసాతం.

### 1313. ఆదివారం మాంసాహారం నిషేధమా?

**జ.** ఆదివారం మాంసాహారం తినుట వల్ల సూర్యుని ఆగ్రహానికి గురి కావల్సి వస్తుంది. మాంసాహారం భుజించని వారికి అశ్వమేధయాగం చేసినంత ఫలం లభించగలదని గౌతమ మహర్షి తెలిపారు.

### 1314. మంథర ఎక్కడ నుండి వచ్చింది?

**జ.** కైకకి దురాలోచననూ, దుర్మార్గపు ఆలోచనలనూ కలుగజేసిన మంథర ఎక్కడ నుండివచ్చిందో, కైక వద్దకు ఎలా

చేరిందో ఆమె గురించి సమాచారం రామాయణంలో లేదు. అయితే పురాణాల ప్రకారం దుందుభ అనే గంధర్వ స్త్రీని దేవతలు మంథరగా సృష్టించి సందర్భోచితంగా శ్రీరామపట్టాభిషేక సమయాన రావణ వధకై సరస్వతీదేవి మహిమతో ఆమె నోటినుండి చెప్పవలసిన మాటలను చెప్పించారు. ఆ కార్యం తరువాత మంథర ప్రస్తావన కనిపించదు.

## 1315. తిరుమలలో లడ్డు ప్రసాదంగా ఎప్పటి నుండి ప్రారంభమైనది?



**జ.** గత చరిత్రలూ, శాసనాలూ, పురాణాలు పరిశీలిస్తే దాదాపు 150 సంవత్సరాల నుండి తిరుమలలో లడ్డు ప్రసాదంగా ఉన్నది.

## 1316 మన గురించి ఇతరులకు వెల్లడించకూడని విషయాలు ఏమిటి?

**జ.**1. వయస్సు.

2. భార్యా భర్తల సంబంధాలు.

3. భవిష్యత్ ప్రణాళికలు.

4. జీవితంలో పొందిన అవమానాలు.

5. అనుష్ఠించు మంత్రము మరియు ఆధ్యాత్మిక రహస్యాలు.

6. నీవు ఇతరులకు ఇచ్చిన దానము మరియు అప్పులు.

## 1317. రంగులవల్ల మనకు కలిగే ప్రయోజనం ఏమిటి ?

**జ.** మన జీవితాన్ని గ్రహనక్షత్రాలే కాక రంగులు, సంఖ్యలు,ఆలోచనలు, కర్మలు మొదలగునవి ఎన్నో ప్రభావితం చేస్తుంటాయి.

**ఎరుపు :** దీని నుండి వెలువడే కాంతి పుంజాలు కాస్త తేజోహీనంగా ఉంటాయి. ఈ రంగు ఉత్తేజాన్ని, ప్రోత్సాహాన్ని కలిగించి చురుకుగా పనిచేయునట్లు చేస్తుంది. ఈ రంగును అన్ని సందర్భాలలో వాడకూడదు.

**నారింజ రంగు :** ఈ రంగు శరీరంలో విద్యుత్ తరంగ ప్రవాహాన్ని పెంచును.

**పసుపు పచ్చ :** ఈ రంగు నైపుణ్యాన్ని మరియు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సూచించును. చలికాలంలో ఈ రంగు దుస్తులు ధరిస్తే శరీరానికి వెచ్చగా ఉండును.

**ఆకుపచ్చ :** మానసిక ఆందోళనలను తొలగించి, ఉల్లాసం కలిగించును. ఈ రంగు శాంతానికి మరియు సమృద్ధికి చిహ్నం.

**నీలిరంగు :** కేవలం నీలి రంగు మాత్రమే ఉన్నట్లయితే అశుభమైన ఫలితాన్ని కలిగిస్తుంది. నీలిరంగు పసుపు పచ్చ లేక గులాబీ పువ్వు రంగుతో కూడి ఉండిన ఆధ్యాత్మిక భావనలను పెంపొందిస్తుంది.

**గులాబీపువ్వు రంగు :** ఈ రంగు కోరికలను మరియు భౌతిక సౌభాగ్యాన్ని కలిగించేదై ఉంది.

**బూడిద రంగు :** ఈ రంగు ఆధ్యాత్మిక జ్ఞాన పరిపక్వతను సూచించును. సంతృప్తికి ఈ రంగు చిహ్నామై ఉండును.

**నలుపు :** ఈ రంగు వినాశనాన్ని మరియు మృత్యువును సూచించును. క్రూరత్వాన్ని మరియు వంకర బుద్ధిని సూచించును.

**వంగపండు రంగు :** ఈ రంగు ధన కాంక్షను మరియు కాముకత్వాన్ని సూచించును.

**ధూమ్రవర్ణం** (పర్పిల్) :గాఢమైన ప్రేమను, నైతిక ప్రవర్తనను, నిజాయితీని మరియు సత్య సంధతను ఈ రంగు సూచించును.

**తెలుపు :** ఈ రంగు పవిత్రత, జీవశక్తి, కల్మషరాహిత్యము మరియు దాపరికము లేని సూటీ గుణాన్ని సూచించును.

## 1318. ఈ సమయాలలో అబద్ధం చెప్పవచ్చు

**జ.** ఎప్పుడూ సత్యాన్నే చెప్పాలని మన ధర్మం బోధిస్తుంది. అదే ధర్మం కొన్ని సందర్భాలలో నిజం చెప్పటం కన్నా అసత్యం చెప్పటం సరియైనదేనని పేర్కొంది. ఒక రోగి కొద్ది రోజులలోనే మరణించవచ్చుని వైద్యునికి తెలిసినా అతడు ఆ రోగికి ఆ విషయం చెప్పక మంచినే చెప్పటం నైతికత. నైతికతను, ధర్మాన్ని, లోక క్షేమాన్ని కలిగించగల ఓ చిన్న అసత్యము కూడా సత్యమంతటి మహిమ కలి గినదే అవుతుంది. తెలివి తక్కువతో, దుష్ట బుద్ధితో చెప్పిన సత్యం అనేకులకు అన్యాయం కలిగించవచ్చు. సత్యాన్నైనా, అసత్యాన్నైనా ధర్మరక్షణకు చెప్పటం న్యాయం.



## 1319. రాత్రిపూట భోజనాల సమయములో దీపాలు ఆరిపోయినచో భోజనం చేయకూడదా?

**జ.**ఇలాంటి సందర్భంలో భోజనం చేయకూడదని, సూర్య చంద్రులను ప్రార్థించి ఆ రోజు పండ్లో, పాలనో స్వీకరించాలని పెద్దలు చెప్పారు. ఇలా చెప్పటంలో ఆరోగ్యరహస్యం ఒకటి ఉన్నది. ఒక్క సారిగా వెలుగు పోయినపుడు మనమే కొంత ఆందోళన చెందుతాము. అలాంటి మనచుట్టూ ఉన్న జీవుల సంగతి ? అవి అదరుటవల్లనో, బెదరుట వల్ల నో మనం తినే భోజనంలో పడే అవకాశం ఉంది. అందుకే ఆ ఆహారాన్ని వదలమని చెబుతారు

## 1320. త్రికోణమునకుగల ప్రాముఖ్యము ఏమిటి?

**జ.** భారతీయులు త్రికోణాన్ని తమ ఆధ్యాత్మికమైన చిహ్నాలలో ఒక ప్రముఖమైన చిహ్నాంగా గుర్తిస్తారు. వీరి దృష్టిలో ఈ త్రికోణం ఒక విశాలమైన విశ్వాన్ని సూచి

స్తుంది. మూడు గీతలు లేకుండా ఓ చక్కని ఆకృతిరాదు. త్రికోణంలోని మూడు గీతలు సృష్టి యొక్క మూడు స్థాయి లను సూచించును. త్రికాలాలు (భూత, భవిష్యత్, వర్తమానాలు); త్రిగుణాలు (సత్వ, రజో, తమో); త్రిమూర్తులు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు); సృష్టి, స్థితి, లయాలు; పుట్టుక, జీవితం, మరణం; స్త్రీ, పురుష, నపుంసకత్వం; ప్రారంభం, గమనం, అంతం ... మొదలగునవి ఎన్నో భావాలను త్రికోణం వ్యక్తం చేస్తుంది. ప్రారంభం చివరలో అంతమైపోవటం త్రికోణ గీతల్లోని ప్రత్యేకత. మానవ దేహం కూడా కూర్చొని ఉన్నప్పుడు త్రికోణాన్నే పోలి ఉంటుంది. ఆధ్యాత్మికతో త్రికోణాన్ని ప్రపంచాన్ని నడిపే మూల శక్తిగా కొలుస్తారు.

## 1321. ఏ పాపాలకు ప్రాయశ్చిత్తం లేదు?

**జ.** పరాయివాని భార్యను ఆశించి పొందిన వానికి, ఇంటి పెద్దలు లేనపుడు పిల్లలకు చెందాల్సిన ఆస్తిని చేజిక్కించుకున్నవానికి, పరుల ధనాన్ని చేజిక్కించుకున్నవానికి ఎన్ని క్రతువులు, యాగాలు, దానాలుచేసినా వానికి ప్రాయశ్చిత్తము లభించదు. ఇతని పాపాలకు ఈ లోకంలోనూ, పై లోకంలోనూ శిక్ష అనుభవించక తప్పదు.

## 1322. శేషము లేకుండా నాశనము చేయవలసినవి ఏవి ?

**జ.** అవసరం కోసం వెలిగించిన నిప్పు, అప్పు; శత్రువులను, వ్యాధిని పూర్తిగా నశింప చేయాలి. లేనిచో అవి నిన్నే దహించివేయగలవు.

## 1323. ఏ శక్తి ఆలయంలోనైనా లలితా సహస్రనామమే ఎందుకు చదువుతారు?

**జ.** చక్కని చదువుకోసం సరస్వతిని పూజిస్తాము, సంపదల కోసం మహాలక్ష్మిని పూజిస్తాము, శక్తి కోసం దుర్గాదేవిని పూజిస్తాము. సకల దేవతా స్వరూపమైన లలితా సహస్ర నామాన్ని చదివితే అమ్మ వార్లం



దరినీ స్తుతించినట్లే కాగలదు. లలితా సహస్రనామంలో అన్ని దేవతా శక్తి స్వరూపాల స్మరణ, స్తుతి ఉన్నది. ఎలాంటి కోరికలైనా లలితాసహస్రనామం చదివితే తప్పక తీరగలవు అని విశ్వాసం. అందరి దేవతలను తనలోనే ఇముడ్చుకొన్న శక్తి లలితాదేవి.

## 1324. మన మనస్తత్త్వం మన ముఖానికి ప్రతిబింబమా?

**జ.** మనముఖమే మన మనస్తత్వాన్ని ప్రతి బింబిస్తుంది. అద్దంలో జాగ్రత్తగా మన ముఖాన్ని గమనిస్తే మన నైజం బయట పడుతుంది. ఈ విషయాన్ని ఆధునిక



మానసిక శాస్త్రం కూడా అంగీకరిస్తుంది. ఒక వ్యక్తితో పరిచయమైన తరువాత ఆ వ్యక్తి ఎలాంటి వాడో మనకు చాలా వరకు అవగతమౌతుంది. ఇలా ముఖాన్ని చూసి చాలా విషయాలు గమనించవచ్చు. ఒక వ్యక్తి దయార్ద్ర హృదయుడా, క్రూరుడా, దుర్మార్గుడా, నిత్య కృషీవలుడా, సోమరి పోతా, సౌమ్యుడా, జ్ఞానా మొదలగు వారిని ముఖం చూసి గుర్తించవచ్చు. ఒక వ్యక్తి నైజం అతని మాటల్లో, ముఖంలో గమనించవచ్చు. ఒక వ్యక్తి గతంలో చేసిన కర్మల, ఆలోచనలసారం ఈ జన్మలో తల్లి గర్భంలో ముఖ నిర్మాణ కార్యంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది. పుట్టినప్పుడు ఉన్న ముఖమే జీవితాంతం ఉండదు. మన కర్మల, ఆలోచనల ప్రభావం మన ముఖంపై మార్పును కలిగిస్తూనే ఉంటుంది.

## 1325. పాడుపడిన బావిని మూసివేయవలసిన విధానము

**జ.** చాలాకాలం వాడకుండా విడిచి వేయ బడిన బావి అంటే పాడుపడిన బావి ఇంటి పరిసరాలలోఉంటే ఆ గృహ యజ మానికి అశుభ ఫలితాలు కలుగుతాయని, దానిని పూడ్చివేయాలని చెబుతారు. పాడుబడిన బావిని పూడ్చుటకు ఒక శుభ దినాన్ని ఎన్నుకొని, ఆరోజు తూర్పు లేక ఉత్తరం దిక్కున నిలబడి పూజలు నిర్వ హించాలి. పూజతరువాత ఒక లీటరు పాలను బావిలోకి పోయాలి. తరువాత ఒక కిలో చెరకు రసాన్ని పోయాలి. తరు వాత ఒక బస్తాలో నీటితో తడిపిన ఇసు కను బావిలోకి తాడుతో దింపి విడు వాలి. ఇప్పుడు పూడ్చుటను ప్రారం భించాలి. బావిని పూడ్చుటకు మట్టిని వాడాలి. చెత్తా చెదారం మరియు కలుషి తమైన పదా ర్థాలను అందులో వేయరాదు. బావిని మంచి మట్టితో పూడ్చుట అవసరం.

## 1326. ఎడమ చేతితో కనీసం నీటిని కూడా త్రాగకూడదా ?

**జ.** తాగకూడదనే శాస్త్రాలు చెబు తున్నాయి. భోజన సమయంలో కుడి చేతి మణికట్టుపై పాత్రను ఆనించి ఎడమ

చేతితో పాత్రను పట్టుకొని నీటిని త్రాగ వలెను. ఎడమ చేతితో వడ్డించినా వచ్చు నది పాపమే. ఈ విధముగా తినిన భోజ నము రాక్షస భోజనం అవుతుంది. దాన మును కూడా ఎడమ చేతితో చేయ కూడదు. ఎడం చేతితో ఎంత గొప్ప కార్యము చేసినా అనారోగ్యకరము. కుడి చేతితో ఏ పనిచేసినా ఆరోగ్యము.

## 1327. 'భజరంగభళీ' అని హనుమంతుని ఎందుకు పిలుస్తారు?

**జ.** శ్రీరామ భక్తుడైన హనుమంతుని దేహం వజ్ర కఠినం. దుర్భేద్యము. అందుకే 'వజ్రాంగబలీ, భజరంగ భళీ' అని హనుమను కొలుస్తాము. ఆపదలలో



కేవలం ఈ నామం ఉచ్చరించినందు చేతనే సమస్త శుభాలు కలిగి, నూతన ఉత్సాహం మనకు కలుగుతుంది. కురు క్షేత్ర సంగ్రామంలో అర్జునుడు హను మంతుని జెండాను తన రథంపై ఉంచి శత్రువులను చీల్చి చెండాడి వీర విహారం చేశాడు. అట్లే హనుమంతుని మనసులో ధ్యానించుకొని తన కార్యసాధనకు సాధ కుడు ఉపక్రమించాలి.

## 1328. శకునములకు ప్రాధాన్యత ఉన్నదా?

**జ.** శకునమును రాబోవు సుఖదుఃఖము లకు సూచనగా విశ్వసిస్తారు. శకున ములు ప్రధానముగా శుభ, అశుభ అని రెండు విధములు. ఏదైనా ఒక కార్యము నిమిత్తము మనము బయలు దేరినపుడు శుభశకునములు ఎదురైన శుభము జరు గునని హిందువుల విశ్వాసము. ఎవరైనా ఒక పనిపై బయలుదేరి నప్పుడు వెనుక నుండి పిలువరాదు. ఇది ఒక అప శకు నముగా భావింపబడినది. వచ్చే వారిని ఆహ్వానించుట ఒక శుభ శకునముగా పరిగణింపబడుచున్నది. పువ్వులు, మాంసము, చేపలు, వృద్ధుడు, ఆవు, మేక, ఎద్దులు, గుర్రాలు, ఏనుగులు, అగ్ని, ఆవుపేడ, బంగారం, వెండి, రత్నము, వేశ్య, అద్దము, నిశ్శబ్దముగా వెళుతున్న శవయాత్ర మొదలగునవి ఎదురు పడిన శుభశకునములుగా భావింపబడును.

## 1329. ఋతుస్రావ కాలంలో స్త్రీలు దేవాలయానికి ఎందుకు వెళ్ళకూడదు ?

**జ.** ఋతుస్రావ కాలంలో స్త్రీలు దేవాలయ ప్రవేశం, భగవత్ ప్రార్థనలను భారతీయ సంప్రదాయం నిషేధించింది. గత కాలంలో ఋతుస్రావ కాలంలో స్త్రీకి ప్రత్యేక గది మరియు పడకను ఏర్పాటు చేసేవారు. ఇంటిలోని పూజా గృహం వైపుకు కూడా రారాదనే నిషేధం కూడా ఉన్నది. ఈకాలంలోనే స్త్రీ తన భర్త దరికి

కూడా రారాదని, ఔషధ మొక్కల వద్దకు కూడా పోరాదని నియమం. ఋతుస్రావ కాలంలో స్త్రీ యొక్క శరీర ఉష్ణోగ్రతలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఆ కారణంగా వారు దేవాలయాన్ని సందర్శించినట్లయితే వారి శరీర ఉష్ణోగ్రత లోని మార్పు దేవుడి విగ్రహానికి చేటుచేసే అవకాశము ఉన్నది. దైవ కృపాశక్తికి చేటు కలిగే అవకాశమున్న కారణంగా ఈ నిషేధాన్ని మన పూర్వీకులు ఏర్పాటు చేశారు. ఋతుస్రావ కాలంలో ఉన్న స్త్రీ సమక్షంలో పట్టు పురుగులు పంట పొలాలలో మరణించడాన్ని శాస్త్రీయంగా నిరూపితం చేయబడింది. పట్టుపురుగులు ఒక్కసారి ఉష్ణోగ్రతలోని ఏ కొద్ది మార్పును కూడా భరించి బ్రతుకలేవు. ఋతుస్రావంకల స్త్రీ తన శరీరం నుండి తక్కువ ఉష్ణోగ్రతను వెల్లడిస్తుంది. కాబట్టి ఈ పట్టుపురుగులపై ప్రభావముంటుంది.

## 1330. ధ్వజస్థంభం దేవాలయాన్ని ఏ విధంగా రక్షిస్తుంది?

**జ.** ధ్వజస్థంభం దేవాలయాన్ని పిడుగుల నుండి రక్షించేదిగా ఉంటుంది. ధ్వజస్థంభాన్ని దేవాలయపు వెన్నెముకగా తెలపటం జరిగింది. దేవాలయం యొక్క నడుమ భాగంలో స్థంభం అడుగు భాగం ఉంటుంది. ఈ ధ్వజస్థంభం గర్భగుడి దాకా అడ్డంగా వెన్నుపామువలె పడుకోబెట్టినట్లు భావించబడుతుంది. కానీదాని ఎత్తు ఖచ్చితంగా లెక్కించబడి ఉంటుంది.



దానితలపై ధ్వజస్థంభ వాహకదేవత ప్రతిష్ఠించబడి ఉంటుంది. ధ్వజస్థంభం పైన కుండలినీ శక్తి ముద్రించిన పతాకం ఏర్పరచబడి ఉంటుంది. ఈ కుండలినీ శక్తి కలిగి వున్న జండాను పైకి ఎత్తడ మంటే, ప్రాణాయామంద్వారా భక్తుని కుండలినీ శక్తిని జాగృతపరచి సహస్రారానికి కొనిపోవడం అనే అర్థాన్ని ఇస్తుంది.

## 1331. స్త్రీకి అతి కష్టమైన పని ఏది?

**జ.** కుటుంబ బాధ్యతలను మోయటం, పిల్లల ఆలనా, పాలన చూచుట, భర్తను సన్మార్గంలో ప్రవర్తిల్లేటట్లు చూచుట, అత్తమామల పరిరక్షణ, బంధు మిత్రులను ఆదరించుట వీటన్నింటి కన్నా తన శీలాన్ని రక్షించుకొనుటకై ఎక్కువ కష్టాన్ని పొందుతుంది.

## 1332. ఛాతిపై చేతులు పెట్టుకొని నిద్రించ కూడదా ?

**జ.** కొందరు వివిధ భంగిమలలో నిద్రిస్తారు. నిద్రలోనే వివిధ అవయవాలు పూర్తి విశ్రాంతిని తీసుకుంటాయి. అందుకని ఏ అవయవంపైనా ఒత్తిడి కలిగించే

అలవాటు చేసుకోకూడదు. కొందరు ఛాతిపై చేతులు పెట్టుకొని నిద్రించే అలవాటు కలిగి ఉంటారు. ఈ అలవాటు పిల్లలలోనే కాకుండా పెద్దలలో కూడా కనబడుతుంది. ఆరోగ్యానికి హాని కలిగించే మూలంగా ఈ అభ్యాసాన్ని మన పూర్వులు తిరస్కరించారు. ఛాతిపై (రొమ్ముపై భాగంపై) ఏదైనా బరువు పడినపుడు అది గుండెపై వత్తిడిని పెంచుతుంది. ఇలా గుండెపై భారం పడటం వల్ల రక్తప్రసరణ వ్యవస్థ, గుండె పని తీరుపై మార్పును చూపవచ్చు. ఈ విధమైన అలవాటు వలన గుండెకే కాక ఊపిరి తిత్తులకు కూడా చేటు కలుగుతుంది. ఈ కారణాలవలన గుండెపై చేతులు వేసుకొని నిద్రించటాన్ని మన పూర్వులు నిరసించారు.

## 1334. పంచాంగ నమస్కారం అంటే ఏమిటి?

**జ.** మీ శిరస్సును, రెండు హస్తాలను, రెండు భుజాలను వంచుతూ, మోకాళ్ళపై వంగి చేసేది పంచాంగ నమస్కారము. స్త్రీలకు నమస్కారం చేసేటప్పుడు ఏక నమస్కారం చేయాలి. అంటే తలను మాత్రమే వంచి నమస్కరించాలి.

## 1335. తాంబూలాన్ని ముత్తైదువలకు ఇవ్వవలసిన విధానము ?

**జ.** స్త్రీలు ఇతర స్త్రీలకు బొట్టుపెట్టి తాంబూలము ఇచ్చేటప్పుడు తమల పాకు చివర్లూ, అరటి పళ్ళ చివర్లూ ఇచ్చేవారి వైపు కాకుండా వ్యతిరేక దిశలో ఉంచి ఇవ్వాలి. చివర్లను వారివైపుకు ఉంచి ఇచ్చినచో తాంబూల ఫలం వృధా కాగలదు. తమలపాకులు మూడుగాని, ఐదుగాని, అట్లే వక్కలు, పండ్లూ రెండు చొప్పున ఇవ్వాలి. ఒక పండుతో తాంబూలము ఇవ్వకూడదు.

## 1336. పెళ్ళి సమయాల్లో తుమ్మిన తుమ్ము శుభకరమా ?

**జ.** పెళ్ళి సమయాల్లో తుమ్మిన తుమ్ము శుభకరమేనని శాస్త్రం చెబుతుంది. కొత్త వస్త్రాలు ధరించేటప్పుడూ, భోజనానికి ముందు, పంట పొలాల్లో విత్తనాలు చల్లేటప్పుడు తుమ్మిన తుమ్ము శుభ ఫలితాలను ఇస్తుందంటారు. ఒంటి తుమ్ము మంచిది కాదు.

## 1337. విష్ణువు మరియు శివుడికి పూజలో వాడు పుష్పాలు ఏవి?

**జ.** విష్ణువు ఆరాధనలో రామతులసి, కృష్ణ తులసి, తెల్లని తామర, నీలి వర్ణపు

తామర, ఎర్రని తామర, మల్లెలు, అరే బియా మల్లెలు, బంతిపూలు, తెల్ల మల్లెలు, చెంపకము మొదలగు పూలను వాడ తారు. ఇక శివారాధనలో శివునికి ఎంతో ప్రీతిపాత్రమైన బిల్వపత్రాలు, ఎర్రని మరియు తెల్లని తామర, బంతి పూలు, ఉమ్మెత్త, చంపక, మల్లెలు, మందారం, జిల్లేడు మొదలగు పూలను వాడతారు.

## 1338. ఇలా చేస్తే ... ఏనుగు కుంభస్థలాన్నైనా కొట్టవచ్చు

**జ.** ఎంతటి అసాధ్య విషయమైనా సాధించగల సామర్థ్యం మనలోనే ఉంది. మనం చేయవలసింది మన శక్తి సామర్థ్యాలను బయటకు తీయటమే. అందుకు తొట్రుపాటును అస్సలు ప్రదర్శించకూడదు. ఆందోళన దగ్గరకు చేరనీయకూడదు. ఒకటికి రెండు సార్లు సరిచూచుకోవాలి.



అన్ని ఇంద్రియాలను సిద్ధం చేసుకోవాలి. మౌనంగా ఉండాలి. శక్తిని ఒకే స్థానంలో కేంద్రీకరించుకోవాలి. శారీరక శక్తి మొత్తం చేతుల్లో కేంద్రీకృతం కావాలి, కళ్ళు తీక్ష ణతతో నిండిపోవాలి, మనస్సులో సంకల్పం స్థిరంగా ఉండాలి. వీటి అన్నింటిని ఏక కాలంలో ఉపయోగించాలి. అప్పుడు ఏనుగు కుంభస్థలమే కాదు ప్రపంచంలో ఏకార్యాన్నైనా సాధించవచ్చును.

## 1339. గాయత్రీ మంత్రానికి ఎలాంటి శక్తి ఉంది ?

**జ.** గాయత్రీ మంత్రాన్ని ఉచ్చరించినచో బుద్ధి వికాసం కలుగుతుందని భారతీయుల నమ్మకం. ఈ నాడు స్త్రీలతో సహా అన్ని వర్ణాలవారూ గాయత్రి మంత్ర జపాన్ని చేయడం ప్రారంభించారు. భారతీయులేకాక ప్రపంచంలోని అనేక దేశస్తులుకూడా ఈ మంత్రాన్ని జపించి దాని ఫలితాన్ని అనుభవిస్తున్నారు. గాయత్రీ మంత్రం ఇది ...

## 1340. సీమంత వేళల గర్భిణీ స్త్రీలకు గాజులే ఎందుకు తొడుగుతారు?

**జ.** ఏ శుభ కార్యంలోలేని విధంగా సీమంతం సమయంలో గర్భిణీ స్త్రీకి అందరూ గాజులు తొడుగుతారు. భర్త ఆయురారోగ్యాలతో పాటు పండంటి బిడ్డ కలగాలని ఆశీర్వదిస్తారు. గాజులు తొడిగే కార్యక్రమంలో ఓ పరమార్థం దాగి ఉన్నది. గర్భం ధరించిన స్త్రీ గర్భకోశం మీద కావలసినంత జీవనాడుల ఒత్తిడి కావాలి. అందుకే ఏడో నెలలో శుభ కార్యం చేస్తూ అయిన వారందరూ గాజులు తొడుగుతారు. చేతుల్లో నరాలకీ గర్భ కోశానికి అవినాభావ సంబంధము ఉన్నట్లు చెపుతారు. అలా ఎక్కువ గాజులు

తొడిగించుకోవటం ద్వారా గర్భకోశముపై సరిఅయిన ఒత్తిడి జనించి సుఖప్రసవం జరుగుతుంది.

**ఓం భూర్భువః సువః తత్ సవితుర్వరేణ్యం భర్గోదేవస్యధీ మహి ధియోయోనః ప్రచోదయాత్ ॥**

ఈ మంత్రాన్ని దేవమాత అని పిలుస్తారు. "సవిత" గాయత్రీ మంత్రము నకు అధిష్ఠాన దేవత, అగ్ని ముఖము, విశ్వామిత్రుడు ఋషి, గాయత్రి ఛందము. "ప్రణవ రూపమైన 'ఓం' కారమునకు నేను వందనం చేస్తూ, విశ్వాన్ని ప్రకాశింప జేయుచున్న సూర్యతేజమైన సవితను నేను ఉపాసిస్తున్నాను"అని గాయత్రికి ఉన్న వివిధ అర్థాలలో ఒక అర్థము. ఈ మంత్రమును చదువునపుడు ఐదు చోటు లందు కాస్తఆగి చదవాలి. అవి 1. ఓం 2. భూర్, భువః, 3.తత్ సవితుర్ వరేణ్యం 4. భర్గో దేవస్య ధీమహి 5. ధియో యోనః ప్రచోదయాత్. ఈ మంత్రాన్ని భక్తి శ్రద్ధలతో చదువువారు శారీరక మరియు మానసిక ఆనందాన్ని పొంది జీవితంలోని అన్ని కష్టములను ఎదుర్కొనెడి బలమును పొందెదరు. గాయత్రీ మంత్రోచ్ఛారణము వల్ల మెదడులోని విజ్ఞాన గ్రంధులు మేల్కొనబడతాయని పరిశోధనల వల్ల వెల్లడైంది. ఈ గాయత్రీ మంత్రాన్ని జపించు వారు వారి మెదడులో నిరం తరం కొనసాగు ప్రకంపనలను అనుభవం పొందుతారు. వారు ఎప్పుడూ జాగరూక తతో జీవితాన్ని గడుపగలరు. గాయత్రీ మంత్రాన్ని లయబద్ధంగా జపించినపుడు దాదాపు లక్ష శక్తి తరంగాలు అతని తల చుట్టూ ఉద్భవిస్తాయని, ఈ గాయత్రీ మంత్రోపాసన ఒకవ్యక్తిని తెలివైన వానిగా, ధైర్యవంతునిగా చేస్తూ తరగనంతటి అను కూల శక్తి సామర్థ్యాలను అతనిలో నింప గలదని చెప్పబడుతుంది.

## 1341. లేత కొబ్బరిని తినటం మంచిదేనా?

**జ.** లేత కొబ్బరిని సేవించుట వలన పిత్త సంబంధమైన రోగములు నశించును. అట్లే వాంతులు, జ్వరము నశించుటే కాక జీర్ణ వ్యవస్థ లోపాలు కూడా సరి అగును. లేత కొబ్బరిని సేవించినచో కళ్ళలో ప్రకా



శము పెంపొందును, మానసిక ప్రశాంతి కలుగును. కడుపులోని విష క్రిములను హరించును. చర్మరోగములు నశించి, శరీర ఉష్ణోగ్రత క్రమబద్ధ మగును. ఇన్ని సుగుణములుగల లేత కొబ్బరిని, కొబ్బరి బోండాం యొక్క నీటిని సేవించవలెనని చెప్పబడినది.

## 1342. నోము అంటే ఏమిటి? వ్రతము అంటే ఏమిటి?

**జ.** మనస్సును కేవలం భగవంతునిపై లగ్నం చేసి స్వామిని పూజించి ధ్యానం

చేసేది నోము. శ్రావణ మంగళవారం, ఉండ్రాళ్ళతద్ది, అట్లతద్ది మొదలగునవి నోములు. అత్యంత నియమ నిష్ఠలతో, మంత్రోచ్ఛాటనలతో, ధూపదీప నైవేద్యాలతో సేవించేది వ్రతము.

## 1343. పెళ్ళికాని కన్నెలు గోదాదేవి కథను పారాయణ చేస్తే వారికి పెళ్ళవుతుందా?

**జ.** విష్ణుచిత్తుడి కుమార్తె అయిన గోదాదేవి మానవులకు కాక దేముడైన రంగనాథునే వివాహం చేసుకుంటానని దీక్ష పూను తుంది. అందుకని ఆమె ధనుర్మాసంలో వేకువనే నిద్రలేచి విష్ణుపూజ చేసి, తన అనుభవాల్నీ, భావాన్ని ఒక గేయం అంటే పాశురం రూపంలో రచించేది. ఇలా ప్రతి



రోజు ఒక పాశురం చొప్పున 30 పాశురాలను రచించి వాటిని విష్ణువుకు అంకితం చేసింది. అప్పుడు విష్ణువు ప్రత్యక్షమై శ్రీరంగం రమ్మనుట, ఆమె తండ్రిని తీసుకొని శ్రీరంగం వెళ్ళుట, శ్రీరంగంలో రంగనాథస్వామితో వివాహం జరుగుట, వివాహం తరువాత గోదాదేవి రంగనాథునిలో ఐక్యం చెందుటతో కథ ముగుస్తుంది. పెళ్ళికాని పిల్లలు ఈ తిరుప్పావైను పారాయణం చేయటం వల్ల తమ కోర్కెలు నెరవేరతాయని చెబుతారు.

## 1344. ముక్కోటి ఏకాదశినాడు ఉపవాసం ఎందుకు ?

**జ.** ముక్కోటి ఏకాదశి నాడు తినే అన్నంలో రాక్షసుడు ఉన్నాడని అంటారు. అందుకే ఆ రోజు ఉపవాసము ఉండాలని అంటారు. బ్రహ్మదేవుడి స్వేద బిందువు నుంచి రాక్షసుడు జన్మించాడు. బ్రహ్మ ఆజ్ఞతో ముక్కోటి ఏకాదశినాడు వరి అన్నములో ఆనాటి నుంచీ నివశిస్తున్నాడు అని పురాణాలలో ఉన్నది. ఈ రోజునే శ్రీమహావిష్ణువు గరుత్మంతుడితో సహా వైకుంఠం నుంచి ముక్కోటి దేవతలకు దర్శ నమిస్తాడు. వైకుంఠ ఏకాదశి అనంతమైన పుణ్యాన్ని ఇచ్చే రోజు. ఈ ఏకాదశినే ముక్కోటి ఏకాదశి అనీ, మోక్ష ఏకాదశి అనికూడా అంటారు. చాతుర్మాస్య కాలంలో దక్షిణం దిక్కున తలపెట్టి నిద్రిస్తున్న శ్రీ మహావిష్ణువు ఆ రోజు మేల్కొని ఉక్కులకు ఉత్తర ద్వార దర్శనాన్ని ఇస్తాడు. ఈ రోజు ఉత్తర ద్వారము నుంచి స్వామిని దర్శించిన వైకుంఠములో స్వామిని దర్శించిన పుణ్యం ప్రాప్తిస్తుంది. రాబోయేది ఉత్తరాయణ పుణ్య కాలము. సంవత్సరంలో 24 ఏకాదశుల్లో పూజించి ఉపవశిస్తే వచ్చే పుణ్యం ఈ ముక్కోటి ఏకాదశి రోజున స్వామిని దర్శించి పూజించినం తనే కలుగుతుంది.

## 1345. స్త్రీకిగల ఏ లక్షణాలు సుఖాన్ని కలిగిస్తాయి ?

**జ.** 1. మిక్కిలి పొడవూ, మిక్కిలి ఎత్తుగా కాక సమముగా ఉన్న ముక్కుగల స్త్రీ ధన్యురాలు. భర్త ద్వారా శారీరక సుఖాన్ని అధికంగా పొందగలదు. 2. పొడవుగా ఉన్న క్రింది పెదవి స్త్రీలకు భోగాన్ని ఇస్తుంది. 3. శంఖమువలె, మల్లెపూవు



వలె, చంద్రుని వంటి తెల్లని పలు వరుస లతో నునుపుగా, పొడవుగా సందులు లేకుండా ఎత్తుగా ఉన్న దంతములుగల స్త్రీ మంచి తిండిపుష్టి కలిగి ఉంటుంది. 4. కాటుక పిట్ట, వరాహము, లేడి వంటి కన్నులుగల స్త్రీ మెట్టినింట మహా వైభో గాలను పొందుతుంది. భర్తను కొంగున ముడివేసుకొంటుంది. 5. ఒక దానితో ఒకటి కలవక, చిన్న కను బొమ్మ లుగల స్త్రీ సుఖవంతురాలు కాగలదు. 6. పొడ వుగా ఉన్న క్రింద పెదవి స్త్రీలకు భోగాన్ని ఇస్తుంది.


## 1346. పక్షులు చీమలను తినకుంటే ఎక్కువ కాలం బ్రతకవా ?

**జ.** చీమలు తినని పక్షులు ఎక్కువ కాలం బ్రతుకుతాయి అని మనకు ప్రాచీన కాలం నుండి ఉన్న విశ్వాసం. మన దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన కొన్ని జాతుల వారు చీమలను తింటారు. వారు ఎక్కువ కాలం బ్రతకడమే కాకుండా మంచి కంటి చూపును కలిగి ఉంటారు. చీమల గుడ్లు తినేవారు కూడా దీర్ఘాయువును మరియు మంచి కంటి చూపును కలిగి ఉంటారు. చీమలలో విటమిన్-ఎ మరియు ఇతరమైన అనేక పదార్థాలు ఉంటాయి కాబట్టి ఇలా ఫలితాన్నిస్తోంది. ఇలా మానవులకు మంచి ఫలితాన్ని కలిగించే చీమ ఆహారం పక్షులకు ఎందుకు వ్యతిరేకంగా పనిచేస్తుందన్న ప్రశ్న కొంత కాలం పరిశోధకులను కలవర పరచింది. కానీ ఈ మధ్య పరిశోధనల ప్రకారం చీమలను తినని పక్షులు ఎక్కువ కాలం ఎందుకు బ్రతుకుతాయో వెల్లడి చేయడం జరిగింది. ఈ పక్షులు చీమలను తినకుండా వాటి రెక్కల క్రింద చీమలు ఉండేటట్లుగా చూసుకుంటాయి. ఇలా రెక్కల క్రింద చేరిన చీమల శరీరాల నుండి వ్యక్తమయ్యే ఫార్మిక్ ఆమ్లం (అంటు రోగాలు తగలనీయకుండాచేయు ఆమ్లం. గాయాలు మాన్పగలిగినటువంటి ఆమ్లం) పక్షి రెక్కల క్రింద అలాగే ఈకలలో ఉన్న పేన్లను మరియు ఇతర పురుగులను

హరింప జేస్తుంది. ఈ విధానం వల్ల ఆయా పక్షులు చీమల సహకారంతో దీర్ఘా యువును పొందుతాయని తేలింది.

## 1347. నిద్ర లేచేటప్పుడు మనం కుడివైపు తిరిగి లేవాలా ?

**జ.** నేటి పాశ్చాత్య వైద్యులు సైతం ఈ విషయాన్ని అంగీకరిస్తూ పాటించాల్సిన అంశంగా సూచిస్తున్నారు. ఉదయాన నిద్ర లేచేటప్పుడు కుడివైపుకు తిరిగి లేవాలని



చెప్పబడింది. దీనికి కారణం మన శరీరం చుట్టు రెండు అయస్కాంత వలయాలు ఉన్నాయి. మొదటిది పాదం నుండి తల వరకు, తల నుండి పాదం వరకు తిరుగు తుంటుంది. రెండవది ఎడమ వైపు నుండి కుడికి, కుడివైపు నుండి ఎడమకు మన చుట్టూతా తిరుగుతుంది. అనుకూల దిశగా మన శరీర కదలికవల్ల రెండవ వలయ ప్రవాహం ప్రభావితమై బలం చేకూరుతుంది. ఒక వేళ ఈ రెండు వల యాలు ఒకదాని కొకటి విరుద్ధ దిశలో ఉండే శరీరయంత్రాంగం బలహీన పడును. ఈ విషయాన్ని గమనించిన ఆధునిక సైన్స్ కుడి వైపుకు తిరిగి లేవ డంవల్ల వలయ ప్రవాహం బలం పుంజు కుంటుందని తెలుపటం జరుగుతోంది. పూర్వం పిల్లలు తమ పనిలో మంద కొడితనం ప్రదర్శించినపుడు ఎడమవైపుకు తిరిగి నిద్ర లేచేవారిని పెద్దలు మందలించేవారు.

## 1348. గర్భిణీస్త్రీ పెరుగును రాత్రిపూట తినకూడదా ?

**జ.** గర్భిణీస్త్రీ ఓ ప్రాణిని తనతో పాటు పెంచుతుంది. కావున తేలికగా జీర్ణ మయ్యే పదార్థాలను స్వీకరించటం చాలా ఉత్తమం. ముఖ్యంగా రాత్రిపూట పెరు గును తీసుకొనరాదని ఆయుర్వేదం తెలుపుతుంది.


## 1349. స్నానానికి నీటిలో మునిగే ముందు నడకయొక్క అవసరం ఏమిటి ?

**జ.** నిద్రలేచిన అనంతరం కొంతదూరం నడచి ఆలయానికి సమీపంలో ఉన్న చెరువు లేక నదీ ప్రవాహంలో మునక వేస్తూ స్నానం చేయమని చెప్పడం జరి గింది. స్నానానికి ముందు నడవడంలోని ఆంతర్యం చాలా మందికి తెలియదు. ఉదయం వేళ నడిచే నడక శరీరానికి మంచి వ్యాయామం. గుండెకు కావల్సి నంత ప్రాణవాయువు లభించి మనసుకు, శరీరానికి చక్కని ప్రశాంతత లభిస్తుంది. ఆలయానికి సమీపాన ఉన్న చెరువులో స్నానం చేసి ఆలయంలో భగవంతుడి ధ్యానము చేసుకోవచ్చును. ప్రాణా యామం యోగంలోని ఓ సాధన. దీని వల్ల శరీరంలోని కణములకు పుష్కలంగా ప్రాణవాయువు లభించి ఆ రోజు అంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారు.

ఉదయ సమయాన్ని నడకతోకూడిన, మునకతో కూడిన స్నానంవల్ల బుద్ధి కుశలతపెరిగి, జ్ఞాపకశక్తిలో చురుకుతనం లభిస్తుందని ఆధునిక విజ్ఞానం కూడా అంగీకరించింది.

## 1350. తిరుమల దేవాలయంలో మహాభక్తుడైన కులశేఖరాళ్వార్ స్థానం ఎక్కడ ఉంటుంది ?

***జ.*** మహాభక్తుడైన కులశేఖరాళ్వార్ యొక్క భక్తికి తిరుమల వేంకటేశ్వరుడు మెచ్చి వరం కోరుకోమంటాడు. అప్పుడు కుల



శేఖరాళ్వార్ ప్రతినిత్యం నిన్ను చూసే అదృష్టాన్ని వరంగా కోరుకుంటాడు. అప్పుడు స్వామి అనుగ్రహిస్తాడు. ఆ అనుగ్రహం కారణంగానే ఆ భక్తుణ్ని 'పడి' గడపగా వెంకటేశ్వరుడు అనుగ్రహించటం జరుగుతుంది.

## 1351. ప్రపంచంలోని అతి పెద్ద మరకతము ఎక్కడ ఉన్నది?

***జ.*** ఏడుకొండల వెంకటేశ్వరుని ఖజానాలో అతిపెద్ద, మేలైన మేరుపచ్చ ఉన్నది.

## 1352. మైలలో దైవ ధ్యానం కూడా చేయరాదా ?

***జ.*** మైల ఉన్నా భగవంతుని నిరభ్యంతరంగా ధ్యానించవచ్చునని హిందూ సంప్రదాయం చెబుతోంది. మనం దైవ స్మరణ చేసినంత మాత్రాన దేవునికి మైల సోకటం జరుగదు. అయితే పూజా మంది రాన్ని కానీ, సంబంధిత పాత్రలను గానీ తాకరాదు.

## 1353. వెళ్ళివస్తాను అనే అనాలా?

***జ.*** మంచి లేదా చెడు మాటలు మన ధర్మ, పుణ్య శక్తులను బట్టి సత్యమవుతాయి. వాక్కుకి అంత శక్తి ఉంది. ఎచ్చటకైనా వెళ్ళేటప్పుడు "వెళ్ళివస్తాను"అని మాత్రమే అనాలి. ఒక్క అంతిమయాత్రకు వెళ్ళేటప్పుడు మాత్రమే 'వెళ్తాను' అనాలని పెద్దలు అంటారు.

## 1354. ఆత్మ ఎలా ఉండవచ్చు?

***జ.*** తామర మొగ్గ ఆకారంలో ఉండే మన హృదయంలో వరి కంకి గింజంత చిన్నదిగా, సన్నగా దివ్యకాంతితో పసుపు పచ్చ వర్ణంతో అణువంతగా మహోజ్వలంగా వెలిగిపోతుందని మంత్రపుష్పంలోని శ్లోకం వలన తెలుస్తుంది.

## 1355. మనువు స్త్రీ పక్కదారి పట్టటానికి కారణాలుగా వేటిని పేర్కొన్నాడు?


***జ.*** ★ భర్తకు దూరంగా ఉండటము.

★ మద్యపానము.

★ అవసరమున్నా లేకపోయినా అటూ ఇటూ తిరుగటం.
★ ప్రవర్తన సరిగా లేనివానితో కలసి మెలసి ఉండుట.
★ ఇరుగు పొరుగు ఇళ్ళకు అతిగా వెళ్ళుట.
★ విపరీతమైన నిద్ర.
★ మద్యపానము.

## 1356. గర్భంలోని శిశువు కదలికను బట్టి లింగ నిర్ధారణ చేయవచ్చా?

**జ.** గర్భిణీస్త్రీలు శరీరాన్ని వదలుగా ఉంచి నడచినట్లయితే మన పెద్దవారు శిశువు యొక్క లింగాన్ని గర్భం యొక్క కదలికలను బట్టి గుర్తించగలరు. ఈ విధమైన పరిశీలన ఫలితం అతి ఎక్కువసార్లు



నిజమేనని నిరూపితమైంది. పై పరిశీలనా విషయంలోని వాస్తవాన్ని నేటి వైద్యశాస్త్రం కూడా గుర్తించింది. ఆడశిశువు గుండె మగ శిశువు గుండె కంటే చాలా ఎక్కువసార్లు కొట్టుకుంటుంది. దీన్ని ఆధారం చేసుకొని పూర్వం మన పెద్దవారు గర్భంలో ఉన్న శిశువు ఆడా లేక మగా అని గుర్తించేవారు.

## 1357. అతిగా నీరు త్రాగడం మంచిది కాదా ?

**జ.** కొంతమంది దేహానికి, ఆరోగ్యానికి మంచిదన్న అభిప్రాయంతో అధికంగా నీటిని త్రాగుతుంటారు. అట్టివారికి మూత్ర సమస్యలు రావటానికి అవకాశం ఉంది. అలా అని నీటిని తక్కువ కూడా త్రాగ కూడదు. ఉదయం గోరు వెచ్చని నీటిని ఓ గ్లాసు నుండి రెండు గ్లాసుల వరకు త్రాగటం ఎంతో మేలు. భోజనానికి ముందు నీటిని త్రాగకూడదు. భోజనం మధ్యలో కొద్దిగా త్రాగవచ్చును. అలాగే రాత్రిపూట నీటిని సమృద్ధిగా తాగ వచ్చును.

## 1358. తలచినంతనే స్నాన ఫలాన్ని అందించే నదులు ఏవి?

**జ.** గంగ, యమున, గోదావరీ, సరస్వతి, నర్మద, సింధు, కావేరి. ఈ నదులు మహా మహిమాన్వితమైనవి. అందుకే ఎచ్చట, ఏ నీటితో స్నానం చేస్తున్నా

**గంగే చ యమునే చైవ గోదావరీ సరస్వతీ**
**నర్మదా సింధుకావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు**

అని స్మరించి స్నానమాడినచో గంగాది నదులలో స్నానము చేసిన ఫలితము రాగలదు.

## 1359. కర్పూరాన్ని ఎండాకాలంలో దానమివ్వ కూడదా ?

**జ.** వ్యక్తులు చేయకూడని పనులు, చేయాల్సిన పనులు ఈ విధంగా ఉన్నాయి.

★ కర్పూరాన్ని ఎండాకాలంలో దానం ఇవ్వ కూడదు.
★ గడప ఇవతల నుండి భిక్షను వేయకూడదు.
★ శుభానికి వెళుతున్నప్పుడు స్త్రీలు ముందు ఉండాలి.
★ అశుభానికి వెళుతున్నప్పుడు పురుషులు ముందు ఉండాలి.
★ ఇంటి గృహిణికి చెప్పకుండా పరులను ఎవ్వరినీ భోజనానికి పిలువరాదు.
★ గడపకు ఇవతల నుండి దానం వేయ కూడదు.
★ ఉదయం పూట చేసే దాన కార్యాలు ఎక్కువ ఫలాన్ని ఇస్తాయి.
★ అమంగళాలను ఎప్పుడూ ఉచ్చరించ కూడదు. తథాస్తు దేవతలు ఉంటారు.
★ పెరుగును చేతితో చితికి మజ్జిగ చేయ కూడదు.
★ పగలు ధనాన్ని సంపాదించాలి. రాత్రి సుఖాలను అనుభవించాలి.
★ చూపుడు వేలితో బొట్టుపెట్టుకో కూడదు.
★ కుక్క ఎదురొస్తే ఏ కార్యానికైనా నిర భ్యంతరంగా వెళ్ళవచ్చు.
★ పిల్లి ఎదురొస్తే కొన్ని నిముషములు ఆగి బయటకు వెళ్ళాలి.

## 1360. గాయత్రి మంత్రాన్ని జపిస్తే పిల్లలు పుడతారా?

**జ.** గాయత్రి మంత్రంలోగల ఇరవై నాల్గు అక్షరాలలో ఏ అక్షరానికి ఆ అక్షరం ఒక విశిష్ట స్థానాన్ని ఆక్రమించాయి. గాయత్రి మంత్రంలోగల 'ణ్య' అక్షరము వృషణము నకు సంబంధించినది. 'ణ్య' అను అక్షరము పలికినపుడు వృషణాలు కదలికను పొంది, ఉత్తేజం పొంది గర్భకోశ గ్రంథులు మరింత శక్తిమంతమై సంతాన వంతులయ్యే అవకాశం ఎక్కువగా ఉన్నది అంటారు.

## 1361. సంగీతము ద్వారా వ్యాధులను నయం చేయవచ్చా?

**జ.** సంగీతం ద్వారా మెదడులోని ఎన్నో భాగాలు ఉత్తేజం పొంది ఉత్సాహవంతులుగా, ఆరోగ్యవంతులుగా ఉంటారని ఆయుర్వేదం చెబుతోంది. హృదయ సంబంధిత రోగాలను గాంధారము దూరం చేస్తుంది. చక్కని సంగీతము ఎముకల్లో కదలికలను తెస్తుంది. తద్వారా పటుత్వం



పెరుగుతుంది. చలి కాలంలో వచ్చే దగ్గును భైరవరాగం తగ్గి స్తుందని చెబుతారు.

## 1362. కాళ్ళను కడుగకూడని సందర్భాలు?

**జ.** వివాహము, వ్రతము, పూజలు, యాగాలు, దేవాలయ దర్శనము మొదలగు శుభకార్యాల తరువాత వెంటనే

కాళ్ళు కొడుగుకొనరాదు. ధర్మ కార్యాల తరువాత కాళ్ళను కడుగుకొనినచో ఆ ఫలం మనకు దక్కదని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. అయితే నవగ్రహాది దోషాలు కలవారు ఆ గ్రహాలకు పూజ చేసిన వెంటనే ఇంటికి వచ్చి కాళ్ళను కడుగుకొనవలెను. అట్లే జన్మ దోష నివారణకు దానాలను ఇచ్చిన సందర్భంలో కూడా కాళ్ళను వెంటనే కడుగుకొనవలెను.

## 1363. ఉపవాసం ఉన్న రోజుల్లో తలకు నూనె రాయకూడదా ?

**జ.** ఉపవాసం చేసే రోజుల్లో తలకు నూనె అంటటం నిషేధం. దీనికి ఒక శాస్త్రీయ కారణం చెబుతారు. శనిగ్రహం శక్తి ప్రభావంవల్ల నూనె ఉత్పన్నమైనట్లుగా భావించటం జరిగింది. తలకు నూనె అంటుకోవడం వల్ల తల చుట్టూ ఓ తేజో వలయం ఏర్పడుతుంది. ఈ వలయం ఇతర గ్రహాల నుండి మన శరీరంలోకి ప్రసరించే అయస్కాంత తరంగాలను నిరోధిస్తుంది. కానీ ఉపవాసం పాటించు రోజుల్లో ఇది వేరుగా చెప్పబడింది. ఉపవాస దీక్షను పవిత్ర మనస్సు మరియు శరీరముతో ఆచరించటం జరుగుతుంది. కాబట్టి మన శరీరానికి ఇతర గ్రహాల మరియు నక్షత్రాల నుండి భూమిపైకి ప్రసరించే అయస్కాంత తరంగాల అవసరం ఉంటుంది. తలపైరాసిన నూనె ఈ శక్తి తరంగాలను మనలోకి ప్రసరించకుండా అడ్డుకుంటుంది. కాబట్టి ఇలాంటి నిషేధాన్ని ఉపవాసకాలంలో మన పెద్దలు ఏర్పాటు చేశారు.



## 1364. నిద్రించే ముందు ఎవరిని స్మరించాలి?

**జ.** అగస్త్యుణ్ని, మాధవుణ్ని, ముచుకుందుణ్ని, కపిలుణ్ని, అస్తికుణ్ణి స్మరించిగాని నిద్రకు ఉపక్రమించకూడదు.

## 1365. రాత్రి భోజనం చేసిన తరువాత ఏమి చేయాలి?

**జ.** రాత్రి భోజనము తరువాత చాలా మంది నిద్రకు ఉపక్రమిస్తారు. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం భోజనం తర్వాత కనీసం నూట ఎనిమిది అడుగులు వేయాలనీ, ఎనిమిదిసార్లు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తీసుకొని ఆపై విశ్రమించి పద్దెనిమిది సెకన్లపాటు కుడి వైపు తిరిగి పడుకొని, ఆపై ముప్ఫయి సెకన్లపాటు ఎడమ వైపు తిరిగి పడుకొని ఆపై మామూలుగా పడుకొని మంచి వ్యక్తుల గూర్చి, మంచి ఆలోచిస్తూ నిద్రలోకి జారుకోవాలని చెబుతోంది.

### 1366. సౌందర్యరాశి అయిన భార్య కావాలంటే ఏం చేయాలి?

**జ.** త్రయోదశినాడు మన్మథుని పూజించి సంతృప్తి పరిస్తే మంచి సుందర రూపంతో పాటు అద్భుతమైన సొగసూ, లావణ్యం గల గుణవతి అయిన భార్యను పొంద గలడని తెలియుచున్నది.



### 1367. ఓటమికి కారణాలు మూడు విషయాలేనా?

**జ.**ఎంత విజ్ఞానం ఉన్నా, ఎంత విద్వత్ ఉన్నా, ఎంత జ్ఞానం ఉన్నా ఓ వ్యక్తి అపజయాల పాలవుతున్నాడంటే కారణం అతని స్నేహితులుకావచ్చు, స్త్రీ వ్యామోహం కావచ్చు లేదా మత్తును కలిగించే వ్యసనాలు కావచ్చు.

### 1368. కుబేరుని అంతటి సంపదను ఎవరు ఇచ్చారు ?

**జ.** ఉత్తర దిక్కుకు అధిపతి, యక్షులకు నాయకుడు అయిన కుబేరుని తపోనిష్ఠకు మెచ్చి అతనికి అపార ధనరాశిని మహాను గ్రహంగా శ్రీమహాలక్ష్మి దేవి అనుగ్ర హించింది.

### 1369. భోజనాన్ని ఒంటరిగా తినకూడదా?

**జ.** ఒంటరిగా తినే భోజనము వృధా అని చెప్పబడింది. ఇద్దరు కలసి భోజనము చేస్తే అది భుక్తి. ముగ్గురు కలసి భోజనము చేస్తే అది భోజ్యము. నలుగురు ఆపై కలసి చేస్తే భోజనము. గృహస్తు కుటుంబ సభ్యులందరితో కలసి భోజనం చేయాలి. భోజన సమయంలో మంచినీటి గ్లాసును కుడి వైపున పెట్టవలెను. పీటపై కూర్చొని భోజనం చేయువారు పీటపై నుండి కాలిని క్రిందకు ఆనించకూడదు.

### 1370. విభూతిని ఎలా ధరించాలి?

**జ.** విభూతిని బొటన వ్రేలితో కుడి నుంచి ఎడమ వైపుకు పెట్టుకొని మధ్య వేలితో సరిచేసుకోవాలి. ఆ తరువాత మధ్య మూడు వేళ్ళతో పెట్టుకోవాలి. తలస్నానం చేసినపుడు తడి విభూతి, మామూలు స్నానం చేసినపుడు పొడి విభూతి ధరించాలి.

### 1371. కంచుపాత్రలో భోజనం చేస్తే అందంగా మారతామా ?

**జ.** కంచు పాత్రలో భోజనాదులను నిర్వహిస్తే మనలో ఉన్న పైత్యం హరింప బడుతుంది. కంటికి ఎంతో మంచిది. కంచులో శరీరంలో రంగు పెంచే గుణం

ఉంది. చర్మానికి కాంతిని ఇస్తుంది. జఠరాగ్నిని, జీర్ణశక్తిని పెంచుతుంది. ఈ గుణాలన్ని శరీరానికి కలిగితే అందం దానంతట అదే పెరుగగలదు కదా!

### 1372. మొదటి సంవత్సరంలో శిశువు తలపై దువ్వెన పెట్టకూడదా ?

**జ.** శిశువు మొదటిపుట్టిన రోజు జరుపుకునేంత వరకు తలపై దువ్వెనను ఉపయోగించరాదని మన పెద్దలు చెబుతారు. మొదటి జన్మదినోత్సవ సమయంలో తలవెంట్రుకలు తీయడానికి మంగలిని పిలిపిస్తారు. గుండు గీసిన



రోజు నుండి పసి గుండుకు వెంట్రుకలు మొలిసేంత వరకు గంధం ప్రతిరోజూ పట్టిస్తారు. సంవత్సరం వయస్సులోపు శిశువు తల చాలా సున్నితంగా ఉంటుంది. కాబట్టి దువ్వెన వాడితే వాటి మొనల రాపిడి భరించే సామర్థ్యం తలకు ఉండదు. అలా దువ్వినట్లయితే పుర్రెకు అపాయం కలుగుతుంది. అందుకని ఈ నిషేధాన్ని విధించారు.

### 1373. నిద్రించేటప్పుడు తల ఏ దిక్కున ఉంచి నిద్రించాలి ?

**జ.** స్వంత ఇంట్లో తూర్పు వైపు, అత్త వారింట ఉత్తరంవైపు, బంధువు ఇంట్లో మరియు తీర్థయాత్రా సమయాల్లో పడమర వైపు తలపెట్టుకొని నిద్రించాలి.

### 1374. నిద్రపోయేవార్ని ఎలా నిద్రలేపాలి?

**జ.**★ పెద్దగా అరచి నిద్రలేపకూడదు.

★ పరుండిన వ్యక్తిని గట్టిగా కుదిపి, కుదిపి లేప కూడదు.

★ ముందు నెమ్మదిగా పిలిచి, ఆపై స్వరం పెంచి, నెమ్మదిగా చేయివేసి కదిలి నిద్ర లేపాలి.

★ ఒంటరిగా పరున్నవ్యక్తి విషయంలో మరింత జాగరూకత వహించాలి.

### 1375. మనిషికి శాశ్వతమైన ఆభరణాలు ఏవి?

**జ.** వినయము, మధుర భాషణము మాత్రమే మనిషికి శాశ్వతమైన ఆభరణాలు. తక్కినవన్నీ నామమాత్రమైన ఆభరణాలే.

### 1376. పెళ్ళిలో ఎవరు ముందు తలపై జీలకర్ర, బెల్లం పెడతారో వారి మాటే చెల్లుతుందా ?

**జ.** వివాహ సమయంలో ఎవరు ముందుగా జీలకర్ర, బెల్లం తలపై పెడతారో వారి శక్తి అవతల శక్తిపై పడుతుంది. ఆ ప్రవాహ శక్తి జీవితాంతము పడుతూనే ఉంటుంది. అందుకే కొందరి విషయంలో ముందుగా జీలకర్ర, బెల్లం పెట్టినవారి మాటే చెల్లుబాటు అవుతుంది. సాంప్రదాయంగా అయితే పెళ్ళి కూతురితో ముందు పెట్టిస్తారు.

## 1377. శ్రీవారి బ్రహ్మనాడిని దర్శించారా?

**జ.** శ్రీవారి దర్శన సమయంలో స్వామినే చూడగలిగినంత సేపు, కనులార్పకుండా చూస్తూనే ఉండండి. స్వామి విగ్రహ నొసటి కుడి ప్రక్క నామం క్రింద సూర్య



నాడి, ఎడమ ప్రక్కనున్న నామం క్రింద బ్రహ్మనాడి, మధ్య ఉండే ఎర్రని నామమే బ్రహ్మనాడి. ఈ బ్రహ్మనాడియందే పర మాత్ముడు ఉన్నాడు.

## 1378. మంగళవారం పురుషులు తల స్నానం చేయకూడదా ?

**జ.**★ ఆదివారం పురుషులు స్నానం చేస్తే ఆ స్నానం తాపాన్నీ, కోర్కెలనీ పెంచుతుంది.

★ సోమవారం తలంటు స్నానం అందాన్ని పెంచుతుంది.

★ మంగళవారం తలంటు స్నానం విప రీత దుఃఖాన్ని కలిగిస్తుంది.

★ బుధవారం తలంటు స్నానం లక్ష్మీ దీవెనలకు కారణం అవుతుంది.

★ గురువారం తలంటుస్నానం విపరీత ఆర్థిక నష్టానికి కారణం కాగలదు.

★ శుక్రవారం తలంటు స్నానం అనుకోని ఆపదలను తెచ్చిపెడుతుంది.

★ శనివారం స్నానం మహాభోగమును తెస్తుంది.

## 1379. రోజులో ఎన్నిసార్లు భోజనం చేయాలి?

**జ.** రోజుకు ఒకసారి భోజనం చేసేవాడు మహాయోగి, రెండుసార్లు భోజనం చేసే వాడు మహాభోగి, మూడుసార్లు భోజనం చేసేవాడు మహారోగి అని చెప్పబడింది. కాబట్టి రోజులో ఎన్నిసార్లు భోజనం చేయాలో నిర్ణయించుకోవలసింది మనమే.

## 1380. వర్షపు నీటిని త్రాగకూడదా ?

**జ.** భూమిపై ఉన్న జలాశయాలూ, చెరువులూ, మురికిగుంటలలోని నీరు ఆవిరై వర్షం రూపంలో మనను చేరు తుంది. అందుకనే ఏ వర్షం నీరు మంచిదో తెలుసుకొనటానికి ఓ వెండి గిన్నెలో వేడి అన్నాన్ని పెట్టి వర్షపు నీరు పడతారు. అన్నం పాడైనచో ఆ వర్షం నీరు మంచిది కాదని, పాడుకానిచో ఆ వర్షం నీరు మంచిదని మన పెద్దలు చెబుతారు.

## 1381. కల్లుత్రాగితే తెల్లని బిడ్డలు పుడతారా?

**జ.** కల్లు అంటే ముఖ్యంగా కొబ్బరి కల్లు తాగితే సుందరాకారులు పుడతారని ఆయుర్వేదం చెపుతుంది. ఒక వేళ తల్లి

తండ్రులు చామనచాయ కలవారైతే వారి చాయ బిడ్డలకు రాకూడదని, మంచి రంగులో తమ బిడ్డలు జన్మించాలని కొబ్బరి కల్లు త్రాగుతుంటారు. ఇలా కొబ్బరి కల్లు త్రాగటం వల్ల బిడ్డలు తెల్లగా, అందంగా జన్మించగలరని చరక సంహిత కూడా తెలుపుతుంది.

### 1382. శిశువుకు అన్నాన్ని మొదటిసారిగా ఎప్పుడు తినిపించాలి?

**జ.** శిశువుకు ఆరు నెలల వయస్సు వచ్చిన తరువాత ఓ శుభదినాన అన్న ప్రాసన చేయాలి. కొంతమంది ఆరు నెలల ఆరు రోజులకు అన్నప్రాసన చేస్తారు. ఈ అన్నప్రాసన కార్యక్రమంలో



భగవత్ ప్రార్థనలు శుద్ధాత్మకంగా జరపాలి. మొదట భగవంతుడికి నూనె దీపాన్ని వెలిగించి ధూపమిచ్చి, వండిన అన్నాన్ని తేనె, పెరుగు మరియు శుద్ధమైన నేతితో కలిపి నైవేద్యం పెట్టి కర్పూర హారతి ఇచ్చిన తరువాత దేవునకు పెట్టిన నైవేద్యాన్ని ప్రసాదంగా శిశువునకు తినిపించాలి. బంధుమిత్రులు ఈ కార్యక్ర మంలో పాల్గొంటారు. వారు "ఓం త్వం అన్నపతిరన్నదో వర్తమానో భుయ" అన్న మంత్రాన్ని ఉచ్చరిస్తూ దీవించాలి.

### 1383. ఆహారం తీసుకునేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

**జ.** ఆహారం తినేటప్పుడు నిలబడి, కాళ్ళు చాపి, నడుస్తూ, మాట్లాడుతూ తిన కూడదు. పుల్లని పెరుగును స్వీకరించ కూడదు. అజీర్ణసమస్యలు తలెత్తవచ్చు. తినే పదార్థాలను అనేకసార్లు వేడిచేసి తినకూడదు. ఈ పదార్థాలను తినుట వల్ల గ్యాస్ సమస్య ప్రబలవచ్చును. మినుము లతో చేసిన పదార్థాలు తినిన తరువాత పాలను త్రాగకూడదు. భోజనానికి ముందు ఆమ్ల గుణముకల దానిమ్మను తింటే అజీర్ణ సమస్య ఉండదు.

### 1384. శాస్త్రాల ప్రకారం ఏ మాంసాన్ని తినవచ్చు?

**జ.** అనారోగ్యాన్ని తెచ్చే అవకాశము ఉన్నందున అడవి జంతువులను తిన కూడదు. శాస్త్రాలు నిర్ణయించిన వర్ణాల వారు మాత్రమే చేప, కోడి, మేక మాంసాలను భుజించవచ్చు. పూర్వా భాద్ర, మూల, పూర్వాషాఢ, ఉత్తరాభాద్ర, ఉత్తరాషాఢ, శివరాత్రి, గ్రహణ సమ యమున, ముందు వెనుకా, సంక్రమణ సమయాలలో కూడా మాంసా హారమును భుజించకూడదని శాస్త్రాలు పేర్కొంటున్నాయి.

## 1385. కాఫీ త్రాగితే జ్ఞాపకశక్తి పెరుగుతుందా ?

**జ.** దాదాపు ప్రతి భారతీయుడు తన దిన చర్యను ఓ కప్పు కాఫీ త్రాగటంతో ప్రారంభిస్తాడు. ఈ కాఫీ తనను రోజంతా హుషారుగా ఉంచుతుందని అతని భావన. భారతీయులకుగల ఈ నమ్మకాన్ని నిజమే



నంటూ అరిసోనా విశ్వ విద్యాలయం వారు కూడా కాఫీ గొప్పతనాన్ని చాటారు. 65 సంవత్సరాల వయస్సు పైబడిన వారిలో సైతం కాఫీలో ఉండే 'కెఫీన్' అనే రసాయనం జ్ఞాపక శక్తిని చైతన్యవంతం చేస్తుందని తెలిపారు. సహజంగానే వయస్సు పైబడినవారిలో జ్ఞాపకశక్తి క్షీణిస్తుంది. ఉదయం ప్రారంభంలో జ్ఞాపక శక్తి బాగుగానే ఉన్నా క్రమక్రమంగా ఆ జ్ఞాపకశక్తి సాయంత్రానికి క్షీణిస్తూ వస్తుంది. కాఫీ త్రాగటం వల్ల ఇలాంటి జ్ఞాపకశక్తి క్షీణత తగ్గు తుందని నిరూపించబడింది. కాఫీలోకల 'కెఫీన్' అనే రసాయన పదార్థం ఉదయ సమయం తరువాత తగ్గుముఖం పట్టే జ్ఞాపక శక్తిని అదుపుచేసి సమతులత సాధిస్తుంది.

## 1386. నెత్తిన పాలుపోసినట్లే అనటంలో అర్థమేమిటి?

**జ.** పూజాదికాలప్పుడు దేవునకు పాలూ, పెరుగూ, నెయ్యి, తేనెలతో అభిషేకం చేస్తాము. అందువలన దేవుడు సంతృప్తి చెంది మనకు మంచిని చేస్తాడనే భావన మనకు ఉంటుంది. ఈ అర్థంలోనే నువ్వు ఆ పని చేసావంటే నాకేమీ ఇబ్బంది కలుగ కుండా ఉంటుంది అనే భావంలోనే ఆ పని చేస్తే నా నెత్తిన పాలు పోసినట్లే అని అనటం.

## 1387. స్టీల్ ప్లేట్లలో భగవంతునికి నైవేద్యం పెట్టకూడదా ?

**జ.** బంగారము, వెండి, రాగి, ఇత్తడి, మోదుగ ఆకు, అరటి ఆకులు, తామర ఆకులోకానీ లేదా మట్టి పాత్రలోనైనా భగవంతునికి నైవేద్యం పెట్టవచ్చు. కానీ స్టీలు, గాజు వంటి పాత్రలలో భగవంతునికి నైవేద్యం పెట్టటం తగదు అంటారు.

## 1388. లక్షణాలను బట్టి స్త్రీల జాతులు

**జ.★** నిత్యమూ రెండు పూటలా స్నానం చేయునది, పరిమళముగల దేహము కలది, ప్రియ సంభాషణలు కలది, తక్కువ భుజించి, తక్కువగా మాట్లాడునది 'దేవత'.

★ భర్తకు తెలియకుండా పాపములు చేయునది, చేసిన పాపము తనపై పడకుండా జాగ్రత్త పడునది, అర్థం కాని విధంగా ప్రవర్తించునది మార్జాలం (పిల్లి).

★ అతిగా నవ్వుతూ, ఆట పాటల మాటలతో వ్యవహరించునది, ఊహించని విధంగా కోపం ప్రదర్శించి, ఆ మరు క్షణంలోనే ప్రసన్నురాలు అయ్యేడిది 'రాసభి' (గాడిద).

★ విపరీతంగా తినునది, ఊరకే అతిగా మాటాడునది, ఎప్పుడూ ఎవరినో ఒకనిరి దూషించుచు, భర్తకు ఎదురు చెప్పు స్త్రీ 'పిశాచి'.

★ నిత్యస్నాతయై సువాసనలుగల పూలను ధరించి పదార్థములను ఇష్టముగా భుజించి భర్తకు ఆనందంకలిగించేలా వ్యవహరించునది, ఉద్యానవనాల్లో విహరించే స్త్రీ 'గాంధర్వి'.


★ చాపల్యము కలది, ఎల్లప్పుడూ దిక్కులు చూసేదీ, పిసినారీ, తిరిగే గుణం కలది 'వానరి'.

★ చంద్రబింబము వంటి ముఖముతో పొందికైన అవయవములతో మదించిన ఏనుగువలె నడుచునది, ఎర్రని వన్నెతో మెరిసే గోళ్ళు కలది 'విద్యాధరి'.

★ వీణ వంటి సంగీత ధ్వనులను చేయగలిగేదీ, పాటలు, వేణుగానము, పుష్పములూ, సుగంధ ద్రవ్యములపై ఆసక్తి గల స్త్రీ కూడా గాంధర్వే.

## 1382. దేవతల ఆహారం ఏమిటి ?

**జ.** పండ్లు దేవతల ఆహారం. పండ్లను తినుటవల్ల అనేక లాభాలు ఉన్నాయి. మూడు పూటలా కేవలం పళ్ళే తిని, అలా నెలలో మూడు రోజులు దీక్షలా చేసినచో



శరీరంలోని సకల మలినాలు తొలగి పోగలవు. ఒక మహాకార్యం ప్రారంభించారా కేవలం పళ్ళే తినండి ఎంతటి అద్భుతం జరుగుతుందో చూడమని ఆయుర్వేదశాస్త్ర పితామహుడు చరకుడు చెప్పాడు.

## 1380. పిశాచసత్వ స్త్రీలు ఉంటారా? వారి లక్షణాలు ఏమిటి ?

**జ.** పిశాచసత్వ స్త్రీలు మద్య మాంసాలను అధికంగా ఇష్టపడతారు. భర్త, తండ్రి, తల్లి ధనాన్ని అనవసరంగా ఖర్చుపెడతారు. ఏ చిన్న అవకాశం లభించినా కామాన్ని వెంటనే తీర్చుకుంటారు.

## 1381. స్త్రీలు సుందరాకాండను ఎందుకు చదువకూడదు ?

**జ.** సుందరాకాండలో గాయత్రీ మంత్రము ఉంటుంది. గాయత్రి మంత్రం పఠించటం వలన స్త్రీలకు గర్భాశయంపై దుష్ప్రభావం చూపిస్తుందని స్త్రీలు సుందరాకాండను చదువరాదని నిషేధం విధించారు.

## 1382. కొత్తపెండ్లికూతురును ఇంట్లోకి ఆహ్వానించునపుడు దీపం వెలిగించి ఇంటిలోకి స్వాగతం పలకాలా?

**జ.** హిందువుల ఇంట ఏ శుభ కార్యము జరిగినా దీపాలకు విశేష ప్రాధాన్య మున్నది. ఇక వివాహము వంటి శుభ కార్యము జరిగేటప్పుడు చెప్పవలసిన పని లేదు. నూతన వధువును అత్తవారింటికి ఆహ్వానించేటప్పుడు చేతిలో దీపాలతో



కూడిన పళ్ళెం పట్టుకొని కుడి కాలును మోపుతూ అత్తవారింట్లోకి నూతన వధువును ఆహ్వానిస్తారు. అత్తకాని, వరుని సోదరికాని దీపాలు చేతిలో పట్టుకొని వధువును ఇంట్లోకి ఆహ్వానిస్తారు. ఈ విధానంలో ఆరోగ్యానికి సంబంధించిన విశేషాలు ఏమీ లేకపోయినా దీపాలు సిరి సంపదలకు దైవమైన లక్ష్మీదేవి స్వరూపంగా చెబుతారు. అలా దీపాలను వెలిగించి పట్టుకోవడం లక్ష్మీసాన్నిధ్యంగా భావింపబడుతోంది. అలాగే ఇంటికి వచ్చే కోడలు లక్ష్మీదేవి వంటిదై కుటుంబానికి సరిసంపదలు తెస్తుందని అత్తింటివారు కోరుకుంటారు.

## 1383. దేవాలయాల్లో ఇచ్చే తీర్థాన్ని ఎన్నిసార్లు తీసుకోవాలి?

**జ.** దేవాలయంలో ఇచ్చే తీర్థం మూడు సార్లు తీసుకోవాలి. మొదటిసారిగా ఇచ్చే తీర్థం శరీర పవిత్రత కొరకు, రెండవసారి ఇచ్చే తీర్థం ధర్మ సంబంధమైన జీవనం కొరకు, మూడవసారి ఇచ్చే తీర్థం పుణ్య లోకాల కోసము.

## 1384. ఆరువేళ్ళవారికి అదృష్టం కలసిరాదా?

**జ.** మోకాళ్ళు కలిసే ప్రదేశంలోనూ, మోకాళ్ళ మధ్యా తగుఖాళీ ఉంటే అదృష్టం రకరకాలుగా కలసి వస్తుందని చెబుతారు. పురుషులకు గాని, స్త్రీలకుగాని నోరు చిన్నదిగా ఉండాలి, నోరు పెద్దదిగా ఉండాలి. అపుడే వారికి అదృష్టం వరిస్తుందని చెబుతారు. చేతుల విషయానికి వస్తే ఆరువేళ్ళ వారికి అంత అదృష్టం ఉండదు. వారు కష్టం ద్వారానే దేనినైనా సాధించాలి.

## 1385. మానవుడు ఆచరించవలసిన మంచి పనులు

**జ.** ★ మీ చుట్టూ ఉన్న వారంతా బాగుగా ఉండాలని కోరుకుంటే మీరు ఇంకా బాగుంటారు.

★ భార్యను దూరం చేసుకున్నవాడు, తల్లీ, తండ్రి, అత్తమామలను దూరం చేసుకున్న వాడూ, స్నేహితులను దూరం చేసుకో కూడదు … ఇట్టి వారిని చూసి జాలి పడక మనం ఏం చేయగలం?

★ మీ మంచిని కోరేవార్ని దూరం చేసుకోవడం ద్వారా మీకు నిద్ర కూడా కరువు కాగలదు.

★ తోటివారిమీద చెడు ఆలోచనలతో ఎన్నో తెలివితేటలు చూపించి వారికి నష్టం కలిగించితే చివరకు నష్టపోయేది మీరే.

★ వ్యక్తులు ఉన్నప్పుడు వారి విలువ తెలియదు, వారు దూరమయినపుడే వారి విలువ తెలుస్తుంది. అప్పుడు ఏం చేసినా ప్రయోజనం ఉండదు.

★ జంతువులు కూడా గుంపులుగా ఆహారం కోసం వెళతాయి. ఆత్రంగా, స్వార్ధంగా కనిపించేదంతా తనకే కావాలని ఏ జంతువూ ఆత్రుత పడదు.

## 1396. ఉదయం లేవగానే గోరువెచ్చని నీరు త్రాగాలా ?

**జ.** రాత్రి తెల్లవార్లూ నిద్రించిన తరువాత అన్ని అవయవాలు పూర్తి విశ్రాంతిని తీసుకుంటాయి. నిద్రలేచి కాలకృత్యాలు, మొఖం కడుగుకొనుట మొదలగునవి చేసిన తరువాత శరీరం సాధారణ స్థితి లోకి వస్తుంది. శరీరం లోపల ఉన్న అవయవాలు మాత్రం ఆహారం తీసుకోవటానికి మాత్రం సిద్ధంగా ఉండవు. అందుకే తేలికైన నీటితో వాటిని లేపుతాము. మనం తీసుకొన్న గోరు వెచ్చని నీటిద్వారా పొట్ట శుభ్రపడి ఘనాహారం తీసుకోవటానికి ఉదరం సిద్ధమౌతుంది.



## 1397. దత్తతగా ఏ కుమారుని పంపవచ్చు?

**జ.** పెద్ద కుమారుడు అంటే తొలి సంతానం దైవసంతానం. చివరి సంతానం అంటే ముద్దుల కొడుకు. జ్ఞాన సంతానం. మధ్యవాడు కామ సంతానం. కావున ఆ కుమారుని దత్తత ఇవ్వవచ్చని వాల్మీకి రామాయణం పేర్కొంది.

## 1398. అష్ట కష్టాలు అంటే ఏవి?

**జ.**★ ఇష్టం లేకపోయినా తప్పని సరిగా పనిచేయాల్సి రావటం.

★ భయంకర దారిద్ర్యము.

★ భార్య ఉండి ఉపయోగపడక పోవటం.

★ అడుక్కునే పరిస్థితి.

★ అప్పు అడిగినా ఇచ్చే వారు కరువుకావటం.

★ వీసమెత్తు ఉప్పు కూడా అడిగినా ఇచ్చే వాళ్ళు లేకపోవటం.

★ రెండు కాళ్ళతోనే వెళ్ళాల్సిరావటం.

వీటిని అష్ట కష్టాలు అంటారు. ఇన్ని కష్టాల మధ్య కూడా అత్యున్నత స్థాయిని పొందిన వారు అనేకులు ఉన్నారు.


## 1399. ఎవరితో వివాదం పెట్టుకోకూడదు?

**జ.** బలమున్న వాడితో, ధనమున్నవాడితో, మదమున్న వాడితో, పొగరున్న వాడితో,

అధికారమున్నవాడితో, స్థాన బలమున్న వాడితో వివాదం పెట్టుకున్నా ఫర్వాలేదు. కానీ పైన పేర్కొన్న బాలాదులు లేక పోయినా మేధావితో మాత్రం పెట్టుకో కూడదు అంటారు.

## 1400. శాఖాహారంలో ఉత్తమమైన ఆహారం ఏది?

**జ.** తీగ ద్వారా వచ్చే పొట్లకాయ, బీరకాయ, సొరకాయ, గుమ్మడి, చిక్కుడు, ఆకుకూరలు మొదలైనవి ఉత్తమమైన ఆహారం. కాయల రూపంలో మనకు



లభించే వంకాయ, మునగకాయ, దోస కాయ, టమోటా మొదలగునవన్నీ మధ్య మాలు. భూమిలో పండేవి అనగా దుంప కూరలు అధమం. ఇవి ఆరోగ్యానికి ఏమంత మేలు చేయవు. వీటిని వైద్య శాస్త్రం కూడా ధృవీకరిస్తోంది.

## 1401. కలియుగంలో అనంతమైన ఫలితాన్ని ఇచ్చే కార్యం ఏది?

**జ.** కలియుగంలో దానానికి మించిన సత్కర్మ లేదని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. దానం కూడా అర్హతకలవానికే చెయ్యాలని భజగోవిందకారుడు సెలవిచ్చాడు. కృత యుగంలో తపస్సు, త్రేతాయుగంలో వేదజ్ఞానము, ద్వాపరయుగంలో యజ్ఞ యాగాదులు అనంతమైన ఫలితాన్ని ఇస్తాయని చెప్పబడింది.

## 1402. మాంసాహారాన్ని అందరూ తినకూడదా ?

**జ.** శాస్త్రాలలో చెప్పిన ప్రకారం కొన్ని వర్ణాల వారే మాంసాహారాన్ని భుజించాలి. మాంసాహారాన్ని తినాల్సిన వర్ణాల వారు కూడా స్వయంగా జంతువులను వేటాడి తినరాదని, ఎవరైనా ఇచ్చినవి, కొన్నవీ, వండి పెట్టినవి తినవచ్చునని ఇలా తినుట దోషరహితమని కూడా శాస్త్రాలు పేర్కొంటున్నాయి.

## 1403. అత్యంత మహత్తు కలిగిన పర్వదినాలు ఏవి?

**జ.** అమావాస్యా సోమవారం; సప్తమీ ఆదివారం; అష్టమీ బుధవారం; చవితి మంగళవారం.

## 1404. ధన్వంతరి ఆలయాన్ని సందర్శిస్తే ఆరోగ్యం కలుగుతుందా?

**జ.** దీర్ఘవ్యాధులతో బాధపడేవారిని ధన్వంతరి ఆలయాన్ని సందర్శించమని చెబుతారు. సూర్యుని వద్ద ఆయుర్వేద వైద్యాన్ని నేర్చుకున్న పదహారు మంది శిష్యులలో మొదటివాడు ధన్వంతరి. ఇట్టి దేవ వైద్యుడైన ధన్వంతరి ఆలయాన్ని ఇరవై ఏడు నక్షత్రాలకు, తొమ్మిది గ్రహాలకు సంబంధించిన దివ్య ఔషధ మొక్కలను నాటి పెంచి, మధ్యలో ధన్వం

తరి ఆలయం కడతారు. ఈ ఆలయ సందర్శనం వలన అనారోగ్యం కలవారు ఆ దివ్య ఔషధాల గాలి సోకటంవల్ల వారి అనారోగ్యం నుండి ముక్తులు కాగలరు. అందుకే ధన్వంతరి ఆలయం సందర్శించిన వారిని కొద్దిసేపు అచ్చట ఉండి తప్పనిసరిగా ధ్యానం చేయమని చెబుతారు.

## 1405. నల్లచారలుగల జింకలు తిరిగే భూమి పుణ్యభూమా ?

**జ.** పూర్వం ఋషులు నల్లచారలుగల జింకలు తిరిగే ప్రదేశాన్ని ఎంచుకొని ఆశ్రమం నిర్మించుకొని తపస్సు చేసే వారు. అట్టి భూమిని వారు పుణ్య భూమిగా భావించేవారు. ఆ ప్రదేశంలో యజ్ఞాలూ,



యాగాలూ, ధర్మాలు మొదలగు ఏ కార్యాలు చేసినా శుభ ఫలితాలను ఇచ్చి, ఆ కార్యం ఫలప్రదం అవుతుంది. ఈ ప్రదేశాలలో దేవతలు, యక్షకింపురుషులు సదా సంచరిస్తూ ఉంటారు. రాజులు కూడా ఈ ప్రదేశాలలోనే యజ్ఞ యాగాదులను చేసేవారు.

## 1406. స్నేహం చిరకాలం నిలవాలంటే?

**జ.** ఎట్టి స్థితిలోను మిత్రుడి భార్యతో ఒంటరిగా మాట్లాడరాదు. డబ్బు విషయంలో, ఇచ్చి పుచ్చుకునే విషయంలో నిక్కచ్చిగా నలుగురి మధ్యన వ్యవహారం సాగించాలి. లేనిపోని విషయాలపై స్నేహితునితో వాదోపవాదాలు ఆడరాదు.

## 1407. మంగళసూత్రమా ? తాళిబొట్టా?

**జ.** పూర్వం మహిళలు తమ మంగళ సూత్రాలుగా తాళ పత్రపు ఆకులను చుట్టి దానికి పసుపు దారాన్ని చుట్టి కుంకుమ రాసి మెడలో మాంగల్యంగా ధరించే వారు. అందుకే మంగళసూత్రాన్ని ఇప్పటికీ తాళిబొట్టు అని కూడా అంటారు.

## 1408. విశ్వామిత్రుడు సృష్టికి ప్రతిసృష్టి చేసిన వస్తువులు ఏవి?

**జ.** గుమ్మడికాయ, వంకాయ, కరివేపాకు, పచ్చి మిరపకాయలు, గోంగూర, కుంకుడు కాయలు. ఇవి విశ్వామిత్రుడు సృష్టికి ప్రతి సృష్టిలో చేసిన వస్తువులుగా చెప్పుదురు. వీటిని శ్రాద్ధ కార్యాలలో వాడకూడదనే నిషేధము ఉన్నది.

## 1409. క్షౌరము ఏఏ రోజుల్లో చేయించుకోరాదు? ఎందుకు చేయించుకోరాదు ?

**జ.** క్షౌరము చేయించుకోవటం వల్ల శరీరంలో విద్యుత్తు తగ్గుతుంది. అందుకే

వ్రతదీక్షలప్పుడు క్షౌరము చేయించుకోరు. ఇక పాడ్యమీ, చవితి, షష్ఠి, అష్టమి, నవమి, అమావాస్య, పౌర్ణమి తిథులందు, శనివారం, మంగళవారం క్షౌరము కూడ దని చెప్పిన దానిలో ఎంతో ఆరోగ్య రహస్యము ఉన్నది. చంద్ర, సూర్యుల నుండి వచ్చే కిరణాలు ఆయా రోజుల్లో కనులపై కూడా ప్రభావం చూపుతాయి. సూర్య చంద్రుల కిరణాల ప్రభావం వల్ల కనులకి ఇబ్బంది అయ్యే ఆ రోజుల్లో క్షౌరము చేయించుకోవటంవల్ల శరీ రంలో విద్యుత్ కూడా తగ్గి శరీరానికి అనారోగ్యం కలుగుతుంది. అందుకనే పై పేర్కొన్న దినాలలో క్షౌరం చేయించుకొన రాదని నిషేధం విధించారు.

## 1410. ఋషుల కమండలంలోని జలానికి శాపాన్ని, వరాన్ని ఇచ్చేటంతటి శక్తి ఉంటుందా?

**జ.** జలము, విభూది, రుద్రాక్ష. ఈ మూడు ఎంతటి శక్తినైనా తమలో ఇముడ్చుకోగలవు. మునులు తమ తపశ్శక్తిని



కమండలంలోని నీటిలో నిక్షిప్తం చేసి ఉంచుతారు. అందుకే వారు శాపాన్ని ఇవ్వాలన్నా, వరాన్ని ఇవ్వాలన్నా కమండ లంలోని తమ తపఃశక్తి అనే జలాన్ని మంత్రించి చల్లుతారు. ఆ జలంలో వారు నిక్షిప్తం చేసిన తపఃశక్తి వల్ల వారు అన్నది అక్షరాలా జరుగుతుంది అని పెద్దల నమ్మకం.

## 1411. నవగ్రహాలకు ప్రదక్షిణ ఎక్కడి నుండి ప్రారంభించాలి?

**జ.**"ఆదిత్యాయ సోమాయ" అంటూ నవగ్రహ స్తోత్రాన్ని ప్రారంభిస్తాము కనుక ఆదిత్యుడైన సూర్యుని వద్ద నుండి ప్రదక్షిణ ప్రారంభించి మరలా సూర్యుని వద్దకు చేరితే ఒక ప్రదక్షిణ పూర్తి అయినట్టు లెక్క. సూర్య గ్రహాన్ని తూర్పు దిశగా, గ్రహాలకు మధ్యన ప్రతిష్ఠిస్తారు.

## 1412. నవగ్రహాలకు ఏ నైవేద్యాలు పెట్టాలి?

**జ.** సూర్య భగవానునికి గుడాన్నము; చంద్రునకు నేతితో వండిన పాయసము; కుజునకు హరిస్యాన్నము; బుధునకు క్షీరాన్నము; బృహస్పతికి పెరుగూ; శుక్రునకు ఘృతాన్నము; శనీశ్వరునకు నూవుల పిండీ, మినుములు; రాహువుకి మాంసము; కేతువుకి చిత్రాన్నము, రేగి పండ్లు, పచ్చి తామర గింజలను నైవేద్యంగా సమర్పించాలి. నవగ్రహాలకు ప్రీతిగల ఈ పదార్థములను తయారు చేసిన వారికి కూడా సకల సర్వదోషాలు నశించునని నమ్మకం. (భవిష్య పురాణం నుండి)

### 1413. ఆహారం తీసుకునేముందు దైవప్రార్థన చేస్తే ఆహారం అమృతమయమౌతుందా ?

**జ.** ధర్మంగా సంపాదించని ధనముచేత ఆహారం కొన్నది కాకపోయినా, మురికి గుంటల ప్రక్కన, పండించకూడని ప్రదేశాల్లో పండించిన ఆహారమూ విషతుల్యము అగును. అందుకే భోజనము



నకు ముందు ప్రార్థన చేయుట ద్వారా కొంతవరకైనా ఆహారాన్ని అమృతమయం చేసుకొనవచ్చును.

### 1414. వట్టి హారతిని స్వామికి ఇవ్వకూడదా?

**జ.** ఇవ్వకూడదనే శాస్త్రం చెబుతోంది. పుష్పంగానీ, హారతితో పట్టుకొని స్వామికి ఇవ్వాలి. తరువాత కళ్ళకు అద్దుకోవాలి.

### 1415. ఇంట్లో పిచ్చుకలు తమ గూడు పెట్టుకోకూడదా ?

**జ.** పశుపక్ష్యాదులకు ఆహారాన్ని వేయుట, వాటికి నివాసం కల్పించుట యజ్ఞం చేసినంత ఫలం కలిగిస్తుందని చెబుతారు. అందుచే పిచ్చుకల వంటి పక్షుల గూటిని కదలించరాదు.

### 1416. తిరుమలలో ప్రసాదంగా లడ్డుకు ముందు ఏ ప్రసాదం ఉండేది ?

**జ.** నేడు తిరుమలలో శ్రీవారి ప్రసాదమైన లడ్డుకు ముందు స్వామివారి ప్రసాదంగా బియ్యపు పిండి, బెల్లం పానకంతో చేసిన ప్రసాదాన్ని అందించేవారు. తరువాత లడ్డు ప్రసాదంగా మారినట్లు తెలుస్తుంది. లడ్డు ప్రసాదంగా ఇవ్వటం దాదాపు 150 సంవత్సరాల నుండి కొనసాగుతుంది.

### 1417. ఏ సుగుణం వల్ల ఏ ఫలం సిద్ధిస్తుంది?


**జ.** సామర్థ్యము ద్వారా అధికారం అందుతుంది. జ్ఞానము ద్వారా వైరాగ్యము, దానం చేత కీర్తి, వినయము ద్వారా సంపద, ప్రియపలుకుల ద్వారా మంచి మిత్రులు, భక్తి ద్వారా భగవంతుని ఆశీర్వాదము అందుతాయి.

### 1418. పగలు ఎవరు నిద్రించ వచ్చును?

**జ.** గర్భిణీస్త్రీలు, చిన్న పిల్లలూ, వృద్ధులూ, అనారోగ్యము గలవారు పగటి పూట కొద్దిసేపు నిద్రించవచ్చును. శృంగార సంభోగములు జరిపిన వారు కూడా పగటి పూట నిద్రించవచ్చును. రాత్రిపూట ఆరు గంటల నిద్ర అమృతమయమైనదని ఆయుర్వేదశాస్త్రం చెబుతోంది.

## 1419. సిగ్గును ప్రదర్శించే స్త్రీ ఈ పనిని చేయరాదు

**జ.** స్త్రీలు సిగ్గును అనేక విధాలుగా ప్రదర్శిస్తారు. కొందరు స్త్రీలు కాలి బొటన వ్రేలిని నేలకు రాస్తూ సిగ్గు పడతారు. ఈ పని ఆరోగ్యరీత్యా మంచిది కాదని తెలు



స్తుంది. బ్రొటనవేలిలోని నరాలు గర్భానికీ, హృదయానికి సంబధించినవి అయి ఉంటాయి. వాటిపై ఒత్తిడి తేవటం ఆరోగ్యరీత్యా మంచిది కాదు. కావున స్త్రీ తన సిగ్గును ఇలా ప్రదర్శించరాదని పెద్దలు సెలవిచ్చారు.

## 1420. శంఖము పూరించటం వల్ల ఏం ప్రయోజనము కలుగుతుంది?

**జ.** ఆరు నెలల పురాణశ్రవణం వల్ల కలిగిన ఫలం ఒక్కసారి శంఖము పూరించుట వలన కలుగుతుంది అని చెప్పబడింది. గృహ ఆవరణలోని దుష్ట శక్తులు శంఖనాదం వల్ల పారిపోగలవు.

## 1421. మెటికలు విరువ కూడదా? అలా విరిస్తే నష్టమా?

**జ.** వేల్పులు అంటే దేవతలు వేళ్ళ కణుపుల వద్ద ఉంటారని చెబుతారు. మెటికలు విరిస్తే దేవతలకు కోపం కలుగుతుందని భావన. ఆరోగ్యరీత్యా కూడా మెటికలను విరుచుట మంచిదికాదు. ఇలా మెటికలను విరుచుట వల్ల చేతులలోని శక్తి హరించగలదని, చేతులలో పట్టు ఉండదని పెద్దలు చెబుతారు.

## 1422. తామరాకు, మోదుగ ఆకుల్లో సన్యాసులే భోజనం చేయాలా?

**జ.** తామర, మోదుగ ఆకుల్లో ఆహారాన్ని మునులూ, సన్యాసులూ మాత్రమే తినాలి. ఆ ఆకుల్లో భుజించటం వల్ల సత్వగుణం అలవడుతుంది. అందుకే గృహస్థు జీవితం గడుపుతున్నవారు తామర, మోదుగ ఆకుల్లో భోజనం తినరాదని చెబుతారు.

## 1423. కొత్త ఇంటిలో పాలు పొంగించేది ఎందుకు ?

**జ.** గతంలో కట్టెల పొయ్యిమీద వంట చేసేవారు. శుభ పర్వ దినాల్లో రెండు బియ్యపు గింజలను పొయ్యిలో వేసేవారు. అలా మాడిన బియ్యపు వాసన వల్ల వంటగదిలోని అనేక క్రిమికీటకాలు దూరంగా తొలగిపోతాయి. కాలం మారుతుండటంతో బ్రతుకు తెరువుకోసం జనం అనేక చోట్లకు మరలుతుండటంతో వెళ్ళిన చోట పాలు పొంగించి బియ్యం

వేసి ఉడికించి పొంగలిని నైవేద్యంగా భగవంతునికి సమర్పించమని పెద్దలు ఆచారంగా ఈ నియమాన్ని పెట్టారు.

### 1424. దీపావళి రోజున దీపాలు ఎక్కడెక్కడ పెట్టాలి ?

**జ.** దీపావళి రోజున దీపాలు ముఖ్యంగా ఐదు చోట్ల పెట్టాలి. ఇంట్లో పూజా మందిరం వద్ద, ధాన్యమున్న చోట, బావి వద్ద, రావిచెట్టు వద్దా, తులసి చెట్ట దగ్గర



తప్పనిసరిగా దీపాలు పెట్టాలి. ఏ కారణాల వల్లనైనా పండుగ జరుపుకోక పోయినా దీపాలు మాత్రం పెట్టుకొన వచ్చు.

### 1425. ఏకాంతంలో భార్యను దగ్గరకు తీసుకున్నప్పుడు మగవారు కన్నులు తెరచుకొనే ఉండాలా?

**జ.** ఆ సమయంలో సిగ్గులతో మొగ్గలయ్యేదీ, ఆనందంతో తన్మయంగా కన్నులు మూసుకునేదీ స్త్రీయే. పురుషుడు కనులు తెరచి భార్యను చూస్తూనే శృంగారాన్ని ప్రదర్శించాలి. పురుషుడు కనులూ మూసుకుంటే అనేక ఆలోచనలు అతన్ని ఇబ్బంది పెట్టవచ్చునని, భార్యతో పరిపూర్ణ సుఖాన్ని పొందలేడనే భావనతో పురుషునకు ఈ నియమాన్ని పెట్టారు.

### 1426. బిందెలను కొడితే దయ్యాలకు ఆహ్వానమా?

**జ.** గుడిలో గంట కొడితే దేవునికి మేలుకొలుపు. శంఖనాదం విజయానికి గుర్తు. ధనష్ఠంకారం సమరోత్సాహానికి పిలుపు. రెండు చేతులూ కలిపికొడితే ఉత్సాహానికి, అద్భుతానికి గుర్తు. బిందెల మీద కొడితే దయ్యాలకు ఆహ్వానం అని చెబుతారు.

### 1427. ఏకభుక్తం అంటే ఏమిటి?

**జ.** ఒంటిపూట అదీ మధ్యాహ్నం చేసే భోజనాన్ని ఏకభుక్తం అంటారు. ఈ ఏకభుక్తంతో పాటు భగవంతుని ధ్యానం కూడా చేయాలి. అన్నం వలన మనం చేసిన పాపాలు నశించటానికి, శరీర దోషాలు నశించటానికి ఏకభుక్తం చేస్తారు.

### 1428. మనుష్యులు అస్సలు చేయకూడని పనులు?

**జ.**★ అన్యాయపు సొత్తును ఆశించరాదు. ఒక వేళ ఆ సొత్తును నీవు అనుభవించిన అపకీర్తి, దుర్గతీ లభించగలవు.

★ అద్దంలో సూర్య చంద్రులను చూడ రాదు.

★ నేల అదిరేటట్లు నడువరాదు.

★ అప్పుపుచ్చుకొని ఎగవేసినచో ఆ అప్పును మరుజన్మలోనైనా తీర్చవలసి ఉంటుంది.

★ ఆకాశం వంక చూడరాదు.

★ ఇంగువ, నూనె, ఆవాలు ఎక్కువగా వాడకూడదు.

★ తడిపి ఆరవేసిన బట్టల నుండి నీటి చుక్కలు క్రిందకు పడకూడదు. అవి మీ పితృదేవతల కన్నీరు వంటివి. కావునా గట్టిగా పిండి ఆరవేయాలి.

★ ఆదివారం ఉసిరికాయ పచ్చడిని తిన కూడదు.

## 1429. హోమాల్లో నేతిని వాడటం వల్ల ఉపయోగం ఉందా ?

**జ.** ఆవునెయ్యి హోమంలో పోస్తూ మంత్ర పఠనం చేయటం ద్వారా, ఆ నెయ్యిలోని శక్తి ఎన్నో కిలోమీటర్ల వరకూ వ్యాపించి,



తద్వారా వచ్చే ఆవిరి అనేక వాతావరణ దోషాలను తొలగిస్తుంది. అందువలన సకాలంలో వర్షాలుపడి అందరూ సుఖిస్తారు.

## 1430. జంట అరటిపండ్లు తింటే కవల పిల్లలు పుడతారా?

**జ.** జంట అరటి పండ్లను తింటే కవల పిల్లలు పుడతారని నమ్ముతారు. కానీ దీనికి శాస్త్రీయమైన ఆధారము ఏమీ లేదు. జంట ఫలాలను స్వామికి అర్పించుట, తినుటలో ఎట్టి దోషం లేదని శాస్త్రాలు చెబుతున్నాయి. అంధగర్వంతో విర్రవీగిన రంభ శ్రీమహావిష్ణువు శాపం వలన భూలోకంలోఅరటి చెట్టుగా జన్మించిందని పురాణ సారాంశం. తాంబూలంలో మాత్రం జంట అరటిపండు పెట్టుట నిషేధం. దీనికి కారణం ఏకఫల తాంబూలం నిషేధం కాబట్టి.

## 1431. రాజుకన్నా బలవంతుడు ఎవరు?

**జ.** రాజుకన్నా బలవంతుడు మూర్ఖుడు. ఇతడు ఇవ్వరి మాటా వినడు. కొంత మంది వ్యక్తులు ధనం కోసం లొంగ గలరు. మరికొందరు స్త్రీకోసము, అధికారం కోసం, భోగాల కోసం లేదా తన వారి క్షేమం కోసమన్నా లొంగగలరు. కానీ మూర్ఖుడు దేనికీ లొంగడు. అందుచే మూర్ఖుని రాజుకన్నా బలవంతునిగా పేర్కొంటారు.

## 1432. అప్పనంగా డబ్బు వచ్చి పడాలంటే ఏం చేయాలి ?

**జ.** అదృష్టము ఉండాలి. ఆ అదృష్టాన్ని పొందాలంటే కష్టపడాలి. ఏమీ చేయకుండా రాత్రికి రాత్రే కోటీశ్వరులం కావాలనుకోవటం వట్టి భ్రమ. అదృష్టం రెండు రకాలు. మొదటిది పుట్టుకతోనే ధనవంతులుగా ఉండటం. అంటే ధనవంతుల ఇళ్ళలో పుట్టటం. రెండవ అదృష్టం కష్టపడటం, గమ్యాన్ని చేరటం. ఇవి నెరవేరినపుడు సకలభోగాలు మన ఎదుటనే ఉంటాయి. మొదటి అదృష్టం పూర్వజన్మ

సుకృతంవల్ల కలిగింది అనుకొన్నా, రెండవ అదృష్టం భగవంతుడు మనకు ఇచ్చిన జ్ఞానం. ఈ జ్ఞాన మార్గం ద్వారా ప్రయాణించి మనకు ఇష్టమైన గమ్యాన్ని చేర వచ్చును.

## 1433. శివుని ఏ లింగాన్ని పూజిస్తే ఏ ఫలము లభించగలదు?


**జ.**★ స్వర్ణ లింగాన్ని సేవిస్తే సౌఖ్యం, ధనం, విద్యా ప్రాప్తి లభించగలవు.

★ స్ఫటిక లింగాన్ని పూజిస్తే కీర్తి, కోరిన కోర్కెలు సఫలము కాగలవు.

★ మంచు శివలింగాన్ని అనగా అమర్‌నాథ్‌లోని స్వామిని దర్శించినచో మహాశివుని కోరికతో పార్వతి దేవి అష్టలక్ష్ముల ఆశీర్వాదాలను కూడా ఇవ్వగలదు.

★ అష్టలోహలింగాన్ని పూజించి అభిషేకిస్తే శరీర బాధలు, అంటు వ్యాధులూ, మానసిక వ్యాధులూ నశిస్తాయి.

★ ఖండ శర్కర (పటిక బెల్లం) లింగాన్ని పూజిస్తే ఆరోగ్యశాంతి, కుటుంబ శాంతి, సంతాన ఫలము లభించగలవు.



★ గుమ్మడి శివలింగాన్ని పూజించినచో ధన ధాన్యాలు రెట్టింపుకాగలవు. గుమ్మడి కాయను శివలింగంగా నిర్మించుకొని, ఆపై ఆవుపాలతో అభిషేకించి, విభూతి రాసి పూజించాలి.

★ గోమయంతో శివలింగాన్ని స్థాపించి ఆరాధించినచో ఆనందమూ, ఆరోగ్యము, వివాహం కానివారికి మంచి వరునితో వివాహం కాగలదు.

★ కొబ్బరి శివలింగము ముఖ్యంగా పాత కొబ్బరికాయను శివలింగముగా పూజిస్తే పుట్టే సంతానము మహా ప్రయోజకులుగా, శక్తివంతులుగా కాగలరు.

## 1434. మానవులు ఆచరించకూడని అనారోగ్యకర అలవాట్లు

**జ.**★ దాన, దైవ, పూజ, జప, హోమ సమయాల్లో అంచులేని వస్త్రాలను ధరించ కూడదు.

★ పుట్టిన రోజునాడు, సంక్రాంతి పర్వ దినాన, పురుటి రోజు, శ్రాద్ధములప్పుడు వేడి నీటి స్నానం చేయరాదు.

★ కంచు పాత్రలలో పాలు, కొబ్బరి వంటి వస్తువులను తీసుకొనరాదు.

★ ఉసిరి పచ్చడిని ఆదివారం తినరాదు.

★ రసం వంటి వాటి మధ్య, పాయసం తినేటప్పుడు, పెరుగన్నము తినేటప్పుడు నీటిని త్రాగరాదు.

★ అమాయకులకు నోటికి వచ్చినట్లు అబద్ధాలు చెప్పి వారిని మోసపుచ్చరాదు.

★ స్త్రీ సహజంగా తాను ధరించాల్సిన ఆభరణాలు అనగా ముక్కుకి, చెవికి, మెడలో ఏమీ లేకుండా భర్తకు, సాటి స్త్రీలకు కనిపించరాదు.

★ ఒక గాజు ధరించకూడదు.

★ భర్తను వదలి దేవుని కూడా పూజించ రాదు.

★ స్త్రీలు వాడిన దుస్తులు పురుషులూ, పురుషులు వాడిన దుస్తులు స్త్రీలు వారు భార్యాభర్తలైనా సరే ఉప యోగించ కూడదు.

★ స్నానము చేయునపుడు కాలిపై కాలిని ఉంచి రుద్దుకొని శుభ్రపరచుకొన రాదు. చేతిని ఉపయోగించి శుభ్ర పరచు కొనవలెను.

★ ఉదయం, సాయంత్రం వాకిలిని ఊడ్చి, కళ్ళాపిచల్లి, ముగ్గులువేయనిచో లక్ష్మీ కటాక్షము లభించదు.

★ ధూపం లేకుండా పూజను ముగించరాదు.

★ ఆలయంలో ప్రదక్షిణలు చేయుచున్న ప్పుడు గర్భాలయ వెనుకభాగం స్పృశించ కూడదు.

★ అన్నం ఉడికేటప్పుడు మౌనంగా ఉండాలి.

★ మంగళ, శుక్రవారాలు సముద్ర స్నానం చేయరాదు.

★ భోజనం తర్వాత చేతిని నాకరాదు.

★ ఒక గాజును ధరించకూడదు.

## 1435. ఏ కార్యం నెరవేరాలంటే ఎక్కడ స్నానం చేయాలి?

**జ.**★ విజయాన్ని కాంక్షించేవారు తీర్థ జలంలో స్నానం చేయాలి.

★ సంతానం కోరే వారు సముద్ర స్నానం చేయాలి.


★ విద్యను ఆశించేవారు నదీతీర ప్రాంతంలో ఒడ్డున ఉండి మాత్రమే స్నానము చేయాలి.

★ అనారోగ్యము తగ్గటం కోసం వర్షంలో స్నానం చేయాలి.

★ అనేక గ్రహబాధల కోసం దేవాల యాల్లోని బావి వద్ద స్నానం చేయాలి.

## 1436. తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామివారికి రోజులో ఎన్నిసార్లు పూజాదికములు నిర్వహిస్తారు?

**జ.** తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి పూజలు వైఖానస ఆగమనం



ప్రకారం జరుగుతాయి. రోజులో ఆరు సార్లు పూజలు నిర్వహిస్తారు. అవి ప్రత్యూష పూజలు, ప్రభాత పూజలు, మధ్యాహ్న పూజలు, అపరాహ్న పూజలు, సాయం కాల పూజలు, అర్థరాత్రి పూజలు చేస్తారు.

### 1437. దేవీ నవరాత్రులలో అమ్మవారికి ఏ రోజు ఏ మాలను వేయాలి?

**జ.**★ మొదటిరోజు అమ్మవారికి బిల్వ దళములు లేదా మల్లెలతో కట్టిన మాలను వేయాలి.



★ రెండవ రోజు జాజి పూలతో చేసిన మాల లేదా తులసీ మాల.

★ మూడవ రోజు సంపెంగీ, మరువం మాల.

★ నాల్గవ రోజు సన్నజాజులతో చేసిన మాల.

★ ఐదవ రోజున మరువంతో కూడిన కదంబమాల.

★ ఆరవ రోజున మందార మాల.

★ ఏడవ రోజున మొగలిపూల మాల.

★ ఎనిమిద రోజున గులాబీలతో చేసిన మాల.

★ తొమ్మిదివ రోజున నేరేడు ఆకులను మాలగా చేసి అమ్మవారికి సమర్పించాలి.

### 1438. తడి బట్టలతో చేయకూడని పనులు

**జ.**★ తదియనాడు తడిబట్టతో దొండకాయ తినరాదు.

★ తడి దుస్తులతో భుజిస్తే దరిద్రం ఆవహించగలదు.

★ తడిబట్టలతో తిరిగితే నగ్నత్వ దోషం కలుగును.

★ తడి బట్టలను తూర్పు, ఉత్తరములందు మాత్రమే ఆరవేయవలెను.

★ తడి బట్టలను భుజం మీద ఉంచుకొనినచో నరాలపోటు సంభవించగలదు.

### 1439.ఈ ప్రపంచంలో అతి కష్టమైన, తేలికైన ఒకే పని ఏమిటి ?

**జ.** అతి కష్టమైన, తేలికైనపని కూడా ధనం సంపాదించటమే. అట్లే అన్నింటి కన్నా కష్టమైన పని ధర్మంగా ఉండటం, తేలికైన పని అధర్మంగా ఉండటం.

### 1440. తల్లీ తండ్రి వేరు వేరు కులాలైనప్పుడు పుట్టే బిడ్డ కులం ఏది ?

**జ.** క్షేత్రము ఎవ్వరిదైనా వేసే విత్తనాన్ని బట్టే మొక్క వస్తుంది. దీనిని బట్టి జన్మించే శిశువు భర్త కులానికి చెందుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

### 1441. కుళాయి నుండి వచ్చిన నీటితో స్వామికి అభిషేకం చేయకూడదా?

**జ.** కుళాయి, బావి నుండి తెచ్చిన నీటితో స్వామికి అభిషేకం చేస్తే దోషం. ఆ నీటిలో అనేక దోషాలు ఉంటాయి. ఈ నీటిని శుద్ధం చేయటానికి మంత్రోచ్చాటన ఉన్నది. అది పూర్తి అయిన తరువాత నీరు స్వచ్ఛమౌతుంది. అప్పుడు మాత్రమే స్వామిని అ నీటితో అభిషేకించాలి.

అందుకే గృహస్తులు అభిషేకాదులను స్వయంగా నిర్వహించ కూడదని చెబుతారు. అర్చకస్వాముల ఆధ్వర్యంలో చేయాలని చెబుతారు.

### 1442. ఎవరెవరికి ఎలా దణ్ణం పెట్టాలి?

**జ.** భగవంతునికి శిరస్సువంచి పది నుంచి పన్నెండు అంగుళాలు చేతులెత్తి నమస్కరించాలి. విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ముఖానికి ఎదురుగా చేతులు జోడించి నమస్కరించాలి. సన్యాసులకూ,



భాగవత ప్రవచనాలను చెప్పువారికీ, ధర్మాలను చెప్పేవారికీ వక్షస్థలం వద్ద చేతులు ఉంచి నమస్కరించాలి. తండ్రికీ, తల్లికీ పెదవుల మధ్యగా చేతులు ఉంచి నమస్కరించాలి. అధర్మపరులకు, అబద్ధాలు చెప్పేవారికి, గొడవలు పెట్టే వారికి కనులు పైకెత్తి పలుకరించి నమస్కరించాలి.

### 1443. దైవ దర్శనానికి వెళ్ళి దర్శనం చేయకుండానే వెనుతిరుగ వచ్చా?

**జ.** మనం దైవ దర్శనానికి అనుకొని దేవాలయమునకు వెళ్ళినపుడు, అచ్చట విపరీతమైన రద్దీ కారణంగానో, గుడి మూసిన కారణం వలననో లేదా మరే కారణం చేతనో దర్శనం లేకుండానే వెనుతిరుగవలసిన సందర్భం రావచ్చు. అలాంటప్పుడు దైవస్మరణం చేసుకొని ఓ చిన్న మొక్కు మొక్కుకొని ఇంట్లో ముడుపు కట్టి, దేవుడి దగ్గరకు మరల వెళ్ళినపుడు ఈ ముడుపును సమర్పించాలి.

### 1444. నిద్రలేవగానే చూడాల్సిన వస్తువులు

**జ.** సూర్యుడు, బంగారము, సముద్రము, ఎర్ర చందనము, ఆలయ గోపురం, పర్వతము, ఆవుదూడ, కుడిచేయి, ధర్మపత్ని .. మొదలగు వానిని చూసిన ఆ రోజు శుభ ఫలితాలు కలుగును. జట్టు విరబోసుకొని ఉన్న భార్య, బొట్టులేని ఆడపిల్ల, ఇల్లు ఊడ్వని ప్రదేశాలను చూచుటవల్ల ఆ రోజు అనేక కష్టములు సంభవించగలవు.

### 1445. పూజాదికాల్లో గోత్రనామాలు ఎందుకు?

**జ.** మనం పుణ్యాలు చేస్తే పుణ్యాల చిట్టా, పాపాలుచేస్తే పాపాల చిట్టా తయారు అవుతుంది. పాపాల చిట్టా తయారు చేయటానికి చిత్రగుప్తుడు ఉన్నాడు. అట్లే పుణ్యాల చిట్టా తయారు చేయటానికి సర్వ దేవతా రూపాలు ఉన్నాయి. మనం ఇతరులకు చేసే సహాయ సహకారాలు, దానం, ధర్మము, యజ్ఞ యాగాదులవల్ల మనకు పుణ్యం లభిస్తుంది. ఈ పుణ్యాలు మనం చిట్టాలోకి ఎక్కాలంటే పూజాది

కాల్లో మన చెప్పే గోత్రనామమే శరణ్యం. దాని ద్వారానే మనకు పుణ్యాదికాలు చేరతాయి.

## 1446. చూపుడు వ్రేలిని ధర్మ కార్యాలలో ఉపయోగించకూడదా ?

**జ.** మనం కోపావేశాలలో ఊగిపోయి, ఇత



రులను బెదిరించుటకు చూపుడు వ్రేలును చూపి హెచ్చరిస్తాము. అంటే ఆవేశానికి, కోపానికీ, క్రోధానికి చూపుడు వ్రేలు ప్రతీకగా నిలుస్తుంది. అందుకే దైవ కార్యాలలో, జపాలలో, ధర్మకార్యా లలో, ముఖానికి బొట్టు మొదలగునవి ధరించేటప్పుడు, ఆరోగ్య సంబంధిత మందులు ఉపయోగించేటప్పుడు చూపుడు వ్రేలికి పని చెప్పక పోవటం మేలు.

## 1447. సకాలంలో వివాహం జరగాలంటే ఈ మంత్రం చదవాలి

**జ.** ఓం మూలీ మూలీ మహామూలీ సర్వం సంక్షోభయ సంక్షోభయ ఉపద్రవేభ్యః స్వాహా. శుక్రవారం లేదా శనివారం తలారా స్నానం చేసి ఇష్టదైవం ముందు ఈ మంత్రాన్ని 108 సార్లు జపించాలని చెబుతారు.

## 1448. నైవేద్యాలలో ఎన్ని రకాలు ఉన్నాయి?

**జ.** నైవేద్యాలు రెండు రకాలు. 1. మహా నైవేద్యము. 2. సాధారణ నైవేద్యము. మహా నైవేద్యాన్ని రకరకాల భక్ష్యాలతో, చేష్యాలతో, లేహ్యాలతో కూడి ఉంటుంది. సాధారణ నైవేద్యంలో పంచదార, బెల్లం, అరటిపండువంటి సాధారణ వస్తువులు ఉంటాయి.

## 1449. మన దేవాలయాల్లోకి వేరే దేశస్తులు ప్రవేశించకూడదా ?

**జ.** మన దేవతా మూర్తులు ఎంతో సుందరంగా, పవిత్రంగా, సరళంగా, హృద్యంగా, రమ్యంగా ఉంటాయి. మనము భక్తి, భయము, శ్రద్ధ అనే దృష్టితోనే ఆ రూపాలను దర్శించుకుం టాము. పర దేశీయలకు మన దేవతా మూర్తులంటే భక్తి ఉండదు. అందువలన వారు చూసే చూపులో దోషము ఉండును. వారు విగ్రహంలో ఉన్న అందచందాలను మాత్రమే చూస్తారు. అట్టి దృష్టిలో దేవతా మూర్తులను చూడరాదనే భావంతో పెద్దలు ఈ నిషేధం విధించారు.

## 1450.పునాదులకై నేలను త్రవ్విన తరువాత కొంత కాలం ఆగడము ఎందుకు ?

**జ.** ఇల్లు నిర్మించాలంటే ముందుగా చేయవలసినపని పునాదులు తవ్వటము. ఎంత లోతుగా పునాదులు తీస్తే ఆ ఇల్లు అంత దృఢంగా ఉంటుంది. ఈ విధంగా పునాదులకై గుంటలు తీసిన వెంటనే పునాదులు నిర్మించరాదని, కొద్దికాలం ఆగాలని మన పెద్దలు అంటారు. ఈ చర్య వెనుక ఒక నైతిక సూత్రం దాగి ఉంది.

భూమిలోపల అనేకమైన ప్రాణులు ఉంటాయి. అది వాటి నివాసం. ఇంటి కొరకు పునాదులు త్రవ్వినపుడు అవి తమ ఆవాసాన్ని కోల్పోతాయి. కొద్ది రోజులు ఎడం ఇచ్చిన తరువాత నిర్మాణం కొన సాగిస్తే ఈ లోపు ప్రాణులు వేరే నివా సానికి మారగలవు.

## 1451. పారాణి పెట్టుటలోని మర్మం?

**జ.** పసుపులో సున్నం కలిపితే పారాణి తయారవుతుంది. వివాహ సమయంలో వధూవరులకు, ఆడపడుచులకూ, వియ్యపురాలికి, ఇంకా శ్రావణ మాసంలో పూజా కార్యక్రమాల సమయంలో ముత్తై దువుల కాళ్ళకి పారాణి పెట్టటం మన



సంప్రదాయం. కాలివేళ్ళ నరాలకీ, హృదయానికి, గర్భాశయానికీ అవినా భావ సంబంధం ఉండటంవల్ల ఆ భాగాల్లో ఉన్న అనేక రుగ్మతల వల్ల మనసు వికలం అవ్వకుండా పారాణి పెడ తారు. ఈ పారాణివల్ల కాలి పగుళ్ళు రా కుండా పాదాలు సున్నితంగా, అందంగా తయారు కాగలవు.

## 1452. వీరితో ఎప్పుడూ గొడవలు పడకూడదు

**జ.** సంతానానికి విద్యను నేర్పుతున్న గురువుతోను; పూజాదికాలు నిర్వహించే బ్రాహ్మణులతోను; తల్లి, తండ్రి, అత్తా, మామలతోను; బావమరుదులు, ముఖ్య స్నేహితులతోను; సోదరులు, ఆడపడు చుల తోనూ; ప్రభుత్వ అధికారులతోను, ఇంటికి ఇరువైపులా ఉన్నవారితోను గొడవ పడేలా వారితో ప్రవర్తించకూడదు.

## 1453. కుంతి ముగ్గురు పుత్రుల తరువాత ఇక సంతతి చాలు అన్నదా ?

**జ.** ముగ్గురు పుత్రులను ముగ్గురు పురు షుల ద్వారా పొందిన స్త్రీ ధర్మ శాస్త్రాల ప్రకారం మళ్ళీ సంతానవంతు రాలైనచో స్వైరిణి అవుతుంది. అదే అయిదుగురు పుత్రులను అయిదుగురు పురుషుల ద్వారా పొందితే వేశ్య అవుతుంది. అందుకే మాద్రి ఒకే మంత్రంతో అశ్వనీ దేవతలను ప్రార్థించి తను స్వైరిణి కాకుండా ఒకేసారి నకుల సహదేవులకు జన్మనిచ్చింది.

## 1454. ఆహారాన్ని కూర్చోనే తినాలా?

**జ.** ఆవుపేడతో అలికి ఉన్న నేలపై, అరటి ఆకులో అన్నం వడ్డించుకొని బాసెంపట్లు వేసికూర్చున్న విధానంలో కూర్చొని ఉండి భోజనం చేయడం మన సంప్రదాయం. కానీ పాశ్చాత్య సంస్కృతీ ప్రభావంతో

'బఫే' మనకు సర్వసాధారణమైపోయింది. ఆధునిక వైద్యశాస్త్రం ప్రకారం మనం ఏ పదార్థమైనా తింటున్నప్పుడు శరీరంలోని కీళ్ళు కావలసినంతగా కదలికలు పొందు తాయి. నిలబడి తినటం లాంటి అల వాట్లు కీళ్ళకు ఎక్కువ శ్రమను కలిగి స్తాయి. కూర్చొని తినటం వల్ల ఈ కీళ్ళకు శ్రమ కలగకుండా ఉంటుంది. నిలబడి తినటం వల్ల ఎక్కువ ఆహారం తినటం జరుగుతుంది. అతిగా తినటం ఆరో గ్యానికి హానికరం.

## 1455. మామిడి పండును ఇతరులకు ఇచ్చాక లేదా దానమిచ్చాకగాని ఎందుకు తినరు?

**జ.** ఎండాకాలంలో వచ్చే మామిడి పండును స్వామికి సమర్పించిగానీ, దానంగా ఇచ్చిగానీ తినటం జరుగదు. దానికి కారణం వైశాఖ మాసంలో అనగా సంవత్సరంలో ఒక్కసారే వచ్చే ఈ పండును దానమిస్తే దేవతలు సంతృప్తులు



కాగలరు. ఇంకా మామిడి పండునే కాక పండును దానమిచ్చినా వారి పితృ దేవ తలు పరమానందం చెందుతారు. అలాగే దోస, బెల్లం, చెరకు వంటివి దానం చేస్తే పాపాలు నశిస్తాయి. అలాగే ఈ మాసంలో మజ్జిగను దానమిస్తే అపరాధన లాభమని శాస్త్రాలు శెలవిస్తున్నాయి.

## 1456. పురుషునికిగల పదహారు సద్గుణాలు ఏవి?

**జ.** పురుషునకు పదహారు సుగుణాలు ఉండాలని చెబుతారు. అవి 1. సద్గు ణమూ 2. పరాక్రమము 3. ధర్మమూ 4. ఉపకారి 5. అసత్యం ఆడకుండుట 6. నియమ నిష్ఠలతో గడుపుట 7. శత్రువులు కూడా వంక పెట్టని వాడుగా ఉండుట 8. సకల జీవకోటికి ఉపకారం చేయువాడుగా ఉండుట 9. వేదాలను చదివిన వాడు 10. అందగాడు 11. ఆజాను బాహుడు 12. ప్రేమతత్వం కలవాడు 13. కోపాన్ని అదుపులో పెట్టువాడు 14. స్పష్టంగా పలికేవాడు 15. అసూయ లేనివాడు 16. యుద్ధానికి సిద్ధమైతే దేవతలందరు కలసి వచ్చినా భయపడనివాడు. ఈ పదహారు గుణాలు న్నది ఒక్క శ్రీరామునిలోనే.

## 1457. విభూదిని శరీరమంతా పులుమ వచ్చా?

**జ.** విభూదిని శరీరమంతా పులుము కొనుట వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నా యని శాస్త్రీయంగా నిరూపితమైన దని

తెలుస్తుంది. నుదుటిపై విభూదిని ధరిస్తే అది అక్కడి తేమను గ్రహిస్తుంది, మెడ వెనుక భాగాన పూస్తే అక్కడి తేమను గ్రహించి అక్కడ చర్మ వ్యాధులు మొదలగునవి రాకుండా నిరోధిస్తుంది. చెవుల వద్ద 72 వేల నాడులు కలుస్తాయి. వాపు లేక కొవ్వు ప్రతి నాడిలోఉండి కీళ్ళవాపుకు దారి తీస్తుంది. విభూది వాడకం వల్ల ఈ సమస్య రాకుండా ఉంటుంది. కావున శరీరంలోని వివిధ భాగాలలో శరీర మంతా పవిత్ర విభూదిని ధరించటం వల్ల శరీరానికి వ్యాధి నిరోధక ఔషధము వాడినట్లయి అనేకరోగముల బారిన పడకుండా కాపాడుతుంది.

### 1458. మూడు రంగుల దారం, ఏడు పేటల వత్తితో ప్రమిద వెలిగిస్తే ప్రయోజనము ఏమిటి?

**జ.** ఇంట్లో యజమానికి జబ్బు చేసినచో మూడు రంగుల దారాలతో, ఏడు పేటల వత్తి చేసి నెయ్యి, నూనె, ఆముదంగల మట్టి ప్రమిదలలో వత్తి చేసి వెలిగిస్తారు. పురాతనమైన ఈ సంప్రదాయంలో తమ వారంటే తమకు ఉన్న ప్రేమను తెలియ చెప్పే చర్య కనబడుతుంది. ఈ చర్యతో గృహ యజమాని జబ్బునుండి కోలుకో గలడని నమ్ముతారు.

### 1459. పిల్లలకు దంతాలు త్వరగా వస్తే మాటలు ఆలస్యంగా వస్తాయా?

**జ.** కొందరు పిల్లలకు దంతాలు త్వరగా వస్తాయి మరికొందరికి ఆలస్యంగా




వస్తాయి. విశ్వాసం ప్రకారం దంతాలు తొందరగా వచ్చిన పిల్లలకు మాటలు ఆలస్యంగా వస్తాయని. ఇది కేవలం విశ్వాసం మాత్రమే కాక వాస్తవమైన విషయంగా పరిగణింపబడుతున్నది. తొందరగా దంతాలు రావటం వల్ల నాలుక స్వేచ్ఛగా కదలలేక మాటలను పలకటంలో కొంత సమయం విలంబము కాగలదు.

### 1460. తాంబూలాన్ని సేవించ కూడని వారు ?

**జ.** పళ్ళు బలంగా లేనివారు, పంటి జబ్బుల వారు, కంటిరోగాలు కలవారు, విరోచనములకు మందులు వాడువారు, ఆకలి కలవారు తాంబూలమును సేవించ రాదని ఆయుర్వేదము చెబుతుంది. అలాంటి వారు తాంబూలమును సేవించినచో కంటి చూపు తగ్గుతుంది, జుట్టు పలచబడుతుంది, దంతాలలో శక్తి తగ్గి దేహములో శక్తి సన్నగిల్లుతుంది.

## 1461. నిష్క్రమణ సంస్కారం అంటే ఏమిటి?

**జ.** శిశువు యొక్క నాల్గవ నెల సూర్యోదయ సమయంలో ఇంటిలోని గాలి, వెలుతురు బాగుగా వచ్చే ప్రదేశంలో శిశువును తెచ్చి సూర్యునికి ఎదురుగా పరుండబెట్టి శిశువు దేహమంతా సూర్యకాంతి సోకేలా చేస్తారు. ఈ కార్యాన్నే నిష్క్రమణ సంస్కారం అంటారు. చూడటానికి వింతగా ఉన్నా ఈ సంస్కారం వల్ల శిశువుకు సూర్యకాంతి లోని విటమిన్ 'డి' లభించి శిశువు ఎదుగుదలకు తోడ్పడుతుంది. అప్పటివరకు శరీరం మరీ సున్నితంగా ఉంటుంది కాబట్టి సూర్యకాంతిని కూడా భరించలేదు. నాల్గునెలల కాలం తరువాత శిశువు శరీరం సూర్యకాంతిని స్వీకరించటానికి సిద్ధమౌతుంది. అదే రోజు రాత్రి చంద్రునికి కూడా శిశువు శరీరాన్ని చూపించటం జరుగుతుంది. ఇదీ బాహ్యంగా శరీరానికి జరిగే మేలు. ఇక అంతర్గతంగా సూర్యునిలో ఉన్న సద్గుణాలు అంటే సత్యానికి (క్రమం తప్పకుండా ప్రతీరోజూ ఉదయిస్తాడు కాబట్టి), సామ



ర్థ్యానికి (ప్రకాశవంతంగా ప్రకాశిస్తాడు కాబట్టి), ఉత్సాహానికి (సోమరితనం సూర్యునిలో లేదు కాబట్టి) మరియు తపస్సుకు (క్రమం తప్పని సత్ కర్మలను అందిస్తాడు కాబట్టి) అలవడతాయని మనవారి నమ్మకం.

## 1462. ఏ వ్యక్తికీ తెలియని ఐదు విషయాలు

**జ.** ప్రపంచంలోని ఏ వ్యక్తి అయినా, అతడు ఎంత సంపాదించినా, ఎంత హోదాలో ఉన్నా ఐదు విషయాలు అతనికి తెలియవు. అవి 1. జీవించే వయసు. 2. రోగాలు. 3. చావురాకడ 4. శరీరంలో పతనావస్థలు. 5. మరణించాక జరిగే సంగతులు.

## 1463. మర్రిచెట్టు చుట్టూ ప్రదక్షిణము చేస్తే ప్రయోజనము ఏమిటి ?

**జ.** సాధారణంగా అన్ని దేవాలయాలలో మర్రిచెట్లు పెంచబడి ఉంటాయి. ఇటువంటి మర్రిచెట్ల చుట్టూ ప్రదక్షిణము చేయాలని ఋషులు ఓ నియమం పెట్టారు. దీనికి నిజమైన ఓ ప్రయోజనం ఉంది. మర్రిచెట్టునుండి ఆక్సిజన్ పుష్కలంగా ఉత్పన్నమౌతుంది. అలాగే మర్రి మనకు చల్లని నీడను కూడా ఇస్తుంది. మర్రిచెట్టు ఆక్సిజన్‌తో పాటుగా కొద్ది మొత్తంలో ప్రాణవాయువు ఘనీభూత రూపాన్ని వెల్లడిస్తుంది. గాలియొక్క సాంద్రత కంటే ఘనీభూత రూప ప్రాణవాయువు యొక్క సాంద్రత ఎక్కువగా ఉండటం వలన అది చుట్టూతా ఉన్న గాలిని శుద్ధి చేయడమేకాక మన ఊపిరి తిత్తులలో ఉన్న సూక్ష్మక్రిములను నాశనం

చేస్తుంది. ఈ కారణంగా మన పూర్వులు మఱ్ఱిచెట్టుకు ప్రదక్షిణము చేయమని చెబుతారు.

## 1464. ఇంటికోడలిని శనివారం రోజు ఆమె పుట్టింటికి పంపకూడదా?

**జ.** వారంలో శనివారానికి ఒక ప్రత్యేకత ఉంది. శనివారంలో శనిగ్రహం యొక్క ప్రసన్నతకై ఉపవాస దీక్ష చేస్తారు. అనేక రకాలైన పూజలను కూడా శనివారమే



చేస్తారు. ఈ పూజలు, దీక్షలను నిర్వహించటంలో ఆ ఇంటి కోడలే ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఆ ఇంటి వారికి కావలసిన సరంజామా సమకూర్చటంతో పాటు అనేక విధాలుగా సహాయకారిణిగా ఆమె వ్యవహరిస్తుంది. ఆమె పుట్టింటికి ఇంత ప్రాధాన్యతగల శనివారం వెళ్ళితే ఆ ఇంటిలో పూజాదికాలు నిర్వహించటం కష్టమనే భావంతో కోడలిని శనివారం పుట్టింటికి పంపటం జరిగేది కాదు.

## 1465. భార్యకు ఏడవ నెల వస్తే భర్త పూజాదికాలు చేయకూడదా?

**జ.** చేయకూడదనే చెబుతున్నారు. దీనికి కారణం ఏడవ నెలలోనే గర్భములో ఉన్న బిడ్డ సంపూర్ణ రూపును సంతరించుకుంటుంది. ఇక ఆ సమయం నుండి ప్రతి దినము ఎంతో కీలకమైనది. అలాంటప్పుడు భర్త పూజాదికాలూ, దీక్షలూ చేయవద్దు అనటానికి కారణం ఆ సమయంలో గర్భిణీ స్త్రీకి పూర్తి విశ్రాంతి కావాలి. తను స్వయంగా పూజాదికాలు నిర్వహించకపోయినా భర్త పూజలు నిర్వహిస్తే ఎంతో కొంత సహాయ పడక తప్పదు. ఆ అధిక శ్రమ కూడా ఆమె తట్టుకొనలేదు కనుక భర్త చేయు పూజాదికాలు ఏడవ నెల నుంచే చేయ రాదని నిషేధం విధించారు.

## 1466. తుమ్మునప్పుడు ముఖభాగాన్ని ఎందుకు కప్పుకోవాలి?

**జ.** మనం తుమ్ముతున్నప్పుడు చేతితోనో, రుమాలుతోనో ముఖాన్ని కప్పుకొనుట అవసరం. లేకుంటే ఇతరులు వికారంగా మనల్ని చూస్తారు. ప్రతి మనిషికి ఏదో ఒక చిన్న అనారోగ్యం ఉంటుంది. తుమ్మినపుడు ఆ వ్యక్తిలోని రోగక్రిములు కూడా కొంత వరకు బయటకు నెట్టబడతాయి. అలా తుమ్మి తన రోగ క్రిములను బయటకు విడిచి అతని చుట్టు ప్రక్కల ఉన్నవారికి అవి సోకేలా చేయటం

జరుగుతుంది. తుమ్మును మనం ఎట్టి పరిస్థితులలోను ఆపుకోలేముకాబట్టి ముఖాన్ని ఏదోలా కప్పి తుమ్మినట్లయితే ఇతరులకు ఇబ్బంది కలిగించని వాడవుతాడు.

## 1467. హీరవాయువు ఏ సమయంలో వీస్తుంది?

**జ.** సూర్యుడు ఉదయించక ముందు నాలుగు, అయిదు గంటలు సమయంలో అనగా బ్రహ్మ ముహూర్త సమయంలో



వీచే గాలి అమృతం వంటిది. దాన్నే ఋషులు హీరవాయువు అని అంటారు. ఈ ముహూర్తములో నిద్రలేచిన వారికి ఏ పని చేసినా ఆ పనిలో విజయం లభిస్తుంది, ఆయుష్షు వృద్ధి పొందుతుంది, బుద్ధి వికసిస్తుంది.

## 1468. సామూహిక ప్రార్థనలు రోగాల్ని నివారిస్తాయా ?

**జ.** కొన్ని రకాలైన రోగాలను సామూహిక ప్రార్థనలు నివారిస్తాయని ఒక విశ్వాసం ఉంది. ఈ సామూహిక ప్రార్థనల వల్ల వంటిలో వాపు మాయం కావటం, దీర్ఘ కాలిక వ్యాధులు నయంకావటం, హై బ్లడ్ ప్రెషర్ మరియు అలాంటి సమస్యలు తొలగినట్లుగా నిర్ధారణ అవుతున్నది. నిజానికి ఇలాంటి చికిత్సలలో రోగికి వైద్యునిపై విశ్వాసం లేకపోతే ఇలాంటి అద్భుతాలకి అవకాశమే లేదు. శ్రావ్యమైన సంగీతంతో కూడిన లయలో మైమరచి రోగి ఓ విచిత్ర భావన స్థితిలోకి జారుతాడు. దృఢ విశ్వాసంతో రోగి స్వస్థ తను పొందుతాడు. ఇలాంటి చికిత్సా విధానాన్ని మానసిక వైద్యులు సైతం గుర్తించారు. సామూహిక ప్రార్థనలలో మానసిక చికిత్స సంబంధమైన విషయాలు దాగి ఉన్నాయని మనకు తెలుస్తుంది. ఈ విషయమే ప్రార్థనల విజ యంలో కీలక పాత్ర పోషిస్తున్నది.

## 1469. నిద్రించవలసిన పద్ధతి ఏది?

**జ.** తల భాగము ఎత్తుగా, శరీర భాగము దిగువగా ఉండేలా నిద్రించాలి. దూలమూ, పై కప్పులేని ప్రదేశాల్లోనూ, వృక్షముల క్రింద నిద్రించకూడదు. నిద్రకు ఉపయోగించే మంచము మర్రి, జువ్వి, నేరేడు వంటి వృక్షములతో చేసినది అయి ఉండాలని శాస్త్రం చెబుతోంది. ధాన్యపు బస్తాల మీద నిద్రించకూడదు. రాతి మీద, సింహ ద్వారంపైతల ఉంచి నిద్రించకూడదు. తలవైపు దీపం ఉండకుండా నిద్రించాలి. అందరూ కూర్చొని ఉన్నప్పుడు కటిక నేలపై నిద్రించకూడదు. శుభ కార్యాలప్పుడు స్త్రీల మధ్య నిద్రించకూడదు.

## 1470. పళ్ళు కొరకటం అనారోగ్యకరమా?

**జ.** కొందరికి కోపం వచ్చినపుడు పళ్ళు పటపటా కొరికే అలవాటు ఉంటుంది. ఇలా పళ్ళు కొరకటంవల్ల పళ్ళు అరిగి పోయే అవకాశం ఉంది. పళ్ళు అరిగి పోవటమే కాకుండా, పళ్ళ మొనలు విరిగి పోవటం, పంటిపై ఉండే పింగాణి పొర ఊడిపోవటం కూడా జరుగుతుంది. తద్వారా పంటికి సంబంధించిన అనేక వ్యాధులకు గురవటం జరుగుతుంది. పూర్వం పళ్ళు కొరకటం అనే క్రియ ఏదో దుష్టశక్తి యొక్క ప్రభావ మని నమ్మేవారు. ఈ విధంగా పళ్ళు కొరుకుతున్న వ్యక్తు లను వారిని ఆవహించిన దుష్టశక్తిని పార ద్రోలటానికి చీపురు మొదలగు వస్తు వుల తో చితక బాదేవారు. ఆ దెబ్బలకు తాళ లేక దయ్యం వారిని వదలిపోతుందనే భ్రమ వారికి ఉండేది. అయితే కొందరిలో ఈ చికిత్స పనిచేసి పళ్ళు కొరికే రుగ్మత పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. పళ్ళు కొరికే అలవాటుకు, ఇలా చితక బాదుటకు ఎలాంటి సంబంధము లేదు.

## 1471. శివాలయానికి వెళ్ళినప్పుడు మొదటగా దర్శించవలసింది నవగ్రహాలనా ?

**జ.** మహేశ్వరుడు ఆదిదేవుడు. సర్వాంత ర్యామి. కనుక ముందుగా దర్శించ వలసింది పరమేశ్వరునే. తరువాత నవ గ్రహాలను కొలవాలి. ఒక వేళ ముందుగా



నవగ్రహాలను కొలిచినా శివుని కరుణకు ఏ మాత్రం ఇబ్బంది కలుగదు. ముందుగా శివుని దర్శించినందుకు నవగ్రహాలు కూడా తమ స్వామిని ముందుగా కొలిచి నందుకు తమ కరుణను కూడా అనుగ్రహిస్తాయి.

## 1472. మైల ఉన్నవారిని తాకకూడదా ?

**జ.** ఆత్మీయులుగాని, బంధువులు గాని మరణించిన సందర్భములో ఉన్న వారిని మైల పడి ఉంటారని అంటారు. వీరిని తాకరాదనటానికి ఒక ఆరోగ్య సంబంధ మైన అంశము ఉన్నది. మైల పడిన వారు పూర్తి దుఃఖములో ఉంటారు. ఈ దుః ఖములో వారు కొన్నిసార్లు ఏడుస్తారు, స్నానాదికాలు సరిగా చేయరు, వస్త్రము లను సరిగా మార్చుకొనరు. ఇటువంటి సందర్భములో వారి వంటిపై అనేక మలినములు ఏర్పడవచ్చు. వాటిని తాకుట వల్ల మనకు అపకారం జరిగి, మన ద్వారా మన పిల్లలకు ఆరోగ్య హాని జరుగవచ్చుని పెద్దలు భావించి మైల ఉన్నవారిని తాకరాదని చెప్పి ఉండవచ్చును.

## 1473. ఓ వ్యక్తి పరిపూర్ణ విద్యావంతునిగా ఎప్పుడు కాగలడు ?

**జ.** గురువునుండి కొంత భాగం విద్యను; తనకు తాను కొంత విద్యా జ్ఞానాన్నీ; తోటి వారి నుండి కొంత జ్ఞానాన్నీ; పూర్తి జ్ఞానం



సమాజాన్నుంచి నేర్చుకొని మాత్రమే పరి పూర్ణ విద్యావంతుడు కాగలడు.

## 1474. బియ్యం తింటే తల్లికి హాని కలుగుతుందా?

**జ.** పిల్లలు ఎప్పుడూ చిరుతిండ్లు కావాలని మారం చేస్తుంటారు. వారికి ఈ చిరు తిండ్లు దొరకని సందర్భంలో బియ్యాన్ని తినేవారు. ఇలా బియ్యం తింటే తల్లికి హాని అని పిల్లలకు చెప్పేవారు. తల్లికి హాని విషయం అలా పెడితే బియ్యం వండక ముందు చాలా గట్టిగా ఉంటాయి. అటువంటి బియ్యాన్ని బొక్కడంవల్ల ఆ పచ్చిబియ్యం అరగక ఉదర సంబంధమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. సామా న్యంగా మనం బియ్యాన్ని వండే ముందు కనీసం రెండు మూడుసార్లన్నా బాగా కడిగి నానపెట్టి వండటం జరుగుతుంది. ఈ వండటానికి ముందే బియ్యాన్ని చాటలోవేసి బాగా చెరిగి, అందులోని రాళ్ళు మరియు దుమ్మూ ధూళి, మట్టి పెడ్డలు మొదలగు వానిని తొలగించి, శుభ్రపరచి అప్పుడు కాని బియ్యాన్ని కడగటం చేయరు. ఇంతగా శుద్ధిచేసి వాడవలసిన బియ్యాన్ని అలాగే పచ్చిగా తింటే వ్యాధుల బారిన పడక తప్పు తుందా? పిల్లలను ఇటువంటి పనులను చేయవద్దని హెచ్చరించుటకై నీవు బియ్యం తింటే నీ తల్లికి హాని జరుగు తుందని భయపెట్టి ఉండవచ్చు.

## 1475. గర్భిణీస్త్రీలు చెట్లు కొట్టుచున్నప్పుడు చూడకూడదా ?

**జ.** చూడకూడదనే శాస్త్రం చెబుతుంది. దీనికి వివరణను కూడా ఇచ్చింది. చెట్టు కొట్టుచున్నప్పుడు ఆ పరిసరాలలో గాని గర్భిణీస్త్రీలు ఉన్నప్పుడు ఒక వేళ ఆ చెట్టు విరిగి క్రింద పడుచున్నప్పుడు ఉరకలేక పోవటమే కాక తప్పించుకోలేరు. ఈ కారణమే కాక చెట్టు విరిగి క్రింద పడు చున్నప్పుడు ఉత్పన్నమయ్యే శబ్దం చాలా భయంకరంగా ఉంటుంది. ఈ శబ్దం గర్భంలోని శిశువు గుండె మరియు మెదడుపై శాశ్వతమైన చెడు ప్రభావాన్ని కలిగించవచ్చు. కాబట్టి నేటి వైద్యులు కూడా గర్భిణీస్త్రీలను విస్ఫోటనా శబ్దా లను,పెద్ద శబ్దాలను వినకుండా ఉండ మనే చెబుతారు.

## 1476. దేవాలయ సందర్శనం తరువాత స్నానం చేయకూడదా ?

**జ.** మనం ప్రతిరోజు ఉదయం, సాయం త్రం స్నానం చేస్తాము. ఎవరైనా మరణ వార్త వినిన తరువాత, శ్మశానమునకు వెళ్ళి వచ్చిన తరువాత కూడా స్నానం చేస్తాము. దేముని వాసమైన దేవాల యము పవిత్రమైనది. ఆ పవిత్రమైన ప్రదేశము నుండివచ్చిన తరువాత స్నానము చేసినచో ఆ పవిత్ర నశించ గలదు. అందుచే దేవాలయమును దర్శిం చిన తరువాత స్నానము చేయకూడదు.

## 1477. నవరత్నాలు ధరించినచో అవి ఎన్నిరోజులలో తమ ప్రభావాన్ని చూపుతాయని చెబుతారు?

**జ.** రత్నశాస్త్రప్రకారము నవరత్నాలు తమ ప్రభావాన్ని చూపగలవు. అయితే అవి అసలైన రత్నాలై ఉండాలి. ముత్యము ముచ్చటగా మూడు రోజులలో తన ప్రభా



వాన్ని చూపగలదు, వైఢూర్యము నెల రోజులలోను, వజ్రము ఇరవై రెండు రోజు లలోను, గోమేధికము ఇరవై తొమ్మిది రోజులలోను, నీలము మూడు రోజుల లోను, పుష్యరాగము ఏకాదశి, ద్వాదశి మధ్య రోజులలోను, మరకతము వారం రోజులలోను, పగడము ఇరవైఒక్క రోజు లలోను, మణిక్యము రెండు ఏకాదశుల లోను తన ప్రభావాన్ని చూపగలవు అని చెబుతారు.

## 1478. గోళ్ళను ఇంటిలోపల తీయకూడదా?

**జ.** గోళ్ళను ఇంటిలోపల తీయరాదన టంలో ఒక శాస్త్రీయ కారణం ఉంది. మన గోళ్ళు ఆహారం రంగులో సులభంగా కలసిపోతాయి. పొరపాటున ఇంట్లో తీసిన గోళ్ళు ఆహార పదార్థాలలో మిశ్రమమై పోయి కడుపులోనికి పోయే అవకాశం ఉంది. అదే విధంగా కత్తిరిం చిన చిన్న చిన్న వెంట్రుక ముక్కలు కూడా ఆహారం ద్వారా కడుపులోనికి వెళ్ళి ప్రేగులకు అంటుకొనిపోయే అవకాశం కూడా ఉంది. కాలిగోళ్ళు కడుపులోనికి వెళ్ళి జీర్ణంకావు. జీర్ణం కాకుండా కడు పులో ఉండిపోతే శాశ్వత ఉదర సమ స్యలు రావచ్చు. అలా కాకుండా బయ టకు మలద్వారం గుండా విసర్జింప బడినా, విసర్జించే సమయంలో లోపలి ప్రేగుకు హాని జరుగవచ్చు. ఇంతే కాకుండా గోళ్ళలో కొద్దిపాటి విషం ఉంటుంది. ఇంట్లో నేలమీద పారాడే పసి

పాపలకు గోళ్ళు గ్రుచ్చుకొని విష జ్వరాలు వచ్చే అవకాశాలు కూడా ఉంటాయి. చిన్న పాపలు తెలియక నేలమీద పడి వున్న గోరును బాల్య చాపల్యంతో మ్రింగ వచ్చు ... ఇలాంటి అనేక సమస్యలు తలెత్త వచ్చును కావునా గోళ్ళను ఇంట్లో తీయకపోవటమే మంచిది.

## 1479. స్త్రీ ధనము క్రిందకు ఏమేమి వస్తాయి?

**జ.** ★ వివాహ సమయంలో తల్లి, తండ్రి పెట్టిన నగలు.

★ అన్నదమ్ములు, బాబాయిలు ఇచ్చిన సొమ్ము.

★ వ్రతాలూ, నోములప్పుడు పుట్టింటి వారు ఇచ్చిన సొమ్ము.

★ తల్లికి సంబంధించిన ధనముపై పుత్రికల వాటా.

★ భర్త సంతోషముగా ఇచ్చిన ధనము.

## 1480. రావిచెట్టూ, వేపచెట్టూ కలిసున్న దగ్గర ప్రదక్షిణలు చేస్తే పిల్లలు పుడతారా ?

**జ.** పిల్లలు సరైనసమయంలో కలుగని స్త్రీలు తమకు సంతానం కలగాలని రావి చెట్టు, వేపచెట్టు కలసిన దగ్గర 68 సార్లు ప్రదక్షిణం చేయడం చాలా రోజుల నుండి మనం చూస్తున్నదే. దీనికి వైద్య కారణాన్ని వెదకితే రావిచెట్టు పురుష అంశ కలది. వేపచెట్టు స్త్రీ అంశ కలది. రెండూ కలసిన ప్రదేశంవద్ద ప్రదక్షిణలు చేయటం వల్ల శరీరం వాటి నుంచి అమ్లజనితము గ్రహిస్తుంది. గర్భదోషాలను అరికడుతుంది. ఎక్కువసేపు, ఎక్కువ రోజులు ప్రదక్షిణలు చేయటం ద్వారా వాటిపై నుండి పడిన సూర్య కిరణముల వల్ల గర్భకోశ శక్తి పెరిగి సంతానవంతులయ్యే అవకాశం అధికంగా ఉంటుందని కొందరు అంటారు.

## 1481.పేరంటంలో చిమ్మలిని ఎందుకు పెడతారు ?

**జ.** శనికి ఇష్టమైనవి నువ్వులు. ఆ నువ్వులని ఎవ్వరూ దానం తీసుకోవటానికి సాహసించరు. ఇష్టపడరు. అందుకే అందులో బెల్లం, కొబ్బరి లాంటివి చేర్చి చిమ్మిరి ఉండగా చేసి, దానితో పాటు



శెనగలూ, వక్కా, ఆకులనూ పేరంటానికి వచ్చిన వారికి తాంబూలంగా ఇస్తారు. అలా పెట్టిన వారికి శనిగ్రహ దోష నివారణ జరిగి వాతంవల్ల కలిగే అనేక వ్యాధులు నయంకాగలవు. చిమ్మిలి స్వీకరించిన వారిపై శనిగ్రహం తన చల్లని చూపులను ప్రసరించుతుందని చెపుతారు.

## 1482. ఈశ్వరగీత ఏ పురాణంలోనిది ?

**జ.** కూర్మపురాణం.

## 1483. ఆడపిల్ల ప్రథమ ఋతుమతి వేడుకలు తప్పనిసరా ?

**జ.** సాధారణంగా ఆడపిల్లలు పదకొండవ సంవత్సరం నుండి పదునాల్గవ సంవత్సరం లోపుగా ఋతుమతి అవుతారు. ఇది సృష్టి ధర్మం. ఈ సాధారణమైన నియమాన్ని ఘనంగా వేడుకగా చేసుకోవలసినంత అవసరం ఉందా అని ప్రశ్నించుకుంటే తర్కానికి స్ఫురించే అంశం మనకు బోధపడుతుంది. "అష్ట వర్షాభవేత్ కన్యా'' అనే సంప్రదాయం మనకు ఉండేది. అంటే ఎనిమిది సంవ త్సరాల వయస్సుగల ఆడపిల్ల కన్యగా భావించి ఋతుమతి కాకమునుపే వివాహాన్ని జరిపేవారు. పెండ్లి జరిగిన మూడు నాలుగేండ్లకు అమ్మాయి ఋతుమతి అయ్యేది. ఈ శుభవార్తను అమ్మాయి అత్తింటివారికి, బంధువులకు తెలియ జెప్పే శుభవేడుకనే డబ్బున్నవారు ఘనంగా, మధ్య తరగతి వారు మామూలుగా, పేద వారు నిరాడంబరంగా జరుపుకొనేవారు.

ఆడ పిల్లలకు పెండ్లి చేయటం తల్లిదండ్రులకు ఒక సమస్యగా ఉండేది. ఆడపిల్లల తండ్రి వరాన్వేషణలో ఎక్కువ సమయం గడవవలసి వచ్చేది. ఊరూరా తిరుగవలసి వచ్చేది. ఈ శ్రమనుండి బయట పడాలంటే ఆడపిల్ల రజస్వల కాగానే బంధుమిత్రులందరికీ తెలియపరచి ఒక శుభకార్యంగా జరిపితే ఈ విషయం అందరికీ తెలిసి వరాన్వేషణ



తేలిక అవుతుందని మరో భావనతో కూడా ఈ వేడుకలను చేస్తారు. జమిందారులు, ధనవంతుల ఆడ పడుచులు ఋతుమతులైనపుడు తిథి వార నక్షత్రాలను సరిచూసి గ్రహశాంతులు, అన్నదానాలు చేసే ఆచారం విధిగా నడిచేది. ఆడపిల్ల రజస్వల కావటం అంటే మాతృత్వానికి సిద్ధమైందన్న మాట! సృష్టిని స్థిరీకరించే స్త్రీగా రూపు దిద్దుకొనబోయే, జన్మనిచ్చే మాతృదేవతగా మారనున్న ఈ కన్యను "శుభం భూయాత్, భద్రం భూయాత్; శ్రీః భూయాత్; సమస్త సన్మంగళాని భవంతు అంటు కుల పెద్దలచే, బంధు మిత్రులచే, గురు పూజ్యులచే ఆశీర్వచనాలిప్పించే ఆచారాన్నే వేడుకగా చేస్తారు.

## 1484. అపమృత్యు భయం పోవాలంటే యముని పూజించాలా?

**జ.** గంధము, అక్షతలు, పుష్పములు వంటి పూజా ద్రవ్యములతో, భరణీ నక్షత్రము నాడు నల్లని పూవులతో యముణ్ని పూజిస్తే అపమృత్యు భయం నశించునని చెబుతారు.

## 1485. కార్తీకమాసంలో దీపాన్ని వెలిగించుటలోగల అంతర్యము ఏమిటి ?

**జ.** కార్తీక మాసంలో పగలు ఎక్కువ, రాత్రి సమయం తక్కువ. చలి ప్రారంభం అవుతుంది. దేహంలో మార్పులు ప్రారంభం



అవుతాయి. ఇట్టి సమయంలో సాయంత్రం సమయంలో నువ్వుల నూనె లేదా ఆవు నెయ్యితో దీపాన్ని వెలిగించమని చెబుతారు. ఇట్టి దీపాన్ని చూచుట వలన కనులకు ఎంతో హాయి కలుగుతుంది. అనేక దృష్టి దోషాలు నయం కాగలవు. వాతావరణంలోని మార్పుల వలన సంభవించే శ్వాసకోశ మార్పులు నయం కాగలవు. దీపం వద్ద గడిపిన సమయంలో ఆ దీపం నుండి వచ్చే వేడి వాతావరణం వల్ల చల్లబడిన దేహాన్ని కొద్దిగానైనా వెచ్చ బరుస్తుంది. దీపంకాంతి వలన క్రిమి కీటకాలు ఆకర్షించబడి అవి నశిస్తాయి.

## 1486. శనీశ్వరునిపటం గృహంలో ఉండవచ్చా ?

**జ.** శనీశ్వరుని పటంకాని, విగ్రహం కాని ఇంటిలో ఉంచుకొనుటకు ఎట్టి నిషేధాలు లేక పోయినప్పటికీ, సహజంగా శనీశ్వరు నిపైగల భయంతో రోజు ఆ విగ్రహాన్ని కాని, పటాన్ని చూచుట వలన ఆందోళన కలిగి ఆరోగ్యం దెబ్బ తినగలదు. అందు వలన శనీశ్వరునిపటం గృహంలో ఉంచు కొనక పోవటం ఉత్తమం.

## 1487. ఏ పుష్పములతో ఏ దేవతలను పూజించ కూడదు?

**జ.** గణపతిని తులసి ఆకులతో పూజించ కూడదు; శ్రీ మహావిష్ణువుని అక్షింతలతో పూజించకూడదు; భైరవుణ్ణి మల్లెపూలతో పూజించ కూడదు; శివుని మొగలి పూవులతో పూజించకూడదు; శ్రీ మహాలక్ష్మిని తమ్మిపూలతో పూజించకూడదు; సూర్య భగవానుని మారేడు ఆకులతో పూజించ కూడదు.

## 1488. నవ్వే బుద్ధుడు బొమ్మను బహుమతిగా తీసుకుంటే మంచి జరుగుతుందా ?

**జ.** వందల సంవత్సరాలనాటి బౌద్ధ భిక్షువు బొమ్మను వ్యాపార సంస్థల్లోగాని, గృహంలోకాని అందరికీ కన్పించే ప్రదేశంలో ఉంచుకుంటే ఎంతో ఉన్నతిని సాధించగలమన్న నమ్మకాన్ని ఎంతో మంది విశ్వసిస్తారు. లావు పొట్టతో చూడగానే నవ్వుతెప్పించే బుద్ధుడు తన తపఃశ్శక్తితో చేతిలోని భిక్షపాత్ర ద్వారా అనేక మంది ఆకలి బాధ తీర్చాడని ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది నమ్మకం.

### 1489. షష్ఠిపూర్తి తరువాత చేయించు కొనవలసిన శాంతులు ?

**జ.** అరవై నిండగానే షష్ఠిపూర్తిలో ఉగ్రరథ శాంతి, డెబ్బయి ఎనిమిదిలో భీమరథ




శాంతి, ఎనభై మూడు దాటినతరువాత విజయరథ శాంతి, నిండు నూరేళ్ళు నిండినవారు పూర్ణశతాభిషేకం చేయించు కొంటారు.

### 1490. దశ షోడశ దానాలేవి?

**జ.** గో, భూ, తిల, హిరణ్య, రత్న, విద్య, కన్యాదానాది పదహారు దానాలు షోడశ దానాలు. గో, భూ, తిల, హిరణ్య, అజ్య, వస్త్ర, ధాన్య, గుడ, రౌప్య, లవణ దానాలు దశ దానాలు. అన్నదానము దశ షోడశ దానాల్లో చేరలేదు. అందుకే అన్ని దానాల్లోకన్నా మహోన్నతమైనది అన్నదానం అని అంటారు.

### 1491. కొత్త పెళ్ళికూతురిచేత సింహద్వారం వద్ద బియ్యపు పాత్రను ఎందుకు కాలితో తన్నిస్తారు?

**జ.** కొన్ని ప్రాంతాలలో నూతన దంపతులు అత్తవారింటికి వచ్చినపుడు రాగి పాత్రలో బియ్యంపోసి సింహద్వారం మీద పెట్టి కొత్త పెళ్ళికూతుర్ని ఆ బియ్యపు పాత్రను తన్ని ముందుగా కుడికాలు పెట్టి లోపలకు రమ్మని అంటారు. పెళ్ళి కూతురు తన్నిన బియ్యం ఎంత దూరంగా పడి విస్తరిస్తే అంత ప్రదేశం వరకు ధాన్యలక్ష్మి తాండవిస్తుందని నమ్మకం.

### 1492. చేతికి కట్టుకొనే కంకణం వల్ల ఉపయోగం ఉందా ?

**జ.** సత్యనారాయణస్వామివ్రతము, గౌరీ పూజా, వివాహము మొదలగు శుభ కార్యాల్లోను, యజ్ఞ యాగాదుల సమయాల్లోను చేతికి కంకణం కట్టుకుంటారు. చేసిన పూజాఫలం, భావనా తొలగి పోకుండా ఆ కంకణం ఉన్నంత వరకూ అదే భావన, ప్రశాంతత ఆ కంకణం కట్టుట వలన సిద్ధిస్తుందని నూలుకు పసుపు రాసి ముంజేతి మణికట్టుకు కట్టుకుంటారు. కంకణ ధారణకు ఆధ్యాత్మికమైన ఈ ప్రయోజనంతోపాటు మరో ప్రయోజనం కూడా కలదు అంటారు. శరీరంలోని జీవనాడుల్లో ముఖ్య నాడి చేతుల మణికట్టు భాగం వరకు ఉంటుంది. కంకణము కట్టుకోవడంవల్ల, ఆ భాగంలో

కలిగే ఒత్తిడి వల్ల రక్త ప్రసరణలతో పాటు హృదయ స్పందన సరళ రీతిలోకి ప్రవేశి స్తుంది. అక్కడ ఉన్న నాడి గర్భాశయం వరకూ ఉంటుంది. అందుకే నాడి పట్టు కొని చూసి ఓ స్త్రీ గర్భవతా, కాదా అని కూడా చెప్పగలరు. అంతటి విశిష్ట స్థానము కావున ఆ స్థానంలోని జీవనాడుల ఉద్దీపన కొరకు వ్రతాది సమయాల్లో కంకణమును ధరించే ఆచారం తప్పనిసరి చేశారు.

## 1493. వెండి కంచంలో తింటే నేత్ర వ్యాధులు రావా ?

**జ.** వెండి కంటికీ, వంటికీ, పంటికీ ఎంతో మేలు చేస్తుందని చెబుతారు. వెండి కంచంలో భోజనం చేయటం వల్ల నేత్రా లకు చలువ కలుగుతుంది. జఠరాగ్ని పెరుగుతుంది. అన్ని వైద్యశాస్త్రాలలోను వెండిని కంటికి సంబంధించిన మందుల తయారీలో ఉపయోగిస్తారు.

## 1494. శుభలేఖలకు నాలుగు వైపులా పసుపే రాయాలా?

**జ.** శ్రీ మహాలక్ష్మికి ఆమె అక్క అయిన జ్యేష్ఠాదేవికి ఎవరు ఎక్కడక్కెడ ఉండాలో అనే విషయమై చర్చ రాగా లక్ష్మీదేవి సముద్రంలో దాక్కోవటంతో ఆమెను బైటకు రమ్మని జ్యేష్ఠాదేవి కోరింది. ఆ సమస్య కొలిక్కి వచ్చిన సమయంలో లక్ష్మీదేవి తాను ఏ ఏ ప్రదేశాలలో ఉండ గలనో చెప్పింది. వాటిలో పసుపు ఒకటి. అందుకే వివాహ శుభలేఖలకు పసుపు రాసి లక్ష్మికి ఆహ్వానం పలుకుతారు. ఇలా లక్ష్మికి ఆహ్వానం పలకటంవల్ల ఆమె సదా వీరిపై తన కృప చూపగలదని పురా ణాలు చెబుతున్నాయి.

## 1495. విష్ణువు ఆలయంలో ఎన్ని ప్రదక్షిణలు చేయాలి?

**జ.** విష్ణువు ఆలయంలో సరి సంఖ్యలో అంటే 2, 4, 6 .... ఈ సంఖ్యలలో ప్రదక్షిణలు చేయాలి.



## 1496. ఖాళీగా ఉన్న రోలును రుబ్బరాదా?

**జ.** మిక్సీలు, గ్రైండర్లు లేని పాతకాలంలో రోటిపైనే ఎక్కువగా ఆధారపడేవారు. రుబ్బడానికి, పిండి చేయటానికి ఈ రోటిని ఎక్కువగా ఉపయోగించేవారు. రోటికి, పొత్తరమునకు మధ్యలో కాస్త కరుకుగా ఉండేది. దీనినే కక్కు అంటారు. ఈ కక్కులేకుండా నునుపుగా ఉంటే ఏ పదార్థమైనా త్వరగా నలగదు కదా. ఖాళీ రోలును వాడడం అంటే రుబ్బటం వల్ల రాతి రోలుకు ఉన్న గరుకుతనం అరిగి పోయి, ధాన్యాన్ని దంచటం లేదా రుబ్బ టం ఆలస్యమౌతుంది. ఆ కారణం గానే

ఖాళీగా ఉన్న రోలును రుబ్బరాదన్న నిషేధాన్ని పెట్టడం జరిగింది. రోలు గరుకుగా ఉంటేనే త్వరగా దానిలో వేసిన పదార్థాన్ని మెత్తగా నూరివేయ గలుగుతుంది. అది మాత్రమే కాక ఖాళీ రుబ్బు రోలు తిప్పితే భయంకరమైన శబ్దాన్ని చేస్తుంది. ఈ శబ్దం చుట్టు ప్రక్కల వారికి ఇబ్బంది కలిగిస్తుంది. అందుకే ఇటు వంటి పనులు కూడదని నిషేధం.

## 1497. సన్నబడాలంటే ఏం చేయాలి?

**జ.** రోజూ ఉదయం గోరువెచ్చని ఓ గ్లాసు నీళ్ళలో ఓ స్పూను స్వచ్ఛమైన తేనె, ఓ చెక్క నిమ్మరం కలిపి త్రాగితే శరీరంలోని అధికమైన క్రొవ్వు కరిగి నాజూకుగా తయారు కాగలరు.



## 1498. బ్రహ్మహత్యతో సమానమైన పాపాలు ఏవి?

**జ.** అతిథిని పిలిచి భోజనంపెడుతూ లోలోన బాధపడటం, సమయానికి భోజనం పెట్టకుండా వేచి వుండేలా చేయటం, ధర్మకార్యాలు చేస్తూ జీవనం సాగిస్తున్న వారి నోటి దగ్గరి ధనాన్ని లాగుకొనటం, గేదెలూ, ఆవులూ, జంతువులు నీరు త్రాగుచుండగా అదిలించటం, మహా శాస్త్రాలను చులకనగా మాట్లాడటం, తమ తెలివితేటలతో ఎత్తులువేసి అమాయకులకు హానికలిగించటం, తగిన వరునికి కాకుండా ధనమున్నదని అయోగ్యునకు తన కుమార్తెను కట్టబెట్టటం–ఇవన్నీ మహా పాపాతి పాపాలు. వీటికి నిష్కృతి లేదు. ఎన్ని జన్మలెత్తినా వీరు ఈ పాప ఫలాన్ని అనుభవిస్తూ ఉండవలసినదే.

## 1499. మర్రిచెట్టు చుట్టూ ప్రదక్షిణము చేస్తే ప్రయోజనము ఏమిటి ?

**జ.** సాధారణంగా అన్ని దేవాలయాలలో మర్రిచెట్లు పెంచబడి ఉంటాయి. ఇటు వంటి మర్రిచెట్ల చుట్టూ ప్రదక్షిణము చేయాలని ఋషులు ఓ నియమం పెట్టారు. దీనికి నిజమైన ఓ ప్రయోజనం ఉంది. మర్రిచెట్టునుండి ఆక్సిజన్ పుష్కలంగా ఉత్పన్నమౌతుంది. అలాగే మర్రి మనకు చల్లని నీడను కూడా ఇస్తుంది. మర్రిచెట్టు ఆక్సిజన్‌తో పాటుగా కొద్ది మొత్తంలో ప్రాణవాయువు ఘనీభూత రూపాన్ని వెల్లడిస్తుంది. గాలియొక్క సాంద్రత కంటే ఘనీభూత రూప ప్రాణ వాయువు యొక్క సాంద్రత ఎక్కువగా ఉండటం వలన అది చుట్టూతా ఉన్న గాలిని శుద్ధి చేయడమే కాక మన ఊపిరి తిత్తులలో ఉన్న సూక్ష్మ క్రిములను నాశనం చేస్తుంది. ఈ కారణంగా మన పూర్వులు మర్రిచెట్టుకు ప్రదక్షిణము చేయమని చెబుతారు.

### 1500. ఏ దిక్కు వైపు తిరిగి మంత్రాలను ఉచ్చరించ కూడదు ?

**జ.** దక్షిణదిక్కు వైపు తిరిగి మంత్రాలను పఠించినా, హోమయాగాదులను చేసినా



ప్రయోజనము ఉండదు. దక్షిణ దిక్కుగా తిరిగి మంత్రాలను కేవలం ఉగ్రహోమాలలో మాత్రమే నిర్వహిస్తారు. ఆసనసిద్ధి లేని మంత్రములన్నీ వ్యర్థములు కాగలవని పెద్దల భావన.

### 1501. గర్భగుడిలో చిన్న దీపాన్నే ఎందుకు పెడతారు?

**జ.** స్వామి మూర్తిని దర్శించిన ఫలం కంటే, పాదాలను దర్శించి నమస్కరించటం ద్వారా అనంతమైన ఫలం లభించగలదు. గర్భగుడిలో స్వామి పాదాల మీద ప్రసరించే ఆ చిన్న దీపం ద్వారా స్వామి పాదాలను చూసి తరిస్తారని అలా ఏర్పాటు చేస్తారు. అంతే కాక దేవుని ఎదు రుగా శఠగోపం పెట్టేటప్పుడు తలను వంచుతాము. అప్పుడైనా మన దృష్టి స్వామి పాదాలను స్పృశించుతాయని పెద్దలు ఈ ఏర్పాటు చేశారు.

### 1502. దిష్టితియ్యగానే ఉపశమనం కలుగుతుందా?

**జ.** నిప్పులు పళ్ళెంలో పోసి ముఖానికి దగ్గరగా పెట్టి మూడుసార్లు మిరప కాయలతో, ఉప్పుతో దిష్ఠితీసి నిప్పుల మీద వేస్తారు. అలావేసిన తర్వాత వచ్చే పొగను పీల్చటం వల్ల అనగా సోడియం క్లోరైడ్ విడిపోయి సోడియం పెరాక్సైడ్‌గా, క్లోరిన్‌గా మారిన వాటిని పీల్చటంవల్ల ముక్కు రంధ్రాల గుండా తీక్షణమైన ఆ వాయువు శరీరంలో ప్రవేశించటంతో శ్వాస మండలం రిలాక్స్ అవుతుంది దానితో దిష్టి తీయటంవల్ల ఈ మంచి జరిగిందని భావిస్తాం. దిష్టి తీయటం అనే ఈ తతంగంలో ఎంతో వైజ్ఞానిక విశేషము కలదని తెలుస్తుంది.

### 1503. ఏ విధముగా తయారైన కుంకుమను ఉపయోగించాలి?


**జ.** పసుపు కొమ్ములు, నిమ్మరసము, పటికల సమ్మేళనాలతో తయారు చేసేదే కుంకుమ. ఇలాంటి కుంకుమను ఎడమ అరచేతిలోకి తీసుకొని కుడిచేతి ఉంగరపు వేలితో మాత్రమే ధరించాలి.

### 1504. కన్నీరు ఎలా వస్తుంది?

**జ.** తట్టుకోలేని విషయం విన్నప్పుడు మొదట శరీరం వణకిపోతుంది. కనులలో నీరు తిరుగుతుంది. మెదడు మొద్దుబారిపోతుంది, ప్రక్కవారి మాటలు వినబడవు, నాలుకస్పర్శను కోల్పోతుంది. శ్వాస మందమౌతుంది, అప్పుడు కన్నీరు బయటకు వస్తుంది.

## 1505.సూర్యాస్తమయం తరువాత చెట్లు కొట్టకూడదా ?

**జ.** పొయ్యిలోకి కట్టెలు కొట్టుటకు అత్యంత జాగ్రత్త, నిపుణత అవసరం. సూర్యాస్తమయమైన తరువాత వెలుగు తగ్గినప్పుడు కట్టెలు కొట్టుట జరిగితే గొడ్డలి దెబ్బలు సరిగా, సరైన ప్రదేశంలో పడక పోవచ్చు లేదా గొడ్డలి జారి క్రింద పడినచో దానిని వెదకుట కష్టము వంటి అనేక నష్టాలు ఉన్నాయి. మరియు వంట చెరకుకు ఉపయోగపడే చెట్లు, ఉపయోగపడని చెట్లు ఉంటాయి. వాటిని కాంతి లేనప్పుడు గుర్తించుట కష్టము మొదలగు కారణాల వల్ల ఈ నిషేధాన్ని విధించారు.



## 1506. పూవులతో మరువం కలపటం వలన చెవి బాధలు నశిస్తాయా?

**జ.** కొన్ని రకాల పూలు అందాన్ని ఇస్తాయి కాని వాసనను ఇవ్వవు. వాటిని మరువం వంటి పూలతో కలిపి ఉపయోగించటం వలన చెవి భాగాలు శుభ్రమౌతాయట. చీమూ, చెవిపోటూ వంటివి ఈ మరువం వాసనా, స్పర్శ ద్వారా నివారణ కాగలదని చెబుతారు. వినికిడి శక్తినికూడా పెంచగల శక్తి మరువానికి కలదని కూడా చెబుతారు.

## 1507. ఏ అగ్ని తనకు దూరాన ఉన్న వారిని కూడా దహించి వేస్తుంది?

**జ.** అగ్ని తన సమీపమున కలవారిని మాత్రమే దహిస్తుంది. కానీ క్రోధాగ్ని మాత్రం ఎంతో దూరాన ఉన్న వారిని కూడా దహించివేయగలదు.

## 1508. యమ ద్వితీయ అంటే ఏమిటి?

**జ.** యముడు తన సోదరి ఇంటికి వెళ్ళి ఆమె ఆప్యాయతతో వండిపెట్టిన భోజనాన్ని స్వీకరించి చెల్లిని నిండు నూరేళ్ళు పసుపు కుంకుమలతో చల్లగా వర్థిల్లమని ఆశీర్వదించి, కార్యార్థియై వెళ్ళి విజయం సాధిస్తాడు. అందుకే దీనిని యమ ద్వితీయ అంటారు. ఈ విదియ రోజు సోదరి తన సోదరుని ఆప్యాయంగా పిలిచి, వడ్డించి ఆశీర్వచనాలను తీసుకుంటుంది. ప్రతి సోదరుడు తన అక్క లేదా చెల్లి ఇంటికి వెళ్ళి క్షేమ సమాచారాలను తెలుసుకొని, భోజనం చేసి వారికి ఆనందాన్ని కలుగజేస్తారు.

## 1509. చాటపై పాదాలు ఉంచరాదా ?

**జ.** సాంప్రదాయంగా చాటలు సన్నటి వెదురు బద్దలతోకానీ, ఈనెలతో కానీ తయారు చేస్తారు. ఈ చాటలను ధాన్యము మొదలగు వాటిని చెరగటానికి ఉపయోగిస్తారు. అప్పుడు ధాన్యం శుభ్ర పడుతుంది. ఆ శుభ్రపడిన వంట ధాన్యాన్ని భారతీయులమైన మనము ఎంతో

పవిత్రంగా చూసుకుంటాము. ఈ కార్యానికి ఉపయోగించే చాటను కూడా ఎంతో పవిత్రంగా భావించేవారు. కాబట్టి చాటపై కాలు పెట్టటం పాపంగా పరిగణించే వారు. ఈ విశ్వాసంలో రెండు ప్రధానాం శాలు ఉన్నాయి. చాటను తయారు చేయ టానికి ఉపయోగించే వెదురు చాలా పదు నుగా ఉంటుంది కాబట్టి దానిపై కాలు పెట్టినచో తెగి గాయమయ్యే ప్రమాదం ఉంది. చాటపై కాలు పెట్టినచో అశుభ్రము అవుతుందికాబట్టి చాటలో చెరిగే ధాన్యం కూడా మలినపడుతుంది.

## 1510. తల్లిదండ్రుల నుంచి పిల్లలకు ఏమేమి సంక్రమిస్తాయి?

**జ.** తండ్రి నుండి జుట్టూ, కనులూ, గోళ్లు, దంతములూ, శిరలూ, ధమనులూ మొదలగునవి. తల్లి నుంచి చర్మమూ, రక్తమూ, మాంసమూ, నాభి, హృద యమూ, చిన్న ప్రేవూ, పెద్దప్రేవు మొద లగునవి. అందుకే తల్లిదండ్రులకు వృద్ధా ప్యములో అన్ని అవయవాలూ మీరే అయి సేవ చేయాలని కామాఖ్యతృము తెలుపు చున్నది.



## 1511. ఎంతకోపం వచ్చినా ఆడవారు చేయకూడని పనులు

**జ.** భర్తపై కోపంతో బంగారు నగలను విసరుట, భర్తకు హాని కలిగించుట, వంట పాత్రలను, చీపురును విసరుట చేయకూడదు. ఆ చర్య శ్రీమహాలక్ష్మిదేవిని వద్దనుకొని ఆమె అక్క జ్యేష్ఠాదేవిని ఆహ్వానించటమే.

## 1512. స్మశానానికి వెళ్ళివచ్చి స్నానం చేయకుండానే ఇంట్లోకి ప్రవేశించ వచ్చా?

**జ.**అంత్యక్రియలకు వెళ్ళివచ్చినవారు లేదా శ్మశానమునుండి వచ్చినవారు శరీరంపై దుస్తులు ఉంచుకొనే స్నానం చేయాలని సంప్రదాయం. లేకపోతే చనిపోయిన వారి ఆత్మ వీరిని వెంటాడు తుందని చెప్పేవారు. ఆత్మ విషయం ఎలా ఉన్నా ఈ సంప్రదాయం వెనుక ఒక ఆరోగ్య రహస్యం ఉంది. మరణించిన వ్యక్తి శరీరం నుండి అనేక విషక్రిములు బయటకు వస్తాయి. ఇవి ఆ దేహం చుట్టూతా ఆవహించబడి ఉంటాయి. ఎవరైతే శవాన్ని తాకుతారో వారిపై ఈ క్రిముల ప్రభావం కన్పించవచ్చు. ఈ విష క్రిముల బారిన పడకుండా తప్పించు కొన టానికే బట్టలమీదనే తలారా చన్నీటి స్నానం చేయాలని చెప్పటం జరిగింది. విషక్రిములు దుస్తులపైకూడా ఉంటాయి కాబట్టి దుస్తును కూడా నీటితో తడిసేలా స్నానంచేయాలని చెప్పటం. ఈ విశ్వా సంలో పరిశుభ్రతతో పాటు రోగాల బారిన పడకుండా ఉండే ఏర్పాటు ఉంది.

## 1513. చెడు సావాసాలు చేయకూడదా ?

**జ.** ఎంతధర్మబుద్ధులు నేర్చినా, చెడు ప్రవర్తన కలిగిన వారితో ఉంటే, మన ధర్మబుద్ధి వారికి అంటకపోగా, వారి అధర్మబుద్ధి మనకు అంటుతుంది. భీష్ముడు సకల ధర్మశాస్త్రాలనూ, ధర్మా లనూ చెప్పి ఆచరించినా దుర్యోధనుడి సభలో ద్రౌపది చీర లాగుతుంటే చూస్తూండి పోయాడు.

## 1514. పొడుపు కథలు వేసే వారు బీదవారు అయిపోతారా?

**జ.** ఇంట్లోని పెద్దలు పొడుపు కథలు వేయరాదని, ఒక వేళ అలా చేస్తే వారు దరిద్రులు కాగలరని ఒక విశ్వాసం. ఈ విశ్వాసం వెనుక ఒక అంతరార్థం దాగి ఉన్నది. టీవీలు, రేడియోలు లేని రోజుల్లో ప్రజలు అనేక వినోద కార్యక్రమాల్లో పాల్గొనేవారు. పొడుపు కథలు వేయటం, వాటిని విప్పడం ఆ వినోదంలో ఒక భాగం. ఈ పొడుపు కథలు మెదడుకు మేతపెట్టేవి. పిల్లలు ఈ పొడుపు కథలు వేయటం, వాటిని విప్పడం అలవాటుగా మారినట్లయితే వారు చదువులో వెనుక బడే ప్రమాదం ఉంది. పెద్దలు కూడా ఈ పొడుపు కథల వ్యవహారంలో ముని గితే తమ పనులు చెడిపోయే ప్రమాదం ఉంది. అదే పనిగా ఈ పొడుపు కథలలో లీనమైనవారు తమ పనులలో అశ్రద్ధ చూపించినట్లయితే వారి పురోభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉంది. "అతి సర్వత్ర వర్జయేత్" కాబట్టి పొడుపు కథలు వంటి వినోద కార్యక్రమాలు దూర ప్రయా ణాలలోనో, విసుగుగా ఉన్నప్పుడో, ఏ పనీ లేనప్పుడో నిర్వహించితే సమయో చితంగా ఉంటుంది.

## 1515. ఉసిరికాయ మీద ఆవునేతి దీపం వెలిగిస్తే మంచిదా ?

**జ.** ఉసిరికాయ మీద ఆవునేతి దీపం వెలిగించి, పూజించిన వారు నేరుగా విష్ణు సాన్నిధ్యానికి చేరతారని విష్ణుపురాణం పేర్కొంటుంది.

## 1516. గంధాన్ని నడుము క్రింది భాగంలో ఉపయోగించ కూడదా ?

**జ.** గంధలేపనాన్ని హిందువులు చాలా పవిత్రతతో ధరిస్తారు. కానీ దాన్ని నడుము క్రింది భాగంలో ధరించరు. దీని వెనుక శాస్త్రీయమైన కారణం దాగి ఉన్నది. గంధ లేపనం ఎంతో చల్లని గుణం కలిగిఉంది. గంధాన్ని ఎక్కువగా రాసుకోవటం వల్ల మగతనం తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. అలా గంధాన్ని నడుముకు క్రింది భాగంలో ఆ భాగం చల్లబడి పుంసత్వం తగ్గగలదని భావించి పెద్దలు ఈ నియ మాన్ని సూచించారు.

## 1517. అష్టదరిద్రాలు అంటే ఏమిటి?

**జ.**★ సహాయం చేసే వారు ఒక్కరైనా లేక పోవటం.

★ కనీస అవసరాలకు ధనము లేక పోవటం.

★ ఒంటి పూట భోజనమునకు కూడా విప రీతమైన శ్రమ చేయాల్సి రావటం.
★ చినిగిన బట్టలతో ఉండటము.
★ వెళ్ళటానికి ఏ వాహనము లేక పోవటం.
★ ధనం ఉన్నా సంతానం లేకపోవటం.
★ పుత్రుడు ఉన్నా వదలి వేయటం.
ఇవి అష్టదరిద్రాలు అని చెప్పబడినవి.

## 1518. ఏ విషయంలో స్త్రీ పురుషునిపై భద్రకాళిగా మారుతుంది ?

**జ.** భర్త తనను తిట్టినా, కొట్టినా భార్య భరిస్తుంది. తిండి పెట్టకపోయినా తను సంపాదించి భర్తకీ పిల్లలకూ పెడుతుంది. త్రాగుబోతైనా, తిరుగుబోతైనా భరిస్తుంది. కానీ తన శీలాన్ని శంకిస్తే మాత్రం భద్ర కాళి అవుతుంది.

## 1519. నాలుగు విధాలైన దానాలు ఏవి ?

**జ.** చావు భయంలో శరణు వేడిన వానికి ప్రాణ అభయదానం, రోగాలతో బాధ పడే వానికి వైద్యదానము, ఆకలి బాధతో అల్లాడేవానికి అన్నదానము, పేదవానికి ఉచిత విద్యాదానము. ఈ నాలుగు దానాలు చేసిన వారికి పూర్వజన్మ పాపాలు నశించి, ఈ జన్మలోనే సుఖాలు లభించ గలవని చెప్పుదురు.

## 1520. ఇంట గెల్చి రచ్చ గెలవాలా?

**జ.** సమాజానికి సేవ చేయాలనుకోవటం హర్షణీయమే కాని ఆ సేవ తన ఇంటి నుండి ప్రారంభించాలి. సేవలో స్వలాభ త్యాగం, కాలం, ధనం, అంకిత భావం కూడి ఉంటాయి. ఇలాంటి సేవను చేయు వారు తన కుటుంబం అనే చిన్న సమాజం నుండి ప్రారంభించాలి. స్వ జనోద్ధరణ చేయనివాడు సమాజాన్ని ఎలా ఉద్ధ రిస్తాడు? కావున సత్ సంతానంగా మాతా పితరులకు, తాతా బామ్మలకు, సోదరీ సోదరులకు మరియు తన సంతానానికి తన శక్తి మేర మొదట నుండి సేవ చేయాలి. వీరినందరికి కాదని సమా జాన్ని ఉద్ధరించటం కుదరనిపని. మీ ఆదర్శాలకు అనుగుణంగా మొదట మీ ఇంటిని సరిదిద్ది తరువాత సమాజానికై పాటుపడటం ఉత్తమ మానవుని కర్తవ్యం.

## 1521. కంచుపాత్రలో టభోజనం చేయకూడని వారు ఎవ్వరు?

**జ.** మఠాధిపతులు, మత ప్రచారకులూ, సన్యాసులు, దీక్షా కంకణ బద్ధులు కంచు పాత్రలలో భోజనం చేయకూడదు. కంచులో తినుట వలన శరీర పటుత్వం అధికంగా పెరుగుతుంది. ఆ కారణంగా ఐహికమైన విషయాలపై ఆసక్తి పెరిగి వారి దీక్ష భగ్నం అయ్యే ప్రమాదం ఉంటుంది.

## 1522. పరస్త్రీలను కామంతో చూస్తే మరుజన్మలో ఏ శిక్షలు పడగలవు?

**జ.★** పరస్త్రీని క్రీగంట చూచినచో మెల్ల కన్నుతో జన్మిస్తాడు.

★ కొరుక్కుతినేలా చూస్తే మరు జన్మలో పుట్టుగ్రుడ్డిగా జన్మించగలడు.

★ ధనం ఆశచూపిగాని, భయపెట్టిగాని స్త్రీని దిగజార్చితే మరుజన్మలో కులటగా జన్మిస్తాడు.

★ పరస్త్రీ శరీరాన్ని చూసి చొంగలు కార్చినచో మరుజన్మలో మూర్ఛవ్యాధి పాలు బడగలడు.

## 1523. ఏ పుణ్యకార్యాలు చేసిన ఫలితం ఎప్పుడు లభించదు ?

**జ.** వ్రతలూ, నోములూ, దానాలూ, ధర్మాలూ, యజ్ఞాలూ, యాగాలూ, హోమాలు, తర్పణలూ మొదలగునవి ప్రతిరోజు ఎన్నింటినిచేసినా తల్లిదండ్రులను నిరాకరించిన వారికి, దూషించిన వారికి, ఆదరించని వారికి యజ్ఞ యాగాదుల ఫలం అందక పోగా మహా ఘోర నరకాలను ప్రస్తుతమే కాక పై లోకాలలోనూ అనుభవించాల్సి ఉంటుంది.

## 1524. స్నానం చేసిన తరువాత మొదటగా ఏ భాగాన్ని తుడవాలి?

**జ.** నదిలోనో, కాలువలోనే, చెరువులోనో స్నానం చేసిన తరువాత మొదటగా వీపు భాగాన్ని తుడవాలని మన ఆచారం తెలుపుతోంది. సాంప్రదాయం ప్రకారం మన దేహాన్ని మంగళ మరియు అమంగళకర దేవతలు ఆశ్రయించి ఉంటారు. స్నానం చేయునపుడు తలపై నీళ్ళు పోసుకొనిన వెంటనే ఈ ఇద్దరు దేవతలు శరీరాన్ని విడిచి, స్నానం తరువాత శరీరాన్ని తుడిచిన వెంటనే తమ స్థానాలు పొందుతారని చెప్పబడింది. ఈ సంప్రదాయం ప్రకారం ఏ భాగం ముందుగా తుడచబడుతుందో ఆ భాగం అమంగళకరదేవతలతో ఆవహింపబడుతుందని విశ్వాసం. అందుకే మొదటగా ముఖమునో లేదా రొమ్ముభాగము కాక వీపు భాగము తుడిచినచో అమంగళకర దేవతలు వీపు భాగమును ఆశ్రయిస్తారని భావన. తరువాత ముఖము మరియు ఛాతిని తుడిచినచో శుభదేవత అయిన శ్రీదేవి ముఖభాగాన్ని ఆక్రమిస్తుంది. అప్పుడు ముఖమండలము తేజోవంతముగా ఉండి జనాకర్షణ మరియు శుభాకర్షణ ఫలితం కలుగుతుంది. ఈ విశ్వాసంలో శాస్త్రీయత కూడా కనిపిస్తున్నది. చల్లని నీళ్ళతో స్నానం చేయటంవల్ల శరీర భాగాలన్నీ చల్ల బడుతాయి. అన్ని భాగాలకన్నా వెన్నెముక ఎక్కువగా చల్లదనానికి గురి అవుతుంది. ఈ కారణంగా చిన్నాచితకా ఆరోగ్య సమస్యలు కలుగవచ్చు. కావున స్నానం తరువాత వెంటనే వీపు భాగాన్ని తుడుచుకోవాలని చెప్పబడింది. అయితే ఈ నియమం మనం గృహంలో సాధారణంగా చేసే బకెట్ స్నానానికి వర్తించదు.

## 1525. దరిద్రుని లక్షణాలు ఏవి?

**జ.** పగలు నిద్రించుట, స్త్రీ వ్యామోహము, స్త్రీలకు పురుషుల వ్యామోహము, మాంసమును భుజించాలనుకొనుట, ఊరికే

తిరుగుట, మధుపానమునందు ఆసక్తి, అసత్యాలను ప్రచారం చేయటం, ఆట పాటలతో కాలం గడపాలనుకోవటం ... ఇవన్ని దరిద్రుని లక్షణాలుగా చెప్పబడినవి.

## 1526. తులసి ఆకులను చెవుల వెనుకే ధరించాలా ?

**జ.** ఇలా ధరించాలనే శాస్త్రం చెబుతుంది. శరీరంలో తీవ్రంగా నీటిని గ్రహించే గుణం చెవి వెనుక భాగానికి ఉంది. తులసిలో ఔషధీయ గుణాలు ఉన్నాయి. తులసిని చెవి వెనుక చేర్చటం వల్ల ఈ ఔషధీయ గుణాలను అక్కడి చర్మం గ్రహిస్తుంది. దీనివల్ల ఆరోగ్యం కలుగు తుంది. తులసిలో అనేక రకాలు ఉన్నా కృష్ణ తులసి ఉత్తమమైనదని భావించ బడుతుంది. ఈ కృష్ణ తులసినే భగవధా రాధనలో ఉపయోగిస్తారు.

## 1527. ప్రదోషకాల పూజ చేయుచున్నప్పుడు ఎందుకు తినకూడదు?

**జ.** సాయంకాల సమయంలో ఇంట్లో పూజ జరుగుచున్నప్పుడు ఆ కుటుం బంలోని సభ్యులు ఎవరూ ఎటువంటి పదార్థాలను భుజించరాదని ప్రాచీన కాలం నుండి విశ్వసింపబడుతుంది. ఇలా తినుట పాప కర్మ అని చెప్పడం జరిగింది. సాయంకాలం దేవుడికి దీపం వెలిగించి మంత్రాలతో మరియు శ్లోకాలతో స్వామిని కీర్తించడం జరుగుతుంది. అప్పుడు దైవం భక్తుని యెడల ప్రసన్నుడై ఉంటాడు. ఇంటికి శుభాన్ని కలిగించే లక్ష్మీదేవి పూజ జరుగుకాలమందు లక్ష్మి ఉపస్థితురాలై ఉంటుందని, అశుభకారిణి అయిన దరిద్ర దేవత బయటకు వెళ్ళిపోతుందని భారతీయుల భావన. ఇలాంటి శుభ సందర్భమైన కాలంలో ఇంటిలోని వారందరూ దైవ ప్రార్థనలో పాల్గొనాలి. ఒక వైపు దైవ ప్రార్థన జరుగుతుంటే మరో వైపు తమ కడుపు తాము నింపుకునే ప్రయత్నంలో ఉన్నవారు దైవాన్ని నిర్లక్ష్య పరచినారన్న భావన మిగతావారిలో కలుగ వచ్చు లేదా ప్రార్థనలో పాల్గొన్న వ్యక్తుల ఆలోచనలు తినేవారిపై మరల వారు ఏం తింటున్నారో అన్న ఉత్సుకత కలిగి దైవంపై మనసు పూర్తిగా నిలుప లేక పోవచ్చును. ప్రదోషకాలంలోనే శివుడి భూతగణాలు భూలోకంలో విహరిస్తూ పూజ జరుగు చున్న ఇంటిని సందర్శిస్తారని విశ్వసింప బడింది. అలా వారు ఒక ఇంటిని దర్శిం చినపుడు సమయము, సందర్భము లేకుండా తింటున్న వ్యక్తి వారిని పరో క్షంగా అవమానించినట్లు అవుతుంది. ఈ కారణంగానే కాక ఆరోగ్యశాస్త్రాన్ని అను సరించి కూడా ప్రదోషకాలంలో (సూర్యుడు అస్తమించిన కొద్ది సేపటి తరువాత) తినుట ఆరోగ్యప్రదం కాదు. ఈ సమ యంలో వాతావరణంలో రసాయనిక మార్పులు కలుగు తుంటాయి కాబట్టి ఈ సమయంలో భోజనం చేయకూడదని కూడా సైన్స్ చెబుతోంది. ఎన్నో విధా లుగా ఈ సమయం భోజనానికి తగినది

కాక పోవటమే కాక క్రమశిక్షణా రహిత భోజన అలవాటును సూచిస్తుంది.

## 1528. చండప్రదక్షిణం అంటే ఏమిటి?

**జ.** శివాలయంలో ప్రదక్షిణ చేస్తున్నపుడు సోమ సూత్రాన్ని దాటకూడదు. సోమ సూత్రం ఇవతల నుండి ధ్వజస్థంభం వరకూ, ధ్వజస్థంభం నుండి మళ్ళీ ప్రదక్షిణగా సోమసూత్రం వరకూ, అక్కణ్నించి వెనక్కి తిరిగి ధ్వజస్థంభం వరకూ, ధ్వజ స్థంభం నుండి ముందుకు కదలి సోమ సూత్రం వరకూ, తిరిగి మళ్ళీ విచి ధ్వజస్థంభం వరకూ, మళ్ళీ అలాగే ధ్వజ స్థంభం నుండి సాగి సోమసూత్రం వరకూ, తిరిగి సోమ సూత్రం నుండి వెనుక ధ్వజం వరకూ, అక్కడ్నించి ముందుకు సోమ సూత్రం వరకూ, సోమ సూత్రం నుంచి వెనుక ధ్వజం వరకూ, అక్కడ్నించి ముందుకు సోమసూత్రం వరకూ, సోమ సూత్రం నుండి ధ్వజం వరకూ, ఆ పై శివాలయ ధ్వజ స్థంభం ఎడమ పక్క వెళ్ళాలి. ఇదే చండ ప్రదక్షిణం. ఈ చండప్రదక్షిణం చేస్తే ముప్పైవేల ప్రద క్షిణాలు చేసిన ఫలం లభించునని శాస్త్రాలు చెబుతున్నాయి. రెండోసారి చండ ప్రదక్షిణ చేస్తే ధ్వజ స్థంభాన్ని తాకరాదు అని చెబుతారు.

## 1529. రోటిపై కిరోసిన్ దీపాన్ని పెట్టకూడదా?

**జ.** పాత రోజుల్లో కరెంటు లేని రోజుల్లో కిరోసిన్ దీపాలను ఇంటిలో వెలిగించే వారు. ఈ దీపాలను వెలుగుకై అటూ ఇటూ త్రిప్పేవారు. ఈ సందర్భంలో ఎటు వంటి పరిస్థితులలోను కిరోసిన్ దీపాన్ని రోలుపై పెట్టరాదని పూర్వులు చెప్పేవారు. దీనికి ముఖ్యమైన కారణం ఒకటి ఉంది. గ్రయిండర్స్ లేని రోజుల్లో రోటినే అధి కంగా వినియోగించేవారు. నిత్య జీవి తంలో రోలు వారికి అనేక విధాలుగా ఉపయోగపడేది. కిరోసిన్‌తో నింపి ఉన్న దీపాన్ని రోటిపై పెట్టినప్పుడు ఆ దీపా న్నుంచి కిరోసిన్ రోటిపై చిందే అవకాశం ఉంటుంది. ఏదైనా రుబ్బడానికి ఆ రోలును కడిగినా ఆ కిరోసిన్ వాసన పోదు. అలా రోలులో రుబ్బే ఆహార పదార్థాలు కిరోసిన్ కంపుకొట్టి ఆహారాన్ని తినకుండా చేస్తుంది. కావున ఈ సమస్య ఉత్పన్నం కాకుండా ఉండటానికి రోలుపై దీపాన్ని ఉంచరాదని పెద్దలు నిషేధించారు.

## 1530. హారతి కర్పూరం వెలిగిస్తే దేవుడు ప్రసన్నుడౌతాడా?

**జ.** పూజ అంతంలో హారతి కర్పూరాన్ని వెలిగించి దేవుని విగ్రహానికి కుడి నుండి ఎడమవైపు గుండ్రంగా త్రిప్పుతూ మంగళ హారతులివ్వడం, ఆ తరువాత ఆ హారతిని భక్తులు నమస్కరించి కళ్ళకద్దుకోవడం జరుగుతుంది. పూజలో ధూపాన్ని మరియు అగరు వత్తులను వెలిగించటం కూడా జరుగుతుంది. నాస్తికులు ఈ హారతులు మరియు ధూపాలు ఇవ్వటం వట్టి మూఢ నమ్మకంగా కొట్టివేస్తారు. నాస్తికులు

కేవలం వీటిని దైవాన్ని ప్రసన్నం చేసుకోవడానికే ఉపయోగిస్తామని తప్పుగా అర్థం చేసుకుంటారు. కాని ఈ హారతి కర్పూరంవల్ల మరో ప్రయోజనం కూడా ఉంది. కర్పూరాన్ని లేదా ధూపాన్ని వెలిగించినప్పుడు వాటి నుండి వెలువడే పొగ అనుకూల శక్తి తరంగాలను తమ నుండి పుష్కలంగా వెల్లడి చేయడం జరుగుతుంది. ఈ పొగ వ్యాపించి, అక్కడ ఉన్న విషపూరిత సూక్ష్మ క్రిములను అంతం కూడా చేస్తుంది. భగవంతుడిని ప్రసన్నం చేయడమే కాక ఇలాంటి ఇతర ప్రయోజనాలు కర్పూరానికి, ధూపానికి ఉన్నాయి.

## 1531. వీరందరూ ఉన్నా లేనట్లే

**జ.**★ మంచి పనులకు ఉపయోగించని ధనము.

★ పాలు ఇవ్వని గేదె.

★ అర్జునుడు వంటి శిష్యుడు లేని గురువు.

★ దక్షత లేని ప్రభువు.

★ బొట్టులేని నుదురు

★ భర్తకు భయపడని భార్య.

★ అవసరానికి ఆదుకోని స్నేహితుడు.

★ పదునులేని కత్తి.

వీరంతా ఉన్నా లేకపోయినట్లే.

## 1532. అనారోగ్యాన్ని కలిగించు ఆహార మిశ్రమాలు

**జ.**1. పెరుగు లేక మజ్జిగను అరటి పండుతో కలిపి తీసుకొనకూడదు. 2. తేనె మరియు నెయ్యిని కలిపి తినరాదు. 3. అన్నాన్ని పండ్లతో కలిపి తినరాదు. 4. కూరగాయలతో వెన్నను కలిపి తీసుకొనరాదు. 5. చేపలను తినినపుడు పెరుగును కాని మజ్జిగను కాని తినరాదు. 6. ఆస్తమా రోగులు టమాట, బూడిద గుమ్మడి మరియు ముల్లంగిని తమ ఆహారంలో ఉపయోగించరాదు. 7. టీ, కాఫీని ఏమీ తినకుండా సేవించరాదు. కనీసం మంచినీరు త్రాగిన తరువాత మాత్రమే టీ, కాఫీని త్రాగవలెను. 8. స్త్రీలు ఋతుకాలమందు నువ్వులను, గుమ్మడికాయను వాడరాదు. 9. చర్మ వ్యాధులతో బాధపడుతున్న వారు పొట్లకాయ, పల్లీలు, చేపలు, ఎండు చేపలు, ఘాటైన ఆహారం, బాగా పుల్లని ఆహారం, చిక్కుడు మొదలైనవి తినరాదు. 10. గోధుమలతో చేయు వంటకాలలో నువ్వుల నూనె ఉపయోగించరాదు. 12. కడుపులో అల్సర్స్ ఉన్నవారు పచ్చళ్ళను గాని, కారాన్ని గాని తీసుకొనరాదు.

## 1533. వివాహము తరువాత నూతన వధూవరులచేత ఇరువురి పేర్లు చెప్పించటంలో ఆంతర్యం ?

**జ.** నూతన వధూవరులను ఇంటిలోనికి రాకుండా ఆపి ఒకరి పేరు మరొకరి చేత చెప్పించటం సర్వసాధారణ విషయం. ఈ ఆచారం వల్ల భావోద్వేగాలు ఉపశమింపబడే ఒక ఆహ్లాదకర వాతావరణం కలుగుతుంది. ఈ పద్ధతిలో భార్యాభర్తలు ఒకరి పేరు మరొకరు చెప్పే తీరును బట్టి వారికి గల ప్రేమాభిమానాలను పెద్దలు అవ

గాహన చేసుకొనగలరు. వివాహ సమయంలో జరిగే చిన్న చిన్న గొడవలు, వ్యవహారాలు, ఘర్షణలు జరిగినా అవేమీ మాకు పట్టలేదు అని ఇరువురు తెలియజెప్పటమే ఈ తంతు వెనుక అసలు రహస్యం.

## 1534. స్ఫటికరాయికి నల్లని తాడును కట్టి సింహద్వారానికి ఎందుకు వేలాడ దీస్తారు?

**జ.** నలుపుతాడుకి దిష్టినీ, ఎంతటి ఉగ్ర వేడినీ అయినా గ్రహించి తనలోనే ఇముడ్చుకొనే శక్తి ఉంటుంది. స్ఫటికము చాలా గట్టిది. ఎంతమంది ఎన్ని శాపనార్థాలు పెట్టినా, ఏడుపులు ఏడ్చినా, మన ఉన్నతిని చూసి ఈర్ష్య పడినా వాటిని అన్నింటిని నల్లత్రాడు గ్రహించి గట్టిదైన స్ఫటికంలో కప్పిపెడుతుంది. సింహద్వారం దాటి ఏ నరదిష్టిని లోనికి రానివ్వదు. అందుకే స్ఫటిక రాయిని లావాటి నల్లతాడుకి కట్టి సింహద్వారంలో వ్రేలాడ తీస్తారు.

## 1535. పంచ శిరస్సు అనగా ఏమిటి ?

**జ.** వాస్తు దోషాన్ని నివృత్తి కావించి కుటుంబమునకు క్షేమం కలుగునట్లు చేయుటకు బంగారము లేక పంచలోహ నిర్మితమైన ఐదు జంతువుల చిన్నని బొమ్మలను చేసి ఇంటి వద్ద ఉంచబడును. ఏనుగు, సింహము, పంది, ఎద్దు మరియు తాబేలు ఈ ఐదు జంతువులై ఉన్నవి. వీటి తలలను దగ్గరగా ఉంచి ఓ రాగి డబ్బాలో పూజలు నిర్వహించిన అనంతరము పెట్టి, ఇంటిలో వాస్తు దోషమున్న చోటు దాన్ని స్థాపిస్తారు. ఈ రాగి డబ్బాలో ఏనుగును మధ్యగా ఉంచ వలెను. ఏనుగుకు ఇరు ప్రక్కలా ఎద్దు మరియు సింహమును ఉంచాలి. వాటి ఇరుప్రక్కన తాబేలు మరియు పందిని ఉంచాలి. వీటి ముఖము తూర్పు దిక్కును చూచునట్లు పెట్టిన ఎక్కువ శక్తివంతముగా ఫలితమును ఇచ్చును. భూమిలో కాస్తలోతుగా వాస్తు దోషమున్న చోట ఈ పంచ శిరస్సులను పాతి పెట్టాలి.

## 1536. నమ్మకూడని వ్యక్తులు ఎవరు ?

**జ.** తాను ఆచరించప నీతులుచెప్పే వారిని, దాన ధర్మాల గురించి మాటలు చెప్పే వారిని, వ్యాపార వ్యవహారాల్లో మీకన్నా వయస్సులో పెద్దవారిని, ధన విషయంలోను, రహస్యాల దాపరికం విషయంలోను ఎవ్వరినీ నమ్మకూడదని పురాణాలు శెలవిస్తున్నాయి.

## 1537. ఏ దేమునికి ఏ అక్షతలు వాడాలి?

**జ.** పరమేశ్వరునకు తెల్లని అక్షతలు, విష్ణుమూర్తికి పసుపు అక్షతలు, స్త్రీ శక్తి దేవతలకు కుంకుమ అక్షతలు వాడాలి.

## 1538. జన్మకుండలి / జాతకచక్రం అనగా ఏమిటి?

**జ.** ఒక వ్యక్తి జన్మించినప్పుడు ఆకాశమున గ్రహ నక్షత్రములు ఏయే స్థానముల

యందు ఉన్నవో, వాటి ప్రభావము ఆ వ్యక్తి జీవితముపై ఎట్లు ఉండునో తెలుసు కొనుటకు వ్రాయబడు పట్టికనే జన్మ కుండలి అని అంటారు. ఈ గ్రహస్థితి ప్రభావము జీవితాంతము ఒక వ్యక్తిపై, అతడి గుణ లక్షణాలపై ప్రభావము కలిగి ఉండును. జన్మకుండలి అతడి బంధు మిత్రుల గూర్చి మరియు జీవితానుభవ ముల గూర్చి తెలియజేయును. జన్మ కుండలిని పరిశీలించి గ్రహ స్థానములు వాటికలయికల ప్రభావాలను అర్థము చేసుకొని జ్యోతిష్యుడు జోస్యము చెప్పును. జన్మ లగ్నము యొక్క మరియు గ్రహముల వివిధ గదులను ఇందు ప్రధానముగా పరిశీలించుట జరుగును. జన్మకుండలి ఒకవ్యక్తి మరియు విశ్వానికి మధ్యగల సంబంధమును తెలియజేయును. జన్మిం చిన కాలమును బట్టి నక్షత్రము, రాశి, లగ్నము మొదలగు వాటిని తెలుసు కోవ డం జరుగుతుంది. సమర్థుడైనట్టి జ్యోతి ష్యుడు జన్మకుండలి సహాయంతో వ్యక్తి కాలగతిని మరియు దాని ప్రభావాన్ని గూర్చి వివరించగలడు. కానీ అతీంద్ర శక్తులుగల సిద్ధపురుషులు జన్మకుండలి మొదలగువానిని పరిశీలించకనే ఓ వ్యక్తి భూత భవిష్యత్ వర్తమానాలను గురించి చెప్పగలడు.

### 1539. పురాణ కాలంలో ఉండి, ఇప్పుడు కనుమరుగైన నది ఏది?

**జ.** సరస్వతి నది.

### 1540. 'వినాశకాలే విపరీత బుద్ధి' అని అనటంలో అర్థము ఏమిటి ?

**జ.** మనిషి చేసే ఆలోచనే ఒక్కోసారి అతని పతనానికి దారితీస్తుంది. ఉదాహర ణకు వినాశనము దాపురించినందు వల్లనే రావణుడు సీతను ఎత్తుకు వెళ్ళి సర్వనాశనం అయ్యాడు; ద్రౌపది వస్త్రా లను లాగి కౌరవులు అంతం అయ్యారు; ముని మెడలో చనిపోయిన పామును వేసి పరీక్షిత్తు మహారాజు మరణించాడు - అందువలన ఏదైనా ఒక ఆలోచన వచ్చి నపుడు మంచీ చెడులు విచారించి, కార్యం ప్రారంభించాలని పెద్దలు నర్మ గర్భంగా చెప్పిన ఉపదేశం.

### 1541. కలియుగాన ఏమేమి జరుగుతాయి?

**జ.** ★ న్యాయానికి రోజులుకావు, అన్యా యానికి పట్టాభిషేకం.

★ ధర్మం ఒక్క కాలిపై నడుస్తుంది.

★ ధనమూ, స్త్రీ కోసం ఏమైనా చేస్తారు.

★ మద్యపానం చాలా మామూలు విషయం.

★ తల్లిదండ్రులను ఎవరూ పట్టించుకోరు.

★ ప్రకృతి మనుష్యులపై పగపడుతుంది.

★ అకాల వర్షాలు.

★ పురుషుని అవసరం లేకుండానే స్త్రీ గర్భం ధరిస్తుంది.

★ కొత్త కొత్త దేవుళ్ళు పుట్టుకొస్తారు.

★ మనిషి ఆయువు సగానికిసగం పడి పోతుంది.

★ పురుషుల్లో సంతానోత్పత్తి శక్తి తగ్గుతుంది.
★ బిడ్డల వివాహాలపై తల్లిదండ్రులు హక్కును కోల్పోతారు.
★ వేదాలకీ, శృంగార గీతాలకీ తేడా ఉండదు.

## 1542. ఇంటిలో బిల్వవృక్షాన్ని పెంచుకొనవచ్చా?

**జ.** నిరభ్యంతరంగా పెంచుకోవచ్చని శాస్త్రాలు చెబుతున్నాయి. అయితే నిత్యం భక్తి ప్రపత్తులతో పూజలు చేయాలి. పడమర దక్షిణం దిక్కులలో పెంచుకోకూడదు. ఉత్తర, తూర్పు దిక్కులలో పెంచటం వల్ల ఆ వైపు నుంచి వచ్చే గాలి ఆరోగ్యాన్నీ, బిల్వవృక్ష ఆశీర్వాదాన్ని తెస్తుంది.

## 1543. ఆరోగ్యానికి శుభాన్ని కల్గించు ఆహార మిశ్రమాలు

**జ.** 1. దోసకాయతో ఉప్పు మరియు కారం. 2. ఎర్రని కారం మరియు ధనియాలు. 3. ముల్లంగి మరియు కారం. 4. పల్లీలు మరియు బెల్లం. 5. బియ్యం మరియు పాలు లేక నెయ్యి. 6. మిరియాలు, తేనె మరియు నెయ్యి లేక అరటి. 7. పచ్చిమిరప మరియు కొత్తమిరప. 8. పాలు మరియు అరటి. 9. బియ్యంతో చిక్కుడు లేక నెయ్యి.

## 1544. బ్రహ్మస్నానము అంటే ఏమిటి? దానిని ఎలా చేయాలి?

**జ.** కొన్ని సమయాలలో స్నానం చేసి దైవ దర్శనము చేసుకొనే వీలు ఉండదు. అలాంటప్పుడు బ్రహ్మస్నానము చేయవలెనని పద్మ పురాణం చెబుతుంది. ఉద్ధరణిలో పట్టేటంత నీరు అరచేతిలోకి తీసుకొని ఇష్టదైవాన్ని ప్రార్థించి విద్యుత్ కేంద్రమైన మన శిరస్సుపై శరీరంమీద కూడా పడేలా చిలకరించుకోవాలి. అర చేతిలో తీసుకున్న నీరు విద్యుత్‌ను గ్రహించి, శరీరంలో ఎక్కువ, తక్కువలుగా ఉన్న విద్యుత్‌ను సమము చేసి దేహాన్ని చక్కటి స్థితికి స్నానము చేసినంత కాక పోయినా కొంత సమస్థితికి తేగలదు. దీనినే బ్రహ్మ స్నానము అంటారు.

## 1545. జీవితంలో ఒక్కసారైనా చేయవల్సిన పవిత్ర స్నానం ఏది ?

**జ.** మహాశివునకు మాఘమాసం ప్రీతికరమైనది. ఈ మాఘమాసంలో మాఘ స్నానం చేయని జీవితం వృధాగా చెప్పబడింది. ఈ స్నాన ఫలం గూర్చి బ్రహ్మ నారదునితో చెప్పాడు. ఈ మాఘస్నానం వల్ల విష్ణులోక ప్రాప్తికూడా లభిస్తుంది. సూర్య భగవానుడు మకరంలో ఉదయించిన వేళ చేసెడు ఈ స్నానం వల్ల తెలిసీ, తెలియక చేసిన తప్పులన్నీ అగ్నిపై వేసిన నెయ్యిలా పుణ్యప్రదాలు కాగలవు.

## 1546. రాత్రిపూట పాలు త్రాగితే ముసలితనం దరిచేరదా ?

**జ.** బ్రహ్మ వైవర్త పురాణం ప్రకారం భోజనం తరువాత మజ్జిగ, రాత్రిపూట పాలు తీసుకొన్నవారికి, కాళ్ళు కడుగుకొని

భోజనానికి ఉపక్రమించేవారికి ముసలి తనపు ఛాయలు త్వరగా దరిచేరవని తెలుస్తుంది. అల్లే తడికాళ్ళతో నిద్రకు ఉపక్రమించ కూడదు.

## 1547. నక్షత్రం ప్రకారం వారి వారి లక్షణాలు

**జ.** బృహత్సంహితలో ఏ నక్షత్రం వారికి ఎలాంటి లక్షణాలు ఉంటాయో తెలుపబడింది. వాటి వివరాలు

**1. అశ్విని :** చక్కనిరూపం, దక్షతకలిగిన వారు, నీతివంతులు, ప్రియ భూషణులు.

**2. భరణి :** దృఢ నిశ్చయులు, సుఖ వంతులు, సత్యమయులు, ఆరోగ్యవంతులు.

**3. కృత్తిక :** తేజస్సు, ప్రఖ్యాతులు.

**4. రోహిణి :**సత్యవంతులు, శుభ్రత, ప్రియంవద, స్థిరమతి, సురూప.

**5. మృగశిర :**చపలులు, చతురులు, ఉత్సాహవంతులు, భోగులు, భీకరులు.

**6.ఆర్ద్ర :** గర్వితులు, కృతఘ్నులు, అయిన వారిని ప్రేమించేవారు.

**7. పునర్వసు :**సుశీలులు, అల్ప సంతోషులు, రోగులు.

**8.పుష్య :**శాంత స్వభావులు, పండి తులు, ధర్మభూషణులు.

**9. ఆశ్లేష :** సర్వభక్షకులు, కృతఘ్నులు, అమాయకులు, సున్నితత్వం కలవారు.

**10. మఘ :**భోగులు, ధనవంతులు, పితృభక్తి పరాయణులు, మహోద్యమకారులు.

**11. పూ.షా :**ప్రియవచనములు పలుకు వారు, దాతలు, ద్యుతిమానులు.

**12.ఉ.షా :**భోగులు, సుఖములు కల వారు, విద్యాప్రాప్తి కలవారు.

**13. హస్త :**ఉత్సాహవంతులు, తస్కరులు, అఘ్రుణీలు.

**14. చిత్త :**సులోచనాంగులు, నెరజాణలు.

**15. స్వాతి :** కృపాళులు, ప్రియవాక్కు కలవారు, ధర్మాశ్రితులు.

**16. విశాఖ :** ఈర్ష్య బుద్ధి కావారు, ద్యుతులు, మాన్యవచనులు.

**17. అనూరాధ :** విదేశీయానం కల వారు, ధర్మాత్ములు.

**18. జ్యేష్ఠ :** పలువురు మిత్రులు కలవారు, సంతృప్తి కలవారు, కోపితులు.

**19. పూ.అ. :**సౌహార్ద్ర హృదయం కల వారు, ఇష్టపూర్వకంగా పనిచేయు వారు, కళలను ప్రేమించువారు.

**20. ఉ.ఆ. :**ధార్మికులు, బహుమిత్రులు కలవారు, కృతజ్ఞత కలిగినవారు.

**21. శ్రవణ :** ఉదార స్వభావులు, ఖ్యాతి పొందెడువారు, ధనవంతులు.

**22. ధనిష్ఠ :** దాతలు, ధనలబ్ధము కలిగిన వారు, సంగీత ప్రియులు.

**23. శతభిష :** సాహసికులు, కోపము కలిగిన వారు, వ్యసనపరులు.

**24. పూ.భా.:**సంతోషమును తృప్తిగా అనుభవించ లేనివారు, ధనవంతులు, దాతలు.

**25. ఉ.భా. :**ఎక్కువ సంతానము కల వారు, ధార్మికులు, జితశత్రులు, వక్తలు.

**26. రేవతి :** శూరులు, శుచివంతులు, సుభగులు, సంపూర్ణాంగులు.